వీరేశలింగ గ్రంథావళి

తొమ్మిదవ సంపుటము

సాహిత్య — మిశ్ర గ్రంథములు



923.6
VEN

ప్రకాశకులు:

వీరేశలింగ కవిత్వ నివారిణీ సమాజము
రాజమహేంద్రవరము

Dr. B.R. AMBEDKAR
OPEN UNIVERSITY
CALL NO: 923.6 VEN ACC. NO: N-10494
AUTHOR: Veeresalingm, K.
TITLE: Complete Works

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

AdyA10/13 133

i

THE

Complete Works

OF

Rao Bahadur K. Veeresalingam Pantulu,

Retired Telugu Pandit, Presidency College, Madras.

Vol. IX.- LITERATURE AND BIOGRAPHIES

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.
10474

SARASWATHI POWER PRESS, RAJAHMUNDRY.

1951

MEMORIAL LIBRARY

ii(a)



కీ. శే. కందుకూరి వీరేశలింగం పంతులుగారు.

(కందుకూరి వీరేశలింగకవి కృతగ్రంథములు.

లొమ్మిదవ సంపుటము — సాహిత్యచరిత్రగ్రంథములు.



రాజమహేంద్రవరము : సరస్వతీ పవర్ ప్రెస్‌నందు

శ్రీ అద్దేపల్లి నాగేశ్వరరావు గారిచే

ముద్రింపఁబడినది. 1951

T
923.6
VEN



పీఠిక

అవ్యతిక్రమాన యని ప్రసిద్ధికెక్కిన కందుకూరి వీరేశలింగము పంతులవారి గ్రంథసంపుటములో నిది తొమ్మిదవసంపుటము - ఇందు సావశిత్యగ్రంథములు, జీవితచరిత్రలును గలవు - పంతులుగారు తాము నూతనపథకము ద్రొక్కినపుడు, లక్ష్యలక్షణసమన్వయ మేర్పఱచి యాపతకమును దిద్దితీర్చి, భావిరచయితలకు, మార్గదర్శకులైనారు — ఈ లక్ష్యలక్షణదృష్టితో పరిశీలించిన నిందలి రచనావిశిష్టత తేటపడగలదు.

నేటివచనసావశిత్యమునకు తలమానికమగు నీతిచంద్రిక పంథి విగ్రహాములను, వీరేశలింగముగారు, రచించి, ప్రాచీనవచన సంప్రదాయ రీతిని సుప్రతిష్ఠితము గావించిరి — ఈనీతిచంద్రికయందు, మిత్రలాభము, మిత్రభేదము, విగ్రహాము, సంధి అనునాలుగుభాగములు గలవు. వీనిలో మొదటిరెండింటిని ప్రఖ్యాతపండితుడు వరవస్తుచిన్నయసూరి రచించెను. విగ్రహాంత్రమును, బ్రహ్మశ్రీయుత కొక్కొండ వేంకటరత్నము పంతులుగారును, వీరేశలింగము పంతులుగారును వేఱ్వేరుగా రచించిరి. ఈరెండింటిలో వీరేశలింగము పంతులుగారి విగ్రహాత్రము, చాల వ్యాప్తికెక్కినది. అది చిన్నయసూరిమార్గమున కొంచెము కఠినశైలిని రచిత మైనది. ప్రాచీనవచనరచనాసంప్రదాయము తెలుపుటకు నా భాగ మట్లు రచించి యాపెనుక సంధినికూడ పూరించిరి. ఇది విగ్ర హముకన్న సులభగ్రాహ్యమైన శైలిలోనుండి నవీనవచనరచనకు మేలు బంతి యగుచున్నది.

ఇట్లు ప్రాచీన నవీనరీతులకు లక్ష్యములురచించి యారచనలకు ననుగుణ్యమగు భాషాప్రౌఢిమ యులవఱచుటకు "సంగ్రహవ్యాకరణము" రచించెను — భాష ప్రవాహరూపముగ నిత్యవ్యవహారములో మారు చుండును — వ్యాకరణ మా ప్రవాహమును రెండువైపుల గట్టులవలె, నరియగు కట్టుదిట్టములతోనడిపించి, రచనకు స్థిరత్వము గలుగజేయును.

సంగ్రహవ్యాకరణమునకు ముందు చిన్నయసూరిగారి బాలవ్యాకరణము, వెంకయ్యవ్యాకరణము మున్నగునవికలవు – అందు బాలవ్యాకరణము ప్రౌఢులగువారికి గాని యుపాదేయముకాదు – వెంకయ్యవ్యాకరణము బాలురకేగాని ప్రౌఢులకు గాదు – తెనుగుభాషలో నట్టిరాస్యలందటకు, సవగాహనమగునట్లుగా, క్లిష్టమగు వ్యాకరణసూత్రమును సంగ్రహాముగను, సులభగ్రాహ్యాముగను, చెప్పుటయందు పంతులవారికి సాటియగువారులేరని చెప్పవచ్చును –

వ్యాకరణమువలన నిర్దుష్టమగు రచనచేయుటకు వీలుగలుగును గాని యది హృదయమునాకర్షింపక పోవచ్చును. రచనయాహ్లాదకర మగుటకు నలంకారము లావశ్యకములు. దానికొఱకు, అలంకార సంగ్రహమురచించిరి – మఱియు కావ్యమునకు ప్రాణమగు రసమును గూర్చి, నాయికానాయక వివరణముగూర్చి, కావ్యభేదములనుగూర్చి సాహితీసంప్రదాయములనెఱుంగుటకు కావ్యసంగ్రహము రచించిరి. మన సాహితీసంప్రదాయములు పూర్వులచే, శాస్త్రీయమైన పద్ధతిని నుపరిష్కృతములై, తరువాత వారు ప్రమాణముగా గ్రహింపదగినట్లుగ సిద్ధాంతములు చేయబడినవి– ఆపద్ధతులను తెలుసుకొనుటకు, పూర్వపక్షప్రతిపక్షములను, ప్రమాణములను వివరించు తర్కసంగ్రహమును రచించుట యావశ్యకమే గదా!

సత్యవాదులగు పంతులుగారు, మతతత్త్వమును, ఆస్తికబుద్ధిని పెంపొందింపజేసి, ఏకేశ్వర మతప్రతిష్ఠాపనకొఱకు అద్వైత, విశిష్టాద్వైత, ద్వైతమతసంప్రదాయ ప్రవర్తకులగు శంకర, రామానుజ, మధ్వాచార్యుల చరిత్రములను, వారి మతసిద్ధాంతములను వివరించిరి. పరిశుద్ధాస్తిక మతస్వరూపమును వ్యాప్తిచేసిరి. మన దేశమందలి సనాతనముగా నెలకొన్న మతములేగాక, పాశ్చాత్యఖండమున ప్రబలముగనున్న క్రైస్తవ మతస్థాపకుడు యేసుక్రీస్తుచరిత్రను, విపులముగ వ్రాసిరి.

ఉత్తమస్త్రీల చరిత్రలలో క్రైస్తవమత సిద్ధాంతములను చక్కగ గ్రహించి, సాంఘిక రాజకీయసేవ నొనర్చిన, పాశ్చాత్యసతీమణుల చరిత్రలను, హిందవస్త్రీల కాదర్శప్రాయముగ పంతులుగారు రచించిరి. ఉత్తమమాత, సముద్రమధ్యమున పడవను నిగినవారినిసంరక్షించి కీర్తిని గన్న గ్రేసు డార్లింగుకన్య, ధైర్యసాహసములు మూర్తీభవించిన జోన్ ఆఫ్ ఆర్కు, మతవిశ్వాసమునకై ప్రాణములు బలియిచ్చిన లేడీ జేన్‌గ్రే, కారాగారనివాసులకు సౌఖ్యము లొనగూర్చిన ఎలిజబెత్తుఫ్రై), రామమోహనరాయల యాంగ్లేయ దేశజీవితము చిత్రించిన భారతదేశ బాంధవి మిస్ మేరీ కార్పెంటరు — అనువారల జీవితములిందు, మనోహరముగ చిత్రింపబడినవి. మనస్త్రీలు ముఖ్యముగ నీభాగము చదువ దగినది. వీరేశలింగముగారి కలమునకుగల యాకర్షణశక్తి యెట్టిదోగాని ఖండఖండాంతరముల జరిగిన విషయములను మనకన్నులకు గట్టినట్లుగా మఱపురానీయక మనస్సును పట్టునట్లుగా, నొకమాఱు చదివిన మఱి యొకమాఱు చదువవలెనని యాసక్తిగలిగించును.

పరిశుద్ధమగు ప్రవర్తన, పరతత్త్వమునందు భక్తిపరత, ఆత్మ విశ్వాసము, కార్యదీక్ష, సంఘమునకు పునాదులు - ఈనైతికవిజ్ఞానము పురుషులకువలె స్త్రీలకు నత్యంతావశ్యకము - ఇట్టివిజ్ఞానమును వచనసాహిత్యమూలమున నాంధ్రలోకమున నాచంద్రార్కము వెలుగ జేసిన వీరేశలింగకవి వాఙ్మయరంగమున దివ్యజ్యోతి —

తొమ్మిది నిధులవలె, తొమ్మిదిశీర్షికలు గల యీసంపుటమును పునర్ముద్రణము గావించిన, శ్రీ దంగేటి నారాయణ స్వామిగారి కాంధ్రలోకమెంతయేని కృతజ్ఞత చూపవలసియున్నది.

ఇట్లు

చెన్న పురి
15-2-1951

నిడదవోలు వేంకటరావు ఎమ్. ఏ.
మదరాసు విశ్వవిద్యాలయాంధ్రభాషా శాఖాధ్యక్షుడు.

విషయసూచిక

	పుట.
సంగ్రహవ్యాకరణము	1
కావ్యసంగ్రహము	93
నీతిచంద్రిక, విగ్రహము...	127
నీతిచంద్రిక, సంధి	241
తర్కసంగ్రహము	293
అలంకారసంగ్రహము	315
పత్యవాదిని	371
ఉత్తమస్త్రీచరిత్రములు	477
జీసస్ చరిత్ర	603

శ్రీ

సంగ్రహ వ్యాకరణము

ఆంధ్ర భాష

౧. ఆంధ్రదేశమున వ్యవహరింపఁబడుభాష యాంధ్రభాష యనఁబడును. భాషయనఁగా నరు లొండొరులకుఁ దమమనోభావముల నెఱిఁగింప సాధనభూతముగానుండు వాగ్జాలముకూడిక. అది వాగ్రూప ముగానైనను, లిఖితరూపముగానైనను ఉండవచ్చును. ఎఱుకభాష మొదలగునవి కేవల వాగ్రూపములు. తెలుఁగు అఱవము మొదల యినవి వాగ్లిఖితరూపములు.

౨. ఈభాషయందలి పదములు, తత్సమములు, తద్భవములు, దేశ్యములు, అని మూఁడుభేదములు కలవి. ౧ విభక్తిప్రత్యయము మాత్రముమాఱి తెనుఁగున వాడఁబడు సంస్కృతప్రాకృతపదములు తత్సమములు. ఉ:—సం. గురు(ఃసం. స. గురు(వు);ప్రా. గారవ(ం), ప్రా. స. గారవ (ము). ౩ వర్ణాగమము, వర్ణలోపము, వర్ణాదేశము, లోనుగాఁగలవికారములను విధివిహితముగాఁ బొంది తెలుఁగున వ్యవ హరింపఁబడు సంస్కృత ప్రాకృతపదములు తద్భవములు. ఉ:— ఆగ—సం. రథః, సం.భ. అరదము; ప్రా. అచ్ఛేరం, ప్రా. భ. అచ్ఛేరువు—లోప—సం. తామరసమ్, సం. భ. తామస; ప్రా. పణ్ణాసా, ప్రా. భ. పనస.—ఆదే—సం. అంగణమ్, సం. భ. అంక ణము; ప్రా. పుఢవీ, ప్రా. భ. పుడమి. 3. సంస్కృత ప్రాకృతముల సంబంధ మేమియులేక త్రిలింగదేశమున వ్యవహరింపఁబడు పదములు ఉద్దేశ్యములు. ఉ—ఊరు, పేరు.

3. సంస్కృతసమేతర మగుభాష యచ్చ తెలుఁ గనఁబడును. ఆంధ్రమునకు సంస్కృత ప్రాకృతములు రెండును బ్రకృతులు కావున, సంస్కృత మాద్యప్రకృతి యనియు, ప్రాకృతము ద్వితీయప్రకృతి యనియు, ఆంధ్రము వికృతి యనియు, చెప్పఁబడును.

4. లక్షణవిరుద్ధము లైనపదములు గ్రామ్యములు. ఉ:— వస్తాడు, తెస్తాడు. ఇవి ప్రయోగార్హములు గావు. అయినను మన తొల్లింటి కవీంద్రులు వాడియున్న పదములు గ్రామ్యము లైనను గ్రాహ్యములే. ఉ:—కఱకంఠుఁడు, ప్రాణగొడ్డము. జీవగఱ్ఱ.

5. భాషకుం బ్రధానసాధనములు వర్ణములు; వర్ణములు పదము లగును; పదములు వాక్యము లగును; వాక్యములు కావ్యము లగును.

వ్యాకరణము.

6. ఆంధ్రభాషను సలక్షణముగా వ్యవహరించుటకు ఉపయోగించువిషయములు గల శాస్త్రము ఆంధ్రవ్యాకరణ మనఁబడును.

7. అది వర్ణపరిచ్ఛేదము, పదపరిచ్ఛేదము, వాక్యపరిచ్ఛేదము, కావ్యపరిచ్ఛేదము, అని నాలుగుభాగములు గలది.

వర్ణపరిచ్ఛేదము.

8. వివిధములగుధ్వనులను వేర్వేఱ నెఱిఁగించుకొనుకు వ్రాఁత యం దేర్పఱుచుకోఁబడిన గుఱుతులు వర్ణము లనికాని, అక్షరములనికాని, చెప్పఁబడును. ఉ:—అ, ఇ, క, గ. అట్టివర్ణములను గూర్చి చెప్పినది వర్ణపరిచ్ఛేదము.

౨. వర్ణములసమూహమునకు వర్ణసమామ్నాయమని పేరు. ఆంధ్రవర్ణసమామ్నాయమున, ఏబదియాఱువర్ణములు గలవు. అవి అచ్చులు, హల్లులు, ఉభయాక్షరములు, అని మూఁడువిధములు గలవి.

3. అచ్చులు పదియాఱు:—అ,ఆ,ఇ,ఈ,ఉ,ఊ,ఋు,ౠు,ఌ,ౡ, ఎ,ఏ,ఐ,ఒ,ఓ,ఔ. (అచ్చులకు, ప్రాణములు, స్వరములు, అని మాఱు పేళ్ళు గలవు.)

౪. ఇతరవర్ణసాహాయ్యము లేకయే పూర్ణముగా నుచ్చరింపఁ బడువర్ణములు అచ్చులు. అచ్చులలో అ, ఇ, ఉ, ఋు, ఌ, ఎ, ఒ, అను నేడును హ్రాస్వములు (అనఁగా కుఱుచలు); ఆ,ఈ,ఊ,ౠు,ౡ,ఏ,ఐ, ఓ,ఔ, అను తొమ్మిదియు దీర్ఘములు (అనఁగా నిడుదలు); ఎ,ఏ,ఒ,ఓ అను నాలుగును వక్రములు (అనఁగా వంకరగా నుండునవి); ఐ,ఔ, అను రెండును వక్రతమములు (అనఁగా మిక్కిలి వంకరగానుండునవి).

౫. హల్లులు ముప్పదియేడు:—క,ఖ,గ,ఘ,ఙ,చ,ఛ,జ,ఝ,ఞ,ఱు, ట,ఠ,డ,ఢ,ణ,త,థ,ద,ధ,న,ప,ఫ,బ,భ,మ,య,ర,ల,వ,శ,ష,స,హ,ఱ,ళ. (హల్లులకు వ్యంజనములు, ప్రాణులు, అని నామాంతరములు.)

౬. స్వరసాహాయ్యము లేక పూర్ణముగా నుచ్చరింపఁబడని వర్ణములు హల్లులు. హల్లులలో, క,చ,ట,త,ప, అను నాఱును పరుషములు (అనఁగా కఠినాక్షరములు); గ,జ,డ,ద,బ, అను నాఱును సరళములు (అనఁగా కఠినములు కానివి); ఖ, ఘ, ఙ, ఛ, ఱు, ఞ, ఠ, ఢ, ణ, థ, ధ, న, ఫ, భ, మ, య, ర, ల, వ, శ, ష, స, హ, ఱ, ళ, అను నిరువదిమైదును స్థిరములు (అనగా నిలుకడగా నుండునవి); స్థిరములలోని నకారము ద్రుత మనఁబడును; ఖ, ఘ, ఛ, ఱు, ఠ, ఢ, థ, ధ, ఫ, భ, అను పదియు వర్గయుక్తములనఁబడును.

౭. మఱియు హల్లులలో క, ఖ, గ, ఘ, ఙ; చ, ఛ, జ, ఝ, ఞ; ట, ఠ, డ, ఢ, ణ, త, థ, ద, ధ, న; ప, ఫ, బ, భ, మ; అను నిరువదియైదును స్పర్శములు—ఇందు, అయిదయిదు క్రమముగా కవర్గము, చవర్గము, టవర్గము, తవర్గము, పవర్గము, అనఁబడును :— య, ర, ల, వ, అను నాలుగును అంతస్థములు; శ, ష, స, హ, అను నాలుగును ఊష్మములు.

౮. ఉభయాక్షరములు మూఁడు.—ఇవి క్రమముగా, అరసున్న, నిండుసున్న, విసర్గము, అనిచెప్పఁబడును. (అరసున్నకు, అర్ధానుస్వారము, అర్ధబిందువు, అనియు, నిండుసున్నకు, పూర్ణానుస్వారము, పూర్ణబిందువు, అనియు వేఱునామములు)

౯. అచ్చులును హల్లులు నగువర్ణములు ఉభయాక్షరములు. హల్లులమీఁదవలె వీనిమీఁద అచ్చులు నిలువకుంటఁజేసి యచ్చులును, అచ్చులకువలె వీనికి స్వతంత్రప్రయోగము లేమిఁజేసి హల్లులును, అని యెఱుంగునది.)

౧౦. ఉత్పత్తిస్థానములనుబట్టి, అ, ఆ, క, ఖ, గ, ఘ, ఙ, హ, ః, లు కంఠ్యములు; ఇ, ఈ, చ, ఛ, జ, ఝ, ఞ, య, శ, లు తాలవ్యములు; ఋ, ౠ, ట, ఠ, డ, ఢ, ణ, ర, ష, ఱ, లు మూర్ధన్యములు; ఌ, ౡ, చ, జ, త, థ, ద, ధ, న, ల, స, లు దంత్యములు; ఉ, ఊ, ప, ఫ, బ, భ, మ, లు ఓష్ఠ్యములు; ఙ, ఞ, ణ, న, మ, ఁ, ం, లు అనునాసికములు; ఎ, ఏ, ఐ, లు కంఠ్యతాలవ్యములు; ఒ, ఓ, ఔ, లు కంఠోష్ఠ్యములు; వ, దంతోష్ఠ్యము; అని చెప్పఁబడును.

౧౧. య, ర, ల, వ, ఈయక్షరములు లఘువులు, అలఘువులు, అని యిరుదెఱుంగులు. సాధ్యమగుయకారము లఘువు. ఉ:—

(అది+ఇట్టి=) అదియిట్టి. సాధ్య మనఁగా శాస్త్రముపలనఁ గలిగినది. సిద్ధ మగుయకార మలఘువు. ఉ:—కాయు; సిద్ధ మనఁగా శబ్దము తోడ నుండునది. రేఫము లఘువు. ఉ:—పెరుగు. శకటరేఫ మల ఘువు. ఉ:—చెఱకు. సిద్ధ మగులకారము లఘువు. ఉ:—తల. సాధ్యమగు ళకార మలఘువు. ఉ:—(ఏఱునుండి) ఏళులు. సాధ్య మగుప్రథమమిూఁదివకారము లఘువు. ఉ:— (అతఁడు+పలికె =) అతఁడువలికె. సిద్ధ మగువకార మలఘువు. ఉ:—వాఁగు.

౧౨. పైవర్ణములలో ఎ, ఒ, చ, జ, ఱ, ఁ, అను నాఱును సంస్కృతమున లేవు; ఋు, ౠు, ఌ, ౡ, ఐ, ఔ, ఙ, ఞ, శ, ష, అను పదియుంగూడ ప్రాకృతమున లేవు; ఋు, ౠు, ఌ, ౡ, ః, ఖ, ఘ, ఙ, ఛ, ఝ, ఞ, ఠ, ఢ, ణ, ధ, ఫ, భ, శ, ష, అను వందొ మ్మిదియు నచ్చ తెలుఁగున లేవు.

౧౩. అచ్చ తెలుఁగునకు వర్ణములు ముప్పదియేడు—అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ, ఁ, ం; క, గ, చ, ఛ, జ, ఝ, ట, డ, ణ; త, ద, న, ప, బ, మ; య, ర, ల, వ, స, హ, ఱ, ళ.

౧౪. ఇఁక, అట, చుఁడు, అను శబ్దములం దక్క ప్రథమ హ్రస్వముమిూఁద అరసున్న లేదు. హ్రస్వముమిూఁది యరసున్న వైక ల్పికముగా నిండుసున్న యగును. ఉ:—అనఁటి, అనంటి.

౧౫. అచ్చ తెనుఁగున వరుషసరళములకు ముందే బిందువుండును. ఉ.—కలఁక, వంకర, వాఁగు, పంగ.

౧౬. తెలుఁగుమాటలకు మొదల, ణ, య, ళ, వు, వ్ర, వ్ల, వ్ల, లు లేవు.

౧౭. ఉయ్యాల, పయ్యెద, తాయెతులు ఈ మూఁడుశబ్దములం

దక్క, పదమధ్య యకారమున కెత్వము లేదు. ఉ:—కయ్యము, బయలు.

౧౪. అచ్చు తెలుఁగున చ, జ, లు, తాలవ్యములు; చ, జ, లు దంత్యములు. తాలవ్యములు, ఇ, ఈ, ఎ, ఏ, ఐ, లంగూడి యుండును. ఉ—చిగురు, జిగి, మెు. దంత్యములు, అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓ, ఔ, లంగూడి యుండును. ఉ.—చని, జత, మెు.

౧౫. సంస్కృత సమములయందు ఇకారాంతము లయిన శబ్దముల ఉపధ*లగు చ, జ, వర్ణములు బహువచనమునందు దంత్యము లగును. ఉ.—వీచి, వీచులు 'రాజు' శబ్దముమాత్రము ఏకవచనము నందు దంత్యయుక్తముగా నున్నది.

పదపరిచ్ఛేదము.

౧. అర్థము గల వర్ణముకాని, వర్ణసముదాయముకాని, పద మనఁబడును. ఉ—అ. మా, అట, నగ, పనస, అట్టిపదములను గూర్చి చెప్పునది పదపరిచ్ఛేదము.

౨. వ్యస్తపదము లనియు, సమాసపదము లనియు, పదములు రెండువిధములు. పెక్కుపదములు చేరి యొక్కపద మగునది సమాస పదము:—గరళకంఠుఁడు, అలరువిల్తుఁడు అట్లు చేరనిది వ్యస్తపదము:- గరళము, కంఠము, అలరు, విల్లు.

3. సంస్కృతశబ్దములు, ప్రకృతులు, ప్రత్యయములు, అని రెండువిధములు కలవి. లోకములోనిపదార్థములను, వ్యాపారములను,

---

* ఉపధ యనఁగా తుదివర్ణమునకు ముందుండువర్ణము.

తెలియఁజేయు మూలపదములు ప్రకృతులు, ప్రకృతులకు లింగము, కాలము, మొదలగు భేదములు గలుగుటకై చేర్పఁబడునవి ప్రత్యయములు. ప్రకృతులు ప్రాతిపదకములని, ధాతువులని, ఇఱు దెఱఁగులు.

౪. కొందఱిమతమున శబ్దములుమూఁడువిధములుగలవి. అవి నామములు, క్రియలు, అవ్యయములు, కేవలనామములు, సర్వనామములు, అని నామములు రెండు విధములు; కేవలనామములు, విశేష్యములు, విశేషణములు, అని రెండు దెఱఁగులు.

౫. విశేష్యములు, విశేషణములు, సర్వనామములు, క్రియలు, అవ్యయములు, అని పదము లయిదువిధములుగలవి.

విశేష్యము.

౧. మన యింద్రియములకుఁగాని, మనస్సునకుఁగాని, గోచరము లగుపదార్థముల పేళ్లు విశేష్యము లనఁబడును. ఉ.-పుస్తకము, కూఁత, పరిమళము, పులును, వేఁడిమి, యోగ్యత.

౨. సంజ్ఞావాచకములు, జాతివాచకములు, గుణవాచకములు, క్రియావాచకములు, అని విశేష్యములు నాలుగువిధములు గలవి.

3. మనుజులు, దేశములు, పట్టణములు, పర్వతములు, నదులు మొదలగువానిలో నొక్కొక్కదానికిఁ బెట్టఁబడిన నామములు సంజ్ఞావాచకములు. ఉ.—రాముఁడు, కోసలము, ద్వారక, నీలగిరి, గోదావరి.

౪. జంతువస్తు సముదాయములలో నొకొక్కతెరగతిలోని వానికి సామాన్యముగాఁ జెందునవి జాతివాచకములు. ఉ.—మను జుఁడు, వృక్షము, ఆవు, రాయి.

౫. వేఱు వేఱుగుణములపేళ్లు గుణవాచకములు. ఉ.—చూధు ర్యము, చేఁదు, యోగ్యత, చెడ్డతనము.

౬. భావార్థకమునందుఁ దెలుఁగున, తనము, తికము, ఇమ్ము, న, ఇక, మొదలగు ప్రత్యయము లంతమునందు వచ్చును. ఉ.—చిన్న తనము, కన్నెతికము, పేరిమి, నల్లన, అగ్గలిక.

౭. మతుబర్థంబున, కాఁడు, కత్తియ, ఈఁడు, అరి, ఇ, త, ఆఁడి, ఆఁడు, మొదలగు ప్రత్యయములు వచ్చును. ఉ.—తేర కాఁడు, తేరకత్తియ, అటమటీఁడు, కల్లరి, బిత్తరి, చాకిత, వగ లాఁడి, వగలాఁడు.

౮. క్రియలవలనఁ గలిగినవి క్రియావాచకములు. ఉ.—వం డుట, వంట, వండమి: పండుట, పంట, పండమి.

౯. ధాతువులకు, క, ఇమి, ఁత, కువ, ట, టు, పము, వు, ఇక, న, బడి, గడ, ఇకి, వు, అ, అకము, డు, లోనగు ప్రత్యయములఁ జేర్చుటవలన క్రియాజన్యవిశేష్యములు కలుగును:—అలుక, కలిమి, కోఁత, పెనఁకువ, ఆట, వ్రేటు, తిరిపము, చూపు, కోరిక, గడన, ఏలు బడి, తీఱుగడ, వినికి, మనువు, ఎండ, అమ్మకము, త్రొక్కుడు. వీనినే కృదంతము లందురు.

౧౦. సంస్కృతనామములుకొన్ని యజంతములుగాను, కొన్ని హలంతములుగాను, ఉండును. లింగబోధకప్రత్యయాదులు గలుగు నప్పు డజంతశబ్దములలో మహద్వాచకముల తుది అకారమునకు ఉకార మగును:—(రామ) రాము; ఏకాక్షరశబ్దంబులకుందక్క మిగి లినవాని దీర్ఘమునకు హ్రస్వ మగును—(రమా) రము, (నదీ) నది, మా, శ్రీ, ఋకారాంతముల ఋకారమునకు అకారమగును—(భ్రాతృ) భ్రాత. హలంతములలో మకారాంతములు ద్వితీయైకవచ

నాంతతుల్యములు; ఇతరములు ప్రథమైక వచనాంతతుల్యములు. అందు, నకారాంతములకుఁ దక్క- ప్రథమైక వచనాంతతుల్యంబుల తుది హల్లునకు ద్విత్వమును, ఉకారాగమమును, అగును—(దిక్) దిక్కు; (కకుప్) కకుప్పు; దీర్ఘముమీఁది హల్లునకు ద్విత్వము వైకల్పికము:— (వాక్) వాక్కు, వాక్కు; నాంతములయు, ద్వితీయైకవచనాంతతుల్యములయు, అంత్యహల్లునకు లోపంబు గలుగును—(కర్మన్) కర్మ, (విద్వాంసమ్) విద్వాంస. [ఇట్లు లోపముం బొందువాని కజంతంబులకుఁ బోలెఁ గార్యంబు:— (విద్వాంస) విద్వాంసు.]

౧౧. దేశ్యనామములు ఔపవిభక్తికాంతములు, అనౌప విభక్తికాంతములు, అని రెండువిధములు గలవి.

౧౨. విశేష్యములకు లింగము, వచనము, విభక్తి, గలిగి యుండును.

లింగము.

౧. స్త్రీపురుషాదిజాతిభేదము లింగ మనఁబడును. ఆంధ్రమున మహత్తు, మహతి, అమహత్తు, అని లింగములు మూఁడు. మనుష్యుల లోనికాని దేవతలలోనికాని పురుషులును, వారివిశేషణములును, మహత్తులు; స్త్రీలును, వారివిశేషణములును, మహతులు; తిర్యక్కులును, జడములును, వానివిశేషణములును, అమహత్తులు.

౨. సంస్కృతమున శబ్దములకే నియతము లగు లింగములు కలవుగాని, అర్థమును బట్టి లేవు. అవి, పుంలింగము, స్త్రీలింగము, నపుంసకలింగము, అని మూఁడు.

౩. ఇకారాంతవ్యతిరిక్తము లగుమహద్వాచకములకు బిందు పూర్వక డువర్ణకంబు పచ్చును:- (రామ) రాముఁడు, (శంభు) శంభుఁడు,

(విధాతృ) విధాతృడు, మగడు, బల్లిదుడు. ఇకారాంతము.—హరి.

౪. కొన్ని యమహచ్ఛబ్దములకును మహద్వాచకీయం దీకార్యము కలుగును:—సముద్రుడు, మేఘుడు, హిమవంతుడు.

౫. ఇట్టి ఉవర్ణకము వచ్చు మహత్తులుకాని దేశ్యపదములు వుంలింగసమము లనఁబడును.—కర్తృడు, పరికొడు.

౬. అకారాంతము లగు అమహద్వాచకములకు ఉవర్ణకముపచ్చును.—ఋక్కు, వనము, గుఱ్ఱము, పల్లము.

౭. ఉవర్ణ మంతమందువచ్చు నపుంసకవాచకములు కాని పదములు నపుంసకలింగసమము లనఁబడును.—జనము, చుట్టము.

౮. మూడులింగములయందును ఉకారాంత తత్సమశబ్దముల యంతమందు వు వర్ణకము వచ్చును.—శంభువు, వధువు, వస్తువు.

౯. మహతీవాచకముల యంతమునందు, డు, ము, వు, లలో నేదియు రాదు:—సీత, వనిత, అక్క, తల్లి. ఉకారాంతములకు వువర్ణకము మాత్రము వచ్చును:—వధువు.

౧౦. లింగబోధకము లగు డు, ము, వు, లలో నొకటిగాని యంతమందురాని స్త్రీవాచకములుకాని శబ్దములు స్త్రీలింగసమము లనఁబడును.—దూత, దొర, చరిత, మూఁత.

౧౧. ఈభావయందు మహత్తు, మహతి, వీనిభేదమును దెలిసికొనుటకు మూడుమార్గములు గలవు—

౧. పదభేదమువలన.

మహత్తు.	మహతి.	మహత్తు.	మహతి.
పురుషుడు.	స్త్రీ.	పెనిమిటి.	పెండ్లాము.
పిత.	మాత.	మామ.	అత్త.
వరుడు.	వధువు.	బావ.	వదిన.

ఆ. అంతభేదమువలన.

బ్రాహ్మణుఁడు	బ్రాహ్మణి	పాఱుఁడు.	పాఱుక.
నాయకుఁడు.	నాయిక.	వగలాఁడు.	వగలాడి.
జనకుఁడు.	జనని.	చెలికాఁడు	చెలికత్తె.

3. పూర్వ మొకపదము చేర్చుటవలన.

పురుషశిశువు.	స్త్రీశిశువు.	మగపిల్ల.	ఆఁడుపిల్ల.
మగబిడ్డ.	ఆఁడుబిడ్డ.	మగశిశువు.	ఆఁడుశిశువు.

గమనిక. కొన్నిశబ్దములకు మహత్తునకును. మహతికిని, ఏకరూపమే కానఁబడుచున్నది.—అసుర, బియూరి.

వచనము.

ఒకటికిని, ఒకటికంటె నెక్కువకును, కలుగుభేదము వచన మనఁబడును. ఏకవచనము, బహువచనము, అని వచనములు రెండు.

ఏకవచనము.

అ. ఒక దానిని దెలుపునది యేకవచనము—రాముఁడు, స్త్రీ, వస్తువు.

3. లింగబోధకములగు, డు, ము, వు, పర్ణకములు మూఁడును ఏకవచనమునందే వచ్చును.—రాముఁడు, వనము, వస్తువు. వీనిలో ముపర్ణమునకు మూఁడుఁడిగాని, పూర్ణబిందుపూర్వక బుపర్ణకముగాని, వికల్పముగా వచ్చును.—వనము, వనమ్ము, వనంబు.

ర. 'ఇయ' అనుదానికి మూఁడుగా ఎకారము వైకల్పికముగా వచ్చును. విడీయము, విడెము, కన్నియ, కన్నె.

ఱ. పూర్వసూత్రములంబట్టి ఉకారాంత మహచ్ఛబ్దంబుల

కేకవచనంబున, డు, వు, లలో నేదియైన వచ్చునుగాన రెండురూపములు—గురుఁడు, గురువు; శంభుఁడు, శంభువు.

౬. సాంతములగు హలంతశబ్దముల కడహల్లు వైకల్పికముగా లోపించి రెండురూపము లేర్పడును.—ఉరము, ఉరస్సు; ధనువు, ధనుస్సు. మహాద్వాచకములు, కడహల్లు వికల్పముగా లోపింప, ద్వితీయైకవచనాంతతుల్యము లగును.—అంగిరుఁడు, అంగిరసుఁడు.

౭. ఇమనిచ్ ప్రత్యయాంతములకు మువర్ణకము వైకల్పికముగా వచ్చును—గరిమ, గరిమము; మహిమ, మహిమము; అణిమ, అణిమము; లఘిమ, లఘిమము.

బహువచనము.

౮. అనేకములను దెలుపునది బహువచనము.—రాములు, స్త్రీలు. వస్తువులు.

౯. సామాన్యముగా ఏకవచనరూపము తుదను లువర్ణకము చేర్చుటవలన బహువచనము సిద్ధన్నమగును.—వనిత, వనితలు; నవలా, నవలాలు; భ్రాత, భ్రాతలు; దిక్కు, దిక్కులు; వనము, వనమ్ము, వనంబు, వనములు, వనమ్ములు, వనంబులు.

౧౦. పుంలింగబోధక మగు డువర్ణకము బహువచనము పర మగునప్పుడు లోపించును.—రాముఁడు, రాములు; గురుఁడు, గురులు; మగఁడు, మగలు. జేఁడు శబ్దమునకు లోపింపదు.—జేఁడులు. లింగబోధక మనుటచే భ్రాతృలు, ఇత్యాదులందు లోపములేదు.

౧౧. బహువచనము పర మగునప్పుడు, ఇకారాంతశబ్దముల కొన యికారమునకు ఉకార మగును.—హరి, హరులు; కర్త.

కత్తులు; వాహిని, వాహినులు; ఇకార ముపాంత్యము*గాఁ గూడ గల తెలుఁగుశబ్దముల ఉపాంత్యఇకారమునకును ఉకార మగును:— కలికి, కలుకులు. రెండక్షరముల శబ్దములకును, ర, ల, డ, లు ఉపధలుగాఁ గలశబ్దములకును, కాదు:—జిగి, జిగులు; పందిరి, పందిరులు; పిడికిలి, పిడికిళ్లులు; రాపిడి, రాపిడులు.

౧౨. కొన్ని సువర్ణాంతశబ్దముల సువర్ణమునకు బహువచనము పర మగునప్పుడు బిందుపూర్వక కువర్ణంబు వచ్చును:—వ్రాఁతను, వ్రాఁకులు. కొలను, కొలఁకులు—కలను, కెలను, కొఱను, గవను, నెఱను, వరను, వలను, శబ్దములుకూడ నిట్టివే. ఈ కువర్ణకము వీక వచనమునందును వికల్పముగా వచ్చును:—కొలను, కొలఁకు. రేను, గోను, శబ్దముల సువర్ణమునకు బిందుపూర్వక గువర్ణకం బగును.—రేఁగులు, గోఁగులు.

౧౩. కొన్నిశబ్దములకు బహువచనము పర మగునప్పుడు కడ వర్ణము లోపించును—చేను, చేలు; పేరు, పేలు; మీను, మీలు; రేయి, రేలు; తాయి, తాలు; వ్రాయి, వ్రాలు; వేయి, వేలు. కొన్నిటి కీలోపము వైకల్పికము.—ఆవు, ఆవులు, ఆలు; జాము, జాములు, జాలు; చుట్టము, చుట్టములు, చుట్టలు; మీసము, మీసములు, మీసలు.

౧౪. దీర్ఘపూర్వక మగుళకార ముపథగాఁ గలసంస్కృతసమ మహచ్ఛబ్దంబులకు బహువచనము పర మగునప్పుడు రువర్ణకము వచ్చును.—బాలుఁడు, బాలురు. ఇట్లు కొన్ని తెలుఁగుశబ్దములకును బహువచనమున రువర్ణకము వచ్చును.—పగతుఁడు, పగతురు; అల్లుఁడు, అల్లురు.

---

* ఉపాంత్య మనఁగా తుదివర్ణమునకు సమీపమం దుండువర్ణము.

౧౫. బహువచనము పర మగునప్పుడు ఉకారాంతశబ్దముల వుపధ్మానీయమునకు లోపము బహుళము† గా నగును.—మనువు, మనువులు; గురువు, గురువులు, గురులు; వధువు, వధువులు; తరువు, తరువులు, తరులు.

౧౬. బహువచనము పర మగునప్పుడు, డు, లు, టు, రు, వర్ణముల ఉకారమునకు లోపము వైకల్పికముగా గలుగును.—గుండు, గుండులు, గుండ్లు; కాలు, కాలులు, కాళ్లు; గొంటు, గొంటులు, గొంట్లు; గోరు, గోరులు, గోర్లు.

౧౭. కొన్నిశబ్దములకు బహువచనమునం దనేకరూపములు గలవు:—

ఏకవచనము.	బహువచనము.
విలుకాఁడు.	విలుకాండ్రు, విలుకాలు.
వేఁటకాఁడు.	వేఁటకాండ్రు, వేఁటకాలు.
చెయ్యువు.	చెయ్యువులు, చెయ్యువులు.
చీటి.	చీటులు, చీట్లు.
అనఁటి	అనఁటులు, అనంట్లు.
తూఁడు.	తూఁడులు, తూండ్లు.
వజ్రము.	వజ్రములు, వజ్రాలు.
పగడము.	పగడములు, పగడాలు.
పేరు.	పేరులు, పేళ్లు, పేళ్ళు,
కొడవలి.	కొడవండులు, కొడవండ్లు.

† కొన్నిచోట్ల నిత్యముగాను, కొన్నిచోట్ల వికల్పముగాను, కొన్నిచోట్ల, మఱి యొకవిధముగాను, పచ్చటి బహుళము.

ఏకవచనము.	బహువచనము.
(తాడు.	(తాడులు, (తాళులు, (తాళ్ళు.
మొగిలు.	మొగిళులు, మొగిలులు. మొగిళ్ళు.
ఊరు.	ఊరులు, ఊళులు, ఊళ్ళు.
ఏఱు.	ఏఱులు, ఏళ్ళులు, ఏళ్ళు.
విల్లు.	విల్లులు, విండులు, విండ్లు.
జెట్టి.	జెట్టులు, జెట్లు.
తడి.	తడులు, తళ్లు, మొదలగునవి.

౧౪. మఱికొన్ని శబ్దములకు బహువచనము నానావిధములుగఁ గలుగును.

ఏకవచనము.	బహువచనము.	ఏకవచనము.	బహువచనము.
ఆలు.	ఆండ్రు	కూఁతురు.	కూఁతులు.
చెల్లెలు	చెల్లెండ్రు	పెండ్లి.	పెండ్లిండ్లు.
కోడలు.	కోడండ్రు	తేఁడు.	తేండ్లు.
ముద్దరాలు.	ముద్దరాండ్రు.	మఱఁదలు.	మఱదండ్రు.
గండఁడు.	గండండ్రు.	చెలియలు.	చెలియండ్రు.
మిండఁడు.	మిండండ్రు.	జవరాలు.	జవరాండ్రు.

౧౫. వస్తుస్వభావమునుబట్టి కొన్ని శబ్దములకు బహువచనము లేదు.—పైఁడి, వెండి, కేలు, మొన్న, నిన్న, రేపు, మాపు.

౧౬. ఈలాగుననే మఱికొన్ని శబ్దముల కేకవచనము లేదు.—ఇరులు, కురులు, పడ్లు, పెసలు.

౧౭. కొన్ని శబ్దముల కేకవచన బహువచనములయందు అనేక రూపములు కానఁబడుచున్నవి.—

ఏకవచనము	బహువచనము.	ఏకవచనము.	బహువచనము.
దయాళుఁడు,	దయాళురు,	అభిలాషము.	అభిలాషములు.
దయాళువు.	దయాళువులు.	భ్రమ,	భ్రమలు,
రాహువు.	రాహువులు,	భ్రమము.	భ్రమములు.
రాహు.	రాహులు.	వధ,	వధలు
వుట్టువు,	వుట్టువులు,	వధము.	వధములు,
వుట్టు.	వుట్టులు.	కంధరము,	కంధరములు.
సవితృఁడు,	సవిత్రులు,	కంధర.	కంధరలు.
సవిత.	సవితలు	నాసికము.	నాసికములు,
విధాతృఁడు,	విధాతృలు,	నాసిక.	నాసికలు
విధాత.	విధాతలు.	మిత్రుఁడు,	మిత్రులు,
నేతృఁడు,	నేతృలు,	మిత్రము.	మిత్రములు.
నేత.	నేతలు.	ప్రధానుఁడు,	ప్రధానులు,
శుంభుఁడు,	శుంభులు,	ప్రధానము,	ప్రధానములు.
శుంభ.	శుంభలు.	పాత్రుఁడు	పాత్రులు.
అసురుఁడు,	అసురులు,	పాత్రము	పాత్రములు.
అసుర,	అసురలు.	హంస,	హంసలు,
దూతుఁడు,	దూతులు,	హంసము	హంసములు.
దూత.	దూతలు	ధర్మము,	ధర్మములు,
బిడ్డఁడు, బిడ్డ.	బిడ్డలు.	ధర్మ్మవు.	ధర్మ్మవులు.
గొల్లఁడు, గొల్ల.	గొల్లలు.	కర్మ్మము,	కర్మ్మములు,
జాణఁడు, జాణ	జాణలు.	కర్మ్మవు.	కర్మ్మవులు.
వృద్ధుఁడు, వృద్ధు,	వద్ధులు.	వణిక్కు.	వణిక్కులు,
గృహస్థుఁడు, }	గృహస్థులు.	వణిజుఁడు.	వణిజులు
గృహస్థు. }		ఋత్విక్కు,	ఋత్విక్కులు,
చరిత,	చరితలు,	ఋత్విజుడు,	ఋత్విజులు.
చరితము.	చరితములు.	భగవంతుఁడు,	భగవంతులు.
అభిలాష,	అభిలాషలు,	భగవానుఁడు.	భగవానులు.

ఏకవచనము.	బహువచనము.
హనుమంతుఁడు.	హనుమంతులు.
హనుమానుఁడు.	హనుమానులు.
వయస్సు,	వయస్సులు,
వయసు.	వయసులు.
అంగిరుఁడు,	అంగిరులు.
అంగిరసుఁడు.	అంగిరసులు.
ప్రచేతసుఁడు,	ప్రచేతసులు.
ప్రచేతుఁడు.	ప్రచేతులు.
ప్రక్క,	ప్రక్కలు,
ప్రజము,	ప్రజములు.
గరిమ,	గరిమలు,

ఏకవచనము.	బహువచనము.
గరిమము.	గరిమములు.
మహిమ,	మహిమలు,
మహిమము.	మహిమములు.
ఆత్మ,	ఆత్మలు,
ఆత్ముఁడు,	ఆత్ములు,
ఆత్మము.	ఆత్మములు.
మనసు,	మనసులు,
మనస్సు,	మనస్సులు,
మనము.	మనములు.
పల్లకీ,	పల్లకీలు,
పల్లకి.	పల్లకులు. మొ.

విభక్తి

౧. విశేష్యములకుఁగాని సర్వనామములకుఁగాని, ఏకవాక్యము నందలి వేఱుపదములతోఁ గలుగు సంబంధమును దెలిపెడురూపము విభక్తి యనఁబడును. — ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థి, పంచమి, షష్టి, సప్తమి, అని విభక్తు లేడు.

౨. ద్వితీయాదివిభక్తుల ప్రత్యయములతోఁ గూడనిది ప్రథమావిభక్తి. — రాముఁడు ; శంభుఁడు ; శంభువు ; వనము, వనమ్ము, వనంబు ; వనిత ; గిరి ; బంటు ; కన్నె ; నవలా ; శ్రీ ఇదియె నామ విభక్తి యనఁబడును.

3. ఎవఁటివారిని బిలుచునపుడు విశేష్యములమీఁద నుండు ప్రథమ, సంబోధన ప్రథమ యనఁబడును. — ఓ రాముఁడ, ఓ రామ.

౪. సంబోధనంబున నేక వచనంబున నామంబు కడపటి ఉకా

రమునకు అకార మగును — రాముఁడ, శంభుఁడ, శంభవ ; వనము, వనమ్మ, వనంబ ; బంట.

౫. సంబోధనంబున సంస్కృతనామములు లింగబోధక దువర్ణ కమునకు లోపము వికల్పముగానగు. — రాముఁడ, రామ; సంస్కృత నామము లనుటచే అక్కజుఁడు, బల్లిదుఁడు, తమ్ముఁడు, మగఁడు, లోనగు తెనుగు శబ్దములయుం దీలోపము లేదు. — అక్కజుఁడ.

౬. ఉకారాంత సంస్కృతనామంబుల కీలోపంబు గలుగు నప్పుడు కడయచ్చునకుఁ బ్లుతము వచ్చును. — శంభూ, గురూ, ప్లుత మనఁగా మూడు మాత్రలకాల ముచ్చరింపఁబడెడి యచ్చు.

౭. సంబోధనంబున బహువచనంబునకు 'అర' అనునాగమము వచ్చును. — రాములార, బాలులార, జవరాండ్రార.

౮. సంబోధనమున అకార ఇకారములకు దీర్ఘము వైకల్పి కముగా నగును — రామ, రామా; రాములార, రాములారా ; హరి, హరీ ; తండ్రి, తండ్రీ.

౯. సంబోధ్య వాచకమునకు ముందు ఓ యనునాగమము వికల్పముగా నగును :— ఓరాముఁడ, రాముఁడ; ఓమిత్రుఁడ, మిత్రుఁడ ; ఓదురాత్ముఁడ, దురాత్ముఁడ ; ఓనెలఁత, నెలఁత ; ఓవనమ, వనమ; ఓరాములార, రాములార; మొదలగునవి.

౧౦. ఏకవచనంబునఁ బురుషసంబోధనంబున ఓయియు, నీచత్వ మిత్రత్వంబుల స్త్రీపురుష సంబోధనంబులఁ గ్రమముగా, ఓసియు, ఓరియు, వికల్పముగాఁ బూర్వా గమము లగును :— ఓయిరాముఁడ రాముఁడ; ఓసిదురాత్మరాల, దురాత్మరాల; ఓసిచెలి, చెలి; ఓరిదురాత్మ, దురాత్మ; ఓరిమిత్రుఁడ, మిత్రుఁడ.

౧౧. అకార పూర్వకముగాని లింగబోధక డువర్ణకము తుదయందుఁగల శబ్దములకు ద్వితీయాది విభక్తుల యేకవచనములు పరములగునపుడు డువర్ణకము లోపించి యూచోట నివర్ణకంబు వికల్పముగా నిలుచును:— రామునిని, రాముని, రామునిచేత, రాము చేత; బల్లిదునిని, బల్లిదుని, బల్లిదునిచేత, బల్లిదుచేత; శంభునిని, శంభుని, శంభునిచేత, శంభుచేత; విధాతృనిని, విధాతృని, విధాతృని చేత, విధాతృచేత. మొ. అకారపూర్వక మయ్యేనేని, నివర్ణకము నిత్యము:— రంగనిచేత, మగనిచేత, మొ.

౧౨. బహువచనంబున ద్వితీయాదివిభక్తులు పరంబు లగునపుడు బహువచనమును దెలుపు తుదివర్ణముయొక్క ఉకారమునకు అకార మగును:— రాములను, రాములచేత; బాలురను, బాలుర చేత; ఆండ్రను, ఆండ్రచేత; త్రాళ్ళను, త్రాళ్ళచేత.

౧౩. ని, ను, ద్వితీయావిభక్తి. డువర్ణకముపచ్చు మహాచ్ఛ బ్దంబులకును, ఇ, ఈ, ఐ, అంతమందుఁ గలపదములకును, ఏకవచన మున నివర్ణకము వచ్చును:— రామునిన్; *శంభునిన్, విధాత్రినిన్, మగనినిన్, హరినిన్, శ్రీనిన్, మైనిన్. తక్కినచోట్ల నువర్ణకము వచ్చును:— దొరను, గురువును, విధాతను, వనమును, రాములను, హరులను.

౧౪. ని, ను, వర్ణకములు వైకల్పికముగా లోపించును:— రామున్, వనమున్.

౧౫. చేత, చే, తోడ, తో, తృతీయావిభక్తి:— రాముని చేతన్, రాముచేతన్, రాములచేతన్. మొ.

---

* నై, యొక్క, లకుఁదక్క ద్వితీయాదివిభక్తుల కొనయందు ప్రాతముండును.

౧౬. కై, కొఱకు, చతుర్థీవిభక్తి:— రామునికై, రాముకై, రాములకై. మొ.

౧౭. వలన, కంటె, పంచమీవిభక్తి: — రామునివలనన్, రామువలనన్, రాములవలనన్. మొ.

౧౮. కి, కు, యొక్క, లోవల, లో, షష్ఠీవిభక్తి. సి, మీ, లకుఁదక్క ఇకార, ఈకార, ఐకారాంతములకు ఏకవచనమునందు కివర్ణకమువచ్చును:— హరికిన్, శ్రీకిన్, మైకిన్; నీకున్, మీకున్. తక్కినచోట్ల కువర్ణకమువచ్చును:— దొరకున్, రాములకున్, ఆమెకున్. ఉకార ఋకారములమీఁది కివర్ణకమునకుఁ బూర్వమున సవర్ణమాగమ * మగును:—రామునకున్, వనమునకున్, విధాత్రునకున్. లోవల, లో, వర్ణకములు బహువచనమునందే వచ్చును.- రాములలోవలన్, రాములలోన్.

౧౯. అందు, న, సప్తమీవిభక్తి. అందు వర్ణకము పరమగుచో ఉకార ఋకారములకు సవర్ణమంతాగమంబగును.—రామునందున్; విధాత్రునందున్; రాములయందున్. ఉకారాంతములగు అమహచ్ఛబ్దంబుల కేకవచనమునందు సవర్ణకము వచ్చును:— వనమునన్, ధనువునన్, చెట్టునన్.

కొన్ని శబ్దముల విభక్తిరూపములు.

రామశబ్దము.

	ఏకవచనము.	బహువచనము.
ప్ర.	రాముఁడు.	రాములు.

---

* ఆగమమనఁగా వర్ణమెక్కువగా వచ్చుట.

సం్ర.	ఓరాముఁడ, ఓరాముఁడా, ఓయిరాముఁడ, ఓయిరాముఁడా, ఓరామ, ఓరామా, ఓయిరామ, ఓయిరామా, రాముఁడ, రాముఁడా, రామ, రామా.	ఓయిరాములార, ఓయిరాములారా, ఓరాములార, ఓరాములారా, రాములార, రాములారా.
ద్వి.	రామునినిన్, రామునిన్, రాముఁన్.	రాములనున్, రాములన్.
తృ.	రామునిచేతన్, రాముచేతన్, రామునిచేన్, రాముచేఁ, రామునితోడఁ, రాముతోడఁ, రామునితోన్, రాముతోఁ.	రాములచేతన్, రాములచేన్ రాములతోడఁ, రాముల తోన్.
చ.	రామునికై, రాముకై, రామునికొఱకున్, రాముకొఱకున్.	రాములకై, రాముల కొఱకుఁ.
పం.	రామునివలనన్, రామువలనఁ, రామునికంటెఁ, రాముకంటెఁ.	రాములవలనఁ, రాములకంటెఁ.
ష.	రామునికిఁ, రామునకుఁ, రామునియొక్క, రాముయొక్క	రాములకుఁ, రాములయొక్క, రాములలోపలఁ, రాములలోన్.
స.	రామునియందుఁ, రామునందుఁ.	రాములయందుఁ. రాములందుఁ.

హరిశబ్దము.

ప్ర.	హరి	హరులు.	
సం. ప్ర.	ఓహరి, ఓహరీ.	మొ.	ఓహరులార. ఓహరులారా. మొ.
ద్వి.	హరిని, హరిఁ.		హరులను, హరులఁ.

☞ పై సూత్రములఁబట్టి ఆయావిభక్తి ప్రత్యయములఁజేర్చుకొనుటవలనఁ దక్కినవిభక్తులు లేర్పడును.

శ ం భు శ బ్ద ము.

ప్ర.	శంభుఁడు, శంభువు.	శంభులు, శంభువులు.
సం.	ఓశంభవ, ఓశంభుఁడా, ఓశంభూ 3. మొ.	ఓశంభువులారా, ఓశంభులారా. మొ.
ద్వి.	శంభువునుఁ, శంభువుఁ, శంభునిఁ, శంభుఁ.	శంభులనుఁ, శంభులన్.

[శేష మీరీతినే యూహించునది.]

వ న శ బ్ద ము.

ప్ర.	వనము, వనమ్ము, వనంబు.	వనములు, వనమ్ములు, వనంబులు.
సం. ప్ర.	ఓవనమ, ఓవనమా. మొ.	ఓవనములార, ఓవనములారా. మొ.
ద్వి.	వనమునున్, వనమున్. మొ.	వనములన్. మొ.

[శేషం బూహ్యాంబు]

ఔ ప వి భ క్తి కా ం త ము లు.

౧. విభక్తికి సహాయముగాఁ బూర్వమందు వచ్చురూపము ఉపవిభక్తి యనఁబడును. ఉపవిభక్తి ప్రత్యయము లౌపవిభక్తికములు. అవి కొనయందుఁగలవి. ఔపవిభక్తికాంతములు. నామం బులతుదనుండు, ము, లు, డు, ను, యి, మొదలయినవానికి ద్వితీయా ద్యేకవచనంబులు పరమగునప్పుడు కొన్నియెడల ఆదేశము* గాను కొన్నియెడల ఆగమముగానువచ్చు, ఇ, టి, ంటి, తి, వర్ణము లౌప విభక్తికములు.—

---

*ఆదేశమనఁగా నొకవర్ణముపోయి దానికిమాఱుగా మఱియొకవర్ణము వచ్చుట.

ప్రథమావి.	ద్వితీయావి.	ద్వితీయాదివి.			
ఊరు	ఊరి	ఊరి(నిన్,	చేతన్,	తోడన్,	మొ.)
కాలు	కాలి	కాలి(నిన్	,,	,,	,,)
ప్రాను	ప్రాని	ప్రాని(నిన్	,,	,,	,,)
ప్రాడు	ప్రాటి	ప్రాటి(నిన్	,,	,,	,,)
నోరు	నోటి	నోటి(నిన్	,,	,,	,,)
వేయి	వేయిటి	వేయిటి(నిన్	,,	,,	,,)
అన్ని	అన్నిటి	అన్నిటి(నిన్	,,	,,	,,)
కన్ను	కంటి	కంటి(నిన్	,,	,,	,,)
విల్లు	వింటి	వింటి(నిన్	,,	,,	,,)
అల్లు	అతిత	అతిత(నిన్	,,	,,	,,)
గొల్లు	గొతిత	గొతిత(నిన్	,,	,,	,,)
గోయి	గోతి	గోతి(నిన్	,,	,,	,,)
చేయి	చేతి	చేతి(నిన్	,,	,,	,,)

౨. గోయి మొదలగువాని కీరూపము బహువచనము పర మగునపుడు సయితముపచ్చును :— గోతులు, గోతులను, గోతుల చేతన్. మొ.

3. ద్వితీయావిభక్తికములలోఁ గొన్నిటికి వైకల్పికముగాఁ దృతీయాసప్తముల కత్వ మాదేశమగును:—

ప్ర. వి.	తృ. వి.	స. వి.
ఊరు	ఊరత	ఊరన్.
ప్రాడు	ప్రాటన్	ప్రాటన్.
వేయి	వేయిట	ప్రేయిటన్.
కన్ను	కంట	కంటన్.
అల్లు	అతిన్	అతిన్.
చేయి	చేతన్	చేత.

ఔపవిభక్తికాంతము.

కన్నశబ్దము.

ఏక.	బహు.
ప్ర. కన్ను.	కన్నలు.
ద్వి. కంటినిన్, కంటిన్.	కన్నలనున్, కన్నలన్.
తృ కంటిచేతన్, కంటిచేన్,	కన్నలచేతన్, కన్నలచేన్,
కంటితోడన్, కంటితోన్, కంటన్.	కన్నలతోడన్, కన్నలతోన్.
చ. కంటికొఱకున్, కంటికై.	కన్నలకొఱకున్, కన్నలకై.
పం. కంటివలనన్, కంటికంటెన్.	కన్నలవలనన్, కన్నలకంటెన్.
ష. కంటికిన్, కంటియొక్క.	కన్నలకున్, కన్నలయొక్క.
	కన్నలలోపలన్, కన్నలలోన్.
స. కంటన్, కంటియందున్.	కన్నలయందున్, కన్నలందున్.

విశేషణము.

౧. విశేష్యముల ధర్మములను దెలుపుపదములు విశేషణము లనఁబడును.

౨. గుణవాచకములు, సంఖ్యావాచకములు, క్రియావాచక ములux, అని విశేషణములు మూడువిధములు.

3. విశేష్యముల గుణములను దెలుపునవి గుణవిశేషణములు:— తెల్ల, మంచి, నిగ్గు. [రూపము, రసము, స్పర్శము, మొదలగునవి గుణములు.]

౪. ప్రాయికముగాఁ దెనుఁగు విశేషణములు స్త్రీలింగసమము లయి యుండునుగాన, అవి లింగవచనాదిభేదము లేక యెల్ల విశేష్య ములకును ముందు ప్రయోగింపఁబడును:— పెద్దమనుష్యుఁడు, మంచి పడఁతి, చిన్నపలక, నల్లమృగములు.

౫. విశేష్యములు పరము లగునప్పుడు అకారాంత గుణవాచకంబుల తుదను నివర్ణకము బహుళముగావచ్చును. — నల్లకోక, నల్లని కోక; చక్కనిబాలుఁడు; చిన్నపుస్తకము.

౬. మువర్ణాంత విశేషణముల ముపర్ణమునకు విశేష్యము పరమగునప్పుడు పువర్ణకముగాని, పూర్ణబిందు పూర్వక పువర్ణకముగాని, అగును. — సరసము+కూట=సరసపుమాట, సరసంపుమాట.

౭. సంఖ్యను దెలుపునవి సంఖ్యావాచకములు. — రెండు, యిద్దఱు.

౮. సంఖ్యార్థకములు, సంఖ్యేయార్థకములు, పూరణార్థకములు, అని సంఖ్యావాచకములు మూఁడు విధములు. రెండు, మూడు, మొదలగునవి సంఖ్యార్థకములు; ఇద్దఱు, ముగ్గురు, మొదలగునవి సంఖ్యేయార్థకములు; రెండవ, మూడవ, మొదలగునవి పూరణార్థకములు.

౯. క్రియలవలనం గలిగినవి క్రియావాచక విశేషణములు, — కొట్టుచున్న; కొట్టిన; కొట్టఁగల; కొట్టు, కొట్టెడు, కొట్టెడి.

౧౦. ఈక్రియాజన్య విశేషణములతుదను "అట్టి" అనునది వైకల్పికముగాఁ జేర్చఁబడును. — కొట్టుచున్నట్టి, కొట్టుచున్న; కొట్టినట్టి, కొట్టిన; మొ.

౧౧. క్రియావాచకములకుఁదక్క మిగిలిన విశేషణములకు, ఐన, అగు, ఔ, అను క్రియాజన్యవిశేషణములు వైకల్పికముగా నంతాగమంబు లగును — నిగ్గైన, నిగ్గగు, నిగ్గౌ (చెక్కులు), నిగ్గు (చెక్కులు.)

౧౨. లింగబోధక ప్రత్యయములతోఁ గూడిన విశేషణముల కీయాగమంబులు నిత్యముగా నగును. — యోగ్యుఁడగు పురుషుఁడు, మృదువగువస్తువు, అందమగుపదార్థము.

౧౩. ఒకానొకచో గొన్ని విశేష్యములు విశేషణములుగా వాడఁబడును – పసిఁడికంచము, పెండిపళ్ళెము, రాగిచెంబు. [ఇచట బసిఁడి మొదలగువిశేష్యములు విశేషణములుగా వాడఁబడినవి.]

స ర్వ నా మ ము లు

౧. విశేష్యములపునరుక్తిని నివారించుటకయి వానికిమాఱుగా బ్రయోగింపఁబడు పదములు సర్వనామము లనఁబడును.

౨. సర్వనామములు విశేష్యములకుమాఱుగా నుపయోగింపఁబడునవికాన విశేష్యములకుం బోలె లింగవిభక్తివచనములు వానికిని గలుగును. సంబోధన ప్రథమమాత్ర ముండదు. విశేషణములతో గూడియుండునపుడు సంబోధన ప్రథమయు నగును – ఓచిన్నవాఁడ, ఓచిన్నదాన.

౩. పురుషబోధక సర్వనామములు, సంబంధ సర్వనామములు, ప్రశ్నవాచక సర్వనామములు, విశేషణ సర్వనామములు, అని సర్వనామములు నాలుగువిధములు.

౪. పురుషులను దెలుపునవి పురుషబోధక సర్వనామములు. ప్రథమపురుషము, మధ్యమపురుషము, ఉత్తమపురుషము, అని పురుషములుమూఁడు.

౫. ప్రథమ పురుషమునం దొక్క లింగభేదములేదు. ప్రథమ పురుషమునందు, వాఁడు, వీఁడు పుంలింగము. అది, యిది, స్త్రీలింగమును నపుంసకలింగమును. నీవు, మధ్యమపురుషము. నేను, ఉత్తమ పురుషము.

౬. పురుషత్రయ సర్వనామము లిట్లు రూపనిష్పత్తిఁజెందును.

పురు. లిం విభ.	ఏక.	బహు.
ప్ర. పుం ప్ర.	వాఁడు. / వీఁడు	వాండ్రు, వారు, వారలు. / వీండ్రు, వీరు, వీరలు.
,, ,, ద్వి.	వానిన్ / వీనిన్	వారిన్, వారలన్, వాండ్రన్. / వీరిన్, వీరలన్, వీండ్రన్.
,, ,, తృ.	వానిచేతన్. మొ. / వీనిచేతన్. మొ.	వారిచేతన్. మొ. / వీరిచేతన్. మొ.
,, స్త్రీ. ప్ర.	అది / ఇది	వారు, వారలు. / వీరు, వీరలు.
,, ,, ద్వి.	దానిన్ / దీనిన్	వారిన్, వారలన్. / వీరిన్, వీరలన్.
,, ,, తృ.	దానిచేతన్. మొ. / దీనిచేతన్. మొ.	వారిచేతన్. మొ. / వీరిచేతన్. మొ.
,, న ప్ర.	అది, ఇది.	అవి, ఇవి.
,, ,, ద్వి.	దానిన్, దీనిన్.	వానిన్, వీనిన్.
,, ,, తృ.	దానిచేతన్. మొ. / దీనిచేతన్. మొ.	వానిచేతన్. మొ. / వీనిచేతన్, మొ.
మ. ప్ర.	నీవు, ఈవు.	మీరు, మీరలు, ఈరు, ఈరలు.
,, ద్వి.	నిన్నున్, నినున్.	మిమ్మున్, మిమున్.
,, తృ.	నీచేతన్. మొ.	మీచేతన్. మొ.
ఉ. ప్ర.	నేను, వీను.	నేము, వీము, మేము.
,, ద్వి.	నన్నున్, ననున్.	మమ్మున్, మమున్.
,, తృ.	నాచేతన్, మొ.	మాచేతన్, మొ.

[ఇంచుఁ దృతీయయయం దొక్కరూపమువఱకును రూపభేదములు వక్కాణింపఁబడినవి. తక్కినవి యూహించుకొన వలయును.]

౭. "తాను" అనునది ప్రథమపురుష సర్వనామముల వున రుక్తిని మాన్పుకొఱకు వాడఁబడు నొకవిధమైన పురుషసర్వనామము— వాఁడు తాను నిన్న వచ్చినాఁడ నని చెప్పుచున్నాఁడు; అది తాను యోగ్యురాల ననుకొనుచున్నది; వారు తాము చెప్పినదినిజమందురు.

	ఏక.	బహు.
ప్రథమావి.	తాను.	తాము, తారు, తమరు.
ద్వితీయ.	తన్నున్, తనున్.	తమ్మున్, తమున్.
తృతీయాది.	తన(చేతన్. మొ.)	తమ(చేతన్. మొ.)

౮. పూజయందుఁ బ్రథమపురుషైకవచన పులింగమునకు అతఁడు, ఆయన, ఇతఁడు, ఈయన, అనునవియు; స్త్రీలింగమునకు, ఆమె, ఆపె, ఆకె, ఈమె, ఈపె, ఈకె, అనునవియు; వచ్చును.

౯. "మనము" అనునది మధ్యమోత్తమ పురుషముల కేక ముగా నుపయోగింపఁబడు నిత్యబహువచనాంతమగు సర్వనామము. "మనము" అనుదానికి నీవును నేనును అని యర్థము. దీని ప్రథమా విభక్తి, మనము; ద్వితీయ, మనలన్; తృతీయాది, మనచేతన్, మనల చేతన్. మొ.

౧౦. మధ్యమోత్తమపురుష సర్వనామముల విశేషణములకుఁ గ్రమముగా నేకవచనమున, వు, ను, లును బహువచనమున, రు, ము, లును నంతాగమంబు లగును — నీవు జాణవు, నేను జాణను. ఈయాగమంబులు పరంబు లగునపుడు ఉకారంబునకు అకార మగును.—నీవు ధన్యుఁడవు, నేను ధన్యుఁడను; మీరు ధన్యులరు, మేముధన్యులము. విశేషణము లికారాంతము లయ్యే నేని వాని, వు,

ను, లకు, వి, ని, క్రమముగానగును – నీవు సుకృతివి, నేను సుకృతిని,

౧౧. ఏక వాక్యమునందలి మఱియొక నామముతోడి సంబంధ మును గలిగియుండునవి సంబంధ సర్వనామములు – ఎవఁడు తల్లిదండ్రులమాటను వినునో వాఁడు బాగుపడును. [పై వాక్యములోని "ఎవఁడు", అనునది యీవాక్యమందలి "వాఁడు" అను నామముతో సంబంధించుచున్నది కాఁబట్టి సంబంధసర్వనామము.]

౧౨. ఏఁడు, ఏవాఁడు, ఎవ్వాఁడు, ఎవ్వఁడు, ఎవఁడు, ఎతఁడు, ఏతఁడు, ఏయను; ఎవ్వరిత, ఎవ్వర్త, ఎవ్వత, ఎవరిక, ఎవర్త, ఎవత, ఎవ్వరితి, ఎవ్వర్తి, ఎవతి, ఎవరితి, ఎవరిర్తి, ఎవతి, ఎవ్వరితె, ఎవ్వర్తె, ఎవ్వతె, ఎవరితె, ఎవర్తె, ఎవతె, ఎవ్వర్తుక, ఎవ్వతుక, ఎవర్తుక, ఎవతుక, ఏమి, ఏపె, ఏకి, ఏబిడ, ఏయము; ఎది, ఏది, ఎద్ది, ఏయుది, ఎయ్యది; ఇవి సంబంధసర్వనామములు. ఇందు, "ఏఁడు" మొదలగునవి మహాదర్థకమునందును, "ఎవ్వరిత" మొదలగునవి మహాత్యర్థకమునందును, "ఏది" మొదలగునవి యమహాదర్థకమునందును వచ్చును.

౧౩. ప్రశ్నముల నడుగుటయుం దుపయోగపడునవి ప్రశ్న వాచక సర్వనామములు. – ఏసంవత్సరమున నీవు జన్మించితివి? ఎవ్వఁడు రావణుని సంహరించెను?

౧౪. సంబంధ సర్వనామములు, ఏ, ఎందఱు, ఎన్న, ప్రశ్న ములయందు వాడఁబడునుగానఁ బ్రశ్న వాచక సర్వనామములు.

౧౫. సర్వనామధర్మములను విశేషణధర్మములను గూడఁ గలిగియుండినవి విశేషణసర్వనామములు – అందఱు. [దుర్జను నందఱు నిందుంతురు; దుర్జను నందఱు నరులు నిందింతురు. ఇందు మొదటి వాక్యమునందు సర్వనామధర్మమును, రెండవవాక్యమునందు విశేషణ

ధర్మమును, 'అందఱు' అనుదానికిఁ గలదు కావున విశేషణసర్వనామము.]

౧౬. నిర్దిష్టసర్వనామములు, అనిర్దిష్టసర్వనామములు, సంఖ్యావాచకసర్వనామములు, అని విశేషణ సర్వనామములు మూఁడు విధములు.

౧౭. తమతో సంబంధించువిషయములను నిర్దేశించునవి నిర్దిష్టసర్వనామములు – ఆపట్టణము, ఈగ్రామము. ఆ, ఈ, అనురెండును నిర్దిష్టసర్వనామములు. [లొంటివాఁడు వీనిని సర్వనామములుగాఁ జెప్పిరికాని వీనియందుఁ గేవల విశేషణధర్మమే కానఁబడుచుండఁజేసి విశేషణములని చెప్పుటయే మేలు.]

౧౮. సంయుక్తాక్షరములును, శ, ష, స, హ, ర, లును బరంబు లగునప్పుడు దక్క ఆ, ఈ, ఏ, లు తాము హ్రస్వముంబొంది మీఁదివర్ణములకు వికల్పముగా ద్విత్వంబును బుట్టించును. – ఆకాలము, అక్కాలము; ఈకాలము, ఇక్కాలము; ఏకాలము, ఎక్కాలము; ఆశబ్దము, ఈరూపము, ఏప్రొలు.

౧౯. తమతో సంబంధించువిషయముల నిర్దేశింపనివి యనిర్దిష్టసర్వనామములు. – పెక్కుతెగలు. అన్ని, ఇన్ని, ఎన్ని, కొన్ని, పలు, అందఱు, అందొఱు, ఇందఱు, కొందఱు, పెక్కు, పెక్కండ్రు, పెక్కూరు, పలువురు, పలుగుండ్రు, ఇవి, యనిర్దిష్టసర్వనామములు.

౨౦. సంఖ్యను జెప్పుటయందు వర్తించునవి సంఖ్యావాచకసర్వనామములు. – ఒకఁడు నిజము చెప్పెనుగాని యిద్దఱు కల్లలాడిరి. ఒక్కఁడు, ఒక్కర్తి, ఒక్కటి, ఇద్దఱు, ఇరుగురు, రెండు, మూగురు, ముగ్గురు, ముగురు, మూఁడు, మొదలగునవి సంఖ్యావాచకసర్వనామములు.

[ఒకడు మొదలగువానికి రూపభేదంబు లనేకంబులు గలవు. గ్రంథవిస్తర భీతిచే నవి యిందుదాహరింపఁ బడవయ్యెను. వాని నెల్లఁదక్కుఁగల వ్యాకరణముల వలనను, ఆర్యవ్యవహారంబు వలనను ఎఱుంగునది.]

క్రియ.

౧. వ్యాపారమును దెలుపుపదములు క్రియ లనఁబడును — పోషించు, కొట్టు.

౨. ధాతువులకొనయుం దుకార ముండును. [ప్రత్యయముల తోడ, గూడకమునుపు క్రియకు ధాతువనియు నామమునకుఁ బ్రాతిపదిక మనియు, పేళ్ళు.]

3. క్రియలు తత్సమములు, ఆచ్చికములు, అని రెండుదెఱఁగులుగా నుండును. అందు తత్సమక్రియల యంతమందు 'ఇంచు' ఉండును.—పోషించు. ఈయించు కొన్ని దేశ్యక్రియల యంతమందును. గానఁబడు చున్నది.—ఆరగించు, అవులించు, తిలకించు, పరికించు, వలవించు. కొన్నితత్సమక్రియల యంతమందు ద్విరుక్త లకార ముండును.—భాసిల్లు, రంజిల్లు, రాజిల్లు, వర్ధిల్లు, విలసిల్లు.

౪. గురువు లేనట్టియు యకారాంతములు కానట్టియు ధాతువుల కొకటిరెండచ్చులు గలవానికి వికల్పముగా నించుకఁ బూర్వమున 'ఇయ్' ఆగమం బగును.— భుజించు, భుజియించు; గుణించు, గుణియించు; నగించు; నగియించు.

౫. సకర్మకములు, అకర్మకములు, అని క్రియలు రెండు విధములు.

౬. కర్మమును గోరునవి సకర్మకములు.—బాలుఁడు పాఠమును జదువు చున్నాఁడు. ఇచట "చదువు" ధాతువు సకర్మకము; "పాఠము" కర్మము (క్రియఫలనఁ గలుగుఫలమును పొందునది కర్మము.) కర్మమును గోరనివి యకర్మకములు — పిల్లవాఁడు పరుగెత్తు చున్నాఁడు.

౭. కర్తృర్థకప్రయోగము, కర్మార్థకప్రయోగము, అని సకర్మక క్రియలలో రెండుప్రయోగములు గలవు.

౮. కర్త ప్రథమగా నుండునది కర్తృర్థకప్రయోగము — ఉపాధ్యాయుఁడు శిష్యుని శిక్షించెను. ఇచట "ఉపాధ్యాయుఁడు" కర్త. (ధాత్వర్థ వ్యాపారమునకు ఆశ్రయమైనది కర్త.) కర్మము ప్రథమగా నుండునది కర్మార్థకప్రయోగము — శిష్యుఁడు ఉపాధ్యాయునిచేత శిక్షింపఁబడెను.

౯. సమాపకములు, అసమాపకములు, అని క్రియ లన్నియు రెండువిధములు. సమాపకము లనఁగా ముగిసినవి.—కొట్టుచున్నాఁడు. అసమాపకము లనఁగా ముగియనివి.—కొట్టి.

౧౦. స్వార్థకము, ప్రార్థనార్థకము, ఆశీరాద్యర్థకము, అని సమాపకక్రియలు మూడుభాగములు గలవి.

౧౧. వర్తమానకాలము, భూతకాలము, భవిష్యత్కాలము, తద్ధర్మార్థకము, అని స్వార్థకమందు నాలుగుకాలములు గలవు.

౧౨. ఇపుడుజరుగుచున్న కాలమును దెలుపునది వర్తమాన కాలము:—వురుగులు ప్రాఁకుచున్నవి. వెనుకజరిగిన కాలమును దెలుపు నది భూతకాలము:—వురుగులు ప్రాఁకెను. ముందు రాఁబోవు కాల మును దెలుపునది భవిష్యత్కాలము:— వురుగులు ప్రాఁకఁగలవు. పై మూడుకాలములయందును నొకటిగానుండు స్వభావాదులను దెలుపు నది తద్ధర్మము:— వురుగులు ప్రాకును.

౧౩. అవ్యయములు, విశేషణములు. విశేష్యములు, అనియున మూపకక్రియలు మూడువిధములు. తుమున్నాద్యర్థకము, క్త్వార్థకము, శత్రర్థకము మొదలగునవి యవ్యయములు. ధాతువునకు క్రమముగా ద్రుతనహిత అకారమును, ఇకారమును, ద్రుతసహిత చువర్ణకమును చేర్చుటవలన తుమున్నాద్యర్థకాదులుమూడును నిష్పన్నములగును — కొట్టన్ (తుమున్నాద్యర్థకము), కొట్టి (క్త్వార్థకము), కొట్టుచు (శత్రర్థకము). [అవ్యయములకు క్రియాకాంక్షము లని, విశేషణములకు నామకాంక్షములని విశేష్యములకు ధాశ్వర్థకాదు లని పేళ్ళు.]

౧౪. భావము, వ్యతిరేకము, అనియర్థము ననుసరించిన రెండు భేదములుగలవు. వ్యతిరేకమనగా క్రియయొక్క అభావము.

౧౫. కర్తలనుబట్టి క్రియలకు, ప్రథమపురుషము, మధ్యమపురుషము, ఉత్తమపురుషము, అని మూడేపురుషములుగలవు. ప్రథమపురుషసర్వనామమునుగాని విశేష్యమునుగాని కర్తనుగాఁ గలది ప్రథమపురుషము; మధ్యమపురుషసర్వనామమును కర్తనుగాఁగలది మధ్యమపురుషము; ఉత్తమపురుష సర్వనామమును కర్తనుగాఁగలది ఉత్తమపురుషము.

౧౬. ప్రథమపురుషమునం దక్కి లింగభేదము లేదు. ప్రతి పురుషమునందును ఏకవచన బహువచన భేదము కలదు.

౧౭. మఱియు సహాయక్రియలు, స్వతంత్రక్రియలు, న్యూన క్రియలు, అని క్రియలు మూఁడింగులుగా నుండును. సహాయక్రియలకే ఉపక్రియ లని పేరు.

ఉ ప క్రి యలు

౧౮. కాలము మొదలగువాని నేర్పఱుచుటయందుఁ గ్రియలకు సహాయముగా వచ్చుక్రియలు ఉపక్రియ లనఁబడును. తెలుఁగున నట్టి యుపక్రియలు నాలుగు. – ఉండు, కలుగు, పడు, కొను.

ఉపక్రియల రూపనిష్పత్తి.

౧. ఉండుధాతువు.

వర్తమానకాలము.

వురుషము.	లింగము.	ఏకవచనము.	బహువచనము.
ప్ర.	వుం.	ఉన్నాఁడు.	ఉన్నారు.
,,	స్త్రీ.	ఉన్నది.	ఉన్నారు.
,,	న.	ఉన్నది.	ఉన్నవి.
మ.		ఉన్నావు.	ఉన్నారు.
ఉ.		ఉన్నాను.	ఉన్నాము.

[ఈక్రియ యింతవఱకే యుపక్రియగా నుపయోగింపఁబడును.]

౨. కలుగుధాతువు.

వర్తమానకాలము.

ప్ర.	వుం.	కలఁడు.	కలరు.
,,	స్త్రీ.	కలదు.	కలరు.
,,	న.	కలదు.	కలవు.
మ.		కలవు.	కలరు.
ఉ.		కలను.	కలము.

[ఈక్రియయు నింతవఱకే యుపక్రియగా నుపయోగింపఁబడును.]

3. పదుధాతువు.

సమాపకములు.

స్వార్థకము; భావము.

వర్తమానకాలము.

ఏకవ.	బహు.
ప్ర. వుం.	పడుచున్నాఁడు.	పడుచున్నారు.
,, స్త్రీ.	పడుచున్నది.	పడుచున్నారు.
,, న.	పడుచున్నది.	పడుచున్నవి.
మ.	పడుచున్నావు.	పడుచున్నారు.
ఉ.	పడుచున్నాను.	పడుచున్నాము.

భూతకాలము.

ప్ర.	వుం.	స్త్రీ.	పడియెను, పడెను.	పడిరి.
,,		న.	పడియెను, పడెను.	పడియెను, పడెను.
మ.			పడితివి, పడితి,	పడితిరి.
ఉ.			పడితిని.	పడితిమి.

భవిష్యత్కాలము.

ప్ర.	వుం.	పడఁగలఁడు.	పడఁగలరు.
,,	స్త్రీ.	పడఁగలదు.	పడఁగలరు.
,,	న.	పడఁగలదు.	పడఁగలవు.
మ.		పడఁగలవు.	పడఁగలరు.
ఉ.		పడఁగలను.	పడఁగలము.

తద్ధర్మము.

ప్ర.	పుం.	పడుసు.	పడుదురు.
,,	న.	పడుసు.	పడును.
మ.		పడుదువు.	పడుదురు.
ఉ.		పడుదును.	పడుదుము.

తద్ధర్మము. రూపాంతరము.

ప్ర.	పుం.	స్త్రీ. పడియెడును, పడెడును, పడియెడిని, పడెడిని.	పడియెదరు, పడెదరు.
,,		న. పడియెడును, పడెడును, పడియెడిని, పడెడిని.	పడియెడును, పడెడును. పడియెడిని, పడెడిని.
మ.		పడియెదవు, పడెదవు, పడియెదు, పడెదు.	పడియెదరు, పడెదరు.
ఉ.		పడియెదను, పడెదను.	పడియెదము, పడెదము.

వ్యతిరేకము.

తద్ధర్మము.

ప్ర.	పుం.	పడడు.	పడరు.
,,	స్త్రీ.	పడదు.	పడరు.
,,	న.	పడదు.	పడవు.
మ.		పడవు.	పడరు.
ఉ.		పడను.	పడము.

ప్రార్థనార్థకము.

౧. భావము.

వీ. బ.

మ. పడుము, పడు. పడుఁడు, పడుఁడి.

ఉభయకర్తృకము — పడుదము.

౨. వ్యతిరేకము.

మ. పడకుము, పడకు. పడకుఁడు, పడకుఁడి.

ఆశీరాద్యర్థకము — పడెడున్, పడియెడిన్, పడుత్తక.

అనమాపకములు.

౧. క్రియాకాంక్షములు.

౧. పడి, క్త్వార్థకము.	౪. పడుచున్, శత్రర్థకము.
౨. పడక, వ్యతిరేక క్త్వార్థకము.	౫. పడుడుక, ఆనంతర్యార్థకము
౩. పడక, తుమున్నాన్యర్థకము.	౬. పడినన్, పడ్డన్, చేదాద్యర్థకము.

౨. నామాకాంక్షములు.

౧. పడుచున్న, వర్తమానార్థక విశేషణము.	౪. పడు, పడియెడు, పడెడు, పడియెడి, పడెడి, తద్ధర్మార్థక విశేషణము.
౨. పడిన, పడ్డ, భూతార్థక విశేషణము.	౫. పడని, వ్యతిరేకార్థక విశేషణము.
౩. పడఁగల, భవిష్యదర్థకవిశేషణము.	

౩. ధాత్వర్థకములు.

౧. పడుట, ధాత్వర్థకము.

౨. పడమి, వ్యతిరేక ధాత్వర్థకము.

[దీనికి స్వతంత్రక్రియ యగునప్పుడు సయిత మిారూపములే వచ్చును.]

---

౮. కొనుధాతువు.

సమాపకము, స్వార్థకము.

భావము.

వర్తమానకాలము.

ప్ర.	పుం.	కొనుచున్నాఁడు,	కొనుచున్నారు,
		కొన్చునాఁడు,	కొన్చునారు,
		కొంచునాఁడు.	కొంచునారు.
ప్ర.	స్త్రీ.	కొనుచున్నది,	కొనుచున్నారు,
		కొన్చున్నది,	కొన్చునారు,
		కొంచున్నది.	కొంచునారు.
,,	న.	కొనుచున్నది,	కొనుచున్నవి,
		కొన్చున్నది,	కొన్చున్నవి,
		కొంచున్నది.	కొంచున్నవి.
మ.		కొనుచునాను,	కొనుచునారు,
		కొన్చునాను.	కొన్చునారు,
		కొంచునాను.	కొంచునారు.
ఉ.		కొనుచునాను,	కొనుచునాము,
		కొన్చునాను,	కొన్చునాము,
		కొంచునాను.	కొంచునాము.

భూతకాలము.

ప్ర.	పుం.	స్త్రీ.	కొనియెను, కొనెను.	కొనిరి.
,,		న.	కొనియెను, కొనెను.	కొనియెను, కొనెను.
మ.			కొంటివి, కొంటి.	కొంటిరి.
ఉ.			కొంటిని.	కొంటిమి.

భవిష్యత్కాలము.

ప్ర.	పుం.	కొనఁగలదు.	కొనఁగలరు.
,,	స్త్రీ.	కొనఁగలదు.	కొనఁగలరు.
,,	న.	కొనఁగలదు.	కొనఁగలవు.
మ.		కొనఁగలవు.	కొనఁగలరు.
ఉ.		కొనఁగలను,	కొనఁగలము.

తద్ధర్మము.

ప్ర.	పుం. స్త్రీ.	కొనును.	కొనుదురు, కొందురు, కొంద్రు, కొండుగు, కొండు.
,,	న.	కొనును.	కొనును.
మ.		కొనుదువు,	కొనుదురు, కొందురు, కొంద్రు
		కొందువు,	
		కొనుదు,	
		కొందు,	
		కొండువు,	కొండురు, కొంద్రు.
		కొండు.	
ఉ.		కొనుదును,	కొనుదుము,
		కొందును.	కొందుము,
		కొండును.	కొండుము.

తద్ధర్మము రూపాంతరము.

ప్ర. పుం. స్త్రీ.	కొనియెడును, కొనెడును,	కొనియెదరు,
	కొనియెడిని, కొనెడిని.	కొనెదరు.
,,	కొనియెడును, కొనెడును,	కొనియెడును, కొనెడును,
	కొనియెడిని, కొనెడిని.	కొనియెడిని, కొనెడిని.
మ.	కొనియెదవు, కొనెదవు.	కొనియెదరు,
	కొనియెదు, కొనెదు.	కొనెదరు.
ఉ.	కొనియెదను, కొనెదను.	కొనియెదము, కొనెదము.

వ్యతిరేకతద్ధర్మము.

ప్ర. పుం.	కొనఁడు,	కొనరు.
,, స్త్రీ.	కొనదు.	కొనరు.
,, న.	కొనదు.	కొనవు.
మ.	కొనవు.	కొనరు.
ఉ.	కొనను.	కొనము.

ప్రార్థనార్థకము.

౧. భావము.

మ.	కొనుము, కొమ్ము.	కొనుఁడు, కొండు.
ఉభయకర్తృకము, — కొనుదము, కొందము, కొండము.		

౨. వ్యతిరేకము.

మ.	కొనకుము, కొనకు.	కొనకుఁడు.

ఆశీరాద్యర్థకము — కొనియెడును, కొనెడును, కొనుతను.

అసమాపకములు.

౧. క్రియాకాంక్షములు.

౧. కొని, క్త్వార్థకము.
౨. కొనక, వ్యతిరేక క్త్వార్థకము
౩. కొనక, తుమున్నాద్యర్థకము
౪. కొనుచున్, కొన్చున్, కొంచున్, శత్రర్థకము.
౫. కొనుడున్, ఆనంతర్యార్థకము.
౬. కొనినన్, కొన్నన్, చేదాద్యర్థకము

---

౨. నామాకాంక్షములు.

౧. కొనుచున్న, కొన్చున్న, కొంచున్న, వర్తమానార్థక విశేషణము.
౨. కొనిన, కొన్న, భూతార్థక విశేషణము.
౩. కొనఁగల, భవిష్యదర్థక విశేషణము.
౪. కొనుచు, కొన్చు, కొంచు, క్త్వార్థకము.
౫. కొనుట, కొంట, భావార్థకము.
౬. కొనిన, కొన్న, భూతార్థక విశేషణము.
౭. కొనని, వ్యతిరేకార్థక విశేషణము.
౮. కొను, కొనియెడు, కొనెడు, కొనియెడి, కొనెడి, తద్ధర్మార్థక విశేషణము.

[ఈక్రియకును స్వతంత్రముగాఁ బ్రయోగింపఁబడునప్పు డీరూపములే వచ్చును.]

స్వతంత్రక్రియలు.

౧. ఇంచు అంతమందుఁ గలధాతువులకు వర్తమానార్థకము, భవిష్యదర్థకము, ప్రార్థనార్థకము, వ్యతిరేకార్థకము, తుమున్నర్థకము, ప్రేరణార్థకము, మొదలైనవి పరంబులగునపుడు చకారంబునకు పకారం బగును.— పోషించు — పోషింపుచున్నాఁడు, పోషింపఁగలఁడు పోషింపుము. పోషింపఁడు, పోషింపక. పోషింపించు, మొ.

పోషించు, కొట్టు, ధాతువులు.

౧. కర్త్రర్థకప్రయోగము.

సమాపకము—స్వార్థకము.

భావము.

వర్తమాన కాలము.

౨. ధాతువుయొక్క శత్రర్థక రూపమునకు తుదను ఉండు ధాతువుయొక్క వర్తమానకాలరూపములను జేర్చుటవలన వర్తమాన కాలము నిష్పన్నమగును—

ప్ర.	పుం.	పోషింపుచున్నాఁడు.	పోషింపుచున్నారు.
	స్త్రీ.	పోషింపుచున్నది.	పోషింపుచున్నారు.
	న.	పోషింపుచున్నది.	పోషింపుచున్నవి.
మ.		పోషింపుచున్నావు.	పోషింపుచున్నారు.
ఉ.		పోషింపుచున్నాను.	పోషింపుచున్నాము.
ప్ర.	పుం.	కొట్టుచున్నాఁడు.	కొట్టుచున్నారు.
	స్త్రీ.	కొట్టుచున్నది.	కొట్టుచున్నారు.
	న.	కొట్టుచున్నది.	కొట్టుచున్నవి.
మ.		కొట్టుచున్నావు.	కొట్టుచున్నారు.
ఉ.		కొట్టుచున్నాను.	కొట్టుచున్నాము.

భూతకాలము.

3. ప్రథమపురుషైకవచన నపుంసకలింగ బహువచనములందు ధాతువుతుదను 'ఎను' వర్ణకము చేర్పఁబడును. పుంలింగ స్త్రీలింగ బహువచనములందు రివర్ణకమును; మధ్యమపురుషైకవచన బహువచనములందుఁ గ్రమముగా, తివి, తిరి, వర్ణకములును; ఉత్తమపురుషైకవచన బహువచనములందుఁ గ్రమముగా, తిని, తిమి, వర్ణక

ములును; క్త్వార్థకరూపము తుదను జేర్చఁబడును. తివిలోని వివర్ణక ము వైకల్పికముగా లోపించును: —

ప్ర.	పుం.	పోషించెను.	పోషించిరి.
	స్త్రీ.	పోషించెను.	పోషించెను.
	న.	పోషించెను.	పోషించెను.
మ.		పోషించితివి, పోషించితి.	పోషించితిరి.
ఉ.		పోషించితిని.	పోషించితిమి.
ప్ర.	పుం.	కొట్టెను.	కొట్టిరి.
	స్త్రీ.	కొట్టెను.	కొట్టెను.
	న.	కొట్టెను.	కొట్టెను.
మ.		కొట్టితివి, కొట్టితి.	కొట్టితిరి.
ఉ.		కొట్టితిని.	కొట్టితిమి.

---

3. భవిష్యత్కాలము.

౪. ధాతువుయొక్క తుదనున్న క్త్వార్థకరూపము తుదను కలుగు ధాతువుయొక్క వర్తమానకాలరూపములను జేర్చుటవలన భవిష్యత్కాలము నిష్పన్న మగును. —

ప్ర.	పుం.	పోషింపఁగలఁడు.	పోషింపఁగలరు.
	స్త్రీ.	పోషింపఁగలదు.	పోషింపఁగలరు.
	న.	పోషింపఁగలదు.	పోషింపఁగలవు.
మ.		పోషింపఁగలవు.	పోషింపఁగలరు.
ఉ.		పోషింపఁగలను.	పోషింపఁగలము.
ప్ర.	పుం.	కొట్టఁగలఁడు.	కొట్టఁగలరు.
	స్త్రీ.	కొట్టఁగలదు.	కొట్టఁగలరు.
	న.	కొట్టఁగలదు.	కొట్టఁగలవు.
మ.		కొట్టఁగలవు.	కొట్టఁగలరు.
ఉ.		కొట్టఁగలను.	కొట్టఁగలము.

---

౮. తద్ధర్మము.

౫౫. ప్రథమపురుషైకవచన నపుంసకలింగ బహువచనములందు నువర్ణకమును, రూపాంతరమునందు ద్రుతసహితములగు ఎము, ఎడి వర్ణకములును, పుంలింగ స్త్రీలింగ బహువచనములందు దువర్ణకమును, రూపాంతరమునందు ఎదరు వర్ణకమును, మధ్యమపురుషైక వచన బహువచనములందుఁ గ్రమముగా, దువు, దురువర్ణకములును, రూపాంతరములందు ఎదవు, ఎదరు, వర్ణకములును, ఉత్తమపురుషైక వచన బహువచనములందుఁ గ్రమముగా, దును, దుము వర్ణకములును, రూపాంతరమునందు ఎదను, ఎదము, వర్ణకములును, ధాతువు తుదను జేర్చుటవలన తద్ధర్మార్థకము నిష్పన్న మగును.—వీనిలో మధ్యమపురుషమునందలి వువర్ణకము వైకల్పికముగా లోపించును. అప్పుడు తుదిఅకారమునకు ఉకార మగును —

ప్ర.	పుం. స్త్రీ.	పోషించును.	పోషింపుదురు, పోషింతురు.
	న.	పోషించును.	పోషించును.
మ.		పోషింపుదువు, పోషింపుదు.	పోషింపుదురు, పోషింతురు,*
		పోషింతువు, పోషింతు.	పోషింత్రు.
ఉ.		పోషింపుదును, పోషింతును.	పోషింపుదుము, పోషింతుము.
ప్ర.	పుం, స్త్రీ.	కొట్టును.	కొట్టుదురు.
	న.	కొట్టును.	కొట్టును.
మ.		కొట్టుదువు, కొట్టుదు.	కొట్టుదురు.
ఉ.		కొట్టుదును.	కొట్టుదుము.

---

* ఇంచునకు దువర్ణకము పరమగునప్పుడు వైకల్పికముగా చువర్ణకము లోపించి దకారమునకు తకారమగును; దానికి రువర్ణకము పరమయ్యెనేని ఉకారము వైకల్పికముగా లోపించును—పోషింత్రు, నిందింత్రు.

రూపాంతరము.

ప్ర.పుం.	స్త్రీ	పోషించెదన్,	పోషించెడిన్, పోషించెదరు.
	న.	పోషించెదన్,	పోషించెడిన్ పోషించెదన్, పోషించెడిన్.
మ.		పోషించెదవు, పోషించెదు	పోషించెదరు.
ఉ.		పోషించెదను.	పోషించెదము.
ప్ర.పుం.	స్త్రీ	కొట్టెదుఁ,	కొట్టెదిఁ. కొట్టెదరు.
	న.	కొట్టెదుఁ,	కొట్టెడిన్. కొట్టెదుఁ, కొట్టెడిన్.
మ.		కొట్టెదవు,	కొట్టెదు. కొట్టెదరు.
ఉ.		కొట్టెదను.	కొట్టెదము.

వ్యతిరేకము.

తద్ధర్మార్థకము.

ఉ. ప్రథమపురుషైకవచనమునఁ బుంలింగమందు డు వర్ణకమును, స్త్రీలింగ నపుంసకలింగములయందు దువర్ణకమును, బహువచనమునఁ బుంలింగ స్త్రీలింగములయందు రువర్ణకమును, నపుంసకలింగమునందు వువర్ణకమును, మధ్యమపురుషైకవచన బహువచనముల యందుఁ గ్రమముగా, వు, రు, వర్ణకములును, ఉత్తమపురుషైకవచన బహువచనములయందుఁ గ్రమముగా, ను, ము, వర్ణకములును, తుము న్నర్థకరూపము తుదను జేర్చుటవలన వ్యతిరేకతద్ధర్మార్థకము నిష్పన్న మగును.—

ప్ర.	పుం.	పోషింపఁడు.	పోషింపరు.
	స్త్రీ.	పోషింపదు.	పోషింపవు.
	న.	పోషింపదు.	పోషింపవు.
మ.		పోషింపవు.	పోషింపరు.
ఉ.		పోషింపను.	పోషింపము.

ప్ర.	పుం.	కొట్టఁడు.	కొట్టరు.
	స్త్రీ.	కొట్టదు.	కొట్టరు.
	న.	కొట్టదు.	కొట్టవు.
మ.		కొట్టవు.	కొట్టరు.
ఉ.		కొట్టను.	కొట్టము.

ప్రార్థనార్థకము.

౧. మధ్యమపురుషైకవచన బహువచనములయందుఁ గ్రమముగా, ము, డు, వర్ణకములు ధాతుపుత్తుదను చేర్చుటవలన ప్రార్థనార్థకము నిష్పన్న మగును. పురుషములులేవు.

పురు.	ఏక.	బహు.
మ.	పోషింపుము.	పోషింపుఁడు.
మ.	కొట్టుము.	కొట్టుఁడు.

౨. ప్రార్థనార్థకమునం దుది ఉకారమునకు, అ, ఆ, ఇ, ఈ, లు వైకల్పికముగా నగును.— పోషింపుము, పోషింపుమా, కొట్టుమి, కొట్టుమీ, పోషింపుఁడ, పోషింపుఁడా, కొట్టుఁడి, కొట్టుఁడీ.

౩. వ్యతిరేకార్థక మధ్యమపురుషమునకు ఎ, ఏ, ఓ, ఓ, అయ్యా, అమ్మ చేర్చుటవలనను ప్రార్థనార్థక మగును.—పోషింపవె, పోషింపవే, పోషింపవో, పోషింపవో, కొట్టరె, కొట్టరే, పోషింపరయ్యా, కొట్టరమ్మ.

ఉభయకర్తృక ప్రార్థనార్థకము.

౪. దమువర్ణకము ధాతువుత్తుదను చేర్చుటవలన ఉభయ కర్తృక ప్రార్థనార్థకము నిష్పన్న మగును —పోషింపుదము, పోషింతము, కొట్టుదము.

వ్యతిరేక, ప్రార్థనార్థకము.

౫. మధ్యమ పురుషైకవచన బహువచనములయందుఁ గమముగా, కుము, కుఁడు, వర్ణకములు తుమున్నర్థక రూపము తుదను జేర్చుటవలన వ్యతిరేక ప్రార్థనార్థకము నిష్పన్న మగును. అవుడు తుమున్నర్థక రూపముండలి ద్రుతము లోపించును.

	ఏక.	బహు.
మ.	పోషింపకుము.	పోషింపకుఁడు.
మ.	కొట్టకుము.	కొట్టకుఁడు.

ఆశీరాద్యర్థకము.

౧. ద్రుతసహితములగు ఎడు, త, వర్ణకములు ధాతువు తుదను జేర్చుటవలన ఆశీరాద్యర్థకము నిష్పన్న మగును. —పోషిం చెడున్, పోషించుతన్; కొట్టెడున్, కొట్టుతఁ.

౨. తద్ధర్మార్థకము తుదను, కాతన్, కావుతఁ, కాక, వీనిని జేర్చుటవలనను ఆశీరాద్యర్థకమగును.- పోషించుఁగాతన్, పోషిం తురుగావుతన్; కొట్టుదురుగాక.

3. ప్రశ్నముల నడుగునప్పుడు క్రియాపదంబులమీఁద, ఆ, ఏ, లు వచ్చును. —వానిఁ బోషించితివా ? వారు కొట్టిరే ?

౪. క్రియాపదంబులమీఁద నంతేహార్థకునందు, ఓ, ఓ, లు వచ్చును. —కొట్టునో, కొట్టఁడో.

అసమాపకములు.

౧. అవ్యయములు.

క్త్వార్థకము.

౧. ధాతువు కొనయందలి ఉకారమునకు ఇకారముగాఁ జేయుట వలన క్త్వార్థకము నిష్పన్నమగును.—పోషించి, కొట్టి.

ఇకారము పరమగునపుడు యకారాంతధాతువుల యాకు పకారమగును.—(చేయు+ఇ)చేసి. ఈకార్యము ఎ, కొను, పరమగునపుడు సహితము కలుగును—చేసిరి, చేసెను, చేసెడిన్, చేసికొను.

వ్యతిరేక క్త్వార్థకము.

౨. తుమున్నర్థకరూపము తుదను కవర్ణకము చేర్చుటవలన వ్యతిరేకక్త్వార్థకము నిష్పన్నమగును. అప్పుడు ద్రుతము లోపించును. పోషింపక, కొట్టక.

తుమున్నాద్యర్థకము.

3. ధాతువుతుదను ద్రుతసహితమగు అకారము చేర్చుట వలన తుమున్నాద్యర్థకము నిష్పన్నమగును.— పోషింపన్, కొట్టన్.

శత్రర్థకము.

౪. ధాతువుకొనను ద్రుతసహితమగు చువర్ణకము చేర్చుట వలన శత్రర్థకము నిష్పన్నమగును.—పోషించుచున్, కొట్టుచున్.

ఆనంతర్యార్థకము.

౫. ధాతువుకొనను ద్రుతసహితమగు డువర్ణకము చేర్చుట వలన ఆనంతర్యార్థకము నిష్పన్నమగును—పోషింపుడున్, కొట్టుడున్.

చేదాద్యర్థకము.

౬. క్త్వార్థకరూపముతుదను ద్రుత సహిత నవర్ణకము చేర్చుట వలన చేదాద్యర్థకము నిష్పన్నమగును. — పోషించిన, కొట్టిన.

2. విశేషణములు.

వర్తమానార్థక విశేషణము.

౧. శత్రర్థకరూపము తుదను ఉన్న యనునది చేర్చుటవలన వర్తమానార్థక విశేషణము నిష్పన్న మగును – పోషింపుచున్న, కొట్టుచున్న.

భూతార్థక విశేషణము.

౨. క్తార్థకరూపము తుదను నవర్ణకము చేర్చుటవలన భూతార్థకవిశేషణము నిష్పన్నమగును. – పోషించిన, కొట్టిన.

భవిష్యదర్థక విశేషణము.

3. తుమున్నర్థకరూపము తుదను కల యనునది చేర్చుట వలన భవిష్యదర్థకవిశేషణము నిష్పన్నమగును. – పోషింపఁగల, కొట్టఁగల.

తద్ధర్మార్థక విశేషణము.

౪. ధాతువు తుదను, ఎడు, ఎఱి, నవర్ణకములు వైకల్పికముగాఁ జేర్చుటవలన తద్ధర్మార్థకవిశేషణము నిష్పన్నమగును. – పోషించు, పోషించెడు, పోషించెడి; కొట్టు, కొట్టెడు కొట్టెడి.

వ్యతిరేకార్థక విశేషణము.

౫. తుమున్నర్థకరూపము తుదను నివర్ణము చేర్చుటవలన వ్యతిరేకార్థక విశేషణము నిష్పన్నమగును. – పోషింపని, కొట్టని.

---

3. విశేష్యములు.

ధాత్వర్థకము.

౧. ధాతువుతుదను టవర్ణకము చేర్చుటవలన ధాత్వర్థకము నిష్పన్నమగును – పోషించుట, కొట్టుట.

వ్యతిరేక ధాత్వర్థకము.

౨. తుమున్నర్థకరూపము తుదను మివర్ణకము చేర్చుటవలన వ్యతిరేక ధాత్వర్థకము నిష్పన్నమగును. — పోషింపమి, కొట్టమి.

కృదంతములు.

3. ధాతువులతుదను కొన్ని ప్రత్యయములను జేర్చుటవలన నేర్పడు విశేష్యములు కృదంతములనఁబడును. — ఏలిక (ఏలు), కలిమి (కలుగు), కొనుబడి (కొను), మొ.

---

౪. కర్మార్థక ప్రయోగము.

౧. సకర్మక ధాతువుల తుమున్నర్థకరూపము తుదను పడుధాతువు చేర్చుటవలన కర్మార్థకము నిష్పన్నమగును. — పోషింపఁబడు, కొట్టఁబడు.

౨. సమాపకములును, అసమాపకములును, అగు పెక్కురూపములును, పడు ధాతువుయొక్క ఆయారూపములను పైయట్లు చేర్చుటవలన నేర్పడును. — పోషింపఁబడుచున్నాఁడు, కొట్టఁబడుచున్నాఁడు; పోషింపఁబడి, కొట్టఁబడి, మొ.

ఆత్మనేపదార్థకము.

౧. క్రియాఫలము కర్తను జెందినపు డది యాత్మనేపదార్థక మనఁబడును. ధాతువుతుదను కొనుధాతువు చేర్చుటవలన ఆత్మనేపదార్థకము నిష్పన్నమగును. అప్పుడు ధాతువు కొనయందలి ఉకారమునకు వైకల్పికముగా ఇకార మగును. — పోషించుకొను, పోషించికొను; కొట్టుకొను, కొట్టికొను.

—ఏ. సమాపకములును, అసమాపకములును, అగు నన్ని రూపములను ధాతువృత్తుదను పైయట్లు కొనుధాతువు రూపములను జేర్చుటవలన నేర్పడును. కర్త్రర్థకాదులను వెనుక చెప్పినతీరుననే యెఱుంగునది.

౧. ఆత్మనేపదకర్త్రర్థకము.

పోషించుకొనుచున్నాఁడు, పోషించికొనుచున్నాఁడు; పోషించుకొని, పోషించికొని; కొట్టుకొనుచున్నాఁడు, కొట్టికొనుచున్నాఁడు, కొట్టుకొని, కొట్టికొని. మొ.

—ఏ. ఆత్మనేపద కర్మార్థకము.

పోషించుకొనఁబడుచున్నాఁడు, పోషించికొనఁబడుచున్నాఁడు, పోషించుకొనఁబడి, పోషించికొనఁబడి; కొట్టుకొనఁబడుచున్నాఁడు, కొట్టికొనఁబడుచున్నాఁడు, కొట్టుకొనఁబడి, కొట్టికొనఁబడి. మొ.

ప్రేరణార్థకము.

౧. మఱియొకనిచేఁ జేయించునది ప్రేరణార్థక మనఁబడును. ధాతువృత్తుదను ఇంచు చేర్చుటవలన ప్రేరణార్థకము నిష్పన్నమగును.— పోషింపించు, కొట్టించు.

—ఏ. సమాపకరూపములును, అసమాపకరూపములును, కర్త్రర్థకము మొదలయినవియు పైనిచెప్పిన చొప్పున గ్రహింపవలయు.

౧. ప్రేరణకర్త్రర్థకము.

పోషింపించుచున్నాఁడు, పోషింపించి; కొట్టించుఁచున్నాఁడు, కొట్టించు, మొ.

౨. ప్రేరణకర్మార్థకము.

పోషింపింపఁబడుచున్నాఁడు, పోషింపింపఁబడి, కొట్టింపఁబడుచున్నాఁడు, కొట్టింపఁబడి. మొ.

3. ప్రేరణాత్మనేపదకర్త్రర్థకము.

పోషింపించుకొనుచున్నాఁడు, పోషింపించికొనుచున్నాఁడు, పోషింపించుకొని, పోషింపించికొని, కొట్టించుకొనుచున్నాఁడు, కొట్టించికొనుచున్నాఁడు, కొట్టించుకొని, కొట్టించుకొని. మొ.

౪. ప్రేరణాత్మనేపదకర్మార్థకము.

పోషింపించుకొనఁబడుచున్నాఁడు, పోషింపించికొనఁబడుచున్నాఁడు, పోషింపించుకొనఁబడి, పోషింపించికొనఁబఁడి; కొట్టించుకొనఁబడుచున్నాఁడు, కొట్టించికొనఁబడుచున్నాఁడు; కొట్టించుకొనఁబడి, కొట్టించికొనఁబడి. మొ.

న్యూనక్రియలు.

౧. కొన్ని కాలములయందును, పురుషములయందును మాత్రము ప్రయోగింపఁబడు క్రియలు న్యూనక్రియలు. — ఒల్లఁడు, వలయును. మొ.

౨. 'ఒల్లఁడు' దీనికివ్యతిరేకమునందే కాని భావంబునఁ బ్రయోగములేదు; ఈప్రకారముగానె వలయును, వలెను, వలదు, కూడును, కూడదు, మొదలగునవియుఁ గొన్ని యెడలమాత్రమె ప్రయోగింపఁబడును.

---

౧. మఱియు సాధారణక్రియలు, నిపాతనక్రియలు, అని క్రియలు రెండువిధములు గలవి.

---

2. ధాతువు తుదను ద్రుతసహిత అకారమును, ము, డు, వర్ణకములును, చేర్చుటవలన గ్రమముగా తుమున్నా ద్యర్థకమును, ప్రార్థనార్థకమును, నిష్పన్న మగునవి సాధారణక్రియలు—

ధాతువు.	తుమున్నా ద్యర్థకము.	ప్రార్థనార్థకము.
పోషించు	పోషింప	పోషింపుము, పోషింపుఁడు.
భరించు	భరింప	భరింపుము, భరింపుఁడు.
కొట్టు	కొట్ట	కొట్టుము, కొట్టుఁడు.
వండు	వండ	వండుము, వండుఁడు.

3. తుమున్నర్థకమునందును, ప్రార్థనార్థకమునందును వేఱు రూపములను బొందునవి నిపాతక్రియలు.—

ధాతు.	తుము.	ప్రార్థ.
అగు	కాన్	కమ్మ్ము. కండు.
వచ్చు	రాన్	రమ్ము, రండు.
చొచ్చు	చొరన్	చొరుము, చొరుఁడు.
చూచు	చూడన్	చూడుము, చూడుఁడు.
ఇచ్చు	ఈన్, ఈయన్, ఇయ్యన్	ఇమ్ము, ఇండు.
తెచ్చు	తేన్, తేరన్	తెమ్ము, తెండు, తేరుము, తేరుఁడు.
చచ్చు	చాన్, చావన్	చావుము, చావుఁడు.
నొచ్చు	నోన్, నోవన్, నొవ్వన్	నొవ్వుము, నొవ్వుఁడు, నోవుము, నోవుఁడు.
పోవు	పోన్, పోవన్	పొమ్ము, పొండు.
అను	అనన్, నాన్	అనుము, అనుఁడు.

ధాతు.	తుము.	ప్రార్థ.
కను	కనక, కానక	కనుము, కనుఁడు.
పిలుచు	పిలువక	పిలుము, పిలుఁడు, పిలువుము, పిలువుఁడు.
లేచు	లేవక	లెమ్ము, లెండు.
నిలుచు	నిలువన్	నిలుము, నిలుఁడు, నిలువుము, నిలువుఁడు. మొదలగునవి.

ప్రేరణార్థకము.

౧. క్రియలు ప్రేరణార్థకమున, సమరూపక్రియలు, భిన్నరూప క్రియలు, అని రెండు రెఱఁగులు.

౨. ధాతువుతుదను ఇంచు చేర్చుటవలన నిష్పన్న మగునవి సమరూపక్రియలు.—(పోషించు) పోషింపించు; (కొట్టు) కొట్టించు. అట్లుగాక వేరు వేరురూపములను జెందునవి భిన్నరూపక్రియలు.—(రంజిల్లు) రజించు; (అడఁగు) అడఁచు.

భిన్నరూపక్రియల పట్టిక.

స్వార్థకము.	ప్రేరణము.
పూను	పూనుచు, పూనించు.
తేలు	తేలుచు, తేలించు.
మగుడు	మగుడుచు, మగిడించు.
కుదురు	కుదురుచు, కుదిరించు.
వినుచు	వినుచు, వినిపించు.
అను	అనిపించు.
తిను	తినిపించు.
కను	కనిపించు, కానిపించు.
మెచ్చు	మెచ్చించు, మెప్పించు.

స్వార్థకము.	ప్రేరణము.
మాను	మానుచు, మానువు, మానిపించు, మానించు
మను	మనుచు, మనువు.
అడఁగు	అడఁచు, అడఁగించు.
మాయు	మాపు, మాయించు.
కరఁగు	కరఁచు, కరఁగించు.
వడియు	వడుచు.
కలఁగు	కలఁచు, కలఁగించు.
ఉడుగు	ఉడుపు, ఉడిగించు.

స్వార్థకము.	ప్రేరణము.
కడచు	కడవు.
కుడుచు	కుడుపు, కుడిపించు.
ఆఁగు	ఆఁచు, ఆఁపు, ఆఁగించు.
రేగు	రేఁచు, రేఁపు, రేఁగించు.
పాయు	పాచు, పాపు.
విఱుగు	విఱుచు.
చూచు	చూపు.
నేరుచు	నేరుపు.
మేయు	మేపు.
లేచు	లేపు.
కలియు	కలుపు.
తడియు	తడుపు.
తెలియు	తెలుపు.
అగు	కావించు.
వచ్చు	రావించు, రప్పించు.
నొచ్చు	నొంచు, నొప్పించు.
ఉండు	ఉనుచు, ఉంచు.
డిగు	డిగించు, డించు.

స్వార్థకము.	ప్రేరణము.
పెరుగు	పెనుచు, పెంచు.
తునుఁగు	ద్రుంచు.
మునుఁగు	మునుచు, ముంచు.
చొచ్చు	చొనుపు, చొప్పించు.
బిగియు	బిగుచు, బిగియించు.
చినుఁగు	చించు, చింపు.
తెగు	తెంచు, తెంపు.
తిరుగు	త్రిప్పు.
చచ్చు	చంపు.
నిలుచు	నిలువరించు, నిలుపు.
కొను	కొలుపు.
ఆడు	ఆరుచు, ఆడించు.
ఓడు	ఓరుచు, ఓడించు.
కూడు	కూరుచు, కూడించు.
చెడు	చెఱుచు, చెఱుపు.
పడు	పఱుచు
వెలువడు	వెలువరించు, వెలువఱుచు, మొ.

3. ఇందుఁ గొన్ని క్రియలకుఁ బెక్కురూపంబులు కానఁబడుచున్నవి:—(మొగుడునకు) మొగుడుచు, మొగుచు, మోడుచు, మొగిడించు; (పోవునకు) పుచ్చు, పనుచు, పంచు, పనుపు, అనుచు, అనుపు, అంపు.

అవ్యయములు.

౧. లింగము, వచనము, పురుషము, విభక్తి, వీనిని బొంద కుండు పదములు అవ్యయములు.

౨. లాక్షణికములు, ప్రతిదోక్తములు, అని యవ్యయములు రెండువిధములు గలవి. శాస్త్రముచేత నిష్పన్నములైనని లాక్షణికములు. పుట్టినవి పుట్టిన ట్లుండునవి ప్రతిపదోక్తములు.

౩. క్రియాజన్యములు, మొదలగునవి లాక్షణికము లైన యవ్యయములు. తక్కినవి ప్రతిపదోక్తములు.

౪. క్త్వార్థకము, వ్యతిరేకక్త్వార్థకము, తుమున్నాద్యర్థకము, శత్రర్థకము, ఆనంతర్యార్థకము, చేదాద్యర్థకము, క్రియలవలనఁ గలిగిన యవ్యయములు.

౫. అగుధాతువు తుమున్నాద్యర్థకరూపమగు "కాఁ" అనునది విశేషణములతోడఁ జేరి వానిని అవ్యయములఁ జేయును. అప్పుడు కవర్ణముయొక్క దీర్ఘమునకు హ్రస్వము వైకల్పికముగా నగును. చక్కఁగన్, చక్కఁగాఁ; పుల్లగఁ, పుల్లగాఁ.

౬. పదముల నొండొంటితోఁ గలుపుటకు ఉపయోగింపఁబడు పదములు సముచ్చయము లనఁబడును. సముచ్చయములు రెండు.—యు, ను. ఇవి ద్రుతాంతములు. ఉకారాంతములమీఁద నువర్ణకమును, మిగిలినవానిమీఁద యువర్ణకమును వచ్చును—రాముఁడును. సత్యయు హరియు ద్వారకకు వచ్చిరి.

—

ప్రతిపదోక్తములు.

అంత	అదిగో	అమ్మచెల్ల	ఆకట	ఇదిగో	ఉవ్వెత్తు
అఁట	అద్దిర	అయ్యారె	ఆహా	ఇంచుక	ఊరక
అకట	అనయము	అవుర	ఇఁక	ఇసీ	ఎంతయు
అక్కట	అమ్మకచెల్ల	ఆ!	ఇగో	ఉద్దవిడి	ఎట్టూ

ఎత్తిలి	ఓయి	కాఁబోలు	తద్దయు	బలా	హా
ఎప్పటి	ఓహో	కావున	తరమిడి	బలె	హుటాహుటి
ఎల్ల	కటకట	కొలె	తర్వాత	బాపు	హోరాహోరి
ఏని	కట్టా	కోలె	తలా	బాపురె	అయ్యో
ఏల	కడు	క్రమ్మఱి	దనుక	మఱ్ఱి	ఎట్టకేలకు
ఒండొ	కద	గ్రక్కున	దాఁక	మఱి	ఎట్టకేని
ఒగొ	కదా	గ్రమ్మన	నెట్టన్	మిక్కిలి	హైసరె
ఒత్తిలి	కనుక	చీ	పదఁపడి	మిన్నక	హొరిహొరి
ఓహో	కరము	చెఱి	పిదప	వెండియు	బోరన
ఓచెల్ల	కాని	చెల్లఁబో	పిమ్మట	వెండి	మొదలగునవి.
ఓటు	కాఁబట్టి	చేసి	బళి	సని	

---

౧. దృతప్రకృతికములు, కళలు అని పదము లన్నియు రెండు విధములు. దృతమంతమందుఁ గలవి ద్రుతప్రకృతికములు. ద్రుత మంతమందురానివి కళలు.

౨. ద్రుతప్రకృతికములు — ౧ ప్రథమ, కయి, యొక్క కాక మిగిలినవిభక్తులు — గిరిన్, దొరనున్, వనములన్; నాచేశిన్, నీచేన్, వానితోడన్, దానితోన్; మాకొఱకున్; మీవలనన్, తనకంటెన్; హరికిన్, మనకున్, శూరులలోపలన్, నదులలోన్; గ్రహమునందున్, స్వర్గమునన్. ౨. భూతతద్ధర్మార్థక ప్రథమపురు షైకవచనములు. — వచ్చెన్, వండున్, కొట్టెడున్, తినియెడిన్. 3. ఉత్తమపురుషైకవచనములు. — వినుచున్నాను, కంటిన్, చేయఁగలన్, నిలుతున్, అరిగెదన్, కనన్. ౪. ఆశీరాద్యర్థకములగు ఎడు, తవర్ణకములు. — దగ్గుఁడయ్యెడున్, మేలుకలుగుఁగాన్, శుభంబగుఁగా

వుతన్. ౫. శత్రర్థకము — చనుచున్. ౬. తుమున్నాద్యర్థకము. — వీగన్. ౭. ఆనంతర్యార్థకము. — తోలఁగుడున్. ౮. చేదాద్యర్థకము — వర్షించినన్. ౯. సముచ్చయములు — హరియున్, నేనునున్. ౧౦. తాను, నేను, మొదలగునవి. — తాఁజదివె, నేఁజెప్పితి, వలెన్, పోలెఁ, అయ్యెఁ. మొ.

3. ద్భుతప్రకృతికములు కానివన్నియుఁ గళలు — రాముఁడు, వనము, వస్తువు, హరులు, బల్లిదునికయి, వారియొక్క, (విభక్తులు); చెప్పితివి, వచ్చుచున్నావు (మధ్యమపురుషక్రియలు); లేచిరి, వచ్చిరి, (శేషాంతక్రియలు); కంటిమి, చేయుచున్నాము, (మాంతక్రియలు); చేసి, వినక, (క్త్వార్థకములు); చేయుచున్నాఁడు, చేయుచున్నది, కొట్టినవి, చేయఁగలదు, చేయఁగలఁడు, చేయఁగలరు, కొట్టఁడు, కొట్టదు, కొట్టవు, (వర్తమాన, భవిష్యత్, వ్యతిరేక, ప్రథమపురుషములు); ఇంచుక బావురె, ఔర, కటకట, అపుడు, ఇపుడు, ఎపుడు, ఏమి, ఎ, ఏ, ఆ, కదా, ఊరక. మొ. (అవ్యయములు).

౪. వాక్యములతుదనుండు ద్రుతము వైకల్పికముగా లోపించును. — న్యాయమార్గంబున నడువవలయున్, నడువవలయు.

సమాసపదములు.

౧. పెక్కుపదములుకూడి యొక్కపద మగునది సమాసం బనఁబడును — నలుగడలు, పాలకడలిపట్టి, రామలక్ష్మణభరతశత్రుఘ్నులు.

౨. సాంస్కృతికము, మిశ్రము, ఆచ్ఛికము, అని సమాసములు మూడువిధములు. సాంస్కృతికము, కేవలసంస్కృతపదములచేఁ గలిగినచో సిద్ధ మనఁబడును. — తటాకోదకము; తత్సమపదములచేఁ గలిగినచో సాధ్య మనఁబడును. — తటాకంబునుదకము. తత్సమముల

కును, అచ్చు తెనుఁగుపదములకును కలుగునది మిశ్రము.—తటాకంబు నీరు, చెఱువునుదకము, కేవలము తెలుఁగుపదములకుఁ గలుగునది యాచ్ఛికము. — చెఱువునీరు.

3. అవ్యయీభావము, తత్పురుషము, ద్వంద్వము, బహు వ్రీహి, అని సమాసములు నాలుగువిధములు.

ర. మొదటిపదము నర్థము ప్రధానముగాఁ గలది. యవ్యయీ భావము.—మధ్యేసముద్రము, మీఁగాలు, పెడతల.

ఱ. ఉత్తరపదము నర్థము ప్రధానముగాఁ గలది తత్పురు షము.—చోరభయము, దొంగయలజడి.

ఁ. సమానాధికరణము, వ్యధికరణము, అని తత్పురుషము ద్వివిధము. విశేష్య విశేషణముల సమాసము సమానాధికరణము; తక్కినది వ్యధికరణము.

2. సమానాధికరణము—సంఖ్యావాచకము పూర్వపదముగాఁ గలది ద్విగుసమాసము.—త్రిలోకి, ముల్లోకములు, ముజ్జగములు.

ం. సంఖ్యావాచకము కానివిశేషణమునకు విశేష్యముత్తోడ సమాసముకర్మధారయము.-నరసవచనము, సరసపుమాట, దంటమాట.

ఁ. ఇందు, ం. ఉపమానము పూర్వపదముగాఁ గలది యుప మాన పూర్వపదసమాసము. — చంద్రసుందరము, చిరుగుమోవి; ఁ. ఉపమాన ముత్తరపదముగాఁ గలది యుపమానోత్తర పద సమాసము.—హస్తపద్మము, కేలుదమ్మి; 3. అవధారణవాచకము పూర్వమందుఁ గలది యవధారణ పూర్వపదసమాసము. — నిళా కాంత, రేవెలది; ఇదియె రూపకసమాస మనఁబడును, ర. నడిమి పదములోపించినది మధ్యమపదలోపి సమాసము—ఛాయాద్రుమము, జవ్వాజిసెట్టి.

౧౦. వ్యధికరణము.—౧. ద్వితీయాతత్పురుషము.—కృష్ణ శ్రితుఁడు, పడగదారి; ౨. తృతీయాతత్పురుషము—మాసపూర్వము, నెలతక్కువవాఁడు; 3. చతుర్థీతత్పురుషము. — యూపదారువు, దేవరమేలు; ౪. పంచమ్యాతత్పురుషము. — చోరభయము, దొంగ యలుకు; ౫. షష్ఠీతత్పురుషము.—లక్ష్మీవల్లభుఁడు, లచ్చిమగఁడు; ౬. సప్తమ్యాతత్పురుషము. — ఈశ్వరాధీనము, మాటనేర్పరి; ౭. క్త్యర్థపురుషము.—అజ్ఞానము.

౧౧. రెండుపదముల యర్థములును ప్రధానముగాఁ గలది ద్వంద్వసమాసము.—జననీజనకులు, తల్లిదండ్రులు.

౧౨. ఇతరపదార్థము ప్రధానముగాఁ గలది బహువ్రీహి సమాసము.—శీతకిరణుఁడు, చలివెలుఁగు.

౧౩. లుక్సమాసములు, అలుక్సమాసములు అని సమాసము లెల్ల ద్వివిధములు. విభక్తి లోపించునది లుక్సమాసము—వృక్ష మూలము, చెట్టుమొదలు.

౧౪. సమాసమందు విభక్తి లోపించును. లకారము లోపింపదు.—గుణములప్రోక.

౧౫. విభక్తి లోపింపని దలుక్సమాసము. — వనేచరుఁడు, సీతోడిచెలిమి.

౧౬. సమాసమందు, చేత, తోడ, వలన, వీనియంత్య అకారమునకు ఇకారమును, అందునకు తుదను అలి యునునాగమంబులు వగును.—నాచేతిపోరు, సీతోడినెయ్యము, నావలనితప్పు, నాయందలి దయ.

౧౭. సమాసములం దంతట ద్రుతమునకు లోపము గలుగును- ఎల్లయుంశములు; ఎల్లకాలము. తలఁబ్రాలు మొదలగువానియం దీలోపము లేదు.—తలఁబ్రాలు, సేసఁబ్రాలు, ఊరఁబిచ్చుక.

పదసంధులు.

౧. పదము లొకటిత్రో నొకటి చేరునపుడు కలుగు రూప భేదము సంధి యనఁబడును. అచ్సంధి, హల్సంధి, అని సంధి రెండు విధములు గలది.

అచ్సంధి.

౨. మొదటిపదము తుదియచ్చు లోపించి యచట రెండవ పదము మొదలియచ్చు నిలుచుట అచ్సంధి యనఁబడును.— రాముఁడు+అతఁడు=రాముఁడతఁడు.

3. దీర్ఘాచ్చులంతమునందుఁ గల పదములకును, ఇఁక మొదలగు వానికిఁ దప్ప ద్రుతప్రకృతికములకును, తఱుచుగా సంధిరాదు. సంధి వచ్చునప్పుడు ద్రుతము లోపించును. కళాశబ్దములకు సంధిరానిమొడల మొదటియచ్చునకుఁ బరమందు యకారమాగమముగా వచ్చును.— మా+ఇల్లు=మాయిల్లు, చూడన్+అయితి=చూడనయితి, నాకొ అకుఱ+ఇచ్చె=నాకొఅకిచ్చె.

అకారము.

౪. అకారమునకు సంధి బహుళముగా వచ్చును.—మేన+ అత్త=మేనత్త, మేనయత్త. బహుళ మనుటవలన స్త్రీవాచకములు, సంబోధనాంతములు, తద్ధితములు, మొదలయిన వానికి సంధి రాదు.—నెలఁత+ఇచ్చెను=నెలఁత యిచ్చెను, రాముఁడ+ఇదిగో= రాముఁడయిదిగో, హాంప+ఇది=హాంపయిది.

౫. కర్మధారయమునందు, కొన్నిశబ్దములకు ఆలుశబ్దము పర మగునపుడు తుదను రేఫాగమమువచ్చును.—పేద+ఆలు=పేదరాలు, గొడ్డు+ఆలు=గొడ్డురాలు. తత్సమంబుల తుది యత్వంబున కుత్వం బగును.—ధీర+ఆలు=ధీరురాలు.

ఇకారము.

౬. మధ్యమపురుషక్రియలయందు ఇకారమునకు సంధి నిత్యము.—ఏలితివి+అతని=ఏలితివతని, కొట్టితిరి+అప్పుడు=కొట్టితిరప్పుడు.

౭. ఏమి మొదలగుశబ్దముల ఇకారమునకును, ప్రథమోత్తమ పురుషములయందలి ఇకారమునకును, సంధి*వికల్పముగా వచ్చును—ఏమి+అనెను=ఏమియనెను, ఏమనెను; వచ్చిరి+ఇప్పుడు=వచ్చిరియిప్పుడు, వచ్చిరిప్పుడు; వచ్చితిమి+అప్పుడు=వచ్చితిమియప్పుడు, వచ్చితిమప్పుడు. ఏమి, మఱి, కిషష్టి, అది, అవి, ఇది, ఇవి, ఏది, ఏవి, ఇవి, యేమి మొదలగునవి.

౮. తక్కినచోట్ల ఇకారమునకు సంధిరాదు.—వచ్చి+ఇచ్చెను=వచ్చియిచ్చెను; హరి+అతఁడు=హరియతఁడు.

ఉకారము.

౯. ఉకారమునకు సంధి నిత్యముగా వచ్చును.—రాముఁడు+ఎక్కడ=రాముఁడెక్కడ.

౧౦. ద్రుతప్రకృతికము లగు ప్రథమేతరవిభక్తులయందును, శత్రర్థకచువర్ణకమునందును గల ఉకారమునకు సంధి వైకల్పికముగా వచ్చును.—నన్నుక+అడిగెన్=నన్నడిగెక, నన్ననడిగెన్; మొ. చూచుచున్+ఉండెను=చూచుచుండెను, చూచుచునుండెను. నన్ను

---

* ఒకప్పుడువచ్చి యొకప్పుడు రాకపోవుట వికల్పము.

నిన్ను, తన్ను, మమ్ము, మిమ్ము, తమ్ము, లకు ద్విత్వలోపమున సంధి లేదు.—నను నేలె, మిము నడిగె.

౧౧. కర్మధారయమునందు ఉకారమున కచ్చు పరంబగు నవ్వుడు పరమందు టకార మాగమముగా వచ్చును.—కఱకు+అమ్ము= కఱకుటమ్ము. కొన్ని చోట్ల నీయాగమము వైకల్పికము.—పేరు+ ఉరము = పేరురము, పేరుటురము.

౧౨. ఉకారాంతతద్ధర్మార్థక విశేషణములకును, షష్ఠీసమా నమునందు ఉకారాంత ఋకారాంతపదములకును, అచ్చు పరమగు నవ్వుడు నకారమం తాగమముగా వచ్చును.—చేయు+అతఁడు = చేయునతఁడు, వచ్చెడు+ఆతఁడు=వచ్చెడునాతఁడు; మోము+అం దము=మోమునందము, విధాతృ+ఆజ్ఞ=విధాతృనాజ్ఞ.

౧౩. వాక్యముల తుదనుండు ఉకారమునకు సంధిలేకుండుట యొక దోషముగాదు.—సర్వతీర్థాభిగమనంబు సర్వవేద సమధిగమము సత్యంబుతో సమముగావు ఎఱుఁగు మెల్లధర్మములకుఁ.

౧౪. ఆమ్రేడితమందును * ఎడు మొదలగుశబ్దములు పరము లగునవుడును అన్ని అచ్చులకు సంధి నిత్యముగా వచ్చును.—ఆహా+ఆహా=ఆహాహా; వీసె+ఎడు=వీసెడు; తాటి+ఆకు=తాటాకు.

హల్సంధి.

౧౫. ప్రథమమొదటి క, చ, చ, ట, త, వ, లకుఁ గ్రమ ముగా, గ, స, స, డ, ద, వ, లు వికల్పముగానగును.—వాఁడు+ కొట్టె=వాఁడు గొట్టె, వాఁడు కొట్టె; అతఁడు+చేరె=అతఁడు సేరె, అతఁడు చేరె; ఇతఁడు+చనియె=ఇతఁడు ననియె, ఇతఁడు చనియె;

---

* ఆమ్రేడితమనఁగా రెండుమూరు లుచ్చరింపఁబడుమాట.

వీడు+టక్కరి=వీడు డక్కరి, వీడు టక్కరి; ఆమె+శగవరి=ఆమె దగవరి, ఆమె తగవరి; అది+పలికె=అది వలికె, అది వలికె.

౧౬. ద్వంద్వసమాసమునందు పదమునొదిని క, చ, చ, ట, త, ప, లకు గ్రమముగా, గ, స, స, డ, ద, వ, లు నిత్యముగా నగును.—కూరగాయలు, కాలుసేతులు, టక్కుసొక్కులు, వంపుడొంపులు, అన్నదమ్ములు, ఊరువల్లెలు.

౧౭. తెలుగుశబ్దములనొదిని సాంస్కృతిక పరుషములకు గ, స, డ, ద, వ, లు రావు—అతడు చక్రి, వాడు కంసుడు. మొ.

౧౮. ద్రుతప్రకృతికములనొదిని, క, చ, చ, ట, త, ప, లకు గ్రమముగా గ, జ, జ, డ, ద, బ, లు నిత్యముగానగును. అప్పుడాద్రుతమునకు బిందువుగాని సంశ్లేషము* గాని స్వత్వము† గాని వచ్చును. — చూచెన్+కమలము=చూచెంగమలము, చూచెంగమలము, చూచెన్గమలము, చూచెనుగమలము; వచ్చెన్+చక్రి=వచ్చెంజక్రి, వచ్చెంజక్రి, వచ్చెన్జక్రి, వచ్చెనుజక్రి; ఏగెఱ+చాన=ఏగెంజాన, ఏగెంజాన, ఏగెన్జాన, ఏగెనుజాన; పూనెఱ+టక్కు=పూనెండక్కు, పూనెండక్కు, పూనెన్జక్కు, పూనెనుడక్కు; విచ్చెన్+తమ్ము=విచ్చెందమ్ము, విచ్చెందమ్ము, విచ్చెన్దమ్ము, విచ్చెనుదమ్ము; పూచెన్+పద్మము = పూచెంబద్మము, పూచెంబద్మము, పూచెన్బద్మము, పూచెనుబద్మము.

౧౯. ద్రుతమునకు సరళవర్ణముగాని స్థిరవర్ణముగాని పరమగునప్పుడు లోపముగాని, సంశ్లేషముగాని, స్వత్వముగాని వచ్చును.—

---

* సంశ్లేష మనగా మొది హల్లుతో గూడుకొనుట.

† ద్రుతముయొక్క మొదలిరూపమూ స్వత్వమనబడును. అది సువర్ణకము.

వచ్చెన్ + గజము=వచ్చెగజము, వచ్చెన్గజము, వచ్చెనుగజము; తెచ్చెన్ + ఖడ్గము=తెచ్చెఖడ్గము, తెచ్చెన్ఖడ్గము. తెచ్చెనుఖడ్గము.

—౨౦. సమానమందు ఉకారాంతములగు స్త్రీనపుంసకశబ్దముల కును, (మువర్ణకమున కాదేశము గావచ్చు) పు, ంపు, వర్ణకములకును, పరుషసరళములు పరము లగునప్పుడు (ద్రుతమాగమముగావచ్చును. అప్పుడు (ద్రుతప్రకృతికముల కెల్లల్లస్వత్వముదక్కఁ తక్కినరూపములు వచ్చును, — చిగురు+కయిదువు=చిగురుఁగయిదువు, చిగురుంగయిదువు, చిగురున్గయిదువు; సరసపు+గుణము=సరఫున్గుణము. ఇచట (ద్రుతము నకు లోపంబురాదు. ఈయాగమము తనవర్ణకము పరమగునప్పుడు అకారాంతవిశేషణములకును వచ్చును — తెల్ల + తనము = తెల్లఁదనము, తెల్లంతనము, తెల్లన్దనము.

—౨౧. పదు మొదలైనవి పర మగునప్పుడు మువర్ణమునకు లోపముగాని పూర్ణబిందువుగాని వికల్పము గావచ్చును — భయము + పదు=భయపదు, భయంపదు, భయముపదు. పదు, పెట్టు, పట్టు, పఱుచు, ఇవి పదు మొదలైనవి.

—౨౨. (ప్రార్థనార్థక మధ్యమపురుష మువర్ణకమునకు వాల్లు పరం బగునపుడు వైకల్పికముగా లోపముకలుగును. — చూడుము + రాముని=చూడురాముని, చూడుమురాముని. చూడకుము+నన్ను=చూడకునన్ను, చూడకుమునన్ను.

—౨౩. అను పరమగునపుడు విసర్గమునకు లోపముగలుగును.— త్వమేవగతిః+అనియె=త్వమేవగతియనియె.

—౨౪. అనుకరణంబునఁ గడహల్లునకు ద్విత్వ మగును. — పాయాత్ +అని=పాయాత్తని. అహమాదిశబ్దముల మకారమునకు ద్విత్వము వైకల్పికము. — దాసోహమ్+అనియె=దాసోహమ్మనియె, దాసోహమనియె.

-౭౫. అనుకరణమందు ఉకారాంత నామములకు వుకారం బంతాగమం బగును. — ఇయంధేనుఃఎనె=ఇయంధేనువనె.

పదపరిచ్ఛేదము సంపూర్ణము.

వాక్యపరిచ్ఛేదము.

౧. ఒకక్రియతో నన్వయించుపదసముదాయము వాక్య మనఁ బడును. (అనఁగా, కర్తృకర్మ క్రియలకూడికచే సంపూర్ణమైనయర్థము గలుగు పదసమూహము వాక్యము అని యర్థము.) — రాముఁడు రావణుని సంహరించెను. వాక్యములసుగూర్చి చెప్పినది వాక్య పరిచ్ఛేదము.

౨. సకర్మక ప్రయోగమునందు, (కర్త, కర్మము, క్రియ,) మూడును, అకర్మక ప్రయోగమునందు, (కర్త, క్రియ,) రెండును, వాక్యమునకు అవయవము లుండును.

ప్రయోగము.	కర్త.	కర్మము.	క్రియ.
సకర్మకము.	వాఁడు.	సత్యమును.	పలుకుచున్నాఁడు.
అకర్మకము.	వాఁడు.		నవ్వెను.

3. క్రియ లేనివాక్యమును ఉండును. — వచ్చినవాఁడు ఘల్లు నుఁడు. (అయిన నిట్టిచోట్లఁ గ్రియయధ్యాహారమై యుండును.)

౮. ప్రతి అవయవమునందును భాగము లనేకము లుండ వచ్చును.—

కర్త.	కర్మము.	క్రియ.
యోగ్యుఁడగు పురుషుఁడు,	పాపమూలమైన కల్లను	ఎప్పుడును పలుకఁడు.

[తఱుచుగా విశేషణములును వానితో నన్వయించు నవ్యయములును కర్తల కర్మలకును, అవ్యయాదులు క్రియలకును, అంగములై యుండును.]

౯. ఒకవాక్యమునందు విశేషణము, విశేష్యము, మొదలగు వానితోడఁ దుల్యముగ నుండు వాక్యమునకు ఉపవాక్యమని పేరు— ఎవఁడు మంచివాఁడుగా నుండునో వాఁడు గౌరవమును బడయును.

[పై వాక్యమునందు "ఎవఁడు మచివాఁడుగా నుండును" "వాఁడు గౌరవమును బడయును" అను రెండువాక్యములు గలవు. వానిలో మొదటిది మంచి యనువిశేషణముతోఁ దుల్యము కావున నుపవాక్యము; రెండవది ప్రధానవాక్యము.]

౧౦. సమాపకక్రియతో నన్వయించు పదసముదాయము సంపూర్ణవాక్య మనియు, అసమాపకక్రియతో నన్వయించు పదసముదాయము అసంపూర్ణవాక్యమనియు, చెప్పఁబడును.

౧౧. సామాన్యవాక్యములు, సంశ్లిష్టవాక్యములు, ద్వంద్వవాక్యములు, అని వాక్యములు మూఁడువిధములు.

౧౨. ఒక్కక్రియనుమాత్రము గలిగియుండు సంపూర్ణవాక్యము సామాన్యవాక్య మనఁబడును.—సూర్యుఁడుదయించెను.

౧౩. అసంపూర్ణవాక్యముతోఁగాని, ఉపవాక్యముతోఁగాని, కూడియుండు సంపూర్ణవాక్యము సంశ్లిష్టవాక్య మనఁబడును. సూర్యుఁ

డుదయించి పద్మములు వికసించెను; ప్రపంచము నెవఁడు సృజి యించెనో మూఢుఁ డెఱుఁగఁడు.

౧౦. పదుచ్చయాదికముచేఁ గలుపఁబడిన రెండుమూడు సంపూర్ణ వాక్యములుగల వాక్యము ద్వంద్వవాక్య మనఁబడును — వాఁడు సత్యమునే పలికెనుగాని జను లాతనిమాటలను విశ్వసించిన వారు కారు. దీనినేమహావాక్య మందురు.

౧౧. వాక్యమునందలి పదములకుఁ గల పరస్పరసంబంధము అన్వయ మనఁబడును. సమానాధికరణాన్వయము, వ్యధికరణాన్వ యము, అని యన్వయము ద్వివిధము.

౧౨. పదములకు లింగ, వచన, విభక్తి, పురుషములయం దైకమత్యము గల యన్వయము సమానాధికరణాన్వయము; అట్టి యైకమత్యము లేనిది వ్యధికరణాన్వయము.

సూత్రములు.

విశేష్యము.

౧. "యొక్క" తప్ప విభక్తులన్నియుఁ గ్రియలతో నన్వ యించును. — రాముఁడు సీతతోఁ గొలువుండెను.

౨. సంబోధన ప్రథమతక్క ప్రతిప్రథమయు నొకక్రియను జెందియుండును. — రాముఁడువచ్చెను. [ఇచట "రాముఁడు" అనునది "వచ్చెను" అను క్రియను జెందును.] ఈప్రథమయే కర్త యనఁబడును. ఒకానొకప్పుడు క్రియాపదములోపించియు నుండవచ్చును — వాఁడు యోగ్యుఁడు (గానున్నాడు)

౩. ప్రతిక్రియయొక్క కర్మమును ద్వితీయావిభక్తియుం దుండ వలయును. — రాముఁడు రావణునిఁ జంపెను. [ఇచట "చంపెను"

అనుక్రియకుఁ గర్మము కావున "రావణుని" అనునది ద్వితీయావిభక్తిగా నున్నది.]

౮. అచేతన వాచకము కర్మమైనప్పు డది వైకల్పికముగాఁ బ్రథమ యగును. రాముఁడు రథమెక్కెను; రాముఁడు రథము నెక్కెను.

౯. కర్మార్థక ప్రయోగమునఁ గర్తకు చేత వర్ణకము వచ్చును.—రామునిచేత రావణుఁడు చంపఁబడియెను. కరణార్థ మందును, హేత్వర్థ మందును, చేత, చేవర్ణకములును, సహార్థక మందును, తుల్యార్థకమందును, తోడతోవర్ణకములును వచ్చును.—గొడ్డలిచేతఁ జెట్టునఁగకెను (కరణార్థము); విద్యచేఁ గీర్తికలుగును. (హేత్వర్థకము); రాజునేనలతోడవచ్చె (సహాయార్థకము); పిరికివాఁడు స్త్రీతోసమానుఁడు (తుల్యార్థకము).

౬. సంప్రదానమున కొఱకు వర్ణకము వచ్చును—జనకుఁడు రామునికొఱకు సీతనిచ్చెను. ఇచట షష్ఠియు నగు.—జనకుఁడు రామునికి సీతనిచ్చెఁ.

౭. అపాదానార్థమున వలన వర్ణకమును, నిర్ధారణార్థకమున కంటె వర్ణకమును, వచ్చును.—చెట్టువలన ఫలము పడెను; అపకీర్తి కంటె చావుమంచిది.

౮. సంబంధార్థకమున యొక్క వర్ణకంబును, నిర్ధారణార్థ కమున లోపల, లో, వర్ణకములును వచ్చును.—విప్రునియొక్క గృహము; బొలుఁతలో సోమరి చెడిపోవును.

౯. అధికరణార్థమున అందు, న, వర్ణకములు వచ్చును.—బీజలయందు దయయుండవలయును, పాత్రమున నీరున్నది.

విశేషణము.

౧౦. విశేషణములు విశేష్యములతోడను, సర్వనామముల తోడను, అన్వయించును.—మంచిరాముఁడు.

౧౧. విశేషణములు వానివిశేష్యములతోడ సమానములగు లింగ విభక్తి వచనములఁ గలిగియుండ వలయును.—రాముఁడు యోగ్యుడు; సీత యోగ్యురాలు; పాటుపడుట యోగ్యము; వారు యోగ్యులు; యోగ్యుల బాలుర మెచ్చుకొందును.

౧౨. షష్ట్యంత విశేషణములకు వికల్పముగాఁ బ్రథమ వచ్చును.—గుణాభిరాముఁడు రామునకు వందనము చేసెద; గుణాభి రామునకు రామునకు వందనమునేసెద.

౧౩. స్త్రీసమములగుగాని, మున్నాంతములగుగాని విశేషణ ముల బహువచనమునకు వైకల్పికముగా నేకవచనం బగును—పెక్కులు మాటలేల? పెక్కుమాటలేల? వానిచర్యలు చిత్రముగా నున్నవి; వానిచర్యలు చిత్రములుగా నున్నవి.

౧౪. అగుధాతువువలనఁ బుట్టిన విశేషణములచే వ్యవధానము చేయఁబడినట్టి కాని, సముచ్చయములచేఁ గలుపఁ బడినట్టికాని విశే షణములకుఁ బ్రథమ వచ్చును.—శూరుఁ డగు రామునిచే రావ ణుఁడు చంపఁబడెను; యోగ్యుఁడును ధీరుఁడునగు రామునికొఱకు జన కుఁడు కన్యనిచ్చెను.

౧౫. ఏకవచనమునందుండు రెండుమూడు విశేష్యముల విశే షణమునకు బహువచనంబగును.—పూజ్యులగు రాముఁడును గృష్ణుఁ డును విచ్చేసిరి.

౧౬. ఒకానొకచోఁ బులింగ విశేషణములు కొన్ని నపుంసక సములై యుండును. అందమైన మనుష్యుఁడు, సుందరమైనపురుషుఁడు.

సర్వనామము.

౧౭. సర్వనామములు తాముచెందు విశేష్యములతోడఁగాని, సంబంధించు నితరసర్వనామములతోడఁగాని సమానములగు లింగ వచనములను గలిగి యుండవలయును.—ఆబాలుఁడు మంచివాఁడు; వాఁడు కల్లలాడఁడు. సీత మిగులసుకుమారి; అయిన నామె వనవాసము చేసెను. మునులు కోపముగలవారు; కారణము లేక వారితరులను శపింతురు. ఎవఁడుధీరుఁడో వానినిబహుమానించెద. ఎవరుయోగ్యులో వారికి మేలుకలుగును. ఎవతె కష్టపడునో యామెసౌఖ్యమనుభవించును.

౧౪. వాక్యమునకు సహితము మాత్రముగా సర్వనామము పడఁబడును.—సత్రాజిత్తు కూఁతు శతధన్వున కీయకపోయెను. దానంజేసి వాఁడు సత్రాజిత్తునంతంబు నొందించె.

క్రియ.

౧౯. ప్రతిక్రియయుఁ గర్తతో నన్వయించును.—వాఁడు నడిచెను. సకర్మక్రియలు కర్మలతోడఁ గూడ నన్వయించును.—వాఁడు గుఱ్ఱము నెక్కెను.

౨౦. కొన్నిక్రియలకుఁ గర్మములు రెండుండును. అట్టివానికి ద్వికర్మకములని పేరు.—వీనొక్కటి వేఱెదను; వారు రివుల నాపద బెట్టిరి.

౨౧. జనులు కర్తలగునప్పుడు కర్త వైకల్పికముగా లోపించును.—వానకురియు నని చెప్పుదురు.

౨౨. ప్రతిక్రియయుఁ దనకర్తతోడ సమానమైన లింగ పురుష వచనములను గలిగియుండవలయును.—నేను కొట్టుచున్నాను; మేము కొట్టుచున్నాము; నీవు కొట్టుచున్నావు; మీరు కొట్టితిరి; వారు కొట్టిరి; వాఁడు కొట్టఁడు; ఆమె కొట్టదు.

౨౩. సముచ్చయములచే నొకటిగాఁ జేర్పఁబడిన కర్తలక్రియ బహువచనమునందుండవలయును.—రాముఁడును హరియు వచ్చిరి.

౨౪. ఏని, ఒండె. కాని మొదలగు వికల్పార్థములతోడఁ గూడిన కర్తలక్రియ కేకవచనంబగును.—తండ్రియేని కొడుకేని వచ్చును. మధ్యమోత్తమపురుషములతోఁ గూడినచో బహువచనమే వచ్చును.—రాముఁడొండె నీవొండె మడియుదురు; నేనుగాని వాలి గాని జయింతుము.

౨౫. అనేక మహాదమహత్తులు కర్తలగునపుడు క్రియ కడ కర్తకుందగియుండును.—గుఱ్ఱమును కొతును వచ్చిరి. కొతును గుఱ్ఱ మును వచ్చెను.

౨౬. తానుశబ్దముతోఁ గూడినపుడు కర్తలు పెక్కులయ్యును క్రియ యేకవచనమునందే యుండును.—రాముఁడు తానును లక్ష్మ ణుఁడును సీతయు రథమెక్కిరి.

౨౭. ప్రథమమధ్యమపురుషములు కర్తలగునపుడు మధ్యమ పురుషముతోడను, మధ్యమోత్తమపురుషములు కాని ప్రథమమధ్య మోత్తమపురుషములు మూడును గాని కర్తలగునపు డుత్తమపురు షముతోడను, క్రియసంబంధించియుండవలయును — వాఁడును నీవును వచ్చితిరి; నీవును నేనును వచ్చితిమి; వాఁడును నేనును వచ్చితిమి; వాఁడును నీవును నేనును వచ్చితిమి.

౨౮. వాక్యము కర్తయగునపుడు క్రియ యేకవచనమునం దుండును.—ఈవృత్త మెట్లుద్భవించెనో తెలియదు.

౨౯. పూజార్థమునఁ గర్తలకట్ల క్రియలకును ఏకవచనము బహువచనమగును.—నుదీయగురు లిప్పుడ చనుదెంతురు. (మదీయ గురు విప్పుడ చనుదెంచునని యర్థము)

30. వాక్యములలోని రెండువ్యతిరేకక్రియ లొకభావ క్రియతోడ సమానము లగును. — వాఁడుకొట్టకపోలేదు (=వాఁడుకొట్టెను)

3౧. అనేకక్రియ లేకకర్తృకో నన్వయించునపుడు కడక్రియ తప్ప మిగిలినవి క్త్వార్థకములుగానుండును. — రాముఁడు కపిసేనలను గూడి, వారిధిదాఁటి, లంకఁజొచ్చి, రావణుని సంహరించెను.

32. ఏక కాలమందలి వ్యాపారములను దెలుపుక్రియలనేకములు భిన్నములైనకర్తలతో నన్వయించినఁ గడదానికిఁ దక్కు మిగిలిన వానికి తుమున్నర్థక రూపము వచ్చును. — చిలుకలుకూయఁ, దుమ్మెదలుమ్రోయఁ, గోయిలలు రొదసేయ, మరుఁడు వెడలెను.

అవ్యయము.

33. అవ్యయములు క్రియలతోడను, విశేషణములతోడను, ఇతరావ్యయములతోడను, అన్వయించును: — వాఁడుమిక్కిలినడుచును; వాఁడు మిక్కిలి మంచివాఁడు; వాఁడు మిక్కిలి చక్కగాఁ జదువును.

34. సముచ్చయములచేత నొకటిగాఁ జేర్పఁబడిన విశేష్యములును సర్వనామములును ఒక్కవిభక్తి కలవిగా నుండవలయును:— హరియును రాముఁడును వచ్చిరి; శివునియొక్కయుఁ గేశవుని యొక్కయు గుణములను శేషుఁడును వర్ణింపఁజాలఁడు.

35. కొన్నిపదములఁ దక్కు వాక్యమునం దన్నిపదములను మనస్సువచ్చినచోటం బ్రయోగింపవచ్చును. — ఉపాధ్యాయుఁడు బాలురను గణనముగాఁ గొట్టెను; బాలుర నుపాధ్యాయుఁడు కణనముగాఁ గొట్టెను. కణనముగా బాలుర నుపాధ్యాయుఁడుగొట్టెను; కణనముగా నుపాధ్యాయుఁడు బాలురనుగొట్టెను, మొదలగునవి.

వాక్యపరిచ్ఛేదము సంపూర్ణము.

శబ్దాతిదేశము.

ఒకవాక్యమునందలి పదముల సంబంధనిరూపణము చేయు విధము శబ్దాతిదేశ మనఁబడును.

(వాక్యము.)

"ఒకమంచిబాలుఁడు బడికిఁ జని పాఠములను మిక్కిలి క్రమముగాఁ జదివెను; కాఁబట్టి వానికి బహుమతి దొరకెను."

ఒక – సంఖ్యార్థకవిశేషణము, బాలుఁడనువిశేష్యముతో నన్వయించును.

మంచి–గుణవిశేషణము, బాలుఁడు అను విశేష్యముతో నన్వయించును.

బాలుఁడు–విశేష్యము, మహాదర్థకము, ఏకవచనము, ప్రథమావిభక్తి, చదివె ననుక్రియకుఁ గర్త.

బడికిఁ–విశేష్యము, అమహాదర్థకము, ఏకవచనము, షష్ఠీవిభక్తి, చని యనుక్రియతో వ్యధికరణాన్వయముఁ జెందును.

చని – క్రియ, చనుధాతువు, అకర్మకము, అసమాపకము, క్త్వార్థకమైనయవ్యయము, బాలుఁడనుకర్తతో నన్వయించును.

పాఠములను – విశేష్యము, అమహాదర్థకము, బహువచనము, ద్వితీయావిభక్తి, చదివె ననుక్రియకుఁ గర్మము.

మిక్కిలి – అవ్యయము, క్రమముగాన్ అను మఱియొక యవ్యయముతో నన్వయించును.

క్రమముగాన్ – అవ్యయము, చదివెను అనుక్రియతో నన్వయించును.

చదివెను – క్రియ, చదువుధాతువు, సకర్మకము, కర్త్రర్థక ప్రయోగము, సమాపకము, స్వార్థకము, భూతకాలము, ప్రథమపురుషము, పుంలింగము, ఏకవచనము, బాలుఁడనుకర్తతోడను పాఠముల ననుకర్మముతోడను నన్వయించును.

వానికిన్ – పురుషబోధకసర్వనామము, ప్రథమపురుషము, మహాదర్థకము, ఏకవచనము, షష్ఠీవిభక్తి, బొలుఁడను విశేష్యమునకు మాఱుగా నుపయోగింపఁబడినది.

బహుమతి – విశేష్యము, అమహాదర్థకము, ఏకవచనము, ప్రథమా విభక్తి, దొరకె ననుక్రియకుఁ గర్త.

దొరకెను – క్రియ, దొరకుధాతువు, అకర్మకము, సమూపకము, స్వార్థకము, భూతకాలము, ప్రథమపురుషము, నపుంసకలింగము, ఏకవచనము, బహుమతి యనుకర్తతో నన్వయించును.

కావ్యపరిచ్ఛేదము.

ఁ. దోషరహితములును, అలంకార సహితములును, అగు వాక్యసమూహము కావ్య మనఁబడును. కావ్యములను గూర్చి చెప్పునది కావ్యపరిచ్ఛేదము.

అ. కావ్యదోషములు మూఁడువిధములు. ఁ. పదదోషములు, అపశబ్దము, నిరర్థకము, అప్రజనము, శ్రుతికటువు, ఛందోభంగము, మొదలగునవి. ఆ—వాక్యదోషములు—ప్రక్రమభంగము, అధికపదికము, పునరుక్తి, వినంధి, హీనోపమము, మొదలగునవి. ఇ.—అర్థదోషములు, —వ్యర్థము, సంశయము, విరుద్ధము, నేయార్థము, క్లిష్టగూఢార్థము, మొదలగునవి.

ఇ. అలంకారములు రెండువిధములు.—శబ్దాలంకారములు, అర్థాలంకారములు.

శబ్దాలంకారములు.

ఁ. అనుప్రాసము.—మున్నుగొన్న వర్ణమునే పలుమాఱు నుడివిన, అనుప్రాస మగును. — అక్కఱటిపక్కి నిక్కంబ మనదిక్కునకు వచ్చునే నొక్కముక్కు పోటునం జక్కడంచెద.

౨. యమకము —పలుమాఱొక్కవిధమయిన మాటల నర్థ భేదముగల వానిని బ్రయోగించిన, యమకమగును.— మనస్సైన మన సైనికనికాయంబులోఁ గాయంబు గాయంబు కానివాఁడు లేఁడయ్యె.

అర్థాలంకారములు.

౧. ఉపమ —ఉపమానోపమేయములకుఁ జక్కని పోలిక గలిగినచో నుపమాలంకారము. ఉపమానము (అధిక గుణము కల చంద్రాదికము), ఉపమేయము (పోల్పఁ బడఁదగిన ముఖాదికము), సాధారణధర్మము (ఉపమానోపమేయములకు సామాన్యమైన కాంత్యాదికము), ఉపమావాచకము (పోలికను సూచించు, 'వలె' మొద లగునవి), ఈనాలిగింటికి గ్రహణముగలిగినఁ బూర్ణోపమ.— ఎక్కడ జూచిన నవ్వనస్సుమన్వితంబును సుమనోవిరాజిత బును నయి కవ్వారపు దీవి స్వర్గంబుంబోలెఁ జూడ్కికి వేడ్కగొలుపుచున్నది.

౨. ఉత్ప్రేక్ష— ఉపమేయమునకుఁ గలిగిన యుపమాన ధర్మముంబట్టి, ఉపమేయము నుపమానముగా సంభావించుట యుత్ప్రేక్ష. ఇంచు, వస్తువుకానిది వస్తువుగాను, హేతువుకానిది హేతువుగాను, ఫలముకానిది ఫలముగాను, తలఁపఁబడును.—అవ్వా డప్పతంగకుల దారుణరణమరణంబుఁ దానును బతంగుండె కానఁ జూడనోపక యాచోటువాసి చనియెనో యనఁ బ్రభాకరుండు ప్రభయెడలి పడమటి కడలికడకు నడచి మఱుంగువడియె.

౩. రూపకము.—ఉపమేయముయొక్క ధర్మము ఉపమాన మునం దారోపింపఁబడి హృదయరంజక మగునది రూపకము:—పుణ్య వళంబున నిప్పటి కాళశాదనాప మృత్యుదేవతవాతఁ బడక బ్రతికితిమి.

౪. స్వభావోక్తి.— నహృదయహృదయంగమముగా నున్నది యున్నట్టుగాఁ జెప్పుట స్వభావోక్తి:—యాతాయాతగజవ్రాతపద

తలఘాతంబులం జదిసి సమసిన శశకవిసరంబుల నాలోకించి, శశకేం
ద్రునిమంత్రి బెగ్గలం బగ్గలింప రోఁజుచుం బొమలు తెంచి నిజాధీశ్వరునిం
గాంచి వినయవినమితోత్తమాంగుండై నమస్కరించి తమవారికిం
బాటిల్లినముప్పు చెప్పఁబోయి డగ్గుత్తికవడి కొంతవడి నోరురాక
యూరకుండి యెట్టకేలకు నెలుంగు తెచ్చుకొని యిట్లనియె.

౫. అతిశయోక్తి.—ఉన్నదానికంటె నెక్కువగాఁ జెప్పుట
యతిశయోక్తి.మరాళకులాధ్యక్షుండు నిజవళక్ష పక్ష విక్షేపణ
జాతవాతివేగసముద్భూత పాంసుజాతంబు భూనభోంతరాళంబుందిరో
హించి యుంతరిక్షం బలక్ష్మీకంబుగాఁ జేయఁ జనుదెంచె.

౬. అర్థాంతరన్యాసము.—ఒకవిషయమును జెప్పి, దానిని
సమర్థించుటకు విశేషముగాఁగాని సామాన్యముగాఁగాని వేఱొకవిష
యమునుజెప్పుట యర్థాంతరన్యాసము.—ఇనుమునుగూడిన వేఁడి
వేల్పునకు సమ్మెట పెట్టఁబెట్టును; హీనునిఁగూడిన మానసీయునకు
లాఘవంబు గలుగునుగదా.

౭. శ్లేషము.—అనేకార్థములుగల పదములఁగూర్చి చెప్పుట
శ్లేషము:—ఆపరమ హంసావతంసుండాశల జయించి నైజతేజంబెల్ల
కడల వెలుంగ నొక్కనాఁడు నిజాప్తద్విజనికరపరివేష్టితుండై రాజ
యోగంబు మెఱయఁ బుండరీకాసనంబున సుఖాసీనుండై నిండు
కొలువుండె.

౮. పద్యకావ్యము, గద్యకావ్యము, అని కావ్యము ద్వివిధము.

పద్యకావ్యము.

౯. ప్రతి పద్యమునకు నాలుగుపాదము లుండును. అనేకగణ
ములుచేరి పాదమగును. గురులఘువుల చేతనే గణము లేర్పడును.

౧౦. గురువులు:—దీర్ఘాక్షరములును, పూర్ణబిందువు, విసు

V. R. N. MEMORIAL LIBRARY
V. R. I.
Acc. No. 10474

ర్గము, పొల్లుహల్లు, వీనిని గూడిన వర్ణములును, సంయుక్తాక్షరమునకు ముందూఁదిఁబలుకు వర్ణములును, గురువులు. గ, ఇది గురువునకుసంజ్ఞ.

3. లఘువులు:—తక్కినవి లఘువులు. ల, ఇది లఘువునకు సంజ్ఞ.

ᴗ, ఇట్లు బాలచంద్రునివిధమున వ్రాసిన గురువనియు, ।, ఇట్లు నిదుప్రగేతి లాగున వ్రాసిన లఘువనియు గ్రహింపవలెను.

ᴗ । । ᴗ ᴗ । । ᴗ । ᴗ । । ᴗ ᴗ ।

[రా ము ఁడు సిం హా స న మె క్కి న్యా య ము గన్ భూ మి

ᴗ ᴗ । । । । ᴗ । । । ᴗ ᴗ । ।

పా లిం చి ప్ర జ ల దుఃఖ ము లఁ బో గొ ట్టె ను.]

౪. నిసర్గగణములు, ఉపగణములు, అని గణములు రెండు విధములు.

౫. నిసర్గగణములు—ఇవి మూఁడేసి యక్షరములవలనఁ గలుగును. అందు, మూఁడుగురువులు మగణము, ఆదిగురువు భగణము, మధ్యగురువు జగణము, అంత్యగురువు సగణము, మూఁడులఘువులు నగణము, అది లఘువు యగణము, మధ్యలఘువు రగణము, అంత్యలఘువు తగణము:—

ᴗᴗᴗ	। । ।
శ్రీ రా మా, మగణము.	మె లఁ గు, నగణము.
ᴗ । ।	। ᴗ ᴗ
నీ క డ, భగణము	మహాత్మ్యల్, యగణము
। ᴗ ।	ᴗ । ᴗ
దు ర ం బు, జగణము,	సౌఖ్యమున్, రగణము.
। । ᴗ	ᴗᴗ ।
గ దు ర న్, సగణము.	గైకొంద్రు, తగణము.

౬. ఉపగణములు:—సూర్యగణములు, ఇంద్రగణములు, ఉప గణములలో ముఖ్యములు. సూర్యగణములు రెండు; ఇంద్రగణము లాఱు:—

౧. సూర్యగణములు.

। । ।	
సు ఖ ము, నగణము.	
⏑ ।	
పొందు. గలము.	

ఇందు గలమును హగణ మనియు వాడుదురు. ఈలాగుననే లగము నకు వగణమని పేరు.

౨. ఇంద్రగణములు.

। । । ।	
న ర స ఖు, నలము.	
। । । ⏑	
గు ణ ము లఁ, నగము.	
। । ⏑ ।	
ప లు మా ఱు, నలము.	
⏑ । ।	
మా ను లు, భగణము.	
⏑ । ⏑	
ప్రే మ తో, రగణము.	
⏑ ⏑ ।	
వ ర్ణి ం త్రు. తగణము.	

౭. యతిప్రాసములు:– పద్యపాదము మొదటివర్ణముయతి; రెండవవర్ణముప్రాసము. యతి ప్రతిపాదమునకు వేఱువేఱుగా నుండును. ప్రాసము పాదములకెల్ల నొకటిగా నుండును ఆయాపాదములందుండు మొదటివర్ణముతో మైత్రిగల వర్ణ ముండుచోటు యతిస్థాన మనఁబడును.

౮. యతి:– యతికి స్వరము ప్రధానము. అచ్చులలో, అ ఆ ఐ, ఔ లును; ఇ, ఈ, ఋు, ౠ, ఎ, ఏ లును; ఉ, ఊ, ఒ, ఓలును,

తమలోఁ దాము మిత్రములు. హల్లులలో, క, ఖ, గ, ఘ, లును; చ, ఛ, జ, ఝ, ఞ, ఝ, శ, ష, స, లును; ట, ఠ, డ, లును; త, థ, ద, ధ, లును; ప, ఫ, బ, భ, వ, లును; య, హ, లును; తమలో దాము మిత్రములు. ఈవ్యంజనములును స్వరమైత్రిఁ జెందియే యొండొంటికింబనికివచ్చును.

౯. ప్రాసము:— ప్రాసమునకు వ్యంజనమైత్రి ముఖ్యము. కాఁబట్టి యేయచ్చుతోఁ గూడినను బనికివచ్చును. ఒకపాదమున సంయుక్తాక్షరమున్న నన్ని పాదముల నాసంయుక్తాక్షరమే యుండనలయును. ప్రాసాక్షరములకు ముందువర్ణములు సర్వత్ర గురువులుగానైనను, లఘువులుగానైనను, ఉండవలయును.

౧౦. పద్యములు:— వృత్తములు, జాతులు, ఉపజాతులు, అని పద్యములు మూడువిధములు.

౧. వృత్తములు.

౧. ఉత్పలమాల:— భ, ర, న, భ, భ, ర, వ, గణములును, పదియవయక్షరము యతియును గలనాలుగుపాదములు గలది ఉత్పలమాల:—

"కొండని వేడ్కతోఁ బసిఁడి ♦ కొండ ధనార్థులకెల్లఁ బంచి యీ
కుండుట దానధాగకుఁ బ ♦ డెనిధులెల్ల న్యాయపలేమి యీ
రెండపకీర్తులం దల ధ ♦ రించినవాఁడు ప్రధానశీలుఁ డా
తం డిరువాగుగా ముసికిఁ ♦ దార్చిన వెండ్రుక లన్మిషంబునన్."

౨. చంపకమాల:— న, జ, భ, జ, జ, జ, ర, గణములును. పదునొకండవ యక్షరము యతియును గల నాలుగుపాదములఁ గలది చంపకమాల:—

"చెలువమునెల్లఁ బ్రోవుగను ♦ జేసి ప్రవీణత నంబుజంబుల్క
నలువ సృజింప నేలవి క ♦ నద్యుతిహీనము లౌటఁ గ్రమ్మఁ గం
గలువలఁ జేనిఁ జేసినఁ బ ♦ గ లుచిహీనుఁ డతండు నౌటఁగా
కలికిముగంబు రేవగలు ♦ కాంతి దనర్పఁగఁ జేసెనిమ్మహిన్."

3. మత్తేభవిక్రీడితము:—స, భ, ర, న, మ, య, వ, గణములును, పదునాలవయక్షరము యతియును గల నాల్గుపాదములఁ గలది మత్తేభవిక్రీడితము:—

"సతియూరుద్యుతిఁ జెందఁ బూని నిజదు ♦ శ్చర్మాపనోదక్రియా
రతిఁ బాధోలపపూరితో దరముఁ లై ♦ రంభేభహస్తంబు లు
న్నతఱిన్ వీడె మరుద్విభూతిఁగదళిం ♦ ద్వగ్ధోష మాచంచలో
ద్ధతశుండాతతిఁ బాయదయ్యె నదెహో ♦ తద్వైరమూలం బిలన్."

4. శార్దూలవిక్రీడితము:—మ, న, జ, స, త, త, గ, గణములును, పదమూడవ యక్షరము యతియును గలది శార్దూలము:—

"పున్నాగంబుల గెల్చు బాలగమనం ♦ బు న్నాభికావర్తముం
బున్నాగంబుల గెల్చు నీలరుచులం ♦ బొల్పారు రోమాళియుం
బున్నాగంబుల గెల్చు నవ్వికసితాం ♦ భోజాక్షి ప్రాపైనచో
పున్నాగంబుల గెల్చుటేమియరుదా ♦ పుష్పాస్త్రీడూహింపఁగన్."

5. మత్తకోకిల:—ర, న, జ, జ, భ, ర, గణములును, పదునొకండవ యక్షరము యతియును గలది మత్తకోకిల:—

"పుత్రి యట్లగునమ్మ శోకము ♦ బొంది కుందుచునున్న నీ
గాత్ర మొండొకకీడు పాటిలఁ ♦ గందుఁ బాండుతనూభవుల్
పుత్రపర్గము చన్నచో నెద ♦ భూరిశోకముఁ బొందఁ జే
పౌత్రహీనతఁ బడ్డ కుంతికి ♦ బాయ నేర్చునె నెవ్వగల్."

౬. మాలిని:—న, న, మ, య, య, గణములును తొమ్మిదవ యక్షరము యతియును గలది మాలిని:—

"కథితశుభచరిత్రా ♦ శ్రావకన్యాకళత్రా
మథితవిమతగోత్రా ♦ మానిసంస్తోత్రపాత్రా
ప్రథనదితిజజైత్రా ♦ భక్తచిత్తాబ్జమిత్రా
పృథులధవళగాత్రా ♦ భీకరోగ్రాగ్ని నేత్రా."

౨. జాతులు

౧. కందము:—కందమునకుఁ బ్రథమతృతీయ పాదముల మూడేసిగణములును, ద్వితీయచతుర్థపాదముల నయిదేసిగణములును, ఉండును. గగము, నలము, భ, జ, స, గణములువచ్చును. వీనిలో బేసిని జగణముగాదు. ద్వితీయ చతుర్థపాదముల మూడవ గణము సల జగణములలో నొకటిగాను, నాలుగవగణము మొదటియక్షరము యతిగాను, కడపటియక్షరము గురువుగాను, ఉండవలయును:—

"అకలుషనీలిమ నా క
న్యకచమునకు నోడి పాఱి ♦ నవియై తేటుల్
మకరందార్థము తఱుచుగ
వికచము లగుపుష్పములకె ♦ వెదకుచు నేగున్."

౨. ఉత్సాహ:—వీడునూర్యగణములు, ఒకగురువు, ఐదవ గణము మొదటి యక్షరము యతియు, కలది యుత్సాహ:—

"తనయుఁగాచుపనికిఁ బూని ♦ ధర్మపుత్రవాయునం
దనులుఁ గవలుఁ జేయఁగలుగు ♦ దండిమగలు సేనలం
గొని వడిం గడంగ సరకు ♦ గొనక నిలిచి యొక్కఁడుం
బెనఁగి యూఁగె సైంధవుండు ♦ బిరుదు దక్కుఁడుం గదే."

3. ఉపజాతులు.

౧. తేటగీతము.—సూర్యగణ మొకటి, ఇంద్రగణములు రెండు, సూర్యగణములు రెండు, నాలుగవగణము మొదటియక్షరము యతియు, కలది తేటగీతము.—

"నీవు చదివింతు వసుచు న ♦ న్ని యును విడిచి
బిచ్చ మె త్తంగరాదుగా ♦ బేలతపసి
గడప నాడకు చాలు నీ ♦ గొడవ యేల
వెజ్జుతన మేల యని మది ♦ లజ్జ యొడమి."

౨. ఆటవెలఁది.—మొదటిపాదమునకు మూడవపాదమునకు మూడు సూర్యగణములు రెండింద్రగణములును, రెండవపాదమునకు నాలవపాదమునకు అయిదుసూర్యగణములును, ప్రతిపాదమున నాలవ గణము మొదటియక్షరము యతియును, కలది యాటవెలఁది యను గీతము.

"అందుఁ బ్రమథముఖ్యు ♦ లందఱు గ్రందుగాఁ
దఱిసి తమయనుంగు ♦ తెఱువపిండుఁ
గూర్చుకొని మనోజ ♦ కోలాహలస్ఫూర్తి
యులర నోలి నోల ♦ లాడుచుండ."

3. సీసము.—సీసమునకుఁ బ్రతిపాదమున రెండుభాగము లుండును. అందు మొదటిభాగమున నాలుగు ఇంద్రగణములును, రెండవభాగమున రెం డింద్రగణములు రెండు సూర్యగణములును, ప్రతిభాగపు మూడవగణము మొదటియక్షరము యతియును, అయి యుండవలయును. నాలుగుపాదములతుద నొకగీతముఁ జేర్పవలయును.

"వాతెఱ తొంటిక్రై ♦ వడి మాటలాడదు,
కుటిలవృత్తివహించుఁ ♦ గుంతలంబు

లక్ష్ములు సిరులురా ♦ సరచూడిక్కఁ గనుఁగొనె,
నాడించె బొమగొని ♦ యాననంబు
చనుగొమల్నెగయ వ ♦ క్షము పేక్షఁ గడకొత్తెఁ,
బాణిపాదము లెట్టి ♦ వాఁ దొడఁగె
సారెకు మధ్యంబు ♦ దారిద్రములె చెప్పె,
రొచ్చోర్వకిటు లోఁగఁ ♦ జొచ్చె మేను

వట్టి గాంభీర్య మొక్కఁడు ♦ పెట్టుకొనియె
నాభి నానాఁటి కీగతి ♦ నాఁటిపొందు
చవుక యయినట్టి యిచ్చటఁ ♦ జనదు నిలువ
ననుచు జాతినకరణి బా ♦ ల్యంబు జాఱె"

(వీనికిఁ బ్రాసమక్కఱలేదు. యతికిమాఱుగాఁ బ్రాస ముండవచ్చును.)

గద్యకావ్యములు.

౧. పద్యకావ్యముకానిది గద్యకావ్యము. దీనినే వచనకావ్య మందురు:—

ఆశ్రయించినను ఫలచ్ఛాయాసమన్వితం బగు మహోపకృతమునే యాశ్రయింపవలెను. ఒకవేళ దైవికంబుగ ఫలంబులు లభింపక పోయినను, ననివార్యం బగు దానినీడ నేఁడు మాపనోవును; సింహా ప్రసాదంబున నజంబును వనంబున నిర్భయంబుగఁ జరియించుటఁ గానమే? అట్లు ప్రబలులంజేరిన లాఘవాస్పదులకును గౌరవంబబ్బును; ద్వేష్యులును సర్వజగన్మాన్య లగుదురు. ఇఁక నార్యులు ప్రశంసనీయు లగుదురని యుగ్గడింప నేల? ఎప్పుడును హీనుని మాత్రము చేరరాదు. చేరినన్ మును గలగౌరవము సయితము పోవును. శౌండిని కరంబున నున్న పాలముంతనేని కల్లుముంతయే యందురు.

విరతులు.

౧. చక్కగా నర్థ మగుటకు భాషించునపుడు కాని పఠించునపుడుగాని వాక్యాదుల యంతమందు యుక్తకాలము వఱకును నూరకుంట విరతి యనఁబడును, సులభముగా ననువ్వయించు కొనుకొఱకు గ్రంథమును వాక్యములఁగాను వాక్యాంశములఁగాను విభజించుటకయి యట్టి వివిధవిరతులను దెలుపు సంజ్ఞలు (గుఱుతులు) వాడఁబడును.

సంజ్ఞలు.

, వాక్యాంశబిందువు. అన్వయమునందు సమీపసంబంధమును గలిగియు నించుక విరతి నపేక్షించు వాక్యాంశములతుద నీగుఱుతు వాడఁబడును.—సూర్యుఁడు, చంద్రుఁడు, నక్షత్రములు, ఆకాశము నలంకరించును. ఇది యేకమాత్రకాలపు విరతిని దెలుపును.

; అర్థబిందువు. మహావాక్యములోని ముఖ్యవాక్యములయంతమం దీగుఱుతు వచ్చును.—సీటియందు బెండ్లు తేలును; గాని గుండ్లు తేలవు. ఇది ద్విమాత్రకాలపువిరతిని దెలుపును.

: న్యూనబిందువు దూరసంబంధముగల రెండు ప్రత్యేక వాక్యములనడుమ నీగుఱుతు వచ్చును.—లోకములో నాకఁటొఁ బ్రొజ్జఁడు లేఁడనుకోకు: ఒకరినిమించినవా రొక రుండనే యుందురు. ఇది మూడుమాత్రలకాలపువిరతిని దెలుపును.

. బిందువు. భిన్నవాక్యముల యంతమునం దీగుఱుతు వచ్చును.—పాపమునకు భయపడుము. మనుష్యుల కోపమునకు భయపడకుము. ఇది నాలుగుమాత్రలకాలపువిరతిని దెలుపును.

౨. ఈవిరతులను దెలుపుగుఱుతులుగాక, అర్థానురాగము

లైన ధ్వన్యాదులను సూచించుగుఱుతులును, మఱికొన్ని పెఱగుఱుతులును, కలవు.

? ప్రశ్నార్థకచిహ్నము. ప్రశ్నార్థకవాక్యములతుద నీగుఱుతు వచ్చును —ఎవ రక్కడ? సంస్కృతముం జదివినితివా?

! రాగచిహ్నము. ఆశ్చర్యము, సంతాపము, మొదలగు వానిని దెలుపుపదములయు వాక్యములయు తుద నీగుఱుతు వచ్చును.- ఆ! ఇవి యేటిమాటలు! అయ్యో! ఎంత మంచివాఁడు పోయెను!

“ ” అనువాదచిహ్నము. గ్రంథాంతరమునుండి గ్రహింపఁబడినవాక్యాదుల కిరుప్రక్కల నీగుఱుతు లుండును.—“దుర్బలస్య బలం రాజా” అన వినమే.

( ) వృత్తార్థము, [ ] వలయితము. అనుఖ్యము లగునట్టి కాని పర్యాయము లగునట్టికాని పదములయొక్కయు వాక్యముల యొక్కయు రెండుప్రక్కల నీగుఱుతులు వేయఁబడును.—దాశరథికి (రామునకు) నమస్కారము. నిష్కారణముగ నీచుఁడు [పాపమునకు వెఱవఁడు కాఁబట్టి] సత్పురుషుల కెగ్గుచేయును.

∧ హంసపాదము. ఈగుఱుతు లుప్తవర్ణాదులు మీఁద వ్రాయబడి యున్నవని తెలుపును.

* తారకము. } † శూలము. } ఈగుఱుతులు రెండును గ్రంథమునందలి విషయములనుగూర్చి యడుగున వ్రాయఁబడిన కారికలు మొదలగువానిని జూడుమని చదువువానికిం దెలుపుట కుపయోగింపఁబడును.

కావ్యపరిచ్ఛేదము సంపూర్ణము.

87

A GLOSSARY Of GRAMMATICAL TERMS.

భాష=Language.
వ్యాకరణము=Grammar.
వర్ణపరిచ్ఛేదము=Orthography.
పదపరిచ్ఛేదము=Etymology.
వాక్యపరిచ్ఛేదము=Syntax.
కావ్యపరిచ్ఛేదము=Prosody.
వర్ణములు=Letters.
వర్ణసమామ్నాయము=Alphabet.
అచ్చులు=Vowels.
హ్రస్వాచ్చులు= Short Vowels.
దీర్ఘాచ్చులు= Long Vowels.
హల్లులు=Consonants.
పరుషములు=Hard Consonants.
సరళములు=Soft Consonants.
స్థిరములు= Fixed Consonants.
కంఠ్యములు=Gutturals.
తాలవ్యములు=Palatals.
మూర్ధన్యములు=Cerebrals.
దంత్యములు=Dentals.
ఓష్ఠ్యములు=Labials.
అనునాసికములు=Nasals.
అంతస్థములు=Semi-Vowels.
ఊష్మములు=Sibilants.
లఘువులు=Light Semi-Vowels.
అలఘువులు=Harsh Semi-Vowels.
పదము=Word.
వ్యస్తపదము=Simple word.
సమాసపదము=Compound word.
విశేష్యము=Noun.
సంజ్ఞావాచకము=Proper Noun.
జాతివాచకము=Real Noun.
గుణవాచకము=Abstract Noun.
క్రియావాచకము=Verbal Noun.
లింగము=Gender.
పుంలింగము=Masculine Gender.
స్త్రీలింగము=Feminine Gender.
నపుంసకలింగము=Neuter Gender.
వచనము=Number.
ఏకవచనము=Singular Number.
బహువచనము=Plural Number.
విభక్తి =Case.
ప్రథమావిభక్తి=Nominative Case.
ద్వితీయావిభక్తి=Objective Case.
తృతీయావిభక్తి=Implimentive Case.
చతుర్థీవిభక్తి=Dative Case.
పంచమీవిభక్తి=Ablative Case.
షష్ఠీవిభక్తి=possessive Case.
సప్తమీవిభక్తి=Locative Case.
సంబోధనప్రథమ=Vocative Case.
విశేషము=Adjective.
గుణవిశేషణములు=Adjectives of Quality. [Adjectives.
సంఖ్యావాచకములు=Numeral
సంఖ్యార్థకము=Cardinal.
పూరణార్థకము=Ordinal.
క్రియావాచకము=Participle Adjective.
సర్వనామము=Pronoun.

పురుషబోధకములు=Personal Pronouns.
సంబంధార్థకములు=Relative Pronouns.
ప్రశ్నవాచకములు=Interrogative Pronouns.
విశేషణసర్వనామములు=Adjective Pronouns.
నిర్దిష్టసర్వనామములు=Demonstrative Adjective Pronouns
అనిర్దిష్టసర్వనామములు=Indefinite, Adjective Pronouns.
సంఖ్యావాచకసర్వనామములు=Numeral Adjective Pronouns.
క్రియ=Verb.
సకర్మకము=Transitive.
అకర్మకము=Intransitive.
సమాపకక్రియ=Finite Verb.
అసమాపకక్రియ=Infinite Verb.
కర్త=Agent or Subject.
కర్మము=Object.
కర్తృార్థకము=Active Voice.
కర్మార్థకము=Passive Voice.
ప్రేరణార్థకము=Causal Voice.
స్వార్థకము=Indicative Mood.
ప్రార్థనార్థకము=Imperative Mood.
ఆశీరర్థకము=Precative Mood.
కాలము=Tense.
వర్తమానము=Present Tense.
భూతము=Past Tense.
భవిష్యత్తు=Future Tense.
తద్ధర్మము=Aorist.
పురుషము=Person.
ప్రథమపురుషము=Third Person.
మధ్యమపురుషము=Second person.
ఉత్తమపురుషము=First Person.
భావము=Affirmative.
వ్యతిరేకము=Negative.
స్వతంత్రక్రియ=Principal Verb.
ఉపక్రియ=Auxiliary Verb.
న్యూనక్రియ=Defective Verb.
సాధారణక్రియ=Regular Verb.
నిపాతనక్రియ=Irregular Verb.
అవ్యయములు=Indeclinable words.
సముచ్చయములు=Conjunctions.
సంధి=Combination Of letters,
ఆగమము=Additional.
ఆదేశము=Substitutional.
నిత్యము=Fixed.
వికల్పము=Optional.
స్వత్వము=State Of Nature.
లోపము=Elision.
సంశ్లేషము=Coalition.
ఆమ్రేడితము=Repetition Of word.
ప్రత్యయము=Particle.
సమానాధికరణాన్వయము=Concord.
వ్యధికరణాన్వయము=Government.
వాక్యము=Sentence.
సామాన్యవాక్యము=Simple Sentence.
సంశ్లిష్టవాక్యము=Complex Sentence.
మహావాక్యము=Compound Sentence.
ప్రధానవాక్యము=Principal Sentence.
ఉపవాక్యము=Subordinate Sentence.

సూత్రము=Rule.
హంసపాదము=Caret.
పద్యము=Stanza.
ప్రాసము=Rhyme.
అలంకారములు=Figures of speech.
ఉపమాలంకారము=Simile.
ఉత్ప్రేక్ష=Metaphor.
రూపకము=Allegory.
అతిశయోక్తి=Hyperbole.
పద్యకావ్యము=Poetry.
వచనకావ్యము=Prose.
సిద్ధము=Indigenous.
సాధ్యము=Applied.
అతిదేశము=Parsing.
అధ్యాహార్యము=Understood word.

విరతులు=Pauses.
వాక్యాంశ బిందువు=Comma.
అర్ధబిందువు=Semicolon.
న్యూనబిందువు=Colon.
బిందువు=Period.
ప్రశ్నార్థకచిహ్నము=Interrogative Point.
కాకచిహ్నము=Exclamation Point.
అనువాదచిహ్నము=Sign Of Quotation.
వృత్తార్థము=Parenthesis.
వలయితము=Brackets.
తారకము=Star.
కూలము=Obelisk.

కావ్య సంగ్రహము

కావ్య సంగ్రహము

౧. దోషరహితములును, గుణసహితములును, భావాదియుక్తములును, అలంకారసంయుతములును, అగు వాక్యార్థసముదాయము కావ్య మనఁబడును. ఈకావ్యలక్ష్మికి శబ్దార్థములు శరీర మనియు, అలంకారములు సొమ్ములనియు, మాధుర్యాదులు గుణములనియు, వృత్తులు వ్యాపారములనియు, పూర్వకవులు వర్ణించియున్నారు. ఉత్తమకావ్యములు, మధ్యమకావ్యములు, అధమకావ్యములు, అని కావ్యములు మూడువిధములు. ధ్వని ప్రధానమయినది యుత్తమ కావ్యము; ధ్వని అప్రధానమయినది మధ్యమకావ్యము. దీనిని గుణీకృత వ్యంగ్య మనియుఁ జెప్పుదురు; ధ్వని యస్ఫుటమైనది అధమకావ్యము. దీనిని చిత్ర మనియుఁ జెప్పుదురు.

౨. మహాకావ్యములనియు, ఉపకావ్యములనియు, కావ్యములు మరల రెండువిధములు. పట్టణము, నది, పర్వతము, ఋతువులు, సూర్యుఁడు, చంద్రుఁడు, సరస్సు, వనము, మధువు, సంభోగము, విరహము, వివాహము, పుత్రజన్మము, నీతి, యాత్ర, యుద్ధము, జూదము, రాజు, అను అష్టాదశవర్ణనలుగలది మహాకావ్యము. వీనిలోఁ గొన్నివర్ణనలు లేనిది ఉపకావ్యము.

౩. ఇతిహాసములు, పురాణములు, ప్రబంధములు మొదలయినవి కావ్యములలోఁ భేదములు. పారంపర్యముగా వచ్చు పూర్వచరిత్రములమూలమున జనులకు నీతిని తెలివిని బోధించు గ్రంథము లితిహాసములు; వేదములకు వ్యాఖ్యానప్రాయము లయి సర్గము, ప్రతిసర్గము, వంశము, మన్వంతరములు, వంశానుచరితము, అను

పంచలక్షణములు గల వ్యాసప్రోక్తము లైన కథలు పురాణములు; కొంచెము సత్యముతో గూడిన కల్పనాకథలు ప్రబంధములు.

శబ్దార్థములు.

౧. శబ్దములు వాచకములు, లక్షకములు, వ్యంజకములు, అని మూడువిధములు. వానియర్థములు వరుసగా, వాచ్యము, లక్ష్యము, వ్యంగ్యము, అనఁబడును. శబ్దవృత్తు లనఁగా శబ్దార్థ సంబంధములు క్రమముగా, అభిధ, లక్షణ, వ్యంజన, అనఁబడును.

(౧) అభిధ — సంకేతికము లయిన పదార్థముల సంబంధ మభిధ యనఁబడును. ఇది యోగమనియు, రూఢి యనియు, రెండు విధములు. అవయవార్థ సంబంధముగలది యోగము. — జలజము. అవయవార్థ సంబంధము లేనిది రూఢి:—కులము.

(౨) లక్షణ—వాచ్యార్థము పొసఁగనియెడల దానిసంబంధము గల యర్థమును దెచ్చుకొనుట లక్షణ యనఁబడును. ఇది జహల్లక్షణ యనియు, అజహల్లక్షణ యనియు ద్వివిధము. వాచ్యార్థమునువిడుచు నది జహల్లక్షణ.—జగములు నంతసిల్లె. వాచ్యార్థమును విడువనిది యజహల్లక్షణ:— కోదండవంక్తులు ముందు నడిచెను.

(3) వ్యంజన—పదము లన్వయించి ధ్వనిచే విలక్షణ మైన యర్థాంతరము కలుగుచుండుట వ్యంజన. ఇది శబ్దశక్తిమూలవ్యంజన యనియు, అర్థశక్తిమూలవ్యంజన యనియు ద్వివిధము. కేవల శబ్ద శక్తిచేత నర్థాంతరము కలిగినయెడల శబ్దశక్తిమూలవ్యంజన.— నీచేతి కత్తిని దారసించిన శత్రువుల కనిమిషభావంబు చేకూఱును. అర్థశక్తిచేతనే యర్థాంతరము కలిగినయెడల నర్థశక్తిమూలవ్యంజన.— నీదానగుణమును జూచి మేఘము వెలవెలఁబోఱును.

దోషములు.

౧. పదదోషములు, వాక్యదోషములు, అర్థదోషములు, అని దోషములు మూడువిధములు.

౨. పదదోషములు.—అపుష్టార్థము, నిరర్థకము, గ్రామ్యము, క్లిష్టము, పరుషము, మొదలైనవి.

(౧) ప్రకృతోపయోగము లేనిపదము అపుష్టార్థము.—రాముఁడు వింశత్యర్థ కంఠుని జంపెను.

(౨) పాదపూరణము నిమిత్తమే వేసినపదము నిరర్థకము—రాముఁ డొగిఁజంపె రావణు రహి చెలంగ.

(3) పామరులు మాటాడునది గ్రామ్యము.— ఆడు వస్తాఁడు.

(౪) దూరార్థము క్లిష్టము.—పద్మారి జనకపుత్రీ రమణకుమార తాపము.

(౫) శ్రుతికటువైనది పరుషము. — కుధ్రేజ్జాధవమూర్ధృతా ర్ధోడ్వధివతిని గొల్తు.

3. వాక్యదోషములు—అక్రమము, పునరుక్తి, వ్యాకీర్ణము, ఛందోభంగము, భిన్నలింగము, మొదలైనవి.

(౧) పదములవరుస తప్పియుండుట యక్రమము.— నీకీర్తిని ప్రతాపమును దినకరుఁడును హిమకరుఁడును పోలుదురు.

(౨) పదమునుగాని యర్థమునుగాని మరలఁ జెప్పుట పునరుక్తి.— వెన్నుఁడు విష్ణుఁడు వచ్చె నరుదెంచె.

(3) భ్రాంతికరమైన యన్యాయముకలుగుట వ్యాకీర్ణము. — ఓకాంతా! పెట్టు తిలకమును గొప్పున ముడువు వూవులను.

(౪) గణాదులుతప్పిన ఛందోభంగము.— క॥ కుందరదన కను బొమలు । విండ్లవలె మనోహరంబు లయ్యెను జూడన్.

(౫) స్త్రీని పురుషునితో, గాని పురుషుని స్త్రీతో, గాని పోల్చుట భిన్నలింగము.— ఆసుందరి చంద్రునివలె నున్నది.

౪. అర్థదోషములు.—హీనోపమ, అధికోపమ, పరుషము, నిరలంకృతి, విగుద్ధము, మొదలైనవి.

(౧) ఘనుని హీనునితో, బోల్చిన హీనోపమ. — ఇతఁడు కుక్కవలె మంచివిశ్వాసము కలవాఁడు.

(౨) అల్పుని నధికునితో, బోల్చిన నధికోపమ. — ఆపేను శివునివలెనే పుట్టెను బట్టెను.

(౩) అర్థము చెవి కసహ్యముగానుండినయెడల పరుషము — నీరూపమునకు మంటలోఁబడ్డమన్మథుఁడు సమానుఁడు.

(౪) ఉన్నసంగతితప్ప మఱియొకయందము లేనిచో నిరలం కృతి.— ఆరాజు బావయుగళయుతుఁడు.

(౫) దేశకాలాదివిరోధముగా నుండుట విరుద్ధము.—తుమ్మెద సంపెంగపువ్వులోని తేనె యూనుచున్నది.

గుణములు.

౧. శ్లేషము, ప్రసాదము, మాధుర్యము, సౌకుమార్యము, సమత, అర్థవ్యక్తి, ఔదార్యము, కాంతి, ఓజము, సమాధి, అను పదియు గుణములు.

(౧) సంధి గలిసినపదము లొకపదము రీతిగా మనోహరముగా నుండుట శ్లేషము. — ఆలావణ్యం బగణ్య మావీర్యం బనిర్వాచ్యము.

(౨) ప్రసిద్ధపదములతో నింపుగాఁ జెప్పుట ప్రసాదము. — ఆరాజు యాచకజనులకు మ్రుంగొంగుబంగారము.

(3) సరసము లగు వాక్యములు వేరువేరుగా వరుసగా నున్నచో మాధుర్యము.—అర్జునుఁడు యంత్రమత్స్యమును వేయఁగా ద్వాదశ రాసులును వెనుకకుఁ బాఱి, గడ్డికఱచి, వేషమునుమార్చి, కలుగుదూరి, అడవులచేరి, సిగ్గుపడి, భారమువహించి, విషముగ్రహించి, వంగి, నదులీఁది, నీటమునిఁగి, నిలువుగ్రుడ్లుపడి, తిరిగెను.

(ర) పూర్ణబిందుపూర్వకము లైన యక్షరములతో నింపుగా నుండుట సౌకుమార్యము. — చెందొవనిందుక్రిందుగ విషబిందువులు చింద సుందరి డెందమునఁ గుందు చెందెను.

(ఱ) అర్ధరీతిచేత నాలుగుపాదములు నొక్కరీతిగా నుండుట సమత.—

సీ. శరవేగములు లేవె చలయంత్రపాఠీన
పాటనక్రియకు నేర్పడవుగాక
చాతుర్యములు లేవె శారదాభాండార
చోరకారశ్రీకిఁ జోరవుగాక
వితరణంబులు లేవె వివిధయాచకనృపా
లకకంఠదఘ్నము ల్గావుగాక
సామర్థ్యములు లేవె సరిదన్యపథయాన
శాసనప్రౌఢికిఁ జనవుగాక.

(ఌ) అర్థము చిక్కులేక స్పష్టముగానుండుట యర్థవ్యక్తి.—నీకీర్తి లోకములోని యేనుఁగులనన్నిటిని నింద్రునియేనుఁగుతో సమానము లగునట్లుగా చేసినది.

(ౡ) కొన్ని సంయుక్తాక్షరములతోఁ గూడుకొనుచువచ్చినచో నౌదార్యము.—అతని కీర్తికాంత బ్రహ్మాండనాట్యరంగమున వర్తించి నిత్యనర్తనము చేయును.

(౮) కొన్నివర్ణముల సముదాయ మింపుగా మరల మరల వచ్చుట కాంతి—వలజేని నిండుకల్వలజేని నాతఁడు సోయగంబున మించును.

(౯) ఇంపైనసమానములతో నిండియుండుట యోజము. — ఆరాజమార్తాండుని శుభ్రయశము హీరహార నీహార డిండీరమందార కర్పూరమనోహరం బయి యున్నది.

(౧౦) ఒకదానిగుణమును వేఱొకదానికి రమ్యముగాఁ గూర్చుట సమాధి.—ఓరాజా! దానకన్య బలిచక్రవర్తిచేత నడుగు లిడనేర్చి, కర్ణునిచేఁ గంచుకము ధరింపనేర్చి, కామధేనువు చన్నుఁబాల బెరిగి, నీకరగ్రహణము చేసినది.

భావములు.

౧. స్థాయిభావములు, విభావములు, అనుభావములు, సాత్వికభావములు, సంచారిభావములు, అని భావములు అయిదువిధములు కలవి.

(౧) స్థాయిభావములు:— శృంగారాదినవరసములకును కారణములయి నడుమ సంచారిభావము లెన్నివచ్చినను తామున్మాత్రము విడువకుండునవి తొమ్మిదియు స్థాయిభావము లనఁబడును. అందు రతి శృంగారరసమునకును, హాసము హాస్యరసమునకును, శోకము కరుణారసమునకును, ఉత్సాహము వీరరసమునకును, భయము భయానకరసమునకును, జుగుప్స బీభత్సరసమునకును, రోషము రౌద్రరసమునకును, విస్మయము మద్భుతరసమునకును, శమము శాంతిరసమునకును, కారణములు. పురుషులకును స్త్రీలకును సంభోగవిషయ మయిన

యభీలాష రతి; క్రూరములుకాని యాకారవికారచేష్టలు చూచి నప్పుడు పుట్టుమనోవికాసము హాసము; ప్రియజనవిరహముచే మన స్సులోఁబుట్టుదుఃఖము శోకము; లోకోత్తరకార్యములను జేయఁగోరి చేసెడు ప్రయత్నముత్సాహము; క్రూరాకారాదులను జూచినప్పుడు మనస్సులోఁ బుట్టుభీతి భయము; నెత్తురు, మాఁసము మొదలయిన వానిని జూచుటవలనఁ గలిగెడి యసహ్యత జుగుప్స; క్రూరులు దుష్ట కార్యములను జేసినప్పుడు పుట్టెడుక్రోధము రోషము; అపూర్వవస్తువు లను జూచినప్పుడు మనస్సులోఁ బుట్టు ప్రమోదము విస్మయము; వైరాగ్యాదులచేత మనస్సు నిశ్చలత వహించుట శమము.

(౨) విభావములు:— స్థాయిభావములకుఁ గారణములయినవి విభావము లనఁబడును. ఆలంబనవిభావము, ఉద్దీపనవిభావము, అని విభావము ద్వివిధము. స్థాయిభావమునకు సమవాయికారణ మయిన దనఁగా పుట్టుట కాశ్రయ మయిన దాలంబనవిభావము. రతికి నాయికా నాయకు లాలంబనవిభావము; ఉత్సాహమున కాలంబనము వీరుఁడు; శోకమున కిష్టవస్తువును బోఁగొట్టుకొన్న వాఁడు. &c. స్థాయిభావమున కుద్దీపనకారణ ముద్దీపనవిభావము. అది యాలంబన విభావముయొక్క గుణము, చేష్ట, అలంకారము, తటస్థము, అని చతుర్విధములు గలది. శృంగారమున కాలంబనగుణము రూపయౌవనాదులు; ఆలంబనచేష్ట హావభావాదులు; ఆలంబనాలంకారము హారనూపురాదులు; తటస్థ ములు మలయమారుతకోకిలాలాపాదులు.

(3) అనుభావము:—స్థాయిభావముచేఁ గలిగి దానిని దెలియఁ బఱుచునది యనుభావ మనఁబడును. రతికి కటాక్షభ్రూవిక్షేపాదు లనుభావములు. ఇవి నాయికకు నాయకవిషయమున రతిచేతఁ గలిగి నాయికామనోగత మగునట్టి యారతిని దెలియఁబఱుచుచున్నవి.

(౪) సాత్వికభావములు:— పరుల సుఖదుఃఖాదులను విచారింపఁగా సత్వగుణముచేతఁ గలిగెడుమనోభావములు సాత్వికభావములు. స్తంభము, ప్రళయము, అశ్రువు, స్వేదము, వైస్వర్యము, రోమాంచము, కంపము, వైవర్ణ్యము, అనునెనిమిదియు సాత్వికభావములు. రాగభయాదులచే దేహము చలింపకుండుట స్తంభము; సుఖదుఃఖాదులచేఁ బరవశత్వము పొందుట ప్రళయము; హర్షరోషాదులచేఁ గన్నుల నీరు వచ్చుట యశ్రువు; రతిశ్రమాదులచేఁ బుట్టు చెమట స్వేదము; ఈర్ష్యారోషాదులచే గద్గదస్వరము కలుగుట వైస్వర్యము; సుఖాధిక్యాదులచే శరీరము గగురుపొడుచుట రోమాంచము; రోషభయాదులచేఁ బుట్టు నడఁకు కంపము; రోషవిషాదాదులచే మొగము వెలవెలపోవుట వైవర్ణ్యము.

(౫) సంచారిభావములు:— స్థాయిభావమునకు నలుప్రక్కలను సంచరించి దానిని వృద్ధి పొందించుచు రసోత్పత్తికి సహాయము లైన నిర్వేదాదులు సంచారిభావములు. నిర్వేదము, శ్రమము, దైన్యము, జాడ్యము, గ్లాని, త్రాసము, శంక, ఆర్తి, రోషము, గర్వము, ఆవేగము, ధృతి, స్మృతి, చాపలము, ఉగ్రత, అవహిత్థ, త్రివ, విషాదము, మదము, ఔత్సుక్యము, మతి, నిద్ర, మోహము, బోధము, మృతి, ముదము, ఆలస్యము, వితర్కము, సుప్తి, అమాయ, చింత, ఉన్మాదము, అపస్మృతి, అను ముప్పదిమూడును సంచారిభావములు. వీనికి వ్యభిచారిభావములనియు పేరు గలదు. ఈర్ష్య, తత్వజ్ఞానము మొదలయినవానిచేఁ గలుగు హేయత్వబుద్ధి నిర్వేదము; సురతము, మార్గగమనము మొదలయినవానిచేఁ గలుగుఖేదము శ్రమము; విరహము దారిద్ర్యము మొదలగువానిచేఁ గలుగుదురవస్థ దైన్యము; ఇష్టానిష్టదర్శనాదులవలన కర్తవ్యమును తెలిసికొనలేకుండుట జాడ్యము

(జడత); సురతాయాసాదులచేఁ గలిగెడుబలహీనత గ్లాని ; మనస్తాపాదులచేఁ గలుగు హృదయసంక్షోభము త్రాసము ; దుర్ణయాదులచేత కీడు మూడు నేమో యనువిచారము శంక; హృదయతాపము వలనఁ గలిగిన శరీరపీడ ఆర్తి (వ్యాధి); అవమానతాధిక్షేపాదులవలనఁ గలుగు రోషము అమర్షము; ఐశ్వర్యము బలము కులీనత మొదలైనవాని వలన తనయందుఁ గలుగు సరోత్కృష్టబుద్ధి గర్వము; ఇష్టానిష్ట ప్రాప్తిచేఁ గలుగు తొట్రుపాటు ఆవేగము; జ్ఞానశక్త్యాదుల వలనఁ గలుగు నిస్పృహత్వము ధృతి; పూర్వ మనుభూతమైన విషయము జ్ఞప్తికి వచ్చుట స్మృతి; రాగద్వేషాదుల వలన పనులు తొందు మాటుగాఁ జేయుట చాపలము; అపరాధము రోషము దౌర్జన్యము లోనగువానిచేఁ గలుగునిర్దయత్వ ముగ్రత; గౌరవము కౌటిల్యము మొదలయిన వానిచే హర్షాద్యాకార గోపనము చేయుట యవహిత్థ; స్తుతిరత్యాదులచే గలుగు మనస్సంకోచము వ్రీప (వ్రీడ); అపరాధము, ధనహాని మొదలయిన వానిచేత నేమియు తోఁచక మనస్సులో పుట్టెడు వ్యసనము విషాదము; సురాపానము మొదలయినవానిచేతఁ గలిగిన హర్షమోహాముల యతిశయము మదము; ప్రియస్మరణాదులచేత కాలవిలంబము సహింపలేకుండుట ఔత్సుక్యము; శాస్త్ర చింతనాదులచేతఁ గలిగెడి యర్థనిర్ణయజ్ఞానము మతి; చింత బడలిక మొదలయిన వానిచేత మనోవ్యాపారముడుగుట నిద్ర; భయ దుఃఖాదులచేఁ గలుగు మూర్ఛ మోహాము; నిద్ర లేకపోవుట వలనఁ గలిగెడి యింద్రియ ప్రకాశము బోధము; మరణ ప్రయత్నము మృతి; ఉత్సాహాదులచేఁ గలుగుమనఃప్రసాదముముదము (హర్షము); గర్వాదుల వలనఁ గలుగు మంద ప్రయత్నము ఆలస్యము; సాధక బాధక విచారము వితర్కము; నిద్రాతిశయము సుప్తి; దౌర్జన్యాదుల

చేత పరోత్కర్షము సహింపలేమి అసూయ; ఇష్టవస్తువు లభింపక పోవుట మొదలయినవానిచేఁ గలుగు వగపు చింత; ప్రియవియోగము, ధననాశనము మొదలయిన వానిచేత చేతనాచేతనముల యందు నమానముగా ప్రవర్తించుట యున్మాదము; మోహ దుఃఖాదులచేఁ గలిగెడి యావేశము అపస్మృతి (అపస్మారము).

వృత్తులు.

౧. కైశికి, ఆరభటి, భారతి, సాత్వతి, అని యర్థసంబంధములగు కావ్యవృత్తులు నాలుగు.

(౧) కైశికి—మృదువయి తేలికైన యర్థరచన కైశికి. దీనిని శృంగార కరుణారసములయం దుపయోగించవలెను.

(౨) ఆరభటి—కఠినమై తీక్ష్ణమయిన యర్థరచన యారభటి. దీనిని రౌద్ర బీభత్సరసములయం దుపయోగించవలెను.

(3) భారతి—ఈషత్పౌష్కల మయిన యర్థరచన భారతి. దీనిని హాస్యశాంతాద్భుత రసములయం దుపయోగించవలెను.

(౪) సాత్వతి—ఈష త్కోమల మైన యర్థరచన సాత్వతి. దీనిని వీర భయానక రసములయం దుపయోగించవలెను.

రీతులు.

౧. మాధుర్యాదిగుణములతో గూడిన పదములకూర్పు రీతి యనఁబడును. వైదర్భి, గౌడి, పాంచాలి, అని రీతులు మూడు.

(౧) వైదర్భి—బంధపారుష్యమును, పదకాఠిన్యమును, దీర్ఘ సమాసములను, లేనిది వైదర్భి.

(౭) గౌడి—బంధపారుష్యమును, దీర్ఘసమాసములును, గలది గౌడి.

(3) పాంచాలి—కొంతవఱకు వయిరెండురీతుల నుండునది పాంచాలి.

పాకములు.

౧. అర్థగాంభీర్యము పాక మనఁబడును. ద్రాక్షాపాకము, నారికేళపాకము, అని పాకములు రెండువిధములు.

(౧) ద్రాక్షాపాకము—పయిని లోపలను స్పష్టముగా తెలియు చున్నరసము గలది ద్రాక్షాపాకము.

(౨) నారికేళపాకము—స్పష్టముగా బోధపడని గూఢమైన రసము లోపలఁ గలది నారికేళపాకము.

శయ్య.

౧ పదము లొకదానితో నొకటి మనోహరముగా చేరుట శయ్య యనఁబడును.—రతిపతివో చెలువున భారతిపతివో మతి.

అలంకారములు.

౧. కావ్యమునకు శోభను దెచ్చెడిధర్మము లలంకారములు. అవి శబ్దాలంకారములు, అర్థాలంకారము లు, అని రెండువిధములు.

శబ్దాలంకారములు.

౧. శబ్దరూపము లయిన అనుప్రాసము, యమకము, ముక్త పదగ్రస్తము, మొదలయినవి శబ్దాలంకారములు.

౨. వృత్త్యనుప్రాసము, ఛేకానుప్రాసము, లాటానుప్రాసము, అని యనుప్రాసములు మూడువిధములు.

(౧) వృత్త్యనుప్రాసము—సంఖ్యానియమము లేక యొకటి రెండు మూడక్షరములు మరల మరలఁ జెప్పఁబడినచో వృత్త్యనుప్రాస మగును.—విపక్షశిక్షణవిచక్షణుఁడగు నాథరాధ్యక్షుఁడు దక్షుఁడయి విపక్షులను శిక్షించెను.

(౨) ఛేకానుప్రాసము—ఎడ తెగక రెండేసి యక్షరములు మరల మరల వచ్చినచో ఛేకానుప్రాస మగును—త్రిపురసంహారు హారు మనమనసులలోఁ దలంతము.

(3) లాటానుప్రాసము—ఒక్కయర్థము గలపదములను తాత్పర్యభేదము కలుగునట్లు మరల మరలఁ జెప్పినచో లాటానుప్రాస మగును.—పరోపకారము చేసెడి వానిహస్తములు హస్తములు, అట్టి వానిజన్మము జన్మము.

3. వచ్చినపదములనే యర్థభేదము కలుగునట్లుగా మరలఁ బ్రయోగించినచో యమక మగును. — ఆస్థానికనికాయంబులోఁ గాయంబు గాయంబుకానివాఁడు లేఁడు.

౪. వెనుకవిడిచినపదమునే యవ్యవధానముగా మరల మరల గ్రహించుచు వచ్చినచో ముక్తపదగ్రస్త మగును. — ఆమెముఖము చంద్రునియందము చూపు; చూపుతూపులను మించును; మించును శరీరకాంతి తిరస్కరించును.

అర్థాలంకారములు.

౧. ఉపమ—ఉపమానమునకును, ఉపమేయమునకును, మనోహర మయిన సాదృశ్యము గలిగియున్నపట్టున, ఉపమాలం

కార మగును. ఇది పూర్ణోపమయునియు, లుప్తోపము యునియు, రెండు విధములు. ఉపమానము, ఉపమేయము, సాధారణధర్మము, ఉపమా వాచకము, ఈనాలుగును ప్రయోగింపఁబడినచో పూర్ణోపమ.— ఆమె ముఖము చంద్రునివలె నందముగ నున్నది. ఈనాలుగింటిలోఁ గొన్ని లోపించినయెడల లుప్తోపమ.—ఆమెముఖము చంద్రునివలె నున్నది. పోల్చుట కయి గ్రహించెడి గుణాధిక్యముగల చంద్రాదిక ముపమానము, వర్ణనీయ మయిన ముఖాదిక ముపమేయము, ఉపమా నోపమేయములకు సామాన్య మయిన అందము మొదలయినది సాధారణధర్మము, పోలిక నుతెలుపు చంద్రునివలె మొదలగునది యుపమా వాచకము.

౨. అనన్వయము—ఒకవస్తువునే యుపమానము గాను, ఉపమేయముగాను కూడఁ జెప్పుట యనన్వయము.—ఆమెముఖమున కామెముఖమే సమానము.

3. ఉపమేయోపమ—ఉపమానము నుపమేయముగాను, ఉపమేయము నుపమానముగాను మార్చివర్ణించుట యుపమేయో పమ.—ఆమెముఖమునకుఁ జంద్రుఁడు సాటి; చంద్రున కామెముఖము సాటి.

౪. ప్రతీపము — ప్రసిద్ధోపమానమున కుపమేయత్వము కల్పించుట ప్రతీపము—ఆమెముఖముతోఁ జంద్రుఁడు సమానుఁడు.

౫. రూపకము—ఒకవస్తువునందు మఱియొకవస్తుత్వ మారో పించుట రూపకము.—ఆమెముఖచంద్రబింబము కళంకము లేక యొప్పు చున్నది.

౬. ఉల్లేఖము—ఒకవస్తు వాయాగుణములనుబట్టి యొక నిచే ననేకవస్తువులుగాఁ జెప్పఁబడినను, అనేకులచే ననేకవస్తువులుగాఁ

జెప్పఁబడినను ఉల్లేఖము.—నేనా రాజును దానమున కర్ణునిగాను, కీర్తిని నర్జునునిగాను, బుద్ధిని బృహస్పతినిగాను, సత్యమున హరిశ్చం ద్రునిగాను, తలఁచెదను. అతనిని స్త్రీలు మన్మథునిగాను, యాచకులు కల్పవృక్షముఁగాను, శత్రువులు యమునిగాను, భావింతురు.

౭. స్మృతిమంతము—ఉపమానోపమేయములలో నొకదానిని జూచినప్పుడు మఱియొకటి స్మరణకువచ్చుట స్మృతిమంతము.—పూర్ణి మాచంద్రబింబమును జూచినప్పుడెల్ల నా కామెముఖము స్మరణకు వచ్చుచుండును.

౮. భ్రాంతిమంతము— ఒకవస్తువునం దన్యవస్తుభ్రమ కలి గినయెడల భ్రాంతిమంతము.—తుమ్మెద యామెముఖము పద్మమని భ్రాంతి వచ్చుచున్నది.

౯. అపహ్నవము—వర్ణ్యమైన వస్తువును మఱుఁగువఱిచి దానిని మఱియొకవస్తువునుగా నిర్ణయించుట యపహ్నవము.—ఆ కనఁబడునది యామె మోముకాదు; కేవలపూర్ణిమాచంద్రబింబము.

౧౦. ఉత్ప్రేక్ష—అన్యవస్తువులతోడి గుణాదిసంబంధమును బట్టి యొకవస్తువుయొక్క ప్రసిద్ధగుణాదులకు విశేషతాత్పర్యమును కల్పించుట యుత్ప్రేక్ష.—పద్మము నీచరణైక్యమును పొందుటకో యన నీటితో తపస్సుచేయుచున్నది.

౧౧. అతిశయోక్తి—సంబంధము లేనిదే యున్నట్లుగాని, సంబంధమున్నను లేనట్లుకాని వర్ణించుట యతిశయోక్తి.—ఆపట్ట ణమునందలి మేడలు చంద్రబింబమును స్పృశించుచున్నవి; నీవు దాత వయి యుండఁగా కల్పవృక్షముల నెవ్వారు నాదరింపకున్నారు.

---

౧౨. తుల్యయోగిత—ప్రకృతములకుఁ గాని, అప్రకృతము లకుఁ గాని యేకధర్మములు చెప్పుట తుల్యయోగిత— చంద్రోదయముకాఁగానే పద్మములును జారిణులముఖపద్మములును కూడ ముడుచుకొనిపోవుచున్నవి; నీశరీరసౌకుమార్యము చూడఁగా మాలతీ పుష్పమునందును పల్లవములందునుగూడ కాఠిన్యము, తోఁచుచున్నది.

౧౩. దీపకము— ఉపమానోపమేయముల కేకధర్మమును జెప్పుట దీపకము.—శుభముచే నేనుఁగును, ప్రతాపముచే రాజును ప్రకాశింతురు.

౧౪. ప్రతివస్తూపమ—ఒక్క సామాన్యధర్మమును రెండు వాక్యములయందు భిన్నపదములచేఁ జెప్పుట ప్రతివస్తూపమ.— సూర్యుఁడు తాపముచేఁ రాజిల్లును; శూరుఁడు చాపముచే శోభిల్లును.

౧౫. దృష్టాంతము—రెండువాక్యములయందు భిన్నధర్మము లను భిన్నపదములతోఁ జెప్పుట దృష్టాంతము—ఓరాజా! లోకములో నీవేకీర్తిమంతుఁడవు. చంద్రుఁడే కాంతిమంతుఁడు.

౧౬. నిదర్శన—సమానము అయిన వాక్యార్థముల నైక్య మాగోపించుట నిదర్శన.—దాత్రకు పారుష్యము లేకపోవుట చంద్రు నకుఁ గళంకము లేకపోవుటయే.

౧౭. సందేహము—సాధారణధర్మముచే రెండువస్తువులలో నిదియో యదియో యని సంశయము దోఁచినయెడల సందేహము.— అతఁడింద్రుఁడో చంద్రుఁడో.

౧౮. వ్యతిరేకము—ఉపమానోపమేయములకు విరుద్ధధర్మ ములను జెప్పినయెడల వ్యతిరేకము.—సత్పురుషులు పర్వతములవలె మహోన్నతులు; అయినను వారు ప్రకృతికోమలులు.

౧౯. సహోక్తి—సహార్థము (తోడ) ను జనరంజకముగా నుప

యోగించినయెడల సహోక్తి. — అతనికీర్తి శత్రువులతోడఁగూడ దిగంతములకుఁ బోవుచున్నది.

౨౦. వినోక్తి—ఒకవస్తువు లేకపోవుటవలన వర్ణ్యము రమ్యమగునని కాని, నింద్య మగుననికాని, చెప్పినయెడల వినోక్తి— ఓరాజా! నీసభ దుష్టులు లేకపోవుటచేఁ బ్రకాశించుచున్నది; విద్యాహృద్యయైనను వినయము లేకపోవుటచేఁ సావద్య యగుచున్నది.

౨౧. పరికరము—సాభిప్రాయవిశేషణ మున్నయెడల పరికరము.—హిమాంశుని శిరస్సున ధరించిన శివుఁడు నాతాపమును పోఁగొట్టునుగాక!

౨౨. పరికరాంకురము—సాభిప్రాయవిశేష్య మున్నయెడల పరికరాంకురము.—దేవుఁ డైన చతుర్భుజుఁడు నాకుఁ బురుషార్థచతుష్టయము నిచ్చునుగాక!

౨౩. శ్లేషము—ఒకవాక్యమున కనేకార్థములు కలుగునట్లు చెప్పుట శ్లేషము.—పద్మాకర మూర్మికాకంకణాదులచే శోభిల్లుచున్నది.

౨౪. అప్రస్తుతప్రశంస — ప్రస్తుతవిషయమున కనుకూలించునట్లుగా అప్రస్తుతవిషయమును ప్రశంసించుట యప్రస్తుతప్రశంస — ఖంద్రునిఁదక్క మఱియొక్కనిని యాచింపని యాచాతకపక్షియే పక్షులలోనెల్ల సుకృతి.

౨౫. ప్రస్తుతాంకురము—ఒక ప్రస్తుతవిషయమే ద్యోతక మగునట్లుగా మఱియొక ప్రస్తుతవిషయమును వర్ణించుట ప్రస్తుతాంకురము. దీనినే యన్యాపదేశ మందురు.—ఓభృంగమా! చక్కని మాలతీకుసుమమును విడిచి కంటకములతోఁగూడిన మొగలిపూవు మీఁదికిఁ బోయెదవేమి!

౨౬. వ్యాజస్తుతి.— చేసెడునింద వ్యాజముచేత స్తుతియే యైనవక్తమున వ్యాజస్తుతి— ఓగంగా! నీవు మహాపాపులను స్వర్గమునకుఁ బంపుచున్నావు. నీకు వివేక మెక్కడిది?

౨౭. వ్యాజనింద.— చేసెడిస్తుతి వ్యాజముచేత నిందయైనచో వ్యాజనింద — ఓనుందరీ! నీవు మంచిదానవు. నాపెనిమిటిని బిలువఁబోయి నానిమిత్త మయి యాతని సఖ్యత దంతక్షతములకు లోనయి శ్రమనొంది వచ్చితివికదా?

౨౮. ఆక్షేపము—తన యభిమతమును స్పష్టముగాఁ జెప్పక, ఆక్షేపణపూర్వకముగా తనకిష్టము లేనివానినే విధించుచు మఱియొక విధముగా తనయభిమతమును గమ్యముగాఁ జెప్పుట యాక్షేపము.— ఓనాథా! నాకు చింతలేదు. నన్ను విడిచిపెట్టి నీమనసు వచ్చిన చోటికే పొమ్ము. నేనక్కడనే మరలపుట్టి నీపాదసేవ చేసెదను.

౨౯. విరోధాభాసము— రెండువాక్యము లన్యోన్యవిరుద్ధార్థములుగాఁ గనఁబడుచున్నను, అర్థాంతరముచేత విరోధము లేకుండఁ జెప్పుట విరోధాభాసము.— ఆరాజు నీతిమంతుఁడయ్యు ననీతిని ప్రజాపాలనము చేసెను.

౩౦. విభావన— కారణములేక కార్యము పుట్టినట్లు చెప్పినను విరుద్ధకారణము వలనఁ గార్యము పుట్టినట్లు చెప్పినను విభావన — ఓకాంతా! నీపాదములు లత్తుకపెట్టక పోయినను నెఱ్ఱి నగుచున్నవి. పతి నెడబాసిసనన్ను శీతాంశుకిరణములే పంతాపపెట్టుచున్నవి.

౩౧. విశేషోక్తి—సంపూర్ణమయిన కారణమున్నను కార్యము పుట్ట లేదని చెప్పుట విశేషోక్తి.— ఆమె హృదయములో స్మరదీపము పూర్ణముగా వెలుఁగుచున్నను స్నేహ మాపంతయు తగ్గలేదు.

౩౨. అసంగతి.— కారణ మొకచోటఁ గలుగఁగాఁ గార్యము

మతియొక చోట గలిగినదని చెప్పుట యసంగతి.—విషపానము మేఘములు చేయగా విరహిణీస్త్రీలు మూర్ఛ నొందుచున్నారు.

33. విషమము—ఒకదాని కొకటి తగనిది సంప్రాప్త మయిన దని చెప్పినను, కోరినదానికంటె విరుద్ధఫలము సంభవించినదని చెప్పినను, విషమము — ఆపుష్పకోమలి యెక్కడ? ఇటువంటి దుర్వార మదనజ్వర మెక్కడ? ఎలుక బుట్టకొఱకి యూహకమును పొందఁగోరి పాముచే భక్షింపఁబడియె.

34. చిత్రము—తాను కోరెడుఫలమునకు విపరీత మయినవని చేయుచున్నట్లు వర్ణించినచో చిత్రము.—అతఁడు మహోన్నతి పొంద గోరి నమ్రత నభ్యసించుచున్నాఁడు.

35. అన్యోన్యము— రెండువస్తువుల కన్యోన్యోపకారమును వర్ణించిన యెడల నన్యోన్యము.— కవిచే రాజును రాజుచే కవియుఁ బ్రకాశింతురు. కంకణముచే హస్తమును హస్తముచేఁ గంకణమును శోభిల్లుచున్నవి.

36. విశేషము—ఒకవస్తువునే యనేకస్థలములయం దున్నట్లు వర్ణించుట విశేషము.— నాకు లోపలను వెలుపలను ముందును వెనుకను సర్వత్ర ప్రియుఁడే తోఁచుచున్నాఁడు.

37. కారణమాల— వరుసగా నొకదానినొకటి కారణము లుగా కొన్నిసంగతులను వర్ణించుట కారణమాల — నీతిచేత ధన మును, ధనముచేత వితరణమును, వితరణముచేత కీర్తియు, కీర్తిచేత స్వర్గమును కలుగును. నరకము పాపమువలనను, పాపము దారిద్ర్యము వలనను, దారిద్ర్యము దానహీనతవలనను సంభవించును గనుక దానపరుఁడవు కమ్ము.

38. సారము— పూర్వమునకంటె నుత్తరోత్తర ముత్కృ

ష్టముగా వర్ణించినచో సారాలంకారము. — తేనె తియ్యనిది; అమృత ము దానికంటెను తియ్యనిది; కవివాక్య మమృతముకంటెను మధుర మయినది.

౩౬. యథాసంఖ్యము—క్రమసంఖ్య గలవానిని వరుసగా క్రమసంఖ్య గలవానితో నన్వయించునట్లు వర్ణించుట యథాసంఖ్యా లంకారము. దీనినే క్రమాలంకార మందురు.—పుత్రులను మిత్రు లను శత్రులను పోషింపుము భూషింపుము దూషింపుము.

౪౦. పరివృత్తి—ఒకదాని నిచ్చి మఱియొకదానిని వుచ్చు కొనుట పరివృత్తి.—రాజు తా నొక్కబాణమునువిడిచి శత్రువుల లక్ష్మీకటాక్షమును గ్రహించెను.

౪౧. పరిసంఖ్య—ఒకవస్తువు నొకచోట నిషేధించి మఱి యొకచోట విధించినచో పరిసంఖ్య.—దీపములయందు స్నేహాక్తి యము కలిగినను కలుగునుగాక స్త్రీలహృదయములయందు కలుగదు.

౪౨. వికల్పము—తుల్యబలము గల రెండువిరోధము లైన కార్యములలో నేదైననొకటి చేయవలెననుటవికల్పము.—నీవు తల నైనను ధనువు నైనను వంచుకొని నీశత్రువువద్దకు పోవలెను.

౪౩. సముచ్చయము— ఒక్కకార్యమున కొక్కకారణము చాలియుండఁగా ననేకకారణములను జెప్పుట సముచ్చయము.—ఆతని మదమునకు కులమును రూపమును వయస్సును విద్యయు ధనమును హేతువు లయినవి.

౪౪. సమాధి— ఆరంభించిన కార్యమునకు మఱియొక కార ణముచే సౌలభ్యము కలిగినయెడల సమాధి—అసలే జారస్త్రీ బయలు వెడలఁ దలఁచి యుండెను, ఇంతలో నూర్యుఁడును గ్రుంకెను.

౪౫. కావ్యార్థాపత్తి—ఒకయుత్కృష్టవస్తువే సాధింపఁబడు చున్నప్పుడు సామాన్యవస్తుభ్రను సాధించుట యెంతని చెప్పినచో కావ్యార్థాపత్తి.—నీముఖముచేత చంద్రుఁడే జయింపఁబడుచుండఁగా నీక పద్మములు జయింపఁబడు నెంత!

౪౬. కావ్యలింగము—సమర్థనీయ మయిన కార్యమును కారణ వాక్యముచే సాధించుట కావ్యలింగము. — నామనస్సులో ఫాలలో చనుఁ డున్నాఁడుగనుక నేను మన్మథుని జయించితిని.

౪౭. అర్థాంతరన్యాసము — విశేషముజెప్పి దానిని సాధిం చుట కయి సామాన్యమును తెచ్చుకొన్నను, సామాన్యమును జెప్పి దానిని సాధించుట కయి విశేషము దెచ్చుకొన్నను అర్థాంతర న్యాసము — రామకార్యమునకై హనుమంతుఁడు సముద్రమును దాఁటెను; మహాత్ములకు దుష్కర మేది? మహాత్ములఁ జేరి యల్పు లును గౌరవమొందుదురు? పుష్పమునుగూడి దారము తలకెక్కదా?

౪౮. ప్రౌఢోక్తి—క్రియాధిక్యమున కయి హేతువునందు హేతువు కల్పించిన-చో ప్రౌఢోక్తి — ఆమెశిరోజములు యమునా తీరతమాలవల్లికలవలె నీలముగా నున్నవి.

౪౯. సంభావన—ఈలాగున నయినపక్షమునఁ బ్రకృతకార్య సిద్ధి యగునని యూహించిన-చో సంభావన.—వర్ణించెడువాఁడు శేషుఁ డయ్యెనా నీగుణములను పూర్ణముగా వర్ణింపఁగలుగును.

౫౦. మిథ్యాధ్యవసితి — ఒకదానికి మిథ్యాత్వమును నూచిం చుట కయి మఱియొక మిథ్యాభూత మయినదానిని కల్పించుట మిథ్యాధ్యవసితి. — ఆకాశపుష్పమాలను ధరింపఁ గలిగిన వాఁడు వేశ్యను వశ్యనుగాఁ జేసికోఁగలుగును.

౫౧. ప్రహర్షణము—యత్నములేకుండ కోరిన కార్యము సిద్ధించినచో ప్రహర్షణము—తాను వెదుకవలెనన్నతీఁగె కాళ్ళనే చుట్టుకొనెను.

౫౨. విషాదనము—ఈప్సితార్థసిద్ధికయి ప్రయత్నించు చుండఁగా తద్విరుద్ధఫలము గలిగినచో విషాదనము—దీప మెగసనద్రో యుట కయి చేయి పెట్టఁగానే దీప మారిపోయెను.

౫౩. అవజ్ఞ—అధికాశ్రయమును పొందినను, అధికఫలము లభింపలేదని చెప్పుట యవజ్ఞ—బొక్కెన సముద్రమున ముంచఁగినను కుండెడునీటినే తెచ్చుచున్నది.

౫౪. లేశము—ఆనుకూల్యమునుబట్టి దోషమును గుణమునుగాఁ జెప్పినను, ప్రాతికూల్యమునుబట్టి గుణమును దోషమునుగాఁ జెప్పి నను, లేశాలంకారము.—ఓచిలుకా! స్వచ్ఛందవిహారముగల తక్కిన పక్షులకులేని వాఙ్మాధుర్యము కలుగఁబట్టికదా నీకు పంజర బంధనము కలిగినది?

౫౫. తద్గుణము—తనగుణమును విడిచి యన్యగుణమును పొం దుట తద్గుణము—అధరకాంతిచే నీముక్కు ముత్యము పద్మరాగ మణి యగుచున్నది.

౫౬. అతద్గుణము — అన్య వస్తుగుణమును పొందుటకుఁ దగినకారణ ముండియుఁ బొందకపోవుట యతద్గుణము — ఓరాజా! నీకీర్తిధావళ్యముచేత శివునికంఠ మయినను దెలుపగునుగాని నీశత్రుల దుష్కీర్తి తెలుపుగాదు.

౫౭. అనుగుణము—పూర్వము స్వతస్సిద్ధముగా నున్న గుణము నకు మఱియొక వస్తువుచే గుణాధిక్యమును జెప్పుట యనుగుణము.—

చెవులయందలి నీలోత్పలములు త్వత్కటాక్షలబ్ధిచేత మణింత నైల్య మును బొందుచున్నవి.

౫౮. మిశ్రితము — గుణసామాన్యముచే భేదము లేనట్లు వర్ణించుట మిశ్రితము—నీసహజారుణము లయిన చరణముల యందు లత్తుకవ్యాప్తి కనబడనే కనబడదు.

౫౯. సామాన్యము — సాదృశ్యముచేత నుపమానోపమేయ ములకు భేదము కనబడలేదని చెప్పినచో సామాన్యము—తామర కొలకులో జొచ్చిన యామెముఖమే కనబడుచుండలేదు.

౬౦. లోకోక్తి—సామెతను చక్కగా నమర్చినచో లోకో క్తి—పాముకాళ్లు పామునకే తెలియును.

౬౧. వక్రోక్తి—శ్లేష కాకుస్వరాదులచే నన్యార్థము కల్పిం చుట వక్రోక్తి — ఓయింతీ! కాకులు కూయుచున్నవి యిప్పుడు పగలగునుజుమా. ఓనాథా! కొఱనోము నోచిన నాకుఁ బగలు గాక స్నేహము లెట్లుకలుగును?

౬౨. స్వభావోక్తి — చక్కనివదములచే వస్తువుల నున్నవి యున్నట్లు వర్ణించుట స్వభావోక్తి—ఆలేడి చెవులు నిక్కించి బెదరి బెదరి చూచుచు గొరిసెలతోఁ దల గోకుకొనుచున్నది.

౬౩. భావికము—భూతకాలము నందలికాని భవిష్యత్కాల మునందలికాని కథ లిప్పుడు చూచినట్లుగా జెప్పుట భావికము— రామ రావణ యుద్ధ కథలఁ జదువుచో నాకుం బ్రత్యక్షముగఁ గనఁబడు చున్నది.

౬౪. నిరుక్తి—యౌగికార్థము గలశబ్దముల కవయవార్థము వలన నర్థాంతరకల్పన చేయుట నిరుక్తి—ఓచంద్రా! మమ్ము బాధిం చుటవలననే నీదోషాకరత్వము తేటపడుచున్నది.

౬౫. ప్రతిషేధము—ప్రసిద్ధ మయిననిషేధము ననువదించి వర్ణించుట ప్రతిషేధము.—ఓశోకునీ! ఇది నాటి పాఁచికలతో నాడిన జూదము కాదు. ఇప్పుడు వాడిబాణములతోఁ నాడెడుజూదము సుమా.

నాయకాదిలక్షణము.

౧. కావ్యనాటకాదులయందు వర్ణింపఁబడు ప్రధానపురుషుఁడు నాయకుఁడనియు, ప్రధానస్త్రీ నాయిక యనియు, చెప్పఁబడుదురు. ధీరోదాత్తుఁడు, ధీరోద్ధతుఁడు, ధీరశాంతుఁడు, ధీరలలితుఁడు, అని కథానాయకులు నాలుగు తెగలవారు.

(౧) ధీరోదాత్తుఁడు—ధైర్యవంతుఁడును, ఆత్మస్తుతి లేనివాఁడును, కరుణాళుఁడును, సాత్వికుఁడును, గాంభీర్యశాలియు, గర్వరహితుఁడును, సత్యసంధుఁడును, క్షమాసంపన్నుఁడును, అయినవాఁడు ధీరోదాత్తుఁడు.

(౨) ధీరోద్ధతుఁడు—శౌర్యశాలియు, కోపశీలుఁడును, దర్పవంతుఁడును, ఆత్మస్తుతిపరాయణుఁడును, మాయావియు, చపలుఁడును, అగువాఁడు ధీరోద్ధతుఁడు.

(౩) ధీరశాంతుఁడు—ధీమంతుఁడును, శుచియు, అభిమానియు, శమసమన్వితుఁడును, అగు బ్రాహ్మణుఁడు ధీరశాంతుఁడు.

(౪) ధీరలలితుఁడు—భోగలోలుఁడును, రూపవంతుఁడును, కామభీరుఁడును, కామినీ పరవశుఁడును, అగువాఁడు ధీరలలితుఁడు.

౨. శృంగారమునం దీనాయకులు నలుగురును దక్షిణుఁడు, అనుకూలుఁడు, ధృష్టుఁడు, శఠుఁడు, అని మరల నాలుగుభేదములు కలవారుగా నున్నారు.—

(ఁ) బహుకాంతలకు సమానప్రియుఁ డయినవాఁడు దక్షి ణుఁడు ; (ఁ) ఏకభార్యానురక్తుఁ డైనవాఁ డనుకూలుఁడు ; (3) తన జారత్వము బయలఁబడినను భయపడనివాఁడు ధృష్టుఁడు ; (ర) ఒక కాంతయందు మనస్సు గలవాఁ డయి మఱియొక కాంతయందు పయి కనురాగమును చూపుచు నప్రియము చేయువాఁడు శఠుఁడు.

3. ఈనాయకులకు స్త్రీలను కూర్చుటలో సహాయులుగా నుండువారు విటుఁడు, పీఠమర్దుఁడు, చేటుఁడు, విదూషకుఁడు అని నలుగురు.—నాయకానంఘటన కనుకూలమైన యేకవిద్య గలవాఁడు విటుఁడు ; (ఁ) నాయకుని కంటె కొంచెము హీనమైన గుణములు కలవాఁడయి కార్యమునకు సహాయుఁడుగా నుండువాఁడు పీఠమర్దుఁడు ; (3) నాయికానంధానమునం దసమానచాతుర్యము గలవాఁడు చేటుఁడు ; (ర) వికృతములైన యంగములచేతను మాటలచేతను వేషాదులచేతను నవ్వుపుట్టించి యుత్సాహముకలుగఁ జేయువాఁడు విదూషకుఁడు.

ర. స్వీయ, పరకీయ, సామాన్య, అని నాయికలు ముగ్గురు.—

(ఁ) ఉచితలజ్జయు, ఆర్జవమును, శీలమును, సౌందర్యమును, గలస్వభార్య స్వీయ ; (ఁ) పరుసిభార్యయు వివాహము కాని కన్యయు పరకీయ ; (3) వేశ్య సామాన్య.

ఈ. ఈనాయికలు ముగ్ధ, మధ్య ప్రౌఢ, అని మూడుభేదములు కలిగి యుండురు.—(ఁ) నూతనముగా యౌవనమును పొందినదియు, అల్పరతమును గోరునదియు, ముగ్ధ ; (ఁ) యౌవనమధ్యస్థయై రతాంతమునందు పరవశ యగునది మధ్య ; (3) యౌవనము ముదిరి యల్పలజ్జ గలదై సురతమునందు పురుషుని చొక్కించునది ప్రౌఢ.

ఉ. ధీర, అధీర, ధీరాధీర, అని మరల మధ్యయు ప్రౌఢయు

ముత్తెఱంగుల నుందురు.— (౧) సాపరాధుఁడయిన భర్తను పరిహాసముగా నెత్తిపొడుచునది మధ్యధీర; (౨) కన్నుల నీరు పెట్టుకొని పరుషము లాడునది మధ్యాధీర; (3) కన్నీటితో వక్రోక్తులను వలుకునది మధ్యధీరాధీర; (౪) భర్త యపరాధి యైనప్పు డాకా రాదులచేత కోపము కనఁబడనీయక రతివేళయం దలయించునది ప్రౌఢధీర; (౫) భర్తను రోషముచేత కొట్టునది ప్రౌఢాధీర; (౬) కోప ముతో కుటిలవాక్యము లాడునది ప్రౌఢధీరాధీర.

౭. ఈశృంగారనాయికలు స్వాధీనభర్తృక, వాసకసజ్జిక, విర హోత్కంఠిత, విప్రలబ్ధ, ఖండిత, కలహాంతరిత, ప్రోషితభర్తృక, అభిసారిక, అని యెనిమిది విధములఁ జెప్పఁబడుదురు.— (౧) తనకు భర్త వశుఁడై యున్నది స్వాధీనభర్తృక; (౨) ప్రియుని రాక వేచి శరీర మును గృహమును అలంకరించుకొనునది వాసకసజ్జిక; (3) పతివచ్చుట కాలస్యము చేయుఁగా తాళలేక తహతహపడునది విరహోత్కంఠిత; (౪) సంకేతస్థలమునకుఁ బోయి నాథుఁడు లేకపోవుటచే ఖేదము నొందు నది విప్రలబ్ధ; (౫) విభుఁడు పరస్త్రీని బొంది వేకువనురాఁగా కోపించు నది ఖండిత; (౬) భర్తను దూషించి పశ్చాత్తాపపడునది కలహాంత రిత; (౭) భర్తవిదేశమునకుఁ బోఁగా వ్యధ చెందునది ప్రోషిత భర్తృక; (౮) కాంతు ననుసరించి పోఁగోరునది అభిసారిక.

దృశ్యకావ్యములు.

ఈపటికు శ్రవ్య (వినఁదగిన) కావ్యములనుగూర్చి చెప్పఁ బడెనుగదా? దృశ్య (చూడఁదగిన) కావ్యము లను యింకొక తెగవి కలవు. దృశ్యకావ్యములకే రూపకము లని పేరు. నటులు రామకృష్ణాది

రూపములను తమయం దారోపించుకొని నటించుటచేత వీనికి రూపకము లని పేరుకలిగినవది.

నాటకము, ప్రకరణము, భాణము, ప్రహసనము, డీమము, వ్యాయోగము, సమవకారము, వీథి, అంకము, ఈహామృగము, అసి రూపకములు పది. వీనిలో నాటకము, ప్రకరణము, వ్యాయోగము, వీథి, అనునవిమాత్ర మిప్పుడు తెనుఁగునం దున్నవి.

౧. నాటకమునందు కథ ప్రఖ్యాత మైనదిగా నుండవలెను; నాయకుఁడు ధీరోదాత్తుఁడు; శృంగారవీరరసములలో నేదైన నొకటి ప్రధానము; అంకము లయిదు మొదలుకొని పదివఱకు నుండవలెను.

౨. రంగస్థలమునందుఁ బ్రత్యక్షముగాఁ జూపఁబడెడి యొక్క నాఁటికి మించనినాయకచరిత్ర మంకము. అంకములో దూరప్రయాణము, వధ, యుద్ధము, ముట్టడి, రాజ్యదేశాదులయుపద్రవము, భోజనము, స్నానము, మైపూఁత, సురతము, చుంబనము, దంతక్షతనఖక్షతములు, నిద్ర, మొదలయినవి చూపఁబడఁగూడదు; విదూషకాది పాత్రములు నాలుగయి దుండవలెను; అంకాంతమున పాత్రము లన్నియు నిష్క్రమింప వలెను.

౩. అంకమునందుఁ జెప్పరాని కడచినకథనుగాని రాఁబోవు కథనుగాని సంగ్రహముగా మధ్య నీచపాత్రములచేఁ జెప్పించునది విష్కంభము. కథ మధ్యపాత్రలచేఁ జెప్పఁబడినచో శుద్ధవిష్కంభమనియు, మధ్య నీచపాత్రములచేఁ జెప్పఁబడినచో మిశ్రవిష్కంభమనియు, చెప్పఁబడును.

౪. రెండంకముల మధ్యను నీచపాత్రములచేఁ బ్రయోగింపఁబడునది ప్రవేశక మనఁబడును.

౫. ప్రకరణమునందు కథ కవికల్పిత మయి, లోకానువర్తన మున కాశ్రయమై యుండవలెను. నాయకుఁడు ధీరశాంతుఁడయి, విప్రుఁడుగాగాని వణిజుఁడుగాగాని యుండవలెను. నాయిక కుల కాంతగాని, వేశ్యగాని, ఉభయులుగాని యుండవలెను. నాయకుఁడు ధర్మకామములయం దాసక్తుఁడయి, అపాయములను గడచి కార్యసిద్ధిని బొందవలెను. పదియంకము లుండవలెను.

౬. వ్యాయోగమునందు కథ ప్రఖ్యాతమై యొక్కనాఁడు జరగిన స్త్రీనిమిత్తము గానట్టి యుద్ధవిషయ మయినదిగా నుండవలెను ; నాయకుఁడు ధీరోద్ధతుఁడు; ఏకాంకము.

౭. వీథియందు కథ శృంగారరసప్రధానమై కల్పిత మైనది; నాయకుఁడు ధీరోద్ధతుఁడు; నాయిక యనురాగముగలదైన వరస్త్రీ ; ఒకటిగాని రెండుగాని పాత్రములు గలయేకాంకము.

౮. ఇవిగాక పదునెనిమిదియురూపకము లున్నను, వానిలో నాటిక యొక్కటిమాత్రమే తెనుఁగునం దున్నది. నాటికయం దంక ములు నాలుగు; నాయకుఁడు ధీరలలితుఁడు; రసము శృంగారము; స్త్రీపాత్రము లధికము; ప్రగల్భరా లైన జ్యేష్ఠభార్య యుండఁగా, తదధీనురాలై నాయకసంగమము కష్టముమీఁదఁ బొందెడు కన్యక నాయికగా నుండవలెను.

౯. రూపకములకు నాట్యము ప్రధానము. రూపకమునందు వచ్చు స్త్రీపురుషులయొక్క యవస్థల నభినయించుట నాట్యము. ఆంగికము, వాచికము, సాత్వికము, ఆహార్యము, అని యభినయము చతుర్విధము. కర చరణాద్యంగములతోఁ జేయునది యాంగికము; మాటలతోఁ జూపునది వాచికము; మనోభావములను కనబఱుచు నది సాత్వికము; వస్త్రాలంకారాదులచే నూఁదించునది యాహార్యము.

కవిసమయములు

ఉన్నవానిని లేనట్లుగాని, లేనివాని నున్నట్లుగాని, అనేక స్థలములయం దుండువాని నొక్కచోటనే యున్నట్లుగాని, వర్ణించుటకై ప్రాచీనకవు లేర్పఱుచుకొన్న నియమములు కవిసమయము లనఁబడును.

(౧) ఉన్నవానిని లేనట్లు వర్ణించుట — వసంత కాలమునందు జాజీ పుష్పించదనుట, చందనవృక్షములయందు పుష్పఫలము లుండవనుట, అశోకవృక్షములకు కాయలుండవనుట, పద్మములు రాత్రియు కలువలు పగలును వికసించవనుట, కృష్ణపక్షమున వెన్నెలయు శుక్లపక్షమున చీఁకటియు లేవనుట, మొదలయినవి.

(౨) లేనివాని నున్నట్లు వర్ణించుట — సమస్త పర్వతములయందును స్వర్ణరత్నాదులను వర్ణించుట, సర్వజలాశయములయందును హంసాదిక పక్షిసంచారమును జెప్పుట, నదీసముద్రముల యందు తామరపువ్వులును కలువలును ఉండు ననుట, రసాలచందనాది వృక్షములను తీఁగెలనుగాఁ జెప్పుట, నవ్వును కీర్తియు తెల్లఁగాను, కోపమును ప్రేమయు పరాక్రమమును ఎఱ్ఱగాను, అపకీర్తియు ఆకాశమును పాపమును నల్లఁగాను, ఉన్నట్లు చెప్పుట, రాత్రి చక్రవాకము లెడఁబాసి ప్రాతఃకాలమున కలిసికొను ననుట, చకోరములు వెన్నెలలు త్రాగు ననుట, లక్ష్మి పద్మములయందును రాజ నేత్రములయందును వసించు ననుట, వానకాలమున హంసలు మానస సరస్సునకు పోవుననుట, స్త్రీ తన్నుటవలన నశోకవృక్షమును– కల్లుమియుట వలన పొగడచెట్టును పూచుననుట, మన్మథతాపముచేత హృదయములును హారములును పగులుననుట, యువతీకటాక్షముల చేతను మదన

బాణములచేతను యువజన హృదయములు భేదిల్లు ననుట, మేఘము గర్జించునప్పుడు నెమళ్లు నృత్యముచేయుననుట, మొదలయినవి.

(3) అనేక స్థలములయం దుండు వాని నొక్కచోటనే వర్ణించుట—మలయ పర్వతమునందే మంచిగంధపు చెట్లుండు ననుట. వస్త్రములకును ఛత్రములకును పుష్పములకును తెలుపే చెప్పుట, మేఘసముద్రములకు నలుపే చెప్పుట, వసంతమునందే కోయిలలును వర్షాకాలమునందే నెమళ్లును కూయుననుట, ఆకాశమూర్ధ్వము నందే యున్నదనుట, మొద లయినవి.

122

నీతిచంద్రిక, విగ్రహము.

శ్రీ

పరబ్రహ్మణే నమః

క. శ్రీకళ్యాణగుణుఁ డఖిల
లోకారాధ్యుఁడు సాధు ♪ లోకావనదీ
క్షాకలితుఁడు నిత్యుఁడు జగ
దేకగురుఁడు దేవదేవుఁ ♪ డిచ్చుత శుభముల్.

గీ. మొదల వాగనుశాసను ♪ మదిఁ దలంచి
సోమయాజిని భాస్కరు ♪ సోము నెంచి
భీముఁ గొనియాడి శ్రీనాథు ♪ వినుతి చేసి
తక్కుఁగలయట్టివిబుధులఁ ♪ దవిలి కొలుతు.

ఉ. చిన్నయనూరి ధీరు లెదఁ ♪ జేరిచి సారెకు గారవింపఁగా
మున్ను రచించి మించె సగ ♪ మున్వచనంబుగ నీతిచంద్రికన్;
సన్నుతి కెక్కఁ దాని కిదె ♪ సాటి యటంచు బుధు ల్మనంబులం
దెన్నఁగ నిప్పుడేను రచి ♪ యించెదఁ దక్కినయుత్తరార్ధమున్.

ఉ. పేరిచి సావకాశముగ ♪ విగ్రహ మీయది వ్రాయఁ బూని నే
నారసి పెక్కు లాంధ్రకృతు ♪ లంతటఁ బోక హితోపదేశమున్
భారతపంచతంత్రములుఁ ♪ బల్మఱునుం బరికించి వానిలోఁ
గోరికయూకథల్గొనియుఁ ♪ గూర్చితిఁ గొన్నిటి నూతనంబుగన్.

గీ. దీన సామాన్యముగఁ దొంటి ♪ తెలుఁగుకవులు
వాడియున్నట్టి పదవాక్య ♪ పద్ధతులనె
యేర్చి కూర్చినవాఁడఁ గ ♪ వీంద్రులకును
మించుగా డెందము ల రుచి ♪ యించుకోఁజుకుఁ.

క. ఎంతైన నిందుఁ దొల్లిటి
చందంబుల రచన లున్న శ్రీ సైరించి యెదం
బొందింప కుండ నీసుల
వందన మొనరింతు నార్య శ్రీ వర్యుల కెల్లన్.

శ్రీరస్తు

నీతిచంద్రిక, విగ్రహము.

ప్రథమభాగము

అనంతర మానశేంద్రనందను లమందానందకందళితహృద యారవిందు లయి, విష్ణుశర్మం గని, యిట్లనిరి. "దేవా! తావకం బగు సేవావిశేషంబున, నిరవశేషంబుగ మిత్రభేదంబును వినంగని, మనంబున ఘనంబగు మోదంబు నొందితిమి. ఇంక విగ్రహంబుం గూడ ననుగ్రహించి, మమ్మే గృతార్థులం జేయ వేఁడెదము. వేగిర మీనవకథానుధారసంబు వెల్లిగొలిపి, యాఁగొన్న మావీనులకు విందు సేయుఁడు." అనిన నాయవనీసురనత్తముం డాదరాయత్తచిత్తుం డయి, యిట్లు వినిపింపందొడంగె.—

తొల్లి, తుల్యబలవిక్రమంబు లగు మయూరమరాళంబులకు సమీకంబు చేకుఱినతఱి, నొక యరిష్టమును నమ్మి, యాహంసమ్మే పరాజయమ్మే నొందెను. మీకక్కథ వక్కాణించెద; చక్కఁగా వినుండి.

కర్పూరద్వీపమునందుఁ బద్మకేళి యనుకొలను గలదు. అందు హిరణ్యగర్భం డను మానసౌకస్వామి వాసము చేయుచుండును. అందలి జలవిహంగమంబు లాయంచలరాయనిం దమ కందరకు దొరఁగాఁ జేసికొని, వాసిగని యుండును. ఆపరమహంసావతంసుఁ డాశలజయించి, నైజతేజం బెల్లకడల వెలుంగ, నొక్కనాఁడు

సూర్యుండు పూర్వాపర్వతశృంగం బలంకరించిన యనంతరంబ నిజా ప్త
ద్విజనికర పరివేష్టితుండయి, రాజయోగంబు మెఱయఁ బుండరీకా
సనంబున సుఖాసీనుం డయి, నిండుకొలువుండఁ గతిపయి మాసంబులకు
మున్ను దేశాంతరం బరిగి మరలి యరుదెంచిన దీర్ఘముఖుండను బక
ముఖ్యుఁడు, వాకిట నిలిచి, ప్రతీహారులవలనఁ దనరాక యెఱిఁగించి
వుచ్చి, సముచితప్రకారంబునఁ గొలువు సొచ్చి, వినయవినమిత
గాత్రుండయి, దండప్రణామంబుఁ గావించిన, రాజును సాదరాహ్లాద
మేదుర నిరీక్షణంబుల నాతని నీక్షించి, "రమ్ము కూర్చుండు" మని,
చేయి చూపి, దావునఁగూర్చున్నయతని కిట్లనియె. "ఓయీ! దీర్ఘ
ముఖా! నేమనూ నీకు? బహుకాలంబునకు నేఁడు నీజాడఁ జూడఁ
గంటిమి! విదేశవాసాయాసక్లేశంబున, భృశంబును జెన్నుఁదఱిగి
నట్టున్న వాఁడవు. ఇంతతడవు నేయేదేశమ్ములఁ గ్రుమ్మరుచుంటివి?
ఏయేసీమల నేయేవిచిత్రంబులు నేత్రంబుల కపూర్వపర్వంబు లొన
రించెఁ? ఎక్కడను మిక్కిలి యక్కజంబులు లేవుగా? నీమోము
పొలఁకువ దిలకింప, నెప్పట్టుననో యొక గొప్పవిశేషం బున్నట్టు
పొడకట్టుచున్నది. నీవేగినచోట విశేషంబు లేలవుట్టకపోవును? నరగ
నెఱిఁగింపుమా; విందము." అనిన, జేని మొగంబున దృష్టి వఱిపి,
యాతం డిట్లనియె.

"ఏలిక పాలనంబు సేయునేల నేమూలం గుశలం బణుమా
త్రంబును గుంటువడ దన, సార్వకాలము దేవరపాదము లాశ్రయించి
సన్నిధానంబు నన మెలంగు నస్మదాదులను, 'నేమమా' యని వేఱ
యడుగనేల? ఇఁక దేశాంతరమం దున్ననాఁటి నాకుశలమో, శశ
విషాణప్రరోహంబు. అది యంతయు దేవర కీతనుద్యుతియే తెలుపుడు
సేయుచున్నది. అది యుండనిండు. నాఁ డట్లు స్వామిపాదంబుల

యాదేశంబు గొని, చనిన దాదిగా నీయాదేశం బననేల? అశేషాశాన కాశమ్మ్లులఁ గ్రుమ్మరి, క్రమ్మఱి, భాగ్యవశమ్మున సమ్మ్లుఖమ్మ్లే జేరఁగంటిని. అంతరాంతరంబుల, నే నెడనెడఁ గాంచినవింత లసంఖ్యా కంబులు గలవు. అవియన్నియు నెన్న, నేండ్లును బూండ్లునుం బట్టు. నిలకడమీఱ విన్నపంబు చేసికొనియెద. త్రోవను నేవకుం డొక్క యపరాధంబుఁ గావించుకొని వచ్చినవాఁడు. మహూర్తమాత్రంబు మార్గఖేదం బవనయించి, యామూలాగ్రంబుగఁ గార్యనివేదనం బొన రించెడు. దేవరదివ్యచిత్తంబున లెస్సగా నవధరింపవలయును. అని యరమోడ్పుఁగన్నులతో వేడినిట్టూర్పు నిగిడించి, క్షణ మూరకుండి, యల్లన నిట్లనియె.

జంబూద్వీపంబున వింధ్యం బను ధరాధరంబు గలదు. ఆగిరివర శిఖరంబున గహనవిహగంబులకెల్ల వల్లభుండయి, చిత్రవర్ణం డను శిఖావలత్ల్లజుఁడు కాపురముండును. తదంతిక కాంతకాంతారంబున, నతనియనుజీవు లగుఖగంబులు కొన్ని, నన్ను బహుయోజనాధ్వ గామిం గాంచి, యాతిథేయసత్కారంబు లాచరించి, యమృతకల్పంబు లగు పరిపక్వఫలంబులొసంగి, మెసంగి విశ్రమించియున్న నన్నుం జూచి, కుశల ప్రశ్న పూర్వకంబుగా నిట్లనియె. "ఓబకోత్తమా! యే దేశంబు భవజ్జననంబునకుఁ దావలంబై, పుణ్యంబువహించినది? ఏ యే దేశములను నీవియోగవ్యధపాలు చేయుచు వచ్చి, యిప్పు డీదేశము నలరించుచున్నాఁడవు? ఇంకను నీపాదము లేదేశమును బవిత్రము గావింప నున్నవి? ధర్మపరిపాలనంబు గ్రాల మీనేల నేలుచు, నిను బోటిశుచిమూర్తుల సేవకులనుగాఁ బడయునంతటిభాగ్యము వహించి, సత్పురుషశిరోమణి యనిపించుకొనుచు, మీరాజ్యము నలంకరించు చున్న రాజరత్న మెవఁడు? మాయందఱికర్ణంబులు, భవదీయ

వృత్తాంత శ్రవణకుతూహలాధీనంబులయి వేచియున్నయవి. ప్రయాణ త్వర యొక్కింత గుదియింప వలనుపడునేని, నివిషమాత్రం బిందు నిలిచి, నీయుదంతంబు సాంతంబుగా వానికిం బ్రసాదింపుము. నావుడు నే నిట్లు వాక్రుచ్చితిని.

"కర్పూరద్వీపమన, మును విని యుందురేకదా? నే నాదీవికి జేవర యగుహిరణ్యగర్భం డను చక్రాంగపుంగవుని యనుంగుభృత్యుఁ డను. మారాజు బలపరాక్రమాదు లాబాలప్రసిద్ధంబులు; కాన, నాతం డొకవేళ మీకు శ్రుతపూర్వుండై యుండనోపు. అందఱు నన్ను దీర్ఘముఖుం డందురు. ఆబాలపాదనాయకుండు నన్నుఁ బ్రాణంబు ప్రాణంబుగా మన్నింప, సన్నిధానవర్తినై, మెలఁగు చుందును. అట్లు సుఖైకభాజనంబనై యుండి, యొక్కనాఁ డశేషవిషయంబులం గల విశేషవిషయంబుల నీక్షింప నపేక్ష వొడమి, మాయొడయనివీడుకోలు వడసి, యాపుడమి వెడలి, యెండ నాక, వాన నాక, దేశమ్ములు గాని దేశమ్ము లెల్ల సంచరించి, తత్తద్విశేషంబులకు డెందంబున నానందించుచు, వచ్చి వచ్చి, యదే పనిగ నేఁ డీదీవియుఁజొచ్చితి. ఇచ్చటివిశేషంబు లెల్లఁ జూడ నాయుల్లంబు కడువేడుకపడుచున్నది. పక్షివరులారా! యీదినశేషంబు, మీసమక్షంబున, నీదీవివినోద వీక్షావిహారంబునఁ గాలక్షేపంబు చేసి, రాతియు మీతోడఁగూడ; నిష్టకథాగోష్ఠి నడపి, యెల్లిప్రొద్దున మాసీమ కేగెద." అనవుడు నావిహంగంబులు ప్రహృష్టాంతరంగంబు లయి, "యట్ల యగుంగాక" యని, గమనపరిశ్రాంతి కొంత శాంతి పొందినపిమ్మట, నన్ను మున్నిడుకొనిపోయి, యాధాత్రింగల విలోకనపాత్రంబు లగు చిత్రంబు లెల్ల నాకుం గ్రమంబునఁ జూపి, యాపిదప నన్ను మగుడఁ దమ మనికిపట్టునకుం దోకొని, వచ్చి, యచ్చేరువ నివ్వల దవ్వుల నిలిపి,

లోనితమజేనిం గానిపించి, యిట్లనియె. "ఓయుండజకులమండనా! మీభువనంబును మాభువనంబును లెన్నగాఁ జూచితివి గదా. వీది, యీదీవుల కెంటిలో, నీకంటి కింపును సొంపును మిగుల నింపుచున్నది? ఏవాఁడు మనజేఁడు లిద్దఱలోఁ దద్దయుఁ బెద్దఱికంబు వహియించి మించును? అభిమానాభిమానంబును, ననుమానసంబును మాని, నీమాన సంబునఁ గలయది తప్పక చెప్పుము." అనిన, బ్రహ్మసభాసురముఖుండ నయి నేనిట్లు పలికితిని:—

"నిచ్చెలులారా! మీరు, గూపకూర్మంబులవలె, సదా యిందుండి, దేశాంతర వృత్తంబులఁ గలనైనఁ గని విని యెఱుంగమిం జేసి, యీలాగున బేలతనంబునఁ బలుకుచున్నారు. మీడెందంబులఁ గ్రందుకొన్న సందేహంబు వాపికొన, మిక్కిలి యక్కఱపడి యడిగితిరి. కాన, మైత్రిం బురస్కరించి, యున్నది యున్నట్టు వాక్రుచ్చెద, ఆలింపుఁడు. నిజముగా మాదీవికి మీదీవికి హస్తిమశకాంతరము గలదు. మాయావాసంబు జనశరణ్యభువనంబు;, మీనివాసము మహా రణ్యము. ఇఁక రాజుల సడుగుదురేని—మాతేనికిని, మీతేనికిని, బర్వతంబునకుం బరమాణువునకుం గలవాసి. మాయధీశ్వరునికి నిల యము కేవలము పద్మాకరము; ఆహార మమృతము; అనుచరులు నిరంతరము సరసులసంగతి నుండుకవికులంబులు: మావిభునివైభవము సమగ్రముగా నెన్న వేనోళ్ళవాఁడును నేరఁ డన మనమా యిఁక వాకొనఁ గలవారము? పట్టిచూడ, మీదొరయం దివియన్నియు విప రీతంబు లయి యున్నవి, నిలయంబు నట్టడవి; అశనమో, కాయలు గడ్డలు; భృత్యు లందునూ, యనవతరము కుజనులసంగతిం దిరుగు పలుగాకిమూఁకలు. ముంజేతికంకణమున కద్ద మేల? ఇట్టిమీప్రభువు వైభవము మీయుల్లంబులకే తెల్లంబు. అది యటుండ నిండు. మీరీ

శిఖచెంతఁ జేరి, చెట్ల గట్ల నీరీతిఁ బరితపింపనేల? కాయగసురు లేఁబు
కొని తిని మననేల? మిమ్ము గన్నప్పటినుండియు, నాహృదయంబున
కిదియ విచార మగుచున్నది. ఏమి సేయవచ్చు? ఇది యంతయు
మిమ్మిట్టుపుట్టించిన దైవంబుదోషంబు గాని మీదోషంబు గాదు.
లోకములో సజ్జనులతోడి సఖిత్వంబు సంభాషణమాత్రసిద్ధంబు; కావున,
మీరు నాకివుడు పరమాప్త లయితిరి. సత్పురుషులైనవారు పరుల
కష్టంబు లైనఁ జూచి సహింపఁజాల రన, నాప్తుల యాపద లెట్లు
చూచి సైఁపఁగలరు? ఈదేహామును ధరించుటయుఁ బరోపకారార్థమె
యగుటను, మీకొక్క హితోపదేశంబు చేసెద. నాపలుకులు కుఱుచ
సేయక, చెవులం జొనువుఁడు. బుద్ధిమంతులరు, మీకు విస్తరించి
చెప్పఁ బనిలేదు. బాగుపడఁ గోరెదరేనిఁ, గీడు మేలాడక, వైశంబ
పయసంబయి, రేపకడ నాతోడఁగూడ మానేలకు రండు. ఆకడ
మీకననాయాపేక్షంబుగ వలయునట్లు జీవనము నడుచును. మాయెడ
యండును, సర్వజనసంస్తవనీయుండు; పరమకృపానిరతుండు; ఆశ్రిత సుల
భుండు; మిమ్మందఱిఁ దనపరివారంబులోనివారిఁగా మన్నించును. ఆతని
పాలంబడి, మీకుబోలినలీల మేలుగం గాలం బచ్చటఁ బుచ్చవచ్చును.
దీనికిం దగినయుత్తరం బంగీకారంబ. ఒండుతలఁపుఁదడవిక్క, ప్రయాణంబై
రండు. ఆడుచుం బొడుచుం బోవుదము." అనిన, రోగార్తులకుఁ బథ్య
పదార్థంబులుం బోలె, నాహితవచనంబులు, రుషారోగపీడితంబు లగు
నాపత్తుల శ్రవణంబుల కనూయాజనకంబు లయిన, ముఖంబులఁ
గోపంబులు ముడివడ, శుష్కహాసితంబు తెచ్చుకొని, కన్నుల మిడుఁ
గుఱులు రాల ననున్నఁ దూష్ణింభావంబున నీక్షించుచు నాపత్తులెల్ల,
నోరికి వచ్చినట్లు ననున్ను దేవరను గొన్ని నికృష్టవాక్యంబు లాడెను.
అవియెల్ల నిండినయోలగంబున నుగ్గడింపఁ బోలవు. ఆకుక్క లటు

మొఱిగినమాత్రంబున, నేలిననారిగౌరవంబున కొక్కతక్కువయుఁ గలుగదు. అవి తమనైజగుణంబులే వెడల నాడుకొన్నవి. పాములకుఁ బాలు వోయ విషవృద్ధి యగునట్లు, వివేకశూన్యులకు హితవాక్యంబులు గఱప దుర్మదం బెక్కును. సర్పంబులు కొక్కనోరనెగాని, ఖలులకు నిలు వెల్లను విషంబే యని, మనీషులు నుడువుదురు. కావున తుల్లకజనంబులకుఁ బొడిఁ గఱపఁబోవుట నోరిచావలంబు గాని వేఱు కాదు; అట్టి హితోపదేశంబువలనఁ జలంబు బలియుం గాని, లవంబును గుణం బలవడదు. కాఁబట్టి, బుద్ధిమంతుఁ డెల్లవిధంబుల వివేకలోకంబునకే బోధింప యత్నవడవలయును. కానినాఁ డసితాననంబులకుఁ దెలుపఁ బోయిన చెవులపోతురీతిని, దవ్వక ముప్పొఁదెందును. అకథ యాకర్ణింపుఁడు.

మాల్యవంతంబుపొంత సంతతపరిణత ఫలకలిత తరుషండ మండితం బగుపసం బొందు గలదు. అచ్చటిగోలాంగూలజాలంబు, మండువేసవి నొక్కవాసరమధ్యంబున, మెండుగఁ దృషార్దితంబయి, బయలు వెడలి, కడుదవ్వునఁ బొడఁగన నగు మృగతృష్ణాప్రవాహం బాలోకించి, నదీప్రవాహం బని భ్రమయించి, మించినయెండ వేడిమి నడుగులొక్కమొగిఁ బొక్క మిక్కిలిదూరము నడచి, యొక్కడను నిక్కంపువారి పూరంబు గాన నేరక, యూరక డస్సి, యమున్న రనుచు నడుగామడగా నాచాయ నున్న యొక్కన్యగ్రోధపాదపచ్ఛాయాశీతలంబగుసికతాతలంబున కల్లన నొడల్లు సేర్చి, జటాఝూటంబులూఁతగూరుచుండియుండఁ, గొండమ్రుచ్చొక్కటి తక్కటివానితోనిట్లనియె. "చూచితిరా! మలినముఖులారా! మన మిపు డెంతదూర మరుదెంచినారమో! మనయూవాసంబున కీవనుమతీజరాజంబు యోజనంబుండునని వినుచుందుము. ఎండతాఁకునం గడుబడలియు, జలంబులాన

నానను తలంపున, నదెయిదె కాసారంబు డాసెద మని, యాసాసలం దటమి నడిచితిమి. నడచినకొలందిని జలంబు లంతకంతకు ద వ్వగు చున్నట్టు నామదికిం గన్పట్టుచున్నవి. ఇప్పటిచొవ్వు పరికింప, నడుగు తీసి యడుగిడుజాడ పొడగాన రాదు. మధ్యందిన దినకరాతపత్తైక్ష్ణ్యం బునఁ గాళ్ళులు కాలి చాల బొబ్బ లెక్కినవి; నాలుక తడియాఱి పిడచవాఱుచున్నది. నేఁడీదప్పి కెట్లు దవ్వారము? ఏమిసేయుదము?" అని మిగుల వగలం బొగులుచుండ, నావటకుటకోటరాభ్యంతరంబున వసియించుశశకం బొకం డాదీనాలాపంబు లాలించి, స్వాంతరంగంబు కరుణాతరంగితం బగుడు, మనసు పట్టలేక, విధిప్రేరణంబునఁ దొట్రి వెడలి వచ్చి, యటుత నిలిచి, కర్ణంబులు తీక్ష్ణించి యిట్లనియె. "ఓబుద్ధిహీనులారా! మీరాయెండమావులం గని కాఁబోలు, నీటి తావులని యాసపడుచున్నవారు. అవి మరీచికలుకాని వీచికలుగావు. ఇదిగో—నాచెయిచాయం దిన్నఁగఁ జూడుఁడు. అల్లదె—యాపల్లం బున, ననతి దూరంబున వారిజాకరం బొకండు గలదు. అందరిగి, మీపెందగఁ దీర్చికొండు; పొండు." అన, నొక యసితాననంబు ప్రహసితాననంబై, కాలానల జ్వాలలీల మండిపడి. పటపటఁ బండ్లు గీటుచుఁ, గుటిలభ్రుకుటి యయి, చదలున నదరులు సెదరఁ జూచుచు లేచి, కప్పరపాటున నాకుండేటిమీఁదికిఁ గుప్పించి యుఱికి, దానికడకాళ్లు తనకేలఁ గీలించి, పైకెత్తి చూపి,—"వింటిరే? యీశశాధముండు నోరఱుగ మనల నెన్నికాఱు లఱచెనో. మన మెల్లరము బుద్ధిహీనులమఁట! తా నేమో మనకు బుద్ధులు దిద్దెడి పాటి మహాబుద్ధిమంతుండఁట! మనకుఁ దనకున్న పాటి వివేక మున్నదే? మనకుఁ జక్కఁల్లుదిద్దఁ డాఁగాక మఱియెవ్వ రున్నారు? ఎమి దీని త్రుళ్లు?" అని, నిందాగర్భంబుగాఁ దోడిమసిఁగోఁతులతోడ నాడుచు,

గేలిగొనుచు, నిర్దాక్షిణ్యచిత్తంబున నాచెవులపిల్లిని బిట్టుగ నేలంగొట్టి కాలం జమరి, కృతాంతనిశాంతంబున కతిథిం జేసి, యవియున్నయుఁ గదలి జలాశయంబునకుం బోయి, తోయంబు లాపోవఁ ద్రావి, యుత్థేష్టంబుగం జనియె. కావున, నెంతమాత్రము మూర్ఖుల కుపదేశింపఁ బూనరాదు. అట్లు పూనువానికి మానక కీడుమూఁడును.

అట్లు దూతి యుప్పక్కు లెల్ల నన్ను రూక్షవీక్షణంబుల నీక్షించుచు, సరోషసరు షాక్షరంబుల మతియు నిట్లనియె, "ఓరీ! దుర్మతీ! నీవు మతిభ్రమ గప్పి, మాకడ గోరంతలు కొండంతలుగాఁ జదువఁ జొచ్చితివి. అంతతో నైన నిలువక, నిర్భయంబుగ మాదేశమ్మును మమ్మును నూరక మీఱి నాడితివి. నీవు పాపవర్తనుండవు, నీబుద్ధి పోనిచ్చుకొందువే? ఏవారలంగాని వారినింబట్టుకొన్న నైసర్గిక దోషంబులు విడువవు. నీవును పక్షపాతలోలబుద్ధివై నీమనంబు వోలితి యందఱకుం దేటపఱిచితివి. సర్వజనసమాదరణీయుండు చిత్రవర్ణుండు నీకాదరణమాత్రుండు గాకపోయెఁగా! విపరీతచేతస్కులకుఁ బూజ్యులే యక్షిగతులగుదురు. నీవు నితరం బెరుంగక, యెక్కుడువారల ధిక్కరించెదవు. నీకింతదురాగతంబు కొఱగాదునుమీ. మింటఁ బొంకు మొయిలుం జూచి పాటుసహాజభీరువునా నాన లేక, మాకడ నేమో గొప్పపౌరుషశాలి యని, యింతతడవును వర్ణించితివి! అట్టి మీ రాజహంసంబున కెవరు రాజ్యాధికారం బొసంగిరి? అతఁడు రాజ్యభారంబు భరియింప నెట్లు సమర్థుం డగును? ఏవారు దేనిఁ బూనినన్నాలో, వారు దానిఁ బూనఁ బొసంగి యుందురు. అట్లు గానిచో, హాస్యాస్పదు లగుదురు. మీహిరణ్యగర్భుఁడా మ మ్మావదలవలనం బాచి, యేలఁజాలువాఁడు? మొగిలినీరునమ్మి, చెఱువునీరు పాఁ జల్లించునంతటి బుద్ధిమంతుఁ డిం దెవ్వాఁడును లేఁడు. మీ రాజువంటి

వారు వేవురైన, మారాజున కెత్తు వత్తురే? చాలుఁ జాలు. ఈపాటి నీమాట లుడుగుము. మాకుఁ గాదు—నీకే మే మొక్కహితోప దేశంబు చేసెదము. తగవరివై తేని, మాపలుకు సేయుము. మారాజు మీరాజుబోఁటివారి నూఱువుర రక్షింప దక్షుండు. మామాటఁబట్టి నీవును మీయెకిమీఁడును గూడ మాజేని నాశ్రయించి బ్రదుకుండు" అని యాపలుగుపులుగులు దేవరం దూఱునప్పు డేమిచెప్పుదు? నాకు నాకసంబును భూమియు నొక్కగ్రుక్కను మింగవలె నన్నంత కోపంబు వచ్చినది. ఐన నే నప్పటి వెనుకముందరలేమి విచారించి, చేయునది లేక, యా కన లెల్ల నుల్లంబుననె దిగఁద్రావి, పొరలి పొరలి వచ్చు పరుషోక్తుల నాలుకతుదకు రాకుండఁ గ్రుక్కి, కొంత శాంతం బవలంబించి, మది కలంగియు గాంభీర్యంబు తెచ్చుకొని, యిట్లంటిని. "ఆ! వీటిమూటలివి! మీ రందఱుం జేరి యుపచార పూర్వకంబుగాఁ బ్రార్థించి యడిగిన, లోకంబుతోడిపాడిగా నాకుం దోఁచినది పలికితిని. మీ కది మనస్సువచ్చి చేయుదు రేని మేలు; చేయకుండినం గడుమే లయ్యెం. అంతియకాని, యింతమాత్రంబునకె కోపమెత్తి, యిట్టి తెఱంగుమాలిన పలుగులు నోర వెడల నిచ్చుట మీయట్టియుచితజ్ఞులకు ధర్మ మగునె? మారాజుగౌరవంబు పేర్కొన మీ రేపాటివారు? వేల నిర్మిత్తంబుగ నసాధారణ గౌరవోదారుం డగుమాజేని నోరికొలఁదు లాడి, వలవనిపాపంబు కట్టుకొనియెదరు? లోకంబున సాధునిందకంటె మిక్కిలిపాతకం బెద్ది? వృథాప్రయాసంబు; ఇట్టినోరిచే టేల? నాబుద్ధి విని, యిఁక నైన మృదుమార్గంబు వట్టుఁడు. లోకంబున నెట్టిదిట్టలకును వాతిపాఁడితనంబు చెట్టలఁ బుట్టింపక పోదు. ఎవ్వరును తాల రువ్వినవానిఁ బూలరువ్వరు! కాన, నేనును మి మెమ్మొక్కటి నడుగవలసివచ్చెడును. మారాజుమాట పిమ్మటఁ జూచు

కొందము. ఏదిట్ట మీనట్టువపిట్టను బక్షిరాజ్యంబునకుఁ బట్టము గట్టెనో మొట్టమొదట దాని నుడువుండు," అను నానోటిమాటలు నోట నుండఁగనె, కట్టలుక నొకపలుగాకికాకి కనుగీట, వేగ నాసైగఁ గైకొనిన గాకము లెల్లఁ బెల్లు రేఁగి, చివ్వకుం జేఁ జాఁచుము, లాతిచో శాంతంబునట్ల యవమానంబగుచోటఁ బరాక్రమంబ పురుషులకు భూషణం బగుటం దలపోసి, నేనును వెనుకదీయక కలని కాయితం బయి, ప్రతిఘటించి నిలిచితిని. అనవుడు సస్మితాస్యుండై, చక్రాంగ పుంగవుండు కొంగ కిట్లనియె. "ఎవ్వఁడుక్రొవ్వునఁ బరనిజశక్తులకొలంది గణింపక, యెక్కుడువారల డీకొన నుంకించునో, యాకట్టిఁడిమత్తుఁ డికట్టులకెల్లఁ బుట్టినిల్లగును. తొల్లి యొకకపోతంబు పోతరంబున నంతరం బెఱుంగక, సాభువంబుతో నెదిరి మద మణఁచెను. నీ కాకథ జెప్పెద వినుము.

పాండ్యమండలంబున మధుర యను పురవరంబు గలదు. ఆపీటికోవెల నాశ్రయించి, యొకపారావత మిథునము వాసము చేయుచుండును. ఆఖగయుగ్మం బొక్కనాఁడు ముఖమండప సమీపంబున దేవాలయములో నేల వ్రాలి చెఱ లాడుచుండ, నొక్క శ్యేనంబు వాని దవ్వుదవ్వుల నీక్షించి, చేరవచ్చి దుర్గసమాశ్రయ బలంబునఁ బట్టనలవికాక, యప్పటికి నొడుపుదప్పి 'వంటయింటి కుందేళ్ళివి యెందేగఁగల' వనియెంచి, నాఁటి కెందేనియుం జనియె. అదియంతయు జెప్పలిడక చూచి, వెఱచి, పారావతి పతికిట్లనియె. "చూడరుగదా? ఇప్పుడొక్కజాలి, జాలిమాలి, మనలం బట్ట నీపట్టున కేతెంచి దుర్గబలంబుల మనలం జెనకరాకిఁ దలయూఁచి, మహాకోపంబున మనవైపునకె చూడ్క నిగిడించుచుం జనియెడు. పుణ్యవశంబున నిప్పటి కాశశాద నాప మృత్యుదేవతవాతం బడక

బ్రదికితిమి. అది ముందెప్పుడును మనమీఁదనే కన్ను వేసి యుండును. ఇఁక నీచోటు వాయకుండిన, నెన్నఁడో మన మాయోరణంబు బారి కగ్గ మగుదుము. ఏవారిఁగాని బలవద్విరోధంబు లగ్గుగాదు. ఈతావు తరలి, వేగ నీడేగనేగి తలంగుదము. తాత త్రవ్వించిన తటాకంబని పొంగి బ్రుంగం దగదుగదా? అందుల కొప్పుకొన్నను, ఇది పెద్దలార్జించిన కాణాచియుఁగాదు. నిలయంబు వదలలేక, యిందుండి మిన్నక లయం బంద నేల? ఇంక నీనేగికి వేగిర ముఱవగు వెరవు పరికింపక మసలరాదు. మసలితిమే నునుఱులు తొఱఁగవలసి వచ్చును. కావున, మునుముట్ట మెలఁకువ పడవలయును. ఏమిబుద్ధి?" అని, కన్నుల నీరు పెట్టుకొని, గద్గదవచనయై యుమ్మలించు తనబోటిమాటలు గీటు నంబుచ్చి, మగపులుంగు మొగంబున కలంతినగవు చెలువు గొలువఁ దన చెలువ కిట్లనియె. "ఏల యీలాగున వలవనివెఱపు గట్టుకొని, నాలా వెఱుఁగక, రిత్తయుత్తలపాటు చిత్తంబునకు హత్తించెదు? ఉన్నయూరును గన్నతల్లియు నొక్కఱూపన వినవె? సాటివానిబోటున బోహాటించి, గృహంబు పాడఱఁజేసి పాతినఁ దోడివారు మనలంగని నగరే? దానిచే నగుపాటు దక్క నొక్కకార్యంబు లేదు. దైవంబు తప్పఁజూచిన, మనయత్నంబు లన్నియు నీటిధారా లగును. వెరవులు వేయును నోసలివ్రాలు తుడువనేరవు. దేహికి సుఖదుఃఖంబు లీశ్వరే చ్ఛాయత్తంబులు. సుఖమ్ములు రమ్మని తెచ్చుకొన్న వచ్చి, దుఃఖ మ్ములు పొమ్మని త్రోచివైచినఁ బోవునే? మతియొక్కటి వినుము ఎట్టి విక్రమ ధురంధరులును నాకట్టెదుటఁ దలచూప నోడుదురు. ఈతుచ్ఛంబగు డేగ యెంత? ఆసాళువంబును నొక్క ఖగంబకాని దయ్యంబుగాదు. నీయది నాయధమశశాననంబున కింత భీతిల నేల? అదియు శకుంతంబ; నేనును శకుంతంబను. ఎక్కడ నేనియు వజ్రంబు

నకు వజ్రంబు తక్కు వగునె? ఏల యూరక కొఱమాలిన పిరికి తనంబుఁ గఱపెదవు? అక్కఱటిపక్కి నిక్కంబ మనదిక్కునకు వచ్చె నేని, నేనొక్క ముక్కు పోటునం గీటడంచెద నొండె; కులిశసఖంబు లగు నిశాతనఖంబులఁ జించి చెండాడెదనొండె. ఆర్యులు కార్యమ్ములఁ దమశౌర్యమ్ములఁ బ్రకటింతురుగాని, మాటలం బ్రకటింప నొల్లరు. నాకిప్పు డూరక నీతోడ వాగ్వాదమేల? నీవుచూచి మెచ్చుతఱియును వచ్చును. నావచనములు విశ్వసించి, యావంత యావంతయు లేక, నిశ్చింతమ్మగ నుండుము. మన కిప్పుడు వచ్చిన భయమేమియు లేదు; అని, యూఱడించిన నాపులుఁగుచెలువ చెలువునిమాటకు మాఱాడ వెఱచి, లోనియూరటంబున కూరటఁగానక, డెందంబున డోలాందోళ నంబు నొంద, మొగము వెలవెలపా టెలనగవున నడంచి, యూర కుండెను. అంత నాడేగయుఁ బగచాటి, మఱునాఁడు రేపాడి వెడలి వచ్చి, యాలయప్రాసాదంబుమీఁద నిర్గమద్వారంబువలనికిం దృష్టి సారించి, పొంచి చూచుచుండెను. అప్పు డక్కలరవంబు లరుణోద యంబున, నెప్పటియట్ల సంచారార్థంబు మందమందగమనంబుల దిక్కుల కరుగ వెడలుడు, నాఁటితోఁ బావురపుసతికిం బతితోడి ఋణానుబంధంబు తీఱుటంజేసి, యయ్యణుజు, పోతుబకదారి నుక్కున ముక్కునం గఱచికొనిపోయి, నాఁటిభోనంబునకుం దానిఁ దొలి ముద్దఁగాఁ జేసికొని, యాప్యాయనంబుగ సావడియె. ఆకలరవాంగనయుఁ బులినోరికండ జాతిపడ్డట్లు చావునకుం దప్పి, దేవళంబుం దూఱె. ఎంతవారికిఁగాని, యాత్మకృతదోషఫలం బవశ్యభోక్తవ్యంబ కదా. కావున, బలవంతునితో నొంటమిఁగొంట దుర్మరణంబునకే కారణం బగును.

మఱియు నింతటిబల్లిదులకును వాక్సారుప్యంబు మేలుగాదు.

దానివలన సర్వకార్యంబులును విఫలంబులై చనును. గొడ్డంట నటి కిన తరువైన మరలఁ జిగిరించుంగాని, మాటల విఱిగిన మనసు తిన్నఁ బడ నేరదు. మున్ను వాగ్దోషంబునంగాదె యొకగర్దభంబు మర్దింపఁ బడియె. నీకాకథ వాక్రుచ్చేద నాలింపుము.

కరివురంబున విలాసుం డను రజకుం డొకండు గలఁడు. ఆమడి వేలు చేరువగ్రామమునుండి క్రొత్తగా నొకగాడిదను విలిచి తెచ్చి, దాని బలిపింపవలె ననుఁ తలంపునఁ జక్కనియుపాయం బొక్కండు వెదకి, పొడగాంచి, యీగాలిగానిమేన నొక్కవులితోలు వ్రేలం గప్పి యప్పుడప్పు డరణ్యప్రాంతసస్యక్షేత్రంబుల రాత్రులు త్రోలుచుండును. క్షేత్రరక్షకులును విభావరిం బులికళాసంబులోనిదాని దూరమునుండి విలోకించి, చిత్తమున వ్యాఘ్రు మను భ్రమ గప్పి, యప్పుడ భయోత్కంపంబున డాయ నోడి, యీడనిఁబాడుదురు. కాఁబట్టి నిరంత రాయముగా నిచ్చలుఁ బచ్చగందని పయిరు కడుపార దొరుకుచుంటం బట్టి, కటువాట మేసి పోసరించి, యీరాసభంబు యథేచ్ఛముగాఁ గ్రుమ్మరుచుండును. ఇట్టు కొంతకాలము కడచినపిమ్మట నొక్క నాఁడు, క్షేత్రస్వామి యొక్కఁడు ఱాగుండియవాఁడు తన పయిరు నిచ్చలుఁ బొలివోవుచుంటకు మనంబున దుఃఖించి, దూరము విచా రించి, యెట్టకేలకు మనంబు గట్టిపఱుచుకొని, నెట్టన సాహసించి, దుర్గమం బగు ప్రయత్నంబునఁ బొలంబు సొచ్చి, ధూసరకంబళంబు మియినిండఁ గప్పుకొని, యప్పాలంబునవలతఱి నొకవృక్షంబు క్రీనీడ నధిజ్యశరాసనుండయి కనుమోసములేక పొంచి కూర్చుండి యుండెను. అప్పు డెప్పటియలవాటుచొప్పున ఖరంబు చేను చొచ్చి, యచ్చేరువ బూదివన్నియగొంగళిలో నున్న పొలముకాఁవును వే మొక్కగర్ద భంబుగా వగచి, కాలపరిపాకం బగుటను వాని కభిముఖంబుగాఁ

గూయుచు డాయవచ్చెను. ఆకూత విని పొలముకాఁపు కలరూపు తెలిసి, దరహాసచంద్రికా సుందరవదనేందుండయి, "యీకిగ్గాడి గాడిదా యిన్నాళ్లును మాయందఱకన్నులను గప్పినది!" అని నిర్భయంబుగ డాయఁబోయి, ' యీబాలేయము నవలీల నొక్కకోలం గూలనేసి, కృతాంత దర్శనంబునకుం బుచ్చి, కృతకార్యుండయి చని నాటఁబట్టి కరను సుఖంపడియుండె.

కావునఁ బలుకు బ్రల్లద మెప్పుడుం దప్పక గొప్పయొప్పుమిఁ బుట్టించును. (శేయస్కామం డది యుడిగి, యడఁగి మడఁగి యుండ వలెను. అది యట్లుండె; తదనంతరవృత్తాంతంబు వినిపింపు మనిన, హంసంబునకు బకోటం బిట్లనియె.

అట్లు వాని పరుషభాషణంబులకు రోషించి యుద్ధసన్నద్ధుండ నయి నిలిచిన నన్ను వీక్షించి, యీపక్షు లిట్లనియె. "ఓరీ! స్వామి ద్రోహీ! యింటఁగుడిచి యింటివాసము లెన్నిక యిడిన వడువున, మాదేశమునఁ గ్రుమ్మరుచు మాస్వామినే యాక్షేపింపఁ జొచ్చితివి. కావున, నీవు సదోపధార్హుండవు; పాపకర్ముండవు; నీయెడ నించు కయిన దయఁ జూడఁదగునె? కుడిచి కూర్చుండి యుబుసుపోక, నోరి క్రొవ్వున నింత తెచ్చుకొంటివి. చేసికొన్న దనుభవింపకతీఱదు. మ మ్మెవరిఁగా జూచితివి? శౌర్యాలంకారుం డగు చిత్రవర్ణుని బంట్లను మ మ్మెఱుంగవే? ఇప్పు డెట్టును నీప్రాణంబులు పుచ్చుకొనక విడువము. నిమిష మడిచిపడకుండ నిలువుము. నీపడు బాములు చూచెదవు." అనుచుం గవిసి, దురాగ్రహాగ్రస్తంబులై యీఖగంబులు నఖరముఖ విదారణంబుల బహుతాడనమ్ములఁ ననున్ను నొంచి, మఱియు నిట్లనియె. మీరాజు మరాళంబు మిగుల మెత్తనివాఁడు. అట్టివానికి రాజ్యాధి కారపూజ్యత యొక్కడిది? సంతతహతముండైనవానిం గని, భృత్యులు

వెఱవక మెల్లిదంబుగఁ జూతురు. క్షమా తేజంబు లాయాయి మెడలఁ బ్రయోగించుట రాజధర్మంబు. అట్టిరాజే ప్రజానురంజకుం డగును. సంతత తేజుం డగుటయు ద్వేషంబు గాదు. తేజంబు కడుఁజూపిన వాని నతిక్రూరుగా భావించి, వానిపొత్తు నహిపొత్తుగా నెంతురు. కావున, నిలాపాలనంబుఁ బూనువాఁ డవసరోచితంబుగ క్షమా తేజంబులు రెండును వెలయించుచు, వీరశాంతాదిగుణంబుల, సరభసమాశ్రిత మధుకోశంబు చందంబున నధృష్యుండును నభిగమ్యుండును నయి చూపట్టవలెను. ఏకాంతమృదువగు వాఁడు కరస్థ మగు నర్థము నేని దక్కించుకొన సమర్థుండు గాఁడనఁ, బ్రజాపాలనదక్షుండయి రాజ్య భారంబు భరియింప నెట్లు శక్తుం డగును? అప్పులఁ బడియుండు తెలి పిట్టయా రాజనామంబుఁ దాల్చ నర్హుండు? దానిఁ బూనువాఁ డెంతటి వాఁడు కావలెను? అట్టి దుర్బలుని పాదసేవకుండవయి నీ వేమిభాగ్య మనుభవించితి వని, నిక్కంపు హితుండవుఁబోలె మా కీ వెడబుద్ధులు గఱపవచ్చితివి? లోకమున నెవ్వరైనఁ బ్రబలునిం జేపట్టుదురు! గాని దుర్బలునిపొంతలం బోనైన నొల్లరు. ఆశ్రయించిసను, ఫల చ్ఛాయాసమన్వితం బగు మహావృక్షమునే యాశ్రయింపవలెను. ఒకవేళ దైవికంబుగ ఫలంబులు లభింపకపోయినను, ననివార్యంబగు దానినీడ నేఁడు మాపనోపును? సింహప్రసాదంబున నజంబును వనం బున నిర్భయంబుగఁ జరియించుటఁ గాన మె? అట్లు ప్రబలులం జేరినలాభువాన్పదునకును గౌరవం బబ్బును? ద్వేష్యులును సర్వజ న్మాన్య లగుదురు; ఇఁక నార్యులు ప్రశంసనీయు లగుదురని యూగ్గ డింప నేల? ఎప్పుడును హీనుని మాత్రము చేరరాదు. చేరినచో, మునుగల గౌరవము సైతము పోవును. శౌండినికరంబున నున్న పాల మంత నేని కల్లుముంతయే యందురు. నీచసేవ కేవలము శ్వవృత్తి

వడిన యాయాసం బెల్ల నిష్ఫలం బగుటయకాక, దాన మనోభీప్సితం బెప్పుడును నఫలంబు కాదు. హీనమానసపదాశ్రయులకుఁ గొన్ని యవ నరంబుల దొనంగులును బొసంగును; అట్టివారి జన్మంబు లెప్పుడును దుఃఖభాజనంబు లగును. ఎప్పుడైనఁ దప్పిదారి, యించుక యభీష్టఫల సిద్ధి యయిన నది తుదముట్టనేరదు. అల్పజలాశయంబుఁ జేరిన విసా రంబునట్టుల, యల్పు నాశ్రయించువాఁడును వానితోడన తీఱును; అట్లు తీరకమున్నను, నాగండకమున కెట్లు వానికి నట్లు గండములు మెండుగా నుండును. అల్పులతో క్షణమాత్రంబును నిలువను, సం భాషింపను, బోలదు. సజ్జనసాంగత్యంబున సర్వార్థసిద్ధులంబోలె, దుర్జనసంగమంబున సకలానర్థములును ప్రాప్తము లగును. ఆధారా ధేయభావంబునంజేసి యాదర్శంబున ద్విరదం బన్నువయయి కనుపట్టు నటుల, యలంతులఁ జేరినవలంతులును నలంతులయి కానఁబడుదురు. కాన, హీనసేవ యావంతయుఁ గర్తవ్యంబుగాదు. పొట్టకయి యట్టి హీనుని కాళ్ళుపట్టుకొని, కష్టవుజీవనము జీవించుటకంటె, మానవంతు నకు నిశ్చంచలం బగు నిశ్చయంబున నడవిలో నుండి, వన్యాహారం బుల సుఖముగాఁ గాలము గడపుట సర్వలోక సమ్మత మైన పక్షము; లేదా, కీర్తిధను నొక్కనిపాదభక్తుఁడ నని పేరుపెట్టుకొని, తక్కువ పాటులేక బ్రతుకుట యంతకంటె నుత్తమపక్షము. మఱియు లోక ములో రాజునాశ్రయించుట, కష్టకాలంబులఁ దమ్మాతం డపాయం బులవలనం బాపి కాపాడునని కదా? అట్టిరక్షణ మా రాజువలనం గలుగకపోయెనా, వానితోడి ప్రయోజన మేమి? అట్టి వరివృధుండు లేకపోయినను, వ్యపదేశంబున నైన బ్రతుకవచ్చును. తొల్లి శశ మ్మలు వ్యపదేశంబునంగాదే, యభిమతార్థసిద్ధిఁ బడసి నితాంత సౌఖ్యం బనుభవించె? ఆకథ సవిస్తరముగా వినిపించెదము వినుము.

పూర్వ మొకప్పు డవగ్రహనిగ్రహంబు సంభవించి, జలాశ యంబు లెల్ల జలశూన్యంబు లైన, దైన్యంబున గహానంబునం గల మతంగజనివహంబులు యూథనాథు పాలికిం బోయి, నకరుణంబుగా నిట్లనియె. "స్వామీ! యేమని చెప్పుదుము? ఈనికటంబున మే మజస్రంబును స్నానపానంబులు నేయుతటిని, యీయేటివఱవుచే నిదాఘుంబగుడుఁ బ్రబలాతపతాపంబున జంబాలమాత్రావశిష్టం బయ్యె. అల్ప కాసారంబులగతి తడవ నేల? తావకచరణసేవకుల ముగాఁ గాఁజాలియు, ననతిక్రమణీయుం బగుమాయభాగ్యంబుకతం బునఁ దృష్ణాతిరేకంబున మాకిట్లాకులపాటు పాటిలవలసిన కాలంబు సంప్రాప్తమయ్యెను. ఇట్టిదుష్కాలంబు ప్రాప్తమగునని కల నేనిం దలఁచి యెఱుంగము. ఏకాలమున నేమివచ్చునో యెవ్వఁ డెఱుఁగును? ఆహా! కాలంబుఁ బోలుదానిఁ, గాలంబుఁ దక్క నింకొక్క దానిం గానము గదా? ఇత్తఱి మమ్ము భవదీయప్రసాదోపజీవుల నీపిపాసం గాసిలకుండ నేది, యీబారిఁ గడవఁబెట్ట దేవరచరణంబులుదక్క నన్యంబు శరణంబుఁ గానము. మేమందఱము మామనఃపరితాపంబు నివేదించి, దేవరకృప నాశ్రయింప వచ్చితిమి. వేళంబ దీనికిం దగిన నదుపాయంబు చింతింప వలయు. అనన్యగతికులమగు మమ్మింక మించినం దేల్చినను దేవర దేభారము." అని యూరకున్న, యూథనాథ కుండును సంక్షుభితం బగుహృదయంబునఁ, గార్యభారమగ్నుండై కొండొకవడిచింతించి, యెుక్కజంఘాలునింబిలిచి, నీవిప్పుడతిత్వరితగతిం బోయి, "యీకుఱంగల నెండైన మధురశంబరపూరితం బగుసరో వరం బారసి, మాకడనున్నట్ల చనుదెమ్ము. అట్లు నేయఁబ్రొలుమాలి యూరకరాక, నీయనువర్గంబులపోక నుమీ." అని పంచిన, వాఁడును వినయనయ భయంబులు హృదయంబునం గదుర, జేనియానతిని శిరసా

వహించి తత్క్షణంబునఁ గదలి మనోవేగముతో నేగి, విపినం బెల్ల వెదకి, తుద కచ్చేరువ నొక్కమడువు పొడగని, హర్షోత్కర్షంబునఁ బటు తెంచి, యూథపతి కిట్లనియె. "దేవా! నేవకుం డీవనమధ్యంబున నిర్మలజలపూర్ణ హ్రదం బొక్కటిచూచి, యిదిగో సఫలప్రయత్నుఁడయి వచ్చె; ఇంక భృత్యులతోడఁ గూడి దేవర విచ్చేయ నవసరంబు. మనవారెల్ల నాప్యాయనంబుగఁ బానీయంబులు గ్రోలఁ గాంచిరి." అన; సామజస్వామియు, గడుంబ్రమోదించి, యతని నభినందించి, గజవ్రజంబుల వెంటఁబెట్టుకొని మడుపుకడకు నడచి, జలమ్ముల డిగి, తోయమ్ము లాకంఠమ్ముగఁ గ్రోలి, కంఠదఘ్నమ్ము లగునంబువులం దేలి, యోలలాడం దొడంగెను. అప్పుడు, యాతాయాతగజవ్రాత పదతలాఘాతమ్ములం జదిసి సమసినశశకవినరమ్ముల నాలోకించి, శోకానలసంతప్తస్వాంతుండయి, శశకేంద్రునిమంత్రి రోమకర్ణుఁడు బెగ్గలఁబగ్గలింపరోజుచుఁ బారు తెంచి, నిజాధీశ్వరునిశిలీముఖునిఁ గాంచి, వినయవినమితోత్తమాంగుండయి నమస్కరించి, తమవారికిఁ బాటిల్లిన ముప్పుచెప్పఁబోయి, డగ్గుత్తికపడి, కొంతవడియూరకుండి, యెట్టకేలకు నెలుంగు తెచ్చుకొనియిట్లనియె "దేవరవారుకంటిరో కానరోకాని, గజ విసరములచే మనశశములకుం బ్రళయము ప్రాప్త మయ్యెను.— అనుడు, నాదారుణ భాషణము శ్రవణములం దూఱి హృదయ దారణము గావింపఁ, గరగుప్తకర్ణుండై 'హరిహరీ' యని కన్నులు మూసికొని, కొంతసేపు చిత్రాయమానగాత్రుండయి తేఱ్ఱిపడి యుండి, మంత్రిప్రయత్నంబునం దెలిసి, దీర్ఘనిశ్వాసపురస్సరముగా నలుదెసలుం జూచి, యల్లన లేచివచ్చి, కార్యచింతాపరత్వమున నమాత్యులంగని శిలీముఖుండిట్లనియె. "మంత్రులారా! యీ యేఁడు వేసవివేఁడిమిఁ బోఁడిమిచెడి, యెల్లవంకలవంక లింకంబాఱిన, మీఱిన

దగ వెల్లిదమున నుల్లములు పల్లటిల్ల, వదనములు వఱువట్లువట్ట, వేదండతండములు నడగొండపిండువడువున వెడలి, పుడమి యీనిన చందమున నెల్లెడలఁ దామ యయి, మెండుకొని యున్నవి. ఇప్పుడు వానియడుగుల యడుగునం బడి మడిసిన మనచెవులపిల్లులసుద్ది వినిన యప్పటినుండి నాయుల్లము పెల్లు తల్లడిల్లుచున్నది. పిపాసాపరాయత్త చిత్తము లగు నీమత్తదంతావళసంతానముల నశ్రాంతము నంబుపానార్థము వచ్చుచుఁ బోవుచు నుండ నిచ్చితిమేని, యచిరకాలమున మన కులంబెల్లఁ బ్రాణములు గోలు వోయి, నామమాత్రావశేషం బయి యుండవలసి వచ్చును. ఇప్పటికే కించిదూనముగాఁ బొలిసి, పారావారమ్ముఁ బురుడించుబలంగమ్ము గోష్పదాకృతి యయ్యె. ఇంకఁ దడసినఁ, గార్యంబు తప్పును. బలహీనులము కావున, మనకు వాని మాఱుకొనుపాటిబలిమిలేదు. ఏమిసేయువారము? ఎటయిన నీవారణం బులబారికిం దగు ప్రతీకారంబు సత్వరంబుగ నారయుం జను." అన, శోకవిస్మయపరీతస్వాంతులయి యెద్దియుం దోఁచక, మంత్రులన్యోన్య ముఖావలోకనంబులు సేయుచు, మన కియ్యెడ దైవంబకాని వేఱొండు శరణంబు లేదని వగగూరి, మొగంబులు తెలివితప్పి యుండ, నాదర వినయసంభ్రమంబులు ముప్పిరిగొన నాతతి విజయుం డను ముసలి కుందేలు శిలీముఖున కిట్లనియె. "ఓమహాప్రభూ! దేవరదివ్యచిత్తం బున నిది యొకపనిగా నెంచి చింతింపవలదు. దేవరదయ గలుగ, నా కీయమిత్రుల నోర్చు నింతపని? లోకంబునఁ బ్రజ్ఞాసాధ్యంబులు కాని కార్యంబు లేవియు లేవు. దేహబలంబు లేనివాఁడయ్యు, శ్రేముషీ మంతుం డెంతఘనకార్యంబు నైనఁ దృణప్రాయంబుగ నిర్వహింప సమర్థుండై యుండును. దేశకాలజ్ఞులమై యనారతము దేవరమోల గంబునం గొలువు సేయుమముబోఁటివారి కీనాగమ్ములఁ దొలఁగఁ

ద్రోలుట యొకదుష్కరము గాదు. స్వామి కనుగిటిపినం జాలు వలినవారినియోగబలంబున, నశ్రమంబున నెంతటికార్యంబు నైన ననివార్యంబుగా సాధించుకొని, నీలెంకలలెంక రాగలండు." అని యనిపించుకొని చనువాడయి యాజ్ఞయే యనఁ గుండేళ్ళరాయం డును నాతనిఁ బ్రీతిశీతలంబగు నాలోకనంబునం జూచుచు, నంగీకార పిశునమందహాసనకందళసుందరం బగు మొగంబు వంకించి, "సరగ నరిగి కర్జంబు సఫలంబు చేసికొని రమ్ము. నీతలంపునకు దైవం బను కూలం బయ్యెడు" మని దీవించిన, 'మహాప్రసాదం' బని వనివిని, హార్దంబున నిట్లు చింతించెను.—ఆదంతిరాజు మహాజంతువు; నేను గడు నల్పజంతువను. ఆగౌరుం డారసించి నా కెట్లు మాటలాడఁ దలకూడును? తలకూడెఁబో, కార్యసంఘటనం బెట్లు సాధ్యమగును? నే నందనిప్రాణనిపండ్లు గోయం దలపెట్టితి. నాకోరిక యీడేఱునో యీడేఱదో గదా? — అని చింతాడోలాయమానమానసుండయి, కడకుఁ బరమోపాయంబొక్కటి బుద్ధికిం దవిలినఁ జక్కఁగాఁ బరికించి, యది మనసునకు సరిపడ్డ తరువాతఁ గదలిపోయి, 'స్పృశించుచునె ద్వీపంబును, నాఘ్రాణించుచునె యురగంబును, బాలించుచునె నృపాలుండును, నవ్వుచునె దుర్జనుండును, హింసింతు' రని విచక్షణులు పలుకుదురు.—కాన, నేనీనగాగ్ర మెక్కి కరిరాజుతో ముచ్చటించెద నని నిశ్చయించి, వేగ నాగిరిశృంగం బధిరోహించి, రాగమనంబు ప్రతీక్షించుచుండె. ఆపగిదిం గొంతతడవాతనిరాక కెదురుచూచుచుండి, దంతినాయకునితో మడువున కేతెంచి పానీయంబులు గ్రోలి మరల యిరవున కరుగుచున్నవానితోఁ గొండ కొమ్మున నుండి యిట్లనియె. 'ఓ మాతంగవుంగవా! నీకు సమస్తంబును శస్తంబగుఁగాక! ముహూర్తమాత్రంబు నిలిచి, నావచనంబులు విని పొమ్ము"

నావిని యాపలుగొమ్మల మెగముల్మలతేఁడు మొగమ్మెత్తి చూచి, "నీవెవ్వఁడవు? మాతోడ నేమికార్యము గలిగి మాటలాడ వచ్చితివి? కాలవిలంబనంబు సేయక నీయుదంతం బంతయు నొకటి రెండు మాటల నుడువుము" అనిన, విజయుం డిట్లనియె. "ఎవ్వనిపేరు విన్న నహిత చక్రంబులు నిచ్చనుఁ దల్లడిల్లుచుండు, నాకు వలయైకాధినాథుండగు రాజుదూతను నేను; దూత యయినవాఁడు విరోధి యనిరోధ క్రోధంబునఁ గృపాణపాణి యయి ప్రాణంబులుగొన గమకించుచున్న నైనఁ, ద్రాసంబు వాసివాయోడక యథార్థంబె వచియింప వలయుం గాన, నానిశానాథుండు తానుగ నీతోడ నాడుమని నాకుం గఱపి వృత్తెంచిన వార్తలు కొన్నిగలవు: వచించెద. వాని సావధానముతో నవధరింపుము.—మదీయాజ్ఞాపరిపాలితం బగుటంజేసి, యీనరోవరం బెట్టి భీమబలులును నాయనుమతంబు వడయక కదియ శంకింతురు. మీరు నన్నుఁ బూరికింగొనక, నేటిప్రే పోట లేక యీకొలను సొచ్చి, కలగుండు వటుచితిరి. అంతియకాక, పథంబున నస్మదీయ పాదభక్తుల శశంబులన నేకంబులరూపుమాపి, నాయెడ మహాపరాధంబుగావించితిరి. బుద్ధిగలిగి బ్రదుకఁదలంతురేని, యీక్షణంబ నుడుంగువిడిచియొండుకడకు నడచునది. ఇది మొదలెన్నండును నాముదలఁగొనక కొలఁకుఁ జొరకుండు నది. ఎటిఁగి యెఱుఁగములంజేసి, మీరింతదనుకంజేసిన నేరంబు సైరించితి. ముందు నాపనుపుచేసి, మొక్కలంబు మాని ప్రాణంబులు గాచి కొండు. అట్లుగాక యింకను మదాంధకారంబునఁ గన్నుగానక మదీ యాజ్ఞోల్లంఘనంబుఁ గావింపఁ బాలుపడుదురేని, మిమ్మందఱి నస్మ దీయప్రతాపానలంబున కొక్కటఁ బూర్ణాహుతిఁ జేసెద. మీఁద మీకుంబోలినగతిఁ జూచుకొండు.—అని రోషాతిభీషణుండయి, సంవర్త సమయభీషణ హుతాశనకీలపోలిక మండిపడుచున్న వాఁడు. కాలాతి

పాతంబుగాకుండఁ, బరమకృపానిరతుం డగు హిమకరుని శరణుసొచ్చి, తదనుగ్రహంబునకు భాజనంబ వగుము. ఆతనియానతి మన కందఱికు నవిలంఘనీయము. మీకుఁ ద్రౌణములు చేఁ దగునేని, యాతుసయాజ్ఞ సన్యథాకరించునది.'' అనుడు, దంభోళిపాతతుల్యంబు లగు నావాక్య ముల హృదయంబు వగిలి, బెగడు గదిరి, కంపంబు సర్వాంగీణంబై యెలయ, వివశం బగు డెందంబు నెట్టకేలకు నూలుకొల్పి, గద్గదిక నెలుంగు దగులువడఁ గుంజరపతి చెప్పులపోతుం గని యిట్లనియె. "క్షుద్రులము మే మీమహాప్రభుని కోపంబున కెంతవారము! తనయు లెం దయిన బుద్ధిదోషమున నెమరుపడి యాజ్ఞ మిగిలినఁ, దండ్రి యది మనసునఁ బెట్టునే? ఆశీతాంశునకు బుధుఁడొకఁడును మే మొకరముఁ గాము. మే మజ్ఞానకృతంబున మి మ్మాయాసపెట్టి కడునవజ్ఞఁ జేసితిమి. మాచేసినయావ్యతిక్రమమ్ము క్షమియింప నీవే మామారుగా కృపాకరుం ప్రార్థింపుము. ముందెప్పుడు నీతటాకంబు చెంతలం జేరము. దీనిం ద్రౌణభయానునం బలుకు కార్యవశంపు మాటనుగాఁ బాటింపఁబోకుము. ఏనిన్ని మాటలవాఁడంగాను. ఇంక నీపలుకుఁ ద్రోచిన, నీపాదములకుం దప్పినవార మగుదుము. మీరాజు సమ్ముఖమ్మున మామీఁద దయ పుట్టునట్టుగా నెట్టు ప్రసంగించెదవో నీదేభారము. మదీయవిజ్ఞాపనము విని వాజ్ఞాత్రంబున నీవు మాకీ యుపకారము తప్పక చేయవలయును. మఱువకుమీ పోయివత్తుము.'' అనిన, శశకం బిట్లనియె. "ఓయూథనాథా! మానాథుం డగు సుధాం శుండు సన్మార్గవర్తి; దయాసుధానిధి; శరణాగతభరణైకబిరుదాం కుండు; భక్తు లెంతలెంతలు తప్పులు చేసినను, ననుతాప పడిరేని నెరను లెన్నిక మన్నించును. తలం కొందకుము. నీవారును నీవును గావించిన యవగడంబు లెల్ల నిస్సంశయముగా లోఁగొనును. ఈ

సరోలలామం బాయన పేరనె చంద్రసరస్సునాఁ బరఁగు చున్నది. మ మ్మాతండు దీనికిం గావలిపెట్ట, నిచ్చోట నున్నవారము. మే మందఱ మాయనభృత్యులము. ఆదయాళుండు మ మ్మనవరతము సహిఁప్రాణంబులుగాఁ జూచుకొని, పుత్రవాత్సల్యంబునం బ్రోచు చుండును. శశంబులం గలిగి యుంటనే, యాశశధరునకు శశి యను నామము జగమునఁ బ్రథితం బయ్యె. ఇప్పు డాతం డతిదూరం బగు గగనపథంబున వర్తించు చుండును. మన కాప్రదేశంబు బహుతర ప్రయాసగమ్యంబు. ఆతఁ డెడపదడవ నీమడుగునకు వచ్చి చూచి పోవుచుండును. ఈనిశాసమయమున నీసరోవరంబునకు విజయము చేయఁ గలవాఁడు. సమ్ముఖమున రాయబార మేటికి? అప్పు డాతని పాదసందర్శనంబు చేసికొని, మాయపరాధంబు సర్వంబును నివేదించి తదీయానుగ్రహంబు వడసి, చనుటమంచిది. అందాఁక నిందు నిలు వుము." అని, యొడఁబఱిచి, ప్రొద్దు వాలినపిమ్మట గజరాజును వెంటఁ బెట్టుకొనిపోయి, సంజవేళకు జలాశయంబు జేరి, కొలనిజలంబుల ననిలవశంబునం గదలునరుణాంబగు నిశాకరప్రతిబింబంబుఁ జూపి, యిట్లనియె. "అదె చూడుము. కుముదబాంధవుండు క్రోధరసం బుట్టి పడ నెట్లు కోపప్రకంపమానాంగుఁ డయి యున్నవాఁడో. ఇది నీవు సంభాషింప నవసరంబుగాదు. కినుక తీఱిన వెనుక సమయము చూచి, నీచందం బీచందమామకునిన్నవించి, నీదెసఁబ్రసన్నహృదయుం గావించెద. ఇక్కడ నీవు మఱేమియుఁ ద్రవ్వక, గ్రక్కున మొక్కి నీయిక్కకుంజనుము. కడమపని నామీఁద విడువుము." అని సము చితముగాఁ బలికి యేనుఁగును మ్రొక్కించి వీడుకొలిపి, విజయుం డును దనజన్మంబు సఫలంబయ్యెఁగదాయని యులరి, వికసన్ముఖుం డయి చని, శిలీముఖమునకు నమస్కరింపుడుఁ, గార్యనివేదనం బొన

రించునంతకు మానసంబు పట్టఁజాలక, విస్మయసూచనలోచనరోచులు నిట్టవొడువ నిట్టనియె. "కార్యము గోట మీటుకొనివచ్చుట నీముఖ వికాసంబె చెప్పక చెప్పుచున్నది. అమోఘసంకల్పుండవు? నీతలం పెన్నఁడయినఁ బొల్లగునే? నీయంతటిహితుండు కలుగంబట్టికదా, నేఁడు మే మందఱము మృత్యువక్త్రగతులముగాక, బ్రతుకు గంటిమి. నీఋణంబు మేము పదివేలజన్మంబు లెత్తి యయిన నీఁగఁగలమె?" అని మఱియు బహువిధంబుల నాతనినిన్నాణంబుఁ బ్రశంసించుచుండ, రాజున కభిముఖుం డయి విజయుండు సవినయంబుగా నిట్లనియె. "ఆశ్రితపక్షముచే దేవర యిట్లానతిచ్చెదరు, గాని నిక్కంబునకు దేవరప్రశంససేయఁ దగినంత శక్తియుక్తుండను గాను. అనామకుల మగుచూదృశులకును, ప్రశంసకు నెంతదూరము? ఒకవేళ మాకట్టి శక్తిగలిగిన, నదియు మీసేవవలననేకదా? దేవరయాజ్ఞ కన్యథాత్వం బేలగలుగును? కార్యంబు పండించుకొని వచ్చితి." అని తనవృత్తాంతం బాద్యంతంబును విజ్ఞాపనం బొనరించి, పారితోషికంబు వడసి, విజయుం డపరిమిత సంతోషంబునం బొదలియుండె. అది దొరంకొని లంబ కర్ణంబులెల్ల నతివేల సమ్మదమ్మునం దేలుచు, సుఖంబు పడియుండె. కావున, రాజు లేకున్నను నెపమ్మా వెట్టియయిన సుఖింపవచ్చును.

అనుడుఁ దదీయ వచనశ్రవణానంతరంబున నుద్దీపితం బగు పాటోపంబు లోలోపలన యడంచుకొనుచు, మనోవికారం బేమియుఁ దోఁపనీక, నేనిట్లంటిని. "ఆర్యజనమిత్రుండగు నా హంసకుల సవిత్రుండు వీరాధివీరుండు; నిజప్రతాపదీపాంకురనిరస్తసమస్తారివీర దుర్వారగర్వాంధకారుండు; విక్రమాఢ్యు నొరు నాతనిఁ జెప్పి చెప్పవలెను; పితృకీర్తనం బాయన యున్న యూరనైన లేదు; ఆతం డించుక కాలు గదిపినేని, భువనంబులెల్ల నల్లలనాడుచుండును. ఉబుసుపోకకు

మీ రూరక పుట్టనిబొొట్టిలకుం బేళ్ళు పెట్టిదరుగాని, యీతండు నలుపో తెలుపో, యెఱుంగరు. భవాదృశులు ప్రాజ్ఞులే యిట్లు భావ్యం బులు కానిపలుకులు నలుకుచుండ, నింక నజ్ఞులగతి యేమనవచ్చును? పరాక్రమగుణంబున నాతం డొక్క కర్పూరద్వీపంబునకె కాదు, త్రిలోకాధిపత్యమునకైనం దగినవాఁడు. ఇంక నాతనిం బేరుగ్రుచ్చి యేమైన నన్న, నపచారం బగును. మీ ప్రల్లదంబు లుడిగి యూర కుండుండు." అన, నాయుండజంబులు మండిపడి, నన్నుఁ దెగటార్పఁ గృతనిశ్చయంబు లయి, తమ ప్రేని యెఱుకమీఁద మఱి పరిమార్చు తలంపునఁ బెడ ప్రెక్కలు విఱిచికట్టి, కొట్టి కంఠగతప్రాణుం గావించి, హతదంష్ట్రిమహాభుజంగంబుభంగి రోజుచున్న నన్నుఁ బ్రసభాచరణం బున దుష్టభూయిష్ఠం బగుసభాస్థలికిం గొనిపోయి, తమ రాజు ముందఱఁ బెట్టి, సభాస్తారు లందఱు విన నిట్లనియె. "స్వామీ! యేము భవదా జ్ఞాధీనకృత్యులముగాన, నెఱిఁగినయర్థము చెప్పక కప్పిపుచ్చి మాయం తన యొకటి చేయుట భృత్యధర్మంబు గాదని, యీమత్తునివృత్తంబు దేవరకు నివేదించి భవదుక్తమార్గంబున నడవఁ జనుదెంచితిమి. ఈమొక్కలీఁడు, సమయుటకు సమయంబై, యుచితానుచితవివేకంబు లేక, ధర్మస్వరూపుల రగుదేవరయెడఁ గొడిమలు గడియింపఁ దొడఁగినవాఁడు. "అన్యదోషకారి తనకిల్బిషంబునఁ దానెకాలిపోవు; చచ్చిన వానిఁ జంపనేల? యనరాదు ఒకప్పుడు దైవంబును దోసకారులకె తోడు చూవును. ఈమూర్ఖబకంబు మనసీమం దిరుగుచుఁ దేకువ మాలి, యేలినవారిపాదంబులనె యధిక్షేపించుచుఁ, బలుకరానిపలుకు లెల్లం బలికెఁ. కావున, నీబకాధముం డవశ్యవధ్యుం డయ్యెను. కలహ శీలుండగు నీతనిఁబొలియింప మేము సంజాతనిశ్చయులమై యున్న

వారము. ముక్కు-పొడువఁగా లేనిముంగోప మదియెన్నటికి? వీనియెడ లేశంబును దయ తలంపవలదు. ఆజ్ఞయైన వీనిఁ గడతేర్చెదము.' అని యన్నియు నేకవాక్యతగాఁ బలికిన నాలించి, వాని వారించి, భయాధీనమానసుండనై మాఱుమొగముపెట్టి వజవజ వడఁకుచున్న నన్నుఁ గరుణాతరంగితాపాంగుండై కాంచుచు, చిత్రపర్ణుండు 'వీఁ డెవఁడు? ఏ దేశమునుండి వచ్చుచున్నవాఁడు? తెలుపుఁడు.' అన, నవియు 'హిరణ్యగర్భుండను రాజహంసంబు ననుచరుండఁట; కర్పూరద్వీపమునుండి వచ్చినవాఁడు' అని విన్నవించుసమయంబునఁ, బరిసరవర్తి యగునా శిఖండిప్రకాండమునిమంత్రి దూరదర్శియునుగ్రద్ద ననున్నపలక్షించి, 'మీ యధ్యక్షుని సమక్షంబున ముఖ్యాత్మూత్యుఁ డేవాఁడు?' అని యడిగిన, నేనిట్లు చెప్పితిని. "వివిధవిద్యావిశారదుండగు సర్వజ్ఞనామక చక్రవాకప్రశస్తుండు. ఆతండునర్వధర్మములను మూలమట్టుగనెఱుంగును; సత్య శౌచాది సద్గుణ గరిష్ఠుండు; స్వదేశసంభవుండును, ఉపధాశుచియు, అఖిలార్థసంవేదియు, అభ్యస్తసమస్త వ్యవహారుండును, సుప్రసిద్ధుండును, సర్వజనసమ్మతుండును, ధైర్య శౌర్య ధుర్యుండును, ప్రతిభావంతుండును, ధర్మాధర్మ విశారదుండును, స్వామికార్య తత్పరుండును, నగువాఁడు మంత్రిపదంబున కర్హుఁ డని నీతిశాస్త్ర వేత్తలు చెప్పుదురు. దైవానుగ్రహంబున నీసకలసద్గుణములును నాజక్కవదొరయందుఁ బొందువడియున్నవి.' అని చెప్పునవసరంబున, నాయాస్థానంబుననున్న యరుణముఖుం డనుకీరంబు మయూరరాజున కిట్లనియె. "దేవా! యవధరింపుము. కర్పూరద్వీప ప్రముఖాంతరీపంబులెల్ల నీజంబూద్వీపాంతర్గతలఘుద్వీపంబులె కావున, నాకప్పురపు దీవియు దేవరవారిద యయియుండును. దాన, నామానసౌకస్వామియు నానుగాదనక స్వామియానకు లోనై మెలఁగఁదగినవాఁడు. నేఁ

డాదిగా నేఁడేఁడును దేవర కరివెట్ట నాజ్ఞాపింవ, హిరణ్యగర్భునిపాలి కొక్కవేగరిని వేగఁ బుచ్చుట ప్రధానానుష్ఠేయమైన కార్యము. వీతిహోత్రుండు కాష్ఠంబులఁ దృప్తి పొందనిచందంబున, భూకాంతుండు రాజ్యంబునఁ దనివిననక యుండవలెను. అనంతుష్టుం డగు భూసురునట్లు, సంతుష్టుండగు పార్థివుండును జెడును. కావున, మహీకాంతుండు సంతతోత్సాహవంతుండై, యార్జవంబునంగాని, యనార్జవంబునంగాని, దుర్జయులగువగఱ నిర్జింపవలయును. అంతియగాక, వేఱొక్క ధర్మనూత్నతగలదు; సావధానమతివై యాకర్ణింపుము. 'రాజ్యంబు వీరభోజ్యంబు' అని ధర్మశాస్త్రమర్మపారగులు వచింతురు. కాన, సముచితసైన్యసమన్వితులరై కదలి, దేవర చేవ మెయి నాదీవి నావరించుట యర్వాకృత్యము. అతండు మంచిమాటలం జక్కఁబడెనేని మేలయ్యెడు. అట్లుగాక, కాదు కూడదని దేవర పలుకు నేయక యవధీరణము చేసెనేనిఁ దత్పలం బాతండు చేసేతం గుడువఁగలాఁడు. మదీయ ప్రార్థనాభంగంబు నేయక, యొకదూతం బనిచి యెదిరిహృదయం బెఱుంగుట యపరిహార్యకార్యంబు.' అనిన వికాసహాస భాసురాననుండై, చంద్రకీంద్రుండును. "అవు; అది కార్యంబు" అని తలయూఁచె. ఔరా; 'రాజ్యమదాంధుండును, బాలుండును, ధనగర్వితుఁడును, నున్మదుండును, శక్యాశక్యవిచారంబు నేయక యలభ్యంబుల లభ్యంబులఁగాఁ దలంతు' రనుకోవిదులవలు కుల కేల యన్యథాత్వంబు గలుగును? రాజ్యలోభంబెకదా, యీ దుర్విచారంబులకెల్ల మూలంబు. కోటరస్థానలంబు కుజంబుంబోలె, హృదయస్థతృష్ణానలంబు మనుజు దగ్ధంబుచేయును. ఆశయే సర్వానర్థంబులకు నాకరంబు. అట్టియాశను దిగనాడి, ప్రాప్తలాభముదితహృదయుండై యుండువాఁడె కృతార్థతముండు. అప్పుడు దేవర

యక్షీణ రణదక్షతావిశేషంబు తలంచి, నాకువారుతనువు లొల్లరొకో యనుబుద్ధి జనించె. అది యుండ నిండు. ఆ విషోప మంబు లగు దుష్టాలాపంబులు మనస్తాపంబు సేయ, నన్ను నేన యుపశమించుకొని, రాజవంక మరలి "నే నొక్కటి విన్నవిం చెద; కోపంబు లేకుగదా' యనిహెచ్చరించి. యీయనచే లేదని పించుకొని, మితహితోక్తుల నిట్లంటిని. "లోకంబున నెంతైన నొరుల సొమ్ములు రమ్మన్న వచ్చునె? వీల, యఘటమానంబగు కార్యంబునందు, నిరర్థకప్రయాసంబు వడియెనరు? చెప్పెడివా రొక వేళఁ జెప్పినను, వినెడువారికైన వివేక ముండవలెనుగదా! అట్లుగాక, 'దున్న యీనినదన, దూడను గట్టుమన్న' మతిపస యొక్కటే రచ్చ కెక్కంగాని, దాన నభిమతకార్యకరణంబు చేకూఱనేరదు. అఖిల విదుండవు; నీవెఱుంగనిధర్మాధర్మంబులు గలవే? దుర్దాంతరివ్రస్ఫురణ హారణపరిణతుం డగుహిరణ్యగర్భుండు, వారువీరుంబోలెనస దనితలంప వలదు. విక్రమంబున నాతం డతిలోకుం డని స్మరణకుఁ దెచ్చుకొని, పిమ్మట నొక్కత్రోవ త్రొక్కుము. కాలనియోగప్రేరితుండై, నిజ జీవితనిస్పృహత్వంబునఁ గడుపూఁదఁదీఱఁ బ్రబేలినయంతనె రాజ్యంబు రాఁబోదు. మదిమదినుండి, యేల నిర్మిత్తంబ చెట్టుగొట్టి పై వేసి కొనెదరు? తదీయప్రభావం బెంతవారికి నపరిభావ్యంబు. మీమీ పంతంబు లెల్లఁ దదీయభ్రూభంగపర్యంతంబులుగాని, యీమీఁదం జెల్లవు. ఆతనికడవారును నుగ్రరణశోవిదులు; మీరుగర్వమానంబు మాని, మాయెడయనిం గడవ నాడక, ప్రాణపరిత్రాణంబు చేసి కొండు. లోకంబున వచనమాత్రంబునఁ యాధిపత్యంబు సిద్ధించు నేని, మత్ప్రభుం డగుహిరణ్యగర్భునకును నీనేరెడుదీవియందు స్వామ్యంబు గలదనవచ్చును. ఈ చప్పిడిమాటలతోడ నేమి ప్రయో

జనము; ఈచాలెడువారికెల్ల నోరికి మాఱు లేదుగనుక, నేలినవారి మెఱమెచ్చునకె యోలగంబున వలసినట్లెల్ల పదరవచ్చుంగాని, తమ దుర్వ్యవసాయంబునఁ గార్యపాకంబు తప్పి, స్వామి కొకఁడయొప్పమి వచ్చినప్పుడు దానికిం దగుప్రతీకారంబుఁ గానక, విస్మయపరీతచేత స్కుఁడై మిన్నుచూచుటదక్క నొక్కటి శక్యంబుగాదు. చిత్రవర్ణునకు మాకర్ప్పారద్వీపమునఁ బ్రాజ్యరాజ్యాధికారంబు గలదో, హిరణ్య గర్భునకు మీతోలుదీవిని నెఱిదొరతనంబు గలదో, యెట్లు నిర్ణయింప నగును;" అనినఁ జిఱునవ్వునవ్వి యవ్విషధరభుగ్వల్లభుం డిట్లనియె. "త్వరయేల; యుద్ధంబుననె యెల్లయర్థంబులును నిర్ధారణంబులగును. ఇప్పుడుపోయి, నీయేలిక నాలంబున కాయితంబు చేయుము. ఇదె నీతోడ మాదూతుఁడు నేతెంచెడు, క్షణమాత్రంబు నిలువుము." అని పలికి, మంత్రిముగంబు చూచి యిట్లనియె. "మంత్రివరా! మన కిపు డొకదూతకార్యంబు ప్రభూతం బయినది. దక్షతయుఁ, గార్య వాదిత్వంబును, బ్రగల్భతయుఁ, బరమర్మజ్ఞతయు, సద్వచోగారవం బును, గలవాఁడు సందేశహారకృత్యంబున కర్హుండౌఁడు. హిరణ్య గర్భునియొద్ద కీకొక్కిరతోడఁగూడఁ బనుప, మనవారిలో నేరుపరి నొకఁడనిఁ బేరుకొమ్ము," అనిన శుకంబు మొకంబు చూపి, దూర దర్శి యిట్లనియె. "ఈయరుణముఖుండె మీయెన్నఁటి సర్వలక్షణ సంపన్నుండు; కాలము చెల్లినవాఁడు; గుణజ్యేష్ఠుఁడు; మనకుం బరమవిశ్వాసి. కావున, దూతభావంబున కీతండె యోగ్యుండు. ఈతనిఁ బనుపఁజను." అనిన వినయంబుమీఱ నాకీరం బిట్లనియె. "దేవా! నాయెత్తువిత్తమ్ముఁ గ్రుమ్మరించినను, నీమదోన్మత్తుని తోడఁగూడి యడుగువెట్ట నొడంబడ నేరను. సర్వవిధంబుల నన్నీ కార్పణ్యదోషావహతస్వభావం బగు దుష్టబకంబుతోఁ బంచుట యించు

కయుఁ గళ్యాణదాయకము గాదు. దేవరమాటకు మాఱుపల్కితి
నని కాఁకసేయుక, నామాటలు తేటపడ విని, మీఁద దేవర యిచ్చ
వచ్చినట్లు చేయవచ్చును. ఈ టక్కరికొక్కెర ముం దఱగుటయె
మిక్కిలి యుక్తము. వీనివెనుకనె నేనునుం జనియెద. సర్వధర్మ
విదులు దేవరకు ధర్మములు సెప్పునంతటివాఁడఁ గాను; నానేరము
నైరింపుఁడు. దుర్జనునితోడం గూడి నడచుట యెడరు తొడగుటకె
కారణం బగును. మన మీతనిగుణము లెల్ల మనవారివలనఁ గథ
లుగా విన్నవాఁడము. కొంతదారి సాఁగనిచ్చి, యిచ్చట ననున్నఁబొడ
వడఁగించిన నెద్దిదిక్కు? అదియుఁగాక, ననఁగూడి నార తలకెక్కిన
వ్లైక్కువవారిం జేరినతిక్కువవారికి గౌరవమును, నినుమును గూడిన
వేఁడివేల్పునకు సమ్మోట పెట్లబ్బినట్లు హీనునిఁగూడిన మానసీయునకు
లాఘవంబును, గలుగుట సహజము. గౌరవలాఘవంబు లెందును
సంసర్గాధీనంబులె కావే? ఖలులు సలుపు దుర్వృత్తంబుల ఫలంబు
తప్పక సన్నికృష్టు లగు సత్పురుషులం బొరయును. తొల్లి యొక్క
వాయసముతోఁ సావాసము చేసి, హంస హింసింపఁబడియె. ఆ కథ
యాకర్ణింపుఁడు.

ఉజ్జయినిపజ్జ తెరువుప్రక్క నొక్కగొప్ప పిప్పలవృక్షము
గలదు. ఆపాదపంబుమీఁద నొక వాయసంబును హంసంబును
గూండ్లు కావించుకొని, వాసము చేయుచుండును. అట్లుండ భీష్మం
బగునొక్క గ్రీష్మవాసరంబున, నధ్వనీనుం డొక్కఁడుండు మిక్కిలి
యధ్వపరిశ్రాంతుం డయి, యెక్కడినవి ల్లక్కడ నిడి, త్రోవక్రేవం
దనయ నారావిసీడ నిద్రించుచుండఁ, గొండొకవడికి ఛాయ తొలంగి,
యరుణకిరణములు తెరువరిమోమునం బడఁదొడఁగె. అయ్యది
వీక్షించి, వనస్పతిస్థితచక్రాంగంబు దయాంతరంగం బయి, గఱులు

విచ్చి యచ్చెట్టుక్రింద నిదురించు పాంథుని మొగమున కెండసోఁకకుండఁ బట్టె. అప్పుడప్పథికుని సౌఖ్యంబు కన్ను గుట్టి, చూపోపక, యశ్వద్ధంబు మీఁది పికవర్ధనంబు స్వభావదౌర్జన్యంబున వాని యాననంబునం బురీషోత్సర్గంబు చేసి, యాచోటువాసి యాకసంబున కెగసి, మాయ మయిపోయెను. ఆచెన్నఁటికాకి తనదౌష్ట్యం బందఱకు నెఱిఁగించెఁ గాని, దాన నేమి కట్టుకొనియెఁ? ఏదియు లేకున్నను, దుర్జనులకుఁ బరపీడయే పరమలాభంబు గదా? అంత, నాజాలపాద శ్రేష్ఠునకుం గాలావధియైన, నాయధ్వగుండు మేలుకాంచి, యుష్పరము విలోకించి తనయాస్యమున రెట్టవైచిన దా తెలిపిట్టయే యని యెంచి, కోపావేశమున నప్పట్టున మోపెట్టి పెట్టియున్నవిల్లు దిగిచికొని, యొక్క భల్లంబున నేపాపము నెఱుంగని యాయంచతల డొల్లనేసిన, నది భాంధవ రాజహంసా వళిదృష్టి సీఱు సేయుచు నేలఁగూలి, ప్రాణములు విడిచెఁ. కంటిరిగదా కాలవక్రతప్రకారము? దైవకృతమునకు మాఱు గలదె? అపరాధి యగు గాక ముండఁగా, ననపరాధియగు హంసము హింసింపఁబడియె! "పాపీచిరాయు" వనుపండితుల మాట కేనాఁటికైన బొంకు గలుగునే? ఎట్టును, జెడుగులతోడిసంగాత మిడుమలకే మూలంబగును.

తదనంతరము నేఁ జిలుకవల నవలోకించి యిట్లు పలికితిని. "సంగడీఁడా! నాకు మాస్వామి హిరణ్యగర్భఁ డెట్టివాఁడో నీవు నట్టివాఁడవె; లోకములోన మహాత్ముల కందఱు నాత్మ సమానులు గాక, పెఱవా రొకరు గలరే? ఆత్మ పరభేద బుద్ధిఁ గల్పించుకొంట మంద బుద్ధులకుం గాని, మహాబుద్ధుల కట్టి భేదభావములేదు, ఆత్మవత్సర్వ భూతాని యను నీతి దలంప వలదె? నామనంబు లోఁతు గానక, వలవని కొలలు కట్టిదపుఁ. నిమిష భంగురంబగు శరీరము

నమ్మి, నీయునుఁ బోసికొని, యెవ్వఁడు శాశ్వతనరక కూపంబునం బడి వెతకుడువఁ గడఁగును! నాయెడ నీకుఁ బ్రశ్యాయ మేల వుట్టెను? సత్పురుషుల తోడి మైత్రి సప్తపదీనం బన వినవే? ఫలభంగములు సేయుట నీకు నైజంబ కాన, నీవెల్లర నట్లుగాఁ దలంచెదవు. నీవెడ కదిదలుడిగి, పయనము తూఁగింపుము. అనినఁ బగపక నవ్వి, శుకం బిట్లనియె. "నీవు దర్దురస్వర దర్వీకరంబవు; నీయెడ నెవ్వరికైన నమ్మిగ వుట్టునే? ఏది యెట్లయిన, నాత్మరక్షణోపాయం బేమఱి యుండఁ గూడదు. నీవిప్పటిపగ మనంబునఁ బెట్టుకొని పైకిఁగానరానీక, దారి సాఁగనిచ్చి, యొక్క విజనప్రదేశంబునఁ గికురవెట్టి, నన్ను మట్టు పెట్టుట కిన్న యెన్నుచున్నాఁడవు. ఇంతతడవు మమ్మునుమాయెడ యనిని నోరికసిదీఱ దూఱి, యింతలో, నేనోరుపెట్టుకొని మరల నెయ్యంబు నెఱపెదవు? నీవు పరమధూర్తాగ్రగణ్యుండ వౌట నీవాల కమే చెప్పుచున్నది. 'అతివినయము ధూర్తలక్షణ' మనియ కదా సుధీజనులు పలుకుదురు. ప్రియంబులు నామోదజనకంబులు నయ్యుఁ, గుజనవచనంబు లకాలశనుమంబులుంబలె, నవసానంబున ననర్థదాయ కంబులై పరిణమించును. నీ దుర్జనత్వము వాగ్వ్యాపారముచేతనె ప్రత్యక్షీకృతం బగుచున్నది. చిత్రవర్ణ హిరణ్యగర్భుల మహోగ్రవిగ్ర హంబునకు నీవచనములెకదా నిదానములు. అల్పుఁడు గిట్టనివానిఁ గోల్పుచ్చుట కయి యెన్ని పన్నుగడ లైనం బన్నును. ధారుణివయిం జిరకాలము జీవింపఁగోరువా రానుడుల కెడ మీరు. మున్నొక మువ్వన్నె మెకం బొక బకంబును బలవంతంబునంగాదె యంతంబు నొందించె. నీకాకథ వినిపించెద సమాహితమతివై యాలింపుము."

జంబూద్వీపంబునఁ గామ్యకం బను లోకైకరమ్యం బగు వనంబు గలదు. అందు, నిరంతరపరిఫుల్ల వనమల్లికావల్లికా మతల్లికా వేల్లిత

నికుంజవుంజరంజితం బయి, కుసుమవిసరపరిమళ మిళితగళిత మకరంద బిందుసందోహాస్వాదనాగత మిళిందబృందసుందరంబై నికటవిటపివిటప చ్ఛటారటచ్ఛకుంతసతతానాశ్రాంత తతరవాకాంతదిగంతరాళంబయి, పొదలు పొదరుటడవి యొక్కటి యుండును. దానినడుమ, నాయతచ్ఛా యానిరస్త సమస్త తీవ్రగభస్తిగభస్తిచయం బగునొకకుజంబుక్రింది యీరమ్మలో, దీర్ఘకాలమునుండి పుండరీకం బొకఁడు నివసించు చుండును. ఆచెంగల, జువ్విచెట్టుమీఁద గులాయంబు నిర్మించుకొని, యొకకొంగ కాపుర ముండును. ఆశార్దూలం బొక్కనాఁ డొక్క యురణంబును మరణంబు నొందించి, దానిపిశితంబు మెనవుచుండ, దైవయోగంబున సూక్ష్మకీకసం బొక్కటి దశనమధ్యంబునఁ జిక్కు కొని మిక్కిలి వ్యధపఱుపఁజొచ్చెను. పులి, దాని వెలువరించుకొను వెరవు దొరకక, శిరంబు ధరణీతలంబున వ్రేలవైచుకొని, పొరలుచుఁ, దీవ్రవేదనానలంబున మలమల మఱుంగుచు, దిక్కులుప్రతిశబ్దంబులీన నంగలార్చు చుండెను. ఆయార్తస్వరంబున నంతరంగంబు గరంగి, ప్లవవృక్షంబు మీఁదిబలోటంబు వ్యాఘ్యంబుం గనుంగొని, కరుణ మీఱ నిట్లనియె. "ఓశార్దూలకులోత్తమా! నీవీయరణ్యంబునఁ జిర కాలమునుండి పొడగనుచున్నాఁడను. మున్నెన్నఁడుగాని యిట్లు వావిడిచి కస్తి పడినవాఁడవుగావు. ఇప్పటి నీచొప్పుచూడ, నాకత్య ద్భుతమగుచున్నది. నీవాపోవుటకు నిమిత్తమేమి? తెలుపుము. అనినఁ గొంతచింతాశల్యంబు వాసి, ప్రమోదమగ్నమానసం బయి, నాలుక తొట్రుపడఁ బులి యిట్లనియె. "ఓదయామయా! నాయభాగ్య మేమని చెప్పుకొందును? నిన్నఁ జేయ నొకతగరుం దెగటార్చి, నంజుడు గుడుచుచుండ, నాపాపకర్మ మేమోకాని యొకయెముకనారదనంబుల సందునం దగులుకొనియె. దానిఁ దీయనుపాయంబు దోఁపక,

యప్పటి నుండియు నిప్పగిదిం దెప్పరం బగు వెతఁ గుడుచుచున్నవాఁడను. ఇంక నన్నియపాయంబువలనం దలంగి రక్షింపఁజాలు కరుణాళు రెవ్వరు గలుగుదురొకో యని వ్యాకులపడుచుండ, నాపాలిటి భాగ్యదేవత యన్నిటికి నీసన్నిధానం బనునాధారంబు గల్పించినది. ఆరసి చూడ నీవు బక మాత్రంబవె? నన్ను బ్రతికింప మూర్తిమంతం బయి నిలిచినబహుజన్మకృత సుకృత ఫలస్వరూపంబవు గాక, నాకింక నీవు దక్క నన్యంబు శరణ్యంబు లేదు. నాకు దిక్కైననుఁ గాకున్ననుఁ నీవ. నామనోరథంబు వ్యర్థంబుసేయక, సదయహృదయుండవై ప్రాణదానంబుచేసి, పుణ్యంబుఁ గట్టుకొమ్ము. నాకింతమాత్రము నీచేత నైనయుపకారంబుఁ జేసితివా, యావజ్జీవము నీమేలు మఱచిపోను. జాగేల? ప్రపన్నుండ నగుననున్నవిపన్నుంజేయుము.' అని యతికరుణంబుగా బహువిధదీనాలాపంబులు పలికినఁ, బట్టరానిదయపుట్టి, చెట్టు దిగివచ్చి, యాకొంగ తనగొంతు క్రోల్పులినోరఁ జొనిపి, యాయస్థిశకలంబు మెలపున నూడఁబెఱికె. అది దొరంగొని, యాద్వీపియుఁ గొక్కెరయు బద్ధసఖ్యంబున నుండి, సౌహార్దసౌఖ్య మనుభవించుచుఁ, బ్రత్యేకముఁ గడుపుం బ్రోచుకొనుచుండెను. అట్లు కొంతకాలముండి, యొక్కనాఁ డాచాఱిలమెకం బెక్కడ నాహారంబు చేకూఱమి, నంగద నలంగుచు, నంతర్గతంబున నిట్లు చింతించెను. 'నేఁ డెంత దుర్దినమో! ఒట్టుపెట్టినట్లు లెంతతిరిగిన నొకకబళమాత్రం బైన మాంసం బీవఱకు దొరకలేదు; ఇంకనుం జిక్కఁజాడ గానరాదు. ఇన్నాళ్ళయినది; మున్నెన్నఁడైన నెఱుచి వుట్టనిదినంబు గలదే? దైవంబు ప్రతికూలం బైనయప్పుడు పౌరుషం బేమియుఁ గొఱగాదు గదా! ఏమి సేయుదు? నేఁ డీయెరియు జఠరాగ్ని కుఱవగునెర యరయకున్న, మిన్నక యసువు లీవలసివచ్చును:— "మాహింస్యాత్సర్వ

భూతాని" యను ధర్మంబు గలదు. అయినను దనప్రాణంబులు నిలిచిన పిమ్మటఁగదా సర్వధర్మములును. "శరీరమాద్యంఖలు ధర్మసాధన" మన మునువినమే? తానుగలిగినఁ, బదివేలు గలుగును. కావున, ధర్మ పథంబుఁ దప్పఁద్రొక్కియైనఁ, దన్నుఁదాఁ గాపాడుకొనుట పరమ ధర్మంబు. ఒడలికొఱకుఁ బుడమినైనను విడువఁజనును "ఆత్మార్థం పృథివీంత్యజే" త్తని నీతివేత్తలు వాక్రుత్తురు. నేనిప్పు డొక్క యుపా యంబున నీకవ్యాంబు కాయంబున కషాయంబు కల్పించి, మృత్యు ముఖంబునకుం దప్పి ప్రాణంబులు నిల్పికొనియెద. ప్రాణంబులు దక్కినఁ దక్కిన పాతకంబు లేపాచితంబులనైనఁ బాచికొనవచ్చును" అని నిశ్చయించి, తద్ద్రోహచింతనానుకూలంబగు నుపాయంబు చింతించి, పూర్వప్రకారమ్మునఁ గ్రమ్మఱఁ దల నేల వ్రేలవైచి, తొంటికంటె నినుమడిగా గుహలు మాఱుమ్రోయఁ గుహనావిలాపంబు సేయఁ జొచ్చెను. ఆవిలాపం బాలించి ప్రాణంబులు గలఁగఁబాఱి, యప్రతీ కారం బగు శోకంబున బమ్మరవోయి, క్రమ్మఱఁ దెలివొంది మిత్రం బగు బకంబు నిర్మలాంతఃకరణంబుతోఁ జేర వచ్చి సమాదరణ పూర్వకంబుగా నిట్లనియె. 'చెలికాఁడా! నేఁడేల యీలాగునఁ జింతా స్తిమితమూర్తివై మగుడఁ దల్లడకుదుచుచున్న వాఁడవు? నీమనికితంబు నాకడదాఁపురము సేయనేల? నీకు నే నొకవింతవాఁడనె? గొబ్బున నీయుమ్మలంబునకుఁ గారణం బెఱిఁగింపుము. ఇత్తఱి, మదాయత్తం బగు కార్యం బొక్కటి గలిగిన, నీనిమిత్తమై నాప్రాణంబుల నైన నిచ్చెద.' అనిన, బెబ్బులి యంతరంగంబున నుబ్బి, యాననంబున దీన భావం బభినయించుచు, నెలుంగురాలుపడ నిట్లనియె. "నేను గృతం బెఱుఁగనివాఁడఁగాను. సందేహము లేదు; ఈదేహము నీవు పెట్టిన చెట్టు. మీఁద నేజీవించుటయు నీయాధారమునన. నీ విప్పు డిచ్చిన

వరంబు మఱచిపోక చెల్లించి, సత్యసరస్వతి వగుము. ఓప్రాణసఖా! ప్రాణప్రదాత యగు మహోపకారి కింతవఱకుం బ్రత్యుపకారము సేయ నద నొదవక పోయెఁగదా యని, నాహృదయంబున నాకే లజ్జ వొడముచున్నదిఁ లోకమున నెంతటివాఁడను 'నేను బలవంతుఁడ; నా కితరులతోడి దేమి?' యని విజృంభీఁగరాదు. బలవంతులకును బల హీనులవలన ప్రయోజనంబులు నిచ్చలు నపేక్షణీయంబులై యుండును. నీవు నాఁ డట్లు ప్రాణాంతంబుఁ జెందకుండ నన్ను నిలిపితివి. బల్లిదుండ నయ్యు, వ్యర్థునికైవడి నేను దానికి బదులుసేయఁ జాలకుంటిని. కట కటా! నాబ్రతు కింకఁ గాల్పనే? ఏమో యీశ్వరమాయ యెఱుంగ! అది యట్లుండ, వెండియు నేఁడు నీసాయంబె నాకు స్పృహణీయం బయి యున్నది. చూచితే కాలగతి! కాల మెంతవారికి దుస్తరంబు గదా? అది యట్లుండె. ఇప్పటి నాదురవస్థ వినుము. తొల్లింటిచంద మునఁనే, నాదంతంబులయంతరంబున నేఁ డొక్కయెంపముక్క చిక్కు వడి, మిక్కుటంబుగ బాధించు చున్నది. నాయట్టిసత్వసంపన్నున కిట్టి కారం బొనరించి, యింతతడవు నీ వుదరపోషణంబునకై యిటునటుఁ జనుచుండఁ గన్నులు పెట్టుకొని చూచుచు, నిన్నాళ్లు సైఁచిననాతప్పు మన్నింపుము. నీయడుగులాన యింకఁ దొంటియట్ల నిన్నాహారార్థం బిందునందుఁ దిరుగులాడనియ్యను. నేటితో నీకష్టము గట్టెక్కును. నాహృదయంబున గలయది నిక్కముగా వచియించితి. నామాట విశ్వసింపుము. ఇదె మిత్రకార్యము సమకూర్చు సమయము వచ్చినది. కాలవిలంబనము సేయక, మిత్రరక్షణతత్పరుండవై నావక్త్రబిలంబు సొచ్చి, చెచ్చెర నీయంగద నార్పుము." అని నెనరుదవులఁ బలికిన నాబకోటంబు గాటం బగు సంతోషంబున, వ్యాఘ్రంబున కిట్లనియె. "మిత్రరత్నమా! యిది యెంతపని? విషాదంబు మానుము. ఇట్టి

పాటులు లోకమున నీతలనె పుట్టెనే? విధి త్రిప్పులకు లోనుగాక కడ
తేఱినవా లేరు? నాచేతిలో నున్న యీమాత్రపుఁబనికి, నన్యోన్యట్లు
నన్నును నీ వింతదూరము వేఁడికొనవలయునా? ఉత్తమచరిత్రునకు
మిత్రమనోరథపూరణంబుకన్న నవశ్యకర్తవ్యం బొక్కటి గలదే?
నేఁడుగా నాతనువెత్తినఫలంబుఁ గాంచగంటిని? నాపుణ్య మేమి
చెప్పను? చూడు మే నిదె నిమిషమాత్రంబున నిన్నీయాపదవలనం
బాపి, ప్రాణసమానుఁ డగు మిత్రునిఋణంబుఁ దీర్చికొనియెద. ఇది
నీయట్టి శక్తిసంపన్ననకు రాఁదగినయాపద కాదు' అని పలుకుచుం
దానినోరఁ జొరబాఱుడుఁ బసిదిండి కఱుక్కున మెడం దెగఁగొఱికి
యాక్షణంబ యాబకంబును భక్షించెను. దురాత్మ లాత్మంభరి
త్వంబునకై మిత్రద్రోహంబునకైనఁ బాలుపడుదురుగదా! కాఁబట్టి
దుష్టులు పలుకునిష్టాలాపంబులు చెవిఁ బెట్టరాదు. తప్పిదారి చెవిఁ
బెట్టితిమా, బెట్టిదం బగు చెట్ట పుట్టక మానదు.

అని మఱియు నాచిత్రవర్ణనికొలువుడుకాండ్రు పెక్కండ్రు రోషదూషితులై నన్ను దిసంతులు గొట్టుచుఁ, బెక్కులు దురాలాపంబులు పలికిరి. అవియెల్ల నుల్లంబునంబట్టి, ప్రత్యర్థి నంతకు చెంతకుఁ బుచ్చునంతకు నెంతయు దేహదాహంబు సేయుచుండును. నే నశక్తుండఁ గావున, లాఘవాస్పదుండనై భంగంబు మ్రింగి, యెప్పటి యెప్పున నందరిలో నౌనని తలయెత్తి తిరుగుచుంటిని. నే నొక పౌరుషశాలినే! ఈయవమానంబు మానవంతుం డోర్చునట్టిది కాదు. అచేతనమయ్యును, సూర్యకాంతము తపనుపాదములు సోఁకినంతనే ప్రజ్వరిల్లుననఁ, జేతనుం డగునభిమానవంతుఁ డెట్లహితకృతతిరస్కారంబుఁ జూచి సైఁచును? అయిన, నాభంగపాటు స్వామికి నివేదింప వలె ననునభిలాషపాశంబు, ప్రాణంబుల వెడలనీక బొందితో బంధించి

నన్నీకడ కీడిచితెచ్చెను. ఆహా! విధిచెయిద మేమనవచ్చును! నాకు గొండంతబలఁగంబు గలిగియు లేనివాఁడనై, కానిదేశములలో దిక్కు మాలినపక్షినై నిలిచితిని. అది యట్లుండె. నీయట్టిజనవిశ్రుతునియడు గులు పట్టఁగలిగియు, విధివశంబున నొప్పనివారి ముంబఱఁ గొలు వులో నన్నిరోఁతమాటలకు వీను లొగ్గవలసివచ్చెను. గతవృత్తంబు లకు విచారపడ నయ్యెడుకార్యము లేకుకాని, మఱచినను మఱుపు నకురాక, యాకష్టపాటు నాహృదయంబున నాటుకొని, మనశ్శల్యం బయి యలయించుచున్నది. నాకిన్న త్రవ్వనేల! కానివారిచే గాసిఁ బొందుమని విధి యట్లు ప్రాసియుండ, నెవ్వఁడు తప్పింపనేర్చును! ఇది దేవరమొగంబునం దెలిపి, మనంబు నొగిలించుట కెంతయు నాస్వాం తంబు దురపిల్లెడును. అచ్చోఁ జిత్రవర్ణం డించుక యుక్కటికంబు వహించి, వై దేశికుండ నని నన్ను మన్నిగొన మదిగొల్పక, విడిచి, పుచ్చెఁ. స్వామిపాదపద్మంబులు మరలసందర్శించుభాగ్యంబు కరంబు కల్గుటఁబట్టి, యీసంగ్రామవార్తాహరత్వంబు వహించి, యిట్లే తెంచ గాంచితిని. మార్గాయాసనిమిత్తంబునఁ జిత్తంబు స్వాయత్తంబు కాకున్నయది; అందులకుతోఁడు, విషాదవేదనాదోదూయ మానమా ననుండ నయి యున్నవాఁడను. ఇంక మిక్కిలి విన్నవింప నేమిను. స్వామికి వార్తావిశేషంబులు నివేదింపవలయు ననునుత్సాహమును, స్వామిసన్నిధాన నివసనాభిరతియు, నవలంబంబులుగా నింతతడవు నిలువఁ గలిగితిని. ఎట్టింగినంతవఱకు మొఱంగక జరిగిన సర్వవృత్తాంత మును దేవరకువిన్నవించి, కృతకృత్యుఁడ నైతిని. ఆచంద్రకేంద్రుండు నన్ను వీడ్కొల్పునపుడు 'నీవెనుకనే కీరంబుఁ బుత్తు ముందు పో'మ్మని పంపెను. అదియు నింతకుఁ జనుదెంచు చుండును. ఇఁక గర్తవ్యాంశంబు దేవరచిత్తమునకే విదితంబు, పోయివచ్చెద." అనిన

హిరణ్యగర్భుండను నాతనిఁ గృపాకటాక్షవీక్షణంబులం జూచుచు నిట్లనియె. "దీర్ఘముఖా! దైవతంత్రం బైనపని కార్తిఁజెంద బని లేదు. సమస్తముఁ దెలిసినవాఁడవు; నీకు నేఁ జెప్పవలయునె? నీవు మిక్కిలి ధైర్యశాలివే, యిట్లు పేదమాట లేల యాడెదవు? ఆచిత్ర వర్ణుఁడు సమిత్రామాత్యపుత్రంబుగా జావఁదలంచి కాఁబోలు, నీయట్టిసాధువున కపకారంబు దలంచె. ఏమయిన నేమి? ఇంతటితో మునిఁగిపోయిన దేమియు లేదు. రేప చని, యాపాపమేపరిదొరయవ లేపంబు మాపుదము. ఊఱడుము. సర్వజనసత్కారార్హుండ వగు నీవంటివానికా, యిట్టిపాటులు పాటిలవలె?" అని శ్రవణరసాయన ముగాఁ బలుకుచు విషాదాపనోదము సేయుచున్న తేనియనుజ్ఞ వడసి దీర్ఘముఖుండు కొంత మనసునందుఁ గొఱగొఱమాని. విశ్వసించుచు నిజాగారంబునకుం జనియె.

అంత నక్కడ దీర్ఘముఖునిఁ బనిచినవెనుకఁ బర్వేంద్రుం డరుణ ముఖుఁ జేరఁజీరి, హిరణ్యగర్భుని కొలువులోఁ బలుకవలయుపలుకు లెల్లఁ దేటపడఁ గఱపి, 'నీ వివియన్నియు నీళ్ళ నమలక దిటంబున నోలగమునఁ బలుకవలయుఁ జుమీ' యని వుచ్చి యంత మంత్రి కేకాంత మిచ్చి, తద్వచనానుసృతిని మేఘవర్ణుం డనుకాకమును రప్పించి, బహుమానపురస్సరముగా నిట్లనియె. 'మనకిప్పు డక్కవ్వ రవ్వుదీవి నావరింప యత్నము కలిగి యున్నది. దానికి నీతోడుపా టవ శ్యము గావలసి యున్నది. ఈకార్యంబు కడముట్ట నిర్వహింప భవ దన్యుండు సమర్థుండు లేఁడు. కావున సర్వప్రయత్నముల నీవీపనికి వేగు నడపవలయును. నీవు ప్రచ్ఛన్నవేషమునఁ జని, యేలాగుననైన హిరణ్యగర్భుని చెలిమికలిమి కుపాయంబు గావించుకొని వేషభాషల నచ్చిక వుట్టున ట్లటమటించుచు, నెందుఁ జనవరివై యుండి, యాను

కూల్యప్రాతికూల్యంబుల తెఱం గెఱింగి, మనకార్యసిద్ధి యెవ్విధంబున నగు నవ్విధంబీవ సంఘటించి, కార్యనిర్వాహకుండ వగుము. నీకచ్చట తోనిదండసుండు నేనికనయిన దోమనయిన నెడసి పోనాడుకోక, కూడఁ గట్టుకొని, వారివారిమనసు కనిపట్టి తిరుగవలయును. వారి కించుక వెగటు దోఁచెనేనిఁ, దగునవసరంబున నీమీఁద నేమేనియు నావగింజలు తాటికాయలుగా నేలికచెవులం బోసి, యెగఁబోసి, నీవలన నొక్కఁకొఱ గామిఁ గల్పించి, నిన్నాతనిమది కెడఁజేయుదురు. దానంజేసి, సకలో ద్యమఘ్నంబు లగువిఘ్నంబులు దొట్టి, మనప్రయత్నమెల్ల నాఁబడి పోవును. కార్యము మించినవెనుక, నేమనుకొంటిమి పో యేమి కార్యము ? రాజులజిత్తంబులును క్షణక్షణంబులు; ఎప్పు డెవ్వగిది నుండునో తెలిసి మెలఁగుట కడుశ్రేఁగు. కావున నయ్య 'జియ్యలు వెట్టుచు, నైనదానికిఁ గానిదానికి నడ్డమువచ్చి పైఁబూసికొనక, వాలుపయి నడచునట్లు మెలఁకువ గలిగి మెలఁగవలయును. రాజుదయ గలిగిననాఁ కృనునందఱు మిత్రులే యగుదురుగాని, యది యింత గొఱఁత వడిన మిత్రులే యమిత్రు లగుదురు. వనంబులు దహించు దహనునకు మిత్రుఁడగు మారుతుండ, దీపంబున నన్నువయ యున్నప్పుడు మారుతుండు గాఁడే ? కావున, నీవేవారికి వేఁడిదాఁకు నట్లుగాఁ జరింపక, రాజి కన్నెఱింగినవాఁడవై, యాతనిచిత్తవృత్తి ననువర్తింపవలయును. ఎందును నీవెఱుఁగని నయానయంబులు లేవు. అచట నీమనసుగూడినవారికైన, హృదయ మిచ్చకుము; మఱచియైన నిచ్చటమాట లచ్చట వాక్రువ్వకుము; నీవు బుద్ధిమంతుఁడవు. ఒరుల చేతఁ జెప్పించుకొనునర్థంబు లేదు. పొమ్ము. మేము నిత్యము నీరాకయే కాచి యుందుము. వెనుక మఱచెదవు సుమీ." అని పనిచి, చిత్ర వర్ణంబు స్వకార్యంబునం బ్రవర్తించుచుండె.

అంత నిచ్చట దీర్ఘముఖుండు కొలువు దాఁటినపిమ్మటఁ, గోక మ్మించుక హసించి హంసప్రకాండునితో నిట్లనియె. " చిత్తగించితిరా ? మనబాలిశుండు పరదేశ మరిగి యేమి కొనివచ్చెనో ! 'తాఁజెడ్డకోఁతి వనమెల్లఁ జెఱచిన' దన్నట్లు, దుర్జనుండు తానుజెడుట చాలక, తన వారికింగూడ వీడనికీఁడు దెచ్చిపెట్టును. అందున కీప్రుక్కడి కొక్కె రయె తాచ్ఛాణంబయి కానఁబడుచున్నది. కారణము లేకయే కలహ మునకుఁ గాలుద్రవ్వుట క్షుద్రునిలక్షణము. పండినవృక్షంబుచందం బున, సజ్జనుండు వంగి యుండును. మూర్ఖుండు, శుష్కకాష్ఠంబుంబలె, భేద్యం డగుంగాని, నమ్రుండు గానేరఁడు. పండితమాన్యు లెఱుక లొకపదివే లుపచరించినను, వారినిబట్టిన నైజదోషంబు లీషన్మా త్రంబును విడువవు. నూఱుమూఱులు నీరంబులం గడిగిన, నంగారం బులమలినత్వంబు వాయదు." అని మఱియుందూఱుచుండ, వారించి కలహంసనాయకుండు నిజామాత్యున కిట్లనియె. "ఇప్పు డీయుపాలం భనవచనంబులతోడఁ బ్రయోజన మేమి ? ఇదియంతయుఁ గాలప్రా ప్తంబుకాని. హితకార్యధూర్వహుం డీతనియెడ నీఁగ కాలంతయు నవకార్యంబులేదు. లేనిది పైఁబెట్టరాదు; కాలవిపర్యయమ్ముల నుద్య మమ్ము లెల్లఁ బ్రతికూలంబు లగును. ఈ తండు మననదయ వాక్యసంభావనకుఁ బ్రాతుండుగాని గర్వాణార్హుండు గాఁడు. నీవును బహువిలోకివి; లోకంబున నీకుఁ దెలియనిది లేదు; పోయిన దాని మరలఁ ద్రవ్వుట చర్వితచర్వణంబు ; దాన సారంబేమియుఁ గనుపట్టదు; అందులకయి వందురుటయు గతజలసేతు బంధనంబు. కాన, దానిమాని, ప్రస్తుత కార్యవిచారంబునకు గోచరంబగునంతయు గార్యనూత్ర మెఱిఁగింపుము." అనిన నాజక్కవలరాయం డారాయుంచ దొర కిట్లనియె.

"బుద్ధిమంతు లగువారు వర్ణాకారప్రతిధ్వానంబుల వలనను, నేత్రవక్త్రాది వికారంబుల వలనను, బరులమనోగతంబు లూహింప సమర్థు లయి యుందురు కావున, మంత్రరక్షణం బత్యంతావశ్యకంబు. అభిగుప్త మంత్రులకు సర్వార్థసిద్ధులును సుకరంబులగును." అనుడు, నమ్మాటల వెంబడినె యొడయనిచూపు దీపితైకాంత కాంక్షంబయి, నలుగడల నిగిడిన, నాచూడ్కితోడన యాయెడకుం గడునెడ గలుగ నడుచు నందలి మాన్యుల వెంట నంటి, తక్కటివారును దూర దూరములకేగిరి. అంత మంతిరి మతింత చెంతకు జరిగి, యేలిక మోమునఁ జూపు మోపి, యిట్లనియె. 'దేవా! యవధరింపుము. నాబుద్ధికింజూడ, నిప్పటి కవ్వగవానిపాలికిఁ బ్రణిధి నొక్కని బనుచుట యుచితంబుగాఁ దోఁచుచున్నది. పదింబదిగ విమర్శింపక, పదరికర్జంబు పూనుట కార్యజ్ఞునిలక్షణంబు గాదు. వైద్యకర్మంబున కనాలస్యంబు నట్లు కార్యనిశ్చయంబున కాలస్యంబకరంబు శ్రేయంబు. ఒకానొక చో నల్పకార్యంబు సాహసారబ్ధంబైనఁ గావచ్చుంగాని, మహాకార్యంబు సాహసక్రియాసాధ్యంబు గాదు. సువిచారపూర్వారబ్ధ కార్యంబునకు, దైవంబును ననుకూలం బగును. అంతియగాక. యెదిరితలంపుఁ బదిలం బుగా నెఱుంగక, యొక సాహసంబునకుం జొచ్చుటయుఁ గానిపనియె. క్షితితలాధ్యక్షుం డాత్మచ్ఛిద్రంబుల బయలఁబడకుండఁ గాపాడుచు, విపక్షపక్షచ్ఛిద్రంబుల భద్రంబుగా మున్మున్న చారదృష్టిని వీక్షింప వలయును. దూరస్థు లయ్యును, గార్యంబు లనిశంబును గొట్టికాండ్రచే గనుచుంటఁబట్టియే, వృథ్వీకాంతులు చారచక్షు లనం బరఁగుదురు. స్వపర రాష్ట్రమ్ముల కార్యాకార్యమ్ముల నవలోకింప రాచవారికి వేగులెకదా లోచనములు? ఎవ్వని కాలోచనంబులు పూజ్యంబులో, యాహానవనాథుం డనయంబును నయనంబులుండియు, నంధ కల్పుం

డగును. ఇప్పు డరుగుచరునితోడఁ గూడ, నయో పాయజ్ఞుఁడును, విశ్వాస పాత్రుండును, నగువేఱొక్కనిఁ గూడఁ బుచ్చ వలయును. ఆతండు సర్వధా యత్రప్రనుత్తుండయి, విరోధివీటఁ బుట్టు విశేషంబు లెవ్వటి వప్పుడు మన చెవుల వేసి, వేసఱక గుప్తప్రకారంబునఁ జను చుండవలయును. ఇమ్మహాకార్యంబు నిర్వహింప మన దీర్ఘముఖుండ శక్తుండు. ఆతండు స్థలజలస చరణ చణుండు; ఆకార వికారాములఁ బరులభావంబు లూహింపఁ జతురుండు; నీటిలోజాడలు దీయు నేర్పున నీతినిఁ జెప్పి వేఱొక్కనిఁ జెప్పవలెను; ఈతనితోడ నీడగువాని నీసభ నొం డొక్కనిం గానము. ఎల్లభంగులఁ జరకృత్యంబున కీతండ యర్హుండు. ఈతనికి బానటయై చన నీతని యనుజుండు ధవళాంగుండు దగినవాఁడు. ఆతండును బరేంగితజ్ఞానచతురుండు. వరులు తెలియ రాదు గాన, నిది యంతయు గుప్తంబుగాఁ గావించుట శ్రేయోదాయ కము. పిడుగు పడుతఱినయెఱుకపడునట్లు, రాజకృత్యంబును ఫలకాల మునకె యెఱుక పడవలయును. మఱియు, మూరుతుం జేరువ నునిచి కొని, యేమఱియుండు నాతండు ప్రమత్తత్వంబు దీర్ఘవృక్షంబు కొన కొమ్మను శయనించి కనుమోడ్చువానికెనయగును. కావున, బరివా రంబునెల్ల రాజద్వారంబుననుండ శాసింపవలయును. ఇట్టిసమయంబుల భూపాలుండెట్టివారినినమ్మక, వైరినివారణంబునకుపాయంబు రోయుచు నెల్లప్రొద్దు నాత్మరక్షావరుండయి, జాగరూకత కలిగి యుండవలెను. మంత్రరహస్యంబును బయలఁబడరాదుగాన, నిజరక్షాయత్న మెట్లట్ల, మంత్రరక్షా యత్నము నేనుఱకుండునది. మంత్రంబు మూడవ నోటంబడిన, సర్వకార్యంబులు భగ్నంబులయి పోలియును. ఇదియం తయు నెఱింగి, ధరావరుం డాత్మమంత్రిద్వితీయుండై, యెంతవారికిం గర్ణగోచరంబు గాకుండ మంత్రకార్యంబు నిర్వహింప వలయు.

అదియు, రాజులకు విజయమూలంబు. అట్లుగాక తక్కిన రహస్యంబు కర్ణపరంపరం బ్రకటంబగును. మంత్రవిభేదంబువలనం గలుగు నిక్కట్టులు చక్కఁబడుట మిక్కిలి యక్కజ మని నయజ్ఞులు వలుకుదురు. నాకుఁ దోఁచినంతవట్టును స్వామికి విన్నవించితిని. సర్వజ్ఞులు, దేవర యెఱుంగనిధర్మంబులు లోకంబున లేవు; ధర్మతత్త్వమ్ము లెల్ల స్వామికిఁ గరతలామలకమ్ములు. దేవర దివ్యచిత్తంబునకు వచ్చిన పని ననుష్ఠింతము." అనినఁ గృపావలోక మందహాససుందర వదనుండయి, వరటాధినాథుం డిట్లనియె. "బావురే! నీవు నామనంబునం గలయుదియె, చెట్టునఁబుడికినట్టు వచించితివి! నీవు దీర్ఘాయుష్మంతుండ వయి మందువుగాక! నీవలన నెంతయు సంతసిల్లితి. నీవాక్య ములయందు గ్రాహ్యంబులు కానివియుఁ గలవే? మనకుఁ బ్రణిధియు నుత్తముండు దొంకెను. నిశ్చితకార్యమునకు జాగేల? శుభస్య శీఘ్రు" మ్మనిన, సవినయముగా మంత్రి యిట్లనియె. "దేవా! యిట్లుప్రయత్నముగ సర్వానుకూలుం డగు చారుండు లభ్య మగుట, భావిజన్యవిజయ సూచకంబయి కానఁబడుచున్నది. సంకల్పసిద్ధులగు దేవరకే యుద్ధంబున జయంబు నిశ్చయంబు." అని ప్రశంసించు నవసరంబునఁ, బ్రతీహారుం డొక్కరుండు ప్రవేశించి, ప్రణామంబు గావించి, యిట్లనియె. "దేవా! దేవర దర్శనార్థంబు జంబూద్వీపము నుండి కొండొక శుకంబు వచ్చి, తలవాకిట నిలచి యున్నది. లోనికిం గొనిరా సెలవే?" అనిన, దొర మంత్రివలనికిం జూడ్కి నిగిడించుడుఁ, దదభిప్రాయం బెఱింగి, చక్రవాక వల్లభుం డిట్లనియె. "నీవిప్పు డేగి, యచ్చిలుకం దగుచోటఁ గూరుచుండఁ బెట్టుము. ఱేనియాసతి యైనప్పుడు లోనికిం గొంచురమ్ము. పొమ్ము." అనిన్న మనంబున భయభక్తులు పెరంగొన వెనుక వెనుకం జని, కీరంబును

గని యిట్లనియె, "మాదొరనా రిత్తఱిఁ దమధీసచిపులతో మంత్రా వాసంబున నేకత ముండి, కార్యపర్యాలోచనము సేయుచున్న వారు. వారిప్పుడ వచ్చి బయలికొలు విత్తురు. అప్పుడు పోయి వాదిచరణములు నందర్శింపవచ్చును. అందాఁక నిందు వసియింపుము" అని యుచితాస నంబువెట్టిన, నది యందు వసించి యుండె. అంత, సమరసమ్ముల్లా సంబు మొగంబునకు వికాసంబు నింప, మంత్రిమోముచూచి మరా ళేంద్రుం డిట్లనియె. "ఆహా! సుభటనివహాముదావహంబును, భీరు భయావహంబును, నగు నాహవంబు సంప్రాప్తమైనది. దురంబునఁ బిఱిందికి నడుగువెట్టని బిరుదుమగలకుం; దమగాత్రంబుల సాఫల్య పాత్రంబులఁ గావించుకొనను, జిరంతన మగు కీర్తి గాంచను, మంచి యవసరం బొడఁగూడినది. శాణవిఘృష్టమణియును, నర్థిసాత్కృత ధను లగు దానఘనులును, రణనిహతు లగు శూరవితతులును, గృశ త్వంబునంగాదె కడుశోభింతురు. కావునఁ బిఱికికండలేని దండిమగల నెల్ల భండనమున కాయితం బయి యుండ నియమింపుము. ఉత్సా హంబు వాటింపుము." అనిన, మందహాసరోచుల మొగంబునఁ దెలివి తొలంకాడ, నాజక్కవయొకివిూఁ డిట్లనియె. "దేవర వాక్రు చ్చిన దంతయు శూరజనశ్లాఘనీయంబ కాని, వేఱుగాదు. అయినను స్వామినగ్గర నాకుం గల చనవరితనం బొక్కహితంబ విన్నవింప నుల్లంబును బెల్లుగఁ బీడించుచున్నది. దేవరమాట కడ్డమాడెనని వేఁడిమి సేయక, లెస్సగా దివ్యచిత్తమున నవధరింప వలయును. తొలుదొల్తఁ గలహామునకుఁ గాలుద్రవ్వుట, యెవ్వరికి ననర్థదాయ కంబు. ఇట్టి యార్యగర్హ్యం బగు పనిని, మిముబోఁటి మేటిమగ లేటికిఁ బాటింతురు? ఉపాయములలో నెల్ల దండోపాయం బధమోపాయం బని, యనయమును నయవిదులు పలుకుచుందురు. ఏమి సేయఁ

బోయిన నేమగునో! జయాపజయంబులు నిర్ణయింప నెవ్వరిసామ్మా? విద్వేషివిజిగీషు లగు మనీషు లాహవంబు శుభావహంబుగామి, సామ దానభేదముల నేదాన నేని దమకార్యముల సాధింపఁ బాటువడుదురు. అం దెందుసఁ దీఱకున్నఁ దుదకుఁ గడయుపాయమునకుం గడంగు దురు, కడపట నెట్టువో నెట్టువచ్చునో యని, యప్పుడును సంప్రాప్త మనోరథు లగుదనుకఁ, బాలలోఁబడ్డ బల్లివిధంబునఁ దల్లడిల్లుచుండురు. ఇండలి మనవార లందఱు శూరాగ్రేసరు లని ముయ్యరాదు. బవర మొదవక మున్ను మదిమది నిండ్లకడ నుండ నెల్లవారును శూరులే యీడురుగాని, ₹దురమున మద మొదవ నెదు రెదిరినతఱి; బెదరి చెదరక మది కుదురఁ బెట్టుట యెట్టిదిట్టలకుం గట్టిది. పరాక్రమ క్రమాసాధ్యములగునట్టి కర్జములు పెక్కు లలోపాయసాధ్యములయి యుండును. అనితరసాధనోత్తాప్యంబు లగుమహోపలముల మహో న్నతపదముల కెక్కించుట యుపాయము చేతనకాదే! యుక్తకాలకృ తోద్యోగమువలనఁ గృషి సఫలం బగునట్లు, ప్రయత్న మల్పమయి నను, సముచితసమయం బొదవుటనుక వేచి యాచరించిన నయవ్యవ సాయమును, సహస్రగుణాధికం బయిన ఫలము నిచ్చును. అట్టు కాని నాఁడు, పడ్డపాటంతయు నిష్ఫలంబయి వృథావస్థయగును. దూరభీరు తయు, నాసన్నశూరతయు, మహాత్ములకు సహజగుణములు. అల్ప లయం దీగుణములు విపరీతము లయి యుండును. వేమఱుశపథములు పలుకుటయు, నంజలులు, నభివాదనములు, సామప్రియవాక్యములు, గాపురుషులకుస్వభావసిద్ధములు. ఇఁకమిథ్యావచనములన్న, వెన్నతోడఁ బెట్టినవె. మహాత్ములు విపత్కాలములయందును దనుధీరత్వము విడు వరు. ఆపత్కాలముల ధైర్యమును, సంపదలయందుఁ దాలిమియు, రాజ సభలయందు సరసవచనరచనాచాతుర్యమును, రణరంగముల విక్ర

మంబును, మహానుభావులకుఁ బ్రకృతిసిద్ధములు కావె? మతియుఁ జిత్రవర్ణుండు మహాబలవంతుఁడును బలవత్సహాయసంపన్నుఁడును నగుట, మన మిప్పు డాతనిఁ దొడరఁ గడంగుట గహనదహనముపయి మిడుత లురువడి నుఱుక నడరుట. ఎట్టిబెట్టిదుండుగాని తన్ను డీకొను వానివీఁకఁ బోకార్చఁ దొడంగుఁగాని, యడఁగియుండువానిపయిఁ దన వడి నిగిడింపఁ దొడఁగఁడు. నదీరయంబు నిలిచిపోలుచు నిలాజంబుల నన్మూలింపఁ బూనుఁగాని, వంగి యడుగంటి యున్నపిల్లుఁ బెల్లగింపఁ బూనదు. క్షమాసమానంబు లగునయోపాయంబు లొండు లేవు కావున వేగిరపాటు చేటు వాటిల్లుటకు మూలం బగును. మన కిప్పుడు దుర్గనిర్మాణోద్యమం బత్యంతావశ్యకంబు. దుర్గస్థుం డగునొక్కనికి, వెలివారి నూఱువుర నైన నోరువ సుకరంబయి యుండును. దుర్గవిష యుం డగుగోత్రావరుండు, శాత్రవాసాధ్యుండయి, పరిభవాస్పదుండు కాకుండును. ఇంక నదుర్గవిషయుం డగుధరావల్లభుండో, ధరచ్యుత మనుష్యప్రతిముండయి, పరాభవంబునకుఁ దావలంబగును. మనము నిర్మింపఁబోవుదుర్గంబును నరాతివర్గంబునకు దుర్గమం బయి, యప్రభేద్యం బయి, లోపల నిర్మలజలసమృద్ధం బగుకొలఁకు నొక్కటిఁ గలిగి యుండవలయును. వచనీయంబు సర్వంబును వచియించితి. ఇంక దేవర సర్వక్రియాకలాపనిర్వాహణధుర్యులు కావలయును. దుర్గంబు సంసిద్ధం బగుపఱకు, దూత నిచ్చోటికి రప్పింప నొప్పదు. కావున, దడవుసేయక ముందఱ నీపనికిం బనుపవలయును." అనిన, హిరణ్యగర్భుండును మంత్రిపదనంబుఁ జూచి, "కాలయాపనంబు సేయక దుర్గనిర్మాణపరిణతుం డగువాని రావించి, యాజ్ఞాపింపు" మనవుఁడు, 'నాఁగా' కని యాకోకనాయకుండు తత్క్షణంబ యొకపరిచారకు నంపి సకలానల్పశిల్పకలాకుశలు వీరవరాభిధానసారసప్రశస్తు

నాయెడకుఁ బిలిపించి, సగౌరవంబుగా నిట్లనియె. "ఓయీ! సారస వరా! ఈయవసరంబున నీవలన మాకొక యవసరంబు గలిగి, పిలి పించితిమి. మాకు నీయంతటిసాహసుండు గలుగుటకు నీచే నైన యిక్కార్య్యంబున కక్కఱవచ్చుటయే ఫలంబు. మన కిత్తఱి నొకదుర్గంబు కావలసివచ్చినది. ఈపని యనితరసాధ్యం బగుటంజేసి, యీభారంబు నీవయినె మోపవలసి వచ్చెను. ఇది నీకుఁ బరమప్రయోజనంబు. స్వామియానతి యీదలం దాలిచి, యతిత్వరితంబుగ నొక దుర్గంబు నిర్మింపుమా. నీనేరిమిపేరిమి చూతము." అనిన నగ్గలం బగువినయంబు తోఁపఁ బ్రమాణాంబుఁ గావించి, యీబెగ్గురుపక్షి యిట్లనియె. "దేవరకు నాయెడఁ గలవత్సలత్వంబున నీమానసీయ వాక్యంబు లానతిచ్చిదరుగాని, నే నంతటిశక్తియుక్తుండను గాను. నా కొండొకపని యనుగ్రహింపుఁడు. నేను మీపాదచ్ఛాయం బడియుండి, మిమ్ముఁ జూపట్టుకొని, చాటునఁ బొట్టఁబోసికో వలసినవాఁడనుగాని, స్వతంత్రించి యొకపని పయి వ్రేసికొని సంబళింపఁ జాలినవాఁడను గాను" అనుచో మరాళతల్లజుండు కించిదుల్లసితవదనుం డగుచు, సారసపతి కిట్లనియె. "నీప్రజ్ఞావిశేషంబు సర్వంబును, మాసర్వజ్ఞుండు వాక్రువ్వ విన్నవారము. నీకిప్పని త్రోచివుచ్చినం బోవదు. ఇది యనన్యవిషయం బయిన కార్య్యంబు. మాకడ నున్న యీయయందఅలో నీవు సమర్థతముండ వని నిశ్చయించి, పని పంచితిమి. ఇఁక వృథాకథ లెన్నక, క్రియాపరుండవు గమ్ము" అనిన, జేనిమాటకు మాఱాడ నోడినట్లు మెత్తన నియ్యకొని చని, చయ్యనఁ జనుదెంచి, నమస్క రించి వీరవరుం డేలిక కిట్లనియె. "స్వామీ! భవత్ప్రసాదంబున, మనకు వలయు దుర్గం బొక్కటి యీరసివచ్చినాఁడను. మననగరోప కంఠంబున, నొకయహార్య్యగహ్వరం బున్నయది. అయ్యది విశాలాంత

రాళంబయి, ప్రత్యర్థిజనదుస్సాధ్యంబయి, యత్యంత రమణీయంబై యుండును. అందు నయనానందకరంబైన విమల కమలపూర్ణకమలాకరంబొక్కటి మిక్కుటముగఁ గ్రాలుచుండును. ఆయది దేవరచిత్తమునకు వచ్చెనేనిఁ జెచ్చెర నాయత్తం బొనరించెదను." అనిన, మెచ్చి వసదనంబు లొసంగి, యారాయంచదొర పలుమాఱు ప్రైగ్గడవిన నాబెగ్గురు నగ్గించి, యిట్లనియె. "మాకు నీవంటిబంటు గలుగుట మాభాగ్యముగాదే! నీవలసం గడుఁబ్రమోదించినారము. దుర్గపాలనాధికారంబును, నీకె యొసంగినవారము. మన్నియోగంబులందు లేశంబును బ్రమాదంబునం బొరయక, స్వకృత్యం బేమఱక కనుగలిగి కాచుకొని యుండునది. నీకు శుభ మగుఁగాత పోయిరమ్మ్ము." అని సెలవొసంగిన, నుదీర్ణపూర్ణ హర్షుండయి 'మహాప్రసాదం' బనిచని, వీరవరుండు తన్నియోగ ప్రకారంబున నాహారనిద్రల కెడము లేక, రేయింబవలును దుర్గరక్షణంబె నిత్యకృత్యముగాఁ గనుపెట్టుకొని యుండెను.

అనిన, రాచకొమారులు తదనంతర వృత్తాంతశ్రవణకుతూహలాయచిత్తచిత్తులై, విష్ణుశర్మంగని, యనంతరవృత్తం బెట్లునడచెఁ జెప్పుమని యడుగుటయు,—

ప్రథమభాగము.

సమాప్తము.

నీతిచంద్రిక, విగ్రహము

ద్వితీయ భాగము

....o0o....

పరమదయాపరుండైన విష్ణుశర్మ, యాదరశీతలేక్షణంబులం గాంచుచు, వీరవరుండు క్రొలువు విడిచి చనిన యనంతరమునఁ జెల్లిన వృత్తాంతంబంతయు, నృపతిసుతులకు నిట్లు చెప్పఁ దొడఁగెను.

అంతలో ద్వారపాలకుఁ డొక్కఁడు క్రమ్మఱ నరుదెంచి, యంజలి ఘటియించి నిలిచి యిట్లనియె. "దేవా! యేలినవారిపాద నందర్శనాభిలాషంబున, సింహళ ద్వీపమునుండి నీలవర్ణనామక వాయస నాయకుండు వచ్చి, బహిర్ద్వారంబున నిలిచి యున్నవాఁడుం ముదలయేని, సన్నిధానంబునకుందోడుకొని వచ్చెద." అనిన, మనంబున నలరి, చక్రాంగవుంగవుం డంగంబు వొంగ మంత్రి కిట్లనియె. "కాకంబు కరంబు ప్రాజ్ఞంబు, శక్తిసంపన్నంబు, రాజు మందప్రజ్ఞుల వేవురఁ జేర్చుట కంటెఁ, బ్రొజ్ఞు నొక్కని గడించు కొంట లాభంబు. సింగంబును గాదని, కాలేయకంబుల వేయింటిఁ గూర్చుకొన్న నేమి ప్రయోజనము? మనవారిలో, నీగుమికానికి సమానుండు బలవంతుం డుండిన, ప్రేలుమడఁచి యొక్కని నెఱిం గింపుము. యుద్ధోద్యోగసమయంబుల శూరసంగ్రహం బవశ్య కర్తవ్యంబు. కాన, సర్వప్రయత్నంబుల మన కీతనితోడుపా టభ్యర్థ నీయము. మనకిట్టి యువిజేయుని సహాయం బొదవిన, నెవ్వఁ డయిన మనలఁ జుట్టనప్రేలఁ జూప నోపునే! నీవును విచారించి చెప్పుము."

అనిన, మందహాస విద్యోతవదనుండయి, సర్వజ్ఞుం డిట్లనియె, "మనో వాక్కాయకర్మంబుల నేనెప్పుడు స్వామికి హితంబె కాంక్షించు చుందుంగాన, గొంకుమాని నాకుం దోచినది విన్నవించెద. దేవర చిత్తంబున వేఱుగా భావింపఁబోకుఁడు. కార్యవేగం బేలినవారిచిత్తం బున కుచితకార్యవివేకంబుఁ దోఁపనీకున్న ట్టున్నయది. క్రొత్తవాని సాహాయ్యంబునఁ బ్రత్యయంబు నిడి కడిందిమార్తురఁ బరిమార్తు మంట, శునకవాలంబు పట్టుకొని కడలిఁగడవఁ గడఁగుట. అదియునుం గాక, కాకంబు స్థలచరంబు; మనము జలచరంబులము. ఈతండు మనతోడం గలియువాఁడు కాఁడు. సమానుఁడు గానివానితోడిపొత్తు విపత్తునకుఁ గారణం బగును. కావున, మన మీయరిష్టమును జేకొనుట యరిష్టమును గైకొంట గాని, వేఱు గాదు. దేవర యిఁక నీతలఁపు వేసి పెట్టవలయును. తనవారి మాని లాతివారిఁ గోరుట, యమృతంబు దిరస్కరించి కాలకూటంబుఁ గ్రోలఁ దలంపుగొంట. ఈప్రత్యక్షవిపక్ష పక్షి యెట్లు సంగ్రాహ్యం బగునో. దేవరయే చక్కఁగా విచారింప వలయును. ఎవ్వఁ డాత్మపక్షంబుఁ బరిత్యజించి పరపక్షంబపేక్షించునో వాఁడు నీలవర్ణ సృగాలంబుపోలిక గాఁతధర్మంబు నొందును. ఏలిక కాకథ విన్నవించెద నవధరింపుఁడు."

ఒక్కతామసీనిశీథంబున శవకబళనలోలం బయి, సృగాలం బొక్కటి నగరోపాంతంబున విచ్చలవిడిఁ జెఱలాడుచుఁ, జీకువాలు కతంబునఁ భ్రమాదంపడి, నీలపాచనభాండంబునంబడి, వెడలనేరక నిరంతరచింతం బనివిపనివి, కొంతపడికి డెందంబు కుందు డిందువఱిచి కొని, మాఱుచింత లేక వేగువఱకు విచారించి, వెరవొండరసి యెడఁ దకు సరిపఱిచుకొని, తెల్లవాఱి భాండస్వామి యే తెంచునంతకు, నూర్ధ్వచరణంబును వివృతాననంబును నిపాఁకసితదంతంబును నయి,

కన్నుల తేలగిలవైచి, యూపిరి బిగఁబట్టి, గిట్టినయట్టుల పడియుండెను. అంత, నానీలికాఁపు వచ్చి చూచి, విస్మయగోచరుండై, యీవంచ కంబు పంచత్వంబు నొందెనకాఁదలంచి, వడివడిం గుండ వెడలించి, ఫేరువు నూరికి దూరంబుగఁ బాఱివైచె. అంత నామానిసి యచ్చోటు వాసి చనినవెనుక, మూసినకన్ను లల్లన విచ్చి, యచ్చెరువడి యీపాద మస్తకము తన మేనినీలిడాలు విలోకించుకొనుచు, జంబుకంబు తనలోఁ దా నిట్లుచింతించెను. 'నాయదృష్ట మెంతయు మంచిది కాఁబట్టి, నేఁడు నాకు యీదృచ్ఛికంబుగ నేతాదృశం బగునుత్తమవర్ణంబు లభ్య మైనది; నాకోలంబులోన మూన్యుఁడ నైతిని. ఇంకను, జ్ఞానహీనుని చందంబునఁ బ్రాభవశూన్యుండనై, నిరర్థకజీవుండనై యుండనేల: ఇట్టిసరోత్కృష్టవర్ణంబు సమకూరినప్పుడే మేలుం బడయుంజాల కుంటినే, నింక నాక్రచ్ఛ్రాలు సాధించుకొనుట యెన్నఁడు? నా యీత్కృష్ట్యంబు లోకంబులకుం బ్రకటింప నిదియు యుదను.' అని విచారించి, కార్యం బారసి, తోడిఫేరవంబులఁ జేరఁజీరి యిట్లనియె. "విన్నారా? నిన్న రేయి ననొక్కదివ్యపురుషుండు స్వర్గంబునకుం గొంపోయి, ప్రసాదమందస్మితవళక్షుం బగుకటాక్షుంబు నాపయింబోల యించుచుఁ, దనయనుకంపపెంపున సర్వగీర్వాణసమక్షంబునఁ బూజ్యం బగుప్రాజ్యారణ్యరాజ్యంబునకు సర్వంబునకు నన్నధ్యక్షునిఁగాఁ జేసి, యీ యుత్తమవర్ణంబు నాకుఁ బ్రసాదించె. సంశయంబునాయ నా యొడలు వొడగాంచితిరిగదా? ఇఁక వినవలసినది విస్పష్టముగావినుండుఁ. ఇది మొదలు, మీరంబఱు మదీయాజ్ఞానుసారంబుగఁ గింకుర్వాణులై ప్రవర్తింపవలయును. మఱియు నేఁడునుతో, యీకాననంగల జంతుసం తానంబెల్ల నాయానకు లోనై మెలంగవలయును. మీరిప్పుడ వెడలి, యీమేటివార్త సకలాటవులం దేటపడంజాటునది." అనివీడుకొ లిచ్చిన,

సృగాలజాలంబులు దానిమేనివిశిష్టవర్ణం బవలోకించి, రోమాంచకం చుకిత గాత్రములయి, యించుకయు ననుమానింపక, యాచరిత్రము, విస్రంభపాత్రముగా వగచి, వినయభయసంభ్రమంబు లుల్లంబుల మల్లడిగొన సాగిలఁబడి మ్రొక్కి; చని యక్కాననంబు దశదిశలంగల సకలజంతుజాతంబున కాతనివృత్తాంతంబు చిత్తంబుల కెక్కినట్లు పౌనఃపున్యంబుగ వాక్రుచ్చి, వచ్చి, నిర్వ్యాజవినయంబున నహర్నిశం బును భక్తిసేయుచుఁ, బ్రదక్షిణప్రాప్తానురాగంబు లయి, వంచనలేక యవంచకంబు నజస్రంబును సేవించుచుండెను. అది మొదలుకొని, యంధపరంపరా వ్యవహారంబున భ్రమియించి, వనంబున వసియించు సింహశార్దూలాదిమృగజాలంబు లాసృగాలంబున కాజ్ఞానువర్తులై, మహోపహారంబులు సమర్పించుచు, నాతనిమన సెక్కడ నొచ్చునో యని యనుసరించి సంచరించుచుండెను. ఇట్లాగోమాయువు, హార్య శ్లాద్యత్వమనత్వంబులు పరిజనపదమునం గుదిరి యవిరతమును దనమాటలో మెలఁగుచుఁ గొలుచుచుంటంబట్టి, తొట్టిన గర్వాతిశేకం బునఁ దనజాతి మెగంబుల మొగంబైనఁ జూడనొల్లక, వానియం దెల్ల నతిమాత్రనిరాదరంబై యుండె. అందుచే, నాశివాసముదయ ములు విషణ్ణహృదయములయి తమ ప్రమాదమునకు నిర్వేదము నొందుచు, వ్రేలు మొగములుపడి తమలోఁ దలహోతలకుం జొచ్చి, రహస్యముగ నొక్కనాఁ డొక్కచక్కిం గూడుకొనియుండ, నందొక్క వృద్ధక్రోష్టువు తనవారినెల్లఁ గలయం గనుంగొని యిట్లనియె. "ఇది యంతయు స్వయంకృతాపరాధము. కాలకర్మవశులమై బుద్ధిమాంద్యం బున మనమే యీతని కీప్రభుత్వసంపదఁ గలుగఁజేసితిమి. అందుచే నీతనికిఁ గాకియుఁ గోకిలమును నొక్కటిగా నున్నవి. ఎంత మేలుచేసి నను, మనమీతని కేమైన హితులమైతిమే! మత్తచిత్త వృత్తులకుఁ జేసిన

మేలు వమ్మగుటయే కాక, చేసినవారికి గోరములును ప్రాప్తము లగును. విమర్శ దూర మైనవానికడ నిలుచుట, మనది నేరము. ఇంత కాల మొద్దనున్న తప్పునకు, నిశితము వీనిచే నవమానవాక్యములం బడిపడి యెమ్మెలెల్లఁ జిల్లులు వడ్డవి. ఇప్పుడు కార్యము తప్పినది. వీని నిన్నాళ్ళును భాడంబునట్ల తల మోచితిమి. ఇంకఁ దఱిచేచి, కటికి నేలం గూలవైపకున్న, మనకుఁ బ్రాణాంతంబువచ్చు. ఆపత్కరి హారార్థముగా నేనొక్క యుపమ సెప్పెద. అది మీమదులం బట్టు కొలిపి, యీపుట్టిన కలంకఁ దొలంగఁబెట్టుఁడు. ఈమృగధూర్త కాధ ముండు రాజ్య మదాంధ కాకంబు కన్నులం గప్పుకొని, క్రిందును మీఁదునుం దెలియుఁ జాలకున్న వాఁడు! ఒద్ద నున్నవారి నైనఁ గనఁడు. మనమెల్ల వీనిమృషావచనమ్మ్మలు నిక్కమ్మ్మలని నమ్మి తెలివిలేక మోసపోతిమి. నక్కయెక్కడ నాకలోకమెక్కడ? రాజ్యం బునకుఁ బట్టంబు గట్టు టెక్కడ? ఇది యంతయు నదృష్ట శ్రుత పూర్వము. వీలాగుననో దీనికిఁనీలిరం గలవడిన, నిట్లిన్ని మాయలీటక్కరి నక్కయే పన్నినది. దీనికి మూలం బెఱుఁగమిని, మన మిట్లు వితాకు గదిరియుంటిమి. ఈమతకరిబూమెలు చెవి నిడి మానంబుఁ గోలుపోయి తిమి. ఒక్కమనమే యన నేల? పంచాస్యాదులును నీమ్రుక్కడి నక్కచేత నవమానితంబు లయ్యెను. ఇంత వఱకు మనమే వివేకుల మనుకొంటిమి; మన మృగేంద్రాదు లంతకు ముందే వివేకులు. కడ చినగాథల ద్రవ్వనేల? మన చిత్తమూంద్యమే మనల నింతకుఁ దెచ్చినది. ఇఁకను మేలుకొనకున్న, దానిచేష్ట లెప్పుడు నప్రతిహతంబు లయి సాగుచుండును. ఇప్పు డాతండు పట్టిన దెల్ల బంగార మగుచున్నదని, మన మాతని నంత పెద్ద సేయువలదు. అగుకాలంబున నర్థంబులు దుర్బుద్ధికైన సిద్ధించును. కాని కాలంబున సుబుద్ధులకును సిద్ధింపవు

అయినను, ఋజుమార్గులై యాపదలం బొరయక, చిరకాలబహు సౌఖ్య భాగు లగుదురు. తనకుఁ గాలంబు నిండి, యాతండాత్మవినాశ హేతు వగు దారాత్మ్యంబున, హార్యక్ష ప్రముఖుల యెడఁ గుటిలవర్తనుం డయ్యెను. 'చెట్టుచెడుకాలంబునఁ గుక్క మూతిపిండె' యన్నట్లు చేటుకాలంబు కడు నికటంబైన, వీని కీదుర్బుద్ధి ఘటిల్లెఁ గాఁబోలు! 'వినాశకాలే విపరీతబుద్ధి' యను నార్యులవచన మేల వృథ యోవును? పొత్తి పురువు తెఱఁగున, నీపేరువును దన్నుఁగట్టఁ ద్రాళ్ళు తాన తెచ్చుకొన్నది. మఱియు హారులు గిరులు దీనిఁ గొలుచు చున్నవని యును మనకు వెఱవఁ బనిలేదు. మర్మజ్ఞులయెడ మానావమానంబు లెంతవారికి శుభాశుభంబుల నావహింపక మానవు. కావున మర్మ జ్ఞులమైనమన కీయొప్పనివానిఁ బరాభవించుట యఱచేతిలోని పనియై యుండును. మన మనోవేదనాపనోదార్థంబుగా దీని కొక మంచు చెప్పెద. మీరెల్లరు దత్తావధానులరై వినుండు. ఇప్పుడు మనమెల్లను గూడి, వీని కభిముఖుల మయి కూసిన, జాతిస్వభావంబునంజేసి తానును గూసెడును. ఆనన్న యించుక యెఱింగినేని, యప్పు డిప్పుండరీకాదు లలో నెద్దియైన నిద్దుష్టుని దిష్టాంతంబు నొందింపక పోదు. ఈశ్వర సంకల్పమును ననుకూలంబై వచ్చిన, శత్రునిరాసం బనాయాసంబుగఁ జేకూఱును. ఇంతకన్న నిరపాయంబైన పరమోపాయం బొక్కటి లేదు." అనిన, నావాక్యములు వీనుల కమృతోపమానము లయిన నిర్భరప్రమదంబునం బొదలి కదలి, దివసావసాన సమయంబున నాభూరి మాయువుదిక్కు మొగంబయి, తదీయరాజ్యావసాన సామీప్య సూచ కంబుగా వఱిడులఱచెడునో నా, నానక్కలెల్ల నెదురుపడి కూయఁ జొచ్చెను. ఆకూత చెవిసోకుఁడు, నక్కలరాయండును దురతిక్రమం బగు జాతిధర్మంబుఁ గడవ నేరక, విధి చోదితుండయి, శ్రవణ విదారణ

దారుణారావంబుఁ గావించె. ఆరొద చెవిఁబడ్డతోడనె, తత్పార్శ్వం బున నున్నయొక్కబెబ్బులి యది నక్కయొకటా యని యెత్తింగి, కోపావేశంబున దంతసందష్టదారుణాననం బయి లేచి, మెఱుంగుమెఱసిన తెఱంగునఁ జెంగునఁబోఁదికుఱికి నెత్తురవఱదలు వాఱ గొంతుక్రోవి యట్టకుంబాపి, తనదారిం బోయెను. అంతకుమున్న నిలువలేక పరు వెత్తుదానిమేనిప్రాణంబులతోడనె, బంధుజనమ్ములమనమ్ముల యుమ్మలమ్ములను బరుగువాఱె.

"కావునఁ, బరపక్షం బెందును భయావహంబు. ఈకాకమును జేరఁదీయుట నామతముగాదు. ఇంతకుం గార్యంబు భవదాభావాధీనం బయి నడుచును." అని వలుకు మంత్రివాక్యము లాకర్ణించి, హంస స్వామి యిట్లనియె. "మనకు నేఁటజేపట దారుణరణంబు నఁప్రాప్తంబు కాఁగలదు. అప్పుడు శూరజనసంగ్రహణంబు సముచితాపేక్ష్యం బయి యుండును. రోయఁబోవుతీవియు దైవయోగంబునఁ గాళ్ళంబెనఁ గొన్నతీరున, నీశూరవరుండు కోరినకోరికగా మనకు లభ్య మయ్యెను. సిరిరా, మోగా లొడ్డ నేల? మనపాలిటిపుణ్యస్వరూపంబు సన్ని హితంబైన ట్లీతనిప్రాపు దొరకినది. అశుభము లట్ల శుభములు నప్ర యత్న సిద్ధంబులు. 'అయాచితోప పన్నంబగు మేలుఁ బరిహరింపఁ గూడదు. మనము జలచరంబుల మితండు స్థలాచరుం డంచువేని, వజ్రమును భేదింపఁ దలంపు గొన్నవాఁ డనన్య భేద్యంబగు నద్దాని వేఱొండు వజ్రంబుచేతనె భేదింపవలసి యుండుంగాన, స్థలచరుండగు చిత్రవర్ణుని దోరింపఁగోరు మనకోరిక స్థలచరుండగు నీనీలవర్ణు తోడ్పాటులేక చేకూఱు నేరదు. మనపు వెకలులమై యీబలియుని చెలిమి నొల్లక పీడనాడితిమేని, యలుక యొలసి యల్ల శిఖి తల్లజుం గలసిన నవల వలవని వానిం గలసం గెలుచుట కరంబు

భరం బగును. వాంఛితార్థంబును గడముట్ట నేరదు. పిమ్మటఁ జేమించిన కార్యంబునకు వగగొంట నిర్వాణదీపతైలదానం బయి, యత్నవైఫల్యంబెకాక మనోవేదనానర్థమును నగును. కాఁబట్టి, సర్వ విధంబుల మన కీకరటంబు పరిగ్రాహ్యంబు. ఇంక లేనిపోనిశంకలు మాని, యీప్రయోజనం బంగీకరింపుము." అనిన, మంత్రియు నించుక యనుమానించి, మిక్కిలి విన్నవించిన జేనిమనసు నొచ్చునో యని హృదయానురంజకంబుగా నిట్లనియె. "సర్వధర్మమర్మజ్ఞానమాన నీయులు, దేవరకుం దెలియనికృత్యాకృత్యంబులు లేవు. కార్యగతుల తెఱంగులు దేవరవారికన్న మిన్నగా నారయువారును లేరు. లెస్సగా విచారించి, కార్యంబు దేవరచిత్తవృత్తి యెత్తెఱంగున వర్తించు నత్తీరున నాచరింపవచ్చును. నాయెఱింగినంతవట్టును నేనువిన్నవించితి. ఈ వఱకే ప్రణిధి నిర్ణయింపఁబడియె; దుర్గంబును సంసిద్ధం బయినది. ఇంక జంపు నడపక, దూతను రావించి, యేతెంచినప్రయోజనంబు విమర్శించి పంపఁజను." అనిన జేఁడు 'నట్లకాని' మ్మనుడుం, జక్రవాకంబు బయలిగొలువుం బ్రవేశించె. అంతకుమున్న యెకివీఁడును జనుదెంచి, యాస్థానం బలంకరించి యుంటంజేసి, పరిజనంబు లల్లనల్లనఁ బరతెంచి, యధ్యక్షుండు యథాప్రధానంబుగా నంభావింపఁ, దమతమ నెలవులం బొలిచిరి. అప్పుడు ప్రెగ్గడ ప్రతిహారు నొక్కనిఁ జీరి, "నీవేగి వేగిర మాకీరంబును గాకంబును నేలికచెంతకుం గొనిరమ్ము." అనుడు, 'మహాప్రసాదం' బనిచని, పణిహారి తెలుపుడుచేసినఁ, గాకకీరంబులు గొలువు సొత్తెంచి, హిరణ్యగర్భకరనిర్దిష్టాసనంబులం గూర్చుండె. అంతఁ గుశలప్రశ్నంబుఁ గావించి నిజాగమనప్రయోజనం బడిగిన యెఱుఁడయని కభిముఖంబై, దరవిరహితంబుగా శుకం బిట్లనియె. "దేవా! నావచ్చినకార్యం బవధరింపుము. "జంబూద్వీపాధినాథుం

డగుచిత్రవర్ణ నామబర్హీంద్రుండనుప, మీతోడ మాటలాడఁ బని గలిగివచ్చితి. ప్రయోజనాంశంబు తిరుఁడవై యాకర్ణింపుము. అవసరం బగునేని విన్నవించెద; హృదయం బేకాగ్రంబు గావించి, యాతం డాజ్ఞాపించినవలుకులకుం జెవి యొగ్గును. 'మీకప్పురపుదీవి లోనుగాఁ గలచిఱుదీవులెల్ల నీనేరెడుదీవిక్రింది యలంతిదీవు లగుటంజేసి, యీసు మాని వానియేలిక లందఱు మీకుఁ గరం బర్పింప నర్హులు. కావున, నీవును మీనప్రాణంబుల కాసింతువేని, యీసు గాదను వివాదంబు మాని, మానేలకు వేళమవచ్చి, యస్మచ్చరణంబుల శరణువేఁడి, నేఁ డాదిగా నేఁడేఁడును దప్పక కప్పం బప్పనము చేయుచుండునది. సామవచనంబుల నీమనంబు కూడియాడుట కొడంబడదేని, నేనిడెడదనంబున నీయదంబు సదమదంబు చేసి పుడమి వడయ నడతెంచుచున్నవాఁడ. వాఁడిమగండవై నిగుడునది.' అని మీకెఱిఁగించి, మీ వాక్యంబుల తెఱం గెఱింగిరమ్మని నన్నిచ్చటికిం బుచ్చెం. నాకిక్కడఁ గడుందడయఁ దీఱదు. సత్వరంబుగఁ బ్రత్యుత్తరం బొసంగి, సెల వొసంగుము. ఆకేకిలోకాధ్యక్షుండు దుర్వారవైరివారగర్వనిర్వాణాఖర్వశౌర్యధుర్యుండు; నిగ్రహానుగ్రహసమర్థుండు. కాన, నాశిక్ష వరుమఱువు సొరుము. ఆతనిబుద్ధిఁ గైకొనక నిరాకరించితేని, నీకీర్తి కల్పకాలంబునకె సమాప్తియొదవును." అనినం దోఁకత్రొక్కిన త్రాఁచుచందంబున సముత్థితుండయి, వళక్షవక్షీంద్రుండు, రోషావేశంబునఁ బెదవు లదర, నద్భుతరసాక్రాంతం బగుస్వాంతంబుతోఁ, మేఘగంభీరభాషణంబుల నిట్లనియె. "ఎట్టట్టూ! నేఁ డేమేమో త్రోత్తలు వింటిమి!" అని కొలువు కలయంజూచి "ఆహా! వింటిరే? నేఁ డెట్టిచిట్టలు పుట్టెనో! ఒక్కకూళనెమ్మిపిట్టకు, నవ్యాజతేజోవిరాజమానంబయి క్రాలుజాలపాదోత్తమంబు పాదాక్రాంతంబయి యరి

వెట్టవలయునఁట! ఔరా! ప్రతాపోక్తులు! అట్టులైన, సింగంబులు ప్లవంగంబుల యడుగులం బడి, శాశ్వతపరిచర్య చేయవలయుం గాఁబోలు! చిత్రవర్ణఁ డలవి యెఱుఁగలేక, చుట్టుకొన్న యజ్ఞానతిమి రంబున, నశక్యవిధానంబునకుఁ బాటుపడుచున్న వాఁడు. తొల్లి వాండ్రను వీండ్రను గొందఱు జయించితినని తలక్రొవ్వి, యిక్కడ నక్కొలందినె పోవు నని తలంచెంగాని, హిరణ్యగర్భనిప్రతాపాగ్నికిఁ దనప్రాణములు వెచ్చపెట్టక బ్రతికిపోలేమి యింతయుఁ జింతింపఁ డయ్యె." అని, యనివార్యక్రోధభీషణుం డయి పలుకుచున్న జేనివంకఁ జూడఁజాలక, భయార్తమూర్తులై సభాసదులెల్లఁ బరస్పరముఖావ లోకనంబులు సేయుచుండ, నామరాళనేత యనుభావంబున కను రూపముగా రిత్తకోపంబు తెచ్చుకొని, దండ నుండుబలిభుజుండు కోపంబు రూపంబు దాలిచినపోలిక లేచి, యాచిలుకకై వెలలుచు, సవినయముగా దొర కిట్లనియె. "కాలపాశబద్ధుండై, యీపాలసుం డోలగంబున దేవరం దన్ను విచారింపక, మండెమేలంబున నోరికి వచ్చిచ్చెల్ల గర్ణకఠోరంబుగఁ బ్రేలుచున్న వాఁడు. ఎంతగుండెగల వాఁడు గాకున్న, నిట్లు మొఱకడమ్మలు పచరింప నోపునే? వీనిం దూతయని దయఁ జూడఁగూడదు. ఈయధముం డత్యంతంబు వధా ర్హుండు. ఏను దేవరసేవకుండ నుండ, నేలినవారికి శ్రమయేల? మాఱు పలుకకుఁడు; నేఁ గడఁగి యీచెడుగు నిప్పుడ కడముట్టించెద; మదీయవిజ్ఞాపనము వృథాకరింపక, ముదల యీవలయును." అనుచుం గదలి, ఫలాశనముకడ నిగుడుచు, నెడసొచ్చి యచ్చకవాకవల్లభుం డిట్లనియె. "నిలునిలుము; సాహసోద్యోగంబు వలదు: ధర్మంబుఁ బదటఁ గలవకుము. దూత్రప్రాణంబుల కలుగుట పాడిగాదు. పాడి విడిచిన వుడమియొడయనికడ నొడమె వెడలునని, నెఱి నెఱి నెఱిఁగిన

గఱువలవలన విందుము. త్రికరణశుద్ధిగా భూతజాతంబులయెడ నెగ్గు దలంపమి శీలంబు నాఁబడు; సమస్తంబునకు శీలంబు మూలంబు; శీలంబువలన ధర్మంబు నెగడును; ధర్మంబువలన సత్యంబు గలుగును; సత్యంబువలన వృత్తంబు చొప్పడును; వృత్తంబువలన బలంబొలయును; బలంబువలన సిరి యొదవును; దానివలన సర్వకార్యసిద్ధులును సంఘటిల్లును. అవు నావును గ్రుమ్మలాడి, నడిమిలేఁబెయ్య కాళ్ళు విఱిచినట్లు, రాజును, రాజునుం బోట్లాడి దూత కెగ్గుసేయ డగ్గఱుకే? ఏతతి నేతతికి సర్వానర్థంబులును సిద్ధంబు లగును. దూత యెప్పుడు నవధ్యుండు. ఆతండు తనయవధ్యభావంబుఁ దలంచి, వలుక వలసినట్లల్ల వాయోడక పలుకుంగాని యెన్నఁడైన మోమోడి స్వాపకర్షంబుఁ బరోత్కర్షంబును బ్రకటింపఁజూచునే? ఈతనిమాటలు తప్పుగాఁ బట్టఁబోకు. దూతవలుకుల కలుకఁ బూనుటకంటె నవివేకము లేదు, కోపము మూర్ఖులకు ముక్కునఁ నె యుండు; క్రోధి, కార్యాకార్యజ్ఞతఁ గోలుపోయి, యవధ్యులనైన వధియించును; తుద కాత్మఘాతమునకైన శంకింపఁడు. కోపము పాపముల కెల్లను మూలము. కావున, క్షమాజలములం జేసి మతిమంతుఁడు క్రోధానలము నార్పవలయునని, సూక్ష్మదృక్కు లైనమహాత్ములు పలుకుదురు. క్షమయే సర్వకార్యములకు సమృద్ధి కారణము. కోపము కొనియాడుట లగ్గుగాదు. క్రూరకర్మము యోధధర్మం బగునే?" అని మందలించి, నీలపర్ణునిఁ గొంత ప్రశాంతస్వాంతుం జేసి, సంరంభంబుడిపిన నుదీర్ణతరనిశ్వాసుండై, యాతండు కుంభనిక్షిప్తభుజంగంబు భంగి రోఁజుచు, నిలువంబడి యుండె. అంతఁ దద్వచనామృతాస్వాదనంబునం దేఱి, ప్రశమితక్రోధుండయి యున్న రాజునకు మంత్రి యిట్లనియె. "దేవా! తడవయ్యె. ఈశుకోత్తముండు ప్రత్యుత్తరము

వార్చియున్నవాడు. ఇంక నిలువఁగూడదు. మీ మనోనిశ్చయము చందం బానతిచ్చి, చెచ్చెరఁ బుచ్చవలయు." అనినఁ, గలహాంసా వతంసుండు శుకంబుపంక మరలి యిట్లనియె. "ఓరీ! యరుణముఖా! వినుము వాక్యం బస్మదీయంబు. నీవేగి నీరాజును బొడగన్నతోడనె, నోరోడక సభామండపమున నందఱు విన నాపలుకులుగా నిట్లనుము. 'నీవు రాజ్యమదంబు ముదిరి మాదేశం బొక్కట నాపోశనము గొనఁ దలఁపు గొన్నవాఁడవు. హిరణ్యగర్భనిముక్కున నూర్పు గలుగ, నీ నేల నేలఁగలుగుట నీకకా దల్ల నొసటఁగన్నవాని కైన మెయి మెయిం గలుగనేరదు. నీవు నాబల శౌర్యములకు మారొడ్డుట, ఖద్యోతంబు ఖద్యోతమండల ప్రభాపటలంబుఁ గడవఁగడఁగుట. ఒక్కచిత్ర వర్ణుండె కాఁడు, కోటిచిత్రవర్ణు లొక్కట నెత్తివచ్చినను, సంవర్త మార్తాండమండలము మెండున విపత్కదురధిక్షేపం బయినప్రతా పంబున వెలుంగు హిరణ్యగర్భని రణాంగణంబునఁ దేజిచూడ శక్యంబు గాదు. నీవు నిక్కంపుఁబౌరుషశాలివేని, యాలంబుచేసి మానేల నొడిచికొనుటయే మగతనంబు. అప్పుడుగా నీమగంటిమి మెచ్చుకొందుము! ఎందును నినుబోఁటి శూరమానులమాటలె కోటలు దాఁటుంగాని, కాలు గడపదాఁటదు. పనికిరాని యీ బేరజ పుంబీరంబులు గట్టిపెట్టి, పోటుబంటనై పోరితంబునకు డాయుము. మృత్యువుం గృతకృత్యుఁ జేసెద. లేదా నీపడుచుమాట లపలఁబెట్టి, జితోస్మి యనుము. అనిన న్విడిచెద." అని తెగనాడి, యివి యన్నియు మాయేలికపాల నళుకుమాని వాక్రువ్వవలయుంజుమా." అని మఱియుఁ జెప్పి, "మీరాజు నాజకిం గొనిరమ్మ్మి, పొమ్మ్మి." అని పసదనం బొసంగి, స్వాదుఫలదానంబున సంతృప్తుఁ జేసి, వీడుకోలిచ్చిన, నచ్చిలుకయు రాజున కున్మఖంబయి, "మీకడ నేమియుఁ

దప్పనాడనుగదా? నావాక్యంబులం గలవచస్ఖాలిత్యంబులెల్ల మఱువ వలయు; నావల్లఁ జాల శ్రమం బయ్యెను. పోయివచ్చెద; నాతోడ నింకేమేనియుఁ జెప్పవలయునది గలదే?" అని సవినయంబుగా వీడ్కొని, పని వినియెను.

అట్లాకీరంబు బయలుదేఱి, కతిపయప్రయాణంబున నిజ దేశంబుఁజేరి, దుర్గమార్గపరిశ్రాంతికొంతశాంతించిన వెనుకఁ గొలువు కూటంబునకుం బోయి, పేరోలగం బున్నమయూరరాజుం గాంచి, ప్రణామంబు గావించుడు, నాతండు కరుణాతరంగితంబులగునపాం గంబు లరుణముఖునివయిం బొలయించుచు, సాదరంబుగా నిట్లనియె. "ఓయరుణముఖా! కర్పూరద్వీపమునకుం బోయి యొకయొచ్చెంబుఁ దొరయుక మరలి నేమఁబున వచ్చితివా? నీవచ్చటనే కదలనికంబంబ వైతి వదియే మొకో యని, మనమ్మె తామరపాకునీరుక్రియఁ దల్లడిల్ల ననిశంబు నీమార్గమె చూచుచు, నిమిషంబొక్కకల్పంబుగా దినములు వుచ్చుచున్నారము. మాచేసినభాగ్యంబుకతంబున, నేడుతిన్నఁగా నిన్నుఁజూడఁగాంచి మాకన్నులు చల్లనయినవి. అచ్చటి వార్తావిశే షంబు లేవియుఁ గడమువడకుండఁ దెలుపుము" అనిసశుకంబిట్లనియె. "నాఁడుస్వామియానతిమాళిఁదాలిచి, హిరణ్యగర్భపాలి కేగి, మాట లాడి, యాతఁ డనుప నిప్పుడ వచ్చితి. ఆదీవిమానోజ్జికం బేమని విన్న వింతును? ఎక్కడఁజూచిన నవ్వనరన్నమన్వితంబును సుమనోవిరాజితం బును నయి, మాఱుటస్వర్గంబునాఁ జూడ్కికి వేడ్కఁగొలుపుచున్నది. హిరణ్యగర్భుండును నాత్మరక్షయం దప్రమాదుండయి, యభిభూతుల వేఱుకన్నులంజూచుచుండును. ఆలంకంగలవిహంగంబులెల్ల, ననూనం బగుసభిజనాభిమానంబు గలవయి, తమరాజు నవ్యాజానురాగమునం గొలుచుచుండును. అస్మదాటు లాయెప్పులో శతాంశంబును జెప్ప,

శక్తులుగారు. నేర్చినవఱకుం జెప్పుదుననన్ను, అందులకుం బెక్కుదినం బులు పట్టును. ఆకథ దవ్వుల నుండనిండు. నే నేగినప్పుడు, హిరణ్య గర్భుండు లోపలికొలువులో నిజామాత్యద్వితీయుండై మంతనం బుండి యుంటంజేసి, మదాగమనాభిధానంబులు విజ్ఞాపనంబు సేయుండని దౌవారికుల నెందఱి నెన్నివిధంబుల నర్థించిన, 'మంచిది చెప్పెద ముండు' మనుచుంటయెకాని, యెవ్వరుం గాలుకదల్పఁ జాలినవారు గారు. తరువాతఁ గొంతసేపున కొకరెండువిడుతలు కొందఱు లోనికిం బోయివచ్చి, 'యిపుడు సమయంబుగాదు. కొంచెము తాళు' మనుచుం జాగు చేసిచేసి, యా దొక్కరుండు లోపలినుండి వచ్చి, 'యేలిక సెలవైనది ర' మ్మని నన్నుఁ బిలుచుకొనిపోయెను. అయ్యవసరంబున నయ్యేకిమిూఁడు సంతత సేనాసమాయాతశకుంతజాతంబులవరవుడంబు లంగీకరించుచు, నాంతరంగికులమనవికిఁ జెప్పి యొగ్గుచునుండి, యాలో ననున్నుఁ జూచి, సముచితాసనంబునఁ గూరుచుండ నియమించి యాగ మనకారణం బడిగెను." అని, తాఁ గొలువు సొచ్చుటాదిగా హిరణ్య గర్భుం డాడ నియోగించినమాటలు తుదిగా నడచినసర్వవృత్తాంతం బును నానుపూర్వ్యంబుగా విన్నవించి, మఱియు నిట్లనియె. "ఆతండు నన్నిచ్చటికంపుచో, న న్నలవోకగాఁ జూచుచు, నవసానంబున 'నీరాజు నాజికిఁగొనిరమ్ము పో' మ్మని వేగిరించె. ఆతఁ డరాతుల కసాధ్యుండు; అనుపోష్యులును భటులును యుద్ధశౌండులు. అయినను మనకొదవ లన్నియు దీర్చి గెలుపొసంగ, మనమేఘవర్ణుండు గలఁడు. అవసరోచితంబు లగువర్తనంబుల జేనిమనసున కెక్కఁ బ్రవర్తిం చుచుఁ, బ్రసాదంబునకుఁ బాత్రభూతుండై, యాతం డచ్చట నీలవ ర్ణాహ్వాయంబున రాజునకు విస్రంభభాజనంబై యున్నవాఁడు. వెఱవ నేల? భారంబు దైవంబుమిూఁదఁ బెట్టి, 'ధర్మోజయతి' యని యుద్ధం

బున కుద్యోగింపుము." అనిన, గొలువు కలయుం గనుంగొని, చిత్ర వర్ణుం డిట్లనియె. "వింటిరే? చెప్పులార మీ రెల్లరు. హిరణ్యగర్భుని గరువపుంబలుకులచందంబు. తా నట! జితోస్మియనిన, నన్ను విడుచు వాడఁట, ఈవాక్యం బొక్కటియె నాహృదయుంబునకు శల్యభూతంబై నొవ్వు దనికించు చున్నది. ఏనాఁడైన మదకుంభికుంభవిదళనపటిష్ఠ నిష్ఠురనఖముఖం బగుకేసరి ఘాసంబు గ్రాసంబుసేయఁ బొలుపడునె? చిత్రవర్ణుం డొరున కొక్కనికి, నీవుణ్యమని దోసిలి యొగ్గి మనుట కల నైనం గలుగనేర్చునే? ఇత్తతి సమరంబుకంటె నుత్తమకృత్యంబు నాముది కొక్కటి చూపట్టదు. పరరాజ్యజిగీషుత్వంబు కన్నను, ననాన్నతం డాడిన తులువమాటలు కలనికి మిక్కిలి త్వరపెట్టు చున్నవి. నాపేరు విన్న, బాఱుపాముసం గదల వెఱచు. అట్టిన న్నా తెలిపిట్టల మన్నీఁ డారివేరంబున వీనిని వారినింబోలె వెఱపింపఁజొచ్చె. ఆహా! అంత్యకాలం బాసన్నం బయ్యు, దుష్ప్రలాపంబులు సేయుచున్న వాఁడు! ఎవ్వఁడు వైరంబు తుదముట్ట సాధింపఁజాలఁడో వాని జన్మంబు నిరర్థకంబు. పౌరుష శాలికిఁ దనంత వాఁడు పగవాఁ డుండినఁ, బగ తెగునంతవఱకుం గంటికి నిద్దుర రాదు; నోరిఁ బోరెం బింపుగాదు; ఇతరసౌఖ్యంబులు మనసునం జొరమి వేర చెప్పనేల? కావున, మనమిప్పుడ జైత్రయాత్ర వెడలి, పగవాని నిర్జించుట కర్జంబు. మీవంటి సహాయ సంపన్నత్వము గలుగ, నాకొక్క హిరణ్య గర్భుం డెంతవాఁడు? ముల్లోకంబులు నొక్కట నెత్తివచ్చినను, సరకుగొనను. అతం డింటనుండిఁ దలమితప్పిన గర్వమున మనల మాటలం గెలుచుచున్న వాఁడు. మన మాయుధమునిబ్రధనంబున నిధనంబు నొందించి, నో ర డంతము. సరివాఁడొకఁడు గొలువులో ములుకులవంటి తులువమాటలు పెక్కులు ప్రేలెనన

విని ప్రతికృతిఁ గావింపక యూరుకువుగలవాని కొటులు తాళ మనసు వచ్చు? మన మొకవేళ దయఁ దలఁచి యోరిచి యూరకుందుముపో, లోకులు మనలఁ జాలనివారనరే? లోకాపవాదము వడశక్యమగునె? ఆహావంబు శుభావహంబు గాదనియు జయాపజయంబులు దైవాధీనంబు లనియుఁ దలంచితిరేని, వినుండు. ఈదేహంబులు బుద్బుద ప్రతిమంబులు; మృత్యుకృత్య మిదమిత్థ మని నిశ్చయింప రాదు? పుట్టినవాఁ డవశ్యము గిట్టవలయును? సదనమునఁ గదలని గదములంబడి యొడలు విడువక, పగతుండు వెగడుపడునట్టి దిట్ట తనంబు వాటించి, యూలంబునం గూలుమేలు పురాతన జననకృత సుకృత పరిపాకమునంగాని చేకూఱ నేరదు. బహూక్తు లేల? కలనం బొలియఁగనుట స్వర్గమార్గంబుఁ గనుట. ప్రసంగ వశంబున నింతయుఁ బలుకవలసి వచ్చెంగాని, వివేకధనుల రగుమీకు ధర్మంబు లుపదేశించు పాటివాఁడంగాను. తద్దయుం బ్రొద్దుపోయెడు జాగేల? మీమీసైన్యంబుల నాయితంబు చేసికొని రండు; పొండు. అని చేసి, మనమాదాయసిరిహరింతము విత్తములుపురుషారంభాయత్తములు." అన, మంత్రిదూరదర్శియిట్లనియె. "దేవా! యింటగెలిచిమఱిరచ్చ గెలువ వలయును. మనలోనిమాట విచారింతము. ఇప్పుడు మనయరుణ ముఖుండు చెప్పినవాక్యములచొప్పు పరికింప, సంగ్రామం బుత్తమ కర్మంబుగా నాబుద్ధికిం దోఁపదు. మిత్రామాత్యానుహృద్వర్గంబులు దృఢభక్తియుక్తులయి యుండి, విపక్షునికడవారు విపరీతులై యుండి రేని, భండనం బప్పుడు కర్తవ్యంబు. మఱియు విగ్రహంబునకు ధరణియు హిరణ్యంబును ననుఁ రెండును ముఖ్యఫలంబులు. అవి తద్దయు నిశ్చితంబు లైనపిదపఁగదా, కదనంబునకుఁ గడంగవలయును? అంతియకాక, వడివడిం దొడర ననన్యసామాన్యపరాక్రమమాన్యం

డైనహిరణ్యాగర్భుండంత యశ్రమసాధ్యుండె? మనతలఁచున ట్లాతఁ డలంతులఁ బోవువాఁడు గాఁడు. అతఁడు పెద్దయుఁ బ్రబారంజకుండై యున్నవాఁడు. సేవకులును గేవల వీరవ్రతశ్రౌండులు. వైరిబలంబు విచారింపక, మూఢుండు సాహసంబునకుం జొచ్చి, హరిబారిం బడు హరిణంబుకరణి మరణంబు నొందును. కావున, నీసాహసిక్యంబు మానవలయు" అన, మంత్రిమాట చెవిఁ దూఱిక, యలుకవొడమి యొడయండిట్లనియె. "నీవాక్యంబులు చూడఁ బ్రత్యాతిచిత్రంబులుగా నున్నవి. నీవు కేవల వయోవృద్ధుఁడవు. తల తెల్లనైనంతనె యెఱుక కలుగు నెట్లు? ముదుసళ్ళులు దమ కనుకూలంబుగాఁ జదువుకొనుటఁ దక్క, వేఱొక్కటిఁ గానరు. జ్ఞానవృద్ధులబుద్ధులు గదా, సభ్యుల కెక్కును? నే నెట్లును బరరాజ్యాక్రమణంబునకుం గృతనిశ్చయుండనై యున్నవాఁడ. ఇఁక మదీయోత్సాహభంగంబుగా మాకడ నీ నేర్చిన వెల్లను వల్లింపకుము. ఓపితివేని, విజయానురూపంబులగుసల్లాపంబులు నలుపుము. అట్లు నలిపినను, నీవు మాకు మహోపకారంబు చేసిన వాఁడ వగుదువు." అనుచు నెఱఁకుదూఱఁ బలికిన, విషణ్ణుం డయ్యుఁ బ్రసన్నుండుంబోలె, దుర్వారం బగుపరిభవవికారం బేమియు వెలిఁ దోఁపకుండ నవ్వుముసుంగు వెట్టి, మానసంబున లేనియుత్సాహంబు దెచ్చుకొని, దాక్షాయ్యనాయకుం డిట్లనియె. "మాకెల్లరకు దేవర మూలకంద మగుటంజేసి, దేవర మేలు గోరి యింతనట్టును నిష్కపట ముగా వచియించితిని. చెవికిఁ జేదుగా నున్నను, స్వామిహితం బెదఁ గోరుభృత్యుండు తనకుఁ దోచినహితము నిశ్శంకముగ వాక్రువ్వవల యును. అట్లుగాక, కొందఱు యథాజాతులు స్వామిచిత్తము నొప్పింప నేల యని, యెఱిఁగినదానినైన నడచివుచ్చి, మనసుకక్కుఱితి నిచ్చక ముగాఁ బెదవులు గదలువ కూరకుందురు. అట్టివాఁడ తప్పక స్వామి

ద్రోహులై, యిహపరలోకదూరు లగుదురు. సర్వధర్మజ్ఞులు, దేవర యెఱుఁగరా నీతినిర్ణీతుల తెఱంగు? మే మెల్లరము స్వామితోటిసుఖ దుఃఖముల కియ్యకొని, యనన్యశరణ్యులమై స్వామియాజ్ఞయందున్న వారము. దేవరనియోగంబన్న, మాకలంఘ్యంబు. సత్యసంకల్పులు, దేవర కెన్నండును నొక్కకొఱంత రాదు. స్వామియానతించేసి, చమూసమూహంబు లాహవదోహలంబు లయి యేతెంచి యున్నవి. దండయాత్ర కిది మంచిసమయము. శత్రువు ప్రక్కడియని ప్రయత్న మల్పము చేయరాదు. చిన్నపామునైనఁ బెద్దకఱ్ఱతోడనె కొట్టవల యును. కాఁబట్టి, సర్వసైన్యసమేతముగా నడచి, యాకస్మికముగఁ బోయి, యేమఱించి వయింబడితిమేనిఁ, బగఱిబలంబుల నేలఁ గలు ఘ్నట మసకుఁ గరము నుకరం బగును. కాలయాపనము చేసిన, వా రందఱుం గూడుకొని, నెయ్యురతోడుపాటుఁగూడఁ బడయుదురు. అప్పుడు వారి దోరిఁచుట కరంబు దుష్కరంబగును కావున, వేవేగ నమిత్రసంతానమును మిత్రనముల్లాసమునుగా దండు వెడలుదము. కార్యము తటిదప్పక చేయుట లగ్గు. 'ఆలస్యా దమృతం విష' మ్మని కదా, యుష్మాద్దృశు లైనపెద్దలు పలుకుదురు." అనుడుఁ బ్రెగ్గడ మాటల కలరి, దండముల నడపింప మొనగాండ్రకు నాజ్ఞయిడి, నెమ్మి సామి సేనాసమేతముగా దాడి వెడలి, నిత్యప్రయాణముల మల యంబుం జేరి, యాచేరువఁ బాళెంబు దిగి యుండె.

పదపడి హిరణ్యగర్భుండు కొలువున్న యెడ, మున్ను చిత్రవర్ణ పాలి కేగినదీర్ఘముఖుండు చనుదెంచి, పథశ్రమమునదూఁగాడుచు నిలువంబడి, జోహారు వొనరించి, జేనియనుమతిని దాపునకుఁ జని, వక్త్రవ్యాంశము విన్నవింప సంకోచించి, నలువంకలుఁ బొఱిఁజూచుడుఁ, దలం పెఱింగి యచ్చటి మేఘవర్ణాదు లవలికిం జనిన, జేనియాననమ్మ్ము

నని మాపు నిలిపి, మఱికొంతచెంత జరిగి మెల్లన నిట్లనియె. "ఓ పక్షి కులసార్వభౌమా! చిత్రవర్ణునిసభం బుట్టిన విశేషములు విన్నవించెద; పరాకులేక యాకర్ణింపుఁడు. కడ కక్కడ నీయెడకు దాడి వెడలుట నిశ్చయింపఁబడి, చిత్రవర్ణుండు సముజ్జ్వలనై జతేజమున మలయధరా ధరోపత్య కన్మానలతోడ వీడు విడిసి యున్నవాఁడు. ప్రతిక్షణమును దుర్గం బేమఱికుండునది. మఱియు నొక్కయాశ్చర్యం బవధరింపుఁడు. మున్నా రాజుచేతఁ బ్రత్యాఖ్యాతం బైన యొకకపోతముతోడఁ జెలి కారంబు వాటించి, రాజమంత్రతంత్రము సమస్తము నొకళించినాఁడను. చెప్పిన నమ్మెదరో నమ్మరో కాని, మనవీట నెవ్వఁడో చిత్ర వర్ణ ప్రేషితగూఢపురుషుం డొక్కరుఁడు డున్న వాఁడని విన్న వాఁడను. ఇప్పలుకు చెప్పునంతలో నప్సారావతంబు కార్యాంతరవ్యాసంగ మున నొండెడ కేగుటం బట్టి, దిఙ్మాత్రంబె కాని, సవిస్తరముగా నాతఁ డెవఁడో యెట్టివాఁడో యడిగి తెలిసికొనం జాలనైతి. అతనితోడి ప్రసంగానుప్రసంగముల వేఱొకప్పుడు మఱికొంక రహస్యంబును నెఱిఁగినవాఁడను. తదీయమంత్రి, రాజు తనమంత్రంబు దెస ననాదరంబు సేయుటంజేసి, యుపేక్షాపరుండయి, యున్నవాఁడట! ఇదియు మన ఫలావాప్తికిఁ గొంత యనుకూలంబుగాఁ దోఁచుచున్నది. నావాక్యములయం దేది యయిన, దేవరకార్యంబునకుం బ్రయోజనకారి యగునేనిఁ, గైకొనునది. మొన్న రాత్రి చిత్ర వర్ణుని పరిచరులు కొందఱు చీఁకటిచాటున నన్నుఁ దారసించి, పూర్వపరిచయంబున, నాపలుకుబడియు మొగముచాయయుఁ దలంచి, యీతండల్లనాఁటి దీర్ఘ ముఖుండౌను నాఁటను సంశయంబుతోఁ గొంతవడి పొట్టుపొరలయి, గుజలు గుజలువోయ డాయఁ జూచిన, నేనా కీ లెఱింగి, తడసినఁ గార్యపాకంబు తప్పునని యెంచి, యుచటఁ

గాలునిలుపక మేను నిదువెండ్రుక పెట్ట లేది యది యే మని యడుగుకలరవంబు తో నేమియులే దిప్పుడ మరలి పచ్చెద నని వులిమిపుచ్చి, దక్కినవారిం గనుమూసి, యిచ్చటి కొక్క యంజను జనుదెంచితి, మనధనళాంగుఁ డచ్చటనే యున్నవాఁడు" అని తావిన్నదియుఁ గన్నదియు ససాకల్యముగా వినిపించి యూరకున్న, క్షణమాత్ర నివిూలిత నేత్రుండై కొంత చింతించి, కుశాగ్రబుద్ధి గావున నహిత కృతద్రోహం బూహించి, మంత్రి రాజున కిట్లనియె. "ఆలించితిరా? మన దీర్ఘముఖుని వచనంబుల, నెవ్వఁడో నెమ్మితేని దూతవేషధారి యొక్కరుం డిందున్నవాఁడని, సూచాయగా నెఱుక పడుచున్నది. ఒకవిధంబున నాగూఢ పురుషుండీ నీలవర్ణుండై యైనం గావచ్చును. ఆకార పూజ్యం డగు నీపలుగాకి కాకి నీకడ నునిచికొనుట యనుచితంబు. వీనిని నిపుణంబుగాఁ బరికించి వేగ వెలార్పవలయు. ఈతనిరాకకు మూలము చాలఁ గలిగియుండును. అదియంతయు వివిూకడ నాకు వాఁకొనలేల? తుదమాట చెప్పెద వినుండు. ఈతని మనవిప్పు డొప్పరికించిన, నుపేక్షితం బయిన యాయుయంబుపగిదిఁ బ్రాణంబుపయి వచ్చును. వేఱొకవిచారంబు మానసి, నామాట చెవిఁదూర్చుఁడు. పరులఁజెఱుప వేఁడి, యరులు పలుపోకలం బోవుదురు: వారాత్మైక్యకార్యాయత్తులు; మాయా శీలురు. వారిమాటల కెల్లఁ జోటిచ్చినఁ, జేటు వాటిల్లును. ఈతండు వట్టి కలపనగంవ. ఈతనిమాట లేమియు నిజము సేయకుఁడు. నిక్క ముగా నీతండు సింహళద్వీపమునుండి వచ్చినవాఁడు గాఁడు. చిచ్చొడి గట్టుకొన్నట్టు లీతని నొద్దఁ బెట్టుకొననేల? స్వకార్యార్థము శత్రువుం డెంతయు నిచ్చకం బచ్చుపడ ముచ్చట లాడి, మచ్చిక చేసికొని, నచ్చికపుట్టించి, కడకుం బ్రతారించి దోరించును. అట్టివానిపొత్తున

కిచ్చగించుట, దండధరుపొత్తు చిత్తంబునం గోరుట. అట్టిఁడు, గోముఖ వ్యాఘ్రంబులాగున, సమక్షవ్యవహారంబుల సాధువర్తనుండుంబోలెఁ జూపట్టును. అజ్ఞానసఖ్యము ముఖ్యముగా సజ్జనుం డుజ్జగింపంజను. కానినాఁడు చిరంజీవి యను కాకమ్మును నమ్మి నిహతమ్మి లైన ఘూకమ్మిలట్లు, కడలేనిహానిఁ జెందును. దేవర కాకథ వివరించెద నవధరింపుఁడు."

పుండరీక గండకవేదండాది నిఖిలమృగకులశరణ్యం బగు దండ కారణ్యంబున, బహుళఫలదళవిలసితం బగు వటవిటపి యొక్కటి గలదు. అయ్యాది పరిసరతరునికరంబుల తోడి పెచ్చుపెరిగిన మచ్చ రంబున మిన్నుముట్టఁ బన్నిదంబు నఱచి, యోడిన తోడిద్రుమాఁకుల నాలోకించి కిలకిల నగుపగిదిని శాఖ లాకసం బొఱయఁ, బలుదెఱం గుల ఘుల్లంగుల కలకలంబులు సెలంగ, గరం బభిరామం బయియుండు. ఆభూజరాజంబున, లోకభీకరంబు లగుకాకిమూఁక లనేకంబులు దన్నఁ గొలువ, సత్వనిర్జితసుపర్ణుం డగు మేఘవర్ణాభిధానుండు బలిభు గ్వల్లభుండు కాఁపురం బుండును. వాయసావాసం బగు వటకుటంబు నకుఁ గొంతచెంత, నులూకమందిరం బగు సుందరవసుంధరాధరకంద రంబుదనరును. ఆగహ్వారంబున, దుర్దమరిపుమర్దనుండగు నుపమర్దనుం డను నులూకలోకాధ్యక్షుం డొక్కఁడుండు, తనకొలంపుఁబులుంగు మొత్తం బులుపెక్కులు దన్ను సేవింప, నివసించి యుండును. ఆపతంగవుంగవుం డొక్కనాఁటి నిశీథంబున నమాత్యాదులతోడ మంతనంబు సలిపి, యప్పుడ సేనాని రప్పించి, యుత్సాహపోషణంబు లగు భాషణంబుల వీరావేశ మెసకొల్పి, మొన లేర్పఱించి, యనేకంబు లగుననీకంబు లతో ఘూకఘూంకృతులు పొదలఁ గదలి, విరోధులు కాకులు వసి యించు మట్టిచెట్టుఁ జుట్టుముట్టి, నిద్రాముద్రితనేత్రంబులై గాత్రం

బులు మఱచి కూరికియున్న వాయునంబులఁ గాంచి, సంతసించి, మించిన కోపాతిరేకంబున ఘూకంబుల డీకొల్పుఁడు, నవియు శాఖోపశాఖలవెదకి, శాతముఖంబు లగునఖంబుల నడచియు మహోగ్రంబు లగుచండతుండాగ్రంబులఁ బొడిచియు నచంచలంబు లగుగరుడంచలంబులఁ జఱచియుఁ గొన్నింటి తెక్కలు మొక్కవఱచి, కొన్నింటిఁ బ్రక్కలు ప్రక్కలించి, కొన్నిటి ముక్కలు చెక్కలు వాపి వివిధంబు లగువధంబులఁ గ్రుటికాలంబులోన, నసేకకాకలోకంబును యమలోకంబున కనిచిన, సమావృతాంతరిక్షుం బగునావటవృక్షంబు విగతధ్వాంక్షంబగుట వీక్షించి, కృతార్థీకృతలోచనుండై, యుపమర్దనుండు సంతోషపుల్కకాంకురాలంకృతసర్వావయవంబులతో, నిజపరిజనకోలాహలనినదబధిరీభూతదోదోంతరాళంబుగాఁ గ్రమ్మరి, పింగళేక్షణంబుల మెఱుంగులు తుఱుఁగలింప నిజనివాసంబునకుం జనియెం.

అంతఁ బ్రభాతం బగుడు, రేయి వాయసారాతులరాయిడిం బడకయొక్కెడ నొడ లోముకొనిన మేఘవర్ణుండు లేచివచ్చి, రాత్రి కులాయాంతరనిద్రాణకరటకులంబునకు సంభవించిన యకాలప్రళయంబు చూచి, గుండెలు వగిలి కొంతవడి చింతాసాగరంబున న్మునింగియుండి, కొంత నివ్వెఱ తొఱఁగి, లోకాంతరగతు లయినతనతనయులం బేరుపేరువరుసలం దలంచి నిట్టూర్పు నిడిగించుచుఁ, గడువుశోకమునఁ దలంబగుకొందలంబునం గుందుచుండ రాతిరి గూబలపాలు గాక చిక్కినప్రెగ్గడ లొక్కచక్కిం గూడుకొని, తమమందభాగ్యత్వంబులకుం దూర వగచుచు, రాజునుం బ్రాణంబులు తప్పించుకొంట విని యాతనిసరన కరుడెంచి, దీనంబు లగునాననంబులతోడ నడుగులంబ్రెళ్ళి, కంటికినేలకు నేకధారగా రోదనంబుసేయుచు నిట్లనిరిం.

"దేవా! తెల్లనాటిమరల నేలినవారి చరణంబులీతీరున సందర్శింపం

బడసికదా, మాయందఱి నయనములు భాగ్యంబులుచేసె. మాప్రాక్తన పుణ్యంబుఫలించెఁ; నేఁడుగా దైవము గలుగుట వరిజనంబులు వేవురు గలిగియు, రాజులేనిరాష్ట్రం బరాజకంబగు కతంబునఁ జుక్కలు పెక్కుం డియుఁ దేజంబుంగాంచనిసోమవిహీనయామిని కైవడిఁ, దమోవృతంబయి కన్పట్టును. ప్రధానులు లేని యధినాథుండునుఁ బ్రాణంబులఁ బాసిన బొందిచందంబునఁ, గాంతి దటిగియుండును. దైవవశంబున స్వామియు నేమును నీ రే యొకబన్నమునకు లోనుగాక, నప్రాణులమై మగుడఁ బుడమిపై నడుగిడఁ గలిగితిమి. పగవారిం గూడి దైవంబును మనకుఁ గీడుఁ దలంచె. ఇది యవశ్యభావి యైనయర్థం బెట్లు తప్పింపనగును? నిష్కారణముగా నీయట్టినధర్మునకుఁ జేసినయపకారం బాక్రూరకర్మ్మ లకుఁ దోడనే చూపకపోదు. ఇప్పుడు మనప్రాణములు దక్కినవంతియ చాలును. ఇఁక బగ నెన్నటికైన, మెల్లఁగా సాధింపవచ్చును. కాలంబు మన కీవేళ మేలు కాకున్నయది. కాలము మీఁతి నడప నెవరి తర మగును? ఆయుఃప్రమాణము నిండి, మనవారు పేరు గలవారు పెక్కండ్రి ట్లనామధేయంబులగు దివాథంబులచే నిద్రావశాత్ములై మానప్రాణంబులు గోలుపోయిరి. దైవవైపరీత్యం బయినప్పుడు వగవఁ బనిలేదు. మే మప్పుడ యలసి కన్నొకింత మూసితిమి. అంతలో నాక స్మికముగ గణనాతీతము లగుపగఱ బారు లరుదెంచి, కనుమూయగా వీరిగొంతుకలు కోసిపోయెను. మేమే మేలుకనియున్న, నొక్కఁడు మీఁబంట్లు నిట్లుపఱచి నామ మడఁగ కుండెనె? ఇప్పుడేమో మా దుర దృష్టంబునఁ బరాభవంబు నొందితిమికాని, దేవరకటాక్ష లవంబు గలుగ, మున్నెన్నఁడు నిట్లయిన వారము గాము. దేవరయంత వానికిం బరాభవము సంభవించెను. ఇది మాచేసికొన్న భాగ్యము గాఁబోలు! పగతురు మనల మిగిలి నొగిలించుట కంతరంగంబున

నెగు లొందకుము. 'అత్యుచ్ఛయః పతన హేతు' వని యార్యులు వచియింతురు గావున, బెరిగెడివాఁడే విఱిగెడివాఁడు. నేఁడు శత్రు నిరాసంబున ధన్యోస్మి' యనుకొని విజ్ఞప్తిఁగు దాయ జేపేమి మూఁడ నున్నాఁడో, యేరెఱుఁగుదుము? సతతముఁ గంటికి రెప్పవలెఁగాచుచుఁ బ్రోచుచుండ దేవరబుద్ధి విని, స్వామియే కనువెలుఁగుగా వెంటఁ జరియించు తలంపున, మేముందఱము మీకడకుం జనుదెంచి నారము. నీయట్టి మునుని కరుణారసవృష్టి కలిగినంగదా, మాహృదయ తాపము చల్లారును. ఇన్ని నాళ్ళును నందఱొనాన బ్రదికి, తుదకుఁ బౌరుషము చెడినప్పుడు శరీరధారణార్థం బొక్కనీచవృత్తికి లోనయి, రోఁతల కాలయము కానేల? ఈఁతకు మిక్కిలిలోఁతు లేదు. కానసాహసించి, యసహాయ శూరులమై, జనులు మనమీఁదఁ జాలమివెట్టఁ జోటు లేకుండ, నాయురవసానపర్యంతమును బోరి, యధ్రువంబులగు దేహం బులచే ధ్రువం బగుకీర్తి నార్జింతము. మనకాలము మంచి దయి నప్పుడు నిగిడి మగుడ నాచెడుగులఁ గడముట్టింతము. విమతుండు బలవంతుండు గావున, నింతే మనభాగ్య మనుకొని, యాతని నాశ్ర యించి బ్రదుకుదము. ఇప్పటికి విప్రకృష్టదేశం బరిగి, యందణఁగి యుండి, పదంపడి పోలినట్లు చూచుకొందము. ప్రత్యర్థుల కసాధ్యం బగుదుర్గంబు నాశ్రయింతము. బల్లిదు నొక్కనిఁ జేరి, వైరి నిరాసం బనాయాసముగఁ గావింతము." అని తమకుఁ దోఁచిన ట్లనేకు లనేక వాక్యములు పలుకుచుండ, వారికలకలంబులు వారించి, చిరంజీవియను మంత్రి యిట్లనియె. "దేవా! దేవరయమాత్యు లెల్లఁ బెల్లుసమర్థులు; ఒక రొకర తమధీబలమున లోకము లెల్ల నఱచేతిలోనికిం దేఁజాలిన వారు; నీతిశాస్త్రమున వారిని మీఱినవా రేరును లేరు. ఇంక స్వామి సామర్థ్యాతిశయంబో, నమత్కుంబున వాక్రువ్వవలసినది కాదు. నంతా

పంబుపేరిమిని, మనసునకు సమాధానంబు లేక యితరవ్యాపారముల
నెఱుంగకుంట నిప్పు డేమోకాని, యించుకంత మది కుదురఁబెట్టి
యాలోచించిన, దేవరకుం దోఁపనికార్యాంశంబులు లేవు. ఎట్టిబుద్ధి
శాలులును దేవరలో సహస్రాంశంబును బోలఁజాలుదురె? ఇది మా
కెల్లరకు ననుభవగోచరంబు. అది యట్లుండె, స్వామి నన్నును నొక
మానిసిఁగా నెంచి మిగుల మన్నింతుగాన, మిన్నకుండఁబట్టక చిత్త
చాపల్యంబున నాకుం దోచినయర్థంబు నేనును విన్నవింపఁ గడఁగె
దను. భవదీయ మతి నతి విశదంబుగా నొనరించి, యూహింపుము.
దురంబున నురగారి నయిన నుఱునిశూర వారంబునెల్లఁ జంపుకొని,
కోఱలు వెఱికినభుజంగంబులభంగి భంగపడి యున్న వారము. ఇత్తఱి
మన మెత్తువడి యుంటంజేసి, యహితుం బొడిచి యెఱువఁ గడిమి
చాలదు. సమయ మెడఁగూడుదాఁక లాఁతివీఁదఁ గన్నిడి నిశ్చం
చలముగ నుండి, తటివేచి, బకముపోలిక నరి నొక్కట గ్రుక్కఁ
గొందము. నాబుద్ధి కిప్పటికి సమాశ్రయం బొక్కటియే యుత్తమ
కార్యముగాఁ గనుపట్టుచున్నది. పగవాఁడు నిగుల బొగరు గవిసి
యున్నవాఁడు కాన, దీనదశనొంది డిందు పడియున్న మన కాతని
పొండెట్లు సంఘటిల్లు నని చింతిలవలదు. తాన కాజ్ఞాబలమునను,
వీరికెల్ల నాదెసం గల యనుకంపపెఁవునను, దైవానుకూల్యము గూడ
గోరంత కలిగెనే నెంతదుష్కరకార్యము నైన వ్రేల్మిడి సఫలంబు
గావించుకొనివచ్చెద. నన్నుఁ బనిగొనుండు. ఓపితిరేని, మీకెల్ల నా
కొక్కసాయము చేయుఁడు. ఈక్షణంబ మీరందఱు నెందయినఁ జని,
యల్లనల్లంగొనివచ్చి, నామేను రక్తసిక్తంబు గావించి, తడయక
ఋష్యశృంగంబునకు వెడలి, యచ్చోట నప్రమత్తులరయి యుండుఁడు.
తక్కినకార్యభారం బంతయు నావయిం బెట్టి, మీరు నిర్విచారంబుగ

సుఖియింపుఁడు. ఎల్లవిధంబుల శుభంబాపాదించెద." అని మృదుమధుర భాషణంబుల స్వాభిలాషంబు తెఱంగెఱింగించిన, మొగంబులం దెలివొంది, వాయసంబు లప్పుడ కడలకు వెడలి, సందుల గొందుల నెమకి, మూషిక ప్రముఖక్షుద్రజంతుసంతానముల దారుణత్రోటీవిదారణముల మారణము గావించి, వలయునంతక్రొత్తనెత్తురు గొంచువచ్చి, యచ్చిరంజీవిశరీరంబునం బూసి, నీవు సిద్ధసంకల్పుండవు. నీకసాధ్యం బెందును లేదు పొమ్మని సాగనంపి, యాచోటు వాసిచనియె. అంత నాచిరంజీవియు 'డాఁగబోయినఁ దలారియి ల్లగునో' యని ప్రాణంబులు పిడికిటం బట్టుకొని, మెల్లఁగానడచి ప్రొద్దుగ్రుంకునంతకు దివాభీతంబు లుండుకొండగుహాఁ జేరి, వైరికి వినంబడున ట్లొకెలుంగు గర్జదికం దగుల, గుహాముఖంబునఁ గూసె. ఆకూఁత చెవి సోకుఁడు నదిరిపడి, కోటఁ డొక్కఁ డాచక్కికిం బఱతెంచి, కాకిం బట్టి గొనిపోయి, యుపమర్దనుముందఱఁ బెట్టిన, నాతండును విస్మయవికచవిలోచనంబులం జూచుచు 'నీ వెవ్వనివాఁడ వేల యిట్లయితి' వని యడిగినఁ జిరంజీవియు దైన్యం బాననంబున నటించుచు, మాయ యచ్చుపడ, డగ్గుత్తిక వెట్టి యిట్లనియె. "చెప్పనోరాడ దేమని చెప్పుదు నావార్త? నేను మేఘవర్ణునిప్రధానమంత్రిని; చిరంజీవి యనువాఁడను. నేటివేఁబోక, మేఘవర్ణుండు నిజప్రధానులం బిలిచి కార్యాలోచనం బడిగిన, నేనాతనిదుర్నయం బెఱింగియుఁ దోఁచినహితంబు చెప్పి చూతముగాక యని, యిట్లంటిని. "ఉపమర్దనుండు లావు గలవాఁడు గావున భక్త్యేకసాధ్యుండు: ఆతని పాదంబులు పట్టి మనుటలగ్గు. నీవు రాజ ననుదురభిమానంబు మాని, యవశ్యంబుగఁ దద్దర్శనంబు చేసి, నామాట విని యక్కరుణాకరుశరణంబు సొరుము." అనునప్పు డేమిసెప్పఁ? నావలుకు లాపాలనునికోపానలంబున కాజ్యధారా

ప్రవాహోపమంబు లైన, భగ్గున మండిపడి, యుక్తివిక్షేపంబున
ననాదరంబు సూపుచు, మంత్రుల నాలోకించి 'వీడు విపక్షపక్షపాతి
యై యెడ లెఱుంగక యున్మత్తప్రలాపంబులు సేయుచున్న వాడుఁ
దయఁ జూడక వీనిం బొడిచి విధియింపుడు.' అనిన, వారును గుక్క
లట్లు నాపయిం గవిసి, ముక్కులంబొడిచి, కాళ్ళంగ్రుమ్మి, నెత్తురులం
దొప్పఁదోఁగి సొమ్మసోయి యున్న ననున్ను మృతుఁగా వగచి,
దిగవిడిచి తమయిచ్చం బోయిరి. వుడమిపై నిట్టిరాజోత్తము లుండఁ
బట్టియేకదా, 'రాజ్యంతే నరకం ధ్రువ' మనుపండితోక్తి యెల్లెడ
లను బెల్లుగ విలసిల్లెఁగను. నేనును గొండొక పడికిం దెలిసి, నలు
వలంకులుఁ గలయ విలోకించి యెందు నెవ్వరిం బొడగానక, చెదరినమది
తుదకుం బదిలించుకొని, విసృష్టస్వాజనబంధుజనుండ నగుటంజేసి, యీ
యవస్థ సర్వంబును దేవరకుం గానిపించి మఱి ప్రాణంబులు విడుతు
ననుతలంపు వొడమ, గళద్రక్తసిక్తాంగంబులతో నిట్లరుగు దెంచితిని.
ఇంక నాకు దేవరయే యేఁజుగడ. శ్రద్ధాధానునకు విద్యాదానంబును,
క్షుధార్తున కన్నదానంబును, వ్యాధిమధితున కౌషధ దానంబును,
భీతున కభయదానంబును, దానంబుల నుత్తమదానంబు లని యార్యు
లందురు. రాజుల కాత్తరక్షణంబును బోలుధర్మంబు నొండు లేవు.
'దుర్బలస్య బలం రాజా' యన వినవే? దేహ మాశల్పము స్థిరము
గాదు: అట్టి యస్థిరం బగుకాయంబుకొఱకుఁ, బరికృతావమాన నివిడ్య
మానమానసుండనై యుదాసీనం బుజ్జగించి, యెట్లు సరివారిలో
మరలఁ దల యెత్తుకొని మెలంగ నేర్తును? ఎవరిని రక్షింపఁగోరి నే
నీబ్రతుకు బ్రతుక వాంఛింతును? నేను సర్వసంగవిముక్తుండ నయి
యున్న వాఁడను. స్వమాత్రపోషకుండ నగు నా కీక నీమేనితోడిపాత్తు
వలదు. ఇంతవఱకును మేఘవర్ణుని కొఱగామి స్వామికి నివేదింపఁ

బ్రాణంబులు పట్టికొని యున్న వాఁడను. నాకుంబాటిల్లిన యీాదురవస్థ యంతయు దేవర కెఱిఁగింపఁ గలుగుటంబట్టి, చరితార్థుండ నైతిని. ఇఁక నెట్లయినం గడుమేల. నేనీయెడఁ బ్రాణమాత్రావ శిష్టుండనై, పగ నీఁగుశక్తి లేక, కాలంబున కెసురుమాచుచు, జీవచ్ఛవంబనయి యున్న వాఁడను. ఆపాపకర్మ లప్పుడు నాప్రాణంబులు గొనక కొంత కొఱంత వెట్టి పోయిరి. మీరైనఁ దక్కినకొఱంతఁ దీర్చి, పుణ్యంబు గట్టుకొండు—నుకృతి నయ్యెదను. తొల్లి నేనెప్పుడును భవత్సందర్శనంబు చేయువలయు ననియే కోరుచుందును. ఎంత పొరలినను, దైవానుకూల్యంబు లేనికార్యంబులు సిద్ధింబొందవుగదా? నేటి కది యీానెపంబున నైన సిద్ధించినది, మహాభాగ్యవంతులకుఁ గొందఱకుఁ గాక, మీాయట్టి వారిసేవ యందఱకుం దొరకొనునె? మఱియు నే నసవరతము దేవరచరిత్రమే యీాతని యోాలగంబున వేనోళ్ళ సంస్తవ మొనరించు చుందును. అంచుల కాతండు కటకటంపడి, మిమ్మోఁ గడవనాడు చుండును. ఆకథలు శ్రవ్వినకొలఁదిని, బెక్కు లూరు చుండును — పోయినవి పోనిండు. నేనాతనికి నేటిదనుకం జేసినమే లంతయు నొక్కపూఁటలో వఱదఁ గలసిపోయెను. అందు దేవరకుం గోటితమాంశం బైన నాచరించిన, నింతకు నామనోరథంబు నిండదే? అని కర్ణకలాపంబులుగాఁ గరటంబొడు దయనీయాలాపంబుల మెత్త నైన రాజుచిత్తంబు నారసి, మంత్రు లిట్లనిరి 'సామీ! యేమో పలుకు చున్నావని యాదరంబు సేయుక, మీామనవి చేకొనుఁడు. ముందఱిఁ గీడెంచి మేలెంచవలెను. వైరంబు లామరణాంతంబులు గాని, యింతట నంతటం దెగునవి కావు. ఈతనిచరితంబు ప్రత్యక్ష పరిచితం బయినది ప్రాపడిపోయెనె? రాజు తనవంక వారినే నమ్మినమ్మక యుండవలెనన, లోఁతివాసిఁ జెప్ప నేల? ఈతండు తృణ

చ్ఛన్నకూపంబుపంటివాఁడు; వీనిని విశ్వసింపఁ గూడదు. మనము మతిఁ దప్పి విశ్వసించితిమేని, వీనిం జేర్చినఫలం బవసానంబున, వంశ ఫలంబురీతి సమూలవినాశంబు నేయక మానదు. సందియము లేదు; వీఁడు మనలం జెఱుపవేఁడి, వైరులకుఁ దాపికాఁడయి వచ్చి, యెందు లేనిపలుపోకలమాయలు పచరించుచున్నవాఁడు. వీని న్మన కడ నునుచుకొనుట, దూదిం జిచ్చు దాఁచినయట్లయ్యెడు. కొండంత దూదికిం గొండంత నిప్పేల? మనల నేలపాలు సేయు వీఁ డొక్కఁడ చాలును. విపక్షుండు క్షుద్రుం డయ్యును గాలక్రమంబునం బెరిఁగి, వృక్షమూలమునందలి వామఁజూరువు వృక్షంబుంబోలెఁ, జెఱుప సమర్థుం డగును." అని మంత్రు లెంద ఱెత్తెఱంగున నాతనిపొత్తు హత్తించుకొనుట విపత్తునకే మూలం బని యొత్తిచెప్పినను, వానిం దనచిత్తంబున హత్తింపక, విధి మూఁడి, యుపమర్దనుండు తనపట్టిన చలంబు విడువక, శరణాగతపరిత్రాణంబున కెనయునుత్కృష్ట ధర్మంబు లే దుడుగుఁ డని వారల వారించి, యాబలిభుజరక్షణ కరణంబునం గృతనిశ్చయుం డయి, వారల కిట్లనియె. "జాతిమాత్రంబు చేతనె యీతని లాతిఁగాఁ దలంపఁదలదు. ఈతండు సాధుజనాగ్రగణ్యుఁడు; కలనైనం బరుల కాపదఁదలఁచువాఁడుగాఁడు; సత్యంబు కానివాక్యం బీతనిరసనతుదకు రాదు; జగంబున నీతనికిసమానుండు మానధనుండు లేఁడు. ఈతని వాక్యంబులే యీతనిగుణమ్ముల నెఱిఁగించుచున్నవిం మన పుణ్యపరిపాకంబున నీచిరంజీవితోడి పరమసౌహార్దలాభంబు దొరకినది. మన కీతండు కడువిశ్వాసనీయుండు; ఇందు నందు ననక మనమందిరంబున నెంతైన నడ్డంకిలేక తిరుగఁదగినవాఁడు. నేఁడు మొదలు పూర్వవైరంబు విచారింపక, మీరెల్లరు నీతని నతిమాత్ర గౌరవంబునం జూచుచుండునది." అని యానతిచ్చి, తనకభయప్రదా

నం బొసంగి ప్రశంసించు చున్నరాజున కభీముఖుం డయి, భయ భక్తులు మొఱయుఁ జిరంజీవి యిట్లనియె "సాధు! సాధు! పరదోషకథా విముఖుల రగు దేవర గుణంబులు గొనియాడ నే నెంతవాఁడ? భవ త్సందర్శనమాత్రంబున, మామకవిలోచనంబులు భాగ్యంబులు వహించె; భవదీయవచనామృతాస్వాదనంబున, శ్రుతిద్వయంబును దృప్తినహించినది. స్వామిసందర్శనంబు దొరకొనని వానిజన్మ మేల? సర్వజగజ్జైత్రులకు మిత్రులగుటంబట్టి, నాజన్మంబు కృతార్థత్వంబు నొందె. మీకారుణ్యంబు గలిగినం, దృణమయిన మేరు వగును. పగ వారినైన నొచ్చిననోరం బలుక నొల్లవు. అది దేవరబోఁటిగుణగ్రహ ణైకపారీణు లగుధరాభాంధౌరేయులకుఁ గొందఱకుం జెల్లెఁగాక యందఱకుం జెల్లునె? స్వామివంటిదయాళుకు కొందఱు గలుగంబట్టి కదా, యీస్థిర తిరంబై నిగడుచున్నది. అక్కడక్కడ రాజ్యపరిపాల నంబు సేయువారు లెక్కకుఁ బెక్కురుగలరు; దేవరం జూచి, మతి వారిం దలపెట్ట సిగ్గు వొడముచున్నది. మత్స్వరూపస్వభావంబులు దెలియక, వీరందఱు నాపై నింద గడించెదరు. హితాహితనిర్ణయంబు సేయ మహాప్రబుద్ధులకుఁ గాక, సామాన్యముగ నందఱకుం బయి పయి నున్నదియే? నావల్ల కల్ల గోరంత కలిగెనే, నిప్పుడకా దెప్పు డయిన నేలిక చిత్తంబునకు వచ్చినట్లు చేయవచ్చును. నిఖలహేయ భాజనం బయి క్షణభంగురం బయినయీకాయంబుఁ గల్పస్థాయిఁగా నమ్మి, యెట్టి కష్టాత్ముండయిన విశ్వాసఘాతుకత్వంబున కొడిగట్టు కొనునే? దైవంబు దయుమాలి నలుపురిలో ననున్నట్లు తల వంచుకొనం జేసెఁగావున, నీరీతి నిన్నికఱకుమాటలకు వీను లొప్పగింపవలసి వచ్చెను. ఆబాల్యము నేఁ గాంచినగౌరవంబంతయు, నిప్పుడు స్వప్న లబ్ధపదార్థంబుచందం బయ్యె. నన్నివ్వ రెట్లనుకొన్ననను, దేవర

యాజ్ఞ కడుగుదాఁట నోడుదుఁగాన, నేలికపాలఁ దల దాఁచుకొని యిచ్చట భవద్గర్భవాసగుప్తిం దినములు పుచ్చెదను." అని యిచ్చ కంబు లాడుచు, నిమిషంబుకు జేని నెడబాయక, యాతనిచూపు లేచాయ నిగుడునో యని సిర్ని మేషంబుగ సమ్ముఖస్థానం గొలిచి యుండుచు, దినదినంబును వింతవింతగా నవసరోచితంబు లగునినో దంబుల బ్రమోదంబు రెట్టించి, యంతకంతకు మొదలింటికంటె శతగుణంబుగా రిత్తయుపచారంబుల నుపమర్దను మనమున కెక్కు నడవడిం బ్రవర్తించుచుఁ, గరమ్ము నమ్మకము పుట్టించి, యెల్లెడల నడ్డు లేక క్రుమ్మరుచుఁ, జిరపరిచయంబునఁ జిరంజీవి తత్తద్రహస్య వర్తనమ్ములును దుర్గబలాబలమ్ములును నిమ్మగా నెఱింగి, తఱి యారసి, యొక్కనాఁటి పగటిపూఁట బహిరస్వనమ్ము లాద మఱిచి సుఖసుప్తంబు లయి యుండ గుహావాకిలి వెడలి వచ్చి, యచ్చేరువ మొదవుపదువులు గలతావుల కరిగి, యెరువు కొంత చరణంబుల నిఱి కియుఁ గొంత ముక్కునం గఱచికొనియుఁ గొనివచ్చి, గుహాముఖం బునం దాపి, రెండవకంటివాఁ డెఱుఁగకుండ మేఘవర్ణపాలికిం బోయి నమస్కరించి యిట్లనియె. "దేవా! మనము సేయునధ్యవసాయంబం తయు నేఁడు ఫలితంబునకు వచ్చినది. అంతకంతకుం బెరుఁగు దేవర మన్ననబుణంబు నేటికిం దీర్పఁ గంటిని. స్వామిమనోరథపూరణం బాపాదింపఁ బడసి, నాయొడలెత్తిన ఫలంబుఁ గాంచఁ గలిగితిని. మీ అందఱు నేకనిశ్చయు లయి, నాకుఁ జేదోడై నడవవలయును. నే నాయుపమర్దనునిచెలిమి కలిగించుకొంటకై పడరానిపా ట్లెల్లం బడితి. కట్టా! దాయలపంచం బడి యేఁ బడినయిడుము లిన్నియన్నియని యెన్నఁదీఱునె? ఉపమర్దనుండు శనపావంబు పండి, సులభంబుగ నావలం దగులువడి, నా కన్నపానాదు లిడి పరామర్శింపఁ దనవారి

నియమించె. వా రెల్లఁ దొలుత నాపొడ కనబడినవు డెల్ల నన్ను గుటుకు మనకుండ మ్రింగవలయు నని యుండిరి. అప్పుడు వారిపెట్టు వోఁతలకు లోఁబడి, వా రింద మని యిచ్చినదే భుజించుచు, నోరు కట్టుకొని శరీరశోషణంబునకయిన నోర్చి, యసంభవం బయిననాఁడు జలప్రాశనంబె చేయుచు రాజుతోడనైనఁ జెప్పక కాలంబు ప్రతీక్షించు చుండి, కడకు వారియనుగ్రహంబునకు సహితము పాత్రుఁడ నయితిని. ఎందును గార్యంబు సఫల మయిన, నేపూర్వప్రయాసంబును నేల గణనకు వచ్చు? కాలుచేతిత్రొక్కులంబడి, యివు డుపమర్దనుండు రాజ్యానుసంధానం బేమఱి, నాతోడిదలోకం బని యున్న వాఁడు. నాపొందు వలదని, యమాత్యు లెందఱో నోరఁ గాయ లిడక బోధించిరి. వారి హితవచనంబు లన్నియు, రోగికిఁ బథ్యాహారంబు లట్లు, యాతనికి రుచింప వయ్యెను. వేయేల? కడమాట నుడివెద; వినుండు. వారి సంతోషకాలము నేఁడు ముగిసివచ్చినది. ఇపుడు మీతోడ నూరక మాటలాడుచుం గూరుచుండుటకు నాకు లేశమును నవకాశము లేదు. వారినందఱఁ గనుఁగొని, నే నిటు చనుదెంచితి. నూతినీళ్లు వెల్లువవోవు. తక్కిన నాయక్కడిగాథ లన్నియు సవిస్తర ముగా ముందు విన్నవించెద. ప్రస్తుతకరణీయంబువినుండి. గుహా లోపల నులూకంబు లీలోకంబు మఱచి, నిద్రావివశంబు లై యుండ నాకుం గనుమొగుడక లేచి వచ్చి, యచ్చుట్టుపట్టుల నుండుతొట్టి వట్టుల కేగి వసులపెంటఁ బట్టుకొని వచ్చి, గవివాతం బెట్టి, మిమ్ముం బిలుచుకొనిపో వచ్చితిని. అందగ్నిరగిల్చి కాల్చి, నిద్దురవోవు కాశి కంబులఁ బెద్దనిద్దుర వుచ్చ వలయు. ఇప్పుడ మనవా రందఱుం గదలి, రవులుకొఱికచ్చులు చంచువులం గరచికొని, నాపిఱుంద నరు దేరవలయు." అని కఱపి, తా నొక్క మండుకాష్ఠంబు ముక్కునం

జిక్కఁబట్టి, పురోయాయి యయి స్రోవవెట్టినఁ, బెఱపిట్టలును నట్టు లాతనివెంట మింట ననుగమించె. అంత నాళకుంతంబు లనంతాధ రంబుం దఱిసి, దరివాతం దార్చినయెకువునకుం గొఱవులు దరికొల్పి యెఱకల విసరుడు, నర్చిష్మంతుండు కరటవిసరపక్షపవమానజాజ్వల్య మానకీలాజాలంబుల నాభీలంబుగఁ గవియించి, ధూమస్తోమంబు లెస కొల్ప గుహాయెల్లఁ దామయై పేర్చినయుర్చులవేడి కోడి, లేచి పేచ కంబులు నిదురమంపున నఱచుచు వెఱచఱచి పఱచి, యెట్లును గుహావెడలువెరవు దొరకక, రాజుకడం జేరి, ప్రభు వని చూడక యిట్లనియె "దేవా! వైరి యగునీచిరంజీవిం జేరఁ దీయవలదు; కీడుమూఁడు" ననిమే మెల్లఁ బలుదెఱంగులఁ జెవి నిల్లుకట్టుకొని పోరిన మామాటలు పాటిగాఁ గొనక, పెడ చెవులంబెట్టి, నీమదిఁ బట్టుకొన్న యున్మాదంబు మానవైతివి. అనన్యాధిష్ఠితం బగు పదమున నిష్కం టకముగా నుండి, యనపహార్యం బగు నైశ్వర్యంబుఁ గుడువ నేరక, నిశ్చేతుకముగఁ గూలఁ దన్నుకొంటివి. మఱియుఁ గానక కన్నసం తానంబును, నెందునుం బడయరానిబంధుజనంబును, బ్రౌఢసమానం బగుమిత్రవర్గంబును, నూరక మ్రింగుకొంటివి. మాపలుకు వినక, విరోధికిఁ దా విచ్చినఫలము చేసేత ననుభూతం బయ్యెం. ఇప్పు డయిన, నహంకారపంక మింకెఁగా?" అని యుపమర్దనుం దూఱుచు, మూల మూలలు దూఱుచు, మంట లొడ ళ్ళింటినఁ గమరి, ఘర్ఘురికంబు లెల్ల నిలువున విగతాసువు లయి, కాళ్ళు కుప్పవడ నేలఁగూలి, వేఁడి వేలువుచే భక్షింపఁబడియె. ఇట్లహితులెల్ల నిహతు లయి, నిమేష మాత్రంబున గుహాయంతయు నేనుఁగు తిన్న వెలఁగపంటివలె నైన నలరి, హృదయంబుల ముదంబు వదనంబుల వెల్లివిరియఁ, గరటంబు లెల్లఁ గూడఁబడి, చిరంజీవిని జుట్టుకొని యిట్లనియె. 'ఓయీ! చిరం

జీవీ! నీవు కలుగఁబట్టికదా, యిబ్బారిం గడవఁగాంచితివిం. అక్కడ నుండి నీవు క్రమ్మఱి వచ్చి మాకంటఁ బదువర్యంతము, మమ్ము మే మెఱుంగము. మాయందతిప్రాణంబులును నీవ; నీవులే కిక్కడ మా కొక్కనిమిషమయిన వేగునఁ; నీ మేధావిశేషంబునంగదా, నిశాదర్శి యొక్కఁడయినఁ గడమవడకుండఁ గడతేఱె. ఇవుడు మామనంబులం గలనెగు లాఱె. అనన్యాదృశసుకృతంబున మాకు నీవంటి చెలిమి కాఁడు దొరకెం. ఇఁక మాకేమితక్కువ?" అని శ్రవణానందంబుగాఁ జిరంజీవిం బ్రస్తుతించి, యాతనిచేఁ బ్రతినందింపఁబడి, కొంతసేపు వాయసంబు లెల్ల సల్లాపసౌఖ్య మనుభవించుచుండెఁ. అనంతరము వాయుసేంద్రుఁడును బరమానందభరితుఁడయి వైరివీ డెల్లఁ జూఱాడి, కాకకాకారవముఖరిత హరిదంతరంబుగా నిజనివాసంబునకుం జని, సుఖం బుండెఁ,—

కాఁబట్టి గిట్టనివాని నొద్దఁ బెట్టుకొంట బెట్టిదంపుంజెట్టఁబుట్టిం చును. దేవరయేకన్నులం జూచెదరోకాని, నాకీకాకమ్మును నమ్మఁట పర్వవిధమ్ముల ననర్థదాయకమ్ముగాఁ గన్పట్టుచున్నది. దేవర యాతని తేనెమాటలకు మోసపోయి, యాతని తోడ్పాటున కువ్విళ్ళూరు చున్నట్టు తోఁచుచున్నది. సత్యమూరయ, నితఁడు చక్కెరపూఁత పూసిన విషముగాని వేఱుగాదు; శీతలప్రవాహంబు కూలసాలనిర్మ్మల నానుకూలంబగుట దేవరచిత్తంబున భావింపవలయును. ఏవిధమునఁ జూచిన, నీనీలవర్ణుండు గర్హ్యాణీయుండయగుంగాని సంభావనీయుఁడుగాఁ గానిపింపఁడు. ఈయన సేయుసాయంబుపేరు దైవం బెఱుంగు; అపాయంబు సేయకున్నం జాలును. విన నేర్చితి రేని, నాకుఁ దోఁచినహితం బొక్కటి చెప్పెదఁ జిత్తంబున జేర్పుఁడు. ఆవల విననీ వినకపోనీ హితంబుగోరి యాఁడుమాట కీశ్వరుం డయిన మెచ్చుఁగదా? క్రూర

కర్మం బనిచూడక వీని నీయెడ మట్టు పెట్టుఁడు; వీఁడు తెగిన మన మనఃపీడయంతయుం దెగును. అని పలుకుమంత్రిమాటలకుఁ జిఱు నవ్వు నవ్వి రా జిట్లనియె "నీ వాడినదంతయు సత్యము. అయినను గ్రొత్తగావచ్చినంతమాత్రమునఁ నె విశ్వాసపాత్రంబు గాఁడని నిశ్చ యించుట తగదు. ఈతఁ డింతవఱకును మనకుఁ గించిద్దోహంబైనఁ జేయఁడు. ఒక్కనిగుణంబు లిట్టివని గుణవ్యాహారంబుల నెఱుంగ వలయుంగాని, జాతిమాత్రంబునఁ నె నిర్ణయింపరాదు. ఒకానొకవేళ నాగంతుకులును హితు లగుదురు: సన్నిహితులే యహితు లగుదురు. శరీరజం బగురుజ యహితే మగుటయుఁ గాటఁ గలిగి యౌషధంబు హితమగుటయుఁ బాటింపవలదే! కొందఱు తొలుత హితులయట్ల కనఁబడి, కడపట నహితులగుదురు. మఱికొందఱు మొదల నహితుల మాడిక్కించూపట్టియుఁ, గార్యావసరంబుల హితులగుదురు. ఈతండుమన కొక్కకీడు రోయువాఁడుగా నాబుద్ధికిం బొడకట్టఁడు. మనకపకారంబె తలంచినవాఁడేని, నాఁడట్లుకొలువులోఁ జిలుకంబిలుకుమూర్ఖఁ దలఁపడు నెట్లు! మనదెసం గలవాత్సల్యంబెకారణంబుగా మనకుపకారంబుచూప వచ్చినవాఁడుగాని, వేఱొక్కపాపం బెఱిఁగినవాఁడు గాఁడు; పరమ ధార్మికుఁడు; సత్యసంధుఁడు. పరీక్షాపూర్వకంబుగాఁ గొన్నా ళ్ళీతని మనకడ నునిచికొని, యీలోపల నెద్దియైన నీతనియెడ నీయెన్నిన యవగుణం బించుక గాననైన, నేమి చేసినను లోకంబు మెచ్చుం గాని, వేగిరపడి ధర్మంబు కట్టిపెట్టి యకారణంబుగ నితని నొకకీడు నకు లోఁబఱిచితిమేని, లోకులు మనల సీ యనరే! మఱియు మనకుఁ బ్రత్యక్షవిపక్షమువాఁ డని కదా, యీపక్షిని నమ్మఁగూడ దనుటం కార్యార్థియగువాఁ డొక్కఁడతఁడె శత్రువునైనం గలపికొని మెలంగ వలయునుం ఆవల లావరియగుదాయ మనమీఁద బాడి వెడలి యున్న

వాఁడు. మన మిప్పు డీతనిం బోనాడునవసరంబు గాఁదు. మన ప్రయోజనంబు తీఱుదనుక మన మీతని నేస్తంబున కొడంబడవల యును. విమతులకు హితులై నవారిం గని మతిమంతుండు వికసన్ము ఖుఁడై, వల్కఁనవనీతకోమలంబును హృదయం బాయసనిష్ఠురంబునునై, మాట లాడవలయును. 'చెలిమి మైఁ జేఁదు మేపింపవచ్చుంగాని, బలిమిమెయిం బాలు ద్రావింపరాదు.' అనులోకోక్తి వినలేదా? విపక్షునియెడఁ గార్యంబుపొంచి మిత్రభావంబు నెఱపియు, మనమ్మున నమ్మక, యప్రమత్తుం డయి యుంట బుద్ధిమంతులలక్షణం బని మేధావులయి వినికి గలవారు చెప్పుదురు. మనకెలసంబు తీఱి నందాఁక నీనీలవర్ణుని విశ్వసించినట్లు నటించి, లోన నమ్మక యుండము. కంటకంబునఁ గంటకోన్మూలనంబు చేసి యాముంటిఁ గూడఁ బరిహరించులాగున, నీతనిప్రాపున నావిరోధిని మర్దించి మనకార్యంబు గడపికొని, పిమ్మట నీతని విడనాడుదము. పూర్వ మొకమూషికంబు తనకర్జంబుకొరకుఁ గేవలము విపక్షపక్షమువానితోడ మార్జాలనాథుని తోడఁ జెలిమి కలిగించుకొని, కార్యాంతంబున విసర్జించెను. నికాకథ వినిపించెద, వినుము.

పంచవటంబుప్రాంతంబున, నొక్క మట్టివృక్షము తొఱ్ఱలో రోమశుం డనుబిడాలము వాసము చేయుచుండును. ఆచెట్టుక్రిందిలాఁగ లోఁగిలిగాఁ జేసికొని, పలితుం డను నెలు కొక్కఁడు వసించుచుండును. ఒక్కనాఁటిరాతిరి కిరాతుం డొక్కఁ డక్కడ కరుదెంచి, యాచెట్టు చుట్టు నుదఁలొడ్డి పోయెను. ఆయెడ్డు పెఱుంగమింబట్టి, వేగుజామునఁ గనుచీఁకటి యుండ, మార్జాలం బాహారంబునకుఁ జనబోయి యా యురిం దగులుకొనియె. అదికాంచి సంతోషించి, మూషికంబు తొడుసు వ సెఁ గదా యని నిర్ధరంబుగఁ గలఁగు పెడలివచ్చి, యచ్చె

రువం జెఱలాడుచుండఁ, జంద్రకుం డనుకౌశికంబొక్కటి యాచకక్కటి కే తెంచి నిలిచెను. దానిపొడ వవలోకించి, కాళ్ళు గుదివడ, నొడలు వడవడవడంక, నుల్లంబు జల్లనఁ, బుల్లవడి యొల్లంబోయి, యల్లనఁ గొంతవడికిం దెలివి తెచ్చుకొని, బిలేశయంబు తనలోఁ దా నిట్లనియె. 'హా! ఏమి సేయుదును? ఈదేహ మిన్నినాళ్ళును బెంచి, కడ కీక్రించుగూబపొట్టఁ బెట్టవలసి వచ్చెను! దైవమా! నీకంటికిం బేల గింజయుఁ బెద్ద దయ్యెనా? ప్రాణంబులు గొనందలంచి, నాపాలివిధి సన్నిటకుం దెచ్చేఁగాఁబోలు! తప్పింప నెవ్వనికి శక్యమగును? అడవిలోపల ఫలమూలమాత్రంబున దేహయాత్ర నడవుచు, నొరుల కెన్నఁడు సెరగు తలఁచి యొఱుఁగనినాకును, ముదిసిముప్పుకాలంబున నపాత్రపుఁజావు చావ విధి లిఖియించెనె! ఆమూలదైవముచేతలకు మేరగలదే? నిమిషంబుక్రింద సీపిల్లిపీడ నేటితో విరుగడయ్యేఁగదా యని, హాయిగా నుండఁ జింతింప, నింతలో నా కీయకాలమృత్యు వెక్కడనుండి యాసన్న మాయెను? దీని కేమిసేయుదు? ఎందుఁ జొత్తు? అని విలపించి, గుండియ లవిసి బెండువడి, మగుడ ధైర్యం బవలంబించి, యిట్లు చింతించెను. 'బుద్ధిమంతుఁ డగువాఁ డప్పు డుప్ప తిల్లిన ముప్పు తప్పించుకొనఁదగిన వెర వరయువలయుంగాని, యధీర త్వంబున నోరు దెఱచి, యుప్పరంబు విలోకించుచుఁ గలఁత నొంద రాదు. ఇప్పుడు నాకీమార్జాలనాయకుం డొక్కఁడేయాశ్రమణీయుం డయి కనుపట్టుచున్నవాఁడు. ఏదో యొకమాయోపాయంబు పన్ని, యీతనియనుగ్రహంబునకుఁ బాత్రుండ నయ్యెద. అని కొంతసే పూర కుండి, యించుకకార్యం బూహించి, సఖరాయుధంబున కభిముఖం బయి నడచుచు మూషకం బిట్లనియె. ఓబిడాలకులోత్తమా! నీకిడె నమస్కారము. తడవులనుండి మన మిద్దరము నీవృక్షము నాశ్ర

యించి యేకోదరులవలె నున్న వారము. అట్టిమనలో మనకు భేద భావంబు వహించి యుండుట కార్యంబు గాదు. నాకు నీవుగాని, నీకు నేనుగాని, యేవాఁడును నొకయపకారంబుఁ దలంచి యెఱుఁగము. నీకు నాకు నిత కేతర ద్వేష హేతువు వే లేదియును లేదు. మనము కల కాలము బ్రతుకఁబోము. ఉన్నట్లుండ నెవ్వాడో కాలుఁడు నోర బ్రేసి కొని పోవును. ఈయున్న రెన్నాళ్ళయిన, మన మన్యోన్య మిత్రభావం బునం బొదలుచు, నొకరికార్యంబుల కొక రవుట యుచితంబు. నీ వీయురిం దగులుకోలు నాలోచనగోచరం బయినంతనుండియు, సహ వాసదోషంబేమి చెప్పుదును? నిప్పులం బొరలించినట్లు నా యుల్లం బెరియుచున్నది. ఇచ్చకంబు గాదు. ఈమనశ్శుద్ధి యీశ్వరుం డెఱుఁగును. వేయేల? ని న్నీమృత్యుపాశంబువలనం దలఁగువరకును, నాహృదయంబు కుదుటఁ బడియుండదు. అయినను, బుణ్యమునకుఁ బోవఁ బాప మెదు రయ్యె' ననట్లు, నీబ్రతుకునకై కడంగ నాబ్రతు కున కెక్కడ మోస మొదవునో యని, నాయుల్లం బొకపట్టునఁ దెగు వకుం జొరఁ బాఱఁ జాలకున్నయది. అది యట్లుండ, నదిగో నొక పాపిష్ఠఘూకము నన్ను వాత వ్రేసిగొన నుంకించి, నట్టాడుచు మ్రోలఁ గొండవలె నిన్నుఁ బొడగాంచి, కదిసి శంకించి, శిరఃకంపంబు చేసి, చిత్తం బురియాడ వెచ్చనూర్చుచున్నది. నీకారుణ్యంబు గలిగిన, నా యాపద నిస్తరించి నీ కీవిపత్సయోధి కవధిఁ జూపుదును. ఎరవుగాఁ జూడక, నన్ను నీవానిఁగా మన్నింపుము." అనుడు, నుల్లంబునఁ బెల్లు సంతసిల్లి, హస్తాచ్ఛాదితశ్రోత్రుండయి పృషదంశకోత్తముం డిట్లనియె. "హా! కారుణికోత్తమా! నీబ్రతుకునకు మోస మొదవునం చెంత మాటాడితివి! ఊరక యుపకారంబు సేయవచ్చిన నీవంటినోరుమాలిన జంతువుం బొట్టకై పొలియించి, నే నేమి కట్టుకొందును? దేనికి వెఱవ

కున్నను, బాపంబున కైన వెఱవ వలదె? నేనిప్పుడు నిరాశ్రయతా దశను గ్రమ్గి, కాటికిఁ గాళ్ళు సాఁచుకొని యున్నాఁడను. ఇట్టిచో నెట్టికట్టిఁడి యైన, ధర్మేతరుండయి నీతిబాహ్యం బైన కార్యంబున కొడఁబడునె? ఒరు లేయువి యొనరించినఁ దనమనమున కప్రియ మగునో, యాయవి తానొరులకుఁ జేయకునికియే, సర్వశాస్త్రసారం బైన పరమధర్మము. నేను బాల్యమునుండియు నిసుబోఁటియెఱుక గలవారిశిక్షలనె పెరిఁగినవాఁడనుగాని, తెఱఁగువచ్చిన నడవడిం బ్రవర్తించినవాఁడఁ గాను. మిత్రుఁడా! నీయాలోకంబున నాతమో నిచయంబులు పటాపంచ లయ్యెను. నే నెప్పుడు నీపొందునకే మున్నను గ్రుక్కిళ్ళు మింగు చుందును. నేఁటికది యానిమిత్తంబున సిద్ధించినది. నీచెలిమి యబ్బిన ధన్యుండు సర్వజనమూర్ధన్యుండు గాఁడె? భవత్సందర్శనంబున వేవు రాప్తులువచ్చి క్రమ్మొల నిలిచిన ట్లున్నది. లోకంబున మంచివారికి సజ్జనదర్శనంబునకంటె బరమలాభంబు గలదె? నీపరోపకారచింతకు నాస్యాంతం బెంతయు సంతసించె. ఎవఁడు చేసినధర్మంబు వానిఁ గాచును. కావున, మతిమంతులు కాలుచె య్యాడుతఱినే ధర్మమునందు బుద్ధి నిలుపవలయును. ఆవల జవసత్వంబు లుడిగి, యస్థిచర్మావశేషావయవంబులతో ముదిమి గదిరి యున్నప్పుడేమి సేయుటకును బురుషుండు సమర్థుండు గాఁడు. అంతియ కాక యాయువును, వాయుచలితదీపకళికయుంబోలె, క్షణభంగురంబై యుండును. అది విచారించి, ధర్మకార్యం బెల్లి చేయవలయునది నేఁడును, మాపు చేయవలయు నది జేవును, జేయుచుండవలయును. 'ధర్మస్యత్వరితాగతి' యను పురాణవచనమును బాటింపవలదే? దుఃఖ సముద్రంబున మునుంగఁబాఱి, నిరాధారంబుగ నున్ననాకు నీవొక తెప్పగాఁ దారసించితివి. ఆహా! యేమి నాభాగ్యము! ఆడఁబోవుతీర్థ

మెదు రయ్యెను! నేను నీతోడు వేఁడికొన వేగిరపడుచుండ, నింతలో నయాచితంబుగ నీవే నన్నుఁదరింపఁ దలంపుఁగొంటివి. నీవంటిపుణ్యకర్ముండు లోకంబున నొండొక్కరుండు గలఁడె? నీకీఘూకమాత్రంబున కీలాగున భయపడ నేల? నాప్రాణము రక్షించితేఁ జాలును. భవదిష్టంబే సవశ్యంబుగఁ గావించెద. గుండెబెదరు దీతి నాసరస కరుడెన్నుఁ. నాప్రాపు గలిగి యుండ, నినీ్నచపేచకంబు సెనకి మయిమయింబోవ నోపునె? నీకొక్కయాపద రాకుండ నాప్రాణమడ్డము వైచెద: చెచ్చెరవచ్చి, యీయుచ్చువ్రచ్చువనిఁ బూనుము. అనిన, నాయుందురువు డెందంబున నానందించి. వల్లేయని, మెల్లన నాచీలి సమీపంబునకుం జనియె. అదిచూచి, మనసు నిరాశ చేసికొని, యులూకంబు తనవచ్చినత్రోవఁ బట్టి తిరిగిచూడక మరల తన యిరవున కరిగెను. అంతఁ బోయయు జాగిలమ్ములు పెక్కులు ప్రక్కలంబలసి చనుదేర, జముదూతవలె నే తెంచుచుండెను. మార్జాలం బాయెలుకను దూరమునుండి కాంచి, గుండియ రాయివడి, యుంగ మాకంపింప, నెలుక కిట్లనియె. "చెలికాఁడా! మనము మాటల సఁదడిని మఱచి, యేమఱి యుంటిమి. చూడు మదిగో — నాపథంబున వ్యాధుండు దండహస్తుండై రెండవ దండధరునోజం జనుదెంచు చున్నవాఁడు. ఆక్రూరకర్ముండు నాకంటఁ బడ్డప్పటినుండియు, నాప్రాణంబులు నామేనలేవు; చిత్తంబు స్వాయత్తంబు గాక తత్తరించుచున్నది. ఇంక నాబ్రదుకెల్లను నీచేతిలోనిదయి యున్నయది. పుట్టి బుద్ధియెఱుఁగుట మొద లెన్నఁడును మున్నిట్టి కష్టములకు లోనైనవాఁడఁ గాను. కాలవిలంబనాసహిష్ణుత్వంబున జలదరించుచున్న నన్ను భయవిహ్వలు నానృశంసుఁ జారిం బడకుండ వేగ విడుగర సేయుము.' అనిన, మూషకంబును నురిచేరులు కొఱుకుట నటించుచు, 'నోడ

కోడకు మిడె విడిపించెద' నని లుబ్ధకుండు సహాసమ్మొండగు నంతకుం గడపి, వాఁడును గడుసికటం బగుడు, వడివడిం ద్రాడు తెగఁ గొతికి, యొక్క పరుగునంబోయి, తనబొరియం జొరఁబాఁతె. లబ్ధ మనోరథం బగునోతువును ముంగలఁ జెంచుంగాంచి, దరమర్దితం బగు హృదయం బున, నాక్షణంబ వృక్షసమారోహణం బాచరించెం. శిథిలప్రయత్నుం డయి నిషాదుండు, విషాదనంబున నురి పారిపోవుటకు నాసికా శిఖా గ్రంబునఁ గరతర్జని మోపి యబ్బురవడుచుఁ దనయిచ్చం జనియె. అంత నావృషదంశకంబు ద్రానుఁ దిగివచ్చి, యెలుకం బేరుకొని యిట్లనియె. మిత్రుఁడా! పరోపకార కారణంబున, నన్నిట్లన్నిటం జాలియున్న సంగడికానిం బడసియు, సౌహార్దసౌఖ్యం బనుభవింప నొల్లక, యేల బేలతనంబున ఫలవిముఖుండ వయ్యెదవు? ఇంకొక తడవ నీపచోమృతంబు నాచెవులకుం జవి చూపుము. నేఁడు మొద లుగా నాసిరి యనుభవింప నీవును భాజనంబ వైతివి. నీవు వెలిగా నొక మంచిపదార్థంబు గుడువ నామన సొగ్గ కున్నయది. నా కెల్ల చుట్టంబులును బక్కంబులును నీవ. నాయిల్లు నీయిల్లుగా భావించు కొని, నేఁడును జేపును నీవవశ్యము మద్గృహంబున నన్నపా నాదివూజనంబులు గయికొని, నా భవనమ్మున్ పావనమ్మున్ చేయు నది. ఇదిగో మదీయంబు లగు నర్థంబును జీవితంబును భవదధీనం బులు. ఇంక నన్ను నీవానిఁగా నెంచుకొనుము. ప్రాణరక్షణం బొనరించి మించిన మహోపకారిం బ్రియపూర్వకంబగు గాఢాలింగనం బున నయిన గారవింపక, కృతజ్ఞతాలేశం బెట్టికట్టిఁడి నయిన మది కుదిరియుండ నిచ్చునే! ఇప్పుడు నీగాఢ పరిష్వంగసౌఖ్యం బొసంగక వేఱు సేయుట, నెయ్యునిదెస కూర్మి కఱసేయుటగాని యెండుగాదు; వేవేగ వివరంబు వెడలివచ్చి, నన్నక్కునం గదియించి మన్నింపుము."

అనిన బిలంబులోనుండి మూషకం బిట్లనియె. ఒకప్పుడు ప్రయోజనం బపేక్షించి విపక్షుని తోడి నఖిత్వం బంగీకరించియు, బుద్ధిమంతుఁ డేమఱి యుండఁడు. ఇప్పుడు నీవొనరించు తటతీవునకుం జిక్కి, చొక్కి, యుండుట నాకు బ్రదుకు తెరువు గాదు. నీవింతదనుకం బాశంబునఁ జిక్కికొని మిక్కిలిబడలి పేరాఁకలి గొనియున్న వాఁడవు; ఉదరంబు వెన్నంటు కొని యున్నది; కన్నులు గుంటలు పడ్డవి; నీ కిప్పుడు చలిది వలసి నెయ్యంబు కరంబు నెఱపు చున్నాఁడవు. నీమాయ మాటలకు లోఁబడి, ప్రాణంబులు గోలుపోదునే; నీ నెయ్యంబునకును నీకును వేయినమస్కృతులు. ఇంక నీవిక్కడ మఱేమియుఁ జదివి చంపక, యీవట్టిభ్రమలు మాని నీదారిం దలయెత్తక పొమ్ము. ఇంతకుముంద యీలుబ్ధకుపాశంబువలన వెలువడియు, మరల నింతలో నీమురాశాపాశంబులఁ గట్టువడఁ గోరెదేల?" అని తెగనాడి, కలుఁగు వదలక యెలుక సుఖం బుండె. అంత నామాటల మనసు విఱిగి, చీలియు హస్తగతం బగు ధనంబు నోనాడుకొన్నకరణి సంతాపించుచుఁ జనియె.

"కాఁబట్టి శత్రువుతోడఁ గూడి మనవలసిన యవసరంబు నుండును. అప్పు డేమఱి యుంటమాత్రము కానిపని. ఈప్రయోజనంబునకు మఱేమియు విచారింపఁ బనిలేదు. ఇఁక నీవు మాట్లాడకు, మీతని చేరిక కీకొమ్ము" అని, మఱియుం గలశంకలన్నిటికిం బరిహారంబులు సెప్పి మఱియు నిట్లనియె. "విరోధి వరూధినితోడఁ గూడి, మలయపర్వతమ్ము నెత్తమ్మున విడిసియున్న వాఁడు. ఇట్టియెడ మనలో మనము త్రొక్కులాడుట పగతుని కార్యసిద్ధికి నుపకారంబు. కావున నీచెనఁటి వివాదంబు మాని, కార్యైకతత్పరుండ వయి, ముందుగాఁ బస్తుత కరణీయంబు విచారింపుము." అనినఁ బక్ష్మాంచలంబులు

వాల్చి తనలోఁ దా నింతసేవు చింతించి, రాజునకు మంత్రి యి
ట్లనియె. "చిత్రవర్ణనిచేతఁ బ్రత్యాఖ్యాతుం డయి, యాతనిమంత్రి
యుపేక్షాపరుం డయియున్నవాఁ డని వినియున్నాము గదా? ఇది
యొక్కటియె మనకార్యసిద్ధి కత్యంతప్రయోజనకారి. అంతియకాక,
పరవశుండును, బ్రమూదియు, యోధావమంతయుఁ బగతురకు సుఖ
భేద్యు లగుదురు. ఈచెప్పిన లక్షణంబు లన్నియు నిప్పుడు చిత్రవర్ణని
యందుఁ గన్పట్టుచున్నవి. ఆతనివాహినీనాథులును మార్గాయాసపర
వశులై, ప్రమాదు లయి యుందురు. దీర్ఘనర్త్మపరిశ్రాంతంబును
క్షుత్పిపాసార్దితంబును నయి, సైన్యంబు దైన్యంబు గదిరి యుండును.
ఆబర్హిప్రకాంశుం డింతవఱకు నస్మద్దుర్గావరోధంబు గావింపం
బ్రమత్తుండయి, తమ్మునఁ దా నెఱుగకున్నవాఁడు. కావున, నభియాతులఁ
బరాభూతులఁ జేయు నిది మంచిసమయంబు. నద్యద్రివనమార్గంబు
లవరోధించి, విరోధివధూధిని వధియింప మనసారసాదుల వేగ నియ
మింప వలయు. మాకు బుద్ధి యేమిఁ? అనిన, నమ్మాటలకుం బ్రము
దితాంతరంగుం డయి, కార్యత్వరాసముత్సాహదోహలిత హృదయుం
బున రా జిట్లనియె. "మనవా రిత్తఱి వైరిం దాఁకసించి బీరం
బులు తోరంబులుగాఁ బోరిన పచ్చు నా గౌరవముగానియందుల
కుంగాని యీయూకారగౌరవంబు గౌరవముగాదు. దురంబున నర
వాయిగొనక, మీరందఱుఁ బ్రౌఢాత్యయపర్యంతంబుఁ బోరునది.
కాలవిలంబనంబు సేయక యందఱమన సొక్కటై నడువుండు." అని
యానతిచ్చె. ఆమాటలాడుటయె తడవుగా, సేనాపతియు మహో
త్సాహంబునఁ బృతనావుంజంబులతోడ నడచి, కడునడచినబడలిక
నొడళ్ళు తూఁగాడఁ బోడిమి చెడియున్న పరబలంబులపయి నేమఱు
పాటుసం బడి, వేఁడిమి చూపి, పక్షహాననంబులఁ దూలించి, శాతనఖ

చంచుపాతనంబుల నొంచి, పొలికలన నెత్తురుమడుగులు గట్టించి, పలువుండ్ర రూపుమాపినఁ జిత్రవర్ణుండు విపక్షపక్షిపక్షనఖతుండా ఘాతమ్ముల నేలం గూలి కీ లెడపిన జంత్రపుబొమ్మలుంబోలెఁ గాలు కాలం బెనఁచికొని చాఁపకట్టువడి యున్న నిజసైనిక నికరంబుల విలో కించి, నిర్విణ్ణుండయి, బహిర్లిఖితచిత్రాకారంబు పగిదిం గొంతవడి చేష్టలు దక్కియుండి, మగుడ నెట్టకేలకుఁ బరిజనప్రయత్నంబునఁ దెలిసి, దారుణరణకరణస్మరణంబు చిత్తంబు నుత్తలపెట్ట, దూరదర్శిం గాంచి, సవిషాదంబుగా నిట్లనియె. "ఇవ్వగిది నొప్పనివారివలన మన దళంబులకుఁ దెప్పరంపుముప్పు వాటిల్లుచుండఁ, గానివానియెయ్యాన నొప్పరికించి చూచుచుండుట నీయట్టిదిట్ట కుచితంబే? నీయుపేక్ష నిర్ఘాతంబె వీరిపరిక్షయంబునకు హేతుభూతం బయినది. మనస్వైన మన సైనికనికాయంబులోఁ గాయంబు గాయంబు గానివాఁడు మందునకైనఁ గానరాఁ డయ్యెడును. మా యదృష్ట మిట్లుండ, నిన్నిట్టిట్టనుట నేరము. అయిననుఁ, మనమొన కొకచెట్ట పుట్టిన, నిందుఁ బ్రసిద్ధులరు మీకకావున నది మీతలనె నిలుచుంగాని, మీ రప్పుడు తప్పించుకొందమన్నఁ బోవునది కాదు. కృతమతి వగు నీమంత్రము పెడచెవులం బెట్టి, వాక్పారుష్యంబు చూపిన నాపాప ఫలము తోడనె కట్టి కుడిపినది. భవదంశకరణంబునం గరుణఁ జొనిపి, యింతదనుక నానోర వెడలినప్రల్లదంబు లెల్ల మఱచి నన్నుఁ జల్లనిచూపునం జూడుము. లేదా, యీదండులం దోచుకొని వింజపుఁగొండకు మార్గంబువెట్టుము. నాగతిదైవంబెట్టు కావింపఁ దలఁచె నట్లయ్యెడు —నామే నున్నది, ఈవింధ్యాటవి యున్నది. అంతేకాని, రాజనసి యీబలంబులు వోలియఁజూచి సహింపఁజాల. అకారణంబు, డిపి తూఁటువడ సందడించునలబలం బివ్వా డలబలంబు

లేక, స ద్దడఁగియున్నది; నాయూరంతబలఁగంబును సల్పావశిష్టం బయి, కాడుపడియున్నది. వీరింగూడ, నెట్లు చూచిచూచి వైరుల వాతఁ ద్రోయుదును? ఇదె పుణ్యమును భూపమును నీపయిం బెట్టి తిని. ఇఁక, నేఁజేసినను నేఁజేయకున్నను గూఁర్చిచికొని రావలయును. న న్నీ యపారవిపత్పారావారంబున ముంచినం దరిఁజేర్చిన నీదె భారము." అని న్యాయనిష్ఠురంబు లాడి, కరుణ పుట్టునట్లు మడిసినదండంబుల దడవి తడవి కురరివలె విలపించిన, మనము కరఁగి దూరదర్శియుఁ దొంటికోపం బెల్ల దిగఁ ద్రావి, ప్రసన్నముఖుం డయి రాజున కిట్లనియె. "దేవా! దేవరయవార్యశౌర్య విజృంభణంబున దుర్గం బాక్రమించి, లబ్ధవిజయులమై సమస్తవస్తువులం జూఱగొని, యచిర కాలంబునకు భవదుక్తప్రకారంబుగా వింధ్యాటవికే చనుదము. సుఖదుఃఖంబు లెంతవారికి ననుభావ్యంబులు కావే! ప్రాగ్జన్మకృత కర్మాధీనంబు లైన వీని నెవరు పొందకుండఁగలరు? ఆయువు మూఁడి యీచన్నవారికై శోకంబు మాని, కార్యపరుండవు గమ్ము. ఈహితశేషపరిమిత బలంబులతోడ నవరిమితవృతనావృతుం డగు నహితు నెట్టు నిహతుం గావింపఁ దలకూడు నని చింతిలవలవదు. లోకంబున నుపాయశాలికి, లోఁకువగానియర్థంబు లేదు. దేవర నిజ ముగాఁ దలఁచినఁ గలన నీయులఁతిమూఁకల గెలువ నెంతసేపుపట్టును? నాసామర్థ్యంబు నేఁ జెప్పవచ్చిన, హాస్యాస్పదంబై చూపట్టును. మతీయు నాత్మప్రశంస యసహ్యంబు; నన్ను నే నెన్నఁనేల? నా బారిం బడ్డవారు ముందఱి నాచే నిందఁ బెట్లయ్యెదరో, నీప యెఱింగె దవు. తక్కినసీలెంకల బలశౌర్యంబులును దలంప లోకసామాన్య ములు గవు. ఏనుంగుంబోలె నీబలము నీవెఱుంగవు. నీ వించుక యలిగిచూచిన, నీముందఱి హంసలుగింసలు నిలువఁ గలవె? మన

మందఱనుం గూడి తెరువు లరికట్టి, యెట్టివారికిఁ జొరప యీక, లోనివారిం గడుపుచిచ్చున లోపలన దరికొనునట్లు సేయవలయు. మన వారిం దొలుత దుర్గద్వారం బవరోధింప విధింపుము. దీర్ఘ సూత్రత విజయసిద్ధికి హేతువుగా వివేకిలోకంబుచే గణియింపంబడు. అయ్యా దియు నియ్యెడ సిద్ధం బయ్యెను. ఇంకఁ గార్యసిద్ధికిఁ సందియం బెయ్యది? సముత్సాహంబు వాటించి, దళవాయిని రణవిహరణ క్రీడకుం దీపరింపుము. జయశ్రీ వరింపుము." అని యాతని యనుభావంబునకుఁ బ్రోద్బలంబుగాఁబలికిన, జేఁడును నంతరంగంబునం బొంగి నింగిముట్టె.

అంతట మున్ను పంపఁబడిన రెండవ వ్రణిధి ధవళాంగుండు రయంబునం బఱతెంచి, హిరణ్యగర్భం గానిపించుకొని, నమస్కరించి యిట్లనియె. "స్వామీ! యవధారు. ఆపాఁపమేఁపరిదొర యెఱకల మెఱుంగులు తుఱుంగలిగొనం దనచేరువతో నీచేరువం జనుదెంచు చున్నవాఁడు. భగ్నమనోరథుండయి యాతండు తనమంత్రికడకుం బోయి వేలాగుల బతిమాలి. యతిప్రయత్నంబున నాతనిం బ్రసన్నుం గావించుకొని, తనమంత్రోపష్టంభంబున విజృంభించి, యాతనివచనంబులె మహోపలంబంబుగా నస్మద్దుర్గావరోధంబు సేయ నిశ్చయించె. ఇఁక నవశ్యానుష్ఠేయం బైన కృత్యంబుపయిం దలఁపు నిలుపుము." అనవుఁడు, జక్రాంగవుంగవుండు రథాంగంబు మొగంబుఁ జూచి, "సర్వజ్ఞా! మీఁదఁ జేయవలయుపని యేమి? చెప్పుము." అనిన నాజకక్కవల మేలుబంతి యిట్లనియె.

"మనవీరుల సారాసారంబులు విమర్శించి, తత్తదవ్హాసంభావనంబుల గారవింపవలయు. దానంజేసి, యుత్సాహసాహసంబు లినుమడించి ప్రాణము లైన డాఁపక పోరుచుఱు. దానముకంటెను సన్మా

నంబె వేయిమడుంగు లెక్కుఁడు; పన్నాసంబె సర్వార్థసాధకము. దక్షు లగు భృత్యుల యథార్హాసంభావనములందనుపమికంబె రాజులకొవ్వమి వేఱు లేదు. కాఁబట్టి నాపలుకుల నడ్డచేయక, యాదరింపవలయును." అనిన, హిరణ్యగర్భుండును మనమున గడునలరి నిజసైనిక నికరముల రావించి, బహూకరించి, యుత్సాహం బెక్కించి, దురమునకుం బురి కొల్పె. అంత దూరదృశ్యమాన వైరివాహినీసందోహముం గాంచి, మించిపోయినట్లు వఱతెంచి, నీలవర్ణుండు రాజునకు నమస్కరించి, యిట్లనియె. "దేవా! నేవగునిఁ గృపాకింకరం బగు కటాక్షాంకురంబున నీక్షించి, యీచిన్నవిన్నవం బవధరింపవలయు. నామాట యసదుగాఁ జూడ వలదు. అల్లడె ప్రత్యర్థి యుద్ధార్థియై దుర్గద్వారమువలనికిం డాయుచున్న వాఁడు. ఆతండు మనదుర్గనిర్గమమార్గం బవరోధించెనేని, మనమెల్లఁ గాళ్ళు తెగినవగిది నిందుండి పేరులేక ప్రుందవలసి వచ్చును. పనుపవచ్చును రాదనుశంక మాని, నన్ను నీయిచ్చవచ్చినపనికిం బుచ్చుము. స్వామియాదేశం బయ్యెనేనిఁ, బోరికిం దారసించిన యీ శారికావారమ్ములను గీరమ్ములను నే నొకచీరికిం గొనను. ఇవి గరు వమున నాడు కండకావరపుమాట లని తలంపకుము. నేఁ బ్రభనము నకుం జొచ్చినఁ, జచ్చియు విచ్చియు నరాతు లెట్లు యథాయథ లయ్యెదరో కనుంగొనుము. స్వామి నాకింతవట్టు మన్నన యీవలయు, దేవరఋణంబెల్ల వడ్డితోడఁగూడ నేఁడయాగ్రుక్కఁడులచేఁ గ్రక్కించి, స్వామిఋణమువలన విముక్తుండ నయ్యెద. అంగీకారనూచక ముగా నొకమాఱు భ్రూవల్లరి నించుక యుల్లార్పుము." అనిన, మొగంబుననవ్వుగానినవ్వు నవ్వి, కోకలోకాధ్యక్షుండు రూక్షేక్షణంబుల నధిక్షేపించుచుఁ, గాకి కిట్లనియె. 'ఓ నౌనుఁ నీవన్ని టికిం జాలుదువు. ఆయాస ముడిగి, యింతటితో మిన్నకుండుము.

కృత్యాకృత్యపరిజ్ఞానంబు లేక, యూరక త్రుళ్ళుటయెకాని, బుద్ధి యూపంతయు నెఱుంగవు. నీ వెప్పుడుం బోరు పోరనియే పలువ రించుచుందువు. నేటి కది తలకూడినది. నీవే నిష్కారణముగా నీవైరంబుఁ బెనిచితివి. దీన మాకంచఱకుంగూడఁ బ్రళయంబు సంభ వించుంగాని, నీయొక్కనితోడం బోవదు. అమోఘ లగు మానును లిండ్లకడ నెన్నియైన బీరంబులు నఱకుదురుగాని, మాకుతుండు దార సంబై యీరసంబుసం బోరునప్పుడు వారి నక్కిళ్ళువడును. నాహిత వచనంబు లవజ్ఞతగా నెక్కించుకోక, నీపోకడనూలినతనంబుఁ గట్టి పెట్టి, సాధుసమ్మతుండవగుము." అని, రాజువంక మరలి "స్వామీ! యీరజ్జులాని వృథాజల్పంబులు నిక్కంబులుగా వగచి, మానప్రా ణంబులఁ గోలుపోవుట మేలుగాదు. వీఁడు గడుఁగ్రొవ్వి, నోరికివచ్చిన ట్లెల్ల వెడయఱవు లఱచుచున్నవాఁడు గాని, లేశంబును గార్యంబుఁ గానఁడు. కర మూరసిచూడ, వీఁడు మిత్రవ్యపదేశంబునం బరఁగు శత్రుండు. నీకుఁ గల వివేక మంతయు నిపు డేయూరికిఁ బోయె? మాయికుల కెందును మాయపుభంగులే మందు గాని, ఋజుమార్గం బులు కొఱగావు. నీవార్యవృత్తంబునకుం జొచ్చి, యీతని శుషోపచారంబులు కడుతీపులుగా నభివర్ణించెదవు. ఈదురాత్మునిదార్ఢ్యం త్ర్యంబు చెవి నిడఁగూడ దను తలం పించుగయు నీబుద్ధికిం బుట్ట దయ్యెను. మనయోధలు దుర్గంబు నిర్గమింతురేని, దుర్గాశ్రయణం బెల్ల నిష్ప్రయోజనంబై చెల్లును. అందులకై మనపడ్డప్రయాస పాటును నిష్ఫలం బగును. నీళ్ళలోనుండి యేనుంగుఁ బీకఁగు గావిం పంజాలు నక్రంబు, బయటిభషకంబుచే భంగపడుట స్థానభ్రంశ దార్ఢ్యబలంబునంగాదే? దుర్గంబు వెలువడునేనిం జివ్వలో మనగువ్వలు గవ్వకుం గొఱగావు: అనుకూలశత్రుం డగు నీలవర్ణుని చెడుఁ గఱపులు

నీవీనుల కమృతకల్పంబులయి, మతికి హితంబులుగాఁ దోఁచు చున్నవి. మనవారికిం గాలంబు చేరు వాటం గాఁబోలు, నీయెడ కీబూటకపుమాటలు వాటంబులుగా నాటుకొనియెడిని" అని మఱియు నేమో యనఁబోవుమంత్రిమాటల కడ్డంబు వచ్చి, హిరణ్యగర్భుండు తన నమ్మకపుటురిం దగులుటభావించి, వర్ధిష్ణుమాణకోషుం డయి కరటేంద్రుం డిట్లనియె. "ఓమహారాజా! నామాటలు బోటు సేయక, దేవర దివ్యచిత్తంబున నవధరింపవలయు. ఈసర్వజ్ఞుండు మేఁకవన్నెపులి. మన కవమానంబు వాటిల్లినను, దనప్రాణముల దాచికొనవేఁడి, యివ్వు డిన్నిపోకలం బోవుచున్నవాఁడు. ఈతఁడు మనకడ, నుత్సంగంబున నాశీవిషం బుస్నట్టన్న వాఁడు. స్వకార్యైక ధురంధరు లగు నేతాదృశమిత్రుల దూరంబున విసర్జించుట కర్జంబు. ఈతండు పోరికి రాకుండుటయె యుఱవు. ఈతం డొక్కఁడు లేకున్నను, మన కొక్కకొఱఁత రాఁబోదు. పన్నికలు దాఁచినంతనె పెండ్లి చిక్కునా! దేవర ముందఱి బంతంబులు పలుకరాదుగాని, యెవ్వరు నేల! నీకుం గెలుపొసంగ నే నొక్కరుండఁ జాలుదును. నాయుత్కర్షంబు చూడఁజాలక, మీఁదుమిక్కిలి నాపై నొక్క యోపమి నారోపించి, దూఱనాడుచున్నవాఁడు. ఓహో వీనుల కెంత రోఁత విలవలసి వచ్చెను! నిక్కంబు విచారింప, నివి యన్నియు న న్నాప్తుఁ డని మన్నించుదేవర నంట గాక, న న్ననుటయె? ఈతని బోఁటిబంట్ల కెట్లయిన నగుంగాని, శరీరంబునఁ బిఱికికండ లేనిబిరుదు మగలకుఁ బ్రాణంబు మానంబుకంటెను బెద్దకాదు; మానమే ప్రాణాధికంబు. కావున, లోకమున మానధనులు మానహీనమయిన బ్రదుకు నొల్లరు. ప్రాణంబులనైన విడువనోవుదుంగాని, మానంబు వీఁటిబుచ్చి లోకంబున భీరువను పడి వడంజాలను. కుండ మూయ

మూకుడు గలదుగాని యొందును నోరుమూయ మూకుడు లేదు. తటి వచ్చినప్పుడు ప్రాణంబులు దాచుకొని, యాబ్రహ్మకల్పాంతంబు నీఘనునే మననిమ్మ్ని" అని, మఱియు ననాదరసూచకం బగుచిఱు నవ్వుతో "అహహా! యీతనిమాటలు మెచ్చనచ్చును. మనగువ్వ లఁట! దుర్గంబు వెలువడిన, గవ్వకుం గొఱగావఁట! ఇట్లు చెప్పెడు వారు చెప్పిననుఁ జెవియొడ్డి వినువా రయిన నవ్వకపోరు. అప్పుడ ట్లనంతము లగు పగరబలంబుల బలిమెయిం దొడరి, నేలఁగలపిన మనబలుసేన లిప్పటి పలపలనిమూఁకల కోపవంటకంబుఁ బరిహాసా స్పదం బగునర్థంబు లేదు. పనికిమాలినయీశంకలఁ జాలించి, సేనల తోడ వెడలి, ఈపజకే యఱి చచ్చి యున్నయాకొంచెపు మూఁకలం బొదివి, సదమదంబు సేయుము. నీవు నిమిత్తమాత్రుండవు: అంతియ కాని, దైవోపహతం బయి యాపరి రూపరియే యున్నది." అని మఱియుఁ బెక్కులు శూరాలాపంబులు పలికి, యామురాళరాజునకు మత్సరం బెక్కించెను. ఇట్లు నీలవర్ణునితోడ విధియును దన్నుఁ బ్రబోధింప, "ఇది నీళ్ళలోని ముల్లు; ఇది యదియని కార్యనిశ్చయంబు సేయరాదు." అని యొకిక్కింతసేపు త్రొక్కటపడుచుండియు, నీల వర్ణునిమాటకు మాఱాడలేక, యాకలహంసపతంసుం డూరకుండెను. అంత నీలవర్ణుండును సెట్టకేల కొడయని యర్ధాంగీకారంబె వడసి, దడంబులఁ దోడుకొని, దుర్గంబు వెడలి యరిగి, పరబలంబులం దల పడియె.

అందుల నచ్చటివా రందఱు గుంపులుగూడి, రహస్యముగఁ దమలో గుజగుజలు వోవుచుండ, మంత్రి సేనానితోడ నిట్లనియె. "నీలవర్ణునితోడినే స్తంబు మానించుటకై, నేఁబోరలంగలయంతయుఁ బోరలితి. ఇఁక బతితో నతివివాదంబు కూడదు; 'అతిసర్వత్రగర్హిత'

మ్మని పెద్దలు చెప్పుదురు. ఎంత చెప్పినఁ, దనమార్గంబు మానక, మన జేఁడు తాను బట్టినపట్టకు నాలుగుకాళ్ళే యనుచున్న వాఁడు. మన కాడిక రాకుండఁ, జేతికయినంతవఱకు మనము నిలిపిచూచితిమి. మీఁద నీశ్వరసంఘటనం బెటులుండె నటులకాకమానదు. మనకుఁ గాలంబును గర్మంబును బ్రతికూలంబు లయియుండ, నాతనికి మంచి బుద్ధి యెట్టుపుట్టును? మనరాజునకుఁ గ్రొత్తవారే పెద్దయిష్టులు; మనమే లాఁతివారము." అనుచుండి, యనతిదూరవర్తి యుగుచక్రాంగ చక్రవర్తిం గాంచి, యొండొరుల నవలోకసంజ్ఞల వారించుకొనుచు, రణసంభ్రమంబునం బరిభ్రమించు చుండిరి. అంత మరాళకులాధ్య క్షుండు, నిజసలక్షపక్షనిక్షేపణ జాతవాతవేగసముద్ధూత పాంసుజాతంబు భూనభోంతరాళంబుం దిరోహించి యంతరిక్షంబలక్షితంబుగాఁ జేయు దురాగ్రహాగ్రహావేశంబున నొడ లెఱుంగక, సమగ్రసన్నాహంబున, నుత్సాహం బెసంగఁ జనుదెంచి, యింగలమ్మ్ల లొలుకునపాంగమ్మ్లల వైరివీరుల నీక్షించుచు, మొనవెనుకం బొలిచి నిలిచెఁ. అప్పుడు హిరణ్యగర్భవాహిని సందోహంబు లనోన్యాహ్వాన వాదంబులును సింహానాదంబులును రోదసీకుహరంబులు నిండ వైరివీరులం దలపడి, హోరాహోరిం బోరిన, సంగ్రామం బుద్దామంబుగాఁ జెల్లె. అందు దీర్ఘముఖాదులు తొంటిపగకై ప్రాణంబులకుఁ దెగించి, రోషావేశ విశులు లయి రిపుసేనఁ బొయువడం జొచ్చి, దారుణంబు లగుత్రోటీ విదారణంబులను, నత్యంతకఠినపాతంబు లగు చరణ నఖాఘాతంబులను, నభియాతుల నొప్పించి, యద్భుతరసావహంబుగా మహోపాయం బొనరించినఁ గించిదవశిష్టంబుగా నరాతిచమూసమూహంబు నష్టంబునొందె. అప్పు డవ్వితంగకులదారుణ మరణంబుఁ (దానును బతింపండె కానఁ) జూడ నోపక యూచోటు పాసి చనియెనో యనఁ బ్రభా

కరుండు ప్రభ యెడలి పడమటికడలికడకు నడచి, మఱుంగునడియె. ఆమునిమూవున నిరువాఁగుల పడవాళ్లును నాఁటికి బవరంబు చాలించి, తమతమబలంబులం దివిచికొని వీళ్ళు నేరిరి.

అట్లరిగి, యారాత్రి సుఖనిద్ర చేసి, మఱునాఁడు రేపకడ నుభయవాహినీపతులును నహార్న్మఖోచితకృత్యంబులు నిర్వర్తించిన పిమ్మటఁ దమతమబలంబులఁ గలని కాయితంబు చేసి, వురికొల్పిన, నవి యనల్పక్రోధంబున నభ్యర్ణపూర్ణ చంద్రోదయ ఘూర్ణమానార్ణవంబులభంగిఁ బొంగి, యొండొంటిం దలకడచితాఁకి, ఘోరంబుగాఁ బోరుచుండె. ఆభీమసంగ్రామంబునఁ బ్రొద్దు పొడవకమున్ను వచ్చియున్న మేఘవర్ణుండు, హిరణ్యగర్భరాజ్యగర్వాంధకారవినాశసూచకోల్క నానొక్కజ్వలత్కాష్ఠంబు ముక్కునం గఱచికొని కపటపలాయనంబు నటించుచుఁ, దనవారు వేవురు వెంటనంటికా దుర్గం బనర్గళరయంబునం జొచ్చి, చిచ్చింటింటం దరికొల్పి, చట్టుపల విసరుడుం బ్రజ్వలితశిఖుం డగుసమీరణసఖుండు, కరాళజ్వాలికాజాలంబుల దశదిశలం బఱపి, దుర్గంబెల్ల నాక్రమించిన, బహువిహంగంబులు విహాయపంబున కెగసి, పక్షంబులు కమలిన నుడివడుచు ముడింగిపడి, వాతాశనుని కశనంబు లయ్యెం. కల్పాంతకల్పం బగుననలవిహారంబునకుఁ దలంకి, హతశేషము లయినపక్షు లంతరిక్షంబున కెగయ గమకింపఁ, బోనీక కాకులెల్లం బొదివి త్రోటీఘాతమ్ములఁ జరణప్రహరణమ్ములఁ తీవ్రహింగర్ఘూటమ్ముల నిరాఘాటమ్ముగఁ గెడపి, పుడమికిం బలిచేసి 'దుర్గంబుపట్టువడెఁబట్టువడె' నని. యార్చిపేర్చిన కోలాహలము రోదోంతరాళము నిండిన, బెండువడి విమతకృతం బగుపావకోపప్లవంబునకు వగచి; లోనినగోకములు కాందిశీకము లయి, యూహావమున కోహాటించిపాఱి, కంఠగతజీవనము లగుచు జలధులంబడి, తమప్రాణముల

దక్కించుకొనియె. తక్కిన కొన్ని స్వభావమునకు భయము తోడ్పడ గుండియలు జల్లుమని, కళ్లుపడి, యేగఁ గాళ్లురాక, పగతురచరణ నఖాఘాతనిపాతితములై, స్రవన్నిర్ఝరము లగుగోత్రములుం బోలె, నెత్తురువఱదలు వాఱుగాత్రములు మెఱయ, నిశ్చేతనము లయ్యెను. అట్లు క్షణమాత్రమున దుర్గం బెల్ల మల్లెపట్టినపొలముచందం బగుట విని, బయటివారును వెఱవేఁకిఁగొని, కాలుచే యాడక, పిడు గడిచిన వడువునఁ గూలఁబడి బిమ్మిటి గొనియుండ, నేమఱుపాటునం జుట్టు ముట్టి, పరబలము లసంఖ్యములు నిశితముఖము లగు నఖములం గ్రుచ్చి, నిర్ఘాతపాతములంబోని తుండాఘాతముల నొప్పించిన, నిలు వున విగతాసువులై రక్తసిక్తాంగంబులతో రణాంగణం బలంకరించిరి. కొందఱు రణభీరువులు రాజుం బగవారినడుము దిగవిడచి, నిలిచినచోట నిలువక, చూచినవంకఁజూడక, కెళవుల కుఱికి, యొకఁడు పోయిన త్రోవ నొకఁడు వోవక, చెట్టొకఁడుగా నొదిఁగిరి. మఱికొందఱు కాలుతక్కువవారు పాఱంజాలక వెనుకచిక్కి, విరోధియోధచరణ ప్రహారమూర్ఛాపరవశులై, త్రోటిభేదనముల సంధులు ప్రిదుల మురిసి వ్రాలిరి.

ఇట్లు నిహన్యమానము లగుసైన్యములు నిలువఁజాలక, భైన్యమునఁ జెల్లాచెదరై పఱచిన, నాయూపత్కాలమున రాజహం నము స్వభావమందగతి యగుట నబ్బారి గడవనేరక, సారసద్వితీయం బైయుండి, పొరలి పొరలి వచ్చుకన్నిటివఱదం దనధైర్యనౌకాస్థున నుడుపుచు, సేనానిదిక్కు మొగం బయి యిట్లనియె. "మీవరా చూచితివిగదా, నానిమిత్తమున మనవారల కెందఱి కిట్లు ప్రాణాంత కారియైన యాపద సంప్రాప్తమయ్యెనో? వారందఱజీవిక్షణము లిఁక జనము లద్భుతములుగాఁ జెప్పుకొందురు. ఆగడియతఁ నీవును

నేనును నూపిరితో నున్నారము. ఉత్తరక్షణమున నెట్లయ్యెదమో తెలియదు. నాకై యంతలేసివార లట్లు కాగా, నింక నీపాడుశరీరమా నన్ను రక్షించునది? ఈనీలవర్ణుని నమ్మ్మటంగదా, కార్యమింత మోస మయ్యెను. ఆమాయమాటలు చూచి, యాతఁడేమో విశ్వాసపాత్రుం డని భ్రాంతిపడి, తప్పుచేసి యీగతిఁ దెచ్చుకొంటిని. కడ కీదురాత్ముండు నమ్మించి భంగపఱచెను. అప్పుడితనిఁ జేరదీయవలదని మీరెంద రెంద రెన్నెన్ని విధములనో నూఱి పోసితిరి. ఏమికాలకర్మదోషమో యప్పు డావచనము లేమియు నాచెనికిం జవి గావయ్యెను. అప్పటి నాడెందఁబు చందఁబు తలంప, నిపుడు నాకే విస్మయ మగుచున్నది. విధి మూఁడిన వానికి హితులవాక్యము లెట్లు రుచించును? మీరెల్లరు వలదువలదని వేవిధములఁ జెప్పినఁ, జెవిని బెట్టక యీకట్టిడికాకిని గోరి తెచ్చుకొన్న నాపాపఫలం బనుభవింపకతీఱునె? ఇంతకును దైవసంకల్పం బిట్లుండఁ, బౌరుషం బేమి సేయనోపును? హా! దైవకృత మేమనవచ్చును! నాఁడట్లు వేవు రెప్పుడు నొలసి కొలువ వెలయునాకుఁ, బిలిచిన నోయనువాఁడును లేకుండఁ జేసె. వారందఱు ముందుగాఁ ద్రోవ తీసిరి; ఋణ మెక్కువ తక్కువగా మనము నాదారినే వారిఁ జేర నున్నారము. మనసర్వజ్ఞుం డాడినమాట లన్నియు నేఁడు తథ్యంబు లయినవి. అతండు తలంప నీలోకములోనివాఁడే? ఇఁక నాతనివిషయమై యెట్టి పాపపుమాట చెవిని బడునో? నీవు నాకుం గూర్తువేని, యీలోసనచని, యొక్కయుపకారము చేయుము. దైవోపహతుండ నగుననన్ను రక్షింపఁ బూను నీయెత్తికో లెట్లును సఫలము గానేరదు. నేఁటితో నాయాస విడిచిపెట్టి, నాకడంక కడ్డకా ల్వేయక, మదీప్సితంబుఁ దుద ముట్టించి, కృతకృత్యుండ వగుము. నీవు వేగమ వీను చొచ్చి, సర్వ

జ్ఞానుమతంబున మత్పుత్రుఁ జూడాకర్ణు విహంగరాజ్యంబున కభిషిక్తుం
గాఁంచి, యాశుభవార్త దెల్పి నాచెవి వేయుము. ఆతఁడైనఁ
బ్రాణములతోడ నుండి రెక్కొకనెనా మనయాపగ నెన్నటికైన నీఁగఁ
గలవాఁడు. దైవంబు మనలసిద్దఱిఁ దిన్నఁగాఁ జూచినఁ, బునర్దర్శనం
బయ్యెడును. లేదా, యింతే మనయదృష్ట మనుకొని, యిదే కడసారి
చూ పనుకొమ్మ; పొమ్మ" అను తేనివచనములు కర్ణశూలాయ
మానంబులయి హృదయంబుఁ గలంచినఁ, గొంతవడి దిగ్భ్రాంతి వడి,
యతిప్రయత్నంబునం దెలిసి, గ్రుడ్లనీరు గ్రుక్కుకొనుచు, నెలుంగు
గద్గదికం దగులువడ నిట్లనియె. "దేవా! యిట్టి దుస్సహవచనంబులు
దేవరనోర వెడలఁదగవు. 'చూడాకర్ణుని విహగరాజ్యంబున కభిషిక్తుం
జేయుమని యెంతమా టానతిచ్చిరి! అచంద్రతారార్కంబుగ
నీసర్వంసహాచక్రంబు సర్వంబును దేవరవారే యేలవలెను. నేను
సేనానినై యుండ, దేవర నెవ్వరైనఁ, జుట్టన్రావేలఁ జూపనోపుదురె?
వేయేల? మదీయ మాంసాసృగ్వి లిప్తమార్గంబునంగాని, దాయ కేలిన
వారి డాయఁదలకూడదు. క్షమావంతుండును, దాతయు, గుణగ్రా
హియు నగుదొర దొరకుట, మహాభాగ్యంబునంగాని గలుగదు.
శుచియు, దక్షుండును, ననురక్తుండును నగుభృత్యుఁ డొదవుటయు
దుర్లభంబె. అట్లు భాగ్యవశంబున లభ్యం బైనప్రభురత్నంబు నెట్టి
మందభాగ్యుఁ డైనఁ బెడవాయఁ జూచునె? నాకు స్వామితోడిద
లోకంబు; దేవరచరణంబు లెడవాసి క్షణంబును మనఁజాల. ఎంతటి
వాఁడును మృత్యువుఁ గనుఁగ్రొమ్మలేఁడు. ఎన్నటికైన నీదేహంబు
నేలపాలు గావలసినదే. అస్థిరం బగుశరీరంబునకై సుస్థిరం బగుకీర్తిం
గోలుపోనేల? భృత్యుఁడు స్వామికార్యహేతుప్రాణుఁ డయ్యెనేనిఁ,
బుణ్యలోకంబులు చూరగొనునని యార్యు లందురు. ఎప్పుడైన

విడువవలయునీశరీరంబు, నిప్పుడు విడుచుటయేమి భారము? స్వామ్యర్థ పరిత్యక్తజీవుఁడనై సుకృతి నగుదును. సంపదలు గజకర్ణాంతవిలోలంబులు ; తనువులో, శరస్నేహతటి త్తరళంబులు ; ఇఁకఁ దారుణ్యమందుమా, వారితరంగచంచలంబు; నిన్నఁ జూచినవాఁడు నేఁడు గానరాఁడు. ఉన్నను జన్నను, బేరుమాత్రము పోక నిలుచును. దేవర వారు సర్వథా రక్షణీయులు; సప్తాంగములలోఁ బ్రధానాంగము రాజు; ప్రకృతివర్గం బెంత బలవంతం బయ్యు, రాజవిహీనంబై జీవింపనేరదు. ధన్వంతరి వైద్యుఁడైన, నాయువు మూఁడినవాని నేమి సేయనోవును? అంభోజంబుంబోలె, నినునియభ్యుదయసంక్షయంబుల లోకంబంతయు వికాససంకోచంబులం బొరయుచుండును." అనునంతలోఁ జిత్రవర్ణుని సేనాపతి తామ్రచూడుఁడు తనవుంజుపోఁజూతో రాజహంసనుహింసించు తలంపునం దారసించె.

అప్పుడు కుక్కుట పురాళంబులకు దారుణప్రవిదారణం బొదవి, పొదలుమదంబులం బొదివి పరస్పరజయకాంక్షలం బోరుచుఁ, బిఱిందికిం జరగి మరల నరుదెంచి యెగిరి చరణంబుల నొండొరుల నదరంటం జఱచుచు, నఱచుచుం బఱతెంచి చంచువు చంచువునం బెనఁచి యితశేతరాకర్షణంబుల మించి మేనులు చించుచు, వాఁడిగోళ్ళొడళ్ళు గాఁడఁ దాఁచుచు, నెత్తురులం జొత్తిల్లి, తెక్కలుగల మలలమాడిక్కినింగి కెగసి వక్షంబులు ప్రక్షతంబులు చేసిన బోరనం గారుధారాళ రుధిరాసారపూరంబు ధారాధరనిపతితపయోబిందుసందోహంబు ననుకరింప, నొండొరువులకు వట్రపడక పెద్దతడవు పెనంగి, ధరణీతలంబునకు లంఘించి కొంతసే పీడంబోక పోరాడి యంతకంతకుఁ బరిశ్రాంతసత్త్వుండగుచు వచ్చునంచలఁతేనిం గని సత్త్వాధికుం డగుకృకవాకువల్లభుండు మేలు చేయియయి, మెఱుఁగు మెరసిన తెఱఁగున హిరణ్య

గర్భమోఁది కుటికి యెఱికల శిరమ్ము మోఁదిన, నమ్మోఁదుకంబెసు
ముంగలివారినగవుశిఖవోలె మనం బెరియింప, నటాసముత్పాటన
కుపితం బగుకంఠీరవంబు నేపునఁ గోపంబు ముప్పిరిగొనఁ దఱివారిఁ
గొందటిం బొరిగొని, యంతలోఁ జరణాయుధంబు క్రమ్మఱఁ దన్నిన
క్రొమ్మగతిలి, దిగ్గన సంబళించుకొని లేచి, భ్రుకుటీప్రకటీకృతరోషుం
డయి, కడంకలు సుడివడఁ గడిమిపెంపు వోనాడి, దండతాడితదర్వీ
కరంబునోజ రోఁజుచు, శ్రమంబునం డీలుపడియుండ, వీక్షించి సా
సాధ్యక్షుండు వీరవరుండు రోషానూయావిలమూననుండై కడంగి,
యదరు లుమిసెడుచూడ్కి లాతనిపై నిగిడించుచుం గవిసి నిజఖరతర
నఖరప్రహారంబులఁ జరణాయుధంబు నెట్టకేలకు ధరణికెరఁజేసి, బాసట
యై దారిచేసినఁ దెఱిపిగాంచి యాయంచలరాయుండు వెఱపెల్లునం
బ్రాణార్తుండయి పాఱి, నీరంబులం దూఱె. అట్లు తమయుద్యమం
బెల్ల వీసరపోవుటయుఁ, బృతనావతి నిహతుం డగుటయు, నీక్షించి
విపక్షిపక్షులెల్లఁ గోపాటోపంబునం జుట్టుముట్టిన, పరకుసేయక
యాసారసతల్లజుండు సంవర్తవేళాప్రవర్తిత దారుణసంహారవిహారుం
డగుమూఱట సమవర్తియుంబలె నుదగ్రమహాగ్రహవ్యగ్రుండయి,
యనేక శకుంతంబుల నంతకాంతికంబున కనిచి, చూప అగ్గింవఁ జిత్ర
వర్ణవాహిని నేటి కెదు రీఁదినట్లు వీరవిహారంబు సలిపి, విపక్షదుర్ని
రీక్షుండయి, రణక్షోణియెల్ల నిపతితవసామాంసభారంబు లగు శోణిత
పూరంబులు వఱపి, మఱియు బిఱువోవక జమఁ డాడించు జంత్రపు
బొమ్మలట్లు పయిపయిం గవియు పింగళి బలంబులఁ బీనుంగుపెంటలు
గావించి, మాఱులేక మలయుచుండ, హతశేషపక్షికులంబు వికలం
బయి విఱిగి నురిఁగి తనమఱుఁగుఁ జొచ్చుటయుఁ, గేకినాయకుం డెల్లె
డలం బెల్లుగఁ దెళ్ళి మృతంబులు మృతకల్పంబులు నైయున్న స్వకీ

యానీకినీజనంబులకు విచారపడి, సేనలం బురికొల్పి, యొక్క పెట్టఁ దానును నమాత్యుండును బెగ్గురువయిం బడి బడలించినఁ, జేవదతీఁ గియుఁ బౌరుషంబు వాటించి, శాత్రవసహస్రంబులం దునిమి, విగత పత్త్యం డయి తూఁగాడుచు నరగన్ను వెట్టి, కొఅప్రాణులబులతో వీర వరుం డుండ, శిఖండీంద్రుండు వురివిచ్చి వచ్చి యాత్మపక్షత్రోటీ ప్రహరణమ్ములఁ మొత్తిన, విక్షతంబుగా నొఅలుచు విగతజీవుండయి వీగశయనంబున శయినించె. అది చూచి చిత్రవర్ణుం డమందానందం బునం బొదలి, సింహనాదంబు చేసె.

ఇట్లు చిత్రవర్ణుండు విజయోల్లాసభాసురుండయి, యరిదుర్గంబుఁ బ్రవేశించి, రాచనగరులెల్లఁ గొల్లగొని, యుల్లంబుల వెల్లివిరియు నంత నంబు మొగంబునం బబ్బి యబ్బి, జయజయశబ్దంబులు భూనభోం తరంబు నిండ, నిజామాత్యభృత్యవర్గంబులం దోడుకొని, నిత్యప్రయా ణంబుల నిజరాజధానిం జేరి, యత్యంతయత్నలబ్ధం బయిన విజయంబు సార్థకంబుగా నపారసంతోషంబున వసుంధరాపాలనంబు నేయుచు సుఖముండె.

అని విష్ణుశర్మ విగ్రహము సమగ్రముగా ననుగ్రహించి, ప్రజాప్రళయకారణం బగు రణంబునకుఁ గాలు ద్రవ్వక, నొవ్వక, మీరును నేమిమీఱఁ ప్రజాపాలనంబు సలుపుం డనిన, రాజపుత్రు లింతంతనరాని సంతసంబునం బొదలి విష్ణుశర్మను బహుభంగులం గొనియాడిరి.

ద్వితీయభాగము ముగిసెను.

విగ్రహము సంపూర్ణము.

235

నీతిచంద్రిక, సంధి.

956

TO

Edward Parr Metcalfe, Esq., M. A.,

PRINCIPAL, PROVINCIAL COLLEGE,

RAJAHMUNDYR.

THIS LITTLE VOLUME

IS

MOST RESPECTFULLY DEDICATED

BY

THE AUTHOR

AS A SLIGHT MEMORIAL OF SINCERE ESTEEM.

6.548

పీఠిక.

...o(@)o...

చిత్రపదము.

శ్రీకరు నవ్యయు నాద్యున్
లోకచయావనశీలున్
శోకవిశోషణు సీశున్
బ్రాకటభక్తిని గొల్తున్.

తేటగీతము.

ఆంధ్రభావను బద్యకావ్యములు పెక్కు-
మున్న లోకోపకారకంబుగ రచించి
నట్టి నన్నయాదుల నెదయందుఁ గొలిచి
వచనకావ్యంబులను వ్రాయువారిఁ దలఁతుం.

ఉత్పలమాలం.

ఇంతకుమున్న నేను రచియించినవిగ్రహతంత్ర మెల్లచో
నెంతయుఁ గష్టశైలి రచియింపఁగఁబడ్డ దటంచుఁ బల్మఱున్
వింతగనాకు లేఖలను బెక్కురు వ్రాయుచునుంటఁ జేసి య
త్యంతము వ్రాసితిన్ సులభమాగతి దీనిని సంధితంత్రమున్.

తేటగీతము.

పలుమఱు హితోపదేశంబు భారతమును
బంచతంత్రంబుఁ బరికించి, వానిలోన
వలయుకథలను గొని దీని వ్రాసినాఁడఁ
గ్రొత్తగాఁ గొంత యందందుఁ గుదురుపఱిచి.

చి త్ర ప ద ము.

పెద్దల వేఁడెద దీనన్
దిద్దఁగ దోషము లున్నన్
విద్దియ చాలనినన్నున్
దద్దయుఁ గూర్మిఁ క్షమింపన్.

241

నీతిచంద్రిక

సంధి

తదనంతర మానరవరకుమారు లాధరణీ సురప్రవరున కిట్లనిరి. "స్వామీ! మీ యనుగ్రహంబు కతంబున, విగ్రహమును సమగ్రము గా నాకర్ణించితిమి. దయచేసి యింక సంధిని సహితము ప్రసాదించి మాకుం గర్ణరసాయనంబు గావింపుఁడు." అనవుడు సభ్యస్తనమస్త నీతిశాస్త్ర మర్మ్మం డగు విష్ణుశర్మ్మం డిట్లని చెప్పందొడంగె:—

అమ్మాడిక్ భీమసంగ్రామంబున నిహతానేకసైనిక లోకంబు లగు మయూర మానసౌకంబులకు గృధ్రచక్రవాకంబులచే క్షణమా త్రంబున సంధి చేయఁబడియె. ఆవిధంబు వివరించెద వినుండు.

ఆరీతిని దారుణం బగు ప్రవిదారణంబున వీరవారం బెల్ల మారణంబు నొందినఁ జింతాక్రాంత స్వాంతుండై వరటా కాంతుండు మంత్రిం జూచి "సర్వజ్ఞా! ఎవఁడు మనదుర్గంబున నట్లగ్గి పెట్టిన దుష్టా త్ముఁడు? పగఱచేఁ బంపంబడి యెవ్వరయినఁ బ్రచ్ఛన్నవేషు లయి మనదుర్గంబు నివాసంబుగా నుండి మనల మోస పుచ్చి, చి చ్చంటించి పోయిరదా!" అనిన వినయావనతుం డయి చక్రవాక ప్రశస్తుం డిట్లనియె.

"దేవా! దేవరవారికి నిష్కారణబంధువై యుండు నీలవర్ణుం డిప్పు డేమెఱో సపరివారంబుగా గానరా కున్నాఁడు. నాకుం జూడ నిది యంతయు నావిశ్వాసఘాతకునివిచేష్టితమ యని తోఁచుచున్నది. దేవర యమూయ కత్వమే దేవర నింతకుం దెచ్చినది. పుట్టుపూర్వ్వ

ములసు విచారింపక యవిశ్వసనీయు లగు నభినవాగతులయెడ హృద
యంబు సదయంబు గావించి నమ్మినపావఫల మనుభవింప నేడు
కాలము వచ్చినది." అనిన రాజును క్షణమాత్రంబు స్వాంతంబునఁ
జింతించి—"ఇది యంతయు మా దురదృష్టము. మా యదృష్ట
మిట్లుండఁగా నెవరి నన వలసిన పని యేమున్నది. ఈవిషయంబున
దైవప్రతికూల్య మొక్కటియె కాని మంత్రులదోషంబు లేశంబును
లేదు మనుష్యోపయత్నముచేఁ గార్య మెంత చక్కఁగా సంఘటింపఁ
బడినను, దైవయోగము చేతం జెడిపోవును. నిటలలిఖి తాక్షరంబులు
తుడిచివేయ నెవ్వరిచే నగును." అని యూరకుండెను.

అవుడు సవినయంబుగా మంత్రి యిట్లనియె—"లోకిములోఁ
బండితులు కానివారు తమ కొక్కవిషమదశ ప్రాప్త మయినప్పుడు,
దైవమును గర్హింతురు; కాని యాత్మకర్మదోషంబుల నెఱుంగఁ
జాలరు. అవధ్యానురాగు లగురోగుల లాగున నృపాలురును హిత
తంత్రు లగు మంత్రులమతి నతిక్రమించి యాత్మవంచకు లయి యభి
నవప్రియులం బురస్కరించుకొని కార్యంబు ముగిసినవెనుక గర్వము
సర్వముం దూలి యవ్వు డదృష్టముం బేరుకొందురు. సుహృదులును
హితకాములును నగుసచివుల వాక్యంబులాదరింపనివారు సహవాసి
హితోపదేశంబు వినక చెడినదీర్ఘసూత్రుండను విసారంబుతీరున వినా
శంబు నొందుదురు. అక్కథ యక్కాణించెద నవధరింపుండు."

ఒక్కయేటిమడువున దీర్ఘకాలమునుండి, దీర్ఘదర్శి, ప్రాప్తకాల
జ్ఞుఁడు, దీర్ఘసూత్రుఁడు, నని మత్స్యంబులు మూఁడు కూడి వసియించు
చుండును. అట్లుండఁ గొండొకకాలంబునకు వేసవి సమీపించుడు,
దీర్ఘదర్శి తక్కటివిూల రెంటిని జేరఁబిలి యిట్లనియె — "మిత్రు
లారా! మీరునుం జూచు చున్నారుగదా! ఆదినమున కాదినము

వేసఁగి మిగుల నాసన్న మగుచునున్నది. ముందు నిక్కముగా నీళ్ళివుఁ బాఁపెడితఁటిని మన కొండొక చోటికిం బోవ శక్యము కాదు. కాఁబట్టి యిప్పుడే యీ వేటం బడి వెడలి యగాధజలంబును జలచర బహుళంబును నగు మఱియొక్కచుదువుం జేరుదము. అనినఁ బ్రాప్త కాలజ్ఞుం డిట్లనియె. భవిష్యదర్థంబునందుఁ బ్రమాణముం గానము; కాఁబట్టియె బుద్ధిమంతు లగువా రెప్పటి కేది ప్రాప్తమగునో యప్పటికి దానికిం దగినట్లు కార్యము ననుష్ఠింపఁ జూతురు; కాని ముందెప్పుడో యెప్పని రాఁబోవు నని యిప్పుడే చిత్తంబున రిత్తవిచారంబు పెట్టుకొని కుందరు. ఇట్లీమహార్ణవంబువడుపున నుండఁగానిప్పుడే యింతపంత యేల: అంత పుట్టినప్పుడు పోలిన తెఱంగు చూచుకొందము" అనిన దీర్ఘనూత్రుఁ డేమియు నాలోచన పాలు వోవక యూర కుండె. అంతయు న్విచారించి దీర్ఘదర్శి యింక నిందు నిలుచుట కార్యంబు కాదని మున్నింద మెలంకువ పడి జలసమృద్ధం బగు మఱియొక్కమడువుం బ్రవేశించె. ఆవెనుకం గొన్నాళ్ళు గడచిన నెండలు మెం డగుమఁ బూఁట పూఁటకు జలంబు లింకఁ జొచ్చిన, జాలరులు వచ్చి యూఁతలు, చిక్కములు, మీలపుట్టికలు మొదలగు వానితోడ నీరంబులఁ జొచ్చి, విషంబులం గలరుషంబుల నెల్లఁ బట్టి ప్రాళ్ళం గ్రుచ్చు చుండఁ బ్రాప్తకాలజ్ఞుం డొక్కవెర వూహించి యం దొక్కప్రాడు నోరం గఱిచికొని గ్రుచ్చినట్లు లంటిపట్టు కొని గ్రుక్కమి క్కనక యుండెను. అప్పుడు దీర్ఘనూత్రుం డబ్బారిం గడచునుపాయంబుఁ గానక "యేమి చేయును నెందుఁ జొత్తు" నని తత్తఱంబుచు నిందు నందు మిట్టిమిట్టి పడుచు దుముకు లాడు చుండఁజూచి యాకైవర్తులానాలుగను లగుడంబున నడిచి మడియిం చిరి. అంత నాధీవరులు మీలవేటఁ జాలించి వారిచరంబులయొడళ్ళ

నంటినమంటిని గడుగ మీలగుదుల జలంబుల జాడించునప్పుడు మీనం బులసందున నిరుదొడలం ద్రాడు గతిచి పట్టుకొని గిట్టినట్టులు కదల మెదల కున్న ప్రాప్తకాలజ్ఞుడు మెల్లఁగాఁ ద్రాడు విడిచి గంభీరవారిం బ్రవేశించి ప్రాణత్రాణంబు గావించుకొనియె. కాఁబట్టి మిత్రులహిత వచనంబులు వినినవాఁడు దీర్ఘసూత్రునివిధంబున నంతంబుఁ జెందును. మఱియు దీన నిం కొకవిశేషంబుకూడఁ గలదు. ముందుగా ననాగత ములగు కార్యంబుల నూహించి మెలఁకువ పడువాఁడు దీర్ఘదర్శి విధంబున నాపదం బొరయక సుఖించును; అప్పటికిం దోఁచినట్టు వెరవు పరికించి ధైర్యముతోఁ గార్యము నిర్వర్తింపఁ జూచువాఁడు ప్రాప్తకాలజ్ఞుని తెఱంగునఁ బరమసంశయాస్పదం బయినబ్రమకుం గాంచును; భవిష్యదర్థంబునుఁ గానక సమయోచితం బగుతుపా యుంబునుఁ దోఁచక యూరకుండువాఁడు దీర్ఘసూత్రునికైవడిఁ దప్పక యప్పుడ ముప్పుఁ జెందును.

అనునప్పు డొప్పునివారివీటం బుట్టువింతల నారసి రాఁ గ్రమ్మఱఁ బంపఁబడిన ధవళాంగుండు చనుదెంచి యంచలరాయనిం గాంచి నమ స్కరించి యిట్లనియె. "స్వామీ! ప్రతిక్షణంబును దుర్గశోధనంబు కర్తవ్యంబని మున్నే విన్నవించుకొని యున్నాఁడనుగదా! దేవర నావచనంబులయెడ ననాదరంబు చేసి యీవనిం గావింపనైతిరి. అల్లేమటి యుండుటవలనిఫల మిప్పు డనుభూతం బయినది. గృధ్రా నీతం బయినమేఘవర్ణం డనువాయసముచేతనే మనదుర్గదాహంబు చేయఁబడినది. అతఁడే మీపాల నీలవర్ణం డనఁ జనవరియై యుండిన వాఁడు. ఆప్రకారము—అనునంతలో నాతనిమాట కడ్డము వచ్చి తల యూఁచి విశ్వసించి మరాళవల్లభుం డిట్లనియె. "ఔనౌను: ఉప కారంబువలనంగాని ప్రణయంబువలనంగాని కానివాని విశ్వసించి

నాతఁడు వృక్షాగ్రమున నిద్రించువానివలెనే యధఃపతితుం డగును. సందియము లేదు. తదనంతరోదంతంబు చెప్పుము." అనుడు బకం బిట్లనియె. "ఆప్రకారము దుర్గదాహంబు చేసి డాయవచ్చిన మేఘ వర్ణునిఁ జిత్రవర్ణుండు సగౌరంబుగా బహూకరించి, ప్రసాదమేదు రంబుగా మంత్రివంకఁ జూచి యిట్లనియె. — "కృతకృత్యుఁ డయిన భృత్యునికృతం బూరక పోరాదు. ఆతండు మనోవాక్కుల సంతో షించు ప్రతిఫల మవశ్యము కలుగవలయును. కాఁబట్టి యీమేఘవర్ణుని నే యీ కర్పూరద్వీపరాజ్యంబున కభిషిక్తునిం జేయుదము" అని చెప్పి నప్పుడు పోరిచొప్పు తలఁపునం బొంది పరధ్యానముతో విచారించు చున్న రాజుం జూచి మంత్రి చక్రవాకంబు: "ప్రణిధి యేమో ముఖ్యాంశంబు మనవి యెయిసరింపఁ బోవుచున్నాఁడు, దేవర పరాకు లేక ససాకల్యముగా నాకర్ణింపవలయును." అనుడు జేఁడు; "ధవ ళాంగా! మేము చిత్తగించుచునే యున్నారము. ఏదీ? తరువాతి వృత్తాంతమును వినిపింపుము." అనవుడుం బ్రణిధి యిట్లు విన్నవించు చున్నాఁడు.

అంత నామాటలకుఁ బ్రధానమంత్రి యైన దూరదర్శి యి ట్లనియె: "దేవా! ఇప్పు డేలినవారు సెల విచ్చిన దంత యుచితం బని నే దలంపను. ఈతనికి మే లొనరింపఁ దలంపుఁ గొంటి రేని, ప్రసా దాంతరము చేయుటయె యెంతయు నర్హకార్యము. 'చూడామణి స్థానమునం బొడుకర నిడఁగూడనట్లు, మహాత్ము లుండఁదగినపదంబు నందు నీచుల నెప్పుడును నిలుపరాదు. నీచస్థానయోగ్యునిం దెచ్చి యతిశయస్థానమునందు నిలిపినభూవిభుండు, కాళ్ళం దొడుగఁ దగిన పాదుకలం దల ధరించినవానివలెఁ బరిహాసపాత్రుఁ డగును. లోకములో దేవర యెఱుఁగనిది మఱి యెవ్వ రెఱుఁగుదురు? పూజించినను నవ

మానించిననుగూడ నపకారంబు చేయుచుండుట యల్పులకు నైజ గుణము; శిరంబున ధరించిసను గాలం ద్రొక్కినను భుజగంబు బడలు పడం గఱుచును గదా? నీచులు శ్లాఘ్యపదంబుం బొందుదురేని ఒకానొకప్పుడు మేలు చేసినవారికే ద్రోహంబు చేయఁ జింతింతురు. మునొక్క కాలసర్పము వణిజునిచేఁ బ్రతికింపఁబడియుఁ, నాతనికే యపకారంబు చేయఁ జూచెను. దేవర కాకథ వాక్రుచ్చెద నవధరింపుఁడు.

హిమవంతంబు ప్రాంతంబున నొక కాంతారంబునఁ గాలితెరువున నొక బేహారి చనుచుండెను. ఆయెడ నాయడవియందు దావపావకుండు గడు నడరి నలుగడలుఁ జుట్టి యొక్కపట్టున నొక్కపెట్టునఁ బెక్కుచెట్లుం గాల్చుచుండెను. అట్లు వెంటనె మంటలు మింట నంటఁగా నానడుమ నొక్కకాలవ్యాళంబు చిక్కుకొని యొక్కడకుం బోవఁ ద్రోవఁ గానక యాకానం జను చున్నవాణిజునిం గని పేరెలుంగున నిట్లనియె. "ఓయార్తజనశరణ్యా! ఈయరణ్యంబు నలుదెసలుం గ్రమ్మి మమ్మారమ్మ్రగఁ జుట్టుకొన్న యీయెరగలింబడి ప్రాణంబులు గోలుపోవలసి వచ్చెఁగా యని రక్షణోపాయంబు తోఁపక దైవంబుంబ్రార్థించుచుండఁగా నాపాలిటిదైవంబు చందంబున సమయమున సన్నిహితుండయినాఁడవు. శరణాగతభరణంబున శిబిచక్రవర్తిని దలఁపింపం దగు నీయంతటిలోకోత్తరుని శర ణొందితిని. ఇఁక నాకేమి కొదవ; జాగు సేయక వేగ వచ్చి ప్రాణదానంబు చేసి పుణ్యమునం బొమ్ము. నే విన్నవింపఁగల దంతయు విన్నవించితిని. పిమ్మట దమచిత్తము నాభాగ్యము. అని మఱియు దీనాతిదీనంబు లగువచనంబులఁ బ్రార్థింప, నాతఁడు దుష్టజంతువు ప్రాణసహితము చూడఁజాలక యగణ్యాకారుణ్యంబున డాయఁబోయి లోపల మిలమిలమెదలుచు నరణ్యరోదనంబు చేయు చున్న జింహగముం గనుగొని, తనచేతికజ్జలొనకుం బెరు

ద్రాటితో నొకపంచిని వ్రేలం గట్టి, యాకఱ్ఱి మొదలు చేకఁబట్టుకొని
యుపాయముగా పంచిని బొడలలో జాఱి విడిచెను. తోడనే
యాపన్నం బగు నాపన్నగంబు పంచిలోఁ దూఱి చుట్టచుట్టుకొని
యుండెను. అంత నాపణ్యాజీవుండు మెల్లఁగా పంచిని బయటఁ దీసి
యాశీవిషము నొకచోట విడిచి పెట్టెను. మ్రొక్కఁ బోయిన గుడి
విఱిగి మీఁదఁబడినట్టు తోడనే యాత్రాఁచు బుసకొట్టుచు లేచి,
మనుష్యులు పాములం గంటఁ బడినతోడనే చంపుచుందురు.
కాఁబట్టి యట్టి మాకులంబున కెల్లను మృత్యుప్రాయు లైన వారిని
దొరకినవుడు దోరింపక విడువ రాదని పలుకుచు, నాలుక లార్చుచుం
గవిసి యాతనిపైఁ బడి కఱవఁ బోయెను. అందుల కాతం డడలు
గడలుకొని వడఁకుచుఁ బరిసరధరాధరదరీద్వారంబులు మాఱుమ్రోయ
నఱచుచు పంచి నొకమూలం బాఱవైచి దర్వీకరము వెనుకయుఁ
దాను మందును గాఁ బఱవఁ జొచ్చెను. ఆచేరువ పొదలో నిదు
రించు చున్న గోమాయు వాయలుకుడు విని యులికి పడి లేచి వచ్చి,
ఫణికిని వణీక్భిరోమణికిని నడుము నిలిచి యిట్లనియె. "ఓయురగ
రాజమా! ఏల యీరక రోఁజుచు నీపాఱుఁబోతువెంటం బడి పరు
గెత్తుచున్నాఁడవు? ఇంచుక సేపు నిలిచి నీవార్త నాతోడఁ జెప్పుము.
నాచేత నగు సాహాయ్యం బున్నం జేసెదను" అనినం గృష్ణాహి తన
యీవదవ్వృత్తాంతంబును బూసగ్రుచ్చినరీతిని వినిపించెను. అది విని
యక్కజం పడినట్లభినయించుచు నక్క- యిట్లనియె: "ఓమిత్రమా!
ఇప్పుడు నీవు చెప్పినచరిత్రము విస్రంభపాత్రముగా నేఁ జింతింపను.
ఈసంచి యెక్కడ? నీదేహమెక్కడ? దీనిలో నీవు దూఱుట
యెక్కడ? నీవు చూడఁబోయిన బెద్దబారెఁ దున్నాపు; సంచియో
పట్టుచున్న జేనెఁడు లేదు. నీనిందు మరలఁ జొచ్చి చూపుపటుకును

నీమాట సత్య మని విశ్వసింపఁ జాలను." అనుచు నానాగుఁబా మప్పుడ సంచిం బ్రవేశించి, తొల్లింటియట్టుల చుట్టఁ జుట్టుకొని లోపల నిమిడి యుండెను. వెంటనే యాసృగాలము, మోమున వైవర్ణ్యంబు మిగులఁ బెదవులు తడుపుచు నిలుచున్న యావణిజునకుఁ జేసైఁగ చేసి యాసంచిమూతిని గట్టిగా దారముతో బిగింపు మని చెప్పెను. అతఁడాప్రకారము చేసి, తనచేతిబడియతో సంచిమీఁద నాలుగుమోఁదులు మోఁది దందశూకమును స్వర్గలోకమునకుం బుచ్చి, జంబుకంబుం గొనియాడి తనదారిఁ బోయెను.

కాఁబట్టి క్షుద్రులు తమ కుపకారంబు చూపినవారికే యప కారంబుఁ దలంతురు. అంతియ కాక, ప్రుక్కడులయెడం జేసిన యుపకారంబును నిసుకయందు రచించినచుద్రయుం బోలెఁ జాల కాలంబు నిలువదు. మార్జాలంబును ధర్మకర్తఁగా భావించి సేవింపఁ బోయినశశకపింజలములకుం బోలెఁ దమకెప్పుడు కీడు మూఁడునో యని యెంచి, ప్రజలును నల్వనిం గొలిచి యుండ నొడఁబడరు. మీ కాకథ వాక్రుచ్చెద నాలింపుఁడు.

వింధ్యాటవిలో నొకవృక్షకోటరంబునఁ జిరకాలమునుండి కపింజలంబను పక్షియొకటి కాపురంబుండును. ఒకనాఁటి సూర్యాస్తమ యసమయంబున మొయిలు మొత్తమ్ములు వియత్తల మెల్లఁ గాఁజు క్రమ్మికొని కడవలం ద్రిమ్మరించిన ట్లొకజడివాన కురిసెను. ఆవర్ష ంబునం దడిసి తడసి యాపులఁంగు వేళకుఁ దొట్రు జేర లేక పోయెను. అప్పుడు దీర్ఘకర్ణం బనుశశం బొక్కండు భృశంబును వానను నాని యాశకుంతం బుండుతరుకోటరంబు చేరి, నెమ్మదిగా నందు సుఖ నిద్ర చేయు చుండెను. ఇంతలోఁ గపింజలము తనని వాసస్థలి న్వేదకు గొనుచుఁ జిమ్మచీఁకటిలో వచ్చి లోన నిదురించు కుండేటిం గని

యుదలించి కోపంబు గదుర నిట్లనియె. "ఓరీ! శఠాధమా! నే నింటలేనియెడ వచ్చి నీవు కావరంబున నాగృహం బాక్రమించుకొని నిశ్శంకముగా శయసించు చున్నాఁడవుం ఇఁకనైన నాలస్యంబు చేయక నాయిల్లు నాకు విడిచి యవలికి లేచి పో. మాడు పోకుంటివా నీప్రాణములు నీవి కావు." అనిన గరువంబున శశం బిట్లనియె. "చాలుఁ జాలు. నీబెదరింపుమాట లింతటితోఁ గట్టి పెట్టుము. దీర్ఘకర్ణునిముందఱనా బీరంబులు పలుక వచ్చితివి? వాపీకూపంబు బును, దటాకంబులును, దరువివరంబులును నెవ్వరు ముంచుగా నాక్ర మించుకొందురో నాఁటికి వారివి గాని యెల్లకాలముఁ బ్రత్యేకముగా నొకరిసొత్తులు గావు. మా టాడక పో పో. పో నొల్ల వే నెయ్యెడ కైనం దగవునకు రా పోదము" అనిన "వ్యవహారమునకు ర మ్మన్న చో రానన వచ్చునా? ఈరాత్రి వుచ్చి వేగినం బోదము. ఆందాఁక గొంచె మోపిక పెట్టుము." అని యాకొదవరాత్రి నెట్లో వేగించి తూరుపు తెల్లవాఱుము శశంబును లేపి, దానితోఁ దగవునకుం బోదము నము వు మని నాలుగడుగులువెట్టి, యాసిట్ట మనవివాదంబుఁ దీర్పఁ గలవాఁ డెవ్వఁ డనిన దీర్ఘకర్ణుఁ డిట్లనియె "నర్మదానదీతీరంబున దధికర్ణుం డనుమార్జాలవల్లభుఁ డొకండు గలఁడు. అతఁడు బహుకాల వృద్ధుఁడు; బహువ్యవహారదర్శి; శాంతమూర్తి; సధర్మ్మఁడు. అతండే మనచిక్కు వదలింపఁ దగినవాఁడు." అనినఁ గాఁ బోలు నని యొడఁబడి యాకపింజలము కుండేటితోడఁ గూడఁ గాల్దెవుసం జని చని మిట్టమధ్యాహ్నమున నాజీర్ణోతు వుండు తావుం జేరెను. ఆహా! కాలంబు చేసు వయినఁ దల లుత్తరించుకొని పోవుచోటికే పాదంబు లెంతదూర మయిన, శరీరధారుల నీడ్చుకొని పోవును గదా; అ ట్లాశశకపింజలములు గమ్యస్థానంబుఁ జేరి, పురోభాగమున వృద్ధ

మార్గాలునిం గాంచి, కపటధార్మికుఁడును గేవలజఠరపూరకుం డును నని యెఱుంగక యిట్లనియెను. "ఓ మార్గాలనాయకా! మాలో మాకు స్థలవివాదం బొక్కటి పుట్టి దానిని ధర్మ స్వరూపుల రగుస్వామిసమ్మఖమ్మునం దీర్పుకోవలెనని బహుదూరము నుండి యాస పడి వచ్చినవారము. మమ్మీఁ దడవు కూర్చుండఁ బెట్టక నిష్పక్షపాతకముగా వేగిరము వ్యవహారంబు తీర్చి మమ్ము మానెలవులకుఁ బంపివేయుము." అని నామునుసనిపిల్లి యిట్లనియెఁ- 'అయ్యలారా! మీరేమో దూరమునుండి చెప్పుచున్నారు. జరాభరం బునఁ జాంద్రాయణాదివ్రతంబులు తోడువడఁ గృశించి యిందిరు వటుత్వము తగ్గి యున్నవాఁడఁ గాన నాశ్రవణంబులు దూరమునుండి మీవాక్యంబులఁ దిన్నఁగా గ్రహింప నేర కున్నవి. మీరిరువురుం జెఱియొక చెవి చెంతం జేరి మీమీవివాదాంశంబులఁ దేట పడ నుచ్చై స్వనంబునం దెలుపుఁడు. మాకనుష్ఠానసమయంబు సమీపించు చున్నది; మాధ్యాహ్నికంబు లొనరించి దానధర్మములు చేసికోవలెను. అయినను దగవు తీర్పఁ గలవా రెంద రైనఁ గోర్టులో యుండ మీరు వారి నేరింగాదని, నే నేమో నిష్పక్షపాతముగాఁ దీర్పువాఁడ నని విని కడుదవ్వులనుండి వచ్చియున్నవారు. అట్టి మిమ్మూహారక పంపుట మము బోఁటితపస్వులకు ధర్మంబు గాదు. ఈలోకములోనే యెల్లకాలము నుట్టి కట్టుకొని యూఁగు లాడఁ బోము. కాలధర్మము నొంది నప్పుడు ధర్మమొక్కటి దక్క నీలోకములోని వేవియుఁ గూడ రావు. కాఁబట్టి యట్టిధర్మమును మాత్రము వేయియాపదలు వచ్చినను జెడ నీడు లోక కాపాడుకొనుచు రావలెను. ఇది యెంతయు సత్యము. సత్య మెప్పుడును దప్పరాదు. సత్యమే సర్వశుభములకు మూలము. సత్యము నకుఁదోడు భూతదయయు నుండవలెను. భూతదయయే సమస్త ధర్మ

మునకు నలంకారము. తనదేహమున నొక్కకంటకము పోకినంతనె యెంతనొప్పి కలుగునో యెల్లదేహధారుల శరీరవేదనయు నట్టిదే కదా యని యెఱింగి తత్త్వజ్ఞు లెప్పుడును హింసకుం గదుదవ్వుగఁ జరియింపు చుందురు. క్రూరకర్మ లీయర్థం బెఱుంగక దయయు ధర్మంబును విడిచి దేహయాత్రామాత్రమునకై పరోపతాపంబు చేయఁ బాలు పడుదురు. "స్వాశ్రితావనసమానహిధర్మ" యని వేదములు ఘోషిం చుచు గదా! కాఁబట్టి యాశ్రిత రక్షణమునకు సమాన మయిన ధర్మము మఱియొకటి లేదు. విషాభం బగు లోభంబును మొట్ట మొదట మొదలంట నున్మూలింప వలయును. ఎంత సంపాదించినను బ్రాణావసాన సమకుంబున లోకములోని దేదైనఁ దలఁ గట్టుకొని పోదుమే? ఓరుగాళ్ళా! పాపభూయిష్ఠం బయిన యీ కలికాలంబున నీవెందఱు వళవర్తులం గానించుకొని యెందఱిచే నెన్ని దుష్కార్య ములఁ జేయించుచున్నావు! ఓహో! నీపేరు తలంపునఁ బాతినంతనె నాగుండెలు పగులుచున్నవి! అని యవ్వగ్గుఁబిల్లి చల్లని మాటలతో నల్లన ధర్మోపన్యాసంబులు సేయుచుండ నా శశకపింజలములు విశ్వా సముతో బిడాలమును డాయం బోయి రెండును రెండు చెవులలోను దనతన వ్యవహారమ్మును జెప్పుకొనుచుండ, పిట్టశగవు పిల్లి తిర్చి నన్న ట్లూజరమార్జారంబు కాళ్ళతో నా రెంటిని జిక్కఁబట్టి యొక్కట మెడలు కొఱికి చిత్రవధం బొనరించెను. ప్రాణ ప్రయాణ వేళ నశశకపింజలములు: "అయ్యో! ఒక్కరాత్రికివ్వరు పరున్న నేమి యని యూరకుండక లేనిపోని వివాదంబు పెట్టుకొని తగవునకుం బోవుద మనుదుర్బుద్ధి యొకటి పుట్ట నుఖముగా బ్రదుక లేక వేకువ జామునఁ బడిపోయినట్లు లేచి యింతదూరము పరుగెత్తుకొని వచ్చి, యీ ఖలుఁని నాశ్రయించి వీనిమిథ్యా వాదములు విని వృథా భ్రమ

వడి దుర్మరణంబుఁ దెచ్చుకొంటివిం. పోరు నష్టి పొందులాభము నన్న లోకోక్తికి యెన్నఁడైన వ్యర్థ మగునా? వినాశకాలము సమీపించినప్పు డెవ్వరియాలోచనలు నేల వనికి వచ్చును? తానొకటి తలఁచిన దైవ మొకటి తలఁచును. 'లలాటలేఖా నవునఃప్రయాతి' యన వినమే?" అని చింతించుచుఁ బ్రాణములు విడిచెను. మార్జాలమును యథేష్టం బుగ రెండుమూఁడు దినము లాహారంబు వెదకుకోనక్కఁజలేక వానిని భక్షించుచుండెను.

అప్పుడు చిత్రవర్ణుండు దూరదర్శిం జూచి, "మంత్రివరా! నీవు చెప్పినట్లు మేఘపర్ణుని కుప కారాంతమునే చేయుదము. కాని మున్ముందు చేయు వలసినపని నొక దానిం జెప్పెదను విమ్ము. మునచే నశ్రమంబున జయింపఁబడిన కర్పూరద్వీపమునకు మరల నీమేఘ వర్ణునినే పంపుదము. ఈతండు చని యారాజ్యమునం గల యుత్తమ పదార్థముల నెల్ల నిరాయాసంబున నిచ్చటికిం గొనిరాఁ గలఁడు. అప్పు డాతెచ్చినవానిలోఁ గొన్నియపూర్వవస్తువుల మనయాప్తులకుం బుత్తము; కొన్ని మేలి వస్తువులు ప్రకృతివర్గంబున కొసఁగుదుము; మిగిలిన వానిని యథేచ్ఛముగా మన మనుభవింపఁగలము. ఆపయిని నిష్కంటకముగా మనమే యెల్లకాలము జలనంబు లేకుండ నాదీవి దొరతనంబు జెల్లింపఁ గలము. అను రాజువచనంబులు విని నవ్వి దూరదర్శి వినయ విధేయత్వంబులు కాన్పింప మెల్లఁగా నిట్లనియె. "దేవా! అనాగత కార్యంబులం దలఁచి సంతోషింపరాదని నయ విదులు పలుకుదురు. మనోరథ రాజ్యపాలనంబున నానందించువాఁడు కడపటఁ బేలపిండికుండం బగులఁ గొట్టుకొన్న మేదినీ దివిజునివలెనే విషాదంబునొందును. ఆకథ వినిపించెదను. వినుండి.

అయోధ్యానగరంబున దేవశర్మ యను బ్రాహ్మణుఁ డొకఁడు గలఁడు. ఆమహీసురుఁడు మహావిష్ణువత్సంక్రాంతినాఁడు మఱియొక విప్రునియింట శ్రాద్ధమునంను నిమంత్రితుఁడై, యొక సక్తుపూర్ణశరావమును దానముగాఁ బరిగ్రహించెను. అందున కాఁపుండు డెందంబున సమందానందము నొంది, యాసక్తు ఘటముఁ గొని యిరవున కరుదెంచుచుఁ గడుసార శ్రాద్ధభోజనంబు చేసి యుంటఁజేసి నడవఁజాలక యాయాసపడుచు బొజ్జ నిమురుకొనుచు మెల్లన మార్గంబున నొకకుంభకారుని గృహంబు చేరి యురుగు మీఁద దొంతరలుగా నిడిన కడవలకడఁ దనసీరుకావిదోవతింబఱిచి, తలకుఁ జుట్టినయంగవస్త్రము తీసి చుట్టకుదురు గాఁ జేసి దానుపయిని సక్తుభాండంబు నిడి, నక్తరక్షణార్థంబు దక్షిణహస్తంబున దండంబు నొకదానిని ధరించి, యెడమచేయి తలగడగా నిడుకొని యాపంచ మీఁద శయనించి, కన్ను లర మోడ్చి మితిమీఱిన కోరికలు కోరుచు నిట్లు చింతించెను. "ఈసక్తువును మంచివెల వచ్చినప్పు డమ్మి యొకపాఁడిమేఁకను గొనియెదను. అది యేఁటేఁట రెండేసిపిల్లలఁ బెట్టుచుండును. అవియు వానికిఁ బుట్టినవియు సంవత్సరక్రమమున బెరిఁగి కొన్ని హాయనములలో బహుసహస్రము లగును. అప్పుడు వాని ననిన్నటిని విక్రయించి నూఱు పాఁడిమొదవులం గొందును. ఆధేనుశతమును గతిపయాబ్దములలోఁ బెక్కుదూడల నీనును. అవి యన్నియుఁ గాలక్రమమున మందలుమందలుగా వర్ధిల్లి, దొడ్లునిండి పోవును. ఆవల వానిలోఁ గొన్నిటితో విరివిగా వ్యవసాయము సాగించి, పొలములలోఁ బండిన వంటలలోఁ గొంత విక్రయించి లక్ష సంఖ్యాలధనము నార్జించెదను; మఱికొన్ని కోడెల నమ్మి సొమ్మ్ము కూడఁ బెట్టెదను. ఆవిత్తముతో నత్తఱి నేను గోటీశ్వరుఁడ నగుదును.

ఆపిమ్మట మాయింట నేమూలఁ జూచినను రొక్కము వెక్కసము గా మూలుగు చుండుట నెఱిఁగి యెల్లవారును నాకు 'మేము కన్య నిచ్చెదము మేము కన్యనిచ్చెద' మని యింటిచుట్టును దిరిగి పోవు చుందురు. అందులోఁ గులగుణరూపసమన్వితయగు నొక్కతన్విం బెండ్లియాడెదను. ఆలలనవలన నాకు మాఱునిం బోలుకుమారుండొకఁడు కలుగును. వానికి మాసోమశర్మపేరే తప్పక పెట్టెదను. గృహకృత్య నిర్వహణాయత్తచిత్తంబున నాసుందరి నందను నెత్తుకోక నా ముందఱ విడిచి పోవఁ గోపంబు పట్టలేక వెనుకపాటునఁ బోయి యా మగువ నీలగుడంబున నే నాలుగడపు లడఁచెదను." అను సమయమునఁ గొంచెము నిద్రవచ్చి తెప్పలు వాల్చి నిజముగా భార్యవచ్చి మ్రోలనిలుచున్నట్లు కలవరించి, యాగ్రహంబునఁ దనకుడిచేత నున్నదండముతో నాపిండికుండను భిన్నభిన్నములుగాఁ గొట్టను. కట్టివిసరునప్పు డాదెబ్బలలోఁ గొన్ని యాచేరువ నున్న భాండ పఙ్క్తులకుం దగిలి కొన్నికుండలు పగిలి పోయెను. ఆచప్పుడు విని యుదరిపడి లోపలినుండి కుమ్మరివాఁడు పరుగెత్తుకొని వచ్చి యా వెడఁగుబాపనయ్యకు నాలుగుబహుమానంబు లర్పించి, వడివడి నావుడమి వేల్పును జావడి వెడల నడఁచెను. కాఁబట్టి యెందును రాఁబోవు కార్యంబులం దడవికొని, సంతోషించువాఁడు మున్నున్న దానిం గూడఁ జెడఁగొట్టుకొనుటయె కాక, సరివారిలో దూఱు వడయును.

అప్పుడు మయూరసార్వభౌముండు మంత్రిం జూచి యిట్లనియెఁ: "దూరదర్శీ! నీ వీవఱకును వచియించిన దంతయు నాదరణీయం బయి యున్నది. నీమాట చొప్పున మేఘవర్ణుని రాజ్యంబునకుఁ బట్టంబు కట్టఁ గూడమికి మేమును నొప్పుకొన్నారము.

ఇఁక గర్భారణ్యవపరిపాలనంబుఁకు మనవారిలో నేరి నియోగింప వలెనో వాక్రువ్యము." అనిన మందహాసంబు గావించి, సగౌరవముగా దూరకర్మి యిట్లనియె.

"దేవా! మన మిప్పు డాహిరణ్యగర్భునిఁ బరాజయంబు నొం దింపం గలుగుట మాయోపాయముచేఁ గాని, నిక్కంపుఁబౌరుషంబు చేతం గాదు. అతఁడు మహాసత్వసంపన్నుండు; ప్రజారంజకుండు; అసమానమానమహితుండు. కావున నీయసమానంబున కోర్చి యాతం డూర కుండువాఁడు కాఁడు. ఉన్న ట్టుండి యెప్పుడో యే మఱుపాటున మనపయిం బడి పగఁ దీర్చుకొన సమయంబుకొఱకుఁ బ్రతీక్షించుచుండును. అతనిమంత్రియు ననన్యసామాన్య శ్రేముషీ మంతుఁడు; సర్వంకషప్రజ్ఞగలవాఁడు; సౌజన్యధన్యుఁడు; ప్రతాప దీపితుఁడు. కాలచోదితుం డయి వెనుక యేఁ డాతనిమంత్రంబు దెన ననాదరంబు సేయుటంజేసి యీమేఘవర్ణున కందుఁ జేరంగలిగెను గాని, హిరణ్యగర్భం డప్పు డాతనిమంత్రంబునే నమ్మ్మికొని ప్రవ ర్తించెనేని యింతకుముందు మన మెక్కడ నుండవలసినవార మో దేవరయే యూహింపఁ దగి యుండును. వెనుక నొకసారి నమ్మి భంగ పడి యున్నవాఁ డవుటంజేసి తొంటియ శ్లేమఱి యుండక యిఁక జాగరూకతతో మంత్రివాక్యములనే వేదవాక్యములనుగా మన్నించుఁ గాన, ముందు మనయాట లేమియు నాతనికడ సాగవు. ఇంతియ కాక రాబోవునది వర్షాకాలము. జలపక్షు లగుటంజేసి యాతనిసైనిక నికాయంబుల కది యూలంబున కనుకూలకాలంబై చూపట్టును. స్థల పక్షు లగుమనపక్షములవారికో వర్షాకాలదినంబులు దుర్దినంబులె యయి కానఁబడును. కాఁబట్టి హిరణ్యగర్భునితోడ సంధి గావించు కొని యాతనిరాజ్యం బాతని కొనంగుట సముచితకార్యము. హిరణ్య

గర్భుని సంగరంబున జయించితి మన్నప్రతిష్ఠ యీావఱకే వచ్చి యున్నది. దానంజేసి యిఁక దేవరకీర్తి లోకంబున శాశ్వతంబుగ నెల కొనఁ గలదు. అంతకన్న మనకుఁ గావలసిన దేమి? హిరణ్యగర్భుండు దేశకాలానుకూలంబు తెఱఁ గెఱింగి మరల సంగరంబునకు రాఁ తక్కఁడు. పరమర్మభేదనోపాయధౌరేయుం డగుసర్వజ్ఞునిబుద్ధిసంప దకుఁ దోడు సహాయనంపదంగూడఁ బడసి దడంబులతోడ దాడివెడలి మనలం దొడరు మరాళరాజున కాజి యిచ్చి నొచ్చి యోడి, దిగ్దేశ ముల వ్యాపించిన యశస్సును గోలుపోక నిలుపుకొనుట యుక్తము; నేఁ జెప్పవలసినది చెప్పితిని. ఇంక దేవరయిష్టము.” అనిన బకపక నవ్వి బలదర్పంబున నాతనిమాటలు పాటింపక శిఖండీంద్రుం డిట్లనియె.

నీవేమో లోకములో లేనియూహలనెల్ల నల్లి నేర్పు మెయి న్నిరాధారముగా నాకాశహర్మ్యమును నిర్మింపఁజూచు చున్నాఁడవు, కాని యది యుక్తిమారుతంబు తాఁకునకుం గదలక నిలువ నేరదు. సంగ్రామంబున సర్వంబును బోఁగొట్టుకొని ప్రాణమాత్రావశిష్టుం డై యోడి పాతినహిరణ్యగర్భం డెక్కడ? సంగ్రామవిజయుగర్వో న్నతి న్మాఱు లేక మలయు చున్న చిత్రవర్ణుని నాతండు భండనంబుం దాఁకి మానప్రాణంబులు గోలుపోక నిలిచి గెలుచు టెక్కడ? ఈమాట లెవ్వరయిన విన్ననవ్వుదురు. బాహుబలంబున నార్జించు కొన్ననేల నాఁచికో లేక నిష్కారణముగాఁ జేవిడుచుట వీరధర్మంబు గాదు. రణవిజితుం డగుహిరణ్యగర్భం డిప్పుడు నాచేతిలోనివాఁడ. అతని నాతనిరాజ్యంబును నాయిచ్చవచ్చినట్లు చేయఁగలవాఁడను. నీ విఁక వేయి చెప్పినను రాజ్యంబు విడువఁగలవాఁడను గాను. ఇంక నీవిషయమున నీవు నాతోడ నేమియుఁ జెప్ప వలదు.” అని, వీర గర్వంబునఁ గొలువు విడిచి లోపలిమందిరంబునకుం జనియెను. అంత

మంత్రి మొదలగువారును దమతము నెలవులకు నరిగిరి. నేనును దేవరకు వార్తావిశేషంబులు విన్నవింపఁ గ్రన్ననఁ జనుదెంచితిని. అని ధవళాంగుండు సర్వంబును నివేదింప, రాజానుమతంబున సర్వజ్ఞుం డాతని కిట్లనియె. "ధవళాంగా! నీవు మార్గాయాసంబునఁ గడు బడలి యున్నవాఁడవు. ఇప్పుడు గృహంబునకుం బోయి యులసట వాపికొని, పిమ్మట నెమ్మదిగా మతియొకసారి దొరవారిని సందర్శించుకొమ్ము. నీకు మేము మిక్కిలి శ్రమ యిచ్చినారము. నీస్వామిభక్తికిని గార్య నిర్వాహకత్వంబునకును స్వామియు నేమును స్వాంతంబున నెంతయు సంతసించినారము. నీ వింకఁ బోయి రమ్ము." అని వీడుకోలిచ్చిన, నాబకంబును మనంబునఁ గరంబు నయంబును భయంబును గదుర తేనికిని మంత్రికిని మ్రొక్కి తనయిక్కకుం జనియెను.

ధవళాంగుండు నిజమందిరంబున కరిగినయనంతరంబున హిరణ్య గర్భుండు మంత్రితోడ నేకత ముండి, కార్యాలోచనం బడిగినఁ బ్రొద్దగ యిట్లనియె. మన మీవఱకే బవరంబున నోటువడి వాసి చెడియున్న వార మగుటంజేసి, యిప్పు డీవిరోధి వరూధినీజాలంబు నెక్కటిం దాఁకి వీఁక చెడక నిలువఁజాలము. బలశాలి యగు విరోధిని సాధింపఁ దలంపు గొన్నవాఁడు. అంతకంటె బలవంతునితోడ జెలికారంబు వాటించి యామేటిమగనిం దనవైరిమీఁదికిం బ్రేరేవపలయునని నీతి విద్యావిదులు పలుకుదురు. గంధగజం బుబ్బలిలోఁ దగులుకొన్నప్పుడు గంధగజంబే లేవనెత్తవలెనుగాని యీపని యొక్కమ్రుక్కడిమృగంబు చేతఁ గానేరదు. సింహళద్వీపాధినాథుం డగు మహాబలాభిధానసారస కులపవిత్రుండు మనకుం బరమమిత్రుండు గలండు. అతనిపాలి కిప్పుడ దూతను బంపి, జంబూద్వీపంబుపయి దండు వెడలి మనకుఁ దోడు నూప వేఁడుకొనవలయును. ఇప్పటి కిదియ నాకుం జూడ నవశ్యకర్త

వ్యంబుగాఁ దోఁచుచున్నది.” అనిన జ్రేఁడునుఁ గడు నలరి మంత్రిం గొనియాడి, తదుక్త ప్రకారంబున వేగంబ నుగుప్తంబుగా నొకలేఖ లిఖియించి, పదిలంబుగా ముద్రవైచి, విచిత్రుండను బకంబును రహస్యంబుగఁ బిలిపించి, యాలేఖ నతనిచేత నిచ్చి సింహళద్వీపంబునకుం బుచ్చెను.

అంత నచ్చటఁ జిత్రవర్ణుండు మఱియొకనాఁడు నిండుకొలువుండి నానావిషయంబులు ముచ్చటించుచుఁ, బ్రసంగవశంబునఁ గర్పూరద్వీపమునుండి మేఘవర్ణునితో నిట్లనియె. “ఓయీ, మేఘవర్ణా! నీవు బహువారములు కర్పూరద్వీపమునుండి వచ్చితివి గదా? హిరణ్యగర్భుఁ డెట్టిగుణములు గలవాఁడో యాతనిమంత్రి చరిత మెట్టిదో నీవు చక్కఁగా గ్రహించి యుందువు. కాఁబట్టి వాని నెల్ల మాకడ వివరింపుమా చూశము.” అనినఁ గాశంబి ట్లనియెఁ: “హిరణ్యగర్భమహారాజు మహోశయుఁడు; సత్యసంధుఁడు; జాగరూకుఁడు మంత్రి సర్వజ్ఞుండును సర్వవిధంబుల సమర్థుఁడు; ప్రెగ్గడతనంబున నాతనిఁగోడ నీడగు ప్రయోజకుని నొండొకఁ గానము.” అనినఁ జిత్రవర్ణుండు తల యూఁచి మందహాసపూర్వకంబుగా నిట్లనియెఁ. “అంతటి మహోశయుం డగుటచేత నాహిరణ్యగర్భుండు నీచేత నంతసులభముగా వంచితుఁ డయ్యెను? ఏ దేదీ! ఇఁక నొంత చెపుమా!” అనిన వాయసముఖ్యుం డిట్లనియె. “విశ్వాసముకతంబున నేమఱి యున్నవానిని వంచించుట యొక ఘన కార్యము కాదు. నమ్మకముచేతఁ దొడవినాఁడఁ దల నిడుకొని సుఖముగా నిదురించుచున్నవానిని గొంతు కోయుట యొకపౌరుషమగునా? నల్లని వెల్ల నీళ్ళును దెల్లని వెల్లఁ బాలును ననుకొను నమాయికులు తమవలెనే లోకములో నెల్లవారును నత్యవాదులును

సన్మార్గవర్తులును నిష్కపటులును ననుకొందురు. లోపల నుండు మాయలును మర్మములును నెఱుంగ రాకుండ నేనువు మెయి దుర్జనులు చెప్పు తేనెమాటలకు మోస పోయి ప్రథమమున వారిబలుదగులుకొందురు. ఒకటి రెండుమాఱు లనుభవమునమీఁదటఁ దరువాతివిషయములలో మిక్కిలి జాగ్రత్త గలిగి యుందురు. ఎవ్వరైనఁ గ్రొత్తగా వచ్చినవానిగుణంబు లిట్టి వని వానిమాటలనుబట్టి నిశ్చయించుకోవలెను గాని మనసులో నే మున్నదో లోపలఁ జొచ్చి చూడ లేరు గదా? పూర్వ మొకయుర్వీసురుఁడు కొందఱు ధూర్తుల చేత మోస పుచ్చఁబడ లేదా? దేవర కాకథ, వినిపించెదను వినుండు.

బ్రాహ్మణుఁడు పరమచ్ఛాందసుఁ డొకఁడు తన యధ్వరార్థంబు నల్లమేఁక నొకదానిం గొని మెడకుఁ బగ్గ మగ్గలముగా బిగించి మించువేడుకతోడ నింటి కీడ్చుకొని పోవు చుండెను. త్రోవలో నొక చెఱువుగట్టుమీఁదఁ గూర్చుండి చూచి దుర్మాయంబునఁ గొందఱు దుర్మార్గు లాయజంబును గాఁజేయువలెనని తలంచి తమలోఁ దా మిట్లు చింతించిరి. ఈధరాపురుం డడదె బలిసినమేకపోతుం గొనిపోవు చున్నవాఁడు. ఒక్కనిమ్మ మిచ్చి కొంద మన్నను మన కిట్టి క్రొవ్వినది సాధారణముగా దొరకదు. ఈవైదికశిఖామణి నేలాగునన్నైన వంచించి యాచ్ఛాగంబు నిప్పు డపహరించితిమేని వారమునిదినముల వఱకుఁ బుష్కలముగా మన మనన్యాపేక్షంబుగ మాంసభక్షణంబు సేయవచ్చును. అనునెడ నొకధూర్తుఁడు నడుమ నడ్డము వచ్చి యిట్లనియె. "ఈబ్రాహ్మణుఁడు పిశాచమువలెఁ బట్టుకొని యేమఱిక యీమేఁకం గొంతున కురి పోసి ధరాపరాగంబు రేఁగ లాగుకొని పోవుచుండఁగ, బట్టపగలు నట్టనడువీధిలో మన మిట్లు దీని నెత్తుకొని

పోయి ప్రజలకన్నులు గప్పఁ గలము? రాజభటులును భయంకరు లయి యమకింకరులవలె దండహస్తులై యూర నెల్లెడఁ దిరుగులాడు చున్నారు. మనల నొకవేళ దొంగల మని పట్టుకొనిపోయి, చండ శాసనుఁ డగురాజునెదుటం బెట్టినఁ గ్రూరశిక్షలకుం గుఱి కావలసి వచ్చును. దైవ మిచ్చినమాత్రము సుఖముగఁ గుడిచి కూర్చుండ లేక తల క్రొవ్వి యకార్యకరణంబునకుం జొచ్చితిమేని, మన కందఱకు నేకకాలంబునఁ గాలంబు చేరు వగును. ఈవ్యర్థప్రయత్నముచే మన కవమానం బగుట దక్క నభిమతకార్యసిద్ధి యొదవ నేరదు. నాబుద్ధి విని యింక నీప్రయత్నంబు మానుడు." అనినం బకవక నవ్వి శౌల్యమునుండియు మోసపుఁబనుల నాతితేటిన యొకవృద్ధవంచకుం డిట్లనియె.— నీకు లోకానుభవంబు చాలమించేసి బేలతనంబున బాల వాక్యంబులు పలుకు చున్నాఁడవు. నిజముగా నావంటి ప్రౌఢుఁడు దలఁచుకొన్న నీయల్పకార్యంబు సాధించుట యెంత పని? ఫాలాక్షు నైనను మోసపుచ్చి యభిమతంబు తుదముట్టించును. చూడు మే నిదె నీవు చూచుచుండ నాశక్తిచేత నీమేకపోతును గుక్కను జేసి తీసుకొని వచ్చి మీకందఱికుఁ గాంక్షలు దీఱ దీనిమాంసమున విందు చేసి మీచేత నివ్వుడె మెప్పించు కొందును. తొల్లింటికాలంబున నొకమర్క టంబు మకరంబును మోసపుచ్చి కాదే తనప్రాణంబులఁ గాపాడు కొనెను. మీకక్కథ వకాఁణించెదఁ జక్కఁగా వినుండి.

పశ్చిమసముద్రతీరంబున నుండునడవియందు బలవర్ధనుఁ డను ప్లవంగవుంగవుం డొకండు వసియించుచుండును. అతండు వార్ధక్యం బున హీనసత్త్వం డగుట చూచి జ్ఞాతులు సర్వముం దోఁచుకొని యాతని నిల్లు వెడలనడఁచిరి. బలవర్ధనుండును నడవులపాలయి పోయి పోయి, దపతీనదంబుతీరంబున ఫలభరితంబై యున్నయొక్క మేడిచెట్టు

నాశ్రయించి, తత్ఫలాహారంబున శరీరధారణంబు గావించుకొను చుండెను. ఇట్లు ఫలమాత్రమునఁ బ్రాణభరణము జేసికొనుచు నా యుదుంబరవృక్షముమీఁదఁ జిరకాలము నిర్విచారముగా నుండి, యొక్కనాఁడు పండ్లం దినుచుండ వలకేలం బట్టుకొన్నపండు ప్రమాద వశంబునం జాతి నీరంబులం బడ బుడబుడశబ్దం బొక్కటి పుట్టెను. వానరమున కా నినదము శ్రవణానందముగా నున్నఁ దనమర్కట చేష్టలు బయల్పడ బలవర్ధనుం డవారిగ వారిలోపల ఫలములఁ బడ వేయఁ జొచ్చెను. దైవవశంబున నావేళ ఛాయకయి వచ్చి చెట్టు క్రింద నీడం బండుకొని యున్న క్రకచం బను మకరం బొకపండు గొని చప్పరించి జహ్వా కింపుగా భక్షించి రుచి మరగి మఱియు నోరూర వానరము రాల్చుఫలములనెల్ల మెల్ల మెల్లఁగా నాలుక త్రుప్పుడుల్ల నారగింపసాగెను. ఇట్లు ఫలాపేక్షుంజేసి యా మొసలి మునలి కోఁతితో మైత్రి చేసికొని, యిల్లును వాకిలియు మఱచి యాలుబిడ్డలం దలపెట్టక నెలలకొలంది నిచ్చటనే కాలక్షేపము చేయుచుండెను. అంత గృహం బున నాతనిగృహిణి దుస్సహం బగుపతివిరహంబునకుం దాళఁ జాలక పెనిమిటిం దలఁచుకొని యహోరాత్రములు నేత్రముల నీరు సంతత ధారగాఁ గాఱ నేడ్చుచు, నొక్కదూతం బిలిచి ప్రాణనాయకుని విలంబనకారణం బారసి యాతని సుఖవార్తను జెవుల వేసి మేనం బ్రాణంబుల నిలువు మని బహువిధంబులఁ బ్రార్థించెను. ఆదూతికయు నతిరయంబునం గదలి వెదకుచు వచ్చి యామేడిచెట్టునీడను గోఁతి తోడఁ గూడ నుండి వేడుకమాట లాడుచున్న క్రకచునిఁజూచి పోయి దీనాననంబుతో నామానిని యడుగులఁ బడి, "మగువా! నీమగఁ డొకకోఁతిముగుదం దగులుకొని మగుడ నెలవునకు రాఁజాలకున్నాఁ" డని, యున్నవి కొన్నియు లేనివి కొన్నియుఁ గల్పించిగ్రుడ్లనీరుగ్రుక్కు-

కొనుచు వినిపించెను. పతి యొండొకసతిం దవిలి యున్నాఁ డన్న పలుకులు ములుకులవలెఁ జెవిని బడినమాత్రమున నుల్లము నల్లన నొల్లఁబోయి యల్లనఁ దెలి నొంది యా మొసలి చెలువ చెలువుని నడతిం దడవి మన మెరియ వెచ్చ నూర్చు చుండెను. ఇచటఁ గ్రకచుండును దూతిక యేతెంచి దవ్వుల న్మగిడి పోవుట దూరము నుండి పొడగని గుండెలు తటతటం గొట్టుకొన, అది సదనంబునకుం జని తనమీఁదఁ గామినితో నేమి నేరములు చెప్పునో యని యచట నిమిషమయినఁ గాలు నిలువక, వడివడి న్సంగతికాని వీడుకొని, యింటి కేగు నప్పుడు శూన్య హస్తములతోఁ బోఁగూడ దని చేడి యకు నూడిదగా నిడఁ గొన్ని మధురతరపరిపక్వ ఫలంబులం గొని వాటావాటిఁ జనియెను. ఈలో నామకరాంగన తన చెలుల వలనం బతిరాక మున్న్మంద యెఱింగి, చెలికత్తెయలు సూరెలం జేరి విలపించు చుండ, మూసినకన్నులు తెఱవక పడి యుండి మూలుగు చుండెను. క్రకచుండును దార దారసించి కాంచి హృదయంబు పగిలి నోరుగడ్డ దికం దగులు వడఁ బడఁతిం బిలిచి యలబ్ధ ప్రతివచనుండయి, తత్తరం బున నిదియే మని చెలికత్తియల నడిగిన నత్తరుణు లిట్లనిరి. "నీవు వెనుక మఱచి, పోయినపోకగాఁ బోయి యింటియొద్దఁ బెండ్లి మేమయి నను సరేయనుకొని నెలదినములనుండి బొత్తిగా నిల్లు క్రొక్కి చూడ కుంటివి. నీవరిగినమఱుసటిదినము మొదలుకొని నీభార్యకుఁ దీఱనివ్యాధి పట్టుకొని దినదినక్రమమున రోగము ప్రబలి నేటియుదయము నుండి మాట వడిపోయినది. తెవులు కనఁబడినది మొదలుకొని రాత్రియనక పగ లనక తిరిగి, కన్నకన్నవారి కాళ్లెల్లం బట్టుకొని సొమ్మునకు వెనుక ముందులు చూడక మేము మాచేత నయినపని లోకములో లేనిసిద్ధా షధముల నెల్ల నొకటి కాదని యొకటిఁ బోయించితిమి. ఆఁడువార

మింతకంటె నేమిచేయఁ గలము? వేసినపుంగులెల్ల నేమూలఁ బడు
చున్నవో కాని లేశ మయినను గుణ మగపడలేదు. మందులు పోసి
పోసి విసిగి వైద్యులు కడచికిత్స యొకటి చెప్పిరి. కోతిగుండెకాయ
నేయత్నముచేతనైన సంపాదించి దానిం బాలతోనాలుగుదినములు
సాయంసమయమున సేవించుచు వచ్చిన రోగము నిశ్శేష మయి
యీముదిత (బతుకఁ గలదనియు, లేకున్న జీవితాశ వదలుకోవలసిన
దనియుఁ దెలియఁ జెప్పిరి. చెడగాఁ జెడఁగాఁ గాఁవురములు గావు.
మేము చెప్పవలసినది చెప్పితిమి. ఇంక నేపాట్లుపడి వానరహృదయము
తెచ్చి భార్యం (బతికించుకొనెదవో మీఁద నీయిష్టము." అనినం
గొంతతడవు నిశ్చేష్టితుఁ డయి విశాకు గదిరి యుండి, యేమియుం
బాలు వోక యాకసమువంకఁ దిలకించి పరిపరివిధంబులఁ జింతించి
తల పంకించి, యెట్లును బోకతీఱు దని నిశ్చయించి, వారికడ నోరు
మెదల్పలేక కదలి చనుచు మార్గంబున నిట్లుచింతించెను. ఇంట భార్య
చూడఁ బోయిన వచ్చెను (ప్రాణముతోను బోయెను (ప్రాణముతోను
నున్నది. వైద్యులో యసాధ్య మయిన యౌషధముంజెప్పిరి. సాధ్య
మయ్యేఁబో నెయ్యానిం బోలియించునంతటిపని పుట్టును. బలవర్ధ
నుండు దక్క నాకు మఱియొక్కకోఁతి యెక్కడ జిక్కును? వానర
హృదయ మెత్తెఱంగునఁ దెత్తును? లేక యీయవస్థలో నున్న నన్ను
తాంగి నెట్లు మందు వేయక బలవంతముగాఁ జంపుకో నేర్తును?
భార్య నిమిత్తము మిత్రద్రోహము చేయుట తగ వగునా? కాదని
యెప్పరికించిన నిష్కారణముగాఁ బండువంటి కాఁవురము కూలి పోవు
చున్నది. మిత్రవధంబు దురితంబులలో నెల్ల దురితంబు; జాయ తన
కాయంబులో నర్ధం బగుటంజేసి యాలిం గోలుపోవుట యాత్మవధంబు
కంచెను బాతకంబు. లోకములోఁ దన్ను మాలినధర్మము లేదు

గదా! నూక్ష్మదృష్టి న్వీచారింప మిత్రునిప్రాణంబులు గొని యైనఁ
బ్రాణేశ్వరీప్రాణత్రాణంబుగావించి యిల్లు నిలువఁ బెట్టుకొనుటయే
యుచితము." అని కృతనిశ్చయుం డయి పదియడుగులు నడచి యుం
తటిపావంబున కొడిగట్ట నొకపట్టున మన సొప్పక డోలాందోళనంబు
వొందఁ గ్రమ్మఱఁ గొంతవడి విచారించుచు నిలువంబడి, కడకుఁ
బావనిశ్చయుండై, బలవర్ధనవధోద్యోగంబున నేగుదెంచిన చెలికానిం
గని యావనచరవల్లభుం డిట్లనియె. "మిత్రమా! చిత్ర మయ్యెడును.
కళత్రముం జూడ వేడుక పడి గడియ క్రిందటనె చని యింతలోనే
యేల తిరిగి వచ్చినాఁడవు? నీరాకకుం గలకారణము తెలుపుము."
అనిన నానక్రంబు వక్రంబుగా నవ్వి యిట్లనియె. "నీచేత ననుజ్ఞా
తుండ నయి మందిరంబునకుంజని నాసుందరిం గని యమందానందం
బున నీవిచ్చిన స్వాదుఫలంబుల నొసంగిన నంతరంగంబునఁ బొంగి
యాయంగన కొన్ని మెనంగి, వానిరుచి కచ్చెరు పడి "యీపండ్లెక్క
డివి? వీని నీకిచ్చిన పుణ్యాత్ముఁ డెవ్వఁడు? నీవిన్నాళ్ళ కాఁక నెక్కడ
మసలితివి? చెప్పు" మనిన, నేనిట్లు చెప్పితిని: 'తపతీనదియొడ్డున నుండు
మేడిచెట్టుమీఁద బలవర్ధనుం డను తరుచరనత్తుం డొకఁడు కలఁడు.
ఆతఁ డనింద్యచరితుండు; స్నేహపాత్రుఁడు; నాకుం బరమమిత్రుఁడు.
ఆదయాళుని యాదరణంబున సమస్తము మఱచి యాతనికడ నపూర్వ
సుఖం బనుభవించుచు నిందాఁక వదలి రాలేకుంటిని. ఆమహామహుండు
నన్ను సాంత్వనవచనంబుల వీడుకొలుపి యమృతోపమానంబు లగు
నీఫలంబుల నిచ్చి నీయొద్దకుం బుచ్చెను." అని నీయుపకారకృత్యంబులు
స్తుతిపాఠకుగతిం బొగడి నీసుగుణసంపదను సహస్రముఖంబులం గొని
యాడితిని. నీచెలియ లావలుకులు విని నన్నుఁ గినిసి 'ఓయి! కృతఘ్నుఁ
డా! సుహృత్తముఁ డైన యావనచరోత్తముని నీతోడఁగూడ మన

భవనమునకుం గొని వచ్చి మనపాలిటి వేలుపుం బోలెఁ బూజించి జన్మసాఫల్యంబు గాంచక యాచెట్టుమీఁద నొంటిం దిగ విడిచి వచ్చితివే? ఇప్పుడ పోయి యాకపికుల గ్రామణికి నాగ్రమొక్కని గ్రమొక్కయిక్కడకుం దోడితెచ్చి మఱి నాతోడ మాటాడుము." అని పదరి నన్నిచటికిఁ బంపిన నిన్ను వెంటఁ బెట్టుకొని పోవచ్చితిని. నాప్రార్థనం బంగీకరించి వేగమ మదీయాగారంబునకు విచ్చేయుమా. పోదము!" అని యాకపటాత్ముండు మిథ్యావినయంబునఁ బలికిన నావానర వరుండు నెయ్యునిమాట కడ్డ మాడలేక యియ్యకొని యిట్లనియెఁ: "గ్రక్కచా! నాకు నీయిల్లు లాఁతియిల్లు కాదు; నీయాగారంబున కరు దెంచి నీవలని సత్కారంబులం బడయుటకు నాకేమియు నడ్డంకి లేదు. కాని, యొక్క ప్రతిబంధము మాత్రము కనఁబడుచున్నది. నేను వనచరుండనయ్యును నీవనంబులనె చరియింపఁ గలను గాని మీ రుండు వనంబులఁ జరింపఁ జాలను. మీగృహంబున కెట్లు రాఁ గలుగుదునో చెప్పుము." అనిన మకరంబు కరంబును మిఁటివంకఁ జూచి యాలోచించి యిట్లనియె. "నే నంత విచారింపక నిన్నుఁ బిలుచుకొని పోఁదలచినాఁడను గాను. నాయిల్లు నీకు రా రాని చోటు గాదు. మేముండినది యీయేటిలంకలోని యొకసుందర మందిరము. దానిచుట్టుపట్టుల ఫలవృక్షము లనేకంబులు గలవు: ఆదీవిమానోజ్జకం బేమని చెప్పుదును? అది భూతలస్వర్గంబు నాఁ జూడ్కికి వేడ్క గొలుపుచుండును. తేవును మాపును మామంది రంబున సపర్య గొనుచు సిచ్చ వచ్చినప్పు డెల్ల నందు విహారంబు సలుపుచుండవచ్చును. మార్గంబున నీకొక్క యుపాయంబు గలుగ కుండ నిన్ను నావీఁపుమీఁద నెక్కించుకొని యుపాయముగాఁ గొని పోయి మాయావాసంబుం జేర్చి నీచెలియు లత్యంతతాత్పర్యంబున

నావహించినశాకపాకంబులతోడి భక్ష్యంబుల నుపాయనంబు చేసెద. నీసోదరి మనరాక కెదురు చూచుచుండును. రమ్మా పోయివత్తము.” అనిన మాఱుమాటాడక యాకీశలోకేసుండు వృక్షావతీర్ణుం డయి క్రకచునివీఁపునందూఁకెను. దూఁకుటయె తడవుగా మకరంబు సుకరంబుగా వానరంబును వెన్నున నిడుకొని చనుచుఁ దెన్నునఁ దనలోఁ దానిట్లు పలుకఁ జొచ్చెను. “అయ్యయో! ఎంతదారుణకర్మంబు గావింపఁ జూచుచున్నాఁడను! ఒక్క యాఁడుదాని నిమిత్తము మిత్రముం దోరించి ఘోరపాతకంబు కట్టుకోవలసి వచ్చెఁగా! ఇఁక నేదుర్గతికిఁ బోదునో యెఱుంగను. ననువంటిదుష్టాత్మ్మలెండైన నుందురే! దైవమా! నే నేమినిందలపాలు గావలయునో” అని యీరెలుంగున ననుకొనుచు ఖిన్నహృదయుండై చనుచుండఁ గపివరుం డించుక గ్రహించి, “మిత్రుఁడా! ఇప్పుడు నీమోముజాడఁ జూడ నొండొకవిధంబుగా దోఁచుచున్నది. నీయందు ముందున్న యుత్సాహంబు గాన రాదు. చిత్తంబు విచారాయత్తం బయి తత్తఱించు చున్నట్టు కనుపట్టు చున్నది. దేహము లాధివ్యాధిజరాన్వితములు; గృహమున నాసహోదరి నేమమున నున్నది గదా?” యనెను. క్రకచుండు వలుకులఁ దడఁబాటు పడుచు ‘నీచెల్లెలు కొంచెము వ్యాధిబాధిత యయి యున్న’ దనెను. అంతటి యల్పరోగమునకా నీమొగ మింత చిన్నపోయినది? చీటికిమాటికిఁ దాలిమి దిగనాడుట మగపాడి గాదు గదా యని బలవర్ధనుండు పలికెను. ‘ప్రబల వ్యాధిపీడిత యయియే యున్న’ దని క్రకచుండు సందేహించుచుఁ బలికెను. అంత నశ్రుమిశ్రితాక్షుం డయి వానరాధ్యక్షుండు; ‘వైద్యులం బిలిపించి వేగిరము దివ్యౌషధ ప్రయోగము చేయించినావు కావా?’ యని యడిగెను. ‘ఏమి

మాయయో యెఱుఁగను; వైద్యు లెంతమంది యెన్నిమందులను వేసిరను గుణ మియ్యు లేదు — నిన్నట్లు వీడ్కొని పోయి చూచు నప్పటికి నిచెలియలు యిమయాతిన పడుచున్నది; నాకుం జూడ నీ రోగము కుదిరి జీవించుటయె కష్టముగాఁ దోఁచుచున్నది' అని క్రకచుఁడు బదులు చెప్పెను. విని వనచరుఁడు 'ఇది యేమి! మిత్రుఁడా! ఇంత వెట్టిపని చేసితివి! ఇంట భార్య యిట్టియవస్థయుం దుండఁగా మందును మాకును విచారింపక యెంటి నిడిచి మిత్రుని యొద్దకు రాఁ జిత్త మెట్లొప్పెను! విందునకుంబిలువ నోరెట్లాడెను!' అని మందలించెను. 'ఘనవైద్యులు కొందఱు కోఁతిగుండెకాయతో మం దీయవలెనని చెప్పుచున్నారు. అందునిమిత్తమయి వచ్చితి' నని యాక్రకచుండు శోకవ్యాకులితహృదయుం డగుకతంబున మతి పోయి తనగుట్టుబయలఁ బెట్టెను. ఆమాట విన్నతోడనె ప్రాణములు గలఁగఁ బాతి మేను చెమర్పఁ గొంతవడి యామర్కటంబు దిగ్భ్రాంతినొంది యుండి యింతిలో డెందంబుకుందు డిందు వఱిచికొని "అయ్యో! ఖర్వాటుఁడు సూర్యాతపమునకు సహింపలేక తాళవృక్షచ్ఛాయకుం బోవఁ దాఁటిపండు పడి తిల పగిలినట్టు ద్రైవోపఘాతం డగువాఁ డెందుఁ బోయినను నాపదలు వెంట వచ్చును గదా! అడవిని విడిచి మృగసంచారము సహితము లేని సముద్రతీరముం జేరియు, మృత్యు ముఖప్రవిష్టుండ నైతిఁ గదా' యని వగచుచుఁ దెచ్చిగోల్బిరంబున నిట్లనియెఁ: "క్రకచా! యెంతపిచ్చిపని చేసితివి! వానరహృదయంబు గొఱకు వచ్చినవాఁడ వాఁబాట నించుక మిత్రునిచెవిని వేయువలదా? ముందె చెప్పిన ముదిమి గదిరి యుంట నోర్మియులేక మేడిచెట్టునఁ దవిలించి యుంచిన నాగుండెకాయ నప్పుడ కూడఁ గొని పత్తును గదా? నిమినోగతంబు నెయ్యునికిడ స్మఱింపఁజాలని పని చెఱిచితివి.

ఇట్టి నీవు నీకళత్రమునకు శత్రుండవుగాక మిత్రుండ వే? మన కింత వఱకు నడిచిన దంతయు వృథా త్రిప్పట యయ్యెను. అయిన నేమి? శీఘ్రంబ మరలి మేడిపొంత కరుదెమ్మ్ము. గుండెకాయుంగొనివ త్తము." అను మాయమాటలు నమ్మి మకర మాపానరమ్ము్మను గ్రమ్మఱి మేడికడకుం గొని తెచ్చి విడిచెను. ఇంక బ్రాణములు దక్కిన వని యామర్కట మొక్కవడి భూరుహంబు నెక్కి వెక్కిరించుచు, హృద యమును లేదు గిదయమును లేదు పో పొ మ్మ్మని క్రకచుని గడ్డించెను. అది చూచి మొసలి మోసముం దెలిసికొని యేవలనను మోస మెట్టిదో యెఱుంగని నన్నును నీమునలికోతి యిట్టె మోసపుచ్చెంగా యని వగచుచుండఁ బ్లవంగ మిట్లనియె. "నీవు ప్రసాదపురస్సరము గా నెన్నెన్ని యో యుపచారవాక్యంబులు పలికి నిటల తటఘటి తాంజలివై నీయింటికి రమ్మని దేవురించుటంజేసి, పాపపు మోమో టమి నోరునొక్క రా నన లేక మోస పోయితిని గాక నన్నుఁబ్రతా రింప నీతర మగునే? ఓరి మూఢాత్మా? మాటదాఁటకవచ్చి చేపడిన వాడే తప్పించుకొనిపోయెనుగదా యని సంతాపంబునొందక యీపాటి నీదారిం బొమ్ము్మ. ఒకకూర్మముచేత నక్క యంతటిది మోసపోయి నది. ఇక నీవనంగా నెంతవాఁడవు? వినవలతువే నాకథఁ జెప్పెద వినుము."

కర్ణాటక దేశమునందుఁ గావేరియను నదియొక్కటి ప్రవ హించు చుండును. సాగరసంగమునకు సమీపంబునఁ దత్తీరంబున నొక్క పటమహీరుహము గలదు. ఒకనాఁటిమధ్యాహ్న సమయంబున నొక కమఠంబు జలంబులు వెడలి వచ్చి యచ్చోట్టునీడను సుఖముగా నిద్రించు చుండెను. అప్పుడు తత్ప్రాంతకాంతారంబున నుండు ఘేరవం బొక్కటి యాయేట నీరువట్టు మాన్పుకొనం జనుదెంచి తీయనిపానీ

యుంబు లాప్యాయనంబుగఁ బానంబు చేసి యాసమీపపాదపచ్ఛా
యం బవళించి యున్న తాఁబేలుం గాంచి పరమసంతోషంబున మెల్ల
మెల్లఁగాఁ దారుచుం బఱతెంచి యేమఱుపాటున దానివీఁపుమీఁదఁ
దనపాదంబు మోఁది త్రొక్కెను. అంత నాతాఁబేలు మేలుకని కీ
లెఱిఁగి కాలునుం గేలుకుం దటాలున ముడుచుకొని తల పొట్టలో
నిముడుచుకొని కదలకుండెను. క్షుధార్తం బగుమృగధూర్తంబును
బదంబున దాని నదిమి పట్టి యిట్టట్టు పొరలించుచుఁ గోఱలు మొఱ
కలు వాఁఁ గొఱుకుచుఁ గూర్మంబు మర్మంబులు భేదింపఁజాలక
చాలసేపు విడిచిపోవను మనసు రాక క్రిందనుమీఁదనుం బడుచుండెను.
అక్కరణి నది మిక్కిలి చిక్కులు పడుచుండ నకూర్మం బెక్కరణి
నైన నీక్రమక్కడినక్కను డక్కవెట్టి ప్రాణంబులు దక్కించుకొనెదఁ
గాకని తలఁచి యించుక యాలోచించి మాయ యచ్చువడ నిట్లనియె.
"ఓజంబుకోత్తమా! తత్త్వం బెఱుంగంజాలక యేల యీలాగున
వృథాప్రయాసంబు పడితివెదవు? నీవీకైవడి వేయేఁడులు కొఱికినను
నాయెఱుడలు నీకుఁ గొఱుకుడు పడఁగలదే? నీవేవిధంబునను నను
వధించి యాపోవ నామాంసంబు మెసవక యువలఁ బోవని తలపోసి
యీమనుగడ పయి నాసను గోసి యనాయాసమరణంబు నొంద నిశ్చ
యించుకొన్నాఁడను. విషములోనిబ్రదుకు; మాకెప్పుడును మృత్యువు
శిరసుపై నాడు చుండును. కాఁబట్టి యీఁకొన్నమహానుభావునకు నీ
కొక్కచక్కనియుపాయం బుపదేశించెదను. వినుము: నన్నుఁ గ్రన్ననం
గొనిపోయి నీరంబులం జేరిచి కొంతతడ వందు నాననిచ్చిన, నామేను
వెన్నవలె మెత్తనయి నిమిషములో నీచిత్తువచ్చినట్లగును. అప్పుడు
కడుపార నామాంసంబుతో సుఖపారణ చేసి నీవలసినచోటికిఁ బో
వచ్చును. అట్లు చేయుము." అనిన గోమాయువును మాయావాగురం

జిక్కకొని యుక్కపటవచనంబులు వేదవచనంబులని నమ్మి యుదియ
కార్య మ్మనుకొని తాఁబేటిని బేలుపోయి జలంబులం బడవైచియుఁ,
గొంత మెలఁకువ గలిగి పట్టు విడువక గట్టిగాఁ దనముంగాళ్లు దాని
వీఁపున నొక్కిపి పండ్లయూటలు ద్రావుచు దానిమీఁదనె కన్నిడి
ముహూర్తమాత్రంబు నిలిచి మరలఁ గొంతకి చూచి దానిబొగసు
పండ్లకు సాధ్యముగాకున్నఁ గమఠంబున కిట్లనియె: "తడ వాయెను:
నిన్ను జలంబుల నిడి యొడలు మెత్తపడినఁ గడువడిం గుడిచి నడవ
వలెనని కాచుకొని యున్నాఁడను. ఏవేళకును నీమేను నానుజాడ
గానరాకున్నది. ఏమి చెప్పెదవు?" అనినఁ గచ్ఛపం బిట్లనియె:
"మిత్రుఁడా! నీవు నావచనంబులయందు గుటీ యుంచక వెన్నుమీఁద
రెండుపాదములును దిట్టముగాఁ బెట్టియున్న వాఁడవు. నీరంట వలను
వడకుండ వెన్ననకెల్ల సరిపోవ దారుణముగాఁ జరణంబుల నిలిపి
యుండ, నామే నెట్లు నానఁగలదు? నీకోరిక యెట్లీడేఱఁ గలదు?
ఇందు నాదోసంబు వీసంబును లేదు. నోటిశనిచేత నీవే యింతతడవు
నవనమ్మిక పడి చెడితివి. అయిన నిప్పు డేమాయెను? ఇంకనైన
నామాట నమ్మి వెన్నుమీఁదిపాదంబు లెత్తి క్షణమాత్రము చేరువం
గూరుచుండి చూచుచుండుము. ఇప్పుడ పులకండంబులఁ బోలునా వల
ఖండంబులతో విం దారగించి యునాయాసంబుగాఁ బోవచ్చును."
అనిన నా సృగాలంబు కూర్మంబువాఙ్మనచయంబులు నిశ్చయంబులుగా
వగచి తదీయోపదిష్టప్రకారంబున వెన్ను పయి నిడియున్న యుడుగు
దోయిని మెల్లఁగాఁ దీసెను. దీసినతోడనే ప్రాణంబుల దక్కించుకొని
యుక్కమఠంబు శరవేగమునం బఱచి లోతునీళ్ళం బడియెను.

అని చెప్పి యామర్కటము మఱియు నిట్లనియె. "ఓరీ!
ముకరాధమా! మోసములకెల్ల నిధి యగువంచకమే యిటు వంచింపఁ

బడఁగా, నీవంటిపుట్టుగ్రుడ్డు మోసపోవుట యొక యుక్కజమా? చాలుఁ జాలు, నీతోడ మైత్రి చేసినందునకు ఫలము తోడనే కలిగినది. ఇంక నీమైత్రిని నీయొద్దనె యుంచుకొమ్ము. లోకవిఖ్యాతసత్వుండవయ్యు దైవవంచనచేత రాజ్యంబు గోలుపోయి త్రాణ చెడి రిపులతోఁ బడలేక కళత్రప్రముఖజన్యసుఖవిముఖుండనై లేచివచ్చి నిలువ నీడయుఁ ద్రాగ నీరును గానక యేకాకినై యడవులు పట్టి తిరిగి తిరిగి కడ కీవృక్షంబుఁ జేరి స్వచ్ఛందాహారంబున నుదరపూరణంబు గావించుకొనుచుఁ గులగోత్రనామంబులు దాఁచుకొని మొన్నటిదాఁక కాలము గడుపుచుండి, నీపెద్దతనంబు చూచి బుద్ధి భ్రమసి మిత్రవంచకుఁడవని తెలియుంజాలక నీతోడిసఖిత్వం బంగీకరించితిని. నీవును బాపాత్ముఁడా వైన నీభార్య దుర్బోధచేతఁ జెడుబుద్ధి పుట్టి, కుటిలోపాయంబున నన్ను మట్టువెట్టఁ దలఁచి, మాయింట విం దారగింతువు గాని రమ్మని నచ్చికబుచ్చిక లాడిన నేనామర్మ మెఱుంగక నీమంది రమ్మ్నఁ దిరమ్ముగాఁ దల దాఁచుకొన నిశ్చాయకుఁడ నయి నితాంత సంతోషంబున బయలుదేఱి మధ్యేమార్గంబున నాకారవికారాదులచే భవదీయం బగుమనోవ్యవసాయం బూహించి పూర్వపుణ్యవశంబున నీయుపాయంబు తోఁచఁబట్టి బ్రతికి, పులి నాకి విడిచినవానిఁగా భావించుకొను చున్నాఁడను. ఆఁడువారు మంచి యెఱుఁగరు; చెడ్డ యెఱుఁగరు; వట్టికుత్సితములు పన్ని తమపట్టినపట్టు సాధించుకొనఁ జూతురు నీవు నాతోడి చెలిమిఁజేసి యిల్లు వట్టుకున్న నన్నేలాగున నైనఁ జంపింపఁ దలఁచి యిది యంతయు నీభార్య పన్నిన పన్నుగడ యయి యుండును. దేహములు బుడ్బుదప్రతిమంబులు; పరువము ఫేనసదృశంబు; సంపదలు తటిచ్చంచలంబులు; అలంకారంబులు భిత్తిచిత్రంబులు; దారపుత్రాదులా శ్మశానగమనులుగాని యా

పయిని వచ్చువారు కారు; ధర్మ మొక్కటియే తోడ వచ్చి తన్నుఁ గాచునది. అట్లయ్యును నీవు తగవును ధర్మంబును దలపోయక పద్మాపాతి యగు తనువును నమ్మినోని కీర్తిశరీరము నిగ్గడించి నిత్యం బగు నవఖ్యాతి గడియించుకొంటివి. ప్రాణాధికుఁడయిన మిత్రునినే యిట్లు చేసిన పరమసాహసికునకు నీకు నితరులు తృణకణంబులు. మీఁద నీ వేమిగతిఁ బోవువాఁడవో! నీయట్టిమిత్రద్రోహిం జూచు చున్న నఘం బొదవును. ఇఁక నీవు నాముందఱ నిలిచి నన్నుఁ గన లింపక, వేవేగ నీయింటిత్రోవఁ బట్టి పొమ్ము" అని ముక్కును మొగమును జూడక దూరనాడి, నిరుత్తరుంజేసి యా మొసలితోని నక్కడనుండి సాగనంపెను. క్రకచుండును నిన్పృహాయుండై దిక్కును చూచుచు దోయిడిచేతుల న్మగిడి నిజనివాసంబునకుం జనియెను.

కాఁబట్టి మోసముచే నెట్టిపని నైన సాధింపవచ్చును. నాయం దనుగ్రహించి మీరందఱు నాకొక్క సాహాయ్యమును మాత్రము చేయుఁడు. మీరందఱును ముందుగాఁ బోయి బ్రాహ్మణుఁడు చను మార్గమునందు దూరదూరముల నిలిచి, అతఁడు మీసమీపమున నుండి పోవునప్పుడు 'విప్రోత్తమా! కటికుక్క నేల కొనిపోవు చున్నా' వని ప్రశ్న చేయుఁడు. ఇంతమాత్రము మీరు తోడు పడితి రా, మిగిలినకార్యమును నేను జక్కఁ బెట్టెదను. అని యావృద్ధవంచకుఁడు పలికెను. మంచి దని యావనికి నమ్మతించి, తక్కినవా రందఱును బ్రాహ్మణున కగపడకుండఁ జని యాతఁడు వచ్చుదారిలో నందందుఁ గూరుచుండి, యాతనిరాకం బ్రతీక్షించుచుండిరి. ఇంతలో బ్రాహ్మ ణుఁడును మేఁకపోతు నీడ్చుకొని, మొదటివంచకుఁ డున్న తావునుండి పోవుచుండెను. అప్పుడు వాఁడు "అయ్యో! మీరు చూడఁ బోయిన బ్రాహ్మణోత్తములుగా నున్నారు. ఈకటికుక్క నేల మిట్టుకొని తీసి

కొని పోవుచున్నారు!" అని యడిగెను. అందున బ్రాహ్మణుండు నేత్రాంతంబులఁ గెంపు గదుర, చీ చీ! బ్రాహ్మఁ బోతా! దురాగత భాషలు ప్రేలకుము. నే నధ్వరార్థము కొనిపోవుచున్న యీ పవిత్ర మయిన ఛాగము నపవిత్ర మయిన శునకమునుగాఁ బలుక నీకు నోరెట్లు వచ్చినదిఁ పో పొ" మ్మని, యీమాటలను లక్ష్యము చేయక తన త్రోవం బోవుచుండెను. మఱి నాలు గడుగులు సాగినతరువాత రెండధూర్తుఁ డెదురువచ్చి మస్తకన్యస్తహస్తుఁ డయి నమస్కరించి, బ్రాహ్మణునివంకఁ జూచి, "స్వామీ! మీరు సర్వము డెలిసిన వారు గదా! ఈనల్లకుక్క నెగ్గు లేక ముట్టుకొనుచున్నా రే" మని పలికి పోయెను. అందున కావిప్రుండు డొందములో నించుక సందేహించి, వానిమాటకు మాఱు చెప్పక మేఁకం గొనిపోవుచుండెను. ఇంతలో మూఁడవవాఁ డెదురుపడి, "ఇది యేమి; బావఁడా! ఇంత యుక్త మనునకు లోఁబడినావు. నీవెత్తినది బ్రాహ్మణజన్మము గదా! అట్ల య్యున్ను గులశీలముల నేటఁ గలిపి లోకు లెల్ల నవ్వఁ బట్ట పగలు రాజవీధిం బడి యీయపవిత్ర మయిన వేఁపి నెచటి కీడ్చుకొని పోయె దవు? ఈరాజ్య మేమిపాపము చేసెనో కాని కులాచార ధర్మములు నిర్మూలము లయి పోవుచున్నవి." అని పలికెను. అంత నాయనంతా నురుండు మఱి వికలత్వంబు నొంద శంకా మగ్నుండయి, "ఒకరు కారిద్దఱు గారు; కన్నవారెల్లరు దీనిని వేఁపి యనుచున్నారు. నాకొక వేళ మతిభ్రమ జనియించఁ బోలు" నని చింతించుచు, ఉల్లి ముయ్యేల లాగున నూఁగ నిటునటుఁ జనఁ దోఁచక యనుమానించుచు నిలు చుండెను. మొదటినుండియు బ్రాహ్మణు నెడఁ బాయక వెంబడించి వచ్చు చున్న యావృద్ధవంచకుఁడు, తనప్రయత్నము ఫలోన్ముఖము నకు వచ్చెఁగదా యని సంతోషించి, బ్రాహ్మణునకు వినఁబడునట్లు

గాఁ జేసువనున్న తోడు దొంగతో నిట్లనియె. "పాప మీముగ్ధ బ్రాహ్మణుని వెట్టివానిం జేసి యెవ్వరో యట్లు కుక్క నొకదానిం గట్టి పెట్టిరి. చూచితివా యీతనిదురవస్థ?" అని, విప్రుని యకార్య కరణమునకు వ్యసన పడునట్లు పలికి వక పక నవ్వెను. బ్రాహ్మణుఁ డామాటలు విని, యింద జేక వాక్యముగాఁ జెప్పిన దబద్ధము కానేర దని నిశ్చయించి, తన ప్రమాదమునకు లోపల నొచ్చుకొనుచు యజన భాగము నచటనే విడిచి పెట్టి, మరల వెనుకకుం బోయి ధూర్త లందఱుఁ గొలంకు కెలంకునఁ జేరి నవ్వఁ దటాకములో స్నానము చేసి శుచియై తడిబట్టలతో నింటికిఁ బోయి, పాపపరిహారార్థము గాయత్రి జపించు కొనుచుండెను. ధూర్తు లామేఁకపోతుంగొని పోయి, చంపు కొని తినిరి.

అని మేఘవర్ణుండు చెప్పిన విని, చిత్రవర్ణుండు మఱియు నిట్ల నియె. "నిమిషకాలము శత్రువుతోఁ గలసి యుండుట. యెంతో ప్రాణాంతముగ నుండును. అట్టి స్థితిలో, నీవంతకాలము హిరణ్య గర్భునివీట నిర్భయముగా నుండఁ గలుగుట చూడ నత్యద్భుతముగా నున్నది. శత్రుమధ్యమునఁ జిరకాలము నీవెట్లు గుండె గుదిరి యున్న వాఁడవో తెలుపుము." అనిన, మేఘవర్ణుండు సవినయంబుగా నిట్ల నియె. "స్వామీ! కార్యార్థి యయి యున్న వాఁడు స్వప్రయోజనమును ముఖ్యముగాఁ జూచుకోక యెవ్వ రెన్ని బాధలు పెట్టిన, నోర్చుకొని శత్రువును స్కంధమున వహించి మోచి యైన స్వకార్యము నుద్ధరించు కొనును. పూర్వ మొక వృద్ధసర్పము తనకార్యము నిమిత్తము కప్ప లను మూఁపువయిం బెట్టుకొని మోసి, కడపటఁ దనమనోరథ మీ డేర్చుకొన లేదా? దేవర కాకథఁ చెప్పెదను జిత్తగింపుఁడు.

కాంచీపురసమీపంబున నుండుజీర్ణోద్యానంబునఁ దడవుల నుండి మందవిషుఁడను విషధరవల్లభుఁ డొకఁడు వాసము చేయు చుండును. ఆకఁ డొక్కనాఁ డహార్ముఖంబున నాహారాన్వేషణార్థంబు సంచారంబు వెడలి ఒక్కచోట భేకకలకలంబులు మిన్ను ముట్ట గంభీరజలంబుల నలరారుసరోవరంబు పొడగాంచి యందుఁ బ్రవేశించి యామండూకంబుల నెల్ల భక్షించుమార్గము దొరకక, కొండొకవడి చింతించి యొక్కయుపాయం బూహించి తత్తీరంబున నేలపై ఫణంబు వాల్చి వ్యాధిగ్రస్తునివిధంబున మూల్గుచుఁ బడి యుండెను. అది చూచి జలపాదుం డనుమండూకస్వామి చేర వచ్చి యిట్లనియె; "ఓనాగకులావతంసమా! నీవు తలఁచుకొన్న మహాబలునంత వాని నయిన నొక్కగ్రుక్కను వాత వ్రేసికోఁగలవు. అట్టిని వి త్తరిఁ గప్పలు కుప్పతిప్పలుగా బ్రమోల దుముకు లాడుచున్నను భక్షింప నొల్లక, ప్రాణములు కంటికొలుకులలోఁ బెట్టుకొని పస్తు పడియుండుట యెంత యు వింతగా నున్నది. ఇందులకుఁ గతం బెఱిఁగింపు" మనినఁగాలాహి యిట్లనియె: "నాకుఁ బ్రాపించినదుర్దశ మీతోడ నేమనిచెప్పుకొందును? నేనీవఱ కెన్నఁడును బొట్టకొఱకుఁ బరులను దేహి యని యాచించిన వాఁడను గాను. నేఁటికాలమునకు నాకు మీవంటివారి ననుసరించి పొట్ట పోసికోవలసినదినములు వచ్చినవి. వే యేల? ఇక ముందు మీ రనుగ్రహించి భోజన మిడిన భుజింప వలసినవాఁడను, లే కున్నఁ బస్తుండ వలసినవాఁడను, నయినాఁడను. నిన్నటిదిన మర్ధరాత్రంబున నే నాహారేచ్ఛం ద్రిమ్మరు చుండ, నొకభూసురకుమారుఁ డాత్రో పను జనుచు దురదృష్టవశమున నాతలమీఁద నడుగు వైచెను. ఆయవ మానమును సహింపలేక నేనును బుస్సుమని విషాగ్ని లుమియుచుఁ దత్తణంబ యావిప్రునందనుని కొలొడిసి కఱచితిని. అకాటు తిని విప్రార్భ

కుఁడు భయాతిరేకంబున గృహాంబులోనికి బొతిం తండ్రికంతయుం
దెలిపి వులుకువులుకున నేడ్చుచు విష మెక్కి మూర్ఛిల్లి నోర నురుఁ
గులు గ్రక్కుచు నేలఁ బడి తెప్పలు దేలవై చెను. బ్రాహ్మణుఁడును
గొడుకుం దొడలమీఁదనిడుకొని యస్తోక శోకమగ్నుఁడయి పరిపరివిధ
ముల విలపింపఁ జొచ్చెను. అప్పు డాతని బాంధవులు పలు దెఱంగుల
దుఃఖశోషణంబు లగుభాషణంబుల నాతనికి ధైర్యము చెప్పి మరలింప,
ఆయర్ధరాత్రపువేళఁ జిమ్మచీఁకటిలో నురిమీఁద వెన్నకు నీడ్చి
పాదములతోఁ బోయి విషవైద్యునిఁ బిలుచుకొనివచ్చి యాచిన్న
వానిని వీఁడు మీవాఁడు గాని మావాఁడు కాఁడని వారిపాదముల
మీఁదఁ బడవై చి, తదనుగ్రహంబున విషముక్తుఁడయి లేచి కూర్చున్న
కొడుకును జూచి యంతరంగంబు హర్షోత్తరంగంబయిన 'వీఁడు మీరు
పెట్టిన చెట్టని జీవనము లిచ్చినయాఘునుని వేనోళ్ళఁబొగడి వీడుకొలిపి,
నామీఁదియాగ్రహం బుడుగక యాబ్రాహ్మణుఁడు న న్నుద్వేషించి
యిట్లనియెఁ: "ఓపన్నగమా! వున్నమచందమామను బోలునీ యుర్భకుని
మోము చూచి, దయ పుట్టక నిర్హేతుకముగాఁ గాటు వేయ నీకు
నో రెట్లాడెను? సదా రంధ్రాన్వేషణమే పనిగాఁ గుటిలగతిన్వర్తించు
పాపజాతికి నీ కెట్లు దయ పుట్టును? నిష్కారణము గా విప్రబాలకుం
గతిచినయీదురితంబు నీదేహ మెల్లం జుట్టుకొని, నీయహంకారపంక
మింకున ట్లింతవరకును నీ కాహారముగా నున్నభేకముల నీతలను
మోపించి దయామతి నవి యొసఁగిన యాహారము నే నీచేతం గుడి
పించుఁ గావుత' మని రోషావేశంబున ఘోరశాపంబిచ్చెను. పాముల
బాములనే మందును? ఆశాపాశీరంబు లశనిపాంతంబువోలె నాకర్ణం
బులఁ జూడి హృదయ ఛేదనంబు గావింప, నాయొడలు నావశము
గాక కాళ్ళు లేనివానివలెఁ గదల లేక మెల్లమెల్లఁగాఁ బ్రాఁకుచు

మీకృప నాశ్రయింప వచ్చితిని. ధైవోపహతుండ నయి మీపాలఁ బడిననన్నుఁ జేయి విడువక, మీవాహనముఁగాఁ జేకొని యాహార దానంబు చేయుచు రక్షింపు చుండిన, ఎప్పుడును మీపాదములకొలువు సేయు చుందును." అనుడు జలపాదుం డుప్పొంగి యాగోహణకాతూ హలంబు తన్నవివేకిం జేయ దుష్టోరగంబుమాయావాగురం దగులు కొని దానియునుకువ తీకొనియెను. అంత నమ్మందవిషుండును జల పాదుని నిజభోగమున న్వహించి, కొండొకవడి చిత్రప్రచారంబున నిందు నందుం ద్రిప్పి లేనిబడలిక తెచ్చుకొని రోఁజుచుఁ దల వ్రేల వైచి యూరకుండెను. జలపాదుం డంతయుఁ జూచి, నీవేల యిట్లు నడవఁజాల కున్నావని యడిగెను. మందవిషుండు: "స్వామీ! నిన్నటి నుండి కబళమాత్రం బయిన నాహారంబు లభింపమిం జేసి, శుష్కోప వాసంబున న్మాఁడుచు జవసత్వంబు లుడిగి జీవచ్ఛవంబనై యున్న వాఁడను. కటికియాఁకట నకనకం బడునా కిప్పు డాహారంబు దయ చేసినంగాక, వాహనకృత్యం బెట్లు నిర్వహింపఁ గలుగుదును? కడుపు నిండినమీఁదట మఱి నాచిత్రపదక్రమంబు దేవర చిత్తగింప వలయు." అనిన, నావాక్యంబులు నిజమ్ములని నమ్మి, యంతరంగంబు గరఁగిన వాఁడయి జలపాదుం డిట్లనియెఁ: "ఓభుజంగపుంగవా! నే నొక్క మాట చెప్పెదను వినుము. మధ్యమధ్య నీవు నన్నడుగవలసిన పనిలేదు. కడుపుఁజిచ్చు దరికొనునవ్వాడెల్ల వలసినన్ని మండూకంబుల భక్షింప నొక్కసారిగా నీకిదె యాజ్ఞయొసఁగినాఁడను. ప్రతిదినంబును నీయిచ్చ వచ్చిననన్నిటిఁ గొన వచ్చును. ఇప్పుడు పోయి యథేప్సితంబుగ నాహా రంబు గైకొనివచ్చి, మరల వాహనకార్యంబునం బ్రవర్తిల్లుము." అనిన మహాప్రసాదం బని జలమధ్యంబునం బ్రవేశించి, కఱవు దీఱఁ జిఱుకప్పలఁ గొన్నిటిఁ గిచుకు రన మ్రింగి జఠరానలం బార్చుకొని

మండూకరాజు నెదుర నిల్చెను. ఈప్రకారము యథేచ్ఛను బ్రతిదిన
మును వలసిననిన్నటిని దిగ మ్రింగుచుఁ, దొల్తుత సన్నగాంద్రను బిదప
బలవంతులను దదనంతరము మంత్రులనుగా దిన క్రమమున జలపా
దావ శేషంబుగా హ్రదంబు నిర్మండూకంబు గావించి, కట్టకడపట
నాకప్పల జేనిని సహితము కూయిడం బట్టుకొని మేనిమాంసం
బాప్యాయనంబుగ మెక్కి, యిప్పటికి నావ్రతసమాప్తి యయ్యెఁగా
యని సంతోషించుచు, ఆకొలను వెడలి యొండొకచోటికిం
జనియెను.

నేనును మందవిషునిచందంబుననే యవమానంబున కోర్చు
కొని, ప్రతివక్ష కార్యవిఘాతం బొనరించి స్వకార్య ముద్ధరించితిని.
బగ్గున మండుదవానలంబు వృక్షాగ్రంబులఁ గాల్చి విడుచుం గాని,
వానిని నిర్మూలము గావింపఁ జాలదు; శైత్యశీల మయ్యును నదీ
జలంబు తటస్థితవనుమతీజంబుల మూలంబులతోడఁ బెల్లగించును.
కాఁబట్టి మంచిమాటలతో సాధింప వచ్చువనిని బరాక్రమశతంబుచే
నైన సాధింపరాదు. అయినను హిరణ్యగర్భుఁడు సంధికిం దగినవాఁ
డనియె నామతము. అని చెప్పి మేఘనర్ణుండు మిన్నకుండెను.

అంత మంత్రి దూరదర్శి చిత్రవర్ణునివంకఁ దిరిగి యిట్లనియె.
"దేవా! సర్వవిధంబుల నిప్పుడు హిరణ్యగర్భునితో సంధి చేసికొని
యాతని రాజ్యంబున నాతనినె యథాపూర్వముగా నిలుపుట శ్రేయ
స్కరము. మొన్న సీనడుమఁ గర్పూరద్వీపమున నుండి యొకబకంబు
సింహళద్వీపాధినాథుం డగు మహాబలునికడకుం బంపఁబడియె నని
చారులవలన నేఁటి యుదయమునని విన్నాఁడను. విచారించి చూడ
హిరణ్యగర్భం డచ్చటికి దూత నంపుట, మనతో యుద్ధము చేయ
పారసరాజును సహాయంబు వేఁడుటకై యుండును. మన యూహయె

నిజమయ్యె నేని, మహాబలుండును బూర్వ మొకసారి మనచే నవ మానితుం డయి యున్నవాఁడె కావున మహాసంతోషముతో హిరణ్య గర్భునకుఁ దోడుపడు ననుటకు సందియము లేదు. వారిరువురుం గలిసి రొని మనమీఁద దండు వెడలుట పొసంగునేని, ప్రస్తుతస్థితిని బట్టి విచారింప మనము వారిని గెలువఁ గలుగుట దుర్ఘటము. కాఁబట్టి హిరణ్యగర్భునితో సంధి చేసికొనుటయె యుత్తమపక్ష మని నాకుఁ దోఁచుచున్నది."

అనిన మందహాససుందరాననుం డయి చిత్రవర్ణుం డిట్లనియె. "హిరణ్యగర్భఁ డెప్పు డాల మిచ్చి మనచేఁ బరాజితుఁ డయ్యెనో యప్పుడె రాజ్యాధికారపూజ్యతం గోలుపోయి మనకు సేవక ప్రాయుఁ డయ్యెను. అట్టివానిం బూజించి తెచ్చి మరల రాజ్యపీఠంబునం బ్రతి ష్ఠింప వలసినంత యక్కఱ మన కెప్పు డేమి కలిగినది? అంత కలిగి నప్పుడు పోలినట్లు చూచుకొందము. 'ఈనఁ గాచి, పొలమును నక్క లకుఁ బెట్టినట్లు, బాహుబలాధిక్యంబు వేరిమిని గష్ట పడి రణంబునం గెలుచుకొన్న రాజ్యంబును ఫలకాలంబున నొరునిపాలు సేయ నేల? ఈవిషయమున నక్రమముగాఁ బూనుకొని మహాబలుండు మనమీఁద ధ్వజ మెత్తినను నెత్తనిమ్ము. నాప్రతాపాలనంబు వేఱిమి నాతఁ డిం కొకసారి బాగుగఁ జవి చూచెడుంగాక!" అనుచుండ నొకశుకంబు గోఁజుచుఁ గొలువుఁగూటంబుదిక్కునకుం బఱతెంచుచు దూరమున నుండి "దేవా! సింహళద్వీపరా జనేకానీకంబులతోడ న్వేడలి వచ్చి మనపట్టణ మాక్రమింప నూరిబయల న్విడియుచున్నాఁడు." అని కేక వేసెను. రా జావాక్యము విని యులికిపడి 'యేమి యేమి' యని యాత్రముతో నడిగెను. కొలువువారును ససంభ్రములైరి. అంతఁ జిలుకయు సమీపమునకు వచ్చి రాజుదిక్కు మొగము చేసి నమస్క

రించి "దేవా! సింహళద్వీపరాజగు మహాబలుఁ డాకస్మికముగాఁ గోప కారణ మేమియు లేకయె మనమీఁద దండు వెడలివచ్చి, తనసేనల న్నగరంబుపఱగడ న్వీడియించు చున్నాఁడు. అతండు మనరాజధాని న్నమీపించువఱకును, మనవారి కెవ్వరికి నాతని రాక తెలియ దయ్యెను. వారిం జూచి యిప్పుడూరికావలివారలు రణసంభ్రమంబు నం బరిభ్రమించుచున్న వారు. నేను ఫలంబులు తేర వనంబునకుం; జని ఫలంబులుకోయుచుఁ దొలుదొలుత · నొక్కవృక్షాగ్రమునుండి దూరమునమిన్నును మన్నును నేకము సేయుచు లేచినధూళిం బొడ గాంచితిని; డోలాందోళితమానసుండనయి దాని కారణంబు యోచించు చుండ నింతలో నూఁతవేటుదూరమ్మున సైన్యకలకలంబు వినవయ్యెఁ: పదంపడి బారులుతీరి మనప్రోలిదెసంజను దెంచుపక్షి వారంబులనాలో కించితిని; తదనంతరము వురోయాయి యయివచ్చినయొక బకంబు వలన నది మనవీ డాక్రమింప వచ్చినసారసాధ్యక్షునిసైన్య మగుటం దెలిసికొని, దేవర కాసమాచారమును నివేదింప వాయువేగమునం బఱతెంచితిని.' అని మరలఁ జెప్పెను.

అప్పు డమ్మయూరరాజు రౌద్రరసమూర్తియై లేచి, కొలువు కలయంజూచి యిట్లనియె — "దూరదర్శీ! నిన్ననో మొన్ననోకదా మహాబలుండు మనమీఁద దాడి వెడలి వచ్చి బవరంబునం బరాభవంబు నొంది సేనల నేలపాలు చేసికొని తాను మాత్రము ప్రాణంబు లతో నవులఁ బడి నిజదేశముం జొచ్చినవాఁడు. దానినంతను నింత లోనే మఱచి తాను నొకమానిసి ననుకొని ప్రబలత్వదుర్బలత్వంబులు తలంపక తగరువచ్చి కొండను దాఁకినట్లు మరల మనమీఁద నే మొగంబున వచ్చి దండు వెడలినాఁడు? చూచితివా యాతనికండ కావరము? మన మిప్పుడపోయి యీమత్తునిజన్యంబు చేసి స్సై

న్యంబుగా యమపురి కతిథిం గావింతము. అవార్యశౌర్యధుర్యుండ
నగునాముందఱఁ దృణకల్పుఁ డగునీపక్షి యెంతటివాఁడు? ఈతని
సైన్య మెంత? మున్ముంద యీవచ్చినవీరవారంబునెల్ల ఫేరపంబుల
కాహారంబు కావించి వచ్చి, పిదప సింహళద్వీపమునకుం గూడ దాడి
వెడలి యీసారి తప్పక యాతనిరాజధానిం గూఁకటివేళ్ళతోఁ బెల్ల
గించి పేరు లేకుండ నేలమట్టము కావింతము." అనిన సవినయంబుగా
మంత్రి యిట్లనియెం

"ఇన్నాళ్ళవలెఁ గాదు. మొన్నటిపోరునఁ బేరు గలవారు పలువు
రంతరించుటంజేసి మనసైన్య మిప్పుడు శూరశూన్యమై యున్నది.
తామ్రచూడుండు పోయినతరువాత మనసేనలస్థితిగతుల నెఱిగి నడపి
కార్యావసరంబున ధైర్యంబును శౌర్యంబును బాహువీర్యంబును
మెఱయించి దళవాయితనంబు వూన నర్హుం డగునూహాపోహావిచ
క్షణుఁ డొక్కఁడును నాకంటికిం గనఁబడకున్నాఁడుం. అందుచే మన
సైనికనికరంబులు బహునాయకత్వంబు గలిగి యున్నవి. ఎల్లకాలం
బును సాహసంబు సాగిరాదు. శత్రు వొకప్పుడు లోఁబడినవాఁడె
కదా యని తలంపం బనిలేదు; శిఖిశిఖాతప్తం బగుజలంబె పొంగిపడి
యాయగ్నిం జల్లార్చుచుండుట లోకధర్మము. శకటగతచక్రంబు
తెఱంగునఁ గాలగతులం గ్రిందు మీఁదును మీఁదు గ్రిందును నగు
చుండును. కరనిహతకందుకంబునకుం బోలె భూమిపయిం బడినదేహ
ధారుల కందఱికిను బడు చుండుటయు లేచుచుండుటయు నైసర్గికము.
నేనింతదూరము చెప్పుట నాప్రాణములు వంచించి కాదు. శర
దంబుం బోలె ఘనగర్జితము చేయుటవలనం గార్య మెప్పుడును
గానేరదు: మహాత్ములు సావధానముగా సాధకబాధకమ్ముల న్మంత్రి
ముఖంబునఁ జక్కఁగా నాలోచించి, యర్థానర్థంబుల నూహించి,

మఱి కార్యనిశ్చయమ్ము చేయుదురు. రాజు తానెంత బలవంతుఁడయినను, బలువురు రాజులతో వివాదము పెట్టుకోరాదు; పెట్టుకొనెనేని, నిశ్చయముగా దురంతము నొందును. సర్పమెంత బలవంతమయ్యును, చలిచీమలచేతం జిక్కి యుక్కఱచుండ మనము చూచుచుండ లేదా? నిరర్థకవిరోధంబు సమర్థింపం జూడక దేవర యివ్వాడు నన్ననుగ్రహించి విగ్రహంబు మానవలయును. ఎవఁడు కార్యాకార్యవిచారమును మాని, క్రోధమునే ప్రధానము చేసికొని యొక పనికిఁ బూనుకొనునో వాఁడు మొదల విచారింపక నకులమును జంపుకొని పిదప విషాదము నొందినబ్రాహ్మణునివలెనే కడపటఁ బశ్చాత్తప్తుఁడగును. దేవర కాకథ చెప్పెద నవధరింపుఁడు.

గౌడదేశమునందలి యొకయగ్రహారమున దేవశర్మ యను పేరుగల వేదజుఁడు డగువిప్రుఁ డొకఁడు గలఁడు. అతనికిఁ గొంతకాలము సంతానము లేనికొదవ యొక్కటియే కాని వేఱుకొదవ లేక యుండెను. అతనిభార్య యగుయజ్ఞసేని సంతానము లేని దయి, పుత్రులం గని పెంచు తనయాడుచేడియలం గని ముచ్చట పడుచు, బిడ్డలనిమిత్తము యోగులని వేషములు వేసుకొనువారినెల్లఁ గాళ్ళుఁ గడుపులుం బట్టుకొని యాశ్రయించి వారిచే వేళ్ళు వెల్లంకులు గట్టించుకొనుచు, జాయి గన్న జాతికి గుడి గన్న గుడికి మ్రొక్కుచు, ఎవ్వ రేతీర్థము పేరు చెప్పిన నచ్చటికిఁ బోయి మునింగి వచ్చుచు, లోకములో లేనినోములు వ్రతములు పట్టుచుండును. ఇట్లు కొంతకాలము గడిచినపిమ్మట, నాయింతి యాశ్వరానుగ్రహమువలన, గర్భవతియై యొక్కపుత్రకుం గనియెను. లేక లేక కలిగిననంతాన మగుటంజేసి, తల్లిదండ్రు లాచిన్న వానిని బొమ్మవిూఁదికాలు నేలఁ బెట్టనీక ప్రాణములకంటె నెక్కువగా గారాబమునఁ బెంచుకొను చుండిరి. ఒకనాఁ డాబిడ్డను బా

లిచ్చి నిదుర పుచ్చి, యుయ్యాలలోఁ బరుండఁబెట్టి మగనిని గావలి యుంచి యాజ్ఞసేని పొరుగువీధి నున్న తనపుట్టినింటికిఁ జూడఁబోయెను. నాఁడు పర్వాదిన మగుటంజేసి రాజుదగ్గఱనుండి పార్వణశ్రాద్ధదాన మిచ్చుటకొఱకయి యాబ్రాహ్మణున కాహ్వానము వచ్చెను. సహజ దరిద్రుఁడయిన యాశుద్ధశ్రోత్రియుఁడప్పు డిట్లు చింతించెను. "రాక రాక నేఁటికాలమునకు భూపతికి నాయం దనుగ్రహము వచ్చి, సాహిత్యపరు లనేకు లుండ వారిం గాదని నాకే దాన మియ్యఁ దలఁచి వర్తమాన మంపెను. నన్ను భాగ్యవంతునిఁ జేయవలె ననుతలంపుతోనేలిక పిలువనంపినపుడే, నాపాలిటి యభాగ్యదేవత సమయమున కీయసందర్భము తెచ్చిపెట్టినది. ఇఁకఁ బుట్టినింటనుండి నాభార్య వచ్చు నెప్పుడు? నేఁ బోయి దానము పట్టు నెప్పుడు? రాకున్న నేమి పోవును నన్ను నిందాఁకఁ గంటికి రెప్పవలెనుండి కాపాడుకొనుచున్న పిల్లవానికడం గావుండువారు లేరు; పోక మానెద నన్న భూపాలుఁ డాదానము నన్యుల కిచ్చివేయును. నాకొక్క యుపాయము కినుపట్టుచున్నది. బవాదినములనుండి కన్నబిడ్డవలెఁ బెంచుచున్న నకుల మున్నదిగదా! ఈపెంపుడుముంగిని నాముద్దుఁబట్టికి రక్షక ముంచి కదిలిపోయి దానమును స్వీకరించి యింట నున్నట్టి పరుగెత్తుకొని వచ్చెదను." అని నిశ్చయించి, ముంగిసను ససంకేతముగాఁ జెప్పి యాయుర్భకునకుఁ గావలి పెట్టి, రాజమందిరమునకుం బోయెను. దానమునిమిత్త మేగిన రెండుగడియలును బ్రాహ్మణునికి శరీర మొక్కటియె రాజమందిరమున నుండెనుగాని చిత్త మంతయు నింటిమీఁదను గొమారునిమీఁదనె యుండెను. ఇంతలో నొకకృష్ణ సర్పము మిద్దెమీఁదినుండి యుయ్యాలచేరులగుండ బాలుఁడు నిద్ర పోవుచున్న పాన్పుమీఁదకిఁ బ్రాఁకి వచ్చుచుండెను. దానిని

ముంగిస చూచి యొక్కయెగు రెగిరి మెడవట్టుకొని కొఱికి ముక్కలు చేసి క్రిందఁ బడ వైచెను. అంత నాబ్రాహ్మణుఁడును రాచనగరం గాసువీసములు గ్రహించి, కొడుకుమీఁదిప్రేమ తన్నుఁ ద్వరపెట్ట నేలమీఁద మడమలు మోపక డోలాయమాన మానసుం డయి మహావేగముతో వచ్చుచుండెను. బ్రభువును దన స్వామియడుగులచప్పుడు విని, పాము నెత్తు రంటికొన్న నోటితో మార్గము పొడుగున రక్తబిందువులు జాటి వీధిగుమ్మముదగ్గఱ కెదు రేగి, సంతోషముతో నాబాపనికాళ్ళబ్రేళ్ళం బడి పెనఁగఁ జొచ్చెను. రక్తవిలిప్తముఖం బగునకులంబును జూచి గుండెలు తటతటఁ గొట్టు కొన, భీతిపరీతచేతస్కుఁ డయి యాపాఱుఁడు తనకొమారునినె యా నకులంబు చంపి వచ్చెనని యెంచుకొని, పెంచిన విశ్వాసమయిన లేక నాముద్దుఁ బట్టి నెత్తురుఁగందు నెట్లు గఱచితి వని దురహంకారంబున జేరువ నున్న దుడ్డుకఱ్ఱను హస్తమున నంకించి నకులమును మోఁదెను. ఆమోఁదు శిరంబునం దగుల గ్రుడ్లు వెడలఁ బెట్టి, నేలం బడి విలవిలఁ దన్నుకొనుచు నొక్కపెద్దయఱి పఱిచి నకులము ప్రాణము విడిచెను. అట్లాముంగియునుఱుఁ గొని యాభూసురుఁడు నందనుని కయి ప్రలాపించుచు లోనికిం జని తలినుంబునఁ జెక్కచెమర్పకుండ నిదురించుచున్న బాలకునిఁ గని, ప్రమోదమానమానసుం డయి, పదంపడి డోలాసమీపంబున ఖండఖండము లయి వడి యున్న నల్లత్రాఁచును జూచి చోద్యపడి, కలయూవు తెలిసికొని శోకోద్రేకమ్మున నురమ్మును శిరమ్మును హస్తతలమ్మును మోఁదుకొనుచు నెందు నెవ్వరికిఁ గలుగని కలుషము తన కొదవెంగా యని పెద్దతడవు రోదనము చేయఁ డొడఁగెను. కాఁబట్టి యేకార్యమును సావకాశముగా విమర్శింపక త్వరపడి చేయరాదు.

అని దూరదర్శి చెప్పిన విని యించుక యనుమానించి, శిఖండి ప్రకాండుం డిట్లనియె. 'మంత్రివరా! నీవిప్పుడు చెప్పిన దంతయు నాదరణీయముగనే కానవచ్చుచున్నది. కాని శత్రు వొక్కఁడు మనపట్టణముమీఁద దండు వెడలి వచ్చి దాని నాక్రమింప నుపక్రమించు చుండఁగా దీర్ఘాలోచన చేసి కార్యనిశ్చయంబు చేయవలయు నని జాగు చేయు చుండుట పాడిగాఁ గనుపట్టదు. మన యాలోచన కుదురు నప్పటికిఁ బురము దొడ్డ పోవచ్చును. కాఁబట్టి ముందుగా నేకీతి నయిన నాతనిం బాఱఁదోలు సాధనము చూచుట ముఖ్యకర్తవ్యము. ఇప్పుడు వచ్చినయాపదను దొలఁగించుకొన్నతరువాత హిరణ్యగర్భుని సంగతి చూచుకొందము. నాకుంజూడ వీరవారంబుం గూరుచుకొని పోయి వైరిం దారసించి పౌరుషంబు నెఱిపుటకన్న వైరవారణంబునకుం దగినయుపాయం బన్యం బున్నట్లు కనుపట్టదు. అయినను నీబుద్ధిప్రచారంబునకు గోచరమయిన దేమయినం గలిగినఁ దెలుపుము. ఆలోచించి సర్వసమ్మత మయిన పక్షము నవలంబింతము. అనిన దాక్షాయ్యనాయకుం డిట్లనియె.

"మనము హిరణ్యగర్భునితోడం బోరి గెలుపు కొన్నవార మయ్యెనను, మన గెలు పొక గెలు పని సంతోషింప రాదు. ఏల యనిన—మనపాలం గల యోధవారంబులోఁ బేరు గలవారు పెక్కండ్రాలము చేసి న్వర్గస్థు లయిరి; ఉన్నవారిలోను బలువురు కాయంబుల నిండ గాయంబులు గలవా రయి పోరికిం బనికి రానివా రయిరి. ఇట్టి యుశక్తులను వెంటఁ బెట్టుకొని పోయి, మేమే శూరుల మని సాహసంబున వైరిం దలపడుదు మేని మనవారు శరీరంబు కాన పడక యోపినంతవట్టు పోరాడినను దుదను బరాభవంబు నిశ్చయము. ఈ మహాబలుం డిప్పుడు మనమీఁద దాడి వెడలుట, హిరణ్యగర్భుని

మంత్రి యైన సర్వజ్ఞుని ప్రేరణము చేతం గాని స్వబుద్ధిచేతం గాదు. తనతొంటి విరోధంబు సాధించు కొనవలయు ననునుద్దేశంబును దానికిం గొంత తోడుపడి యుండ వచ్చును. అయినను దనమిత్ర మనోరథం బీడేఱు నేని ఈతండు సంతుష్టుం డయి తనపురికి మరలఁ గలవాఁ డగుట సందియము లేదు. మన మిప్పుడు హిరణ్యగర్భుని సమాధాన పఱుచు కొనుయత్నంబు చేయుటయె ప్రధానామేయ మయిన కార్యము. కాఁబట్టి మున్ముంద యాహంసస్వామిపాలికి మనదూత యరుగవలయును; అట్లరుగుదూత కార్యసంఘటనం బొనర్చుకొని మరల మనలం జేరుటకు లోపలనె యీమహాబలుని దళముల వలన నొకటి వుట్ట కుండ నీక్షణంబ సారసరాజు నొద్ద కొక రాయబారిఁ బంపుదము. ఇట్లు చేసిన సకలము ననుకూలముగా నడచును." అనిన రాజును నానని యాలోనియెను. అప్పుడే రాజానుమతంబున మంత్రి యరుణముఖుని రప్పించి మహాబలునితోడం బలుక వలయు పలుకుల నెల్లం దేటపడఁ గఱపి, కార్యంబు పొత్తు పఱుచుకొనిరమ్మని వంచిన, నాతండును వినయవేషంబునం జని నగరంబు పఱగడ నొక్క వనంబున నున్నస్కంధావారంబుం దఱిసి, సేనారక్షకులకుం దనవచ్చిన కార్యంబు చెప్పి యెల్ల సైనికులును మూఁకలు గట్టి తన్నుఁ జూచు చుండఁ దన్మధ్యంబున నొక్కచోఁ జందనతరు సమీపంబున లతాగృహంబున వసియించి యున్న మహాబలునిన్ ద్వారపాలకుల వెంబడిం బోయి సందర్శించి నమస్కరించి, యాతనియాజ్ఞానుసారముగా సమీపంబున గూరుచుండి చేతులు జోడించి యిట్లనియె.

"దేవా! జంబూద్వీపాధినాథు లగుచిత్రవర్ణ మహారాజుల వారు తొమ్మిగ దేవరివారితోడ నాడు మన్ననూటల విన్నవించెద; అవధాన ముతోఁ జిత్తగింపుఁడు. ఇరుగు పొరుగుల దేశముల కేలిక లయిన

మనము మనలో నిట్లు దుర్మత్సరంబు వాటించి మానుషధర్మమును మఱచి లోకులు మనలం దల లెత్తి చూడ జగడము లాడు చుండుట యుచితము గాదు. మన మైకమత్యంబు వేర్మిని సోదరభావంబు గూరి యుండు మేని, ముల్లోకము లొక్కట నెత్తి వచ్చినను గలన న్మనలఁ దేతి చూడఁ గలవే! పూర్వమే వేళావిశేషముననో మనమనసులలోఁ గ్రోధాగ్ని పొడచూపి, మెల్ల మెల్లఁగా రాఁజి ప్రజ్వరిల్లి యుద్ధరూప మునం బయ లెడలి యుభయపక్షములవారిం గొందఱ దహించి యప్పటి కాఱినది; ఆఱి పోయినదాని న్మరల మండఁ జేయుచు మన మనస్సీమలఁ గోపంబులు గావురం బుండ నిచ్చట యుభయులకును క్షేమకరము గాదు. ఇకముందు మనమన్యోన్యస్నేహము నవలంబించి మీమాట మేమును మామాట మీరును జెల్లించుచుఁ గూడి మనుట మాయభిమతము. కర్ణాటద్వీపాధీశ్వరుం డగు హిరణ్యగర్భుఁడు మన కిరువురకుఁ బ్రాణమిత్రుఁడుగా నుండఁ దగినవాఁడు. అతనిరాజ్యం బాతని కిచ్చితి మని తెలిపి, మాతోడ సంఖ్యంబు నెఱవ నాతనినడుగ నేఁడె దూతను బంపు చున్నారము."

అని చెప్పి యూరకున్నఁ మహాబలుండును గొంతవడి చింతించి, తనబలంబులు మార్గాయాసంబునం బడలి యుంటఁజేసియుఁ దనవచ్చిన కార్యం బనుకూలముగా ముగియుచిహ్నములు కానఁబడు చుంటం జేసియు సంధిచేసికొనుటయే యప్పటికుచిత మని నిశ్చయించి, పూర్వ వైరంబు మాని సంధి కియ్యకొనియెను. అప్పుడు మహాబలచిత్రవర్ణు లకుఁ గపాలసంధి యయ్యెను.

తరువాతఁ జిత్రవర్ణుండు తనమంత్రితో నాలోచించి, యుచిత గతిని హిరణ్యగర్భునిపేర నొకలేఖ వ్రాసి, తల్లేఖం గొని పోయి హంసస్వామితో యుక్తక్రమంబున సంభాషించి కార్యంబు పొందు

పఱుచుకొని రా నరుణముఖుండె తగినవాఁడని యెంచి, అతనినె వయి నంబుచేసి క్రమ్మఱఁ గర్పూరద్వీపంబునకుఁ బంపి యాతనిపునరాగ మనంబున కెదురు చూచుచు దినము లెన్ను చుండెను. అతండును, కతిపయప్రయాణంబులఁ గప్పురపుదీవిం జేరి, రాజధానిం బ్రవేశించి, ముందుగా మంత్రిసందర్శనంబు చేసి నిజాగమనకారణంబు తెలిపి, యాతండు తన్ను వెంటఁ బెట్టుకొని పోవ హిరణ్యగర్భుని రహస్య వాసంబుఁ జొచ్చి, యచ్చట నాప్తవర్గంబుతో నిష్టకథాప్రసంగంబులఁ గాలక్షేపంబు చేయు చున్న హంసాధ్యక్షుని వీక్షించి, నమస్కార పూర్వకంబుగాఁ దన్నెఱిఁగించుకొని, మితహితోక్తుల నిట్లనియెం "జంబూద్వీపాధినాథుండు చిత్రవర్ణుండు దేవర సుగుణసంపదను బలు వురు ప్రశంసింపఁ బూర్ణమనంబుతో నాకర్ణించి, దేవరతోడిమైత్రి నపేక్షించి నన్నిటకుం బుత్తెంచెను. నేఁడు మొదలుకొని యథాపూర్వ ముగా దేవరవారు కర్పూరద్వీపరాజ్యాధికారంబు మరల వహియించి, లోకోత్తరముగాఁ బ్రజాపాలనంబు గావించుచు మయూరస్వామి తోడి సౌహార్దసౌఖ్యం బనుభవింప నర్హులు," అని లేఖం జేతి కిచ్చెను. దానిం బుచ్చుకొని హిరణ్యగర్భుండు మంత్రితో నాలోచించి తగిన ప్రత్యుత్తరంబు వ్రాసి ధవళాంగునిచేత నిచ్చి, 'నీవీయరుణ ముఖునితోడ జంబూద్వీపంబున కరిగి చిత్రవర్ణుని సందర్శించి యవ్వా సంభాషణంబుల నాతని నలరించి యీజా బిచ్చి రమ్మని యానతి యొసఁగి, యరుణముఖుని నవ్వాసత్కారంబుల గారవించి చెప్పవలయు పలుకు లెల్లం జెప్పి, వీడుకొలిపెను.

అంత ధవళాంగుండును నరుణముఖుండును బయలు వెడలి, సరససంభాషణంబుల మార్గాయాసంబు వీసంబును గాన రాకుండ నడచి, కతిపయదినంబులకు జంబూద్వీపంబు చేరి చిత్రవర్ణుండు నిండు

కొలు వుండి యుండ నాతనిపాదసందర్శనంబు చేసికొని, సందేశంబు సమస్తంబును నివేదించి, కృతకృత్యు లయిరి. మహాబలుండును మిత్ర కార్యంబు సాధించుకొని చిత్రవర్ణుని మన్ననఁ బడసి, పరమానందభరి తుండయి సైన్యసమేతంబుగా నిజదేశంబునకుం జనియెను. నాఁడు మొదలుకొని మహాబలచిత్రవర్ణహిరణ్యగర్భు లన్యోన్యమైత్రిం బొంద లుచుఁ, బరస్పరక్షేమలాభంబులఁ బ్రతికాముఖంబులఁ దెలిసికొనుచుఁ జిరకాలము సుఖముగా రాజ్యపాలనంబు గావించిరి.

అని విష్ణుశర్మ సంధితంత్రమును ససాకల్యముగా వచియించి, మీరును సర్వసర్వంసహాపతులతోను సంధి కావించుకొని, యైక మత్యంబు పెంపున సకలసౌఖ్యంబుల ననుభవింపుఁడనిన, రాజపుత్రు లెంతయు సంతసించి 'దేవరమూలమున నజ్ఞానాంధకారంబునుండి వెలువడి జ్ఞానభాను న్సందర్శింపఁ గంటి మని విష్ణుశర్మను నుతియిం చిరి. అంత సనయు లయిన నృపతనయులఁ దనవెంటఁ దోడ్కొని పోయి, సుదర్శనున కర్పించి, విష్ణుశర్మ యాతనిచే సకలసమ్మానంబులం బొంది, యొకయగ్రహారము బహుమానంబు వడసెను.

సంధితంత్రము, సంపూర్ణము.

990

తర్క సంగ్రహము

తర్క సంగ్రహము

క. శ్రీకళ్యాణగుణాసీ
కాకరుఁడును సర్వసజ్జ ♦ నార్తిహరుండున్,
శ్రీకరుఁడును నగు దేవునిఁ
బ్రాకటతాత్పర్యయుక్తి ♦ భజియింతు మదిన్.

---

౧. – ద్రవ్యము, గుణము, కర్మము, సామాన్యము, విశేషము, సమవాయము, అభావము, అని పదార్థము లేడు.

౨. – పృథివి, అప్పు (నీరు,) తేజస్సు, వాయువు, ఆకాశము, కాలము, దిక్కు, ఆత్మ, మనస్సు, అని ద్రవ్యములు తొమ్మిది.

3. – రూపము, రసము, గంధము, స్పర్శము, సంఖ్య, పరిమాణము, ప్రథక్త్వము (వేఱుపాటు,) సంయోగము, విభాగము, పరత్వము (దూరత్వము,) అపరత్వము, (సామీప్యము,) గురుత్వము, ద్రవత్వము, స్నేహము, శబ్దము, బుద్ధి, సుఖము, దుఃఖము, ఇచ్ఛ, ద్వేషము, ప్రయత్నము, ధర్మము, అధర్మము, సంస్కారము. అని గుణము లిరువది నాలుగు.

౪. – ఉత్తేపణము (ఎగజిమ్ముట,) అవక్షేపణము (దిగద్రోయుట,) కుంచనము (ముడుచుట,) ప్రసారము (చాఁచుట,) గమనము (నడక,) అని కర్మము లయిదు.

౫. – పరము, అపరము, అని సామాన్యము ద్వివిధము.

౬. – నిత్యద్రవ్యములయం దుండు విశేషము లనంతములు.

౭. – సమవాయ మేకవిధము.

౮. – ప్రాగభావము (పూర్వమున లేకుండుట,) ప్రధ్వంసాభావము (నశించుటచే లేకుండుట,) అత్యంతాభావము (అసలే లేకుండుట,) అన్యోన్యాభావము, అని యభావము చతుర్విధము.

౯. – ద్రవ్యములలో గంధముకలది పృథివి. అది నిత్య, అనిత్య, అనిద్వివిధము. పరమాణురూపమయినదినిత్య; కార్యరూపమయినది యనిత్య. శరీర, ఇంద్రియ, విషయ, భేదములవలన ననిత్య మరలఁ ద్రివిధము. మనుష్యులు మొదలగువారిది శరీరము; నాసాగ్రవర్తియయి, గంధగ్రాహక మయిన ఘ్రాణ మింద్రియము; మృత్పాషాణాదికము విషయము.

౧౦. – శీతస్పర్శముగలది యప్పు (జలము.) అది నిత్య, అనిత్య, అని ద్వివిధము. పరమాణురూప మయినది నిత్య; కార్యరూప మయినది యనిత్య. శరీరము, ఇంద్రియము, విషయము, అనుభేదములవలన ననిత్య మరలఁ ద్రివిధము. శరీరము వరుణలోకమునం దుండును; జిహ్వాగ్రవర్తియయి, రసగ్రాహక మయిన రసన యింద్రియము; నదీ సముద్రాదికము విషయము.

౧౧. – ఉష్ణస్పర్శముగలది తేజస్సు. అది నిత్యము, అనిత్యము, అని ద్వివిధము. నిత్యము పరమాణురూప మయినది; అనిత్యము కార్యరూప మయినది. శరీరము, ఇంద్రియము, విషయము, అను భేదములవలన ననిత్యము త్రివిధము. శరీర మాదిత్యలోకమునం దుండును; కృష్ణతారాగ్రవర్తియయి, రూపగ్రాహక మయిన చక్షు రింద్రియము; భౌమము, దివ్యము, ఔదర్యము, ఆకరజము, అను భేదముల వలన విషయము చతుర్విధము. వహ్న్యాదికము భౌమము, విస్ఫూర్జి (మెఱుపు) దాదికము దివ్యము, తిన్న దానిని జీర్ణముచేయుటకు హేతు

వయి యుదరమునం దుండునది యాదర్శము; సువర్ణాదిక మాశ రజము.

౧౨. – రూపరహిత మయి స్పర్శముకలది వాయువు. అది నిత్యము, అనిత్యము, అని ద్వివిధము. పరమాణురూప మయినది నిత్యము; కార్యరూప మయిన దనిత్యము. శరీరము, ఇంద్రియము, విషయము, అనుభేదములవలన ననిత్యము త్రివిధము. శరీరము వాయులోకమునం దుండును; సర్వశరీరవర్తి యయి, స్పర్శగ్రాహక మైనత్వక్కు ఇంద్రియము; వృక్షాదికంపనహేతువు విషయము.

౧౩. – శరీరములోపల సంచరించువాయువు ప్రాణము; అది యొక్కటియే యయినను, ఉపాధిభేదములవలన బ్రాణాపానాది సంజ్ఞలను బొందుచున్నది. [ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము. అను పంచవాయువులును పంచప్రాణము లనబడును.]

౧౪. – శబ్దగుణము కలది యాకాశము, అదియొక్కటి యయి, అంతటను వ్యాపించి నిత్య మయి యుండును.

౧౫. – అతీతము (భూతము) మొదలయిన వ్యవహారమునకు హేతు వయినది కాలము. అది యేక మయి సర్వవ్యాప్త మయి, నిత్య మయి యుండును (భూతము, భవిష్యత్తు, వర్తమానము, ఇవి యతీతము మొదలయినవి.)

౧౬. – తూర్పు మొదలయినవ్యవహారమునకు యోగ్య మయినది దిక్కు. అది యేకమయి, సర్వవ్యాప్తమయి, నిత్యమయి యుండును, (తూర్పు, పడమర, ఉత్తరము, దక్షిణము, ఇవి తూర్పు మొదలయినవి.)

౧౭. – జ్ఞానాధికరణ (ఆధార) మయిన దాత్మ, అది పరమాత్మ, జీవాత్మ, అని ద్వివిధము. అం దీశ్వరుడును సర్వజ్ఞుడు నయినపర

మాత్మ యొక్కటియే; జీవాత్మ ప్రతిశరీరమునందును భిన్నమయి యుండును; అది సర్వత్ర వ్యాపించి నిత్యమయి యుండును.

౧౪. – సుఖదుఃఖాదులను బొందుటకు సాధన మైనయింద్రి యము మనస్సు. అది ప్రత్యాత్మయందు నుండుటచేత ననంత మయి పరమాణురూపమై నిత్యమై యుండును.

౧౫. – చక్షు (కన్ను) ర్మాత్రముచే గ్రహింపఁ దగినగుణము రూపము. అది శుక్లము, నీలము, పీతము, రక్తము, హరితము (ఆకుపచ్చ), కపిశము (కోతివన్నె), చిత్రము, అనుభేదములవలన సప్త విధము. అది పృథివియందును, జలమునందును, తేజస్సునందును, ఉండును. వానిలోఁ బృథివి యందు సప్తవిధముల నుండును; జలము నం దభాస్వరశుక్ల మయి యుండును; తేజస్సునందు భాస్వరశుక్ల మయి యుండును.

౧౬. – రసన (నాలుక) చే గ్రహింపఁ దగినగుణము రసము. అది మధురము, ఆమ్లము (పులుసు), లవణము, కటువు (కారము), కషాయము (ఒగరు), తిక్తము (చేదు), అనుభేదములవలన షడ్విధము. అది భూమియందును, జలమునందును, ఉండును. అందు భూమియందు షడ్విధము; జలమునందు మధురమాత్రము.

౧౭. – ఘ్రాణము (ముక్కు) చే గ్రహింప, దగినగుణము గంధము. అది సురభి (పరిమళము), అసురభి (కంపు), అని ద్వివిధము. అది పృథివియందుమాత్ర ముండును.

౧౮. – త్వగింద్రియమాత్రముచే గ్రహింపఁ దగినగుణము స్పర్శము. అది శీతము, ఉష్ణము, అనుష్ణాశీతము, అనుభేదములవలనఁ ద్రివిధము. అది పృథివియందును, అప్పునందును, తేజస్సునందును,

వాయువునందును, అందు శీతము జలమునందును, ఉష్ణము తేజస్సు నందును, అనుష్ణాశీతము పృథివీవాయువుల యందును నుండును.

౨౩. – పృథివియందు పాకజనిత మైన రూపాదిచతుష్టయము (రూప, రస, గంధ, స్పర్శములు) అనిత్యము. ఇతరస్థలములయం దపాకజనిత మయినది నిత్యానిత్యభేదమును గలిగి యుండును. నిత్య గత మైనది నిత్యము; అనిత్యగత మైన దనిత్యము.

౨౪. – ఏకాదివ్యవహార హేతువయినది సంఖ్య. అది తొమ్మిది ద్రవ్యములయందుండి, యేకత్వము మొదలు పరార్ధముపఱకు నుండును. ఏకత్వము నిత్యమును, అనిత్యమును అయి యుండును. నిత్యగత మయినది నిత్యము; అనిత్యగత మయినది యనిత్యము. ద్వ్యాద్యిక మంతట నిత్యము.

౨౫. – మానవ్యవహార కారణ మయినది పరిమాణము. అది తొమ్మిదిద్రవ్యములయందు నుండును. అది, అణువు, మహత్తు, దీర్ఘము, హ్రస్వము, అని చతుర్విధము.

౨౬. – పృథగ్వ్యవహారకారణము పృథక్త్వము. అది సర్వ ద్రవ్యములయందు నుండును.

౨౭. – సంయుక్తవ్యవహారమునకు హేతు వయినది సంయోగము. అది సర్వద్రవ్యములయందు నుండును.

౨౮. – సంయోగనాశకగుణము విభాగము. అది సర్వద్రవ్యములయందు నుండును.

౨౯. – పరాపరవ్యవహారాసాధారణకారణము పరాపరత్వము. అది పృథివ్యాదిచతుష్టయమునందును, మనస్సునందును, ఉండును. అది దిక్కృతము, కాలకృతము, అని ద్వివిధము. దిక్కృత మయిన పరత్వము దూరస్థ మయిన వస్తువునం దుండును; దిక్కృత మయిన

యపరత్వము సమీపస్థవస్తువునం దుండును కాలకృత మయిన వర త్వము జ్యేష్ఠవస్తువునం దుండును; కాలకృత మయిన యపరత్వము కనిష్ఠవస్తువునం దుండును.

౩౦.—ఆద్యపతనమున కసమవాయికారణ మయినది గురుత్వము. అది పృథివీజలములయం దుండును.

౩౧.—ఆద్యస్పందనము (కాఱుట) న కసమవాయికారణ మయి నది ద్రవత్వము. అది పృథివీజల తేజస్సులయం దుండును. అది సాంసిద్ధికము, నైమిత్తికము, అని ద్వివిధము. సాంసిద్ధికము జలమునం దుండును. నైమిత్తికము పృథివీతేజస్సులయం దుండును. పృథివీ సంబంధు లయిన ఘృతాదులయందు ద్రవత్వ మగ్ని సంయోగజము; తేజస్సంబంధు లైన బంగారము మొదలైనవాని యందును ద్రవత్వ మగ్ని సంయోగజము.

౩౨.—చూర్ణాదులు ముద్ద యగుటకు హేతు వయిన గుణము స్నేహము. అది జలమునందుమాత్ర ముండును.

౩౩.—శ్రోత్రము (చెవి) చేత గ్రహింపఁ దగిన గుణము శబ్దము. అది యాకాశమునందు మాత్ర ముండును. అది ధ్వన్యాత్మకము, వర్ణాత్మకము, అని ద్వివిధము. ధ్వన్యాత్మకము భేర్యాదులయం దుండును; వర్ణాత్మకము సంస్కృతభాషాదిరూప మయినది.

౩౪.—సర్వవ్యవహార హేతు వైన జ్ఞానము బుద్ధి. అది స్మృతి, అనుభవము, అని ద్వివిధము. సంస్కారమాత్రజన్య మయిన జ్ఞానము స్మృతి; తద్భిన్న మయిన జ్ఞాన మనుభవము. యథార్థము, అయథా ర్థము అని యనుభవజ్ఞాన ద్వివిధము. ఆయాగుణములు కలదా నియం దాప్రకార మయిన (ఆయాగుణములు కలవనెడి) యనుభవము యథార్థము—రజతమునందు రజతజ్ఞాన యథార్థము; ఇదియే

ప్రమ యనఁబడును. ఆయథాగుణములు లేనిదానియం దాప్రకార మయిన (ఆయథాగుణములు కలవనెడి) జ్ఞాన మయథార్థము—శుక్తి యందు రజతజ్ఞాన మయథార్థము; ఇదియే భ్రమ యనఁబడును.

౩౫.—ప్రత్యక్షము, అనుమితి, ఉపమితి, శాబ్దము, అను భేద ములవలన యథార్థానుభవము చతుర్విధము. ప్రత్యక్షము, అనుమా నము, ఉపమానము, శబ్దము, అను భేదములవలనఁ దత్కరణము సహితము చతుర్విధము.

౩౬.—వ్యాపారవంత మైన యసాధారణకారణము కరణము. అనన్యథాసిద్ధకార్య నియతపూర్వవృత్తి కారణము; ప్రాగభావప్రతి యోగి కార్యము.

౩౭.—సమవాయి, అసమవాయి, నిమిత్తము, అనుభేదముల వలన కారణము త్రివిధము. పటమునకు తంతువులవలెను, స్వగత రూపాదులకు పటము (బట్ట) వలెను, దేనినుండి సమవేత (విడు వని సంబంధముగల) కార్యము పుట్టునో యది సమవాయి కారణము. పటమునకు తంతు (దారము ల) సంయోగమువలెను, పటగతరూపము నకు తంతురూపమువలెను, కార్యముతోఁగాని కారణముతోఁగాని యేకార్థమునందు సమవేత మైనకారణ మసమవాయికారణము; పట మునకు కుంచెవలెను, మగ్గమువలెను, తమధయభిన్న మైన కారణము నిమిత్తకారణము. ఈ త్రివిధకారణములలో నసాధారణమైన కారణ మేదో యదియే కరణము.

౩౮.—ఇందుఁ బ్రత్యక్షజ్ఞానకరణము ప్రత్యక్షము. ఇంద్రియార్థ సన్నికర్షజన్యమైన జ్ఞానము ప్రత్యక్షము. అది నిర్వికల్పము, సవికల్పము, అని ద్వివిధము. ఇది యేదో యొకటి యనునట్లు నిష్ప్రకారక మైన

జ్ఞానము నిర్వికల్పము; ఇతఁడు డిద్దుఁడు, ఇతఁడు బ్రాహ్మణుఁడు, ఇది వలుపు, అనునట్లు సప్రకారక మైన జ్ఞానము సవికల్పము.

౬౯.—సంయోగము, సంయుక్తసమవాయము, సంయుక్తసమవేత సమవాయము, సమవాయము, సమవేతసమవాయము, విశేషణ విశేష్యభావము, అని ప్రత్యక్షజ్ఞానహేతువయిన యింద్రియార్థసన్నికర్షము షడ్విధము. కంటికి ఘటము ప్రత్యక్షమయినప్పుడు సంయోగ సన్నికర్షము; చక్షుస్సంయుక్తమైన ఘటమునందు రూపముయొక్క సమవాయమువలన ఘటరూప ప్రత్యక్షమునందు సంయుక్తసమవాయ సన్నికర్షము; చక్షుస్సంయుక్తమైన ఘటమునందు సమవేత మయిన రూపము రూపత్వమునకు సమవాయ మగుటవలన రూపత్వ సామాన్య ప్రత్యక్షమునందు సంయుక్తసమవేత సమవాయ సన్ని కర్షము; కర్ణరంధ్రమునం దుండెడియాకాశముయొక్క శ్రోత్రత్వము వలనను, శబ్దముయొక్క యాకాశగుణత్వమువలనను, గుణిగుణముల యొక్క సమవాయమువలనను శ్రోత్రమునకు శబ్దసాక్షాత్కార మయినప్పుడు సమవాయసన్నికర్షము; శ్రోత్రసమవేత మైన శబ్దము నందు శబ్దత్వముయొక్క సమవాయమువలన, శబ్దత్వసాక్షాత్కారము నందు సమవేత సమవాయిసన్నికర్షము; భూతలము ఘటాభావమును గల దనుచో చక్షుస్సంయుక్త మైన భూతలమునందు ఘటాభావము యొక్క విశేషణత్వమువలన, అభావప్రత్యక్షమునందు విశేషణవిశేష్య భావసన్నికర్షము. ఈసన్నికర్షములవలనఁ గలిగినజ్ఞానము ప్రత్యక్షము మీని కింద్రియము కరణము కాఁబట్టి యింద్రియము ప్రత్యక్షప్రమాణ మనుట సిద్ధము.

౭౦.—అనుమితియొక్కకరణ మనుమానము. పరామర్శజన్య మైన జ్ఞాన మనుమితి. వ్యాప్తివిశిష్ట పక్షధర్మతాజ్ఞానము పరా

మర్శము—ఎట్లనఁగా, ఆపర్వతము వహ్ని వ్యాప్యమైన ధూమమును కలది యనుజ్ఞానము పరామర్శము; దానివలనఁ గలిగిన పర్వతము వహ్నిమంత మనుజ్ఞాన మనుమితి: ఎక్కడ ధూమ ముండునో యక్కడ వహ్ని యుండు నను సాహచర్య నియమము వ్యాప్తి వ్యాప్యముయొక్క పర్వతాదివృత్తిత్వము పక్షధర్మత.

౮౧—స్వార్థము, పరార్థము, అని యనుమానము ద్వివిధము. స్వానుమితి హేతువు స్వార్థము-ఎట్లనఁగా, తానే పలుమాఱు చూచుట చేత పంటయిల్లు మొదలైనవాని యం దెక్కడధూమ ముండునో యక్కడ నగ్ని యుండు నని వ్యాప్తిని గ్రహించి, పర్వతసమీపము నకుఁ బోయినవాఁ డయి పర్వతమునందలి పొగను జూచి దానియం దగ్ని యుండునా యనినం దేహపడి, ఎచ్చటధూమముండునో యచ్చట నగ్ని యుండు నన్న వ్యాప్తిని స్మరణకుఁ దెచ్చుకొనుచున్నాఁడు; తదనం తరము పర్వతము వహ్ని వ్యాప్యధూమవంత మని జ్ఞానము కలుగు చున్నది; దీనినే లింగపరామర్శ మందురు; అందువలనఁ బర్వతము వహ్నిమంత మనెడు యనుమితి పుట్టుచున్నది; అది స్వార్థానుమానము ధూమమువలన నగ్నిని దానే యనుమానించి, పరులకు బోధించుట కొఱకుఁ బంచావయవ మైనవాక్యమును బ్రయోగించినప్పు డది పరార్థానుమాన మగును—ఎట్లనఁగా,

(౧) పర్వతము వహ్నిమంతము;

(౨) ధూమవత్త్వమువలన;

(3) మహానసము (వంటయిల్లు) వలెనే యేది ధూమవంతమో యది యగ్ని మంతము;

(౪) ఇదియు నాలాగున నే;

(గి) కాఁబట్టి యిది (పర్వతము) యటువంటిదే (వహ్ని మంతము).

ఈవాక్యముచేఁ బ్రతిపాదిత మయినలింగముపలన రెండవదియు నగ్నిని ప్రతిపాదించుచున్నది.

౪౨. – ప్రతిజ్ఞ, హేతువు, ఉదాహరణము, ఉపనయము, నిగమనము, అనునయిదును నవయవములు. (ఁ) "పర్వతము వహ్ని మంత" మనునది ప్రతిజ్ఞ: (ం) "ధూమవత్త్వము వలన" ననునది హేతువు; (3) "మహానసమువలెనే యేది ధూమ వంతమో యది యగ్నిమంత" మనునది యుదాహరణము; (౪) "ఇదియు నాలాగు ననే" యనునది యుపనయము; (గి) "కాఁబట్టి యిది యటువంటిదే" యనునది నిగమనము.

౪3. – స్వార్థానుమితి యందును పరార్థానుమితియందును లింగ పరామర్శమే కరణము; కాఁబట్టి లింగపరామర్శ మనుమానము.

౪౪. – అన్వయవ్యతిరేకి, కేవలాన్వయి, కేవలవ్యతిరేకి, అని లింగము త్రివిధము. వహ్ని (నిప్పు) ని సాధింపఁ దగినప్పుడు ధూమ వత్త్వము (పొగ గలిగి యుండుట) వలెనే, అన్వయముచేతను వ్యతి రేకముచేతను వ్యాప్తికలది యన్వయవ్యతిరేకి—మహానసము వలెనే యెచ్చట ధూము ముండునో యచ్చట నగ్ని యుండు ననుచోటనన్వయ వ్యాప్తి; మహాహ్రదమువలెనే యెచ్చట నగ్ని లేదో యచ్చట ధూమ మును లేదనుచోట వ్యతిరేకవ్యాప్తి, అన్వయమాత్రవ్యాప్తిని గలది కేవలాన్వయి; ఎట్లనఁగా, పటమువలెనే ప్రమే యత్వము (తెలిసికోఁ దగుట) వలన ఘటము పేరు పెట్టఁ దగిన దనుచోట, సర్వమునకును ప్రమేయత్వమును నభిధేయత్వమును (పేరు పెట్టఁ దగుట) నుండుట

వలన ప్రమేయత్వాభిధేయత్వములకు వ్యతిరేక వ్యాప్తి లేదు. వ్యతిరేకమాత్రవ్యాప్తిని గలది కేవల వ్యతిరేకి; ఎట్లనగా,

(ఁ) పృథివి యితరములకంటె భిన్న మయినది;

(ఁ) గంధవత్త్వము (వాసనను గలిగి యుండుట) వలన;

(3) ఏది యితరములకంటె భిన్నము కాదో యది జలము వలెనే గంధవత్తు (గంధము కలది) కాదు;

(ర) ఇది (పృథివి) యీలాగున (గంధము లేనిదిగా) లేదు;

(ఱ) కాబట్టి యిది వాని (ఇతరముల) వంటిది కాదు.

గంధవత్త్వము పృథివీమాత్రపక్ష మగుటవలన, ఏది గంధవత్తో యది తదితరములకంటె భిన్న మయిన దనుచో నన్వయదృష్టాంతము లేదు.

రఱ. – (అగ్ని నూహించుటకు) ధూమవత్త్వము హేతు వయినప్పుడు పర్వతమువలె సందిగ్ధసాధ్యవంతము పక్షము, అందు (అదృష్టాంతమునందు) మహానసమువలె నిశ్చితసాధ్యవంతము సపక్షము; అందు మహాహ్రదమువలె నిశ్చితసాధ్యభావవంతము విపక్షము.

రఙ. – సవ్యభిచారము, విరుద్ధము, సత్ప్రతిపక్షము, అసిద్ధము, బాధితము, అని హేత్వాభాసము లయిదు. ఏకాంతికము (ఒకేయూహ గలది) కానిది సవ్యభిచారము. అది సాధారణము, అసాధారణము, అనుపసంహారి, అనే భేదమువలన త్రివిధము. అందు, సాధ్యాభావ సద్వృత్తి (సాధింపఁ దగినది లేకుండుట) సాధారణము; ఎట్లనఁగా, 'ప్రమేయత్వమువలన పర్వతమువహ్నిమంతము' అనుచో ప్రమేయత్వమువహ్న్యభావమును గలదియైనహ్రాదమునందును గలదు (గాన సాధారణము). సర్వసపక్షవిపక్షవ్యావృత్తము (సపక్షమునకును విపక్షమునకును చెందనిది) అసాధారణము; ఎట్లనఁగా, 'శబ్దత్వమువలన

శబ్దము నిత్యము' అను-చో నమస్తనిత్యములయందును, అనిత్యముల యందును వ్యావృత్త మయిన (ఉండని) శబ్దత్వము శబ్దమునందు మాత్రమే యుండునది (గాన నసాధారణము). అన్వయవ్యతిరేక దృష్టాంతరహితము (అన్వయదృష్టాంతముగాని వ్యతిరేకదృష్టాంత మునుగాని లేనిది) అనుపసంహారి ; ఎట్లనఁగా, 'ప్రమేయత్వము వలన సర్వమును ననిత్యము' అను-చో సర్వమునకును పక్షత్వము కలుగుటవలన దృష్టాంతమే లేదు (గాన ననుపసహారి). సాధ్యాభావ (సాధింపఁ దగినదానిలేమి) వ్యాప్య మయినహేతువు విరుద్ధము ; ఎట్లనఁగా, 'కృతకత్వమువలన శబ్దమునిత్యము' అను-చోకృతకత్వమే (చేయబడుటయే) నిత్యత్వాభావ మగుటచేత ననిత్యత్వమునందు వ్యాప్త మగును. సాధ్యాభావసాధక మయినహేత్వంతర మెచ్చటఁ గలదో యది సత్ప్రతిపక్షము ; ఎట్లనఁగా, 'శ్రవణసంబంధిత్వమువలన శబ్దము నిత్యము' అను-చో 'కార్యత్వమువలన ఘటమువలె శబ్ద మనిత్యము' (అనవచ్చును). ఆశ్రయాసిద్ధము, స్వరూపాసిద్ధము, వ్యాప్యత్వాసిద్ధము, అని యసిద్ధము త్రివిధము. 'అరవిందత్వమువలన సరోజారవిందమువలెనే గగనారవిందము - పరిమళము గలది' అను-చో నాశ్రయాసిద్ధము. ఇచట గగనారవింద మాశ్రయము ; అది లేనేలేదు. 'చాక్షుషత్వమువలన శబ్దము గుణము' అను-చో స్వరూపాసిద్ధము. ఇచట శబ్దమునకు శ్రావణత్వము (కర్ణగోచరత్వము) కలుగుటవలన శబ్దమునందు చాక్షుషత్వము (నేత్రగోచరత్వము) లేదు. సోపాధిక (ఉపాధిని గలది) మైన హేతువు వ్యాప్యత్వాసిద్ధము; సాధ్యవ్యాపకత్వ ముండఁగా సాధనవ్యాపకత్వము లేకుండుట యుపాధి. సాధ్యసమా నాధికరణాత్యంతాభావ ప్రతియోగిత్వము (సాధింపఁ దగినదానితో సమాన మయిన యాశ్రయము గల యత్యంతాభావమునకు విరోధి

కాకుండుట) సాధ్యవ్యాపకత్వము, సాధనవన్నిస్థాత్యంతా భావప్రతి
యోగిత్వము (సాధనవత్తునం దున్నయత్యంతాభావమునకు విరోధి
యగుట) సాధనవ్యాపకత్వము. వహ్నిమత్త్వముచలన పర్వతము ధూమ
వంతమను-చోట వచ్చికట్టల సంయోగ ముపాధి; ఎక్కడ ధూమ
ముండునో యక్కడ నార్ద్రేంధన (వచ్చికట్టల) సంయోగమనుట
సాధ్యవ్యాపకత్వము; అయోగోళము (ఇనుపగుండు) నం దార్ద్రేంధన
సంయోగము లేమించేసి యెక్కడ వహ్నియుండునో యక్కడనార్ద్రేం
ధనసంయోగ ముపాధి; సోపాధికత్వము వలన వహ్నిమత్వము వ్యాప్య
త్వాసిద్ధము. దేనికి సాధ్యాభావము ప్రమాణాంతరముచేత నిశ్చితి
మగునో యది బాధితము; ద్రవ్యత్వముచలన వహ్ని యనుష్ణమను-చో
అనుష్ణత్వము (చల్లదనము) సాధ్యము (సాధింపఁదగినది); తదభావ
మయిన యుష్ణత్వము (త్వక్) స్పర్శనప్రత్యక్షముచేత గ్రహింపఁ
బడును గనుక బాధిత మయినది.

౪౭. — ఉపమితికరణ ముపమానము. సంజ్ఞా (పేరు) సంజ్ఞి
(పేరుగలది) సంబంధజ్ఞాన ముపమితి; సాదృశ్యజ్ఞానము దానికరణము.
అతిదేశ* వాక్యార్థముయొక్కస్మరణ మవాంతరవ్యాపారము. ఎట్లు
నఁగా, ఒకఁడు గవయశబ్దార్థ మెఱుఁగనివాఁ డయి, ఒకానొక యార
ణ్యక పురుషునివలన గవయమృగము గోవువలె నుండుననివిని, వనము
నకుఁబోయి వాక్యార్థమును స్మరించుకొని, గోసదృశ మయినరూపమును
జూచుచున్నాఁడు; అటుతరువాత నిదిగవయశబ్దవాచ్యమయినదని యుప
మితి పుట్టుచున్నది.

---

* ఒకచోటఁ జెప్పఁబడినదానిని సామ్యమునుబట్టి మఱియొకచోట నుపయోగ
పఱుచుట యతిదేశము.

౪౯. – ఆప్తవాక్యము శబ్దము. యథార్థవక్త యాప్తుఁడు. పద సమూహము వాక్యము :— "గోవును తెమ్ము" శక్తికలది పదము; ఈ పదమువలన నీయర్థము బోధింపఁదగిన దనియెడి యీశ్వరసంకేతము శక్తి.

౯౦. – ఆకాంక్ష, యోగ్యత, సన్నిధి, ఇవి వాక్యార్థజ్ఞాన హేతువులు. పదమునకు పదాంతరవ్యతిరేక ప్రయుక్తాన్వయానను భావకత్వము (పదాంతరములేక యుద్దేశింపఁబడిన యర్థము నిచ్ఛశక్తి లేకుండుట) ఆకాంక్ష; అర్థాబాధము. యోగ్యత; పదముల నవిలంబ నముగా (జాగులేకుండ) నుచ్చరించుట సన్నిధి.

౯౧. – ఆకాంక్షాదిరహిత మయినవాక్యము ప్రమాణము కాదు. ఆకాంక్ష లేకపోవుటవలన, "గోవు, అశ్వము, పురుషుఁడు, హస్తి" అనువాక్యము ప్రమాణము కాదు; యోగ్యతలేకపోవుటవలన, "అగ్ని చేత తడువుచున్నాఁడు" అనువాక్యము ప్రమాణము కాదు; సాన్నిధ్యాభావమువలన, జాముల కొకసారి "గోవును—తెమ్ము" అను సహోచ్చరితములు కానిపదములు ప్రమాణము కాదు.

౯౨. – వైదికము, లౌకికము, అని వాక్యము ద్వివిధము. ఈశ్వరోక్తమువలన వైదికము సర్వమును ప్రమాణము; లౌకిక మైన యాప్తవాక్యము ప్రమాణము; ఇతర మప్రమాణము.

౯౩. – వాక్యార్థజ్ఞానము శాబ్దజ్ఞానము: తత్కరణము శబ్దము.

౯౪. – సంశయము, విపర్యయము, తర్కము, అను భేదము వలన, అయథార్థానుభవము త్రివిధము. ఒకధర్మ్మియందు విరుద్ధ నానాధర్మ్మవైశిష్ట్యజ్ఞానము సంశయము :— (ఒకవస్తువును జూచి) స్థాణువుకాని పురుషుఁడుకాని (అనుకొనుట). మిథ్యాజ్ఞానము విపర్యయము :— శుక్తిని (ముత్యపుచిప్పను) జూచి రజితము (వెండి) అను

కొనుట. వ్యాప్యారోపముచేత వ్యాపకారోపము తర్కము:— వహ్ని లేకపోయెనేని, అప్పుడు ధూమమును లేకపోవును (అనుకొనుట).

౫౫. — యథార్థము, అయథార్థము, అని స్మృతియు ద్వివిధము. ప్రమాజన్యమయినది యథార్థము; అప్రమాజన్య మయథార్థము.

౫౬. — అందఱిచేత ననుకూలముగాఁ దెలిసికోఁదగినదిసుఖము.

౫౭. — ప్రతికూలముగాఁ దెలిసికోఁదగినది దుఃఖము.

౫౮. — కామ మిచ్ఛ.

౫౯. — ద్వేషము క్రోధము.

౬౦. — కృతి ప్రయత్నము.

౬౧. — విహితకర్మజన్యము ధర్మము.

౬౨. — నిషిద్ధకర్మజన్య మధర్మము.

౬౩. — బుద్ధ్యాదు లెనిమిదియు (బుద్ధి, సుఖము, దుఃఖము, ఇచ్ఛ, క్రోధము, ప్రయత్నము, ధర్మము, అధర్మము) ఆత్మమాత్ర విశేషగుణములు.

౬౪. — బుద్ధీచ్ఛాప్రయత్నములు నిత్యములు, అనిత్యములు, అని ద్వివిధములు. ఈశ్వరునివి నిత్యములు; జీవునివి యనిత్యములు.

౬౫: — వేగము, భావన, స్థితిస్థాపకము, అని సంస్కారము త్రివిధము. వేగము పృథివ్యాది చతుష్టయమునందును (పృథివి, జలము, తేజము, వాయువు,) మనస్సునందును, ఉండును. అనుభవ జన్యయు స్మృతిహేతువు నయినభావన యాత్మయందు మాత్ర ముండును. మఱియొకవిధముగాఁ జేయఁబడినవానికి మరల తదవస్థా పాదకము స్థితిస్థాపకము — ఇది చాపలు మొదలయిన పృథివీమాత్ర మునం దుండును.

౬౫. – చలనాత్మక మయినదికర్మము. ఊర్ధ్వదేశసంయోగ హేతు వుత్క్షేపణము; అధోదేశసంయోగ హేతు వవక్షేపణము; శరీర సన్నికృష్టసంయోగ హేతు వాకుంచనము; విప్రకృష్టసంయోగ హేతువు ప్రసారణము; అన్యముసర్వమునుగమనము. ఇది (చలనము) పృథివ్యాది చతుష్టయమునందును మనస్సునందునుమాత్ర ముండును.

౬౬. – నిత్య మయి యేక మయి యనేకములయం దుండు నది సామాన్యము. అది, ద్రవ్య, గుణ, కర్మలయం దుండును. అది పరము, అపరము, అను భేదములవలన ద్వివిధము. పరము సత్త; అపరము జాతిద్రవ్యత్వాది.

౬౭. – నిత్య ద్రవ్యములయం దుండు వ్యావర్తకములు విశేష ములు.

౬౮. – నిత్యసంబంధము సమవాయము. అది యయుతసిద్ధ ములయం దుండును; ఏరెంటిలో నొకటి రెండవదాని నాశ్రయిం చియే యుండునో యవి యయుతసిద్ధములు; ఎట్లనఁగా — అవయవావ యవులు, గుణగుణులు, క్రియాక్రియావంతులు, జాతివ్యక్తులు, విశేష నిత్యద్రవ్యములు, మొదలయినవి.

౬౯. – అనాదియు సాంతము నైనది ప్రాగభావము — ఉత్పత్తికంటెఁ బూర్వము కార్యమున కిది యుండును. సాదియు ననం తము నైనది ప్రధ్వంసాభావము — ఉత్పత్తికంటె ననంతరము కార్య మున కిది యుండును. త్రైకాలికసంసర్గాభావ మత్యంతాభావము — ఎట్లనఁగా భూతలమునందు ఘటము లేదు. తాదాత్మ్యసంబంధావచ్ఛి న్నప్రతియోగికము (తాదాత్మ్యసంబంధముచే వేఱుపఱుపఁబడిన విరో

ధముకలది) అన్యోన్యా భావము:— ఎట్లనగా, ఘటము పటము కాదు.

౭౦. — సమస్త పదార్థములును వయిని కెప్పఁబడినవానిలోనే చేరియుండుటవలన పదార్థము లేడే యని సిద్ధ మయినది.

క. అన్నంభట్ట కృతంబయి
సన్నుతి గన్నట్టితర్కసంగ్రహమును దీ
ని న్నెటి బాలురకొఱకున్
గ్రన్నన వీ రేశలింగకవి తెనిఁగించెన్.

370

అలంకారసంగ్రహము

3/3

పీఠిక

...o0o...

ఈపుస్తకము 1887వ సంవత్సరమునందు రాజమహేంద్ర వరమునందలి రాజకీయశాస్త్రపాఠశాలలోని పట్టపరీక్షతరగతి విద్యార్థులకొఱకు రచియింపఁబడినది. అప్పటికి తెలుఁగుభాషలో వచనరూపమున రచియింపఁబడిన యలంకారగ్రంథములు లేవు. దీనిని వృద్ధిపఱిచి పూర్వకవివిరచితము లైనప్రౌఢకావ్యములనుండి లక్ష్యములను జేర్చి ప్రచురింపవలెనని యింతకాలము ముద్రింపింపక నిలిపియుంచితినిగాని నావ్రాఁతప్రతి శిథిలము కా నారంభించినందున నిప్పుడు మార్పులు చేయుక యున్నదియున్నట్టుగా సచ్ఛాత్తింపవలసినవాఁడ నయితిని. ఉపకారవేతనము నొందినతరువాత నొక గొప్పలక్షణగ్రంథమును వ్రాయఁ దలఁచి యున్నాఁడను గాన నప్పు డందు దీనిని జేర్చి పెంపు చెందించెదను.

1–6–03.

కం. వీ.

శ్రీ

అలంకార సంగ్రహము.

అర్థాలంకారములు.

౧. ఉపమాలంకారము — ఉపమానమునకును*, ఉపమేయమునకును*, రసికజనహృదయాహ్లాదకరమయి మనోహరమైనసాదృశ్యమును వ్యంగ్యరీతినిగాక స్పష్టముగాఁ జెప్పినపక్షమున, ఉపమాలంకారమగును. అది పూర్ణోపమయనియు, లుప్తోపమయనియు, రెండువిధములు గలది. ఉపమానము, ఉపమేయము, సాధారణధర్మము, ఉపమావాచకము, ఈనాలిగింటిని గలిగియున్నచో పూర్ణోపమ:— ఆమె ముఖము చంద్రునివలె నందముగ నున్నది. ఈనాలిగింటిలో నొకటి రెండుమూడు లోపించిన లుప్తోపమ:— ఆమెముఖము చంద్రునివలె నున్నది. పోల్చుటకయి గ్రహించెడు గుణాధిక్యము గల చంద్రాదిక ముపమానము, వర్ణింపఁదగినదై న్యూనగుణము గల ముఖాదిక ముపమేయము; ఉపమానోపమేయములకు రెంటికిని సామాన్యమయిన అందము మొదలగునది సాధారణధర్మము; పోలికను దెలుపు వలె మొదలగునది యుపమావాచకము. పయివాక్యములలో, మొదటి దానియందు చంద్రుఁడనునుపమానమును ముఖ మనునుపమేయమును, అంద మనుసాధారణధర్మమును, వలె ననునుపమావాచక

---

* ఉపమేయము వర్ణ్యము, ప్రస్తుతము, ప్రకృతము, విషయము, అనునామములతోను; ఉపమానము అవర్ణ్యము, అప్రస్తుతము, అప్రకృతము, విషయి, అనునామములతోను; వ్యవహరింపఁ బడుటయుఁ గలదు.

మును, ఉండుటచేత అది పూర్ణోపమ యనియు, రెండవదానియందు అందమను సాధారణధర్మము లేకుండుటచేత అది లుప్తోపమ యనియు, గ్రహింపవలెను. వాచకలుప్త, ధర్మలుప్త, ధర్మవాచకలుప్త, వాచకోపమేయలుప్త, ఉపమానలుప్త, వాచకోపమానలుప్త, ధర్మోపమానలుప్త, ధర్మోపమానవాచకలుప్త, అని లుప్తోపమ యెనిమిదివిధములు గల దని పెద్దలు చెప్పుదురు.

౭. అనన్వయాలంకారము — ఒకవస్తువునే యుపమానముగాను, ఉపమేయముగాను కూడ చెప్పినచో అనన్వయము:— శోభయందామెముఖమున కామెముఖమే సమానము. ఇక్కడ వర్ణ్యమైన ముఖమే యుపమానముగాను ఉపమేయముగాను చెప్పబడుటచేత అనన్వయ మయినది. ఆమెముఖము సాటి లేని దని తాత్పర్యము.

3. ఉపమేయోపమాలంకారము — రెండువస్తువులలో నొక దాని నుపమేయముగాను మఱియొకదాని నుపమానముగాను జెప్పి, మరల వానినే మార్చి యుపమానము నుపమేయముగాను ఉపమేయము నుపమానముగాను చెప్పినచో ఉపమేయోపమ; ఆమె ముఖమునకు చంద్రుఁడు సాటి, చంద్రున కామెముఖము సాటి. ఇక్కడ ముఖము నుపమేయముగాను చంద్రుని నుపమానముగాను మొదట చెప్పి, వానినే మరల మార్చి యుపమేయముగాఁ జెప్పిన ముఖము నుపమానముగాను ఉపమానముగాఁ జెప్పిన చంద్రుని నుపమేయముగాను రెండవసారి చెప్పుటచే నుపమేయోపమ యయినది.

౪. ప్రతీపాలంకారము – (క) ప్రసిద్ధోపమానమున కుపమేయత్వము కల్పించినను, (చ) ఉపమానము లభించుటచే నుపమేయమును తిరస్కరించినను, (ట) ఉపమేయప్రాశస్త్యమునుబట్టి యుపమానమును తిరస్కరించినను, (త) ఉపమానమువలని ప్రయోజన

ముపమేయము వలననే కలుగుటచేత నుపమానముతో పనిలేదని చెప్పి నను, (ప) ఉపమేయమున కుపమానము సాటి కాదన్ననను, ప్రతీపము.

(ఠ) ప్రసిద్ధోపమానమున కుపమేయత్వము కల్పించుట :- ఆమె ముఖముతో చంద్రుఁడు సమానుఁడు. ఇచట ముఖము చంద్రునితో సమాన మనుటకు మాఱుగా ప్రసిద్ధోపమాన మయిన చంద్రునే యుపమేయము చేసి చంద్రుఁడే ముఖముతో సమానముగా నున్నాఁడని చెప్పుటచే మొదటి ప్రతీప మయినది.

(చ) ఉపమానము లభించుటచే నుపమేయమును తిరస్కరించుట :— ఓముఖమా! గర్వపడకుము. నీతో సమానుఁడు చంద్రుఁడున్నాఁడు. ఇక్కడ నుపమాన మయినచంద్రుఁడు లభించుటచేత నుపమేయ మగుముఖము తిరస్కరింపఁ బడినది గనుక రెండవ ప్రతీప మయినది.

(ట) ఉపమేయప్రాశస్త్యమును బట్టి యుపమానమును తిరస్కరించుట :— ఓచంద్రుడా! నేనె కాంతిమంతుఁడ నని యేల గర్వపడెదవు? నిన్ను మించిన దామె ముఖ మున్నది. ఇక్కడ నుపమేయ మయినముఖముయొక్క యుత్కృష్టతను బట్టి యుపమాన మయిన చంద్రుఁడు తిరస్కరింపఁబడినందున మూడవప్రతీప మయినది.

(ఠ) ఉపమానమువలన ప్రయోజన ముపమేయమువలననే కలుగుటచేత నుపమానముతో పని లేదని చెప్పుట :- ఓరమణీ! నీ ముఖదర్శన మగుచుండగా చంద్రుఁ డేల యుదయింపఁ వలెను? ఇక్కడ నుపమాన మయినచంద్రుని యుదయము వలని ఫల ముపమేయ మయినముఖముయొక్క దర్శనముచేతనే కలుగుచుండుటచేత నుపమాన మయిన చంద్రునితో పని లేదని చెప్పఁబడినందున నాలవ ప్రతీప మయినది.

(ప) ఉపమేయమున కుపమానము సాటి కా దనుట :—
ఓ కాంతా! తెలియనివారు నీ ముఖముతో చంద్రుఁడు సాటి వచ్చు
నని చెప్పుట యసత్యమే సుమా. ఇక్కడ నుపమేయమైనముఖముతో
నుపమాన మగుచంద్రుఁడు సాఁటి కాఁ డని చెప్పఁబడినందున నయి
దవప్రతీప మయినది.

౫. రూపాకాలంకారము-ఉపమేయమునందు హృదయరంజక
ముగా నుపమానముయొక్కరూపము నారోపించినయెడల రూప
కము :— ముఖచంద్రుఁడు మందహాసచంద్రికలను గాయు చున్నాఁడు.
ఇక్కడ నుపమేయము లగుముఖమందహాసములయందు వరుసగా
ఉపమానము లగుచంద్రచంద్రికారూపము లారోపింపఁబడినవి గనుక
రూపక మయినది. అభేదరూపకము, తాద్రూప్యరూపకము, అని
రూపకము రెండువిధములు కలది. ఉపమానోపమేయములకు భేదము
లేనట్లు చెప్పినచో నభేదరూపకము; ఈరాజు పురసంహారకుఁ డగు
నీశ్వరుఁడు. ఇక్కడ నుపమేయ మైనరాజే యుపమాన మయిన
యీశ్వరుఁ డైనట్లు చెప్పఁబడుటచే నభేదరూపకము. ఉపమానోప
మేయములకు భేద మగుపడుచున్నను, ఉపమానరూపముచేత నుపమే
యమునకు రంజనము కలిగించినచో తాద్రూప్యరూపకము. ఈరాజు
పురసంహారకుఁ డగురెండవయీశ్వరుఁడు. ఇక్కడ నుపమేయ మగు
రాజునకును నుపమాన మగుసీశ్వరునకును భేదము చెప్పినను, ఈశ్వర
రూపముచే రాజునకు రంజనము కలుగఁజేసినందున తాద్రూప్య
రూపకము. న్యూన, అధిక, అనుభయభేదములచే వరుసగా అభేద
తాద్రూప్యరూపకములు మరల మూడేసివిధములుగా భాగింపఁ
బడినవి.

(య) న్యూనాభేదరూపక ము - అభేదరూపకమునం దుపమా నముకంటె నుపమేయమునందు న్యూనత చెప్పినచో న్యూనాభేద రూపకము:— ఈరాజు మూడవకన్ను లేనియీశ్వరుఁడు. ఇక్కడ నుపమాన మగునీశ్వరున కున్నమూడవకన్ను లేదని యుపమేయ మగురాజునందు న్యూనత్వము చెప్పఁబడుటచే న్యూనాభేదరూపకము.

(ర) అధికాభేదరూపకము - అభేదరూపకమునం దుపమానము కంటె నుపమేయమునం దధికత చెప్పినచో నధికాభేదరూపకము:— ఈరాజు నిండు పౌరుషము గలయీశ్వరుఁడు. ఇక్కడ నుపమాన మగు నీశ్వరునికి లేని నిండుపౌరుషము కలదని యుపమేయ మగురాజునం దధికత్వము చెప్పబడుటచేత నధికాభేదరూపకము. (వామార్ధము పార్వతి గనుక నర్ధనారీత్వముచే శివునకు నిండుపౌరుషము లేదని తాత్పర్యము).

(ల) అనుభయాభేదరూపకము - అభేదరూపకమునం దుపమా నముకంటె నుపమేయమునందు న్యూనత్వాధికత్వములను జెప్పక యుపమానముతోడ సమత్వమును జెప్పినచో ననుభయాభేదరూప కము:— ఈరాజు పురసంహారకుఁ డగునీశ్వరుఁడు. ఇక్కడ నుపమాన మగునీశ్వరునికిని నుపమేయ మగురాజునకును పురసంహారకత్వము సామాన్యముగాఁ జెప్పుటచే ననుభయాభేదరూపకము.

(శ) న్యూనతాద్రూప్యరూపకము - తాద్రూప్యరూపకమునం దుపమానముకంటె నుపమేయమునందు న్యూనతను జెప్పినచో న్యూన తాద్రూప్యరూపకము:— ఈరాజపరమేశ్వరుఁడు మూడవకన్ను లేక ప్రకాశించు చున్నాఁడు. ఇక్కడ నుపమాన మగుపరమేశ్వరున కున్న మూడవకన్ను లేదని యుపమేయ మగురాజునందు న్యూనత చెప్పు టచే న్యూనతాద్రూప్యరూపకము.

(ష) అధికతాద్రూప్యరూపకము - తాద్రూప్యరూపకమునం దుపమానముకంటె నుపమేయమునం దధికతను జెప్పినచో నధిక తాద్రూప్యరూపకము:— ఈరాజపరమేశ్వరుఁడు నిండు పౌరుషము కలిగి వెలయు చున్నాఁడు. ఇక్కడ నుపమాన మగుపరమేశ్వరునికి లేనినిండుపౌరుషము కలదని యుపమేయ మగురాజునం దధికత్వము చెప్పఁబడుటచే నధిక తాద్రూప్యరూపకము.

(స) అనుభయతాద్రూప్యరూపకము - తాద్రూప్యరూపకము నం దుపమానోపమేయములకు న్యూనత్వాధికత్వములను జెప్పక సమ త్వమును జెప్పినచో ననుభయతాద్రూప్యరూపకము:— ఈరాజు వర నంహారకుఁ డగురెండవయీశ్వరుఁడు. ఇక్కడ నుపమాన మగునీశ్వ రునికిని నుపమేయ మగురాజునకును వురసంహారకత్వము సామాన్య ముగాఁ జెప్పుటచేత ననుభయతాద్రూప్యరూపకము.

౬. పరిణామాలంకారము — ఉపమేయైక్యముచేత నుపమా నమే ప్రకృతకార్యోపయుక్తమైనదనిచెప్పినచో పరిణామ మగును:— ఆమె వికాసము నొందిన నేత్రపద్మములతో వల్లభుని జూచెను. ఇక్కడ పద్మ మనెడియుపమానము నేత్ర మనెడియుపమేయముతోఁ జేరి కన్నులు చేయవలసిన ప్రకృతమైన వీక్షణకార్యమును పద్మములే చేసి నట్లు చెప్పబడినందున పరిణామమయినది.

౭. ఉల్లేఖాలంకారము—వివిధధర్మములు కలుగుటనుబట్టి యొకపదార్థమును పలువురు పలువిధములుగాఁ దలఁచినను, ఒకఁడే యనేకవిధములుగాఁ దలఁచినను, ఉల్లేఖము:—ఆరాజును స్త్రీలు మన్మథునిగాను, యాచకులు కల్పవృక్షముగాను, శత్రువులు యమని గాను, తలఁచుచున్నారు; దానమునఁ గర్ణునిగాను, కీర్తిని నర్జునుని గాను, బుద్ధిని బృహస్పతినిగాను, నేను భావించెదను. ఇందు మొదటి

వాక్యమున సౌందర్యము, త్యాగము, వీరత్వము, అనుగుణములను బట్టి రాజనెడి యొక్కపదార్థమునె స్త్రీలు, యాచకులు, శత్రువులు, అను పలువురు పలువిధములుగాఁ దలఁచుటచేతను, రెండవవాక్యమున నేనొక్కఁడనే యారాజును దాన, కీర్తి, బుద్ధులనుబట్టి పలువిధములుగాఁ దలఁచుటచేతను, ఉల్లేఖ మయినది.

౯. స్మృతిమదలంకారము :— ఉపమానోపమేయములలో నొకదానిని జూచినప్పుడు సాదృశ్యముచేత మఱియొకటి స్మరణకు వచ్చినయెడల స్మృతిమంతము:—చంద్రబింబమును జూచినప్పు డొల్లనాకామెముఖము స్మరణకు వచ్చుచున్నది. ఇక్కడ నుపమాన మగు చంద్రబింబమును జూచినప్పుడు సాదృశ్యమునుబట్టి యుపమేయ మగుముఖము తలఁపునకు వచ్చినట్లు చెప్పఁబడినందున స్మృతిమంత మయినది.

౯. భ్రాంతిమదలంకారము:— ఒకవస్తువును జూచినప్పుడు సాదృశ్యమునుబట్టి యది మఱియొకవస్తువుగా భ్రమ కలిగెనేని భ్రాంతిమంతము:—తుమ్మెద లామెముఖము పద్మ మనుకొని వ్రాలఁ బోవుచున్నవి. ఇక్కడ నుపమేయ మైన ముఖమును జూచి తత్సదృశ మైన పద్మ మని భ్రాంతి పడినట్లు చెప్పఁబడినందున భ్రాంతిమంత మయినది.

౧౦. సందేహాలంకారము:— ఒకవస్తువును జూచినప్పుడు సామాన్యధర్మమును బట్టి యది రెండుమూఁడు వస్తువులలో నదియో నిదియో యని సంశయము కలిగినచో సందేహము:— అతడు వసంతుఁడో కంతుఁడో! ఇక్కడ నొక పురుషుని జూచినప్పు డుభయ సామాన్య మయిన సౌందర్యమును బట్టి వసంతుఁడో కంతుఁడో యని సంశయము కలిగినందున సందేహ మయినది.

౧౧. అపహ్నుత్యలంకారము:— శుద్ధాపహ్నుతి, హేత్వపహ్నుతి, పర్యస్తాపహ్నుతి, భ్రాంతాపహ్నుతి, ఛేకాపహ్నుతి, కైతవాపహ్నుతి, అని యపహ్నుతి యాఱు విధములు గలది.

(౧). శుద్ధాపహ్నుతి:—వర్ణ్యమునం దితరవస్తుధర్మము నారోపించుట కయి యుపమేయముయొక్క ధర్మమును మఱుఁగుపఱచి నచో శుద్ధాపహ్నుతి:—ఆ ప్రకాశించునది చంద్రబింబము గాదు; ఆకాశగంగలోని సువర్ణకమలము ఇక్కడ నుపమేయ మయిన చంద్ర బింబమునం దుపచూన మయిన యాకాశగంగాకమలత్వము నారోపించుటకయి చంద్రబింబము కాదని వర్ణ్యము మఱుఁగుపఱుఁపఁబడి నందున శుద్ధాపహ్నుతి.

(౨) హేత్వపహ్నుతి:—అన్యముయొక్క ధర్మము నారోపించుటకయి వర్ణ్యముయొక్క ధర్మమును హేతుపూర్వకముగా మాటు పఱిచినచో హేత్వపహ్నుతి:—వేఁడి చూపుచున్నది గాన నిది చంద్ర బింబము కాదు; రాత్రి ప్రకాశించుచున్నది గాన నూర్యబింబమును గాము; విరహిణులను బాధించుటకయి సముద్రమునందు పుట్టిన బడబానలము. ఇక్కడ వర్ణ్యమయిన చంద్రబింబమునందు బడబానల ధర్మము నారోపించుటకయి వేఁడి చూపుట రాత్రి ప్రకాశించుట యను హేతువులు చూపఁబడి చంద్రత్వము మఱుఁగుపఱుపఁబడినందున హేత్వపహ్నుతి.

(3) పర్యస్తాపహ్నుతి:— ఉపమానమునం దుపమేయవస్తు ధర్మము నారోపించుటకయి యుపమానముయొక్క ధర్మమును మఱుఁగు పఱిచినచో పర్యస్తాపహ్నుతి:— ఆ కనఁబడునది చంద్ర బింబము గాదు కామినీముఖచంద్రబింబము. ఇక్కడ నవర్ణ్య మయిన చంద్రబింబమునం దుపమేయ మయిన కామినీముఖ ధర్మము నారో

పించుటకయి చంద్రబింబము.....కాదని యుపమానము మఱుఁగు పఱుపఁబడినందున పర్యస్తాపహ్నుతి.

(౪) భ్రాంతాపహ్నుతి :— అన్యునకు శంక కలిగినప్పుడు సత్యము చెప్పి భ్రాంతి నివారణముచేసినయెడల భ్రాంతాపహ్నుతి:— సఖీ! శరీరమునకు కంపమును తాపమును పుట్టించెడును. ఓ చెలీ! జ్వరమా యేమి! సఖీ! కాదుకాదు మన్మథుఁడు. ఇక్కడ నొక విరహిణి తనదేహమునకుఁ గంపమును దాపమును పుట్టించెడు నని చెప్పినప్పుడు చెలికత్తెకు శంక తోఁచి యట్లు కంపతాపములను పుట్టించెడు నది జ్వరమా యని యడుగఁగా మన్మథుఁ డని చెప్పి యాచెలి సందేహము నివారణము చేసినందున భ్రాంతాపహ్నుతి.

(౫) ఛేకాపహ్నుతి:— అన్యునకు శంక తోఁచినప్పుడు, నిజమును మఱుఁగు వెట్టి బొంకినచో ఛేకాపహ్నుతి:— ఓకాంతా! అంతట మొఱవెట్టుచు నాపాదమునఁ బడెను. ఓచెలీ! యెవరెవరు! నీకాంతుడా యేమి! ఓసఖీ! కాంతుఁడు కాఁడు. అందియ. ఇక్కడ నొక కాంత తనకాంతుని విషయమయి నర్మసఖితో మాటాడుచు మొఱపెట్టుచు పాదమునఁ బడి నని రహస్యముగా చెప్పుచుండఁగా మఱియొక చెలికత్తె విని కాంతుఁడా యని యడిగినప్పుడు సత్యమును దాఁచి యందియ యని బొంకినందున ఛేకాపహ్నుతి.

(౬) కైతవాపహ్నుతి:— కైతవము, ఛలము, వ్యాజము, మిష, నెపము మొదలయిన పదములచే సత్యము ను మాటుపెట్టిన యెడల కైతవాపహ్నుతి.— ఆకాంతయొక్క దృక్పాతము లనుమిష చేత మన్మథబాణములు వెడలుచున్నవి. ఇక్కడ మిషయును పదముచేత దృక్పాతము లను సత్యమును మఱుఁగు పఱిచినందున కైతవాపహ్నుతి.

౧౨. ఉత్ప్రేక్షాలంకారము :— అన్యధర్మసంబంధమును బట్టి యొకవస్తువుయొక్క ప్రసిద్ధగుణాదులకు విశేషతాత్పర్యము కల్పించుట యుత్ప్రేక్ష. అది వస్తూత్ప్రేక్షయనియు, హేతూత్ప్రేక్షయనియు, ఫలోత్ప్రేక్షయనియు మూడువిధములు గలది. ఉక్తవిషయ, అనుక్తవిషయ, అని వస్తూత్ప్రేక్ష రెండువిధములుగాను; సిద్ధవిషయ, అసిద్ధవిషయ, అని హేతుఫలోత్ప్రేక్షలు రెండేసివిధములుగాను; భాగింపఁబడి యున్నవి. వస్తూత్ప్రేక్షకుస్వరూపోత్ప్రేక్షయనియు నామముకలదు.

(౧) ఉక్తవిషయవస్తూత్ప్రేక్ష :— ఉపమానధర్మసంబంధము కలుగుటనుబట్టి యుపమేయమున కుపమాన తాదాత్మ్యము నూహించినచో వస్తూత్ప్రేక్ష. అందు విషయము చెప్పఁబడినచో నుక్తవిషయ :— ఈచీఁకటి చక్రవాకీవిరహాగ్ని జనితధూమ మని నేనెంచెదను. ఇక్కడ నుపమేయ మగుచీఁకటికి నలువు మొదలయినధర్మసంబంధము కలుగుటను బట్టి యుపమాన మగుపొగయొక్క తాదాత్మ్య మూహించఁబడినందున వస్తూత్ప్రేక్షయు, విషయ మగుచీఁకటి చెప్పఁబడినందున నుక్తవిషయయు, అయినది. తాదాత్మ్యమనఁగా నదే యిది యనుట.

(౨.) అనుక్తవిషయ వస్తూత్ప్రేక్ష :— వస్తూత్ప్రేక్షయందు విషయముచెప్పఁబడని పక్షమున, అనుక్తవిషయవస్తూత్ప్రేక్ష:— ఇప్పుడాకాశము నీలిమైపూఁత పూసికొన్న దేమో యని యూహించెదను. ఇక్కడ విషయమగుచీఁకటి చెప్పఁబడనందున, అనుక్తవిషయ.

(3.) సిద్ధవిషయ హేతూత్ప్రేక్ష:— హేతువుకానిదానిని హేతువునుగా నూహించినచో హేతూత్ప్రేక్ష. అందుఁ బ్రసిద్ధమైన విషయముకలిగినేని సిద్ధవిషయ యనఁ బడును:— ఓయింతీ! నీమృదుపాదములు కఠినమయిన భూమిమీఁద మోపుటవలన నెఱ్ఱపడిన వని నేను భ్రమఁ జెందను. ఇక్కడ స్త్రీపాదములయందలి సహజారుణకాంతికి భూమి

మోఁద మోపుట హేతువు కానిదే హేతువునుగా సంభావించుటచేత హేతూత్ప్రేక్షయు కఠినమయినభూమిమోఁద మోపినప్పుడు పాదము లెఱ్ఱపడుట ప్రసిద్ధము గనుక సిద్ధవిషయయు, అయినది.

(ర.) అసిద్ధవిషయ హేతూత్ప్రేక్ష — హేతూత్ప్రేక్ష యందు విషయ మప్రసిద్ధమగునేని, అసిద్ధవిషయ హేతూత్ప్రేక్ష-ఓకాంతా! నీముఖాభను జెందఁ గోరి చంద్రుఁడు పద్మములతో వైరము పూనె నని నేనూహించెదను. చంద్రునకుఁ బద్మములతోడి వైరమునకు ముఖాభనుజెందఁ గోరుట హేతువుకాకపోవుటచేత హేతూత్ప్రేక్షయు, చంద్రుఁడు ముఖాభనుజెందఁ గోరుట యప్రసిద్ధ మగుటచేత నసిద్ధ విషయయు, అయినది.

(శ.) సిద్ధవిషయ ఫలోత్ప్రేక్ష — ఫలము గానిదానిని ఫలము నుగా నూహించినచో ఫలోత్ప్రేక్ష. అందుఁ బ్రసిద్ధవిషయము కలిగె నేని, సిద్ధవిషయ యనఁబడును — స్తనభారమును భరించుటకో యన నామె నడుము బంగరు మొలనూలిచేఁ గట్టబడినది. నడుముయొక్కకుచ ధారణమునకు బంగరు మొలనూలు కట్టుట ఫలము కానిదే ఫలమని యుత్ప్రేక్షించుటచే ఫలోత్ప్రేక్షయు, నడుము స్తనభారమును వహిం చుట ప్రసిద్ధ మగుటచేత సిద్ధవిషయము, అయినది.

(ఱ). అసిద్ధవిషయఫలోత్ప్రేక్ష-ఫలోత్ప్రేక్షయందు విషయ మప్రసిద్ధ మగునేని, అసిద్ధ విషయ ఫలోత్ప్రేక్ష — పద్మము నీ చరణై క్యము పొందుటకో యన నీటిలో తపస్సు చేయుచున్నది. పద్మములు నీటియందుండుటకు చరణైక్యము పొందుట ఫలముకానిదే ఫలముగాఁ జెప్పఁబడినందున ఫలోత్ప్రేక్షయు, పద్మములు చరణైక్యము పొం దుట యప్రసిద్ధ మయినందున అసిద్ధవిషయయు, అయినది.

౧౩. అతిశయోక్త్యలంకారము — రూపకాతిశయోక్తి, భేద

కాతిశయోక్తి, సంబంధాతిశయోక్తి, అసంబంధాతిశయోక్తి, అక్రమాతిశయోక్తి, చపలాతిశయోక్తి, అత్యంతాతిశయోక్తి, అనియతిశయోక్తి యేడువిధములు గలది. అందు రూపకాతిశయోక్తి, శుద్ధ, సాపహ్నవ, అని మరల ద్వివిధము.

(౧.) శుద్ధరూపకాతిశయోక్తి — ఉపమేయమును తద్వాచక శబ్దముచేఁ జెప్పక యుపమాన రూపముచేత నిశ్చయించినచో శుద్ధ రూపకాతిశయోక్తి — నీలోత్పలద్వంద్వమునుండి తీక్ష్ణబాణము లెట్లు వెడలు చున్నవో చూడు. ఇక్కడ నుపమేయములగు నేత్రములను కటాక్షవీక్షణములను తద్వాచక పదములచేతఁ జెప్పక యుపమానము లగునీలోత్పలద్వంద్వతీక్ష్ణ బాణములచే నిశ్చయించుటచేత శుద్ధాతిశయోక్తి.

(౨.) సాపహ్నవ రూపకాతిశయోక్తి — రూపకాతిశయోక్తి యే యపహ్నవ సహితమైనచో సాపహ్నవ రూపకాతిశయోక్తి — ఓరాజా! నీమృదూక్తి యందలి సుధను మూర్ఖులు భ్రాంతు లయి చంద్రునియందు వర్ణింతురు. ఇక్కడ మృదూక్తి మాధుర్యమే యమృత మని యతిశయోక్తిని జెప్పి చంద్రునియందలి దమృతము కాదని దానిని మఱుఁగు పఱుచుటచే సాపహ్నవ రూపకాతిశయోక్తి యైనది.

(3) భేదకాతిశయోక్తి — లోకసాధారణమయిన దానిని భేద మయినదానినిగాఁ జెప్పినచో, భేదకాతిశయోక్తి — ఓరామా! నీధైర్యము వేఱు; ఇతర రాజులధైర్యము వేఱు. రామునిధైర్యమితర రాజులధైర్యమువంటిదే యయినను దానిని భిన్నమయినదానినిగాఁ జెప్పుటచేత భేదకాతిశయోక్తి యయినది.

(౪) సంబంధాతిశయోక్తి — సంబంధము లేనిదానికి సంబంధ

మున్నట్లు చెప్పినచో సంబంధాతిశయోక్తి:—ఆపురసౌధములు చంద్ర బింబమును స్పృశించుచున్నవి. సౌధములకును చంద్రబింబమునకును సంబంధ మేమియు లేకపోయినను మేడలు చంద్రబింబము నంటు చున్నవని సంబంధము కల్పించినందున సంబంధాతిశయోక్తి యయినది.

(౫) అసంబంధాతిశయోక్తి — సంబంధ మున్న దానికి సంబంధము లేనట్లు చెప్పినచో నసంబంధాతిశయోక్తి:—నీవు దాతవయి యుండగా మేఘముల నెవ్వరు నాదరింపకున్నారు. అందును మేఘ ముల నాదరించుసంబంధ మున్నను లేదని చెప్పినందున నసంబంధాతి శయోక్తి యయినది.

(౬) అక్రమాతిశయోక్తి — కారణకార్యము లొక్కమాఱే సంభవించినట్లు చెప్పినచో నక్రమాతిశయోక్తి:— నీశరమ్ములు వింటిని జేరుటయు శత్రుశిరమ్ములు మంటిని జేరుటయు నొక్కమాఱే కలుగు చున్నవి. ఇక్కడ ముందుగాఁ బుట్టిన కార్య మయిన బాణప్రయోగ మును వెనుకఁ బుట్టిన కార్య మయిన శిరఃపాతమును ఒక్కసారియే కలిగినట్లు చెప్పినందున నక్రమాతిశయోక్తి యయినది.

(౭) చపలాతిశయోక్తి — కారణమును బ్రసంగించినంతమాత్ర మునకే కార్యము కలిగినట్లు చెప్పినచో చపలాతిశయోక్తి:—భర్త గ్రామాంతరము పోయెదనని చెప్పగానే భార్య కుంగరములు కంక ణము లయ్యెను. భర్త గ్రామాంతరము పోకయే కారణ మయిన ప్రయాణముయొక్క నామోచ్చారణము చేయుటచేతనే భార్యయందుఁ గార్య మయిన కృశత్వ మనఁగా బ్రేళ్ళకు పెట్టుకోఁదగిన యుంగరములే చేతులకుఁ బట్టినంత చిక్కుట చెప్పఁబడినందున చపలాతిశయోక్తి యయినది.

(ఘ.) అత్యంతాతిశయోక్తి:— కారణము కంటె కార్యమే ముందుగా జరిగినట్లు చెప్పినచో నత్యంతాతిశయోక్తి. ఆయింతికి మొదటనే ప్రణయకోపము పోయెను; తరువాత భర్తవచ్చి బతిమాలెను. భర్తప్రార్థించుటయే తడవుగా కోపము పోయెనని చెప్పుటకు కార్యమయిన కోపశాంతియే ముందుగాఁ గలిగి కోపశాంతికిఁ గారణ మయిన బతిమాలుటయే తరువాత జరిగినట్లు చెప్పఁబడినందున నత్యంతాతిశయోక్తి యయినది.

౧౪. తుల్యయోగితాలంకారము— (ఁ) ప్రకృతములకుఁగాని, అప్రకృతములకుఁగాని, ఏకధర్మమును జెప్పినచో మొదటి తుల్యయోగిత. ప్రకృతుల్యయోగిత:—చంద్రుఁడుదయింపఁగానే పద్మములును జారిణుల ముఖపద్మములును ముడుచుకొని పోవుచున్నవి. చంద్రోదయసమయమునందు వర్ణింపఁదగిన ప్రకృతము లగు పద్మములకును జారిణుల ముఖములకును ముడుచుకొని పోవుట యను నేకధర్మము చెప్పఁబడినందున ప్రకృతతుల్యయోగిత యయినది. అప్రకృతతుల్యయోగిత:— ఆమె శరీరమార్దవమును జూడఁగా మాలతీకుసుమములందును రసాలపల్లవములందును కాఠిన్యముతోఁచుచున్నది. ప్రకృతమైనకామినీశరీరవర్ణనమునం దప్రకృతము లయినమాలతీపుష్పముల కును మామిడిచిగుళ్ళకును కఠినత్వ మనునేకధర్మము చెప్పఁబడినందున నప్రకృతతుల్యయోగిత యైనది.

(ఙ). హితాహితవస్తువులయం దేకక్రియను వర్ణించినచో రెండవతుల్యయోగిత:— ఆరాజు శత్రుగృహములయందును మిత్రగృహములయందును కాంచనవృద్ధియే కలిగించెను. ఇక్కడ సహితుల యిండ్లలోను హితులయిండ్లలోను కాంచనవృద్ధి యనెడి యేకక్రియయే

వర్ణింపఁబడినందున రెండవతుల్యయోగిత యైనది. కాంచన మనఁగా బంగారమును, ఉమ్మెత్తయును.

(3) ఉత్కృష్టగుణము గలపదార్థములతో వర్ణ్యమును సమపటించి యేకధర్మము చెప్పినచో మూడవతుల్యయోగిత :—ఓరాజా! ఇంద్రుఁడును కుబేరుడును నీవును లోకపాలురు. ఇక్కడ నుత్కృష్ట గుణము గల యింద్రకుబేరులకును వర్ణ్యుఁడైన రాజునకును జేర్చి లోకపాలత్వ మనెడి యేకధర్మము చెప్పఁబడినందున మూడవతుల్యయోగిత యైనది.

౧౫. దీపకాలంకారము — ప్రకృతములకును అప్రకృతముల కును నేకధర్మమును జెప్పినచో దీపకము:—ఓరాజా! తాపముచే సూర్యుఁడును ప్రతాపముచే నీవును దుర్నిరీక్ష్యులగుచున్నారు. ఇక్కడ వర్ణ్యమైన రాజునకును అవర్ణ్యమైన సూర్యునకును దుర్నిరీక్ష్యత యను నేకధర్మము చెప్పఁబడినందున దీపకమయినది.

౧౬. ఆవృత్తిదీపకాలంకారము — దీపమున కావృత్తి కలిగినచో నావృత్తిదీపకము. ఇది పదావృత్తి, అర్థావృత్తి, పదార్థావృత్తి, అని త్రివిధము.

(౧) పదావృత్తిదీపకము — వచ్చినపదమే మరల వచ్చినచో పదావృత్తిదీపకము కామినియు వలపు గొలుపు చున్నది; పూవులును వలపు గొలుపు చున్నవి. ఇక్కడ నర్థము వేఱైనను వలపుగొలు పను పదమే మరలఁ బ్రయోగింపఁబడినందున పదావృత్తి యయినది.

(౨) అర్థావృత్తిదీపకము — వచ్చినయర్థమే మరల వచ్చినచో నర్థావృత్తిదీపకము :— మల్లికలును పూచుచున్నవి; కదంబములును పుష్పించుచున్నవి. ఇక్కడ పూచు పుష్పించు పదములు భిన్నము

లయినను వానియర్థ మొక్కటియే యయి వచ్చినయర్థమే మరల వచ్చినందున నర్థావృత్తిదీపక మయినది.

(3) ఉభయావృత్తి (పదార్థావృత్తి) దీపకము — పదార్థముల రెంటిని గూడ నావృత్తిగలిగినచో పదార్థావృత్తి దీపకము :— వర్ష యోగము వలన నెమళ్ళును మోదించినవి; చాతకములును మోదించినవి. ఇక్కడ మోదించె ననుపదము రెండుమార్లు వచ్చుటయే కాక యర్థముకూడ వేఱు గాక రెండుచోట్లను సంతోషించె నని యొక్కటియే యయినందున నుభయావృత్తిదీపక మయినది.

౧౭. ప్రతివస్తూప మాలంకారము — ఒక సామాన్యధర్మమును రెండువాక్యములయందు భిన్నపదములచే జెప్పినచో ప్రతివస్తూపమ :— నూరుఁడు శాపముచేత రాజిల్లును ; శూరుఁడు చాపముచేత భ్రాజిల్లును. ఇక్కడ రెండు వాక్యములయందు నూరునకును శూరునకును ప్రకాశించుట యను సామాన్యధర్మము వరుసగా రాజిల్లు భ్రాజిల్లు ననుభిన్నపదములచేఁ జెప్పబడినందునఁ ప్రతివస్తూపము యయినది.

౧౮. దృష్టాంతాలంకారము — రెండు వాక్యములయందు భిన్నధర్మములను బింబప్రతిబింబభావముచేతఁ జెప్పినచో, దృష్టాంతము:— లోకములో నీవే కీర్తిమంతుఁడవు ; చంద్రుఁడే కాంతిమంతుఁడు. ఇక్కడ రెండువాక్యములయందు రాజునకును చంద్రునకును భిన్నధర్మము లయినకీర్తిమత్త్వమును కాంతిమత్త్వమును బింబప్రతిబింబభావముచేఁ జెప్పఁబడినందున దృష్టాంత మయినది. బింబప్రతిబింబభావ మనఁగా నుపమానోపమేయములయొక్క ధర్మములను వేఱువాక్యములయందు వేఱుగాఁ జెప్పినను వాని రెంటికిని పరస్పర సామ్యము గమ్యమయి యుండుట.

౯౯. నిదర్శనాలంకారము — వాక్యార్థవృత్తినిదర్శన, పదార్థ వృత్తినిదర్శన, పదసదర్థబోధనరూపనిదర్శన, అని నిదర్శన త్రివిధము.

(౧) వాక్యార్థవృత్తినిదర్శన—సదృశములయిన వాక్యార్థముల కైక్యము నారోపించినచో, వాక్యార్థవృత్తినిదర్శన:—దాతకు పారుష్యము లేకపోవుట చంద్రునకుఁ గళంకము లేకపోవుటయే. ఇక్కడ నుపమానోపమేయ ప్రాయము లయినసదృశ వాక్యములయందు దాత యొక్క పారుష్యాభావము చంద్రునికళంక రాహిత్యమే యని యైక్యము నారోపించుటచేత వాక్యార్థవృత్తినిదర్శన యైనది.

(౨) పదార్థవృత్తినిదర్శన — ఒకపదార్థమున కన్యధర్మము నారోపించి వర్ణించినచో పదార్థవృత్తినిదర్శన:— ఓకాంతా! నీనేత్ర యుగళము నీలాంబుజద్వయవిలాసమును ధరించినది. ఇక్కడ నేత్ర యుగళ మనుపదార్థమునకు నీలాబ్జములయందే యుండెడు నీలాబ్జ విలాస మనెడియన్యధర్మ మారోపింపఁబడినందున పదార్థవృత్తినిదర్శన యయినది.

(3) సదసదర్థబోధనరూపనిదర్శన — (క) ఒక రొక కార్యమును జేసి దృష్టాంతభూత మయిన యాకార్యముచే నితరుల కసదర్థమును బోధించినచో, అసదర్థబోధనరూపనిదర్శన:— రాజవిరోధి నశించు నని తెలుపుచుఁ జంద్రోదయమునఁ జీఁకటి నశించుచున్నది. ఇచ్చట రాజవిరోధముచేత నశించుచున్న చీఁకటి స్వనాశన మను కార్యముచే రాజవిరోధి తనవలెనే నశించు నని పరున కసదర్థమును బోధించునట్లు వర్ణింపఁబడినందున, అసదర్థబోధనరూపనిదర్శనయయినది. (చ) పయి యట్లే నదర్థమును బోధించినచో సదర్థబోధనరూపనిదర్శన:— సంపద లకు సుహృదనుగ్రహము ఫల మసిబోధించుచు నూర్యోదయం చుచునే పద్మములకు శ్రీ నిచ్చుచున్నాఁడు. ఇచ్చట కమలములకు

శోభ నిచ్చుచున్న సూర్యుఁడు స్వకార్యముచేఁ బద్మములకు సిరుల నిచ్చుచున్న తనవలెనే యభ్యుదయకాలమున సుహృదులకు సిరులు కలిగింపవలె నని యితరులకు సదర్థమును బోధించునట్లు వర్ణింపఁబడి నందున, సదర్థబోధనరూపనిదర్శన యయినది.

౨౦. వ్యతిరేకాలంకారము — ఉపమానోప మేయములకు సామాన్యమయిన ధర్మమును జెప్పక వ్యతిరేకముగా నుండు ధర్మమును జెప్పినచో వ్యతిరేకము :— సత్పురుషులు శైలములవలె మహోన్నతు లయినను ప్రకృతికోమలులు గదా. ఇక్కడ నుపమేయు మగుసత్పురు షులకు నుపమాన మగుపర్వతములందుఁ గలసామాన్యకాఠిన్యము, చెప్పఁబడక వ్యతిరేక మయిన కోమలత్వము చెప్పఁబడినందున వ్యతిరేక మయినది.

౨౧. సహోక్త్యలంకారము — హృదయరంజకముగా సహా ర్థకమును (తోడను) గూర్చి చెప్పినచో, సహోక్తి :— నీకీర్తి నీశత్రు వులతోడఁగూడ దిగంతముల కేగినది. ఇక్కడ పాతిపోయి దిగంతము లను జేరెడు శత్రువులతోఁ గూడఁ జేర్చి దిగంతములవఱకును వ్యాపిం చిన కీర్తిని చెప్పుటచేత సహోక్తి యయినది.

౨౨. వినోక్త్యలంకారము—వినోక్తి రమ్యాస్వరూపయనియు హేయస్వరూపయనియు, ద్వివిధము. (౧) ఒకవస్తువు లేకపోవుటచేత వర్ణ్యము రమ్య మగు నని వర్ణించినచో రమ్యాస్వరూప :— ఓరాజా! నీసభ దుష్టులులేక ప్రకాశించుచున్నది. ఇక్కడ దుష్టులను పదార్థము లేకపోవుటచేత వర్ణ్య మగుసభ రమ్యముగా నున్నదని వర్ణించుటచే రమ్యాస్వరూప యయినది. (౨) ఒకవస్తువు లేకపోవుటచేత వర్ణ్యము రమ్య మగు నని వర్ణించినచో హేయస్వరూప :— విద్యాహృద్యయయి నను విషయములేక ప్రకాశింపకున్నది. ఇక్కడ విషయ మనుపదార్థము

లేకపోవుటచేత వర్ణ్య మగు విద్య యుపమ్యముగా నున్నదని వర్ణించు టచే హేయుస్వరూప యయినది. వీనికి వరుసగా చారుతావినోక్తి, అచారుతావినోక్తి అని పేళ్ళు.

౨౩. సమాసోక్త్యలంకారము—ప్రస్తుతవృత్తాంతమును వర్ణించుచుండఁగా, అప్రస్తుతవృత్తాంతము స్ఫురించినయెడల సమాసోక్తి :— చంద్రుఁడు రక్తుఁడయి ప్రాచీముఖము నానుచున్నాఁడు. ఇక్కడ చంద్రుఁ డెఱ్ఱ నయి తూరుపుదిక్కు యొక్క యుగ్రమునందుఁ గానఁ బడుచున్నాఁడని ప్రస్తుతవృత్తాంతము వర్ణింపఁబడుచుండఁగా, చంద్రుఁ డని పుంలింగపద ముండుటచేతను ప్రాచీ యని స్త్రీలింగపద ముండుట చేతను రక్తుఁడు ముఖము ననుపదముల ననురాగము గలవాఁడు మోహము నని యర్థము లుండుటచేతను కామునకుఁడు కామినీముఖ మును చుంబించుచున్నా ఁడని యప్రస్తుతవృత్తాంతము స్ఫురించుట చేత సమాసోక్తి యయినది. సమాస మనఁగా సంక్షేపము. ప్రకృతా ప్రకృతవృత్తాంతములు సంక్షేపముగా నిందు చెప్పఁబడును గాన దీనికి సమాసోక్తి యని పేరువచ్చినది.

౨౪. పరికరాలంకారము:—సాభిప్రాయవిశేషము లున్నచో పరికరము:—శీతాంశుధరుఁ డైనహరుఁడునా తాపమును బోఁగొట్టును గాక! ఇక్కడ శీతాంశుధరుఁ డనువిశేషణము తాపనివారణసామ ర్థ్యాభిప్రాయగర్భితముగనుక పరికరాలంకార మయినది. ప్రకృతార్థము నకు విశేషతాత్పర్యమును గలిగించు విశేషణములు సాభిప్రాయవిశేష ణములు.

౨౫. పరికరాంకురాలంకారము—సాభిప్రాయ విశేష్యమున్నచో పరికరాంకురము:—చతుర్భుజుఁడు మీఁకు బురుషార్థచతుష్టయము నిచ్చును గాక! ఇక్కడఁ జతుర్భుజుఁ డను విశేష్యము చేత నాలుగు

చేతులు గల విష్ణువే నాలుగుపురుషార్థముల నీయ సమర్థుడని బోధించు చుండుటచేత బరికరాంకుర మయినది.

౨౬. శ్లేషాలంకారము—అనేకార్థములు గలుగునట్లు చెప్పి నచో శ్లేషము:—అది ప్రకృతశ్లేషమనియు, అప్రకృతశ్లేష మనియు, ప్రకృతాప్రకృతశ్లేష మనియు, త్రినిధము.

(౧) ప్రకృతశ్లేషము—అనేకార్థములు కేవలవర్ణ్యములయందే యిచ్చినచో బ్రకృతశ్లేషము:— శంకరుఁడు మాధవుండు మాకు విజయ మిచ్చుఁగాక! ఇక్కడ సుఖము నిచ్చువాఁడైన లక్ష్మీవల్లభుఁడైన శంకరుం డనియు, శంకరుఁడు మాధవుం డను పదముల కర్థ మయి కేవల ప్రకృతభూతు లయిన హరిహరులకు శ్లేషచే నర్థ మగుటవలన ప్రకృతశ్లేష మయినది. శివవరమున ఉమాధవుఁ డని పదవిభాగము.

(౨) అప్రకృతశ్లేషము—అనేకార్థములు కేవలావర్ణ్యముల యందే యిచ్చినచో నవకృతశ్లేషము:—ఓకాంతా! నీముఖము శంబర సంగతాబ్జతుల్య మయి యున్నది. ఇక్కడ శంబర సంగతాబ్జ మయిన ప్రకృతమునకే హరిణయుక్తుఁడయిన చంద్రుఁడనియు నీటిని పొందిన పద్మ మనియు రెండర్థములు కలిగియున్నందున నప్రకృతశ్లేష మయినది.

(3) ప్రకృతాప్రకృతశ్లేషము—ఒక యర్థము ప్రకృతపరము గాను మఱియొక్క యర్థ మప్రకృతపరముగాను నున్నచో ప్రకృతాప్రకృతశ్లేషము—పద్మాకర మూర్మికాకంకణాదులచే శోభిల్లుచున్నది. ఇక్కడ పద్మాకర మూర్మికాకాంకణాదు లనుదానికి కొలఁకు తరంగములచేతను జలబిందువులచేతను నని యైనప్పుడు ప్రకృతవర్ణ్యపరము గాను లక్ష్మియొక్క హస్త ముంగరములచేతను కడియములచేతను

వని యైనప్పు డప్రకృత మైన లక్ష్మీహాస్తపరిముగాను అర్థద్వయము కలిగినందున ప్రకృతాప్రకృత మైనది.

౨౭. అప్రస్తుతప్రశంసాలంకారము – ప్రస్తుతాంశము తోఁచునట్లుగా నప్రస్తుతాంశమును ప్రశంసించినచో నప్రస్తుతప్రశంస:— ఇంద్రునిఁదప్ప వేఱొకని యాఁచింపని యాచాతకపక్షియే వక్షులలో నెల్ల సుకృతి. ఇక్కడ నింద్రుని దక్క వేఱొక్కని చాతకపక్షి యాచింప దని యప్రస్తుతవిషయమును జెప్పుటవలన క్షుద్రులను యాచింపఁబోవక గుణాఢ్యు నాశ్రయించినవాఁడే సుకృతి యను ప్రస్తుతాంశము తోఁచుచున్నది గనుక, అప్రస్తుతప్రశంస యయినది.

౨౮. ప్రస్తుతాంకురాలంకారము — ఒక ప్రస్తుతవిషయము ద్యోతక మగునట్లుగా మఱియొక ప్రస్తుతవిషయమును వర్ణించినచో ప్రస్తుతాంకురము. దీనినే యున్యాదేశ మందురు. ఓభృంగరాజా! చక్కని మాలతీకుసుమమును విడిచి కంటకములతోఁ గూడిన మొగలి పూవు మీఁదికిఁ బోయెద వేమి? ఇక్కడ నొక కులకాంత యొక తోఁటలో బరాంగనాసంగమార్థియై వల్లభుఁడు పోవుచుండఁగాఁ బ్రస్తుత మగపడుచు మాలతీపుష్పము నుండి మొగలిపూవు మీఁదికిఁ బోవుచున్న తుమ్మెదను గూర్చి యున్న పయివాక్యము వలన సుఖప్రద మయిన కులాంగనా సంగమును విడిచి యపాయబహుళ మయిన పరాంగనాసంగమున కేలపోయెద వని భర్త నుద్దేశించి వలుకుట యను మఱియొక ప్రస్తుతాంశము బోధపడుచున్నది గనుక ప్రస్తుతాంకుర మయినది.

౨౯. పర్యాయోక్త్యలంకారము—(1) వీవస్తువు నేప్రకారముగా వర్ణించిన సుబోధ మగునో యాప్రకారముగా వర్ణింపక భంగ్యంతరముచేఁ జెప్పినచో మొదటిపర్యాయోక్తి రాఘవధూయావన

మును వ్యర్థపఱిచిన దేవుని గొలిచెదను. ఇక్కడ విష్ణువును లక్ష్మీవల్ల భాదిప్రసిద్ధవిశేషణములచే సుబోధ మగునట్లు చెప్పక రాహుని శిరో మాత్రావశిష్టునిగాఁ జేసి యాలింగనాది క్రియాశక్తి లేకపోవుటచే నాతనిభార్యయొక్క యౌవనమును వ్యర్థపఱిచినవాఁడను విశేషణ మును వాడుటచే మొదటిపర్యాయోక్తి యయినది. (2) తన యభీష్టకార్యమును కార్యాంతరమిషచేత సాధించుకొనినట్లు వర్ణించి నచో రెండవపర్యాయోక్తి — ఓదంపతులారా! మీరీపొదరింట నుండుఁడు. నే నాచూతలతను చూచి వచ్చెదను. మామిడిచెట్టును చూచివచ్చెద ననుమిషచేతఁ దొలఁగి తనయభీష్ట మయిన వధూవసుల యథేష్టావిహారమును కూర్చినట్లు వర్ణింపఁబడినందున రెండవపర్యా యోక్తియయినది.

30. వ్యాజస్తుత్యలంకారము — (1) నిందావ్యాజమున స్తుతి చేసినచో మొదటివ్యాజస్తుతి—ఓగంగా! మహాపాపులను స్వర్గము నకుఁ బంపుచున్న నీకు వివేక మెక్కడిది? ఇక్కడ బయికి నిందవలెఁ గనఁబఱిచినను నీవు పాపులను సహితము పావనులను జేసి స్వర్గసుఖ మున కర్హులను జేయుచున్నా వను స్తుతియే యుద్దేశింపఁ బడినందున మొదటివ్యాజస్తుతి యయినది. (2) స్తుతివ్యాజమున నింద చేసిన-చో రెండవవ్యాజస్తుతి—ఓదూతీ! నాపెనిమిటిని బిలువఁబోయి నానిమిత్త మయి యాతని దంతక్షతనఖక్షతములకు లోనయి శ్రమ నొందితివి గదా? నీ వెంత మంచిదానవు? ఇక్కడ బయికి స్తుతివలెఁ గనఁబఱిచి నను నానిమిత్త మయి పోయి దుష్టురాల వయి నాపతితోనే సంభో గించి వచ్చితి వను దూషణమే యుద్దేశింపఁబడినందున నిందాగర్భిత మయిన రెండవవ్యాజస్తుతి యయినది.

౩౧. వ్యాజనిందాలంకారము — ఒక వస్తువును నిందించుటచే మఱియొకవస్తువు యొక్కనింద తోఁచినయెడల వ్యాజనింద—నన్నిట్లు దుఃఖము లనుభవింపు మని లిఖించిన బ్రహ్మ నింద్యుఁడు కాఁడు; ఆతని శిర మొక్కటి మాత్రమే ఖండించిన శివుఁడు నింద్యుఁడు. బ్రహ్మదేవుని యైదుతలలును దునుమక యొక్కతలను మాత్రమే తుని మిన శివుఁడు దూష్యుఁ డను శివనిందవలన బ్రహ్మవధార్హుఁడని బ్రహ్మ నింద తోఁచుటచేత వ్యాజనింద యైనది.

౩౨. ఆక్షేపాలంకారము— ఉక్తప్రతిషేధ రూపము, నిషే ధాభాస రూపము, తిరోహితనిషేధవిధివ్యక్త రూపము, అని యిది త్రివిధము.

(౧) ఉక్తప్రతిషేధ రూపము: — ఒకవస్తువును ముందుగాఁ గోరి, తరువాత, వస్త్వంతరము కలుగుటనుబట్టి విచారణమీఁద దానిని నిషేధించినచో నుక్తప్రతిషేధ రూపాక్షేపము – ఓచంద్రా! నీవొక్క పారి దర్శన మిమ్ము. అక్కఱ లేదు. నాప్రియురాలి ముఖ చంద్రబింబ మున్నది. ఇక్కడ మొదటఁ జంద్రబింబమును గోరి, తరువాత నాహ్లాద కర మైన కాంతా ముఖ చంద్రబింబమును దలఁచుకొని చంద్రుని నిషే ధించుటచేత నుక్తప్రతిషేధరూప మయినది.

(౨) నిషేధాభాసరూపము—నిషేధము బాధింపఁబడినదయి యర్థాంతరమునందుఁ బర్యవసించుచు నొకవిశేషార్థమును దెచ్చినచో నిషేధాభాస రూపాక్షేపము — ఓరాజా ! నేను దూతిని గాను. నీప్రియురాలిని దహించుచున్న యగ్నిసమ మగు విరహతాపమునుజూడ లేక వచ్చినదానను. ఇక్కడ దూతియే తాను దూతిని కానని చెప్పు టచే నిషేధ మాభాసమయి నేను సామాన్యముగాఁ గార్యార్థమయి సమయోచితముగా మృషావాక్యములు పలుకు దూతిని కానను

నర్థాంతరమునందుఁ బర్యవసించుచు నీవు వచ్చి యిప్పుడే ప్రియురాలి ప్రాణములు కాపాడుకోవలె ననుఁ విశేషార్థమును దెచ్చినందున నిషే ధాభాసయూవ మయినది.

(3) తిరోహిత నిషేధవిధివ్యక్తరూపము — తన కిష్ట మయిన నిషేధమును జెప్పక తన కిష్టములేని విధిని జెప్పుచు స్వాభిమతనిషే ధము గర్భీకృత మగునట్లు చేసినచో తిరోహిత నిషేధవిధివ్యక్తరూపా క్షేపము:—ఓప్రియవల్లభా! నన్నిందు విడిచి దేశాంతరము పొమ్మ్రి. నీవేగిన యుత్తరక్షణమునఁనే నేనాదేశమునఁ బుట్టి మరల నీపాదసేవ చేసెదను. ఇక్కడఁ దన కిష్ట మయినప్రియ దేశాంతర గమన నిషేధ మును జెప్పక, తన కిష్టము లేని దేశాంతరగమనవిధినే చెప్పుచు తన మరణమును సూచించు వాక్యములతోఁ దనబ్రతుకు గోరినయెడలఁ బోవలదను నిషేధము గమ్య మగునట్లు చేయఁబడినందున తిరోహిత నిషేధవిధివ్యక్తరూప మయినది.

33. విరోధాభాసాలంకారము — రెండు వాక్యములు పై కన్యోన్యవిరుద్ధార్థములుగాఁ గనఁబడు చున్నను, అర్థాంతరముచేత విరోధము పరిహార మయినచో విరోధాభాసము—ఆరాజు నీతిమంతుఁ డయ్యును ననీతిని ప్రజా పాలనము చేసెను. ఇక్కడ నీతిమంతుఁ డయ్యు నీతిమాలి ప్రజాపాలనము చేసె నన్నయర్థము పైకి స్ఫురించు చున్నను, అనీతి యనుదాని కీతిబాధలు లేకుండ నని యర్థాంతర మయి పయివిరోధము పరిహార మయినందున విరోధాభాస మయినది.

34. విభావనాలంకారము — విభావనాలంకార మాఱువిధ ములు గలది.

(1) కారణము లేకయే కార్యము పుట్టినట్లు చెప్పినచో మొఱటివిభావన — ఓకాంతా! నీపాదములు లత్తుక పెట్టక పోయినను

నెట్టి నగు చున్నవి. ఇక్కడ లత్తుకపూత యనుకారణము లేకయే రక్తిమ యనుకార్యోత్పత్తి కలిగినట్లు పతాజదారుణము లైనచరణ ములు వర్ణింపఁబడినందున మొదటివిభావన యైనది.

(2) సంపూర్ణకారణము లేకయే కార్యము పుట్టినట్లు చెప్పి నచో రెండవవిభావన — మన్మథుఁ డతిమృదులాస్త్రములచేతనే ముల్లోకములను జయించెను. లోకముల గెలుచుటకు సంపూర్ణకార ణము లైనకఠినబాణములు లేకయే కోమలపుష్పబాణము లనెడి యసంపూర్ణకారణముచేతనే లోకవిజయకార్యము నిర్వహించినట్లు చెప్పఁబడినందున రెండవవిభావన యైనది.

(3) ప్రతిబంధక మున్నను కార్యము కలిగినట్లు చెప్పినచో మూడవవిభావన — ఓరాజా! నీఖడ్గాహి పరనరేంద్రప్రాణానిలము లనే పానము చేయుచున్నది. నరేంద్రు లనఁగా రాజులును విషవైద్యు లును గనుక, ఖడ్గ మనెడినర్పము విషవైద్యప్రతిబంధ మున్నను నరేంద్రప్రాణములు గొనుట యనుకార్యము కలిగినట్లు చెప్పఁబడి నందున మూడవవిభావన యైనది.

(4) కారణము కానిదానివలనఁ గార్యము కలిగినట్లు చెప్పి నచో నాలవవిభావన — ఆహా! ఇక్కడ శంఖమునందు వీణానినా దము కలుగు చున్నది! వీణానినాదము పట్టుటకు శంఖము కారణము కాకపోయినను, కామినీకంఠమును శంఖముగాను గళస్వరమును వీణాని నాదముగాను నుద్దేశించి కారణము గానిశంఖమువలన వీణానినాద కార్యము కలిగినట్టు చెప్పఁబడినందున నాలవవిభావన యైనది.

(5) విరుద్ధకారణమువలనఁ గార్యము కలిగినట్లు చెప్పిన-చో నైదవవిభావన — ప్రియురాలి నెడఁబాసిన నన్ను శీతాంశుకిరణములే సంతాప పెట్టుచున్నవి. ఇక్కడ చలువ గొలువవలసినశీతాంశుకిరణము

లనువిరుద్ధకారణమువలన సంతాప మనుకార్యము పుట్టినట్లు చెప్పఁబడి నందున నైదవవిభావన యైనది.

(౬). కార్యమువలననే కారణము పుట్టినట్లు చెప్పినచో నాఱవవిభావన — ఓరాజా! నీకరకల్పవృక్షమువలననే కీర్తిపయస్సముద్రము పుట్టుచున్నది. కల్పవృక్షములు పుట్టుటకు పాలసముద్రము కారణ మైనట్లు జగత్ప్రసిద్ధమయి యుండఁగా నిక్కడ కరకల్పక మనెడికార్యమువలననే యశఃపయోనిధి యనుకారణము కలిగినట్లు చెప్పఁబడినందున నాఱవవిభావన యైనది.

౩౫. విశేషోక్త్యలంకారము:-సంపూర్ణమయిన కారణమున్నను కార్యము పుట్టలే దని చెప్పినచో విశేషోక్తి:— ఆమెహృదయములో స్మరదీపము పూర్ణముగా వెలుఁగు చున్నను స్నేహమాత్రావంతయుతగ్గ లేదు. లోకములో దీపము వెలుఁగుటచేత చమురు తగ్గుట ధర్మ మయి యుండఁగా నిక్కడ స్మరదీపము వెలుఁగుట యనుసంపూర్ణ కారణమున్నను స్నేహ మనుచమురు తగ్గుట యనుకార్యము పుట్ట నట్లు చెప్పఁబడినందున విశేషోక్తి యైనది. స్నేహమనఁగా చమురును ప్రేమమును.

౩౬. అసంభవాలంకారము:— జరిగినకార్యము విషయమయి యట్లు జరుగు నని యెవ్వరికి నూహించుటకే శక్యము కాదని వర్ణించినచో నసంభవము:— ఒకగొల్ల శిశువు కొండ నెత్తు నని యెవ్వఁడనుకొనును; ఇక్కడ గోపాలబాలుఁ డైనకృష్ణుఁడు గోవర్ధన పర్వత మెత్తు నని యెవ్వరు ననుకో లే దని వర్ణింపఁబడినందున నసంభవ మైనది.

౩౭. అసంగత్యలంకారము;—అది మూఁడువిధములు గలది.

(ఁ.) కారణ మొకచోటఁ గలుగఁగాఁ గార్యము మఱియొక చోటఁ గలిగె నని చెప్పినచో మొదటి యసంగతి:— దుష్టులు రాజు చెవి కొఱుకఁగా భృత్యజనులు చచ్చు చున్నారు. చెవి కొఱుకుట యనుకారణము రాజునందుఁ గలుగఁగా కార్య మయిన మరణ మచ్చటం గలుగక భృత్యులయందుఁ గలుగుచున్న దని చెప్పఁబడి నందున నసంగతి యైనది. చెవిగొఱుకుట యనఁగాఁ గొండెములు చెప్పుట గాని దుష్టులకొండెముల మూలమున ప్రకృతివర్గమునకు ప్రాణాపాయము వచ్చుచున్న దని తాత్పర్యము.

(ఆ.) ఒకచోటఁ జేయుఁదగినపని మఱియొకచోట చేసినట్లు చెప్పినచో రెండవ యసంగతి:—ఓకాంతా! నీవు కంకణములు హస్త ములందు ధరింపవలెనుగాని యిట్లు కన్నులందుఁ గంకణములు ధరింప వచ్చునా? ఇక్కడఁ జేతులయందు ధరింపవలసిన కంకణములు కన్ను లయందుఁ ధరింపఁబడినట్లు చెప్పఁబడినందున నసంగతి యైనది. కంక ణము లనఁగా హస్తాంగదము లనియు జలబిందువు లనియు నెఱుంగునది.

(3.) ఒక కార్యమును జేయఁ దలఁచి తద్విరుద్ధమైన కార్యమును జేసినట్లు వర్ణించినచో మూడవయసంగతి:— దానవారిని మనస్సు నందు నిలుపఁ బూని యతఁడు దానవారిని విడిచెను. ఇక్కడ దాన వారిని మనస్సునం దుంచుకొనఁ దలఁచి దానవారిని విడుచుట యను విరుద్ధకార్యము చెప్పినట్లు చెప్పఁబడినందున నసంగతియైనది. దాన వారియనఁగా విష్ణుమూర్తియనియు దానజల మనియుఁ దెలియునది.

౫౮. విషమాలంకారము—అననురూపఘటనారూప మనియు, విరూపకార్యోత్పత్తిరూప మనియు, అనిష్టాపాప్తిరూపమనియు, విష మాలంకారము మూడువిధములు గలది.

(౧.) అననురూపఘటనారూపవిషమాలంకారము :— ఒకదాని కొకటి తగనిపదార్థముల సంఘటనమును వర్ణించినచో నననురూప ఘటనారూపము:— ఈ శిరీషకుసుమ సుకుమారశరీర మెక్కడ? దుర్భర స్మరజ్వరపరితాప మెక్కడ ? ఇక్కడ మెత్తనిమేని కననురూపమగు దుర్భరమన్మథతాపము ఘటిల్లుట వర్ణింపఁబడినందున నననురూపఘట నారూప విషమాలంకార మయినది.

(౨.) విరూపకార్యోత్పత్తి రూపవిషమాలంకారము:—కారణ విరుద్ధమైన కార్యముత్పత్తియైనట్లు వర్ణించినచో విరూపకార్యోత్పత్తి రూపము:—ఓరాజా! నీఖడ్గము నల్లని దయ్యును దెల్లనికీర్తిని ఘటించు చున్నది. కారణ మెట్టిగుణము కలది యుగునో కార్య మట్టిగుణము కలదియే కావలసినది ధర్మ మగుచుండఁగా నల్లనికత్తి యనుకారణము వలనఁ దెల్లనికీర్తి యనువిరూపకార్యము కలిగినట్లు చెప్పఁబడినందున విరూపకార్యోత్పత్తిరూపమయినది.

(3.) అనిష్టాపాప్తిరూపవిషమాలంకారము:— ఒకయిష్టకార్య ప్రాప్తికయి యత్నింపఁగా నిష్టలాభము కలుగక యనిష్టము కలిగినట్లు చెప్పినచో ననిష్టాపాప్తిరూపము:—మూషక మహారాజు చేతఁ బెట్టెను గొఱికియందున్న పాముచే భక్షింపఁబడియె. ఇక్కడ నాహారమునిమిత్త మయి పెట్టెను గొఱికినయెలుక కాహారము లభింపక పోవుటయే కాక యనిష్ట మైనప్రాణహాని కూడ సంభవించినందున ననిష్టాపాప్తిరూప మయినది.

౨౯. సమాలంకారము — అనురూపవర్ణనరూపము, కారణ సారూప్యవర్ణనరూపము, అక్లేశ కార్యసిద్ధివర్ణనరూపము, అని సమా లంకారము త్రివిధము.

(౧.) అనురూపవర్ణనరూపము — అనురూపము లగు రెండు వస్తువులకు సంఘటనము వర్ణించినచో మొదటినమాలంకారము: — ఈనకుఁ దగినస్థల మని ముక్తాలహార మామె కంఠము నాశ్రయిం చెను. ఇక్క ముక్తాహారమునకు గళప్రదేశ మనురూపస్థల మని వర్ణింపఁబడినందున ననురూపవర్ణనరూపసమాలంకార మయినది.

(౨.) కారణసారూప్యవర్ణనరూపము — కార్యమునకుఁ గార ణముతోడ సమాన రూపత్వమును వర్ణించినచో రెండవసమాలం కారము:— ఓలక్ష్మీ! నీటఁ బుట్టిన నీకు నీచోపసర్పణము సహజమే కదా? కారణ మైన నీటికి నీచోపసర్పణము సహజ మైనట్లే కార్య మైన క్షీరసముద్రసంభూత యగు లక్ష్మీకిని నీచోపసర్పణ మనుసరూప త్వము వర్ణింపఁబడినందున కారణసారూప్యవర్ణనిరూపసమాలంకార మైనది. నీచోపసర్పణ మనఁగా జలవక్షమునఁ బల్లములకుఁ బొఱుట యనియు, లక్ష్మీపక్షమున నీచులను జేరుట యనియుఁ దెలియునది.

(3.) అక్లేశకార్యసిద్ధివర్ణనరూపము — ఒకఁడు చేయఁదలఁచిన కార్యముకష్టము లేకుండ సిద్ధించి నట్లు వర్ణించిన-చో మూడవసమా లంకార మగును:—ఓబావా! వారణమును గోరిన నీకు రాజద్వారమున వారణమే లభించినది గదా? ఇక్కడ వారణమును గోరినవాని కనా యాసముగా వారణమే లభించి నట్లు చెప్పఁబడినందున నక్లేశకార్య సిద్ధి వర్ణనరూపసమాలంకార మయినది. వారణ మనఁగా నేనుఁగును ద్వారనిరోధమును గనుక, ఏనుఁగును బహుమానము పొందఁగోరి పోయినవానికి రాజభటుల వలన నిరోధము కలుగఁగా బావమఱఁది పరిహాసముగాఁ బలికిన వాక్యము.

౪౦. చిత్రాలంకారము — ఒకఁడు చేయఁబూనినవనికి విపరీత మయిన ఫలమును బొందుట కయిప్రయత్నించినట్లు వర్ణించినచోఁ

చిత్రము — నుజనుఁ డౌన్నత్యమును పొందఁగోరి నమ్రతను వహిం చును. ఇక్కడ సుజనుఁడు వంగియుండుట యనెడుపని చేసి దానికి విపరీతఫల మయినయున్నతి పొందగోరినందున చిత్రాలంకార మయి నది.

౪౧. అధికాలంకారము — అధికాలంకారము రెండువిధములు గలది.

(౧.) విస్తార మయిన యాధారమునకంటె నాధేయమున కాధి క్యమును వర్ణించినచో మొదటి యధికాలంకారము:— ఓరాజా! బ్రహ్మాండములను బుద్బుదములవలె ధరించిన యామహాజలము నీగుణ ములు నిలుచుటకుఁ జాలకున్నది. ఇక్కడ రాజునకు గుణములు మహా జలమును డాఁటిపోయె నని మహాధారమగు మహాజలము కంటెను నాధేయ మగు సుగుణజాల మధిక మయినట్లు వర్ణింపఁబడినందున మొదటియధికాలంకార మయినది.

(౨.) విస్తార మయిన యాధేయమున కంటె నాధారమునం దాధిక్యవర్ణనము చేసినచో రెండవ యధికాలంకారము:— ఓరాజా! నీయనంతగుణములు విశ్రమించి యుండుటచేత వాగ్బ్రహ్మ మంత గొప్పదే యనవచ్చును. ఇక్కడ రాజుయొక్క గుణము లన్నియుఁ దదాశ్రితకవికృతానంతకావ్యములం దిమిడె నని యాధేయ మయిన గుణజాలము కంటె నాధారమయిన కవివాగ్బ్రహ్మమునం దాధిక్యము వరింపబడినందున రెండవయధికాలంకార మయినది.

౪౨. అల్పాలంకారము — అల్ప మయిన యాధేయవస్తువున కంటె నాధార మతినూక్ష్మ మయినట్లు వర్ణించినచో నల్పాలంకా రము:— ఇప్పు డీకాంతకు మణియుంగరము జపమాల యగుచున్నది. వేలికిముడ వలసినది గనుక సూక్ష్మ మయిన యుంగర మను

నాధేయము మణిబంధమునకే వదులయి మణిమాలవలె సుండి విర హావస్థవలన మణిబంధ మనునాధార మతిసూక్ష్మతను పొందినట్లు వర్ణింపఁబడినందున నల్పాలంకార మయినది.

౪౩. అన్యోన్యాలంకారము — రెండువస్తువుల కన్యోన్యోప కారమును వర్ణించినచో నన్యోన్యము:— కంకణముచే హస్తమును హస్తముచేఁ గంకణమును శోభిల్లుచున్నవి. ఇక్కడ హస్తకంకణము లొకదానివలన నొకటి శోభిల్లుచున్న వని రెంటికిని పరస్పరోప కారము వర్ణింపఁబడినందున నన్యోన్య మయినది.

౪౪. విశేషాలంకారము—ఆధారరహితాధేయవర్ణనరూపము, ఏకానేక గోచరత్వవర్ణనరూపము, అశక్యక్రియాంతరవికృతివర్ణన రూపము, అని విశేషాలంకారము త్రివిధము.

(౧). ఆధారరహితాధేయ వర్ణనరూపము— ప్రసిద్ధ మయిన యాధారము లేకున్నను నాధేయవస్తువు లుండి కార్యకరములగుచున్న వని వర్ణించినచో మొదటివిశేషము:— సూర్యుఁడస్తమించినను నాతని కిరణములు దీపముల నాశ్రయించి రాత్రియందును జీకట్లను భేదించుచున్నవి. ఇక్కడఁ బ్రసిద్ధాధార మగుసూర్యుఁడు లేకపోయినను తదాధేయము లగు కిరణము లుండి తమపని చేయుచున్నట్లు చెప్పఁ బడినందున విశేష మయినది.

(౨) ఏకానేకగోచరత్వ వర్ణనరూపము—ఒకవస్తువే యేక కాలమునం దనేకస్థలములయం దున్నట్లు వర్ణించినచో రెండవవిశే షము:— ఓచెలీ! నాకిప్పుడు లోపలను వెలుపలను ముందును వెను కను సర్వత్ర ప్రియుఁడే తోఁచుచున్నాఁడు. విరహిణికిఁ బ్రియుఁడను నొక్కవస్తువే బహుస్థలములయందుఁ గానఁబడుచున్నట్లు వర్ణింపఁబడి నందున విశేష మయినది.

(3) అశక్యకార్యాంతరవికృతివర్ణనరూపము — ఒక కొంచెపుఁ గార్యసిద్ధి కయి ప్రయత్నింపఁగా నసాధ్యవస్త్వంతరకరణము లభించి నట్లు వర్ణించినచో మూడవవిశేషము:— ఓరాజా! నిన్నుఁ జూచుట చేత మా కిప్పుడు కల్పవృక్షదర్శనము లభించినది. ఇక్కడ రాజదర్శ నమున కయి యత్నింపఁగా దానిచేతనే యసాధ్య మయిన కల్పవృక్ష దర్శనకార్యకరణము తటస్థించినట్లు చెప్పఁబడినందున విశేష మయినది. రాజు వితరణగరిమచేతఁ గల్పవృక్షమువంటివాఁ డని భావము.

౪౫. వ్యాఘాతాలంకారము — తథాకార్యతథాకారిత్వక్రియ, సాకర్యనిబద్ధకార్య విరోధిక్రియ, అని వ్యాఘాతము ద్వివిధము.

(౧) తథాకార్యతథాకారిత్వక్రియ— ఒక కార్యమునకు సాధన మయినదానిని తద్విరుద్ధ మైన మఱియొక కార్యమునకు సాధన మయిన దానినిగా వర్ణించినచో వ్యాఘాతము:— లోకమునకుసంతోషకరము లయినపుష్పములతో మన్మథుఁడు లోకములకు బాధను జేయు చున్నాఁడు. జగత్ప్రీతికి సాధన మయిన పుష్పములను తద్విరుద్ధ మైన జగద్బాధకు సాధనముగాఁ జేసినట్లు వర్ణింపఁబడినందున వ్యాఘాత మయినది.

ఒకఁ డొకపనికి సాధనముగాఁ జేసికొన్నదానిని తత్ప్రతి భటుఁడు తద్విరుద్ధ మయిన పనికి సాధనముగాఁ జేసికొన్నట్లు వర్ణించి నను వ్యాఘాతమే యగును:— తన వాడిచూపునఁ జూచి మరుని రూపు మాపిన యీశివునిఁ దనవాఁడిచూపునఁ జూచి పార్వతి మరల మరుని బ్రతికించుచున్నది. మన్మథదహనమునకు చూపే సాధన మయినను శివునిజయించి మన్మథునిపాలు చేసిన పార్వతిచూపే మన్మ థుని బ్రదికించుట యను తద్విరుద్ధకార్యమునకు సాధన మయినట్లు వర్ణింపఁబడినందున వ్యాఘాత మయినది.

(ఎ) సౌకర్యనిబద్ధకార్యవిరోధిక్రియ:—ఏసాధనము చేత నొక కార్యము నిశ్చయింపఁబడునో యాసాధనముచేతనే తద్విరుద్ధకార్యము సుకరముగా సమర్థింపఁబడినట్లు వర్ణించినచో వ్యాఘాతము:— ఓ కుమారా! బాలుఁడవు గనుక నిన్ను రాజ్యమందు నిలిపెదను. ఓజనకా! బాలుఁడ నగుటచేతనే నన్ను రాజ్యమునందు నిలుప వలదని ప్రార్థించెదను. ఇక్కడ తండ్రి కుమారుని పడుచువాఁడను హేతువుచేత రాజ్యమునందు నిలుప నిశ్చయింపఁగా ననుభవము లేని పడుచువాఁడనెడి యా హేతువుచేతనే తద్విరుద్ధ మగు నిలుపఁగూడక పోవుటను సుకరముగా సాధించినట్లు వర్ణింపఁబడినందున వ్యాఘాత మయినది.

౪౬. కారణమాలాలంకారము:—వరుసగా నుత్తరోత్తరము లకు పూర్వపూర్వములు కారణము లయినట్లు గాని, పూర్వపూర్వ ముల కుత్తరోత్తరములు కారణము లయినట్లు గాని, కొన్ని సంగతు లను జెప్పినచోఁ గారణమాల:—నీతిచేత ధనమును, ధనముచేత వితరణమును, వితరణముచేతఁ గీర్తియు, కీర్తిచేత స్వర్గమును గలు గును. ఇక్కడ నుత్తరోత్తరములకుఁ బూర్వపూర్వములు హేతువు లుగాఁ జెప్పఁబడినందున మొదటి కారణమాల మయినది. నరకము పాపమువలనను, పాపము దారిద్ర్యమువలనను, దారిద్ర్యము దాన హీనతవలనను గలుగునుగాన దానపరుఁడవు కమ్ము. ఇక్కడఁ బూర్వ పూర్వముల కుత్తరోత్తరములు హేతువులుగాఁ జెప్పఁబడినందున రెండవకారణమాల యైనది.

౪౭. ఏకావళ్యలంకారము:— ఉత్తరోత్తరపదమునకుఁ బూర్వ పూర్వపదము విశేషణ మగునట్లుగాఁ గాని, పూర్వపూర్వపదమున

కుత్తరోత్తరపదము విశేషణ మగునట్లుగాఁగాని, వర్ణించినచో, ఏకావళి:—అతనికన్నులు కర్ణాంతరవిస్తారములు ; కర్ణములు దోస్తంభ లంబమానములు ; దోస్తంభములు జానుపర్యంతములు. ఇక్కడ పూర్వము లైనకన్నులను గుఱించి యుత్తరము లయినకర్ణములకును, కర్ణములనుగూర్చి దోస్తంభములకును, దోస్తంభములనుగూర్చి జానువులకును విశేషణత్వము చెప్పఁబడినందున నేకావళి యైనది. ఈప్రకారముగానే రెండవది యూహించుకొనునది.

౮౮. మాలాదీపకాలంకారము:— దీపకాలంకార లక్షణమును, ఏకావళీలక్షణమును, రెండునుగూడఁ గలిగినచో మాలాదీపకము:— లక్ష్మీకరుణచే నీకటాక్షములయందును, నీకటాక్షములచేత విబుధుల యందును జేరెను. ఇక్కడ వర్ణ్య మైనరాజకటాక్షముల యందును అవర్ణ్య మైనవిబుధులయందును లక్ష్మీనివాసత్వ మనుకేక ధర్మము చెప్పఁబడినందున దీపకలక్షణమును, విబుధు లనుకుత్తర పదమునకుఁ గటాక్షము లనుపూర్వపదము విశేషణమగునట్లుగాఁ జెప్పఁబడినందున నేకావళీలక్షణమును పట్టినవి.

౮౯. సారాలంకారము:— పూర్వపూర్వమునకంటె నుత్తరోత్తర ముత్కృష్ట మయినదిగా వర్ణించినచో సారము:— లోకములోఁ దేనె మధుర మయినది ; అమ్మ మంతకంటెను మధుర మయినది; కవివాక్య మమృతముకంటె మధుర మైనది. ఇక్కడ తేనెకంటె నమృతమునకును, అమృతమునకంటెఁ గవివాక్యమునకును బూర్వపూర్వమునకంటె నుత్తరోత్తరమునకు గుణోత్కర్షము వర్ణించుటవలన సారాలంకార మయినది.

౯౦. యథాసంఖ్యాలంకారము :— క్రమసంఖ్య గలవానిని వరుసఁగాఁ గ్రమసంఖ్య గలవానితో నన్వయించునట్లు వర్ణించినచో

యథాసంఖ్యము:— ఓయీ! నీవు పుత్రులను మిత్రులను శత్రులను, బోషింపుము భూషింపుము దూషింపుము, ఇక్కడ "పుత్రులను బోషింపుము మిత్రులను భూషింపుము శత్రువులను దూషింపుము" అని యథాసంఖ్యముగా ననఁగా మొదటిది మొదటిదానితోను, రెండవది రెండవదానితోను మూడవది మూడవదానితోను అన్వయించునట్లు వర్ణింపఁబడినందున యథాసంఖ్య మయినది. క్రమాన్వయమును బట్టి దీనిని కొందఱు క్రమాలంకార మందురు.

౫౧. పర్యాయాలంకారము :— ఏకానేకాశ్రయరూపము, అనేకాశ్రయరూపము, అని పర్యాయాలంకారము ద్వివిధము.

(౧). ఒకవస్తువునకుఁ గ్రమముగా ననేకాధారములను వర్ణించినచో మొదటిపర్యాయాలంకారము:— ఆమెముఖకాంతి పద్మమును విడిచి యిప్పుడు చంద్రుని జేరుచున్నది. ఇక్కడ ముఖకాంతికి మొదట బగలు పద్మాశ్రయమును తరువాత రాత్రి చంద్రాశ్రయమునుగా, ననేకాశ్రయములు చెప్పుటవలనఁ బర్యాయాలంకార మైనది.

(౨). ఒకవస్తువునందుఁ గ్రమముగా ననేకాధేయములను వర్ణించిన రెండవపర్యాయాలంకారము :— పూర్వము ప్రవాహమున్నచోట నిప్పు డిసుకతిన్నె కానఁబడుచున్నది. ఇక్కడ నాధారమగునొక్కస్థలమునందే ప్రవాహమును పులినము ననెడియనేకాధేయవస్తువు లున్నట్లు వర్ణింపఁబడినందున రెండవపర్యాయాలంకార మయినది.

౫౨. పరివృత్త్యలంకారము:— ఒకదాని నిచ్చి మఱియొకదానినిఁ బుచ్చుకొన్నట్లు వర్ణించినచోఁ బరివృత్తి. అల్పము నిచ్చి యధికమును స్వీకరించినట్లుగాని, అధికము నిచ్చి యల్పమును స్వీకరించినట్లుగాని, సమవ్యయముచే సమస్వీకరణము చేసినట్లుగాని,

మూఁడువిధములుగాఁ జెప్పవచ్చును:— రాజు తానొక్కబాణమును విడిచి శత్రువుల యపారరాజ్యలక్ష్మీలను గ్రహించుచున్నాఁడు. ఇక్కడ రాజు బాణ మను నొక్కవస్తువు నిచ్చి యనేకము లయిన రాజ్యలక్ష్మీలను స్వీకరించినట్లు చెప్పఁబడినందున మొదటి పరివృత్తి యయినది.

౫౩. పరిసంఖ్యాలంకారము:—ఒకవస్తువు నొకచోట నిషేధించి మఱియొకచోట విధించినయెడలఁ బరిసంఖ్య:— స్నేహాక్తయము దీప ములఁ గలుగవలెను గాని కామినుల మనస్సులందుఁ గలుగ రాదు. ఇక్కడ స్నేహాక్తయము స్త్రీలమనస్సులయం దుండఁగూడ దని నిషే ధింపఁబడి దీపములయం దుండవలెనని విధింపఁబడినందునఁ బరిసంఖ్యా లంకారమయినది. స్నేహాక్తయ మనఁగా ప్రేమ తగ్గుటయు, చమురు తగ్గుటయు, నని తెలియవలెను.

౫౪. వికల్పాలంకారము:— సమబలము గలరెండువిరోధకార్య ములలో నేదైన నొకటి చేయువలె ననివర్ణించిన-చో వికల్పము:— ఇప్పుడు నీవు శిరస్సు నైనను ధనుస్సునైనను వంచుకొని శత్రున కభి ముఖముగాఁ బోవలెను. ఇక్కడ యుద్ధమును సంధియునను సమాన బలము గలరెండువిరోధకార్యములలోఁ దలవంచుకొని సంధి కయినను విల్లు వంచుకొని యుద్ధమున కయినను నేదో యొకదానికిఁ బోవుట చేయువలె నని వర్ణించుట వలన వికల్ప మయినది.

౫౫. సముచ్చయాలంకారము:— అది ద్వివిధము.

(ఁ) విరుద్ధములు కానిబహుకార్యము లేక కాలమునందుఁ బ్రాప్తించినట్లు వర్ణించినచో మొదటిసముచ్చయము:— యుద్ధభూమి యందు నీశత్రువులు నొచ్చియు విచ్చియుఁ జచ్చియుఁ బలు తెఱగులవా

రయిరి. ఇక్కడఁ బరస్పరవిరుద్ధములు కాని నొచ్చుట విచ్చుట చచ్చుట యనుకార్యము లేక కాలమునందు సంప్రాప్త మయినట్లు చెప్పఁబడినందున సముచ్చయాలంకార మయినది.

(౨). ఒక కార్యమున కొక్క కారణమే చాలి యున్నను ననేక కారణములను జెప్పినచో రెండవసముచ్చయము.— ఆతని మదము నకు ధనమును యౌవనమును కులమును రూపును విద్యయు హేతువు లయినవి. ఇక్కడ మదమును జేయుటకు ధనయౌవనాదులలో నొక్క కారణమే చాలియున్నను ధనాదికారణములను బెక్కింటిని జెప్పుట చేత సముచ్చయ మయినది.

౫౬. కారకదీపకాలంకారము:—క్రమముగా ననేకక్రియల కేక కర్తృకారకాన్వయము కలుగునట్లు వర్ణించినచోఁ గారకదీపకము:— అతఁడు తన యింటిని విడువ లేక నాలుగడుగులు నడుచును దిరిగి చూచును మరల వచ్చును నిట్టూర్పులను విడుచును. ఇక్కడ నడుచు చూచు వచ్చు విడుచు ననుబహుక్రియ లేకకర్తతో నన్వయించునట్లు చెప్పఁబడినందున కారకదీపక మయినది.

౫౭. సమాధ్యలంకారము:—ఒకకారణముచేతనే కార్యారంభ మగుచున్నను మఱియొక్క కారణముచే నారబ్ధకార్యమునకు సౌలభ్య మగుచున్నట్లు వర్ణించినచో సమాధి:— చోరుఁడును వేగిరపడుచుండె నింతలో సూర్యుడు నస్తమించెను. ఇక్కడ చౌర్యకార్యా రంభము నకు దొంగయొక్క వేగిరపాటు చాలి యున్నను సూర్యాస్తమాన మను కారణాంతర మాకార్యమునకు సౌకర్యము కలిగించినట్లు వర్ణించినందున సమాధి యయినది.

౫౮. ప్రత్యనీకాలంకారము :— బలవంతుఁ డగు శత్రువును జయింప లేక తత్పక్షమువానిని దిరస్కరించెనని వర్ణించినచోఁ బ్రత్య

నీకము:—ఇందీవరము తన్ను మించిన కన్నుల గెలువ లేక కన్నుల చెంత నున్న చెవులఁ గ్రిందు పఱుచుచున్నది. కలువ తన్ను జయించు నేత్రమును జయింప శక్తిలేక నేత్రముల దాపుచేరిన కర్ణములను లాఘవపఱిచినట్లు చెప్ప బడినందున ప్రత్యనీక మయినది. నల్లగలువ కర్ణభూషణ మయి చెవిపయి నున్నందునఁ జెవిని క్రిందుపఱిచి నట్లు చెప్పఁబడినది.

౫౯. కావ్యార్థాపత్త్యలంకారము:— ఒక యుత్కృష్టవస్తువే సాధింపఁబడు చున్నప్పుడు తక్కువవస్తువును సాధించుట యొఁత యని వర్ణించినచోఁ గావ్యార్థాపత్తి:—ఓకాంతా! నీముఖముచేతఁ జంద్రుఁడే జయింపఁబడుచుండఁగా నింకఁ బద్మ మెంత! ఇక్కడ దుర్జయుఁ డగు చంద్రుఁడే ముఖముచే జయింపఁ బడుచుండఁగా కైముతికన్యాయమున సుకర మైనపద్మవిజయ మెంతటికార్య మని చెప్పఁబడినందున కావ్యార్థాపత్తి యైనది.

౬౦. కావ్యలింగాలంకారము:— మొదట నొకదుష్కరమయిన యర్థము నుపపాదించి, అది సంభవింపఁ దగని దయి నమర్థింప వలసి యుండఁగా, వాక్యార్థమును గాని పదార్థమునుగాని హేతువునుగాక జేసి దానిని సమర్థించినచో గావ్యలింగము. దుష్కరార్థమును వాక్యార్థముచే సమర్థించినయెడల వాక్యార్థ హేతుకము:— ఓకామునఁడా! నేను నిన్ను జయింపఁగలను; నామనస్సులో ఫాలాక్షుఁ డున్నాఁడు. ఇక్కడ దుష్కరమయిన కామజయ ముపపాదింపఁబడి, (మన్మథదేహ దాహము చేసిన) ఫాలాక్షుఁడు మనస్సులో నున్నాఁడను వాక్యార్థముచే నది నమర్థింపఁబడినందున వాక్యార్థహేతుక కావ్యలింగ మయినది. దుష్కరార్థమును బదార్థముచే సమర్థించినయెడల, పదార్థహేతుకము:— సమాన్వితుఁడ నయిక్రోధనిగ్రహము చేసెదను. ఇక్కడ దుష్కర

మయిన క్రోధనిగ్రహ ముపపాదింపఁబడి, అది శమాన్వితుఁ డను పదార్థముచే సమర్థింపఁబడినందునఁ బదార్థహేతుక కావ్యలింగ మయినది.

౬౧. అర్థాంతరన్యాసాలంకారము — ప్రస్తుత మయినవిశేష మును సమర్థించుట కయి యప్రస్తుత మయినసామాన్యమును జెప్పి నను, ప్రస్తుత మయినసామాన్యమును సమర్థించుటకయి యప్రస్తుత మయినవిశేషమును జెప్పినను, అర్థాంతరన్యాసము. విశేషమును సామాన్యముచే సమర్థించుట :- రామకార్యమునకయి హనుమంతుఁడు సముద్రమును లంఘించెను; మహాత్ములకు దుష్కర మేమి యున్నది? హనుమంతుఁడు సముద్రమును దాఁటె నను ప్రస్తుత విశేషాంశమును జెప్పి దానిని సాధించుటకయి మహాత్ములకు దుష్కర మేమి యున్న దనుసామాన్యాంశమును జెప్పినందున మొదటి యర్థాంతరన్యాస మయినది. సామాన్యమును విశేషముచే సమర్థించుట :— మహాత్ము లను జేరిన యల్పులును గౌరవము నొందుదురు. పుష్పమును గూడి దారము తల కెక్కదా? ఇక్కడ మహాత్ములను జేరినయల్పులు గౌరవము నొందుదు రనుసామన్యాంశము చెప్పఁబడి, దానిని సాధించుట కయి పుష్పమును గూడి దారము తల కెక్కదా యను విశేషాంశము చెప్పబడినందున రెండవ యర్థాంతరన్యాస మయినది.

౬౨. వికస్వరాలంకారము—ఒకవిశేషార్థమును సమర్థించుట కయి సామాన్యము గ్రహింపఁబడి మరలనాసామాన్యమును సమర్థించు టకు మఱియొకవిశేషము చెప్పఁబడినచో వికస్వరము :— ఆ రాజు నెవ్వరును జయింప లేరు. మహాత్ములు సముద్రమువలె నసాధ్యులు సుమా. ఇక్కడ రాజు నెవ్వరును జయింపలే రనువిశేషము గ్రహింపఁ బడి దానిని సమర్థించుట కయి మహాత్ము లసాధ్యులను సామాన్యము

చెప్పఁబడి యాసామాన్యమును మగల సాధించుటకయి సముద్రము వలె ననుపమానరూపమైన విశేషము చెప్పఁబడినందున వికస్వర మయినది.

౬౩. ప్రౌఢోక్త్యలంకారము — క్రియాధిక్యమునిమిత్త మయి హేతువు కాని దానియందు హేతుత్వమును గల్పించినచో ప్రౌఢోక్తి :— ఆమెశిరోజములు యమునాతీరతమాలవల్లికలవలె నీల ములుగా నున్నవి. తమాలవల్లికలనీలత్వమునకు యమునాతీరమునం దుండుట కారణము కాకపోయినను తమాలవల్లికలయందు నీలత్వాతి శయమును జెప్పుటకయి నల్లనినీరు గలయమునాతీరమునం దుండుట హేతువుగాఁ జెప్పబడినందున ప్రౌఢోక్తి యయినది.

౬౪. సంభావనాలంకారము— ఈలాగున నయిన పక్షమున నిట్లగునని ప్రకృతకార్యసిద్ధినొఱ కూహించినచో సంభావన :— ఓ రాజా! వర్ణించెడువాఁడు శేషుఁడయ్యెనా నీగుణములను పూర్ణ ముగా వర్ణింపఁ గలుగును. ప్రకృతకార్య మైన గుణవర్ణనముకొఱకు వర్ణించెడువాఁడు శేషుఁడయ్యెడుపక్షమునఁ గార్యసిద్ధి యగు నని యూహింపఁబడినందున సంభావన యైనది.

౬౫. మిథ్యాధ్యవసిత్యలంకారము — ప్రకృతమునకు మిథ్యా త్వమును నూచించుటకయి మిథ్యాభూత మైన దానిని కల్పించినచో మిథ్యాధ్యవసితి :— ఆకాశపుష్పమును ధరించినవాఁడు వేశ్యను వశ్య నుగాఁ జేసికొనును. ఇక్కడ వేశ్యను వశ్యురాలినిగాఁ జేసికోఁ గలు గుట మిథ్యయని చూపుటకయి మిథ్య యైనయాకాశ పుష్పధార ణము కల్పింపఁబడినందున మిథ్యాధ్యవసితి యైనది.

౬౬. లలితాలంకారము— ప్రకృత మైన నాయకాధిధర్మ్మ యం దున్నప్రస్తుతవృత్తాంతమును జెప్పక తత్సదృశాప్రస్తుతవృత్తాంత

మును వర్ణించినచో లలితము:—ఆసుందరి జలము పోయినతరువాత సేతువు గట్టఁ దలఁచు చున్నది. తన్ను బతిమాలి వచ్చిననాయకునిఁ గసరి పోనాడుకొని యతఁడు పోయినతరువాత ప్రార్థించి తెచ్చుట కయి ప్రయత్నించు చున్నదన్న ప్రకృతవృత్తాంతమును వర్ణింపక తత్సదృశ మైనగతజలసేతుబంధనవృత్తాంతమును వర్ణించినందున లలిత మయినది.

౬౭. ప్రహర్షణాలంకారము — సర్వేంద్రియసుఖానుభవము కలిగించెడు భావము ప్రహర్షము. అట్టి హర్షప్రద మయిన యర్థము యొక్కసిద్ధి ప్రయత్నము లేకయే సంభవించినట్లు వర్ణించినచో మొదటిప్రహర్షణము: – ఆకఁ డేసుందరిని గోరి పిలిపింపఁ దలచి యుండెనో యాసుందరియే దూతికగా వచ్చెను. ఒకపురుషుఁడు కోరిన సుందరి ప్రయత్న మక్కఱ లేకయే దూతికగా వచ్చి లభించునట్లు చెప్పఁబడినందున మొదటిప్రహర్షణ మైనది. కోరినయర్థమునకంటె నధి కార్థము సిద్ధించెనని వర్ణించినచో రెండవప్రహర్షణము:—వెలుతురు నిమిత్తము దీప మెగఁద్రోయఁగానే సూర్యోదయ మాయెను. ఇక్కడ పదార్థప్రకాశనముకొఱకు దీప మెగఁద్రోయఁగా దీపముకంటె నధిక ప్రకాశము గల సూర్యుఁడు దైవవశమున నుదయించెనని చెప్పుటచేత రెండవప్రహర్షణ మయినది. అర్థసిద్ధికొఱ కుపాయాన్వేషణము చేయు చుండఁగానే తదర్థసిద్ధి యయ్యెనని వర్ణించినచో మూడవప్రహర్ష ణము:—అతఁడు పెన్నిధిని గోరి నిధ్యంజనౌషధీమూలమును ద్రవ్వు చుండఁగాఁ బెన్నిధియే కానఁబడెను. ఇక్కడ నొకపురుషుఁడు ధన నిక్షేపమును గోరి దానిని పొందుటకు సాధన మయినద్రవ్యాంజనౌషధి యొక్కవేరును ద్రవ్వుచుండఁగా నక్కడ ధననిక్షేపమే లభించెనని చెప్పబడినందున మూడవప్రహర్షణ మయినది.

౬౮. విషాదనాలంకారము—ఈప్సితార్థసిద్ధికొఱకు యత్నము చేయుచుండఁగా దైవవశముచేఁ తద్విరుద్ధ మయిన యనిష్టార్థప్రాప్తి యైనట్లు వర్ణించినచో విషాదనము:—దీప మెగసనఁద్రోయ యత్నించు చుండఁగా దీప మాఱిపోయెను. ఇక్కడ దీప మెగసనఁద్రోచి యెక్కువ వెలుతురును కలిగింప యత్నించు చుండఁగా దీప మాఱిపోయి మును పున్న వెలుతురుకూడఁ బోయి యనిష్టప్రాప్తి యయినట్లు వర్ణింపబడి నందున విషాదన మయినది.

౬౯. ఉల్లాసాలంకారము—ఒకరిగుణదోషములచే నితరులకు గుణదోషములు కలిగినట్లుచెప్పినచో నుల్లాసము. అది నాలుగు భేద ములుగలది.

(౧). ఒకరిగుణముచేత మఱియొకరికి గుణోత్పత్తిని వర్ణించి నచో మొదటి యుల్లాసము:— ఆపతివ్రత తననీట స్నానముచేసి తన్నఁ బవిత్రురాలినిగాఁ జేయు నని గంగానది తలఁచుచున్నది. ఇక్కడ పతివ్రతగుణముచేత గంగకు గుణోత్పత్తి యైనట్లు జెప్పఁబడి నందున మొదటియుల్లాస మయినది.

(౨) ఒకరిదోషము చేత మఱియొకరికి దోషోత్పత్తిని వర్ణించినచో రెండవయుల్లాసము:—ఓ రాజా! అరణ్యమార్గముల నడిచెడు సీశత్రుకాంతలు తమ కుచములయం దుంచిన కాఠిన్యమును పాదము లయం దుంచ లే దని బ్రహ్మను నిందింతురు. ఇక్కడ స్త్రీలచరణ ములయందలి యకాఠిన్యదోషముచేత బ్రహ్మకు నిందాదోషము జెప్పఁబడినందున రెండవయుల్లాస మయినది.

(3) ఒకరి గుణముచేత మఱియొకరికి దోషోత్పత్తిని వర్ణించి నచో మూడవయుల్లాసము:—త్యాగశీలుఁ డయినసజ్జనుని బొందకుం టట ధనముయొక్క యభాగ్యము గాని సజ్జనునిదోషము గాదు.

ఇక్కడ సజ్జనునిగుణముచేత ధనమునకు దోషము చెప్పఁబడినందున మూడవయుల్లాస మయినది.

(౪) ఒకరిదోషముచేత మఱియొకరికి గుణోత్పత్తిని వర్ణించి నచో నాలవ యుల్లాసము:— ఆదుష్టరాజు సేవకులను జంపకుండుటయే వారికిఁ బరమలాభము. ఇక్కడ రాజుయొక్క దుష్టత్వదోషము చేత పరిజనులకు చావు లేకుండుటయే గుణముగాఁ జెప్పఁబడినందున నాలవయుల్లాసమయినది.

౭౦. అవజ్ఞాలంకారము—అవజ్ఞాలంకారము ద్వివిధము.

(౧) ఒకరియొక్క గుణముచే మఱియొకరికి గుణము కలుగ నట్లు వర్ణించినచో మొదటియవజ్ఞ:— బొక్కెన సముద్రమున మునిఁగి నను కుండెడు నీటినే గ్రహించుచున్నది. బొక్కెనకు బహుజలసమృద్ధ మయిన సముద్రమును జేరినను దానిగుణము కలుగక యల్పజలమే వచ్చిన దని చెప్పుటచేత మొదటియవజ్ఞ యయినది.

(౨) ఒకరియొక్కదోషముచేత మఱియొకరికి దోషము కలుగ నట్లు వర్ణించినచో రెండవయవజ్ఞ :— కమలము ముడుచుకొన్న మాత్రముచేతఁ బూర్ణిమాచంద్రునకు లోపమేమి? ఇక్కడ పద్మము యొక్క దోషముచేతఁ జంద్రునకు దోషము కలుగనట్లు చెప్పఁబడి నందున రెండవయవజ్ఞ యయినది.

౭౧. అనుజ్ఞాలంకారము — దోషమునం దేదో గుణ మున్న దను హేతువుచేత నాదోషమునే కోరినట్లు వర్ణించినచో ననుజ్ఞ:— ఈశ్వరభక్తిని కలిగించు గుణమందుండుటచేత నేనాపదలనే కోరెదను. ఇక్కడ నాపద లనుదోషమునం దీశ్వరుని మఱువకుండఁ జేయుగుణ ముండుటనుబట్టి యాయాపదలనే కోరినట్లు వర్ణింపఁబడినందున నవజ్ఞ యైనది.

22. లేశాలంకారము—అనుకూల మగుటనుబట్టి దోషమును గుణమునుగాఁ జెప్పినను, ప్రతికూల మగుటనుబట్టి గుణమును దోషమునుగాఁ జెప్పినను, లేశము:— మధుర వాక్యములు లేని సకలపత్నుల కును స్వచ్ఛందవిహారము కలుగుచుండఁగా, ఓచిలుకా! నీ కీపంజర బంధముకలుగుట నీవాజ్మాధుర్యముయొక్క ఫలమే కదా? ఇక్కడ మొదటివాక్యమునందు స్వచ్ఛందవిహారాను కూల్యమునుబట్టి దోష మయిన వాజ్మాధుర్య రాహిత్యమును గుణమునుగాఁ జెప్పుటచేతను, రెండవవాక్యమునందు స్వేచ్ఛావిహారాభావ ప్రాతికూల్యమును బట్టి గుణ మయిన వాజ్మాధురిమమును దోషమునుగాఁ జెప్పుటచేతను రెండువాక్యములును వరునగా ద్వివిధ మయిన లేశాలంకారమునకు నుదాహరణము లయినవి.

23. ముద్రాలంకారము — ప్రకృతార్థబోధకము లయిన పద ములచేతనే ప్రకృత మయిన నూచ్యార్థసూచనమును వర్ణించినచో ముద్ర:— ఆటవెలఁది గీత మందంబుగాఁ జేసె, మృదుపదాళితోడ మెచ్చువుట్ట. ఆటవెలఁది యనఁగా వేశ్యయు నాటవెలఁది యను గీత పద్యమును గనుక, ఆటవెలఁది (వేశ్య) మృదుపదములతో గీతము (పాట) ను మెచ్చువుట్టున ట్లందముగాఁ జేసె ననుప్రకృతార్థ ప్రతిపాద కము లయిన పదములచేతనే ప్రకృతమందు నూచ్యమయినయాట వెలఁది యను గీతపదమును మృదుపదములతో మెచ్చువుట్టున ట్లంద ముగాఁ జేసె నన్న యర్థముయొక్క నూచనగూడ వర్ణింపఁబడినందున ముద్రాలంకార మయినది.

24. రత్నావళ్యలంకారము — ప్రకృతార్థమున కప్రకృతా ర్థతాదాత్మ్యము తోఁచుటకయి ప్రకృతార్థబోధకపదముల చేతనే ప్రసిద్ధక్రమమును వదలకుండ నప్రకృతార్థమును నిర్దేశించినచో

రత్నావళి:—నీవు చతురాస్యుడవును పురుషోత్తముఁడవును సర్వజ్ఞుఁడవును నయి పెలయుచున్నావు. ఇక్కడ వర్ణ్యమయిన రాజున కప్రకృతము లయిన బ్రహ్మాదులతాదాత్మ్యము తోఁచుటకు నేర్పు గలమాటలు గలవాఁడవును పురుషశ్రేష్ఠుడవును సమస్తమును దెలి సినవాఁడవు ననుప్రకృతార్థములను బోధించెడు చతురాస్య పురుషో త్తమసర్వజ్ఞపదములచేతనే క్రమముగా బ్రహ్మ విష్ణు మహేశ్వరు లను నప్రకృతార్థము నిర్దేశింపఁబడినందున రత్నావళి యయినది.

౭౫. తద్గుణా లంకారము — ఒకవస్తువు స్వగుణమును విడిచి యన్యగుణమును పొందినట్లు వర్ణించినచో తద్గుణము — ఓకాంతా! అధరకాంతిచే నీముక్కు ముత్యము పద్మరాగమణి యగుచున్నది. ఇక్కడ నాసామౌక్తికము తనధవళ కాంతిని విడిచి యధరోష్ఠము యొక్క రక్తకాంతిని పొందినట్లు వర్ణింపఁబడినందున తద్గుణ మయినది.

౭౬. పూర్వరూపాలంకారము—ఇది ద్వివిధము.

(౧) స్వగుణమును విడిచి యన్యగుణమును స్వీకరించినవస్తువు నకుఁ గారణాంతరముచే మరల స్వగుణము వచ్చినట్లు వర్ణించినచో నొకపూర్వరూపము:—ఓరాజా! శివుని గళకాంతిచే నల్లపడిన శేషుఁడు మరల నీశుద్ధకీర్తిచేఁ దెల్లపడుచున్నాఁడు. ఇక్కడ శేషుఁడు స్వకీయ మైన ధావళ్యమును విడిచి శివునికంఠ నీలిమను పొందినవాఁడై మరల రాజుయొక్క యశఃకాంతిచే ధవళిమ నొందినట్లు చెప్పఁబడి నందున పూర్వరూపమైనది.

౭౭. వస్తువునకు నాశనము కలిగించిన తరువాతను పూర్వ స్థితియే యున్నట్లు వర్ణించినచో రెండవపూర్వరూపము: — ఆకాంత రతివేళ సిగ్గుచే దీపము నార్పినను కాంచికారత్నములచేత వెలుతు రట్టె యుండెను. ఇక్కడ కాంతికారణ మయిన దీప మార్పఁబడినను

గాంతి పోక యొడ్డాణమునందలి రత్నములచేత దీప్తి పూర్వ రూపము ననే వెలుఁగుచున్నట్లు చెప్పఁబడినందున పూర్వరూప మయినది.

22. అతద్గుణాలంకారము — అన్యవస్తువుయొక్క గుణమును పొందఁ దగిన కారణ ముండియుఁ బొందనట్లు వర్ణించినచో నతద్గుణము:—ఓ రాజా! నీకీర్తిధావళ్యముచేత శివునికంఠ మైనను దెల్ల నగునుగాని నీశత్రుల దుష్కీర్తి తెలుపు గాదు. ఇక్కడ శత్రుల దుష్కీర్తి రాజుయొక్క యశోధావళ్యమును జేరి తెల్లపడఁ దగి యుండియు తద్గుణమును పొందనట్లు వర్ణించినందున నతద్గుణ మైనది.

23. అనుగుణాలంకారము — పూర్ణము స్వతస్సిద్ధముగా నున్నగుణమునకు మఱియొకవస్తువు యొక్కసంయోగము వలన గుణాధిక్యము కలిగినట్లు వర్ణించినచో ననుగుణము:— చెవులఁ జేర్చిన నీలోత్పలములు తత్కటాక్షలబ్ధిచే మఱింత నైల్యమును పొందు చున్నవిఁ ఇక్కడ నల్లగలువలయొక్క స్వతస్సిద్ధనీలగుణమునకు కడకంటి చూపులచే మఱింత నలువు కలిగినట్లు చెప్పఁబడినందున ననుగుణ మైనది.

24. మిశ్రితాలంకారము—గుణాదిసామాన్యముచేత భేదము కనఁబడనట్లు వర్ణించినచో మిశ్రితము: — నీసహజారుణము లైన చరణములందు లత్తుకపూఁత కానరాకున్నది. ఇక్కడ నరుణగుణ సామాన్యముచేత పాదములయందు లాక్షారసాలంకారము భేదముగాఁ గానఁబడునట్లు వర్ణింపఁబడినందున మిశ్రిత మైనది.

25. సామాన్యాలంకారము — సమానధర్మము గలరెండు వస్తువులలో నేది యేవస్తువో తెలిసికొనుభేదము లేనట్లు వర్ణించినచో సామాన్యము:— తామరకొలఁకులోఁ జొచ్చిన యాకాంతల ముఖములే తెలియరాకున్నవి. ఇక్కడ సమానధర్మమునుబట్టి యుపమానోప

మేయము లయిన పద్మముఖములకు భేదమే కానరానట్లు చెప్పఁబడి నందున సామాన్య మయినది.

౯౧. ఉన్మీలితాలంకారము — రెండువస్తువులకు సాదృశ్యమే వలన భేద మగపడనప్పుడు కారణాంతరముచే భేదము తెలియ వచ్చి నట్లు వర్ణించినచో నున్మీలితము — ఓ రాజా! నిశీర్థమగ్న మైన హిమవద్గిరిని దేవతలు శైత్యముచేతఁ దెలియుచున్నారు. ఇక్కడ యశోధావళ్యముచేత నభిన్న మయినహిమవత్పర్వతము వే ఱయిన శైత్యధర్మముచేఁ దెలిసికోఁబడ్డట్లు వర్ణింపఁబడినందున నున్మీలిత మయినది.

౯౨. విశేషాలంకారము — సమానధర్మము గల రెండువస్తు వులలో నొకదాని కొకానొకకారణముచేత విశేషము కలిగినట్లు చెప్పినచో విశేషము:— తమ్మికొలఁకులో నోలలాడు స్త్రీలముఖము లును పద్మములును జంద్రోదయము కాఁగానే తెలియ నయ్యెను. ఇక్కడ భేదము కానరాకుండు పద్మముఖములలో నొకటియైన పద్మ ములకుఁ జంద్రోదయకారణమున ముకుళన మను విశేషము కలిగినట్లు వర్ణింపబడినందున విశేషాలంకారమయినది.

౯౩. గూఢోత్తరాలంకారము — ఒక రడిగిన ప్రశ్నకు మఱి యొకరు స్వాభిప్రాయగర్భితముగా నుత్తరము చెప్పినట్లు వర్ణించినచో గూఢోత్తరము — ఓకాంతా! ఈనది నిక్కడ దాఁటవచ్చునా? ఓపథి కుఁడా! ఇక్కడ గాదు. ఆవేతసీనికుంజ మున్నచోటికిఁ బొమ్ము. నేను జూఁపెదను. ఇక్కడ నది యెక్కడ దాటవచ్చు నని పథికుఁ డడిగిన ప్రశ్న కొక యువతి మన కచ్చట సంగమానుకూలస్థల మనుస్వాభి ప్రాయము గర్భమం దుండునట్లుగా ప్రబ్బపొదకడ దాఁటవచ్చు నని యుత్తర మిచ్చినట్లు వర్ణింపఁబడినందున గూఢోత్తర మయినది.

౯౫. చిత్రోత్తరాలంకారము — ప్రశ్నాభిన్నోత్తర రూప మనియు, ఉత్తరాంతరాభిన్నోత్తరరూప మనియు, చిత్రాలంకారము ద్వివిధము.

(౧) ఒక రడిగినప్రశ్న కాప్రశ్న చేసిన వాక్యముచేతనే యుత్తరము చెప్పినట్లు వర్ణించినచో ప్రశ్నాభిన్నోత్తరరూపము:— నాతి! దూరమే యిల్లు? అడుగు లాతె. నాతి దూరమేయిల్లు; అడుగులాతె. ఇక్కడ "నోనాతీ యిల్లుదూరమా కాళ్ళు కాలుచున్న" వని యర్థ మిచ్చెడుప్రశ్న కావాక్యముచేతనే "యిల్లు నాతిదూరమే (నమీపమే) ఆ అడుగులే" యని యుత్తర మిచ్చినట్లు చెప్పఁబడినందున ప్రశ్నా భిన్నోత్తర రూపచిత్రోత్తర మయినది.

(౨) భిన్నవిషయకము లయిన రెండు ప్రశ్నల కొక్కవాక్యము చేతనే యుత్తరము చెప్పినట్లు వర్ణించినచో నుత్తరాంతరాభిన్నోత్తర రూపము:— సోమయాజులు స్వర్గమున నెవ్వ రెను గలయఁ గోరుదురు? శుభకార్యములయందు స్తంభముల నేమి గట్టుదురు? రంభను. ఇక్కడ భిన్నవిషయకము లగు పయి రెండు ప్రశ్నలకును వరుసగా దేవవేశ్యయు కదళీస్తంభము నను నర్థ మిచ్చెడు రంభ నను నొక్క యుత్తరమే చెప్పఁబడినందున నుత్తరాంతరాభిన్నోత్తర రూపచిత్రో త్తర మయినది.

౯౬. సూక్ష్మాలంకారము—ఒకరు నేత్రాది చేష్టచేత స్వాభీష్ట మును దెలుపఁగా మఱియొక రది తెలిసికొని తదనుగుణస్వాభిప్రాయ సూచకచేష్టా విశేషమును జూపినట్లు వర్ణించినచో సూక్ష్మము:— నాయకుఁ డొకసుందరిని భ్రమతోడిచూడ్కిని జూడఁగా నాకాంత శీమంతమణిని దనకురులచేఁ గప్పెను. ఇక్కడ నాయకుఁడు తా నాకాంత నభిలషించిన యభిప్రాయమును కన్నులతోఁ దెలుపఁగా

నాకాంత పాపటయుం దున్నరత్నములు తనశిరోజములతోఁ గప్పి సూర్యుఁ డస్తమించి చీఁకటి పడినతరువాత రమ్మను నిజాభిప్రాయము చేష్టచేత నూచించినట్లు వర్ణింపఁబడినందున సూక్ష్మాలంకార మయినది.

౮౬. పిహితాలంకారము — వరునివ్యాపారమును తదీయులక్ష ణములచేఁ దెలిసికొని తెలిసినట్లు చెప్పక సాభిప్రాయచేష్ట చేసినట్లు వర్ణించినచో పిహితము:— పతి ప్రాతఃకాలమున నింటికి రాఁగా భార్య పరుండుటకయి పాన్పు వేసెను. ఇక్కడ రాత్రియంతయు భర్త వర సతిని గలసి మేలుకొని యుండె నన్నవృత్తాంతమును తచ్ఛరీరమందలి కుంకుమాదిచిహ్నములచేఁ దెలిసికొని దానిని బయలఁ బుచ్చక రతి శ్రమచే నలసి రాత్రినిద్ర లేకుంటివి గాన సుఖనిద్ర చేయు మనెడి యభిప్రాయము స్పష్ట మగునట్టుగా శయ్య యమర్చినట్లు వర్ణింపఁబడి నందునఁ బిహిత మయినది.

౮౭. వ్యాజోక్త్యలంకారము—ఆకారచిహ్నములయొక్కకార ణము చెప్పఁదగి యుండనిచో గారణాంతరమును గల్పించి చెప్పి నిజ మయినకారణమును దాఁచినచో వ్యాజోక్తి— ఓచెలీ! గృహారామము నందుఁ దిరుగుటచేత నామీనఁ బరాగ మెట్లు నిండెనో చూచితివా? ఇక్కడ నొకయువతికిఁ జారరతివలన దేహమున దుమ్మంటుకొనఁగా నిజ మయినయాకారణము చెప్పఁదగినది కానందున తోఁటలోఁ దిరు గుటచే నొడలధూళి గ్రమ్మె నని కారణాంతరమును గల్పించి నిజ మయిన హేతువును మఱుఁగుపఱిచినట్లు వర్ణింపఁబడినందున వ్యాజోక్తి యయినది.

౮౮. గూఢోక్త్యలంకారము — ఒకరినిగూర్చి పలుకఁదగిన వాక్యమును బరులకుఁ దెలియకుండుటకయి మఱియొకరినిగూర్చి పలికి

నట్లు వర్ణించినచో గూఢోక్తి — ఓవృషభమా! క్షేత్రస్వామి వచ్చు చున్నాఁడు. ఈపరక్షేత్రమును విడిచి వేగముగాఁ బొమ్ము. క్షేత్ర మనఁగా భార్యయు పొలమును గనుక పొలములో నన్యసతితో సంభోగించుచున్న పురుషునిగూర్చి భర్తనచ్చుచున్నప్పుడు కావలి యున్నదూతిక పలుకవలసిన వాక్యమును బరులకుఁ దెలియకుండుట కయి పొలములో మేయుచున్న యెద్దునుగూర్చి క్షేత్రస్వామి వచ్చు చున్నాఁడు గాన శీఘ్రముగా క్షేత్రమును విడిచి పొమ్మని చెప్పినట్లు వర్ణింపఁబడినందున గూఢోక్తి యయినది.

౮౯. వివృతోక్త్యలంకారము — శ్లేషచే గోపనము చేయఁ బడిన గూఢార్థము కవిచేఁ గంతోక్తిగా వివరణము చేయఁబడినచో వివృతోక్తి:— ఓవృషభమా! పరక్షేత్రమును వేగవిడిచి పొమ్మని సఖున కొకచెలికాఁడు సూచనగాఁ జెప్పెను. ఇక్కడ పరక్షేత్రమును విడువు మనుచోటఁ గల శ్లేషగుప్త మయిన గూఢార్థము సూచనఁగాఁ గవిచే వివరింపఁబడినట్లు వర్ణింపఁ బడినందున వివృతోక్తి యయినది.

౯౦. యుక్త్యలంకారము—ఒకరురహస్యమయినవనినిజేయుచు నాప్తులు కాని వారువచ్చినప్పు డా రహస్యము వారికిఁ దెలియకుండుట కయి యొకానొకక్రియచే వారికి భ్రాంతికలుగఁజేసి వంచించినట్లు వర్ణించినచో యుక్తి:— ఒక యువతి చిత్రపటమునఁ బ్రియుని వ్రాయుచు ననాప్తురా లొకతె రాఁగా నాతనిహస్తమునఁ జెఱుకువిల్లు వ్రాసెను. ఇక్కడ నొకానొక యువతి రహస్యముగాఁ దన ప్రియునిరూపము వ్రాయుచు నింతలో నాప్తురాలు కానిదొకతె యచ్చటికి రాఁగాఁ దన రహస్యమూ యనాప్తురాలికిఁ దెలియకుండ వంచించుటకయి చేతి యందు ధనుస్సు వ్రాసి చిత్రలిఖితుఁడు మన్మథుఁ డనుభ్రాంతి కలి గించినట్లు వర్ణింపఁబడినందున యుక్తి యయినది.

౯౧. లోకోక్త్యలంకారము— లోకప్రవాదము ననుకరించిన మాటలను కూర్చి వర్ణించినచో లోకోక్తి:— ఓచెలీ! నాలుగయిదు దినములు కన్నులుమూసికొని గడపుము; నీభర్త సుఖముగావచ్చును. భర్త గ్రామాంతరము పోయిననఖిని గూర్చి యొక చెలికత్తె నాలు గయిదుదినములు కన్నులుమూసికొని గడపుమన్న లోకోక్తి నమర్చి చెప్పినందున లోకోక్తి యయినది.

౯౨. ఛేకోక్త్యలంకారము — లోకోక్తి నర్థాంతరగర్భిత మగునట్లుగాఁ గూర్చి వర్ణించినచో ఛేకోక్తి:— పాముకాళ్ళు పాము నకే తెలియును. ఇక్కడ పాముకాళ్ళు పామునకే తెలియు నన్న లోకోక్తిప్రియునిగూర్చి నాయికచే నీమాయలు నీకే తెలియునుగాని యన్యులకుఁ దెలియ వనునభిప్రాయము గర్భిత మగునట్లుగాఁ జెప్పఁ బడినందున ఛేకోక్తి యయినది.

౯౩. వక్రోక్త్యలంకారము — ఒకఁ డొకవాక్యమును ఋజు బుద్ధిచేతనే పలుకఁగా మఱియొకఁ డావాక్యమునకుఁ గోపాదికారణము లనుబట్టి శ్లేషచేతఁగాని కాకుస్వరము చేతఁగాని యర్థాంతరమును గల్పించి వంకరమాట యాడినట్లు వర్ణించినచో వక్రోక్తి:— ఓకాంతా! కాకులు కూయుచున్నవి. యిప్పుడు పగలగును జుమా. ఓనాథా! కొఱ నోములునోచిన నాకుఁ బగలు గాక స్నేహ మెట్లగును! ఇక్కడ పగ లనుమాట ఋజుబుద్ధితో దివాభాగ మను నర్థమునందే నాయకునిచే నుపయోగింపఁబడినను కోపముచేత నాయిక దానికి విరోధము లను నర్థాంతరమును కల్పించి వక్రభాషణ మాడినట్లు వర్ణింపఁ బడినందున వక్రోక్తి యయినది.

౯౪. స్వభావోక్త్యలంకారము — జాత్యాదులయం దున్న యథార్థధర్మములను రసికజనహృదయరంజకముగా నున్నవి యున్నట్లు

వర్ణించినచో స్వభావోక్తి:— ఆలేడి చెవులు నిక్కించి బెదరిబెదరి చూచుచు గొరిసెలతోఁ దల గోఁకుకొనుచున్నది. ఇక్కడ లేడియొక్క స్వభావచేష్ట లున్నవి యున్నట్లు వర్ణింపఁబడినవి గనుక స్వభావోక్తి యయినది.

౯౫. భావికాలంకారము — వెనుక జరిగినవృత్తాంతమునుగాని ముందు జరగఁబోవువృత్తాంతమునుగాని మహాశ్చర్యకరము లగుటచేఁ బ్రత్యక్షముగా నిప్పుడు జరుగుచున్నట్లు వర్ణించినచో భావికము:— దేవాసుర లిప్పుడు నాకన్నులయెదుర యుద్ధము చేయుచున్నారు. ఇక్కడ భూతకాలమునం దెప్పుడో జరిగిన దేవదానవయుద్ధము తన కిప్పుడు కన్నులఁ గట్టిన ట్లున్న దనుఁనర్థమునఁ బ్రత్యక్షముగా నిప్పుడే జరుగుచున్నట్లు చెప్పఁబడినందున భావిక మయినది.

౯౬. ఉదాత్తాలంకారము — శ్లాఘ్యమైనట్టిగాని శౌర్యాది సంపత్సమృద్ధిమంత మయినట్టిగాని చరిత్ర మన్యమున కుపలక్షణము గాఁ జెప్పినచో నుదాత్తము:—ఆకిరాతార్జునులు పోరాడిన కొండచటి యను జూచినాఁడను. ఇక్కడ నుపలక్షణ మనఁగా నానవాలు. ఈయుదాహరణమునందు శ్లాఘ్యమై శౌర్యాదిసమృద్ధిమంత మయిన శివార్జునయుద్ధచరితము కొండచరియ కుపలక్షణముగా ననఁగా నాన వాలుగాఁ జెప్పఁబడినందున నుదాత్త మయినది.

౯౭. అత్యుక్త్యలంకారము — అత్యద్భుతమును నసత్యమును నగుశౌర్యాదార్యాదులను వర్ణించినచో నత్యుక్తి:— ఓరాజా! నీవు దాతవైయుండఁగా యాచకులు కల్పవృక్షము లయినారు. ఇక్కడ రాజిచ్చిన యపరిమితధనముచేత యాచకు లెల్ల ధనాఢ్యులయి యడిగిన వారికెల్లఁ గల్పవృక్షములవలె నిచ్చువా రైనారని యత్యద్భుతము

గా మిథ్యాభూత మయినయౌదార్యము వర్ణింపఁబడినందున నత్యుక్తి యయినది.

౯౮. నిరుక్త్యలంకారము— యౌగికార్థము గలశబ్దముల కవయవార్థమువలన నర్థాంతరకల్పనము చేసి వర్ణించినచో నిరుక్తి:— ఓచంద్రా! మమ్మిట్లు బాధించు చుండుటచేత నీవు దోషాకరుఁడవగుట నిశ్చయమే. ఇక్కడ విరహబాధచే వెన్నెలకాఁకకుఁ దాళ లేని యొకసతి రాత్రిని జేయువాఁడనుయౌగికార్థము గలదోషాకరశబ్దమున కవయవార్థమునుబట్టి దోషములకు స్థానభూతుఁడ వనునర్థాంతరమును గల్పించినట్లు వర్ణింపబడినందున నిరుక్తి యయినది.

౯౯. ప్రతిషేధాలంకారము — చెప్పఁబడిననిషేధము ప్రసిద్ధమైన దయియుండి యర్థాంతరగర్భితముగా ననువదింపఁబడినచోఁ బ్రతిషేధము:— ఓశకునీ! ఇది నీవు నాఁడు పాచికలతో నాడినజూదము కాదు; ఇప్పుడు వాఁడిబాణములతో నాడెడుజూదము సుమీ. ఇక్కడ యుద్ధము జూదము కాదన్ననిషేధము ప్రసిద్ధముగాఁ దెలిసినదే యైనను శకునికి జూదమునందే కాని యుద్ధమునందు నేర్పు లేదను నర్థాంతరమును సూచించుటకు నకులునిచేఁ జమత్కారముగా ననువదింపఁబడి నిషేధింపఁబడినందునఁ బ్రతిషేధ మయినది.

౧౦౦. విధ్యలంకారము—అర్థాంతరగర్భిత మయి చమత్కారహేతు వగునట్లుగా సిద్ధమైన వస్తువును దిరిగి విధించినచో విధి:— ఈవసంతకాలమునఁ బంచమస్వరముతో నొప్పుచుండుటచేతఁగోకిల కోకిల యయినది. ఇక్కడ కోకిలకు కోకిలత్వము సిద్ధమయియుండఁగా బంచమస్వరశాలిత్వముచే సర్వజనమనోహర మగుచున్నదన్న యర్థము గర్భీకృతమయి చమత్కారజనక మగునట్లుగా మరల కోకిల కోకిల యగునని విధించుటవలన విధియైనది.

౧౦౧. హేత్వలంకారము — (౧) కార్యముతోడఁ గారణము నకు సంబంధమును వర్ణించిచో హేతువు:— ఆచంద్రుఁడు విరహిణీ జనులను భయభ్రాంతలనుగాఁ జేయుటకే యుదయించెను. ఇక్కడ చంద్రోదయ మనుకారణమునకును విరహిణీభయ మనుకార్యమున కును సంబంధము వర్ణింపఁబడినందున హేతు వైనది.

(౨) కార్యశీఘ్రత్వాదిసూచనకై కార్యకారణముల కభే దము వర్ణించినచో (రెండవ) హేతువు:—ఓరాజేంద్రా! నీకటాక్షములే కవీంద్రులకు లక్ష్మీవిలాసములు. ఇక్కడ రాజుయొక్క కటాక్ష మాత్రముచేతనే కవులకు సంపత్సమృద్ధు లగుచున్న వని చెప్పఁ దగి యుండఁగాఁ గార్యశీఘ్రతా సూచనమునకై కటాక్షములే సంపద్వి లాసము లని కార్యకారణముల కభేదవర్ణనము చేయఁబడినందున హేతు వైనది.

సత్యవాదిని

370

371

సత్యవాదిని

THE FATHERHOOD OF GOD,
AND
THE BROTHERHOOD OF MAN.

ఈశ్వరుని పితృభావము, మనుష్యుని భ్రాతృభావము.*

ఓ భ్రాతృవరులారా!

సమస్త సంస్కారములలోను మతసంస్కారము ప్రధానమైన దనియు, మతము పరిశుద్ధమయినచో సమస్తసంస్కారములును దాని వెంబడినే యనాయాసముగా జరుగు ననియు, గతభానువారమునాఁడు చెప్పి యుంటినిగదా. తనకంటె నధికశక్తిసంపన్నత గల దేవుఁడుగాని దేవతలుగాని యున్నా రనియు, తదుపాసనము చేయుచు తత్ప్రీతికర ముగాఁ దాను వర్తింప వలయుననియు, తలఁ చెడి మనుష్యుని యభి ప్రాయము మత మనఁబడును. అనాగరికదశలో సృష్టిలోని స్వాభావిక పదార్థములనే పూజించుటయు, అల్పనాగరికదశలో తమ దేవతల పేర ప్రతిమలనుగూడఁ గల్పించి వాసి నర్చించుటయు, అధిక నాగరికదశలో నీశ్వరుఁ డొక్కఁడని యెఱిఁగి యాతని మానసికముగా నుపాసించు టయు, సాధారణముగా తటస్థించు చున్నది. ఏకేశ్వరోపాసకు లైన పరిశుద్ధాస్తికమతస్థులు దేవుఁడు సృష్టికర్త యనియు లోకరక్షకుఁ డనియు, నిరాకారుఁ డనియు, సత్యస్వరూపుఁ డనియు, పరిశుద్ధుఁ డనియు, దయాస్వరూపుఁ డనియు, విశ్వసించి సర్వ విషయముల

---

* ఇది 1906 వ సంవత్సరము ఏప్రిల్ నెల మొదటి తేదిని రాజమహేంద్రవర ప్రార్థనాసమాజమునఁ జదువఁబడినది.

యందును తదాజ్ఞానుసారముగాఁ బ్రవర్తించుట పరమకర్తవ్య మని భావింతును. దయాస్వరూపుఁడయిన సర్వకర్త యగుటచే నీశ్వరుఁడు లోకపిత యగుచున్నాఁడు; ఈశ్వరసృష్టిలోనివారై తద్దయాపాత్రులైన సమస్త మానవులును నీశ్వరకుటుంబమయి పరస్పరభ్రాత లగుచున్నారు. కాఁబట్టి సత్యమైన పరిశుద్ధాస్తిక మతమునందు దేవుని పితృభావమును మానవుల పరస్పరభ్రాతృభావమును ముఖ్యసిద్ధాంతములు. ఈరెండుసిద్ధాంతములను గూర్చియు నే నీ సాయంకాలమునఁ గొన్నిమాటలు చెప్పఁబోవుచున్నాను.

పూర్వాచారము నొక్కపట్టున విడువలేకుండుట మానుష స్వభావ మయియున్నది. అందుచేతనే జనులనేకవిషయములలో నాగరికాగ్రగణ్యులయి యేకేశ్వరారాధనమే పరమకర్తవ్య మని యెఱిఁగి నవారయ్యును ఆనాగరికదశలో వచ్చిన స్వాభావిక వస్తుపూజనమును నల్పనాగరికదశలో వచ్చిన ప్రతిమార్చనమును పలువురు పూర్వాచార బలముచేత పూర్ణముగా విడువఁజాలకున్నారు. కాఁబట్టి మతమును పరిశుద్ధము చేయువలె నన్నచో నేతద్విషయమున సంస్కార మవశ్యముగఁ జేసికొనవలయును. మతసంస్కారము జరగనియెడల నీతివిషయములోను సంఘవిషయములోను తక్కిన సమస్తవిషయములలోను మితిమీఱినదురాచారము లుద్భవిల్లి ప్రజాసౌఖ్యమునకును దేశాభివృద్ధికిని భంగము కలిగించును. సమస్తమానవధర్మశాఖోపశాఖలకును సంతోషరసమును ప్రవహింపఁ జేయుటకు మూలమైన మతిజలాశయమే కలుషమయి యనర్థదాయక మయినపక్షమున సంసారవృక్షమునం దేశాభ యూరోగ్యస్థితిలో వర్ధిల్లి సుఖప్రదము కాఁ గలుగును; మనుష్యుని కాయమునకు మతమే ప్రాణము; మతము నిర్దుష్టస్థితిలో నుండ నప్పుడు సంఘము జీవచిహ్నము లేనిబొందివంటిదిగా నుండును. సంఘ

శరీరమునకుఁ బ్రాణ మయిన మతము పరిశుద్ధ మయి యుత్సాహ వంతము కాదేని, సాంఘికసంస్కారాదు లేవియు సఫలము లయి దేశ క్షేమకరములు కానేరవు. కాఁబట్టి దేశాభిమాన మానసీయు లగు మాన్యులారా! మీరు నిజముగా దేశక్షేమమును గోరెదు వారయిన పక్షమున, ఈశ్వరునిపితృభావమును వాక్కుచేతను మనస్సు చేతను క్రియల చేతను పూర్ణముగా నంగీకరించి యాతని నొక్కనినే ప్రీతి పూర్వకముగా భజించుచు తదితరారాధనమును విడిచి పెట్టుఁడు. ఈశ్వరైకారాధనమునకును, ఈశ్వర పితృత్వ భావనకును, మన దేశ ములో గర్భశత్రువుగా నున్నది విగ్రహారాధనము. సర్వానర్థమూల మయిన విగ్రహారాధనము మూలముట్టుగ నశింపఁజేసినఁగాని మన ఈశ్వరపితృత్వసిద్ధి యలవడ నేరదు. కాఁబట్టి యేరూపమున నున్నను విగ్రహారా ధనమును మనము విషసర్పమును జూచినట్టు చూచి ద్వేషించుచు సర్వవిధముల చేతను దాని నంతము నొందింప మన శక్తియుక్తులను వినియోగించి పాటు పడవలయును. మనుజుఁ డేదిన మున విగ్రహారాధనపిశాచపీడనుండి విడివడునో యాదినమే యాతని జీవిత కాలములోనెల్ల మహాసుదినము; ఆదినమే యతఁడు పాపబంధ ములనుండి విముక్తుఁ డగుటకు కృత ప్రారంభుఁ డయిన పుణ్య దినము; ఆదినమే యతఁడు సర్వేశ్వరసాంగత్యభాగ్యము నపహరించుచుండిన వీడని పీడను వదల్చుకొని తాను సుఖియయి యొక మహోత్సవమును రూపుమాపి దేశమును సుఖింపఁజేయు దీక్షవహించిన పర్వదినము.

సత్యైకాదర పరాయణులారా! మీరీదినమునుండి ఈశ్వరరాజ్యా క్రమణ ద్రోహమున కొడిగట్టిన విగ్రహ రూపరివులపయి ధ్వజమెత్తి నీచతిసీచమయిన తద్దాస్యమునుండి మీయాత్మలను రక్షించుకొని యీశ్వరసేవాపరాయత్త చిత్తులరయి మీసహోదరు లయిన యుష్మ

ద్దేశీయుల యాత్మల నుత్తమోత్తము మయిన యీశ్వరసేవకుఁ బురి
కొల్పుటకు సర్వవిధములఁ బ్రయత్నింపుఁడు. ఈవిగ్రహ పిశాచములు
మిమ్మీశ్వర దూరులనుగా మాత్రమే కాక నీతిదూరులను గాను
సౌభ్రాత్ర దూరులనుగాను మానుషస్వభావ దూరులనుగాను జేయు
చున్నవి. వల్లభవైష్ణవధర్మము పేర జరగు వ్యభిచారములును, ఆగ
మోక్తధర్మముపేర జరగునురాపానాదులును, గంగార్చనముపేర
జరగుశిశుహత్యలును, కాళికాపూజపేర జరగుజంతుహింసలును, విగ్రహ
పిశాచముల దురోభ్ధనవలనఁగాక మఱి దేనివలనఁ గలిగినవి? ఇంత
కంటెను నీతిమాలినిపను లేవి యుండును? శైవవైష్ణవ ధర్మముల పేర
నొండొరుల ద్వేషించి దూషించుకొనుటయు ద్వైతాద్వైతధర్మముల
పేర నొఁడొరులను పొడగన్నపాపమునకై చాంద్రాయణ భూప్రదక్షి
ణాది ప్రాయశ్చిత్తములు చేసికోవలె ననుటయు విగ్రహ పిశాచముల
దురోభ్ధనలవలనఁ గాక మఱి దేనివలనఁ గలిగినవి? ఇంతకంటెను
సౌభ్రాత్రరాహిత్యము మఱి యేముండును? వరాహ భైరవ నామ
ములచే మనుష్యులను పందులకును కుక్కలకును బ్రొక్కినట్లు
చేయుట విగ్రహపిశాచముల దురోభ్ధనలవలనఁ గాక మఱి దేనివలనఁ
గలిగినది? ఇంతకంటెను మానుషస్వభావమునకు విరుద్ధములైన పనులు
మఱి యేముండును? మాటాడుటకు నోరు లేకయే యిటువంటి దురోభ్
ధనలం జేసి లోకమును వంచించు చున్నవిగ్రహపిశాచములు నోరు
తెఱచి మాటాడఁ గలిగినచో నెంత యొక్కువహాని చేయఁగలుగును!
ఓసువివేకులారా! అపవిత్రమును నసర్థదాయకమును నయినవిగ్రహ
పిశాచసేవను విడనాడి పవిత్రమును శ్రేయోదాయకమును నయిన
యేకేశ్వరసేవ నంగీకరింపుఁడు. ఉత్తరక్షణమునఁ మీరు నీతియుతు
లును సౌభ్రాత్రమహితులును మానుషస్వభావ భూషితులును నగు

దురు. అప్పుడు లోకమం దంతట సేశ్వరరాజ్య మేర్పడును; లోకము లోనివారెల్లరును భ్రాతలయి పరస్పరానురాగము కలవారగుదురు; ఎల్లమానవులును జాతిమతవైషమ్యవిరహితులయి దేవతుల్యులగుదురు. "కాష్ఠలోష్టేషు మూఢానాం యుక్త స్యాత్మని దేవతా" యనున్యాయమునుబట్టి దేవుఁడు మూఢులకు కట్టెలలోను మట్టిగడ్డలలోను జ్ఞానుల కాత్మలోను నుండునని చెప్పి, మూఢజనబాహుళమయినలోకముకొఱకు విగ్రహారాధన ముండవలయునని కొందఱు మిమ్ము భ్రమపెట్టఁ జూతురు. ఆమాట లణుమాత్రమును విశ్వసింపఁబోకుఁడు. మనదేశమున కజ్ఞ జనబాహుళ మన్నయపఖ్యాతిని బోఁగొట్టి ప్రాజ్ఞజనబాహుళమన్న ఖ్యాతిని తెచ్చుటకయి నిరంతరకృషి చేయుఁడు. విగ్రహారాధనము నవలంబించి యజ్ఞులతోడ నధోగతికి మీరు దిగక విగ్రహారాధనపాశములనుండి విడిపించి యజ్ఞులను విజ్ఞులను జేసి మీతోడ నూర్ధ్వగతికి వారి నెక్కింపఁ బ్రయత్నింపుఁడు. సామాన్యముగా విగ్రహారాధనము నుపదేశించెడు శైవవైష్ణవపురాణములు సహిత మీవిషయమున విశేషముగా నేమి బోధించు చున్నవో వినుఁడు—

శ్లో॥ "ఆత్మసంస్థం శివం త్యక్త్వా బహిస్థం యజతే శివం
హస్తస్థం పిండ ముత్సృజ్య లిహే త్కూర్పరమాత్మనః".

తనలోపల నున్న శివుని విడిచి వెలుపల (గుళ్ళలో) నున్న శివుని పూజించువాఁడు చేతిలోనున్న ముద్దను పాఱవేసి మోచేతిని నాకువాఁడగునని శైవపురాణమైనస్కాందము ఘోషించు చున్నది.

శ్లో॥ "యో మాం సర్వేషు భూతేషు పంత మాత్మాన మీశ్వరం
హిత్వార్చాం భజతీ మూఢ్యాత్ భస్మ న్యేవ జుహోతిసః".

సకలభూతములయందు నాత్మస్వరూపుఁడనయి యున్న యీశ్వరుని నన్ను విడిచి మూఢత్వమువలన విగ్రహార్చన చేయువాఁడు బూడిదలో హోమము చేసినవాఁడగు నని వైష్ణవపురాణ మైనశ్రీమద్భాగవతము ఘోషించు చున్నది.

ఈశ్వరుని కళ్యాణగుణములలో నొక్కొక్కదానిని దెలుపుట కయి యొక్కొక్కవిగ్రహము ప్రతిష్ఠింపంబడె నని విగ్రహారాధనపక్ష మవలంబించి పలుక సాహసించెడు ధీమంతులమాట వట్టిబూటకముల మూట. ఏనుఁగుమోమును బానకడుపును గలగణనాథవిగ్రహముగాని కరచరణాదులు లేని జగన్నాథవిగ్రహముగాని యీశ్వరుని యేకళ్యాణ గుణమును దెలుపును?

ఆస్తికమతముఖ్యసిద్ధాంతములలో మొదటి దయినయీశ్వర పితృభావమునకు విగ్రహారాధనవిషవృక్షము గర్భశత్రు వనియు దానిని మూలచ్ఛేదము చేయుట పరమకర్తవ్య మనియు నింతవఱకుఁ గొంత చెప్పి యున్నానుగదా! ఇఁక రెండవ దయినమనుష్యభ్రాతృభావ మునకును గర్భశత్రు వయినది మనదేశములో వర్ణపిశాచము మఱి యొకటి యున్నది. విగ్రహారాధనపిశాచమును రూపుమాపుటకు మాన మెంత పట్టుదలతో పాటుపడవలయునో యంతపట్టుదలతోనే వర్ణపిశా చమును రూపుమాపుటకును మనము పాటుపడవలెను. ఈవర్ణపిశాచ మిడ్డి డీదేశమున సంఘమునొక్క ప్రాణవాయువులను పీల్చివేయు చున్న భయంకరకాలసర్పమై యున్నది. ఈపెనుభూతము భరతఖండ వాసులలో నైకమత్యమును స్నేహభావమును పూర్ణముగా చెడఁ గొట్టి బహుశతసంవత్సరములనుండి దేశాభివృద్ధికి భంగము కలిగించు చున్నది. ఇది యన్యోన్యసోదరభావము గలిగి యుండవలసిన హిందూ మహాజనులలో వైషమ్యమును పుట్టించి దేశక్షేమాభివృద్ధులకు భంగ

కరము లయిన నమస్తానర్థములకును మూల మయి యున్నది. పూర్వ కాలమునందువలె వర్ణాధిక్యము సర్వ్వనర్తనమునుబట్టి వచ్చునది గాక యిప్పుడు జాతిమాత్రముచేతనే కలుగునది యయి యున్నది. జ్ఞాన గుణసంపన్నుఁ డయి లోకోపకారపరాయణుఁ డయి భగవద్భక్తుఁ డయినయు త్తమశూద్రునికంటె జ్ఞానహీనుఁ డయి యవగుణపరిపూర్ణుఁ డయి యీశ్వరవిద్వేషి యయిననికృష్టబ్రాహ్మణజాతుఁ డధికగౌరవ నీయుఁడుగా పరిగణింపఁబడు చున్నాఁడుం. ఆహా! ఏమి యీకాల మహిమ! ఏమి యీవర్ణప్రభావము! ఏమి యీయన్యాయధన్యత! బ్రాహ్మణుఁడు కూరుచున్నచాపమీఁదఁ గూరుచున్న శూద్రునిపిఱ్ఱలు కోసివేయువలె నఁట! ఇది స్మృత్యుక్త మయిన మహాధర్మ మఁట! ధర్మశాస్త్రములలోనెల్ల నుత్కృష్ట మయిన దని యెంచఁబడుచున్న మనుస్మృతి యీవిషయమున విధించిన పరమధర్మమును చెవులు తనియునట్లుగా వినుఁడు—

శ్లో॥ సహాసన మభిప్రేప్సు రుత్కృష్ట స్యాపకృష్టజః
కట్యాం కృతాంకో నిర్వాస్యః స్ఫిచం వాస్యావకర్తయేత్॥

బ్రాహ్మణునితో సహాసనమును గోరు శూద్రుని తుంటిమీఁద వాఁత వేసిగాని పిఱ్ఱకోసిగాని వెడలఁగొట్టనలయునని ధర్మశాస్త్రము విధించు చున్నది. బ్రాహ్మణపక్షపాతమునుబట్టి యెంతటి యధర్మ ము మహాధర్మమని ఘోషించుట కీధర్మశాస్త్రము లజ్జింపకున్నది. ఇటువంటి ధర్మశాస్త్రవచనములు పరమప్రమాణములుగా భావింపఁ బడుచున్న యీదేశ మన్యాక్రాంత మగుటలోను పరస్పరద్వేషపూరిత మగుటలోను వింత యేమున్నది? వర్ణభేద మిప్పటివలె లేని పూర్వ కాలమునందు నానావిధ దేశమునకుఁ గొన్ని యల్పలాభములు గలిగి

నను, ఇప్పు డట్టిలాభము లేనియు లేక యనంతము లైనయనర్థములు మాత్రమే కలుగుచున్నవి. ఇప్పటినర్ణభేదమువలన దేశమునకు కలుగుచున్నయనర్థములలో నొకటి యీశ్వరకుటుంబములోనివా రగుటచే ననోన్యసౌభ్రాత్రము కలిగి యుండవలసిన సోదరునకును సోదరునకును వేఱుపాటు గలిగి పంక్తిభోజనములును సంబంధబాంధవ్యములును లేక పరస్పరద్వేషము ప్రబలి మానుష్యస్వభావము చెడుట. రెండవది జాతికట్టుబాటులే పరమధర్మము లయి నీతిగౌరవము చెడి మనుష్యులు దయాదాక్షిణ్యశూన్యులయిన రాక్షసతుల్యులగుట! జన్మమును బట్టివచ్చిన దురభిమానగర్వితుఁడగు బ్రాహ్మణసంజాతుఁడు తనసోదరుఁడనఁదగిన యధమవర్ణమువానిపై గోడవిఱిగి కూలినను సాయము చేయఁజూడక తాను మైలపడుదు నని యంటనొల్లకుండుటకు సిగ్గు పడుటకు మూఁఢుగా గర్వపడుచుండుట రాక్షసకృత్యము గాక మఱి యేమగును? రాజసభలో నప్రమాణములుచేయుటకును కూటసాక్ష్యములు పలుకుటకును శంకింపనివాఁ డయినను తాను బ్రాహ్మణుఁడ ననియో వైశ్వదేవపరుఁడ ననియో గర్వపడుచు భోజనసమయము నందు పాపభీతి కలవాఁడయి సత్యసంధుఁ డయిన యుత్తమశూద్రుఁడు తనకంట బడినంతమాత్రముచేత నాతని శపించుచు ముందరియన్న మును విడిచి లేచిపోవుటకంటె రాక్షసకృత్యము మఱి యే మండును? అతిబాల్యవివాహములు, స్త్రీవిద్యాభావము, వితంతువివాహనిరోధము, దేశాంతరగమన నిషేధము, మొదలయిన సమస్త సాంఘిక దురాచారములకును వర్ణభేదమే పట్టుకొమ్మ యైయున్నది. శాఖోపశాఖలుగాఁ బెరిగిన యీవర్ణవైషమ్యవిషవృక్షమును ప్రేళ్ళతోఁ బెల్లగించి వేసినం గాని దానిఛాయ వ్యాపించినంతదూరము మనదేశమునం దేనంస్కార బీజమును నాటుకొని మొలకయెత్తి వృద్ధినొంద నేరదు.

మనదేశమునందు వర్ణభేదము పూర్వకాలమునం దిప్పటివలె నుండినది కాదు. అప్పుడు, మనపూర్వులు పుట్టుకచేతఁగాక నీతిచేతనే గౌరవపాత్రు లగుచుండిరి. శ్రీ మహాభారతములో

శ్లో॥ నయోని ర్నాపి సంస్కారో నశ్రుతం నచసంతతిః
కారణాని దిజత్వస్య వృత్తమేవతు కారణమ్.

"పుట్టుక, ఉపనయనాదిసంస్కారము, వేదాధ్యయనము, సంతతి, ద్విజత్వమునకు కారణములు కావు; మంచినడతయొక్కటియే కారణము" అని యానుశాసనిక పర్వమునందును,—

శ్లో॥ నకులేన నజాత్యావా క్రియాభి ర్బ్రాహ్మణోభవేత్
చండాలోపిహి వృత్తస్థో బ్రాహ్మణస్స యుధిష్ఠిర॥
శూద్రోపి శీలసంపన్నో గుణవాక్ బ్రాహ్మణోభవేత్
బ్రాహ్మణోపి క్రియాహీనః శూద్రాత్ప్రత్యవరోభవేత్॥

"కులము చేతను జాతిచేతనుగాక కార్యములచేతనే బ్రాహ్మణుఁడగుచున్నాఁడు. ఓయుధిష్ఠిరా! మంచినడవడి గలవాఁడు చండాలుఁడయినను వాఁడే బ్రాహ్మణుఁడు. శూద్రుఁడైనను సదాచారసంపన్నుఁడయి గుణవంతుఁడయినవాఁడు బ్రాహ్మణుఁడగును; బ్రాహ్మణుఁడయినను, క్రియాహీనుఁడు శూద్రునికంటె తక్కువవాఁడగును" అని యారణ్యపర్వమునందును, శ్రీమద్భాగవతములో

శ్లో॥ శమోదమస్తపశ్శౌచం సంతోషః క్షాంతి రార్జవమ్
జ్ఞానం దయా చ్యుతాత్మత్వం సత్యంచ బ్రహ్మలక్షణమ్॥

"శమము, దమము, తపస్సు, శౌచము, సంతోషము, క్షాంతి, ఆర్జవము, జ్ఞానము, దయ, స్వార్థపరిత్యాగము, సత్యము బ్రాహ్మణ లక్షణములు" అని సప్తమస్కంధమునందును, జెప్పఁబడి యున్నవి. ఓబ్రాహ్మణనామధారకులారా! ఈలక్షణములు మీయందుఁ గలిగిన

బ్రాహ్మణులమని చెప్పుకొని గర్వపడుఁడు. ఈలక్షణములేవియు లేక పుట్టుబ్రాహ్మణుల మని మాత్రము వృథా గర్వపడఁ బోకుఁడు. పూర్వోక్త లక్షణములుగల అధమవర్ణసంజాతులనయినను బ్రాహ్మణులనుగాను సహజన్మలనుగాను భావించి గౌరవింపుఁడు. నిజమైనబ్రాహ్మణత్వము గుణములలో నున్నదిగాని పొట్టలోనుపుట్టుకలోనులేదు. పుట్టుకనుబట్టి మేము వశిష్టాదిగోత్రజుల మని విఱ్ఱివీఁగెడు వెఱ్ఱులారా! మీపూర్వులపుట్టుకను విచారింపుఁడు.

శ్లో॥ గణికాగర్భసంభూతో వసిష్ఠశ్చమహామునిః॥

బ్రహ్మర్షులలో నెల్ల నగ్రగణ్యుఁడయి శ్రీరామప్రముఖ సూర్యవంశ రాజులకెల్లఁ బురోహితుఁ డయిన వసిష్ఠుఁడు వేశ్యకు పుట్టినవాఁడు.


శ్లో॥ జాతోవ్యాసస్తు కైవర్త్యా శ్పపాకాస్తు పరాశరః॥

అని భారతారణ్యపర్వమునఁ జెప్పబడియున్నది. వేదవిభాగముచేసి వేదవ్యాసుఁ డని పేరొందిన, ప్రస్థానత్రయములో నొకటియయిన బ్రహ్మసూత్రములను రచించిన సాత్యవతేయుఁడు పల్లెడానికొమకు; వ్యాసునితండ్రి యయి కలియుగమునకు బరమప్రమాణ మయిన స్మృతిరత్నమును రచించిన పరాశరుఁడు మాలదానికొడుకు. ఈమహానుభావులందఱును పుట్టుకచేతఁగాక గుణముచేతనే మహర్షులయి పూజనీయులయిరి. వారివలెనే మీరును గుణసంపదను గడించుటకయి పాటుపడుఁడు. మన యాధిక్యమంతయు సద్వర్తనములో నున్నది కాని భోజనములోను జన్మములోను లేదు. జాతికంటె గుణము శ్లాఘ్యతరమని మీకెప్పుడు దృఢనిశ్చయము గలుగునో యప్పటినుండి దేశాభివృద్ధి యారంభమగును.

ఓభ్రాతృవరులారా! మీరు తోడివారి హీనస్థితికి దిగక వారి నున్నతస్థితి కెక్కించుటకయి ప్రయత్నింపుఁడు పూర్వోక్తములయిన

బ్రాహ్మణలక్షణములను విన్నారుగదా! మీరు బ్రాహ్మణలక్షణము లను విడువక బ్రాహ్మణేతరులయిన శూద్రాదులను బ్రాహ్మణపద మెక్కించుటకు కృషిచేయుఁడు. ఋషోక్తోపదేశములచేతఁగాక కార్య ములచేత "మేము నడుచునట్లు నడువు" డని లోకమునకుఁ బోధిం పుఁడు. అప్పుడు మాత్రమే మీబ్రుజుత్వము లోకమునకుఁ దెలిసి మీమాటలయందువిశ్వాసము కుదురును. మన యీశ్వరునకును మన యాత్మలకును గర్భశత్రువు లయినవిగ్రహారాధనమును వర్ణవైషమ్య మును నశించువఱకును పోరాటమును మానక యీశ్వరభటులైనిలు వుఁడుం. ఈశ్వరుఁడు మీకు తగినయుత్సాహమును బలమును ప్రసా దించుగాక!

పరిశుద్ధాస్తికమతము.*



భ్రాతృవరులారా!

నేఁడీపట్టణమున జరుగు చున్న యీయాంధ్రదేశాస్తికమహా సభకు నన్నధ్యక్షునిగా నియమించినందున కయి మీకుఁ గృతజ్ఞతా పూర్వకములైన వందనముల సమర్పించు చున్నాఁడను. మీరు నన్నుంచిన యీఘనపదమునకు నేనర్హుఁడనుగానని యెఱిఁగిన వాడన య్యును, నామీఁదియాదరముచేత నన్నీసభాధ్యక్షత వహింపవలసినదని యాహ్వానసభాకార్యదర్శిగారు పునరుక్తముగాఁ గోరినప్పుడు నే నాయనమాటనతిక్రమింపఁజాలక యంగీకరింప వలసినవాఁడ నయితిని.

---

* ఇది 1906వ సంవత్సరము ఏప్రియల్ నెల 15వ తేదీని గుంటూరులో జరి గిన యాంధ్రదేశాస్తిక సభలోఁ జదువఁబడినది.

సభారంజకముగాఁ బ్రసంగింపవలసిన యిట్టి సమయమునందుఁ గొప్ప పరీక్షలయందుఁ గృతార్థుఁడయి నాకంటె సమర్థతరుఁడైన మంచి వక్తను సభాధ్యక్షునిగా నేర్పఱుచుకొని యుండినయెడల సభోద్దేశము లధికజయప్రదముగా నెఱవేఱుట కవకాశము కలిగియుండును. నేటి సభ కట్టిభాగ్యము పట్టినదికాదు. కార్యము మించినతరువాత వగచిన ప్రయోజనము లేదు. మీరు పొందిన ప్రమాదమురొయొక్క ఫలము నేర్పుతోను తృప్తితోను మీరనుభవించితీఱవలెను. కాఁబట్టి నేనేమో హృదయాహ్లాదకర మైనగొప్పధర్మోపదేశమును జేయుదు నని భ్రమ పెట్టుకొనక యాశాభంగమునకె మీరందఱు సంసిద్ధులయి యుండ వలెను. సభాధ్యక్షత వహించినవా రేదో కొంతసంభాషించుట యాచారమయి యుండుటచేత నేనివ్వా డాస్తికసమాజ ధర్మములను గూర్చి నాయప్రౌఢవాక్యములతోనే యించుక సంభాషించి మీకు శ్రమకలిగించుచున్నాను. నాయుపదేశ కౌశలమునుబట్టి కాకపోయి నను నావృద్ధత్వమును దయనీయమైన శరీరదౌర్బల్యమును విచారించి యైనను సహించి నేఁ జెప్పఁ బోవుదానిని దయతో నాలకింపుఁడు.

పరిశుద్ధాస్తికమతము నాంధ్రదేశములో నెట్లు వ్యాపింపఁ జేయ వలయునో యాలోచించుటకును తన్మతసిద్ధాంతములనుగూర్చి సంభాషించుటకును తెలుఁగు దేశముయొక్క బహు భాగములనుండి పరిశుద్ధాస్తిక మతావలంబులును తదభిమానులు నైన సోదరు లిప్పు డింతమంది వచ్చి యిచ్చట సమావేశమగుట దేశముయొక్క పురో వృద్ధికి శుభసూచకముగా నున్నది. పరిశుద్ధాస్తికమతము మన భరత ఖండమునందుఁ గొన్నిచోట్ల బ్రహ్మసమాజ మనియుఁ గొన్నిచోట్లఁ బ్రార్థనసమాజ మనియు నామద్వయముతో వ్యవహరింపఁ బడు చున్నది. దేవుఁ డున్నాఁడని యంగీకరించు నవి యెల్లను ఆస్తికమత

ములే యయ్యినను, జనుల యజ్ఞానము మొదలయిన కారణములచేత బహుమతములయందు దేవుసిగూర్చియు, దేవునకును మనుష్యునకును గల సంబంధమును గూర్చియు దేవుని విషయమున మనుష్యుఁడు నడుచుకోవలసిన ధర్మములను గూర్చియు సపరిశుద్ధములైన యభిప్రాయములును దురాచారములును వ్యాపించియున్నవి. ఇహపర సుఖభంజకము లైన యట్టియపరిశుద్ధతలన్నిఁ దొలఁగించుకొని మతమును నిర్మల మైనదానినిగాఁ జేయుటచే దీనికి పరిశుద్ధాస్తిక మతమని పేరు వచ్చినది. ఆర్యులపవిత్రగ్రంథము లయినయుపనిషత్తులయం దీశ్వరుఁడు బ్రహ్మ మనునామముతో వ్యవహరింపఁబడుటచేత శుద్ధపర బ్రహ్మము నుపాసించువారి యామతమునకు బ్రహ్మమత మనియు, వారి సంఘమునకు బ్రహ్మసమాజ మనియు, ఈసమాజమునకు మానసికప్రార్థనము ప్రధాన మయినందున ప్రార్థనసమాజ మనియు, పేరులు కలిగినవి. బ్రహ్మసమాజ మను పేరుచేతనే యిది యార్యమత వృక్షమునుండి పుట్టిన పరిశుద్ధశాఖ యనిస్పష్టపడుచున్నది. పరబ్రహ్మమునుగూర్చి,—

"యఃసర్వజ్ఞఃసర్వవిద్ యస్యైష మహిమాభువి దివ్యే
తదివ్జానేన పరిపశ్యన్తిధీరాఆనందరూప మమృతం యద్విభాతి."

ఎవ్వఁడు సర్వజ్ఞుఁడో సర్వవిదుఁడో భువియందును దివియందును గలవి యెవ్వని మహిమలో యెవ్వఁడానందరూపుఁడును నిత్యుఁడు నయి ప్రకాశించుచున్నాఁడో యతనిని పండితులు జ్ఞానముచేత నంతటఁ జూచుచున్నారని ముండకోపనిషత్తును,—

"ప పర్యగాచ్ఛుక్ర మకాయ మవ్రణ
మస్నావిరగ్ శుద్ధమపాపవిద్ధమ్."

అతఁడు సర్వవ్యాపి, తేజోమయుఁడు, నిరాకారుఁడు, నిరామయుఁడు, అస్నావిరుఁడు, శుద్ధుఁడు, పాపరహితుఁడు, అని యీశావాస్యోపనిషత్తును చెప్పుచున్నది. ఇటువంటి వాక్యములే యితరవిశేషములతోడ పెక్కు లితరోపనిషత్తు లందును గానఁ బడుచున్నవి. ఇట్టి యుపనిషద్వాక్యములను బట్టి దేవుఁడు నిత్యుఁడు, నిరాకారుఁడు, సర్వవ్యాప్తి, సర్వజ్ఞుఁడు, సర్వశక్తుఁడు, సర్వకారుణ్యుఁడు ఆనందస్వరూపుఁడు, పరిశుద్ధుఁడు, పాపరహితుఁడు, అని విస్పష్ట మగుచున్నది, పరిశుద్ధాస్తికులయినమనవా రుపాసించు దేవుఁడీ పరమాత్మయే,—

"యతోవా ఇమానిభూతాని జాయంతే యేనజాతాని జీవంతి
యత్ప్రయం త్యభిసంవిశంతి తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మ"

దేనివలన నీచరాచరభూతములు పుట్టుచున్నవో, దేనివలన పుట్టినవి జీవించుచున్నవో, ఆత్మలు దేనినిగూర్చి పొలుపొందుచున్నవో, అది బ్రహ్మమని తెలిసికొమ్మని తైత్తిరీయోపనిషత్తులోని భృగువల్లి యందుఁ జెప్పఁబడియున్నది. ఇత్యాదివాక్యములను బట్టి చరాచరములయినసమస్త పదార్థములును దేవునివలననే కలుగుచున్న వనియు, సమస్తజీవకోటులును దేవునివలననే జీవించుచున్న వనియు, సమస్తాత్మలును మరణానంతరమున దేవునియొద్దకే పోయి చేరుచున్న వనియు విశద మగుచున్నది. పై వాక్యములవలన నీశ్వరుఁడు సృష్టిస్థితిలయములకు కారణుఁడనుటయే గాక మనయాత్మలు సయితము నిత్యములయి మరణానంతరమున నుండు ననుటయుఁ దేలుచున్నది. ఈయుపనిషదర్థములే పరిశుద్ధాస్తికమతములయొక్క సిద్ధాంతములు. ఈసిద్ధాంతము లను బట్టి సృష్టికర్త యగుటచే నీశ్వరుఁడు లోకపిత యనియు ఆయనచేఁ బుట్టింపఁబడిన మానవుల మయిన మనమందఱమును తత్పుత్ర సదృశుల మనియు అందుచేత పరస్పరభ్రాతల మనియు, పితృభక్తి

కలవాడ మయి యీశ్వరుని సేవించుచు సర్వవిషయములలోన్ను, తదాజ్ఞానుసారముగా వర్తించుటయు తోడిమానవులయెడల సోదర భావము కలవారమయి వారిని ప్రేమించుచు వారిమేలుకొఱకు పాటు పడుటయు మనకు ధర్మము లనియు, నేర్పడుచున్నది. ఇందువలన నీశ్వరపితృత్వమును, మనుష్యభ్రాతృత్వమును పరిశుద్ధాస్తిక మతము నకు మూలతత్వములుగాఁ బరిగణింపఁబడినట్లు తెలిసికోవచ్చును. లోక ములో మనకు ప్రియతమము లయినపదార్థము లన్నిటికంటెను ప్రియ తరునిగా భావించి తదాజ్ఞ నణుమాత్రమును మీఱక యేపని చేసి నను పరమేశ్వర ప్రీత్యర్థముగానే చేయుచు భక్తిచూపునప్పుడే మన కీశ్వరపితృత్వము లభించిన ట్లగును.

"తదేతత్ ప్రేయఃపుత్రాత్ ప్రేయోవిత్తాత్ ప్రేయోన్యస్మాత్ సర్వస్మాత్ అంతరతరం యదయమాత్మా"

ఏది యన్నిటికంటె నంతరతరమో యట్టిపరమాత్మ పుత్రునికంటెను ప్రియతరమయినది, విత్తముకంటెను ప్రియతరమైనది, యితరములైన యన్నిటికంటెను ప్రియతర మైనది, అని బృహదారణ్యకోపనిషత్తు బోధించుచున్నది. ఈశ్వరునియందు పితృభావము కుదురుటకు భక్తి పూర్వకమయిన మానసికారాధన మావశ్యకము. కుమారుఁడు తండ్రిని సమీపించునట్లు నిర్మలాంతఃకరణముతో పరమాత్మను సమీపించి తన లోపములను వాంఛలను నిష్కపటముగా నివేదించి, తన యపచార ములకు పశ్చాత్తాపపడి క్షమింపవేఁడుచు, తనకు ధర్మచింతను ధర్మా చరణస్థైర్యమును ప్రసాదింపఁ బ్రార్థించుటయే యీశ్వరారాధనము. ఇట్టి మానసికారాధనమే పరిశుద్ధాస్తికుల కీశ్వరసాంగత్య సంధాయక మగు సత్యవ్రతము. విగ్రహారాధన మీశ్వరపితృభావసిద్ధికి విఘ్న భూతము. ఈశ్వరసాంగత్య సౌఖ్యామృతము ననుభవింప నపేక్షించు

ప్రతివురుషుఁడును నోరుచెఱిపి హృదయమును కలుషపఱిచి భక్తిబీజ
మును చంపివేసెడు ప్రతిమార్చనాత్మకవిషఫలమును రూపుమాప దీక్ష
వహింపవలెను. ప్రతిమారాధనము నుపేక్షించినయెడల మన మసత్య
సముద్రములోను, అజ్ఞానాంధకారములోను, మునిఁగి నిత్యపదవిని
బోఁగొట్టుకొందుము.

"అసతోమా సద్గమయ తమసోమా జ్యోతిర్గమయ మృత్యో
ర్మామృతంగమయ."

అసత్యమునుండి నన్ను సత్యమును పొందింపుము, అంధకారమునుండి
నన్ను తేజస్సును పొందింపుము. మృత్యువునుండి నన్ను నిత్యపదవిని
పొందింపుము' అని బృహదారణ్యకోపనిషత్తున నున్నట్లు మనల నసత్య
మునకును తమస్సునకును మృత్యువునకును నీడ్చెడువిగ్రహవ్యూహా
పిశాచహస్తములనుండి విడిపించి రక్షించుటకయి సత్యస్వరూపుఁడును,
స్వప్రకాశుఁడును, నిత్యుఁడును నయిన యీశ్వరుని ప్రార్థింతము.

మన కీశ్వరపితృత్వసిద్ధి యెప్పు డగునో యప్పుడే మానవ
సామాన్యభ్రాతృభావమును కలుగును. ఈశ్వరునిబిడ్డల మగుటచేత
మన కెల్లపురుషులు నన్నదమ్ములును, ఎల్లస్త్రీలును అక్కచెల్లెండ్రును
అగుదురు. అప్పుడు లోక మంతయు నేకకుటుంబమయి, యందలివా
రందఱును స్వప్రయోజనపరత్వమును మాని, పరార్థపరత్వమును
బూని యన్యోన్యశ్రేయోభివృద్ధికయి పాటుపడువా రగుదురు. ఇట్టి
స్థితిని గలిగించుటకై పాటుపడుట పరిశుద్ధాస్తికుల పరమధర్మము.
పరస్పరసోదరభావమునకు మనదేశములో నిప్పుడు గర్భశత్రుయి
యున్నది వైషమ్యము. ఈయస్వాభావికవైషమ్యము మనలో విశేష
భాగము మానుషస్వభావమునే మార్చివేసి, మనుష్యులను మృగ
తుల్యులనుగాను మృగములకంటెను హీనులనుగాను జేసినది. అధమ

వర్ణములవారివిషయమున నగ్రవర్ణములవారు చేసెడి యన్యాయ
మటుండనిచ్చి యేకవర్ణమువారిలోనే నడచెడు పశుప్రాయ మైన దుర్ణ
యమును జూడుఁడు. ఏకవేదమునే నమ్మఁచు నేకధర్మశాస్త్రమునే
యంగీకరించుచు నేకదేశమునఁ నసించుచు బ్రాహ్మణోత్తముల మని
గొప్ప చెప్పుకొనువారిలోనే వైశ్వదేవపరు డయి శుద్ధశ్రోత్రియుం
డయినస్మార్తుఁడు కాకి చూచుచున్నను కుక్క చూచుచున్నను
భుజించునుగాని వైష్ణవ బ్రాహ్మణుఁడు చూచినంతమాత్రముచేత తన
యన్నము మైల పడిన దని భుజింప నొల్లక విస్తరి విడిచి లేచిపోవును
గదా? మేమందఱము హిందూమతావలంబులమే యని ప్రజ్ఞలు
పలుకుచు దురభిమానదూషితు లగుచున్న మహానుభావు లీద్వేజులు
మ్లేచ్ఛనియెడలఁ జేసెడిదానికంటె స్వకులజునియెడలఁ జేసిన ఘనకార్య
మేమో చెప్పుడు. యాత్రాపగు లైన బ్రాహ్మణులే మార్గమధ్యమున
వ్యాధిబాధలచేతి గ్రామము విధులప్రక్కలను బడియుండి కులగోత్ర
ములు తెలియమిచే నెవ్వరు నంటినుట్టి తోడ్పడకుండుటచేత కృశించి
నకృంలచే జీవములతోనే యీడ్చుకొనిపోఁబడు చుండుట యుఁ గలదని
చూచిన యన్యదేశీయులు ప్రాసియున్నారుం. హిందూమతమున కింత
కంటెనవమానకరమైన హీనకృత్యము మఱేమున్నది? పశుకృత్యము
సహితమింతకంటె నీచమైన దుండునా? పరస్పరభ్రాతృత్వ కల్పతరు
వును మూలచ్ఛేదము చేసెడు వేరుపురుగైన వర్ణవైషమ్యమును
తాము విడుచుటయేకాక సకలవిధముల దాని స్వరూపనాశనమును
జేయుటకయి పరిశ్రద్ధాస్తికు లందఱును బద్ధకంకణులు కావలెను.
ఓ భ్రాతృవరులారా! దయాదాక్షిణ్యములు మాని మీరీశ్వరకుటుంబ
నాశనకారకుఁ డయినవర్ణవైషమ్యరాక్షసుని హతము చేయుటకయి
కృతప్రతిజ్ఞులరు కండు. ఈశ్వరశత్రు నిరానాభిలాషచేత పక్షవ్యధర్మ

మార్గ మించుక తొలగి వర్తించితిని. మన్నింపుము. ఇక వక్తవ్యాంశ మునకు వత్తము.

ఈశ్వరసద్భావమును గూర్చియు, నాతని కళ్యాణగుణములను గూర్చియు మనుష్యుల యన్యోన్యసోదరభావమును గూర్చియు మను ష్యాత్మల నిత్యత్వమును గూర్చియు నుపనిషద్వాక్యముల నుదాహ రించుచుఁ బరిశుద్ధాస్తిక మతసిద్ధాంతములను సంక్షేపముగాఁ జెప్పి యున్నాను. ఇఁక స్వధర్మములను గూర్చియు ధర్మనియమమునకుఁ గల ప్రమాణములను గూర్చియు పుణ్యపాపములను గూర్చియు స్వర్గ నరక ములను గూర్చియుకూడ నించుక వచించి విరమించెదను.

శ్లో॥ మాతృవ త్పరదారాంచ పరద్రవ్యాణి లోష్టవత్
ఆత్మన త్సర్వభూతాని యఃపశ్యతి సపశ్యతి.

పరదారను తల్లివలెను, పరద్రవ్యమును మట్టిగడ్డవలెను, సర్వ భూతములను తనవలెను, ఎవఁడు చూచునో వాఁడే నిజముగాఁ జూచు వాఁడని మనపూర్వులు చెప్పి యున్నారు. ఈయవి మనుష్యధర్మములు. ఈవిషయమున నిట్లు చేయువలసిన దని విధించిన యీశ్వరాజ్ఞ లన్నియు మనకు ధర్మములు.

"సత్యంవద" "ధర్మంచర" అని తైత్తిరీయోపనిషత్తు శిక్షా వల్లిలో గురువు శిష్యునకు 'సత్యము పలుకుము' 'ధర్మము నాచ రింపుము' అని యుపదేశించు చున్నాఁడు. ఈరెండును పరిశుద్ధాస్తికుల పరమధర్మములు. లోకములో సత్యమును మించిన ధర్మము వేఱొకటి లేదు.

శ్లో॥ నాస్తి సత్యసమోధర్మ నాసత్యాద్విద్యతేపరం
నహితీవ్రతరం కించి దన్యత్తాదిహ విద్యతే.

సత్యముతో సమాన మయినధర్మము లేదు; సత్యమునకంటె శ్రేష్ఠ మయినది లేదు; అసత్యమునకంటె తీవ్రతర మయినది యీ లోకమున వేఱొకటి లేదు — అని పంచమవేద మనఁబరఁగిన శ్రీమహాభారతము సత్యోత్కృష్టతను ఘోషించుచున్నది. ఈశ్వరుఁడే సత్యస్వరూపుఁ డగుటచే సత్యము ననుసరించుట యీశ్వరు ననుస రించుటయే. మన కెన్నికష్టములు వచ్చినను సత్యమును విడువరాదు. "నాస్మృతా త్పాతకంపర" మన్న యీర్ష్యక్తి యసత్యమునకంటె నెక్కుపపాతకము లే దని చాటు చున్నది. సత్యాదరము లేకున్న లోకములో నభివృద్ధియే కలుగదు. సత్య మెందున్నను గ్రహింప వలెను.

మాది మాపూర్వులు చేసినది యున్నదురభిమానమును విడిచి యసత్యము మన దయినను తెలియఁగానే త్యజించుచు సత్యము పరుల దయినను భజించుచుండవలెను. మనవన్న హేతువుచేత దురాచారము లను మూఢవిశ్వాసములను హేత్వాభాసములను కల్పించి పొగడు చుండుటయు పరుల దన్న హేతువుచేత సదాచారములను సదుపదేశ ములను యుక్త్యాభాసములు కల్పించి తెగడు చుండుటయు దేశమును పాడుచేసెడు దురభిమాన మగునుగాని దేశమును బాగుచేసెడు స్వదేశాభిమానము కాదు. తనవారి యభివృద్ధి గాంక్షించెడు ప్రతి దేశాభిమానియు తనవారిలోఁ గలలోపముల నెత్తి చూపి వానిని దిద్దుకొనునట్లు చేయుచు నితరులలోఁ గలగుణాంశముల నెత్తిచూపి వానిని గ్రహించునట్లు చేయుచు దేశాభివృద్ధ్యర్థము నిరంతరకృషి చేయుచుండవలెను. గుణాగుణవిచారము లేక తమలోఁ గలదురాచార దురుపదేశములను సహితము పామరజనరంజనముకొఱకు తమ విద్యా బుద్ధుల వినియోగించి భూషించుచు నభివృద్ధికి భంగమును సంస్కార

మునకు విఘాతమును గలిగించెడు తెలిసినమూఢులే మన దేశమునకు గర్భశత్రువులు. పామరదూషణములు పాటిచేయక చెవికి చేదుగా నుండినను హితమును జూపి దురాచారదుర్మతులను రూపు మాపి సంస్కారము వ్యాపింపఁ జేయుట కయి తమకాలమును శక్తిని ధన మును వినియోగించువారుమాత్రమే దేశమునకు నిజమైనమిత్రులు. సత్యసమాదరమే సర్వదా పరిశుద్ధాస్తికుల నిత్యకృత్య మయి యుండవలెను. తొలుత నెన్నియంతరాయములు వచ్చినను కడపట సత్యమే జయించును. "సత్యమేవజయతే" యని ముండకోప నిషత్తు మొఱ యిడుచున్నది.

శ్లో॥ ఏవఏవ సుహృద్ధర్మోనిధనే ప్యనుయాతి యః
శరీరేణ సమం నాశం సర్వ మన్యద్ధి గచ్ఛతి॥

తక్కినవి సమస్తమును శరీరనాశముతోనే పోవుచుండఁగా మరణా నంతరమున సహితము వెంటవచ్చెడుధర్మ మొకటియే నిజమైన మిత్రుడనియు,—

శ్లో॥ ధర్మఏవ హతో హన్తిధర్మో రక్షతి రక్షితః
తస్మాధర్మో నహంతవ్యో మానోధర్మో హతోవధీత్॥

ధర్మము తన్ను హతము చేయువానిని హతముచేయుచు, తన్నురక్షించు వానిని రక్షించుచుండును, గనుక ధర్మమునుజెఱిచి తానుచెడకుండఁ బలెననియు పంచమవేదమైన భారతము ధర్మమును శ్లాఘించుచున్నది. ఈశ్వరాజ్ఞయే ధర్మమని యింతకుముందు చెప్పి యున్నానుగదా! ధర్మాధర్మనిర్ణయ మెట్లు చేయనగును, ఇది యీశ్వరాజ్ఞయనిమనకెట్లు తెలియవచ్చును, కృత్యాకృత్య నిర్ధారణ మునకు ప్రమాణమేమి, యని సందేహము తోఁచవచ్చును. కార్యా కార్య నిర్ణయమునకు మన యంతరాత్మయే పరమ ప్రమాణము.

ఈశ్వరుఁడు మనహృదయఫలకమునందే మనధర్మశాస్త్రమును దివ్యాక్షరములతోలిఖించి యున్నాఁడు. మనయంతరాత్మ మంచిదని బోధించుచుదానిని జేయుచుండుటయే మనకు పరమధర్మము. అది యొక్కటియే పరమ కర్తవ్యము;—

శ్లో॥ యత్కర్మ కుర్వతోస్య స్యాత్ పరితోషోంతరాత్మనః
తత్ప్రయత్నేన కుర్వీత విపరీతంతు వర్జయేత్ ॥

ఏపని చేయుటవలన నంతరాత్మకు సంతోషమగునో యాపనిని ప్రయత్నముతోఁ జేసి దానికి విరోధమైనదానిని వర్జింపవలసినదని మనుధర్మశాస్త్రము విధించు చున్నది. అంతరాత్మ బోధించునట్లు సర్వదా చరించు వాఁడే యీశ్వరాజ్ఞను జెల్లించువాఁడును స్వధర్మానుష్ఠానపరుఁడును సుకృతియు నగును. మనకోరిక లెట్లున్నను మనయంతరాత్మయిదిమంచి యిదిచెడ్డ యిది చేయఁదగినది యిది చేయఁదగనిది యని నిరూపించి సదా కర్తవ్యము నుపదేశించుచుండును. తదాచరణమునలన లాభముగలుగునా నష్టము కలుగునా యన్నవిచారమునుమాని యీశ్వరాజ్ఞయు ధర్మమగుటచేత నంతరాత్మ విధించుదానిని ఫలనిరపేక్షముగా ననుష్ఠింపవలెను. అట్టియనుష్ఠానపరుఁడే పయినుండి యనంతము లైన యీపదలు బాధించుచున్నను మనశ్శాంతిగలవాఁడయి యాత్మానందము ననుభవింపఁగలుగును. లోకములోని తక్కిన సమస్త విషయములలో నెట్లో యట్లే మతవిషయమునందును వృద్ధి స్వాభావికము. జ్ఞానాభివృద్ధియయి నూతనసత్యములు బయలుఁబడుచుండు కొలదిని వానిని స్వీకరించుచుండవలయును. సత్యగ్రహణైక పరాయణునకపజయ మెప్పుడును గలుగదు. క్రమముగా నుపయోగింపక యుపేక్షచేసినచో కరచరణాద్యవయవము లే ప్రకారముగా దుర్బలములగుచువచ్చునో యాప్రకారముగానే మన యంత

రాత్మయుఁ దన యుపదేశములను నిరాకరించుచు నుపేక్షచేయుచు వచ్చినకొలఁదిని దుర్బల మయి నిరుప యుక్తమగును. కాఁబట్టి మన యంతరాత్మ బోధనల ననాదరింపక యాచరణమునకుఁ దెచ్చుచు దానిని బలపఱుచు చుండవలెను. అప్పుడది తానుబలపడి సత్కార్యాచరణమున కయి మనకు బలమునిచ్చి మనల నీశ్వరవృత్తులనుట కర్హులయినవారినిగాఁ జేయును. నేను శ్రుతిస్మృతులనుండి పలు మాఱు ప్రమాణవచనము లుదాహరించుచు వచ్చుటచేత నాయా గ్రంథములం దున్నవన్నియు నాచరణీయములుగు నాయని కొంద ఱిడు గవచ్చును,—

"యాన్యస్మాగ్ సుచరితాని తానిత్వ యోపాస్యాని నో ఇతరాణి"

ఏవి మాసుచరితములో యవియే నీచేత ననుష్ఠింపఁదగినవి కాని యితరములు కావనియు, తైత్తిరీయోపనిషత్తు నందు గురువు శిష్యున కుపదేశించి యున్నాఁడు. గ్రంథములలోని యుపదేశములు గాని గొప్పవారియొక్క వాక్యములును పనులును గాని యెంతవఱకు మంచివిగానుండి యంతరాత్మ బోధలకు వ్యతిరేకము కాకుండునో యంతవఱకే గ్రాహ్యములును ననుష్ఠేయములు నగునుగాని యాపయిని గావు. అంతరాత్మబోధన మొక్కటియే మనకుఁ బరమప్రమాణము. దానిముందు తక్కిన వన్నియు నధమ ప్రమాణములు.

ఈశ్వరాజ్ఞ ననఁగా ధర్మము నుల్లఘించుట పాపము; ధర్మానుసరణము పుణ్యము. శారీరధర్మములను మీఱినప్పుడు దేహమునకు రోగాదిక మగుబాధ కలుగునట్లు, ఆధ్యాత్మిక ధర్మములను మీఱినప్పుడు మనసునకు దుఃఖాదిక మగు వ్యధకలుగును. ఏధర్మము నతిక్రమించినను, ఆపాపమున కర్హదండన మవశ్యముగా కలుగును.

ఈదండన మెప్పుడును మనలను పాపములనుండి మరలించి మనమేలు నకుతోడు వడునదిగా నుండును. శారీరధర్మముల ననుసరించినవ్వుడు దేహమున కారోగ్యాదిక మగుసౌఖ్యము కలుగునట్లే ఆధ్యాత్మికధర్మ ముల ననుసరించి నప్పుడు మనస్సునకు సంతోషాదిక మగునుఖము కలుగును. ఏధర్మము ననుసరించినను, ఆపుణ్యమున కర్హబహుమాన మవశ్యముగా కలుగును. ఈబహుమానమెప్పుడును మనలను పుణ్య మునకు పురికొల్పి మనమేలునకు తోడుపడునదిగానుండును. పుణ్యము స్వాభావికము; పాప మస్వాభావికము. ఈశ్వరునకు పుణ్యము ప్రీతికర మయినది; పాప మప్రీతికరమయినది. మనకు పాపము పరమశత్రువు; పుణ్యము పరమమిత్రము. మనమెప్పుడును పాపముతో పోరాడి దానిని నాశముచేసి, హృదయ రాజ్యమున స్థిరముగా పుణ్యమును స్థాపింపఁ బ్రయత్నింపవలెను. మరణానంతరమున నాత్మసుఖస్థితియం దుండుట స్వర్గము; దుఃఖస్థితియందుండుట నరకము. ఆత్మ పాపముల నుండి విడిపింపఁబడుటముక్తి. మనుష్యుఁడు తాను చేసినపాపమునకు పరి తాపపడి, యిఁకముం దట్టి పాపము నెప్పుడును జేయునని కృతనిశ్చయుఁ డగుటచేత పావిముక్తి నొంది పవిత్రుఁ డగును.

శ్లో॥ కృత్వాపాపం హి సంతప్య తస్మాత్పాపాత్ప్రముచ్యతే
నైదం కుర్యాం పునరితి నివృత్త్యాపూయ తేతు సః॥

"పాపముచేసి సంతాపపడి యాపాపమునుండి విడిపింపఁ బడు చున్నాఁడు; దానిని మరల చేయనని మళ్ళుకొని వాఁడు పూఁతుఁ డగు చున్నాఁడు" అని మనుస్మృతి చెప్పుచున్నది. పరిశుద్ధాస్తిక మత సిద్ధాంతములలో ముఖ్యమయినవానిని బేరొక్కంటిని గాన నిఁక మన సామాజికుల కొకచిన్న విన్నపముచేసి ముగించెదను.

సామాజికు లగు సహోదరులారా! మీమూలమున సంస్కా
రమునొంది బాగుపడవలెనని మనదేశ మాశపడుచున్నది. మీరాశా
భంగమును కలిగింపక దేశాభివృద్ధిని గలిగించుటకయి శక్తివంచన
చేయక సర్వవిధముల పాటుపడుఁడు. సమాజప్రతిజ్ఞా పత్రమునందు
చేర్వాలుచేయుటచేతను, వారమున నొకసారి సమాజమునకు వచ్చి
ప్రార్థనచేసిపోవుటచేతను, అప్పుడప్పుడు ధర్మోపన్యాసములుచేయుచు
వచ్చుటచేతను, కృతార్థుల మయితి మని తలఁచుకొనకుఁడు. ఈవను
లావశ్యకములే యైనను, మీరు చేయవలసినవి యింతకంటెను
ముఖ్యము లయినవనేకము లున్నవి. ఇతరులను సంస్కరింపఁ బ్రయ
త్నించుటకు ముందు మీరు మిమ్ము సంస్కరించుకొనవలెను.
సంస్కార మెప్పుడును తనతో నారంభము కావలెను. తన్నుఁదాను
సంస్కరించుకో లేనివాఁడు లోకము నెట్లు సంస్కరింపఁ గలుగును?
తన్ను సంస్కరించుకొనుట స్వాధీనమయినపని; ఇతరులను సంస్కరిం
చుట పరాధీనమైనపని. పరాధీనమైనపని సాధ్యముకాక పోవచ్చును
గాని స్వాధీనమైనపని యెవ్వరికిని సాధ్యముకాకపోదు. సత్యమిట్ల
య్యును మనదేశములో నిప్పుడు తమయుపదేశము తమ కక్కఱకు
రాని సంస్కర్తల సంఖ్య యంతకంత కధిక మగుచున్నది. ఎక్కడఁ
జూచినను ప్రసంగములే; ఎక్కడఁజూచినను ధర్మోపన్యాసములే. ఉప
దేశములలోఁ గొఱఁతలేదు; కొఱంత యంతయు నొక్క యనుష్ఠా
నమునందు మాత్రమే కనఁబడు చున్నది. అందుచేతనే వీరు శుష్క
వాచాటులేకాని క్రియాశూన్యులని యిప్పటికి విద్యాధికుల మాటల
యందు జనులకు విశ్వాసము తగ్గిపోవుచున్నది. మాటలుతక్కువచేసి
కార్యము లెక్కువ చేసి చూపినప్పుడే ప్రజలకు మన మాటలయందు
విశ్వాసము పుట్టును. జనులు సాధారణముగా మనము చెప్పినట్లు

చేయక చేసినట్లు చేయఁజూతుము. కాఁబట్టి లోకమును ధర్మమువంక నాకర్షించి మనమార్గమునకుఁ ద్రిప్పఁ దలఁచిన పక్షమున మనము వాక్ప్రారతతోడ కార్యశూరతను గూడఁ గనఁబఱుపవలెను. మిత్రులారా! మీకు మీమాటలయందును సత్యమునందును నిజమైన విశ్వాస మున్నయెడల మీరుపదేశించు సత్యమును మొదట స్వాచరణమునందుఁ జూపుఁడు; తరువాత వరుల కుపదేశింపుఁడు. "సత్యంచ స్వాధ్యాయ ప్రవచనేనచ" సత్యమును తాను ననుష్ఠించి యితరులకు ప్రవచనము చేయవలసినదని వేదము విధించుచున్నది. అట్లుచేసినచో లోకము మనయాచరణమును జూచి మనయట్ల తా నాచరించును. జనులకు సదుపదేశమునుజేసి చేసిన యుపదేశమును స్వాచరణమునందుఁ బెట్టి తన్మూలమున వారి నందు నడపింపుఁడు. మీయుద్యమము సఫలము చేయవలసినదని నిర్మలహృదయముతో వినయపూర్వకముగా నీశ్వరుని వేఁడుఁడు. ఈశ్వరబలముచేత ప్రతిపక్షులనడుము సత్యధ్వజ మెత్తుఁడు. ఈశ్వరభటులయి యజ్ఞానముతోను మూర్ఖత్వముతోను పోరాడి యంధకార బంధురములై యున్న హృదయ గుహలలో నీశ్వర తేజస్సును ప్రవేశపెట్టుఁడు. ఈజ్ఞానాజ్ఞాన యుద్ధమునందు వెనుకంజవేయక సదా ముందుకు నడుచుచు గాయములకు భయపడక మేనిలోఁ ప్రాణమున్నంతవఱకు జ్ఞానమునను సత్యపక్షమునను నిలిచి వీరభటులవలె విక్రమమును జూపుఁడు. శక్తియున్నంతవఱకును పోరాడి యలసి సొమ్మసిల్లినప్పుడు మీకుతోడయినిలిచి యీశ్వరుఁడు మిమ్ములనెత్తి మీకు నూతనబలమును ప్రసాదించి గెలుపొసఁగును. సమస్తమునకును సర్వరక్షకుఁడైన నర్వేశ్వరునినే నమ్మి కృతార్థులగుఁడుం.

ఓదీనశరణ్యా! దీనులయిన మావయి దయచూపి ధర్మాచర

ణమునకు మాకుధైర్యమును బ్రసాదింపుము. నీవుతక్క మాకు వేఱుదిక్కులేదు. దురాచార పంకములోఁ దగులుకొని దానినుండి వెలువడుటకు శక్తిచాలక దుర్బలులమయి యున్నమాకు బలము నొసఁగి మమ్ము గట్టెక్కింపుము. నీప్రేమజలముతో మాహృదయము లను పరిశుద్ధపఱుపుము. మాహృదయము లెప్పుడును సత్యమునే యభిలషించునట్లు చేసి సత్యమార్గానువర్తనమునందు మాకు నిరంత రోత్సాహమును గలిగింపుము.

మతధర్మము. *

సకలచరాచరసృష్టికిని కర్తయైనపరమేశ్వరునకును సృష్టి వర్గములోనివార మైనమనకును గలసంబంధములు గూర్చిన యభి ప్రాయము మతఁ మనఁబడును. అట్టి యనివార్యసంబంధమునఁబట్టి ఈశ్వరుని యెడలను మానవకోటియెడలను మన మాచరింపవలసిన కర్తవ్యములు ధర్మములనఁబడును. మనలనుసృజించి రక్షించి శాసించు వాఁడగుటచేత నీశ్వరుఁడు మనకు పరమపిత; అద్వితీయుఁడయిన యీశ్వ రునిచే సృజింపఁబడి సంరక్షింపఁబడు వారగుటచే సమస్త మానవు లును పరస్పరభ్రాతలు. కాఁబట్టి యీశ్వరుని పితృభావమును మను ష్యుల భ్రాతృభావమును మతమునకు ప్రధానాంగములు. ఈరెండంగ ములనుబట్టియే సమస్తధర్మములు నేర్పడుచున్నవి. లోకములో వేఱువేఱునామములతో వ్యవహరింపఁబడుచున్నను మనుష్యున కను

---

* ఇది 1908-వ సంవత్సరము ఏప్రియల్ నెల 18-వ తేదీని బందరుపురమున జరిగిన యాంధ్రపరిశుద్ధాస్తిక మహాసభలోఁ జదువఁబడినది.

శ్రేయములయిన సమస్త ధర్మములును మతధర్మము లనియే చెప్ప
వలసి యున్నవి. మన మేపనిని చేసినను పరమేశ్వరప్రీత్యర్థముగానే
చేయుచుండవలెను. అట్లు చేయువాఁ డొక్కఁడే యీశ్వరపుత్రుఁ
డును భక్తుఁడు ననదగినవాఁడు ; ఈశ్వర ప్రీత్యర్థముగా చేయక
యన్యచింతతోఁ జేయువాఁ డీశ్వరశత్రుఁడును వంచకుఁడు
నగును. తోడి మానవులయెడల భ్రాతృభావమును వహించి
యన్యోన్య క్షేమాభివృద్ధుల కయి పాటువడుచు నెవ్వరిని ద్వేషిం
పక యెవ్వరిని వంచింపక యెవ్వరికి నన్యాయము చేయక వర్తించు
టయే యీశ్వరునకు ప్రీతికరము. ఈప్రకారముగా స్వార్థపరత్వము
మాని పరోపకారపరాయణత్వమును వూని యీశ్వర ప్రీతికరముగా
వర్తించుట కయి సత్యము న్యాయము ప్రేమము మొదలయినవి
మన కీశ్వరుఁడు ప్రసాదించినపవిత్రపరమ సాధనములు. ఈదివ్యసాధన
ముల నాదరింపక యసత్యములాడుచు నన్యాయములుచేయుచు ద్వేష
మును జూపుచు వర్తించువాఁ డీశ్వరప్రార్థన లెన్నిసారులు చేయువాఁ
డయినను ధర్మోన్నతదేశము లెంత యెక్కువగా నొనరించువాఁ డయి
నను ఉపాసనమందిరముల కెంత తఱుచుగా నరుగువాఁ డయినను
భక్తుఁడు గాక యీశ్వరద్రోహి యగును. కాఁబట్టి నిజముగా నీశ్వర
భక్తుఁడు కావలె నన్నవాఁడు మొట్టమొదట సత్యమునం దాదరము
గలవాఁడును న్యాయమార్గము ననువర్తించువాఁడును భూతదయా
పరుఁడును కావలెను. అట్లయినవాఁడే యీశ్వరాజ్ఞానువర్తియు
ధర్మరతుఁడు నయినభక్తుఁడు. లోకములో ధర్మబలమును మించిన
బలము వేఱొకటి లేదు. "యతోధర్మస్తతోజయ" యని మనపెద్దలు
పలికియున్నారు. జనులుసత్యసంధులయి దయాపరులయిన్యాయావలంబు
లయి ధర్మబలము గలవారయినంగాని యే దేశమును ముందుకు రాదు.

దేశమును వృద్ధికిఁ దీసికొనిరావలె నన్నచో జనులను నీతిపరులనుగాఁ జేయవలెను. నీతిపరులు గానివా రీశ్వరభక్తులు కాఁజాలరు. నీతి యీశ్వరునకు పరమప్రీతికరము; నీతి మతధర్మములలో నుత్తమ ధర్మము. మనుష్యులను సత్కార్యనిష్ఠులను జేసి నీతిపరత్వమునందును సాంఘిక సదాచారవర్తనమునందును ధైర్యవంతులుగాఁ జేసెడిశక్తి ధర్మమునందే యున్నది; ఈశ్వరభక్తి లేనివానిని విభాగజ్ఞానముగాని కీర్తి కామత్వముగాని దేశోపకారకృత్యములలో కష్టకాలమునందు ధైర్యోత్సాహములతో నడుచునట్లు చేయుటకు సమర్థము కాదు; ఈశ్వరభక్తిలేక యంతరాత్మ దుర్బల మగును; ఈశ్వరబలవిశ్వాసము లేక సాంఘికదురాచారనివర్తన ప్రయత్నము తలయెత్తదు. జనులలో మతధర్మము దుర్బల మయినపక్షమున పాపభీతి యడుగంటి సమస్తానర్థములును సంభవించును. మతధర్మము పరిశుద్ధము కానియెడల సమస్త స్వాతంత్ర్యములును చెడును. ఎవరిస్వాతంత్ర్యములు వారికుండునట్లుచేసి యందఱిని సౌఖ్యసంతోషములను పొందునట్లుచేయుటయే మతధర్మముయొక్క ముఖ్యకార్యము. పరోపకారము, న్యాయము మొదలైనవన్నియు స్వాతంత్ర్యసంరక్షణముయొక్క ఫలములే. మన స్వాతంత్ర్యములనిమిత్తము మనముపోరాడి యితరుల స్వాతంత్ర్యములను మన్నింపకుండుట నిజమైన స్వాతంత్ర్యసంపాదనముకాదు. నిజమైన స్వాతంత్ర్యాభిలాషమనుష్యప్రకృతియందు గౌరవము కలిగించి యెంతయల్పునికి నన్యాయము సంభవించినను దానిని మాన్పుటకపేక్షించును. అన్యాయనివారణమునకు మతధర్మ మమోఘసాధనము. అట్టి ధర్మబలము లేకపోయినపక్షమున స్వప్రయోజనపరత్వము ప్రబలి పరార్థపరత్వము క్షీణించి జనులను మృగతుల్యులనుగా మార్చును. మతధర్మబలము చేతనఁగా నీశ్వరభక్తివిశ్వాసముచేతనే దేశాభిమాన బీజమంకురించి

యెల్లెడల నల్లుకొనును. ఈభక్తివిశ్వాసముచేతనే వివేకియైనవాఁడెల్ల
తాను తనయొక్కయు తనకుటుంబముయొక్కయు మేలుకొఱకే సృజింపఁ
బడ లేదనియు లోకముకొఱకుఁగూడ సృజియింపఁ బడితి ననియుఁ
దెలిసికొని పరోపకారార్థముగా పాటుపడఁ గడఁగును. అట్టివాఁడు
లోకమంతయు నేకకుటుంబ మని భావించి యాలోకకుటుంబములో
నెక్కడ నెవ్వరి కాపద వచ్చినను తనదానినిగా భావించుకొని నిజ
మైనదేశాభిమాని యయి దానిని వారించుటకయి తన సుఖమును
సహితము త్యజించును. పరోపకారరూపమైన యీదేశాభిమానమును
మనము బాల్యమునుండియు నభ్యాసము చేయవలెను. దేశాభివృద్ధిని
గోరెడు నిజమైన దేశాభిమాని తనదేశమునం దేమి చెడు గున్నను
దానిని రూపుమాపి దేశమును పరిశుద్ధపఱుచుటకయి ప్రయత్నింప
వలెను. అట్లుచేసినంగాని దేశముసుఖవంతమయి స్వాతంత్ర్యలాభము
ననుభవించుటకు శక్తముకాదు. నిజమైన దేశాభిమానమునకు
మాఱుగా ననేకులలో మన దేశమునం దిప్పు డొక విధమైన దురభి
మానము వ్యాపించుచున్నది. ఈదురభిమానబలముచేత మన దేశము
నందలి దురాచారములు సహితము సదాచారములుగా పొగడఁబడు
చుండుటయు నితరదేశములవారి సదాచారములుకూడ దురాచారము
లుగా తెగడఁబడుచుండుటయుసంభవించి నిజమైన దేశాభివృద్ధికిభంగము
గలుగుచున్నది. ఈదురభిమానముపరదూషణమునకును ద్వేషమునకును
కారణమయి మతధర్మమునకు శత్రువయి దేశాభివృద్ధికి భంగకర
మయి యనర్థదాయక మగుచున్నది. ఈయపూర్వదేశాభిమానులు
మూఢజనుల మెప్పునకయి స్వదేశీయ మైనదానినెల్ల బట్టువలె
భూషించుచు విదేశీయ మైన దానినెల్ల ద్వేషించుచు, దేశాభివృద్ధి
కయి యాత్మశ్లాఘనలు గాక సత్యమును న్యాయమును ప్రేమమును

గావలెనని వలుకువారిని దేశద్రోహులనియు సత్కార్యభీరువులనియు దూషించుచున్నారు. ఇట్టివారు సత్యమతధర్మమునకు విరోధులు. ఇట్టి దురభిమానులవాగాడంబరమువలన మనదేశ మభివృద్ధి పొంది స్వస్వాతంత్ర్యలాభముల నొందఁజాలదు. దేశాభివృద్ధికి నిజ మైన యీశ్వరభక్తులు కావలెను. పరిశుద్ధమైన యీశ్వరభక్తి గలవారు మాత్రమే స్వార్థపరిత్యాగులయి కార్యశూరులయి నత్యన్యాయకారు ణ్యాదులైన యమోఘసాధనములను గొని యీశ్వరధర్మధ్వజమును దాల్చి పోరాడఁగలుగుదురు. ఈశ్వరభటుల మన్న నమ్మకము లేక దురభిమానపూరితు లైనవాక్శూరులు స్వార్థత్యాగము కావలసి నప్పుడు మూలమూలల నొదుగుచు తమ పరదూషణ పాండిత్యము కష్ట సమయములయందు తమకు తోడుపడకపోఁగా భీరువులయి యదృశ్యు లగుదురు. ఇట్టివారి కార్యసాధకత్వ మంతయు పరదూషణములతోను దంభోక్తులతోను స్వశ్లాఘనలతోను ద్వేషప్రధానము లైన పాటల తోను ధ్వజపటములతోడి యూరేగింపులతోను నిండి యుబుసుల తోను మెఱుపులతోను పూర్ణమయి చినుకు లేనిశుష్కమేఘాడంబ రమువలె క్రియాశూన్యమయి పర్యవసించును. నిజమైన దేశాభి మానమును భక్తియుఁ గలవాఁడు జనులు తన్ను మెత్తురా యనుస రింతురా యన్నచింతను మనస్సునందుఁ జొరనీక యిది దేశోపకార కమా యీశ్వరసమ్మతమా న్యాయానుకూలమా యనిమాత్రము విచారించి యీశ్వరప్రీతికరమును, ధర్మానుకూలమును, దేశక్షేమ కరమునని దృఢపడినతోడనే జనులు దూషించినను భూషించినను త్యజించినను భజించినను గణన చేయక న్యాయమార్గమున నడుచుచు దేశోపకారముకొఱకు తనధనమును దేహమును కావలసినచో ప్రా ణమునుసహిత మర్పింప వెనుకతీయకుండును. స్వార్థపరిత్యాగము లేని

వాక్స్థిరతను జూపువాఁడు నిజమైన దేశాభిమాని కానేరఁడు. తనకు సోదరతుల్యమైనజనసామాన్యముయొక్కఁ మేలుఁ గోరెడు దేశాభిమాన మానసీయుఁడు సమయము వచ్చినప్పుడు జనసామాన్యశ్రేమముకొఱకు సంశయింపక తనదేహము నైనను సంతోషపూర్వకముగా ధార పోయుటకు సంసిద్ధుఁడయి యుండవలెను. ఇట్టినిర్వ్యాజదేశాభిమాన మునకు దృష్టాంతముగా నొకచరిత్రాంశము నుదహరింప ననుజ్ఞ వేఁడెదను.

ఇంగ్లండుదేశమునకు రాజైన మూడవయెడ్వర్డు పూర్వము ఫ్రాన్సుదేశముమీఁద దండెత్తి యనేకయుద్ధములు చేసి కడపట కేలే నగరమును ముట్టడించెను. ఆపురవాసులు సాధ్యమయినంతవరకు స్వపురరక్షణార్థము బహుదినములు ధైర్యోత్సాహములతో పోరాడి తుద కాహారపదార్థాభావమువలనఁ జేయునది లేక తమపట్టణమును శత్రురాజునకుఁ లోఁబఱుపవలసినంత దుస్థితికి వచ్చినవారయి కొన్ని షరతుల కంగీకరించినయెడల పురమును స్వాధీనము చేసెదమని రాజునకు సందేశము నంపిరి. పురజనులు చూపినయసాధారణపౌరుష మునుబట్టి తనసేనలకుఁ గలిగిన వినాశమువలనను తనకుఁ గలిగిన యత్యంత వ్యయప్రయాసములవలనను రాజు దురాగ్రహావేశపరవశుఁడయి పురజనులయెడల దయ దలఁపక యెల్లవారిని తుదముట్టింప నిశ్చయించుకొని యుండెను. అట్లు సర్వజనసంహారము చేయఁజూచుటకు క్రూరకృత్యమని మంత్రులు మొదలైనవారు ప్రార్థించి వాదించినపిమ్మట పురజనులలో ప్రముఖులుగా నున్నవారాఱుగురు తమప్రాణముల నిచ్చుట కొప్పుకొనివచ్చి కోటతాళములు తనకు తెచ్చియిచ్చినవఱ కును తెక్కినవారిప్రాణములను గాపాడెద ననిరాజు పౌరులకు వర్త మాన మంపెను. పిదుగువంటి యాయశుభవార్త రాఁగానే కోటలో

నున్న పౌరబృందములో గొప్పసంక్షోభ మారంభ మయ్యెను. మా
ప్రాణసంరక్షణార్థమయి మీప్రాణములు విడువుఁడని పౌరులు తమ
లోనివారి నెవ్వరి నాఱుగుర నడుగగలుగుదురు? తోడిపౌరులప్రాణ
ములను కాపాడుటకయి తమప్రాణముల నిచ్చెద మని తమంత బైలు
దేఱెడు పరోపకారు లెవ్వరుందురు? ఇట్లు క్షణకాలము దిగ్భ్రమ
కొంది యేమిచేయుటకును పాలుపోక చింతించుచుండఁగా నాగుంపులో
నుండి యొకమహానుభావుఁడు వెలువడివచ్చి పౌరరక్షణార్థము తన
ప్రాణముల నిచ్చెదనని సంతోషపూర్వకముగా పలికెను. పరిశుద్ధ
చింతతో పరోపకారార్థము స్వార్థపరిత్యాగమునకు వూనిన వుణ్య
పురుషుఁడు చూపిన నిదర్శనము లోకములో నెప్పుడును నితరులను
దనవంక కాకర్షింపక వ్యర్థముగా పోదు. అట్లు వెడలివచ్చి ముందు
నిలిచిన యామహాత్ముని యసాధారణ దేశాభిమానమును జూచి
తత్క్షణమే యింకొక కార్యశూరుఁడు తనప్రాణముల నిచ్చెద నని
ముందుకు వచ్చెను. అతనిని జూచి వెంటనే యింకొకఁడును, అనంతర
మింకొకడును, ఇంకొకఁడును, ఈప్రకారముగా పరోపకారార్థమయి
యాత్మప్రాణత్యాగమున కంగీకరించినవా రాఱుగురును నిమిషకాల
ములో సంసిద్ధు లయిరి. అప్పు డాపౌరులలో ననేకులు తామే
ముందుగా వచ్చి పరోపకారార్థ పరిత్యక్తదేహుల మయ్యెడుభాగ్య
మును బొందలేకపోయితిమిగదాయని సిగ్గును విషాదమును గాంచ
సాగిరి. దేశాభిమాన మన్న నిట్లుగదా యుండవలెను! ఇట్లాయాఱు
గురు వుణ్యపురుషులును వినయవేషములతో రాజుకడకు వచ్చి తమ
దుర్గమునొక్క తాళముల నర్పించిరి. తాను మొదట నుద్దేశించినట్లు
రాజు వారిప్రాణములు తీయుటకు కృతనిశ్చయుఁడయి యుండెను;
అట్లుచేయుట తగవు కాదని మంత్రులును యువరాజును జేసినహిత

బోధలన్నియు రాజుముందట బూడిదలో వ్రేల్చిన హోమములయ్యెను; ఇట్టి యవస్థలో గర్భవతియైయుండిన రాణి యింగ్లండునుండి భర్త వద్దకు వచ్చుట తటస్థించెను.

ఆమె స్త్రీజనస్వభావికమైన జాలిగుండెతో రాజు పాదములు మీఁదఁబడి, ఎవ్వరెన్ని విధములఁ జెప్పినను వినక తనపట్టును విడువకున్న యారాజుయొక్క కఠినచిత్తము కరఁగునట్లుగా సజ్జనాగ్రగణ్యులైన యాపౌరజన షట్కముయొక్క ప్రాణప్రదానము నిమిత్తమయి దీనవచనములతో భర్తనువేఁడుచు నభయహస్త మిచ్చువఱకును పాదములపైనుండి లేవకుండెను. వజ్రకఠినహృదయుఁడయి పౌరషట్క ప్రాణాపహరణదీక్ష వహించిన రాజుసహితము ప్రియకాంతా ప్రార్థనమువలన తన తొంటినిశ్చయమును విడువవలసినవాఁడయి యాయాయుగురను భార్యవశమున నప్పగించెను. ఆసాధ్వీమణి తత్క్షణమే వారిని బంధమునుండి విముక్తులను చేసి వారికి నూతన వస్త్రములను కట్టనిచ్చి తనవంక్తిని విందుపెట్టి వారి నభినందించి పంపివేసెను. ఇందాపౌరజనషట్కముయొక్క చరిత్ర మెంత శ్లాఘాపాత్ర మైనదో రాణియొక్క సదయచరిత్ర మంత శ్లాఘాపాత్ర మైనదే. నిజమైన యీశ్వరభక్తిగలవా రందఱును శత్రుపక్షము వారినిసహితము ద్వేషింపక ప్రేమింపవలయును. అట్టి ప్రేమతోఁ గూడిన పరోపకారచింత గలవాఁడే నిజమైన భక్తుఁడును దేశాభిమానియు నగును.

ఇప్పుడీ దేశములో పరద్వేషసహితమైన దురభిమానమేకొంద ఱిచే దేశాభిమానముగా పరిగణింపఁబడుచున్నదని యీవఱకే సూచించి యున్నాను. ఈదుర్భిమానప్రభావముచేతనే తన దంతయు సర్వోత్తమమైనదని గర్వించుచుండుటయు నితరుల దంతయు హేయమైన దని గర్హించుచుండుటయు సంభవించుచున్నది. మనకిప్పుడలవి

మనము తెలిసికొని సంస్కరించుకొనుచున్నంగాని మన కభివృద్ధి కలుగదు. దేశాభివృద్ధికి గర్వమును మించిన గర్భశత్రువు వేఱొకటి లేదు. దేశాభివృద్ధి కలుగవలె నన్నచో మనదోషముల నెఱిగి సంస్కరించుకొనుచు నితరులగుణముల నెఱిగి గ్రహించుచు నుండవలెను. పరిశుద్ధాస్తిక మతావలంబుల మని చెప్పుకొనెడు మన మెప్పుడును దేశాభిమానము పేరు చెప్పికాని మఱి యేనత్కృయపేరు చెప్పికాని యన్యులను ద్వేషింపఁగూడదు. మనము ద్వేషింపవలసిన దొక్క పాపము మాత్రమే. పరిశుద్ధాస్తిక మతానుసారముగా స్వదేశీయుని నైనను పరదేశీయు నైనను సోదరతుల్యునిగా భావించి యెల్ల వారిని సమబుద్ధితో ప్రేమించి మన మాదరము చూపవలెను. తనవా రనియు పరులనియు భేదభావమును వహించి సౌభ్రాత్రమును చూప కుండుట మనస్వభావమునకును మనసిద్ధాంతములకును భగవదాజ్ఞకును విరోధము. కాఁబట్టి సౌభ్రాత్రమునకు భంగముకలిగించెడు ప్రతి ప్రతిబంధమును రూపుమాపుటకయి ప్రయత్నించుట సర్వవిధముల చేతను మనకు పరమకర్తవ్యము. ఐకమత్యమును చెఱిచి, వైషమ్యమును వృద్ధిపఱిచి, ద్వేషమును కలిగించి, సౌభ్రాత్రమును తొలఁగించెడు మహానర్థము మనదేశములోఁగల వర్ణభేదపిశాచము. ఈక్రూరపిశాచము మనదేశములో నిరంకుశముగా రాజ్యము చేయుచున్నంతకాలము స్వరాజ్యముగాని, ఈశ్వరరాజ్యముగాని, మఱి యేరాజ్యముగాని తలయెత్తదు. ఈపిశాచావేశబలముచేత మనదేశములో నైకమత్యము చచ్చినది; పరస్పరద్వేషము హెచ్చినది; సుగుణసంపద విచ్చినది; అనర్థపరంపర వచ్చినది. ఇట్లిన్ని యవగుణములు ప్రబలినప్పుడు మన దేశములో నీశ్వరరాజ్య మెట్లు వ్యాపించును? అమృత తుల్యము లైన పరిశుద్ధాస్తిక మత

దివ్యఫలము లెట్లు ప్రాపించును? ఈ పిశాచబలముచేత మత మిప్పుడు హృదయమును విడిచి పొట్టకు దిగినది. అందుచేత మతధర్మము లైన కారుణ్యము మొదలైనవి హృదయమునుండి తొలగిపోయినవి; మతధర్మము లని పేరు పెట్టుకొని వచ్చి యొండొరులతో భుజింపఁగూడ దనెడు సోదరభావ భంజకము లైన విషకీటకములు పొట్టకడ్డముగాఁ జొచ్చి కలఁగించు చున్నవి. కడుపే కైలాస మనెడుమహానుభావులు మత మంతయు భోజనములోనే యున్నదని చెప్పి మానవకోటిలోని పరస్పరభ్రాతృభావమును నామమాత్రావ శేషము చేయఁ జూచుచున్నారు. సన్మతమహావృక్షమును మూలచ్ఛేదము చేయఁజాలిన యీయుపసిద్ధాంతవిషబీజము తమలో మొలక యెత్తకుండ జ్ఞానజ్యోతిచేత మాఁడ్చివేయుట పరిశుద్ధాస్తిక మతావలంబులకు ప్రథమ ధర్మము. వర్ణభేద పిశాచము మనదేశమాత కాచరింపని చెడుగులేదు. భారతపుత్రుల సమస్తవిషయములలోను దాసులనుగాఁ జేసి సమస్తస్వాతంత్ర్యములను గోలుపోఁగొట్టినది యీ మొండిపిశాచమే. అన్యదేశప్రభుజాతివారు మనలను తిన్నగాఁ జూచుచుండలేదని మనవారు మొఱ్ఱపెట్టుచున్నారు. రాజ్యాధికార గర్విష్ఠులయి వారిలో ననేకులు మనయెడల సర్వాగౌరవము చూపకుండుట సత్యమే. అయినను వర్ణపిశాచప్రేరణముచేత నగ్రవర్ణముల వార మనుకొని విజ్ఞులీఁగెడుమనవా రధమవర్ణములవా రనఁబడెడి స్వమతములవారివిషయమునఁ జూపెడి యగౌరవమునుబట్టి చూడఁగా నన్యమతస్థులుచూపెడిది పర్వతములో పరమాణువంత యైన నుండునా యని సంశయింపవలసియున్నది. మనవారు స్వమతస్థులైన మూలమూది గలయెడలఁ జూపెడి యన్యాయము మానవనామధారకులకెల్ల నవమానకరముగా నున్నది. వాండ్రు మనవీథులలో నడవఁగూడదు;

వాండ్రబిడ్డలు మనబడులలో చదువఁగూడదు. గాడిద యైనను పంది యైనను మనదాపుననుండి పోవచ్చునుగాని మాలవాఁడుమాత్రము బాటెడుదూరమునుండియైనను పోఁగూడదు. మనమతములో నున్నంత కాలము వానికెవ్వఁడును ముక్తిగలుగదు; గౌరవముకలుగదు. హిందు వైనమాలవాఁడు స్వమతమునువిడిచి బైలఁబడినఁగాని గౌరవపాత్రుఁడు కాఁడు. హిందువుగా నున్నమాలసీనఁడు మాత్రమే యస్పృశ్యుఁడును అవాచ్యుఁడునగునుగాని యా చెప్పరానివాఁడే క్రైస్తవమతమునో మహమ్మదీయమతమునో యవలంబించి జానో ఖానో కాఁగానే తాఁకఁదగినవాఁడును మాటలాడఁదగినవాఁడును నగుచున్నాఁడు. మత ములలో నెల్లఁ దమడె సర్వోత్కృష్ట మయిన దనిపొగడుకొనెడు హిందూమతస్థులకు స్వమతస్థు లయినమాలమాదిగల యెడలఁ దాము చూపెడియనాదరమును దలఁచుకొన్నప్పటికంటె నెక్కువ సిగ్గుపడవల సిన యవసరము మఱియెప్పుడు తటస్థించును? కోట్లకొలఁదిగా మన దేశమునం దంతటను వ్యాపించియున్న యీమాలమాదిగలే మన పూర్వు లయినయార్యులచే జయింపఁబడి దానులుగాఁ జేయఁబడిన మనదేశపు మొదటికాపు లని తెలిసినవారు చెప్పుచున్నారు. అదియే నిజ మయినచో నిజమైనహిందూ దేశస్వాములు వారే యనియు ఆర్యసంతతివార మయిన మనము వారిదేశము నపహరించి చిర కాలమునుండి యనుభవించుచున్న యపహర్తల మనియు స్పష్ట మగు చున్నది. పంచముల నిట్లు పలుతెఱఁగుల బాధించు మన మేన్యాయ మును జెప్పి జేత లగు పరదేశీయుల నధికస్వాతంత్ర్యముల నిండని వేఁడఁ గలము? జితులయినవారియెడల న్యాయముగా వర్తించికదా విజితుల మయిన మనము మాయెడ న్యాయముగాఁ బ్రవర్తింపుడని యడుగఁ గలము? ఇట్లు చెప్పుటచేత మనకర్హమైన స్వాతంత్ర్యములను మనము

పొందఁ బ్రయత్నింపరా దని నాయభిప్రాము మెంతమాత్రమును గాదు. మనస్వాతంత్ర్యముల నిమిత్తమై పోరాడెడు మన మితరుల స్వాతంత్ర్యములను గూడ మన్నించి యితరులయెడ నన్యాయము చేయకుండుట ధర్మమని చూపుటకొఱకే యింతనొక్కి చెప్పితినిగాని వేఱొకందునకుఁ గాదు. మన కర్మము లయినస్వాతంత్ర్యములను మనము పొందఁగోరినను మనకు యోగ్యమగు గౌరవమును మనము పొంద నపేక్షించినను పురుషులకుఁ గాని స్త్రీలకుఁ గాని యన్యులకుఁ గాని యుగ్రజాతులవారికి గాని యధమజాతులవారికి గాని మన మియ్యవలసిన స్వాతంత్ర్యములను మనము చూపవలసిన గౌరవము లను మనము చేయవలసిన న్యాయములను మనమిచ్చి చూపి చేయ వలెను. అందఱిని సోదరభావముతోఁ జూచుచు నెవ్వరియెడల నన్యా యము చేయక సర్వసమభావముతో వర్తించుట పరిశుద్ధాస్తికమతావ లంబుల మైన మన కీశ్వరాజ్ఞారూప మైన పరమధర్మము; జ్ఞానవిషయ మునఁ గాని సాంఘికవిషయమునఁ గాని నీతివిషయమునఁగాని కళల విషయమునఁ గాని కర్మలవిషయమునఁ గాని రాజ్యాంగవిషయములఁ గాని మానవకోటియొక్క సౌఖ్యాభివృద్ధులకు సహకారు లయిన సమస్తకృత్యములును మన కీశ్వరప్రీతికరము లయిన మతధర్మములే. మన మిది యది యనక మానవకోటి కేదేది యిహపరసుఖసాధక మో దానినెల్ల నభివృద్ధి చేయుటకయి యీశ్వరప్రీత్యర్థము పాటుపడ వలెను. కార్యములచేతనే కాని క్రియ లేనిశుష్కవాక్యములచేత దేశ మెప్పుడును బాగుపడదు. ఉపన్యాసము లావశ్యకములే యయినను మన దేశాభివృద్ధి కయి యిప్పుడుపన్యాసములకంటె కార్యపరు లధిక ముగా కావలెను. సభాభవనములలో ప్రసంగములను ప్రతిజ్ఞలనుచేసి శపథములు పలుకువారు మాత్రమేకాదు — కొందఱు సమస్తవిషయ

ములలోను సామాన్యజనులలో జ్ఞానాధిక్యము కలిగించుటకు బద్ధ కంకణులు కావలెను; కొందఱు సాంఘికదురాచారములను వెల్లడించి సంఘసంస్కరణదీక్ష వహించినవారు కావలెను; కొందఱు సత్యసంధత్వాదులు, బోధించుచు పరుల నధికనీతి పరులనుగాఁ జేయ కృతప్రతిజ్ఞులు కావలెను; కొంద అన్యదేశ విద్యాశిల్పయంత్రనిర్మాణాదులను నేర్చుకొని దేశములో నెలకొల్పి పాటుపడువారు కావలెను; కొందఱు మతధర్మోపదేశములు చేయుచు జనులలో పరిశుద్ధమతధర్మవ్యాపనముచేయ కృషిచేయువారు కావలెను. ఈవిధముగా నానాముఖములఁ బనిచేసిన గాని యొక్క విషయమున మాత్రమే కృషిచేసి తక్కినవిషయములయం దశ్రద్ధచూపిన నిజమయిన క్షేమలాభములు కలుగఁజాలవు. మొట్టమొదట సమస్తధర్మము లకును నస్థిభారమైనమతమును పరిశుద్ధమైనదానినిగాఁ జేయువలెను. మత ముపరిశుద్ధమైనచో జనులు నీతిపరులును సాంఘికదురాచారదూరులును నగుదురు. ఈవిషయములయందభివృద్ధిపొందినఁగాని ప్రజలు రాజ్యాంగ స్వాతంత్ర్యఫలములను పూర్ణముగా ననుభవింప శక్తులుకారు. సంఘ సంస్కరణాదులు మనచేతిలో నున్నవి ; రాజ్యాంగసంస్కరణాదులు పరులచేతిలో నున్నవి; కృషిచేసినచో స్వాశనము లయిన మొదటి వానిలో జయ మొందఁగలుగుట నిశ్చయము; పరాధీనమైన కడవటి వానిలో జయ మొందఁగలుగుట సంశయము. కాఁబట్టి మతసంఘ సంస్కరణాదులయందుఁ గూడ శ్రద్ధవహించి పనిచేయ మన విద్యాధి కుల నత్యంతవినయముతో వేఁడుచున్నాను. స్వభావముచేత మన భరతఖండముసమస్త వస్తుసంపూర్ణ మయినది. ఆవస్తు వులయుపయోగ మెఱిఁగి వానిని వృద్ధిపఱిచి లాభకరములుగాఁ జేయుటకు మన వారిలో నేర్పుకావలెను; కష్టముకావలెను; ధైర్యసాహసములు కావలెను; నీతి

పరత్వము కావలెను; సకలవస్తుసమృద్ధి గల మనదేశములో పయి సాధనములు వృద్ధియయి జనులు కార్యనిర్వాహణకుశలులు కాఁగానే స్వదేశవస్తు సమాదరమును విదేశవస్తునిరాదరమును తమంతనే కలు గును. ఇట్టి కృషి జరుగక స్వదేశి విదేశి యని ఘోష మిడుచున్నంత మాత్రముచేత దేశమునకు నిజమయిన లాభము కలుగ నేరదు. జాతి మత ద్వేషములను మాని దురభిమానమును త్యజించి పరదేశ యాత్రలు చేసి పశ్చిమఖండవాసులలోఁ గలగుణాంశములను గ్రహించి యంత్రనిర్మాణాది కౌశలమును సంగ్రహించి స్వదేశమున నెలకొల్పఁ గలిగినప్పుడే దేశమున కమూల్యప్రయోజనము కలుగఁగలదు. పరమ దయాపరుఁ డయిన యీశ్వరుఁడు మనవారిని కార్యశూరులనుగాఁ జేయును గాక! ఓభక్తవత్సలా! భక్తుల మయిన మాప్రార్థనలాలించి మాకు దేశోద్ధారణవిషయమున కృషిచేయ ధైర్యోత్సాహములను గలిగింపుము. మే మెప్పుడు నీభక్తిని విడువకుండు నట్లును నీకు ప్రీతి కరము లయిన సత్క్రియలయందే సదా మాకాలమును ధనమును దేహములను వినియోగించు చుండునట్లును సద్బుద్ధి శక్తినీ మాకు ప్రసాదింపుము.

రాజమహేంద్రవర ప్రార్థనసమాజము.

ఈసమాజ మిక్కడ దాదాపుగా ముప్పదిసంవత్సరముల నుండి యుండియున్నది. అంతకాలమునుండి యుండఁగా నేటికాలమున కాసామాజికులలోఁ గొంద అనుష్ఠానపరు లగుట తటస్థించినది. అను ష్ఠానపరు లగుట యనఁగా తాము పరమప్రమాణము లని నమ్మిన

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.

సిద్ధాంతముల ననుసరించి ప్రవర్తించువారగుట. అట్లయిన యనుష్ఠాన పరులలో నేనొకడను. చెన్నపురిరాజధానియందుఁ గాని బొంబయి రాజధానియందుఁ గాని కాళీఘట్ట రాజధానియందుఁ గాని భరత ఖండము నందలి మఱి యేయితర దేశమునందుఁగాని బ్రహ్మసమా జము లనునామమునను ప్రార్థనసమాజము లనునామమునను బరఁగు చున్న సమస్తసమాజముల యొక్కయు ముఖ్యసిద్ధాంతములు రెండని చెప్పవచ్చును. అందొకటి సర్వ లోకాధిపతి యైన యీశ్వరుఁడు లోకైకపిత యన్నవిశ్వాసము; రెండవది జాతివర్ణ మతభేదములులేక యీశ్వర సృష్టిలోని వారయిన సర్వమానవులును సోదరతుల్యు లన్న విశ్వాసము. ఈరెండును దాననుష్ఠానపరుఁడు కాఁగలిగినను కాఁజా లకపోయినను పూర్వోక్తము లయిన సమాజములలోఁ జేరిన ప్రతి సామాజికునియొక్కయు పరమభావనలు. కేవలశుష్కోప దేశమున కంటెఁ గార్యాచరణము శ్లాఘ్యతరమనుట నిర్వివాదాంశము గదా? తాను జేసిన యుపదేశము తనకే యాచరణమునకుఁ బనికిరాని పక్ష మున మఱియెవ్వరికిఁ బనికివచ్చును? అట్టి వంచకుని మాటయం దెవ్వ రికి విశ్వాసము కలుగును? పరోపదేశసమయమునం దెల్లవారును పండితులేయయి యనుష్ఠానసమయము వచ్చినప్పు డాపాండిత్యమును మూలఁబెట్టెడి యీకాలములో చెప్పినట్టు నడుచుకొనెడు సాహసికుఁ డొక్కఁడు కలిగినను తదితరులు కాకపోయినప్పటికిని సామాజికు లందఱైన నాతనిగౌరవించి యాదరింప వలయునుగదా? అట్లుచేయక వాక్శూరులైన కొందఱు బుద్ధిమంతు లాకార్యశూరులపై వేగిరపాటు గలవారనియు దూరాలోచన లేనివారనియు దోషారోపణలు చేయుచు సౌభ్రాత్రమును విడువఁజూచుట శోచనీయముగదా? ఒకవేళ వృద్ధత్వ దోషమున మతితప్పి యన్నిటికి సాహసించి వగలోకమునకుఁ బ్రయా

ణముకట్టుకొని యున్న ట్టూహింపఁదగిన నావంటివాని విషయమున నట్టి దోషారోపణము లొకవేళ నంతగా నింద్యములు కాకపోయినను బుద్ధిపటుత్వము గలనిండువయస్సులో నుండి విద్యాధిక్యముచే దూరా లోచన గలవా రనఁదగి యీలోకములో చిరకాలము వర్ధిల్ల నపే క్షించియున్న క్రియాపరుల విషయమున నట్టి యారోపణములు గర్హా ములు కాకపోవునా? ఓసోదరులారా! మీలోనెవ్వరైన నట్టి యారో పణములు చేసెడివా రున్నపక్షమున, ఈశ్వరు నొక్కసారి హృదయ పూర్వకముగాఁ బ్రార్థించి మీపూర్వసిద్ధాంతములను స్మరణకుఁ దెచ్చు కొని మీసోదరులయెడలఁ బూర్ణస్నేహమును గనఁబఱుపుఁడు. వ్యాధి బాధచేతఁ గదలలేనివాఁడ నయి కూరుచుండి వ్రాయుటకుసహితము శక్తుడనుగాక పరుండియే యీపంక్తులనువ్రాసి మిమ్మువేఁడు చున్నాను. మమ్మువిడువకు లగువేగిరపాటుగలవారినిగా భావింపక సదయదృష్టితోఁ జూడుఁడు. సత్కార్యమునకుఁ బూనుటలోను సత్యము ననుష్ఠించుటలోను వేగిరపాటన నెట్టిది? కాలముకొఱకు వేచుటయన నెట్టిది? ఎప్పుడు సత్కార్యము తేటపడునో దానికిఁ బూనుట కప్పుడే యుక్తసమయము; ఎప్పుడు సత్యము స్పష్టపడునో దాని ననుష్ఠించుట కప్పుడే యుక్త కాలము. తమతప్పను కాలముపైఁ ద్రోయుట యీశ్వరునియందును సత్యమునందును దమకుఁగలభక్తి హీనతకును గౌరవాభావమునకును గుఱుతు. నిజమునఁ భక్తివఱఁ డెవ్వఁడు నిట్టిమాటలనఁడు. కొందఱుమహానుభావులు సమయముపచ్చి వఱకును తామేమో లోకోపకార ధురీణు లయినట్టును భక్తాగ్ర గణ్యులయినట్టును నటించుచు లోకమునుభ్రమింపఁజేయుచు శోధన వచ్చినప్పుడు తెర వెడలివచ్చి ప్రపంచిక నాట్యరంగమున తమస్వాభా విక వికృతవేషములతోఁ గనువట్టుదురు. పయిమాటలు కార్యభీరు

లయిన యట్టి వేషధారులనోట వెడలవలసినవిగాని భక్తిలేశభూషితు లైన నిష్కపట హృదయులనోట వెడలవలసినవి కావు. భక్తలోకా భీష్టప్రదాత యైనయీశ్వరుఁడు పరిశుద్ధాస్తికులయినభక్తుల హృద యములయం దట్టికలఁపులు పొడమకుండఁజేసి, మానవదౌర్బల్యము చేత తాము ధర్మచరులు కాలేకపోయినను ధర్మచరుల నాదరించునట్టి సద్బుద్ధి వారి కందఱికిని పుట్టించునుగాక!

నేను వర్ణభేదమును పాటింపక సర్వవర్ణసమభావమును పూను టచే సామాన్యముగా సంఘసంస్కారమునకును ముఖ్యముగా వితంతు వివాహ సంస్కారమునకును నష్టము కలిగె నని కొందఱు భావించు చున్నారు అది యెంతమాత్రమును సరికాదు. ఎప్పటికిని లోకములో నేసంస్కారమును తనయొక్క న్యాయబలమునుబట్టి నిలచియుండును గాని యొక్క మానవమాత్రుని జీవితమునుబట్టి ప్రబలదు. ఈశ్వరేచ్ఛ చేత నావంటి దుర్బలుఁడు సహిత మొకానొకప్పుడు సంస్కార ప్రాబ ల్యమున కొకపనిముట్టుగా నుండవచ్చునుగాని యాతని తోడనే యా సంస్కారము నశింపదు. ఎప్పుడును ప్రతీక్షింపని స్థలములనుండి ప్రబలులైన సంస్కారపక్షావలంబు లనేకులు బైలుదేఱి సహస్ర గుణము లధికముగా దానిని కొనసాగింపవచ్చును. ఈశ్వరఘటనలు దురూహ్యములుగదా! ఇంతకును వర్ణ వైషమ్యమును విడుచుటచేత నేను సంస్కారపరాయణత్వము నెంతమాత్రమును విడిచిన వాఁడను గాను; ఈశ్వరప్రతిక లయిన హిందూనుందరు లందరును నూతన సంబంధమునుబట్టి నాకు మఱింతదగ్గరవా రయిన తోడఁ బుట్టువు లగుటచేత వారిస్థితిని బాగుచేయుటకయి మఱింత యెక్కువ పూనికతో పాటుపడుట నాకుఁ బరమకర్తవ్యముగా నేర్పడియున్నది. సామాన్యముగా స్త్రీలస్థితిని ముఖ్యముగా వితంతువులస్థితిని బాగు

వఱుచు ప్రయత్నములో నిఁకముందును నాశక్తిని యుక్తిని నాకాయ
మును ధనాదాయమును వలసినచో నాజీవితమును ధారపోయుట
కయి నేను సంసిద్ధుఁడ నయియున్నాను. వివాహమాడ నపేక్షించు
వారుగాని విద్యాలాభము పొందఁ గోరువారుగాని యథాపూర్వక
ముగా నేను గట్టించిన గృహమునందు వసించి స్వాభీష్టమును బడయు
చుండ వచ్చును. అట్టివారు నాతోఁగలసి భోజనము చేయుక వంతుల
వరుసను స్వయంపాకమును గావించుకొని సుఖించుచు నాయాతిథ్య
సత్కారమును యథేచ్ఛముగా ననుభవింపవచ్చును. ఏకేశ్వరారాధ
నము నంగీకరించి విగ్రహారాధనమును త్యజించి జాతివైషమ్యాభావ
మును భజించుటచే సంస్కారపక్షమునఁ బనిచేయుటకే నాకర్తలే
దని యాస్తికశిఖామణు లయిన యపూర్వసంఘసంస్కార ప్రియులు
గొందఱు ఘోషించుచున్నారఁట! వారు ఘోషించునట్లు వారియాద
రణము క్రిందఁ బని చేయుటకును వారిసాంగత్య భాగ్యము ననుభ
వించుటకును నేనర్హుఁడను కాకపోవచ్చును. ఇటువంటి పరార్థపరులు
లక్షమంది నన్ను త్యజించిరను నాసేవ యంగీకరించుట తమ గౌరవ
మున కర్హముకా దని భావించిరను, ప్రభువులకెల్లను ప్రభు వయిన
సర్వేశ్వరుఁడు నన్ను త్యజింపక నాకభయహస్త మిచ్చి స్వదేశక్షేమా
ర్థముగా నాసేవ నర్పించుటకుఁ బురికొల్పుచు నాకుఁ బ్రాపయి
చెంత నిలిచియుండఁగా నాధర్మమును నిర్వహించుటకు నే నెట్లర్హుఁ
డను గాకపోదును; ఈశ్వరబలము లేక లోకములో నేసత్కార్య
మును సంపూర్ణసాఫల్యము నొందనేరదు. సర్వశక్తుఁడయిన యీశ్వ
రుఁడే నాకు ముఖ్యబలమయి యుండఁగా నశక్త మానవులతోడ్పాటు
గొందఱిది లేకపోవుటవలన నాపని కేలభంగము వచ్చును? ఇప్పుడు
ప్రతాపోక్తులు పలికెడి యీ యసహాయవాక్శూరులవంటి వారియొక్క

యౌదార్యమును ధైర్యమును నేను పుప్పదిసంవత్సరములనుండి చూచు చున్నాను. బూటకపుమాటలబుంగ లైన మహావాక్యశూరులు పలు వురు ప్రసంగములు కావలసివచ్చినప్పుడు సభాభవనములు మాఱు మ్రోయునట్లు మేఘగంభీరభాషణములతో మహా ఘోషము చేసినను కార్యములు కావలసివచ్చినప్పు డేనూలను గానఁబడకున్నారు. ఇట్టి వాక్శూరులు కార్యశూరులయి సంస్కారదీక్ష వహించి దేశమును శతాబ్దములనాటి యగాధదురాచార పంకమునుండి యుద్ధరించుచుఁ దమవీరత్వమును గనఁబఱుచునప్పుడు పైనుండి చూచుచు నాకంపె నెక్కువయానందమును బొందువా రింకొకరుండరు. ఈమహానీయుల కొకవేళ నాచేసెడియల్ప సేవకూడ నంగీకార్య మయినయెడల వద్దుఁ డను దుర్బలుఁడను నైన నేనును నాకీశ్వరుఁడు ప్రసాదించిన యల్పబల మును శక్తివంచనలేక నినియోగింప సంసిద్ధుఁడనయి యున్నాఁడను. మాటల కేమి? మూఢులముందఱను దురభిమానదూషితుల ముందఱను పోటుమాట లెన్నియైనను బలుకవచ్చును. ఈశూరాలాపముల సత్య మును కార్యమువచ్చినప్పుడు కనఁబఱచి నప్పుడుగ దా యీవాగేక శూరులమగతనము తేట తెల్ల మగును! మూఢజనసమ్మతముగాని యొకసంస్కారమునకుఁ బూనినచోఁ భూషించుమిత్రులు దూషించు నప్పుడును, సేవించుసేవకులు బాధలు గావించునప్పుడును, ఆహ్వానపత్రి కలు పంపు మతాచార్యులు బహిష్కారపత్రికలు పంపునప్పుడును, ఈశ్వరభక్తివలనఁ గలిగెడి యసమానబల మొక్కటియే తోడు పడును గాని యదిలేనినాస్తికత్వాదు లేవియు తోడుపడవు. సంఘసంస్కారుల మయితిమని సంతోషపడెడి యోమిత్రులారా! వృథాగర్వాలాపములు పలుకక కార్యపరుల యెడల నించుక సహనము వహింపుఁడు. తమ సంస్కారములేక సంఘ సంస్కారముగాని మఱియే యితరసంస్కా-

రముగాని జయప్రదముగా సాగ దని చిరకాలానుభవము వలన నేను
దృఢముగా దలఁచుచున్నాను మీరు పడుచున్న భ్రమలలోనే నేనును
దగులుకొని యుండి మతనిష్ఠులు లయిన నావిశ్వాసములను గొన్ని
టిని గార్యములలోఁ జూఁపక యాత్మవంచకుఁడ నయి వితంతువివాహ
సంస్కారము చెడు నని కడచిన యిరువదియయిదు సంవత్సరముల
నుండి యీశ్వరవంచకుఁడ నయి ప్రవర్తించినాఁడను. ఇట్లు చేసినను
వితంతువివాహ సంస్కార మివ్వు డించుమించుగా నారంభదశలో
నున్నట్లే యున్నదిగాని యెక్కువయభివృద్ధిని బొందఁగలిగినది గాదు.
ఇప్పుడును పట్టపరీక్షలం గృతార్థు లయిన విద్యావివేక సంపన్నులు
వితంతువివాహములను సంస్కార కార్యపట్టికలో నుండి తీసివేయ
వలయు ననుచున్నారు; వితంతువివాహము లాడినవారిలో భోజనము
చేసినవారికి స్వాము లిప్పుడును బహిష్కారపత్రికల నంపుచున్నారు.
శూద్రాలాపము లాముసంస్కారప్రియు లివ్వుడును వెనుకటివలెనే
భయపడుచున్నారు. ఇంతకాలము నా యౌవనమును బలమును ధన
మును విద్యను బుద్ధిని వితంతువివాహావశ్యమునఁ గొంత యుపయో
గించియున్నాను. ఇఁకముందును నాదేహములో నూపిరియున్నంతకాల
మీవనిని విడువను; నాకంత్యదినములు సమీపించుచున్నవి. దక్షిణ
హిందూస్థాన బ్రహ్మసమాజమునకుఁ బ్రధానాధ్యక్షుఁడగా నుండి
యీశ్వరునియెుక్క పరస్పరభ్రాతృభావమును ఘోషించుచు నాత్మ
వంచకుఁడను లోకవంచకుఁడను భగవద్వంచకుఁడను నయి దేహము
త్యజించుట కిష్టములేనివాఁడ నయి యీ లోకసామాన్యసౌభ్రాత్ర
మున కీవృద్ధదశలో సాహసించినాఁడను! ఇహలోకయాత్ర నాకు నేటి
తోనే ముగియవలసియున్నను పరపంచకత్వము విడిచి సత్యము నను
ష్ఠించి యీశ్వరసామీప్యమును గొంతయెక్కువగాఁ బొందఁగలిగితిని

గదా యున్నంత వంతోషముతోను తృప్తితోను దేహమును చాలించె దను. ఈశ్వరుఁడు నాకు సంపూర్ణ మనశ్శాంతిని గలిగించునుగాక! నావంటివారి నిదర్శనమువలన లోకమునకు మేలుకలుగునట్లు చేయును గాక! నామిత్రులు ననున్న మన్నించి నాయందు తొంటిసుహృద్భావ మునే చూపుదురుగాక!

కం— వీరేశలింగము.

సన్మతము. 1-4-08.

...o0o...

ఎల్లవారును తామవలంబించిన మతమే యుత్తమ మయిన దనియు దానివలననే ముక్తిగలుగు ననియు చెప్పుచున్నారు. ఎల్ల వారును తామనుసరించెడు మతము గాక యితరమతము లన్నియు హేయము లనియు నరక హేతువు లనియు ఘోషించుచున్నారు. గ్రామదేవతలయెదుట కోళ్ళయొక్కయు మేకలయొక్కయు గొంతు కలు కోసి యానందించు జీవహింసాపరుఁడును తనమూఢమతమే సన్మత మనుచున్నాఁడు. తులసిపూసలతావళములు ధరించి లలాటము నిండ తిరుమణినామములు తీర్చి శంఖచక్రముద్రలతో బుజములు కాల్చుకొను వీరవైష్ణవుఁడును తనదే యుత్తమమత మనుచున్నాఁడు; రుద్రాక్షమాలలు దాల్చి మొగమునిండ విభూతి పూసికొని నాలుక కును బుజములకును శూలములు గుచ్చుకొని నిప్పులత్రొక్కు వీర శైవుఁడును తనదే సర్వోత్కృష్టమత మనుచున్నాఁడు; సూర్యోద యము మొదలుకొని సూర్యాస్తమానమువఱకును కర్మలలో మునిఁగి తేలుచు నువవాసాదులచే బాధపడు పరమచాందసుఁడును తనదే

శ్రేష్ఠమత మనుచున్నాఁడు. ఇంద టీలాగున నెవరిది వారే సన్మత
మని సంస్తుతించుకొనుచున్నప్పుడు సత్యమైన సన్మత మేకో తెలిసి
కొనుసాధన మేమున్నది? ఒకవృక్షము మంచిదో చెడ్డదో దానిఫల
ములవలననే తెలిసికొనవలసినట్లు మతమహావృక్షమునుసయితము దాని
ఫలములనలననే సంశోధించి నిశ్చయింపవలసి యుండును. వృక్షము
యొక్కశ్రేష్ఠతను నిర్ణయించుట ఫలములయొక్కరంగును బట్టియు
గొప్పతనమును బట్టియు మాత్రమేకాక వానివలన దేహమునకుఁ గలి
గెడి యారోగ్యసౌఖ్యములనుబట్టి నిర్ధారణ చేయవలసి యుండును.
పండు మంచిరంగును స్థౌల్యమును గలదయినను దేహమున కనా
రోగ్యకర మయి బాధను కలిగించునది యగునేని, అట్టిదుష్ఫలముల
నిచ్చువృక్షమును వివేకి యయినవాఁడు సద్వృక్షమని చెప్పజాలఁడు
గదా? ఆప్రకారముగానే మత మహావృక్షముయొక్కఫలము లింద్రి
యాకర్షకములును బహుజనాదృతములు నయినంతమాత్రముచేత
నాత్మ కానందదాయకములును పుష్టికరములును గానియెడల తన్మత
మును సన్మత మని వివేకిలోకము పరిగణింప నేర్చునా? సన్మతకల్ప
తరు వెప్పుడును సర్వజనసంతతానందదాయకము లైన సత్ఫలముల
నిచ్చునది యయి యుండును. సర్వజనానందకరము లయిన సత్ఫలములు
సత్యము న్యాయము ప్రేమము మొదలయినవి. ఇట్టి యమూల్యసత్ఫల
ములను లోకమునకు వెదచల్లు మతమహాకల్పమహీరుహమునకు
మూలము సత్యన్యాయదయాస్వరూపుఁ డైనపరమేశ్వరుఁడు. మధుర
ఫలభరిత మయినమహావృక్షము నాశ్రయించి సుఖించుపక్షులవలె
సమస్తకళ్యాణగుణపరిపూర్ణుఁ డైన పరమేశ్వరునికారుణ్యాతిశయము
చేత సనంతదివ్యఫలముల నొసఁగు సన్మతకల్పభూరుహము నాశ్ర
యించి నిత్యానందామృతరసపానసౌఖ్యము ననుభవించుచు కృతార్థులు

కావలసినవా రీశ్వరసంతతి యనఁదగిన మానవకోటి. సకలజనులను ప్రేమించుచు రక్షించుచు సమభావమున సౌఖ్యానందములఁ బ్రసాదించు పరమేశ్వరుఁడు మన పరమపిత. తదీయసంతతియైన మానవకోటి వరస్పరభ్రాతృభావముతో ననోన్యసుఖాభివృద్ధుల కయి పాటుపడుచు సమస్తవిషయములలోను లోకపితయొక్క యాజ్ఞ ననువర్తించుచు తదనుగ్రహాముపలననే యానందము నొందవలసిన సోదరీసోదరబృందము పరమపిత యైన యీశ్వరుఁతోడ తత్సంతతియైన మానవసంతతిని దృఢముగా బంధించెడు ధర్మానుబంధమే మతము కాఁబట్టి సత్యమతావలంబకు లైనవారికి లోకమంతయు నేకకుటుంబము. పురుషు లందఱును సోదరరత్నములు; స్త్రీలందఱును సోదరీమణులు. జాతివర్ణ ద్వేషములను బూనక యెల్లవారియెడలను సౌభ్రాత్రము వహించి పరులను తనవలె భావించి ప్రేమించి స్వప్రయోజనపరత్వమును విడిచి పరార్థపరుఁడయి వర్తించుట మానవధర్మము. అదియే యీశ్వరప్రీతికరము; అదియే పుణ్యము; అదియే శాశ్వత సుఖదాయకము. దేశభేద మతభేదములనుబట్టి జాతివర్ణ ద్వేషములను వహించి జనులను పగవారివలె భావించి గర్హించుచు పరోపకారచింతను విడిచి స్వార్థపరుఁడయి వర్తించుట మనుష్యప్రకృతి కనర్హమైన యధర్మము; అదియే యీశ్వరద్రోహము; అదియే పాపము; అదియే శాశ్వత దుఃఖదాయకము. ఈశ్వరేచ్ఛనే తనయిచ్ఛనుగాఁ గైకొని భగత్ప్రీతికర మగునట్లుగానే సమస్తకార్యముల నాచరించుచు సర్వప్రయత్నములచేతను పాపమార్గమును పరిహరించుచు పుణ్యమార్గమునసే సంచరించుచు తాను సుఖించుచు లోకమును సుఖింపఁజేయునట్లు మనుష్యుని నడుపుటయే మతముపలనఁ గలుగవలసిన ప్రయోజనము. తాను సుఖించుటకును, పరులను సుఖింపఁజేయుటకును సత్యము

న్యాయము కారుణ్యము మొదలయిన సుగుణరాజములే పరమసాధన ములు. ఈసాధన కలాపమును ననవరతము ధరించి తదనుగుణముగా వర్తించు మహానుభావులే నిత్యసత్య వ్రతులును న్యాయైకావలంబు లును భూతదయాపరులును నయి నీతిమంతు లనఁబడుదురు. నీతిని స్రోత్సాహపఱుపని మతము సత్యమతము కాదు; నీతిబాహ్య మయిన మతము సర్వానర్థదాయక మయిన దుర్మతము. నీతిబలముచేతనే దేశ మభివృద్ధి చెందవలెను; ఎప్పుడే దేశ మున్నతస్థితికి వచ్చినను దేశ వాసులనీతిసంపద చేతనేకాని వేఱుకారణముచేతఁ గాదు. నీతిమంతుఁ డొకఁడే నికృష్టమైన యీశ్వరభక్తుఁడు, ఆనందబాష్పములు విడు చుచు దినమునకు వేయిప్రార్థనలు చేయువాఁ డయినను నీతిమాలిన వర్తనము గలవాఁ డగునేని, ఆ యీశ్వరవంచకుఁడు భక్తుఁడు గాక భ్రష్టుఁ డగును. నీతియే యీశ్వరగుణభూషణము; ఈగుణభూషణ ములలో కారుణ్యము శిరోభూషణము. పైని జెప్పినదానివలన సన్మత మునకు ప్రధానాంగములు రెండని యేర్పడుచున్నవి. అందు మొద టిది యీశ్వరపితృభావనయు తద్భక్తియు నయి యున్నది; రెండవది సర్వజనభ్రాతృభావనయు తదుపకారము నయి యున్నది.

సర్వాభివృద్ధులకును మతమే మూలాధారము. ఈశ్వరభక్తి లేక సత్కార్యాచరణబుద్ధి పుట్టదు; సర్వజనసౌభ్రాత్రము లేక సత్కార్యాచరణము కలుగదు. నికృష్టమైన జనసౌఖ్యమునకు మొట్ట మొదట మతము పరిశుద్ధమయి శుభదాయకము కావలెను. అది నీతి బాహ్యమయి కలుష మయినయెడల సమస్తాభివృద్ధి భంజక మయి యశుభదాయకమగును. కాఁబట్టి స్వాభివృద్ధిని దేశాభివృద్ధిని గాంక్షిం చెడు పుణ్యపురుషులు మతమునందుఁ బ్రవేశించిన యవరిశుద్ధతలను దొలఁగించి దానిని నిష్కళంకముగాఁ జేయ పూనుపడవలెను. జనులంద

ఱును సత్యాదరము కలవారు కావలెను; ధర్మపరులు కావలెను; దయాళువులు కావలెను; సత్కార్యశూరులు కావలెను. మనము చేసెడి ప్రతిసత్క్రియను ఫలనిరపేక్షముగా ననఁగా, ధర్మ మనియు నీశ్వర ప్రీతికరమనియుఁ జేయువలెనేకాని వానివలనఁ గలుగఁ బోయెడు లాభనష్టముల నాలోచించి కాదు. మనకు ధర్మమును కర్తవ్యమును నగుపనిని బాధలెన్నివచ్చినను గణింపక పరమేశ్వరప్రీత్యర్థముగా చేసి తీఱవలెను. అట్లు చేసెడిమనుష్యుఁడే నిజ మయిన యాత్మగౌరమును భగవద్భక్తియుఁ గలవాఁడుగాని తదితరులు గారు.

సత్యమునం దాదర మెట్లో యట్లే భగవద్భక్తి గలవారెల్ల న్యాయమునందు సహితమాదరముగలనారయియుండవలెను. మనదేశ మునందగ్రవర్ణములవారధమవర్ణములవారియెడలను, పురుషులు స్త్రీల యెడలను, ఎన్నెన్ని యో యన్యాయములను జేయుచున్నారు. మాల మాదిగ లయినపంచముల విషయ మటుండఁగా శూద్రులవిషయమున నడచు చున్నయన్యాయములను దలఁచుకొన్నను న్యాయదృష్టిగలభగ వద్భక్తులకు తలవంపులుగా నుండును. సోదరులుగా నుండవలసిన మానవజాతిలో కొందఱు మఱికొందఱిని మృగములకంటెను హీనముగాఁ జూచుచు నవమానించుచుండుట మతమునకంతకు నవమానకరము. మానవజాతికంతకు నపకీర్తికర మయిన వర్ణవైషమ్య మహోకళంకము మతమునుండి తొలఁగింపఁబడువఱకును మనదేశము బాగుపడనేరదు; మనదేశస్థులు స్వాతంత్ర్యలాభముల ననుభవింపఁ జాలరు. మనదేశ మందు స్త్రీలవిషయ మయి నడచెడి యన్యాయము లింతకంటెను ఘోరతరము లయి యున్నవి. పురుషుల కర్థాంగులనఁ బడెడియబలలను విద్యావిహీనులనుగా జేసి, ఆడుకొనెడి దినములలోనే వివాహ మనెడి పేర దాస్యము పాలుపఱచి బాలవితంతువుల నామరణమును దీఱనివ్యథ

కప్పగించి, పెట్టెపు కడగండ్లను దలచుఁకొన్న న్యాయబుద్ధియు నీశ్వర భక్తియుఁగల వివేకుల హృదయములు కంప మొందవా? వారికంట వెడలెడి యశ్రుజలము లొక్క చోటఁజేర్చఁగలిగితిమా యెన్న డో మహాసముద్రము లేర్పడకపోవు. స్త్రీలను తమస్థితికిఁ దీసికొనిరాక యజ్ఞానాంధకారమున ముంచి దుస్థితిపాలు చేసెడి యపయశమును దొలగించుకొన్నఁగాని మనవా రెప్పటికిని నాగరికు లనఁదగినవా రను భవించుచున్న శుభస్థితిని బొంద శక్తులుకారు. అబలలయిన, యీడు వారి నేడిపించి సుఖింపఁ గోరువీరులు తాము బాగుపడనేర్తురా? ఈశ్వరభక్తిలేశముగల పురుషనామధారు లందఱును శోచనీయమైన యీపాపపంక మింకువఱకును నిదురపోకుందురుగాక !

ఇటువంటి యనంతములైన యన్యాయములను రూపుమాపు టకును ప్రజలయభివృద్ధిని పెంపు చెందించి వారిని సుఖులనుగాఁ జేయుటకును కారుణ్య మమోఘసాధనము. ఈకారుణ్యమును వృద్ధి పొందించుకొనుచు పరోపకారకృత్యములయం దెంతయెక్కువగా వర్తించుచుండునో భక్తుఁ డంతయెక్కువగా నీశ్వరసామీప్యమును బొందుచు దేశమును పాపపంకమునుండి యుద్ధరించి విముక్తిమార్గ మున నడపింప శక్తుఁడగును. దేశారిష్టకరము లైన యిట్టికళంకముల వారింపఁగలిగినఁగాని మతము పరిశుద్ధమయి సన్మతమని పేరువడయు నర్హముకాదుం పరమదయాళుఁ డైనపరమేశ్వరుఁడు నిర్దుష్టమయిన సన్మతమును దేశమునం దంతటను వ్యాపింపఁజేయునుగాక!

గృహము — భూతలస్వర్గము. 1-4-08

ఆదికాలమునందు మనుష్యులు మృగప్రాయులయి, మృగముల తోడిపాటుగా నరణ్యములందు వసించుచు, కందమూల పర్ణఫలభక్షణము చేయుచు, చెట్లనీడనో గుహలలోనో విశ్రమించుచు, భార్యాది బంధము లేక యిచ్చవచ్చినవారితోఁ గలియుచు, అనాగరికు లయి యుండెడివారు. కాలక్రమమున మృగప్రాయతతొలఁగి, సభ్యతకొంత గలిగి, వివాహానుబంధసంసారభారము మీఁద పడినతోడనే సుఖావాసమునకు గృహము కావలసిన యావశ్యకత సంభవించెను. గృహమేర్పడి గృహస్వామ్యము కలిగినప్పుడు గృహము గలపురుషుఁడు గృహియు స్త్రీ గృహిణియు నయిరి; అప్పుడాపురుషుఁడు భరింపవలసినవాఁడగుటచేత భర్తయు స్త్రీ భరింపఁబడఁదగిన దగుటచేత భార్యయు నయిరి. అట్లు గృహయోజమాన్యము భార్యాభర్తలయందు సంక్రమించినందున పురుషుఁడు గృహపతియు స్త్రీ గృహపత్నియునయి సంసారచక్రమున కుటుంబపాలనమునందు గృహమునకు వారిరువురును రాజును రాణియునయి సంసారసుఖము ననుభవించుచు నానందింపఁ గలవారయిరి. స్త్రీపురుషులలో ననోన్యస్యమైత్రియు పరస్పరానుకూల్యమును గలిగి గృహపాలన మైకమత్యముతో నిర్వహింపఁబడునప్పుడు సంసార మమృతతుల్యమయి సమస్తసుఖావహ మయి సకలసద్గుణోత్తేజకమయి యత్యంతస్పృహనీయ మగును; అప్పుడు గృహము భూతలస్వర్గ మగు ననుటకు సందేహములేదు. అనిర్వ్యాజానందము గృహమునందే యుదయించును; శుద్ధవర్తనము గృహమునందే యారంభ మగును; స్వప్రయోజనత్యాగము గృహమునందే పుట్టును; ఈశ్వరభక్తి గృహమునందే యంకురించును; పరోపకారబుద్ధి గృహ

మునందే జనన మొందును. ఇది యది యననేల? మానవానంద సౌఖ్యఫలములకు మూలము లయినసమస్తసద్గుణలతలును గృహాల వాలములనే మొలకలెత్తి పెరిగింది బయలఁబ్రాఁకి కాలక్రమమున లోకమెల్ల నల్లుకొనును. ఇట్టిగృహమునందు పురుషునిపాలిటి భాగ్య దేవతయు, అర్ధాంగి యగుటచే సమసుఖదుఃఖభాగినియు, ఆరోగ్య భాగ్యకారిణియు, దుఃఖనివారిణియు, నయిన యిలురాణి నిరంకుశాధి కారముతోఁ గాక యనురాగపూరితము లైన కటాక్షవీక్షణముల తోను ప్రేమాస్పదము లైన మృదుమధురవాక్యములతోను రాజ్యము చేయును. సహాధర్మచారిణి ప్రేమానుపూర్వకముగాఁ జేసెడి యువ చారములును సరససల్లాపములును సమస్తశ్రమలును మఱిచునట్లు చేసి యనిర్వాచ్య మైన హృదయానందమును గలిగించును; తప్పుటడుగు లిడుచు వచ్చీరాని తొట్రుపలుకులు పలుకుచు వచ్చి వయిని ప్రక్కను బడి మురిపములు మూపు శిశువుల ముద్దుమోములును వారి మంద హాసములును నేత్రానందముచేయును; పగలెల్లను బయిట పనిచేసి యలసిసొలసి సాయంకాల మిల్లు చేరవచ్చునప్పటి కెదురుగావచ్చి నవ్వుమొగముతో నిరువైపుల చేతులుపట్టుకొని లోపలికిఁ గొనిపోయి కిలకిలలాడు బిడ్డల గారావుమాటలను, ఉల్లము చల్లచేసి మనఃక్లేశ మునుబాపి సంతోష మొసఁగెడి ప్రియకాంతయొక్క సవినయోప చార వాక్యములును, సంగీతముకంటెను మధురతరముల శ్రావ్యము లయి శ్రవణరసాయనము లగును.

నిరంకుశబుద్ధిప్రచారులగు కవికుమారులువర్ణించిన స్వర్గమును పయినుండి క్రిందికిదింపి మనభూలోకగృహములయందు పెట్టిరేమో యనునట్లు పయిప్రాఁతపలసఁ గనఁబడినను, పరీక్షించి చూడఁగా కవిశిఖామణులు కావ్యములయందు వర్ణించిన నరకమును క్రిందినుండి

పయికెత్తి యీభూలోక గృహములయందు పెట్టిరేమో యనునట్లు బహు గృహములు కానఁబడుచున్నవని కొంద అనుభవశాలులు వలుకవచ్చును. భూలోకనరకము లనఁదగిన గృహములు పెక్కులుగలవు గాని యవి యట్లుండుట స్వాభావిక గుణముచేతఁగాక యస్వాభావిక దోషముచేత తటస్థించినదని చెప్పనలసియున్నది. గృహముస్వర్గమువలె నుండక నరకమువలెనుండుటకుఁగల యస్వాభావికదోషమేది? నిజముగా గృహము భూలోకస్వర్గమువలె నుండుటకు గృహియు గృహిణియు నెట్టివారుగా నుండవలెను? అన్న యంశము విమర్శనీయముగానున్నది. లోకములో సుఖపడఁ దలఁచుకొన్న వారందఱు విద్యావివేకములు గలవారుగాను సత్యసంధులుగాను, ధర్మరతులుగాను, నీతిమంతులు గాను, భూతదయాపరులుగాను, ఈశ్వరభక్తి గలవారుగాను, సద్వర్తనులుగాను, ఉండుటచేత గృహస్థుఁడట్టి సుగుణసంపద గలవాఁడుగా నుండవలెను. గృహి యట్టివాఁడు కావలసినచో నింక గృహిణి యెట్టిదిగా నుండవలెను?

భర్తతోడిపాటుగా మొట్టమొదట భార్యయు విద్యావతి యయి యుండవలెను. కొందఱు బుద్ధిమంతులు తాము విద్యావంతులయ్యును భార్యలను మూఢురాండ్రనుగానుంచి వారు గుణవంతురాండ్రు కావలెనని కోరుదురు. సదసద్వివేకము కలిగించెడు విద్యలేనియెడల సుగుణము లెక్కడినుండి వచ్చును? ఆవుకు మేత వేయక పాలీయవలె ననన్న నెట్లు పొసఁగును? కొందఱుమహానుభావులు చదువుకొన్న భార్య పరపురుషుల కుత్తరములు వ్రాయఁగలుగునని వలుకుచు మూఢనవనిత గుణములను మెచ్చుకొందురు. కుంటివాడు నృత్యముఁ జేయుచుండఁగా గ్రుడ్డివాఁడు సంతోషించినట్లు మూఢకాంతల కౌశలమును మూఢకాంతులు మెచ్చుకొని సంతోషపడనిండు. చదువుకొన్నవాఁడు

మాత్రము తన యర్ధాంగిని చదువెఱుంగనిదానినిగా నుంచకుండును గాక! భార్యాభర్తల దిద్దుతిది యేకదేహ మనిచెప్పుటచేత నందర్ధభాగ మయిన స్త్రీశరీరము విద్యాభావముచేత పశుశరీరముగాను, అర్ధభాగ మయిన పురుషశరీరము విద్యాప్రభావము చేత మనుష్య శరీరముగాను, ఉన్నయెడల నట్టిశరీరము పక్షవాతబాధితదేహముపలె బాధ పడక యెట్లు సుఖపడఁగలుగును? "విద్యావిహీనఃపశుఃు" అన్న యార్యోక్తిని వినినివా రెవ్వరు? పశువాస మైనగృహము మహా రణ్యముగాక మనుష్యశరణ్య మెట్లగును? మూఢాంగనలతో నిండి యున్న గృహాములు భూలోకనరకము లగుట యొకవింత కాదు. చదువుకొన్నభర్తకు చదువుకోనిభార్యబాధ గలయింటికడ నుండునంత యసౌఖ్యము మఱియొక్కడనుండదు. అట్టిభర్త కిల్లేనరకము. బయట ప్రసంగములలో సింహముపలె నసహాయ శూరుఁడుగా నుండు విద్యాధికుఁడు మూఢభార్యాపిశాచావాస మైనస్వనివాసమునకు రాఁగానే తనప్రపంగములను తన్మునుమఱచి యింటికడ నసమాన భీరువయి భయముచే వడఁకుచు పిల్లిపిల్లవలె మూలమూలల నొదిగి యుండవలసినవాఁ డగును. సభాభవనములో నెత్తిననోరు స్వభవన ములో నెత్తినపట్టున మఱునాఁటినుండి బ్రతుకులేదు. చదువు గల భర్తకును చదువులేని భార్యకును సద్విషయములయందు సంభా షణ ముండదు; సత్కార్యములయం దైకమత్య ముండదు.

సత్యమైనసౌఖ్య ముండదు; సంతోష ముండదు. ఏసౌఖ్యము లేకపోయినను తగవులాట యైనను లేకుండ బయలఁబడవలెనని కోరెనా, యతఁడింట నున్ననాలుగుగడియలును తన విద్యాధికవేష మును మార్చి మూఢవేషమును వేయువలెను. ఇట్టిగృహాములు భూలోకనరకములుగాక స్వర్గము లెట్లు కాఁగల్గును?

విద్యావివేకకోవిదు లయిననుహృదులారా! మీగృహములు భూతలస్వర్గములు కావలెనన్నకోరిక మీకున్నచో మీతోసమానముగా మీవామాంగులను విద్యావతులనుగాఁ జేయ సర్వవిధములఁ బ్రయత్నింపుఁడు. వారిని మూఢత్వములో ముంచియుంచి మీరెప్పుడును పైకితేలఁజాలరు. అజ్ఞానసముద్రమునుండి విద్యాప్లవముచేత వారిని తేల్చిన మీరును తేలి దరిచేరఁగలుగుదురు; అట్లుచేయని యెడల మీరును వారితో మునిఁగి యడుగంటుదురు. మీరు బాగు పడఁ గోరితిరా వారిని బాగుచేయుఁడు. స్త్రీలబాగే పురుషుల బాగు; స్త్రీలయోగే పురుషులయోగు. వారి నజ్ఞానాంధకారమునుండి వెడలించి కన్నులు తెఱపించి వెలుతురులో పెట్టితిరా వారు మీతోడ నడచి యిహలోకయాత్రయందు సహాయులౌదురు. విద్యయిమ్ము నిత్యానంద పదవికిఁ జేర్తురు. ఒక్కవిద్యాదానమును మీరు వారికి పూర్ణముగాఁ జేసితిరా, విద్యాప్రభావముచేత వారు సమస్తయోగ్యతలనుబడసి గృహములను నిజమైన భూతలస్వర్గములనుగాఁ జేయ సమర్థులౌదురు.

పాపము — ఈశ్వరకారుణ్యము.

ఈ లోకము దుఃఖబహుళమైన దనియు దుఃఖముల కన్నిటికిని జన్మము కారణ మగుటచేత జన్మము లేకుండఁ జేసికొనుటయే పరమార్థమనియు, అదియే ముక్తి యనియు, మనవారు చెప్పుచున్నారు. జరామరణరోగాదులవలనఁ గలుగు దుఃఖములు మనదేహముల నాశ్రయించి యుండుననుటకు లేశమాత్రమును సందేహము లేదు. పరమకారుణ్యుఁడయిన యీశ్వరుఁడే లోకమును పాలించుచున్న

యెడల సృష్టిలో నిట్టిదుఃఖము లుండుట యెట్లు పొసఁగునని భావించి సంశయించి నాస్తికులయిన వారును పలువురు గలరు. సర్వకారుణ్యుఁడైన యీశ్వరుని రాజ్యములో నిట్టి దుఃఖము లుండుట పొసఁగునా యన్న యంశము విచారణీయ మైనదే. మనకు శరీరములు మాత్రమే యుండి శరీర సౌఖ్యములే పరమార్థము లయినపక్షమున మన సంసార దుఃఖములు నిజముగా నీశ్వరుఁడు సర్వకారుణ్యుఁడగునా యన్న సందేహామును గలిగింపవచ్చును. మనకు క్షీణ భంగురము లైన శరీరములుమాత్రమేగాక నిత్యము లైనయాత్మలుకూడ మున్నవి. అందుచేత శారీరిక సౌఖ్యము లనఁగా నింద్రియసుఖములు తుచ్ఛము లయి యనిత్యము లైనవిగాను, ఆధ్యాత్మిక సౌఖ్యములు శ్రేష్ఠములయి నిత్యము లైనవిగాను, ఉన్నవి. ఈద్వివిధ సౌఖ్యముల లోను దేహసౌఖ్యముకంటె నాత్మానంద మధికాదరణీయ మయి పరమార్థముగా నేర్పడుచున్నది. కాఁబట్టి వివేకులైన వారు నశ్వరము లైన దేహసౌఖ్యములను త్యజించియైనను, అనశ్వరములైన యాత్మానందము నొందుటకయి సదా ప్రయత్నించుచుందురు. లోకములో సాధారణముగా దేహసంబంధ మయినట్టి గాని యాత్మసంబంధ మయినట్టి గాని సౌఖ్యము లీశ్వరాజ్ఞనుసరించుటవలనను దుఃఖము లీశ్వరాజ్ఞనతిక్రమించుట వలనను గలుగుచున్నవి. దేహారోగ్యధర్మముల మీఱుటవలన వ్యాధులు సంభవించును; ఆధ్యాత్మిక ధర్మములను మీఱుటవలన మనోవ్యథలు సంభవించును. కాఁబట్టి వ్యాధులును వ్యథలును అస్వాభావికములును నాగంతుకములు నయి యున్నవి. సౌఖ్యానందములు స్వాభావికములును సుస్థిరములు నయి యున్నవి. మనము స్వభావమునుచేసి సౌఖ్యము ననుభవించునట్లు చేయుటయే యీశ్వరుఁడు సర్వకారుణ్యుఁడగుటను సనాతనులు ఘోషించు

చున్నవి. అయినను లోకమంతలో మనకు కష్టములు పెక్కులు గలవు. ఈకష్టములు నొప్పులు, తెవుళ్లు, చావులు మొదలైనవానివలనఁ గలుగుచున్నవి. ఇట్టిబాధలు మనదేహములకు సంభవించెడు వ్యాధులు మొదలైనవానివలన మాత్రమే కాక మనకు ప్రేమాస్పదులైన భార్యాపుత్రాదులు బంధువులు మిత్రులు మొదలైనవారికి సంభవించెడు రోగములు నొప్పులు మొదలైన దుఃఖములవలనను కలుగుచున్నవి. ఈదుఃఖములు మనము బాధపడుటకు మాత్రమే యుద్దేశింపఁబడినవిగాక కడపట వానివలన మనకు మేలు కలుగుకొఱకే యుద్దేశింపఁబడిన వగుటచేత నీదుఃఖములవలన సహిత మీశ్వరుని సదుద్దేశమును కరుణాళుత్వమును వెల్లడి యగుచున్నవి. నిప్పు త్రొక్కినప్పుడు గాని ముల్లుగ్రుచ్చుకొన్నప్పుడుగాని కలుగు నొప్పి ముందు జాగరూకులమయి చూచి నడుచుటకు తోడుపడుచున్నది; వ్యాధు లారోగ్యధర్మములను మీఱకుండునట్లు చేయుటకయి తోడు పడుదున్నవి; ఇతరుల యీవదలు జాలి కలిగించి పరోపకారమునకు పురికొల్పుటకయి తోడుపడుచున్నవి.

శరీరసుఖములకంటె నాధ్యాత్మికసుఖము లధికాభ్యర్థనీయము లనియు, స్థిరతరము లనియు, శరీరక్లేశములకంటె నాధ్యాత్మిక దుఃఖము లధిక హేయములనియు నధిక వేదనాకరములనియు, తెలిపియున్నాము. ఈశ్వరాజ్ఞారూపములైన యాధ్యాత్మిక ధర్మములను మీఱుట పాప మనియు, అనుసరించుట పుణ్యమనియు, వ్యవహారింపఁబడుచున్నవి. ఇహపర సుఖముల నపేక్షించు ప్రతిపురుషుఁడును ప్రతిస్త్రీయును పాపమునకు భయపడుచు సర్వప్రయత్నముల చేతను దాని పొంతకుఁ బోకుండునట్లు పాటు పడుచుండ వలయును. ఈపాపముల మనోవాక్కాయ కర్మలచేత స్వవిషయమునను భగవం

తునివిషయమునను చేసెడి యాశ్వరాజ్ఞోల్లంఘనములయి యున్నవి. శారీ
రక దుఃఖములకంటె పాపరూపము లయిన యాధ్యాత్మికదుఃఖములు
ఘోరతరము లని సామాన్యజ్ఞానము గల యెల్లవారును నెఱిఁగి
యున్నారు. అందుచేతనే యనేకు లెన్ని దేవాబాధలకయినను సహిం
తురుగాని వానిని తప్పించుకొనుట కయి పాపకార్యమున కడుగిడఁ
జాలరు. అనేకులు తమవారు దుష్కార్యములు చేసి యపకీర్తిపా
లగుటకంటె మృతినొందుట మే లని తలంతురు.

ఇది మంచిది, ఇది చెడ్డది, ఇది చేయఁదగినది, ఇది చేయఁగూడ
నిది, అనుజ్ఞానము మనలోనుండుటచేత పుణ్యపాపభేద మేర్పడినది.
ఈజ్ఞానమే లేకయుండినయెడల పుణ్యపాపభేదమేయుండదు. మనుష్యుఁ
డొకబాలుని జంపినయెడల నెల్లవారును వానిని పాపాత్ముఁడని భావిం
తురుగాని, యాబాలునినే యొకతోడేలు మ్రింగిన నెవ్వారును అది
పాపము చేసె నని తలంపరు. సర్వజంతువులలో మనుష్యుఁడు శ్రేష్ఠుఁ
డని భావింపఁబడుట కతనికిఁ గల పుణ్యపాపజ్ఞానమేముఖ్యకారణము.
ఇటువంటి నదసద్వివేకమును ప్రసాదించుటయే యీశ్వరుఁడు మనకు
చేసినమహోపకారములలోనెల్ల నగ్రగణ్య మయినది. దీని మహిమ
చేతనే మనము సమస్తజీవరాసులకంటెను మహోన్నతుల మయి తల
యెత్తుకొని నిత్యానందము ననుభవింపగలుగుచున్నాము. ఈవిభాగ
జ్ఞానమే మనము పాపుల మనుచింతను మొట్టమొదట మనహృదయ
ములలో నుదయింపఁజేయున దయినను, పాపచింతయే మనలను నీతి
పరులను జేసి శాశ్వతానందప్రద మయిన ముక్తిసౌధము నెక్కించుటకు
ప్రథానసోపాన మగుచున్నది. అందుచేత పాపచింత మన కెంత
మాత్రము నపకారి గాక మనయుత్తమగమ్యస్థాన మైన పరమపద
మును జేర్చుటకు సాయమయి మహోపకారి యగుచున్నది. మనము

పాపులమును పతితులమును కానియెడల పుణ్యులమును పావనులమును కాఁగలుగుట సాధ్యము కాదు. పాప మనునది యొకటి యుండఁబట్టియే మనము పుణ్యపాపభేదములను దెలిసికొని, మనప్రయత్నముచేత పాపమును పరిత్యజించి పుణ్యపథమునుభజించి యానందింపగలుగుచున్నాము. ఒకఁడు పాపకార్యమును జేయుటకు శక్తుఁడు కాకుండుటలో ఘనత యేమియు లేదు. ఘనతయంతయు పాపమును జేయుటకు శక్తుఁడయి యుండియు తనకుఁ గల స్వతంత్రముచే పాపమార్గమునుబట్టక చరించుటలో నున్నది. పాపపుణ్యవిభేదమును దెలిసినవా రయి ఇచ్చవచ్చిన దారి ననుసరించు స్వాతంత్ర్యము గలవార మగుటచేతనే యీశ్వర భటుల మనఁదగిన మనము మోహాంధకారబంధురరిపువర్గకంటక దుశ్చింతావిషసర్పసమావృత మైన పాపమహారణ్యమును ఛేదించి దారి చేసికొనుచు మహాపౌరుషముతో ముందుకునడిచి యీశ్వరసాన్నిధ్యము చేరి యనిర్వాచ్యనిరుపమానంద లాభమునొంది సుఖింపఁగలుగుచున్నాము. ఇటువంటి యసమానమోక్షసాధనమును మనకనుగ్రహించి నిత్యానందపదవికి దారియేర్పఱిచిన సదయహృదయుఁడు సర్వకారుణ్యుఁడు గాక మఱియెట్టివాఁడగును? పాప మను దానినొకటిని గలిగించిన పరమేశ్వరుని కరుణాళుత్వమువలననే మనము పాపభయమునుబట్టి యభయము వేఁడి యీశ్వరునియండఁజేరి తద్దాసులమయి యీశ్వరప్రీతికొఱకు తత్పరులమై న నీతియందును సత్యమునందును దినాదినాభివృద్ధి నొందుచుఁ గడపట పరిపూర్ణపవిత్రతను గాంచి యీశ్వరసామీప్యమునొంది మోక్షసామ్రాజ్యమును చూఱగొనఁ గలుగుచున్నాము. పాపచింతలనుండియు పాపవాక్కులనుండియు పాపకర్మలనుండియు విముక్తుల మయి ముక్తిపదము నొందుటయే మనము కోరఁదగిన పరమార్థము. దానిని బొందుటకు పాపపరిజ్ఞాన

మును యథేచ్ఛానువర్తన స్వాతంత్ర్యమును పరమసాధనము లుం
మనయెడలఁగల నిర్హేతుకజాయమూన కరుణాపశేషముచేతనే యీశ్వ
రుఁడు మనకట్టి యమూల్యమోఘసాధనముల దయచేసియున్నాఁడుం
ఆయమోఘసాధనములను యుక్తరీతిని మన ముపయోగించుకొను
చుండుమేని కాలక్రమమున పురోవృద్ధినొందుచు తుదను పరమార్థమును
సాధించి యానందింతుము. అటుపంటి నిత్యానందపదవిని బొందుటకు
విశేషకాలము కావలసియుండును. ప్రతిపదార్థమును సూక్ష్మస్థితి
నుండి యంతకంతకు వృద్ధినొంది కడపట పూర్ణదశను గాంచునటె
నుట యీశ్వరసంకల్పము. అత్యల్పబీజమునుండి యంకురించి కాల
క్రమమున పెరిగి మహావృక్ష మయి మఱి చెట్టు వేలకొలఁది పక్షులకు
పండ్లను, నూఱులకొలఁది మనుష్యులకు ఛాయను నియ్య సమర్థ మగు
చున్నది. మొట్టమొదట నొక చిన్నయేటనుండి యుదయించి యల్ప
జలముతో కాలువపాఱి యేఱు కాలక్రమమున వృద్ధినొంది దేశదేశ
ములవెంటఁ బ్రవహించి మహానదియై సస్యములపంటకును జంతువుల
స్నానపానములకును మహోపయుక్త మగుచున్నది. ఈప్రకారము
గానే మోక్షసామ్రాజ్యము నొందుటకును చిరకాలము పట్టును.
ఒక్కకాలదీర్ఘత మాత్రమేకాక దానిని సాధించుటకు బహుకష్టము
లును పడవలసియుండును. ఏవిషయములోను కష్టములేక ఫలము
కలుగదు. ఎక్కువఫలము నపేక్షించువా రెక్కువకష్టములను పడ
వలెను. కష్టములేక కలుగుఫలము సుఖదాయకము కాదు. నిత్యా
నందపదవి మనుష్యునకు పరమార్థమయినందున దానిని సాధించి
సుఖించుటకయి మనుష్యుఁడన్నిశ్రమల నయినను పడవలెను. ఎన్ని
శ్రమలకైనను సహించి పరమార్థము సాధించు బుద్ధిని శక్తిని సాధన
ములను ప్రసాదించిన వరమేశ్వరుఁడు పరమకృపాళుఁడు. లోకములో

పాపముండుటవలన నీశ్వరుని కరుణాళుత్వమున కెంతమాత్రమును
లొఁతగలుగదు. ఈశ్వరానుగ్రహమువలన నెల్లవారును నిత్యానంద
పదవిని పొందుటకయి నిరంతరకృషిని చేయుదురుగాక!

స్త్రీ విద్యం

ప్రహసనము.

[సుందరి, దమయంతి, సరస్వతి, అను బాలికలు ప్రవేశించుచున్నారు.]

దమ—సుందరీ! నీ విప్పుడు అలా విచారంగా వున్నావేమి? కళ్ళన్నీ వాచిపోయినవి. యేడిచినావా యేమిటి?

సుంద—సఖీ! దమయంతీ! యేమనిచెప్పను? రేపటినుంచి బడికి పోవద్దని మాఅమ్మ నన్ను నిర్బంధపెడుతూ వున్నది. అందుచేత యేడ్చినాను.

దమ—చదువు మాన్పించవద్దని పెద్దాయన మీ తాతగారయినా కూతురిని కాస్త కూకలువేసినారు కారటే?

సుంద—తాతగా రెవరే? నాకు తాతగారు లేనేలేరు.

దమ—మొన్న నేను మీకోసం మీయింటికి వచ్చినప్పుడు మంచం మీద కూర్చున్నాయన మీతాతగారుకారటే? ఆయన మీ అమ్మతాతగారా యేమి?

సుంద—కాదే.

దమ—యెవరూ కాకపోతే నీకాయన యేమవుతారే?

సుంద—(చిరాకుతో) యేమవుతారో నన్నడుగకు.

దమ—నిష్కారణంగా నామీద చిరాకుపడుతావేమే! —వరస్పతీ! నే నేమి తప్పుమాట అన్నాను! మీయింట్లో వున్నముస లాయన యెవరంటే, సుందరి ఆలా చిరాకువడతుందేమే!

సర—ఆహాహాహా! నెల్లాళ్ళబట్టి సుందరితో స్నేహం చేస్తూ వున్నావు నీ కాసంగతి తెలియదా! ఆయన సుందరికి భర్తగా రవు తాడే. ఆయనపోరు మూలంగానే తల్లిసుందరిని చదువు చాలించుకో మంటూవున్నది.

దమ—ఆహాహా! సుందరీ! యేమి సీవుణ్యం! ఇంత చిన్నతనం లోనే నీకు పెద్దలసేవచేసి తరించేభాగ్యం లభించింది! నీ యీడుకూ జోడుకూ తగినభర్తను వరించినావు. నీప్రాణవల్లభుడే చదువువద్దని నిన్ను ప్రాణాలు తీస్తూవున్నాడా!

సర—పావం! దాన్ని ఆక్షేపించ బోకే. అది యేమి చేస్తుంది! నీతండ్రిగారివలె దానితండ్రి దాన్ని అడిగి మరీ పెళ్ళిచేసినా డను కొన్నావా యేమిటి! ఋణాలు తీర్చుకోవడానికి వెయ్యిరూపాయిలు పుచ్చుకొని దానితండ్రి సుందరిని సహస్రమాసజీవి కిచ్చి కన్యాదానం చేసినాడు. సుందరి బహుసుంచిది. చదువుకున్నది కావడంచేత విన యమూ విధేయతా కలదయి యింకా పెద్దమనిషి కాకపోయినా పెద్ద దానివలెనే యింటికాడ పెనిమిటికి సమస్తోపచారాలూ చేసి మరీ బడికి వస్తుంది.

దమ—అవును. సుందరి అందరివంటిదీ కాదు. బహు బుద్ధి మంతురాలు. తనవుపచారానికి లోపం లేకుండావున్నప్పుడు పిల్లది చదువుకుంటూ వుంటే ముసలాయనసొమ్మేమి పోయిందిలే!

సర—సుందరిచదువు మాన్పించవద్దని మొన్న మాఅమ్మ పెళ్ళి దానితల్లితో చాలాదూరం చెప్పింది. తల్లి వట్టిమూర్ఖురాలు;

యెంతచెప్పినా వినకుండా వున్నది. "ఆడది చదివి చెడె మగవాడు చదవక చెడె" నని సామెతలు తెచ్చి, ఆడదానికి చదు వెందు కంటుంది! మాచిన్నతనంలో మేము యేమిచదువు చదివి మగడితో కాపురంచేసి బిడ్డలను కన్నామంటుంది. మరీమరీచెప్పి తే అల్లుడుగారికి యిష్టం లేనప్పుడు పిల్లను నేనెట్లాబడికి పంపుతా నంటుంది!

దమ—ముసలాయనతోకూడా చెప్పి చూడలేకపోయిందా!

నర— ఆపనీ జరిగింది. ఆడది చదువుకుంటే మగవాడిమాట వినదట! చదువు నేర్చిన ఆడుదానితోనూ వంటనేర్చిన మగవాడితోనూ యెవ్వరూ నోప లేరట! నో రెరుగని చిన్నతనంలో పెళ్ళిచెయ్యబట్టి కాని యిప్పు డయినట్టయి తే చదువుకొన్నందుకు తండ్రిమాట వినక పొయ్యేదే నట! ఆయనవూహలు యేమని చెప్పను!

దమ—భర్తకూ తల్లికీకూడా యిష్టంలేకపో తే మన సుందరి యింతకాలంనుంచి యేలా చదువుకుంటూ యున్నది!

సర—పెనిమిటి వుస్తెముడివేసి వునాసతారా వెళ్ళి నెల్లాళ్ళ క్రిందటనే తిరిగివచ్చినాడు. కాలేజిలో చదువుకుంటూవున్న అన్న గారి ప్రోద్బలంచేత సుందరియింతవఱకు చదువుకున్నది. చెల్లెలు చదువుమానడం అతనికి యిప్పుడూ యిష్టంలేదు. బావమరిదితో చెప్పించడానికి నిన్న మాతండ్రిగారినికూడా మనయింటికి తీసుకొని వెళ్ళినాడు. అప్పుడు వారి యిద్దరికీ పెద్దసంవాదం జరిగింది. పళ్ళాడి పోవడంచేతగాని లేకపో తే నమిలి మింగివేయువలె నన్నంతకోపము మాతండ్రిగారిమీద ముసలాయన కప్పుడు వచ్చింది. మాతండ్రి గారితోకూడా వెళ్ళడంచేత నేనాసంవాదమంతా విన్నాను.

దమ—ఆయన స్త్రీలకు విద్యకూడ దనడానికి యేమియుక్తులు చెప్పినారు!

సర—వీమి క్రొత్తయుక్తు లున్నవి? అన్నీ మాతాతలనాటి పెడయుక్తులే, చదువుకుంటే పూర్తిగా స్త్రీస్వభావమే మాటిపోతుం దట!

దమ—దానికి మీతండ్రిగారు రేమి బదులు చెప్పినారు?

సర—మాతండ్రిగారు ఏకపక్ష నవ్వి "నాభార్య బాగా చదువు కున్నది, దానికి ముప్పయియేండ్లు వున్నవి. యిన్నేళ్ళుపచ్చినప్పటికి దానికి మీరన్న స్త్రీస్వభావం చెడి మొగంమీద వక్కమీాసమైనా మొలవలేదు. యిక ముందయినా గడ్డాలూ మీసాలూ వచ్చేజాడలు యేమీ కనపడడం లేదు. దానివద్ద వున్ననమ్రతా పరోపకారబుద్ధీ గర్వరాహిత్యమూ మొదలైనసుగుణాలు చదు వెరుగని మూఢురాళ్ళ వద్ద నాకెక్కడనూ కనపడడం లేదు. అది యెప్పుడూ నామాటకు వ్యతిరిక్తంగా నడవదు; పిల్లలను చక్క బెట్టుకుంటూ వాళ్ళవిద్యా బుద్ధులు తానే చూస్తుంది; గృహకృత్యములన్నీ తీరుస్తుంది; జిహ్వా కింపుగా పాకంచేసి వేళ తప్పకుండా భోజనా లమరుస్తుంది; దాసదాసీ జనుల జీతబత్తెములూ యింటివెచ్చాలూ తానే విచారించి నాకు భారం లేకుండా చేస్తుంది; అందుచేత మాయిల్లు భూతల స్వర్గంలాగు సర్వసుఖప్రదంగా ఉంటుంది. నాభార్య చదువుకోవడంచేత బాగుపడ్డ దేకాని యెంతమాత్రమూ చెడిపోలేదే!" అని చెప్పినారు.

దమ— నిజం చెప్పినారు. అంతటితో ముసలాయన బుద్ధి తెచ్చుకొని వూరుకున్నాడా? యింకా యేమైనా సోది మొదలు పెట్టినాడా?

సర—ఎందుకు వూరుకుంటాము? వూరుకుంటే యిక మూర్ఖ త్వం యేమిటి? లోకంలో యేరోగానికైనా మందున్నది కాని మూర్ఖత్వరోగానికి మందు లేదు. చదువుకుంటే స్త్రీలకు స్వాతంత్ర్యం

దస్తుందనీ, స్త్రీలకు స్వాతంత్ర్యం కూడదని శాస్త్రాలు చెపుతూవున్న వనీ, స్త్రీలకు స్వాతంత్ర్యం యిస్తే వారు పురుషులనుకూడా చెడ గొడతారనీ, చదువుకున్న దన్నమాటేగాని మాతల్లివద్ద ఆచారవ్యవ హారాలే లేవనీ, మడీమయిలా లేదనీ, తినకు వచ్చిన వెట్టి మొట్టిచదు పంతా యేమేమో చదివినాడు.

దమ—ఆయనగా రారునెలల నుంచి తడవకుండా చేతులు తుడుచుకొన్న నేతిడిష్టుతో కుళ్ళుకంపు కొడుతూవుండే ధావళీగుడ్డ మాత్రమే మడి దనీ, తెల్లగా పువ్వులాగు చాకలిది వుతికి తెచ్చిన దోవతీ మయిల దనీ, అనుకున్నాడు కాబోలును! ఆయన చెప్పిన ఆచారవ్యవహారాలు యిది తగిలిం దనీ అది తగిలిం దనీ రోజుకు ముప్పయిసార్లు మురికినీళ్ళలో మునిగి తడిబట్టలతో వుండి రోగాలు తెచ్చుకోవడమూ, అవుపంచితాలు తాగడమూ, పేడముద్దలు మింగ డమూ, కాబోలును! మీతండ్రిగా రేమన్నారు?

సర—మాతండ్రిగా రిట్లన్నారు—"తాతగారూ! కోపపడక వినండి – పురుషులు తామేమో స్వతంత్రులమని తెలియక మాటలలో విజృంభించడమేకాని నిజానికి పురుషు డెప్పుడూ క్రియలలో స్త్రీలకు దాస ప్రాయుడే. స్త్రీ చదువుకొన్నదై మంచి దైన పక్షమున చెడ్డవా డయినా పురుషుడు సహవాసపుణ్యంచేత తానుకూడా బాగుపడుతాడు; స్త్రీ మూఢురాలై చెడ్డ దైన పక్షమున మంచివా డయినా పురుషుడు సహవాసదోషంచేత తానుకూడా చెడిపోతాడు. పురుషులను మనసు వచ్చిన ట్లూడించేశక్తి స్త్రీలచేతిలో వున్నది. పురుషు లెప్పుడూ స్త్రీలు చేసిన ట్లవుతారు. విద్యావంతులైనను విద్యావిహీన లైన స్త్రీలతో సహవాసము చేసేవారు తత్తుల్యులయి మూఢాచారపరా యణు లవుతారు; విద్యాగంధము లేనివా రయినను విద్యావంతు లైన

స్త్రీలతో సహవాసము చేసేవారు తత్తుల్యులయి సదాచారపరాయణులవుతారు. ఏదేశ మెప్పుడు బాగుపడినా స్త్రీలమూలముననే బాగుపడవలెను. దేశమునందలి స్త్రీలస్థితినిబట్టియే దేశముయొక్కస్థితి బోధపడుతుండి. కాబట్టి మన మెల్లప్పుడును విద్యామహిమచేత స్త్రీలను న్నతస్థితికి తెచ్చి తన్మూలమున మన మున్నతస్థితిని పొంద పాటుపడవలెను. స్త్రీకి విద్యచెప్పి బాగుపఱిచి పురుషుఁడు స్త్రీతో తాను గూడ నూర్ధ్వగతిక్రైనను బోవలెను; లేదా స్త్రీకి విద్యమానిపి మూఢురాలినిజేసి దానితో తానుగూడ నధోగతిక్రైనను బోవలెను. అంతేకాని స్త్రీని మూఢత్వసముద్రములో ముంచి తాను పయికితేలి సుఖించెడు మధ్యమార్గ మెప్పుడును నుండదు. కాబట్టి నాప్రార్థన చిత్తగించి మీరు మరికొంతకాలము మీభార్యను చదువుకోనియ్యుండి.

శ్లో॥ పితా రక్షతి కౌమారే భర్తారక్షతి యౌవనే
రక్షంతి స్థావిరే వుత్రాః న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి.

అన్న మనువచనము నేను విననిది కాదు. తండ్రి భర్త వుత్రులూ స్త్రీలను రక్షించేవారే కాని లోకానుభవమునుబట్టి చూడగా సాధారణముగా శాసించేవారుమాత్రము కారు. నిజముగా పురుషులను శాసించి నడుపువా రెప్పుడును స్త్రీలే.

శ్లో॥ మాతా శాసతి కౌమారే భార్యా శాసతి యౌవనే
స్నుషా శాసతి వార్ధక్యే పుంసోనా స్తి స్వతంత్రతా.

అని శ్లోకం వున్నయెడల, సత్యాని కది యెక్కువచేరువగా వుంటుంది. ఈకడపటి శ్లోకార్థం వినండి—

గీ. మాత శాసించుచుండుఁ గౌమారమందు
భార్య శాసించుచుండు యౌవనమునందు

వచ్చి కోడలు శాసించు వార్థకమున
పురుషునకు లేదు స్వాతంత్ర్యగరిమ యెప్పుడు."

అని చెపుతూవుండగానే "హరిహరీ" అని చెవులు మూసుకొని తాతగారు చివాలున లేచిపోయినారు. బ్రహ్మ దిగివచ్చినా మూర్ఖులకు బోధించడం శక్యము కాదని నిరాశ చేసికొని మానాన్నగారూ నేనూ యింటికి వచ్చినాము.

దమ—చదువుమాట పోనీకాని తాతగా రేమైన డబ్బు గలవారేనా ?

సర—వున్నదికాస్తా పెళ్ళితో పోయింది. 'బ్రాహ్మణస్యధనం భిక్ష' మన్నట్లు యిప్పు డాయనకు "సీతారామాభ్యాంనమః" తప్ప వేరే ఆధారం లేదు.

దమ—ఆలాగైతే భార్యఅయినా చదువుకొని పదిరూపాయలు తెచ్చి మొగుణ్ణి పోషిస్తుందే. సుందరియిప్పు డారోక్లాసులో చదువు కుంటూవున్నది. చదువుచూనిపిస్తారంటే వలవల యేడుస్తూవున్నది. ఇంకొక్క యేడాదిపాటు చదువుకోనిస్తే పరీక్ష ప్యాసవుతుంది.

నర—తాతగారికి మొదల భార్యచదువుకోవడమే అవమాన మట! అవతల వుద్యోగంచెయ్యడం అంతకంటేనూ తలవంపులట! వక్కముష్టియెత్తుకోవడమే మహాగౌరవమట! ఇంతటి బుద్ధిమంతులతో చెప్పవలసిన దేమున్నది! — సుందరీ! విచారించబోకు. నీ చదువుకు భంగం రాకుండా దేవుడు రక్షిస్తాడు. ఇంటికి పోదామురా.

(అందఱు నిష్క్రమించు చున్నారు.)

అద్వైతమత సంగ్రహము.

....o0o....

అద్వైత మనఁగా రెండవది లేదనుట; బ్రహ్మముతప్ప వేఱు పదార్థము లేదని యీమతసిద్ధాంతము. ఈమతస్థాపకుఁడు శంకరాచార్యుఁడు. ఆర్యావర్తములో లోకగురుఁడని ప్రసిద్ధిగన్న యీమహానుభావుని వంశజన్మ కాలాదులను గూర్చి యింకను నిశ్చయముగాఁ దెలియదు. ఇతఁడు కేరళ (మళయాళ) దేశములోని కాలాది యనునగ్రహారములో జననమొందినట్లు పలువురు వ్రాయుచున్నారు. చిదంబరములో పుట్టిన ట్లానందగిరి తన శంకరవిజయములోఁ జెప్పియున్నాఁడు. గాని యీమాట విశ్వాసార్హ మయినదిగాఁ గనఁబడదు. ఆదిశంకరులవారు మళయాళదేశములోని నంబుదిరి బ్రాహ్మణసంతతివారగుటకు సందేహము లేదు. ఈయనతండ్రిపేరు శివగురువు; తల్లిపేరు విశిష్ట. ఇతఁడు శివునియొక్క వరప్రసాదము వలన జననమొందినట్లు శంకరవిజయములలోఁ జెప్పఁబడి యున్నది; మధ్వవిజయమును మణిమంజరిని రచియించిన నారాయణాచార్యుఁడు తనమణిమంజరిలో శంకరుఁడు వితంతు వయినతల్లికి వ్యభిచారదోషము వలన సంభవ మయ్యెనని యు కులమువా రామెను జాతిబహిష్కృతునుగాఁ జేసి రనియు వ్రాయుచున్నాఁడు. ఇది మతవైషమ్యము చేతఁ గల్పింపఁబడిన కథ యైనను గావచ్చును. అయినను తనయాడు చేడియలతోఁ గూడి యొక బాలవితంతువు శివాలయమునకుఁబోయి వారు తమకు కొడుకుల నిమ్మని మ్రొక్కుకొనుచుండఁగాఁ దానును నట్లుచేసె ననియు, ఈశ్వరుఁడు భక్తిపూర్వక మయిన యాప్రార్థన సంగీకరించి పుత్రదానము చేసె ననియు, మళయాళ దేశములో నిప్పటికిని వాడుకగా నున్నది. వ్యాసాదుల జన్మములవలెనే మహాను

భావుల జన్మము లనేకములు దేవరహస్యము లయి యున్నవి. శంక రులవారు క్రీస్తుశకము 788-వ సంవత్సరమునందు జననమొందిన ట్లిప్పు డించుమించుగా నిశ్చయింపఁబడినది. ఈతని కేడవయేట నువనయ నము చేయ యత్నించుచుండఁగా తఁడ్రి లోకాంతరగతుఁ డయ్యె నఁట. తల్లియే యుపనయనాదిసంస్కారములను జేయించి కొడుకు నకు వేదవేదాంగములను జెప్పించెను. ఈయనకు వివాహము కాలేదు. ఈతఁడు చిన్నప్పటినుండియు వైరాగ్యము కలవాఁడయి సన్యాసి కాఁగోరెనుగాని తల్లి యనుమతింపకుండెను. ఒకనాఁడు తల్లియు తన యుఁడును నదికి స్నానము చేయఁబోయినప్పు డతనిని మొసలి పట్టు కొనె ననియు, ప్రాణాపాయసమయమునం దాతఁ డాతురసన్యాసాశ్రమ స్వీకారమునకుఁ దల్లిని వేడుకొనఁగా నామె యనుజ్ఞయిచ్చెననియు, అంతట మొసలి యతనిని విడిచిపెట్టె ననియు, తరువాత విద్యారణ్య లని ప్రసిద్ధిగన్న మాధవాచార్యులవారు తమశంకరవిజయములో వ్రాసియున్నారు. శంకరాచార్యులవారు నర్మదాతీరమునందలి యొక యాశ్రమములో నుండిన గోవింద భగవత్పాదుల వారివద్ద యత్యా శ్రమమును స్వీకరించి, యాయనవలననే వేదాంతశాస్త్రమును తది తరశాస్త్రములను గ్రహించెను.

అతఁడు గురుని యాజ్ఞానుసారముగా కాశీపురమునకుఁ బోయి యచ్చట సమస్త విద్యాప్రవీణుఁ డయి ప్రసిద్ధినొందె, యనేక శిష్య బృందమును జేర్చెను. వారిలో ప్రథానుఁడు చోళదేశమునుండి వచ్చి చేరిన పద్మపాదుఁడు. ఈయన కాశీనగరమునం దుండిన కాలము లోనే యించుమించుగాఁ దనగ్రంథముల నన్నిటిని రచియించెను. శత కములు, అష్టకములు, ద్వాదశ మంజరులు మొదలయినవానిని విడిచి పెట్టిడు పక్షమున నీతఁడు రచియించినవానిలో ముఖ్యగ్రంథములు:

వేదాంతసూత్రభాష్యము, దశోపనిషద్భాష్యము, భగవద్గీతా భాష్యము—ఈతఁడు కాశికాపురిలో నున్నకాలములో నొకసారి బదరికాశ్రమమునకుఁ బోయివచ్చెను. శంకరాచార్యులు కాశిలోఁ గొంతకాల ముద్వైతమతబోధ చేసినతరువాత ప్రయాగమునకుఁ బోయెను. అక్కడ నున్నకాలములో నతఁడు మండన మిశ్రుని ప్రఖ్యాతిని విని యతనిని జయింపవలె ననున్న యుద్దేశముతో నాతని వాసస్థానమైన (మగధదేశములోని) మాహిష్మతీ పురమునకుఁ బోయి, తానోడిపోయెడుపక్షమున సన్యాసాశ్రమునువిడిచి గృహస్థాశ్రమమును గ్రహించి మండనమిశ్రునకు శిష్యుఁడగునట్లును, మండనమిశ్రుఁడోడిపోయెడువక్షమున గృహస్థాశ్రమమును విడిచి సన్యాసాశ్రమమును స్వీకరించి తనకు శిష్యుఁడగునట్లును పందెము వేసికొని బహుదినము లాతనితో వాదించి యాతని నోడించెనఁట! అంత నతనిభార్యయైన భారతి తాను మండనమిశ్రుని యర్ధాంగి యగుటచేఁ దన్నుఁ గూడ గెలిచినఁగాని పూర్ణజయము కాదనిపలికి శంకరునితో వాదించి కడపట నపజయము నొందెనఁట! అప్పుడు మండనమిశ్రుఁడు సురేశ్వరాచార్యుఁడనుపేరితో శంకరునకు శిష్యుఁడయ్యెను.

శంకరుఁ డక్కడనుండి మహారాష్ట్రదేశముగుండ దక్షిణదేశయాత్రకు బైలువెడలెను. మహారాష్ట్రదేశములో కాపాలిక మతస్థులాతనిఁ జంపఁ బ్రయత్నించిరిగాని యీశ్వరానుగ్రహము వలన నతఁడు తప్పించుకొనెను. శంకరుఁడు ప్రాణాయామమునుబట్టి యొంటిగా సమాధినిష్ఠుఁడయి యున్నప్పు డొక కాపాలికుఁడు చేత ఖడ్గమును బూని యాతనిని భైరవునికి బలిపెట్టవలెనని సమీపింపఁగాఁ బద్మపాదుఁడు చూచి పరుగెత్తి వానిచేతిఖడ్గము నూడఁబెరికికి దానితో వానితలను నఱికి గురువును రక్షించెనఁట! అతఁ డక్కడనుండి

తుంగభద్రాతీరమునకుఁ బోయి, యొకదేవాలయమును గట్టించి యందు భారతిని ప్రతిష్ఠించి, యందొకమఠమును గట్టించి యాశృంగగిరిమఠములో సురేశ్వరాచార్య లని పేరొందిన మండనమిశ్రుని నిలిపెను. మహారాష్ట్రదేశయాత్రలో హస్తామలకుఁ డనఁబడెడి యానంద గిరి శంకరాచార్యులకు శిష్యుఁ డయ్యెను.

శంకరాచార్యుఁడు తనశిష్యులనెల్ల శృంగగిరియందు వదలి మాతృదర్శనార్థమయి స్వగ్రామమునకుఁ బోయెను. అతఁ డక్కడ నున్న సమయమునం దామె మరణ మొందుట తటస్థించెను. అప్పు డాయగ్రహారములో నున్న నంబూరిబ్రాహ్మణులు శవదహనాదికార్య ములం దతనికి తోడుపడకపోవుటయే కాక స్మశానవాటికయందు దహనసంస్కారముకూడ చేయనీయకపోయిరి. అంతమాత్రముచేత శంకరుఁడు నిరుత్సాహి గాక, స్థూలకాయ యయిన తల్లి శవమును ముక్కలుగాఁ గోసి తనయింటి దొడ్డిలోనికిఁ గొనిపోయి యచ్చటనే యొ మూల దహనము చేసెను. మహానుభావులసహితము తమ జీవిత కాలములో స్వదేశమున గౌరవింపఁబడకపోవులకు దీని నొకదృష్టాంత ముగాఁ జెప్పవచ్చును.

అతఁ డక్కడనుండి మరల శృంగగిరి కరిగి శిష్యవర్గమును వెంటఁ గొని పాదచారి యయి స్వమతసిద్ధాంతముల నెల్లయెడల బోధించుచు పూర్వసముద్రతీరప్రాంతము పొడుగునను యాత్రచేసెను. ఆకాలమునందు పాండ్య, చోళమండలములయందు వ్యాపించి యుండిన శాక్తేయులు గాణపతులు కాపాలికులు మొదలయినవారిమతములలో, గల క్రూరాచారములను వేదబాహ్యములని ఖండించుచు దుర్నీతిని తొలగింపఁ బాటుపడుచు మధుర మీనాక్షియొక్కయు కంచి కామాక్షియొక్కయు దేవాలయములలో నడచెడు దుష్టవామాచార

ములను మాన్పి జగన్నాథమని సాధారణముగా జెప్పఁబడెడు పురు
షోత్తమపట్టణమువఱకును బోయి యచ్చట గోవర్ధనమఠమును
స్థాపించెను. తరువాత నతఁడు మరల నుత్తరహిందూస్థానమునకు
బైలుదేఱి కాశికాపురద్వారమున నుజ్జయినికిఁ బోయి, యచ్చట
నుండి ఘూర్జరదేశములోని ద్వారకకరిగి యచట శారదామఠమును
స్థాపించి మరల నుత్తరమునకుఁ దిరిగి కాశ్మీరమువఱకును పోయి
యచట బదరికాశ్రమమునందు బదరీనారాయణాలయమును గట్టించి
వ్యాసమఠమును స్థాపించి, అస్సాములోని కామరూప (గౌహతి)
మున శాక్తేయమతాచార్యుఁడైన యభినవగుప్తునితో వాదముచేసి
యాతనినోడించి, యచ్చోటువిడిచి కేదారమునుజేరి కేదారనాథుని
సేవించి యచటనే యతఁడు 888-వ సంవత్సరమునందు సిద్ధినొందెను.
కైవల్యము పొందునప్పటికి ముప్పదిరెండు సంవత్సరముల ప్రాయమునే
పలువురు చెప్పియున్నను ముప్పదియెనిమిదేండ్లని యొకరు వ్రాసి
యున్నారు. ఆయన సిద్ధిఁబొందిన సంవత్సర మిదియే యైనఁబట్టి మన
నలువది సంవత్సరములు జీవించి యుండవలెను. ఆయన క్రీస్తుశకము
798వ సంవత్సరమునఁ బుట్టి 830వ సంవత్సరమునందు శివసాయు
జ్యము నొందెనని యి రొకరు వ్రాయుచున్నారు. తనకు సంభవించిన
పరాభవమును సహింపఁజాలక పగతీర్చుకొనుటకయి యభినవగుప్తుఁడు
శంకరాచార్యులపై క్షుద్రదేవతాప్రయోగము చేసెననియు, అందు
చేత శంకరుని శరీరమునిండ పొక్కులులేచినను దానినెఱిఁగి పద్మ
పాదుఁ డాప్రయోగమును మరలించి ప్రతిక్రియ చేసినందున స్వస్థత
కలిగెననియు, అటుతరువాత నతఁడు శీఘ్రకాలములోనే సిద్ధినొందె
ననియు, వ్రాసి యున్నారు.

అద్వైతులు బ్రహ్మము, అవిద్య యను రెండుపదార్థములు కలవన్నను, తన్మతమున బ్రహ్మ మొక్కటియే సత్యపదార్థము. అద్వైతమును స్మార్తమత మనియు వాడుదురు. బ్రహ్మము సత్యజ్ఞానానందాత్మకము, నిర్వికారము, నిరవయవము, నిర్దోషము, విభువు. సత్యమనఁగా కాలత్రయముచే బాధింపఁబడఁ దగినదిగాక నిత్యమైనది; జ్ఞానాత్మక మనఁగా నెఱుక (జ్ఞానము) తో నిండినది; ఆనందాత్మక మనఁగా సంతోషస్వరూప మయినది; నిర్వికార మనఁగా మార్పులు చెందినది; నిరవయవ మనఁగా భాగములు లేక యఖండ మయినది; నిర్దోష మనఁగా లోపములు లేక పరిశుద్ధమయినది; విభు వనఁగా సర్వత్ర వ్యాపించి యుండునది.

అవిద్య అపారమార్థికము. సదసద్వ్యలక్షణము, జడము, సవికారము, సావయవము, అనాది, సాంతము. అపారమార్థిక మనఁగా మిథ్యాభూత మయినది, సదసద్వ్యలక్షణ మనఁగా సత్తయిన బ్రహ్మము కంటెను, అసత్తయినగగనకుసుమాదికము కంటెను, వేఱయినది; జడ మనఁగా జ్ఞానశూన్యమయినది; సవికార మనఁగా రూపాంతరములు చెందునది; సావయవ మనఁగా అవయవసహిత మయినది; అనాదియనఁగా మొదలులేనిది; సాంత మనఁగా (బ్రహ్మజ్ఞానము కలిగినతోడనే) నశించునది. అద్వైతమతమునందు సత్యము పారమార్థిక మనియు, వ్యావహారిక మనియు, ప్రాతిభాసిక మనియు, త్రివిధము. త్రికాల బాధితముగాక యెప్పుడు నుండునది పారమార్థికము; వ్యవహారమునందు మాత్ర ముండి బ్రహ్మజ్ఞానముచేత నివర్తించునది వ్యావహారికము; ప్రాటిని పామనుకొనునట్లు భ్రాంతి నివారణ మగు పఱకును మాత్రము సత్యముగా తోఁచునది ప్రాతిభాసికము. అవిద్య పరిమార్థమునందుఁ గాక వ్యవహారమునందు మాత్రమే సత్యమైనది.

ఈ యవిద్య సత్త్వరజస్తమోరూపగుణత్రయాత్మక మయినది. మాయ యనఁబడెడి యీ యవిద్యకు ఆచ్ఛాదకశక్తి, విక్షేపకశక్తి, అని రెండు శక్తులు గలవు. చీఁకటిచే నావరింపఁబడిన మనుష్యున కెట్లు స్వరూపజ్ఞానము చెడునో యట్లే యవిద్యయొక్క యాచ్ఛాదకశక్తిచే నావరింపఁబడిన బ్రహ్మమునకు స్వస్వరూపజ్ఞానము చెడును; అప్పుడు దాని విక్షేపకశక్తి చేత బ్రహ్మమునకు దేవమనుష్యతిర్యగ్జడాది భేదజ్ఞానములు గలుగును. ఈభేదభావములన్నియు బ్రహ్మమున కవిద్య వలనఁ గలుగునవికాని పారమార్థికములుకావు.

శుద్ధచైతన్యము, మాయావచ్ఛిన్నచైతన్యము, అంతఃకరణావచ్ఛిన్నచైతన్యము, వృత్త్యవచ్ఛిన్నచైతన్యము, విషయావచ్ఛిన్నచైతన్యము అనిబ్రహ్మరూపమయిన చైతన్యము పంచభేదములు కలదిగానున్నది. శుద్ధచైతన్యముబ్రహ్మము; మాయావచ్ఛిన్నచైతన్యము ఈశ్వరుఁడు; అంతఃకరణావచ్ఛిన్నచైతన్యము జీవుఁడు; వృత్త్యవచ్ఛిన్నచైతన్యము జ్ఞానము; విషయావచ్ఛిన్న చైతన్యము ఘటపటాదికము. బ్రహ్మమునకు కడపటి నాలుగుభేదములును అవిద్యాదు లయిన యుపాధులచేతఁ గలుగుచున్నవి.

మాయావచ్ఛిన్నచైతన్య మయినయీశ్వరుఁడే జగత్సృష్ట్యాదికర్తయు సర్వాంతర్యామియు నయిన సగుణబ్రహ్మము. ఇతఁడు ప్రాణిజాలముయొక్క తారతమ్యమునకుఁ గారణము లయినకర్మములు తనకు సహాయపడఁగా, అపరిమితశక్తియుక్త మయినమాయను వశపఱచుకొని, నామరూపాత్మక మయిన నమస్తప్రపంచమును సృజింపఁ దలఁచుకొని పంచీకృతములుకాని యాకాశాది పంచభూతములను మొట్టమొదటఁబుట్టించెను. వానిలో నాకాశమునకు శబ్దమును, వాయువునకు శబ్దస్పర్శములును, తేజస్సునకు శబ్దస్పర్శరూప

ములును, అప్పానకు శబ్దస్పర్శరూపరసములును, పృథివికి శబ్దస్పర్శ రూపరసగంధములును, గుణములు. పృథివ్యాపస్తేజో వాయు రాకాశము లనెడి యీపంచభూతములను గుణత్రయాత్మక మయిన యవిద్యయొక్క కార్యములగుటచేత నివియు గుణత్రయాత్మకములే.

సత్వగుణయుక్తము లయిన యీపంచభూతములచేత త్వక్చ క్షుర్ఘ్రోత్రజిహ్వాఘ్రాణము లనఁబడెడి జ్ఞానేంద్రియపంచకమును, మనోబుద్ధ్యహంకారచిత్తము లనెడి యంతఃకరణచతుష్టయమును, కలుగుచున్నవి. రజోగుణయుక్తము లయిన యీ పంచభూతముల చేతను వాక్పాణి పాదపాయూపస్థము లనఁబడెడు కర్మేంద్రియ పంచకమును, ప్రాణాపాన వ్యానోదాన సమానము లనఁబడెడు పంచప్రాణములును, కలుగుచున్నవి. ఈపంచభూతముల చేతను జ్ఞానేంద్రియ కర్మేంద్రియముల చేతను పంచప్రాణ మనో బుద్ధులచేతను లింగశరీర మనఁబడెడి సూక్ష్మశరీరము పుట్టి, పర లోకయాత్ర కనుకూల మయి మోక్షపర్యంతము నుండును. తమో గుణయుక్తము లయిన యీపంచభూతముల చేతను పంచీకృతభూత ములును, వానిచేత బ్రహ్మాండములును, చతుర్దశభువనములును, జరాయుజాండజస్వేదజోద్భిజ్జములును, కలుగుచున్నవి.

పంచీకరణ మనఁగా నాకాశాది పంచభూతములను ప్రత్యే కముగా రెండేసిసమభాగములుగా భాగించి, అం దొక్కొక్క యర్ధ భాగమును మరల వేఱు వేఱుగా నాలుగేసి సమాంశములుగా విభాగించి ఒక్కొక్కదాని యర్ధభాగముతో మిగిలినవానియొక్క యర్ధభాగ ములలోని యొక్కొక్క చతుర్థాంశము ననఁగా నష్టమాంశమును జేర్చుచు వచ్చినయెడల పంచీకృతభూతము లేర్పడును. ఆకాశము యొక్క యర్ధభాగముతో పృథివ్యాపస్తేజోవాయువులయొక్క

యొక్కొక్క యష్టమాంశమును జేర్చినచో పంచీకృతాకాశ మగును;
వాయువుయొక్క యర్ధభాగముతో పృథివ్యాపస్తేజో కాశముల
యొక్క యొక్కొక్కయష్టమాంశమును జేర్చినచో పంచీకృతవాయు
వగును; తేజస్సుయొక్క యర్ధభాగముతో పృథివ్యాపోవాయురా కా
శములయొక్క యొక్కొక్క యష్టమాంశమును జేర్చినచో పంచీ
కృతతేజ స్సగును; ఆపస్సుయొక్క యర్ధభాగముతో పృథివీతేజో
వాయురాకాశముల యొక్క యొక్కొక్క యష్టమాంశమును జేర్చి
నచో పంచీకృతాపస్సగును; పృథివియొక్క యర్ధభాగముతో ఆప
స్తేజో వాయురాకాశములయొక్క యొక్కొక్క యష్టమాంశమును
జేర్చినచో పంచీకృతపృథివి యగును. జరాయుజము లనఁగా జరా
యువు (మూవి) వలనఁబుట్టెడుమృగమనుష్యాదులు; అండజము లనఁగా
నండము (గ్రుడ్డు) వలనఁబుట్టెడు పక్షిసర్పాదులు; స్వేదజము లనఁగా
స్వేదము (చెమట) వలనఁబుట్టెడు మత్కుణ యూకాదులు;
ఉద్భిజ్జము లనఁగా భూమిని పెకల్చుకొని పుట్టెడు వృక్షలతాదులు.

ఆకాశతుఁడైన సూర్యుఁడు ఘటమఠాకాదులయందుఁ బ్రతి
బింబించునట్లుగానే తేజోమయ మయినబ్రహ్మ మవిద్యాపరిణామము
లయిన యంతఃకరణములయందుఁ బ్రతిఫలింప నేర్పడునదియే యంతఃకరణావచ్ఛిన్నచైతన్య మయిన జీవుఁడు. శుద్ధచైతన్య మయిన బ్రహ్మము బింబము; అంతఃకరణమునందు తోఁచుచుట్టి చైతన్యము లగుజీవులు ప్రతిబింబములు. సూర్యబింబమునకును జలఘటాదులయందు తోఁచు ప్రతిబింబములకును భేదము లేనట్లే, బ్రహ్మము నకును జీవునకును భేదము లేదు; అనఁగా బ్రహ్మచైతన్యమునకును ప్రతిబింబితజీవచైతన్యమునకును అంతఃకరణరూప మయిన యుపాధిభేదమే కాని స్వరూప భేదము లేదు. అంతఃకరణపరిణామరూపము లయిన వృత్తులయందు

ప్రతిఫలించు చైతన్య మయిన జ్ఞానము ప్రత్యక్షానుమానశబ్దాది భేదములచే నసేకవిధములయినదిగా నుండును. అద్వైతులు వేదప్రామాణ్యమునంగీకరించి, వేదవచనములు చేతమాత్రమే బ్రహ్మము నెఱుంగనగు ననిచెప్పుదురు; వారికి శ్రుతిస్మృతిపురాణేతిహాసములన్నియుం బ్రమాణములే యయినను, ప్రస్థానత్రయ మనఁబడెడి యుపనిషత్తులను బ్రహ్మసూత్రములును భగవద్గీతలును ముఖ్యప్రమాణములు.

ప్రపంచమునకు మూల ప్రకృతి ఘటమునకు మన్నువలె పరిణామ్యుపాదానకారణము; బ్రహ్మము సర్ప మను భ్రాంతికి రజ్జువువలె నివర్తోపాదానకారణము. పరిణామి యనఁగా నొకరూపము నుండి వేఱొకరూపమును బొందునది. ప్రపంచరూపము లయిన కార్యముల నాశనము ప్రళయ మనఁబడును. అది నిత్యప్రళయము, నైమిత్తిక ప్రళయము, ప్రాకృతప్రళయము, ఆత్యంతిక ప్రళయము, అని నాలుగు విధములు గలది. అందులో నిత్యప్రళయము సుషుప్తి (నిద్ర) నైమిత్తికప్రళయము చతుర్ముఖబ్రహ్మయొక్క దినప్రళయము; ప్రాకృత ప్రళయము చతుర్ముఖ బ్రహ్మతోడ సర్వజగన్నాశనము; ఆత్యంతిక ప్రళయము బ్రహ్మసాక్షాత్కారముచేత నవిద్యారూప కారణసహితముగా లోకనివృత్తి. బ్రహ్మసాక్షాత్కార మనఁగాఁ దనకును బ్రహ్మమునకును నైక్యప్రత్యక్షము. ఈయైక్య ప్రత్యక్షముచేత నానందమయమగుస్వరూపప్రాప్తి కలుగును. బ్రహ్మజ్ఞానమువలనఁ బొందఁదగినయది కలుగఁగాఁ గైవల్యప్రాప్తి యగును.

బ్రహ్మైక్య జ్ఞానమునకు నిత్యానిత్యవస్తువివేకము, విషయఫల వైరాగ్యము, శమాదిషట్కము, ముముక్షుత్వము, అనునాలుగును సాధనములు. ఈనాలుగును సాధనచతుష్టయ మనఁబడును. బాహ్యం తరదృశ్య మయినప్రపంచ మెల్ల ననిత్యమనియు, రూప నామ రహితమై

సర్వావిలక్షణమయి వెలుఁగుబ్రహ్మము నిత్యమునిదు, ఎఱుఁగుట నిత్యానిత్యవస్తువివేకము. ఈవివేకము శ్రవణ మనన నిదిధ్యాసనము లతోఁగూడిన వేదాంతవాక్యములచేతఁ గలుగు చున్నది. శ్రవణ మనఁగా నాచార్యునివలన న్యాయయుక్తము లయినయర్థములను వినుట; మనన మనఁగా విన్నయర్థములయందు విరోధశంకలు కలు గఁగా వానిని పోఁగొట్టుకొనెడు మానసికవిచారము; నిదిధ్యానన మనఁగా ననాదివాసనచేత విషయములయందు ప్రవర్తించి యుండు మనస్సును విషయములనుండి మరలించి యాత్మయందు నిశ్చలముగా నిలువుట. విషయఫలవైరాగ్య మనఁగా నిహలోక పరలోకసుఖముల యందపేక్ష లేకుండుట. శమము, దమము, ఉపరతి, తితిక్ష, సమా ధానము, శ్రద్ధ — ఈయాఱును శమాదిషట్కము. శమ మనఁగా నంతరింద్రియనిగ్రహము; దమ మనఁగా బహిరింద్రియనిగ్రహము; ఉపరతి యనఁగా చిత్తమును చలింపనీక నిలువుట; తితిక్ష యనఁగా ద్వంద్వము లేని వచ్చినను దననిష్ఠను వదలక ఖేదమోదములను సహించి యుండుట; సమాధాన మనఁగా మనస్సు నేకాగ్రముగా నొకచోటనే నిలువుట; శ్రద్ధ యనఁగా నాచార్యునియందును శాస్త్ర ములయందును విశ్వాస ముంచుట; ముముక్షుత్వ మనఁగా మోక్షము నం దిచ్ఛ.

పయివిధముగా నిర్గుణబ్రహ్మమును సాక్షాత్కరింపఁ జేఁకో లేనివారు సగుణబ్రహ్మోపాసనము చేయవలయును. అట్టివారికి సగుణ బ్రహ్మోపాసనముచేత మనస్సు స్వాధీనపడఁగానే నిర్గుణబ్రహ్మము తానే తోఁచును. సగుణబ్రహ్మోపాసకు లర్చిరాదిమార్గమున బ్రహ్మ లోకము నొంది, శ్రవణాదులచే బ్రహ్మసాక్షాత్కారమును బడసి, మోక్షము నొందుదురు. కర్మనిష్ఠులు ధూమాదిమార్గమున పితృలోక

మును జేరి, అక్కడ సుఖ మనుభవించి, పుణ్యపాపానురూపముగా మరల మనుష్యాదిజన్మముల నెత్తుదురు. పాపకర్మముల నొనరించు వారు రౌరవాదినరకముల కేగి బాధ లనుభవించి, తిర్యగ్జడజన్మము లెత్తి నశింతురు. నిర్గుణబ్రహ్మోపాసకులు ప్రారబ్ధకర్మములను మాత్ర మనుభవించి, మిగిలినపుణ్యకర్మలను మిత్రులయందును పాపకర్మలను శత్రులయందును బెట్టి కైవల్యమును బొంది నిరతిశయానందము ననుభవింతురు.

విశిష్టాద్వైతమతసంగ్రహము.

విశిష్టాద్వైతము మనదేశమునందు వ్యాపించి యున్నత్రిమత ములలో రెండవది. ఇదిశైవవిశిష్టాద్వైతము, వైష్ణవవిశిష్టాద్వైతము; అని ద్వివిధము. ఈయుభయమతావలంబులలో నొకరు శివుఁడు దేవుఁ డనియు, ఇంకొకరు విష్ణుఁడు దేవుఁ డనియు, నామభేదమును జెప్ప టయేకాని వీరిసిద్ధాంతములలో భేదము లేదు. బ్రహ్మసూత్రములకు నీలకంఠభాష్య మనుపేరఁ బరఁగు భాష్య మొనర్చిన శ్రీకంఠశివాచా ర్యుఁడు శైవవిశిష్టాద్వైతమతస్థాపకుఁడు. బ్రహ్మసూత్రములకు శ్రీభాష్య మనుపేరఁ బరఁగుభాష్య మొనర్చిన రామానుజాచార్యుఁడు వైష్ణవ విశిష్టాద్వైతమతస్థాపకుఁడు. ఇప్పుడిందు వైష్ణవవిశిష్టాద్వైతమున గూర్చి తెలువఁబడును. రామానుజాచార్యుఁడు చెన్నపట్టణమునక పడమట నఱువదిమైళ్ళదూరములోనున్న శ్రీపెరంబూదూ రనుగ్రామ మునందు యజుర్వేదియు స్మార్తుఁడు నైన కేశవసోమయాజికిని కాం మతీదేవికిని కలియుగాబ్దములు 4118 కి సరియైన క్రీస్తుశకము 1017 సంవత్సర పింగళనామ సంవత్సర చైత్రమాసమునందు జనన మొం

ఇతఁడు తన పదునేనవ సంవత్సరమునందు తండ్రి పోవువఱకును స్వగృ
మమునందే తండ్రివద్ద వేదవేదాంగములను చదువుకొని యనంతర
మున విద్యాభ్యాసమునిమిత్తము కాంచీనగరమునకుఁ బోయి యాదవ
ప్రకాశమిశ్రుఁ డను సన్యాసియొద్ద శాస్త్రములను జదువుకొనెను.
యాదవప్రకాశుఁ డద్వైతియే యయినను శంకరాచార్యమతముతో
నేకీభవింపక బ్రహ్మసూత్రములకు భాష్యాంతరమును జేసెను.
శ్రీరామానుజాచార్యుఁడు తనగురువుయొక్క యభిప్రాయముతో నేకీభ
వింపక యాతని విడిచిపెట్టి, శ్రీరంగములో యామునాచార్యుఁ డను
యతి విశిష్టాద్వైతమును బోధించుచున్నాఁడని విని యాతనియొద్దఁ
జదువుకొనుట కయి వెళ్ళెనుగాని యతఁడు శ్రీరంగమును జేరులోపలనే
యామునాచార్యుఁడు పరమపదమును బొందినందునఁ దచ్ఛిష్యులలో
సమర్థశముఁ డైన మహాపూర్ణాచార్యుని (పెరియనంబి) యొద్ద మధు
రాంతకములో వైష్ణవము పుచ్చుకొనెను. అంతట గురువును శిష్యుఁ
డును గలిసి కంచికిఁ బోయిరి. కాంచీనగరము నందు శ్రీరామానుజా
చార్యుఁడు తనగురువువద్ద విశిష్టాద్వైతసిద్ధాంతములను నేర్చుకొనెను.
రామానుజాచార్యుఁడు గృహస్థాశ్రమమును స్వీకరించినవాఁడే యయి
నను తన పదునెనిమిదవయేట భార్యను సంసారమును విడిచి కాంచీ
నగరమునందు త్రిదండిసన్యాసి యయ్యెను. శ్రీరామానుజుఁడు శేషుని
యవతార మనియు, నూటయిరువది సంవత్సరములుజీవించి కలియుగా
బ్దములు 4238 కి సరియైన 1137వ హేవిళంబినామసంవత్సరమునందు శ్రీరంగములో
మృతినొందె ననియుఁ జెప్పుచున్నారు. సన్యాసి యైనతర్వాత రామా
నుజుఁడు స్వమతమును శిష్యులకు బోధించుచుఁ గొంతకాలము కాంచీ
నగరములో నుండి యక్కడినుండి తిరుపతికిఁ బోయి వేంకటేశ్వరుని
దేవాలయములో వేదాంతప్రసంగము లనేకములు చేసి, తరువాత

దక్షిణహిందూస్థానమునందుఁ గల వైష్ణవదివ్యక్షేత్రముల నెల్ల సేవించి, కడపట శ్రీరంగమునకుఁ బోయి యచ్చట స్వమతసిద్ధాంతములను బోధించుచుండఁగా చోళదేశాధీశుఁ డయిన క్రిమికంఠ చోళుఁ డాతనిని బాధించినందున నతఁ డచ్చటనుండి శిష్యసహితముగా మైసూరిరాజ్యములోని ద్వారసముద్రమునకుఁ బారిపోవలసినవాఁ డయ్యెను. ఆదేశమును జైనమతస్థుఁ డైన బల్లాలుఁడు పాలించుచుండెను. జైనులతో జరిగిన వాదములలో రామానుజుఁడు జైనుల నోడించినందున, బల్లాలరాజు వైష్ణవమతము నవలంబించి విష్ణువర్ధనుఁ డను నామాంతరమును వహించెను. అనంతరము రామానుజుఁడు రాజుయొక్క సాహాయ్యము చేత తిరునారాయణపురము (మేలుకోట) నం దొక దేవాలయమును గట్టించి యందు నారాయణునిఁ బ్రతిష్ఠించి, చుట్టుపట్ల వైష్ణవాగ్రహారముల నేర్పఱిచెను. ఆతఁ డక్కడ పండ్రెండు సంవత్సరములుండి శ్రీకంఠచోళుఁడు స్వర్గస్థుఁ డగుట విని నిర్భయముగా మరల శ్రీరంగమునకుఁ బోయి, యక్కడ శ్రీరంగనాథునిపూజ వ్యాపింపఁ జేసెను. అటుపిమ్మట నతఁడు తిరుపతి, అహోబిలము మొదలగు దివ్యస్థలముల మీఁదుగా త్రోవపొడుగునను వైష్ణవమతిబోధ చేయుచు మహారాష్ట్రదేశము చొచ్చి, యం దుండి ద్వారకమీఁదుగా శిష్యబృందముతోడఁ గూడఁ బోయి ప్రయాగ, కాశి, మథుర, హరిద్వారము మొదలయినక్షేత్రములను సందర్శించి, హిమాలయపర్వతములలో నున్న బదరికాశ్రమమునకుఁ బోయి బదరీనాథుని సేవించి, అక్కడనుండి కాశ్మీరదేశములోని శ్రీనగరమున కరిగి యచ్చటి శారదాపీఠమునకుఁ దాను రచియించిన శ్రీభాష్యాదిపుస్తకములను సమర్పించెను. అక్కడిపండితులెంతో చర్చచేసి తుద కాపుస్తకములను శారదాపీఠపుస్తకనిలయమునం దుంచుట కంగీకరించిరి. అప్పటి

నుండియు రామానుజులవారు శ్రీభాష్యకారు లనునామముతోఁ బ్రసిద్ధులయిరి. అత్రఁడు శారదాపీఠమును వీడ్కొని కురుక్షేత్రము, అయోధ్య, గయ మొదలగుప్రదేశములకుఁ బోయి చూచి, వంగదేశ ములో గంగాసాగరసమీపమునం దున్న కపిలాశ్రమమును జేరి, అక్కడనుండి దక్షిణమునకు మరలి జగన్నాథముపోయి, ఆంధ్రదేశము మీఁదుగా శ్రీరంగమునఁ బ్రవేశించెను. అత్రఁ డింకొకవర్ష్యము కూడ భరతఖండమంతయు స్వమతబోధ చేయుచు సంచారము చేసి, అనేకుల నెల్లచోట్లను స్వమతావలంబులనుగాఁ జేసి, క్రమ్మఱి శ్రీరం గము చేరి యచ్చటనే వైకుంఠప్రాప్తి నొందెను. శ్రీనగరమునందలి శారదాపీఠమున కియ్యఁబడిన పుస్తకములు వ్యాసుని బ్రహ్మసూత్ర ములకుఁ జేయఁబడిన శ్రీభాష్యము, వేదార్థసంగ్రహము, గీతా భాష్యము అనుమూఁడు. ఇవిగాక వేదాంతదీపము, వేదాంతసారము, గద్యత్రయము, నిత్యగ్రంథము; అను మఱి నాలుగు గ్రంథములు కూడ రామానుజునిచేత రచియింపఁబడినవి. ఇతఁడు బోధచేసి వేల కొలఁది జనులను స్వమతమునఁ గలుపుకొనుటయేకాక విశిష్టాద్వైత మును బోధించుట కయి గృహస్థు లయినయాచార్యపురుషులను డెబ్బదినలువుర నేర్పాటుచేసెను. అంతేకాని యితఁడు శంకరా చార్యునివలెను, మధ్వాచార్యునివలెను మతములను స్థాపింపలేదు.

ఈమతమునందు చిత్తు, అచిత్తు, ఈశ్వరుఁడు, అని పదార్థ ములుమూఁడు. శైవవిశిష్టాద్వైతు లీమూఁటిని వరుసగా పశువు, పాశము పతి, అను పేరులతో వ్యవహరింతురు. చిత్తనఁగా జీవాత్మ. అది జ్ఞానేం ద్రియ మనోబుద్ధివిలక్షణ మయి, అజడ మయి, ఆనందరూప మయి నిత్యమయి, అణువయి, నిరవయవమయి, నిర్వికారమయి, నానాశ్రీమ మయి, ఈశ్వరునికి లోఁబడిన దయియుండును. జీవాత్మఁడు బద్ధుఁడు,

ముక్తుఁడు, నిత్యుఁడు, అని మూఁడు భేదములను కలిగి యుండును. బద్ధుఁ డనఁగా జనన మరణాదిరూపసంసారము ననుభవించెడు మన వంటి జీవుఁడు; ముక్తుఁడనఁగా భగవద్భక్తిచే సంసారము విడిచి మోక్షము నొందినజీవుఁడు; నిత్యుఁ డనగా నెప్పుడును నంసారబంధమే లేని యనంతగరుడ విష్వక్సేనాదులవంటి జీవుఁడు. ఈ ముత్తెఱఁగు లయిన యాత్మలును వేని కవి వేఱు. అచిత్తనఁగా జ్ఞానశూన్య మయి వికారాస్పద మయి యుండునది. ఈయచిత్సంబంధము చేతనే బద్ధాత్మక విద్యాకర్మవాసనారుచులు కలుగుచున్నవి. శుద్ధసత్వము, మిశ్ర సత్త్వము, సత్త్వశూన్యము, అని యచిత్తు మూఁడు విధములు గల దందురు. శుద్ధసత్వ మనఁగా రజస్తత్వగుణములు లేక కేవలసత్వ గుణము కలదయి,. భగవదిచ్ఛచే గోపురప్రాకారరూపముగా నుండు నది; మిశ్రసత్త్వ మనఁగా సత్త్వరజ స్తమోగుణము లను మూటిని గలది; సత్వశూన్య మనఁగా కాలము. ఇందలి మిశ్రసత్తము బద్ధు లను జ్ఞానానందములచేఁ గప్పుచు విపరీతజ్ఞానమును బుట్టించుచు నిత్య మయి మహదాదివికారములను బుట్టించునది యయి యీశ్వరు నకు క్రీడాసాధన మయి యున్నది. అచిత్తునకు ప్రకృతి, అవిద్య, మాయ, అనునవి నామాంతరములు. ఈశ్వరుఁడు నిఖలహేయగుణ ప్రత్యనీకుఁ డయి, అనంతుఁ డయి, జ్ఞానానందస్వరూపుఁ డయి, కళ్యాణ గుణ పరిపూర్ణుఁ డయి, సర్వజగత్సృష్టిస్థితిలయకర్త యయి, నిత్యుఁ డయి, సత్యజ్ఞానస్వరూపుఁ డయి, విభువయి, సర్వజ్ఞుఁడయి, సర్వ శక్తుఁ డయి, జగత్తున కుపాదాననిమిత్త నహకారికారణుఁ డయి, యున్నాఁడు.

అహంకార మమకారము లవిద్య యనియు, పుణ్యపాపములు కర్మయనియు, కర్మలచేతఁ గలిగెడు సంస్కారము వాసనయనియుఁ

విషయములయం దాసక్తి రుచియునియు, చెప్పఁబడును. హేయగుణ ప్రత్యనీకుఁ డనఁగా వికారాది దోషగుణములకు విరోధిగా నుండు వాఁడు. విభువనఁగా సర్వవ్యాపి. ఉపాదానకారణ మనఁగా కుండలకు మన్నును నగలకు బంగారము నయినట్లు మూలాధార మయినది; నిమిత్తకారణ మనఁగా కుండలకు కుమ్మరివాఁడును నగలకు కంసలి వాఁడును నయినట్లు హేతు వయినది; సహకారికారణ మనఁగా కాలమును.

విశిష్టాద్వైతమతమునందు బ్రహ్మ మొక్కటియే సత్య మయిన తత్త్వము. బ్రహ్మ మెప్పుడును చిదచిత్తులతోఁ గూడియుండును. అతఁ డాస్థితియందుమాత్రమే తెలియఁ దగినవాఁ డయినను, చిత్తుకంటెను అచిత్తుకంటెను భిన్నుఁ డయి జ్ఞానాత్మకుఁ డయి యున్నాఁడు. చిత్తును, అచిత్తును, కూడ సత్యములే. బ్రహ్మమునకును చిదచిత్తులకును శేష శేషీభావము కలదు. శేషశేషీభావ మనఁగా బ్రహ్మ స్వతంత్రుఁ డనియు, చిత్తును అచిత్తును బ్రహ్మమునకు లోఁబడిన వనియు, తాత్పర్యము. చిత్తును, అచిత్తును, బ్రహ్మమును మూఁడును నొండొంటిని విడువక యవినాభావ సంబంధము కలిగియున్న వగుటచేత చిదచిత్తులు శరీరమువంటి వనియు, బ్రహ్మము శరీరివంటి దనియుఁ జెప్పుచున్నారు. మనశరీరమున కాత్మ యెట్లో యట్లే యజడము లైన జీవాత్మలకును జడమయిన ప్రపంచమునకును గూడ నాత్మ యగుటచేత బ్రహ్మము పరమాత్మ యనఁబడును. విశిష్టాద్వైత మనుసమాసము విశిష్టము, అద్వైతము, అను రెండువ్యస్తపదములచేత నైనది. విశిష్ట మనఁగా కూడినది యని యర్థము; అద్వైత మనఁగా రెండవది లేనిది యని యర్థము. పరబ్రహ్మము చిదచిద్విశిష్ట మయిన యద్వితీయ పదార్థ

మని బోధించునది యగుటచేత నీయుశమునకు విశిష్టాద్వైత మని పేరు కలిగినది.

ఉపనిషత్తులలోఁ గొన్నిచోట్ల బ్రహ్మ మొక్కటియే సత్య మను వాక్యములును కొన్నిచోట్ల చిదచిదీశ్వరులు మూఁడును సత్యము లను వాక్యములును, కొన్నిచోట్ల చిదచిత్తులు పరబ్రహ్మమునకు శరీరమను వాక్యములును, కనఁబడుచున్నందున నీశ్వరునకు విశేష ణము లనఁగా గుణములని చెప్పినంగాని పరస్పర విరుద్ధములుగా కనఁ బడెడి యన్ని వాక్యములను సమన్వయింపఁ జేసి నమర్థించుట సాధ్యము కాదని రామానుజాచార్యులు చెప్పుచున్నారు. అట్లయినచో నీశ్వ రుఁడు నిర్గుణుఁడని చెప్పెడి వాక్యములగతి యేమి కావలె నని శంక తెచ్చుకొని గుణములులేక పదార్థముండుట సంభవింపనేరదు గనుకను, బ్రహ్మము సత్పదార్థ మగుటచేత గుణములుండి తీరవలయును గను కను, నిర్గుణుఁ డనుట కర్థము ప్రకృతికిఁ గలగుణము లనఁగా హేయ గుణములు లేనివాఁడని చెప్పిరి. సత్త్వరజస్తమస్సులు మూఁడును ప్రకృతి గుణములు; బ్రహ్మమున కీగుణములు లేవు. ఈశ్వరుఁడు రూపమును బొందునని విశిష్టాద్వైతమతము; అతఁడరూపుఁడనియు నిరాకారుఁడనియు వేదములలో నున్నది. ఈశ్వరుఁడు స్వభావము చేత నిరాకారుఁడే యైనను, సర్వశక్తుఁడగుటచేత లోకరక్షణార్థము తనయిచ్చ వచ్చినరూపములను పొందునని రామానుజుఁడు సాధించు చున్నాఁడు. తన్మతానుసారముగా నీశ్వరుఁడు పొందెడు శుద్ధసత్త్వ స్వరూపము లయిదు—1. శంఖచక్రగదాదులనుధరించి వైకుంఠము నందు సర్వదా యుండెడుపరవిగ్రహము; 2. ఉపాసకులైన దేవతలచే సేవింపఁబడుచు, ఆమోద భువనప్రమోదములనెడు విష్ణులోకము లలో సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధనామములతో నుండు వ్యూహ

విగ్రహము; 3. రామకృష్ణాద్యవతారరూపముల నుండెడు విభవవిగ్ర హము; ౪. మంత్రాది ప్రభావముచేత ప్రతిమలలోఁ బ్రవేశించెడి యర్చావిగ్రహము; ౫. ధ్యానముచేసెడి భక్తులకు గోచరమయ్యెడి యంతర్యామి విగ్రహము. ఈరూపములలో నేరూపమున నున్నను లక్ష్మీకూడ ననపాయినియై విష్ణువుతో నుండును. నిరాకారమయిన బ్రహ్మమునందు గుతీయుంచుట సాధ్యము కాకపోవుటచేత యోగుల ధ్యానమున కనుకూలపడుట కయి యీశ్వరుఁ డీరూపములను బొందు చున్నాఁడు.

అచిత్తు ప్రపంచమునకును జీవాత్మల శరీరములకును మృత్తు ఘటములకువలె నుపాదానకారణ మనియు, అది ప్రకృతి ప్రధాన అవ్యక్త మాయాదిసామములచే వ్యవహరింపఁ బడుననియు, సత్వరజ స్తమోగుణములు ప్రకృతి ధర్మము లనియు, పయినే చెప్పఁబడెను గదా. ప్రకృతి (అచిత్తు) నుండి మొదట మహత్తు పుట్టెను; మహత్తు నుండి యహంకారము పుట్టెను. అహంకారము వైకారికము (సాత్వి కాహంకారము). తైజసము (రాజసాహంకారము), భూతాది (తామసాహంకారము), అని త్రివిధము. సాత్వికాహంకారము వలన నంతఃకరణ మయిన మనస్సును, త్వక్చక్షుర్జిహ్వాఘ్రాణ శ్రోత్రము లనెడు జ్ఞానేంద్రియము లయిదును, వాక్పాణిపాదపాయూపస్థ లనెడి కర్మేం ద్రియము లయిదును, పుట్టెను. తామ సాహంకారము వలన పంచ మహాభూతముల యొక్క సూక్ష్మరూపము లయిన పంచ తన్మా త్రలు పుట్టును. శబ్దస్పర్శరూప రసగంధములు పంచ తన్మాత్రలు. ఈపంచ తన్మాత్రలవలన వరుసగా ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథిని, అను పంచభూతములు పుట్టినవి. రాజసాహం కార మీశ్వర సంకల్పమువలన సమస్తవస్తువులను గలిగించు

టకు స్వాతికతామసాహంకారములకు రెంటికిని తోడువడును. చిత్త
నఁగా జీవాత్మ మోక్షపర్యంతము ప్రకృతితోడి సంబంధమును వీడక
కర్మపాశ బద్ధమయి యీశ్వరునికి లోఁబడినదయి యుండును ప్రకృతి
లోన ప్రత్యణువును జీవుని గలదయి, తనయందుండెడి జీవునకు శరీర
మయి యుండును. ప్రతిజీవుఁడును పరమాత్మను శరీరిని (అంతర్యామిని)
గాఁ గలిగి యుండును.

శుద్ధ శూన్యమునుండి వస్తు వెవ్వఁడును కలుగ నేరదుగనుక నిత్యమయిన ప్రకృతినుండియే యీశ్వరేచ్ఛచేత సృష్టి కలుగు చున్నది. సమష్టిసృష్టి యనియు; వ్యష్టిసృష్టి యనియు, సృష్టి ద్వివిధము. పరబ్రహ్మముయొక్క సంకల్పానుసారముగా మహత్తు, అహంకారము మొదలయినవి కలుగుట సమష్టిసృష్టి. పంచతన్మాత్రలయొక్క కూడిక (పంచీకరణము) చేత కర్మానుసారము లయినరూపములు కలుగుట వ్యష్టిసృష్టి. సృష్టి (౧) సుర, (౨) నర, (3) తిర్యక్, (౪) స్థావర రూపముల నాలుగు విధములుగా నుండును. సృష్టిని ప్రాకృత సృష్టి, దైనందినసృష్టి నిత్యసృష్టియని త్రివిధముగాఁ గూడఁ జెప్పుదురు. ప్రాకృతసృష్టి (మహదహంకారాదిరూప మయినసమష్టిసృష్టి) ప్రతి మహాకల్పము (బ్రహ్మజీవితకాలము) నందును నొక్కసారి జరగు చుండును. దైనందినసృష్టి (వ్యష్టిసృష్టి) ప్రతిబ్రహ్మకల్పము (బ్రహ్మ దినము) యొక్కయారంభమునం దొకసారి కలుగు చుండును. నిత్య సృష్టి సమస్తస్థూల పదార్థముల యొక్కయు జన్మస్థితుల వలె కర్మఫ లానుగుణముగా ప్రతిదినమును ప్రతినిమిషమును గలుగు చుండును. కల్ప మనఁగా కాలవిశేషము. బ్రహ్మకల్పము, మహాకల్పము, అని కల్పములు రెండు. ఒక్కొక్కకల్పములో ననేక మన్వంతరము లుండును; ఒక్కొక్కమన్వంతరములో డెబ్బదియొక్క మహాయుగము

లుండును. కృత, త్రేతా, ద్వాపర, కలియుగములు నాలుగును జేరి యొకమహాయుగ మగును — కలియుగము 432000 సంవత్సరములు ; ద్వాపరయుగము కలియుగమునకు ద్విగుణ మనఁగా 864000 సంవత్సరములు ; త్రేతాయుగము కలియుగమునకు త్రిగుణ మనఁగా 1296000 సంవత్సరములు ; కృతయుగము కలియుగమునకు చతుర్గుణ మనఁగా 1728000 సంవత్సరములు. ఒకమహాయుగములో 4320000 సంవత్సరము లుండును. మన్వంతర మనఁగా మనువుకాలము ; మన్వంతరములు పదునాలుగు. బ్రహ్మకొక్కదినమైన బ్రహ్మకల్పములో పదునాలుగు మన్వంతరము లనఁగా సంధులతోఁ గలుపుకొని నూఱు మహాయుగము లుండును. మునూఱ్ఱాటయఱువది బ్రహ్మకల్పములును, అంతే ప్రమాణము గలమునూఱ్ఱాటయఱువదిరాత్రులును గలిసి బ్రహ్మకొక్క సంవత్సర మగును; అటువంటి సంవత్సరములు నూఱు చేరి బ్రహ్మాయుష్కాల మయినమహాకల్ప మగును.

ప్రాకృతప్రళయము, నైమిత్తిక ప్రళయము, నిత్యప్రళయము, ఆత్యంతికప్రళయము, అని ప్రళయము చతుర్విధము. ప్రాకృతప్రళయ మనఁగా ప్రపంచ మంతయు నిప్పు డున్నస్థూలరూపమునువిడిచి సూక్ష్మ రూపమును బొంది నశించుట. ఈప్రళయము మహాకల్పాంతమున జరగును. నైమిత్తికప్రళయ మనఁగా త్రిలోకములును దమ యిప్పటి రూపమును విడిచి యందలివస్తువు లన్నియు నాయాభూతములలోఁ గలియుట. ఇది ప్రతిబ్రహ్మకల్పాంతమునను జరగును. నిత్యప్రళయ మనఁగా ప్రతినిమిషమును మరణాదిరూపమున పదార్థములు నశించు చుండుట. ఆత్యంతికప్రళయ మనఁగా జీవునకు ప్రకృతితోడ సంబంధము విడిచిపోవుట. ఇది జీవుఁడు మోక్షము నొందినప్పుడు సంభవించును. ఈప్రకారముగా దృశ్యమంతయు వశ్యమగును. ఆయా

వస్తురూపములు నశించినను వానికి మూలాధారము లయున సూక్ష్మా ణువులు నశింపనందున ప్రకృతి నిత్యమయినది జీవాత్మ దేహములోఁ బ్రవేశించుట జనన మనియు, దానిని విడుచుట మరణమనియు, చెప్పఁ బడును. జీవాత్మ కొంతకాల మొక దేహములోనుండి తరువాత దానిని విడిచి యెప్పుడో యొకప్పుడు మఱియొక దేహములోఁ బ్రవేశించును. ఇట్లు ప్రవేశించుట జన్మాంతర మనఁబడును. జనన మరణ జన్మాంతరాదులు సవికార మయిన దేహమునకు సంబంధించి నవేకాని నిర్వికార మయినజీవాత్మకు సంబంధించినవి కావు. స్వభా వముచేత నిత్యుఁడును పరిశుద్ధుఁడు నయినజీవుఁడు కారణశరీరమును బొంది సుఖదుఃఖముల ననుభవించుటకు కర్మ కారణము. ఈకర్మమే జననమును మరణమును జన్మపరంపరను దేహధారణమును బొందు టకుఁ గారణ మగును. మంచిదికాని చెడ్డదికాని జీవుఁడు బుద్ధిపూర్వ కముగాఁ జేయుపని కర్మ యనఁబడును. ఈశ్వరునకు ప్రీతికర మయిన కర్మము సుకృతము; ఈశ్వరునకు ప్రీతికరముకాని కర్మము దుష్కృతము.

అవిద్య యనఁబడెడి యజ్ఞానమువలన జీవుఁడు కర్మమును జేయును. అన్యథా జ్ఞానము, విపరీతజ్ఞానము, అని యవిద్య (అజ్ఞానము) ద్వివిధము. ఒకవస్తువుగుణముల నింకొకదాని వనుకొనుట యన్యథా జ్ఞానము; ఒకవస్తువును మఱియొకవస్తువనుకొనుట విపరీతజ్ఞానము. జీవాత్మ మొదట శరీరమే తాననుకొనును: పిమ్మట జననము, మర ణము, మొదలయినశరీరగుణములు, తన వనుకొనును. అవిద్యవలన రాగద్వేష క్రోధాదులు కలుగును: వానివలన జీవుఁడు కర్మలకు వశుఁడగును. ఒకకర్మవలన వేఱొకకర్మ పుట్టును. ఈప్రకార ముగా ప్రకృతిసంబంధమునుబట్టి కర్మపరంపర యాద్యంతములు

లేని దయి చక్రపరిభ్రమణమువలె తిరిగితిరిగి వచ్చుచుండును. ఈ తెంపు లేని కర్మప్రవాహము ప్రళయకాలమునందు సహితము నశింపక జీవాత్మతో నడఁగి యుండి సృష్టితోడఁగూడ మరల బయలు వెడలును. ఈశ్వరుఁడు తటస్థుఁడగుటచేత కర్మతో సంబంధము కలిగించుకొనక సాక్షి యయి చూచు చుండును. అందుచేత జీవాత్ముఁడు తాను జేసినకర్మఫలముల ననుభవించు చుండును. పాప కర్మయొక్కఫల మిహలోకములో దుఃఖమును పరలోకములో నరక మును; పుణ్యకర్మయొక్కఫలమిహలోకములో సుఖమును పరలోకములో స్వర్గమును. స్థూలదేహమునుండి వెలువడిన సూక్ష్మదేహమువలనఁ గలిగినయాతనాశరీరమును బొంది జీవుఁడు పాపఫల మయినయాతన ననుభవించెడు లోకము నరకము. దాని కధిపతి యమునఁడు. సూక్ష్మదేహము వలనఁ గలిగినభోగశరీరము నొంది జీవుఁడు పుణ్యఫల మయిన యానందము ననుభవించెడిలోకముస్వర్గము. సాధారణముగా నూర్ధ్వలోకము లనెడి పుణ్యలోకము లాఱు: అవి భువర్లోకము, స్వర్లోకము, మహర్లోకము, జనలోకము, తపోలోకము, సత్య లోకము. నరకాదు లధోలోకము లనఁబడును. జీవుఁడు తన పుణ్య పాపఫలము లనుభవించువఱకును ఊర్ధ్వాధోలోకములయందుండును. అనంతర మతఁడు తన కర్మఫలానుసారముగా మనుష్యపశుపక్ష్యాది స్థూలశరీరమును ధరించి, జన్మరాహిత్యమును బొంది ముక్తివడయు వఱకును జన్మపరంపరను బొందుచుండును. సామీప్యము, సాలో క్యము, సారూప్యము, సాయుజ్యము, అని ముక్తి నాలుగు విధములు గలది. ఈశ్వరుని సమీపమం దుండుట సామీప్యము; సమానలోక మందుండుట సాలోక్యము; సమానరూపమునొందుట సారూప్యము; ఈశ్వరునితోఁ గలిసి యానంద మనుభవించుట సాయుజ్యము. ముక్తి

నొంది, జీవుఁడు మరల బద్ధుఁడు కాఁడు కాని లోకోపకారార్థము భూమిపయి నవతరించి తనపని తీరినతరువాత మరల మోక్షమునకుఁ బోవును. వైష్ణవులకు పరమపద మనఁబడెడు వైకుంఠము ముక్తి స్థానము. ప్రకృతిసంబంధమును విడిచి, పుణ్యపాపకర్మలనుండి పూర్ణముగా విడివడుట మోక్షము. మోక్ష మనుపదమునకు కర్మ బంధములనుండి విడివడుట యని యర్థము. అన్నిజీవులును కర్మక్షయ మును జేసి మోక్షమును బొందవచ్చును. జీవుఁడు దేవాయన మనఁ బడెడి యర్చిరాదిమార్గమునఁ బరమపదమునకుఁ బోవును. అవసాన దశయందు జీవుఁడు సూక్ష్మ (లింగ) శరీరము నొంది, సుషుమ్నా నాడిద్వారమున బ్రహ్మరంధ్రములనుండి పైకి వెడలి, సూర్యమండ లము జొచ్చి, యచ్చటనుండి పరమపదమును జేరును. కర్మయోగము, జ్ఞానయోగము, భక్తియోగము, ప్రపత్తియోగము, అని మోక్ష మును బొందుట కుపాయములు నాలుగు. వేదాధ్యయనముచేత తత్త్వ జ్ఞానమును బడసి, కర్మఫలాపేక్ష లేక వేదవిహితకర్మలను జేయుచు, జపహోమయజ్ఞదాన తపఃప్రభృతులగు సర్వకర్మలను ఈశ్వరార్ప ణము చేయుట కర్మయోగము. యోగశాస్త్రమునందుఁ జెప్పఁబడిన యమనియమప్రాణాయామ ప్రత్యాహార ధ్యానధారణసమాధులనెడి యష్టాంగములచేతను మనస్సు నీశ్వరునియందునిలుపుట జ్ఞానయోగము. యథాశక్తిని సర్వకర్మలను జేయుచు, యావజ్జీవమును నిశ్చల భక్తితో దేవునిసమస్తకళ్యాణగుణములను దలఁచుచు నీశ్వరు నుపా సించుట భక్తియోగము. పయిని జెప్పఁబడిన మోక్షసాధనములను మూటిని ననుష్ఠించుటయందలి తనయశక్తతను దెలుపుచు, తన రక్ష ణమున కీశ్వరకృప నొక్కఁడానినే నమ్మికొని మరణపర్యంతమును దేవుని కల్యాణగుణస్మరణము చేయుచుండుట ప్రపత్తియోగము.

జ్ఞానులుమాత్రమే మొదటి మూడుయోగములు ననుష్ఠించుట కర్హులైనను, ఈకడపటిదైన ప్రపత్తియోగము ననుష్ఠించుట కజ్ఞానులును చండాలురు మ్లేచ్ఛులు మొదలయిన యెల్లవారును నర్హులు. ఈచతుర్విధమోక్ష సాధనములును కర్మను నశింవఁ జేయును.

సంచితము, ప్రారబ్ధము, ఆగామి అని కర్మ త్రివిధము. ఈవఱి కనుభవింవ నారంభింపక కూడఁబెట్టినది సంచితము, ఇప్పు డనుభవించుట కారంభింవఁబడినది ప్రారబ్ధము; భవిష్యత్కర్మల వలన మున్ముందనుభవింపఁ బోయెడిది యాగామి. పయిసాధనముల చేత సంచిత కర్మ నశించిపోవును; ప్రారబ్ధకర్మ ఫలములనిచ్చి నిలిచిపోవును; ఆగామికర్మ ఫలకారి కాకుండును. తక్కినమార్గములచేత ప్రారబ్ధ కర్మముయొక్క పరిమితినిబట్టి యాజన్మమునందో మఱికొన్ని జన్మము లను బొందియో మోక్షమును బొందవచ్చునుగాని ప్రపత్తి మార్గము చేత నాజన్మమునందే కర్మక్షయమును జేసికొని మోక్షమును బడయవచ్చును.

శ్రీవైష్ణవులలో వడగలు లని, తెంగలు లని, రెండు తెగలవారున్నారు. వడగలివా రనఁగా నుత్తరదిక్కువారని యర్థము. వీరు సంస్కృత వేదములయం దధికవిశ్వాసము గలవా రయి, కాంచీనగరమునందలి వేదాంతాచార్యులవా రుపదేశించిన రహస్యములలోని సిద్ధాంతముల ననుసరింతురు. తెంగలివా రనఁగా దక్షిణదిక్కువారని యర్థము. వీరు ద్రవిడభాషలో రచియింపఁబడిన దివ్యప్రబంధ మనఁబడెడు ద్రావిడవేదమునం దధికవిశ్వాసము కలవా రయి, శ్రీరంగమునందలి లోకాచార్యులవా రుపదేశించిన రహస్యములలోని సిద్ధాంతముల ననుసరింతురు. వడగలివారు తిరుమణినామములో ముక్కుమీఁద పాదముపెట్టరు; తెంగలివారు ముక్కుమీఁద పాదము పెట్టు

దురు. రామానుజాచార్యులకుఁ బూర్వమునందు దక్షిణహిందూస్థాన మునం దుండిన యాళ్వారులచే ద్రావిడమునందుఁ జేయఁబడిన గ్రంథ ములు దివ్యప్రబంధ మనఁబడును. దానియందు పాశురము లనఁబడెడు నాలుగువేల పద్యములు గలవు: ఆళ్వారులు పన్నిద్దఱు; వారిలో మాలలు మొదలుకొని సర్వజాతులవారు నున్నారు. ఈయిరుదెఱఁగుల వైష్ణవులలోను పంచసంస్కారములు ప్రధానములు. తాపము, పుండ్రము, నామము, మంత్రము; యాగము, ఇవి పంచసంస్కార ములు. తాప మనఁగా నెఱ్ఱగాఁగాల్చిన యినుపముద్రలతో విష్ణునిశంఖ చక్రచిహ్నములను బుజములపై ముద్రించుట; పుండ్రమనఁగా లలాట మునందును శరీరముయొక్క మఱి పదునొక్కస్థలములయందునుసుద్దతో నామములు పెట్టి వానినడుమ శ్రీచూర్ణ రేఖ నుంచుట; నామమనఁగా వైష్ణవులకు విష్ణుని పేరులనే పెట్టుట; మంత్రమనఁగా గురూపదేశ సమయమునం దాచార్యుఁడు శిష్యులకు విష్ణుషడక్షరి, నారాయణా ష్టాక్షరి, వాసుదేవద్వాదశాక్షరి, శరణాగతిమంత్రము, మొదలైన వాని నర్థసహితముగా నుపదేశించుట; యాగ మనఁగాఁ నర్చించుట కేదో యొకవిగ్రహమును విధించుట. వైష్ణవులు పెట్టుకొనెడు నిలువు బొట్లు వండ్రెండును ద్వాదశోర్ధ్వపుండ్రము లనఁబడును.

ద్వైతమత సంగ్రహము

•••○○•••

ద్వైతమతము మనదేశమందు వ్యాపించియున్న త్రిమతము లలోఁగడపటిది. ఈద్వైతమతసిద్ధాంతమును స్థాపించినవాఁడు మధ్వాచా ర్యుఁడు. అందుచేత నిది మాధ్వమతమనియుఁ జెప్పఁబడును. ఇతఁడు పరమాత్మ జీవాత్మలును, ఏకముగాక వేఱైనవని ద్వైత్వమును

బోధించుటచే నీతనిమతమునకు ద్వైతమని పేరువచ్చినది. ఇతఁడు దక్షిణకర్ణాటక(South Canara District) మండలములోని తులువ దేశములో ఉడిపికి సమీపమునఁ దున్న అనంతేశ్వర మను గ్రామము నందు మధ్యగేహభట్టనెడు బ్రాహ్మణునకు పుత్రుఁడై 'శాలివాహన శకము 1040 సంవత్సరములో విలంబి సంవత్సరాషాఢబహుళ చతుర్థి నాఁడు జనన మొందెను. ఈ సంవత్సరము క్రైస్తవశకము 1119 తో సమాన మగును. ఇతఁడు శైశవమునుండియు మతాభినివేశము గల వాఁడయి, పండితులతో తత్త్వవిషయములను గూర్చి వాదించుచు అసామాన్య మేధావంతుఁ డయి యుండెనఁట. ఇతఁ డుపనయన మయినతరువాతఁ దన తొమ్మిదవయేటనే అచ్యుతప్రేక్షస్వామిచలన సన్యాసాశ్రమమును స్వీకరించెను. పూర్వాశ్రమమునం దీతని పేరు వాసుదేవాచార్యుఁ డైనను సన్యాసి యయిన తరువాత నితఁడు మధ్వాచార్యుఁ డనియు, ఆనందతీర్థుఁ డనియు, నామములను వహించెను. ఇతఁ డధికప్రజ్ఞ గలవాఁ డయి యుండుటచేత నీశనిని పూర్ణప్రజ్ఞుఁ డనియుఁ బిలుతురు. ఇతఁడు గంగాయాత్ర చేయవలె నని ప్రయత్నింపఁగా గురుఁడు తన ప్రియశిష్యునియందుఁ గల ప్రేమాతిశయముచేత నాతనిని బోనీయక, తన యిష్టమైనత మయిన యనంతేశ్వరునిఁ బ్రార్థించి తదనుగ్రహమువలన గంగానది యంతర్వాహినిగా వచ్చి యుడిపిలో నున్న సరోవరమునందుఁ బ్రవేశించునట్లు చేసెననియు, మధ్వాచార్యుఁడును సర్వజనులును దానిలో స్నానముచేసి కృతార్థులయి గంగాస్నానఫలములను బొంది రనియు చెప్పుచున్నారు. అతటాక మిప్పుడు మధ్యసరోవర మని చెప్పఁబడుచున్నది. గురువు జీవించియుండఁగానే మధ్వాచార్యుఁడు స్వమతమును జనులకు బోధించుచు, అతఁడు సిద్ధిపొందినతరువాత నాతని మఠమున కధిపతి

యయ్యెను. ఇట్లు మఠాధిపతి యయినతరువాత నతఁడు తన వదు నేడవ సంవత్సరమునందు హిమాలయ పర్వత ప్రాంత మందలి బదరీ వనమునం దున్న వేదవ్యాసాశ్రమమునకు యాత్ర వెడలెను. అతఁ డక్కడ వేదవ్యాసులవారిచేత సత్కరింపఁబడి కొంతకాలముండి తత్త్వ విషయము నధికముగా నేర్చుకొని ననియు, వేదవ్యాసులవా రిచ్చిన యెనిమిది సాలగ్రామములను గైకొని యాతఁ డా యాశ్రమమునుండి వెడలి మగలి యుడిపికి వచ్చె ననియు, చెప్పుదురు. నేపాళదేశము నందలి గండకీనదియందుఁ బుట్టిడి యొకవిధ మైన నల్లని గుండ్రరాళ్ళు సాలగ్రామము లనఁబడును. ఆ సాలగ్రామములయందు మహా మహిమ గలదని నమ్మి హిందువులు వానిని దేవతార్చన పెట్టుఁగోఁ బెట్టి పూజించి, వానిని కడిగి సాలగ్రామతీర్థమును భక్తితో లోపలికిఁ బుచ్చుకొందురు.

మధ్వాచార్యులవారు బదరికాశ్రమమునుండి వచ్చి న్యస్థా మును జేరినతరువాతఁ దాను దెచ్చిన యష్టసాలగ్రామములలో నాఁటిం టిని సుబ్రహ్మణ్యములోను, ఒకదానిని ఉడిపిలోను, ఒకదానిని మధ్య తలములోను గల దేవాలయములలోఁ బెట్టెను. అంతేకాక యతఁడు ద్వారకానగరమునుండి మలబారుతీరమునకు వచ్చిన యొక యోడలో గోపీచందన మను మట్టిలోఁ గలిసి తనకు లభించిన కృష్ణ విగ్రహమును ఉడిపిలోని యొక దేవాలయమునందుఁ బ్రతిష్ఠించి యా పట్టణము నందును దానిసమీపమునందును మఠముల నెనిమిదింటిని స్థాపించెను. అతఁడు తాను సాలగ్రామములను కృష్ణ విగ్రహమును బెట్టిన దేవాలయములలోను స్థాపించినమఠములలోను దనశిష్యులను నిలిపి, తాను రచియించిన ముప్పదియేడు గ్రంథములలోను గల ద్వైతమత సిద్ధాంతములను ప్రజలకు బోధింప నియమించెను. తద్విరచిత గ్రంథ

ములలో ఋగ్భాష్యమును, దశోపనిషద్భాష్యమును, గీతాభాష్యమును, బ్రహ్మసూత్రభాష్యమును, భారతతాత్పర్య నిర్ణయమును, భాగవతతాత్పర్య నిర్ణయమును, కృష్ణామృత మహార్ణవమును, తంత్రసారమును, ప్రధానము లయినవి. అతఁడు డెబ్బది తొమ్మిది సంవత్సరములు జీవించి క్రీస్తవశకము 1198 వ సంవత్సరముతో సరియైన శాలివాహనశకము 1120 పింగళ నామ సంవత్సర మాఘమాసమునందు రెండవసారి బదరికాశ్రమమునకుఁ బోవలెనని బైలుదేఱి వెళ్లెనుగాని తరువాత నాతనిజాడ తెలియరాలేదు. అతఁడిప్పటికిని బదరికావనమునందలి వేదవ్యాసాశ్రమమునం దున్నవాఁడని మాధ్వమతస్థులు నమ్ముచున్నారు.

మాధ్వమతస్థులకు విష్ణువు ప్రధానదైవతము. అందుచేత వీరు వైష్ణవు లనియుఁ జెప్పఁబడుదురు. విష్ణువు ప్రపంచమును జడ ప్రకృతిలో నుండి పుట్టించె ననియు, అందుచేత సృష్టికి విష్ణుఁడు నిమిత్తకారణుఁడును జడప్రకృతి యుపాదానకారణము ననియు, విష్ణువును ప్రకృతియు జీవుఁడును ఈమూఁడును ఆద్యంతములు లేని నిత్య పదార్థము లనియు, అవి యన్యోన్యభేదభావము గల ప్రత్యేకపదార్థములే యైనను ప్రకృతియు జీవుఁడును స్వతంత్ర మైనవి గాక విష్ణువునకుఁ బరతంత్రము లయి పూర్ణముగా లోఁబడి యుండునవి యనియు, జీవుఁడు ప్రకృతియొక్క సత్త్వరజస్తమోగుణము లకు వశుఁడయి వివిధకర్మలను జేయుచు జననమరణ జన్మపరంపరా వస్థలను బొందుచుండు ననియు, జీవుఁడు కర్మక్షయమును జేసి ముక్తుఁడగు ననియు, ముక్తిని బొందుటకు విష్ణుభక్తి సాధన మనియు, భక్తి వలన విష్ణుప్రసాదము లభించి తనూత్సర్గమున మోక్షప్రాప్తి కలుగు ననియు, మోక్ష మనఁగా సంసారబంధములనుండి విముక్తి నొందుట

యనియు, మాధ్వులు చెప్పుచున్నారు. ఇవియే ముఖ్యము లయిన మాధ్వమతసిద్ధాంతములు. ఈమతస్థులు ప్రత్యక్షానుమాన శబ్ద ప్రమాణములను మూటి నంగీకరింతురు. శబ్దప్రమాణములలో శ్రుతియు, స్మృతియు, పంచరాత్రమును, మూలరామాయణమును, మహాభారతమును, వానికి విరుద్ధముగా నుండని యితరగ్రంథములును, వీరిచే ప్రమాణగ్రంథములుగా నంగీకరింపఁబడుచున్నవి.

విష్ణుఁ డొక్కఁడే దేవుఁడైనను, సృష్టిస్థితిలయార్థముగా నతఁడప్పుడప్పుడు భూమిమీఁద నవతరించు చుండు ననియు, అతనియవతారములకును నాతనికిని నభేద మనియు, ద్వాపరయుగమునందు కృష్ణుఁడుగా నవతరించినట్లే విష్ణుఁ డీకలియుగమున బుద్ధదేవుఁడుగా నవతరించె ననియు, బుద్ధుఁడు బోధించిన బౌద్ధాగమముకూడ వేద విహితధర్మములనే బోధించి ముక్తికి హేతు వగు ననియు, తెలియని వారు కొంద అపార్థములను యథేచ్ఛముగాఁ గల్పించి తన్మతదూషకు లయినను బుద్ధదేవుఁడు విష్ణునియవతార మగుటచేత నతఁడును నాతని సిద్ధాంతములు నాదరణపాత్రములే యనియు, వీరు చెప్పుచున్నారు. వీరికి ప్రధానదేవత లక్ష్మి.

"సత్యం జ్ఞాన మనంతంబ్రహ్మ" అను శ్రుత్యనుసారముగా దేవుఁడు సత్యజ్ఞానాంతస్వరూపుఁ డని మధ్వాచార్యుఁడు చెప్పి యున్నాఁడు. జన్మనాశములు లేక శాశ్వతుఁడుగా నున్నందున సత్య స్వరూపుఁ డనియు, దేశకాలగుణబాధితుఁడు కానందున ననంతుఁ డనియు, వివరింపఁబడినది. సర్వవ్యాపి యగుటచేత దేశాబాధితుఁడు; ఆద్యంతములు లేకపోవుటచేత కాలాబాధితుఁడు; సర్వశక్తత్వసర్వజ్ఞత్వాదిగుణములు కలవాఁ డగుటచేత గుణాబాధితుఁడు. ఇతఁడు వేద ప్రమాణము నంగీకరించినవాఁ డయినందున శ్రుతులయందుఁ జెప్పఁ

బడిన నిర్గుణత్వాదివిశేషణములు దేవున కున్నట్లొప్పుకొనవలసినవాఁ డయినను, వానికి సామాన్యార్థములను గ్రహింపక విశేషార్థములను గల్పించెను. ఎట్లనఁగా, నిర్గుణుఁ డనఁగా గుణములు లేనివాఁడని యర్థము కాదనియు, ప్రతిసత్పదార్థమునకును గుణము లుండి తీఱ వలసి యుండుటచేతను గుణము లేవియు లేని-చో సత్పదార్థమే యుండక పోవలసి వచ్చుటచేతను దేవుఁడు సత్పదార్థ మగుటచేతను నిర్గుణశబ్దమున కర్థము మనుష్యాదిజీవులకుఁ బ్రకృతిసంబంధముచేతఁ గలిగెడు హేయగుణములు లేవనియే కాని కళ్యాణగుణములు లేవని కాదనియు, సమర్థింపఁ జూచెను. ఈప్రకారముగానే యద్వైత మతానుకూలముగా నున్న యితర విశేషణములకును విశేషార్థములు కల్పింపఁ బడినవి.

వీరిమతమునందు జీవులును జడప్రకృతియుఁ గూడ నీశ్వరునితో సమానముగానే నిత్యములు. అందుచేత నవి యీశ్వరునిచే సృజింపఁబడినవి కావు. అయినను జీవులును జడప్రకృతియు నీశ్వరునికి లోఁబడినవి. నగకు. బంగార ముపాదానకారణ మయినట్లుగా సృష్టికి జడప్రకృతి యుపాదానకారణము; కంసాలి నిమిత్తకారణ మయినట్లుగా దేవుఁడు నిమిత్తకారణము; వస్తువు కానిదానినుండి వస్తువు కలుగదుగనుక బంగారము స్వర్ణకారునిచేతవలె జడప్రకృతి యీశ్వరుని చేత నూతనముగా సృజింపఁబడినది గాక యాపఱకున్నదే యయి యున్నది. జడమయిన ప్రకృతి స్వయముగా సృజనచేయ శక్తికలది కానందున దేవుఁడు పురుషరూపమున దానిలోఁ జొచ్చి సంక్షోభింపఁ జేయుట చేత సృష్టిలోని యనంతపదార్థములు కలిగినవి.

సృష్టిలో మొదట త్రిగుణాత్మక మైనమహత్తు కలిగినది; దానినుండి వైకారిక తైజసభూతాది యైనయహంకారము కలిగినది;

దానినుండి పృథివ్యాపస్తేజో వాయురాకాశతన్మాత్రలు కలిగినవి; అనంతరము జ్ఞానేంద్రియ కర్మేంద్రియములుకలిగినవి; పిదప దేవతలు కలిగిరి; అప్పుడు తమోమోహామహామోహాతమిస్రాంధతమిస్రరూపమయి యవిద్య పుట్టినది; ఈయాఱును ప్రాకృతసర్గము లనఁబడును. ఏడవసృష్టి స్థావరములు; ఎనిమిదవది తిర్యక్ స్రోత స్సనఁగా జంతుసృజన; తొమ్మిదవది అర్వాక్ స్రోత స్సనగా మనుష్యసృజన: కడపటిదగుపదవది యీశ్వరావతారములు.

జడపదార్థము చైతన్యరహితమైనది; ప్రకృతి యనఁబడెడు లక్ష్మినుండి దానికి శక్తి కలుగుచున్నది. దేవునితోఁగూడ నది సర్వత్ర సర్వకాలము నుండునదిగనుక దేవునివలెనే లక్ష్మియు నిత్యమైనదే. అది ప్రపంచమున కుపాదానకారణమయి జీవునకును సమస్త పదార్థములకును దేహామయియుండు; అది యప్పుడు సత్త్వరజస్తమోగుణములను గల దగును.

జీవుఁడు జడముగాక చేతనుఁడయి, నిత్యుఁడయి, దేవునికంటె వేఱయి, దేవునికి లోఁబడినవాఁడయి యుండును. ఒకశరీరమునందుండుజీవుఁ డింకొకశరీరమునం దుండెడిజీవునికంటె భిన్నుఁడు. జీవుఁడు బద్ధుఁడయి యున్నప్పు డనఁగా శరీరమును దాల్చి యున్నప్పుడు జడప్రకృతియొక్క పూర్వోక్తగుణత్రయమును బొందును. జీవులు ముక్తయోగ్యులు, తమోయోగ్యులు, నిత్యసంసారులు, అని త్రివిధములవారు.

ద్వైతులు పంచభేదములను చెప్పుదురు. జీవేశ్వరభేదజ్ఞానము, జీవపరస్పరభేదజ్ఞానము, జడజీవభేదజ్ఞానము, జడేశ్వరభేదజ్ఞానము, జడపరస్పరభేదజ్ఞానము, అను పంచభేదజ్ఞానము ముక్తి కావశ్యకమందురు. 1. దేవుఁడు జీవునికంటె వేఱ అయినవాఁడు; 2. జీవు

లొకరికొకరు వే అయినవారు; 3. జడము జీవునికంటె వే అయినది; 4 జడము దేవునికంటె వేఅయినది; 5 జడము లొండొంటికి వే అయినవి; ఇవి యన్నిటకు సత్యములు ఘటపటాదిరూపముల నున్న స్థూలాంశములు నశించినను వానికి మూలము లయిన సూక్ష్మాంశము లగు తన్మాత్రలు నశింపనందున ప్రపంచము సత్యమయినది. జీవునకు జననమరణము లనఁగా మనుష్యుఁడొకయింటిని విడిచి వేఱొకయింటఁ బ్రవేశించునట్లుగా నొక దేహమును విడిచి వేఱొక దేహమునుబూని జన్మపరంపరను బొందుచుండుటయే కాని వేఱు గాదు. దేవుఁడు సర్వవ్యాపి యయి సర్వాంతర్యామిగా నున్నను, సర్వమునకు వే అయినవాఁడు. ఈశ్వరునకును జీవునకును, గలది వస్తువులకును పురుషునకును గల సంబంధమువంటిది కాక వృక్షమునకును తీవ్రపమునకును గలిగినదానివంటి యవినాభావసంబంధ మయి యున్నది. కాఁబట్టి జీవేశ్వరుల కెప్పుడును వీడనిసంబంధ మున్నను, జీవాత్మ పరమాత్మ లేకము గాక వేఅయినవిగా నున్నవి.

జీవునకు పరమార్థము ముక్తి, అనఁగా ప్రకృతిసంబంధముల నుండి విడివడి యీశ్వరునితోఁ జేరుట. కర్మక్షయము, ఉత్క్రాంతి, అర్చిరాది, అని ముక్తిమార్గములు మూఁడు. ఈమూఁడింటిని గడచిన తరువాత జీవుఁడు భోగ మనబడెడు చతుర్థదశను బొందును. కర్మక్షయ మనఁగా కర్మఫలము నశించుట. మనోవాక్కాయయూపమున కర్మము త్రివిధముగా నుండును. జీవునకు దేహముతోడి సంబంధము చేత త్రిగుణాత్మకము లయిన ప్రకృతిధర్మములు కలుగును; ఆధర్మములవలన కర్మలను జేయును. జీవుఁడు పొందెడు సుఖదుఃఖములన్నియు కర్మఫలములు; కర్మఫలము జన్మాంతరములకును లోకాంతరవాసములకును గారణ మగును. కాఁబట్టి మోక్షమునకు కర్మ

క్షయము ప్రథమకర్తవ్యము. కర్మక్షయ మయినతరువాత జీవుడు శరీరమునందుఁ గలడొబ్బదిరెండువేల నాడులలోను ప్రధాన మయిన సుషుమ్న నాడిద్వారమున దేహమునుండి వెలువడుట ఉత్క్రాంతి యనఁబడును; ఆత్మ సుషుమ్ననాడిలోఁ ప్రవేశించుట యుత్క్రాంతిలయ మనఁబడును. జీవుఁడు సుషుమ్ననుండి బ్రహ్మ రంధ్రములోఁ ప్రవేశించి యక్కడనుండి యగ్నిలోకాదులనుండి పోవు మార్గ మర్చిరాదిమార్గ మనఁబడును; అర్చిస్సనఁగా వ్యగ్నిహోత్రము. అర్చిరాదిమార్గమునఁ బోయి జీవుఁడు శాశ్వతానందము ననుభవించుట భోగ మనఁబడును. జీవుఁడు యోగాభ్యాసమువలన దేహ బంధములనుండి ముక్తుఁడయి సుషుమ్నలోఁ ప్రవేశింప శక్తుఁడగును; కర్మక్షయ మయినఁ గాని యట్లు ప్రవేశించుట సంభవింపదు. కర్మ క్షయము భక్తివలనను విష్ణుప్రసాదమునలనను గలుగును. భక్తి యనఁగా నీశ్వరునియందు సంపూర్ణవిశ్వాస ముంచి వగమవిధేయుఁడయి సర్వవిషయములలో నీశ్వరప్రీతికరముగా నడుచుకొనుట. భక్తి కలుగఁగానే యీశ్వరప్రసాదమును గలుగును గాన పురుషుఁడు మొట్ట మొదట భక్తుఁ డగుటకు నవదోషములను వరిహరింపవలయును. జీవేశ్వరులకు భేదము లేదనుట, దేవుఁడు నిర్గుణుఁ డనుట, దేవుఁడు దోషసహితుఁ డనుట, దేవునితో నమానులితరులు కలరనుట, దేవునికంటె నధికులు కలరనుట, దేవుఁడు తన యవతారములకంటె వేఱనుట, అవతారపురుషులు దేవాంశకలవారు గాక నరమాత్రులనుట, భాగవతాపచారము చేయుట, దేవుని ప్రాభవమును నిరాకరించుట—ఇవి నవదోషములు. ఈనవదోషములను త్యజించి గుణములను భజించుటకు అంకనమును, నామకరణమును, భజనమును సాధనములు.

అంకన మనఁగా నారాయణుని యాయుధములను దేహము మీఁద ముద్రించుకొనుట. అది రెండు విధములు. మొదటిది విష్ణుని పంచాయుధము లయిన శంఖచక్రాదులను స్నానము చేయునపు డెల్లను గోపీచందన మను మట్టిలోను జలములోను ముంచి లలాటను ఱొమ్ము భుజములు మొదలయిన వానిమీఁద ప్రతిదినమును ముద్రలు వేసి కొనుట. రెండవది యాచార్యపురుషుఁడు వచ్చినపుడు భుజముల మీఁద తప్తముద్రాంకణము చేయించుకొనుట యనఁగా లోహ ముతోఁ జేయఁబడిన విష్ణు శంఖచక్రముల కెట్టగా కాల్పించి వానితో రెండు భుజములమీఁదను ముద్రలు వేయించుకొనుట. నామకరణ మనఁగా కొడుకులు మొదలయినవారికి విష్ణుని పేరులు పెట్టుట. భజన యనఁగా భగవంతుని సంపూర్ణభక్తితో పూజించుట. సత్యము, హితము, ప్రియము, స్వాధ్యాయము, దానము, పరిత్రాణము, పరి రక్షణము, దయ, నస్పృహ, శ్రద్ధ—ఈపదియు భజన కంగములు. వీని నన్నిటిని త్రికరణశుద్ధిగాఁ జెల్లించిన వక్షమున, జీవుఁ డన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయానందమయకోశములను విడు చుటకు శక్తుఁ డగును. ఈపంచకోశములలో మొదటిది స్థూలశరీరము తోను తక్కినవి సూక్ష్మ (లింగ) శరీరముతోను కారణశరీరముతోను సంబంధించినవి. ఆత్మ యొకదాని తరువాత నొకటిగా నీపంచకోశము లను విడిచి మోక్షమును బొందును. ఏదో ఒకవిధ మయిన దేహము లేక జీవుఁడు భోగము ననుభవింపనేరఁడు గనుక, ఈదేహముల నన్ని టిని విడిచినతరువాత చిన్మాత్ర దేహమును బొంది యీశ్వరునిలో శాశ్వతానందము ననుభవించును. జీవు లందఱును ఏకరీతిముక్తిని బొందరు. సారూప్యము, సాలోక్యము, సాన్నిధ్యము, సాయుజ్యము, అనెడు చతుర్విధ ముక్తులలో వారువారు తమతమ కర్మానుసార

ముగా సర్వా మైనముక్తిని బొందుదురు. దీనిలో నొకదానికంటె నొకటి యుత్తరోత్తరము శ్రేష్ఠతరములు. సాయుజ్యమనఁగా జీవుఁ డీశ్వరునిలోఁ గలిసి స్వరూపనాశనము నొందుట గాక స్వస్వరూప జ్ఞానముతో నీశ్వరునిలోఁ గలిసియుండి జననమరణాదిరహితుఁడయి శాశ్వతానందము ననుభవించుచుండుట.

ఉత్తమ స్త్రీ చరిత్రములు

476

ఉత్తమస్త్రీ చరిత్రములు

"WOMAN AS MOTHER."

ఉత్తమమాత.

ఓ సోదరీమణులారా! నేటిసాయంకాలము "ఉత్తమమాత" ను గూర్చి కొంచెము చెప్పఁబోవుచున్నాను. "ఉత్తమమాత" యన్న పదమే మీలోఁ గొందఱి చెవులకు వింతగా వినఁబడవచ్చును. బిడ్డల తల్లు లయిన యిల్లాండ్రకు "మేము త్తమమాతలము కామా? ఈవిష యమున మేము క్రొత్తగా నేర్చుకొనవలసిన దేమున్నది?" అనియుఁ గొందఱకు తోఁచవచ్చును. అయినను తెలిసినవారికి సహితము ధర్మ మును పలుమాఱు స్మరణకుఁ దెచ్చుట యావశ్యకమే. కాఁబట్టి నాయం దాదర ముంచి యీచిన్నయుపన్యాసమును సావధానముగా వినుఁడు.

"మాత" యన్నది రెండక్షరములు గలచిన్నపదమే యయినను దానియం దెంతో యర్థ మిమిడి యున్నది. అది స్త్రీవాచకము లయిన పదము లన్నిటిలోను మిక్కిలి గౌరవనీయ మయినది. మాతృదశకంటె మఱి యేదశలోను స్త్రీకెక్కువ గణ్యత కలుగదు. "అమ్మ" యను మాట సమస్తభాషలలోను మిక్కిలి శ్రావ్యతర మయినది; అంత కంటె మధుర మైన పదము వేఱొకటి లేదు. అదియే శిశువు మొట్ట మొదట నేర్చుకొనునది; మరణమువఱకును మఱవకుండునది. తల్లి యున్న చిన్న పేరున కర్హురాలు కాఁగానే యావఱి కెన్నఁడును నెఱుఁగ రాని సుగుణసంపద స్త్రీయందుఁ గానవచ్చును. తల్లియయిన తరువాత స్త్రీయొక్క ప్రేమ మఱింత యధికమును, పరిశుద్ధమును, ఫలసిర పేక్ష

మును అగును. పయికిఁ గానరాక లోపల నడఁగి యున్న యీమె స్వాభావికసద్గుణము లన్నియు నప్పుడు వికాసము నొందును. నాఁడు మొదలుకొని స్త్రీజనస్వాభావిక మయిన యీమెయబలత సుబలతగా మాఱును; ఆమె భీరుత్వము శూరత్వ మగును. నిర్మలప్రేమము, నిరంతరసహానము, నిరుపమానదృఢచిత్తత, బుద్ధివిశేషము, అప్పుడు ముందుకు వచ్చును. ఆమె మాతృవాత్సల్యము బయలుపఱుపని గుణ విశేష మేది యుండును! తల్లి శిశువునిమిత్త మెంత శ్రమము పడును! ఎన్నికష్టములు సహించును! ఎట్టి దుష్కరకార్యములకు సాహసించును! శిశువున కించుక రోగము వచ్చెనా తననుఖమును పాటింపక రాత్రి యనక పగలనక దినములకొలఁది ప్రతినిమిషమును విసుగు లేక మంచమువద్ద గనుపెట్టుకొని యుండి యెంత శ్రద్ధతో శిశువును గాపాడును! తల్లి తనబిడ్డప్రాణమును గాపాడుట కయి తనప్రాణము నిచ్చుటకైనను వెనుకదీయదుగదా! శిశువువిషయ మయి యుండ మును ఆళ వదలుకొన్నప్పుడును, ఆమె కాళపోదు; ఎవ్వరికిని భయము తోఁచనప్పుడు, ఆమెకు భయము తోఁచును. ఆహా! మాతృవాత్సల్య మెంతటి మహిమ గలది!

మంచి దయినపక్షమున కుటుంబమునందు తల్లియొక్క ప్రాబల్య మెంత యైనను మేలు చేయును. గృహమునకు శోభను, పరిశుద్ధతను, యశస్సును, శాంతిని తెచ్చునది తల్లి; గృహములోని యైకమత్యము నకును సంతోషమునకును మూల మగునది తల్లి. లోకములో మహా నీయు లైన మహాపురుషులయొక్క గొప్పతన మంతయు తల్లిమూల మునసే వచ్చుచున్నదని విద్వాంసు లభిప్రాయపడి యున్నారు. బిడ్డల యందలి ప్రేమకును, బంధువులయందలి ప్రీతికిని, బీదలవిషయ మయిన దానగుణమునకును, ఇటువంటివే యనేకము లయిన యితరసద్గుణము

లకును, ఆదికాలమునుండియు మనదేశపుస్త్రీలు నుత్రసిద్ధురాం డ్రయి
యున్నారు. నాకంటె సమర్థతరు లయినవారు పలువురు వర్ణించి
యుండిన దానికంటె నేనివ్వు డానుగుణముల నెక్కువగా వర్ణింప
జాలను. కేవల గుణవర్ణనము చేసి పొగడుటయు ఇచ్చట నాపని
కాదు. పలుమాఱు పొగడుచుండుటవలన గర్వము కలుగుట మనుష్యు
లకు సహజావము. గర్వమువలన నభివృద్ధికి భంగము కలుగును.
కాబట్టి నేనిక్కడ మనస్త్రీలలోఁ గల లోపములను సహితము గొన్ని
టిని దెలిపి, వానిని దిద్దుకొని బాగుపడుటకుఁ దగిన మార్గములను
నాబుద్ధికి తోఁచినంతవఱకు కొన్నిటిని జూపఁ బ్రయత్నించెదను. నేను
జెప్పినదానిలో గుణాంశ మున్నచో గ్రహింపుఁడు. తమ లోపములను
దాము తెలిసికొనుటయే వివేకుల లక్షణము. తాము తెలిసికొన్న లోప
ములను దిద్దుకొనుటయే తమ యభివృద్ధికిని లోకమెక్కు మేలున
కును హేతు వగును. ఇప్పుడు మనదేశములో సాధారణముగా
స్త్రీలలోఁ గల విద్యాభావమువలనఁ బయిని బేరొక్కొనిన నుగుణముల
వలన సహితము గొన్ని యనర్థములు పుట్టుచున్నవి. బిడ్డలయందలి
యతి ప్రేమచేత తిన్నఁగా నాజ్ఞ పెట్టకపోవుటవలన బాలు రనేకులు
చెడుచున్నారు; బంధువులయందలి యతి ప్రేమచేత చుట్టములను
జేర్చుటవలన ననేకులు పాటువడక సోమరు లగుచున్నారు; బీదల విష
యమునఁ గల యతిదానగుణముచేత పాత్రాపాత్ర విచారము మాని
దానము లొనర్చుటవలన పలువురు దృఢకాయులు బిచ్చగాం డ్రగు
చున్నారు. ఇటువంటి యనర్థము లనేకములకు మనకాంతలలోఁ గల
విద్యాశూన్యతనే బుద్ధిమంతులు ప్రధానకారణముగాఁ జెప్పు
చున్నారు. విద్యావివేకవతి యైనపన్నాతవలన బహుశుభములు గలుగు
నట్లే విద్యాగంధము లేని మూఢమాతవలన బహుదురవస్థలు పొంద

వించును. తల్లియేకదా గృహమునకు రాణి. అట్టితల్లియే విద్యావిహీ
నురా లయినపక్షమున గృహపరిపాలనమున కెట్లు సమర్థురా లగును?
తనకు జ్ఞానము చాలని యిల్లాలు తనబిడ్డల నెట్లు జ్ఞానాధికులను జేయు
జాలును? బిడ్డలను మంచిస్థితికిఁ దెచ్చుటయే తల్లియొక్క ప్రధాన
ధర్మము.

బిడ్డలను దృఢగాత్రులనుగాఁ జేయుట, సద్గర్తనము గలవారి
నిగాఁ జేయుట, జ్ఞానవంతులనుగాఁ జేయుట, ఈమూఁడును తల్లులకు
ముఖ్యకర్తవ్యము లనిచెప్పవచ్చును. బిడ్డలు దృఢగాత్రులుగా నుండుట
కయి వారిజననమునకు కారణభూతు లయిన జనకజనకులు మొట్ట
మొదట దృఢశరీరు లయి యుండవలెను. అతిబాల్య వివాహము
లత్యంత ప్రబలముగా నున్నయీదేశములో నట్టి భాగ్య మింతట
తటస్థింపనేరదు. అయినను తల్లు లితరవిధములచేత తమసంతతిని
పాధ్యమైనంత బలవదముగాఁ జేయవచ్చును. వాసగృహమును శుచిగా
నుంచుట, శుద్ధవాయుప్రసారము గలుగునట్లు చేయుట, స్నానపాన
ములకు నిర్మలజలము నుపయోగించుట, ఆరోగ్యకర మయిన యహా
హారమును పెట్టుట, పరిశుభ్రమయిన వస్త్రములను గట్టనిచ్చుట,
దేహపరిశ్రమము తగినంత కలిగించుట, మొదలయిన విషయములలో
తగినంతశ్రద్ధ చేసినపక్షమున శిశువులు దృఢదేహులగుటకు సందేహము
లేదు. అన్యదేశములకంటె మనదేశములో శిశువు లెక్కువగా పురుటి
దినములలోనే మరణము నొందుచున్నారు. అట్లుకాలమృత్యువువాత
బడక బ్రదికినవారును తఱుచుగా దృఢగాత్రులు గాక వ్యాధిపీడితు
లయి దుర్బలశరీరులగుచున్నారు. దీనికి ముఖ్యకారణము పురుటిండ్లలో
మంచివాయువును చొరనీయకుండుటయే. ఇటువంటి పెద్దపట్టణములలోఁ
గొంతవఱకు మంచిస్థితిలోనున్నను సామాన్యముగా నితరస్థలములలో

సూతికాగృహములు మిక్కిలి యిఱుకైన చిన్నగదులుగా నుండును; వానిలో ధారాళముగా గాలివచ్చుటకు చాలినన్ని గవాక్షములే యుండవు; ఉన్న తలుపులనైనను తెఱచి యుంచక ముసలమ్మలు మూసివేయుదురు; చూడవచ్చిన యమ్మలక్క లాచీఁకటిగదిలో గుంపుగుంపులుగా మూఁగియున్న గాలినిసహింపకము చెఱువుదురు; ఆపయిని కుంపట్లు పెట్టుదురు. ఇట్లు శుద్ధవాయువునకు గర్భశత్రువు లిన్ని యొక్కచోటఁ గూడినప్పు డాప్రసూతికాగృహములలోని మాతాశిశువులు బ్రతికి బయలఁబడుట వింతగాని మఱియొకవిధ మగుట వింతగాదు. దుర్గంధయుక్తమయిన యాగదిలో శిశువు గతించుట సంభవించెనా, నిజమయిన కారణమును కనుఁగొనలేక నొసటివ్రాత యట్లున్నదనియు, ఆయువులేదనియు, పూర్వజన్మపాపఫల మనియు ఎన్నెమ్మ నెత్తికొట్టిన దనియు, కల్పితకారణములను జెప్పికొని మనస్సమాధానము చేసికొందురు. దుర్గంధముచేత గదులలో పుట్టెడు పేడపురుగులను ఎన్నెమ్మలని చెప్పుదురు. తల్లులు విద్యావతు లయినఁగాని యీయసర్థ మెట్లు తొలఁగును? విద్యనేరనివాఁడు మంచితల్లి లెట్లగుదురు? మంచితల్లులులేక దేశ మెట్లభివృద్ధి చెందును? దేశాభివృద్ధి కేమి కావలయునని యొకరు ప్రశ్నవేయుఁగా, మంచితల్లులు కావలెనని పూర్వము నెపోలియ్ చక్రవర్తి యుత్తరము చెప్పెనఁట! విద్యావతులు గాని మూఢమాతలు తమబిడ్డలకు విలువబట్టలను దొడుగఁ జూతురు గాని విమల వస్త్రములను తొడుగఁజూడరు; బయల దిరిగిన పయిని పిట్టలు పాఱునని గదులలో మూసిపెట్టఁజూతురుగాని బిడ్డలను మంచిగాలిలోఁ ద్రిప్పఁ జూడరు; ఆఱవనెలనన్న ప్రాశనముచేయింపఁజూతురుగాని పాలుత్రాగింపఁ జూడరు. శిశువులకు రెండుసంవత్సరములు దాటువఱకును ద్రవపదార్థము లఱుగనుగాని అన్నము మొదలయిన ఘనపదార్థములు జీర్ణ

ములు కావు. అఱవనెలనే యన్న ప్రాశనము చేసి పప్పు ముద్దలు బల వంతముగా ప్రింగించుటయే కాక తల్లి భోజనము చేయునప్పుడు తల్లి యొద్దను తండ్రి భోజనము చేయుచున్నప్పుడు తండ్రియొద్దను తాము తిను నదియెల్ల ప్రింగఁ బెట్టుచు వచ్చినచో తిన్నది యఱగించుకోలేని శిశువు లెట్లు దుర్బలులు కాకుండ నేర్తురు? ఇట్లు శిశువులు దుర్బలు లగుచున్నను విచారము నొందక విద్యావిహీన లై మానినులు తమకువలెనే తమ బిడ్డలకును దేహములనిండ నాభరణముల నుంచఁ జూతురు. దేహమున కారోగ్యమే యమూల్యాలంకారము గాని లోహపుతొడవు లలంకారములు గావు. మూఢురాండ్రు మాత్రమే తమ నగలను జూచుకొని విశ్వము మఱచి గర్వపడుదురు. ఈవిష యమున మీకొక్కచిన్నకథ చెప్పెదను. ఇటలీదేశమునందు "కార్నీలియా" అనుపేరు గల యొక యుత్తమమాత యుండెను. ఆమెను జూచుట కయి యొక ప్రభువుభార్య యొకనాఁ డామెయింటికిఁ బోయి తన నగలను జూచుకొని సంతోషించుచు గర్వముతో "ఏవీ? నీనగలు నాకు చూపుము" అని యడిగెను. "ఒకనిమిషము తాళుము. చూపెదను" అని పలికి, బడినుండి రాఁగానే దృఢసుందరగాత్రు లయిన తన యిరువురు బిడ్డలను గొనివచ్చి యామెముందు నిలిపి "ఇవిగో! నా యమూల్యాలంకారములు చూడుము." అని చూపెను. ఆప్రభు భార్య తన యవివేకమునకు సిగ్గుపడి యింటికిఁ బోయెను. ఈ దేశము నందలి సుందరీమతల్లు లయిన తల్లులెల్ల తా మిటువంటి యమూల్యా భరణములను లోకమునకుఁ జూపఁ బ్రయత్నింతురుగాక!

ఈవఱకును బిడ్డల నారోగ్యవంతులనుగాఁ జేయవలసిన ప్రథమ ధర్మములను గూర్చి కొంత చెప్పితిని. ఇఁక వారిని సద్వర్తనము గల వారినిగాఁ జేయవలసిన రెండవ మాతృధర్మమును గూర్చి కొంత

ముచ్చటించెదను. వరుసనుబట్టి దీనిని రెండవ ధర్మమునుగాఁ జెప్పి నను గుణగౌరవమునుబట్టి యిదియే ప్రథమధర్మ మని చెప్పవచ్చును. తల్లులు నడచినట్లు పిల్లలు నడుతురు. తల్లినిజూచి పిల్లను గ్రొత్తనవలె నన్నసామెత మీరందఱును విన్నదేకదా! కాఁబట్టి పిల్లలను సద్వర్త నము గలవారినిగాఁ జేయుటకు ముందుగా తల్లులు తాము సద్వర్త నము కలవారు కావలెను. తల్లి శాంతస్వభావయు, మృదు భాషిణియు, సత్యవ్రతయు, అయినయెడల బిడ్డలు నట్లే యగుదురు. అట్లుగాక యామె కోపశీలయు, పరుషభాషిణియు, అసత్యవాదినియు, అయినచో బిడ్డలు సహిత మట్టివారే యగుదురు. తల్లియొక్క దినవర్త నమే బిడ్డలకు దినపాఠముగా నుండును. ఉపాధ్యాయులు నూరుగురి కంటెను నొక్కనన్నాత యెక్కువ విలువ చేయును. తల్లి యజ్ఞానము వలనను దుర్వర్తనములనను పాడయిన పుత్రుని వేవు రుపాధ్యాయు లయినను బాగుపఱుపఁజాలరు. తల్లి దురాగ్రహము కలది యయిన బిడ్డలు కోపిష్టు లగుదురు; తల్లి దుర్భాషలాడునది యైన బిడ్డలు తిట్టు బోతు లగుదురు; తల్లి కల్లలమారి యయిన బిడ్డలు కల్లరు లగుదురు; ఖవి యవి యని వేఱుగ జెప్పనేల? తల్లులయం దేయే యవలక్షణము లుండునో బిడ్డల కాయాయవలక్షణములు పట్టుపడును. కాఁబట్టి బిడ్డల మేలుగోరు మాత లందఱును స్వప్రవర్తనవిషయమున మిగుల జాగ రూకురాం డ్రయి యుండవలెను.

జనని తన శిశువునకు నేర్పవలసిన మొదటి సుగుణము విధే యత. విధేయతలేనిచో నితరసుగుణములు పట్టుపడవు. శిశువులు ప్రతి విషయములోను తల్లి యాజ్ఞకు పరమవిధేయు లయి నడుచుకొను నట్లు చేయవలెను. తమ మనసు వచ్చినట్లు చేయఁగూడ దనియు, తా మెవ్వఁడును తల్లిదండ్రులకు లోఁబడి వారు చెప్పినట్లు చేయవలయు

ననియు, బిడ్డలు గ్రహించినట్లు చేయవలెను. ఆలోచన లేని బిడ్డ లొక ప్పుడు తల్లి చెప్పినట్లు చేయక తమ యిచ్ఛవచ్చినట్లు చేయఁజూతురు. అట్టి సమయములయందు పిల్లలపంతము గెలువనియ్యక, ఆవశ్యక మయినచో దండించియైనను జనని తన యాజ్ఞాప్రకారముగా వారు నడుచునట్లు జేయవలెను. ఒకసారి వారిమాట సాగనిచ్చిన పక్షమున పిల్లలు తల్లులమాట వినక తిరుగఁబాటు చేయుచుందురు. తమమాట సాగదని పిల్ల లొకసారి దృఢముగా తెలిసికొన్నయెడల తరువాత వా రెన్నఁడును తల్లిదండ్రుల యాజ్ఞను మీఱక విధేయులయి వర్తింతురు. కొందఱు తల్లులు బిడ్డలు తమమాట విన రని చెప్పుదురు. అట్లయి నచో నది స్వయంకృతాపరాధమే కాని వేఱు కాదు. తల్లి శిశువుల కొకయాజ్ఞ యిచ్చు నప్పుడు వారది చేయఁ దగినదియు, చేయక నిరాకరించినప్పుడు తాను వారిచేత చేయింప నిశ్చయముగా తలఁచు కొన్నదియు, అయిన యాజ్ఞనే యియ్యవలయును. వా రది చేయనిచో నుపేక్షించి యూరకుండఁ దలఁచుకొన్నయాజ్ఞ నెప్పుడు నియ్యఁగూడదు. ఒకసారి చేయఁగూడ దన్న పని వారప్పుడు మానివేసి మఱియొక సారి చేసినను తల్లి యుపేక్షించి యూరకుండ గూడదు. అట్లూర కుండుటకంటె నవిధేయతను నేర్పుటకు బలవత్తర మయిన మార్గము లేదు. ఇట్టి యుపేక్షామూలమున నలవాటు పడినకార్యమును మాన్పు టకు తరువాత బతిమాలుకొనుట గాని బెదరించుటగాని పనిచేయదు. ఇచ్చినయాజ్ఞను బిడ్డలు వెంటనే చేయునట్లు చేయవలెను. ఎందుచేత చేయవలె నని వారి నడుగనియ్యఁ గూడదు; ఆయాజ్ఞను చెల్లించు టకు వారిని భయపెట్టుటగాని లంచమిచ్చుటగాని కూడదు; వారు తన్నే లక్ష్యము చేయునట్లు చేయవలెనుగాని, చేయక పోయినచో నాయనతోఁ జెప్పికొట్టించెద ననఁగూడదు. బిడ్డలు తలిదండ్రుల

కిద్దరకును సమానముగానే విధేయులు కావలెను. ఈవిధేయతను తల్లి శైశవమునుండియు నేర్పవలెనుగాని, తరువాత నేర్పుట సాధ్యము కాదు. బిడ్డలకు విధేయత సభ్యాసము చేయించినచో సమస్తసుగుణములను సులభముగా నేర్పవచ్చును.

ఉత్తమురా లయినమాత్ర తా నసత్యము నెప్పుడును పలుక కుండవలెను. లోకములో నసత్యమును మించిన పాపకార్యము వేఱొకటి లేదు. తల్లి యెప్పుడును బిడ్డలను సత్యము పలుకునట్లు ప్రోత్సాహపఱుపవలెను. అమెరికాఖండములోని "యూనైటెడ్ స్టేట్సు" నకు మహోపకారముచేసి మహోన్నతస్థితిని బొందినజార్జి వాషింగ్టన నునాతఁడు పసివాఁడుగా నున్నప్పు డతని కొకరు పోట కత్తిని బహూనూనము చేసిరి. ఆబాలుఁడు కత్తిదొరకిన దన్నసంతో షముచేత తోఁటచొచ్చి చెట్లకొమ్మలను నఱకుచు, తనతండ్రి ప్రాణ పదముగా పెంచుకొనుచుండిన యొకపూలమొక్కను మొదలంట నఱికివేసెను. తండ్రి మఱునాఁడు వాడుకచొప్పున తోఁటకుఁ బోయి చూచునప్పటికి తనప్రియ మైనచెట్టు ఖండింపఁబడి చచ్చి పడి యుండెను. అది చూచి యాతఁడు ఖిన్నుఁడయి యాపని తన తోఁటవాండ్రెవ్వరో చేసియుందు రని వారిమీఁద కోపపడుచుండెను. ఆసమయమునందు కత్తి చేతఁ బట్టుకొని యాబాలుఁ డక్కడకు వచ్చెను "ఈచెట్టెవ్వరు నఱికినారో యెఱుఁగుదువా?" అని యతఁడు కుమారుని నడిగెను. ఆబాలుఁడు క్షణ మూరకుండి తండ్రికోపమును జూచియు భయపడక "నానోటినుండి యసత్యము రాదు. నేనే నఱికి తిని." అని నిశ్శంకముగా పలికెను. అప్పుడు తండ్రి వెంటనే కోప మును శాంత పఱుచుకొని "వెండిపూవులును బంగారుపండ్లును గల వేయిచెట్లకంటెను సత్యమొక్కఁడ విలువగలది" అని పలుకుచుఁ

బోయి కుమారుని కౌగిలించుకొనెను. ఆబాలుని తల్లియు సుగుణ సంపదయందు తండ్రికి తీసిపోవునది కాదు. తండ్రి బాల్యమునసే లోకాంతరగతుఁడు కాఁగా తల్లియొక్కశిక్షవలననే యాబాలుఁడు మహనీయుఁడయి మహోన్నతదశనుబొందెనని చరిత్రకారులు వ్రాసి యున్నారు. ఇట్టితల్లిదండ్రులనేకులు కలిగినప్పుడుగదా దేశ మున్నత స్థితికి వచ్చును! బాలుఁడు తాను జేసిన తప్పిదము నొప్పుకొని పరి తాపపడినచో దండింపక క్షమించి సత్యమును ప్రోత్సాహపఱుప వలెను. విద్యావిహీనురాండ్రయిన యువివేకినులు కొందఱు తాము కల్లలాడి బిడ్డలకు కల్లలు నేర్పుదురు. బిడ్డలు తప్పు చేసినప్పుడు కప్పిపుచ్చఁ జూచుట, వారి తప్పులను మఱుఁగుపఱుపఁ జూచుట, నేరము చేయ నట్టితండ్రితోఁ జెప్పుఁడని బోధించుట, వారిచే నొక కార్యమును జేయించుట కయి యసత్యములు పలు కుట, ఇవి బిడ్డలకు బొంకులు నేర్పెడుమార్గములు. ఇటువంటి పనికి మాలినప్రేమవలనను, బుజ్జగింపులవలనను, బిడ్డలు పాడగుదురు. ఇట్టి తల్లి బిడ్డలకు శత్రువుగాని ప్రేమ చూపునది కాదు. తప్పు చేసినప్పుడు దండించుటయే బిడ్డలయెడలఁ జూపవలసిన నిజ మయినప్రేమము; అదియే వారికి శ్రేయస్కరము. మందు మ్రింగించుటకయి చేదు మందు తీయమందని బొంకి యొకసారి వంచింపఁగలిగినను, బిడ్డఁడు తోడనే సత్యమును దెలిసికొని తల్లిమాటయెడ గౌరవము చెడినవాఁ డయి నిజముచెప్పినను నమ్మకుండును. శిశు వొకయద్దమును ముట్ట బోయినప్పుడు వలదని యాజ్ఞాపింపక ముట్టుకొన్నచో బూచి కఱచు నని వంచించి మాన్పించినచో వంచనమును శీఘ్రముగానే తెలిసికొని తల్లియెడల గౌరవము లేనివాఁడును అవిధేయుఁడును అగును. కాఁబట్టి యసత్యము లాడియు, వంచించియు, శిశువులచేత పని చేయించుటకు

తల్లు లెవ్వాడును బ్రయత్నింపరాదు. లంచములు చని చూపియు చెప్పినవనిని చేయునట్లు బిడ్డలనొడఁబఱుపరాదు ఒకపని చేయుట కయి యొకసారి పండో భక్ష్యమో యిచ్చినయెడల రుచిమరగినవా రయి యేవని చేయవలసి వచ్చినను లంచ మడుగుచు, ఇయ్యనిచో చేయక నిరాకరించి యేడ్చుచు, అనిధేయత కలవాటు వడుదురు.

కొందఱు మూఢవనితలు తమబిడ్డలు తప్పుచేసినప్పుడు ముద్దుచే దండింపక నవ్వుచు నూరకుందురు? కొంద ఱతిప్రేమచేత బిడ్డలను యథేచ్ఛముగా నడవనిచ్చి వారితప్పిదములనే గ్రహింపఁజాలరు; కొందఱు గ్రహించినను, అవి చిన్నతనవుచేష్టలని పలుకుచు నుపేక్షించి తప్పు చేసినవారినే నిందింతురు. ఇట్టివా రందఱును దమయుపేక్ష వలన బిడ్డలు చెడిపోయి పెద్దవారయి దుష్టు లయినప్పు డాఫలము ననుభవించుచు ననుతాపపడవలసినవా రగుదురు. అనేకులు తను బిడ్డలు చక్కనివా రయినప్పుడును, దుర్బలు లయినప్పుడును, పలు వురు వచ్చి చచ్చినప్పుడును, ఏకవుత్తుఁ డయినప్పుడును, గారాబము చేత నిట్టి యుపేక్ష చేయుదురు. కొంద ఱిట్టివి స్వల్పాంశము లను కొన్నను, వానివలనఁ గలుగు చెడుగు మాత్రము స్వల్పము కాదు. ఇట్టి స్వల్పాంశములే యభ్యాసము లయి కాలక్రమమున పెరిగి దుర్వృత్తికి దింవును. కాఁబట్టి స్వల్పాంశములలో సహితము జాగరూకత వహించి తప్పెంత చిన్నదిమైనను ప్రారంభములోనే మాన్పఁ బ్రయత్నింప వలెను.

తప్పెప్పుడు చేసినను, ఎంత చిన్నతప్పయినను, తగినశిక్ష చేయవలెను. చేసినశిక్ష కఠిన మయినదిగా నుండక యపరాధనివార ణమునకుఁ జాలినంత యల్పమయినదిగా నుండవలెను. ఒకసారి బిడ్డ వంక కోపదృష్టితో చూచుటయే చాలి యుండును; ఒకప్పు డొక

చిన్నమాటయే చాలి యుండును; ఒకమాఱు కొంచెము మందలింపు చాలి యుండును; ఒకసమయమున నొకతిట్టు చాలియుండును; పీనిలో వేనివలనను బ్రయోజనము లేక శిశువు చేసిననేరమునే మరలఁ జేసినప్పుడుమాత్రమే యొకదెబ్బ కావలసియుండును. చేసిననేరము బుద్ధిపూర్వము గాక ప్రమాదజనిత మయినపక్షమున దండింపనే కూడదు. బిడ్డలస్వభావమునుబట్టికూడ దండనము వేఱువేఱువిధముగా నుండవలెను. సాధుస్వభావము గలవారికి నించినమాటలే చాలును; దుష్టస్వభావము గలవారికి గొంచెము కఠినముగా ప్రవర్తింపవలసి యుండును. నేరముల స్వభావమునుబట్టియు దండనము మాఱుచుండ వలెను. బంతితో సోదరునిఁ గొట్టినయెడలఁ బంతిని లాగుకొనుటయే శిక్ష; అజాగ్రత్తవలన నొకవస్తువును పోఁగొట్టుకొన్నయెడల, మరల దానిని గొని యియ్యకుండుటయే శిక్ష; ఇంకొకవస్తువును పాడు చేసినయెడల, వానివస్తువు నొరున కిప్పించుటయే శిక్ష; పిల్ల లొండొరులతో కలహ మాడినయెడల, మరలఁ గలసి యాడుకోకుండ దూరముగా నొలఁగించుటయే శిక్ష. అతిక్రూరతనలనను, అతిప్రేమము వలనను కూడ బిడ్డలు చెడుదురు గాన దండించుటలోను దయ చూపుటలోను హద్దు మీఱకుండవలెను. బిడ్డలను పలుమాఱు దూషించుచుండను గూడదు; భూషించుచుండను గూడదు; ప్రతి స్వల్పవిషయమునకును తిట్టుచున్నను మెచ్చుకొను చున్నను వానివిలువ తగ్గిపోవును. అట్లని బిడ్డ లెంతటి శ్లాఘాపాత్ర మయినపని చేసినను మెచ్చుకొనఁగూడదని నాయభిప్రాయము కాదు. బిడ్డలేదియైనను మెచ్చఁదగినవిశేషకార్యమును జేసినప్పుడుమాత్రమే విశేషాదరమును జూపి శ్లాఘింపవలెను. అటువంటిసమయములలో జనని యొక్కసారి కాఁగిలించుకొన్నను ముద్దు పెట్టుకొన్నను సత్కార్యాచరణమం దది

బిడ్డల కెంతో యుత్సాహకరముగాను సంతోషదాయకముగాను
ఉండును. ఒకప్రసిద్ధుఁడయినచిత్రకారుఁడు తనతల్లిముద్దే తన్నంత
వానిఁగాఁ జేసెనని వ్రాసి యున్నాఁడు. చదువు మొదలయినవాని
యందు విశేషపరిశ్రమమును చాతుర్యమును జూపినపక్షమున బిడ్డలకు
బొమ్మలు పుస్తకములు మొదలయినవి బహూనూనము చేయుట
మంచిదిగాని మధురాహారములు, ఫలములు, రొక్కము, ఇచ్చుట
యంత మంచిది కాదు. లడ్డువలు మొదలయినవి తఱుచుగా నిచ్చుచు
వచ్చినచో బిడ్డలు తిండిపోతు లగుటయే కాక యారోగ్యహీనులుసహిత
మగుదురు.

ఎవ్వరియందును బక్షపాతము చూపక యందఱిని సమాన
ముగాఁ జూచుచు తల్లి బిడ్డలకు న్యాయవర్తనము నేర్పవలెను. తమ
వస్తువు లితరులు తీసికొన్నప్పుడు తమ కెంతదుఃఖము కలుగునో యట్లే
యితరులవస్తువులు తాము తీసికొన్నప్పుడు వారికిని నంతదుఃఖను
కలుగునని బోధించి బిడ్డ లితరులవస్తువుల కాసింపకుండునట్లు చేయు
వలయును. బిడ్డ లొండొరులపై దయచూపునట్లును, స్వప్రయోజన
పరత్వమును విడుచునట్లును జేసి శైశవమునందే పరోపకారబుద్ధిని
బుట్టింపవలెను.

మూఢస్త్రీలలోఁ గలదుర్గుణ మొక్కటి యీసందర్భమునఁ
జెప్పవలసి యున్నది. కొందఱు వేడుకకొఱకు బిడ్డలకు తిట్లు నేర్పి,
వారిచే నితరులను దిట్టించి యానందింతురు. ఇది యెంతయు దూష్య
మయిన పని. బిడ్డలకు అమ్మను తిట్టు, నాయనను కొట్టు, అని
బద్ధులు నేర్పు తండ్రియు తల్లియు తాము వహించిన యాపవిత్ర
నామముల కగౌరవము తెచ్చువారని వేఱె చెప్పవలయునా? యోగ్య

లయిన తల్లిదండ్రు లెప్పుడును మోటుమూట తమనోట వెడలనియ్యరాదు; నోటినుండి పరుషోక్తి వెడలినచో బిడ్డలను మందలించుచు ఒండొరులను తిట్టుకొనకుండునట్లు చేయుచు, వా రాటలయందు సహితము మృదుత్వము తప్పినమాట లాడుకొనకుండునట్లు చేయవలెను.

తన బిడ్డలను జ్ఞానవంతులనుగాఁ జేయుట తల్లియొక్క మూడవ ధర్మము. తల్లి విద్యావతియైనఁ గాని బిడ్డలను విద్యావంతులనుగాఁ జేయఁజాలదుగదా. మంచితల్లి బిడ్డల కుగ్గుపాలనుండియు సమస్తవిషయములలోను జ్ఞానమును గఱపుచుండును. బిడ్డల శ్రేయస్సు గోరిన తల్లి యీశ్వరభక్తియు పాపభీతియు మొదటినుండియు వారికిఁ గలిగించుచుండును. బిడ్డలను చనుబాలతోఁ గూడ భగవద్గుణామృతమును త్రాగింపవలె నని యొకానొకరు వ్రాసియున్నారు. బాలురకు విద్య కూడ దనవారు లేక పోయినను బాలికలకు విశేషవిద్య యక్కఱ లేదనువా రిప్పటికిని విద్యాధికులలోనే కొంద ఱందందుఁ గానఁబడుచున్నారు. విద్యాగంధము లేనివారికిఁ బుట్టి వారిచేఁ జెంపఁబడిన వారికంత చదువుకొన్నను చిన్ననాటివాసన బొత్తిగా పోనేరదు. పురుషులకు వలెనే స్త్రీలకును విద్య సర్వశుభప్రద మనుట నిర్వాదాంశము గనుక స్త్రీలకువిద్య యావశ్యకమని యిచ్చటఁ జర్చింప వలసిన పనిలేదు. బాలురకువలెనే బాలికలకును విద్య సమానముగాఁ జెప్పింపవలెను. బాలునికి విద్య నేర్చుటవలన విద్యాసంపన్నుఁడొక్కఁడే కలుగుననియు, బాలికకు విద్యనేర్చుటవలన విద్యాసంపన్నమైన కుటుంబము కలుగు ననియు నొక బుద్ధిమంతుఁడు నుడివియున్నాఁడు. ఒకవిధమునఁ జూడఁగా పురుషులవిద్యకంటె స్త్రీల విద్యయే యొక్కువ యుపయోగకర మయినట్లు కనఁబడుచున్నది.

విద్యాభావములవలననే మనలోని స్త్రీ లిప్పుడు శిశువులను చక్కఁగా పెంచఁజాలకయు, సమయానుగుణముగా భర్తలకు హితము చెప్ప నేరకయు, నద్విషయములయందు కాలము వుచ్చఁ జేతఁగాకయు, జగడములతోను పరదోషకథలతోను పనికిమాలిన యుపవాసముల తోను, నోములతోను, వ్రతములతోను, మూఢవిశ్వాసములతోను కాలము గడువుచున్నా రని తెలిసినవారు చెప్పుచున్నారు. స్త్రీలు విద్యావతు లయినచో నిట్టిదోషములన్నియు తొలఁగి దేశము బాగు పడుననుటకు సందేహము లేదు.

గృహమునకు తల్లియే రాణియనియు, అందుచేత నామె సాధ్య మైనంత యధిక విద్యావతిగా నుండవలె ననియు, ఈవఱకే చెప్పి యున్నాను. లోకములో నధిక విద్యావతు లైనతల్లులుమాత్రమే యుత్తమమాత లగుదురు. విద్యాగంధము లేనిమూఢురా లెట్లు గృహమునకు రాణియయి కుటుంబపరిపాలనము చేయఁగలుగును? శిశు పరిపాలనము ప్రజాపరిపాలనమునకంటె సులభమయిన పని కాదు. తల్లి శిశువులయొక్క గుణశక్తిసామర్థ్యములను గ్రహించి, వారిలో నేది ప్రబలమో యేది దుర్బలమో, వారి యాధిక్యము లేమో న్యూనత లేమో, వారి కేవిషయమున సాయము కావలెనో యేవిషయమున అసహాయకార్యనిర్వాహకశక్తిగలదో, తెలిసి తగినట్లు నడపుట విద్యా వతికిఁగాక యితరులకు సాధ్యమగునా? సన్మాత సాధున్వభావము కల దయ్యును దృఢచిత్తత కలదిగా నుండవలెను; వాగ్మాధుర్యమును మృదువర్తనమును దయార్ద్ర హృదయమును గల దయి బిడ్డలమనస్సు లను దనవంక కాకర్షింప శక్తికలదిగా నుండవలెను; ధర్మమును పరిగా గ్రహించి యోర్పుతో ననునరించునదిగా నుండవలెను; శా

నెప్పుడు లోఁబడవలెనో యెప్పుడు ప్రతిఘటింప వలెనో, ఎప్పుడు పట్టు విడువవలెనో యెప్పుడు బిగింపవలెనో యెఱిఁగిన దయి తాను నేర్పుట లోను నేర్చుకొనుటలోను శ్రద్ధకల దయి యుండవలెను; త్వరపడక కార్యాంశమును చక్కఁగా నాలోచింపఁ గలదిగాను, నునిశ్చిత మయిన కార్యమును యుక్తసమయమున నేర్పుతో నడుపఁగలదిగాను, కోపము నడఁచుకొని నిశ్చలచిత్త కాఁగలదిగాను, ఉండవలెను; బిడ్డల యాటలలో తానును శ్రద్ధ చూపుచు, ఆటలలోనే వినోదకరముగా పాటును నేర్పుచు, పాటును వారికి హృదయాకర్షకముగాఁ జేయ వలెను; కసరక బిడ్డలు చెప్పినదానినెల్ల నత్యాదరముతో విని తగిన యాలోచన చెప్పుచు, వారిని మంచికిఁ బ్రోత్సాహపఱుచుచు, పరోప కార బుద్ధికలవా రగునట్లు చేయువలెను; తన ముందట బిడ్డలు తమ మనస్సులను స్వేచ్ఛగా విప్పి చెప్పునట్లు దయతో వర్తించి వారి విశ్వాసమునకు పాత్రురాలు కావలెను; బిడ్డలు తనయందు పరిపూర్ణ విశ్వాస ముంచునట్లు నేర్పి, తాను వారివిశ్వాసమున కర్హురాలగు నట్లుగా వర్తింపవలెను; సమస్తవిషయములలోను బిడ్డల గౌరవమును వలెనే వారియనురాగమును సమాకర్షింపవలెను; అన్నిటికంటెను ముఖ్యముగా బిడ్డలయం దవ్యాజప్రేమను జూపుచుండవలెను. ప్రేమయే సమస్తమును పవిత్రముచేసి, సమస్త విషయములలోను విజయము కలిగించునది. తల్లియొక్క ప్రేమమే పిల్లలను సదా సుఖ వంతులనుగాఁ జేయునది.

GRACE DARLING.

గ్రేస్ డార్లింగు కన్య.




తీవ్రభంజనము క్రూరముగా వీచుచు తరంగములు తాళ
ప్రమాణములుగా లేచుచు నల్లకల్లోలముగా నున్న సముద్రమున కంటె
నధిక భయంకర మయినది వేరొకటి యేదియు లోకములో గను
పట్టదు. మహావాత్యలు విజృంభించి సముద్రతరంగముల నాకాశపథ
మున కెగయించుచుండగా; కాలమేఘములు కాటుక్రమ్ముకొని

సూర్యరశ్మి నడఁచి యుఱుములతోను మెఱుపులతోను సంతత ధారగా జడివాన కురియుచుండఁగా, దారునిర్మితనగరము లననొప్పు మహానౌకలు సహితము స్వవశములు గాక ప్రచండమారుతాధీనము లయి పూరిపుడకలవలె మహార్ణవమధ్యమున నిటునటు సంచలించు చుండఁగా, బాల్యావస్థనుండియు సముద్రయాత్రలయుం దాజితేఱి గాలివానల కలవాటుపడి యోడలు గడప సమర్థు లయిన ప్రౌఢ నావికులును సముద్రము పయి నడుగిడ భయపడుచుండఁగా, అటు వంటి సంక్షోభసమయమునం దల్పవయస్కురా లయిన యొక యబల స్వప్రాణములను సరకుగొనక వరప్రాణరక్షణార్థమై యొకచిన్నవడ వలో నెక్కి సముద్రసంచారమునకు వెడల సాహసించె ననుట యసే కుల కూహింపను విశ్వసింపను రాని యద్భుతకథగాఁ దోఁపవచ్చును. అయినను గ్రేస్ డార్లిం గనెడుకన్యకామణి యొకతె నిజముగానే యిట్టి ఘనకార్యమును నిర్వహించినది.

మన కథానాయిక యైన గ్రేస్ డార్లింగు 1815 వ సంవత్స రము నవంబరు నెల 24 వ తేదీని జనన మొందినది. ఆమె తండ్రిపేరు విల్లియమ్ డార్లింగు. ఆమె యాతని కేడవబిడ్డ. ఆతఁ డింగ్లండు దేశములోని నార్తంబ్రియా మండలమునకు తూర్పువైపున నున్న సముద్రమునందలి ఫారన్ ద్వీపములలో నొకటియైన "లాంగుస్టోన్" ద్వీపమునందుఁ గట్టఁబడిన దీపగృహమునకు రక్షకుఁడుగా నుండెను. దీనిం జదువువారికిఁ గొందఱికిఁ దీపగృహ మన నేమో తెలిసియుండక పోవచ్చును. సముద్రమునం దోడలు నడవువారికి రేవుస్థలము లేవో, తాము తప్పించుకొని దూరముగాఁ దొలఁగవలసిన యపాయస్థలము లేవో, తెలువుట కయి సముద్రతీర పట్టణములయందును ద్వీపముల యందును స్తంభములవలె రాతితో మహోన్నతముగా నిర్మింప

బడి, శిఖరములయందు సముద్రముపైని బహుదూరము వరకును గవఁబడునట్లుగా దీవము లుంచుట కయి యద్దపుటిండ్లు కట్టఁబడిన గోపురములు దీపగృహము లనఁబడును. చెన్నపట్టణము, కాకినాడ మొదలయిన రేవుస్థలములకుఁ బోవఁ దటస్థించినవా రీ దీపగృహములను జూచియుండవచ్చును. దీపగృహమొకొ స్వరూప మిఁకఁదివట మునఁ జూపఁబడి యున్నది.—



ఈ ఫారన్ ద్వీపములు నిర్మానుష్యము లయినవంధ్యప్రదేశము ములు; ఇవి శిలామయములై చెట్టుచేమలు లేనివిగా నున్నవి. ఈప్రాంతమునందలి సముద్రము మిక్కిలి యపాయకర మయినది. సముద్ర మిక్కడ సర్వదా తరంగాకుల మయి, పాటువేళ సంఖ్యయుం దిరువదింటి కంటె నెక్కువగా నుండెడు యీద్వీపముల నడుమను వడిగాఁ బాఱుచుండెడి ప్రవాహములు గల దయి, యున్నది. అనేక నౌక

లిచ్చట మునిఁగిపోవుచు వచ్చినవి. నూటయేఁబది సంవత్సరములకు మునుపు నలువది ఫిరంగులు గల డచ్చివారియోడ యొక్కటి యీదీవులలోఁ జిక్కుకొని నావికజనసహితముగా నడు గంటి నశించినది. 1782 వ సంవత్సరమునం దమెరికాఖండమునుండి తిరిగివచ్చుచుండిన వర్తకులయోడ యొక్కటి యిక్కడ ఖండఖండములుగా పగిలిపోయెను. 1823 వ సంవత్సరము జనవరిఫిబవరి నెలలలో నాలుగైదోడ లీనమీవమున సముద్రముపా లైనవి. ఇట్టియపాయములను బట్టి యిచ్చటదీవ గృహాముమిక్కిలి ముఖ్యమయినదయినందున, దానికి పాలకుఁడుగానుండువాఁడు సమర్థుఁడునుబుద్ధికుశలతయు జాగరూకతయుఁగలవాఁడును నయియుండవలసి యుండెను. అట్టియోగ్యత లన్నియుఁ గలవాఁ డగుటచేత విల్లియమ్ డార్లింగు దీనికి రక్షకుఁడుగా నియమింపఁబడెను. ఇతఁడు స్వకృత్యనిర్వహణమునందు నిపుణుఁ డయి జాగరూకుఁడయి యుండుటయే కాక యవకాశము చేసికొని తనబిడ్డల విద్యాబుద్ధులవిషయమును ననుశ్రద్ధాళువయి పాటుపడుచుండెను. అందుచేత నీతనిబిడ్డ లందఱును సామాన్యముగా విద్యావంతులయి యుండిరి. మకథానాయిక యైన గ్రేస్ డార్లింగు సదా శాంతస్వభావమును ముఖవికాసమును గలదయి మితభాషిణియు పరోపకారశీలయు నయి యుండెను. ఆమె మిక్కిలి నూత్నబుద్ధి గలదయి చక్కగా వ్రాయుటకును చదువుటకును నేర్చినది; ఆమె యావఱి కెన్నఁడును పడవను నడుపుటలో తండ్రికి సాయముజేయ నలవాటు వడి యుండినది కాదు. గృహకృత్యము లన్నియు నీమెతల్లియే చక్కఁబెట్టు చుండెడిది. ఇట్లుండఁగా నీమె నాకస్మికముగా లోకప్రసిద్ధురాలినిగాఁ జేసినవృత్తము 1838 వ సంవత్సరము సెప్టెంబరునెల యేడవతేదిని జరుగుట తటస్థించెను. అప్పటి కామెప్రాయ మిరువదిరెండు సంవత్సరములు.

1838 వ సంవత్సరము సెప్టెంబరునెల 5 వ తేది సాయంకాలము "పోర్ట్ ఫార్ పైర్" అను ధూమనౌక హోల్ నగరమును విడిచి బైలు దేఱెను. 'జాన్ హంబుల్' అను నతఁడు దానికి నాయకుఁడుగా నుండెను. ఆపొగయోడయందు విశేషముగా వెలువగల వాణిజ్యపు సరకులును గదులు పుచ్చుకొన్నట్టియు పయినున్నట్టియు పథికులును నుండిరి. గదులలో నున్నవా రిరువదియిద్దరును పయినున్నవారు పందొ మ్మండ్రును, పథికులు నలువది యొక్కరును, ఓడనాయకుఁడును భార్యయు నిరువురును, నావికులును యంత్రకారులును బొగ్గువేయు వారును గలసి యిరువండ్రును, అందఱును జేరి యవ్వు డాయోడలో నఱువదిమువ్వురు జను లుండిరి. రెండు సంవత్సరముల క్రిందటనే కట్టఁ బడిన దగుటచేత నోడ క్రొత్తదేకాని దాని యావిరి నీటిబానలును యంత్రములును మాత్రము మంచిస్థితిలో నుండలేదు. గురువారము నాఁటిరాత్రి యావిరినీటి యిరుపబానలనుండి నీఱు కార నారంభించెను. గొట్టములతో నీరెక్కించి యెంతప్రయాసపడినను, నీ రంచు నిలువలేదు, నాటిరాత్రి 12 గంటలలోపలనే గాలి యధికమయి సముద్రమెంతో యెత్తునకు లేచెను; 12 గంట లగునప్పటి కది గొప్ప గాలివాన యయ్యెను. ఆవిరి నీటిబానలలోని నీరు కాఁజొచ్చుచుండఁగా యంత్రము పనిచేయక నిలిచిపోయి చక్రము లాడుట మానివేసినంతన ఓడ కర్ణధారునికి వశము గాక ప్రవాహమును గాలియు నీడ్చినట్లెల్లఁ బోవఁ దొడఁగెను. ఓడలోనుండిన యాత్రికుల యంతరంగములు భయాకులములయినందున నెల్లవారును దిగ్భ్రమనొంది ప్రాణములమీఁది యాశ వదలుకొని గొల్లున గోలపెట్ట మొదలుపెట్టిరి. ధూమనౌక గట్టు వంకఁ గొట్టుకొనిపోవుచున్నట్టు పొడకట్టినందున నోడనాయకుఁడు మనసు చెదరనీయక ధైర్యమవలంబించి తెరచాప లెత్తించి పుర

లింపఁ బనిచేసెను గాని యాతనికృషి విఫల మయ్యెను. ప్రవాహము దక్షిణపువైపునకు బలముగాఁ బొఱుచున్నందున నిరాధార మైన యా యోడ దానిలోఁ బడి కొట్టుకొనిపోయి తుదకు విఱిగెడి భంగములలోఁ బడెను. ఫారన్‌ద్వీపములలోని దీపగృహముయొక్క వెలుతు రెదుట స్పష్టముగాఁ గనఁబడుచుండెను. అందుచేతఁ జా మప్పు దున్న స్థల మేదో యెంత యుపాయకర మైనదో యెల్లవారికిని దెల్ల మయ్యెను. ఓడనాయకుఁ డైన హంబుల్‌దొర యోడ నాద్వీపముల నడిమికి నడప వలెనని కడప్రయత్న మొకటి చేసి చూచెను గాని దానివలనను బ్రయోజనము లేకపోయెను. తెల్లవాఱుజామున నాలుగుగంటలవేళ భార్యహీన మైన యాయోడయొక్క ముందుభాగ మొక కొండమీఁదఁ దగులుకొనఁగా వెనుకటిభాగ మలలతాఁకున వెనుకకును ముందుకును నూఁగులాడు చుండెను. ఈసమయమునందు స్వప్రయోజనపరు లైన నావికులు కొంద ఱాత్మరక్షణార్థమయి యోడకు వ్రేలఁగట్టి యున్న పడవ నొకిదానిని క్రిందికి దింపి దానిలో నెక్కి తప్పించుకొని తొలఁగి పోయిరి. ఓడను నేర్పుతోనడిపి యాపత్సమయమునందు యాత్రికుల ప్రాణములు కాపాడవలసిన వా రయిననావికులు తమ్మునమ్మి యాత్ర వెడలివచ్చిన యసహాయు లగు పథికులను సముద్రమధ్యమున నోటి యోడలో దిగవిడిచి తము దేహములను నిలుపుకొనుట కయి పాఱి పోవుట యవమానకర మైనను లోకములో నెవరిప్రాణములు వారికి తీపి యగుట భావించి వారి నివ్వు డంతగా నిందింపవలసినవని లేదు. వారు పడవను దింపుచవ్వుడు చెవినిబడఁగానే గదిలోనున్న 'రూత్‌స్‌న్ రిచ్చై' యను పాంథుఁ డొకఁడు వేవేగ లేచి వస్త్రములు వేసికొని వచ్చి వెడలిపోవుచున్న యాపడవలో నెట్లో దుమికెను. గదులలో నుండిన పథికులలో బ్రతికి బయలఁబడినవా డితఁ డొక్కఁడే. అతనిని

జూచి యాతని పినతండ్రియు పినతల్లియు నాతనివెంట బైలువెడలి వచ్చి పడవలోఁ బడవలె నని దుముకిరి గాని గురి తప్పినందున సముద్ర ములోఁ బడి యాతని కన్నులయెదుటనే యధోగతు లైరి! ఓడలోఁ బయినున్న పాంథులయొక్క దురవస్థ యిట్టి దట్టిదని వర్ణించుటకు భాష చాలదు. స్త్రీలయొక్కయు శిశువులయొక్కయు రోదనములును ప్రార్థ నములును భంగములయొక్కయు ప్రభంజనముల యొక్కయు ధ్వను లతోఁ గలిసి మిన్ను ముట్టుచుండెను. ఇటువంటి వ్యాకులసమ యములో మహాతరంగ మొకటివచ్చి యమాంతముగా నోడసంతను బైకెత్తి యాకొండమీఁద నురువడితోఁ గూలవేసెను. ఆదెబ్బతో నోడ నడిమికి రెండుభ్రక్కలు కాఁగా వెనుకటిభాగము విశేషజన ముతో మునిఁగి యమునంటి యదృశ్య మయ్యెను. గదులన్నియు నీభాగములోనే యుండెను. ఓడనాయకుఁడును భార్యయు నిండే యుండి మడిసిరి.

చాపకొయ్యలును యంత్రములును చక్రములును గల ముందు భాగ మింకను కొండలలో చిక్కుకొని నిలిచియుండెను. ఈహత్తశేష పోతము నంటిపెట్టుకొని నిరాశు లయిన జీవులు తొమ్మండ్రుగురు ప్రాణములు చిక్కఁబట్టుకొని నిలిచియుండిరి. వీరిలో నైదుగురు పాంథులు, నలుగురు నావికులు. ఆపాంథబృందములో సారా డాసన్ అను పేరుగల సుందరియు నొకతె యుండెను. ఆమె తన యిరువురు బిడ్డలను రెండుచేతులలోను బట్టుకొని తొమ్మిన కదుముకొని యుండెను. సాయము వచ్చునప్పటి కామె దేహములో ప్రాణము గాలిలోని దీపమువలె సంచలించుచు నిలిచియుండెను గాని చేతుల లోని బిడ్డ లిరువురును శవములై బిట్టి బిగిసికొని యుండిరి. బొండిలో

ప్రాణ మున్నంతవఱ కాశ వదలిపోదు గనుక, ఆపన్న లైన
మూతొమ్మండ్రును నాత్మరక్షణాశ నూతఁగొని ప్రాణము లఱచేతఁ
బట్టుకొనియుండిరి. పయి నింకను ప్రచండవాయువులు వీచుచుండినను,
గాలివాన కొంత తగ్గిన ట్లుండెను; సముద్రమునూత్రము భయంకర
మయి యింకను మహోన్నతముగా లేచుచునే యుండెను. ఇంతలో
ప్రభాతమయి నలువంకలు కనఁబడనారంభింపఁగా, ఏదిక్కునుండియు
సాయమువచ్చుట యసాధ్యమని తోఁచినందున మందభాగ్యులైన
యాహతశేషుల కావఱికున్న యల్పాశ క్షీణించి యడుగంటఁజొచ్చెను.
అయినను వా రెప్పుడును నెమరుచూడఁ జాలని యొకదిక్కునుండి
వారి కప్పుడు సాయము రా సంసిద్ధమై యుండెను. ముఖ్యముగా నొక
బీదబాలికయొక్క నిరుపమాన ధైర్యసాహసములచేత వారికి మర
ణోపద్రవమునుండి విముక్తి గలుగవలసినట్లుగా నేర్పడియుండెను.
వివన్న లైనయాపాంథులయొక్క యార్తనాదములు తెల్లవాఱు
జామున గ్రేస్‌డార్లింగుకన్యయొక్క చెవిని బడఁగా నామె పెఁటనే
పోయి తండ్రిని మేలుకొలిపెను. అయినను గాఢాంధకార బంధురము
గానుండిన యాసమయ మేవిధమైన తోడ్పాటు చేయుటకును నసాధ్య
మైనదిగా నుండెను. కాఁబట్టి వారు గొంతసేపు వేచియుండి ప్రభాత
మగుచున్నప్పు డార్తనాదము వచ్చిన దిక్కునకు చూడ్కి నిగిడించి
చూడఁగా, పగిలిపోయిన యోడభాగమొకటి వారికంటఁబడెను. వారు
భూతదర్పణమును గొని నిపుణముగాఁ బరీక్షింపఁగా వారి కాభగ్న
పోతమునం దింకను ప్రాణములతో నున్నవారు కొందఱున్నట్లు గోచర
మయ్యెను. ఇఁక వారిని రక్షించుమార్గమెట్లు? గాలి కొంచెము తగ్గిన
ట్లున్నను సముద్ర మింకను మహాతరంగాకులమయి యతిభయం
కరముగానే యుండెను. ఆదినము మఱింక ప్రొద్దెక్కిన తరువాత

పగటిపూఁట "స్కాడిల్" అను పెద్దమనుష్యుఁ డయిదు వొనుల (75 రూపాయిల) నిచ్చెదనని చెప్పి ప్రార్థించి తీరమునుండి కొందఱు చేపలవాండ్రను సాయముపంప సర్వప్రయత్నములు చేసినను, సముద్ర తరంగములను లక్ష్యముచేయక చిన్నదోనెలలో నెక్కి సదా చేపల వలె నీటిలోఁబడి మునిఁగి తేలుచు కొట్టుకొనుచుండెడు చేపలవాండ్రు సహితము వెవ్వరును ధైర్యశాలులైనను వడవలలోఁ బోవఁ దెగింప లేనవ్వు డప్పటి సముద్రస్థితి యెట్లుండెనో యితరు లట్టిపనికిఁ బూను కొనుట యెంత ప్రాణాపాయకరమో సులభముగా నూహించి తెలిసి కొనవచ్చును. ఇటువంటి ప్రతిబంధములను పరిగణింపక యిట్టియుపాయ సమయముసం దొక చిన్నపడవలో సముద్రముపై వెడల సాహసిం చుట సముద్రయానకుశలు లైన ప్రౌఢనావికులకు సహితము ప్రతిష్ఠా వహమని చెప్పవలసియున్నప్పుడు ముగ్ధ యైన యొక్క యబలయే యట్టి సాహసికకార్యమున కడుగిడినచోఁ జెప్పవలసిన దేమున్నది? సముద్రసంక్షోభమును జూచి తెగువచేయుటకు మొట్టమొదట డార్లింగుదొర యించుక సంశయించె నఁట గాని తన కోమారిత ముందడు గిడఁ గానే యతఁడును ప్రయాణమునకు సంసిద్ధుఁడయ్యెను. తల్లియొక్క తోడ్పాటుతో పడవయొకటి నీటిలోనికిఁ ద్రోయఁబడగానే కూఁతురును దండ్రియు చెరియొక తెడ్డును చేతఁబట్టుకొని దాని లోనికి దుమికిరి. డార్లింగుకన్య యావఱి కెన్నఁడును తెడ్డుచేతఁబూని పడవనడిపి యెఱిఁగినదికా దని చదువరుల కీసందర్భమునఁ దెలుపవలసి యున్నది. ఏది యెట్లున్నను లోపల నెల్లఁ దానయయి యితర చింతల నెల్ల మఱపించిన యామె యొక్కదృఢమైన యార్తరక్షణపరాయత్త చిత్తమే యామె మృదుహస్తముల కసాధారణబలమును గలిగించి ఝంఝాసముద్రముమీఁద పడవను గడపు సామర్థ్యము నొసఁగెను.

వారిట్లు తెడ్లువేసికొని కర్కశతరంగములతో లేచుచు క్రుంగుచు పడవ నడపుకొనుచుఁ బోయి యెన్నియోకష్టములు గడచి కొంత నేపటి కెట్లో పగిలినయోడ యున్నకొండను సమీపించిరి. కాని వారి కన్నుల కప్పుడు ముందు గడచిన కష్టము లన్నిటికంటెను గొప్పదైన కష్టమొకటి యనివార్యముగఁ గానిపించెను. ఓడలోనున్న వారిని రక్షించుటకయి తాము ముందుగా కొండమీఁద దిగవలెను; తామెక్కి వచ్చిన పడవనుపగులకుండ కాపాడవలెను. ఆయలలతాఁకున కొండకుతగిలినపక్షమున తమ పడవ ముక్కముక్కలగు ననుట నిశ్చయము. పడవ పగిలినపక్షమునఁ దా మాపిల్లలను రక్షింప లేకపోవుటయే కాక తామును నందు చిక్కుకొని చిక్కి పడవలసినవా రగుదురు. ఇటువంటి స్థితిలో నపాయకరమును సాహసికము నయినయొక యుపాయముచేత పడవ కొండ దగ్గఱకుఁ బట్టి తండ్రి యందులోనుండి కొండమీఁదికి దుముకఁగానే కూఁతురు తెడ్లువేసి పడవను మహావేగముతో వెనుకకు లోఁతు నీటిలోనికి నడపి తన నేర్పుచేత పడవ యచ్చట తేలి యాడుచుండు నట్లు చేసెను. ఇట్లు శ్రమపడి తండ్రి బిడ్డ లెంతోకష్టముమీఁద నోడపై నున్న తొమ్మండ్రను తమ పడవలో నెక్కించుకొని సురక్షితముగాఁ గొనివచ్చి వారిని తమ దీవ గృహమునఁ జేర్చిరి. డార్లింగుకన్య యాపిల్లల ప్రాణములను రక్షించుటయం దెంత దయచూపినదో తరువాత సహిత మంతదయనే చూపి మూఁడహోరాత్రములు నదా వారిని కనిపెట్టుకొనియుండి వారికి గావలసినవానినెల్ల సమకూర్చి, వారిమనోవేదనలను చాలవఱకు శాంతపఱిచెను. ఆదంపతులును కొమారితయు నాయాపిల్లలయెడలఁ జూపిన యాదర మింతంత యని చెప్ప శక్యము కాదు. డార్లింగుకన్య తనపఱపును బిడ్డలను గోలుపోయి విలపించుచున్న డానన్‌దొరసాని

కిచ్చి తా నొకకటికిబల్లమీఁద పరుండెను. తీరమునుండి యాయాపత్తులను రక్షించుటకయి తరువాతవచ్చిన పడవలోనివారు కూడ సముద్రమునొక్క క్రొర్యమునుబట్టి యచ్చటనే నిలువవలసినవారయినందున డార్లింగు కుటుంబమున కప్పు డతిథులవలెనే యుండిరి.

ఘనకార్యము నెంత తక్కువవంశమువారు చేసినను ప్రజలహృదయముల నది యాకర్షింపక మానదు. నిర్జనమై యప్రసిద్ధమైనయొకదీవియం దున్న దీపగృహమునకు నాయకుఁడుగా నుండినవాఁడుత్తమవంశసంజాతుఁడును విద్యోపేతుఁడును నయియుండుట సాధారణముగా సంభవింపదు; అట్టివాని కూఁతురు పేరు లేని పేదది అయియుండు నని వేయింగ జెప్పవలసినపని లేదు. కీర్తిగౌరవములు చేసిన ఘనకార్యములనుబట్టి వచ్చును గాని పుట్టుకనుబట్టియు స్థితినిబట్టియు రావు. కాఁబట్టి యెంతహీనస్థితియం దున్నవారయినను స్వశక్త్యానుసారముగా శ్లాఘ్యకార్యములను నిర్వహింపఁ బ్రయత్నింప వలెను. డార్లింగుకన్యయొక్క యీవృత్తాంతము జల మధ్యమునఁ జేయఁబడినదయినను వెంటనే జనమధ్యమున వ్యాపించెను. ఈమహాకార్యము నొకటితరువాత నొకటిగా వృత్తాంతపత్రికలెల్లను ప్రకటించి యీకన్యకారత్నము యొక్క ధైర్యకారుణ్యములను సహస్రముఖముల శ్లాఘాపూర్వకముగా ఘోషింపఁజొచ్చెను. ధనికు లనక దరిద్రులనక పండితు లనక పామరు లనక వృద్ధు లనక బాలు రనక స్త్రీ లనక పురుషు లనక గొప్పవారనక కొలఁదివారనక యెల్లవారి నోళ్ళలోను గొంతకాల మీమెపేరేయుండెను. ఆమెయుజూచుట కయి యెల్లవారును కుతూహలపడుచుండిరి. పలువురు పనికట్టుకొనివచ్చి యామెను సంద


ర్శించి పోవుచువచ్చిరి. ఇట్లామెయుదర్శింప నపేక్షించినవారు సామాన్య జనులు మాత్రమేకాక ప్రభువులలోను బలువు రుండిరి. అనేకు లామెను శ్లాఘించుచు లేఖలువ్రాసి సర్వస్థలముల నుండియు ధనాధికములైన బహుమతులను బంపఁదొడఁగిరి. నార్తంబరులాండు ప్రభువును ప్రభ్వీయు నామెను తండ్రిని తమదుర్గమునకుఁ బిలిపించి యాదరించి యామెకు బంగారు గడియారమును బహుమానమొనర్చిరి. తన్నెవ్వ రైనను గొప్పవారు చూడవచ్చినప్పుడామె యాగడియారమునుధరించి సంతోషముతోఁ గూర్చుండుచు వచ్చెడిది. ఇట్లొక్కొకరుగా నంపిన పారితోషికములుగాక యొకసంఘముచేరి యామె యువయోగము నిమిత్తమయి చందాల పట్టికను బ్రచురించినప్పుడు 700 పౌనులు (10,500 ల రూపాయలు) చందాలుపడినవి. ఇట్లామెపొగడ్త లెల్ల యొడలను మిన్ను ముట్టుచుండునప్పుడు, నాటకసంఘములవా రనేకు లామెచేసిన యీ ఘనకార్యమును నాటకరూపమున రచించి ప్రయో గించుట కుద్యోగించిరి. అట్టి నాటకమును నేత్రోత్సవముగా నెప్పుడు చూతుమాయని జనులును నాత్రపడుచుండిరి. నాటకశాలాధికారులు గొందఱు తాము నాటకమును ప్రదర్శించునప్పుడు నాటకరంగము నకు వచ్చి గొంచెమునే పొక్కపడవలోఁ గూరుచుండినపక్షమున నెంతో సొమ్మిచ్చెద మని యామె రాకను మహోత్సుకతతోఁ బ్రార్థించిరి. ఇచ్చెదమన్నవిత్తవు మొత్తము లెంత చిత్తాకర్షకములుగా నున్నను, చేసినప్రార్థన లెంతయునిలంఘనీయములుగాఁ గానఁబడినను, ఆమెస్తోత్రపాత్రములయం దెంతమాత్రమును నిష్టము లేని దయి మానినీజనాలంకార మైనవినీతిని వహించి వారి ప్రార్థనల నెల్లను తృణప్రాయముగా నిరాకరించెను. స్వభావము చేతనే యామె యత్యంతవినమ్రయు లజ్జాశీలయు నయి స్తోత్రప్రియురాలు గాకుండెను.

ఎంద రెన్నివిధముల నామెను స్తుతిపాత్రులతో శ్లాఘించినను, మన స్సులో గర్వపడుట గాని యాత్మస్తుతి చేసికొనుటకుగాని తాను చేసిన కార్యము గొప్ప దని భావించుటగాని యామెకు మాత్ర మెప్పుడును సరిపడినవిగా నుండలేదు. అనంతర మామె తల్లిదండ్రులతో మూఁడు సంవత్సరములు సుఖముగా కాలము గడపెను. ఈ కాలములో నెందఱో యామెను వివాహమాడవలె ననన్న యిచ్ఛను దెలిపిరిగాని తల్లిదండ్రులు నజీవులయి యున్నంతవఱకును దాను వారిని విడువనొల్ల నని యామె వారి ప్రార్థనల నన్నిఁటిని నిరాకరించెను.

ఈలోకములో మంచివస్తువు చిరకాల ముండ దని పెద్దలు చెప్పుదురు. సుకృతీగతాయువన్నలోకోక్తి మనము పలుమాఱువిన్నదే గదా. 1841 వ సంత్సరాంతమున నామెకు క్షయరోగ చిహ్నములు కనఁబడెను. అవి యంతకంతకు ప్రబలి తల్లిదండ్రులకును బంధువులకును మిత్రవర్గమునకును మిగుల దుఃఖమును గలిగించెను. ఈమె కెంతటి ఘన వైద్యులచేత నెన్ని చికిత్సలు చేయించినను గుణ మగపడలేదు. మరణ మునకు ముం దామె స్వబంధువులనెల్లఁ తనయొద్దకు రప్పించుకొని తన నామస్మృత్యర్థముగా వారి కందఱికి నేదో యొకవస్తు విచ్చెను. ఇట్లు చేసి యామె 1842 వ సంవత్సరము అక్టోబరునెల 20 వ తేదిని బాంబరోనగరమున పరమపదము నొందెను. ఆమె శవమును శ్మశాన మునకుఁ గొనిపోవునప్పుడు తీర్థప్రజవలె లెక్కలేని జనులు వెంటఁ బోయిరి. ఒకరిజీవితకాల మత్యల్పమైనదే యైనను పరోపకారకార్య పూరిత మయినపక్షమున నదియే దీర్ఘమును సార్థకమును నైనది. ఉపకారశూన్యమైన జీవితము శతసంవత్సర పరిమిత మయిన దయినను అది యత్యల్పమును నిరర్థకము నైనదే. ఈ యుత్తమాంగనయొక్క వృత్తాంతమును జదివెడు సుందరు లందఱును నీమెవలెఁ బరార్థపరత్వ శీల లగుటకుఁ బ్రయత్నింతురుగాక!

JOAN OF ARC—MAID OF ORLEANS.

"ఆర్లియన్సు కన్య" యనఁబడు జోన్ ఆఫ్ ఆర్క్.



ఏనూరుసంవత్సరములక్రిందట ఫ్రాన్సురాష్ట్రములోని విశేష భాగము ఇంగ్లండుదేశపురాజుల పరిపాలనమునకు లోఁబడి యుండెను. ఫ్రాన్సులోని రెండవభాగ మగు నార్మండీ దేశముయొక్క ప్రభువు విల్లియ మను నతఁ డింగ్లండుదేశమునిఁ దనకి దండెత్తి విజయము నొంది వానికి రా జయినతరువాత నార్మండీదేశమునుగూడఁ దన యధీనము

లోనే యుంచుకొనెను. తదనంతరము రాజ్యమునకు వచ్చిన యతని సంతతివారు నార్మండీదేశమును తమ ముఖ్యస్థానముగాఁ జేసికొని యేదో మిష కల్పించుకొని యుద్ధముల కారంభించి ఫ్రాన్సురాజ్యము లోని యితర దేశముల నాక్రమింపఁ జొచ్చిరి. ఫ్రాన్సుదేశపురా జయిన యాఱవచార్లస్‌యొక్క కూఁతు రింగ్లండుదేశపురా జయిన యైదవ హెన్రీకి వివాహము చేయఁబడెను. ఆఱవచార్లెస్ 1422-వ సంవత్సరమునందు మృతుఁ డైనప్పు డాతని కుమారుఁ డైన చార్లెస్ దుర్బలుఁ డైనందున రాజ్యభార మాతని యల్లుఁ డైన యైదవహెన్రీ వహించున ట్లేర్పాటు చేయఁబడెను. అయినను హెన్రీ ఫ్రాన్సుదేశము నకు వచ్చి రాజ్యాభిషిక్తుఁడు కాకముందే పరమపదము నొందినందున నింగ్లీషువా రతనికుమారుఁ డైన యాఱవ హెన్రీ యనుబాలుని ఫ్రాన్సు దేశమునకుఁ దీసికొని వచ్చి పారీసునగరమునందు పట్టాభిషేకము చేసి యతఁడే ఫ్రాన్సుదేశమునకు రా జని ప్రకటించిరి. బాలుఁ డైన హెన్రీ స్వయముగా కార్యనిర్వాహణము కావించుకొనుటకు సమర్థుఁడు కానందున నాతనిపక్షమున బెడ్‌ఫోర్డ్‌ప్రభువును గ్లౌసెస్టరుప్రభువును ఫ్రాన్సుదేశసంస్థానములయొక్క రాజకార్యనిర్వాహణమును నడుపు చుండిరి. ఫ్రాన్సుదేశములోని ప్రభువు లంతశ్ఛిద్రములచేత దేశాభి మానహీను లయి యన్యోన్యద్వేషపరాయణులయి యైకమత్యము లేనివారైనను గొందఱుమాత్రము స్వదేశాభిమానమును రాజి భక్తియు విడువక తమరాష్ట్రమునకు చార్లెస్సే న్యాయమైన యుత్త రాధికారి యని యాతనిపక్ష మవలంబించి యుండిరి. ప్రబలుఁ డైన బర్గండీప్రభు ఇంగ్లీషువారిపక్షమును వహించి యుండినందునను, ప్రధానదుర్గములును ముఖ్యపట్టణములును ఇంగ్లీషుసేనలచే నాక్ర మింపఁబడి యుండినందునను, ఫ్రాన్సుదేశ మన్యాక్రాంత మయి

యింగ్లీషువారిపాలనమునకుఁ బోవున ట్లుండెను. అట్టి సందిగ్ధసమయ
మునం దాస్థానికముగా నొక కాపుకన్య ప్రభుభక్తియుక్తయు దేశాభి
మానమానసీయయు నయి బయలు వెడలి పరాధీనము కాకుండఁ
గాపాడి స్వదేశము నుద్ధరింపఁ గలిగెను. ధైర్యశౌర్యభక్తియుక్తురా
లయిన యాయుత్తమకన్యయే మనకథానాయిక. ఆమెపేరు జోన్.

జోన్ ఆఫ్ ఆర్క్ ౧౪౧౧ వ సంవత్సరమునందు జనన
మొందెను. ఆమెతండ్రిపేరు జేకిస్ అర్క్; తల్లిపేరు ఇసబెల్లా. ఈపేద
దంపతులు డోర్రెమిూ యనుపల్లెయందు వసించు చుండెడివారు.
ఈవధూవరులకు జోన్ గాక మఱియొకకొమారితయు ముగ్గురుకుమా
రులును నుండిరిగాని యాకొమారిత బాల్యములోనే మృతి నొందెను.
భార్యాభర్తలు తమ కున్నదానితోనే సంతుష్టులయి యీశ్వరభక్తియు
న్యాయప్రవర్తనమును గలవారయి తమబిడ్డలను మంచిమార్గమునఁ
బెంచు చుండిరి. జోన్ చదువుటకును వ్రాయుటకును నేర్చినది కాదు.
ఆకాలమునందు మతాచార్యులకుఁ దక్క సాధారణముగాఁ బురుష
లకే విద్య లేకుండినప్పుడు బీదబాలికకు విద్య లేకపోవుట వింత గాదు.
ఆచిన్నదానికి తల్లి నూలువడుకుటకును కుట్టుటకును నేర్పినది; తండ్రి
క్రైస్తవమతధర్మములను బోధించెను. ఆమె స్వభావముచేతనే మంచి
దగుటనుబట్టి బాల్యమునుండియు భగవద్భక్తియు వినయాదిగుణసం
పత్తియు దయార్ద్రచిత్తవృత్తియుఁ గలదయి సదా పాటుపడుటయం
దిష్టము గలదయి యుండెను. ఆమె తనయీడుబాలికలతోడి యాట
పాటలను విడిచి యుపాసనసమయమునందు దేవాలయమునకుఁ బోయి
శ్రద్ధతో ధర్మోపదేశములను వినుచు భక్తిపారవశ్యము నొంది
యానందించుచు, పొలములోఁ గలుపుతీయుట పైరుకోయుట మొద
లగువనులలో నున్నప్పుడుసహితము తోడివారిని విడిచి కొంచెము సే

పేదో యొక యేకాంతస్థలమునకుఁ బోయి యెంటిగాఁ బ్రార్థనచేసి వచ్చుచు నుండెడిది. ఆమె సదా లజ్జాశీలయు భీరుస్వభావయు మిత భాషిణియునయి యుండెను. ఆమె కొంత పెద్ద దయినతరువాతసహిత మింట గృహకృత్యములను చక్కఁబెట్టుచు బయిట గుఱ్ఱములను పశు వులను మేపుచు నశ్వారోహణము చేసి గుఱ్ఱములను నీళ్ళకుఁ గొని పోవుచు నిరంతరమును పాటుపడుచుండెను. ఆకాలమునందు యుద్ధ ములమూలమున జనులవిషయమున నడచు చున్న క్రౌర్యములను తన దేశమునకును రాజునకును సంభవించిన యన్యాయములను తలఁచుచుగా వినుచు వచ్చుటచేత నామెమనస్సునందు పరితాపమును దేశాభిమాన మును నుదయించినందున నామె స్వదేశోద్ధారణార్థమయి పలుమాఱు దేవునిఁ బ్రార్థించుచువచ్చెను. ఆచింతయే చిత్తమును విడువక సదా తలపించు చుండుటచేత నామె పదుమూఁడు పదునాలుగు సంవత్సర ములప్రాయమప్పుడు దేవదూతలు తన్నావేశించి ఫ్రాన్సుదేశమును పునరుద్ధారణము చేయవలసినదని తన కాజ్ఞాపించిన ట్లామె స్వప్నాది దర్శనములను బొందుచువచ్చెను. అవి యన్నియు నీశ్వరునియాజ్ఞలే యని యూహించిన్నది నిశ్చయముగా నమ్మిన దనుట కణుమాత్రమును సందేహము లేదు.

'క్రివాంటు' 'వెర్నూల్' అను స్థలములయందు జరిగిన యుద్ధ ములవలన ఛార్లెస్‌యొక్కయాశ పూర్ణముగా నిరాశ యయినట్లు కాన వచ్చెను. ఆసమయమునందే మనకథానాయిక యయినయీ కావు చిన్నది తనకు దేవతాసాక్షాత్కారము లయినట్లు భావించి యానందింప నారంభించెను. ఒకనాఁ డామె తనతండ్రిపొలములోఁ గూరుచుండి యుండఁగా నెదుట నొకవెలుఁగు కానవచ్చి, యందుండి నీవు భక్తు రాలవుగాను మంచిదానవుగాను నున్నయెడల దేవుఁడు నీకు మేలు

చేయు' నని పలికిన ట్లశరీరవాక్కొకటి వినవచ్చెను. ఇంకొకసారి యామె పొలములో పశువులను మేపుచుండఁగా వెనుకటివలెనే వెలుఁగొకటి కానవచ్చి యందులోనుండి రెండు దివ్యసుందరవిగ్రహములు "నీవింగ్లీషువారిబంధమునుండి విముక్తికలిగించి ఫ్రాన్సుదేశమునుద్ధరింపవలసిన" దని పలికినట్లు భావగోచరమయ్యెను. ఈ రెండును ముగ్ధభక్త్యావేశవివశురాలయిన యాకన్యయొక్క చిత్తభ్రమణైక మూలకములే యయి యుండవచ్చునుగాని శుద్ధాంతఃకరణయైన యాకన్య కవి సత్యమైనయీశ్వరాదేశములే యయ్యెను. ఈకడవటి దర్శనమువలన హృదయ ముప్పొంగి యప్పటు చు వీరావేశపరవశ యయ్యెను. ఆక్షణమునసే యామె తా నవివాహిత యయి యావజ్జీవము కన్యగానే యుండునట్లును, దేవాదిదేవుఁ డయినయీశ్వరుడు దీనాతిదీన యయిన తన కనుగ్రహించినయాజ్ఞను జెల్లించుటకయి తన జీవమును ధారపోయు నట్లును, కృతప్రతిజ్ఞురా లయ్యెను. ఈసంగతి తండ్రికిఁ దెలిసినప్పు డతఁడు తన కూఁతున కున్మాదము కలిగిన దని భావించి, ఆమెను దండువెంట విడుచుట కంటెఁ దన చేతులతో లోఁతునీటిలో నట్టేట విడిచెద నని పలికెను.

బెడ్‌ఫోర్డుప్రభువు బర్గండీప్రభువుయొక్క సాహాయ్యమును బొంది చార్లెస్సును జయించుటకు గొప్పసేనను బంపెను. దానికి శాలిస్బరీప్రభువు సేనాధిపతిగా నుండెను. అతఁడు చిన్నకోటలను పట్టణములను స్వాధీనము చేసికొని "ఆర్లియన్సు" అను గొప్పదుర్గమును ముట్టడివేసెను. ఈపట్టణము శత్రువులపా లయినపక్షమున, చార్లెస్ తన రాజ్యమును విడిచి స్వపక్షజన సహితముగా నడవుల పాలుగావలసిన వాఁడే. ఈపట్టణముయొక్కముట్టడి 1428 వ సంవత్సరము అక్టోబరు నెలలో నారంభ మయ్యెను. ఈపట్టణము ముట్టడింప

బడు నని ముందుగానే తెలిసినంచున రాజసేనలును పురజనులును దానిని గాపాడుట కయి సర్వసన్నాహములును యుక్తసమయమునసే చేసికొని యుద్ధమునకు సంసిద్ధులయియుండిరి. ముట్టడించిన యింగ్లీషు సైనికు లెంతధైర్యోత్సాహములతోఁ బయిని బడినను ముట్టడింపఁ బడిన రాజభటులును పౌరవీరులును నిరుపమాన దేశాభిమానమహితు లయి ప్రాణముల కాశింపక సోరాడి యహితులను బురము చొరనీక దూరమున నిలిపిరి. పురబహిర్ద్వారమునఁ గలిగిన యాఘోరసమర మునం దింగ్లీషు సేనా నాయకుఁ డగు శాలిస్బరీప్రభువు నిహతుఁడు కాఁగా నాతనిస్థానమున నస్సోకుప్రభువు సేనాధిపత్యమును వహిం చెను.

ఈనమయమునం దామెకుఁ బూర్వరీతినే దేవతాదేశము లగు చునే యుండెను. ఆర్లియన్సుపట్టణముయొక్క ముట్టడిని విడిపించుట యొకటియు, ఛార్లెస్సును రీమ్సునగరమునందు పట్టాభిషిక్తునిగాఁ జేయుటయొక్కటియు ఈరెండును దనకు దేవుఁడు విధించిన యాజ్ఞ లని యామె హృదయఫలకమునందు శిలాక్షరముల వలె దృఢముగా నాటుకొని యుండెను. తన కొనఁగఁబడిన యీశ్వరాదేశమును గూర్చి తల్లిదండ్రులతోఁ జెప్పుటవలనఁ బ్రయోజనము లే దని యెఱిఁగిన దయి, యామె సమీపగ్రామమునందు నివసించియుండెడు తన మేన మామ యింటికిఁ బోయి యాతని కడ తన మనస్సును విప్పి తనకు విధింపఁ బడిన కృత్యమునుగూర్చి విపరముగాఁ జెప్పెను. ఆచిన్నదాని యొక్క నిష్కళంకచరిత్రమును బట్టియు సత్యనంధతను బట్టియు నవ్యాజదైవభక్తినిబట్టియు నామె మేనమామ యయిన లాక్సార్టు శైశవమునుండియు నామెను ప్రాణాధిక మయినప్రేమతోఁ జూచు చుండెను. అందుచేత నాతఁ డామె చెప్పినదంతయు విశ్వసించి

యామె సందేశమును దెలుపుటకయి సమీపపట్టణ మయిన 'వాకా లియరు' నకుఁ బరిపాలకుఁ డయిన 'బౌడ్రికోర్టు' దొరయొద్దకుఁ బోయెను. ఆపరిపాలకుఁ డాతనిమాటలను విని పరిహసించి "యా పిచ్చిపిల్లదానిని రెండు చెంపకాయలువేసి శీఘ్రముగాఁ తల్లిదండ్రుల యొద్దకుఁ బంపివేయుము" అని హితోపదేశము చేసి యాతనిని బంపి వేసెను. విఫలమనోరథుఁ డయి మరలివచ్చి మేనమామ యచ్చట జరిగినవృత్తాంతమును జెప్పినను, ఆమె యెంతమాత్రమును నిరు త్సాహపడలేదు గాక తానే స్వయముగాఁ బోయి బౌడ్రికోర్టును దర్శించి మాటాడెద నని వాకాలియరుపట్టణమునకు బైలుదేఱెను. మేన మామయు నతనివెంటఁ బోయెను. ఆమె యాపట్టణమును జేరినతరు వాత విచారించి యొక దొడ్డయిల్లాలిగృహమునందుఁ బ్రవేశించి మేన మామ వెంటరానప్పుడు తానొక్కఁడకుఁ బోవలసివచ్చినను నొంటిగా బోవక యాగృహిణిని వెంటఁ గొనిపోవుచు వచ్చెను. ఇచ్చటనే కాక మఱి యెచ్చటకు బోయినను ప్రతిగ్రామమునందును విశుద్ధచరిత్రు రాలైన యొకయుత్తమాంగనను దనకు సహాయురాలినిగాను సంర క్షకురాలినిగాను జేసికొని యామె వెంట మెలగుచు వచ్చెను. ఈపట్ట ణము చేరిన తరువాత మొట్టమొదట, నామె కామండలపరిపాలకుని దర్శనము దొరకుటయే కష్టమయ్యెను. దర్శనములభించిన తరువాత నాతఁ డామె విన్నపమును సావధానముగాఁ జెవియిచ్చి వినుట యంత కంచెను గష్టమయ్యెను. విన్నతరువాత నాతనిని తోడుపడునట్లొప్పిం చుట కష్టములలో నెల్ల నధికకష్ట మయ్యెను. ఆమె నిశ్చలభక్తియు నేకాగ్రచిత్తతయుఁ గపటము లేని నిర్మలవర్తనమును జూచి పట్ట ణము లోనివా రందఱును నాకన్య నిజముగా నీశ్వరసాక్షాత్కారము గలభక్తురా లని నమ్మిరి. వారిలో ముఖ్యముగా ప్రముఖులయిన

గృహస్థులిద్దఱు తా మామెకు సాయము చేయునట్లు వూనుకొని యావురపరిపాలకునిచేత రాజున కొక విజ్ఞాపనపత్రమును వ్రాయించిరి. ఆపరిపాలకుఁ డామెను రాజునొద్దకుఁ బంపుటలో జేసిన సాయమంతయు నొక ఖడ్గము నిచ్చుటతప్ప వే ఱేదియు లేదు. ఆమె మేనమామయు నాతనిమిత్రుఁ డొకఁడును ఋణము చేసి యామెకొక శ్వేతాశ్వమును గొనియిచ్చిరి. ఆమెకుఁ దోడుపడిన పురవాస్తవ్యులలో నొకఁ డామె ప్రయాణవ్యయములను భరించెను. తానప్పటినుండి పురుషవస్త్రములను ధరించుచు ట్లీశ్వరాజ్ఞ యైన దనిచెప్పి యామె యిట్టివస్త్రములను ధరించెను. ఇట్లామె పురుషవేషమును దాల్చి యశ్వారోహణము చేసి యీశ్వరచిహ్నిత మైనధ్వజమును భుజమున ధరించి రాజసందర్శనార్థము బయలు వెడలెను. ఈ చరిత్రారంభమునందు వేయఁబడినది యీమె యప్పటిరూపమే.

ఈ పట్టణమునకు వచ్చినప్పటినుండియు తోడుపడుచుండిన యిద్దఱు పెద్దమనుష్యులును మఱినలుగురును నామె కంగరక్షకులుగా నామెవెంట బయలుదేరిరి. చుట్టుపట్ల ప్రదేశము లన్నియు శత్రుమయము లై యహితపక్షమవలంబించిన వయి యుండినందున శత్రువులచేతిలోఁ జిక్కుదు మన్నభయము చేత వారప్పుడు సాధ్య మయినంత వఱకు రాజమార్గములను గ్రామములను తొలఁగి, మనుష్యులు సాధారణముగా నడవని పెడదారులలో మహారణ్యములలోను బడి పోవలసినవా రయిరి. ఇట్లు ప్రయాసపడి కొంతదూరము పోయినపిమ్మట లోయిరునదిని దాఁటి రాజున కనుకూలురయి యున్నప్రజలు గలదేశమును బ్రవేశించిరి. అప్పు డామె తా నార్లియస్సునగరమును విడిపించుటకును ఛార్లెస్సును సింహాసనాసీనునిగాఁ జేయుటకును దేవునిచేఁ బంపఁబడి

నట్లు బహిరంగముగాఁ జెప్ప నారంభించెను. అది మూఢవిశ్వాస మత్యధికముగా నుండినకాల మగుటచేత నాచిన్నది చెప్పెడుకథ యెంత యద్భుతముగాను విశ్వాసానర్హముగాను గానఁబడినను పందేహపడక యెల్లవారును దానిని నమ్మి మనదేశమును రక్షించుట కయి దేవునిచేఁ బంపబడినదేవదూతి వచ్చుచున్నదని ప్రోవపొడుగు నను గుంపులుగుంపులుగా వచ్చి చూచి సంతోషించుచుండిరి. ఆ సను యమునందు రాజు చినాన్‌కోటయుం దుండి, శత్రువులు తానున్న దుర్గమును ముట్టడింతు రన్నభీతిచేఁ నార్లియున్ ఫొరరక్షణకుత్నమును విడిచిపెట్టి తాను గహనదేశములకుఁ బాతిపోఁ దలఁచెను గాని కొందఱు దేశాభిమానులప్రోత్సాహముచేతఁ గొంతధైర్యము వహించి యప్పటి కచ్చటనే నిలిచి యుండెను. ఇట్టిస్థితిలో జోన్‌కన్య చేరువగ్రామమును జేరి తాను వచ్చుచున్న వార్తను ముందుగా రాజునకుఁ జెప్పిపుచ్చెను. ఆమె చినాన్ దుర్గమునకు వచ్చుట కుత్తరువు వెంటనే పుట్టెనుగాని యామెకు దర్శనమిచ్చుటమాత్ర మాలోచనలోఁ బడెను. మంత్రుల లోఁ గొంద ఱామెక్షుద్రదేవతోపాసకురాలైన మాయలమారి యని పలికిరి; కొంద ఱామె చిత్తభ్రమణముగల యున్మాదిని యనిపలికిరి; వలువు రామె యెట్టిదయినను మన కిట్టిసమయమునందు సన్నిధికి వచ్చిన సాహాయ్యమును నిరాకరించుట యవివేకమని పలికిరి. కడపట నామెను గొన్నిప్రశ్న లడిగి యుత్తరములను బడయుటకయి యొక సభ నియమింపఁబడెను. ఆమెనుబరీక్షించియాసభవారిచ్చిన యభిప్రాయ మామె కనుకూలముగా నుండినందున డోలాయమానమానసుఁ డయి యుండిన యాచిఱుతరాజు తుద కామెను దర్శనమిచ్చుట కంగీకరిం చెను. రాజామెను మోసపుచ్చవలెనన్న యుద్దేశముతో నామె తన దర్శనమునకు వచ్చినప్పుడు తాను సామాన్యవస్త్రములను ధరించుకొని

దిగువను గూర్చుండి యుండి తనయాస్థానములోని దొరలకు గొప్ప సేవ
ములు వేసి వారి నున్నతస్థానములయందుఁ గూర్చుండఁబెట్టి యుండె
నఁట. ఆమె తత్పూర్వము రాజమొగ మెప్పుడును జూచి యెఱుఁగని
దైనను వేషమాత్రముచేత భ్రమపడక తిన్నగా రాజుకడకే పోయి
యాతనికి మ్రొక్కి "ఓ మహాప్రభూ, నీకును నీరాష్ట్రమునకును;
సాయము చేయుటకు దేవునిచేతఁ బంపఁబడిన జోన్‌కన్యను నేను.
రీమ్సునగరమునందు నీ వభిషక్తుఁడ వగుదువని ప్రకటించుటకు నే
నాజ్ఞాపింపఁబడినదాననను. ఇంగ్లీషువారితోఁ బ్రతిఘటించి యుద్ధము
చేయుటకు నేను సంసిద్ధురాలనయి యున్నదాననను." అని ధీరస్వర
ముతోఁ బలికెను. ఆమాటలవలన రాజునకును సభ్యులకును నత్యద్భుత
ప్రమోదములు కలిగెను. ఈయద్భుత మిట్లుండగా జనులవిశ్వాస
మును బురికొల్పినవింత యప్పు డింకొకటి నడచెను. తనసమీపము
నుండి యామె నడుచుచుండినప్పుడు సైనికుఁ డొకఁ డామెనుగూర్చి
మోటుగా మాటాడఁగా, "ఓయీ! మృత్యువత్యాసన్న మయి
యుండ నీ కింత త్రుళ్లు పాటు తగునా?" యని యామె వానిని మంద
లించెను. ఆభటుఁ డాదినముననే నదిని దాఁటునప్పుడు మునిఁగిపోయి
మరణము నొందెను. ఈ దైవఘటననుబట్టి యామె యాగమనము
తెలిసినమహాత్మ్యారాలని యెల్లవారికిని నమ్మకము కలిగెను. ఆమె
వర్తనమును నిపుణముగా పరిశీలించినకొలఁదిని భక్త్యుత్సాహముల
యందు నిష్కళంకురాలని తేటపడినను యుద్ధతంత్రములయందుఁగాని
రాజ్యాంగవ్యవహారములయందుఁగాని విశారదురాలు కాదని మంత్రి
వర్గమున కభిప్రాయము కలిగెను. అందుచేత ఛార్లెస్ మరల సందే
హందోళితమనస్కుఁడయి యామె సాహాయ్యము సంగీకరించుటను
గూర్చి యాచార్యసభ వారికి విజ్ఞాపనమును బంపెను. వారామె జన్మ

స్థలమైన డోక్రెమెమీగ్రామమునకు మనుష్యులను బంపి యామె పూర్వ వృత్తమును పూర్ణముగా విమర్శించి యామెచరిత్రము కళంకరహిత మయినదని తెలిసికొని రా జావుణ్యకన్యయొక్క తోడ్పాటును నిస్సంశయముగా నంగీకరింపవచ్చునని శ్రీముఖమును బంపిరి. ఈ యాలోచన నలతోను సందేహములతోను రెండుమానములు గడచినతరువాతఁ దగినయేర్పాటులు చేసి కవచ మొకటియు నొకదేవాలయమునందుఁ జిరకాలమునుండి మూలఁబడి యుండిన పవిత్రఖడ్గ మొకటియు తదభీష్టానుసారముగా జీసస్‌యొక్కయు తల్లియొక్కయు విగ్రహములు వేయఁబడిన ధవళధ్వజ మొకటియు రా జామెకిచ్చి యుద్ధయాత్ర కనుజ్ఞ యిచ్చెను. ఆమె ప్రాయ మిప్పుడు పదునేడు సంవత్సరములు. విశ్వాస్యులయిన కతిపయవీరభటు లామె కంగరక్షకులుగా నియమింపఁబడిరి. ఆమె యాశ్వారోహణచేసి కవచాదులు ధరించి వీరభటునివలె బురుషవేషముతో బైలువెడలఁగానే యావటికు నిరాశులయి పలాయితులైన సైనికు లండఱును నామె కీశ్వరసాహాయ్య మున్నదన్న సంపూర్ణ విశ్వాసముతో ధైర్యోత్సాహము గలవా రయి వీరావేశము నొంది మరల నామెచుట్టును జేరసాగిరి. ఇట్లు చేరిన వీరవార మత్యల్పకాలములోనే యాఱువేలవటికును బెఱిఁగెను.

ఈవటికు సేనానాయకులుగా నుండినవారే యీ సేనను నడపవలయునో జోన్‌కన్యయే నడపవలయునో యని శంక గలిగి నప్పు డామెయే నడుపవలయు నని జనసంఘము పట్టుపట్టుటచేత లోపల నిష్టము లేనివారయినను, సేనాధిపతులు పయి కామెకు లోఁబడి యామె యాజ్ఞానుసారముగా నడపవలసినవారైరి. ఆమె మొట్టమొదటఁ జేసినపని తనదండువెంటవచ్చిన చెడునడతగల పడఁతుల నందఱిని వెడలఁగొట్టివేసి, సైనికులనందఱిని తమదోషముల నీశ్వరునికి

నివేదించి కుమింప వేఁడుకొనునట్లు చేసి యుద్ధమునకు సంసిద్ధులను జేయుట ఆమె బ్లాయిస్‌పట్టణమునుజేరి యక్కడనుండి యార్లియన్సు పురమునకు ముట్టడి వేసియున్న యింగ్లీషు సేనాధిపతులకు దేవుని యాగ్రహమునకు పాత్రులుగాక శీఘ్రముగా పట్టణమును విడిచి తొలఁగవలసినదని యాజ్ఞాపించుచు లేఖను బంపెను. ఇంగ్లీషు సేనా నాయకు లామెయుత్తరమును తిరస్కారభావముతోఁ జూచినట్టు నటించిరి. కాని యామె యమానుషశక్తినిగూర్చిన యద్భుతకథ లనేకము లీవఱకే వినియున్నందున నామె యీశ్వరసాక్షాత్కారబలమో క్షుద్రదేవతా వశీకరణశక్తియో కలయవిజేయురా లని హృదయము లలో సమ్మిళయుండిరి. ఆమె యాపట్టణమును జేరునప్పటికి చీఁకటి పడెను; గాలి ప్రతికూలముగా వీచుచుండెను; వాన జోరునఁ గుఱియు చుండెను. అటువంటి సమయమునందు నదిని దాఁటుటకు సేనాధి పతు లిష్టము లేనివారుగా నుండిరి. ఆమె సర్వమును ననుకూలముగా నుండునని పలికి పడవలెక్కి తక్షణమే నదిని దాఁటుట కాజ్ఞాపించెను. ధ్వజ పటమును జేకఁ బట్టుకొని ముందుగా నామె యొక పడవ లోనికి దుముకఁగానే సంశయింపక యామె వెంబడినే సైనికులెల్ల రును మహోత్సాహముతో పడవలవంక నడచిరి. ఇట్లు పడవలెక్కి యార్లియన్సు పురవాసులనిమిత్తమయి తెచ్చిన భోజనపదార్థములను గొని నదిని తరించి సైనికు లామె చెప్పిన ట్లొక్క గడియలో నురక్షి తముగా నావలియొడ్డును జేరఁగలిగిరి. ఆమె యీప్రకారముగా శత్రు వుల శిబిరముల చెంతనుండియే తనసేనలతో నడచి వారిని తప్పించు కొనిపోయి 1829 వ సంవత్సరము ఏప్రియల్ నెల 29 వ తేది రాత్రి యెల్లవారు నద్భుతపడునట్లుగా నార్లియన్సుపురమునఁ బ్రవేశించెను. ఆమె యట్లు పురప్రవేశము చేయఁగానే రక్షకురాలు వచ్చెనని పర

మానంద భరితులయి పౌరులందఱు నా బాలగోపాలము నొండొరులను ద్రోచికొనుచు నడచి యామెను సందర్శింపవలెనన్న కుతూహలముతో నామెచుట్టును మూఁగిరి: అప్పటి కర్ధరాత్ర మయినను మార్గా యాసముచేతఁ గడు బడలియున్నను విశ్రాంతినొందఁగోరక యామె కరదీపికలు వెలుఁగ ముందుగా దేవాలయమునకుఁ బోయి యచ్చట భక్తిపూర్వకముగా దేవునిఁ బ్రార్థించి కృతజ్ఞతాభివందనములు సమర్పించి, యటుపిమ్మట నాపట్టణములో నత్యంత పుణ్యశీలయని ప్రఖ్యాతిగన్న యొకయుత్తమ గృహిణి గృహమునకుఁ బోయి యామె యొద్ద శయినించెను.


మఱునాఁటి ప్రాతఃకాలమునందు నిద్రనుండి లేచినతరువాత నామె యుద్ధమునకు సంసిద్ధురాలయి బయలు వెడలెనుగాని జాలి గుండెగలది యగుటచేత నిష్కారణముగా ప్రాణహాని కలుగుట కిష్టము లేనిదయి లోఁబడవలసిన దని శత్రుసేనాధిపతి కొక యుత్తర మును వ్రాయించి దాని నొక బాణాగ్రమునఁ గట్టించి వింట సంధించి శత్రు సేనామధ్యమునఁ బడునట్లు విడిపించెను. అంతేకాక తాను వంతెనపొడుగునను నడచుచు నుచ్చైస్స్వనముతో ముట్టడిని విడిచి తొలఁగిపోవలసినదని యింగ్లీషుసేనలకు వినఁబడునట్లుగాఁ గేకలువేసెను. అయినను శత్రుసేనాధిపతు లిప్పుడును వెనుకటివలెనె యామె యుత్తరములను గాని మాటలను గాని నరకుచేయక యవమాన వాక్యములు పలికి యామెను బరిహసించిరి. పయికి వారెంత బింక మును జూపినను లోపలవారు భయభ్రాంతులు కాకుండినవారు కారు. జోన్‌కన్య తన విజయధ్వజమును బైకెత్తుకొని ధనుర్విముక్త మైన బాణమువలె సెంటులూపుకోటవైపు శత్రు సైన్యములమీఁదికి గుఱ్ఱమును దుమికించెను. సైనికులును ధైర్యోత్సాహములతోఁ బరు

గిడి వైరివారమును దలవడిరి. మూడుగంటలకాలము ఘోరయుద్ధము జరగిన తరువాత నింగ్లీషువారు పరాజితులయిరి. జోన్‌కన్యదయార్ద్ర హృదయముతో నడ్డుపడి కాపాడినవారు నలువది యేఁబదిమంది కాక కోటలోని యింగ్లీషుసైనికు లందఱును సంహరింపఁ బడిరి. మఱునాఁడు వండుగుదిన మగుటచేత యుద్ధము నిలుపఁబడినందున, జోన్ తన పక్షమువారితోఁ గలసి యీశ్వరప్రార్థనలతోను భజనలతోను నాఁడు కాలము గడపెను. మఱునాఁటి యుషఃకాలమున నెప్పటియట్ల తన జయపతాకతో జయలక్ష్మి సాకారయయినట్లు సేనాముఖము నలంకరింపఁగా లాహైర్ మొదలగు ఫ్రెంచి సేనానాయకులు తమసైన్యములతో శత్రువుల కభిముఖముగా నడచిరి. నాఁడు పగలంతయు మహాహవము జరగి యెక్కడజూచినను జోన్ సేనలకే జయము కలుగుచుండఁగా సాయంకాల మగునప్పటికి బాస్టిల్ దుర్గమొక్కటి తక్క శత్రువులకోట లన్నియు ఫ్రెంచివారి యధీనము లయ్యెను. ఆమె యాఁగాత్రి పట్టణమునకుఁ బోయి సుఖనిద్రపొంది తెల్లవాఱుజామున మరల యుద్ధయాత్రకు వెడలెను. బాస్టిల్ దుర్గమును సాధించుట యసాధ్యము గనుక స్వల్పసైన్యముతో దానిపై వెడలుట కర్తవ్యము కాదని హితముచెప్పి సేనాధిపతు లామెను నిరుత్సాహపఱిచినను, ఆమె యణుమాత్రమును వెనుకంజ వేయక లగ్గలువట్టి యాకోట సాధించుటకు నిశ్చయించి యాకోటవంక నడచెను. కోటముం దామె విగ్రహము కంటఁబడఁగానే ఫ్రెంచిసైనికులయొక్క దేహము లుప్పొంగి పోయెను; ఇంగ్లీషు సైనికులయొక్క గుండెలు పగిలిపోయెను. అది చదువుకొన్నవారు చదువుకొననివారును గూడ నేకరీతిగా మంత్రములను మహిమలను నమ్మినకాల మగుటచే, నామె క్షుద్ర దేవతల తోడ్పాటు కలదని యింగ్లీషుసేనలలో నెల్లను నమ్మకము

వ్యాపించెను. లగ్గలు పట్టుట కయి స్వయముగానే యామె నిచ్చెన యెక్కి కోటగోడమీఁదికిఁ బ్రాఁకు చుండెను. అప్పుడు శత్రువులచే విడువఁబడిన బాణమొకటి వచ్చి కంఠమునందు గ్రుచ్చుకొనఁగా నామె పట్టువదలి జలపూర మయిన క్రింది కందకములో తలక్రిందుగా కూలెను. ఇంగ్లీషువా రామెను బట్టుకొనుటకుఁ బ్రయత్నించిరి గాని యింతలో నామె పక్షమువారువచ్చి యామెను సురక్షిత మయిన స్థలమునకుఁ గొనిపోయిరి. గాయముయొక్క బాధచేత నామె కన్నుల నుండి కొంచెము నీరు కాఁజెను గాని యామె వెంటనే ధైర్యమువలం బించి తనచేతులతోనే బాణము నూడఁ బెఱికిఁగొని కట్టుకట్టించుకొని మరలరణరంగమునఁ బ్రవేశించెను. తాను గాయపడుదు నని యామె యీవఱకే చెప్పియుండి నందున సైన్యములో నిందుమూలమునఁ గొందలపాటు పుట్టలేదు. ఆమె యాకస్మికముగా మరల సమరతల మునఁ బొడచూపఁగానే ప్రేంచిసైనికుల యంతరంగము లద్భుతప్రమోద రసతరంగితములయి ద్విగుణితోత్సాహవంతము లయ్యెను. తాము కోటగోడనుండి కూలఁద్రోయుటచే నరచచ్చిన దనుకొన్నకన్నె కన్నుల యెదుట మరలఁబ్రత్యక్షము కాఁగానే యింగ్లీషుసైనికులస్వాంత ములు భయభ్రాంతములయి దిగుణీకృతనిరుత్సాహవంతము లయ్యెను. భయజ్వరావేశవివశు లైనయాసైనికులు కొందఱు మృత్యువు తమ మొగములవ్రేలఁగా వివర్ణులయి ప్రతిపక్షులపక్షమున దేవత లాయుధ పాణు లయినిలిచి తమసేనలను తుత్తుమురుగా నఱుకుచుఁ దమ ప్రాలఁ గనఁబడు చున్న వారని సంధి యెత్తినవారి వలెఁ బ్రల పించుచుఁ గాలుసేతు లాడక వెట్టిచూపులు చూచుచు తడఁబడఁ జొచ్చిరి. ఆసంక్షోభమును జూచి యింగ్లీషు సేనానాయకుఁ డగుగ్లాడ్సు డేలు తనసేనలోనెల్ల శూరాగ్రేసరు లనఁదగిన వీరభటులను వెంటఁ

గొని కోటలోవలఁ బ్రవేశించి పోరాడవలె నన్న చింతతో వంతెన మీఁదినుండి కోటగవనివంకఁ బోవుచుండఁగా, జోన్‌కన్య యాతనిని తారసించి యింతట నయినను లోఁబడవలసిన దని యాజ్ఞాపించెను. అతఁడామె మాటలను లక్ష్యముచేయక ముందువంక నడచుచుండఁగా ఫ్రెంచివారు వేసిన ఫిరంగిగుండొకటి తాఁకి వంతెన విఱిగి దానితో సేనాధిపతియు వీరభటులును నదిలోఁ గూలి సంఘాతమరణము నొందిరి. ఇంతటితో సంపూర్ణవిజయము ఫ్రెంచివారికిఁ గలిగెను. హత శేషు లెదిరింపనయినను బ్రయత్నింపక కాలుచేతులు కట్టి యొప్పింపఁ బడినవారి వలె ఫ్రెంచి సైనికులకు దాను లయి లోఁబడిరి. ఈ మూడుదినముల యుద్ధములోను నింగ్లీషుసైనికులు దాదాపుగా నేడెని మిదివేలు మృతినొందిరి. ఇట్లు నిరుపమానవిజయశోభిత యయి యామె స్వసైన్యముతోఁ బురప్రవేశము చేయునప్పుడు పౌరుల జయ జయనినాదములు మిన్ను ముట్టెను; ప్రతిదేవాలయమునందును విజయ సూచకము లయినజయఘంటలు మ్రోగెను. ఆమె యిట్లు ప్రజల సాధువాదములతో దేవాలయమునకుఁ జని సవినయముగా దేవునిఁ బ్రార్థించి కృతజ్ఞతాపూర్వకవందనశతము లర్పించెను. ఇప్పటికి జోన్ చేసిన మొదటిప్రతిజ్ఞ నెఱవేఱినది. ఈశ్వరునియెడల నవ్యాజభక్తి విశ్వాసములు గలయొకప్రాణి లోకములో నెంతటి యద్భుతకార్య ములను నిర్వహింపఁగలుగునో దీనివలనఁ దేటపడెను గదా! ఈవిజయ దినము మొదలుకొని జను లీమెను "ఆర్లియన్సుకన్య" యని పిలువఁ జొచ్చిరి.

జోన్‌కన్య యార్లియన్సునగరముయొక్క ముట్టడిని విడిపించిన మఱునాఁడే తన ప్రతిజ్ఞాశేషమును నెఱవేర్చుట కయి బైలుదేఱఁ బ్రయత్నముచేయ నారంభించెను. ఈమ్మునగరమునందు ఛార్లెసును



జోక్కన్య.

వట్టాభిషిక్తునిగాఁ జేయువఱకును తన కీశ్వరుఁ డిచ్చినయాజ్ఞను తాను చెల్లించి నట్లు కాదని యామె దృఢముగా నమ్మియుండెను. అందు చేతఁ దనకుఁ గలిగిన గెలుపున కుబ్బకయు దారి బడలికను గణన చేయకయు మెయినెల పదవతేదీనే యామె యాగ్లెన్సునగరమునువిడిచి బ్లాయిన్ పట్టణమును జేరెను. అక్కడనుండి యామె యెంతదీనముగాఁ బ్రార్థించుచు లేఖల నంపినను ఛార్లెస్సు త్రోవపొడుగునను బహు స్థలము లింగ్లీషునేనలచే నాక్రమింపఁబడినందున తానున్న తావు కదలి రీమ్సునగరమునకు వెడలసాహసింపకుండెను. అది యట్లుండ నిచ్చట

నార్లియున్ననగరములోని · సేనాధిపతులు తాముకూడఁ గొన్ని విజయములనొంది పేరు పడవలయు నని యింగ్లీషు సేనాధిపతియైన సస్సోకు ప్రభువుచే రక్షింపఁబడుచుండిన జార్గోదుర్గమును సాధించుటకయి సేనలతో వెడలి బహుదినములు పోరాడియు నేమియు చేయలేకపోయిరి. ఈవార్త తెలియఁగానే జోన్‌కన్య వారి సాయము నిమిత్తమయి వచ్చెను. ఆమె రాకవలన ఫ్రెంచిసేనలలో నుత్సాహ మపరిమితము కాఁగా నవలీలగా విజయము కలిగెను. అక్కడ జరిగిన ఘోరయుద్ధమునందు సస్సోకుప్రభువు పట్టుకోఁబడి కారాబద్ధుఁడుగాఁ జేయఁబడెను. ఇట్లు జార్గోదుర్గము లోఁబడగానే యితరదుర్గములను రక్షించుచున్న యింగ్లీషు సైనికులు శత్రువుల నెదిరించుటకైనఁ బ్రయత్నింపక యింతవఱకును మహాధైర్యశాలియని ప్రసిద్ధిగన్న టాల్బా టనుతమసేనానాయకునితోఁ గలిసి పలాయితు లయిరి. పాటో యను గ్రామమువద్ద జరిగినమహాయుద్ధములో నేక్‌ల్సు ప్రభువు, హంగరుఫోర్డు ప్రభువు, టాల్బాటు మొదలయిన ప్రసిద్ధు లయిన యింగ్లీషు సేనానాయకులు జోన్‌కన్యకు లోఁబడిరి. దైవ మాయ యేమోగాని యీయుద్ధమునం దింగ్లీషు సైనికులు రెండు మూడువేలమంది చంపఁబడిరను ఫ్రెంచిసేనలలో నొక్కఁడే హతుఁడయ్యెనఁట! జయము సంపూర్ణము కాఁగానే జోన్‌కన్య తన సైనికు లను వారించి వృథాసంహారమును మాన్పి .గాయపడినవారి గాయము లకు చికిత్సలు చేయుచు, ప్రాణోత్క్రమణదశయం దున్నవారి కీశ్వర భక్తినిగఱపి చిత్తశాంతిని గలిగించుచు, నుత్సాహముతోఁ బనిచేయఁ జొచ్చెను. తరువాత నామె సల్లే యను స్థలమునం దున్నరాజును గలిసికొని యీనూతన విజయవార్తను న్యాయముగాఁ దెలిపి, పట్టాభి షేకార్థము తత్క్షణమే బైలువెడలునట్లు రాజును బురికొల్పెను.

ఛార్లైన్సు మనస్సులో భయముపిడువనివాఁడయినను, ఆమెకు మాఱు మాట చెప్పలేక జీన్ పురముపద్ద పదివండ్రొమువేల సేనలను గూర్చు కొని యామెవెంట రీమ్సునగరమునకుఁ బోవఁ బ్రయాణ మయ్యెను. అతఁడు జోకన్యయొక్క యమూల్యసాహాయ్యముచేత త్రోవపొడు గునను నున్న ట్రాయిస్ మొదలయిన పట్టణముల ననాయాసముగా స్వాధీనము చేసికొనుచుఁ బోయి జూలయి నెల 16 వ తేది సాయం కాలము జోన్‌కన్య యశ్వారూఢయయి తనప్రక్కను జనఁగా సుర క్షితముగా రీమ్సునగరమునందుఁ బ్రవేశించెను. ఆమఱునాఁడే రాజు యొక్క పట్టాభిషేక మహోత్సవము మహావైభవముతో నడచెను. పవిత్రమైన యాసంస్కారము జరుగుచున్నంతవఱకును జోన్‌కన్య తన ధ్వజపటమును జేతఁబట్టుకొని రాజుప్రక్కను వేదికకడ నిలువఁబడి యుండెను. ఈవైదికకర్మ ముగియఁగానే యాకన్య దేహము పులకింప కన్నుల నానందబాష్పములు గ్రమ్మ వినయముతో రాజుపాదముల మీఁదఁ బడి "ఓమహారాజా! ఆర్లీయన్సు నగరముయొక్క ముట్టడి విడుటయు మీరికక్కడ పట్టాభిషిక్తు లగుటయు నామూలమున జరగ వలెనని యుద్దేశించిన భగవత్సంకల్పము నెఱవేఱి నేను ధన్యురాల నైతిని." అని విన్నవించెను. ఈశ్వరుఁడు తనకు నియమించిన యాజ్ఞ పూర్ణముగా నెఱవేఱినందునఁ దా నిఁక యూరికిఁ బోయి తొంటి యట్ల యుండుటకయి యామె యభిలషించెను. ఆమె యక్కడనున్న సమయములో నామె తండ్రియు మేనమామయు నచ్చటికి వచ్చిరి. వారిని జూడఁగానే స్వగ్రామమునకుఁ బోవలె నన్న యభిలాషము మఱింత హెచ్చుగా వారివెంట డోమ్రెమిగ్రామమునకుఁ బోవ ననుజ్ఞ యియ్యవలసినదని యామె రాజును బ్రార్థించెను. అయినను రా జామెవలన నింకను మేలును బొందవలె నన్న యాశతో నామె

పోక కనుమతింపక పోయెను. అందుచేత లోపలఁ దన కెంత యిష్టము లేకపోయినను, ఈశ్వరుఁడు తన్నుఁ జేయుమన్న పని యంతే యని నమ్మిన దైనను, రాజాజ్ఞ నుల్లంఘింపఁజాలక యందు నిలువవలసిన దయ్యెను. రాజు మూడుదినములు రీమ్సునగరమునం దుండి యచ్చట నుండి జోక్‌కన్య వెంటరాఁగా నైదుక్రోసులదూరములోనున్న యొక పుణ్యస్థలమునకు తనకృతజ్ఞతను దెలిపి యీశ్వరునికి వందనములు సమర్పించుటకయి పోయెను. అతఁడచ్చట నున్నప్పుడు జోక్‌కన్యను బిలిచి కావలసినవరములను గోరుమని ప్రార్థించెను. ఆమె తన గౌరవము నిమిత్తమయి యియ్యఁదలఁచిన బిరుదులను బహుమానములను సమస్తమును నిరాకరించి తన గ్రామమువారి కప్పటినుండి పన్నులు లేకుండ ననుగ్రహింపవలసిన దని వేఁడెను. ఆమె కోరిన ట్లప్పు డనుగ్రహింపఁబడిన రాజశాసనము తరువాత ననూఁఆ సంవత్సరములవఱకు నవిచ్ఛిన్నముగాఁ జెల్లెను.

రా జిట్లు విజయయాత్రలు చేయుచు ఫ్రాన్సుదేశమునకు రాజధానియైన పారీసు నగరమును సమీపించెను. జోన్ యుద్ధముల యందు మునుపటివలెనే ధైర్యసాహసములను సహనమును గనఁబఱుచు చుండినను, తా నీశ్వరాజ్ఞానుసారముగా వర్తించుచున్నదాన నని భావింపనిదయి యప్పటి యుత్సాహమును మాత్రము లేనిదయి యుండెను. రాజు సెంటు డెనిస్ దుర్గమునుండి తన పూర్వరాజధానిని జూచెను. రా జాదుర్గమును విడిచి కదల నొల్లకున్నను జోక్‌కన్య సేనలను నడువుకొనిపోయి మొదటియుగడితను దాఁటెను. అప్పు డా పట్టణము నింగ్లీషుసేనాధిపతులును బర్గండీ ప్రభువును పదివేల సేనలతోఁ గాపాడుచుండిరి. అమె యుగడితను దాఁటి కొంతదూరము సాగ

గానేమిందు జలపూర్ణమయి దుస్తరమైన మహాపరిఖ యింకొకటి కానపచ్చెను. ఆమె యక్కడనుండి పూర్వరీతినే పట్టణమును ఫ్రెంచి రాజు నధీనము చేసి లోబడవలసిన దని యింగ్లీషుసేనాధిపతుల కాజ్ఞాపించినను, వా రామాటలను సరకుసేయక గేలి సేయుచు శరవర్షమును గురిపింప నారంభించిరి. అక్కడనుండి వెనుక మరల వలసిన దని ఫ్రెంచి సైనికు లామెను ప్రార్థించిరి గాని యామె వెనుకంజ వేసినదికాదు. ఆమె కాలి కొక గొప్ప గాయము తగిలినను బాధ దుస్సహముగా నుండినను కాలుగదలుపక యొక దిబ్బ చాటున నిలుచుండి సేనలను ముందుకు నడప నుత్సాహపరుచు చుండెను. చీకటి పడినతరువాత ఫ్రెంచిసేనానాయకుఁ డామెవద్దకు వచ్చి యామెను వెనుకకుఁ బంపివేసెను. ఈ యపజయమువలన హృద యము చెదరిన దయి యామె తా నిప్పు డీశ్వరాజ్ఞకు విరుద్ధముగా నడుచుచున్నందున ముందుగా దేవుఁడు తన కీయాపద్రూపమున హితోపదేశము చేయుచున్నాఁడని తలఁచి యిఁక ముందు యుద్ధ సంబంధమును వదలుకొన నిశ్చయించుకొనెను. ఆమె రాజుసన్నిధినుండి తొలఁగి స్వగ్రామమునకుఁ బోవఁదలఁచెనుగాని రాజును తదాస్థా నమునందలి ప్రముఖులును సమ్మతింపక యందే కొంతకాల ముండు నట్లు బహువిధములఁ బ్రార్థించి యొడఁబఱిచిరి. అంతట రాజకుండ నుండి వెనుక మరలి బోర్డైన్ పట్టణమునందు శీతాకాలము గడచువఱ కును నిలిచెను. ఇక్కడ నున్నకాలములో రాజామెకు ప్రభ్వీపట్ట మును నామెకుటుంబమున కంతకు ప్రభుపట్టమును నొసఁగి గౌర వించెను. ఇట్లెన్నిగౌరవములు వచ్చినను జోన్ తన పూర్వవేషమును మార్చుకొనక, శుద్ధహృదయురాలై తనకాలము నీశ్వరసేవయందుఁ గడపు చుండెను.

ఇంగ్లీషుసేనలును బర్గండీప్రభువు సేనలును వచ్చి ఫ్రెంచివారి
దైన కాంపేనుదుర్గమును ముట్టడించిరి. ఆపట్టణమును విడిపించుట
కయి కొంతసేనతో బోయి జోన్‌కన్య శత్రువులను తలపడెను. ఆమె
యుద్ధమునం దనన్యసాధారణశౌర్యమును గనంబఱచి పోరాడినను
కడపట శత్రువులచే బట్టుపడి కారాబద్ధురాలుగాఁ జేయఁబడెను.
ఆమెపాటును జూచి తమప్రాణము లైన నిచ్చి యాధీరురాలిని విడి
పింపవలసిన ఫ్రెంచిసైనికులు పౌరుషమును విడనాడి స్వప్రాణరక్ష
ణార్థము పారిపోయిరి. అప్పు డింగ్లీషుసేనలలో ఫ్రెంచిరాజ్యమంతయుఁ
దమకు లోఁబడినంత సంతోషము కలిగెను. ఆమె వచ్చునంతవఱకును
తా మెక్కడఁ జూచినను జయము పొందుచుంటి మనియు, తమ
యాపదలకెల్ల నామెయే మూల మనియు, ఆమె దయ్యములసాహా
య్యమునఁ దమ్ము పరాజితులను జేయుచువచ్చిన దనియు, ఆమెను
మరల ప్రాణములతో విడిచినపక్షమున తమముప్పు నిశ్చయ మనియు,
ఇంగ్లీషువారు నమ్మి యామెయెడల నత్యంతక్రోధులయి యుండిరి.
అందుచేత నొకస్త్రీ యామె మంచికై స్తవభక్తు రాలనియు నీశ్వర
ప్రసాదము గలదనియు చెప్పినంతమాత్రమున పారీసునగరమునం
దాస్త్రీని బ్రతికి యుండఁగా బట్టలకు నిప్పంటించి కాల్చి చంపిరి.

ఆఱుమానములు చెఱసాలయం దున్నతరువాత జోన్‌కన్య
నాకాలమునం దింగ్లీషురా జయిన హెన్రీ యున్నటువంటి రుయాన్
పట్టణమునకుఁ గొనిపోయిరి. యుద్ధమునందుఁ బట్టుపడిన శత్రువీరుల
నాదరముతోఁ జూచుట యాచార మయినను, ఇంగ్లీషువారు యుద్ధ
ధర్మములను పాటింపక నీతిమాలినవా రయి జోన్‌కన్యయెడల మిక్కిలి
క్రూరముగాఁ బ్రవర్తించిరి; ఈమెకాళ్ళకు సంకెలలు వేసి పగలెల్లను
బంధించి యుంచుచు వచ్చిరి; రాత్రులు మొలకు బలమైనయినువ

గొలునును జుట్టి కట్టి కదల మెదల నవకాశము లేకుండఁ జేయుచు వచ్చిరి. వా రామెప్రాణముల నేలాగునైనఁ దీయ నిశ్చయించుకొన్నందున, దయ్యములను వశపఱచుకొని యీశ్వరద్రోహిణియయ్యె ననుమహాదోషము నామెయం దారోపించి విచారణనిమిత్తమామెను మతాచార్యులయధికారమున నొప్పగించిరి. లౌకికవ్యవహారానుసార ముగా విమర్శించెడుపక్షమున నామెయం దారోపింపఁ దగిననేర మేదియు లేదు. వారు చేయఁదగిన దంతయుఁ గొంత విడుదలసొమ్మును స్వీకరించియో శత్రువులచేఁ బట్టువడిన తమవారికి పరివర్తనముగానో యామెను విడువవలయుట తప్ప వేఱేదియు నుండదు. ఈవిమర్శ పయికి న్యాయముగాఁ గనఁబడుట కయి వన్నినతంత్రమేగాని న్యాయాధికారులుగా నిర్ణయింపఁబడిన యాచార్యపీఠమువా రావఱకే యామెకు ప్రాణాంతదండనమును విధింప నిశ్చయించుకొని యుండిరి.

ఆమె నావఱకు రహస్యముగపదునేనుమాఱులు విమర్శించినను, బహిరంగముగా విచారణ చేయుట కయి 1431 వ సంవత్సరము ఫిబ్రవరినెల 21 వ తేదిని ధర్మాధికారులవద్దకుఁ దెచ్చి నిలిపిరి. ఆమె పక్షమున వాదించుటకయి న్యాయవాదుల నెవ్వరి నంగీకరింప లేదు. ఆమె కవ్వడున్న బలమంతయు తాను నిర్దోషురాలనని దృఢముగా నమ్మి యుండుటచేఁ గలిగినధైర్యబలమును పరమేశ్వరభక్తిబలమును ఈరెండుబలములును గలిగి యుండుటచేత నణుమాత్రమును జంకక వివక్షులముందు నిశ్చలురాలయి నిలిచి యుండెను. వక్రస్వభావులైన యాధర్మాధికారు లామె నేమాయోపాయముచేతనైనను వంచించి ప్రశ్నలువేసి పడఁదోసి దోషురా లనిపింపవలెనని కుతంత్రములుపన్ని కుయుక్తులు చూపి యేమేమో ప్రశ్నలు వేసిరిగాని యామె చెప్పిన యుత్తరములలో దేనివలనను నామెయందు దోషారోపణము

చేయుట కవకాశము దొరకలేదు. నీవు పురుషవేషము నేలవేసితి వని వా రడిగినప్పు డామె యీశ్వరాజ్ఞానుసారముగా వేసితి నని యుత్తర మిచ్చెను. ఆమె యీశ్వరద్రోహిణి యని సిద్ధాంతము చేయుటకై యీయయంశమే ప్రబలమయినట్టు వివేకహీను లైన యామతాచార్యుల దృష్టి కప్పుడు కనుపట్టెను. విచారణసమయమునం దామెవర్తనమును జూచుచుండిన యొక యింగ్లీషునాఁడు "యీయుత్తమకన్య యింగ్లీషు జాతి దయ్యెనా యెంతటి శ్లాఘ్యస్థానులుగా నుండును!" అని పలు కుచు నాశ్చర్యవడెను. అప్పు డామె ధర్మాధికారు లామెకు దయ్యాలమూఁకితనము నారోపించుచు పెండ్లెండు నేరములు మోపి పారీసునగరవిద్యాగురుపీఠమువారు వారితీర్పును స్థిరపఱిచిరి. ఆమె చెఱసాలయం దుంచఁబడిన తరువాత సంవత్సరమున కనఁగా 1431 వ సంవత్సరము మెయినెల 24 వ తేదీని మతాచార్యు లామె యపరాధి నిగా నిర్ధారణము చేయఁబడె నని బహిరంగముగాఁ దెలిపిరి. తరు వాత వారముదినముల కొక మతాచార్యుఁడు ధర్మాధికారులచే నియ మింపఁబడి యామె యున్న కారాగృహమునకుఁ బోయి యామెను ననే యామె రుయాన్‌పురియందలి యుంగళ్ళవాడనద్ద తరులఁబెట్టఁ బడు నట్లు తీర్పు చేయఁబడె నని చెప్పెను. తనకు విధింపఁబడిన యా క్రూర మరణదండనవార్తను వినఁగానే ధైర్యమును గోలుపోయి యామె దీనముగా విలపించెనుగాని శీఘ్రముగానే మరల ధైర్య మవ లంబించి శాంతచిత్త యయ్యెను. ఆయుధపాణు లయిన యెనిమిదివందల యింగ్లీషుభటు లామెను కాచి రాఁగా నామె వధ్యస్థానమునకుఁ గొని పోఁబడెను. ఆమె ప్రోవపొడుగునను తనయాత్మ నీశ్వరసమర్పణము చేయుచు భక్తిపూర్వకముగా నొనర్చిన నిష్కళంక ప్రార్థనలను విని చూడవచ్చినవా రనేకులు కంట తడిపెట్టి యేడువసాగిరి; ఆమె కీర్తిక్ష

కలిగించుటలో సహకారు లయి యామె చావును జూచి సంతోషింప
వలెనని బంధులుదేతినవారు సహిత మనేకులు గుండెలు పగిలి నడి
దారినుండి వెనుకకు మరలిపోయిరి. ఆమె వధ్యస్థానమునకుఁ గొనిపో
బడునప్పటికే నిర్దయు లయిన మతాచార్య లక్కడ కాష్ఠములను
భేర్పించి చితి నమర్చి తమ క్రూరకిరాతకృత్యమును నెఱవుటకు సంసిద్ధు
లయి తమద్వేషాగ్నికి బలిపెట్టఁ దలఁచిన యానిర్దోషురాలి రాకను
వేచియుండిరి. దుఃఖకర మయిన తరువాతి క్రూరహింసాకర్మమును
పెంచి చెప్పుట యుచితము కాదు. ఆమె చితిపయి కెక్కి, వెనుక
వయిపున పాతిపెట్టఁబడిన నిలువుగుంజ కంటఁగట్టఁబడి నిలిచి, విస్పష్ట
మయిన కంఠస్వరముతో తనదోషములను మన్నింప నీశ్వరుని ప్రార్థించి,
తనయెడల నపరాధు లయినవారి నందఱిని క్షమింప భగవంతుని
వేఁడి, యాశ్వాసేచ్ఛ నెఱవేఱును గాక యని పలికి యూరకుండెను.
ఆమాటలు చెవినిఁ బడఁగానే యామె నపహసింప నిశ్చయించుకొని
వచ్చినవారు సహిత మనేకులు కన్నులనీరుకార రోదనము చేయఁ
జొచ్చిరి; ఆమె క్రూరవధను గన్నులారఁ జూచి సంతోషింపవలె నని
వచ్చి యున్నతాననముల నలంకరించియున్న దయాశూన్య లయిన
మతాచార్య లనేకు లచ్చట నిలువలేక బలివేదికను డిగ్గి వెడలిపోయి
రఁట! మతపిశాచావేశపరవశు లయి దయాధర్మదూరు లయి యుండు
మతాచార్యకిరాతులను మించు ప్రత్యక్షరాక్షసులు లోకములో వేఱొక
రుండఁజాలరు గదా? కాష్ఠమునకు నిప్పంటింపఁబడిన యల్పకాలము
లోనే క్రేతాగ్నులని చెప్పఁదగిన విరోధు లగు నింద్లీషువారి క్రోధా
గ్నికిని మతాచార్యుల ద్వేషాగ్నికిని ప్రజ్వలిత మయిన కాష్ఠాగ్నికిని
నిర్మల చరిత యయిన యాసాధ్వీమణియొక్క యనిత్యదేహ మాహుతి
యయ్యెను. ఈక్రూరహత్య ముగియునప్పటికెల్ల నెల్లవారి మనస్సుల

లోను తాము దేవదూతను నిష్కారణముగాఁ జంపి పాపము కట్టు
కొంటి మన్న విచారము కలిగెను. కొంద ఱా మె దేహము దహింపఁ
బడుటకు మాఱుగా తమ దేహములు దహింపఁబడిన మేలుగ నుండునని
తలఁచిరి. మూఢవిశ్వాసములును మతోన్మాదమును మనుష్యుల
మానుషత్వమును రూపుమాపి వారిచే నెటువంటి క్రూరకృత్యము
లను జేయింపఁజాలవు? అటువంటి యమానుషశౌర్యమే యీకాలము
నందుఁ జూపఁబడినవక్షమున శత్రువులు సహిత మామెను శ్లాఘించి
పూజించి యుందురుగదా! ఈనరహత్య కొడిగట్టిన స్వదేశీయులైన
మతాచార్యులకును పరదేశీయులైన యింగ్లీషు వారికిని నిది తీరనియప
కీర్తిగా నున్నది. పాపకార్య మెప్పుడును జయప్రదముకాదు. స్వప్ర
యోజనార్థముగాఁ దమపక్షమున చేరిన బర్గండీప్రభు వెదురు తిరుగుట
చేతను క్షంతవ్యముగాని యీక్రూరహత్యవలనఁ గలిగిన జనద్వేషము
చేతను క్రమక్రమముగా నింగ్లీషువారు ఫ్రాన్సుదేశములోని తమ
రాజ్యము నంతను నల్పావశిష్టముగాఁ గోలుపోయి స్వదేశమునకు
మరల వలసినవా రయిరి. ఆకన్యకామణివలనఁ దా నంత మహోప
కారము నొందియుఁ దన యుపకర్తి తన నిమిత్తమయి శత్రువులపా
లయి సంవత్సరకాలము చెఱసాలయం దుండినప్పు డామెను విడిపించుట
కయి ప్రయత్నింపక యుపేక్షించిన ఛార్లెస్ రాజును మిత్రద్రోహియు
మహాపాపియు నని చెప్పవచ్చును. ఇట్లు ఛార్లెస్ రాజ్యలాభమును
బొంది చిరకాలము పాలనము చేసినవాఁ డయ్యును మనశ్శాంతి లేక
తుదకుఁ దనకొడుకే తనకు విషముపెట్టు నన్న భీతిచేత నాహారమును
విసర్జించి పస్తుపడి కృశించున కర్వామయిన యపాత్రపుచావే చచ్చెను.
విమర్శ యని పేరుపెట్టి న్యాయాధికారుల మని ధర్మస్థానమునఁ గూరు
చుండి యన్యాయముగా నిరపరాధినికి మరణదండనము విధించిన

పాపము మనస్సులను బాధింపఁగా, మఠాచార్యసంఘమువారు 1456 వ సంవత్సరమున మరల రీమ్సునగరమునందుఁ గూడి పునర్విమర్శ చేసి వెనుకటితీర్పును త్రిప్పివేసి జోన్ నిరపరాధిని యని తీర్పు చెప్పిరి. దొంగలు పడినయాఱునెలలకు కుక్క మొఱిగినదన్నట్లు నిర్దోషిణి చంపఁబడిన యిరువది యైదు సంవత్సరములకు గురుపీఠము వారు చేసిన తీర్పు నెంతని మెచ్చుకోవచ్చును! ఈసాధ్వియొక్క యత్యద్భుత కార్యములను వర్ణించుచుఁ దరువాతికవులు ప్రబంధములను జేసిరి; విద్వద్గాయకులు నాటకములను గీతములను రచించి యాడి పాడిరి; దేశమం దంతటను బహిస్థలములయం దామెకు ప్రజలును ప్రభువులును ప్రతి రూపములను నిలిపిరి. రుయాన్‌పురమునం దామె యగ్నిలో నావాహితి చేయఁబడిన వేదికయందు సుందర మయినమందిరము కట్టఁబడి యామె గుణవరనము శిలాక్షరములుగా నిగనిగలాడు పాలరాయి పయిని చిత్రింపఁబడెను.

Mrs. ELIZABETH FRY.

ఎలిజెబెత్ ఫ్రైదొరసాని.



ఫ్రైదొరసాని 1780 వ సంవత్సరము మెయినెల 21 వ తేదీని ఇంగ్లండుదేశమునందు జనన మొందెను. ఆమెతండ్రిపేరు జాన్ గర్నీ; తల్లిపేరు కేథరైన్ బెల్. ఆమెతల్లిదండ్రు లిరువురును ధనసంపన్నము లయి సుప్రసిద్ధము లయినవంశములయందు జనియించినవారు. తండ్రి మహాధనసంపన్నుఁడు; తల్లి విద్యారూపగుణసంపన్నురాలు. ఎలిజెబెత్తనునది పసితనములో జననీజనకు లీమెకుఁ బెట్టినకన్యకానామము; ఫ్రైయనునది వివాహబంధమువలనఁ గలిగిననామము. తల్లిదండ్రులకుఁ గలిగిన పండ్రెండుగురుబిడ్డలలో నీమె మూడవది. ఈమెకు తోడఁబుట్టినవాండ్రు నలుగురును తోడఁబుట్టిన పడుచు లేడుగురును నుండిరి. బాల్యమునం దీమె చుఱుకుఁదనమును నూత్నబుద్ధియుఁ గలదియేయైనను విద్యయం దంతగా శ్రద్ధవహించి పేరుపొందినది కాదు. శైశవమునం దీమె పుష్పములయందును సృష్టివై చిత్ర్యముల యందును, ప్రీతికలదయి, తల్లివెంట నుద్యానవనమునందుఁ దిరుగు

నవ్వాడు వృక్షలతాదులయొక్కయు పుష్పవల్లవాదులయొక్కయు సౌందర్యమున కాశ్చర్యపడుచు డెందమునం దానందించు చుండెను. ఉత్తమప్రవర్తనము గలదియు విద్యావతియు నైనతల్లి యొక్కనుగుణ సంపదనుబట్టి యీచిన్నది దయార్ద్రహృదయ యయి బీదలయొక్కయు వ్యాధిగ్రస్తులయొక్కయు సండ్లకుఁ బోయి యుపచారములచేతను మంచిమాటలచేతను వారి నాదరించుచు వచ్చెను. ఉగ్గుపాలనాటి నుండియు పరోపకారచింతను గటుపిన యీయుత్తమమాతను గోలు పోవలసినదురవస్థ పండ్రెండేండ్లయీడునకే యీబాలికకు సంభ వించెను. ఇట్లు 1792 వ నవత్సరమునందు మాతృమరణదుఃఖము సంభవించునప్పటికి తల్లికడుపునఁ బుట్టినపండ్రెండుగురిలో నగ్రసంతా నమునకు పదునేడేండ్లప్రాయమును కనిష్ఠసంతానమునకు రెండేండ్ల యీడును నుండెను. ఈమెతండ్రి తనబిడ్డలు మంచివారును సమర్థు లును గావలె నన్నయభిలాషతో వారికి విద్యాబుద్ధులు నేర్పించుట యం దత్యంతశ్రద్ధ వహించుచుండెను. ఈమె చిత్రలేఖనమునందును సంగీతమునందును నాట్యమునందును మహాసమర్థురా లయ్యెను. ఈమెకంఠస్వరము కిన్నరస్వరమువలె నత్యంతమధురమై వినువారి వీనులకు విందు గొలుపుచుండెను. అశ్వారోహణమునందుసహిత మీమెకు నిరుపమాన మైనప్రవీణత కలిగి యుండెను. ఈమె తన యక్క లిద్దఱివలె సంతచక్కనిది కాకపోయినను, పలుచని పొడవైన శరీరమును పట్టువలె మృదువై నదీర్ఘశిరోజములును కలకలలాడెడు నవ్వుమొగమును గలదై మొత్తముమీఁద రూపవతి యనఁదగినదిగానే యుండెను. ఈమె బాల్యావస్థలో తాను పట్టినపట్టెకాని యితరులు చెప్పినమాట వినకుండెడుస్వభావము కలదిగా నుండె నఁట! పెంకెప ట్టని యాకాలములో నెల్లవారును భావించి గర్హించిన యాగుణమే

పెద్ద పెరిగినతరువాత సత్కార్యాచరణముచందలి నిర్నిరోధమైన పూని
కగా మాటి యీమె కమూల్యగుణాలంకార మయి యెల్లవారల శ్లాఘు
నకును యోగ్య మయ్యెను. పదునాఱుసంవత్సరముల ప్రాయ మప్పు
డీమెకు వచ్చిన యొక గొప్పవ్యాధి వలననే యీమెకు పరార్థపరత్వ
మధిక మయినను, 1798 వ సంవత్సరారంభమున వినఁ దటస్థించిన
యొక మతగురువుయొక్క ధర్మోపన్యాసమువలన నీమె పునస్సృష్టి
యైనట్లు పూర్ణముగా మాఱిపోయెను. పదునేడేండ్లప్రాయమునం
దుండిన యీమె యప్పుడు తనగ్రామములోని బీదబిడ్డల విద్యాభివృద్ధి
నిమిత్తమయి యొకపాఠశాలను ప్రప్రథమమున నొక్క పేదబాలు
నితో నారంభించెను. ఆపాఠశాల దినదినాభివృద్ధినొంది యల్పకాలము
లోనే పెద్దదయి, ఆమె వివాహానంతరమున పిత్రృగృహమును విడిచి
భర్తృగృహమునకుఁ బోవలసివచ్చునప్పటి కెనుబదియేడుగురు బాలు
రను బాలికలను గలది యయ్యెను. ఆపాఠశాలయందలి పిల్లలు విద్యా
బుద్ధులయందు వృద్ధిఁ బొందుటయేగాక యీమెయం దత్యంతాను
రాగము గలవా రయి యీమె వియోగమునకు తల్లిని విడువవలసిన
బిడ్డలవలెఁ బరితపించిరి. అంత పెద్దపాఠశాల నన్యులసాహాయ్యమును
గోరక యొక్కతెయు నీమె యెట్లు సమర్థతతో నిర్వహింపఁ గలిగి
నదో యాశ్చర్యముగా నున్నది.

ఈమె తనకు పందొమ్మిదియేండ్లు నిండినతరువాత 1800 వ
సంవత్సరమునందు ఆగష్టునెల 19 వ తేదిన జోసఫ్ ఫ్రైయను నాతనిని
వరించి వివాహము చేసికొనెను. అతఁడొక గొప్పవాణిజ్య సంఘము
నందు భాగస్థుఁడుగా నుండెను. ఈవధూవరు లిరువురును పరస్పరాను
రాగము గలవారయి, శరీరములు వేఱైనను మనస్సొక్కటియే యైన
ట్లైకమత్యముతోఁ గలసి మెలసి వర్తించుచుండిరి. భర్తయుం దవ్యా

జానురాగము గలది యగుటచేత, భార్య హృదయపూర్వకముగా భర్తకు విధేయురా లయి తదాజ్ఞానుసారముగా మెలఁగుచుండెను. భార్యయందు విశుద్ధ ప్రేమము గలవా డగుటచేత భర్తయు భార్య మాటయుం దాదరము గలవాఁ డయి యామె మనస్సు కనిపెట్టి యును కూలుఁ డయి ప్రవర్తించుచుండెను. ఇట్లు ప్రతివిషయమునందును దంపతులమనస్సు లొక్కటి యయి యేకీభవించు చుండుటవలన గృహము నిరంతరసుఖదాయక మయి భూతలస్వర్గమువలె నుండెను. ఆమె గృహావ్యయములను గూర్చి సరియైన లెక్క లుంచి, భోజనవ్యయ ములు, వస్త్రములు, తోఁటఖర్చులు, సేవకులజీతములు, ధర్మము మొదలయినవి వేఱువేఱుగా పద్దులు వ్రాయుచు నేమియు దుర్వ్యయము కాకుండ నాదాయవ్యయములను చక్కఁగా విమర్శించు చుండెను; సేవకులయం దనురాగము గలదయి వారిమనస్సులు నొప్పిం పక వారివలన నేర్పుతోఁ బనులు గొనుచు వారి ప్రేమకుఁ బాత్రురా లయ్యెను. విద్యావతు లయిన యువతులు భర్తల కడఁగి యుండరనియు గృహకృత్యములను నిర్వహింపఁ జాలరనియు ప్రలపించెడు మన యార్యావర్తములోని యపూర్వబుద్ధిమంతు లీకాంతామణియొక్క పవిత్ర చరిత్రమును జదివియైనను విదుషీ విదూషకులు గాక బుద్ధి తెచ్చుకొందురుగాక.

భర్తవలన సీమకు పదునొకండుగురు బిడ్డలు పుట్టిరి. బిడ్డల యం దీమె యపార ప్రేమము గలదయి వారిసంరక్షణము నితరులకు విడిచిపెట్టక స్వయముగా తానే చేయుచు, కొంతయీడు వచ్చువఱి కును రాత్రిం దివములు వారి నెప్పుడు నేమఱక కంటికి రెప్పనలె సదా కాపాడుచుండెను. వారిలో నెవ్వరి కెంత చిన్నజబ్బు చేసినను వారి యల్పబాధను సహితము చూచి సహింపలేక శోకించుచు, కావలసిన

యువచారములను పథ్యపానములను తానే చేయుచు, వారు స్వస్థతపడు వఱకును మనశ్శాంతిలేక పరితపించుచుండును. పిల్లలును తల్లియెడల నపరిమితప్రేమ గలవారయి, తల్లి యొక్కనిమిషము తమకంటఁ బడకపోయిన పక్షమున మిన్ను విఱిగి మీఁదఁ బడినట్లు లేమియుఁ దోఁపక విచారగ్రస్తులయి యుండి దూరమునుండి యామె కంట సర్వము వినఁబడగానే పట్టరాని యానందముతో నెదురుగా పరుగెత్తు కొనిపోయి తల్లిని కౌఁగలించుకొనుచుందురు. ఇట్లీమె బిడ్డలయం దింత ప్రేమ చూపునదిగా నుండినను, పిల్లల నల్లరిచేయనీయక వారినెల్లప్పు డును నాజ్ఞాబద్ధులను గానే యుంచు చుండెడిది. వారిని తనకిష్టములేని వనినుండి మరలించుట కయి యొక్క పరుషోక్తిసహితమునోటినుండి పెడలవలసిన యక్కఱ లేక ప్రేమాస్పదము లయిన కన్నులనుండి వెలు వడెడి యనంగీకారసూచకమైన యొక్కచుఱుకుచూపో భ్రూసంజ్ఞయో చాలి యుండును. ఇట్లు ప్రేమానుబంధముచేత బద్ధులయి యామె కాజ్ఞానువర్తులయి భయభక్తులు మాపుచు మెలఁగుచుండెడివా రొక్క బిడ్డలుమాత్రమేకారు, దాసదాసీజనులును ఆమె యెడల మాతృ భక్తి కలవారయి స్వకృత్యముల నణుమాత్రము నేమఱక, ఆమె యాజ్ఞల నతిక్రమింపక పరమవిధేయులయి శ్రద్ధాభక్తులతో జరుపు చుండెడివారు. ఆమె తనపరివారమును స్వకుటుంబములోనివారిని గానే భావించి ప్రేమించుచు, వారు ప్రమాదవశమునఁ జేసిన తప్పు లను క్షమించుచు, వారిని దన బిడ్డలవలెనే యాదరించుచుండినను, వారిని మనస్సువచ్చినట్లు తిరుగనీయక యెప్పుడును తగిన కట్టుపాటు లోనే యుంచుచుండెను. అందుచేత వారు తమ యజమానురాలి యెడల భక్తివిశ్వాసములు కలవారయి సర్వదావినయవిధేయతలతో సేవించుచు, తమపనుల నత్యంతశ్రద్ధాళువులయి యుక్తకాలములలో

నిర్వహించుచు, ఆమె యాజ్ఞలనెల్ల శిరసావహించి హృదయపూర్వ
కముగాఁ జేయుచు ఆమె నిమిత్తమయి యావశ్యక మైనయెడలఁ దమ
ప్రాణముల నైన సమర్పించుటకు సంసిద్ధులయి యుండునంత యను
రాగము గలవా రయి యుండిరివారుం.

1813 వ సంవత్సరమునందు లండన్ నగరమునందలి 'న్యూగేట్' (నూతనద్వారము) అనుపేరుగల ప్రధానకారాగృహ
ము లో నుంచఁబడియుండు స్త్రీలయొక్క దుస్థితినిగూర్చి శోచనీయము
లయిన కథలు పైత్రిదొరసానియొక్క చెవి సోఁకెను. వారి దుఃఖకథ
లను విని యామె మనస్సునందు సంతాప మొంది తనసహోదరీతుల్య
లయిన యాయభాగ్యురాండ్ర యొక్క దారాభాగ్యమును గొంతవఱ
కైనను దొలఁగించి వారిని మంచిస్థితికిఁ దెచ్చుట యెట్లు సాధ్యమగునా
యని యామె తలపోయఁ జొచ్చెను. ఆచెఱసాలలోని యిన్నూఱు
ఘనగజముల వైశాల్యముగల నాలుగుచిన్నగదులలో మున్నూఱు
గురు కారాబద్ధురాండ్రు వారివారి బిడ్డలతోడఁ గూడ నుంచఁ బడిరి.
వారిలోఁ గొంద ఱపరాధినులు, కొందఱు నిరపరాధినులు; కొందఱు
విమర్శింపఁబడి దోషస్థాపనానంతరమున శిక్షింపఁబడినవారు; కొంద
ఱింకను దోషనిర్ధారణము లేక విమర్శార్థము తేఁబడినవారు; కొందఱు
నరహత్యాది ఘోరపాపముల కొడిగట్టిన కఠినచిత్తురాండ్రు; కొందఱు
దారిద్ర్యదోషముచేత నల్పాహారవస్తుచౌర్యాదులకు లోఁబడవల
సినవా రయిన పశ్చాత్తప్తచిత్తురాండ్రు. ఇట్టి నానావిధవిశేషగుణ
ములవా రందఱు తారతమ్యవిభేదము లేక యేకసమూహాముగా
నక్కడఁ జేర్పఁబడియుండిరి. వారికిఁ బ్రొద్దు గడచుట కక్కడ పని
యేమియు లేదు; వారు యుక్తముగా నడచుచున్నారో లేదో చూచు
టకుఁ దగిన పయిపరామర్శయు లేదు; అందఱిపైని కారా గృహాధి

కారి యొకఁడును వానికి సహాయుఁడుగా బొలుఁడయిన యాతనికొడు కొకఁడును అధికారము చెల్లించు చుండిరి. వారిలోఁ బెక్కండ్రకు ముతకి పేలికలును చింపిగుడ్డలును దక్క నంగములను గప్పుకొనుటకుఁ దగినవస్త్రము లయినను లేవు. వారు వంట చేసికొన్నను, భుజించినను, వసించినను, కూరుచున్నను, శయనించినను, మఱి యేమి చేసికొన్నను, ఆనాలుగు చిన్నగదులలోనే చేయవలెను. వారక్కడ సామాన్యముగా నొండొరులను తిట్టుకొనుచు, శపించుచు, అవాచ్యములు పలుకుచు, అసహ్యము లయినపాటలు పాడుచు, కాలము గడుపుచుందురు. కారాగృహమును సందర్శింప వచ్చినవా రెవ్వరయిన నా మార్గమున బోవఁ దటస్థించిన పక్షమున వారందఱును గుంపుగా ద్వారముల కడఁ జేరి 'ఆకలి' 'అన్నము' అని యఱచుచు, కడువులు నోళ్ళు బాదుకొనుచు, డబ్బు నిమిత్త మినుపకడ్డీల సందులలో నుండి చేతులు చాచుచుందురు; వచ్చినవుణ్యాత్ములలో నెవ్వరయిన జాలి పడి చేతులలోఁ గాను వీసము లేవి యయినఁ బెట్టినపక్షమున వానిని వెంటనే చెఱసాలలోని కల్లంగడికిఁ బంపి మద్యము తెప్పించుకొని త్రాగుచుందురు. వారి పరిభాషయం దన్న మనుమాటకు కల్లనియే యర్థము. వారిలో సాహసికురాండ్రు కొందఱు ద్వారముల సమీపమునకు వచ్చినవారి వస్తువులను చేతులు చాచి బలవంతముగా నూడఁబెఱికి కొనుటయుఁ గలదు.

ఒకనాఁడు మాననీయు లయిన సుందరు లిద్ద ఱాకారాగారమును జూడఁ బోయిరి. వారుకొంతసే పితర విషయములను గూర్చి మాటాడిన తరువాత చెఱసాలలోని స్త్రీల స్థితిని బాగుపఱుచుటను గూర్చి ప్రస్తావన చేయఁగా కారాగృహాధికారి "వారు బాగుపడుట యసాధ్యము. నామాట నమ్ముఁడు. వారు బాగుపడుటకు శక్యము

కానంత దుర్వృత్తిలోను పాపములోను మునిఁగి యున్నారు.” అని గంభీరస్వరముతోఁ జెప్పెను. అప్పటి కారాగారాధిపతులు చిరకాలా గతాచారప్రభావమును బట్టి దయావిహీనహృదయు లయి, కారా బద్ధుల సంస్కారమును గూర్చి యెవ్వ రయిన మున్చటించిసను వారి మాటల నాదరింపక వారిని తిరస్కారదృష్టితోఁ జూచి పరిహసించు నంతటి కఠిన దశకు వచ్చియుండిరి. అప్పు డానుందరులలోనుండి మృదు మధురస్వరముతో “దేవుఁడు తలఁచు కొన్నను వారు బాగు పడరా? వారు దేవుని శక్తికి మించి యున్న వా రని మీాయభిప్రాయము కా దనుకొనెదను.” అని యొకవాక్యము వెలువడెను. ఆమాట విని యులికిపడి యతఁ డావాక్యములు వచ్చినవంకకు దృష్టిపఱపి, దీర్ఘశిరో జములతోడ దయారస మొలుకుచున్న శాంతముఖముతోను మహో త్సాహముచేతఁ బ్రజ్వరిల్లుచున్న వెలితళుకుఁ గన్నులతోను నిలు చుండి ధీరత్వము మూర్తీభవించినట్టున్న పొడవయిన సుందర విగ్రహ మును బొడగాంచి, క్షణకాల మేమి చెప్పుటకును తోఁచక యూర కుండి కడపట “నాయభిప్రాయ మదికాదు. ఈ కారాగృహమునందు మతబోధచేయుట కయి నియమింపఁబడి యున్న మతాచార్యునకు వీరిని బాగుచేయుట యసాధ్య మయిన దని చెప్పుటతప్ప నా యభి ప్రాయము వేఱొకటి కాదు.” అని తడఁబడుచుఁ బలికెను. పయి యట్లు పలికిన యామె మన ఫ్రెంచిదొరసానియే యని దీనిం జదువు వారికి వేఱుగఁ దెలుపవలసిన యావశ్యక ముండదు కదా! అనాటి కాచలిక త్తె లిద్దఱును వారియొద్ద సెలవు గయికొని వెడలిపోయిరి. ఇట్లు వెంటఁబోయిన రెండవయామె ఫ్రెంచిదొరసానియొక్క యక్క పెనిమి టియు పరోపకారములయం దసమానదీక్ష వహించినవాఁడును నయిన ఫర్ ఫనెల్ బక్ స్టన్ దొరవారి సహోదరి యగు అనాబక్ స్టన్ కోళ్ళ-

తరువాతఁ గొన్నిదినములకు ఫ్రెంచిదొరసాని యొక్కతెయు నొంటిగా మరల కారాగృహమునకు వచ్చెను. ఆమె చేతిలో నప్పు డొక్క పుస్తక ముండెను. ఈసారి కారాగృహాధికారు లామె నెక్కువ గౌరవముతోఁ జూచి యాదరించిరి. వారి యాదరణకు సంతోషించి యామె కారాబద్ధురాం ద్రయి యున్న స్త్రీలలోఁ గొంతసేపు తన్నొంటిగా విడిచి వారితో మాటాడుట కంగీకరింపుఁడని కోర – వారిని బాగుచేయఁ బ్రయత్నించుట నిష్ఫల మనియు, వారితో నొంటిగా నుండుట యపాయకర మనియు చెప్పి, కారాగృహాధికారియు మతాచార్యుఁడును ఇతర రాజపురుషులును ఆమెను నిరుత్సాహపఱిచి యామె యుద్యమమును వారింపఁ జూచిరి గాని వారిమాట లామె చెవులలో దూఱినవి కావు. ఆమాటలవలన నామె యెంతమాత్రమును భయపడక, భగవంతుఁడు తనకుఁ రక్షకుఁ డయి యుండఁగా నితరులవలనఁ దన కపాయము రాఁజాల దని పలుకుచు, కృతనిశ్చయురా లయి తన పట్టును విడువకుండెను. అంతటి దృఢమనస్కురా లయి యున్న యామె ప్రార్థనలను త్రోసివేయఁజాలక తుదకు, బందీశాలాధ్యక్షులంగీకరింపవలసినవా రయిరి. ఎంత చెడి హీనదశయం దున్నవా రయినను తనకువలెనే నిత్యము లయిన యాత్మలు గలవా రయి, అజ్ఞానాంధకారముచేతఁ గన్నుఁగానక పాపపంకమునఁ బడినవా రయినను పశ్చాత్తాపావలంబదండముచే మరల లేవఁ దగినవా రయి; అరివర్గపిశాచావేశముచేత మతిచెడి ధర్మముతోడి పోరాటమునకుఁ బూనిన వా రయినను దయనీయ లయిన యబలలే యయి, తన సోదరీతుల్యలయిన యీశ్వరపుత్రికలవద్దకుఁ బోవునప్పు డాత్మసంరక్షణార్థముగా నామె కేమిసాధనములు కావలెను? ఈశ్వరభక్తియే యామెకు వజ్రకవచము; ప్రేమార్ద్రమైన పరిశుద్ధహృదయమే యామె కభేద్యఖేటము;

దయాధర్మాదులే యామె కమోఘాయుధములు. ఇటువంటి యవతి హిత సాధనములను సాయముగాఁ గొని యప్పు డామె నిర్భయముగా కారాబద్ధురాం డ్రయి యున్న మదవతులయొద్దకు నడచెను. ఆమె సమీపింపఁగానే యామదవతు లామెను జూచి యన్నమునకు డబ్బులు డబ్బు లని యొక్కపెట్టున నఱవఁదొడఁగిరి. వారి వదిభాషయం దన్న మన్న పదమున కర్థ మేమో యామెకే తెలుపఁబడినది. అవ్వు డా కారాగారము మనుష్యనివాస మయిన మందిరము వలెఁ గాక యడవి మృగములతో నిండియున్న గుహ వలెనే కానఁబడెను. ఆకేకలలోను నమ్మర్దములోను తా నావఱి కిపోద్ఘాతముగా వారికి బోధింప నుద్దేశించు కొనివచ్చిన మాటలను మఱచిపోయెను గాని యామె ధైర్యమును మా త్రము విడిచిపెట్టక, తనచేతిలోనున్న బైబిలులోని నూతననిబంధనగ్రంథ మును విప్పి, వారికిఁ జదివి వినిపింప దలఁచుకొని వచ్చిన భాగమును దీసి, విస్పష్టమై మధుర మైన గంభీరస్వరముతో నుల్లములు వల్ల వించునట్లు చదువఁదొడఁగెను. వారిలోఁ బలువుర కాయుత్తమగ్రంథ మును వినుట యదియే ప్రథము మయి యుండును. ఆమె శ్రావ్య నాదముతోఁ జదువుచున్నకొలఁది నంతకంత కాసందడి యడఁగి, వారిలోఁ బలువురు హర్షవులకాంకితగాత్రులయి యా వేదవాక్యముల నత్యంతభక్తితోను శ్రద్ధతోను వినుచుండిరి. వారిలో చిరకాలాభ్యస్త పాపకర్మబలముచేతఁ గఠినచిత్తులయి మృగప్రాయులయి యున్న వారుసహిత మావాక్యార్థమునం దాదరము చూపక పోయినను, తమ మీఁది యవ్యాజప్రేమతో వచ్చి తమక్షేమమునే నిష్కళంకహృద యముతోఁ గాంక్షించుచు తమ యాత్మోజ్జీవనముకొఱకే మాటాడు చున్న యా సాధ్వీమణియొక్క నిర్మల వాక్యామృతరసపానముచేత నుత్తిల్లి దేహములు పరవశములు కాఁగా సందడి మాని నిశ్శబ్దముగా

నుండిరి. ఒకద్ద ఱింకను దమలోఁదాము మాటాడుకొనుచుండఁగా వత్యంతశ్రద్ధాళువయి వినుచుండిన యంగన యొకతె చేయెత్తి "మాటాడకుఁడు. ఈదేవతావాక్యములు వినఁబడకుండ సందడి చేయకుఁడు." అని హస్తసంజ్ఞతో వారిని వారించెను. ఆకారాగృహమంతయు నాసమయమున దుష్టాంగనల నెడఁబాసి పుణ్యాంగనలతో నిండినట్లును, రాక్షసస్త్రీలను పోనాడి దేవతాకాంతలను దెచ్చుకొన్నట్లును, అయ్యెను. ఆదివ్యవాక్యామృతరసప్రవాహముచేత ననేకకాంతల శిలాకఠినచిత్తములు కరఁగి నీరయ్యెను; అనేకకాంతల నేత్రములనుండి యానందబాష్పములు జాలుకట్టె; అనేకకాంతల గాత్రములు గగురుపొడిచెను. ఆహా! సౌజన్యమునం దెంతటియద్భుత శక్తియున్నది! గ్రంథపఠన మయినతరువాత నామె బిడ్డలతల్లులను జూచి వారివలె తానును బిడ్డలతల్లియే యగుటచేత బిడ్డలయెడల తల్లుల కెట్టివాత్సల్య ముండునో బిడ్డలసుఖమునిమిత్తము తల్లు లెంత తల్లడిల్లుదురో తానెఱుఁగుదుననియు, యుక్తాహారమును శుద్ధవాయువును దేహావరిశ్రమమును లేకపోవుటచేత శుష్కించి యున్నయాబిడ్డలను జూడఁగాఁ దనమనస్సు దహించుకొని పోవుచున్నదనియు, అసహాయులయి యున్నయాబిడ్డలను చక్కఁగా సంరక్షించి వారిని సన్మార్గమునకుఁ ద్రిప్పుట తల్లులకెల్ల ధర్మమగుటచేత దుస్థితిలో నున్న యాబిడ్డలకొఱకయి చెఱిసాలలోనే యొకపాఠశాలనుంచుట యుచితమనియు, నానావిధముల బోధించి పాఠశాల యుంచుటయం దిష్టము గలతల్లు లెల్లను చేతు లెత్తవలసిన దని యడిగెను. కృపారసము వెదచల్లెడి యామెచల్లనిపలుకులవల్ల నుల్లములు కరఁగినవా రయి కన్నులనుండి జొటజొట నీరుకారుచుండఁగా నొక్కసారిగా బిడ్డలతల్లులందఱును జేతులెత్తిరి. కొంతకాలమున కాచెఱిసాలలోని బిడ్డల

నిమిత్తమయి యొకపాఠశాల స్థాపింపఁబడినది. ఆపాఠశాల కుపాధ్యాయినిగా కారాబద్ధురాండ్రలోని యొకయువతి యచ్చటివా రందఱి చేతను గోరుకొనఁబడినది. ఆయువతి తాను యుక్తప్రవర్తనము కలదయి యుండుటయేకాక పాఠశాలనుగూడ చక్కఁగా నిర్వహించి నందునఁ బదునేనుమాసము లయినతరువాత వయిశుధికారు లాయువతిని క్షమించి విడుదల చేసిరి. ఆమె యాదినమునఁ గొన్నిగంటలకాల మక్కడఁ గడపి యింటికిఁబోయెను. తత్కాలమునకు తమ తొంటి యవగుణములను విడిచి మంచితనము పూనినట్లు కనఁబడినను, ఆకారా బద్ధురాండ్రబుద్ధులు మాఱుటకు చిరకాలము పట్టినది.

ఫ్రైదొరసాని తనబిడ్డల సంరక్షణనిమిత్తము విశేషకాలము గడపవలసిన దయినందున 1816 వ సంవత్సరమువఱకును వస్త్రహీన లయినవారికివస్త్రములు పంపుట యప్పుడప్పుడుపోయి బైబిలులోనిభాగములు చదివి వినిపించుట మొదలయినపనులు తప్ప చెఱసాలలోని స్త్రీలనిమిత్తమయి విశేషముగా నేమియుఁ జేయలేకపోయెను. ఆమె ప్రోత్సాహమువలన 1817 వ సంవత్సరమునందు న్యూగేట్ చెఱసాలలోని కారాబద్ధ లగుస్త్రీలస్థితిని బాగుపఱచునిమిత్తమయి యొక సమాజము స్థాపింపఁబడెను. ఆమె నిరంతరప్రయాసమువలన చెఱసాలలోని స్త్రీలలో నల్పకాలమునఁనే యద్భుత మైనమార్పు గలిగెను. ఆమార్పున కాశ్చర్యపడి కారాగృహాధికారు లామెకు సర్వవిధముల సహాయులయి యామె కర్తవ్యమని చెప్పినదానినెల్ల నంగీకరించి యామెకుఁ బ్రోత్సాహము కలిగించిరి. ఇట్లు చెప్పుటనుబట్టి యామె పూనిన ఘనకార్యము విశేషకష్ట మక్కఱలేక యనాయాసముగా నెఱవేఱినదని దీనిం జదువువారు భ్రమవడఁగూడదు. లోకములో కష్టములకోర్చి ధైర్యమును సహనమును నిరంతరోద్యమమును

పూనని సుఖపరాయత్తచిత్తులలో నెప్పుడు నెవ్వరును ఘనకార్యమును
దేనిని జేసినవారు లేరు. బురదలో దిగి బాహులు నొప్పిపెట్ట దేహ
మునఁ జెమ్మటలుపట్ట ముక్కున నూర్పులుపుట్ట శ్రమపడినంగాని
బురదకు వెఱచి వయినుండి పలుకువారివంచదారపలుకులచేత నెప్పు
డును వంకమున దిగఁబడినబండి పైకి లేవదు. మంచిని జేయువలెనన్న
పక్షమున స్వసుఖమును త్యజించి కష్టములకు సహించి యెడతెగనిపాటు
పడవలెను. ఆచెఱసాల ఘాతుకమృగబహుళ మైన గుహవంటిదిగాని
గృహమువఁటిది కాదని పైని వర్ణింపఁబడినదికదా. అట్టియసహ్య
స్థలము గొప్పవంశమునఁ బుట్టి యాబాల్యమును భోగముల ననుభ
వించుచు సుఖపడ మరగిన మన పైరిదొరసానివంటి వువ్వలోమలుల
కెంత దుస్సహ మయినదిగా నుండునో చెప్పుటకంటె నూహించు
కొనుటయే సుకరము. కొంచెముకాల మయినతరువాత నచ్చటివారి
చేష్టలనుగూర్చి యామె యిట్లు వ్రాసెను — "మాలోఁ గొందఱు
మించుమించుగాఁ బ్రతిదినమును బాఠశాలను జూచుట కయి
పోయిన సమయములలో చెఱసాలయందలి స్త్రీ భాగములో నడచెడి
దారుణము లైనదుర్వ్యాపారములను జూచితిమి. వీడించుట, బాసలు
చేయుట, జూదము లాడుట, పోట్లాడుట, దుర్భాషలాడుట, చెడు
పాటలు పాడుట, గంతులువేయుట, వురుషవేషములు వేసికొని యల్లరి
చేయుట, ఇట్టివే యనేకములు చెప్పను వినను దగినవికావు — అందు
చేత మేమది వఱకువారిని వెంటఁబెట్టుకొనిపోవుట కర్వాయైనతావు
కాదని భావించితిమి." ఆస్థల మామెకు రోత వుట్టింపక పోలేదు.
అయినను మంచిని జేయువలె నన్నయుత్సాహముచేతను స్వాభావిక
సౌజన్యముచేతను భగవత్ప్రీతికరకార్యతత్పరత్వముచేతను నా సాధ్వి
సమస్తమునకు సోర్చుకొన్నది. ఇట్టి హేయస్థలావలోకనమునకు సహించి

పదిమాసములు పనిచేసినపిమ్మట నామె మరల నిట్లు వ్రాయఁ గలిగెను.—

"మే మేర్పచినవిధు లెప్పుడో యొరుదుగాఁ గాని సామా న్యముగా నతిక్రమింపఁ బడలేదు. వారు మేర మీఆజ్ఞ నియమించిన వ్యవస్థలోనే యుండిరి. వారు మాకు పరమవిధేయురాం డ్రయి వర్తించిరి. దయచూపుటకప్ప వేఱువిధముగా వారియెడల మే మెప్పు డును ప్రవర్తింపక పోయినను వారిలో నొక్కఁ డైతే నాతో దండనాధి కారియొద్దకు పోవుటకంటె నాయొద్దకు వచ్చుట కెక్కువ భయపడు చుండు మని చెప్పినది. ఈకాలములో మే మెప్పుడును వీస్త్రీని శిక్షింపనులేదు; శిక్షింపఁ దలఁచుకోను లేదు. నేనుకాని నాసఖులు గాని విధించిన శాసనముల నతిక్రమింపక యింత చక్కఁగా నను వర్తించుట క్రమశిక్షితము లయిన కుటుంబములలో సహితము సాధ్య మని తలఁచెదను. పనివిషయమున నన్ననో వా రిరువదివేల దుస్తులను గుట్టిరి. ఈ పనియంతయు చిన్నయంగడివాండ్రచే నియ్యఁబడిన దగుట చేత వాండ్రిచ్చిన కూలి యత్యల్ప మయినది. ఇన్ని వేలలో మూడు దుస్తులు తప్ప కనఁబడకపోయినవి లేవు. అవియు స్త్రీల లోపములవలన పోయినట్లు తోఁచదు. వారు ప్రతిమాసమును అఱువది మొదలుకొని నూఱువఱకును మేజోళ్ళ నల్లుదురు. వారు కొంచెముగా నూలు సహి తము వడుకుదురు. వారియార్జనము మొత్తముమీఁద స్త్రీ యొక తెకు వారమునకు 18 పెన్సులు (1-2-0) కిట్టుచున్నది. ఈసొమ్ము సాధా రణముగా వారి యన్నవస్త్రములకు వ్యయపఱుపఁబడును. ఇందు నిమిత్త మయి వారందఱును గలిసి నెలకు నాలుగు పౌనులు (రు 60లు) ఇత్తురు; మేము సహాయద్రవ్యముగా నెనిమిది పౌనులు (రు 120) ఇత్తుము. ఈరెండు మొత్తములును గలిసి వారికి తగిన మంచివస్త్ర

ములకుఁ జాలియుండును. ఇంకొక ముఖ్యాంశము మతబోధవలన వారిలోఁ గలిగిన గొప్పలాభ మయి యున్నది. మేము ప్రతిదినమును రెండుసారులు వారికి బైబిలు చదువుచుందుము. వారిలో పలువురకు చదువు నేర్పితిమి కాని కొందఱుమాత్రమే స్వయముగా కొంచెము చదువుటకు శక్తురాఁ డ్రయినారు. దానివలనఁ గలిగిన ఫల మత్యద్భుత మైనదిగా నున్నది. అంత యాదరముతో బైబిలును స్వీకరించుట యితరస్థలములలో నే నెచ్చటను జూడలేదు. వారిలోఁ బెక్కండ్ర కావుస్తకమును, అందుఁ జెప్పఁబడిన మతరీతియు నీతియు, అపూర్వ ములుగా నున్నవి. తత్పఠనమువలన వారియాత్మలకుఁ గలిగిన ప్రయో జనము మిక్కిలి తృప్తికరముగా నున్నది. నే నవ్వు డప్పుడు పోయి చదువ నుద్దేశించితి నని చెప్పినప్పుడు, నే నేదో గొప్ప సంతోషమును వారికిఁ గలుగఁ జేయబోవు చున్నట్లుగా వారు గుంపులు గుంపులుగా నావెంటఁ బడుచుందురు."

ఈమెయొక్క కృషివలనఁ దత్పూర్వము రోగుఁబోతుతనము నకును దైవదూషణమునకును సోమరితనమునకును దౌర్జన్యమునకును నిలయమైనకారాగృహ మిప్పుడు మద్యపానవర్జనమునకును దైవభక్తికిని కర్మశీలతకును సౌజన్యమునకును నివాస మయ్యెను. ఆశ్చర్యకర మైన యీమార్పునకు సంతోషించి ప్రభుత్వమువా రీమె చేసినయేర్పాటు లను బ్రిటానియా దేశములోని చెఱసాలలో నెల్ల నెలకొల్పిరి. అటు పిమ్మట నీ యేర్పాటులు యూరపుఖండమునం దంతట నవలంబింపఁ బడినవి. ప్రపంచమందలి బ్రిటానియా ద్వీపములలో నున్న చెఱసాల లను మాత్రమే కాక, ఫ్రాన్సు జర్మనీ మొదలయిన దేశములలోఁ గూడఁ బోయి యచ్చటి ప్రధానము లైన కారాగృహములను పరీ క్షించి యందలి స్త్రీలస్థితిని బాగుచేయుట కయి బహువిధములఁ

గృషి చేసెను. ఇంతకుముందు చెఱసాలనుండి విడుదలనుబొందిన స్త్రీలు నీతిమాలినవారును జీవనాధారము లేనివారును నయి స్వోదరపోష ణార్థముగా పూర్వపరిచితములైన పాపములనే మరలఁ జేయువా రగు చుండిరి. ఇప్పుడు చెఱసాలలోఁ దగినవృత్తులు నేర్పఁబడుటవలన వీనుక్తిఁ బడవలసినపడఁతు లావృత్తుల నవలంబించి పాటుపడి పాపము పొంతకుఁ బోక సుఖజీవనము చేయగలవా రయిరి. పాపపాశముల నుండి విడివడి యిట్లుత్తమజీవనము చేయుటకు శక్తు రాండ్రయిన స్త్రీలు తమకృతజ్ఞతను దెలుపుచు నామెకు లేఖలు వ్రాయుచుండిరి.

ఫ్రైదొరసాని చేసిన మంచికార్య మిది యొక్కటియే కాదు. ద్వీపాంతరవాసదండనము లొందిన స్త్రీలను గొనిపోయెడి యోడల లోనికిఁబోయి చూచి యావఱి కిసౌఖ్యమునకును క్రూరత్వమునకును స్థానము లయి యుండినవానిని సౌఖ్యమునకును సదాదరణమునకును స్థానములనుగాఁ జేసెను. ఓడలలో నెక్కింపఁబడిన స్త్రీలను పశు వులమందలను దోలినట్లుగా నొకగదిలోనికిఁ ద్రోయఁగా, వా రచ్చట శాపములు పెట్టుచు, ఒట్లు పెట్టుకొనుచు, జగడమాడుచు, స్వీయ పాపకథల నేకరువుపెట్టుచు, అవాచ్యప్రసంగములు చేయుచు, అకార్యకరణముల కుపాయములు రోయుచు, ప్రొద్దు పుచ్చు చుండెడి వారు. ఆమె యట్టి యోడలలోనికిఁ బోయి బైబిలులోని యుత్తమ వాక్యములను వారికి చదివి వినిపించి హితబోధ చేయుచు, ఆ ప్రయాణములయందు వారికి ధర్మబోధ చేయఁబడిన యుపాధ్యాయినుల నేర్పాటు చేయుచు, అధికారులతో మాటాడి వారిని దయతోఁ జూచునట్లు చేయుచు, గతిమాలిన దుర్మార్గ గామినుల లగు నా కామినుల కెన్నివిధములనో మేలు చేసెను. ఆమె క్రుస్మత్తశరణాలయములకును వైద్యశాలలకును బోవుచు రోగుల

సౌఖ్యముల కొఱ కెన్నిన్నివిధములనో పనిచేసెను. ఒకనాఁ డామె యొక యున్మత్తశరణాలయమునకుఁబోయినప్పుడు గదిలో గడ్డిమోఁద పడి పొరలుచున్న యొక పిచ్చిది యామె మాట విని లేచి తన్నుఁ గట్టియున్న గొలుసు సీడ్చుకొనుచు నామె వెనుకకు వచ్చెను. ఆమె దయావిశిష్టము లయినచల్లనిచూపులతోఁ జూచుచు తన హస్తము నాపిచ్చిదాని కందియ్యఁగా నదిప్రేమతో ననేకపర్యాయము లాహస్తమును ముద్దుపెట్టుకొనెను. ఆమె క్రైస్తవవేదగ్రంథములను ధర్మార్థముగాఁ బీదలకుపంచి పెట్టుచుండెను. నావికులకును సైనికులకును కారాబద్ధులకును బీదలకును పుస్తకనిలయములను బెట్టించెను. ఆమె లోకోపకారార్థముగా వచనరూపమునను పద్యరూపమునను బహుగ్రంథములను రచియించెను. ఎక్కడ దుఃఖ ముండినదో, ఎక్కడ దారిద్ర్యపీడ యుండినదో, ఎక్కడ నజ్ఞాన ముండినదో, అక్కడ నెల్ల దుఃఖోపశమనమునకై యామె యేదో పనిచేయు వెదకుచుండెను. విపత్తులోనున్నవా రెవ్వరును నామెవద్దకు వచ్చి యాశాభంగము నొంది వెడలిపోయినవారు లేరు. ఒకనాఁ డామె గుఱ్ఱపుబండిలో నెక్కి పోవుచుండఁగా దారినడుము కొకచోట నొకబండివాఁడు తలగాయముతో తనబండిప్రక్కను పడియుండుట కంటఁబడెను. ఆమె తక్షణమే తన బండిని నిలిపి యాబండివానియొద్దకుఁ బోయి వాఁడు తనకడుపునఁ బుట్టినకుమారుఁ డయినట్లుగా వానితల గాయమునకు కట్టుకట్టి రక్తస్రావమును మాన్పి తరువాత బండి నెక్కి పోయెను. ఆమె రోగుల కుపచారము చేయుటయందును గాయములకు కట్లుకట్టుటయందును గూడ మహాసమర్థురాలు. 'పరోపకారార్థమిదంశరీర' మన్నట్లుగానామె పరులనిమిత్తమే తానుజీవించుచున్నట్లుండెను. ఆమె పవిత్రచరిత్రము లోకమునకు పరోపకారమును బోధించు మహాకావ్యముగా నున్నది.

ఆమె యతిసుకుమార మయినదుర్బలశరీరము కలదిగా నుండె ననియు; భీరుస్వభావము కిల దయి బాల్యమునం దెవ్వరైన గట్టిగా మాటాడినను కోపదృష్టితోఁ జూచినను. బావు రని యేడ్చుచుండెడి దనియు, ఆమె చరిత్రమును వ్రాసినవారు చెప్పుచున్నారు. అట్టి సహజదుర్బల యయిన యీ యబలకు ధైర్యసాహసములతో నిట్టిసత్కార్యముల నిర్వహింపఁ గలబల మెక్కడనుండి వచ్చి నది? ఈబలమంతయు నామెకు మతాభినివేశమునుండియు నీశ్వ రుని నుండియు వచ్చిన దనుటకు సందేహము లేదు. ఆమెకు మత మంతయు కార్యాచరణములలో నుండినదికాని క్రియాశూన్యము లయిన శుష్కవాక్యపఠనములలో నుండినది కాదు. మతమున కెల్లను లోకజనకుఁ డయిన యీశ్వరునియందలి పితృభావము, ఈశ్వరసృష్టి లోనివా రగుటచేత సోదరు లయిన మానవుల యందలిభ్రాతృభావము, ఈ రెండును ప్రధానములు. ఇందు మొదటిదాని వలన నేర్పడుధర్మ మీశ్వరునియందు దృఢభక్తి యుంచి సమస్త విషయములలోను తదాజ్ఞ ననుసరించుట; రెండవదానివలన నేర్పడుధర్మము స్వసుఖమునైనఁ బరిత్యజించి పరోపకారకరణమునందు వర్తించుట. ఈధర్మద్వయము నొకదానిని విడిచి యొకటి యుండునది కాదు. కావున రెండును నేక ధర్మమే యని చెప్ప నొప్పును. ఇదియే సర్వమతసారమయిన పరమ ధర్మము. దీని నొక సంస్కృతకవీశ్వరుఁ డీక్రిందిరీతిని జెప్పి యున్నాఁడు —

శ్లో. శ్లోకార్ధేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్.

గీ. గ్రంథకోటులచే నేది గఱపఁబడెనో
దానిఁ బదార్థమునఁ జెప్పెదను వినుండీ—

అగుఁ బరోపకారఁబు పుణ్యంబుకొఱకుఁ
బృథివిఁ బాపంబు కొఱ కన్యపీడనంబు.

ఆమె తాను బూనినమహాకార్య మీశ్వరాజ్ఞారూప మైనధర్మ మని యాచరించెనేకాని పేరుకొఱకును ప్రసిద్ధికొఱకును గాదు. నిజ మైన మతధర్మము లేవో యెఱుఁగక పనికిమాలిన నోములతోను వ్రత ములతోను ఉపవాసములతోను ఉప్పిడులతోను కాలక్షేపము చేయు చుండెడు మన దేశపుస్త్రీ లీసాధ్వీ శిరోమణి వలెఁ బరోపకార పరా యణులు కాఁబయత్నింతురు గాక! ఈమె వలె నందఱును చెరసాల లును వైద్యశాలలును సంస్కరించువారు కాకపోవచ్చును; పుస్తక నిల యములను స్థాపించువారు కాకపోవచ్చును. కాని, మనఃపూర్వక ముగా కృషిచేసినచో తమ్మును తమ కుటుంబములను సంస్కరింపఁ గలవారును తమ యిరుగు పొరుగు వారిని ప్రేమించి వారికి తోడుపడఁ గలవారును కాకపోఁబాలరు. ప్రతి సత్కార్యానుష్ఠానమునందును కష్టము లుండును. బంగారమునకు మేలిమిని దెచ్చుట కయి దాని నగ్నిహోత్రములోఁ దప్తముచేయుట యావశ్యక మయినట్టి పరోప కారధుర్వహు లగుపుణ్యాత్ములకు మేలిమిని దెచ్చుట కయి కష్టము లావశ్యము లని బుద్ధిమంతులు చెప్పుచున్నారు. తాను బైని వేసి కొన్న ఘనకార్య విషయమునఁనే కాక సంసార విషయమునను మన పైదొరసానిగారికిఁ గష్టము లనేకములు వచ్చినవి. మొట్ట మొదట 1808 వ సంత్సరమునందు కుటుంబమున కంతకు మూలాధారుఁడైన యామె మామగారు కాలధర్మమునొందిరి. తరువాత నామె ప్రియ సహోదరి యొకతె మృతినొందెను. పిమ్మట నామె ముద్దులమనుమఁ డొకఁడు స్వర్గస్థుఁడయ్యెను. అటుపిమ్మట కుమారుని రెండవకూఁతురు లోకాంతరగతురాలయ్యెను. ఆచిన్నది గతించిన పదునొకండు దినము


లకే యాచిన్న దానితండ్రియైన పెద్దకుమారుఁడు వరమపదమునొందెను. తండ్రిపోయిన యెనిమిది దినముల కాతనికూఁతు రింకొకతె పరలోక గత యయ్యెను. ఒకదానిపై నొకటిగా వచ్చిడి యిటువంటి కష్టకథ లను పెంచి చెప్పుట సంతాపకర మగుటచే నీ యాపత్పరంపరాకథ నము నింతటితో విడిచి పెట్టెదను. ఒకదానివెంట నొకటిగా వచ్చిన యీ విపత్పరంపరలవలన నామె మన స్సించుక చలించినను తోడనే నిశ్చలత వహించినందున సత్కార్యాచరణము నందలి ధైర్యోత్సాహము లించుకయు తగ్గక మఱింత పెంపుచెందినవి.

తాను బూనినపనిని దీనిని జనులలోఁ జేరు సంపాదింపవలె నన్న యపేక్షతో నామె చేయలేదనియు, తనపేరు బయలికి వచ్చుచున్నదని తెలిసికొన్నప్పు డామె దుఃఖితురా లయ్యెననియు, చరిత్ర కారులు చెప్పినను, లోకములో సత్కార్యదీక్ష వహించి పనిచేయు వారిపేరు ప్రసిద్ధికిరాక యడఁగిపోవుట యస్వాభావిక మగుటచేత ఫ్లోరిదొరసాని పేరును సర్వత్ర వ్యాపించి మంచివారి గౌర వాదరము లకు పాత్ర మయ్యెను. ఉపకారచింత గలవా రనేకు లనేకస్థలములలో సంఘములుగాఁ జేరి యామెవలెఁ బుణ్యకార్యములు చేయుట కుద్యమింపఁ దొడఁగిరి. ధనాధికారసంపన్నులైన ఘనులనేకు లామెను సందర్శించి యామెతో సంభాషించి కృతార్థత నొంద యత్నింపఁగడఁగిరి. డెన్మార్కుదేశపు రాజును రాణియు నామెతో విందు గుడిచిరి. 1840 వ సంవత్సరము నందు శ్రీవిక్టోరియా మహారాజ్ఞిగారామెకు దర్శనమిచ్చి, చెల్సీనగరములోఁ బెట్టఁబడిన యనాథరక్షణశాలకు సహాయముగా నేఁబది పౌనుల (రు750ల) నొసఁగిరి. 1842 వ సంవత్సరమునందు ప్రష్యాదేశపు రా జామెయింటికిఁబోయి యామెతో నహంవంక్తిని భుజించెను. ఆరాజు నెదురొక్కని గౌరవించిన ప్రస్తావనలో

నామె వ్రాసినదానిలోని కొన్నిపంక్తు లిచ్చటఁ బొందువటుపఁ
ననుజ్ఞ వేఁడుచున్నాను — "నాభర్తగారును నేనును మాయల్లుండ్ర
లోను కుమారులలోను గొందఱితోఁ బోయి రాజు నెదుర్కొని, ఉచిత
పీఠములతోను పుష్పములతోను చక్కఁగా నలంకరింపఁ బడియున్న
మాసభాసదనమునకుఁ దోడితెచ్చితిమి. అచ్చట మే మాయనకు
మాయెనమండ్రు కొమారితలను కోడండ్రను మాయేడుగురు కుమా
రులను పెద్ద పౌత్రుని నాసోదరీసోదరులను జూచితిమి.....ఆయన
కటుతరువాత మేము మామనుమలలోను మనుమరాండ్రలోను ఇరు
వదియేవురను జూపితిమి." పెద్దకుటుంబ మొండుట సత్కార్యాను
ష్ఠానమునకు ప్రతిబంధకమని కొంద ఱందురు. అది కల్లయని యీామె
దృష్టాంతముచే నెఱుఁగవచ్చును. మంచికార్యమునకు మన మెక్కడ
నుండునో మార్గ మక్కడ నేర్పడును. ఆమె తన యవసానదశలో
నీయర్థము వచ్చుమాటలు వ్రాసినది — "వదునేను సంవత్సరముల
ప్రాయమప్పుడు నామనస్సు మాటీనది మొదలుకొని యారోగ్యదశలో
నున్నను ఆమయదశలో నున్నను పగలైనను రాత్రియైనను నేను
నిద్రనుండి లేవఁగానే దేవునికిఁ బ్రీతికరముగా నేను జేయవలసిన సేవ
యేది యని మొట్టమొదట చింతింపకుండిన దెప్పుడును లేదని నమ్మి
చున్నాను." — అటుపది యైదేండ్లు నిండినతరువాత 1845 వ సంవత్స
రము అక్టోబరునెల 12 వ తేదిని ఆమె తనస్థూలశరీరమును విడిచి కీర్తి
శేషురా లయ్యెను. ఆమె యాత్మ సుఖముగా పరలోకమునం దీశ్వర
సన్నిధానమునం దున్నను, ఆమె చేసిన సత్కార్యము లీలోకమున
శాశ్వతముగా నిలిచి యనేకులను పరోపకారకృత్యములకు నిరంత
రమును బురికొల్పుచున్నవి.

LADY JANE GREY.

లేడీ జేన్ గ్రే.



లేడీ జేన్‌గ్రే జీవించినకాల మల్పమే యైనను, అంత యల్ప కాలము సుగుణము లన్నియు పూర్ణముగా వికాసము నొందుటకు

చాలినది కాకపోయినను, ఆయల్పకాలములోని యామె చరిత్రమే నజ్జనులస్తోత్రమునకు పాత్రమైనంత పవిత్రమైనదిగా నున్నది. ఆమె మితభాషిత్వమును, వినయమును, విశుద్ధహృదయమును, నిష్కళంక చరిత్రమును, సర్వజనశ్లాఘాపాత్రము లయినందున నామె కష్టములకు చింతపడని వారును దుర్మరణమునకు దుఃఖపడని వారును లేకుండిరి.

ఆమెతండ్రి నాల్గవయెడ్వర్డునకు దౌహిత్రుఁడయి యింగ్లండు లోని పురాతనప్రసిద్ధకుటుంబములోఁ బుట్టినవాఁడయి హెన్రీగ్రే యనునామధేయము గల డార్సెట్టుప్రభువు; ఆమెతల్లి యింగ్లండు దేశాధిపతి యైన యేడవహెన్రికి కూతురయి ఫ్రెంచిరాజునకు రాణి యయి భర్తృమరణానంతరమున సస్సోక్సుప్రభువును పునర్వివాహము చేసికొన్న మేరీ యనునామెయొక్క జ్యేష్ఠపుత్రి యైనలేడీఫ్రాన్సిస్ బ్రాండ ననునామె. ఉభయపక్షములందు రాజబంధువు లైనయీ దంపతుల కీమె 1537 వ సంవత్సరమునందు లీసెస్టరుసుండలములోని బ్రాడ్‌గేటువట్టణమున జనన మొందెను. వసితనమునందే యీచిన్నది విద్యయం దత్యంతాసక్తురాలుగా నుండెను; తల్లిదండ్రులును తమ కొమారితకు విద్య చెప్పించుటయం దత్యంతశ్రద్ధాళువు లయి యామె నధికసమర్థురాలినిగాఁ జేయుటయం దతికుతూహలము గలవారుగా నుండిరి. అయినను వారు భయము చూపినఁగాని బాలికలు బాగు పడ రన్న నమ్మకముచేతనో మఱి యే హేతువుచేతనో కాని తమపుత్రిక యెడల నతికఠినముగాఁ బ్రవర్తించువారుగా నుండిరి. ఆమెకు మొదటఁ జిరకాలము పండితవర్యుఁడైన ఐల్మరనుసతీడుపాధ్యాయుఁడుగా నుండెను; కడపట మహావిద్వాంసుఁడును సుప్రసిద్ధుఁడును నైన రోజర్ఆస్కా మనుసతీడు విద్యాగురువయ్యెను. ఆమె బుద్ధిప్రతిభావిశేషమును విద్యాభిలాషమును శాంతిస్వభావమును

సాధుభావమును జూచి యుపాధ్యాయు లిరువురునుగూడ శిష్యురాలి యం దత్యంతవాత్సల్యము గలవా రయి యుండిరి.

ఆమె తనతోడ సమానవయస్కు లయి యింగ్లండునకు రా జయిన యాఱవయెడ్వర్డునకంటె సర్వవిధముల సమర్థతరురాలని యెల్ల రచేఁ బరిగణింపఁ బడుచుండెను. ఆమె కుట్టుపనియందు నిపుణురా లయి యనేకకళలయందు సమర్థతకలదిగా నుండెను ; వీణాదివాద్య ములయందు ప్రౌఢురా లగుటయేకాక మృదుమధుర కంఠస్వరము కల దయి కర్ణరసాయనముగా గాత్రమున పాడుటయందును సాటి లేనిదిగా నుండెను. ఆమె స్వభాష యైనయింగ్లీషున సలక్షణముగా వ్రాయుటకును బ్రసంగించుటకును శక్తురా లగుటయేకాక ఫ్రెంచి, ఇటాలియన్, ల్యాటిన్, గ్రీకు భాషలలో ధారాళముగా మాటలాడు టకును వ్రాయుటకును నేర్చెను. ఇవిగాక హీబ్రూ, చాల్డీ, అరబ్బీ భాషలయం దీమె తగుపాటిపాండిత్యము కల దయ్యెను. శైశవమునందే యి ట్లన్ని భాషలయందు పాండిత్యము కలుగుట మహాశ్చర్యము. నిశ్చలచిత్తమును, అసాధారణగ్రహణ ధారణశక్తిని, బుద్ధినూత్న్మ తను గలిగి యుండుటచేత దురవగాహము లయిన శాస్త్రవిషయములు సహిత మామెకు సులభము లయ్యెను. అందుచేత నామె పండిత జనైకగ్రాహ్యము లయిన యాద్విషయములను గూర్చి నిపుణముగా వ్రసంగించుటకును వాదములు సలుపుటకును సమర్థురా లయి యెల్లవా రల నద్భుతప్రమోదములపాలు చేయఁజొచ్చెను. సహజశీరసౌంద ర్యమునకును పాండిత్యమునకును దోడిమెకు యోషిజ్జనామూల్యవిభూ షణము లనఁదగినమార్దవమును నమ్రతయు సత్యసంధతయు సౌశీల్య మును శోభాతిశయమును గూర్చెడి యలంకారములుగా నుండెను. ఈమె విద్యాబుద్ధులు చూచి సంతోషించి యింగ్లండురా జయిన యెని

మిదవహెన్రీ యీచిన్న దానిని పలుమాఱు రాచనగరునకు రప్పించి దయచూపి యాదరించు చుండెను.

ఈమెకుఁ గడపటగురువైన రోజర్ ఆస్కాముపండితుఁడు తన మిత్రుని కొకనికి లేఖ వ్రాయుచు దానిలో జేన్‌గ్రేయొక్క సుగుణ సామర్థ్యములను బహువిధముల శ్లాఘించెను. అతఁడామె కెప్పు డుత్తరములు వ్రాసినను ల్యాటిన్‌భాషలో వ్రాయు చుండెను; ఆమెయు నాతని కాభాషలోనే ప్రత్యుత్తరములు వ్రాయు చుండెను. దీనినిబట్టి విచారింపఁగా నామె పాండిత్య మసమానమైన దనియు, ఈడుకు మించిన దనియు స్పష్టపడుచున్నది. మన దేశమునందు సంస్కృత మెటువంటిదో, యాదేశమునందు ల్యాటిన్ గ్రీకుభాష లటువంటివి. అతఁడు 1550 వ సంవత్సరము శ్రావణమానములో నొకనాఁడు డార్నెట్టుప్రభువుయొక్క నగరమునకుఁ బోయినప్పు డా కుటుంబ మంతయు మృగయావిహారమునకు వెడలియుండెను. జేన్‌గ్రే మాత్ర మింట నున్న దని విని యతఁడామెను సందర్శించుట కయి తన్మందిరమునకుఁ బోయెను. ఆమె యప్పుడు గ్రీకుభాషలో ప్లాటో యను తత్త్వశాస్త్రజ్ఞునిగ్రంథమును జదువుచుండెను. ఆమె యాభాష యందుఁగూడ నసమానపాండిత్యము గలదయి తత్త్వశాస్త్రవిషయ మునఁ బ్రసంగించుట చూచి, పదునాలుగేండ్లలోపలి వయస్సు గల యాబాలికయొక్క తెలివి కతఁ డత్యద్భుతపడెను. ఆమె గ్రీకుభాష యందుఁగూడ వ్రాయను జదువను నేర్చినదయి యాతని కాభాష లోనే లేఖలు వ్రాయుటకు వాగ్దానము చేసెను. ఆతఁడు తనసంతోష మును పట్టఁజాలక యింత పిన్నవయస్సులో నింత భాషాజ్ఞానమును శాస్త్రజ్ఞానమును నీవెట్లు సంపాదింపఁ గలిగితి వని యడిగెను. ఆమె యిట్లు ప్రత్యుత్తర మిచ్చెను — "నేను మీతో నత్యమును జెప్పెదను.

అది విన్నప్పుడు మీాలొకవేళ నాశ్చర్యము గలుగవచ్చును. నాకీశ్వ రుఁడు దయచేసిన గొప్పమేళ్ళలో నొకటి కఠిను లయిన జననీజనకులను దయామయుఁ డయిన యుపాధ్యాయునిఁ బ్రసాదించుట యై యున్నది. నేను నాతల్లియొద్దఁగాని తండ్రియొద్దఁగాని యున్నప్పుడు నేనును మాటాడవలసినను మౌనము వహింపవలసినను కూర్చుండవలసినను నిలుచుండవలసినను నడవవలసినను తినవలసినను త్రాగవలసినను సంతోషింపవలసినను దుఃఖింపవలసినను కుట్టవలసినను క్రీడింపవలసి నను నృత్యము చేయవలసినను మఱి యేపని చేయవలసినను దేవుఁడు తనసృష్టి నెంత క్రమముగాను నిర్దుష్టముగాను జేసెనో యంత క్రమము గాను నిర్దుష్టముగాను నేను జేయవలసి యుండును. అట్లుకాక నే నేవిషయమున నేమాత్రము వ్యతిక్రమముగా నడిచినను పరిహాసముల తోను పరుషవచనములతోను కొన్ని వేళల గిల్లులతోను తాడనముల తోను పీడనములతోను నాతల్లిదండ్రులయెడల నాకుఁగల గౌరవమును బట్టి నేను జెప్ప నొల్లని యితరదండనములతోను నేను బాధింపఁబడు చుందును. ఆదుస్సహబాధచేత నామనస్సు చెదరుచుండుటనుబట్టి నా గురువైన బిల్హణుగారివద్దకుఁ బోవలసిననిమిషము వచ్చువఱకును నేను నటికములో నున్నట్లు భావించు చుందును. ఆయన మిక్కిలి శాంతము గాను చదువునం దెంతో యభిరుచి కలుగునట్లుగాను బోధించుటచేత నే నాయనయొద్ద నుండు కాలమంతయు క్షణములోఁ గడచిపోయినట్లు తలంతును. ఆయనను విడిచి వెడలిపోవలసి వచ్చినప్పుడు నాస్వామి ము దుఃఖాక్రాంత మగును. నేను చదువు తప్ప మఱి యేయితరకార్య మును జేయవలసినను, అది నాకు దుఃఖకరముగాను భయంకరము గాను పీడాకరముగాను నుండును. ఈప్రకారముగా నాకు పుస్తక ములే నంతోషదాయకములుగాను దినదినాధికసుఖప్రదములుగాను

నుండుటనుబట్టి చూడఁగా నాకితరవినోదము లన్నియు వ్యర్థములుగాను పీడలుగాను పొడకట్టును."

ఆమెయొక్కసుగుణగౌరవమును విద్వాంసారదత్వమును తల్లి దండ్రులు చూచి యామోదింప లేక పోయినను, ఆమెతోడిపరిచితి భాగ్యము కలిగిన గుణగ్రహణపారీణు లందఱును ఆమె శక్తిసామర్థ్యములను గుణసంపత్తిని మెచ్చుకొని పొగడుచుండిరి. ఇతరుల స్తుతుల చేత నామె లేశ మయినను గర్వమును బొందక మఱింత వినయవతి గాను సౌశీల్యవంతురాలుగాను అయ్యెను.

మతవిషయమున నీమె రోమీయుక్రైస్తవధర్మములకు విరోధములయిన ప్రొటెస్టాంటు మతసిద్ధాంతములయందు దృఢవిశ్వాసము గలదయి తన్మతావలంబురా లయ్యెను. ఆమెయొక్క చిత్తైన్నత్యము మిక్కిలి ప్రకాశించినది యీమతధర్మానలంబనమునందే. ఆమె చక్కఁగా నాలోచించి సత్యము లనియు నందుచేత నవశ్యానుష్ఠేయములనియు హృదయపూర్వకముగా నిశ్చయించుకొన్న ధర్మములనుండి బహుమానములుగాని బాధలుగాని బ్రతుకుగాని చావుగాని యామె నణుమాత్రమును మరలింపఁ గలిగినవి కావు. ఈసత్యము ముందు ముం దీమెచరిత్రమువలనఁ దెలియవచ్చును.

ఇంగ్లండురా జయిన యెనిమిదవహెన్రీకి ముగ్గురుబిడ్డ లుండిరి. వారిలో మేరీ, ఎలిజబెత్తు, అనువా రిరువురుపుత్రికలు; కడపటివాఁడయిన యెడ్వర్డునుబాలుఁడు పుత్రుఁడు. అతఁడు తనయనంతరమున మొట్టమొదటకుమారుఁడయిన యెడ్వర్డు రాజ్యమునకు రావలయు ననియు, తరువాత మేరీయును, అటుతరువాత నెలిజబెత్తును, తదనంతరమునఁ దనమేనకోడలును, లేడీజేన్ గ్రే తల్లియు నగు ఫ్రాన్సిస్ బ్రాండమును రాజ్యమునకు రావలయు ననియు మరణశాసనమును

వ్రాసి, తనకుమారునికి యుక్తవయస్సు వచ్చువఱకును రాజ్యపాల నము చేయుటకు వదునాఱుగురను కార్యనిర్వాహకులనుగా నియ మించెను. ఆ పదునాఱుగురిలో నార్తంబరులాండుప్రభు వొకఁడుగా నుండెను. అతఁడు తంత్రములవలనను సామర్థ్యములవలనను తక్కిన వారి నందఱికిని మించి తానే సర్వాధికారి యయినట్లుగా యథేచ్ఛ ముగా రాజ్యకార్యములను నిర్వహించుచు మహాబలవంతుఁ డయ్యెను. ఇట్లు జరుగుచుండఁగా నతని యధికారమునకు భంగము కలిగించు వైపరీత్య మొకటి సంభవించునట్లు కానఁబడెను. ఎవరిపేరిట నీప్రభువు రాజ్యపాలనము చేయుచుండెనో బాలుఁ డైన యా యాఁఅవయెడ్వర్డు దీర్ఘవ్యాధిబాధితుఁ డయి యుండెను. రాజు మృతుఁ డయ్యెడు ఏపు మునఁ దన యధికారము పోవుటయేకాక తన కషాయము సహితము రావచ్చు నని యతఁ డెఱుఁగును. అందుచేత రోమీయమతావలంబిని యయినమేరీని రాజ్యమునకు రాకుండఁ జేయుటకును తన యధికార మునకు భంగము రాకుండ నిలుపుకొనుటకును దగినయుపాయ మొకటి యాలోచించి యపాయబహుళ మయిన కుతంత్రము నొకదానిని నడప నుద్యమించెను. ఈ దురాలోచనము మనస్సునందుఁ బెట్టుకొని యతఁడు ముందుగా డార్సెట్టు ప్రభువుతో బాంధవ్యము గలిగించు కొనుటకు యత్నించి, ఆతని పెద్దకూఁతు రయిన లేడీజేన్‌గ్రేను తన నాలవకుమారుఁ డయిన గిల్డుఫోర్డుడడ్లీ యనునతని కిచ్చి వివా హము చేయునట్లు డార్సెట్టుప్రభువును ప్రార్థించెను. ఇప్పుడు సస్సోకు ప్రభువుగాఁ జేయఁబడిన యాడార్సెట్టుప్రభు వాతని మాయోపాయ మును దెలిసికో లేక దుర్బలమనస్కుఁ డగుటచేతఁ దన కూఁతురిత నాతని కొడుకున కిచ్చి పెండ్లిచేయుట కొడఁబడెను. 1553 వ సంవత్స రము జ్యేష్ఠమాసములో వారి వివాహము నడచెను. వరుఁడు దృఢ

కాయుఁడును రూపవంతుఁడును సాధుహృదయుఁడును సద్వర్తనుఁడును నయినందున వధువున కనర్హుఁడని చెప్పఁదగినవాఁడు కాఁడు. ఈ వివాహము మహావైభవముతో నడచెను. రా జయిన యాఅవ యెడ్వర్డిదంపతులకు గొప్పకట్నములను బంపి, వధువున కమూల్యము లయిన వివాహవస్త్రములు నిచ్చెను. రా జపాయకర మయినవ్యాధిలో నుండఁగా నిటువంటి వేడుకలు జరుగుట ప్రజల కెవ్వరికిని సమ్మతము కాకుండెను.

నార్తంబర్లాండు ప్రభు విట్లొకకార్యమును నిర్వహించి తరు వాతి కార్యమును గొనసాగించుట కుపక్రమించెను. ఆఅవయెడ్వర్డు వ్యాధిబాధితుఁడయి దుర్బలచిత్తుఁడయి తనచేతిలో నుండుట చేత నాతఁడు మెల్లగా రాజును సమీపించి, ఆతనివ్యాధిని గూర్చి వరిత పించి, ఆతనికి మఱియొకవిధ మగుట తటస్థించెడు వఱకును తండ్రి మరణశాసనమును బట్టి రాజ్యము మేరీయధీన మగు ననియు, అ ట్టయ్యెడు వఱకును మేరీ రోమాయమతావలంబకురా లగుటచేత దేశమునకు మితిమీరినయనర్థములు మూఁడు ననియు, ఎలిజబెత్తును గూడ రాజ్యమున కనర్హురాలినిగాఁ జేయుక మేరీనిమూత్రము తొలగిం చుట సాధ్యముఁ కా దనియు, వారిరువురును సవతియప్పలుగాని యేక గర్భజనితలు కారనియు, రాజు మరణశాసనమును బట్టి విధించినను ప్రభుప్రతినిధిసంఘముల వారిరువురిచేతను వా రధర్మసంతతిగా నిర్ధార ణము చేయఁబడినందునఁ బ్రజ లట్టి యధర్మసంతతి రాజ్యమునకు వచ్చుట కంగీకరింపఁజాలరనియు, తండ్రియొక్క మరణశాసనమును బట్టి తరువాత రాజ్యమునకు రావలసిన లేడీ జేన్‌గ్రేయొక్క తల్లి యొక్కతెయే యనియు, లేడీ జేన్‌గ్రే విద్యచేతను బుద్ధిచేతను గుణసంపదచేతను సామర్థ్యముచేతను సర్వవిధముల చేతను రాజ్యమున

కర్ప్లారా లగుటచేత నామెను రాణినిగా నియమించుట సర్వజన సమ్మతముగా నుండు ననియు బోధించి, రాజు మనస్సును త్రిప్పి వేసెను. ఇది లేడీ జేన్‌గ్రే రాణి యయినపక్షమునఁ దన కొడుకు రా జగునని యు, అప్పుడు తా నిప్పటివలెనే యధికారమును నిరపాయ ముగాఁ జెల్లింపవచ్చు ననియు, స్వప్రయోజన పరత్వముతోఁ బన్నిన దుస్తంత్రమే కాని ప్రజాక్షేమమునుగోరి పారమార్థిక బుద్ధితో నాలోచించిన సదుపాయముకాదు. ఎడ్వర్డు దూరాలోచన లేని పిన్నవయసువాఁ డగుటచేతను, మరణ మంతికంత కాసన్న మగుటచే దుర్బలమనస్కుఁ డగుటచేతను, తన బాల్యస్నేహితు రాలును యోగ్యురాలును నయిన లేడీ జేన్ గ్రేయందుఁ గల ప్రేమాతిశయము చేతను, రాజా నార్తంబరులాండు ప్రభువు యొక్క మాయలోఁబడి యాతఁ డువదేశించినట్లు మరణశాసనమును వ్రాసెను. తరువాత శీఘ్రకాలములోనే యెడ్వర్డురాజు తన వదు నాఆవయేట తండ్రిపోయిన యేడనంవత్సరములకు గ్రీనిచ్ నగరము నందు పరమపదప్రాప్తుఁ డయ్యెను. ఆతనిమరణమునకు ముందవసాన దశలో సోదరునిఁ జూచుటకయి రప్పించు మిషమీఁద నాతనియప్పల నిద్దఱిని రప్పించి వారిని తనయధీనము చేసికోవలె నని నార్తంబరు లాండు ప్రభు వొకకపటనాకమును గల్పించెను గాని యీ వన్ను గడలో నతఁడు సఫలమనోరథుఁడు కాలేదు. మిత్రు లాతని కుతం త్రమును వారికి ముందుగాఁ దెలిపినందున నారాజతనయ లిద్దఱును నతఁడు పన్నిన వలలోఁ బడక తప్పించుకొని మరలి సురక్షిత మైన స్థలము చేరిరి. అతఁ డిట్లు విఫలమనో రథుఁ డయినను తనవూనికను విడువక నస్సోకుప్రభువు మొదలయినప్రభులను వెంటఁగొని తిన్నఁగా సయ్యా మందిరముల నున్న లేడీ జేన్ గ్రే వద్దకుఁ బోయి వినయనిధీ

యతలతో నామెకు రాణికి నడపవలసినమర్యాదలను నడపి యామెను సందర్శించెను. పెనిమిటితోటి నహవానసౌఖ్యము ననుభవించుచుఁ బెండ్లి యయినప్పటినుండియు. నామె యక్కడ వసించుచుండెను. ఈ దంపతు లన్యోన్యానురాగముగలవారయి సుఖముగా కాలముగడుపు చుండిరి. ఆమె యొంటిగా నున్నప్పు డెల్ల విద్యావ్యాసంగముతో కాలము గడుపుచు సద్గ్రంథములను జదివి యానందించుచు నుండెను. అంతేకాని యిహలోక సంబంధము లయిన దురాశ లేవియు నామెమనస్సునఁ జొరలేదు. తనమామగారు పన్నుచుండిన కపట తంత్రము లామె కెంతమాత్రము నావఱకుఁ దెలియనే తెలియవు. ఎడ్వర్డుయొక్క మరణానంతరమున నార్తంబరులాండు ప్రభువు వచ్చి రాజమరణశాసనమునుబట్టి యామె రాణి యయినదని చెప్పఁగానే యామె బిగ్గరగా నేడ్చి మూర్ఛిల్లెనఁట! మూర్ఛ తెలిసినతరు వాత సహిత మామె యెంతమాత్రము నామోదింపక చాలసేపు విచారగ్రస్తురా లయి యుండి తనకు సింహాసన మక్కఱలేదని నిరాకరించెను. మామగా రైన్నివిధములఁ బ్రార్థించినను తా నాతని ప్రార్థన నంగీకరింపక, జన్మస్వాతంత్ర్యమునుబట్టి న్యాయముగా రాజపుత్రికల సొత్తు కావలసినరాజ్యము నితరు లపహరింపఁ జూచుట యధర్మమనియు, అట్టి యధర్మవృత్తికిఁ దా నొడఁబడఁజాల ననియు, దృఢచిత్తముతోఁ బలికి, తనబంధువులు చెప్పినయుక్తుల కన్నిటికిని తగిన సమాధానములు చెప్పి, తన్ను బాధింపక తానప్పు డున్న స్థితితోఁ దృప్తినొంది సుఖించునట్లు తన్ను విడిచి పెట్టుఁడని వారిని దీనముగా వేఁడుకొనెను. వియ్యంకుని ప్రేరణముచేతఁ దనతండ్రివచ్చి యెన్ని యో విధముల బతిమాలినను మనస్సు చలింపనీక యామె దృఢచిత్తురా లయి తన పూనికను విడువకుండెను. అంతట నామెతల్లి వచ్చి పూజ

నీయు లైన యిందఱొప్పులు చెప్పు చున్నప్పుడు మూర్ఖపుపట్టు పట్టుట న్యాయము కాదనియు, బంధుహితము గోరి చెప్పెడు తనబుద్ధి విన వలసినదనియు, బోధించెను. ఇంతవఱకును నాజ్ఞాపించుచుండెడు జననీ జనకులు ప్రార్థించుచుండఁగా, సదా తదాజ్ఞాబద్ధురా లయి నడవ నల వాటుపడిన యామె యేమి చెప్పుటకును తోఁచని దయి వారిమాట కెదురాడ వెఱచి డోలాందోళితచిత్తయయి యూరకుండెను. అట్టి సమయమునం దామె ప్రాణవద మైన ప్రియభర్త దాపునఁ జేరి తన ప్రార్థన మంగీకరింప వలసినదని వినయపూర్వకముగా కడసారి వేఁడు కొనెను. ప్రాణాధికునిగా భావించి యాతనితోడిదే లోకమని యవ్యాజ ప్రేమతో సేవించుచున్న ప్రాణవల్లభుఁడు వచ్చి ధైర్యరస ముట్టిపడ వేఁడుకొన్నప్పు డాతనిమాట కెదురుచెప్పలేక యామె యెట్లో యొడఁ బడెనుగాని యప్పుడు సహితము సంతోష పడుటకు మాఱుగాఁ దన యవస్థకు దుఃఖింపఁ జొచ్చెను. ఇంతనిర్బంధ పెట్టి బలాత్కారముగాఁ బడసినయంగీకార మనర్థదాయక మయి దుఃఖముగా ముగియు నని తెలుపునట్లుగా నప్పు డామె కన్నులనుండి బొమ్మధారలువెలువడి వెల్లువలుగట్ట నామె పయివంకఁ జూచి "దయాసముద్రుఁడవైన యో యీశ్వరుఁడా! ఈస్వామ్యము నిజముగా నాదే యయినపక్షమున నీమహిమయుఁ బ్రజాక్షేమమును వృద్ధియగునట్లుగా పరిపాలించుటకు నాకు శక్తినిమ్ము" అని ప్రార్థించెను. 1553 వ సంవత్సరము జూలై నెల 10 వ తేదిని లేడీజేన్‌గ్రే పట్టాభిషేకమహోత్సవ నిమిత్తము లండన్ నగరమునందలి కోటలోని కొక సుందరమైనపడవలోఁ గొని పోఁబడెను. అప్పు డామెవెంట మామగారగు నార్తంబరులాండు ప్రభువును తండ్రియగు సస్సోకు ప్రభువును బోయిరి. అంత నచ్చట పట్టాభిషేకోత్సవము నడచెనుగాని యీక్రొత్తరాణియే యుత్సాహ

వంతురాలు గాక కన్నులు వాచునట్లుగా నేడ్చుచుండెను. ఒక్క లండనునగరమునందుఁ దప్ప రాష్ట్రమునం దంతటను ప్రజ లందఱును లేడీజేన్ గ్రేకుఁ బ్రతికూలురయి మేరీ కనుకూలురుగా నుండిరి. లండన్ నగరమునందు సహితము ప్రజ లీమె పట్టాభిషేకసమయమునం దుత్సాహమును సంతోషమును గనఁబఱుపలేదు.

మేరీ రోమిూతుమతస్థురా లగుటచే నామె రాజ్యభారమును వహించుటయం దంత యిష్టము లేనివారుగా నున్నను, నార్తంబరు లాండు ప్రభువుయొక్క దుష్పరిపాలనమును బట్టి ప్రజ లాతనిని ద్వేషించువారయి జేన్‌గ్రేయొక్క ప్రభుత్వమునం దాదరము లేని వారుగా నుండిరి. ఇది యిట్లుండగా మేరీ తాను రాణి యైనప్పుడు మతభేదమును బొటింపక సర్వజనక్షేమకరముగాఁ దాను బూర్వరాజ శాసనములను మన్నించుచు సత్పరిపాలనము చేసెద నని వాగ్దానము చేసెను. అందుచేతఁ బ్రజలు సంతుష్టులయి మతభేదమును మఱచి న్యాయముగాఁ తండ్రిరాజ్యమునకు వచ్చుట కర్హురాలైన మేరీ యొక్క పక్ష మవలంబించి యామెకు సహాయులు కాఁ దొడఁగిరి. లేడీ జేన్‌గ్రేయొక్క యధికారమును గూపాడుట కయి యుంచఁ బడిన సేనలు సహితము సేనాధిపతులచేఁ గొనిపోఁబడి మేరీపక్షమునఁ జేరఁ జొచ్చెను. అప్పు డేమిచేయుటకును తోఁచనివాఁ డయి నార్తంబరు లాండు ప్రభువు కొంతసేనతో మేరీ మిూఁదికి దండువెడలెను. గాని తన నమ్మినభృత్యులే తన్ను విడిచి శత్రుపక్షమునఁ జేరుటచేత నిరాశుఁ డయి తానును మేరీయొక్క ప్రభుత్వమున కామోదించిన రాజభక్తుని వలె నటించి "కాంబ్రిడ్జిపురముయొక్క యంగళ్ళవాడలో బహిరంగ ముగా "దేవుఁడు మేరీరాణిని రక్షించుగాక!" యని ఘోషించెను. జేన్‌గ్రేయొక్క తండ్రి యగు నస్సోకు ప్రభువును వియ్యంకుఁడు చూపిన

మార్గమునసే యనుసరించి తానును మేరీ రాజ్యభారము వహించుట నభినందించెను. ఈప్రకారముగా జేన్‌గ్రేరాజ్ఞిగా ఘోషింపఁబడిన పదియవనాఁడు సస్సెక్సుప్రభువు తన కొమారితయొద్దకుఁ బోయి "నీవు రాణివేషమును విడిచి యింతటినుండి భృత్యవేషముతోఁ దృప్తినొంది యుండవలయును" నని యాకస్మికముగాఁ జెప్పెను. ఆమాట కాపి యణుమాత్రము సంచలింపక నిర్వికారచిత్తయై "నేనీవేషమును ధరించి చిన నాఁటికంటె నెక్కువ సంతోషముతో నిప్పుడు దీనిని దీసివేసెదను. నాజననీజనకు లైన మీ రిరువురును నాజ్ఞాపించినందునఁగాని లేని యెడల నే నీవేషము నెప్పుడును ధరించి యుండను. ఈశుభవార్తనా కెంతో సంతోషకరముగా నున్నది." అని వలికి తత్క్షణమే తనపూర్వ వస్త్రములను దాల్చెను. లండన్ దుర్గమున కధికారిగా నున్న యామె తండ్రియే యప్పుడు మేరీయొక్క ప్రవేశోత్సవమున కయి కోటతలు పులు తెఱపించెను. అందుచేతఁ గోటలో పట్టబద్ధురాలుగాఁ బ్రవేశిం చిన లేడీ జేన్ గ్రే యివ్వు డాకోటలోనే పతితోడఁగూడ కారాబద్ధురా లగుట తటస్థించెను.

మేరీ సింహాసన మధిరోహించిన మఱునాఁడే రాణీపీఠిట లేడీ జేన్‌గ్రే మామగా రైన నార్థంబరులాండుప్రభు వాతనిగర్భ శత్రు వయిన అరండల్ ప్రభువుచేత పట్టుకోఁబడెను. సాధారణముగా క్రూరులును భీరువులు నయినవా రందఱును ప్రాణములకు భయపడు నట్లే యతఁడును భయపడి యంత్యదశయం దతిదీనముగా ప్రాణరక్ష ణార్థము ప్రార్థించెనుగాని యాతని యప్రతిరోధ మైన యపరాధమును వినాశకరమైన దురాశయు దయకుసహిత మతని ననర్హునిగాఁ జేసి నందున నతఁడును మఱియిద్దఱును ప్రాణాంతదండమును బొందవలసి

నవా రయిరి. అతనికొడుకులలో ముగ్గురును నహోదరుఁ డొకడును ప్రభుపరంపరలోనివారు కొందఱునుగూడ రాజద్రోహులుగా పరిగ ణింపఁబడి పట్టుకోఁబడిరి గాని, రాణి ప్రజానురంజనమును గోరి వారిలో నసేకులను క్షమించి విడిచెను. తరువాత లేడీ జేన్ గ్రేయును నామె భర్త యగుగిల్ఫోర్డు డడ్లీ ప్రభువునుగూడ విచర్మింపఁబడి యపరాధ స్థాపన మయినపిమ్మట రాజద్రోహులగుటచే వధార్హులని నిర్ధారణము చేయబడిరిగాని వారిరువురునుగూడ పదునెనిమి దేండ్లయినను నిండని బాలప్రాయు లగుటనుబట్టియు నిరపరాధు లగుటనుబట్టియు క్రింత వ్యులుగా నెన్నఁబడినందున వారిదండనము త్వరపడి నడప నుద్దేశింపఁ బడలేదు. అందుచేత నాదంపతులు కడపట విడిచిపెట్టఁబడుదు రని యెల్లవారును నమ్మియుండిరి.

ఇది యిట్లుండఁగా మేరీరాణి తనకు రాజ్యము స్థిరపడఁగానే యామతసంస్కారమువలనఁ దమ పదములను గోలుపోయిన రోమీయ మతస్థులను మరల వారిపూర్వస్థానములయందు నిలుప నారంభించెను. ఆమె యత్యంతమూఢవిశ్వాసమును మతోన్మాదమును గలదయి, స్వభావమూర్ఖత్వమును బట్టియే స్వమతతారతమ్య గ్రహణాసమర్థురా లయి, యామిూద మతాంతరుల నిషేధవాదములవలన మఱింత దురాగ్రహావేశపరవశురాలయి, రోమీయమతనిషేధవాదులను తన్మ తావలంబులను బహువిధముల బాధింపఁ జొచ్చెను. అందుచేత దేశ ములో రోమీయధర్మప్రతిషేధకమతములయొక్క స్థిరత్వమునకు భంగము కలుగునేమో యని సంశయింపవలసినంత వైపరీత్యము సంభవించెను. ఇట్టిస్థితిలో నామె రోమీయమతస్థుఁడును క్రూరుఁడును నైన ఫిలిప్పునుస్పెయినుదేశపురాజును వివాహమాడఁ బ్రయత్నిం చుటకూడఁ దటస్థించినందున, ప్రజలు నిరాశులయి సంక్షోభము

నొంద మొదలుపెట్టఁగా వారిలోననేకు లాయుధములు ధరించి బహి
రంగముగాఁ గలహించుటకుఁ దెగింపవలసినవా రయిరి. ఈరాజ
ద్రోహతంత్రము మొదట నిగూఢముగా సమర్థతోనే యారంభింపఁ
బడెనుగాని కార్యనిర్వాహణమున కావశ్యక మయిననేర్పు తగినంత
లేనందునఁ గార్యము తుదముట్టినది కాదు. కలహాకారులకుఁ బ్రథమ
నాయకుఁ డైన సర్ థామస్ వైయట్టు రాజసేనలఁ గొన్నిటి నోడించి
లండన్‌నగరముమీఁదికి వచ్చెనుగాని యతఁ డీయల్పజయములచేత
గర్వపడి ప్రమత్తుఁ డయి స్వప్రయత్న మప్రయాసముగా సంపూర్ణ
సాఫల్యము నొందు నని స్వప్నసామ్రాజ్యము ననుభవించుచు నేమఱి
యుండఁగా నాకస్మికముగా పురద్వారముకడనే పట్టుకొనఁబడెను.
ఈప్రయత్నముయొక్క ప్రధానోద్దేశము మేరీస్థానమున నెలిజబెత్తును
రాణినిగాఁ జేసి తన్మూలమునఁ గతినాథ్మఁ డైన స్పెయినురాజు
యొక్కయు రోమీయమతాధికారము యొక్కయు క్రౌర్యమును
దొలఁగించుట యయి యున్నది. అయినను మంత్రరహస్యము వెల్లడి
యైనందున నారాజద్రోహసంరంభ మారంభములోనే యడఁచివేయఁ
బడెను. రాజద్రోహి యైన సర్ థామస్ వైయట్టును నాతనికి
సహాయు లైనవారిలో నఱువండ్రును తలలు తీయఁబడి, మేరీనివివాహ
మాడి స్పెయినురాజు ఫిలి ప్పాఱునెలలకుఁ దరువాత పురప్రవేశోత్స
వమున కయి వచ్చువఱకును వారిమొండెములు వ్రేలాడఁగట్టఁబడి
యుండెను.

లేడీ జేన్ గ్రే తండ్రి యైన సస్సోక్‌ప్రభువు తనకన్నులయెదుట
వియ్యంకుఁ డైన నార్తంబర్లండుప్రభువునకు సంప్రాప్త మయినదుర్మ
రణమును జూచియైనను బుద్ధి తెచ్చుకోలేనివాఁ డయి తనయల్లుఁడును
గూఁతురును మేరీయొక్క కటాక్షమునకుఁ దాను లయి చెఱసాలలో

నున్నవారని యైన, దూరాలోచన లేనివాఁడయి తనప్రాణముల కాశింపక తనయొక్కయు బిడ్డలయొక్కయు క్షేమమును విచారింపక కలహకారులతోఁ జేరెను. ఈయనాలోచితకృత్యమువలన నాతని ప్రాణములకు చేటు మూడుట యొకవింత కాదు. అతఁడు కలహకారులలోఁ జేరుట జేసి గ్రే యొక్కయు నామెభర్తయొక్కయు ప్రాణములమీఁదికిఁ గూడ వచ్చెను. ఆబాలదంపతులకు విధింపఁబడి యింతకాలము నిలిపి యుంచఁబడిన క్రూరదండనము నెప్పుడు ప్రచారమునకుఁ దేవలయునా యని దయయెట్టిదో యెఱుఁగని మేరీయొక్కమన స్సానఱికే వేగిరపడుచుండెను; ఇంతలో నామెతండ్రి రాజద్రోహియగుటకూడ తటస్థించుట యాసాకుమీఁద దానిని తక్షణమే ప్రవృత్తికిఁ దెచ్చుట కవకాశమును గలిగించెను. అందుచేత మరణమునకు సంసిద్ధులరయి యుండవలసినదని లేడీ జేన్ గ్రేకును తద్భర్తకును వర్తమానము పంపఁబడెను. తన కట్టిగతి యెప్పుడో తప్పక కలిగితీఱునని యెఱిఁగిన దయినందున ప్రాణాశ మాని యామె యావఱకే చావునకు సంసిద్ధురాలయి యుండెను. ఇట్టిసమయమునందు రోమాయమతోన్మాదిని యైన మేరీరాణి కారాబద్ధురాలయి యున్న లేడీ జేన్ గ్రేకు విముక్తికలిగించి యనుగ్రహము చూపఁదలఁచుకొన్నదాని వలెఁ గనఁబడుచు నామె తన రోమాయధర్మప్రతిషేధకమతమును త్యజించి రోమాయమతము నవలంబించినపక్షమునఁ బ్రాణదానమును స్వాతంత్ర్యదానమును జేసెదనని చెప్పిపుచ్చి సమర్థులైనట్టియు విద్వాంసులయినట్టియు రోమాయమతాచార్యుల నామెకడకుఁ బలుమాఱు పంపుచువచ్చెను. రాణియొక్కమతాచార్యుఁడైన ఫెకెఁహామను నతఁడు రాణి యుత్తరువు ననుసరించి స్వమతసిద్ధాంతప్రాశస్త్యము నామెకు బోధించి యామె నేలాగున సయిన రోమాయమత

మునకుఁ ద్రిప్పవలె ననిసర్వవిధములఁ బ్రయత్నము చేసెను గాని యాతనికృషి యంతయు విఫల మయ్యెను. ఆమె తనయొద్దకుఁ బంపఁ బడుచు వచ్చిన రోమాయమతాచార్యుల యుక్తులకుఁ బ్రతియుక్తులు చెప్పి ప్రతివక్తులవాదమును పూర్వపక్షముచేసి స్వమతసిద్ధాంతము లను సమర్థతతో స్థాపించుచు వచ్చెను. ఇంత జరిగినను మేరీరాణి యూరకుండక యింకను నామె రోమన్ మతములోఁ గలియు నేమో యన్నభ్రమచేత నామెకు మఱి మూఁడు దినములు గడు విచ్చెను. అయినను జేన్ గ్రే యిటువంటి ప్రాణసంశయదశలో సహితము తన మనోనిశ్చయమును వదలని దయి తాను సత్య మని నమ్మిన ధర్మము నందు దృఢవిశ్వాస ముంచి నిశ్చలురా లయి యుండుటయే కాక యెన్నికష్టములు వచ్చినను స్వమతమును మార్చుకొన కుండునట్లు ప్రబోధించుచుఁ దన సహోదరికి గ్రీకుభాషలో నొక లేఖను వ్రాసి యాభాషలో నున్న క్రైస్తవవేదము నొకప్రతి నామెకుఁ బంపెను.

ఆమె ప్రతిక్షణమును దన చావును బ్రతీక్షించుచుండి యాపఱకే మరణమునకు నంసిద్ధురాలై యుండినందున నిప్పు డియ్యఁబడిన గడు వామె మనోవ్యథను బెంపుచెందించుటకే తోడుపడెను గాని మనశ్శాంతిని గలిగించుట కనుకూలపడలేదు. ఇట్టిస్థితిలో నామెకుఁ దండ్రికిఁ దటస్థించిన యాపదలు తెలియవచ్చుటయే కాక యాతఁడు ప్రాణాంతదండన ననుభవించుటకుఁ దా నున్న దుర్గములోనికే తీసి కొని రాఁబడినట్టు తెలిసెను. ఆసంగతి తెలియఁగానే యామె నిజజన కున కొకలేక వ్రాసి పంపెను. దానిలోని కొంతభాగమును దెనిగించి యిందు క్రిందఁ బొందుపఱుచుచున్నాము—

"ఓ ప్రియజనకా!

ఎవరివలన నాజీవితకాలము పెంపు చెందవలసినదో యట్టి వంటి నీవలననే నాచావును త్వరపఱుచుటకు భగవంతుడనుగ్రహించి నప్పటికిని, నాయిష్టానుసారముగా నాకుదీర్ఘాయువునిచ్చి ప్రపంచము నంతను నాయధీనము చేసినయెడల సమర్పించెదు వందనములకంటె నాదుఃఖదినములను హ్రస్వపఱిచినందున కయి యధికనిర్వ్యాజవంద నములను దేవునకు సమర్పించునంత శాంతతతోనే నేను దానిని స్వీక రింపఁ గలను. నీకష్టములను గూర్చి నీవు పొందునట్టియు నిత్తఱి వలన నేను విన్నదానినిబట్టి ముఖ్యముగా నా దుఃఖకర మైన స్థితిని గూర్చి నీవు పొందునట్టియు శోకాతిశయమును నేను నిశ్చయముగా నెఱుఁగుదును. నాప్రియపితా! అయినప్పటికిని నాచేతులను నిర్దోషిత్వ జలమునందు కడుగుచు నా నిర్దుష్టరక్త మీశ్వర సమ్ముఖమున, నిరప రాధులకు దయ చూపఁబడె నని ఘోషింపఁ గల దగుటచేత నన్ను ధన్యురాలినిగాఁ బరిగణించుకొనవచ్చును. అయినను నీవు చక్కఁగా నెఱిఁగి యున్నట్లుగా నిర్బంధపఱుపఁబడియు పిరాయుము లేకుండఁ బీడింపఁబడియు నైనను (రాజ్య) భారమును పైని వేసికొనుట సమ్మ తించినట్లు కనఁబడి యుందుమూలమున రాణి యెడలను దచ్ఛాసన ముల వలనను మహాపరాధమును జేసినదాన నయినట్లు నే నొప్పుకో వలసి యున్నప్పటికిని, నారాజ్ఞీవేషధారణముచేఁ (భాప్త మైన నిర్బ ధ నిహితిగౌరవ మొప్పుమును నా నిర్మలహృదయముతోఁ జేరుట కా పోవులచేత నిశ్చయవిషయ మయి యీ నాయపరాధ మల్పతర మయిన దని నేను నిశ్చయముగా నమ్ముచున్నాను.

* * * *

ఓ సత్పితా! ఈప్రకారముగా నే నిప్పు డున్నస్థితిని నీకు వెల్లడి పఱిచియున్నాను— నా మరణము పరిమాపించినది.

ఇదియొక వేళ దుఃఖకరముగాఁ గనఁబడ వచ్చినప్పటికిని, ఈ దుఃఖగుహా నుండి వెలువడు రక్షకుఁ డైన క్రీస్తునాథునితోఁ గూడి నిత్యసుఖసంతోషప్రద మైన స్వర్గసింహాసనమునం దుండఁగోరుటకంటె నధికప్రియతరము కాఁగలిగినది మఱియొకటి లేదు; (పుత్రిక తండ్రి కిట్లు వ్రాయుట న్యాయ మయిన పక్షమున) తనయందలి దృఢభక్తి యందు నీ కింతవఱకును బలము నిచ్చినట్టి ప్రభువు కడపట మనము వరలోకములో తండ్రితోను కుమారునితోను పరిశుద్ధాత్మతోను గలిసికొనుటకు నీ కాబలమునే ముందును ప్రసాదించుఁ గాక!

ఇట్లు

మరణపర్యంతము నీ విధేయపుత్రి యైన

జేన్ డడ్లీ"

లేడీ జేన్ గ్రే చెఱసాలలో నున్న కాలములోఁ దన యప్పటి యవస్థకు సరిపోవు నట్లుగా ననేక ప్రార్థనలను పద్యములను రచి యించెను; మరణదండనమును బొందుటకు పూర్వపురాత్రి సహిత మామె వానిని దిద్దునంతటి దృఢమనస్సు గలదయి యుండెను. ఇటు వంటి ప్రాణసంశయావస్థలో సహితము రోమాయమతాచార్య లామె యొద్దకుఁ బోయి యామెను స్వీయమత ప్రనిష్ఠురాలినిగాఁ జేయుట కయి బోధ చేసిరఁట. ఆమె పర్వతము వలె నచంచలురా లయి కడ నిమిషము వఱకును రోమాయధర్మప్రతిషేధక మతమునందే నుస్థిరురా లయి తదేకదీక్షతో నుండెను. తెల్లవారి తన్ను శిరశ్ఛేదము చేయుదు రనఁగా నారాత్రి యామె తన సహోదరి యైన కేథరైనుకు గ్రీకు నూతన నిబంధన గ్రంథమును బంపుమ దానిలో వ్రాసిన లేఖకు భాషాంతర మిది—

"ప్రియసహోదరివైన యోకేథరైనా! పయిభాగము బంగా రముతో నలంకరింపఁ బడక పోయినను లోపల సమూల్యరత్నముల కంటెను నెక్కువవెల కలదయిన పుస్తకమును నీకుఁ బంపుచున్నాను. ఓప్రియసోదరీ! ఇది యీశ్వరశాసనములను గలిగిన పుస్తకము. ఇది నిర్గతికుల మయినమనకు ప్రభువు విడిచిన తన సంహితయు మరణశాన నము నయి యున్నది; ఇది నిన్ను శాశ్వత సంతోషమార్గమునకు నడ పును; దీనిని నీవు మంచిహృదయముతోఁ జదివినను నిష్కపటహృద యముతోఁ ననుసరింపఁ బూనినను నీకిది నాశములేని శాశ్వతజీవన మును దెచ్చును. ఇది నీకు బ్రతుకువిధమును చచ్చువిధమును నేర్పును. నీతండ్రియొక్క యధికమయిన భూములవలన నీవు పొందవలసినదాని కంటె నీకిది యెక్కువ లాభమును గలిగించును. దేవుఁ డాతనికి మంచిస్థితిని గలిగించినందున నీ వాతని భూములను బొంద వలసినట్లు గానే, దీనిలో విధింపఁబడిన ప్రకారముగా నడచుట కపేక్షించుచు దీనిని నీవు శ్రద్ధతోఁ జదివెనుపక్షమున దురాశాపరులు నీయొద్దనుండి గైకొనలేనట్టియు దొంగలు తస్కరింపలేనట్టియు పురుగులు పాడుచేయ లేనట్టియు దివ్యధనమును నీవు చాయముగాఁ బొందుదువు. ఓ సాధు సోదరీ! డేవిడ్డువలె నీవును ప్రభువైన దేవునియొక్క శాసనములను గ్రహింపఁ గోరుము. నీవు మరణమువలన నిత్య జీవనమును బొందు నట్లుగా శాంతితోఁ జచ్చుటకు బ్రతుకుము. నీ లేఁబ్రాయము నీకు దీర్ఘాయువు నిచ్చునని నమ్మకోకుము — దేవునియాజ్ఞ యైనపక్షమున ముసలివా రెంత శీఘ్రముగాఁ బోవుదురో యంత శీఘ్రముగానే పసివారును బోవుదురు - ఎట్లు చావవలయునో నేర్చుకొనుట కయి యెల్లప్పుడును పాటువడుము. ప్రపంచమునకుఁ బ్రతికుటింపుము; పాప మును బాఱఁదోలుము; ఇంద్రియసుఖములను దిరస్కరింపుము; ప్రభు

వునందే యానందమును బొందుము. నీపాపములకయి పశ్చాత్తాప పడుము; ఎవ్వాడును నిరాశనుమాత్రము పొందకుము. భక్తియందు దృఢచిత్తురాలవు కమ్ము; గర్వపడకుము ఎవడు మృతి నొందియు జీవించియున్నాడో యటువంటి క్రీస్తుతో నుండుటకు సెయింటుపాలు వలెఁ గోరుము. అర్ధరాత్రమునందు దొంగవలె వచ్చి మృత్యువుని న్నపహరించునేమో యన్నట్లు సద్భటునివలె రాత్రిసహితము నీవు జాగరూకురాలవయి యుండుము. * * * * నావలెనే నీవు క్రీస్తునం దానందము పొందుము. నీప్రభువైన క్రీస్తునియొక్క మార్గము ననునరించి నీసిలువను వహింపుము. నీపాపముల నాయన వీఁపుమోఁద వేసి, నీ వాయనమార్గము నెల్లప్పుడు ననుసరింపుము. ఓసత్సహోదరీ! ఈదుష్ట భావమునుండి విముక్తి నొంది నిర్దుష్టతను బొందఁబోవు చున్నాను గనుక నామరణమునుగూర్చి నావలెనే నీవును సంతోషింపుము. ఈయస్థిరజీవనమును బోఁగొట్టుకొనుటచే సుస్థిరజీవనమును బొందుదు నని నాకు నిశ్చయముగాఁ దెలియును. భగవంతుఁడు నా కది ప్రసాదించి, ఈశ్వరభీతితో బ్రదికి నిజమైన క్రైస్తవ భక్తితోఁ జచ్చునట్లుగా నీకనుగ్రహింపవలయు నని ప్రార్థించుచున్నాను. జీవితాశచేతఁ గాని మృత్యుభీతిచేతఁగాని నీమూర్ఖమునుండి యెవ్వాడును తొలఁగకుండుట కీశ్వరనామమున నేను నీకు బోధించుచున్నాను. నీజీవితమును దీర్ఘముగాఁ జేసికొనుటకయి నీవాతని సత్యమును నిరాకరించినపక్షమున, నిన్నాయన నిరాకరించి నీదినములు హ్రస్వముచేయును; నీవాయనకై యాశ్రయించి యున్నపక్షమునఁ నీకు సౌఖ్యమును దనకు మహిమయుఁ గలుగునట్లుగా నతఁడు నీయాయువు దీర్ఘము చేయును. ఆపదవికి భగవంతుఁడు నన్నిచ్చాడు కొనిపోయి, ఆయన యనుగ్రహము వచ్చినప్పుడు ముందు నిన్నుఁ గొనిపోవును. ఓ సత్సహోదరీ! నీకు శుభో

మగును గాక! నీవీశ్వరుని యందే విశ్వాసముంచుము; అతఁడొక్కఁడే నీకు సహాయుఁడు కావలెను."

వారివధదినమునఁదు గిల్ఫోర్డ్రుప్రభువు తనభార్య యైన జేన్ గ్రేను సందర్శింపఁ గోరఁగా మేరీరాణి వారి సమావేశమున కియ్యకొనెను. కాని, లేడీ జేన్ గ్రేయే యందు కంగీకరింపక, తమసమావేశానంతర వియోగ దుఃఖ ముభయుల ధైర్యమును జెడఁగొట్టి యవసానదశయం దుండవలసిన మనస్థైర్యమునకు భంగము కలిగించునియు, వారి యీవిరహము కతిపయనిమిషపరిమిత మయినదే యయినందునఁ గొంచె మోర్చినయెడల నెక్కడ ననోన్యాను రాగబంధము తెంపులేక నిరంతరముగా నుండునో, యెక్కడ మృతియు నాశాభంగమును దురదృష్టమును జేరి శాశ్వతా నందమునకు భంగ కలిగింప లేవో యక్కడఁ దానన్యోన్య సమావేశము నొందవచ్చుననియు, సందేశము పంపెను.

గిగిర వ సంవత్సరము ఫిబ్రవరినెల పండ్రెండవతేది సోమవారమునాఁడు వధూవరులలో గిల్ఫోర్డ్రు ప్రభువు శిరశ్ఛేదమున కయిముందుగా వధ్యస్థానమునకుఁ గొనిపోఁ బడెను. అతఁడు పోవునప్పుడామె గవాక్షములోనుండి చూచి తనస్మరణ చిహ్నము నొకదాని నాతనికొసఁగి యీశ్వరధ్యానము చేయుచు తనగడియ వచ్చువఱకును మనశ్శాంతితో వేచియుండెను.

గిల్ఫోర్డ్రుప్రభువు తనప్రాణావసాన సమయమునందు ధైర్యముగాని చిత్తోన్నతిని గాని యణుమాత్రమును గోలుపోక, తన నిమిత్తమయి కాచుకొనియున్న మిత్రులందఱి యొద్దను సెలవుగైకొని, దృఢచిత్తముతో వధ్యస్థానము నధిరోహించి యచ్చటఁ గొన్ని నిమిషము లీశ్వరధ్యానమునందుఁ గడపి, మూఁకలుగా మూఁగియున్న జను

లను తనకొఱకుఁ బ్రార్థింపుఁ డని పలికి, వధ్యదారువుమీఁద నిజశిర స్సును మోపెను. మఱియొక్క నిమిషములో నాతని శిరస్సు మొండెమునుండి ఖండింపఁ బడెను.

గిల్ఫోర్డు ప్రభువు శిరశ్ఛేదము చేయఁబడిన తోడనే పురాధి కారులు వచ్చి యామెను వధ్యస్థానమునకుఁ గొనిపోవలసిన గడియ వచ్చిన దని లేడి జేన్ గ్రేతో విన్నవించిరి. ఆయాజ్ఞ తెలుపఁబడి నప్పు డామె కంపవైవర్ణ్యాదిభయ చేష్టలను వేనిని బొందక నిశ్చల ధైర్యముతోఁ వినెను. ఆమె వధ్యస్థానమునకు గొనిపోఁబడు చుండినప్పుడు దారిలో సమాధిసమిత్తమయి బండిలో వేసి తీసికొనిపోఁ బడుచున్న శిరోవిహీన మైన భర్తృకళేబర మాకంటఁ బడెను. భర్తృశవము నేత్రగోచరము కాఁగానే యామెకన్నులనుండి జొటజొట నీరు కార నారంభించెనుగాని, ప్రాణోత్క్రమణసమయమునందు సహిత మతఁడు ధైర్యమును విడువలే దన్న వార్తాశ్రవణమువలన దుఃఖము నావుకొని మతింత మనోదార్ఢ్యము నొందినదయి ధైర్యమునుబూని "ఓగిల్ఫోర్డా! నీవు చవిగొన్నట్టియు నేను చవిగొనఁబోవుచున్నట్టియు మృతిరూప ఫలము నన్ను కంపము నొందించునంతటి చేఁదైనది కాదు. ఈదిన మున నీవును నేనును గూడి స్వర్గములో ననుభవింపఁ బోయెడు విందు తోఁ బోల్పఁ బడినప్పు డిది పేరోఁ దగిన దేకాదు." అని పలికి తన పలకపుస్తకములో నేదో వ్రాసెను. వధ్యస్థానమును సమీపించినప్పుడు దుర్గరక్షకాధికారి యైన సర్ జాన్ గేజి యనునతఁ డామెను జూచి తత్స్మరణార్థముగాఁ దాను స్థిరముగా నుంచు కొనుట కేదైనఁ జిన్న పారితోషికము ననుగ్రహింపవలసిన దని యామెను వేఁడు కొనెను. భర్తృశవమును జూచినప్పు డింతకుము దామె స్వహస్తముతో గ్రీకు భాషతో "మానుషిక న్యాయ మాతని దేహమునకుఁ బ్రతికూలముగా

నున్నను, ఈశ్వరకారుణ్య మాతనియాత్మ కనుకూలముగా నుండు" ననియు, లాటిన్ భాషతో "ఆమెయపరాధము దండనమున కర్హమైన దయినయెడల, అధమపక్ష మామెబాల్యమును లోకానుభవరాహిత్యమును క్షమార్హము లయినవి" యనియు, ఇంగ్లీషుభాషతో "ఆమె దేవుని నమ్మికొనెను గాన భావికాలప్రజ లామెయెడల దయ చూపుదురుగాక" అనియు, అర్థమిచ్చెడు మూడువాక్యములను వ్రాసిన పలకపుస్తకము నామె యాతని కిచ్చెను. ఆమె యప్పుడొక సేవకురాలికి చేజోళ్ళ నిచ్చెను. ఇయ్యవలసిన వాప్తజనుల కిచ్చి యామె నిర్భయముగా వధ్యవేదికపై నెక్కి యక్కడఁ గూడియున్న ప్రభువులకు మ్రొక్కి ముందు మూఁగియున్న పౌరులవంకఁ దిరిగి యిట్లనియెను.

"నాప్రభువులారా! నాచావు చూడవచ్చిన నత్కైస్తవజనులారా! నేనియ్యెడ శిక్షాన్మృతికి లోఁబడి యున్నదానను. తప్పెప్పుడును జేయని న్యాయాధిపతివంటిదైన యాశిక్షాస్మృతిచేత నేను వధింపఁబడునట్లు విధింపఁబడియున్నాను. ఇది నేను జేయునట్లు నిర్బంధవఱువఁబడినట్టియు నే నెప్పుడును గ్రహింపనిదానిని నేను జేసి యపరాధిని నయినట్టు శిక్షాస్మృతి నిర్ణయించినట్టియు పనిని నే నొప్పుకొన్నందుకుమాత్రమేకాని రాణిగారికి ప్రియమైన యేపనికొఱకును గాదు; ఏలయన, దానినుండి నాచేతులను శుద్ధి చేసికొని, అన్యాయమునుండి నిర్దోషిత్వమెట్లో యట్లే యటువంటిదోషమునుండి పరిశుద్ధమయిన నాయాత్మను దేవునకు సమర్పించుచున్నాను. అది యట్లున్నను నాయింద్రియసుఖవాంఛలను నిర్భాగ్యప్రపంచసుఖములను నత్యధికముగా నవలంబించినందువలనను, భగవంతుఁడు నాకుఁ బ్రసాదించిన జ్ఞానానుసారముగా నేను ప్రవర్తింపనందువలనను, నేను దేవునియెడల నపరాధినయి యున్నదానను. అందుచేత దేవుఁడు నాకీమరణమును

విధించి యున్నాఁడు; నాకృత్యములనుబట్టి నేను దీని కర్త్యంతపాత్రు రాలనయి యున్నాను. ఇక్కడ నీలోకములో నాపాపములకై యను తాప పడుటకును నాపూర్వదురభిమానములచేత విశేషముగా నే నప్రియ మొనర్చిన నారక్షకునియొక్క ప్రసన్నతను మరలఁ బొందుట కును నా కవకాశ మిచ్చినందున నే నాతనికి హృదయపూర్వకముగా వందనముల నర్పించుచున్నాను. కాఁబట్టి నాప్రభువులారా! సత్క్రై స్తవులైన సర్వమహాజనులారా! తనవిషయమున నేను జేసిన యప చారము లెంత లెక్కలేనివిగాను ఘోరమైనవిగాను నున్నను దేవుఁడు తన యపారకరుణతోను నదార్భవముతోను వానిని క్షమించునట్లుగా నేను ప్రాణములతో నుండఁగానే నాతోడను నానిమిత్తమును భగ వంతునిఁ బ్రార్థించుటకు మిమ్మందఱను నేను మహోత్కంఠతో వేఁడవలసి యున్నది. నేను క్రైస్తవభక్తురాలనయి చచ్చుచున్నా నని సాక్షులుగా నిలుచుటకు మిమ్మందఱను వేఁడుకొను చున్నాను. నా సమస్తకర్మలను పుణ్యకార్యములను దూరముగా వినరివైచి, రక్షకుఁ డైన జీసస్‌క్రైస్తుయొక్క రక్తమువలనను ప్రేమమువలనను యోగ్యత వలనను మాత్రమే రక్షింపఁబడుదునుగాని యితరసాధనములవలనఁ గాదు. నాసుకర్మలను నాయోగ్యతలనుమాత్రమే నమ్ముకొన్నయెడల నవి నాకర్తవ్యముల కెంతదూరములై నన్నెంత యధోగతిపాలు చేయఁ దగినవిగా నున్నవో! ఇప్పుడు నాతోను నాకొఱకును మీ రందఱను ప్రార్థన చేయవలయు నని మిమ్ము ప్రార్థించుచున్నాను."

పయి వాక్యము లామె స్వాభావికహృదయశాంతతను సౌజన్య మును వినమ్రతను దేటవఱుచు చున్నవి. ఆమె తనవిషయమునఁ జూపఁబడిన క్రౌర్యనిషయమునఁ బరుల నొక్క పరుషోక్తి యైనను బలుకలేదు. దోషమునంతను దనమీఁదనే వేసికొని, దానికి కారణము

రాజ్యకాంక్షగాక జననీజనకులయాజ్ఞోల్లంఘనము చేయలేకపోవుటయే యని విన్నవించెను. ఈమాటలు పలికినతరువాత నామి తనవెనుక నున్న పరిచారికాద్వయమును బిలిచి తనమెడమీఁదివస్త్రములను దొలఁగింప నియమించెను. కన్నులనీరు కారఁగా, చేతులు వడఁకఁగాఁ మేను చెమర్పఁగా వారు వస్త్రములనుదొలఁగింపఁ జేతు లాడక నిశ్చేష్ట లయి నిలువఁబడినందున, ఆమె యాపని తానే చేసెను. పరిచారికలు



వెనుక నిలువఁబడి మొగమునకు గుడ్డ లడ్డముపెట్టుకొని కన్నీటికాలు వలు తుడుచుకొనుచు నేడ్చుచుండిరి. అపుడు భూతుకపురుషుఁ డామె పాదములమీఁదబడి క్షమింప వేఁడుకోఁగా, ఆమె తత్క్షణమే వానిని క్షమించితీననీ చెప్పి "ఓయీ! దయచేసి నన్ను శీఘ్రముగాఁ దుడ

ముట్టింపుము" అని వేఁడి, "ఓ యీశ్వరా! నాయాత్మను నీచేతులలోఁ బెట్టుచున్నాను." అని విస్పష్టమైనయుచ్చైస్వరముతోఁ బలికి, శాంత మైనట్టియు నిర్వికార మైనట్టియు ముఖభావముతోఁ దన శిరస్సును వధ్యదారువుపైఁ బెట్టెను. ఉత్తరక్షణముననే వధకారిచేతిఖడ్గము మెయుత్తమాంగము నుత్తరించెను. అప్పుడు చూడ వచ్చినగుంపులో నుండి హాహానినాదములును రోదనధ్వనులును బైలువెడలెను.

పదునేడు సంవత్సరములప్రాయమప్పు డుదారచిత్తురా లయినట్టియు స్త్రీజనాలంకారము లైన సమస్తసద్గుణరత్నముల చేతను భూషితురా లయినట్టియు నిష్కళంక సౌశీల్యధైర్యాభిమానమాన నీయురా లయినట్టియు లేడీజేన్‌గ్రేయొక్క యైహికజీవిత మిట్లు వరి సమాప్తి నొందెను. డాక్టరు ఫుల్ల రను విద్వాంసుఁ డీమెను గూర్చి "శైశవమునందలి నిష్కపట్యమును, యౌవనమందలి సౌందర్య మును, కౌమారమునందలి దృఢత్వమును, వార్ధకమునందలి ఘనతను, అన్నిటిని పదునేడేండ్లప్రాయమునందే యీమె కలిగిన దయ్యెను. రాజకుమారియొక్క జననమును విద్వాంసునియొక్క పాండిత్యమును, పుణ్యాత్మనియొక్క జీవనమును, తల్లిదండ్రులదోషమునుబట్టి పాప కర్మనియొక్కచావును నీమెకుఁ దటస్థించెను." అనిప్రాసియున్నాఁడు.

లేడీజేన్‌గ్రే యవసానదశయందుఁ జెఱసాలలో నుండినప్పుడు ప్రాసిన యనేక ప్రార్థనలలోఁ గడపట దానిని మాత్రము తెలిఁగించి యీమె శోచనీయ మయినచరిత్రమును ముగించు చున్నాము —

"ఓప్రభువా! ఈశ్వరుఁడా! నాజీవజనకా! అన్నికష్టములయం దును దుఃఖము లందునుమాత్రము నీయొద్దకుఁ బరుగెత్తుచు గతిమాలి యేకాకిని నయి యున్నయబల నగునా మొట్టి యీలకింపుము ఓప్రభువా! నీయందువిశ్వాస ముంచినవారిని రక్షించి ముక్తినొసఁ

గెడు వాఁడవు నీ వొక్కఁడవే కాఁబట్టి పాపముచేఁ గళంకితురాల
నయి, క్లేశములచేఁ గప్పఁబడినదాన నయి, కష్టములచే శాంతి లేని
దాన నయి, చింతలచేఁ జుట్టుకొనఁబడినదాన నయి, ఆపదలచే నాక్ర
మింపఁబడినదాన నయి, దీర్ఘకాల కారాబద్ధతచే నత్యంత బాధితమై
పనికిమాలిన మట్టిముద్ద యయినయీనాపావపుబొందిని గలదాన
నయి, ఓదయామయుఁడ వయిన రక్షకుఁడా! ఏవి లేక మోక్షకాంక్ష
కించుక యయిన నవకాశ ముండదో యటువంటి నీదయను సాహా
య్యమును వేఁడుచు, రక్షణవిషయమున సంపూర్ణనిరాశ కలుగకుండ
నేను నిన్నాశ్రయించుచున్నాను. మాజీవితము శోధనమీఁదనే నిలిచి
యుండును గాన, మేము నీవార మగుదుమో కామో పరీక్షింపఁ
బడుటకును నిన్నును మమ్మును బాగుగాఁ దెలిసికొనఁ గలుగుటకును
కొన్ని సమయములందుఁ గొన్ని విపత్తులను మాకుఁ గలిగించుట
యుక్తమేయైనను, మాశక్తికి మించిన దుర్భరకష్టములతో మమ్మ
శోధింప నని పలికినవాఁడ వగుటచేత నగతికురా లయిన యీదీను
రాలిని గరుణింపుము. ఓ యీశ్వరుఁడా! అత్యున్నస్థితి నొంది నిన్ను
మఱవకుండులాగునను, అతిహీనదశ నొంది నిరాశచే రక్షకుఁడవును
ప్రభుఁడవును నయిన ననున్ను నిందింపకుండు లాగునను, నన్నతిమాత్ర
సంపదలచే నుబ్బింపకుండుటకును, అతిమాత్రవిపత్తులచే క్రుంగింప
కుండుటకును బ్రార్థించెదను. ఓకరుణానిధీ! నీ కెక్కువగాఁ దెలిసిన
నాదుస్థితిని విచారించి, నారక్షణమున కయి నీవు బలిష్ఠమైన పెట్టని
కోటవు కమ్ము. నేను వినమ్రతతో నర్థించుచున్నాను; ననున్ను నా
శక్తికి మించునట్లుగా శోధింపఁబడనీకుము. ననున్ను మహాకష్టములనుండి
విమోచనము చేయువాఁడ వయినను గమ్ము; లేదా, యీ దుర్భర
బాధను క్రూరదండనమును శాంతితో సహించు టిమ నయినను నా

కనుగ్రహింపుము. ననూ్నఱు నంవత్సరముల కాలము బాధించి దాస్యములోనుంచిన ఫారయోచేతులలోనుండి యీస్రయేల్ ప్రజలను రక్షించినది నీదక్షిణహస్తమే. ఎవరినొఱకు, నీకుమారుఁడైన క్రీస్తువు తన యమూల్య రక్తమును సిలువమీఁదఁ జిందఁజేసెనో యటువంటి శోచనీయు లయిన యభాగ్యులలో నొకఁడనైన ననున్ను నేనిప్పుడున్న దుఃఖకర మైన చెఱనుండియు బంధమునుండియు విముక్తి నొందించుట నీపితృవాత్సల్యమున కర్హ మగును గాక! ఎంతకాలము నీవు కనఁబడ కుండెదవు? ఎల్లకాలమునా? ఓప్రభువా! దయచూపుటను నీవు విస్మరించి యున్నావా? అనంతుష్టుఁడవై ప్రేమపూర్ణ మైన నీకారుణ్యపేటికను మూసి యున్నావా? నిన్నిఁక ప్రార్థింపవలసినపని లేదా? నీదయ యెప్పటికిని రాకుండఁ బూర్ణముగా నంతరించినదా? నీ యభయప్రదానము సంపూర్ణముగా సమాప్తి నొందినదా? నీవింత చిరవిలంబ మేల చేయుచున్నావు? ఓ ప్రభువా! ఇఁక నీకు దయ రాదని నిరాశచేసికోనా? అట్టిది నాకు దూరమగునుగాక! నేనును జీసస్‌క్రీస్తును సృజించిన సృష్టిలోనిదాననే. కాఁబట్టి నీకెప్పుడు దయ వచ్చునో యప్పుడు రక్షింతు వని నిశ్చయముగాఁ దెలిసికొని, నీకు నాయెడఁ గల దయను సందేహించుటగాని విశ్వసింపకుండుట కాని మాని, నీయవకాశమునిమిత్తము వేచియుండుటకును, నీవనులను శాంతతతో సహించుటకును నాకు క్షాంతి నొసఁగుము. నా కేది మంచిదో యది నాకంటె నీకే యెక్కువ తెలియును గనుక, సర్వవిషయములలోను నీవు నాకెట్లు చేయఁ దలఁచుకొన్నావో యట్లు చేయుము; నీయిష్టము వచ్చిన కష్టములను కలిగింపుము. నిన్ను వేఁడుకొను చున్నాను. ఈమధ్యకాలములో నానడుమును నత్యమను నడికట్టుతో బిగించి సాధువృత్త మనెడి యురస్త్రాణమును ధరించి

శాంతివార్త యనెడు దుశ్చేద్యచర్మనిర్మితపాదరక్షలపై నిలిచి, అన్నిటికంటెను ముఖ్యముగా దుర్మార్గులడాప్టాగ్ని బాణముల నన్నిటి నార్చివేయుటకు శక్తికలుగునట్లుగా భక్తిఖేటమునువహించి ముక్తి కిరీటమును నీపవిత్రవాక్య మైనయాధ్యాత్మికఖడ్గమును దాల్చి, నేను వ్యార్ణముగా నీయిచ్ఛ కాత్మార్పణము చేసి నీయిష్టమునకు బద్ధురాల నయి, ఇట్టికష్టములు నాకు శుభకరము లనియు నీవు చేసిన దంతయు నామీలుకొఅకేకాని మఱియొకందునకుఁ గాఁజాలదనియుఁ గనుఁ గొనుచు నీవు నాకుఁ బంప ననుగ్రహించిన కష్టములలో సంతుష్టిని బొందుచుండులాగున సర్వదా వినయవిధేయతలతోఁ బ్రార్థించుచు, నేను దృఢముగా నిలువఁగలుగునట్లుగా నీదివ్యకవచముతో నన్ను మో ఘాయుధసనాధను జేయుము. ఓకరుణాళుఁడవైనపరమపితా! నీ వెఱిని నాపాపములకు బలిగా నుండవలెనని సంకల్పించితివో యాయనకొఅకు నామె ప్రార్థింపుము. ఆయనకును నీకును పరిశుద్ధా త్మకును సమస్తయశోమహిమలును జెల్లునుగాక! తథాస్తు!"

Miss MARY CARPENTER.

మేరీ కార్పెంటరు.



మేరీ కార్పెంట రనునామె యేకేశ్వరబోధక (త్రిత్వనిషేధక) క్రైస్తవమతాచార్యుఁడైన డాక్టరు లాఁటు కార్పెంటరుగారి జ్యేష్ఠ పుత్రిక; ఆమెతల్లిపేరు పెన్. ఈ దంపతుల కీమె 1807 వ సంవత్సరము ఏప్రియల్ నెల మూడవ తేదీని ఎగ్జిటర్ పట్టణములో జనన మొందెను. ఆమెతండ్రి తాను మతాచార్యుఁడుగా నుండి, పెద్దవాండ్రకు ధర్మోప దేశము చేయుచుండుటయేగాక యుపాధ్యాయుఁడుగా నుఁడి పిన్న

వాండ్రకు జ్ఞానోపదేశము చేయుచుండెను. అందుచేత నామె తన జనకుని శిక్షలోనే విద్యాభ్యాసము చేసెను. ఆమె సాధారణముగా నెల్లవారును నేర్చుకొనెడి యింగ్లీషుభాషను గణితచుటయే కాక గ్రీకు భాషను లాటినుభాషను గణితశాస్త్రమును నేర్చుకొని యందుఁ బ్రవీణురా లయ్యెను. తండ్రి యామెకు నీతివిద్యను గఱపుటయుం దత్యంత శ్రద్ధ వహించుచుండెను. ఆమె ప్రకృతిశాస్త్రములను జంతుశాస్త్రమునుగూడఁ జదివి వానియందు మిక్కిలి యభిరుచి గల దయ్యెను. ఈమె చెల్లెండ్రును తమ్ముఁలునుగూడ నించుమించుగా నీమెతో సమానముగానే విద్యాలాభమును బొందిరి. ఈమె తన విద్యనుగూర్చి తరువాత నొకప్పు డిట్లు వ్రాసెను — "విద్య నన్నెప్పుడును గృహకృత్య నిర్వహణమునకు సనర్హురాలినిగాఁ జేయలేదు; అట్లు చేయకపోవుటయే కాక యది సాధ్వీధర్మమును నిర్వహించుటకు నన్ను మఱింత పూర్ణముగా యోగ్యురాలిని చేసినది." ఈమె చిఱుతప్రాయమునందే తల్లికి శ్రమ కలుగకుండఁ దన యిద్దఱు చెల్లెండ్రను ముగ్గురు తమ్ముఁలను సర్వవిధములఁ దానే పెంచుచు వచ్చెను.

ఆమెకు పదేండ్ల ప్రాయమప్పుడనఁగా 1817 వ సంవత్సరమునం దామె తండ్రి యెగ్జిటరును విడిచి బ్రిస్టల్ పురమును జేరి, తొంటి వలెనే యచ్చటఁగూడ ధర్మోపదేశవిద్యోపదేశముల రెంటిని స్వవృత్తినిగా నేర్పఱుచుకొనెను. ఈమెకుఁ దండ్రి తనశిష్యు లయినబాలురతోఁ గలిపియే విద్యచెప్పుచు వచ్చెను. తరువాత మహాధీమంతుఁడయి ప్రసిద్ధికెక్కిన రివరెండు డాక్టరు జేమ్సు మార్టినోగారు 1819 వ సంవత్సరమునందు డాక్టరు కార్పెంటరుగారికి శిష్యుఁడయి మేరీ కార్పెంటరుకన్యకు సహపాఠి యయ్యెను. ఆమె యెదిగినకొలఁదిని తండ్రి యామెకు తన శిష్యులలోని తరుణవయస్కులకు విద్య చెప్పెడు

పని నప్పగించుచు వచ్చెను. ఆపనియం దామె కభిరుచి కలిగి యుండుటచేత నామె యాపని నత్యంతోత్సాహముతోను, పూనిక తోను, నేర్పుతోను, జేయుచువచ్చెను. ఆమె తన తండ్రిగారియొక్క యుపాసనాలయముతో సంబంధించిన భానువార (ధర్మోపదేశక) పాఠశాలయం దత్యంతప్రీతి కల దయి యచ్చట శ్రద్ధతోఁ బనిచేయుఁ జొచ్చెను; ఆమె యచటకు భానువారమునాఁడు పోయి విద్యార్థులకు ధర్మపాఠములను జెప్పుటతో మాత్రము తృప్తినొందక, వారితోఁ గూడ వారియిండ్లకుఁ బోయి వారి తల్లిదండ్రులతో మైత్రి చేసి, ఆత్మాభివృద్ధిని జేసికొనెడు కృషిలో వారికి సహాయురా లగుచువచ్చెను.

ఇరువదియొక్క సంవత్సరములు నిండి వ్యవహారయోగ్యత వచ్చిన తరువాత 1828 వ సంవత్సరములో తండ్రి యామె కిట్లువ్రాసెను — "నీవు త్రొక్కవలసినట్టుగా శాసింపఁబడఁబోయెడు మార్గమేదియో మే మెఱుఁగము; అయినను భూలోకచింత యంతయు, నీవు క్రీస్తున కవ్యాజసేవకురాల వగుదువు కాక యనియు, నీయాత్మరక్షణమునకై పనిచేయుచు కైస్తవపరిపూర్ణతవంక ముందుకునడుచుచు నీకేర్పఱుప బడిన పని నితరుల యుపయోగముకొఱకు నిర్వర్తించుటకు శక్తురాల వగుదువు గాక యనియు, విశ్వాసముతోను శాంతతతోను పూనిక తోను ఈశ్వరేచ్ఛను చెల్లింతువుగాక యనియు, కోరెదుగోరికలో నడఁగి యున్నట్లు మేము భావించుచున్నాము."

అనారోగ్యముచేత చిరకాలమునుండి దుర్బలుఁడయి యున్న డాక్టరు కార్పెంటరు 1829 వ సంవత్సరమునందు తన పాఠశాలవనిని మాని వేసెను; కాని యాతనిభార్యయు ముగ్గురుకూఁతులును చిన్న పడుచుల కొకపాఠశాలను బెట్టిరి. నూతనముగా స్థాపింపఁబడిన యీపాఠశాలయందు స్త్రీజనోచిత ప్రావీణ్యము లెల్ల నేర్పఁబడుటయే

కాక లాటిన్‌గ్రీకు భాషలుకూడ నేర్చఁబడుచుండెను; అక్కడ కుట్టు పనియు కుటుంబములలో నుపయోగపడెడి యనేకేతరవిషయములును గఱవఁబడుచుండెను. అక్కడ విద్యాభ్యాసము చేసిన కాంతలలోఁ గొందఱు తరువాత బీదలకును మూఢులకును విద్యాదానము చేయుట తమ పనిగా నేర్పఱుచుకొనిరి: మఱికొంద ఱుత్తమగృహిణు లయి తమకుటుంబధర్మములను యుక్తముగా నిర్వహించుకొనుచు జనోప యుక్తము లయినసత్కార్యములందుఁ బ్రవేశించి పనిచేయఁ జొచ్చిరి.

1832 వ సంవత్సరమునందు బ్రిస్టల్ నగరమున వాంతిభేది వ్యాపించినప్పటినుండియు నామె యుపకారజీవనము నిజముగా నారంభమయ్యెనని చెప్పవచ్చును. ఆవిషభేది ప్రబలి ప్రజానాశము చేయఁదొడఁగినప్పు డామె తనజీవితమును తనతోడివారికొఱకు సేవ యందుఁ గడపుటకు నిశ్చయము చేసికొని, ఆసంవత్సరము మార్చినెల 31 వ తేదిని తనదినచర్యపుస్తకములో తనమనోనిశ్చయమును లిఖించి, కడపట "నాజీవితకాలములో నడపవలసిన కృత్యములయొక్క యుద్దేశ మేమయి యుండవలయునో నే నెప్పుడైన మఱుచుట తటస్థిం చెడు నెడల, నాకు వ్యతిరిక్తముగా నివి నాపై సాక్ష్యమిచ్చుటకు నే నీసంగతుల నిచ్చట లిఖించుచున్నాను." అని వ్రాసెను.

ఇది యిట్లుండఁగా 1833 వ సంవత్సరమునందు రాజారామ మోహనరాయ లింగ్లండునకుఁ బోయి, డాక్టరు కార్పెంటరుగారి తోడి సంభాషణమువలన లాభము పొందవలెనన్న ముఖ్యోద్దేశ ముతో బ్రిస్టల్ నగరమున కరిగి, వారియింట నుండుట తటస్థించెను. ఆయుభయులకును జరుగుచు వచ్చిన చిత్తాకర్షక సంభాషణసమయము లలో కార్పెంటరుకన్య తఱచుగా సన్నిధియం దుండుచు వచ్చెను.

ఆతనితోడ జరుగుచు వచ్చిన సంభాషణము లామె మనస్సులో శిలా శిరములవలె దృఢముగా నాటుకొనెను. అయినను బహుదినము లిట్లు లాభకరముగాఁ గడవకముందే యతఁడు వ్యాధిగ్రస్తుఁడయి లోకాంతరగతుఁ డగుట సంభవించెను. ఆయన వ్యాధిసమయమునం దీకుటుంబమువా రాయనకు స్వకుటుంబములోనివారికిఁ జేసెడుదానికంటెను నెక్కుఁవగా నుపచారములు చేసిరి. ఆయన సమాధిసమయమునందు డాక్టరు కార్పెంటరుగారిచేతఁ జదువఁబడిన యీ క్రింది యర్థము వచ్చెడు పద్యము నామె రచియించెను—

క. నీయాత్మ శాశ్వతం బగు
నీయభిధ న్మరింతు రెపుడు నీదేశీయుల్
నీయీసమాధి వెలువడి
నీయుక్తులు వారియెడల నెలకొని లేవున్.

ఈమహానీయునితోడి సహవాస మొక్కటియే కాక యానంవత్సరమే యమెరికానుండి యీమి తండ్రిని జూడవచ్చిన డాక్టర్ టక్కరుమ్యానను పేరు గల సత్పురుషుని సందర్శనమువలన సహిత మామెకు విశేష చిత్తోన్నతి కలిగెను. తనజనకునకును రామమోహనరాయలకును జరగుచు వచ్చిన సంభాషణములలో నామె స్త్రీల హీనదశ సంస్కారప్రతిబంధములు మొదలగు విషయములలో హిందూదేశముయొక్క దుస్థితినిగూర్చి వినుచు వచ్చెను. అతఁడు చెప్పినమాటలు దృఢముగా నాటుకొని యీమె మనస్సు హిందూదేశముపంకఁ బలుమాఱు పాఱుచుండినను, పెద్దపట్టణములలో వసించు దిక్కుమాలిన బీదబిడ్డల దురవస్థనుగూర్చి టక్కరుమ్యాను బోధించిన సన్నిహితధర్మము లడ్డుపడి వారించుచు రాఁగా ముందుగా స్వదేశమునందలి కర్తవ్యముల పయికిఁ దిరిగెను. హృదయభేదకము లయిన రామమోహనుల దయ

నీయవాక్యములు తలఁపునఁ బొతినప్పు డామె యప్పుడప్పుడు పక్షివలె తెక్కలు కట్టుకొని యెగిరి హిందూదేశముమీఁద వాలవలె ననిమన స్సులోఁ దలఁచుచు వచ్చినను, తల్లిదండ్రులసేవావిషయమున నాచరింపవలసిన కర్తవ్యములును పాఠశాలాకార్యములును మరల నామెను వెనుకకు లాగుచు వచ్చెను. పూర్వోక్త సత్పురుషద్వయము యొక్క యుపదేశములకు ఫలముగా బ్రిస్టలులో నొక నతీసమాజ మేర్పఱుపఁబడెను. ఈసమాజములోని మానినీమణులు బ్రిస్టలునగరములోని సుఖహీన మయిన ప్రదేశమును గొన్ని భాగములుగ విభాగించుకొని తమలో నొక్కొక్కరొక్కొక్క భాగమునకుఁ బోయి యచ్చటి యువతికు లగు బీదలకు విద్య చెప్పి, యితరవిధముల వారి స్థితిని బాగుచేయుట కయి పాటుపడుట కేర్పఱచు కొనిరి. మేరీ కార్పెంటరు తన కావఱి కున్న భానువార పాఠశాలయొక్కయు దిన పాఠశాలయొక్కయు పనిని జేయుచు, బహు సంవత్సరము లీపనిని గూడ నవిచ్ఛిన్నముగా నిర్వహించెను.

1839 వ సంవత్సరమునందు డాక్టరు కార్పెంటరు గారి యారోగ్యము మరల చెడిపోయెను. ఆతఁడు స్వస్థతను బొందుట కయి స్థలమును మార్చి యూరపుఖండములోని దేశములలో సంచారము చేయుట యావశ్యక మని వైద్యులు చెప్పిరి. అతఁడు ప్రకారముగాఁ బ్రయాణము చేయుచు, ఇటలీసముద్రతీరము పొడుగునను నావికా యాత్ర చేయునప్పుడు 1840 వ సంవత్సరమున నోడలోనుండి సముద్రములోఁ బడి మునిఁగిపోయెను.

ఇంతవఱకును కార్పెంటరుకన్య కొంతగౌరవము గల బీదలలోఁ బనిచేయుచుండెను. అంతకంటెను నధమ జాతులలో బిడ్డలు మూఢత్వములోను పాపములోను బెరుగుచుండిరి. అటువంటి వారి నిమిత్త

మయి బీదపాఠశాల లక్క డక్కడ స్థాపింపఁబడిన వని విని యామె యటువంటిపాఠశాల నొకదానిని బ్రిస్టలునగరములోఁ గూడ నారం భించుటకు నిశ్చయము చేసికొనెను. కార్పెంటరుకన్య తన యాలోచ నను కాలమును విశేషముగా వినియోగించిన యాపాఠశాల యల్ప కాలములోనే యత్యంతోపయుక్త మయి నీతిదాయక మయ్యెను; అందుచేత నారక్షకశాఖవా రాచుట్టుపల్లె నేరములు తక్కువయి పాఠ శాలపలన విశేషప్రయోజనము కలిగిన ట్లొప్పుకొనిరి. అయినను కార్పెంటరుకన్య మాత్ర మంతతోఁ దృప్తి పొందలేదు. అప్పు డప్పుడు నేరములు చేయు తరగతులవారిబిడ్డలు మాత్రమే యీ పాఠశాల యందు జేరి లాభము పొందుచుండిరిగాని, యీపాఠశాలను జేరరాని యధికదుస్థితిపరుల బిడ్డలును బలువు రుండిరి. చోరత్వాదిదోషములనే వృత్తిగా నేర్పఱచుకొన్న జాతులవారి బిడ్డలసామాన్య ప్రయత్నము చేసి విశేష సాధనములఁ గల్పించినంగాని యిటువంటి పాఠశాలల వలని లాభములను బొంది బాగు పడఁజాల రని యామె యెఱిఁగి యుండెను. కాఁబట్టి యామె చోరత్వాదులచే దుష్టులయి యావజ్జీవ మును చెఱసాలలలోఁ బడి కడగండ్లు పడవలసిన దిక్కుమాలిన బిడ్డ లను విముక్తులను జేయఁ దలఁచుకొనెను. ఫైర్‌దొరసాని చేసిన వనిని దీనిని జదువువా రెఱుఁగుదురుగదా. చెడి చెఱసాలలయందుఁ బడిన వారిని బాగుచేయుట కయి యామె పాటుపడెను; రోగము వచ్చిన తరు వాత మందు వేయుటకంటె రోగము రాకుండ మాన్పుట యుత్తమ పద్ధతి యన్న సిద్ధాంత మవలంబించి, చెడిపోవలసిన వారిని బాగుచేసి చెఱసాలలలోఁ బడకుండ వారించుట కయి యామె పాటుపడెను. 1851 వ సంవత్సరమునం దీమె "చెడిపోవుచున్న జాతులవారి బిడ్డలకును వయస్సురాని దోషులకును "దోషనివారక పాఠశాలలు" అను పేరితో

నొకపుస్తకమును ప్రచురించెను. కారాగృహ విద్యాలయములను స్థాపించుటకు దొరతనమువారు పూనుకొనునట్లు చేయుట కయి యామె బహువిధములఁ బ్రయత్నములు చేసెనుగాని యామెకృషి మొదట సఫలము కాకపోయినను కడపట సఫలమయి 1854 వ సంవత్సరమునందు కారాగృహములలో దోషనివారక విద్యాలయములను స్థాపించుటకు రాజానుమతి యియ్యఁబడెను.

పాపమునకు మూలకారణమును గనుఁగొని దానిని వారించుట కయి కారాగృహ విద్యాలయములను కర్మవిద్యాశాలలను స్థాపించి చిరకాల మోర్పుతోఁ బని చేసి కడపట పార్లమెంటుమహాసభ వారి యంగీకారమును సాహాయ్యమును బొంది, ఇంగ్లండు దేశములో నేరములు చేసెడువారిసంఖ్యను తగ్గించుటయుం దావర కెవ్వరును జేసియుండనంత యెక్కువవని నీమె చేసెను. పాప ములో దిగుటకు సిద్ధముగా నున్నట్టియు నావఱకే పాపములో బడినట్టియు బాలురును బాలికలును ఈమె నిరంతరప్రయ త్నములవలన దుస్సహావాసములనుండి తొలఁగింపఁబడి, పాటుపడుచు గౌరవనీయు లయినపురుషులును స్త్రీలునుఁ నగునట్లు చేయఁబడిరి. ఆవఱకు బాలురును బాలికలును నేరములు చేసినప్పుడు దండవిధాయ కులకు వారిని జెఱసాలలకుఁ బంపుట తప్ప వేఱుమార్గము లేకుండెను. అందుచేత నట్టివారు చెఱసాలనుండి విడుదలను బొంది వచ్చినప్పటి కచ్చటి పాపిష్టులతోడి దుస్సహావాసముచేత సామాన్యముగా వా రిఁక బాగుపడుదు రన్నయాశ లేనంతయెక్కువగాఁ జెడిపోయి యావజ్జీవమును ఘాతుకమృగములవలె సంచరించెడు దుస్థితికి వచ్చుచుండిరి. ఈమె 1846 వ సంవత్సరమునందు లాయిన్సు మిడ్డిల్ బీదపాఠశాలలను స్థాపించెను. 1852 వ సంవత్సరమునందు రస్సెల్

స్కాట్లనునతఁడు కింగ్సు పూడ్డులో నొకయిల్లు గొని బీదబిడ్డల విద్యావిషయమయి యిచ్చి యుం దీమెతోఁ గూడ దానును బనిచేయుఁ బూనుకొనెను. ఈమె సెంటు జేమ్సు బ్యాంకువద్ద పనివాండ్ర చావిడిని కట్టించెను. ఈమె పాఠశాలలను శుచిగాను సుందరముగాను నుంచి హృదయాకర్షకములుగాఁ జేయుచుండెను.

1854 వ సంవత్సరమునందు బైరన్ ప్రభ్వి బ్రిస్టల్ నగరములో కార్పెంటరుకన్య విచారణ క్రింద నుంచుటకై యొక బాలికా దోషనివారకవిద్యాలయము నిమిత్తము "శోణగృహ" (Red lodge) మనఁబడెడు విశాలమందిరమును గొని యిచ్చెను. ఆరంభమునందు దానిలో పదుగురు బాలికలు మాత్రమే యుండిరి గాని 1858 వ సంవత్సరమున కేఁబదియిద్దరుబాలిక లయిరి. దొంగలుగా శిక్షింపఁ బడిన నూఱులకొలఁది బాలిక లందుఁ జేరి యవమానకరమయినటియు నపకీర్తికర మయినట్టియు జీవనమునకు లోనుగాకుండ రక్షింపఁబడి యిప్పుడు మాననీయసేనకురాండ్రును, కుటుంబమాతలును, నయి గౌరవనీయ మైనస్థితులను బొందియున్నారు. ఈవిషయములలో నామెకు కార్యవిజయము కలుగుట ముఖ్యకారణము. తనతోడిమానవులలో నత్యంతభ్రష్టు లయినవారియెడలసహిత మామెకుఁ గలప్రేమమును, నదయాత్వమును నయి యున్నవి. ఎంత నీచదశలో నున్నపిల్లలనైనను తనకుటుంబములోనివారివలెఁ జూచి యామె యాదరించు చుండెను. "మన మొకబాలునిఁగాని బాలికనుగాని దోషవిముక్తి గలిగించి బాగుచేయఁ దలఁచుకొన్నపక్షమున నట్టివారిని కుటుంబములో నుంచ వలెను. ఏపనినైనను వారి నాదరించి మంచిమాటలతోఁ జేయింప వలెనుగాని బలవంతపెట్టి చేయించుటవలనఁ బ్రయోజనము లేదు. మనము వారిస్వేచ్ఛ కెప్పుడును భంగము చేయరాదు; వారిని

తమంత క్రమముగా నడవ నేర్చుకొనునట్లు దిద్దవలెను. పతితులయి మిక్కిలి చెడిపోయినవారిలోపల సహితము మడిగి యుండెడు మంచిని బయికిఁ దీసి, యది చెడుగును జయించునట్లు చేయుట యెల్లప్పుడును మనగుటీయయి యుండవలెను." అని యామె పలుమాఱు పలుకు చుండెను. శోణగృహదోషనివారకవిద్యాశాల యిప్పుడును జయప్రద ముగా నడవఁబడు చున్నది. ఆమె పాఠశాలల కనుబంధములుగా నప్పు డప్పు డేర్పఱచుచు వచ్చిన సమాజములు మొదలయినవి సహితము పాఠశాలలంత యుపయోగకరములుగానే యుండుచువచ్చెను. వానిలో నొకటి పతనమందిరము; అక్కడ కాచుట్టుపట్లవా రందఱును వచ్చి వార్తాపత్రికలును పుస్తకములును జదువుచుండిరి; దానిపయి యుప న్యాసమందిరములో సాంఘికవిషయములు నీతివిషయములు మొద లయినయుపయుక్తాంశములను గూర్చి యుపన్యాసము లియ్యఁబడు చుండెను: అందులోనే సురాపాననివారకసమాజసభలు జరుగు చుండెను.

ఆమె కేఁబదిసంవత్సరములు వచ్చినప్పు డామెతల్లి 1856 వ సంవత్సరమునందు మృతినొందెను. తల్లిచావుతో మేరీ కార్పెంటరు కన్యకు సంసారబంధము లన్నియు విడిపోయి, తనకాలమును నిరంత రాయముగా మంచిపనులయందు వినియోగపఱచుటకు మఱింత యానుకూల్యము కలిగెను. అందుచేత నామె మాతృవియోగదుఃఖము తలఁపునకు రాకుండునట్లుగా సత్కార్యాచరణమునందు విరామము లేకుండ పాటుపడఁ దొడఁగెను. 1856 వ సంవత్సరమునం దామెతోఁ గలసి పనిచేయుటకయి చేరిన మిస్ ఫ్రాన్సిస్ పవర్ కాబ్బె ఆమెను గూర్చి యిట్లువ్రాసెను — "అర్ధమనుష్యుని భోజనముతో కార్పెంటరు కన్య ముగ్గురుమనుష్యులపనిని చేయు చున్నది."

1858 వ సంవత్సరమునం దామె యొకకన్య నభిమానపుత్రి కనుగా స్వీకరించి పెంచ నారంభించెను. ఈవిషయమునుగూర్చి యొక చెలికత్తె కామె యిట్లు వ్రాసెను — "నీవు కననట్టిబిడ్డలను నీకిచ్చి యున్నానని సిద్ధాదేశములో వ్రాయఁబడి యున్నది. అంతకుముందు తల్లిప్రేమ యెట్టిదో యెఱుఁగనియనేకులకు నాహృదయాంతర్గత మయినమాతృప్రేమను జూపి యున్నాను. వివాహ మాడవలసినకష్ట మక్కఱలేక కనకుండ సిద్ధముగాఁ జేయఁబడి చేతికంది నాకు లభించిన జననీజనకవిహీన యయినయీయాయమిదేండ్లు పసిబాలికతోఁ గూడిన నాభాగ్యమును జూడుము."

వృద్ధదశలో నితరు లపేక్షించెడువిశ్రాంతి యామెకు వనిచేయ కుండుటవలనఁగాక వేఱువేఱువనులకుఁ బూనుటలోనే కలుగుచుండెను. 1861 వ సంవత్సరమునం దామె యైర్లండునకుఁ బోయి యచ్చటికారా గృహములను పరీక్షించి వానినిగూర్చి యుపయోగకర మయినచరిత్ర మును ప్రకటించెను. మఱిమూఁడుసంవత్సరముల కామె "మన కారాబద్ధులు" అనునామముతో రెండుసంపుటములగ్రంథమును ప్రక టించి, దానిలో కారాబద్ధులస్థితినిగూర్చియు నాదరణమునుగూర్చియు వితర్కించెను. ఆమె చిన్నపిల్లలవిషయమునఁ దాను నడపినక్రమ మునుబట్టి పెద్దవాండ్రవిషయమునఁగూడ నట్లే నడవుట శ్రేయో దాయక మని యభిప్రాయపడెను.

ఆమె కఱువదిసంవత్సరములు నిండినప్పుడు దుఃఖమును తగ్గించు టకును నేరములు మాన్పుటకును దాను జేసిన ప్రయత్నము లన్నియుఁ దానెప్పుడు నెదురుచూడనంత జయప్రదముగాఁ గొనసాగినందుకు సంతోషించి, తన్నత్యంతధన్యురాలినిగా భావించుకొనెను. అయినను దానంతటితో సంతుష్టి నొంది యూరకుండక హిందూదేశమునకుఁ

బోయి చూచి దానికి మేలు చేయువలెనని తలఁచెను. ఆమె హిందూ దేశమునకుఁ బైలువెడలుటకు ముందుగా "రాజా రామమోహన రాయలయొక్క ఇంగ్లండులోని కడపటిదినములు" అను పుస్తక మును రచించి 1866 వ సంవత్సరము సెప్టెంబరునెల మొదటితేది నోడ యెక్కి చిరకాలము నుండి యుద్దేశించుకొనియున్న హిందూదేశ యాత్ర నిప్పుడు నెఱవేర్చెను. ఆమె యెక్కినయోడలోనే యెక్కి మానమోహనగో సనునతఁడు న్యాయవాదిగాఁ బనిచేయుట కయి మరల నీదేశమునకువచ్చెను. ఆమె బొంబై నగరములో దిగిన మఱు నాఁడే బొంబయి రాజధానీ ప్రభుశ్వసువారు సామాన్యముగా విద్యా విషయమయి కార్పెంటరుకన్య కోరినవిశేషము లన్నియు నియ్యవల సిన దనియు బాలురకును తదితరులకును నేర్పడిన శోధనాలయముల యొక్క వృత్తాంతములను దెలుపవలయు ననియు స్థానికోద్యోగస్థుల కందఱికిని నాజ్ఞాపత్రికలను బంపిరి. బొంబయిరాజధానిలో నామె మొదటఁ జూచినస్థల మహామదాబాదు పట్టణము. ఆపట్టణమునం దవ్వ టికే స్త్రీవిద్య కొంతయభివృద్ధిలో నుండెను. అహామదాబాదునుండి యామె సౌరాష్ట్రపురము (సూరతు) నకుఁ బోయి, యచ్చటి నుండి మరల బొంబయిపురము వచ్చిచేరెను. సౌరాష్ట్రపురిలో "ప్రియజననీ" యని సంబోధించుచు నొకహిందూసుందరి తత్పౌర కాంతల పక్ష మున స్వాగతపత్రికను జదివెను. ఆమె బొంబయి నగరములోఁ గొన్నిదినము లుండి యచ్చటివిద్యాశాలలు మొదలగువానిని పరీ క్షించి, అక్కడనుండి పునానగరమునకుఁ బోయెను. చెన్నపురికిఁ బోయినప్పు డచ్చటివా రామె నాదరించి మిక్కిలి గౌరవించిరి. కల కత్తా నగరములో నచ్చటి రాజప్రతినిధిగా రయిన లారెన్సుప్రభువుగా రామెను స్వగృహములో నుంచుకొని సమ్మానించి యాతిథేయ

సత్కారము నాచరించిరి. ఆమె కలకత్తానగరములోను దానిశాఖా నగరములలోను గలపాఠశాలలు మొదలయినవాని నన్నిటినిజూచి, వానివిషయ మయి యనేకోప యుక్తాంశములను గ్రహించి, వాని వయిఁ దనకుఁ దోఁచినయభిప్రాయములను నభివృద్ధిమార్గములను దొరతనము వారికిఁ దెలిపెను. ఆమె యక్కడనుండి బొంబయినగరమునకుఁ బోయ్, యచ్చటి హిందూమహాజనులచే నియ్యఁబడిన యభినందనప్రతిక వందుకొని 1867 వ సంవత్సరము మార్చినెలలో బొంబయినగరములో నోడయెక్కి స్వదేశమునకు వెడలెను. ఆమె స్వదేశమును జేరిన తోడనే "హిందూదేశములోని కారాగృహాశిక్షను గూర్చియు స్త్రీ విద్యనుగూర్చియు సూచనలు" అను పేరితో నొకచిన్న పుస్తకమును బ్రకటించెను. మఱుచటి సంవత్సరమునందామె "హిందూదేశమునం దాఱునెలలు" అను పుస్తకమును జేసి దానిని రామమోహనరాయల కంకితముచేసెను. ఆమె హిందూదేశమునకు బైలుదేఱునప్పుడు హిందూ స్త్రీలను స్వదేశమునకు దీసికొనిపోయి విద్య చెప్పించి యుపాధ్యాయినులనుగా దిద్దింపవలె ననుకొనెను గాని యాపని యసాధ్య మయినట్లు కనబడినందున తరువాత నామె యాప్రయత్న మును విడిచిపెట్టెను. ఆమె ప్రాణమిత్రులు సహిత మామెరాకవలన హిందూదేశమునకు విశేషలాభము కలుగునని తలఁపలేదు. "ఇక్కడి పెద్దలు మాటలలో పెద్దనోరు చూపుటయే కాని క్రియలలో శూన్య హస్తములు చూపుదురని ముందు నీవే తెలిసికొందువు" అని యొక హిందూమిత్రుఁడామెతో ననెను. ఆమె నంతగాఁ బ్రోత్సాహపఱి చిన, కేశవచంద్రసేనుఁడు సహితము "కార్పెంటరుకన్య హిందూదేశ మును విడిచి వెనుకతిరుగఁగానే సత్కార్యవిషయ మైన ప్రతి వాంఛయు శూన్యవాయువులో నసించిపోవును" అనిపలికెను.

ఇట్టివాక్యములచేత నామె నిరుత్సాహురాలు గాక యామె యాహిందూదేశమునందలి ప్రముఖులతో నుత్తర ప్రత్యుత్తరములను జరుపుచు వచ్చెను. బొంబయిలో న్యాయాధిపతి యైన గోపాలరావు హరిదేశముఖుగారి యుత్తరమువలన నామెకు స్త్రీబోధనా భ్యసన పాఠశాలలను బెట్టింపవలెనన్న నిశ్చయము కలిగెను. అతఁడు చిన్న తనములో వివాహము లగుచుండుటవలన బాలికలు పాఠశాలలను విడిచి తా మూవఱకు సేర్చుకొన్నయల్పవిద్యను కూడ మఱచిపోవు చుండుటను బట్టి బాలికా పాఠశాలలవలనఁ బ్రయోజన మంతగాఁ గలుగకున్న దని తెలిపి, "దేశాచారమునుబట్టి యెప్పుడును పునర్వి వాహమును చేసికొనకుండెడు వేలకొలఁది వితంతువుల నుపయోగము నకుఁ దీసికొనిరావలెను; అర్హురాం డ్రయిన యుపాధ్యాయినులను దిద్ది పంపుట కేర్పడిన బోధనాభ్యసన పాఠశాల యొకటి స్థాపింపఁబడు వఱకును స్త్రీవిద్యాభివృద్ధినిగూర్చి యేర్పాటి చెడి యేపథకమును సఫ లము కానేరదు. హిందూదేశముయొక్క యాభ్రాంతమం దున్న మే మందఱమును మీ ప్రయత్నముయొక్క పర్యవసానమునకును మీయొక్క పునరాగమనమునకును అత్యంతాతురతతో నెదురు చూచుచున్నాము." అని వ్రాసెను. అందుపయి నామె హిందూదేశ మునం దప్పు డధికారములో నున్నవారికి స్త్రీబోధనాభ్యసన పాఠ శాలల యావశ్యకమునుగూర్చి తెలిపి, హిందువు లందఱును జేరి సంవ త్సరమునకు 1600 పౌను లిచ్చెడుపక్షమునఁ దా మంతకంటె నెక్కువ బొంబయిలోను అహమదాబాదునగరములోను స్త్రీబోధనాభ్యసన పాఠశాలలను బెట్టుట కిచ్చెదమని బొంబయిదొరతనమువారి వద్ద నమ చేయునట్లు చేసి చందాలుపేసి యంతసొమ్ము వసూలుచేయునట్లు హిందువుల నాపనికిఁ బ్రోత్సాహపఱుపఁ జొచ్చెను.

V.R. NARLA MEMORIAL LIBRARY D. NARLA Acc. No.

ఆమె చేసిన కర్తవ్యోపదేశము ననుసరించి హిందూదేశ ప్రభుత్వమువారు జనులతోడ్పాటు నపేక్షింపకయే బొంబయి నగరములో స్త్రీబోధ నాభ్యసన పాఠశాలను స్థాపించుట కయి యైదుసంవత్సరముల వఱకును సంవత్సరమునకు వంద్రెడువేల రూపాయల నిచ్చుట కేర్పాటు చేసిరి. ఈప్రకారముగాఁ దనకృషి ఫలోన్ముఖమునకు వచ్చుసూచనలు గాంచి సంతోషించి యత్యంతో త్సాహముతో 1868 వ సంవత్సరము నవంబరునెల యేడవ తేదీయం దామె రెండవసారి హిందూదేశమునకు వచ్చెను. ఆమె బొంబయి నగరము చేరినతోడనే తానచ్చటి స్త్రీబోధనాభ్యసన పాఠశాలలో నధ్యక్షురాలుగా నుండి జీతము గయికొనక ధర్మార్థముగాఁ బనిచేసెద నని దొరతనమువారికి విన్నవము చేసెను. వా రామె ప్రార్థనను గృతజ్ఞతాపూర్వకముగా నంగీకరించిరి. ఉష్ణదేశములోనుండి వని చేయుటచే నారోగ్యము చెడిపోవుటచేతను దనపనిని విడిచిపెట్టి యామె మఱుచటి సంవత్సరారంభమునం దింగ్లండునకుఁ బోవలసిన దాయెను. అయినను మరల నామె యాసంవత్సరాంతమునందే హిందూదేశమునకు మూడవసారి వచ్చి స్త్రీవిద్యాభివృద్ధినిమిత్తమయి కొంతపని చేసి మరల స్వదేశమునకుఁ బోయెను.

1870 వ సంవత్సరమునందు కేశవచంద్రసేను డింగ్లండునకుఁ బోయినప్పుడు జూన్ నెలలో బ్రిస్టల్‌నగరమున కరిగి, మేరీకార్పెం టరు కన్యను సందర్శించి, హిందూదేశమును గూర్చిన జ్ఞానమును వృద్ధి చేయుటకును హిందూదేశములోని సాంఘికలోపములను వారించుట కును నొక సమాజమును స్థాపించుట యుచిత మని యతఁ డామెకు విన్నవించెను. ఆసంవత్సరము సెప్టెంబరు నెలలో రెండవసారి యతఁ డామె దర్శనము చేయుటకు బ్రిస్టల్‌నగరమునకుఁ బోయినప్పుడు

"దేశీయహిందూదేశసమాజ" (National Indian Association) మనునామముతో నొక సమాజము స్థాపింపఁ బడెను. ఆసమాజము యొక్క యుద్దేశములను నెఱవేర్చుటకయి సమాజముపేర నొకమాస పత్రిక ప్రకటింపనారంభింపఁబడినది. ఆపత్రిక యిప్పు డిండియా పత్రిక (The Indian Magazine) యను పేరఁ బరఁగుచు తత్సంస్థాపకు రాలి యనంతర మామె పదమును వహించిన యత్యంతయోగ్యురా లగు మానింగుకన్య (Miss Manning) చే మహాసమర్థతో మొన్నటిదాఁక నిర్వహింపఁబడుచుండెను. ఈసమాజమును మన దేశ మునం దనేకస్థలములలో నున్న దీని శాఖలును మనదేశమునకు మహోపకారము చేయుచున్నవి.

1875-76 సంవత్సరములో కార్పెంటరుకన్య కడపటిసారి మన దేశమునకు నాలవపర్యాయము వచ్చెను. ఆమె స్త్రీల విషయము లోను, చెఱసాలల విచారణవిషయములోను, పాపనివర్తక పాఠశాలల విషయములోను, కర్మశాలలవిషయములోను, వృత్తిశాలలలో స్త్రీలను పిల్లలను పనిలోనుంచు విషయములోను ముఖ్యముగాఁ బనిచేసెను. తాను జేసినపనివలనఁ గలిగినఫలితములను గూర్చి యామె సాలి స్బరీ ప్రభువునకు వ్రాసినయుత్తరములో వివరముగాఁ దెలిపినది. అవి యటుతరువాత పార్లమెంటు మహాసభవారి యెదుటఁ బెట్టఁబడినవి.

1877 వ సంవత్సరము ఏప్రియల్ నెల 8 వ తేదీతో నామెకు డెబ్బదిసంవత్సరములు పూర్తియయ్యెను. ఆమె జన్మోత్సవ దినమునం దామె నభినందించుచు బంధువుల యొద్ద నుండియు మిత్రుల యొద్దనుండియు నాశీర్వచనపత్రికలును పారితోషికములును విస్తార ముగా వచ్చినవి. ఆసంవత్సరము 14 వ జూన్ తేదీని తన పెంపుడు కొమారితతో సల్లాపసౌఖ్య మనుభవించి యారాత్రి పడకకుఁబోయి

తెల్లవారులోపల నామె యనాయాసమరణము నొందెను. ఆమె శరీర మార్ణోకనుమ యందు భూస్థాపిత మొనర్పఁబడెను. ఆమె శవమును సమాధికిఁ గొనిపోవునప్పుడు సంఖ్యాతీతు లైన మిత్రులును శోణగృహశోధ నాలయములోని బాలురును బాలికలును, వగటికర్మ పాఠశాలలోని బిడ్డలును. రింగ్స్‌వుడ్డు కర్మ విద్యాలయములోని బాలురును, తమకును లోకమునకును మహోపకారిణి యైనట్టియు బిడ్డలను బీదతనమునుండియుఁ బాపములనుండియు రక్షించుటకై తన జీవితమును ధారపోసినట్టియు నాయుత్తమాంగనయొక్క శవమువెంట శోకించుచుఁ బిళ్ళవనమునకు వేలకొలఁదిగాఁ బోయి తమ కామె యెడలఁ గలభక్తిగౌరవములను వెల్లడించిరి. మనదేశపుస్త్రీ లీమె వలె లోకోపకారకృత్యముల యందుఁ దమ కాలమును గడపుటకుఁ బ్రయత్నింతురుగాక!

601

LIFE OF JESUS

జీసస్ చరిత్ర ము

209

603

LIFE OF JESUS

జీసస్ చరిత్రము

మొదటి ప్రకరణము.

జీసస్‌యొక్క జననమును, బాల్యదశయును.

క్రైస్తవమతస్థాపకుఁడైన జీసస్‌యొక్క బాల్యదశను గూర్చి మన కంతగా తెలియదు. ఆయనచరిత్రమును వ్రాసినవా రాయన యొక్క బాల్యావస్థలో నడచిన వృత్తాంతము తమకు తెలియక పోవుటచేతనో, అప్పటి వృత్తాంతము ముఖ్యమైనది కాదని భావించుట చేతనో, మఱి యే హేతువు చేతనో, దానిని విడిచి యతఁడు మతబోధ కారంభించినతరువాత జరగినవృత్తాంతమును మాత్రమే విశేషముగా వ్రాసియున్నారు. ఒక్కబాల్యావస్థనుగూర్చి మాత్రమే కాక యా ఘనుని జననదిన మిది యని సహితము నిశ్చయముగాఁ దెలియదుం మన యాసియాఖండముయొక్క పశ్చిమదిగ్భాగమునం దున్న పాల స్టిన్ దేశములో నుత్తరపువైపున గాలీలీ మండలములో నాజరెత్తను గ్రామ మొక్కటి గలదు. ఆగ్రామమునం దిప్పుడు మూడునాలుగు వేలజనులున్నారు. పూర్వకాలమునందు సహితమీగ్రామ మిప్పటి కంటె పెద్ద దయి యుండదు. ఈగ్రామ మొక పర్వతము యొక్క ప్రక్కను గట్టఁబడియుండుటచేతను పెక్కు పర్వతములు సమీపమునం దుండి యుండుటచేతను మిక్కిలి మనోహరముగా మఱఁపును. సుందర

మైన యీగ్రామమునందు 'జోసఫ్' అను పేరు గల వడ్రంగి యొకడు మేరీ యను పేరుగల తన చక్కని చిన్న భార్యతో వానము చేయుచుండెను. ఆదంపతులు ధనికులు కాకపోయినను, చుట్టుపట్టుల నున్న యితరశిల్పులకంటె నెక్కువబీదస్థితిలో నుండినవారు కారు. ఆకాలమునం దెవ్వరును మహాధనికులుగాఁ గాని, కూటిపేదలుగాఁ గాని యుండక యెల్లవారును అన్నవస్త్రములకు లోపములేని సామాన్యదశలో నుండిరి. ఆకాలమునందు జోసఫ్ చేతులార కష్టపడి పని చేసి జీవనము చేయవలసిన స్థితిలోనే యుండినను, అతఁడు తద్దేశమునకు రాజధాని యైన జెరూసలేము నగరమును స్థాపించి నట్టియు, హీబ్రూజనుల కాదిమచక్రవర్తి యైనట్టియు, డేవిడ్డుయొక్క సంతతి వాఁడైన మహాకులీనుఁ డని చెప్పుచున్నారు. ఈ సంబంధముననే యాకాలమునందు రాజాజ్ఞచేత వేయఁబడిన జనపరిగణనము నిమిత్తము జోసఫ్ గర్భవతియై యున్న తన నూతనవధువగు మేరీతోఁ గలిసి తన పూర్వుల వాసస్థాన మైన బెథిల్ హేము నగరమునకుఁ బోవలసినవాఁ డయ్యె ననియు, అతఁ డక్కడ నొక సత్రమునకుఁ బోయి యందు చోటుగానక దానితోఁ జేరియున్న యొక పశువులశాలలో వసించి యుండఁగా డేవిడ్డు మహారాజు యొక్క జన్మస్థాన మైన యానగరము నందే యతనిభార్య రాత్రివేళ గడ్డివామిలో నొక పురుష శిశువును ప్రసవించె ననియు, గొందఱు వ్రాసియున్నారు. అప్పుడట్లు పుట్టిన యాశిశువే క్రైస్తవమతస్థాపకుఁ డైన జీసస్. *ఆశిశువు పుట్టిన దిన మును సరిగా కనుఁగొనుట కాధారము లేమియు లేక పోయినను,

---

* జీసస్ క్రైస్తనునది జేసస్ యొక్క సంపూర్ణనామము. అతఁడు సాధారణముగా క్రైస్తనియు పిలువఁబడును. ఈకడపటినామము వచ్చుటకుఁ గల కారణము ముందు వివరింపఁబడును.

అతఁడు క్రీస్తుశకమునకు నాలుగుసంవత్సరములు ముందు జనపరినెల మొదటి తేదికి మూడునాలుగుదినము లీవలనో యీవలనో జనన మొందినట్లు చూపుటకుఁ దగిన నిదర్శనము లున్నవి. ప్రభుత్వమువారి యాజ్ఞను బట్టి వేయఁబడిన యీ జనపరిగణనము క్రీస్తుపుట్టిన పదినంవత్సరములకు తరువాతఁగాని జరగనందున నతఁడు బెథల్‌హేమునగరమున జన్మించుట సత్యము కాదనియు, ఆకాలపువారిచే నతఁడు 'నాజరెత్తుపుర జీసస్' అనియే పిలువఁబడుచు వచ్చుటచేతను, గొంద అతఁడు నాజరెత్తులోనే పుట్టెనని చెప్పియుండుటచేతను జీసస్సు నిజముగా నాజరెత్తుగ్రామములోనే జనన మొందె ననియు, అతఁడు డేవిడ్డురాజవంశజుఁ డయినట్టును బెథల్‌హేమునగరము నందు జన్మించినట్టును తరువాతివా రాతని జన్మోత్కృష్టమును స్థాపించుటకొఱకు క్రొత్తకథను ప్రాతనిబంధనలో ముందవతరింపఁ బోవుచున్నా డని చెప్పఁబడిన దేవదూత యితఁడే యని సాధించుటకొఱకును కల్పించి రనియు, కొందఱు బుద్ధిమంతు లభిప్రాయపడుచున్నారు. లోకోపకారులైన మహాపురుషులకు వారి తరువాతివారు మహావంశసంభవతయు దేవాంశ సంభవతయునారోపించుట యెచ్చటను క్రొత్తగాదుగదా! మనదేశము నందుసహితము శంకరాచార్యులు మొదలగు మహాపురుషులెందఱుమన వారిచే దేవాంశసంభూతులుగా పరిగణింపఁబడు చున్నారు కారు? పూర్వులస్థితియెట్టిదయినను, ఆశిశువుజనించినప్పుడాతనిజనకులు ధన సంపన్నులుగాని కులములో ప్రాముఖ్యము కలవారుగాని కారు. జీసస్సు యొక్క గ్రామమునకు బెథల్‌హేమునగరము మూడుదినముల ప్రయాణములో నున్నది.

ఇట్లు పేదయింట జనన మొందినయీశిశువునకు తల్లిదండ్రులు జీసస్సని నామకరణము చేసిరి. ఆపదమునకు రక్షకుఁ డని యర్థము.

ఆకాలమునం దది యనేక బాలకులకు సాధారణముగాఁ బెట్టఁబడు చుండిననామమేయయినను దాని కిటీవలివారు గొప్పనుహిమ నారో పించుచున్నారు. మహిమ యెప్పుడును పురుషగుణమునుబట్టి వచ్చును గాని పేరునుబట్టి రాదు. ఉల్లికి మల్లె యని పేరు పెట్టినను దానికి సువాసన రాదు; మల్లెపువ్వున కుల్లివు వ్వని పేరు పెట్టినను దాని సువాసన పోదు. అతఁడు చిన్నతనమునం దెట్టియింట వసించెనో, ఎట్టి బట్టలు కట్టెనో, ఎట్టిబాలక్రీడలు నలిపెనో, ఏయేపాఠశాలలకుఁ బోయి యేయేవిద్యల నభ్యసించెనో, ఇప్పు డేమియుఁ దెలియదు. ఆగ్రామ మిప్పు డున్నస్థితినిబట్టి చూడఁగా నతఁ డప్పుడు వసించి యుండినగృహ మిప్పుడు శిల్పులు సాధారణముగా వాసము చేసెడుగృహములవంటిదే యని తోఁచకమానదు. అక్కడియిండ్లకు మిద్దెలును మేడలును లేవు; ఇంటికి రెండుమూడుగదులకంటె నెక్కువ యుండవు; పడకగదిలో నొకకొయ్యపెట్టెయు రెండుచాపలును దిండ్లును నుండును. ఇండ్ల కప్పులమీఁదసుందరముగా ద్రాక్షతీఁగలు ప్రాకు చుండును; లోనికిఁ బోయి చూచినయెడల కూరుచుండుటకు కుర్చీలు బల్లలు మొదలయి నవి లేక నేలమీఁద చాపలు పఱువఁ బడి యుండును. అన్నిగదులకును వెలుతు రిచ్చునట్లుగా నిత్తడిదీపస్తంభ మొకటి యింటినడుమ నడి కప్పునుండి వ్రేలు చుండును; వంటయిల్లు వేఱుగా నుండక యింటికి చేరియే యుండును. స్త్రీలు వీధులలోనినూతులయొద్దకుఁ బోయి నీళ్ళు తోడి కుండలతో బుజములమీఁదఁ పెట్టుకొని తెచ్చి తలుపుల యోరల నుంచుదురు. ఆకాలమునం దిటువంటియిండ్లలోనే యొకదానిలో జీసస్ తనతల్లిదండ్రులతోను సోదరులతోను గలసి వాసము చేసి యుండుటకు సందేహము లేదు. మేరీకి జీసస్సు ప్రథమపుత్రుఁ డని యీవఱకే చెప్పి యున్నాముగదా. అతనికి కొందఱు తమ్ములును చెల్లెండ్రునుకూడఁ

గలరుగాని వారప్రసిద్ధులు. ఆతనిసోదరులని చెప్పఁబడి ప్రసిద్ధిగాంచిన నలుగురుపురుషులును వారిలో ముఖ్యముగా క్రైస్తవమతారంభదశ యందు సుప్రసిద్ధుఁ డయినజే మ్సునతఁడును పినతల్లికొడుకులుగాని సాక్షాత్సహోదరులుగారు. జీసస్‌తల్లి యైన మేరీకి మేరీ యనుపేరు గల చెల్లెలొకతె కలదు. ఆమెభర్త క్లియోపా మ్సను నామాంతరము గలయాల్ఫియ మ్సనువాఁడు; ఆమెకు కొడుకు లనేకులు గలరు; వారు జీసస్సునకు మొదటిశిష్యులయి ప్రఖ్యాతి గాంచిరి. వీరగర్భజనితు లయిన తమ్ముల్తే ప్రతికూలురుగా నున్నప్పుడు జీనస్సునకు వీరనుకూలు రుగా నుండి తోడుపడుటచేత తరువాత పినతల్లికొడుకు లయినవీరికే "ప్రభుసోదరు" లన్న పేరు వచ్చినది. అతనిఁ గన్నతల్లికివలెనే నిజమైన సోదరులకును జీనస్సుయొక్క మరణానంతరమునఁగాని గౌరవము రా లేదు. అతని తోడఁబుట్టినపడుచులు వివాహము లాడి తమభర్తలతోఁ గూడి నాజరెత్తు గ్రామములోనే కాపురము చేయుచుండిరి. ఈ చెల్లెండ్రును తమ్ముల్లును తనతోడఁగూడి క్రీడించు చుండఁగా జీసస్సు కొంతకాలము చిన్నతనములో తల్లియింట విహరించెను. అప్పు డామె తనతోడి చేడియలతోఁగూడి ముచ్చటించుచు వీధిలోని నూతివద్దకుఁ బోయి వసిపిల్లను చంక నిడుకొని పెద్దకొడుకును కేలూఁతయిచ్చి నడ పించుచు బుజములమీఁది బిందెతో మందగమనమున నింటికి వచ్చి వలు మాఱు భర్తకు నేత్రానందము కలిగించి యుండును. అయినను జీసస్సునకు యౌవనము రాకమునుపే తండ్రి కాలము చేసినట్లు కనఁ బడుచున్నది. ఉష్ణదేశ మగుటచే నతఁడు ధరించినవస్త్రములు పలుచని వయి యుండవలెను. అతఁ డాటలకయి గ్రామసమీపమున నుండు కొండలకుఁ బోయి తోడిబాలకులతోడఁ గూడి విహరించి యుండును. కొంతసే పాటలాడివచ్చి యతఁడు వడ్రవునిలో తనతండ్రికి తోడు

వడుచుండియు నుండవచ్చును. అతఁడు చిన్నతనములో తండ్రివద్ద పని నేర్చుకొని కొంతకాలము కులవృత్తిని చేసె ననుటకు సందేహము లేదు.

ఆకాలమునం దతఁడును తక్కిన బాలకులవలెనే వీధిబడికిఁ బంవఁ బడెను. ఆబడులయందు చెప్పబడినది యంతయు చదువుటకును వ్రాయుటకును నేర్పుటయు, కొన్ని పద్యములను గంతపాఠము చేయించు టయు మాత్రమే. ఆకాలమునం దిప్పటివలె నచ్చువుస్తకములు లేనందున, ఉన్నపుస్తకములు కొన్నియు నాకులమీఁద వ్రాయఁబడు చుండెను. అతఁడు దేశభాష యైన సిరియాభాషలో వ్రాయుటకును చదువుటకును నేర్చుకొనుటయేగాక, మతగ్రంథము లన్నియు మన దేశమునందు దేశభాషలలోఁ గాక సంస్కృతభాషలో నున్నట్లే యా దేశమునందు హీబ్రూభాషలో నుండుటచేత ప్రాతనిబంధన (Old Testament) మొదలగు కొన్నిమతగ్రంథములను, మతగ్రంథ ములకు రాబీ లనఁబడు పండితులు చేసిన కొన్ని వ్యాఖ్యానములను, హీబ్రూభాషలోఁ జదివెను. అంతేకాని, యాతని కా కాలమునందు పండితు లనఁబడువారి కుండిన దురవగాహమై నిష్ప్రయోజన మైన పాండిత్యప్రకర్షముగాని తర్కికమూల మయిన గ్రీకుశాస్త్రతత్త్వ జ్ఞానముగాని లేదు. అతఁడు గ్రంథములను విస్తారముగా చదివిన వాఁడు కాకపోయినను చదివిన కొన్నిగ్రంథములను చక్కఁగా గ్రహించి దృఢముగా మనస్సున నాటించుకొనెను. ప్రాతనిబంధనము నందలికీర్తనల (Psalms) లోను దీర్ఘదర్శుల వ్రాతలలోను విశేష భాగ మాతనికి ముఖస్థముగా వచ్చును. ఆగ్రంథములలోని నీతిబోధ కములును భక్తిప్రదాయకములును నైన యుత్తమవాక్యములు చిన్న తనములోనే యాతనిమనస్సునందు శిలాక్షరములవలె దృఢముగా

లగ్నము లయి యుండు పూనఁబోయెడు మహాకార్యమున కాతని నత్యంతార్హుని జేసెను. బీదతనమును శాంతతతో నహించుటలోను హృదయాకర్షక మైన సద్వర్తనమును కలిగి యుండుటలోను, స్వప్రయో జనపరులయి వంచకు లయిన మతాచార్యు లుపదేశించు దురోభ్రధనల ఖండించుటలోను, ఆతఁడు కొంతవఱకు హిల్లెల్ చూపిన మార్గము ననుసరించెను. గౌరవము కలుగుటకయి పురాతన దీర్ఘదర్శుల పేరులు రచియింపబడిన యాధునికగ్రంథములు కొన్ని యాతనికి చిత్తాహ్లాద కరములుగా నుండెను. వానిలో ముఖ్యముగా డానియల్ పుస్తక మాతనికి ప్రియతమ మయినది.

ఆతనికి యూదమత (Judaism) మొక్కటిదక్క మరియే మతమునుగూర్చియు విశేషముగా తెలియదు. యూదులు ప్రతిమార్చ నాదులు లేని యేకేశ్వరారాధనముచేసెడి యాస్తికులు. క్రైస్తవులలో వలె భానువారముగాక వారికి శనివారము విశ్రాంతిదినముగా నుండెను. ఆవిశ్రాంతిదినము శుక్రవారము సూర్యాస్తమానముతో నారంభ మయి శనివారము సూర్యాస్తమానమువఱకు నుండును. యూదుల కది కేవలవిశ్రాంతిదినముగా నుండక మనదేశములోని వైష్ణవులకు హరివాసరము (ఏకాదశి) వలె వ్రతదినముగా కూడ నుండెను. శనివారమునాఁ డెవ్వరును సేపనియుఁ జేయఁగూడదు; నాఁడు వంటనహితము చేసికొనఁగూడదు; శనివారమునాఁడు సాయం కాలము వఱకును కుటుంబమునకు సరిపోవు భోజనపదార్థములనన్నిటిని గృహిణి శుక్రవారమునాఁడు మధ్యాహ్నమునకే సంసిద్ధము చేసి యుంచవలెను; విశ్రాంతిదిన మారంభ మగునప్పటి కింట నిప్పు మండు చుండినపక్షమున, ఆఱనీయక యానిప్పును విశ్రాంతిదినము ముగియు వఱకును మండుచుండునట్లు చేసి కాపాడవలెను; విశ్రాంతిదిన మారంభ

మఱునప్పటి కింట నిప్పు లేనిపక్షమున, ఆదినము కడచినవఱకును నిప్పు తగిలింపకూడదు; ఆదినమున నెవ్వరును మూటనుగాని మఱి యేవస్తువునుగాని వహించి వీధిలో పోగూడదు; నాటికి నియమిత మయి యున్న పాపుక్రోసుదూరములోనే దక్క దానిని దాటి యెవ్వరును వడవగూడదు; నాడేవిధమయిన యాటలను పిల్లలుసహిత మాడగూడదు. నాటిదిన మామశస్తులు చదువుకొనుటయు మాటాడుకొనుటయు దేవాలయమునకుం బోవుటయుం దక్క వినోదార్థముగా మఱి యేపనియుం జేయగూడదు. ఆదినమున దేవాలయమునకుం బోవుట యొక్కటిమాత్రమే పిన్నపెద్దల కందఱికిను సమానముగా నింతసంతోషకరముగా నుండుచు వచ్చెను. దేవాలయముయొక్క బహిర్ద్వారము దాటగానే లోపల పెట్టబడి యున్న చిన్నపెట్టెలో బీదలకు ధర్మార్థముగా నిచ్చుటకయి యక్కడకుం బోయినవారందఱును తమశక్తికొలదిని కానువీసములను వేయుచుందురు. ఆలయమునకుం బోయినతరువాత లోపల నిరుప్రక్కలను రెండేసివరుసల యున్న తానములు వేయబడి యుండును. అం దొక్కప్రక్కను పురుషులును రెండవప్రక్కను స్త్రీలును కూరుచుందురు! ఆలయములో నించుమించుగా మధ్యభాగమునం దున్న వేదికమీద నాచార్యుఁడు కూర్చుండుటకయి యొక యగ్రపీఠము వేయఁబడి యుండును. గర్భాలయములో రాత్రిందివములు సదా దీపము వెలుగుచుండును. అక్కడి జనులు విగ్రహారాధకులు కానందున దేవాలయములో విగ్రహము లుండవుగాని యొకయరలో మతగ్రంథములు మాత్రము పెట్టఁబడి యుండును. దేవాలయమును సందర్శింపవచ్చువారు తమపాదుకలను వెలుపలనే విడిచి వట్టికాళ్ళతో చప్పుడు గాకుండ నడిచి లోపలికి వచ్చి కూరుచుందురు. యుక్తకాలమున సందఱును సమావేశ మయిన

తరువాత నాచార్యుఁడుగాని పాఠకుఁడుగాని లేచిపోయి వేదికమీఁది పీఠము నధిష్ఠింపఁగానే యెల్లవారును లేచి నిలువఁబడి క్షణకాలము తమమనస్సులలో నీశ్వరధ్యానము చేయుదురు. అంతట జనులట్లు నిలువఁబడియుండఁగానే పాఠకుఁడు తాను గ్రహించుకొని వచ్చినప్రార్థనము చదువనారంభించును. అతఁడు వాక్యమును ముగించినప్పు డెల్లను జను లేకగ్రీవముగా నడుమునడుమ "తథాస్తు" అని భక్తిపూర్వకముగా పలుకుచుందురు. ఈప్రకారముగా ప్రథమప్రార్థనము ముగిసినతరు వాత పాఠకుఁడు హీబ్రూభాషలో ధర్మశాస్త్రములనుండి కొన్ని వాక్యములను చదువఁగా జనులకుఁ దెలియుటకయి యాచార్యుఁడు దానిని దేశభాషలలోనికి భాషాంతరీకరించి చెప్పును. అటుపిమ్మట మరల నొకప్రార్థన జరిగినపిమ్మట మఱియొకసారి దీర్ఘదర్శులవ స్తి ములలోనుండి కొన్ని భాగములు చదువఁబడును. అవి సమాపినొందిన పిమ్మట దేవాలయమునకు వచ్చినవారిలో నొకపండితుఁడు గాని సమర్థుఁడయినయితరుఁడు గాని యాచార్యునియాజ్ఞను బొంది యొకధర్మోపన్యాసము చేయును. ఆయుపన్యాసాంతమునం దచ్చటి వారు లేచి దానిమీఁద ఖండనముగాఁగాని మండనముగాఁగాని తమకుఁ దోఁచినయభిప్రాయమును యథేచ్ఛముగాఁ దెలుప నారం భింపఁగా, ఆయుపాసనామందిర మప్పుడు శాంతిప్రద మైనయాశ్రో పాసకసమావేశమువలె నుండక పండితగోష్ఠి వలె కోలాహలధ్వనితో నిండి పోవును. ఇట్లు వివాదములు జరుగుచున్న సమయమునందు పాఠ కుఁడు లేచి ప్రార్థనను చదువుటకు నిలువఁబడఁగానే మరల సర్వమును నిశ్శబ్ద మగును. అంతట పాఠకుఁ డంత్యప్రార్థనముజేసి యాశీర్వదించి యుపాసనమును ముగించును. ఆపల జనులు లేచి యెవరియిండ్లకుపో పోవుదురు. స్వగ్రామములోని యిటువంటి దేవాలయమునకు జీసన్ను

బాల్యమున తల్లిదండ్రులతో గలిసి తఱుచుగా బోవుచుండెను. ఇట్లాలయమునకు బలుమాఱు పోవుచుండునప్పు డచ్చటి యుపదేశ ములవలనను భక్తివరు లయిన వారివర్తనమువలనను జీనస్సుయొక్క మనస్సులో తరుణవయస్సులోనే నిశ్చల మైన యీశ్వరభక్తి నాఁటు కొనుటయేకాక బాహ్యమునకు భక్తవేషములు ధరించి వచ్చెడుదాంభి కులనటనలమీఁదను భక్తిహీనములైన యనావశ్యకము లైన కర్మముల మీఁదను గొంతవఱ కాతని కనూయసహిత ముదయించెను.

యూదులు స్వగ్రామములయందలి దేవాలయములలోఁ జేరి యీశ్వరారాధనము చేయుచుండుటయేకాక యేటేట తమపుణ్యస్థల మైనజెరూసలేమునగరమునకు యాత్ర చేయుచుందురు. హిందువులకు కాశీపుర మెట్టి దివ్యస్థలమో యూదులకు జెరూసలేమునగర మట్టి దివ్య క్షేత్రము. పాలస్టీన్ దేశమునకు రాజధాని యైనట్టియు మతమునకు ప్రధానస్థాన మైనట్టియు యూదులక్షేత్రములలోనెల్ల నగ్రగణ్య మైన ట్టియు గణన కెక్కిన వారి పూర్వరాజులకు వాసభూమి యైనట్టియు జెరూసలేమునగరమునందు ప్రతిసంవత్సరమును మూడు గొప్పయుత్స వములు జరుగును. ఆయుత్సవముల మూటిలో నొక్కటి మిక్కిలి ముఖ్య మయినది. అది మహావైభవముతో ప్రతిసంవత్సరమును చైత్ర మాసములో వారముదినము లవిచ్ఛిన్నముగా నడుపఁబడును. వానికి 'ప్యాసోవర్' పండుగని పేరు. ఆమహోత్సవమును జూచుట కయి దేశదేశములనుండి జనులు తండోపతండములుగా యాత్ర పోయి యిసుక చల్లినను క్రింద రాలనట్టుగా పట్టణమునం దంతటను క్రిక్కి ఱిసి యుందురు. అప్పు డామహానగరములో స్థలము చాలనందున యాత్రాపరులనిమిత్తమయి పందిళ్ళును పాకలును వేయఁబడును. ఆయుత్సవమునకు తనతల్లితండ్రులతోఁ గలిసి జీనస్సు పెక్కుసారులు

పోయి యుండును. నాజరెత్తుగ్రామమునకు జెరూసలేము నగరము మూడుదినముల ప్రయాణములో నున్నది. త్రోవలో దొంగలభయ మధిక మగుటచేత తీర్థయాత్రాపరులు కుటుంబములతో నొంటిగాఁ బోవక సాధారణముగా పలువురుచేరియే యాత్ర చేయుదురు. పండ్రెండుసంవత్సరముల ప్రాయమప్పు డొకసారి జీసస్ జననీజనకు లతోఁ గూడి జెరూసలేమునగరమునకు యాత్ర చేసెను. ఆపట్టణము నందు గొప్ప దేవాలయ మొకటి గలదు; ఉత్సవదినములలో నక్కడ వేలకొలది మేఁకలను గొఱ్ఱెలను భక్తులు దేవునికి బలియిత్తురు. హింసాకర మయిన యాచోటతనికి ప్రతికరముగా నుండనందున, ఆతఁ డచ్చట నుండనొల్లక యాబలిస్థానమును విడిచి దూరముగాఁ బోయి దేవాలయముతోనే చేరి ప్రత్యేకముగా నావరణము చేయఁబడి విద్వాంసులు మతబోధ చేయుటకొఱ కేర్పడి యున్న నిశాలము లైన యాశ్రమములలో నొకదానికిఁ బోయి యక్కడ వారు చేసెడిప్రసంగ ములను శ్రద్ధతో వినఁజొచ్చెను. తత్త్వోపదేశకు లయిన విద్వాంసులు రాబీ లనఁబడు ప్రసిద్ధపండితులు. ఇట్ల మున్నవారందరును బోయి వారు చేసెడి యుపదేశములను విని తమకు సందేహము తోఁచినవిష యములలోనెల్ల యథేచ్ఛముగా ప్రశ్నలు వేసి ధర్మసందేహాములను నివారణము చేసికొనవచ్చును. ఉత్సవదినములు గడఁచిపోఁగానే యాత్రాపరు లందఱును మరల బయలుదేరి గుంపులుగుంపులుగా సహవాసులతోఁగూడి తమతమగ్రామములకుఁ బోవుదురు. జోసప్పును మేరీయును తమయూరికిఁ బోవ బయలుదేఱినప్పుడు జీసస్సు వారికిఁ గనఁబడలేదు. అతఁడు సహవాసులతోఁగలిసి ముందు నడచుచుండఁగా జూచితి నని తోడవచ్చినవారిలో నొకఁడు చెప్పినందున, వారు వాని మాట సమ్మి యుపేక్షచేసి కొడుకుగతి విచారింపకయే దారిసాగిరి.

రాత్రి బస దిగినతరువాతసహిత మతఁడు వచ్చి తల్లిదండ్రులను కలిసి కొనలేదు; ఎంతసేపు ప్రతీక్షించినను వచ్చుజాడ కానరాలేదు. అందు చేత వారప్పుడు భయపడి కుమారుని నిమిత్తమయి సహవాసుల గుడా రములకెల్లఁ బోయి వెదకఁ జొచ్చిరి. ఎందు వెదకినను ప్రియపుత్రుఁడు కంటఁ బడలేదు. ఆరాత్రి చీఁకటిలో మరల వెనుకకుఁ బోవుటకును వలనుపడదు. అంచుచేత వారా రాత్రి మహావిచారముతో క్షణ మొకయుగముగా నెట్లో వేగించి మఱునాఁడు ప్రభాతసమయమున మరల జెరూసలేమునకుఁబట్టి, బయలుదేఱిరి. నాటిసాయంకా లమునకు వారు జెరూసలేము ప్రవేశించి కొన్నిచోట్ల వెదకి చీఁకటిలో దిరుగలేక మార్గాయాస పడి యుండుటచేత నాటిరాత్రి యొకచోట విశ్రమించి వేకువజామున మరల లేచి మూడవనాఁడు పట్టణములో జీసస్సును వెదక నారంభించిరి. ఆమహాపట్టణములో వారు సందులు గొందులు తిరిగి వెదకి యెవరినడిగినను వారికి కుమారునిజాడ తెలియ రాలేదు. ఇట్లు తిరిగితిరిగి వేసరి తుదకు వారు దేవాలయమునకు బోఁగా నతఁ డక్కడ విద్వాంసులు చెప్పెడుదాని నాలకించుచు నడుమ నడుమ వారిని ప్రశ్నలు వేయుచుఁ గూరుచుండి కానఁబడెను. అతఁడు కంటఁబడఁగానే తల్లి యపరిమితానందమును బొందిన దై మార్గాయా సమునంతను మఱచి చేరువకుఁబోయి "కుమారా! మమ్మిట్లు శ్రమ పెట్టితి వేమి? నీతండ్రియు నేనును నీనిమిత్తి మై యెట్లు చింతతో వెదకితిమో చూడు" అని పలికెను. జీసస్సు వింతవడిచూచి "నన్నేల యింత వెదకితిరి? నేను నాతండ్రిగృహములోనే యుందు నని మీ రెఱుఁగరా" అని తోడనే యుత్తరము చెప్పెను. ఆయుత్తరమును బట్టిచూడఁగా తాను కనఁబడకపోయినప్పుడు తనతల్లిదండ్రులు తిన్నఁగా తననిమిత్తము దేవాలయమునకు వత్తు రని యతఁడు భావించినట్లు

స్పష్ట మగుచున్నది. ఇంత చిన్నతనములోనే యతని కీశ్వరునియం
దెంత యవ్యాజ విశ్వాసము కుదిరినదో! దారితప్పి తన యిహలోక
పితను గానలేకపోఁగానే యెందుఁజూచోటికిఁ బోక యతఁడు తన తల్లి
పరలోక పితయొక్క యాలయమునకుఁ బోయి తన నిమిత్తమై తల్లి
దండ్రు లక్కడకే వెడకుకొనుచు వత్తురన్న సంపూర్ణ విశ్వాసముతో
నిశ్చింతముగా నక్కడఁ గూరుచుండెను. అతఁడాచార్యులు కర్మలను
పూజలను జేయుస్థలమునకుఁ బోక విద్వాంసులు ధర్మోపన్యాసములు
చేయుచోటికిఁ బోయి తదేకాసక్తితోఁ గూరుచుండుట యాలోచించి
చూడఁగా, ఆతని మనస్సులో నంతటి బాల్యకాలమునందే భక్తిలేని
బాహ్యకర్మలమీఁద ననాదరమును నిర్మలమైన ధర్మాచరణము
మీఁద ఘనాదరమును దృఢపడినట్లు స్ఫురించుచున్నది. అంతటఁ దల్లి
దండ్రు లాశాలుని వెంటఁబెట్టుకొని స్వగ్రామమునకుఁ గొనిపోయిరి.

అతనికి పదుమూఁడు సంవత్సరములు దాఁటినది మొదలుకొని
దాదాపుగా ముప్పది సంవత్సరములు వచ్చువఱకును జరగిన వృత్తాంత
మును దెలిపెడు విశ్వాసార్హమైన చరిత్రమేదియుఁ గానరాదు. ఆకా
లమునం దతఁడెక్కడెక్కడ సంచరించెనో, ఏయేగ్రంథముల జదివెనో,
ఎవ్వరెవ్వరితో మైత్రిచేసెనో, ఏయేవిషయములయం దెంతెంత యభి
వృద్ధినొందెనో, ఏయేపనులు చేసెనో, అదియంతయు మన కిప్పుడు
పరమరహస్యముగా నున్నది. పాళీభాషలో వ్రాయఁబడిన క్రీస్తుచరి
త్రముయొక్క పురాతనమైన వ్రాఁతప్రతియొకటి తిబితీయ దేశము
లోని యొకబౌద్ధమఠములో క్రొత్తగా లభించినట్టు కొన్ని వార్తాపత్రి
కలలో నీనడుమఁ బ్రకటింపఁబడినది. అది నిజముగా పూర్వకాలము
నందే రచియింపఁబడినగ్రంథమో, లేక పుస్తకమునకు గౌరవాధిక్యము
కలిగింపవలె నన్న యుద్దేశముతో నవీను లెవ్వరిచేత నైన ప్రాచీన

మనుభ్రమ కలుగునట్లు నూతనముగా నృష్టింపఁబడిన గ్రంథమో, సునిశ్చిత మగువఱకును తద్గ్రంథమునందు జెప్పఁబడిన విషయములను మనమింతవఱకును నమ్మవచ్చు నని నిర్ధారణము చేయఁజాలము. అయినను తద్గ్రంథముయొక్క సత్యాసత్యనిర్ణయమును దీనిం జదువు వారిబుద్ధికే విడిచిపెట్టి, అందలి ముఖ్యాంశముల నీవఱకుఁ బ్రకటింప బడినరీతిగా నక్కడ సంక్షిప్తముగాఁ దెలుపుచున్నాను. దేశనంచా ర్థము బైలుదేఱిన 'నికొలస్ నోటోవిష్' అను రషియాదేశస్థుఁ డొకఁడు హిమాలయపర్వతముల కుత్తరమునందున్న తిబితీయదేశ ములో ప్రయాణముచేయుచు నొకమఠములో బౌద్ధులిస్సా యను నొకదీర్ఘదర్శినెఱిఁగి గౌరవించుచున్నారనియు, ఆయిస్సాయే జీసస్ క్రైస్తనియు వినెనఁట! అతఁడంతటితోఁ దృప్తినొంది యూరకుండక యట్టిచరిత్రమొకటి యున్నయెడల తప్పక సంపాదింపవలయు ననినిశ్చయించుకొని, ఇస్సాయొక్క చరిత్ర మెక్కడ లభించు నని బౌద్ధాచార్యుల నడుగుచు రాఁగా వారిలో నొకఁడా గ్రంథము లాడక్ మండలములో లభించు నని చెప్పెనఁట! తత్క్షణమే యతఁడు లాడక్ మండలమునకుఁ బోయి విచారించి, లేనగరమునందలి హేమిస్ మఠములో గ్రంథమున్న దని తెలిసికొని, బహుప్రయత్నములు చేసి మొదట విఫలమనోరథుఁడై తుదకావుస్తకము నక్కడి మతాచార్యుని వలనఁ బొందిి, ద్విభాషి యొకఁడు దానిని జదివి యర్థముచెప్పుచు రాఁగా నతఁడు స్వభాషలోనికి దానిని భాషాంతరీకరించుకొనెనఁట. అందలిసారాంశ మిది:— "ఇస్సా యిస్రాయెల్ దేశమునందు జనన మొందెను. అతని తల్లిదండ్రులు బీదలు. వారిపూర్వులు తమ్మునిశోధిం చుటకై యీశ్వరుఁడు తమ కనుగ్రహించిన కష్టములనిమిత్తమై సృష్టికర్తకు కృతజ్ఞతాపూర్వకము లైన వందనము లర్పించుచు

భూమివీఁద నీశ్వరమహిమనుపర్థిలఁ జేయుటకయి తమపూర్వపుగొప్ప తనమును మఱచిన మహనీయులైన భక్తాగ్రేసరులు. అతఁడుచిన్నతనమునుండియు నీశ్వరుఁ డొక్కఁ డని బోధించుచు వచ్చెను. పదమూడు సంవత్సరములప్రాయము వచ్చిన తరువాత దేశాచారానుసారముగా వివాహమాడక యతఁడు తన తండ్రియిల్లు విడిచి పాతిపోయి వణిజులతోఁ గలసి సింధుదేమునకుఁ బోయెను. పదునాలుగు సంవత్సరముల ప్రాయ మప్పు డతఁడు తా నార్యులమధ్య నుండెను. జగన్నాధము, రాజగృహము, వారణాశి, మొదలగు క్షేత్రములకుఁ బోయి యతఁ డక్కడ వేదాధ్యయనము చేసి వేదార్థమును గ్రహింపఁ నేర్చెను. కాని యతఁడు వేదములయొక్క యీశ్వరకర్తృత్వమును పరబ్రహ్మముయొక్క యవతారసద్భావమును నిరాకరించి బ్రాహ్మణులతో ప్రబలవిరోధము పెట్టుకొనెను. అందుచేత భీమ్మపురములో శ్వేతాచార్యు లాతని ప్రాణముల కెగ్గుదలఁచిరి. అతఁడక్కడనుండి తప్పించుకొనిపోయి గౌతమమతస్థుల మఱుఁగు చొచ్చి, పాళీభాషను నేర్చుకొని, ఆఱుమాసములలో పరిశుద్ధ బౌద్ధమతరహస్యములను గ్రహించెను. అతఁ డక్కడనుండి విగ్రహారాధనమునకు ప్రతికూలముగా బోధచేయుచు పశ్చిమదిక్కున వెడలిపోయెను. పారసీక దేశములో జోరాష్టర్ మతమునకు విరోధముగా జనులకు బోధించి, మాంత్రికులచే బాధింపఁబడి యక్కడనుండి పాతిపోయెను. జూడియా దేశమునకు మరలఁ బోవునప్పటి కతనికి వయస్సిరువదితొమ్మిదిసంవత్సరములు. స్వదేశము చేరఁగానే యతఁడు మతబోధ కారంభము చేసెనుగాని యతనిజనానురాగము శీఘ్రకాలములోనే పాంటియస్ పైలేటు యొక్క హృదయములో భయమును పుట్టించెను. ఇస్సాను విమర్శించుట కయి పైలేటు మతాచార్యులను పండితులను రావించి

సభకూర్చెను. ఆసభవారు విచారణచేసి, ఇస్సా నిర్దోషి యని నిర్ధారణము చేసిరి. సీజరుకు విధేయు లయి యుండవలయుట, స్త్రీలయెడల గౌరవము చూపవలయుట లోనుగాఁగల విషయములనుగూఁడ జేర్చి యిస్సా విరామములేక జనులకు మతబోధలు చేయుచునే యుండెను. కాని యాతని వర్తనమును కనిపెట్టి పరీక్షించి తెలుపుచుండుటకై నియమింపఁబడిన చారులు మూకలయొక్క యత్యుత్సాహమును మతోన్మాదమును జూచి యాతనివిషయమై హృదయభేదకము లైన కథలను తమ ప్రభువునకుఁ బంపిరి. అందుమీఁద నాదేశపాలకుఁడిస్సాను చెఱసాలలోఁ బెట్టించి, బహుబోధలుపెట్టి, ఇద్దఱు దొంగలతోఁ గలిపి న్యాయసభ యెదుటికి విచారణకుఁ దెచ్చెను. ఈసారి లంచములు గైకొన్న తప్పు సాక్షులు తీసుకొని రాఁబడిరి. పైలేటు సాక్షులును పిలువగానే యాతనియాజ్ఞచేత వారిస్సావయిని ద్రోహమున కొడిగట్టిరి. అందొకఁడు ముందుకు వచ్చి యిస్సానుద్దేశించి 'జనులను సన్నాహపఱచుట కయి పరలోకప్రభువు నిన్నుఁ బంపె నని పలుకుచు నీవిస్రాయీలులకు రాజవయినట్లు చెప్పలేదా?' అని యడిగెను. అప్పు డిస్సా వాని నాశీర్వదించి "నీవిప్పుడు చెప్పినది నీహృదయములో నుండి వచ్చినది కాదు. కాఁబట్టి నీవు క్షమింపఁబడుదువు." అని పలికి పైలేటువంకఁ దిరిగి 'ఇట్టి యసత్యము నహితమక్కఱలేకయే నిరపరాధులను దండింపఁగలశక్తి నీయొద్ద నుండఁగా, నీగర్వమును విడనాడి యీ తక్కువవారి కసత్యములతో జీవనము చేయున ట్లేల కఱపెదవు?' అని పలికెను. ఈమాటల కాపరిపాలకుఁడు దురాగ్రహావేశము కలవాఁడయి, యిద్దఱుదొంగలనువిడిచి యిస్సాకు మరణశిక్ష విధించున ట్లుత్తరువు చేసెను. అప్పుడు ధర్మాధికారులు తమలో నాలోచించుకొని 'ధర్మశాస్త్రవిరుద్ధముగా నిద్దఱు తక్కువ

లను విడిచిపెట్టి నిరపరాధికి శిక్షవిధించెడి ఘోరమైన మీ పాపకృత్య
మునకు మే మొడఁబడనేరము. కాఁబట్టి యీవిషయమున నీయిచ్చ
వచ్చినట్లు నీవే చేయుము' అని పైలేటుతో ఖండితముగాఁ జెప్పిరి.
ఈప్రకారముగాఁ బలుకుచు మతాచార్యులును, ధర్మాధికారులును,
'ఈనిరపరాధియొక్క వధవిషయమై మే మెంతమాత్రమును దోష
లము కాము' అని తమచేతుల నొకపవిత్రపాత్రములో కడుగుకొని
నభవిడిచి లేచిపోయిరి. ఇస్సాను దొంగలను తరువాత ప్రూనిపైఁ
బెట్టి మేకులు గొట్టి చంపిరి. ఇస్సాయొక్కసమాధి మూడవనాఁడు
తెఱవఁబడి పట్టిదిగా నుండెను." *

---

* ఈపుస్తకము కేవలకల్పితమనియు, తిబిత్తీయదేశములోను యేబౌద్ధమతము
నందును నిట్టిపుస్తక మెన్నడును లేనట్లు నిశ్చయముగాఁ దెలియవచ్చిన దనియు .
మాక్సుమూలరు మొదలయినవారు దృఢముగాఁ దెప్పుచున్నారు.

రెండవ ప్రకరణము.

....o○o....

తత్కాలదేశస్థితి.

చిరకాలమునుండి స్వదేశరాజుల పాలనములో నున్న పాలస్తీన్ దేశమును రోమకసేనానాయకుఁడైన పాంపియనునతఁడు క్రొత్తగా జయించి క్రీస్తుశకమునకు పూర్వము 63 వ సంవత్సరమునందు దానిని రోమకరాజ్యముక్రిందఁ జేర్చెను. అటుతరువాత పదునాఱు సంవత్సరములకు రోమకచక్రవర్తి యైన జూలియస్‌సీజరు హీరాడనునతని నా దేశమునకు రాజునుగా నియమించెను. రోమకచక్రవర్తులు జనులిష్టపడినవారినిగాక తమమనమనువచ్చినవారినే దేశపరిపాలనమునకు నియమించుచు వచ్చిరి. యూదులు సామాన్యముగా స్వదేశాభిమానము గలవారై నందున, అన్యదేశరాజులకు లోఁబడి నడుచుకొనుటయే వారి కనిష్టముగా నుండెను; ఆపయిని హీరాడ్ స్వజాతివాఁడు గాక రాజవంశస్థుఁడు కాని హీనకులుఁడైనందునను దుష్టవర్తనుఁడైనందుననును జను లాతనిపే రన్న ద్వేషించుచుండిరి. ఆతఁడు ప్రజానురాగము లేనివాఁడయినను చిరకాలము రాజ్యము చేసి ఘనుఁడని బిరుదంది జీసస్ జనన మొందిన సంవత్సరమునందే పరమపదము నొందెను. ఆతఁడు జెరూసలేము నగరమునందు జీర్ణమగుచుండిన దేవాలయమును పునరుద్ధారణము చేసి, దాని నావఱి కెన్నఁడును లేనియున్నతస్థితికిఁ దెచ్చుటచేతను బహుకాలమునుండి యెల్లయెడలను నిండియుండిన దొంగలను రూపుమాపి రాజ్యమును సురక్షితముగాఁ జేయుటచేతను ఘనుఁడని పేరొందినను, ఆతని క్రూరస్వభావమునుబట్టి తా నావఱికిఁ జేసిన క్రూరకృత్యములను కప్పిపుచ్చి

యితరులను మోసపుచ్చుట కయి యీమంచికార్యములను జేసెనే కాని సదుద్దేశముతో జేయలేదని భావించి జనులాతని యెడ విశ్వాసము వహింప రయిరి. అతడు చేయుచు వచ్చిన దారుణకర్మములకు తాళజాలక పలుమాఱు జను లాతనిమీద తిరుగబడి కలహించుచు వచ్చిరిగాని యతడప్రమత్తుడయి తలయెత్తగానే యుక్తసమయమునందు కనిపెట్టి పందలకొలది కలహాకారులను నిర్దయుడయి వధించియు హతశేషులను క్రూరదండనపాలు జేయించియు కలహములు నడచుచు వచ్చెను. అందుచేత ప్రజలాతని ధాకకు తాళలేక తల్లడిల్లుచు జొచ్చిరి. రాజ్యకాంక్షచే తాను జేసికొన్న భార్యను, తాను గన్నకొడుకులను, సంహరించిన కఠినచిత్తుడు పరులవిషయమున నీక నెట్టి క్రూరకృత్యములను జేయ సాహసింపడు! ఆతడు రాజద్రోహము తలచి రన్న హేతువుచేత చేతులార ముగ్గురుకొడుకులను జంపించెను. ఈక్రౌర్యము లిట్లుండగా నతడు తాను కట్టించిన దేవాలయములలో నెల్ల రోమకచక్రవర్తిని కొలుచున ట్లుత్తరువు చేసెను. ఈశ్వరుని కొక్కనికే చెందవలసిన యారాధనమును మనుష్యున కర్పించుట ఘోరపాతకముగా భావించువా రయినందున యూదుల కీయనాలోచితకార్యముచేత నాతనిమీద మఱింత ద్వేషము పుట్టెను. అట్టి జనగర్హితునకు సుతులయి పుట్టినవారిమీద జను లనురాగము గలవా రయియుండుట సాధారణముగా సంభవింపదుగదా! ఆఘునుని మరణానంతరమున తండ్రివాత్సల్యబడక బ్రతికిన కొడుకులు ముగ్గురును రాజ్యభాగముల నిమిత్తము తమలో దాము తగవులాడి రోమకచక్రవర్తికి విన్నపములు పంపుకొనిరి. ఆచక్రవర్తి వారితండ్రి కోరికప్రకారముగా జెరూసలేమునగరమును గలిగి యున్న జూడియా యను నుత్తరమండలమును సమేరియామండలమును జ్యేష్ఠపుత్రుడయిన యార్కి-

లానసుకును, జీసస్ వాసముచేయుచుండిన గాలిలీ యనుదక్షిణమండ
లమును పెరియూమండలమును ద్వితీయపుత్రుఁ డయిన హీరాడ్
ఆంటిపన్నునకును, మఱియొక మండలమును కనిష్ఠపుత్రుఁ డయిన
ఫిలిప్పునకును, దేశమును మూఁడు భాగములుగా భాగించి యిచ్చి
ముగ్గురు సోదరులను మూఁడు సీమలకు రాజులను జేసెను. ఈత్రొత్త
రాజులు సర్వస్వతంత్రులుగాక రోమకచక్రవర్తికి లోఁబడినవారయి
మనదేశమునం దిప్పుడు శ్రీమహారాజ్ఞిగారియధికారమునకు లోఁబడి
యున్న మహిసూరుమహారాజు మొదలయిన సంస్థానాధిపతులవలె
రక్షిత రాజులుగా నుండిరి. జీసస్ జీవితకాలములో నెల్లను గాలిలీ
దేశమునకు హీరాడ్ ఆంటిపస్సే రాజుగా నుండెను. ఆతఁడు రోమకచక్ర
వర్తియెడల భయభక్తులు చూపుచు జనులయెడ దయాశూన్యుఁ డయి
ప్రవర్తించువాఁ డయినందున, ప్రజ లాతనిక్రౌర్యమునకు భయపడి
పయికి లోఁబడియున్నను లోపల నాతని ద్వేషించుచుండిరి; ఆతని
గూర్చి దుర్వార్తలేగాని యొక్కఁడవిన్నను మంచికథ యొక్కటియు
నతనివిషయమున జీసస్సునకు చెవిసోఁకలేదు. ఆతఁడు కాపట్యమునకు
పేరుపడినవాఁ డగుటచేత తరువాత జీసస్సతనికి జంబుక మని పేరు
పెట్టెను.

అతనిసోదరుఁ డయిన యార్కిలా నంతకంటెను జనకంటకుఁ
డయి యనేకదౌర్జన్యములు చేయుచురాఁగా జను లాతనిమీఁద కల
హించి పలుమాఱు దేశక్షోభములు కలిగించుచువచ్చినందున, రోమక
చక్రవర్తి యతనిని సింహాసనవిహీనునిగాఁ జేసి యాతనిస్థానమున
మఱియొకనిని పాలకునిగా నియమించెను. ఇట్లుకొందఱు పరిపాలకులు
మాఱినతరువాత పాంటియస్ పైలేట్ అనునతఁడు జూడియాదేశము
నకు ప్రభువయ్యెను. ఈవిధముగా వచ్చినరోమక పరిపాలకు లందఱును

దేశములో తమయధికారమును సురక్షితము చేసికొనుట కయి తమ తోడఁగూడ వ్యదేశమునుండి రోమకభటులను దీసికొనివచ్చి రోమక రాజచిహ్న మయిన న్వర్ణవికార మగు పక్షిరాజవిగ్రహములు రజత మయ మయిన రోమకచక్రవర్తి రూపమును గల పతాకములను వారి చేత వహింపించుచుండిరి. రోమను లాధ్వజములమీఁది విగ్రహముల కీశ్వరుని కర్పించెడు పూజలను జేయుట యాచారము. యూదులు విగ్రహారాధనమును ద్వేషించువా రయినందున, వా రాధ్వజపటము లను తమ పుణ్యస్థల మయిన జెరూసలేమునగరమునకుఁ దీసికొని రానీకుండిరి. అందుచేత రోమకసైనికు లాధ్వజములను తాము దిగెడు సముద్రతీరపట్టణములలో విడిచి వచ్చుచుందురు. ఇట్లు జరగుచుండగా పైలేటు పరిపాలకుఁ డయినతరువాత పూర్వాచారవిరుద్ధముగా నొక సారి యాపతాకములను రాత్రివేళ, జెరూసలేము నగరమునకుఁ దెప్పించెను. మఱునాఁటి యుదయకాలమునందు ధ్వజపటములు కంటఁబడఁగానే పురజనులలో గొప్ప సంక్షోభము పుట్టెను. అప్పు డసంఖ్యాకు లయిన జనులు గుంపుగూడి పైలేటుగృహమునకుఁ బోయి యాధ్వజపటములను తమ పట్టణమునుండి పంపివేయవలసిన దని మొఱ్ఱపెట్టుకొనుట కయి యాతనిదర్శన మపేక్షించి వేచియుండిరి. ఆతఁడు వారి మొఱ్ఱలాలింపక వా రయి దహోరాత్రములు తన గుమ్మమువద్ద వేచియున్న తరువాత సభాభవనమునకు రావలసిన దని వారికి వర్తమానము పంపెను. తత్క్షణమే జనులతఁడు తమ ప్రార్థన నంగీకరించు నని భ్రమపడి యతఁ డాజ్ఞాపించినట్లు చేసిరి. కాని యతఁ డంతకుముందే సభాస్థానమునంతను ఆయుధపాణు లయిన సైనికులతో నింపివేసి, గొట్టాలమందను వలె నిరాయుధు లయి వచ్చిన జనులను దొడ్డిని పెట్టిన తరువాత కత్తులను దూసికొనియున్న వీరభటులను

లోవలికిరప్పించి, తమవూనికను విడిచి యిండ్లకు తిన్నఁగా నడువని పక్షమున, నొక్క-సారిగా జనుల నందఱిని జంపించెద నని బెద రించెను. వా రా భర్జనమున కణుమాత్రమును జంకక ధైర్యముతో నిలువఁబడి, తాము ప్రాణముల నయినఁ బోఁగొట్టుకొందుము గాని యీశ్వరద్రోహకర మయిన విగ్రహారాధనమున కొడఁబడనేర మని యేకవాక్యముగాఁ బలుకుచు సంఘమరణమున కొప్పుకొని సాగిల వడి, తమ యందఱి తలలను నఱికింపవలసిన దని మెడ లొగ్గిరి. అంతట పైలేట్ వారిధైర్యస్థైర్యముల కద్భుతపడి తన పట్టుదలను విడిచి ధ్వజపటములను పట్టణముయొక్క బాహ్యప్రదేశమునకుఁ గొనిపోవున ట్లుత్తరవు చేసి పౌరులను బంపివేసెను. ఆకాలమునం దీవరిపాలకులపయి నధికారము చెల్లించుచు రోమాపురమునందు పైబిరియ స్సనునతఁడు చక్రవర్తిగానుండెను. వీరి పేరులనే జీసస్సు తఱుచుగా వినుచుండెను. రోమకచక్రవర్తిచేత నియమింపఁబడిన వరి పాలకు లందఱును సామాన్యముగా క్రూరు లయి జనుల కొత్తుడు కలుగఁజేయుచుండిరి; ఆదుష్టాధికారులు జనులనుండి సాధ్యమయినంత యెక్కువవన్ను నాకర్షించుటయే తమపనిగా భావించుచుండిరి కాని దేశక్షేమనిమిత్తము పాటువడుట తమయర్హాకృత్య మని లేశమును చింతింపకుండిరి. జనులు మనస్సులో వారిని ద్వేషించు చుండినను దుర్బలు లయినందున వారిసైనికులముందఱ నేమియుఁ జేయనేరక ప్రజ్వరిల్లుచున్న క్రోధాగ్నిని మ్రింగి తమద్వేషమును లోలోపలనే యడఁచుకొనిపయికిశాంతులవలె లోఁబడి నడచుకొనుచుండిరి. అయినను సాహసికు లయిన దుడుకువారు కొంద ఱప్పుడప్పుడు తిరుగఁబడి కలహా కారులయి ప్రాణములకు తెగించి సంక్షోభము కలిగించుచు వచ్చిరి.

అట్టివారు దేశాభిమానముచే జేయుచున్నిష్ఫలకృషి నిష్ఫలముగుటయే కాక యందువలన ననేకానర్థములును ప్రాణహానియుఁ గలుగుచు వచ్చెను. తనదేశముయొక్క స్వాతంత్ర్యమును మరల స్థాపింపఁగోరి గాలిలీదేశస్థుఁడయిన జూడ స్సనువాఁడు దేశాభిమానమానసీయు లయిన వేగిరకాండ్రను వెంటఁజేర్చుకొని ధైర్యముతో పోరాడి పరాజితుఁడగుటయు, తన్మూలమున దేశస్వాతంత్ర్యము నణుమాత్రమును సాధింపలేకపోవుటయే కాక నిష్కారణముగా రక్తప్రవాహములు కట్టించి దేశాభిమానుల ప్రాణములను గోలుపోవలసి వచ్చుటయు మొదలుగాఁ గల కథలను చిన్నతనములో జీసస్ వేమూఱు వినియుండును. స్వచ్ఛందవృత్తి ననుభవించి బ్రతికినతమ కితరులకు లోఁబడి వారికి దాసు లయి యుండవలసినగతి వట్టుటచేతను, ప్రజాపీడ కలుగునట్లుగా దుష్టు లయిన పాలకులను తమదేశము నేలనిచ్చిన పాపమున కయి భగవంతుఁడు తమ్ము శిక్షించుచున్న భీతిచేతను, పరిపాలకులు బీదసాద యని చూడక బాధించి తమవద్ద పన్ను లధికముగాఁ గొనుచుండుటనుబట్టి వారు తమ్మక్రమముగా దోచుకొను చున్నారని దృఢముగా నమ్మి యుండుటచేతను, రోమనులమీఁద ప్రజల కంతటి విద్వేషము కలిగెను. జనుల కతృప్తికర మయిన యీపన్నులను తండెడిపని స్వదేశస్థు లయిన సుంకరులయుం దుంచఁబడెను. అందుచేత జనులు వారి నధికపాపాత్ములనుగా భావించి, రోమనులకంటెను సుంకరుల నధికముగా గర్హించుచుండిరి. ఇటువంటి సమయములో నెల్లవారును తమ్మట్లన్యాయముగా బాధించుచున్న క్రూరకర్మ్మల హస్తముల నుండి విడిపించి రక్షించుట కయి సర్వరక్షకుఁడయిన యీశ్వరుఁడొక్కరక్షకుసిశీఘ్రముగాఁ బంపకమానఁడనియాశపడి నిరీక్షించుట వింతగాదు.

దేశముయొక్క రాజ్యాంగస్థితి నింతట విడిచిపెట్టి యించుక సేపు

ప్రజాంగస్థితికి వత్తము. ఇట్లు ప్రభువులు ప్రజాపీడకు లయి యుండఁగా, ప్రజలును తమలో నైకమత్యము లేనివా రయి యంతశ్ఛిద్రములలో మునిఁగి యుండిరి. స్వదేశీయులే భేదభావము లేనివారయి యొక్క మాటమీఁద నడచుకొనువా రయిన పక్షమున, విదేశీయు లయిన రోమనులకు వాఁటని విధేయులను గాఁ జేసికొని నిరంకుశాధికారము చెల్లించుట దుర్భర మయి యుండును. జనులలోఁ గల పలుతెగలవారు పరస్పరస్పర్ధ గలవా రయి రోమనులను ద్వేషించునట్లే తమలోఁ దమ్మును ద్వేషించుకొనుచుండిరి. ఆకాలమునం దచ్చటి జనులను ముఖ్యముగా మూఁడుభాగములుగా విభజింపవచ్చును. వారిలో ప్రముఖులు సద్దూకీ లనఁబడువారు. యూదులలో వారు ప్రభుజాతివారు; వారు తాము ప్రాచీనప్రభుసంతతివార మని గర్వపడుచు జనులతోఁ గలసిమెలసి యుండకుండిరి. వారే యించుమించుగా నెలదేవాలయమునకు నధికారు లయి ధర్మకర్తలుగా నుండిరి. వారు మహాకులీనులును ధనసంపన్నులు నయి రోమనుల కనుకూలురుగా నుండిరి. నిజముగా వారు హృదయములో రోమనులమీఁద ప్రేమగలవారు కాక పోయినను, స్వలాభము నపేక్షించి కాలోచితముగా వారియెడల మిత్రభావమును వహించి యుండిరి. రోమనులును వారినే దేశము లోని యధికారపదములయందు నియోగించు చుండిరి. వారు జనసమ్మతులు కానందున జనులకే రాజ్యస్వాతంత్ర్యము లభింపఁ దటస్థించిన పక్షమున వారి కా నియోగము లుండవు. వారికి పూర్వనిబంధములోని లిఖితధర్మములుమాత్రమే ప్రమాణములు; వారికి పరలోకజీవనమునందు విశ్వాసము లేదు.

ఫారసీ లనుమతియొక తెగవారు సంఖ్యయం దధికు లగుటచేత దేశమున ప్రబలులుగాను జనులలో మాటచెల్లుబడి కలవారుగాను

నుండిరి. జీసస్ కాలమునందు లెక్కకు వా రాఱువేలుమాత్రమే యుండిరను, వారిపక్ష మవలంబించినవారు బహుసహస్రసంఖ్యాకు లుండిరి. వారు తాము జనసామాన్యమునకంటె నధికులమనియు వరి శుద్ధుల మనియు భావించుకొనుచు సదా తాము నైష్ఠికత్వమును కాపాడుకొనుటకు పాటుపడుచుండిరి. సద్దూసీలకు పూర్వనిబంధన మొక్కటితక్క ప్రమాణాంతరము లేదు; ఫారసీలకు పూర్వనిబంధ నమునుమాత్రమేకాక మైతిహ్యములును రాబ్బీ లనఁబడు గురుపరంపర నుండి వచ్చుచున్న సంప్రదాయములును గూడ వరమప్రమాణములు. ఐతిహ్యము లాదికాలమునం దీశ్వరముఖమున వెలువడి పారంపర్య ముగా వచ్చుచున్నవని వారికి నమ్మకము. వారి వంశపరంపరాగత పూర్వసంప్రదాయములలో మంచివి కొన్ని యున్నను, అనేకము లనంగతము లైనవి. వారి మైతిహ్యధర్మములలో రాత్రులు దీపము లెట్లు వెలిగింపవలయునో వెలిగించినదీపముల నెట్లు కాపాడవలయునో మొదలయిన యల్పాంశములనుగూర్చి కూడ సూక్ష్మము లయిన విధు లుండెను; ఆవిధులను మీఱి వేఱువిధముగా దీపము వెలిగించుట సహితము వారిలో గొప్పపాపకార్యము. ఆహారవిషయమునను, వస్త్ర ధారణవిషయమునను, దేహయాత్ర విషయమునను వారికి సంప్ర దాయసిద్ధము లైన యనావశ్యకాచారములు పెక్కు లుండెను; అనం తము లైన యీయాచారములలో సూక్ష్మాతిసూక్ష్మ మయిన యొక్క విధి నతిక్రమించి నడిచినను పాపము వచ్చి చుట్టుకొనునని వారి సిద్ధాంత మయినందున వా రీబాహ్యకర్మల ననుష్ఠించుటలో మహా శ్రద్ధాళువులై యుండిరి. ఈకర్మఠులు నీతిని న్యాయమును విడిచినను కర్మానుష్ఠానమును విడువకుండిరి. ఇట్లుతేఱుగా నుపవాసాదినియమములు చేయుచు నిష్ఠాగరిష్ఠులు మనుకొనెడి యీఫారసీలు మతోన్మత్తులయిన

మన దేశపు బ్రాహ్మణోత్తములవలెనే లోకములలో తాము మాత్రమే పవిత్రుల మనియు నితరు లందఱును కర్మబ్రాహ్మ్యు లైన యపవిత్రు లనియు నెన్నికొని సంతోష పడుచుండిరి. ఇట్టి ధర్మిష్ఠతను జూచి యస్థానపరు లని సామరజనులు వారియెడల నత్యంతగౌరవము కలవారై భక్తి చూపుచుండిరి. ఫారిసీలలో తమయనుష్ఠానముల యందు సంపూర్ణవిశ్వాసము గలవారై శుద్ధహృదయముతోనే కర్మ లాచరించుమంచివారు కొంద ఱుండిరికాని పెక్కండ్రు వేషధారులై జనుల మెప్పుకొఱకు పయికి కర్మిష్ఠు లైన మహర్షులవలె నటించుచు తమ్మితరులు భక్తు లనుకొనుటకయి వీధులచివరలను నిలువఁబడి దీర్ఘప్రార్థనలు చేయుదాంభికులుగా నుండిరి. ఇట్టివారు బాహ్యాము నకు నిష్ఠాపరులవలెఁ గనఁబడినను లోపల స్వప్రయోజనపరులును దుష్టులునునై నిజముగా పారమార్థికచింత లేని నికృష్టులుగా నుండిరి. సద్దూసీలు ఫారసీలను వంచకు లని యాక్షేపించి వారియాచారములను పరిహసించు చుండిరి. ఫారిసీలు సద్దూసీలను కర్మభ్రష్టు లైననాస్తికు లని దూషించుచు వారు రోమనులపక్షమున నుండుట యాధారము చేసికొని జనులకు వారిమీఁద ద్వేషాగ్ని రవులుకొల్పుచుండిరి. ఇది గాక యీయిరుతెగలవారికిని పరస్పరద్వేషకారణ మింకొకటి కలదు. ఫారిసీలు పరలోకజీవనమునందు విశ్వాసము కలవారు; సద్దూసీలట్టి విశ్వాసము లేనివారు. అందుచేత పరలోకజీవనవిషయమయి యీరెండు తెగలవారికిని తఱుచుగా వివాదములు సంభవించు చుండెను. పరలోక సుఖ మపేక్షించి ప్రవర్తింపనిపక్షమున నిహలోకవర్తనము శుద్ధముగా నుండ దని ఫారిసీలు వాదించు చుండిరి; సందిగ్ధ మయినపరలోకసుఖ వాంఛను దగిలి యిహలోకకృత్యముల నుపేక్షింతురని సద్దూసీలు వాదించు చుండిరి. ఈవివాదములలో దురాగ్రహావేశముచేత నుభయ

పక్షపులవారును వాదాంశమును విడిచి యొండొరులను దూషించుచు
ద్వేషించుచు ఒకరియం దొకరు లేని దోషముల నారోపించుచు శుష్క-
కలహములతో కాలక్షేపము చేయుచుండిరి. ఫారిసీలలో నాయకు
లుగా నుండువారు లేఖకు లనియు, సద్దూసీలలో నాయకులుగా
నుండువా రాచార్యు లనియు, పిలువబడు చుండిరి. ఎట్టితక్కువయింట
బుట్టినవాఁ డయినను తనవిద్యాసామర్థ్యాదులవలన లేఖక పదమును
బొందవచ్చునుగాని యాచార్యపదమునుమాత్ర మెొక్కసత్కాల
ప్రసూనతివలనఁ దక్క మూర్ధాంశరమునఁ బొందుటకు శక్యము కాదు.
లేఖకపదమును బొందఁగోరు ప్రతిపురుషుఁడును జెరూసలేము నగరము
నకుఁ బోయి యక్కడ ధర్మశాస్త్రాభ్యాసము చేయవలెను.
అట్లు చిరకాల మక్కడ గురుశుశ్రూష చేయుచు నధ్యయనము
చేసిన తరువాత నాతనికి లేఖకపట్ట మియ్యఁబడును. ఆకాలము
నందు ముద్రాయంత్రములు లేనందున సమస్త పుస్తకములును చేతు
లతో వ్రాయవలసినదే. మతగ్రంథములను నిర్దుష్టముగా లిఖించువా
రగుటచేత వారికి లేఖకు లన్న నామము వచ్చినది. ఈలేఖకులలో
మిక్కిలి ప్రసిద్ధు లయినవారు రాబ్బీ లనఁబడు చుండిరి. ఆపదమునకు
విద్వాంసులని యర్థము.

ఈరెండు తెగలవారును గాక యాదేశమునం దవ్వుడెస్సీనులని
చెప్పఁబడెడు మఱియొక తెగవారుకూడ నుండిరి. జీసస్ కాలమునందు
వారి సంఖ్య నాలుగువేలకంటె నధికముగా నుండెను. వా రించు
మించుగా మనదేశములోని సన్యాసులను బోలినవారు. వారు మత
ములయం దనేకులు గుమికూడి యుండి సాముదాయక స్వత్వమును
విభాగములు లేక యేకముగా ననుభవించుచుండిరి. వారు లౌకిక
వ్యాపారములయందుఁ బ్రవేశింపరు. ఫారిసీలవలెనే తమకు నియమి

తము లయి యున్న కర్మలను శ్రద్ధాభక్తులతో నాచరింతురు. వారు మొత్తముమీద దయార్ద్ర హృదయులును మంచివారును నయి యుండిరి. వారు మాంసభక్షణసురాపానాదులను వర్జించి నియతా హారులై యుండిరి. వారు రాజ్యాంగవిషయములలో జనులతో జేరక పోవుటచేతను యుద్ధములను వాణిజ్యాదుల యందలి మోసము లను నిందించువా రగుటచేతను, జనులకు వారి చర్యలు సరిపడవు. ఫారిసీలవలె వారు పరలోక జీవనమును నమ్ముటయేకాక వారికంటె నొక్క మెట్టెక్కువ యెక్కి దేవతావేశము, దేవతాసాక్షాత్కారము మొదలైన వానినికూడ నమ్ముచుండిరి. బౌద్ధమతబోధవలన గొంత వఱకు వీరిట్లయిరని యూహింప బడుచున్నారు.

ఈచెప్పఁబడినవారుగాక యీకాలములో మతికొన్ని తెగలవా రుండిరికాని వారంతగా ముఖ్యులు కారు. సమరితానులని యొక మిశ్రజాతివా రుండిరి. వారిని యూదు లందఱును గర్హించి తక్కువగాఁ జూచుచుండిరి. వ్యవహారవిమర్శ డెబ్బదియిద్ద ఱాచార్యులును లేఖకులును పెద్దలును జేరి యున్నసభవారియం దుండెనుగాని మరణ దండనాధికారమును మాత్రము రోమను లాసభవారికుండి తొలఁగించిరి.

అన్యదేశీయులు వచ్చి దేశము నాక్రమించుకొని ధనాకర్షణము నిమిత్తమై ప్రజలను నానా విధముల బాధింపఁ జొచ్చినప్పుడు త మ్మాబాధలనుండి విముక్తులను జేసి రక్షించుటకయి జనులు రక్షకుని నిమిత్త మెదురు చూచుట వింత కాదని యీవఱకే చెప్పియున్నాము గదా! ఈయాశను వారిపూర్వగ్రంథములలో ప్రవక్తలు చెప్పిన భవి ష్యత్కథనములు బలవఱచినవి. ఆకాలమునందలియూదు లందఱును రోమనులను పాఱఁదోలి యన్యాక్రాంత మైన తమదేశమును మరల

తమవశము చేయుటకై తమమతగ్రంథములలోఁ జెప్పఁబడిన ప్రకారముగా దేవుఁడు మెస్సయాను బంపు ననుదృఢవిశ్వాసము గలవారైయుండిరి. మెస్సయా యను పదమునకు హీబ్రూభాషలో నభిషిక్తుఁడని యర్థము; క్రీస్తనునది గ్రీకుభాషలో దీనికి పర్యాయపదము. భక్తరక్షణమునిమిత్తమై యీశ్వరుఁ డొక్క మహానుభావుని నభిషిక్తుని జేసి పంపు ననిపూర్వపుదీర్ఘదర్శులు మతగ్రంథములలోఁ జెప్పిన వాక్యములనుబట్టి యట్టి మెస్సయా వచ్చుట కప్పుడు సమయము వచ్చిన దని సర్వసామాన్యముగాఁ దలఁచి యుండిరి. ఈశ్వరునిచే నభిషిక్తుఁడై పంపఁబడిన రక్షకుఁ డతఁడే యన్నవిశ్వాసముతోనే జీసస్సును జనులు క్రీస్తని పిలువ నారంభించిరి. అయినను జనులు ప్రారంభదశలో తమ్ము పాపములనుండి రక్షించుప్రభువు వచ్చు నని యెదురు చూడక తమశత్రువులను సంహరించి దిగ్విజయము చేసి సర్వరాజ్యమునకును జెరూసలేమునగరము రాజధానిచేసి లోకములోని సర్వసంపదలను తమ యధీనము చేసి తమకు మహాన్నత్యమును కలిగించి యేలెడు ప్రభువు వచ్చు నని యెదురు చూచుచుండిరి. ఆకాలమునం దెల్లవారలహృదయములలోను మెస్సయాయొక్క రాకను గూర్చినచింతను మించినచింత వేఱొకటి లేదు.

రోమనులు వచ్చి దేశమును జయించి జనులస్వేచ్ఛావిహారమునకు భంగముకలిగించి వారిని నిరోధించి పన్ను లధికముగా గ్రహించి వారి కొత్తుడు కలుగ జేయుచుండిరను, జనుల నొండొరులతోఁ బోరాడనీయక యడఁచియుంచి దేశమును స్వస్థపఱిచి వాణిజ్యాదులు నిరపాయముగా సాగునట్లు చేసిరి. ప్రభుత్వమువారి సేనాబాహుళ్యమునకు భయపడి దేశములోని దుష్టజను లడఁగి యుండవలసినవారయినను వారి హృదయములు మాత్ర మతృప్తిని విడువక తమ

స్వేచ్ఛాచరణస్వభావమును జూపుట కయి సమయము కొఱకు ప్రతీక్షించుచుండెను. ఈయవస్థలో మహోన్మాద మెల్లయెడల వ్యాపించి సర్వజనులహృదయములలోను నెలవుకొనఁగా మెస్సయాపిచ్చ యెల్ల వారిని పట్టుకొనెను. మెస్సయా వచ్చి దుష్టసంహారము చేసి ధర్మ సంస్థాపనము చేయునని యాబాలగోపాలమును నమ్మియుండిరి. కృత యుగమెప్పుడో కడచిపోయిన దని యిక్కడ మనవారి నమ్మకము. కృతయుగము ముందు రానున్న దని యక్కడవారి నమ్మకము; పాలస్టీన్ దేశములో వారిదీర్ఘదర్శులు వందలకొలఁది సంవత్సరముల క్రిందటనే యీవఱకు వుట్టిపెరిగినవా రందఱి కంటెను నధిక బుద్ధి మంతుఁడును బలవంతుఁడు నయిన యద్భుత శక్తిసంపన్నుఁడగు ఘనుఁ డొక్కఁడు తమదేశమునం దుద్భవిల్లు నని పలికియుండిరి. అతఁడు మానవకోటి నంతను శాసించుననియు, సమస్త దేశములవారును వచ్చి యాతనిపాదము లాశ్రయించి కొలుతురనియు వారు వచించియుండిరి. అటుతరువాత గ్రంథకర్త లీవాక్యములను మఱిచి యీఘనుఁడు యూదులలోనే పుట్టు ననియు, డేవిడ్‌వంశమునం దుద్భవించి పూర్వ రాజవంశమును మరల నుద్ధారణము చేసి లోకమున కంతకును ప్రభు వగు ననియు, తొంటికంటెను స్పష్టముగా వ్రాసిరి. పరరాజుల పాల నము వలన జనులలో కష్టము లధిక మయినకొలఁదిని ప్రజల మనస్సు లలో లోకజేత యగు రాజునుగూర్చినచింత యధికము కాఁజొచ్చెను. అట్టి ప్రభువు శీఘ్రముగా వచ్చి 'తమ కష్టములను గట్టెక్కింప వలయు' నని పురుషులును స్త్రీలును బాలురును వృద్ధులును సర్వజను లును సదా తమచిత్తములలోఁ బ్రార్థించుచుండిరి. వారిలో ననేకులకు స్వప్నములో నహితము మెస్సయా వచ్చినట్లే కనఁబడు చుండెను. వారికి రాత్రిందివములు మెస్సయా చింతయే పలవరింతగా నుండెను.

అతఁ డెక్కడ పుట్టునో, ఎట్లు కనఁబడునో, తొలుత నేకార్యములు చేయునో, యన్నవిషయములలో నభిప్రాయభేదమున్నను మెస్సయా వచ్చు నన్నవిషయమునులలో నెవ్వరికి నణుమాత్రమునుసందేహములేదు. మఱునాడు సూర్యుఁడుదయించు నని యెంతనిశ్చయ ముండెనో యెల్లవారిమనస్సులకును మెస్సయా వచ్చుననుటయు నంతదృఢనిశ్చయ మయి యుండెను; కొందఱు మెస్సయా నేఁటి రేపటఁ బుట్టబోవుఁ చున్నాఁడని తలఁచుచుండిరి; కొందఱావఱకే పుట్టి తమలోఁ బెరుగు చున్నాఁడని తలఁచుచుండిరి. కొందఱు నేఁడో రేపో దర్శన మిచ్చి లోకమునకు తనరాకను ప్రకటించు నని తలంచుచుండిరి. ప్రజలలోని వలుతెగలవా రితరవిషయములలో పరస్పరవైషమ్యము కలవారుగా నున్నను, ఈవిషయములో మాత్ర మెల్లవారును నేకీభావము వహించి యుండిరి. ఎన్నినులు జనులు దుర్మార్గు లగుటవలన నతఁడు దర్శన మియ్యకున్నాఁ డని పలుకుచు జనులను సన్మార్గవర్తులు కం డని బోధింపఁ జొచ్చిరి; పారిసీలు మెస్సయా తమలోనేపుట్టి రాష్ట్రములో నున్నతస్థానములను తమ కిచ్చు నని సంతోషించుచుండిరి. సద్దూ సీలు తాము త్తమకులీను లగుటచేత తమలోనివాఁడే యొక మహా పురుషుఁడు తాను మెస్సయా యగుట యెప్పుడో ఘోషించు నని కనిపెట్టుకొని యుండిరి. సామాన్యజనులు మెస్సయా యెక్కడనో జనన మొంది తమలోనే గూఢముగా మెలఁగుచున్నాఁ డనియు, అతఁడు లోకమునకు తన్నెఱిఁగించుకొనుట కియి యుక్తసమయము కొఱకు ప్రతీక్షించుచున్నాఁ డనియు, నేఁడో రేపో యెప్పుడో యే నిమిషముననో యేపండుగనాఁడో బయలఁ బడు ననియు, తలఁచి యాతని దర్శింప నతికుతూహలు లయి యుండిరి పూర్వదీర్ఘదర్శులు చెప్పినవచనములను బట్టి మెస్సయాదర్శన మిచ్చిన మఱుసటి నిము

నము నుండియు తా మందఱును సుఖులును భాగ్యసంపన్నులు నగుదు
మనియు, ప్రపంచమున కంతకును జెరూసలేము రాజధాని యగు
ననియు, భూమిమీఁద యుద్ధములును విపత్తులును రూపు మాయు
ననియు, దుష్టశిక్షణమును శిష్టరక్షణమును కలుగు ననియు, సమస్త
ఋతువులలోను సంవత్సరము పొడుగునను వృక్షములును సస్యములును
ఫలసమృద్ధము లయియుండు ననియు, క్రూరమృగములు సహితము
తమ క్రౌర్యమును సహజవైరమును విడిచి సింహమును మేకయుఁ
గలిసి యేకముగా నొక్కచోట వాసము చేయు ననియు,
వ్యాధులును బధిరత్వాదు లయిన యంగవైకల్యములును లేకుండు
ననియు, మెస్సయా జెరూసలేములో పరిశుద్ధము లయిన ధర్మములను
స్థాపించి యేలునప్పుడు తమదేశము భూతలస్వర్గ మగునని యు, వారి
యెన్నిక.

దేశ మీస్థితిలో నున్నప్పుడు నడుమనడుమ నొకానొకఁడు దేవు
నిచేఁ బంపఁబడిన మెస్సయా తానే యని బయలుదేఱుచుండెను.
అప్పుడాతని చుట్టును వందల కొలఁది జనులు చేరుచుండిరి. ఇట్లు
మెస్సయా సని బయలువెడలిన ప్రతిపురుషుఁడును తాను సహాయ
సంపదలేనివాఁ డయ్యును మతోన్మాదముచేత శక్యాశక్యవిచారము
లేనివాఁడయి తానొక్కఁడే రోమనులను పాఱఁదోలి దేశము నుద్ధ
రింపఁ గలుగుమనన్న పూర్ణవిశ్వాసముతో వెలువడి దురాగ్రహావేశ
ముతో దేశక్షోభమునకు నుపక్రమింపఁగానే రోమను లట్టివారిని
బట్టి సంహరించి యాక్షోభము నడఁచివేయుచుండిరి. అట్లు వెలువడిన
వానికెల్లను చావు నిశ్చయమే యయినను మతావేశపరవశత్వముచేత
మరణమునకు వెఱవక యట్టివా రనేకు లొకరితరువాత నొకరు మరల
మరల బయలుదేఱుచునే యుండిరి. పతితు లయిన పరరాజులను దేశము
నుండి తఱిమివేసి రాజ్యమును నిష్కంటకము చేయుట్కై తమ్మాశ్వ

రుఁడు పంపె ననియుఁ దాము దుర్జయుల మనియు నమ్మి మతోన్మా దమువలనఁ గలిగిన వీరావేశమునుగొని వెలువడి యీసంవత్సరము కొందరు ప్రాణములు కోలుపోఁగా, ఆమఱుసటి సంవత్సరమే యట్టి వారు మఱికొందరు వెనుకటివారి మరణకథను మఱచిపోయి యెవ్వటి విశ్వాసముతోనే వెలువడి మరల మరల రోమనుల ప్రతాపాగ్ని కాహుతి యగుచుండిరి. ఇట్టి రాజద్రోహులను చిత్రవధ చేసి దేశ క్షోభము నడఁచుటలో క్రూరులుగా నుండినను రోమను లితర విషయములలో జనులస్వాతంత్ర్యములకు భంగము కలిగింపక మన్నించుచుండిరి. ఈసర్వజనసంక్షోభసమయమున జీసస్సులు ప్రవర్తించెనో, అతనిమన స్సెట్లుండెనో, మొదలయిన విషయములు ముందు ముందు వివరింపఁబడును.

మూడవ ప్రకరణము

జీసస్‌యొక్క బోధనారంభదశ.

మెస్సయా భ్రమలో బడి విశ్రాంతి గానక యెల్లవారును వ్యాకులస్థితిలో నున్న యాకాలములోనే జీసస్ మొట్టమొదట 'కేనా' నగరమునందు జనులకు ధర్మబోధ చేయు నారంభించెను. తన కొడుకు పని కారంభించి ప్రఖ్యాతి పొందకమునుపే జోసఫ్ పరలోకగతుడయ్యెను. భర్తయొక్క మరణానంతరము మేరీ కుటుంబమునకు యజమానురాలయి నాజరెత్తు గ్రామమును విడిచి తనబిడ్డలతో 'కేనా' పట్టణమునకు లేచిపోయి యందు నివసించినట్లు కనబడుచున్నది. మేరీ కుటుంబ యాజమాన్యమును వహించుటను బట్టియే యేకనామధారు లయిన యితరులనుండి యతనిని వేఱుచేయవలసినప్పు డాకాలపువారు జీసస్సునకు మేరీ కొడు కయిన యనువిశేషణమును జేర్చుచువచ్చిరి. నాజరెత్తు గ్రామమునకు జాము ప్రయాణములో నున్న యాకేనాపట్టణ మొకవేళ నామె పుట్టినిల్లయి యుండవచ్చును. తన యౌవనదశలో కొంతకాలము జీస స్సీపట్టణమునందు వాసము చేసి యిక్కడనే ప్రథమమున మతబోధ కుపక్రమించెను. జీసస్సున కప్పటికి వివాహము కాలేదు. అటుతరువాత సహిత మతడెప్పుడును వివాహము నపేక్షింపక యాపజ్జీవమును బ్రహ్మచారిగానే యుండెను. బాల్యమునుండియు నాతని ప్రేమ మొకప్పుడును కళత్రాదులైన యిహలోకవిషయముల మీఁదికిఁ బోక యెల్లప్పుడును పరమేశ్వరుని మీఁదికే పోవుచుండెను. అప్రసిద్ధస్థితిలో నున్న యాకాలములో నాతనిజ్ఞాన మొల్లు దినదినాభివృద్ధి గినెనో, ఎట్టిధ్యానమార్గముచేత కడ

వటఁ నతఁ డట్టి యీశ్వరైకపరాయత్త మైననిశ్చల మతోత్సాహ
మును పొందఁ గలిగెనో, తెలియవు. నిపుణముగా నాలోచించి
చూడఁగా నితరజన సాహాయ్యము చేతను మతగ్రంథ సాహాయ్యము
చేతనుగాక స్వబుద్ధి విశేషముచేతనే యాతని కట్టి యుత్తమ జ్ఞాన
పదవి లభించినట్లు తోఁచుచున్నది. అతఁడు చూపిన యీశ్వర విష
యక మైన యా యుత్తమజ్ఞాన మాతనికి యూదులమతము వలనఁ
గలిగియుండదు; ఆమతమునం దట్టినిర్మలబోధ మున్నట్లును గానరాదు.
ఈశ్వరుఁడు సర్వజనులకును తండ్రి యన్న నిశ్చయజ్ఞాన మిట్లో
యాతని హృదయఫలకమునందు శిలాక్షరమువలె దృఢముగా లగ్న
మయి యెప్పుడు నెడఁబాయ కుండెను. అందుచేత నాతనికి తండ్రి
యన్నపద మీశ్వరపదమునకు పర్యాయపద మయ్యెను; అతఁ డీశ్వరు
నెప్పుడు పేరొక్కనవలసివచ్చినను తండ్రియనియే సంబోధించుచుండెను.
అంతేకాక యాపరమపితయొక్క యాజ్ఞలాతనియంతరాత్మకు సదావినఁ
బడుచున్నట్లుండెను. పయినుండి వచ్చి యీశ్వరుఁడు ప్రత్యక్ష మైనట్లు
గాని, యతఁ డెప్పుడును భావింపలేదు; అతఁ డీశ్వరుని తనహృద
యములోనే చూచుచు మనస్సు చేతనే సర్వదా యీశ్వరసాన్నిధ్య
సాంగత్యము లనుభవించుచుండెను. అతఁడు తానీశ్వరునిలోనే వసించు
చున్నట్లు దృఢభావన కలవాఁడయి భౌతికనేత్రములతోఁ జూడక
పోయినను జ్ఞాననేత్రముచే నీశ్వరుని సందర్శించి యానందించుచుండెను.
మన దేశమునందలి యహంబ్రహ్మల వలె నతఁ డెప్పుడును తానే
యీశ్వరుఁడ నని భావించుకో లేదు. ఈశ్వరుని తండ్రినిగా భావించు
కొనుచుండుటచేత తా నీశ్వరపుత్రుఁడ ననిమాత్రము దృఢముగా
నమ్మియుండెను. ఈయాకూఢజ్ఞాన మంతయు నాతని కొక్కసారిగా
నలవడిన దని చెప్ప వలనుపడదు. ఇది చిరకాలాభ్యాసము వలనను

దీర్ఘాలోచన వలనను గలిగినఫల మయి యుండవలెను. జీసస్ దృష్టి కీశ్వరుఁ డొల్లవారికిని తండ్రియగుటచేత బిడ్డలందఱు నాతనిని ప్రేమింప వలసినవారే కాని యెవ్వరు నాతనికి భయపడవలసిన పని లేదు; యూదులు తమ మత్రప్రకారముగా భావించుకొనున ట్లీశ్వరుఁడొక్క యూదులకే పితయయి వారిరక్షణముకొఱ కితరులను సంహరించెడు క్రూరుఁడు గాక యాతనిదృష్టియుం దెల్లవారిని సమానముగా కాపా డెడు సర్వకారుణ్యుఁడైన లోకపిత యయి యుండెను. అతఁ డందు చేత తనదేశమువారి దురభిమానమును వదలి యీశ్వరునియొక్క సర్వజన పితృభావమును లోకములో స్థాపించుటకొఱకే మొదటి నుండియు పాటుపడఁ జొచ్చెను. తాను నెలకొల్పఁ దలఁచుకొన్న యీసిద్ధాంతము నతఁడు సాధారణముగా "ఈశ్వరరాజ్యము" "పర లోకరాజ్యము" అనుపేరులతోఁబిలుచుచు వచ్చెను. ఈపదము లతఁడి వారి పూర్వగ్రంథములలో నుపయోగింపఁబడినవే కాని యతఁడు కొత్తగా కల్పించినవి కావు. ఈ పదముల కచ్చటివారు తమతమ బుద్ధ్యను సారముగా ననేకు లనే కార్థములను జేసికొనుచుండిరి. ఈశ్వర రాజ్యము మానసికరాజ్య మనియు, ఎల్లవారు నీశ్వరాజ్ఞకు లోఁబడి నడుచుకొనునా రగుదురేని యీశ్వరరాజ్యము లోకములో స్థాపన మగు ననియు, జనస్వయొక్క యభిప్రాయమైనందున నతఁడా పదము లను తదనుగుణ మైన యర్థమునందుఁ బ్రయోగించుచు వచ్చెను. అందుచేతనే యీశ్వరరాజ్య మెక్కడ నున్న దని యితరులు తన్నడిగి నప్పు డతఁడు మీమనస్సులోనే యున్నదని వారి కుత్తరము చెప్పుచు వచ్చెను. అతఁ డీశ్వర సాన్నిధ్యమును తన మనస్సులోనే యనుభవించువాఁ డైనందున, ఆచారోపదేశములవలనను బాహ్యకర్మల వలననుగాక యొక్కమానసికభక్తిచేతనే యీశ్వరుని పొందఁ దగు

నని యు, ధ్యానమార్గముచేత నీశ్వరసాంగత్యమును బొంది సమస్త కార్యముల నీశ్వర ప్రీతికరముగా నాచరించుచు నీశ్వరునివలె పరిశుద్ధ వర్తనమును బొందుటయే యానందదాయక మనియు, నమ్మి యితరుల కట్లే బోధించుచుండెను.

ఈ బోధనలమూలముననే దురాగ్రహావేశముచేత మతా చార్య లాతనిని ద్వేషించి దూషింప బూనిరి. కన్నులు మూసికొని ప్రార్థించునప్పుడు జనులు తమ్ము చూచుచున్నారో లేదో కనిపెట్టుట కయి నడుమనడుమ కన్నులు దెఱచి చూచుచుండుటయు, ఇతరులు తమ్ము దాతలని చెప్పుకొనుట కయి డంబముతో నలుగురును చూచు నట్లు దానములు చేయుచుండుటయు, తమ్ము పుణ్యపురుషు లని జను లనుకొని గౌరవించుట కయి భక్తవేషమున కనుకూలముగా వస్త్ర ధారణము చేసికొనుచుండుటయు, లోనుగా గల దాంభిక వ్రతముల నతడనుదినమును ఫారసీలలోఁ జూచి రోఁతపడి, యెల్లవారి మనస్సు లను పరిశోధించి చూచుచు ఫలము లిచ్చెడు సర్వేశ్వరుఁ డంతట నిండియుండఁగా తదనుగ్రహకరణమునకు దాంభికు లైన యాచార్య పురుషులతోఁ బనియుండ దనియు, కొడుకులకును దండ్రికిని నడుమ మధ్యవర్తు లుండవలసిన యక్కఱ లేదనియు, మనశ్శుద్ధి లేనప్పుడు బాహ్యస్నానములు మనుష్యుని పవిత్రుని జేయఁజాల వనియు, కనఁ బడినవారి కెల్లను నిర్భయముగా బోధింప నారంభించెను. ఈ స్వదే శీయుల దాంభికాచారములను మనస్సులో నుంచుకొనియే యతఁడు తరువాత తనశిష్యుల కుపదేశించునప్పుడు "మీరు దానము చేయు నప్పుడు మీకుడిచేయి చేయుదానిని మీయెడమచేయి యెఱుఁగకుండు నట్లు రహస్యముగా చేయుఁడు. రహస్యముగా జేసెడు దానిని చూచెడు మీతండ్రి మీకు బహిరంగముగా బహుమాన మిచ్చును" అనియు,

"నీవు ప్రార్థించునప్పుడు నీగదిలోనికిఁ బోయి తలుపులు వేసికొని యంతర్యామి యైన నీతండ్రిని ప్రార్థింపుము. రహస్యములోని దానిని చూచెడు నీతండ్రి నీకు బహిరంగముగా బహుమానము చేయును. దీర్ఘపాఠములవలననే తమ మొఱ్ఱలాలించు నని భావించి ప్రతిమార్చ కులు చేయునట్లు నీవు ప్రార్థించునప్పుడు పలికినదానినే మరల వ్యర్థముగా పలుకఁబోకుం. నీవు తన్నడుగక ముందే నీకేమి కావలెనో నీతండ్రి యెఱుఁగును." అనియు, బోధించుచు వచ్చెను. ఇట్లతఁడు మతిరక్షణ మున కావశ్యకము లన్నమిషమీఁద గురువులచేఁ గల్పింపఁబడి కాపాడఁబడుచుండిన సత్యమతభంజకము లైన కర్మ్మల కన్నిటికిని గర్భ శత్రు వయ్యెను. అందుచేత నతఁడు లోకములో సత్యమతమునకు పరమోపకారి యయ్యెననుటకు సందేహములేదు. ఇట్టి యాతని బోధ లను విని యాతనికి స్వగ్రామములో కొంతమంది శిష్యులుగా నేర్పడిరి.

జీసస్సునకుఁ గల విద్యావిశేషమును గూర్చి యావఱకే కొంత వివరింపఁబడినది కదా? అమానుషశక్తుల విషయ మయి యాతని కప్పుడు సంపూర్ణవిశ్వాస ముండెను. ప్రకృతిశాస్త్ర జ్ఞాన మత్యల్పముగా నుండిన యాకాలములో నతఁడు ప్రార్థ నలచేత తాను మేఘమూర్ధములను మరల్పఁగల ననియు, రోగ మును మరణమును మాన్పఁగల ననియు, సమస్తము నీశ్వరేచ్ఛా యత్త మగుటచే భక్తపరాధీనుఁ డయిన యతఁడు భక్తజనాభీష్టసిద్ధి కలిగించుటకై యెట్టి యద్భుతము లైనఁ జేయవచ్చు ననియు నమ్మఁట యొక వింత గాదు. అయినను జీసస్సునం దిటువంటి నమ్మ కములవలన సాధారణముగా పామరజనులలోఁ గలిగెడి యనర్థము లేవియుఁ గలుగక వానికంటె విలక్షణములయిన సత్ఫలములు కలిగెను.

ఇటువంటి విశ్వాసములవలన పామరులలో కారణము లేని భయము లును, పనికిమాలినభ్రమలును, అనావశ్యకము లయిన యాచారము లును, మాంత్రికాదివేషధారుల వలని మోసములును కలిగి దేశ క్షోభమునకు కారణము లగును; జీసస్సునందో వీనివలననే యాశ్వ రునియెడల సంపూర్ణభక్తియు మనుష్యశక్తియెడల నతిమాత్రవిశ్వా సమును గలిగి దేశలాభమునకు కారణము లయ్యెను. ఈవిశ్వాసముల నటుండనిండు. మతమునకు పరిశుద్ధహృదయమును, పరిశుద్ధవర్తన మును, సర్వజనసౌభ్రాత్రమును, ఈశ్వరభక్తియు ప్రధానములు గాని నిరర్థకము లయిన బాహ్యకర్మలును బాహ్యవేషధారణములును ముఖ్య ములు కావన్నది జీసస్సు చేసినబోధయొక్క సారాంశము. ఇంచు మించుగా నిటువంటి సిద్ధాంతములనే యప్పుడప్పు డుపదేశించుచు వచ్చినవా రొకానొక రుండుచువచ్చిరి కాని తమయుపదేశముల నను ష్ఠానములో జూపినవారు మాత్రము కావరారు. సర్వము ననుష్ఠాన ములో నున్నది కాని యుపదేశములో నేదియు లేదు. వెనుకటివారి వలె కేవలోపదేశముతో తృప్తినొంది యుండక జీసస్ తా నుపదేశిం చిన దానినెల్ల ననుష్ఠించి చూపెను. పశ్చాత్తాపప్పుడు నుపదేశకాలమున కంటె ననుష్ఠానమునందే లోకమున కధికోపకారదాయక మగును. ఎవ్వాడు మాటలతోను చేష్టలతోను ధర్మము ననువర్తించునో, ఎవ్వాడు ప్రాణాపాయము వచ్చినను ధర్మమును విడువకుండునో, అట్టి వాడొక్కడే లోకములో సర్వజనులకు పూజనీయుడగును.

ఎల్లవారును మెస్సయా వచ్చు నని యెల్ల చోటులను ప్రతీ క్షించు చున్న కాలములో జీసస్ తనగ్రామములో మతబోధ కారం భించి యుండగా నాకస్మికముగా దేశమునం దంతటను "మెస్సయా యీవఱకే మనలో నుద్భవిల్లియున్నా డనియు, ఈశ్వరరాజ్యము

సమీపించిన దనియు, బోధించుచు జార్డన్ నదీతీరప్రాంతమంటలి యరణ్యములోనుండి యొక ప్రవక్త బయలుదేఱినాఁడు" అని యొక ప్రవాదము కలిగెను. ఈవార్త పుట్టినతోడనే దేశమునం దంతట నొక్కసారిగా సంక్షోభము పుట్టి యామహాపురుషుని సందర్శించుట కును, తద్బోధనల నాకర్ణించుటకును నానాముఖములనుండి జనులు తండోపతండములుగా వరుగెత్తసాగిరి. ఇట్లు బయలువెడలిన ప్రవక్త పేరు జాన్. క్రీస్తుశకము ౨౮ వ సంవత్సరప్రాంతమునం దత్యుత్సాహావంతుఁడును తపస్వియు నయిన జానను నొకడి యీమహాపురుషుని యొక్క ఖ్యాతి యించుమించుగా పాలస్తీను దేశమునం దంతటను వ్యాపించెను. ఈజాన్ యొక్క జన్మస్థలము జూడియా దేశములోని హెబ్రన్ పురమునకు సమీపమున నున్న జెట్టా గ్రామము; ఇతఁడు డాచార్యపురుషుల వంశమునఁ బుట్టినవాఁడు. జీసస్ పాలస్తీన్ దేశములో నుత్తరభాగమునందు వర్ధిల్లుచుండఁగా నితఁడు దక్షిణభాగమునందు పెరుగుచుండెను. ఇతఁడు బాల్యమునుండియు నుపవాసాది వ్రతములతో కాలక్షేపము చేయు నలవాటు పడినవాఁడు; మన భరతఖండమునందలి ఋషులవలెఁ గొంతకాల మరణ్యమందు తపశ్చర్య చేసినవాఁడు. అట్టి యితఁడు, డిప్పుడు తనశిష్యులను జార్డన్ నదీజలములలో స్నానములు చేయించి యుపదేశములు చేయుచున్నందున నతనికి స్నాతకుఁడన్న నామము ప్రసిద్ధ మయినది. ఇతఁడు జీవ్వుడు చేయుచున్న ముఖ్యబోధ "అనుతాప పడుఁడు. ఈశ్వరరాజ్యము సమీపించుచున్నది" అనునది. జీసస్సు మనస్సునందువలెనే యీతని మనస్సునందును చిన్నతనములోనే తత్కాలదేశదుర్గతి దృఢముగా నాఁటి సంతాపము కలిగించెను. జను లెట్లు కష్టములకు లోనయి దుఃఖపడు చున్నారో, వారిలో నెండఱు పాపముల పాలయి బాధ

వడుచున్నారో, మంచివారుగాను ధీమంతులుగాను నుండవలసిన గురువు లెట్లు దుష్టవర్తనులును బుద్ధిహీను లయియున్నారో, ఎస్సీలును ఫారిసీలును ధర్మకవచమును దొడిగి పైకి భక్తుల వలె నటించు చున్నను హృదయములోపల భక్తిహీనులును దయాశూన్యులు నయి యున్నారో, తెలిసికొని జాన్ మనస్సులో నారాట, మొందఁజొచ్చెను. అతఁ డుగ్రస్వభావుఁడును వేగిరపాటు గలవాఁడు నగుటచే నాతని దృష్టి కీయుక్రమములు దుస్సహము లయ్యెను. హెబ్రన్ నగరము నందలి తన సుందరమందిరమునందు సుఖముగా నుండినవాఁ డయ్యును కన్నులు నీరుగా ననుదినమును తనచుట్టును నడుచుచున్న దుర్వ్యవ హారములను జూచి సహింపలేనివాఁ డయి యతఁ డితరులవలె మెస్సయా యొక్క రాక నపేక్షించి యింట నణఁగి యుండనొల్లక తనకు కోపో ద్రేకమును కలిగించుటకు కారణము లయిన యకార్యకరణములు కంటఁబడకుండు ననియు తన దేశస్థులను మంచిమార్గమునకుం ద్రిప్పు టకుఁ దగిన సాధము లుపదేశించుట కయి నిశ్చలహృదయముతో రాత్రిందివము లీశ్వరుని ప్రార్థింపవచ్చు ననియు తలపోసి యతఁడు వనమునకుఁ బోయి నివసింపవలె నని నిశ్చయించు కొనెను. అడవు లకుఁ బోయి కాయములు శుష్కింపఁ జేసి తాపసు లయి నసించుట యీ దేశమునందువలెనే యీ దేశమునందును పూర్వకాలమునం దాచార మయి యుండెను.

అట్లు వనవాసము చేసి తపస్సు చేయువారి కీశ్వరసాక్షాత్కా రము కలుగు నని నమ్మి జను లట్టివారికి భయపడుటయు వారిని గౌర వించుటయుఁ గలిగి యుండెను. వానప్రస్థము పుణ్యకార్యముగా నెల్ల వారిచేతను భావింపఁబడు చుండెను. అట్లు కృతనిశ్చయుఁడయి యప్పుడే యిల్లు విడిచి జాను మృతసముద్రమునకు సమీపమున నున్న యరణ్య

మునకు లేచిపోయెను. ఆఘోరాటవి దురాలోక మయిననిర్జనప్రదే శము; అక్కడ కొండలును నిసుకతిన్నెలును దక్క కంటికి మఱేమియు కనఁబడవు. ఆకాఱడవిగుండ దినములకొలఁది నడచినను వనవాసుల కప్పుడప్పు డొకానొకపక్షి యో నక్కయో విషసర్పమో దక్క జీవ జంతు వేదియు కంటఁబడదు. అక్కడక్కడ వానలు కురిసినప్పుడు కొండలసందులలోను చిన్నయేటలలోను నిలిచిననీరు దక్క త్రాగు టకు మంచినీరయినను లభింపదు. అడవితేనెయు మిడుతలును దక్క మనుష్యుఁడు శరీరభరణము చేసికొనుట కనుకూల మయిన యాహార పదార్థములేవియు దొరకవు. కొండలలోని నెఱియలలో తేనెయీఁగలు తేనెపట్లు పెట్టును; దక్షిణవాయువులచేత యవనదేశమునుండి మిడు తలదండు కొట్టుకొనివచ్చును. ఇట్టి కాఱడవిలో మిడుతలను దిని తేన త్రాగి ప్రాణాధారణము చేసికొనుచు బహుసంవత్సరము లేకాకియై జాను వసించెను. ఆకాలములో నతఁడు రాజదండనమును తప్పించు కొనుటకయి ప్రాణభీతిచేత పాఱిపోయి వచ్చినయొకానొకతస్కరుని మొగమును దక్క మనుష్యముఖము నెప్పుడును జూడలేదు. అతని కప్పు డడక్కడ పర్వతగుహాయే వాసగృహము; కటిసూత్రమున బంధింపఁబడిన యుష్ట్రాజినమే వస్త్రము; మనోగతులే సహచరులు; పూర్వప్రవక్తలయొక్క వాక్యములను చింతనము చేయుచుండుటయు తనదేశస్థులను దౌర్బల్యములనుండియు పాపములనుండియు విముక్తు లను జేయవలయునని యీశ్వరప్రార్థసము చేయుచుండుటయునే యతని వ్యాపారము.

ఇట్లీశ్వరుని ధ్యానించుచు తపశ్చర్యయందుఁ గొంతకాలము గడపినతరువాత తత్ఫలముగా నతనిమనస్సునం దొకసంకల్ప ముదయించెను. రోమకసైనికులు భూరముగా నున్నందున నతని కీయుడ

విలో వారివలనిభయముగాని వారితో పోరాడుట వృధాయాస మన్న చింతగాని కలుగలేదు. సమీపించినప్పటివలె దూరముగా నున్నప్పు డపాయము లంత భయంకరముగా తోచకపోవుట లోకనైసర్గికమే కదా! ఆయుధపాణు లయిన రోమకభటులను నిత్యమును కన్నుల యెదుర జూచుచు పట్టణములలో వాసము చేయుచుండినవారి కట్టి బలిష్ఠుల జయింపగలుగుదు మన్న యాశ పుట్టుట కష్ట మయ్యెను; కాని యడవిలో నున్న జానుయొక్కదృష్టికి సర్వశక్తుడయిన యీశ్వ రునిరాజ్యమును తనదేశములో స్థాపన కాకుండ నిలుపుటకయి యల్ప సంఖ్యాకు లయిన యీ యాయుధహస్తు లెంతటివా రని తోచెను. ఇట్టిసంకల్ప మతనిమనస్సునకు తగులగానే యతడు తనలో తాను పరివరిలాగుల నాలోచించుకొనజొచ్చెను. జనులయొక్కపాపముల మూలమున మెస్సయా దర్శన మిచ్చుటకు శంకించుచున్నా డని రాబ్బీలు ఘోషించుచుండ లేదా! ఒక్కదిన మయినను జను లంద ఱును తమపాపముల కయి నిజముగా పశ్చాత్తప్తు లైనపక్షమున, మెస్సయా ప్రత్యక్షమై యీశ్వరరాజ్యమును స్థాపించు నని వారు పలికి యుండలేదా! మెస్సయాయొక్క సాక్షాత్కారము నిమిత్తము కావలసినదెల్లను జనులు పశ్చాత్తప్తులై పాపపరాఙ్ముఖు లగుటయే కదా! నేనుపూని జనుల ననుతాపపడునట్లు చేసెదను. అని మనస్సులో దృఢనిశ్చయము చేసికొని యితరులు రిత్తకోరికలు కోరుచు కాల క్షేపము చేయు చుండగా జాను కార్యదీక్ష వహించి బయలువెడ లెను. జా నెవ్వాడును తానే మెస్సయా నని తలచుకోలేదు; నిజదర్శన ప్రాప్తి కర్వాత కలుగునట్లుగా జనులు పరిశుద్ధు లగుట నిమిత్తమా మహాప్రభువు వేచియున్నా డని మాత్రమే తలచి యుండెను. ఇట్టిస్థితి యం దాతనిమనస్సులో నీవుపోయి "పాపమునకు వరితపింపుడు.

ఈశ్వరునిరాజ్యము సమీపించినది." అని జనులకు బోధింపు మని యాజ్ఞాపించిన ట్లొకవాక్యము వినఁబడెను. అట్లు వినఁబడినతోడనే యది యీశ్వరాజ్ఞగాఁ జేకొని యావివిక్తప్రదేశమును తనగుహాను విడిచి బయలుదేఱి యతఁడు త్రోవపొడుగునను కంటఁబడినవాని కెల్లను స్వమత ప్రకటనము చేయుచు జార్డన్ నదీతీరమునకుఁ బోయి తన సిద్ధాంతమును బోధింపఁజొచ్చెను. మనదేశమునందలి బైరాగుల వంటి శిష్యు లనేకు లప్పటికే యతనిచుట్టును జేరి యతఁ డేర్పఱిచిన నియమములకును, బోధించిన సిద్ధాంతములకును లోఁబడి నడుచుకొను చుండిరి. ఆతనిబోధను విన్నవా రెల్లను నతఁ డీశ్వరప్రేరణముచే వచ్చిన నిజమైన దేవదూత యని విశ్వసించి తాము విన్నదాని నిత రులకుఁ జెప్పసాగిరి. ఈప్రకారముగా కర్ణపరంపరచేత నాతనిఖ్యాతి దేశమం దంతటను మెల్లమెల్లఁగా నల్లుకొనఁగా నల్పకాలములోనే జెరూసలేమునగరమునకు సహితము చేరెను. అందుచేత జనులు నానా ముఖములనుండి ప్రవాహరూపమున బయలుదేఱి వచ్చి యాతని బోధను వినుటకై మూగఁజొచ్చిరి. ఎక్కడనో మాఱుమూల నున్న గాలిలీదేశములోను ప్రశాంత మైన నాజరెత్తుగ్రామములోను గూడ జాను బోధించుచున్న కథయు జను లాతనిచుట్టును జేరుచున్న వార్తయు నెల్లవారికిని కర్ణతాడిత మయ్యెను. ఇట్లు కొన్నిమాస ములు జరుగునప్పటి కతఁడు జూడియామండలములో మిక్కిలి ప్రబలుఁ డయ్యెను. పామరజను లందఱు నాతని మహాత్మునిగా భావించి పూజించుచు వచ్చిరి; పలువు రతఁడు దేశోద్ధారణమునిమిత్తమయి యవతరించిన మహాపురుషుఁడని నమ్మిరి; తాను మెస్సయాను కానని యతఁడు బహిరంగముగా ఘోషించుచున్నను, అనేకు లతఁడే మెస్సయా యని భావించిరి. అతఁడు నిర్భయముగా ధనికు లైన మతా

చార్యులయొక్కయు ఫారిసీలయొక్కయు మాయవేషములను వెల్లడి పఱచుచుండుటచేత మతాచార్యులును లేఖకులును మాత్ర మాతనిని ద్వేషించి తిరస్కారభావముతోఁ జూచుచుండిరి. అయినను జనులకు జడిసి వారాతని నేమియుఁ జేయులేకుండిరి.

ఈకాలమునకు జీసస్సున కించుమించుగా మువ్వదిసంవత్సర ముల ప్రాయము వచ్చెను. గొప్ప ప్రవక్త యొకఁడు బయలు వెడలి యెల్లవారిని శిష్యులనుగాఁ జేసికొనుచున్నాఁడన్న వార్త చెవిసోఁకఁగానే జీసస్సు తనయిల్లును వ్యాపారమును విడిచి తన కొంచెపాటి శిష్య బృందమును వెంటఁగొని న్వగ్రామమునుండి బయలుదేఱి యొక్కఁడనో దక్షిణమున జాను బోధ చేయుచున్న దూరదేశమునకు తిన్నఁగా నడిచిపోయెను. ఇట్లుతఁడు సంతోషదాయక మైన తనవాసస్థానమును సుఖములను విడిచిపోవునప్పు డతనికి తనకు ముందు కలుగఁబోయెడు స్థితినిగూర్చినచింత గాని తన కామరణమును బాధలును తన్మూలమున లోకమునకు మేలుసు గలుగు నన్న యాలోచనగాని మనస్సులో పుట్టి వదో లేదో! జానుయొక్క నిప్పులుగురియుమాటలు చెవిని బడఁగానే యాతనిమనస్సులో నుత్సాహాగ్ని రగులుకొని యొక్కసారిగా ప్రజ్వ రిల్లెను. సమస్తదిక్కులనుండియు గుంపులుగుంపులుగాఁ బోవుచున్న మూకలతోఁ గలసి జార్డన్‌నది మృతసముద్రములో సంగమించిన చోటికి సమీపమునం దున్న జానువద్దకు జీసస్ వచ్చెను. అతఁడక్క డకు వచ్చునప్పటికి దీర్ఘశిరోజములు భుజములనుండి వ్రేల, తల విరయఁ బోసికొని, కన్నులనుండి నిప్పులురాల వికృతముగాఁ జూచుచు బాహువులు పయికెత్తి దృఢభక్తినూచకముగా నభినయించుచు, బట్ట బయల నిలువఁబడి మేఘగంభీరభాషణములతో వాగ్ధారాప్రవాహ మును వర్షించుచున్న దృఢోన్నతశరీరుఁ డైన పురుషుఁ డొకఁడు కన్నుల

యెదుటఁ గానఁబడెను. అవ్వా డాతనినోటికుండి "ప్రభువుయొక్క రాకకు దారిచేయుఁడని యరణ్యములో ఘోషించు చున్న వాఁడను నేను. నాతరువాత వచ్చుప్రభువు నాకంటెను శక్తిమంతుఁడు. ఆతని పాదరక్షలయొక్కవాఁటిను వంగి విప్పుటకైనను నేనర్హుఁడను గాను. అతఁ డీవఱకే మీలో నిలిచి యున్నాఁడు. ఆతనివ్యజన మాతనిచేతిలోనే యున్నది. కృషీవలుఁడు ధాన్యమునుండి పొల్లెగరఁ గొట్టినట్లు, అతఁడు పాపాత్మలను భూమినుండి యెగఁజిమ్మివేయును. కాఁబట్టి యనుతాపపడుఁడు ; మీపాపకృత్యములను శీఘ్రముగా విడిచి మంచిని జేయుట కభ్యసింపుఁడు. ఈశ్వరరాజ్య మాసన్నమై యున్నది." అనుమాటలు పిడుగులు వడుచున్నట్లు బయలువెడలి వినువారికర్ణ రంధ్రములనుండి దూరి హృదయములను కలఁచుచుండెను. ఆసమయమునం దక్కడ నున్నమూఁకలో ఫారిసీలును సద్దూసీలును గొంద అతనికంటఁబడఁగా జాను వారివంక రూక్షదృష్టితోఁ జూచుచుచేతులు చాఁచి "ఓవిషసర్పములారా! రాఁబోవు కోపమునుండి తప్పించుకొండని మిమ్మెవ్వఁడు హెచ్చరించును ? మీరు మీపాపములకు వరితాప వడినఁగాని మిమ్ము దేవుఁడు రక్షింపఁడు." అనునట్టివాక్యములను పలికి జనులవంకఁ దిరిగి "పశ్చాత్తాపవడుఁడు; ప్రశ్చాత్తాపవడుఁడు. జ్ఞాన స్నానము పొందుఁడు" అనుమాటలు మాటికిమాటికి నుపన్యసింపఁ జొచ్చెను. స్నానములు ముక్తిదాయకము లని ప్రాగ్దేశమునం దెల్ల వారికి నమ్మిక మగుటను బట్టి యతఁడు జనులు పశ్చాత్తప్తు లయి తన శిష్యులగుట కంగముగా జ్ఞానస్నానమును పేర జార్డన్ నదీజలా వగాహన మేర్పఱిచెను. అతని యాయుపదేశము విని పశ్చాత్తప్తు లయి వేలకొలఁది జనులు కన్నుల నీరుగార మూఁకలలోనుండి వెలు వడి పోయి నదిలో స్నానము చేసి వచ్చి యాతనికి శిష్యులగుచుండిరి.

జాను నదిగట్టున నిలుచుండి యుపన్యసించు చుండఁగా శిష్యులు స్నానముచేసి వచ్చువారును స్నానమునకుఁ బోవువారును నైన గురువునకు భక్తితో ప్రణామము చేయుచుండఁగా, లెక్క లేని జనులు చేరువను నిలువఁబడి వేడుక చూచు చుండిరి. అట్టి సమయమునందు యోవన పురుషుఁ డొకఁ డామ్నాఁకలోనుండి వెలువడి తాను జ్ఞాన స్నానమునకు నీటిలో దిగెను.

ఆవఁకే జాను కొంతకాలము నుండి జార్డను నదిగట్టున నిలువఁబడి నిత్యమును జనులకు బోధచేయుచు పశ్చాత్తప్తు లయిన వారికి జ్ఞానస్నాన మిచ్చుచుండెను. జనులు తమ పాపముల నిమిత్త మెప్పుడు చిత్తములో పశ్చాత్తాపము నొందుదురో యప్పుడు మెస్సయా తప్పక వచ్చు నని జానుకు దృఢవిశ్వాస ముండెను. ప్రతి దినమును వేలకొలఁది జనులు తనవద్దకు వచ్చి తమ పాపముల నొప్పు కొని యనుతాపపడి శిష్యులగుచుండుటచేత మెస్సయావచ్చి దర్శన మిచ్చు దిన మత్యాసన్న మయియున్నదనియు నతఁడు హృదయములో నమ్మి యుండెను. అంతకంతకు జను లధికముగా వచ్చి తమపాపము లనుగూర్చి శోకాగ్ని సంతప్తులై శుద్ధచరిత్రులుగా నుండవలె నన్న మనోనిశ్చయముతో తమతమ వాసములకుఁ బోవుచు వచ్చినకొలఁ దిని మెస్సయామీఁది చింత బలవడి యతని కావచ్చెడువారిలోనే మెస్సయా యున్నాఁ డేమో యన్న భ్రమసహితము కలుగుచు వచ్చెను.

అందుచేత నాతఁడు మెస్సయా యేవేళనో యేనిమిషమందో వచ్చి దర్శనమిచ్చు ననియు, ప్రజారక్షకుఁ డయిన యాప్రభువురాకను జేవుఁడు తరుణము వచ్చినప్పుడు ముందుగాఁ దనకుఁ దెలుపునని యు, నెదురుచూచుచుండి, యెవ్వని ముఖమునం దైన మెస్సయా కాఁదగిన

లక్షణము లున్న వేమో యని తనవద్దకు స్నానమునకు వచ్చువారి ముఖముల నెల్ల నిపుణముగా పరిశీలించి చూచుచుండెను. ఇట్లుండగా నొకనాడు తన బోధ ముగిసిన తరువాత పైన జెప్పినట్లొక యాపవన పురుషుడు నదిలో స్నానము చేసి తన వద్దకు వచ్చుచుండగా జాను కొంతతడవు నిశ్చలదృష్టితో తెప్పవాల్పక యుతని మొగము వంక జూచెను. అప్పు డతనిదృష్టికి తన్ను సంతోషపరవశుని జేయ దగినచిహ్నము లేవో యాయాపవనపురుషుని సాధుముఖము నందు పొడ కట్టెను. "ఇతడే యతడగునా?" యని తనలోన దాను వితర్కించుకొనుచు, తన్ను సమీపించుచున్న యాపురుషుని నేకాగ్రచిత్తు డయి తదేకదృష్టితో జూచునప్పుడు చెవిలో జెప్పినట్లుగా జానునకు తనహృదయములో నుండి "ఇతడే మెస్సయా; దేవునిచేత నభిషిక్తు డయినవాడితడే." యన్నశబ్దము వినబడిన ట్లయ్యెను. అట్లు వచ్చిన యా యాపవనపురుషుడే జీసస్సు. ఆప్రవక్తయొక్క దృఢగంభీరోక్తులు చెవిని బడినప్పు డతని హృదయమునం దావఱి కొన్నడును వుట్టని యనిర్వాచ్య మగు నొకవిధమైన యుద్దీపనము కలిగెను. ఆతడు డాక్షణమునసే త నొక్క దేవదూత చేయిచూపి కొనిపోవు చున్నదో యనునట్లు శాంతముఖముతో తిన్నగా జానుయొక్క నమ్ముఖమునకు నడిచెను. ముం దేమి జరగ నున్నదో యాతనిమనస్సున కప్పుడు పూర్ణముగా పొడకట్టకపోయినను, తాను పవిత్ర మయిన దేవకార్యము నిమిత్తము తనజీవమును నిశ్శంకముగా ధారపోయవలయు నన్న యీశ్వరప్రేరణ మాతని మనస్సులో నుదయించెను. ఆవఱి కాపుణ్యపురుషు లెప్పుడు నొండరులముఖము లను జూచి యెఱుగనివా రయినను ప్రథమదర్శన సమయమునసే వారిరువురకును దేవుడు హృదయముల నొక్కటిగా గూర్చినట్లుగా

లోపలదృఢమైన స్నేహానుబంధము కలిగెను. మఱేమియు వలుకక యితరులవలెనే జీసస్సును జ్ఞానస్నానము నాతనివలనఁ బొందుట కయి నీటిలో దిగెను. అంతట జా నాథని వంక కొంచెము సేపు చూచి యనుమానించి "నేనే నీ వలన స్నానము పొందఁదగినవాఁడను. నీవే నావద్దకుఁ వచ్చుచున్నావా?" అని పలికెను. జీసస్ శాంతచిత్తముతో "ఇట్లుజరగనిమ్ము, ధర్మము సర్వమును నిర్వహించుట మన కిట్లే తగియున్నది." అని యుత్తర మిచ్చెను. పాపమునకు పశ్చాత్తాపపడి ధర్మాచరణదీక్ష వహించుట కితరు లవలంబించిన యీస్నానమార్గమే తనకును తగియున్న దని యీమాటల కర్థమై యుండును. అంతట జాను జీసస్సునకు జ్ఞానస్నాన మిచ్చెను. జీసస్ నీరువెలువడి వచ్చి యీశ్వరుని ప్రార్థించుటకై మోకరించుకొని కూరుచుండి యున్న ప్పుడు జాను తనవద్ద నిలుచున్న వారితో "నా తరువాత నాకంటెను శక్తిమంతుఁ డొకఁడు రానున్నాఁడని నేను చెప్పిన దితనిని గూర్చియే. నేను మిమ్ము నీటిలో స్నానము చేయించినట్లే మి మ్మితఁడు పరిశుద్ధాత్మలో ముంచును." అని మెల్లగా చెప్పి నఁట. ఇందువలన జీసస్సే మెస్సయా యని యప్పు డందఱికిని గాకపోయినను జాను యొక్క మనస్సునకైనను తోఁచె ననుట స్పష్టము.

జీసస్సే మెస్సయా యన్న తనయభిప్రాయమును జాను వలు వురతోఁ జెప్పినట్టు తోఁచదు. అందుచేత జ్ఞానస్నానవేళ నడచిన యీవృత్తాంతమును జననంఘములో నంతగా వ్యాపించలేదు. జీసస్సు జ్ఞానస్నాన మొందిన తరువాత నత్యల్పకాలములోనే యక్కడ నుండి వెడలి పోయెను. జెరూసలేము నగరమునకో మఱియెచ్చటనో జీసస్సు మహోత్సాహముతో తన పని నారంభించిన సువార్త యచిర కాలములోనే చెవిని బడు నన్న పూర్ణవిశ్వాసముతో జా నిక్కడ

యథాప్రకారముగా తా నారంభించిన పనిని తాను పూని కతో నిర్వహించుచుండెను. జాను వద్ద సెలవు గయికొని వివిధాలోచనలతో చిత్త ముద్భ్రాంత లూగ నొక్కఁడును జీనన్ను మున్ను జాను తపస్సు చేసిన జూడియా యరణ్యమునకే తిన్నఁగా తానును నడచెను. ఇంతకుముం దెన్నఁడు ననుకొని తానే మెస్సయా యన్నవిశేష మొకటి యిప్పుడు క్రొత్తగా నాతని చెవిని సోఁకెను. జానుయొక్క ముఖవీక్షణము వలన మెఱుము మెఱిసిన ట్లాకస్మ్మముగాఁ గలిగిన చిత్తోద్వేగములో సతఁ డీశ్వర కార్యమున కయి తన జీవనమును ధారపోసెద ననికృతప్రతిజ్ఞుఁడయి యీవలకు వచ్చినను, ఆయుద్రేకము కొంతశాంతి పొందినపిమ్మటఁ దాను నిర్వ హింపఁ బూనుకొన్న ఘనకార్యమును సాధించుటకు తాను సమర్థుఁడ నగుదునా కానా యన్న సంశయ మిప్పు డాతనిమనస్సును బాధింపఁ జొచ్చెను. తాను పూనిన మహాకార్యము దుస్సాధ్య మనియు కష్ట భూయిష్ట మనియు స్పష్టపడిన యిప్పు డాతనికి తాను మెస్సయా నగు దునా యన్నవిషయములోనే సందేహముతోఁచెను. మెస్సయా నిర్వ హింపవలసినవని సాధారణ మయినది కాదు. అట్టి యసాధారణ కార్య నిర్వహణమునకుఁ జాలినంత బలమును బుద్ధికౌశలమును నాయొద్ద నిప్పు డున్నవా? అట్టి శక్తిని భగవంతుఁడు నా కనుగ్ర హించుట సాధ్య మగునా? నేనో యసహాయుఁడ నైనయప్రసిద్ధుఁ డను; నిర్వహింపవలసిన కార్యభార మో దుర్భర మయినది. భవిష్య ద్గతి నాలోచించిన ననిష్టములే కానవచ్చుచున్నవి. జనులో చపలచిత్తులు! నానాయకత్వ మంగీకరించి వారు కొంతకాలము న నన్నుసరించి తరువాత నెదురు తిరిగి ప్రాణాంతము తేవచ్చును. ఒక్కఁడు నాయకత్వము వహించి లోకము నంతను తీసదారి కెట్లు

త్రిప్పఁ గలుగును; నే నివ్వుడు మెస్సయా నని బయలుదేఱితిని పో
తరువాత జరుగవలసిన దేమి? జను లామాట నమ్ముదురా? నమ్మిన
యెడలఁ జేయవలసినవని యేమి? జనుల యభీష్టప్రకారము నేనలను
గూర్చుకొని పోయి రోమనులతో యుద్ధము చేయవలెనా? జనుల కీశ్వ
రునిగూర్చి బోధించి యొక్కధర్మమార్గోపదేశమునే చేయవలెనా? ఇటు
వంటియాలోచనలు విరామములేక మనస్సునుబట్టి బాధించుచుండఁగా
శేయింబగళ్ళు నిద్రాహారము లెఱుఁగక యతఁడా యడవిలో కాలము
గడుపుచుండెను. ఇప్పు డీవిషయముల నన్నిఁటిని చక్కఁగా నాలో
చించుకొని యొక కార్యాంశమునకు రావలెను. తాను మెస్సయా
నగుదునా? యన్నవిచారము బహుదినము లాతని కాఁకలి తోఁచ
నియ్యకపోయినను, ఆయంశములో నిశ్చతాభిప్రాయ మింకను మన
స్సులో దృఢపడ లేదు. తాను మెస్సయా నగుచునో కానో శోధింప
వలె నన్న తలం పాతని మనస్సులో నడుమునడుమఁ గలుగుచు
వచ్చెను. అంతరాత్మయో నిరంతరము నాతని ధర్మానుసరణము
నకు నుముఖుని జేయుచున్నది; కష్టచింతలో ధర్మమునుండి విముఖునిఁ
జేయఁ జూచుచున్నవి. లోకోత్తరకార్యమున కుత్సహించు మహోపురు
షులచిత్తములో నెన్నికష్టములు వచ్చిను ధర్మపథము నణుమాత్రము
నతిక్రమింప రాదన్న సచ్చింతలు కలిగినప్పు డొకమూల కొన్నిసమ
యములయందు ధర్మము నిమిత్తమయి సర్వసుఖములను ద్యజించి
కష్టము లేల తెచ్చిపెట్టుకొనవలె నన్నదుశ్చింతలుకూడ నుదయిం
చుట వింతకాదుగదా? అట్టి చింతలలో మొదటివానిని దేవతాప్రేర
ణము లనియు, రెండవవానిని పిశాచప్రేరణము లనియు, బుద్ధిమంతు
లాదికాలమునుండియు భావించుచున్నారు. నీ వీశ్వరనియుక్తుఁడ వని
చెప్పి యీశ్వరరాజ్యమును భూమిమీఁద స్థాపన చేయునిమిత్తమై

నీశరీరమును తృణకణమువలె విడువు మని దేవప్రేరిత మైన సద్బుద్ధి ప్రోత్సాహపఱచి యతనికి ధైర్యము చెప్పుచుండఁగా, పిశాచప్రేరిత మైన దుర్బుద్ధి తా నప్పు డప్పుడు నడుమవచ్చి యతని కధైర్యసంశయములు పుట్టించుచు వచ్చెను. అట్టిస్థితిలో తుత్తీడితుఁ డైయున్న యతని కొకప్పుడు "మెస్సు యా కసాధ్యమేదియును లేదని పెద్దలు చెప్పియున్నా రే! నేనే మెస్సయా నైనపక్షమున నాయాఁకలి పోవునట్లుగా నిక్కడి రాళ్ళను రొట్టెలనుగా మార్చఁ బ్రయత్నింతునా?" అన్నబుద్ధి పుట్టి యింతలో "మనుష్యుఁడు రొట్టెలవలననే జీవింపఁగూడదు; ఈశ్వర ముఖమునుండి వచ్చిన వాక్యములవలన జీవింపవలెను." అన్న వేద వాక్యము జ్ఞప్తికి వచ్చి యాతలంపు తొలఁగిపోఁగా నతనికి మరల తన హృదయములో నున్న యీశ్వరాజ్ఞ ననుసరించి తానొక్క ధర్మావలంబమువలననే జీవింపవలె నన్నబుద్ధి పుట్టెను. మఱియొకప్పు డతఁడలసి సొమ్మసిల్లి కన్నులు మూసికొని కునుకుపాట్లలో తాను జెరూసలేము నగరములోని దేవాలయముయొక్క గోపురాగ్రమున నున్నట్లు భావించుకొని యాభావనలోఁ గూడ మెస్సయా చింత మఱచిపోక "నేనే మెస్సయా నైన పక్షమున, దీనిమీఁదినుండి యుఱికినను దేవుఁడు నన్ను క్రిందపడకుండ రక్షింపఁడా!" అనుకొని యాస్థితిలోనే మరల "నీవు నీప్రభువైన యీశ్వరుని శోధింపఁగూడదు" అన్న వేద వాక్యమును స్మరణకుఁ దెచ్చుకొని భగవంతుఁడు తన్ను రక్షించునో లేదో శోధించుటకై యాపదలను బుద్ధిపూర్వకముగా తెచ్చుకోరాదని తన యుద్యమమునుండి మరలుకొనెను. ఇట్టి యాఁకటములోనే యింకొకసారి యతఁడు తాను పర్వతాగ్రమునం దధివసించి చుట్టును గల రాష్ట్రములను జూచుచున్నట్లుగా భావించుకొను చుండఁగా "ఇతరుల పలె నీవు కొంచెము స్వార్థపరుఁడ వయి నిష్కారుణుఁడ వైనపక్షమున

మెన్నయూ భావము వహించి నీ వీకాష్ట్రముల కన్నిటికి రాజ వగుటకు నీశక్తి నుపయోగించుకొనవచ్చును." అని హృదయములో నెవ్వరో చెప్పిన ట్లయ్యెను. అతఁ డామాట వినఁబడగానే తెలివి తెచ్చుకొని "ఇది దుశ్చింత. ఓపిశాచమా! ఇక్కడనుండి తొలఁగిపొమ్ము. వేద ములో చెప్పినట్లు సమస్తవిషయములలోను నేనీశ్వరునే పూజించి సేవింప వలెను. ఉత్తమోత్తమమైన మార్గమునఁ దక్క నన్యవిధమున నేను దేవునికార్యమును జేయ యత్నింపను." అని పలికెను. ఇవియే పిశాచప్రేరణము లైనట్టు గ్రంథములయందు విచిత్రముగా వర్ణింపఁ బడినవి. ఇట్టి హృదయాందోళనములతో నాతని కా యడవియందు నలువది యహోరాత్రములు గడచినవి. ఈప్రకారముగా కర్తవ్య నిశ్చయము గానక నలువది దినములు త్రొక్కటపడిన తరువాత నాతని మనస్సునకు పిశాచప్రేరణము వదలి దేవావేశము కలిగెను. అంతటితో నాతనికి లోపలఁ గల యాందోళనమును సందేహము లును తొలఁగిపోయెను; శాంతియు సంతుష్టియుఁ గల దయి చిత్తము స్వస్థపడెను. అప్పు డతఁడు తాను ధర్మసంస్థాపనార్థ మీశ్వరునిచే నియోగింపఁబడిన మిస్సయా నని మనస్సులో ధ్రువపఱుచుకొని నాఁటినుండి దేశోద్ధారణనిమిత్త మాత్మార్పణము చేయకృతనిశ్చయుఁ డయ్యెను. తనదారి సుగమ మయినది కాదనియు ప్రాణాపాయకరము సహితము కావచ్చు ననియు స్పష్టముగా నెఱిఁగినవాఁ డయ్యును, అతఁ డాక్షణమునుండియు నొకప్పుడును వెను కంజవేయక తాను మార్గదర్శియై నడిపి జనుల నజ్ఞానమునుండియు దుష్కృతి నుండియు, పాపములనుండియు విముక్తులనుజేయ బద్ధకంకణుఁడై సమస్తమునకు నీశ్వరునే నమ్ముకొని కష్టములను సరకు సేయక యీశ్వరసేవ కయి ముందుకు నడవఁ జొచ్చెను. ఇంతవఱకును జీవన్నునుగూర్చి చెప్పినది

సామాన్యపు వఱడంగిగా నున్నప్పటి చరిత్రము; ఇఁక ముందు చెప్పఁబోవునది దేవకార్యమునందు నియుక్తుఁడైన మెస్సయాగా వర్తించెడునప్పటి చరిత్రము. అప్పటి చర్యను బట్టియే జీనస్సునకు మెస్సయాకు పర్యాయపదమైనక్రీస్తను విశేషాభిధానము కలిగినది.

657

నాలవ ప్రకరణము.

జీసస్ మొదట స్నానలమున ధర్మ్మప్రవచనము చేయుట.

జానుబలన జ్ఞానస్నానము పొందుకాలమునకు జీసస్సుప్రాయము దాదాపుగా ముప్పదిసంవత్సరములు. పెక్కుశోధనలకు లోనయి కట్ట కడపట తానే మెస్సయా నన్న పూర్ణవిశ్వాసముతో నరణ్యమునుండి వెడలి వచ్చినతరువాత నతఁడు తనకు జ్ఞానస్నానమును ప్రసాదించి యాశ్వరదాస్యమున కయి యాత్మార్పణము చేయఁ బురికొల్పిన జాను వద్దకు మరలఁ బోయి యాతనిని సందర్శించి ధర్మ్మప్రవచన మారంభిం చుట కయి యాశనివలన ననుజ్ఞ గైకొని యుండవచ్చును. ఆసమా వేశసమయమునుండును జాను మరల తనప్రియశిష్యులతో నితఁడే మెస్సయా యని చెప్పియు నుండవచ్చును. అయినను తామే మెస్స యాల మని యీవఱ కెందరో వీరావేశముచేత బైలుదేఱి నాలుగు దినములు సివములాడి తాము పూనినకార్యభారము ననుమాత్రమును నిర్వహింప శక్తులు కాక కడపట భగ్నమనోరథులయి నామరూప ములు లేకుండ నడఁగిపోవుచు వచ్చుటచేత విన్నజనులుమాత్రము సంశయమనస్కులయి వేగిరవడి తాము మరల నింతలో మోసపోవుట కిష్టము లేనివారయి జీసస్ నిజమైన మెస్సయా యగునో కాఁడో నిర్ధారణము చేయుటకుఁ దగిననిదర్శనములు కనఁబడుటవఱకు నిదమిత్థ మని నిశ్చయింపక వేచి యుండుట కయి పలువు రుద్దేశించుకొని యున్నట్టు తోఁచుచున్నది. అతఁడు జానువద్ద సెలవుగైకొని బయలు దేఱి నదీతీరమున కాలినడకను బోవుచున్నప్పు డంతకుము న్నితఁడే

మెస్సయా యని గురువు తమకుఁ జూపినజానుశిష్యులు కొందఱు జీసస్సును వెంబడించి, అతనితోడఁ గూడ నడవఁజొచ్చిరి. ఇట్లు కొంత దూరము నడచినతరువాత జీసస్ వారిని వెనుక తిరిగి చూచి "మీకుఁ గావలసిన దేమి?" అని యడిగెను. అప్పుడేమి చెప్పుటకును తోఁచక కాఁబోలును వారడిగినదానికి బదులు చెప్పక "స్వామీ! నీ వెక్కడ వసించెదవు?" అని మరల ప్రశ్న వేసిరి. "మీరే వచ్చి చూడుఁడు" అని వారి కుత్తరము చెప్పి తలవంచుకొని యతఁడు మరల యథా పూర్వకముగా నడుచుచుండెను. తదాజ్ఞానుసారముగ వారతని వెంటఁబోయి కొంతకాల మతనితో సహవాసము చేసి తరువాత నతఁడు జానుకంటె తప్పక గొప్పవాఁడని తమమనస్సులలో నిశ్చయము చేసికొనిరి. అతఁడు శాంతస్వభావుఁడగుటవలన మానసోద్రేకమును గలిగించు తీవ్రలక్షణము లేనియు నాతనియందు పొడకట్టకపోవుటచేత క్రొత్తగా చూచువారి కతఁడు సామాన్యమానవుఁడుగానే తోఁచును గాని యితరులకంటె నతనియందు విశేష మేమియు కనఁబడదు. కాని, యతనితోఁ గొంతకాలము పరిచయము చేసి యతనివాక్యము లను వినుచు నతనివర్తనమును గనిపెట్టువారికి మాత్ర మాతని చేష్ట లును మాటలును సమ్మోహజనకము లయి యతనియం దనురాగ మును గౌరవమును గలిగింపక మానవు. ఇట్లతఁడు పూర్వము తన వెంట వచ్చినట్టియు నిప్పుడు క్రొత్తగాఁ జేరినట్టియు పరిమితశిష్య బృందము వెంటనంటి రాఁగా గాలీ దేశములోని స్వస్థానమును గూర్చి ప్రయాణము చేయుచుండెను. మెస్సయావలన జనులు ప్రతీక్షించు చున్నట్లుగా యుద్ధములతోను సేనలతోను తనకుఁ బనిలే దనియు తాను జేయువలసినపని యంతయు తన యుపదేశములచేతను వర్తనముచేతను స్వదేశస్థులకు పరిశుద్ధ మయిన యుత్తమజీవనమార్గ

మును బోధించుటయే యనియు నతఁ డరణ్యములో నున్నప్పుడే నిశ్చయము చేసికొన్నందున, ఆనిశ్చయమునుబట్టి తాను జేయఁదలఁచు కొన్నపనిని తా నెఱిఁగియున్న దేశమునకుఁ బోయి యెఱిఁగియున్న వారిలోనే యారంభించుట యధికప్రయోజనకరముగా నుండు నని భావించుకొని యాయుద్దేశముతోనే స్వదేశాభిముఖుఁ డయ్యెను.

అతఁడు స్వస్థలమును జేరుటకు లోపలనే సకలజనసంక్షోభకర మయిన వైపరీత్య మొకటి సంభవించెను. ఆకస్మికముగా జాను రాజు భటులచేతఁ బట్టుకోఁబడి కారాగృహమునందుఁ బెట్టఁబడె నన్న పిడుగు వంటి దుర్వార్త త్రోవలోనే యతని చెవి సోఁకి కొంత హృదయతాప మును గలిగించెను. అంతేగాని యీ దుఃఖవార్త వజ్రసన్నిభ మైన యాతనిహృదయమును సంచలింపఁజేసి పూనిన పూనికనుండి యాతనిని మరలింపఁగలిగినది కాదు. రాజదండనమునకు పాత్రుఁ డగుట కయి జాను చేసిన యపరాధ మేదియు లేదు; జానుయొక్క ప్రసిద్ధియు జనానురాగకథయు విని, తన ప్రజానురాగబలముచేత నతఁడు ముం దేమయిన జనసంక్షోభమును ప్రేరేచునేమో యన్న భీతిచేత హీరాడ్ ఆంటిపస్ సేనలను బంపి పట్టి తెప్పించి యాతనిని చెఱసాలలోఁ బెట్టించెను. ఘనుఁ డైనయీబోధకుఁ డిప్పుడు రోమనులచేతులలో నున్నందున, ఎప్పుడో యే వేళనో యతఁడు వధింపఁబడుట నిశ్చయము. జనప్రియుఁ డయి ప్రఖ్యాతి గాంచి జనులను తనమార్గమున నడపఁ గల యవస్థ తటస్థించినప్పుడు తనకును నట్టిగతియే పట్టవచ్చునని తీపుపు మనస్సులో నప్పుడే యూహ కలిగెను. అట్టియూహనుబట్టి తనకు ముందు రాఁబోయెడి యీపదలవిషయ మయి [illegible] మును సందేహము పొందనివాఁడయినను, ఆతఁ[illegible] నకు విఘ్నకారణము కాక జాను కారాబద్ధుఁ [illegible]

V. R. NARA MEMORIAL LIBRARY VR NARA DPSI. Acc. No.

పని చేయువారు లేనందునఁ దాను మటింత శీఘ్రముగా పని కారం భింపవలె నన్న ప్రోత్సాహము పుట్టించుటకు హేతు వయ్యెను.

మతాచార్యులదుర్నయములను నిర్భయముగా బయలుపుచ్చుట మొదలగు కొన్నివిషయములలో నొండొరులను బోలి యున్నను, స్వరూప స్వభావములయందును బోధించుటకు స్థలములు మొదలయి నవి యేర్పఱుచుకొనుటయందును బహువిషయములలో జానునకును జీసస్సునకును మిక్కిలి వ్యత్యాసము గలదు. జాను మహోగ్రస్వభా వుఁడు; జీసస్ పరమశాంతస్వభావుఁడు. జాను బిగ్గరగా భీషణకటు నినాదముతో ఘోషించెడువాఁడు; జీసస్ మెల్లగా మృదుమధుర స్వరముతో నుపదేశించువాఁడు. జాను నిస్సంగుఁడయి విశేషకాలము నిర్జన ప్రదేశములయందుఁ గడపుచు వనవాటులలో బోధింప నిచ్ఛ గలవాఁడు. జీసస్ సంగశీలుఁడయి నిరంతరము జనులతోఁ గలసి మెలసి వసించుచు బహుజనాకీర్ణము లయినజనపదములలో బోధింప నభిలాష గలవాఁడు. ఇట్టిస్వభావగుణములతో మొట్టమొదట జీసస్ తాను కొంతకాలము వాసముచేసిన కేవర్నాముగ్రామములో ధర్మ బోధము చేయుట కుపక్రమించెఁ. ఆతనిబోధను వినుటకయి జనులు గుంపులుగుంపులుగా వచ్చి యతనిచుట్టును మూఁగజొచ్చిరి. తాను మెస్సయానని యప్పటి కతఁడు మనస్సులో దృఢముగా నమ్మి యున్నను, తాను జెప్పినదానిని చేసినదానిని పరీక్షించి జనులే గ్రహింపవలెనని కాఁబోలును ముఖ్యు లయినతన పరమాప్తులతో నెవ్వరితోనో దక్క మఱి యెవ్వరితోను జీసస్ను తాను మెస్సయా నని బహిరంగముగాఁ జెప్పలేదు. ఐక్యకంఠముతో నెల్ల వారును తన్ను మెస్సయాను గా గ్రహించి విశ్వసింతు రన్ననమ్మిక యతనికిసహితము లేకయే యుండఁజొచ్చెను. అతఁడు తన్నెప్పుడు చెప్పుకోఁబలసి వచ్చినను

మెస్సయాయని చెప్పుకొకపూర్వము డేనియల్ తనస్వప్న దర్శనములోఁ
జూచిన (యీశ్వరధర్మ్మప్రవచనము చేయు) దేవదూతకుఁ బెట్టిన
"మనుష్యపుత్రుఁ" డన్న పేరును తానుధరించి "నేను" అనుటకు
పర్యాయపదముగా "మనుష్యపుత్రుఁడు" అన్న మాటనే తఱుచుగా
వాడుకు వచ్చెను. మాయయు మర్మము లెఱుఁగక ఋజువర్తనులయి
యతనిబోధను పరిశుద్ధహృదయములతో నమ్మి భక్తితోఁజేరిన పిన్న
వయస్సువారైన స్త్రీపురుషులుమాత్ర మప్పుడప్పుడు "నీవే మెస్సయా"
వని యతనితో ననుచు వచ్చిరి. పూర్వగ్రంథముల ననుసరించి
మెస్సయా డేవిడ్‌సంతతివాఁడయి యుండవలసినందున, మెస్సయా
యనుమాటకు పర్యాయపదముగా వా రాతనిని "డేవిడ్ పుత్రా!"
అనియు పిలుచుచు వచ్చిరి. జీసస్ తాను డేవిడ్‌వంశజుఁడ నన్నవిషయ
మును విశ్వసించినను విశ్వసింపక పోయినను, ఆయర్థమునందు వారట్లు
తన్నుపిలుచుట కామోదించుచు వచ్చెను. అయినను తానుమాత్ర
మతఁడు తన్నా పేరితో నెప్పుడును జెప్పుకొనక మనుష్యపుత్రుఁ డన్న
నామమునే తృప్తితో వహించుచుండెను.

తాను జేసెడిహితబోధమును విశ్వసించి తన్ననుసరించువారు
కొంతకాలమువఱకును కొందఱుమాత్రమే యుందురనియు నతఁడు
మొదటనే దృఢముగా నెఱుఁగును. తనయం దవ్యాజవిశ్వాసము గల
వారికిఁ గొందఱికిమాత్రమే తనసిద్ధాంతములను కూలంకషముగా
బోధపఱచి మనస్సులో దృఢముగా నాటించి తా నాకస్మికముగా
నిహలోకయాత్ర పరిసమాప్తి పొందించి దేహము త్యజింపవలసి
వచ్చినయెడలఁ దానారంభించినపనిని తనయనంతరమున ధైర్యసాహ
సములతో నిర్వహించుటకయి వారిని సమర్థులను జేయవలె ననియే
యాతనిపూనిక. అందుచేత జీసస్ వరమాప్తులుగాను శ్రద్ధాళువులు

గాను నుండెడు కొందఱుప్రియశిష్యులను తనవద్దఁ జేర్చుకొని, సంఘ
మునకు సాముదాయకముగా బోధించునప్పుడు చూప శక్యముగాని
యధికశ్రద్ధతో వారిని శిక్షితులను జేయువలెనని నిశ్చయించుకొనెను.
ఆపనినిమిత్తమై యతఁడు తనబోధనమును వినవచ్చువారిస్వభావ
స్వభావములను నిపుణముగా పరిశీలించుచు, ఎవ్వరిని తన కాంతరంగి
కులనుగాఁ జేర్చుకొనవచ్చునో యెవ్వరిని జేర్చుకోరాదో తనలోఁదా
నాలోచించుకొను చుండెను. ఇట్లాలోచించి కొన్ని నెల లయినతరు
వాత నతఁ డొకనాఁడు గైబీరియస్ సరస్తీరమునందు నడుచుచు తన
బోధము నాలకించు వినవచ్చు చుండెడివారయిన యుపాయకులగు
బెస్తవాండ్రు కొందఱు చేవలు పట్టుచుండఁగాఁ జూచి వారిని చేరఁ
బిలిచి "మీరు నావెంట రండు. నేను మిమ్ము చేవలను గాక మను
ష్యులను పట్టువారినిగాఁ జేసెదను." అని చెప్పఁగానే వారు తత్క్ష
ణమే తమ పడవలను వలలను విడిచి యాతనివెంటఁ బోయిరి. ఈప్రకా
రముగాఁ జేర్చుకొనఁబడిన ముఖ్యశిష్యులనామకథనాదులు యుక్త
స్థలమునందు వివరింపఁబడును. అతఁడు తాను ప్రియశిష్యులనుగాఁ
జేకొన్నవారికి విశేషశ్రద్ధవహించి బోధించినను, సామాన్యముగా
తనవద్దకు వచ్చువారికందఱికిని మానక సర్వకాలములయందును బోధ
చేయుచునే యుండెను. ఆతనిబోధనాశక్తినిబట్టిమాత్రమే కాక రోగు
లను స్వస్థపఱిచెడి యద్భుతశక్తినిబట్టికూడ నాతనిఖ్యాతి శీఘ్రకాల
ములోనే చుట్టుపట్లదేశమునం దంతటను వ్యాపించెను. అందుచేత
చేరువనుండియు దూరమునుండియుఁ గూడ నానూతనబోధకునిబోధ
వినుటకును వ్యాధులను నివారణము చేసికొనుటకును జనులు రాఁ
దొడఁగిరి. గాలిలీదేశమునం దంతటను బయట జెరూసలేమునగరము
పఱుకునుగూడ కొంతకాలములో, నాతనికీర్తి వ్యాపించెను. కొలఁది

సంఖ్య గలయాప్తులతో మొదట జీసస్ కేపర్నాము గ్రామము ప్రవే
శించి ధర్మోపదేశము చేయ నారంభించినను, కొన్ని మాసములు
గడచునప్పటి కతఁ డెక్కడకుఁ బోయినను జను లతనినిగూర్చి యద్భుత
కథలను జెప్పుకొనుచు వెంటఁ బడఁ జొచ్చిరి.

లోకములో జన్మభూమి మెట్టివారికిని ప్రియతమ మైనది కదా!
అతఁ డీప్రకారముగాఁ గొంతకాలము తన కడపటివాసస్థల మైన కేప
ర్నాము గ్రామములో బోధచేసి పేరు పొంది తన జన్మస్థలమును జూడ
వలె నన్న వాంఛపుట్టఁగా బయలుదేఱి త్రోవపొడుగునను గల గ్రామ
ములలో బోధచేయుచు తుద కొకనాఁడు నాజరెత్ గ్రామము ప్రవే
శించెను. అవఱకే యతని కీర్తిలత యాప్రాంతములయందుం దంతట నల్లు
కొనెను., తమ గ్రామములో నుద్భవించినవాఁ డొకఁడు బైలుదేఱి
ప్రవక్త యయి యెల్లయెడలఁ బ్రఖ్యాతి గాంచుచున్నాఁ డని విన్న
మాత్రముననే యెల్లవారికిని సంతోషము పట్టరాకుండునుగదా! అట్టి
వాఁడు తమయం దాదరము గలవాఁ డయి మరల తమ గ్రామము
నకు వచ్చి వాక్సుధాధారలను వెదచల్లఁ బోవుచున్నాఁ డని తెలిసి
కొన్నప్పుడు తదోష్ఠామృతరసపానము చేసి యానందపరవశులము
కావలె నన్న బుద్ధి యెవ్వరి మనస్సులలో నుదయింపకుండును? అది
యతఁడు పుట్టిపెరిగిన స్థల మగుటచేత నాజరెత్తు గ్రామములోనివా
రందఱు నాతనిని చక్కఁగా గుర్తెఱుఁగుదురు; అల్పకాలముక్రిందటనే
స్వగ్రామమును విడిచిపోయిన యతఁ డింతలో నాకస్మికముగా ప్రసిద్ధ
పురుషుఁ డయి మరల స్వజనమును జేరవచ్చుచుండెను. అట్టిస్థితిలో
నామహాపురుషునికి తమ గ్రామము జననస్థానమై ధన్యతగన్న దన్న
గర్వముచేత తద్దార్ఢ్యమానసు లెవ్వ రద్భుత ప్రమోదమగ్న మాన
సులు కాకుందురు? జీసస్ చేసిన యద్భుతచర్యలనుగూర్చి యావఱకే

వినియుండుటచేత నతఁడు తమ యెడల నధికగౌరవానుభాగములు చూపి తమ గ్రామమున మఱింత యధికముగా నత్యద్భుత కార్యములు చేసి తమ్మందఱి సంతోషపెట్టు నని యా గ్రామవాసు లెల్లరు నెదురుచూచుచుండిరి. అందుచేత జీసస్ స్వగ్రామము చేరఁగానే నాజరెత్తుగ్రామనివాసు లందఱు నాతనిఁ జూడవచ్చిరి. "అతిపరిచయాదవజ్ఞా" యను న్యాయముచేత పూర్వపరిచితు లనేకు లతనిని తమవాఁడే యన్న యనాదరభావముతో చులుకఁగా జూచియుందురు. పేరు పెంపు లేని యతని కుటుంబస్థితినిగూర్చి యందఱు నెఱిఁగినవా రగుటచే స్వగ్రామమున నతని కంతగౌరవము కలుగక పోవుట వింతగాదు. ఆతని తల్లిని తోఁబుట్టువులను బావలను కన్నుల యెదుట నిత్యమును జూచుచుండెడివా రతనిని డేవిడ్ రాజవంశజుఁగా నెట్లు భావించి సమ్మానింపగలుగుదురు? ఇతరులమాట యటుండఁగా తుద కతని కుటుంబమువా రే యచ్చట నతనిని ప్రవక్తనుగా నంగీకరింపక ప్రతిపక్షు లయిరి. పూర్వస్నేహితులు పూర్వపరిచయముతోనే యాతని సమీపించి తమ్ము విడిచిపోయిన తరువాత నాతనియందు గలిగిన గొప్ప మార్పును గనిపెట్టలేక పూర్వపుఁరీతినే కుశలప్రశ్నలను వేయఁ జొచ్చిరి; ఎల్లవారును చనవుతో ముందుకు వచ్చి యితర స్థలములలోఁ జూపిన వింతలను దమకుఁ జూపు మని పీడింపఁ జొచ్చిరి. నాఁడు తాను దేవాలయములో నుపదేశము చేయుట కయి యేర్పఱుపఁబడిన సమయము సమీపించకముందే యతఁడు స్వగ్రామవాసులు తన బోధనలయందు భక్తివిశ్వాసములు కలవారు కారనియు తనచేత నేవో యింద్రజాలములు చేయించి వేడుకచూచి యానందింపఁ జూచుచున్నా రనియుఁ దెలిసికొనెను. ఆనఁట కాతనిని జూచి యుండనివారు మాత్రము గౌరవసూచకము లైన శీతలవాక్యములతో

నాతని నాదరించి యభినందించిరి. జీసస్ నాఁడు దేవాలయములో ప్రసంగము చేయఁబోవుచున్నాఁడని యూరంతటను దెలిసినందున, ఉపాసనాసమయమునకు ముందే యచ్చటి చిన్న దేవాలయ మంతయు జనులతోఁ గ్రిక్కిఱిసిపోయెను. సాధారణముగా చదివెడు ప్రార్థనలును ధర్మశాస్త్రవచనములును ముగిసిన తరువాత జీసస్ పూర్వప్రవక్త యైన యిస్సాయాయొక్క గ్రంథములోనుండి "ఈశ్వరుఁడు బీదలకు శుభవార్తలను బోధించుట కయి నన్నభిషిక్తుని జేసినందున, ఈశ్వరుని యాత్మ ననున్నావ్రు డావేశించియున్నది." అన్న వాక్యము నందుకొని యాప్రకరణమును జదివి ముగించి, ఆవిషయమునే తనప్రసంగములో ననువదించి తా నాప్రవక్తల వాక్యము సత్య మగునట్లుగా శుభవార్తను శాంతాత్మ్మలకు బోధించుటకును భగ్నహృదయులను స్వస్థపఱుచుటకును శోకార్తులకు దుఃఖశాంతిచేయుటకును సర్వజనాదరణీయ మైన యాశ్వరవాక్యమును బోధించుటకును వచ్చితిననియు, ఈశ్వరాజ్ఞకందఱును బద్ధులై యెల్లవారల హృదయముల లోను కారుణ్యమే రాజ్యము చేయు కాలము వచ్చినప్పు డెల్లవారును భూతలస్వర్గసుఖము ననుభవింతు రనియు, ఉపన్యసింప నారంభించెను. ఈ ప్రథమవాక్యములు సర్వజనులకును కర్ణరసాయనముగా నున్నందున, దేవాలయములోనివా రందఱు నొండొరుల మొగముల వంకఁ జూచుచు "ఇతఁడు జోసఫ్ కొడుకు కాఁడా? అంతకాలము వఱ్ఱంగిగా నుండి మనలో నివసించినవాఁ డింతలో నిట్లు ప్రసంగింపఁ గలుగు నని యెవ్వ రూహింపఁ గలరు?" అని యతని శ్లాఘింపఁ జొచ్చిరి. ఇట్లీవిధముగాఁ గొంతసేపు ప్రసంగించి తరువాత జీసస్ మఱియొక ధోరణికి దిగెను. అతఁ డక్కడకుఁ బోయిన యుద్దేశము వారిని దిద్ది బాగుచేయవలె ననియే కాని ప్రియవాక్యములు పలికి వారిని సంతోషపెట్టి

తాను మెప్పొందవలయునని కాదు. ప్రసంగము యొక్క పూర్వభాగ
మునం దతడు సూచించిన భావిమహోత్కృష్టదశను పొందుటకు
మార్గ మేదో యిప్పుడు విశదముగా దెలువవలెను. సాధ్యమైన
యెడల వా రేయేవిషయములలో తప్పుదారులు త్రొక్కుచున్నారో,
ఆలోచించుటకును వర్తించుటకును యోగ్యము లైన యుత్తమ
మార్గములేవో, చూపి వారికన్నులు తెఱచుట కర్తవ్య మైనందున,
నతఁ డిప్పుడు తనవారు సంస్కరించుకోవలసిన దోషములను జూపి
సంస్కారమార్గముల నుపదేశింప నారంభించెను. మార్గోపదేష్ట
యయి తాను ధర్మముల నుపదేశించు చున్నప్పుడు తన పూర్వాపరి
చితులు తన్ను స్వోత్కర్షము చూప వచ్చిన గర్వితునిగా భావించి
యసూయాగ్రస్తు లయి యున్నారని వారి చేష్టావికారాదులవలనఁ
గనిపెట్టి, లేశమును సంశయపడక యతఁడు తా నప్పు డుపదేశించు
చున్న వాక్యములు తనవి కావనియు తనలోపల నుండి పలికించు
చున్న యీశ్వరునివాక్యము లనియు దృఢముగా భావించి మఱింత
యుత్సాహముతో "మీస్థితి చూడఁగా 'వైద్యుఁడా! ముందు
నీరోగము నీవు కుదుర్చుకొమ్ము' అన్న పూర్వపుసామెత నాకు స్మరణకు
వచ్చుచున్నది." అని చెప్ప నారంభించెను. జనుల కాతని మాటలు
రుచింపక పోఁగా వారు "ఇంట గెలచి రచ్చ గెలువుము. ముందుగా
నీపని నిక్కడ నారంభింపుము. నీమహిమల నిక్కడఁ జూపి, తన్మూల
మున వచ్చెడి కీర్తి నీవాసస్థల మయిన యిక్కడ నుండి యితరస్థలము
లకు వ్యాపించునట్లు చేయుము." అని యేవేవో ప్రలపింపసాగిరి.
ఆమాటల కతఁడు కోపపడక వినయముతోను విచారముతోను, తాను
మహిమలను జూపి ప్రజలను వినోదపెట్టుట కయి యక్కడకు
రాలే దని తెలియఁ బలికెను. అతఁ డప్పుడు జేయుచుండిన యుప

దేశము దైవాదేశప్రేరిత మనియు నీశ్వరసందేశ మనియు వారి మన స్సులలో నాదరము కలుగలేదు. ప్రవక్తగా నతఁడు స్వగ్రామమున కేదో గొప్పతేనమును సమకూర్ప వలయు నన్నచింత దప్ప వారి మనస్సుల కన్యచింత తోఁచలేదు. అట్టి సమయములో జీసస్ మరల నందుకొని "ఒక్క స్వదేశమునఁ దక్క మఱియెక్కడను ప్రవక్త గౌరవము పొందకుండఁడు" అన్న లోకోక్తి నుదాహరించి, ఈశ్వర రాజ్యమును భూమిమీఁద వ్యాపింపఁ జేయుటకంటె స్వోత్కృష్టతను వారెక్కువగాఁ జూచుకొనుచున్నంతవఱకును తాను వారిలోఁ గలిసి పనిచేయుయత్నించుట వ్యర్థమని వారికిఁజూపఁ బ్రయత్నించెను. అతఁడు నిర్భయముగాఁ బలుకుమాటలు వారి కంతకంతకు కర్ణకఠోరము లుగాఁ దోఁచుచురాఁగా "ఇతఁడు మనలను తిరస్కరించుచున్నాఁడు" అని యొకఁడును, "ఇతఁడు మనకు ప్రవక్త కాఁడు. మనలను యోగ్యు లనుగా భావింపఁడు" మనకొఱకు మహిమల నేమియుఁ జూపఁడు" అని మఱియొకఁడును, పలువురు పలువిధములఁ దమలోఁదాము గుస గుస లాడఁ జొచ్చిరి. జీసస్ వారి మనోగతములను ముఖచేష్టాది వికృ తులను స్పష్టముగాఁ జూచియు జంకక యెప్పటిధోరణినే ప్రసంగము సాగించి యీశ్వరదృష్టియందు తనవారును పరులు నన్న భేదము లేక యందఱును సమానులే యనియు తానునట్లే కులీనతా సంపన్న త్వాదు లగు ప్రాపంచిక చంచలౌన్నత్యములను పాటింపక తన్నెవ్వరు జ్ఞాన కాంక్షులును దీనులు నయి సమీపింతురో వారి చిత్తోపశాంతి కయి ముందుగా శ్రద్ధ చేయువలయు ననియుఁ జూపుట కయి కొన్ని యుప మానములు తెచ్చెను. ఆ యుపమానములు తమ్మె లాఘవపఱి చుట కయి తేఁబడిన నవి దురహంకారు లయిన యా నాజరెత్తు గ్రామ నాసులు భావించుకొన్నంతన వారి చెప్పుల కవి దుస్సహాము

లయ్యేను. అంతేకాక యింతవఱకును తమయూర తక్కువగా బ్రతి
కిన వడ్లంగి కొడుకు వచ్చి తమవర్తనములో తప్పులు పట్టి తమకు
మార్గోపదేశకుఁడు కానా యన్న దురభిమాన మొకటికూడ వారి
మనస్సులను బట్టుకొనెను. ఈ రెండు కారణముల చేతను వారు
ప్రారంభదశలో నాతని ప్రసంగము కలిగించిన సంతోషమును గింతో
షమును మఱచి యాతని యుపదేశమును వినకొల్లక యుల్లసాగించిరి.
ఈవిధముగా నంతకంతకు మూర్ఖత్వము ముదురఁగా వారు దొమ్మి
కేఁగి దౌర్జన్యమున కారంభించి కాఱు లఱచుచు నాతనిమీఁదఁబడి
ఆతనిని దేవాలయములో నుండియు గ్రామములో నుండియు దూర
ముగా నీడ్చుకొని పోయి యొక కొండకొన కెక్కించి యక్కడనుండి
తలక్రిందుగా క్రిందికిఁ పడద్రోచి చంపఁ జూచిరి. అతఁడప్పటికిని
వారి కోపమునకు భయపడక కఠినోక్తులాడక శాంతచిత్తుఁడయి
నిశ్చలుఁడయి యూరకుండెను. పర్వతాగ్రమునకుఁ గొనిపోవుకోపల
వారి కోపము కొంతశాంతి పొందినందుననో, ప్రాణదానమునుసహి
తము వేఁడక నిశ్చలచిత్తముతో మౌనమూనియున్న యాతని యూకా
రమును జూచిన మీఁదట జాలిపుట్టినందుననో, వా రాతనిని క్రిందికిఁ
బడఁద్రోయక కొండకొమ్మున దిగవిడిచి తమదారిని తాము గ్రామ
మునకుఁ బోయిరి. జీసస్ స్వగ్రామమునకుఁ బోవుట కిదియే కడసారి.

స్వగ్రామమున జరగిన యీయవమానము వలన నతఁడణు
మాత్రమును నిరుత్సాహుఁడు కాక గొప్పవారి కెవ్వరికి నిటువంటి
గతి పట్టుట వింతేగా దనియు నెటువంటి ప్రవక్తయు స్వదేశమున
గౌరవింపఁబడఁడనియుఁ దలఁచుచు మరల కేపర్నాము గ్రామము
నకు వచ్చి, అక్కడజనులు తన కనుకూలురుగా నున్నందున వారికి
తన మతమును బోధించుచు, చుట్టుపట్టులగ్రామములకు మతప్రచా

రము నిమిత్తమయి సంచారములు చేయుచు వచ్చెను. ఆ కాలములో విశ్రమవాసర మయిన యొక్క శనివారము నాఁడు దక్క జను లొక్కచోట కూడఁబడుట సంభవింపకుండెను. ఆ దివసమునందు మాత్రము పల్లెలలోనివా రందఱును తమ గ్రామదేవాలయములో నొక్కటిగా చేరుచుండిరి. అది సమయముగాఁ జేసికొని జీసస్ విశ్రమ వాసర మైన యాదినమునందే దేవాలయములో జనులకు పూర్వ సిద్ధాంతములతోడి పాటుగా తన నూతన సిద్ధాంతములను సహితము బోధింప సాగెను; ఉపాసనాసమయమునం దతఁడు దేవాలయము లకుఁ బోయి ప్రార్థనలుముగిసిన తరువాత తాను లేచి నిలువఁబడి యర్చకుఁడు చదువుట కయి ధర్మవాక్యములు గల ప్రమాణగ్రంథ మును చేతి కియ్యఁగా నందుండి కొంతభాగము చదివి యందులో నుండియే యొకవాక్యమును తనప్రసంగమునకు మూలసూత్రము నుగా గ్రహించి తన యభిప్రాయములను వివరించి చెప్పుచువచ్చెను. అతఁడు చెప్పిన యభిప్రాయములను ఖండించి వివాదపడుట కయి యాపల్లెలయందు విద్వాంసు లయిన ఫారిసీలు లేరు. అందుచేత జెరూసలేము నగరమునందు వలె నతనిబోధన కక్కడ ప్రతిపక్ష మేమియు లేనందున, జనులాతఁడు చెప్పినది యెల్లను శ్రద్ధతో విను చుండిరి. అతఁడు చెప్పెడు పరిశుద్ధనీతివాక్యములు దుష్పాండిత్యదూషి తములు కానివారి నిర్మలమనస్సుల కాహ్లాదజనకము లయి వారిహృద యాంతరాళమున శిలాక్షరములవలె నాటుకొను చుండెను. అతి పాండిత్యము చేతను స్థలవేదాంతశ్రవణములచేతను వారిబుద్ధులు చెడ నందున, కపట మెఱుఁగక సత్యసంధు లయి సరళవర్తను లయి యున్నయాజానపదులు సామాన్యజ్ఞానమువలనఁ దెలిసిఁగో దగిన యాశఁ దుపదేశించు సత్యముల నాదరించి యాతని బుద్ధికి

నీతికి నద్భుతపడి యాతనిని ప్రోత్సాహపఱుచుచు వచ్చిరి. అతఁడు చెప్పినదెల్లను చక్కగాఁ జెప్పెననియు, అతఁడు చెప్పినవి మంచి హేతువులనియు వారిమనస్సులకు తోఁచుచుండెను. వారడిగిన కఠిన ప్రశ్నలకు సహిత మతఁ డనాయాసముగా సముత్తరములను జెప్పి వారికి సంశయనివారణముఁ జేయఁగలుగు చుండెను. అందుచేత నా ప్రాంతములయందలి గ్రామ్యప్రజల కాతనిమాటలయం దంతకంతకు ప్రమాణబుద్ధి దినదినప్రవర్ధమాన మగుచువచ్చెను. తనయందు జనులకు విశ్వాసము హెచ్చినకొలఁదిని స్వాభావికముగా జీసస్సునకును తనయందు విశ్వాసము హెచ్చెను. ఆతఁ డిట్లు మొట్టమొదట ముఖ్యముగా కేపర్నాముగ్రామములోనే బోధచేయుచు వచ్చినను కొన్ని మాసములు గడచినతరువాత నితరస్థలములకును తఱుచుగాఁబోయి బోధచేయ నారంభించెను. సమీపస్థలములనుండి యాతని యుపదేశములను వినవచ్చినవా రనేకులు తృప్తులయి యాతనిని తమ గ్రామములకు వచ్చి తమమిత్రులకును బంధువులకునుగూడ బోధ చేయుమని వేఁడుచువచ్చిరి. కొంతప్రసిద్ధి కలిగినతరువాత నతఁ డెక్క డకుఁ బోయినను జనులు మూఁకలుకూడి యాతని ధర్మోపన్యాసము లను వినుటకయి విఱుగఁబడుచు వచ్చుటయే కాక, ఉపన్యాసావసాన మున ప్రతిగ్రామమునను తమవ్యాధులను కుదుర్చుకొనుట కయి రోగులుసహితము ప్రోఁగగుచు వచ్చిరి. ఆరంభదశయం దతఁడు బోధ చేయుచు వచ్చినప్రదేశమే మిక్కిలి పరిమిత మయినది. జైదీరియన్ సరస్సుసమీపమునఁ గొన్ని యామడలదూరమువఱకుమాత్రమే యతఁ డప్పుడు సంచారము చేయుచువచ్చెను. అతఁడు మొట్టమొదట తన ధర్మబీజమును నాటినది యీచిన్నభాగమునందే. అతఁడు ప్రప్రథమ మున చేయుచు వచ్చిన వ్యవశబోధము తన ముఖ్యస్థాన మయిన కేప

ర్నాముగ్రామమునకు చుట్టువట్ల గడియు రెండుగడియల ప్రయాణములో నున్న నాలుగయిదు పల్లెలలోమాత్రమే అతడు తనయూరికి మిక్కిలి చేరువగా నున్నట్టియు హేరాడ్ అంటిపస్‌కు వాసస్థాన మయినట్టియు సైబీరియస్ పట్టణమునకైనను పోయి యుండినట్లు కనఁబడదు. అంత రంగమును బాధించు మనోవ్యాధులను మాత్రమే కాక బహిరంగ మును బాధించు దేహవ్యాధులను గూడ స్వస్థపఱుచు సామర్థ్యము కలవాఁడగుటచేత, జీసస్ చేయు ధర్మబోధను వినుటకును వ్యాధు లను కుదుర్చుకొనుటకును గూడ జను లాతనియొద్దకు వచ్చుచుండి రని యీవఱకే సూచింపఁబడెను గదా! కేపర్నాముగ్రామమునకు మరల వచ్చినతరువాత నొక విశ్రాంతిదినమునం దతఁడు దేవాలయములో బోధించుచుండఁగా విన వచ్చిన జనసమూహములో నుండి మతిచెద రినవాఁ డొకఁడు లేచి నిలువఁబడి భయంకరముగా రణగుణధ్వనితో నఱవ మొదలుపెట్టెను. అల్లకల్లోలముగా నుండి మతవిషయకమయిన యుద్రేకము దేశమునం దంతటను వ్యాపించియున్న సమయములు యందు మతావేశముచేత దుర్బలచిత్తు లనేకులు చిత్తచాంచల్యము పొందుట వింత కాదుగదా! గ్రామదేవతల యుత్సవదినములయందు తప్పటల చప్పుడు చెవిని బడిన మాత్రముచేత మతోన్మాదముచేత నొడళ్ళుమఱచి యమ్మవారు పూనిన దని యన్యక్తప్రలాపములు చేయుచు సివములాడువారిని మన మీ దేశమునందు సహిత మెందఱిని చూచుచున్నాము కాము? ఇట్టిస్థితిలో దేశమందంతటను సంక్షోభము కలిగియున్నప్పు డట్టివారొక్కఁడనయిన బయలు దేఱవచ్చును. అప్పుడు జీసస్సు బోధించుచుండిన వాక్యములు చెవిని బడినప్పు డాకస్మికముగా నొకనికి మతిభ్రమణము కలుగుటనుబట్టి చూడఁగా నాతనివాక్యములు వినువారల హృదయముల కెక్కి వారి నానందపరవశాత్మలను జేయు

శక్తికల వయి యుండినట్లు స్పష్టమగుచున్నది. ఆకాలమునం దొక్క మతిభ్రమణమునుమాత్రమేకాక యనేకము లయిన యితర వ్యాధులను సహితము పిశాచావేశముల కారోపించుట సర్వసామాన్య మయి యుండెను. అక్కడిమాట యేల? ఈకాలమునం దీదేశములో నహి తము తమయింట నెవ్వరికయిన వ్యాధి సంభవించినప్పుడు పామరులు సాధారణముగా వైద్యునియింటికిఁ బరుగెత్తుటకంటె ముందుగా సోడె డెప్పువానియింటికిఁ బరుగెత్తుచున్నారు. ఆకాలమునం దక్కడ నెల్ల వారికిని దయ్యములయందు గట్టినమ్మక ముండుటనుబట్టి మతిభ్రాంతు లయి యున్నవారుసహితము కొన్ని సమయములయందు తమ్ము పిశా చములు వూనిన వని తలఁచుకొని యసంబద్ధప్రలాపములు చేయు చుండుట గలదు. ఆవిధముగానే యీ ధర్మోపన్యాససమయమునం దొకఁడు మతోన్మాదముజేతఁ దన్నుమఱచి తా నేదో దయ్యమయి నట్లు భావన చేసికొని "నాజరెత్తుగ్రామవాసి వయిన జీసస్సా! నీతో మా కేమిపని? నీవు మమ్ము నాశనముచేయ వచ్చినావా? ఓ పరి శుద్ధుఁడ వయిన దేవునివాఁడా నిన్ను నే నెఱుఁగుదును." అని ప్రల పింప నారంభించెను. దయ్యములు గూర్చిన నమ్మక మీకాలపువారి కందఱికిని నున్నట్లే జీసస్సునకుఁగూడ నుండియుండవచ్చును. అప్పుడు జీస స్సాచిత్తోన్మత్తునివంక జెప్పనాల్పక తేఱిపాఱఁ జూచి 'ఇఁక మాటాడక వానిని విడిచి వెలుపలికి రా" అని గంభీరస్వరముతో నాజ్ఞాపించెను. పిడుగుపడునట్లు పలికిన యీయాజ్ఞావచనము లాతని వాఁడిచూపులతోడఁ గూడ సునిశితబాణములవలెఁ దిన్నగాఁ బోయి యీభ్రాంతాత్మని హృదయమూలమునందు నాటిగా నాటి వానినో రడఁచినందున, తత్క్షణమే వాఁడు ప్రేలుట మాని యూరకుండెను. అంతవఱ కూరక వదరుచున్నవాఁడాతని యాజ్ఞాబలముచేత నొక్క

సారిగా వాకట్టు కట్టినట్టు మూకీభావమువహించుట చూచి యచ్చట
నున్న వా రందఱును వరమాశ్చర్యరసమగ్నమానసులయి యతనికి
దయ్యములను వదల్చఁ గలయమ్మభత్రభావ మున్నదని భావించిరి.
ఇంద్రియోద్రేకముచేత మనస్సులను తాము వశపఱుచుకో లేక
యస్వస్థమానసులై యుండువారిని స్వస్థపఱిచెడి యద్భుతసామర్థ్య
మాతనివాక్యములయం దుండినదనుటకు సందేహము లేదు. జీసస్సున
కొకవేళ పిశాచావేశమునందు నమ్మకము లేక యుండినయెడల,
అస్వస్థచిత్తునికి మరల చిత్తస్వాస్థ్యము కలిగించుట కది తప్ప
వేఱుమార్గము లేదని భావించి యయినను నతఁ డప్పుడు వానిలోఁపల
నున్న పిశాచము నాజ్ఞాపించినట్లుగాఁ బలికి యుండవచ్చును. ఈకార్య
ముతో నతఁడు పిశాచముల నుచ్చాటనముచేయు ననియు సమస్త
వ్యాధులను నివారణము చేయు ననియులోకప్రవాద మొకటి మొట్ట
మొదట చుట్టుపట్ల పుట్టి క్రమక్రమముగా దేశమునం దంతటను
వ్యాపించెను. జీసస్ మనోవ్యాధులను శరీర వ్యాధులనుగూడ నివా
రించె నని తచ్ఛిష్యులచే ననేకాద్భుత కథలు చెప్పఁబడి యున్నవి.
బహువిషయములలో దేహారోగ్యము మనస్థితి ననుసరించియే
యుండును. చింతలచేతను భయములచేతను మనో వ్యాధులచేతను జనులు
తఱుచుగా దేహవ్యాధులొంది బాధ వడుదురు; అట్టి మనోవ్యాకుల
తలు తొలఁగుటచేతను రోగము కుదురు నన్నదృఢవిశ్వాసముచేతను
గూడ బహురోగములు మందు లేకయే నివారణము లగును. శీతల
మధురోక్తులతో కర్ణరసాయనముగా ధర్మోపన్యాసములు చేసి జనుల
హృదయములను కరఁగించి చల్లపఱిచెడి హృత్తాపహారకమైన సమ్మో
హనశక్తి జీసస్సుచద్ద నున్నందున, తన్మూలమున ననేకులకు మన
స్స్వాస్థ్యమును కలిగించి రోగనివారణముచేసి యుండుట యాశ్చర్య

కరము గాదు. అయినను జీసస్సు చేసిన రోగనివారణమును గూర్చిన యద్భుతకథాంకురము లనేకములు కర్ణాకర్ణిని వ్యాపించినప్పుడు క్రొత్త క్రొత్తకొమ్మలువేసి పెంపొంది లేఖకులవద్దకు వచ్చినప్పటికే చిలవల తోను పలవలతోను మొదటఁజూచినవారు గుఱుతు పట్టలేనంత మహా వృక్షములుగా పెరిగి యుండవచ్చును. ఈమానసిక సృష్టియం దెంత సత్య మున్నదో యిప్పుడు నిశ్చయముగాఁ జెప్పఁజాలముగాని యా కాలపువారిలో మాటమాత్రముచేతనే మంత్రించి నట్లు రోగ నివారణము చేయఁగల యమానుషశక్తి జీసస్సునకుఁ గలదన్న నమ్మక ముండిన దనుటకు సందేహములేదు. దీనికొక్క నిదర్శనమును వినుఁడు. జీసస్సొకనాఁడు కేపర్నాములోగ్రామములో నొకయింట ధర్మ బోధము చేయుచుండఁగా నాతని వాక్యామృతపానము చేయవలె నన్న కౌతుహలముతో నూఱులకొలఁది జనులు మూఁగి పైకినుక చల్లినఁ గ్రిందరాలనంత దట్టముగా నిల్లంతటను గ్రిక్కిఱిసి యుండిరి.

ఆతని రోగనివారణకథలను విన్నవారు నలుగు రా సమయము నందు పార్శ్వవాయువుచేత బాధ పడుచున్నయొకరోగిని మంచము మీఁద మోచుకొని యాయింటిద్వారముకడకు వచ్చిరి. తీర్థప్రజవలె మూఁగియున్న యా జనులను తొలఁగఁద్రోచి లోపలికిఁబోవుట దుర్ఘట మగుటచేతను ప్రసంగమును ముగించి జీస స్సింవలికి వచ్చువఱకును వేచి యుండునంత సహనము లేక యత్యాతురులై యుండుటచేతను తామే యాతని ముందుగా సందర్శించి స్వస్థులుకావలె నన్న వేగిరపాటు చేతను వెలుపలినుండి నిచ్చెన వేసికొని యింటి నడికొప్పుమీఁదికి వా రారోగితో నెక్కి యేలాగుననో యింటికప్పు కొంత తొలఁగించి దారిచేసి యాసందునుండి త్రాళ్ళుకట్టి యారోగిని మెల్లగా జీసస్సు



కూర్చున్న చోటికి దింపిరి. ఈప్రకారముగా నడుమవచ్చి తన ప్రసం
గమునకు విఘ్నము గలగించినందున కెంత మనస్తాపము కలవాఁ
డైనను, రోగికిని రోగిబంధువులకును దనయందుఁ గల విశ్వాసమున
కదుర్భుతపడి తననిమిత్తమై వారంత శ్రమపడి రోగిని తన పాదముల
కడఁ జేర్చినందున కయి జాలిపూని యత్యాతురుఁడై తన వంక నపే
క్షతో దీనముగాఁ జూచుచున్నరోగివంక శీతల దృష్టితోఁ జూచి యేసున్న

నీపాపములు క్షమింపఁ బడినవి" అని తానే పాపక్షమాధికారియైన ట్లధికారవాక్యమొకటి పలికెను. ఆకాలమునందు యూదు లంద ఱును రోగములు పాపఫలము లని నమ్మియుండిరి. ఆరోగినహితము దేవునియెడలఁ దానేదోయపచారము చేసియుండుటచేత దేవుఁడా పాపమునకు శిక్షగాఁ దనకారోగమును గలుగఁ జేసెనని నమ్మి యుండెను. జీసస్ పాపమునకు ఫలముగా రోగములు వచ్చునని నమ్మి నను నమ్మకపోయినను, అట్టి నమ్మకము గల రోగి కతివేగముగా హృదయశాంతిని ధైర్యమును గలిగించుట కామాటదక్క మఱి యేదియు కార్యకరముగా నుండ దని యెఱిఁగినవాఁడై వానితో నీపాపములు క్షమింపఁబడిన వని పలికెను. ఆమాటలు విని యక్కడ నున్నవారిలోఁ గొందఱు "పాపముల క్షమించుటకు మనుష్యుఁ డెంతటి వాఁడు! దేవుఁ డొక్కఁడే యీపని చేయఁగలవాఁడు. దేవుఁ డనవల సినమాటలు తా ననుట దోషముకాదా!" అని తమలోఁ దా మను కొని యొండొరుల మొగములవంకఁ జూచుకొనుచుండఁగా జీస స్సాఁడకనిపెట్టి నమయోచితబుద్ధికలవాఁ డగుటచేత లేశమాత్రమును పంశయింపక తా ననవాక్యములో నొక్క యక్షరమైనను మరలించు కోక తాను భగవత్ప్రేరణమువలనఁ బనిచేయుచున్నట్లు మనస్సులో సంపూర్ణ విశ్వాసము గలవాఁడై యుండుటచేత ధైర్యముతో "నేనీ వాక్యములను దేవునియాజ్ఞచేతఁ బలుకుచున్నా ననియు, నేను జెప్పుడిదానిలోను జేసెడుదానిలోను సర్వములోను దేవునిచేతనే నడపఁబడుచున్నా ననియు, మీకే తెలిసికోఁ గలరు" అని పలికి రోగివంకఁ దిరిగి "లే. నీమెత్తనెత్తుకొని నీయింటికి నడువు" అని యధి కారస్వరముతో నాజ్ఞాపించెను. అమాటలతో వాఁడు చివాలునలేచి తన బట్టలు పట్టుకొని యెల్లవారు నద్భుతపడునట్లుగా నడిచిపోయెను.

మానసికములైన పాపరోగములనే రూపుమాపఁగల యద్భుత సామర్థ్యము గల మహాపురుషునకు శరీరరుజలను బోఁగొట్టఁగలశక్తి యున్న దన్న హేతువుచేత నూతనమహిమరాదుగాని యొక్కయాతని విషయమున దేవుఁ డేర్పఱిచిన స్థిరము లైన వస్తుధర్మములు మాఱిన వనుమాట మాత్రము విశ్వాసపాత్రము కాదు. ఐనను బయిని బేరొక్కన్నరీతి యుత్సాహవాక్యములవలనను రోగులమనస్సులలో నట్టి వాక్యములు కలిగించిన ధైర్యవిశ్వాసముల వలనను రోగు లనేకు లాతనిమాటమాత్రమున స్వస్థతను బొందియుందురు.

అయిదవ ప్రకరణము.

....o0o....

పాపులయెడఁ జూపిన యాదరము, సర్వస్తీరప్రవచనము.

జీసస్ క్రైబీరియస్ సర్వస్తీరమునం దున్న కేపర్నాము మొద
లైన గ్రామములలో ప్రవచనము చేయుచుండిన కాలమునందు జను
లాతఁడు బోధించిన దంతయు గ్రహింపఁ గలిగినను లేకపోయినను
చెప్పినది వినుటకు మాత్రము గుంపులు గుంపులుగా వచ్చి విని యానం
దించుచు నాతఁడు చెప్పినదానిలో నేదైనఁ దా మావఱకు నమ్మిన
దానికి విరుద్ధముగా నున్నయెడల కుపితులయి యనిష్టమును సూచిం
చుచునుండిరి. సాధారణముగా జనులు లఘుమనస్కులు; లఘుమనస్సు
లెప్పుడును దురభిమానభూయిష్టములు. అందుచేత వారు తమ మన
స్సులు ద్వేషముతోను దుశ్చింతలతోను పూరితము లయి యున్నను,
పండితనామములు ధరించి శిష్టులుగా పరిగణింపఁబడువారు విధించిన
బాహ్యకర్మలను మాఱక నిత్యమును యథావిధిగా ననుష్ఠించుచు
వచ్చినపట్టున సమస్తమును వానితో పరిశుద్ధము లగునని నమ్మి
యుండిరి. ఉదారచిత్తుఁ డైన జీసస్సు బోధించెడి సర్వజన సమాదరణీ
యము లైన యుత్తమధర్మముల తత్త్వమును గ్రహించి యనుష్ఠించు
టకుఁ గావలసినంత జ్ఞానతేజస్సు వారిహృదయములలో లేదు. అందు
చేతఁ దమలో నేర్పడియున్న యల్పవ్యవస్థల నతిక్రమించిన గురు
ధర్మము లన్నియు వారి దృష్టి కనర్థదాయకములుగానే తోచుచు
వచ్చెను. లోకములో సదా సందుగొందులలో నుండమరఁగిన ఘూక
ములు సూర్యతేజస్సువలని ప్రయోజనమును బొంద నేరక యావెలుఁతు
రనర్థదాయక మని భావించుకొను లాగుననే యుక్తాయుక్త విమర్శ
లేక చిరకాలమునుండి యజ్ఞానాంధకారమునం దడఁగియుండి యుంధ

ప్రాయముగా పూర్వాచారపరిరక్షిత మైన యజ్ఞానమే మంచి దని యెంచి యనుసరింప నలవాటుపడిన జనులును నతఁ డాకస్మికముగాఁ జూపిన నూతనసత్య తేజస్సును జ్ఞాననేత్రమును దెఱచి సువిచారపూర్వ కముగాఁ గనుగొని దానివలనిలాభమును బొందఁజాలక యది. దోష దూషిత మని మీఁదిమిక్కిలి ద్వేషింపఁ జొచ్చిరి. అట్టిస్థితిలో జనుల యజ్ఞానమునే యాధారపఱుచుకొని యుదరపోషణము చేసికొనుచు తమ ఘనతను కాపాడుకొనుచుండు మతాచార్యులు జీసస్సు చేయు బోధమును మఱింత యధికముగా ద్వేషించుట వింతకాదు గదా! ఫారిసీలును లేఖకులును జీసస్సును ముఖ్యముగా ద్వేషించువారుగా నుండిరి. పుణ్యపాపములవిషయ మయి వారిలోఁ గల యవిచారమూల కములైన వ్యవస్థలను జీసస్సు పాటింపనివాఁ డయి ఖండించుచు వచ్చి నందున వారి కతనిపే రన్నఁ దల కంటగించు చుండెను.

ఆదేశమునందు బాటసారులు మొదలయినవారినుండి సుంకము తండెడిసుంకరు లనఁబడెడు రాజకీయోద్యోగులు కలరు. వారిలో నధిక సంఖ్యాకులు ప్రజలను పీడించి లంచములు గొనెడు దుష్టాత్ము లయినను ధర్మచింత గలమంచివారు సహిత మనేకు లుండిరి. జన కంటకు లయియున్న రోమనులవద్ద కొలువు కుదిరినంచునను జనుల వలన నిర్బంధముగా వన్నులు గొనువా రయినందునను యూదులు వారి నందఱిని మంచివారిని చెడ్డవారిని గూడ నేకరీతిగా ద్వేషించి వారిని మహాపాతకులనుగా భావించుచు, తమలోనివాఁ డెవ్వఁడయినఁ గ్రొత్తఁగా బోయి యట్టికొలువు కుదిరినపక్షమున వానిని కులములో నుండి బహిష్కరించి వానితో భోజన ప్రతిభోజనములను సాధ్య మయి నంతవఱకు సంభాషణమును గూడ వర్జించి దేవాలయములకును తమ యిండ్లకును వాని రానీయకుండిరి. ఫారిసీలు తెల్లనివస్త్రమును ధరించి

కూరుచుండి మన దేశమునందలి ఛాందసులవలెనే యితరులు తమ దావునకు వచ్చినను స్పర్శదోషమువలన తా మంటుపడుదు మని యెంచుకొని లోకములో తామే పరిశుద్ధుల మను నహంభావము కలవా.రయి యుండిరి. మనబ్రాహ్మణులు పంచముని తాకినప్పటివలె వారిలో నెవ్వ రయినను పతితసంస్పర్శనమును చేసినపక్షమున, పతితు లను తాకినదోషమునకయి మతాచార్యులు వారికి ప్రాయిశ్చిత్తములు విధించి వారివలన దక్షిణలు గయికొనుచుండిరి. అందుచేత ఫారిసీ లెవ్వరును పాపులుగా పరిగణింపఁబడుచుండిన సుంకరిజాతివారిలోఁ గలిసి భుజించుట మహాపాతక మని యెంచి వారికి సాధ్య మయినంత దూరముగా తొలఁగుచుండిరి. జీసస్సునకు సుంకరులయందు ఫారిసీలకుఁ గలిగినట్టి భేదభావము లేదు. వారు మంచివా రయినపక్షమున వారి నితరులకంటెఁ దక్కువగాఁ జూడవలసిన న్యాయము లేదని యెంచి యతఁడు సుంకరులతో యథేచ్ఛముగాఁ గలసిమెలసి తిరుగుచుండెను. అంతేకాక వారిలోని చెడ్డవారిని సహితము ద్వేషించి విడనాడక ధర్మోపదేశములచేత వారిని మంచిమార్గమునకు త్రిప్పుట కయి ప్రయ త్నించు చుండెను.

ఒకనాఁడు వీధిలో నడుచుచుండఁగా జీసస్సునకు మార్గస్థుల వలన సుంకము గ్రహించుచు మాథ్యూ యను సుంకరి యొకఁడు కనఁ బడెను. జీసస్తని నావఱ కెఱిఁగినవాఁ డగుటచేతను, తన బోధన లను వినవచ్చినప్పు డతని శ్రద్ధాభక్తులను నద్వర్తనమును కనిపెట్టిన వాఁ డగుటచేతను, అతనిని తన శిష్యులలో నొక్కనిగా స్వీకరింప వలె నని యుద్దేశించి 'నావెంటరమ్ము' అని పిలిచెను. ఆమాటల యర్థమును గ్రహించి యాపిలువుతోడనే మాథ్యూ తన పనిని విడిచి పెట్టి యెంతమాత్రమును సందేహింపక యాతని వెంట నడిచెను.

పండితమండలిలోఁజేరి ప్రవక్తగా నెన్నఁబడు చున్నజీన స్సంతటి వాఁడు వచ్చి సామాన్యముగా పండితకులము వారిచే నెల్లవారిచే ననాదరింపఁబడుచు ద్వేషింపఁబడు చున్నతన్నుఁ దనవెంట రమ్మని పిలువగానే మాథ్యూ తన కది గొప్ప యనుగ్రహముగాఁ దలఁచు కొని, యీదేశమునందు శ్రోత్రియుఁ డయిన బ్రాహ్మణోత్తముఁ డొకఁడు కడజాతివారిని తనసరసకు రమ్మని పిలిచియాదరించినప్పుడు వాఁడు తన్ను ధన్యునిగా భావించుకొని యెంతసంతోషపడునో యంత పరమానందమును బొందియుండును. మాథ్యూ బీదవాఁడు కాఁడు. గృహమును ధనసంపత్తియు నాప్తవర్గమును గలసంపన్న గృహస్థుఁడు. అందుచేత నతఁ డాదినమునఁ తన బంధుమిత్రులను విందునకుఁ బిలిచి వారి కాతని బోధనమును విని యానందింపఁ గలుగు భాగ్యమును గలిగింపఁజేయుట కయి జీసస్సును గూడ నాఁడు తనయింటికి భోజనమునకు రమ్మని ప్రార్థించెను. అతఁ డాయాహ్వానము నంగీకరించి యాతని బంధుబృందముతో గలిసి సహపంక్తిని భుజించుట కయి యాతని యింటికిఁ బోయెను. ఈవార్తకొంచెము సేపటిలోనే గ్రామమునం దంతటను వ్యాపింపఁగా, జీసస్ పతితు లయిన సుంకరులతోఁ గలిసి భోజనము చేయుచున్నాఁ డని యెల్లవాగును గుంపులుగూడి వీధివీధిని వింతవింతగాఁ జెప్పుకొనసాగిరి. రాబ్బీ (పండితుఁడు) అనఁబడు వాఁడు పోయి పతితు లయిన సుంకరులయింట భోజనము చేయుటకంటె ఘోర మైనయకార్యకరణ మొకటి యప్పుడు ఫారిసీల దృష్టికిఁ గనఁ బడలేదు. అందుచేత ఫారిసీలలోఁ గొందఱు బయలుదేఱి యతఁడు చేయుచున్న కానికార్యమును ప్రత్యక్షముగా చూచి పట్టుకోవలె నన్న తలంపుతో తిన్నఁగా మాథ్యూయింటివంక నడచిరి. అప్పు డాయింట వాకిట జీసస్సుయొక్క శిష్యులుకొందఱు కనఁబడఁగా ఫారిసీలు వారిని

జూచి "మీగురువు చెడిపోయినవారితోఁ గలిసి లోపల కానికూడు తిను చుండఁగా మీరు సిగ్గులేక చూచుచు వాకిట నిలుచున్నారా!" యని దూషింపనారంభింపఁగానే మాటమీఁద మాట పెరిగి యాశిష్యులకును వారికిని వాక్కలహము సంభవించెను. ఆనంక్షోభమును లోపలినుండి విని కలహకారణమును గ్రహించి జీసస్ వెంటనే యీవలకు వచ్చి ఫారిసీలనుఁ జూచి "అన్నలారా! నన్ను విందుకుఁ బిలిచిన వీరు పాపాత్ములని మీ రెన్నుచున్నారు గదా! పాపములనుండి రక్షింపఁబడవలసినవా రయిన పాపాత్ములయొద్దఁ గాక నే నుండవలసినచోటు మతియొక్కఁడ నుండును! దగ్గఱఁ బోయినయెడల రోగము తన్నంటు నని భయపడి రోగులయిండ్లకుఁ బోవక వైద్యుఁడారోగ్యదశలో నున్నవారి యిండ్లకుమాత్రమే పోవుచున్నపక్షమున మీరాతని విషయమున నేమని తలచెదరు!" అని సమయోచితముగాఁ బలికి వారిని నిరుత్తరులను జేసి యప్పటికిఁ బంపివేసెను.

పతితులుగా భావింపఁబడెడు సుంకరులు మొదలయినవారి యెడల కనికరము చూపి యిటువంటి కార్యములను జేయుచు వచ్చుట చేత ఫారిసీలు జీసస్సును "పతితసంసర్గి" యని పిలుచుచు నతనిని గూడ పతితతుల్యునిగానే గణనచేయుచుండిరి. అతని కీబిరుదాంకమును ప్రసాదించుట కింకొకసంగతి యీవలకే తటస్థించెను. దానిని గొన్ని వాక్యము లయినతరువాతఁ దెలిపెదను. ఫారిసీలు చిరకాలాచారమహిమచేత తమ్మధికులనుగా భావించుకొనుచు తా మల్పులని యెంచువారితోడినంసర్గమునుమాని, యట్టివారియెడలఁ గఠిన హృదయులయి వారికష్టములకు జాలిపడకుండుట కలవాటుపడియుండిరి. మతోన్మాదమువలనఁ దామే నిష్ఠాపరుల మనుకొని గర్వపడుచు తమలోఁ గలనిరర్థకకర్మల నాచరించినంతమాత్రమునఁ బరులను

భ్రష్టులనుగా నెన్నుచు నట్టివారు నేత్రగోచరు లయినమాత్రమున తమముందఱి యన్నమును పాఱవేసి లేచిపోవునంతటి దుస్థితికి వచ్చిన మానవనామధారులలో తోడి మానవులయెడల దయాదాక్షిణ్యము లెట్లుండును? ఇటువంటి మతోన్మాదుల మూర్ఖవర్తనములవలన కష్ట ములపా లగుచున్న నిర్దోషులను సమబుద్ధితోఁ జూచుచు తక్కినవారి తోడిపాటుగా వారినాదరించుచు వారితోఁగలసి భోజనప్రతిభోజన ములు చేయుచు వారుకూడ దేవునికిఁ ప్రేమాస్పదు లయినబిడ్డలేయని లోకమునకుఁ జూపుట జీసస్సున కభిమతము. ఈపారమార్థిక బుద్ధిచేత జీసస్ నిష్కారణముగా జనలాఘవము ననుభవించు చున్నవారితోను నిజముగానే పాపముచేసి బాగుపడఁ దలఁచినవారితోను కలిసి భోజి నము చేసినందున కయి యితరులు తప్పుపట్టుచు వచ్చినప్పుడెల్ల నతఁడు సమయమునకుఁదగినట్లుగా "చెడినవారికేకాని బాగున్నవారికి వైద్యు నితోఁబనిలేదు" అనియు, "మనుష్యపుత్రుఁడు పతితులను పావనులను జేయుటకే వచ్చినాఁడు" అనియు, నూఱుగొఱ్ఱెలు గలవాఁడు వానిలో నొక్కటి తప్పిపోయిన పక్షమున మంచిగొఱ్ఱెలను తొంబదితొమ్మి దింటిని విడిచి దారితప్పిన యాయొక్కగొఱ్ఱెను వెదకుకొనుచుఁబోయి యుదికంటఁబడఁగానే సంతోషించి దానిని మూపున వహించి కొనిరా కుండునా?" అనియు, చెప్పి తప్పించుకొనుచు వచ్చెను. జీస స్సనిధ ముగా నాపద్బాంధవుఁ డయి దీనులై కష్టపడుచున్నవారి కందఱికిని దయారసపూరిత మైనహృదయముతో సర్వవిధముల తోడుపడుచుం డును. నిజముగా చెడు తెరువులయందుఁ బ్రవేశించి పాపఫలముగా మనోవేదనల ననుభవించుచుండువారికిఁ గాక వేఱెవ్వరికి రక్షణమార్గ ము ను పరులతోడ్పాటును విశేషముగాఁ గావలసియుండును! ఫారిసీలు పాపపీడితులను తారసించినప్పు డొక్కయుత్సాహావాహ్య మయినను

బలుకక మీఁదిమిక్కిలి చేసికొన్న దనుభవింపవలసిన దే యని యెంగ
తాళిచేయుచు దేవుడు దీనరక్షకుఁడనియు పతితపావనుఁడనియు గణిం
పక యతఁడుపాపులను ద్వేషింది పాపులతో సంభాషించినచో దమ్మునుఁ
గూడ శిక్షించు ననిభ్రమపడి దూరదూరములఁ దొలఁగుచుండఁగా,
జీస స్నట్లుభావింపక యుక్తసమయమున తోడువడి దారిచూపిన
యెడల దుర్మార్గులలో నసేకులు సన్మార్గముంబట్టి బాగుపడుదురనియు
వారి చెడుదారులనుండి రక్షింపఁ బాటుపడుటయే యీశ్వరప్రీతికర
మైనయుత్తమధర్మ మనియు నమ్మి సర్వవిధములచేతను పాపులను
దుర్గతినుండి తప్పించుటకై మాచుచుండెను. ఫారిసీలవలెఁ దిరస్కార
బుద్ధితో జూడక తమ్మాదరించి మంచిమాటలతో పాపోపశమనము
నకు వలయుసదోభ్ధలు చేయుచుండుటవలన దీనజనులు జీసస్సునందు
భక్తికలవారయి యాతనిమాటలయందు పరమ విశ్వాస ముంచి
తమయెడలఁ జూపిన సద్భావమును దలఁచి యాతనిని దేవునివలె
బూజింపఁజొచ్చిరి.

ఒకనాఁ డొకగ్రామములో సిమన్ అనుపేరు గల యొకఫారిసీ
తనగృహామునకు జీసస్సును భోజనమునకుఁ బిలుచుట తటస్థించెను.
ఆఫారిసీ యతనియందుఁ గలభక్తిచేత నాతనిని విందుకుఁ బిలువఁ
బోయినను, ఏదో మిషమీఁదఁ దనయింటికి రప్పించి వచ్చినవు డతనికి
దియ్యనిమాటలతో బోధించి బుద్ధిచెప్పి దేశాచారవిరుద్ధ మైనమార్గ
మునుండి యతనిని మరలింపవలె నన్నకుటిలబుద్ధితోఁ బిలిచియుండును.
మతాచార్యులు ప్రతిదేశమునందును మాయలమారులై దేశక్షేమము
నపేక్షించి తమమార్గములకుఁ బ్రతికూలముగా వని చేయువారిని వారి
పూనికనుండి మరల్చుట కయి నయమున భయమున బతిమాలియు
బెదరించియు నానావిధమాయోపాయములు పన్నుదురు. అందుచేత

సిమన్ తన యింటికి జీసస్ వచ్చినప్పుడు దేశాచారమునుబట్టి యతిథికిఁ జేయవలసిన యర్ఘ్యపాద్యాదులైన యాతిథేయసత్కారములను వేనిని జేయక యాతని నుపేక్షతోఁ జూచెను. అయినను జీసస్సతఁడు తన యెడలఁ జూపినయనాదరభావమును పాటింపక చావడిలో బల్లమీఁద గూరుచుండి తనమాటలను వినవలె నని యక్కడకు వచ్చినవారితో సంభాషించుచుండెను. అందఱును మాటలసందడిలో నున్నప్పుడు చూడవచ్చినవారితోఁ గలిసి చెడిపోయినయువతి యొకతె లోపలికి వచ్చి బల్లమీఁదఁ గూరుచుండి యున్నజీసస్సుయొక్క పాదములచెంత క్రిందఁ గూరుచుండెను. ఆకులట నాఁటియుదయమున జీసస్సు చేసిన బోధను విని పరితాపపడి తనదుశ్చరిత్రమును విడిచి యతనిపాదము లాశ్రయించి యిఁకముందు మంచిదారిని నడువ నేర్చుకోవలెనని మన స్సులో నిశ్చయము చేసికొనెను. అతఁడుత్సాహవాక్యములు వలికి నాఁటిప్రాతఃకాలమున నెంతటి పాపాత్ములకును రక్షణమార్గము కల దని యాశ్వాసించినందున, పాపవర్తనమునం దగిలి యున్న యాయబల తనహృదయమునం దూఱటను బొంది యాతనిసన్నిధానమునకుఁ బోయి పాదసేవ చేసి తదనుగ్రహమువలనఁ దన్నంటి యున్న పాప పాశములను త్రెంపుకొని ముక్తురాలయి కృతార్థతఁ బొందవలె ననన్నయపేక్షతో నచ్చటికి సాహసము చేసి వచ్చి నిర్భయముగా పెద్దమనుష్యులనడుమను గూరుచుండి బాష్పధారలతో నాతని చరణముల కభిషేకము చేయుచుండెను. మొట్టమొదట సిమన్ యొక్క సేవకు లెవ్వరైనను జూచి యుండినయెడల, ఆస్త్రీ నప్పుడు లోపలికి రానిచ్చి యుండరు. ఎల్లవారును ప్రసంగశ్రవణములో ముసిఁగి యున్యమును మఱచి యున్నసమయములో నాకాంత మెల్లఁగా లోపల చొరఁబడి మొదట నాతనిపాదములవద్ద నిలుచుండి తనపాప

ములను దలఁచుకొని దుఃఖించి క్షణకాలము తనవేఁడికన్నీటితో నాతనిపాదములు తడిపి, తనదీర్ఘశిరోజములు నేల జీరాడునట్లుగా తరువాత మోకారించుకొని కూరుచుండి, తనపాలిటి వేల్పువలె వచ్చితనకు చిత్తశాంతిని గలిగించిన యాఘునుని పాదారవిందములకుఁ దాను వచ్చినప్పుడు తెచ్చిన సుగంధద్రవ్యమును రాచి సంతోషపారవశ్యము చేత నచ్చట నెవ్వరున్నారో మఱచి యాతనిపాదములమీఁద వ్రాలి నమస్కారము చేసి యడుగులు ముద్దుపెట్టుకొనఁ జొచ్చెను. అప్పుడక్కడ నున్నవారందఱును దానిచేష్టలు చూచి విస్మయపడిరి. ఇతరులు తన్ను కోపదృష్టితోఁ జూచుచున్నారని తెలిసికొన్న తోడనే యాచేడియ సిగ్గుచేతను భీతిచేతను వడఁకుచు నావలికి లేచిపోఁ జూచెను. గాని యింతలో నభయహస్తము చూపి జీసస్ దానినచ్చటనే యుండ నియమించెను. తోడనే కోపతిరస్కారములు చూపుచుఱుకుఁజూపులతో సిమన్ తనవంకఁజూడఁగా ఆవ్యభిచారిణిని దన్ను తాఁకనిచ్చి నందునకై యతఁడు తనమీఁదకోపము వహించియున్నాఁడని తెలిసికొని యందుమూలమున నతని కొక్క హితము చెప్పఁదలఁచి జీసస్ సిమనును బిలిచి "ఓ యీ! నినొ్నక్కమాట యడుగవలెనని యున్నది అడుగవచ్చునా!" అని పలికెను. "నీకేమి యడుగవలెనని యున్నదో యడుగు" అని సిమన్ తృణీకారమును జూపుస్వరముతో బదులు పలికెను. "ఒకానొకమనుష్యుని కిద్దఱుబుణస్థు లుండిరి. వారిలో నొకఁ డేనూఱురూకలును రెండవవాఁ డేబదిరూకలును బుణపడి యుండిరి. వారాయప్పుతీర్చుటకు శక్తులుగాక పరితాపపడుచుండఁగా, బుణప్రదాత కరుణించి వారిని క్షమించి యిరువురను బుణమునుండి విముక్తులను జేసెను. ఆయిరువురిలో నెవ్వఁ డాతనియెడల నధికకృతజ్ఞత గలవాఁడయి యుండవలెను!"

అని జీసస్ ప్రశ్న వేసెను. ఎవ్వఁ డొక్కువ ఋణవడియుండి మఱియొ
బడెనో వాఁడే యొక్కువకృతజ్ఞతఁ జూపవలెను." అని సిమన్ ఉత్తర
మిచ్చెను. "నీవు చెప్పినది సత్యము" అని యతనితోఁ బలికి జీస
స్సంతట ఆస్త్రీని జూపి "ఓయీ! ఈస్త్రీని జూచితివా? నీయింటికి వచ్చిన
యతిథికి నీవు పాదోదకము నియ్యకపోయితిని, యీయువతి నన్ను
వెదకుకొనుచు వచ్చి తన కన్నీటితో నాయడుగులు కడిగినది. నీవు
నాశిరస్సుపై గంధసారము ప్రోక్షింపకపోయితిని, ఇది నాపాదముల
పై ప్రోక్షించినది. దీని పాపములు క్షమింపఁబడినవి. ఎవ్వరివి స్వల్ప
పాపములు క్షమింపఁబడునో వారు తక్కువభక్తి చూపుదురు. ఎవ్వరి
వధికపాపము·లు క్షమింపఁబడునో వా రెక్కువ భక్తి చూపుదురు.
ఈ కామిని చేసినపాపము లధికము కాఁబట్టి యీయింతి యధికభక్తిని
జూపుచున్నది." అని పలికి యాస్త్రీవంకఁ దిరిగి "ఓ కాంతా! నీ పాప
ములు క్షమింపఁబడినవి" అనెను. ఆమాటలు చెవినిఁ బడగానే
వెనుక రోగిని గూర్చి యతిఁ డీమాట లన్నప్పుడు పుట్టినట్లుగానే
యక్కడ నున్నవారిలో నివ్వఱను గొప్పకలకల మొక్కటి పుట్టెను.
వారిలోఁ గొందఱు లేచి "పాపులను క్షమించుట కితఁ డెవ్వఁడు?"
అని బిగ్గరగా నఱవఁ జొచ్చిరి. జీసస్ వారిమాటలను సరకుగొనక
"ఓ యబలా! నీవిశ్వాసము నిన్ను రక్షించినది. ఇఁక నీవు నిర్విచార
ముగా బొమ్ము." అని యాస్త్రీ నక్కడనుండి మెల్లఁగా బంపివేసెను.
చేసినపాపమున కావిధముగా ననుతాపపడినప్పు డీశ్వరుఁ డామె పాప
ములను తప్పక క్షమించు నన్న పూర్ణవిశ్వాసముతోఁ నతఁ డవ్వఁ డా
మాటలు పలికి యుండును. ఇతరు లందఱును హేన్యముతోఁ జూచెడి
చెడిపోయిన పడఁతి యెడల నతఁడు చూపిన యాదరమును దయయు
సర్వజనశ్లాఘాపాత్రములుగా నున్నవి. క్రూరాచార కళంకితము కాని

యాతనిని నిర్మలదృష్టి కాకులటయు దయనీయ మయిన యీశ్వరుని బిడ్డగానే గనఁబడెను. తన జీవితమును నిర్భాగ్య మయిన దానినిగాఁ జేసిన కుమార్గమునుండి తప్పించుకొని యీవలఁ బడఁగలిగెనా యా పడుచును తక్కిన యీశ్వరుని బిడ్డలవలెనే పరిశుద్ధజీవనము కలదయి మరల సుఖ మనుభవింపవచ్చును. ఆ మందభాగ్యురాలు హేయ మైన తన ప్రస్తుత జీవనము విడిచి బాగుపడఁ గోరియున్న దనియు, దుష్పథమునుండి మరల నీతిపథము పట్టఁగలుగుటకై తన యుత్సాహ వచనములును సాహాయ్యమును గొంచెము కావలసియున్న వనియు, ఎఱిఁగి పయిని జెప్పిన వాక్యములు పలికి జీస స్సాతోడ్పాటును జేసి యాయంగనను పాపమునుండి విముక్తురాలిని జేసెను.

పైని జెప్పినట్లు జీసస్సు చేసెడు బోధనలవలనను, మతాచార్యుల లోపముల నెత్తి జనులకు చూపుచుండుటవలనను, మతాచార్యులు సత్కార్యము లని భావించుచుండెడి యనావశ్యకాచారములను పాటింపకపోవుటవలనను, ఫారసీలకును లేఖకులకును జీసస్ మీఁద ద్వేషము కలిగెను. అందుచేత వారు జీసస్ వర్తనమునందు తప్పులు వెదక నారంభించిరి. ఏకాదశినాఁడు వైష్ణవులు మొదలైనవా రీదేశ ములో నుపవాసములు చేయునట్లె యాదేశమునందును లోపల నెన్ని యకృత్యములు చేసినను పైకి భక్తులవలె నటించుచు విశ్రాంతి దిన మునందు నిరాహారులై యుండుట జనులలో నాచారముగా నుండెను. ఆత్మశుద్ధిలేని యటువంటి బాహ్యాచారమువలనఁ బ్రయోజనము లేదని యెఱిఁగినవాఁడై జీసస్ తనశిష్యులకు విశ్రాంతిదినములలో యథేచ్ఛ ముగా భోజనము చేయవచ్చునని యనుజ్ఞ యిచ్చెను. వారట్లు చేయుట చూచి ఫారిసీ లాతనిశిష్యులు మహాపాతకము చేయుచున్నట్లు భావించి విశ్రాంతిదినమున భుజించుచున్నా రని వారియం దొక దోషా

రోషణము చేయఁజొచ్చిరి. ఈప్రతివక్షుల యాక్షేపణములను బంధు వులయింట వివాహము జరుగుచున్న యొకానొక దినమునందు విని యొక్కడకు వచ్చినవారితో జీసస్ "నిష్కారణముగా నిరాహారులై దేహశోషణము చేసికొని వా రేల బాధపడవలెను? పెండ్లికొడుకు చెంత నుండఁగాఁ బెండ్లికొడుకువంకవా రెక్కడనైనఁ బస్తుందురా? నేను చెంతనున్న కాలము వీరికి సంతోషసమయము. ఈనంతోషదిన ములలో వీ రేల తిండిలేక మాడి సంతాపము తెచ్చిపెట్టుకోవలెను? నేను వీరి నెడఁబాసినప్పు డాహారమును వర్జించి దుఃఖింపవలసిన కాలము ముందు వచ్చును" అని సముచితముగా సమాధానము చెప్పెను. ప్రతియుక్తిగానక ఫారిసీలప్పటికి నిరుత్తరులయిరి. తమ ప్రయత్నములను మానక జీసస్ యొక్కయు శిష్యులయొక్కయు వర్తన మును రహస్యముగా పరిశీలించి వచ్చి తమతోఁ జెప్పుటకయి వేగుల వారిని నియమించిరి. గూఢముగాఁ బోయి చారు లెంతనిపుణముగాఁ బరీక్షించినను దేశాచారవిరుద్ధముగా నడచిన కొన్ని యల్పాంశములు దక్క వారి కితరదోషము లేవియుఁ గనఁబడలేదు. ఆపైని వారు ఫారి సీలవద్దకుఁ బోయి యొకనాఁ డాతనిశిష్యులు విశ్రాంతిదినమున నొక్క పొలములో గోధుమకంకులు విఱుచుకొని తిని విశ్రాంతినియమము నకు భంగము కలిగించి రనియు, మఱియొక విశ్రాంతిదినమున జీసస్ వెట్టివాని కొకనికి చికిత్స చేసి స్వస్థచిత్తునిగాఁ జేసె ననియు, ఇటు వంటి మహాదోషములను మాత్రమే కొన్నిటి నేకరువు పెట్టిరి. ఆమహా పండితు లట్టి యల్పాంశములనే మహాదోషములనుగా నెంచి గోరం తలు కొండంతలు చేసి జనులకు దుర్బోధలు చేసి ద్వేషము పురికొల్పి మతాచారములను మీఱి నడుచు పతితులవాక్యములు వినవలదని జనులను జీసస్ యొక్క ధర్మోపన్యాసములనుండి విముఖులను జేయఁ

బాటువడిరికాని వారికృషి యంతగా సఫలము కాలేదు. అయినను పూర్వాచార పరాయణు లగువా రనేకు లాతని బోధనలను వినుట పాప మని యాతనివద్దకుఁ బోవకుండిరి. విశ్రాంతిదినమున రోగిని స్వస్థపఱుచుట దోషము కాదనియు, విశ్రాంతిదినమున తనయొద్దకు తెగులు వచ్చినపక్షమున నెట్టిమందమతి యైనను మందువేయక యుపేక్ష చేయునా యనియు, తెవులుపడిన పశువునకు మందువేయు సంశయిం పక తోడి మానవుఁడు రోగపడినప్పుడు చికిత్సచేయక యూరకున్నచో మనుష్యుని మృగముకంటెను నీచముగా భావించుట కాదా యనియు, జీసస్ వారిని సమాధానపఱుపఁ జూచెనుగాని మూఢ్యావేశదూషి తము లయి యున్నవారి మనస్సుల కాయుక్తి లణుమాత్రమును రుచించినవి కావు.

జీసస్ బోధించుదానిని జనులు పరమాదరముతో వినుచు వచ్చినను, చెప్పిన దాని పరమార్థమును గ్రహించువారుమాత్రము వారిలో నల్పసంఖ్యాకులుగానే యుండిరి. తానుబోధించెడు ధర్మము లను కథలరూపమునఁ జెప్పునప్పుడు జను లధికాదరము కలవా రగుచు వచ్చుట కనిపెట్టి, తరువాత జీసస్ తన యుపదేశములను సాధారణముగా కథలరూపమునఁ జేయ నారంభించెను. తనయుపదేశ మును వినుట కయి యొకనాఁడు కేపర్నాముగ్రామములో జను లధికముగా మూఁగినప్పు డతఁడు వారిని వెంటఁగొని గైబీరియాసరస్తీ రమునకుఁ బోయి, అందఱికిని వినఁబడునట్లుగా నిలిచి ప్రసంగింపఁ దగిన యున్నతస్థాన మొడ్డున లేకపోవుటచేత నీటిలో నున్న యొకపడవపై నెక్కి మూఁకలు వచ్చి మీఁదఁబడకుండునట్లు శిష్యులచే తెడ్లు వేయించి దానిని నీటిలోఁ గొంతలోఁతునకుఁ గొనిపోయి యానావమీఁద నిలు చుండి జీసస్ జనులవంకఁ దిరిగి యుచ్చైస్స్వనముతో నుపన్యానము

చేయ నారంభించెను. ఆసమయమునందు తల పైకెత్తి చూచినప్పుడు పొలములలోను కొండప్రక్కలను విత్తనములు చల్లుచున్న కాపు లత నికి దృష్టిగోచరు లగుటచేత నుపన్యాసారంభసమయమునం దాతని మనస్సున కీయుపమానము తోఁచి యుండవచ్చును.

"వినుఁడు కర్షకుఁడొకఁడు విత్తనమును చల్లుచుఁ బోయెను. ఆవిత్తనములలోఁగొన్ని కాళ్ళత్రొక్కుడులచేత గట్టిపడిన దారులలో పడగా, పక్షులువచ్చి యేఱుకొని వానిని భక్షించిపోయెను. కొన్ని మన్నంతగా లేనిరాతినేలమీఁదఁబడెను. అవివెంటనే మొలకలెత్తెను గాని సూర్యుఁడు వేఁడియెండలు కాయుఁగా నడుగున లోఁతుగా వేరు దిగకపోవుటచేత నల్పకాలములోనే యెండిపోయెను. కొన్నిగింజలు ముండ్లచెట్లలోఁ బడెను. ముండ్లచెట్లుక్రమ్మికొని వానిని తలయెత్త నీయకపోవుటచేత నవి నిష్ఫలములయ్యెను. కొన్ని మంచినేలనుబడెను. అవిమాత్రమే విస్తారముగా పంట నిచ్చెను."

అతఁడప్పుడు జనుల కింకొకయుపమానము చెప్పెను:—

"ఈశ్వరరాజ్యము తన పొలములో మంచిగోదుమలను జల్లుకొన్న మనుజునివంటిది. ఆతని శత్రువు రాత్రివేళ వచ్చి యాగోదుమలలో కలుపుగింజలు చల్లిపోయెను. అందుచేత గోదు మలు పెరుగ నారంభించినప్పుడు గోదుమ మొక్కలలోఁ గలిసి కలుపు మొక్కలనేకములు బైలుదేఱెను. అది చూచి పనివాండ్రుపోయి క్షేత్రస్వామితోఁ జెప్పి 'యాకలుపు మొక్కలు పెఱికివేయవలెనా' యని యడిగిరి. 'కలుపు మొక్కలను బెఱుకునప్పుడు గోదుమ మొక్కలు కూడ పెల్లగిల్లునుగాన, అట్లుచేయక కోతకాలము వచ్చువఱకును రెంటినిగూడఁ బెరుగనిండు. అప్పుడు మనము గోదుములనుండి కలుపును విడఁదీసి కాల్చివేయుదము' అని యుజమానుఁడు చెప్పెను."

అప్పుడు జీసస్ జనులకుఁ దెలిపినమఱియొకకథ యిది:—
"ఈశ్వరరాజ్యము గింజ లన్నిటిలోను మిక్కిలి చిన్నదైన మట్టిగింజ వంటిది. అయినను పెరిగినప్పు డది మహావృక్షమగునుగానఁ బక్షులు వచ్చి దానికొమ్మలమీఁద గూండ్లు కట్టుకొనును."

అతఁ డిట్టివే యింకను గథ లనేకములు చెప్పెను. ఇట్టియుప మానములను గౌతమబుద్ధుఁడు జనుల కుపదేశించినట్లు బౌద్ధమత గ్రంథములలోఁ బెక్కులుదాహరింపఁబడి యున్నవి. ఆకాలమునం దాదేశముననుండిన యెస్సీనులు బౌద్ధమతసిద్ధాంతములను గొంతవఱ కవలంబించినవారనియు, తన్మూలమున జీస స్సిట్టికథలను విని నీతు లను జనులమనస్సులలో దృఢముగా నాటుకొనునట్లు చేయుట కిట్టి యుపమానము లత్యంతోపయుక్తములని యెంచి కథలమూలమున ధర్మోపదేశములు చేయుచు వచ్చెననియు, కొందఱు తలఁచు చున్నారుం. అవి యెట్టివయినను జీసస్ చెప్పిన యీమనోహరము లయిన యుపమానములయొక్క ఫలితార్థమును జనులు చక్కఁగా గ్రహించినట్లు కనఁబడదుం. ఆతనిశిష్యులుసహితము కొందఱు వాని తాత్పర్యమును గ్రహింపనేరక ప్రసంగము ముగిసినతరువాత నాతని వద్దకుఁబోయి యిట్టికథల నేల చెప్పితిరనియు వానిభావ మేమనియు నడిగిరి. జనులమనస్సులలో నీశ్వరరాజ్యమునుగూర్చిన సత్యములు మస్థిరముగా లగ్నము లగునట్లు చేయుటకయి యుపమానరూపమున నుపదేశించితి ననిచెప్పి, "కర్షకుఁ డనఁగా ధర్మబీజములను జనుల హృదయసీమలలో వెదఁజల్లు బైలుదేఱువాఁడుం. కొందఱిహృదయము లణఁగద్రొక్కినమార్గము లంత కఠినముగా నుండును. భక్త్యావేశ మును బురికొల్పుమాట లక్కడఁ బడునుగాని వేరు నాటుకొనక మిండే దుశ్చింతలు పైఁబడి వాని మనస్థాలము చేసివేయును.

కొందఱిమనస్సులు చెడ్డవి కాకపోయినను రాతినేలలవలె దుర్బలము లును నిస్సారములు నయి గంభీరములు కాక యుండును. అట్టివారు సత్యమును సంతోషపూర్వకముగా స్వీకరించి యప్పటికి దాని ననుస రింప నిశ్చయించుకొందురుగాని ధైర్యమును సహానశక్తియు లేనివా రగుటచేత వారి యుత్తమసంకల్పము లన్నియు నల్పకాలములోనే రూపుమాసిపోవును. తోటలలో ముండ్లును బొదలు నుండునట్లు కొందఱిమనస్సులు ప్రాపంచిక చింతలతోను కాంక్షలతోను నిండి యుండును. సత్యవచనాంకురము లచ్చట నాటుకొని కొంతకాలము వర్ధిల్లునుగాని పనికిమాలినకంటకములు మఱింత వేగముగాఁ బెఱిగి క్రమ్మికొని యందు సత్ఫలములు కలుగకుండఁ జేయును. అయినను గొన్ని మంచిబీజము లెల్లప్పుడును విశ్వాసము గలసుదృఢము లయిన శుద్ధహృదయములలోఁ బడి యేపుగాఁ బెరిగి శాంతిసంతోషఫలముల నమితముగా నిచ్చును." అని వివరించి తెలిపెను. జీస స్సెప్పుడును ద న్ననుసరించువారు సంఖ్య కధికముగా నుండవలెనని కోరక తాను జేసెడియుపదేశములను నిశ్చలబుద్ధితో నమ్మి యనుసరించువారు కొందఱైనను జాలుదురని యెంచి యిందుఁ గడపటఁ జెప్పఁబడిన వారిరీతి వారిని జేర్చి వారిమూలమున లోకమున కమేయోపకార మును జేయఁ దలపోయు చుండెను.

ఆకాలమునందు జను లందఱును మెస్సయా వచ్చి దుష్టసంహా రము చేసి దేశమునంతను మంచివారిపాలు చేయునని నమ్మి యుండిరి. దేశములో ఘోరయుద్ధము జరిగెడుపక్షమున చెడ్డవారుమాత్రమే కాక మంచివారుసహితము మడియక మాన రని యతఁడు నిశ్చయ ముగా నెఱుఁగును. అందుచేత నతఁ డది మనస్సులో నుంచుకొని గోదుమ మొక్కలను కొన్నిటిన్నైనఁ బెల్లగింపకుండఁ గలుపు మొక్కల

నన్నిటిని బూర్ణముగా దీసివేయుట సాధ్యము కాదని యుపమానము చెప్పి, దుష్టు లందఱు నొక్కసారిగా నశ్వాదండనను బొందఁజాల రనియు, అందుచేత శిష్టు లయినవారు లోకములో సర్వమును దమ యిష్టానుసారముగానే నడచు నని యెప్పుడును భావింపఁగూడ దనియు, దుష్టులు కొంతకాలము వర్ధిల్లుచున్నట్లు కనఁబడుచున్నను తొందర పడక తమ కర్మము లయినఫలములను బొందుటకయి తాలిమితో యుక్తకాలము వచ్చువఱకును వేచి యుండవలె ననియు, జనులకుఁ బోధించుట కయి యీరెండవకథను జీస స్సప్పుడు చెప్పెను.

ఈశ్వరరాజ్య మంతయు లోకములో నొక్కపెట్టున వ్యాపించి యెల్లవారికి నొక్కసారిగా సత్ఫలములు కలుగునని యెదురుచూచు చున్నజనులభ్రమను నివారణము చేసి, అతినూక్ష్మ మైనవటబీజము మొలకయెత్తి క్రమక్రమముగా వృద్ధి నొంది మహావృక్ష మయి యసంఖ్యము లయినపక్షుల కాశ్రయ మగునట్లే యీశ్వరరాజ్యము సహిత మల్పారంభమునే కల దయి దినదినక్రమమున లోకములో వ్యాపించి కడపట బహుజనానందదాయకము కావలెనని చూపుట కయి యతఁడీ మూడవకథను జెప్పెను. ఐహికరాజ్యమును నంపాదించి యానందింపవలెనని జనులమానసములు సదా బాహ్యసౌఖ్యముల మీఁదికి బరుగిడుచుండఁగా, జీసస్ వారిహృదయములను మెల్ల మెల్లఁగా బాహ్యసుఖచింతలనుండి విముఖులను గాఁజేసి శుద్ధవఱిచి యాత్మానందమువంకఁ ద్రిప్పి యాంతరసౌఖ్యములనొఱ కున్మఖము లనుగాఁ జేసి యీశ్వరరాజ్యమును వారిహృదయములలోనే స్థాపింపఁ జూచు చుండెను. ప్రవాహమూలము కలుషముగా నున్నపట్టమున దానినుండి పాఱు జలమును కలుషమయినదిగానే యుండును. ప్రజల మనస్సులు నిర్మలములుగా నున్నప్పుడు మాత్రమే వారికార్యములు

యోగ్యములుగా నుండు నని యెఱిగిన వాఁడయి జీస స్సన్నిధుడును జనులహృదయములను వరిశుద్ధపఱిచి యుంచుండి సచ్చింతలు ప్రవహించునట్లు చేయుటవలననే వారిస్థితిని వర్తనమును బాగుచేయవలె నని సర్వవిధముల బాటువడఁ జొచ్చెను.

తనయుద్దేశములు ప్రియుశిష్యులకుఁ దక్క సర్వజనులకును గ్రాహ్యములు కాకుండ గుప్తములు చేయువలె నన్న యుద్దేశ్యములతో జీసస్ కథలమూలమున నుపదేశించుచు వచ్చెనని యిప్పటి గుప్త విద్యాభిమానులు కొందఱు చెప్పుచున్నారు గాని వారి మాటలు ధీమంతు లంగీకరింపఁబడఁదగినవి కావు. నూతనమతమును స్థాపించి దానిని లోకమునం దంతటను వ్యాపింపఁ జేయుట కయి యహర్నిశ మును బాటుపడుచుండిన మహాపురుషుఁడు స్వమతసిద్ధాంతము లెవ్వరికిని బోధపడకుండునట్లు బుద్ధిపూర్వకముగా మఱుఁగు పఱుచు నని చెప్పుటకంటె విరుద్ధాంశ మింకొకటియుండదు. ఆకాలమునం దాతని యుపదేశములను వినవచ్చిడి వారు ప్రాయికముగా విద్యాగంధము లేని ముగ్ధమానవులు. బాలప్రాయు లయినయట్టివారికి కథలు రుచించునట్లు ధర్మకథనములు రుచింపకపోవుటచేతను, చెవులకింపుగా నుండెను కథలమూలమున ధర్మముల నుపదేశించు నవ్వు డవి వారి మనస్సులలో శిలాక్షరముల వలె నాటుకొనుట స్వభావ మగుటచేతను, అతఁ డట్టి యుపమానములను దఱుచుగా జెప్పి యుండునుగాని యివ్వటి బుద్ధిమంతు లూహించునట్లు వేఱు కారణములచేత నయియుండదు. నిత్యమును జీసస్సు యొక్క ప్రసంగములు వినవచ్చువారు చేఁపలను బట్టుకొనుచు గైబీరియా సరస్తీరమునందు వాసముచేయు బెస్తలును వారివంటి యితరసామాన్యమానవులునుగాని; పండితులు గారు. జనుల నుండి తాము గయికొన్న వృత్తిపన్నుల యొక్కయు సుంకముల

యొక్కయు మొత్తములను లెక్కవ్రాయ నేర్చిన దొరతనము వారి సుంకరులును క్రయవిక్రయములు చేయు చిల్లరవస్తువులను పద్దులు వ్రాసికొనఁ జాలిన యంగడివాండ్రును వారిలో మహావిద్వాంసులు. వారి బుద్ధిబలమును వారికిఁ గల విద్యాబలము ననుసరించియే యుండెను. ఎల్లవారికిని దయ్యములమీఁదను భూతములమీఁదను మేరమీఱిన విశ్వాసము కలదు. మూఢులయినను వారు కపట మెఱుఁగని నిర్మల మానసులు; వారి సాధుహృదయము లెప్పుడును దయారసపూరితములయి యుండెను. ఆకాలమునం దిట్టి శిష్యబృందముతోఁ గలిసి జీసస్ సదా బయల వసించి ప్రొద్దుపుచ్చుచు, స్వేచ్ఛావిహారము సలుపుచుండును. ఒకప్పుడు నావపై నెక్కి యొడ్డునఁ గూడఁబడు మూఁకలకు ధర్మోపన్యాసములు చేయును; ఒకప్పుడు చేరువ కొండమీఁది కెక్కి వెంటఁబడువారికి స్వయతోపదేశము చేయును. వినువారి వినయధర్మమును ధర్మముగాను ధర్మము ధర్మముగాను దోపిచేడి దుష్పాండిత్యముచేత దూషితములయిన విపరీతాభిప్రాయములు కాకపోవుటచేత వారాతఁడుపదేశించు సుస్పష్టములయిన సత్యములు నెల్లను పరమాదరముతో స్వీకరించుచుందురు. ఒకానొకప్పుడొక్కొక్కరి మనస్సులలో నాతని యుపదేశములయందు సందేహము కలిగినను అడిగిన ప్రశ్నకు మందహాసము చేసి దయారసము చల్లు చల్లని చూపులతో జీసస్సేదో యుత్తరము చెప్పఁగానే వారిమనస్సు లంతటితో సమాధాన పడి సంతృప్తి నొందుచుండును. అనుయాయికు లయిన యాజనులు తమకు శీఘ్రకాలములోనే యీశ్వరసాక్షాత్కారము కలుగు ననియు, ప్రపంచమున కేలిక లయి తాము ధన్యుల మగుదు మనియు, నమ్మియుండిరి. జీసస్ వారి కుపదేశించిన దానిలో — "బీద లగువారు ధన్యులు;

వారిదే స్వర్గరాజ్యము. దుఃఖపడువారు ధన్యులు; వారు దుఃఖోప
శాంతిని పొందుదురు. నమ్రులయినవారు ధన్యులు; వారు భూమి
కధికారు లగుదురు; ధర్మమునం దాఁకలి గొని దగ గొనువారు
ధన్యులు; వారు సంపూర్ణమనోరథు లగుదురు. దయాళు లైనవారు
ధన్యులు; వారు దయ చూపఁబడుదురు. హృదయశుద్ధి గలవారు
ధన్యులు; వా రీశ్వరుని దర్శింతురు. సంధిచేయువారు ధన్యులు; వారు
దేవుని బిడ్డ లని చెప్పఁబడుదురు. ధర్మముకొఱకు బాధలు సహించు
వారు ధన్యులు; స్వర్గరాజ్యము వారిది." — ఇత్యాది వాక్యము లసే
కము లుండెను.

ఇట్లు బీదతనమును భూషించుచు ప్రాపంచిక సుఖములను
దూషించుచు వైరాగ్యోపదేశము చేయుట పూర్వకాలమునం దుష్ణ
దేశములలో వాసము చేయు మతాచార్యుల కంపటికిని గొంతవఱ
కాచార మయి యుండెను. చలిదేశములలో వలె మంచి గృహములు
వస్త్రములు మొదలయినవి యుష్ణదేశములోని జనుల కంతగా నావ
శ్యకములు కావు. అక్కడ దిగంబరు లయి బయల వసించుచు జనులు
కష్టపడక కాలము గడపవచ్చును. అట్టివారిదృష్టికి మంచిబట్టలు ధరిం
చుటయు మంచియిండ్లయందు వసించుటయు భోగములుగా తోఁచుట
వింతకాదు. ధనవస్తువాహనాదులమీఁది యతికాంక్షవలననే సాధార
ణముగా జను లకార్యకరణమునకు లోఁబడుచు నంతకంత కీశ్వరునికి
దూరముగాఁ దొలఁగుచు వచ్చుట నిత్యమును జూచుచుండు మతా
చార్యులు ధనాదిబంధములే పాపహేతువు లని భావించి యీశ్వర
రాజ్యమును బొందుటకు ధనాదిబంధవిమోచనమే ప్రధాన మని
వైరాగ్యోపదేశము చేయుటయు నాకాలమునందు స్వభావవిరుద్ధము
కాదు. జనులలో జ్ఞానుల మనుకొనువారు తమలో పశుపక్ష్యాదులకు

సహితము కష్టపడ నక్కఅక్కరలేక చిత్రవర్ణముల నీశ్వరుఁడు ప్రసాదించి యుండఁగా వానినిమిత్తము మనుష్యుఁడేల కష్టపడవలెనని తలఁచుచుండిరి. ఇట్టి యూహలచేతనే యుష్ణదేశములలో శీతలప్రదేశముల కంటె విరక్తి మార్గమవలంబించిన సన్యాసులసంఖ్య యిప్పటికి నధికముగా నున్నది. ఇట్టియూహలు సోమరితనమువలన నుదరపోషణార్థమై కలుగక పారమార్థచింతచేతనే కలిగెడు పక్షమున నీయస్వాభావికవర్తనమువలనను లోకమునకుఁ గొంతలాభముకలుగవచ్చును. కేవలసంసార పరిత్యాగమును బోధింపక పోయినను ధనత్యాగమును జీసస్ తన శిష్యులకుఁ బలుమా ఱుపదేశించుచు వచ్చెను. ఆతని యుపదేశములోని కొన్ని వాక్యములు వినుఁడు:—"చిమ్మటలును త్రుప్పును తిను నట్టియు చోరులు పగులఁగొట్టి దొంగిలించునట్టియు భూమిమీఁది నిధనమును కూడఁబెట్టుకోకుఁడు. నిధన మెక్కడ నుండునో నీమనస్సుకూడ నక్కడనే యుండును. ఏమనుష్యుఁడును ఏకకాలమున ఁదిద్దఱప్రభువులను గొలువ లేఁడు. అతఁడొకరిని ద్వేషించి యొకరిని స్నేహించును; లేదా, యొకరిని బహూకరించి రెండవవానిని నిరాకరించును. మీరు దేవునిని ధనదేవతనుగూడ సేవింపలేరు. కాఁబట్టి యేమి తినవలెనో యేమి త్రాగవలెనో యని మీజీవనము నిమిత్తముగాని, యేమిధరింపవలెనో యని మీశరీరము నిమిత్తముగాని యాలోచన చేయవలదని నేను మీకుఁ జెప్పుచున్నాను. మీజీవన మాహారము కంటెను మీశరీరము వస్త్రములకంటెను మేలయినవి కావా? గాలిలోని పక్షులను జూడుఁడు.—అవి విత్తనములుచల్లవు; కోఁతకోయవు; గాదెలలో నిలువ చేసికోవు; అయినను మీపరలోకపిత వాని కాహార మును బ్రసాదించుచున్నాఁడు. మీరువానికంటె మిక్కిలీ యధికులు కారా? మీలో నెవ్వఁడు వస్తుకాంక్ష వహించి తన యాన్నత్యమున

కింకొకమూర చేరఁగలఁడు! వస్త్రములనిమిత్త మేల కాంక్షవహించె దరు! పొలములో గడ్డిపూఁదీఁగె లెట్లు పెరుగుచున్నవో చూడుఁడు:— అవి పనిచేయవు; నూలువడకవు; అయినను సాలమోను ప్రభువంతటి వాఁడును దనమహావైభవదశలో సహిత మలంకారములో వానిలో నొకదానినైనఁ బోలియుండఁడని చెప్పుచున్నాను. ఓవిశ్వాసహీను లారా! నేఁడుండి రేపు ప్రొయిలోఁబడెడు పొలములోని గడ్డి కీశ్వరుఁ డిట్టి యలంకారమును దయచేయునప్పుడు మీకంతికంటె నధికముగా దయచేయఁడా! కాఁబట్టి మేమేమి తినవలెను, మేమేమి త్రాగవలెను, మేమేమిధరించుకోవలె నన్నచింతను బెట్టుకోఁబోకుఁడు. ఇవియన్నియు మీకుఁగావలె నని మీపరలోకపిత యెఱుఁగును. కాఁబట్టి మీరు మొట్టమొదట నీశ్వరరాజ్యమును తద్ధార్మికత్వమును బొంద బ్రయ త్నింపుఁడు; ఈసమస్తపదార్థములును దమంతనే మీకుఁ జేర్పఁ బడును. కాఁబట్టి రేపటిదినమునుగూర్చి యాలోచన చేయఁకుఁడు. రేపటిదినము తానే యావస్తువుల నిమిత్త మాలోచన చేయును."

జీసస్సుయొక్క యిట్టివాక్యము లప్పటివారియొక్క మనస్సు లలో నూతనోత్సాహమును బుట్టించిన వనుటకు సందేహములేదు. సంతుష్టమానసు లయిన యాజనులు సమస్తమునకు నీశ్వరునే నమ్మి కొని త్రైహికచింత లనర్థదాయకము లని భావించియుండిరి. ఐహిక వ్యవహారము లన్నిటిలోను ధర్మమును మీఱక యీశ్వరప్రీతికర ముగా నడుచుచు లోకమునకు మేలుచేయుచుండుట యుత్తమధర్మ మగును గాని సంసారమును బొత్తిగావిడిచిడి విరక్తి యంతగా శ్లాఘ్య మయినదికాదు. ఇట్టి యస్వాభావిక మయిన యీవిరక్తి మార్గోప దేశమే యీదేశమునందు నీతిలతను శోషిల్ల జేసి ధర్మదేవతను నిద్ర పుచ్చి యిహలోకజీవనమును నిస్సారము చేసినది.

జీసస్ సంసారత్యాగమును విధింపకపోయినను ధనత్యాగమును బలుమాఱు శిష్యుల కుపదేశించుచు వచ్చెను. అతఁ డొకపర్యాయము "మీకున్నదంతయు విక్రయించి దానము చేసి, మీకు నిశ్చయముగా రానున్న పరలోకధనమునిమిత్త మెప్పటికిని ప్రాఁతగిలని సంచులను సిద్ధము చేసికొనుఁడు" అని బోధించెను. అతఁ డింకొకసారి "ఈశ్వరరాజ్యము ధననిక్షేపము గలతోఁటవంటిది. దానిని కనుఁగొన్నవాఁడు తత్క్షణమే సంతోషపూర్వకముగాఁ బోయి తన కున్నది సర్వమును విక్రయించి యాపొలమును గొనును" అని బోధించెను. అతఁడు మఱియొకసారి "ఈశ్వరరాజ్యము కావలసినవాఁ డీలోకములోఁ దనకున్న వన్నియు నిచ్చివేసి దానిని గొనవలెను. ఈపరివర్తనమువలన లాభము పొందినవాఁడే యగును" అని బోధించెను. అంతేకాక యారంభదశయందు జీసస్ తనశిష్యపదమును బొందుటకు వానియొద్దఁ గలసొత్తెల్ల విక్రయించి యాసొమ్మ్ము బీదల కిచ్చుట ప్రథమ నిబంధనముగా నేర్పఱిచెను. అట్లుచేయు వెనుకతీసినవారు శిష్యులుగా నంగీకరింపఁబడలేదు. అయినను దరువాత జీస స్సానిర్బంధము నంతగా పాటింపలేదుగాని "ధనవంతున కీశ్వరరాజ్యమును బొందుటకంటె నుష్ట్రమునకు నూదిబెజ్జములోనుండి దూరుట నులభము" అని యీ నీతివాక్యములు కడవఱకును బోధించుచునే వచ్చెను. మనుష్యదౌష్ట్యమును నీతిరాహిత్యమును తఱుచుగా నతిమాత్రవిషయసుఖానుభవమువలనను స్వప్రయోజన పరత్వమువలనను గలుగుచు వచ్చుటచే వానికి మూలమైన ధనము నతఁడిట్లు దూషించియుండును. ఎట్లయినను జీసస్ యొక్క యిట్టిబోధనవలన నాతని శిష్యులింద్రియసుఖవిముఖులయి యాధ్యాత్మికానంద సంపాదనోన్ముఖులయి నిరంతరకృషి చేయుటచేత నాకాలమునందు లోకమున కమితమయినలాభము కలిగినది.

ఆఱవ ప్రకరణము.

శిష్యసంగ్రహమును, పర్వతముమీఁది ధర్మోపన్యాసమును.

వెనుకటిప్రకరణములయందుఁ జెప్పఁబడినట్లు మూఁకమూఁక లుగా వచ్చి జీసస్ చేయుప్రసంగములను విని యప్పటి కానందించి పోవువారు మితిమీఱి యుండినను నిశ్చలమనస్కులయి కష్టసుఖముల యందు విడువక యాతని ననుసరించువారు వారిలో నెంద ఱుందురో యని సందేహింపవలసి యుండెను. ఆతనినూతనమతమును వ్యాపింపఁ జేయుట కయి యిష్టమును సామర్థ్యమును గలవారు వారిలోఁ గొందఱె యుందు రనుటకు సందేహములేదు. ఒకధీమంతుఁడు లోకములో నేదేని నూతనమతస్థాపనముచేయ నుద్దేశించినప్పు డాకార్యభారమును గొంతవఱకుఁ బైని వేసికొని తోడ్పడి యాతనితోడి కష్టనిష్ఠురముల ఓర్చి నిర్వహింపఁ గృతనిశ్చయులయి కంకణము కట్టుకొన్న సమర్థులు గొంద ఱైన నుండక కార్యసాఫల్య మగుట దుర్ఘటముగదా? ఏకా ర్యమునందును కష్టములు రానంతకాల మెల్లవారు నుత్సాహవంతులు గాను గార్యసాధకులుగానే కనబడుదురు. ఇంచుకకష్టము లారంభము కాఁగానే యాయుత్సాహప్రవాహ మంతయు నింకిపోఁగా మొదలింటి వాక్కూరు లనేకు లడుగంటఁగా వారిలో మిక్కిలి కొందఱుమాత్రమే దృఢచిత్తులయి నిలుతురు. అట్టిదృఢమనస్కులను గొందఱిని ముఖ్య శిష్యులఁగా నేర్పఱుచుకొనుట యిప్పుడు జీసస్సునకుఁ బ్రథమకర్త వ్యము. ఈవఱకుఁ జేసినశిష్యులలో విశేషభాగము తమతమవ్యాపార ములను జేసికొనుచు నతఁడు తమగ్రామసమీపప్రదేశములకు వచ్చి ప్రసంగించినప్పుడు పోయివినుచుఁ దమసంశయములను నివారణ చేసి

కొనుచు నతఁడు దూరగ్రామములకుఁ బోఁగానే తామును దమ యిండ్లకుం బోవుచుందురు. అటువంటివాఁ గాక యితరవ్యాపారముల నన్నిటిని విడిచి సదా యతనితోనుండి మత్ప్రభావనము నిమిత్తము పనిచేయు కార్యశూరు లిప్పుడు కావలసివచ్చిరి. అందుచే నతఁడు తన శిష్యబృందములోనుండి యటువంటివారిని పండ్రెండుగురను బ్రియ శిష్యులనుగా నేతికొనెను.

అట్లేర్పఱుచుకొనిన పండ్రెండుగురిలో 'సిమ్ఱ' అను నామాంతరము గల 'పీట' రనువాఁడును, 'ఆండ్రూ' యనువాఁడును, జోసస్ యొక్కకుమారులు. జీసస్ పీరియింటనే చిరకాలము వాసము చేసెను. పీటరున కత్తయు భార్యయు నిద్దఱు బిడ్డలు నుండిరి. ఆండ్రూ కొంత కాలము స్నాతకుఁ డైన జానునకు శిష్యుఁడుగా నుండెనఁట. ఈ యిరువురును జీసస్సునకు శిష్యులుగా నున్న కాలములో సహితము తమ చేఁపల వ్యాపారమును మానలేదు. వీరిద్దఱును జీసస్సునం దధిక భక్తివిశ్వాసములు కలవారు. ఈకుటుంబముమాత్రమేకాక 'జెబిడీ' యనువాని కుటుంబము కూడ జీసస్సునెడల నత్యంతాదరము కలది. జెబిడీకి 'జేమ్సు' అనియు, 'జాన్' అనియు నిద్దఱుకొడుకులు గలరు. వీరిలో కనిష్ఠుఁడైన జాన్ జీసస్సున కాప్తశిష్యుఁడై తరువాత మిక్కిలి ప్రసిద్ధి చెందెను. వీరితల్లి యైన 'సలోమీ' కూడ జీసస్సునం దధికానురాగము కలదై యాతని మరణపర్యంతము నాతని విడువక వెంబడించెను. జీసస్ యొక్క యితరశిష్యులు ఫిలిప్, బర్తోలోమస్, థామస్, లెబ్బాస్, మాథ్యూ, సిమిన్, జూడస్, జేమ్సు. వీరిలో కడపటి యతఁడైన జేమ్సు జీసస్సునకు బినతల్లి యైన మేరీకుమారుఁడు. జేమ్సునకు జేక బనియు నామాంతరము గలదు. ఇట్లేర్పఱుకొన్న పన్నిద్దఱిలో జీసస్సందఱిని మంచివారినే యేర్పఱుచుకొనెను గాని యొక్క 'జూడస్'

విషయములోమాత్రము భ్రమ పడెను. ఎంతజాగరూకు లయియున్నను ధీమంతులకు సహిత మొకానొకప్పుడు ప్రమాదము సంభవించును. జూడస్ పయికి మంచివాఁడుగా కనబడినను స్వభావముచేత దుష్టుఁడు. ఇతఁడు గురుద్రోహియయి కడపటఁ దనగురువును శత్రువుల కొప్ప గించెను. ఇతఁడొక్కఁడు తక్క జీసస్ శిష్యులందఱును గాలిలీదేశస్థులు. ఇతఁడుమాత్రము విదేశస్థుఁడయిన యిస్కారియత్ గ్రామస్థుఁడు. ఇట్లు ప్రథమమున సంపాదించుకొన్న ద్వాదశశిష్యులను సామాన్యస్థితియం దుండినవారే కాని వీరిలో నొక్కఁడును మహాకులీనుఁడును ధనసంపన్నుఁడును విద్వాంసుఁడును లేఁడు. వీరిలోఁ బలువురు చేపలవాండ్రు, ఒక్క మాథ్యూమాత్రము సుంకరి. ఈశ్వరకార్యమునందు నియోగింపఁబడిన యీపన్నిరువురును 'ఈశ్వరదూత' లని వ్యవహరింపఁబడిరి.

ఇట్లు దేవదూత లని నూతనబిరుదాంకముల నందిన యీపన్నిద్దఱును వ్యాపారములను విడిచి తమ స్వామిని జేరిరి. ముం దీ నూతన మతమునొక్క యభివృద్ధియుంతయు వీరి ధైర్యవిశ్వాస సామర్థ్యముల మీఁద నాధారపడి యుండును. వీ రీశ్వరకార్యమునం దవ్యాజభక్తి విశ్వాసములు కలవా రయి ధైర్యసాహసములతోఁ బనిచేసిరా సర్వమును విజయము నొందును. ధర్మభీరు లయి కష్టములు వచ్చినప్పు డీశ్వరకార్యమునందు నిరుత్సాహు లయి వెనుకతీసిరా సర్వమును భగ్నమయి విజయము దవ్వగును. కాఁబట్టి జీసస్క్రీస్తుఁడు తన లోక వేఖ నపాయము సంభవించినను తాను మోసిన కార్యభారమును పైని వేసికొని నిర్వహింప సమర్థులనుగాను దేవకార్యమునందు బద్ధకంకణులనుగాను వీరిని దిద్దవలెను. అన్నివైపులను ప్రతిపక్షులుగా బైలు వెడలు చున్న శత్రువు లెప్పుడో తనప్రాణముల కెగ్గు తలఁపక మాన

రని యతఁడు ముందుగానే కనిపెట్టెను. అటువంటి వైపరీత్యమే సంభ
వించినయెడలఁ దాను బోధించెడి దివ్యము వరమాదరముతో విని,
యామోదించు చున్నవారిలో నధికసంఖ్యాకులు ఫారిసీలకు విధేయు
లయి యీక్రొత్తవంథ విడిచి పూర్వపుదారికే వెనుక మరలుదురనియు
నాతఁ డెఱుఁగును. రాతినేలను మొలచిన బీజాంకురముల వలెనే
చిరకాలాచారముచే చట్టుపడియున్న వారి హృదయక్షేత్రములయం
దంకురించిన నూతనధర్మబీజములును నించుక కష్టము వచ్చినప్పుడు
సంతతబోధామృతధారావర్షము లేనిపక్షమున నల్పకాలములోనే
రూపు మాయునని యాతని యెన్నిక. అందుచేత నాతఁడు తనసిద్ధాం
తములు మొలకలోనే నశింపక తలయెత్తి వృద్ధినొంది లోకమున
వ్యాపించి భావికాలమునం దనంతఫలములను గలిగించునట్లు చేయుట
కయి, యెన్ని యంతరాయములు వచ్చినను నెట్టికష్టములు ప్రాపించి
నను చలింపక యచలములవలె నిలువఁగలఁగునట్లుగా ధైర్యము చెప్పి
కొందఱినైనను దిద్ది తీర్పనలె నని నిశ్చయము చేసికొనెను. ఈ యుద్దే
శముతోనే యతఁడు తనశిష్యబృందములోనుండి దృఢచిత్తులుగాఁ గనఁ
బడినవారిని పన్నిరువురఱి నేతికొని యాంతరంగికులఁగా నంగీకరించి
వారిని సదా తన సన్నిధియం దుంచుకొనెను. జనుల విషయమునఁ
దాను నడపవలసినకృత్యమును మఱపక వారికి సామాన్యముగాఁ జేయ
వలసిన మేలు నతఁ డణుమాత్రమును మానక యుపదేశాదుల మూల
మునఁ జేయుచుండినను, తన యనంతరమునఁ గూడ దా నారంభించిన
మహాకార్యమును సాగించుట కయి యీ యాప్తశిష్యుల నర్హతము
లనుగాఁ జేయుట కయి యధికశ్రద్ధ వహించి మతింత పాటుపడఁ
జొచ్చెను. తన జీవితకాలములోనే దేశము మీఁదఁ బోయి ప్రసం
గములు చేసి స్వతంత్రముగా మతవ్యాపనము చేయ నారంభింపఁ

గుశలులనుగా వారిని జేయువలె నన్న యభిలాషతో జీసస్ వారితో
దా నొంటిగా నున్నప్పుడును వారికి తన సిద్ధాంతములను వేనూఱు
బోధించి మనస్సున నాటించు చుండెను. మఱియుఁ గొన్ని సమయము
లయం దతఁడు వారి నరణ్యములోనికిఁ గొనిపోయి నిర్మానుష్యము
లయిన యేకాంతస్థలములయందును వారికి సావకాశముగాఁ బోధింపఁ
జొచ్చెను. అట్టి సమయములయం దతఁడు శిష్యులను తన చుట్టును
గూరుచుండఁ బెట్టుకొని యొక్కధర్మప్రవచనమును గూర్చి మాత్రమే
కాక లోకములో వారికిఁ గలుగఁబోవు కష్టములను గూర్చియు కష్ట
కాలములయందు ధైర్యముతో వారు వర్తింపవలసిన మార్గములను
గూర్చియు వారి కనేకవిధముల బోధించి యుండును. ముందుగా నన్య
స్థలములలో నారంభింపక స్వగ్రామములకును పల్లెలకును మాత్రము
పోయి స్వజనమున కీశ్వరరాజ్యము సమీపించిన దని బోధింపవలసిన
దనియు, వరులకంటె వారధికాదరముతో వినుదు రనియు, పూర్వ
ప్రవక్తలు చెప్పియున్నట్లుగా దేశము భాగుపడవలసిన సమయ
మాసన్న మయిన దని ఘోషింపవలసిన దనియు, వారి కతఁడు
ప్రథమకర్తవ్యము నుపదేశించి, మతవ్యాపనమును స్వధర్మముగాఁ
జేసికొనక వృత్తిగాఁ గైకొని దానిని ధనాకర్షణమార్గముగాఁ జేసికొన్న
వక్రమున నచిరకాలములోనే మతము హేయస్థితికి రాక మాన దని
యెఱిఁగివాఁ డయినందున ఖండితముగా వారి కతఁడు ప్రయాణ
ములలో స్వోదరపోషణార్థమయి వస్తుసంగ్రహణము చేయువల దనియు,
నితరులకుఁ జేసిన సాయమున కయి వారివలన నేమియుఁ బారితోషి
కముగా నంగీకరింపఁ గూడదనియు, బుద్ధులు చెప్పెను. ధనాపేక్ష
లేక వారు తా నుపదేశించినట్లు కేవల పారమార్థికబుద్ధితోనే ధర్మ
ప్రకటనము చేయువా రయిరేని, జనులే వారి నాదరించి స్వగృహా

ములకుఁ గొనిపోయి యన్న పానాదులు సమకూర్చి యాదరింపక మాన
రనియు, నందుచే వారు కష్టములపాలు కావలసిన యావశ్యక ముండ
దనియు, అతఁ డెఱుఁగును; కేవలపరార్థపరాయణులు గాక ధనాశా
పరు లయి స్వార్థపరత్వము నించుక చూప నారంభించిన యుత్తర
క్షణమునసే సత్యప్రవచనాగ్రేసరు లగుటచే వారికిఁ గలిగిన బల
మంతయు నొక్కసారిగా నడుగంటు ననియు నతఁ డెఱుఁగును. వారి
కతఁ డుపదేశించిన యితర హితవాక్యములు కొన్ని యీరీతిగా
నుండెను.

ఎక్కడకుఁ బోయినను మీ రనువర్తనము గలవారు గాను
శాంతిసంపన్నులు గాను నుండవలెను. ధర్మబోధ చేయునప్పుడు
జనులు విన్నపక్షమున బోధింపవలెను; వినకొల్లని పక్షమున నక్కడి
నుండి తొలఁగి వేఱొక చోటికిఁ బోవలెను. బోధింపవలసిన దొక్కటే
మీధర్మము కాని దాని ఫలము మీశక్తిలోనిది కాదు. జను లవి
నయు లయి మీ రుపదేశించెడి హితబోధ వినక పెడచెవిని బెట్టిన
పక్షమున వారే యీశ్వరున కుత్తరవాదు లయి యాఫలము ననుభ
వింపవలసినవా రగుదురు. పుణ్యపాపఫలముల నొసఁగవలసినవాఁ
డొక్క యీశ్వరుఁడే. ఈశ్వరాధికారమును పైనివేసికొనుట మను
ష్యునకు తగదు. వినినివారికి సహితము మేలునే కోరి వారకి సద్బుద్ధి నుద
యింపఁ జేయుట కయి యీశ్వరుని ప్రార్థింపవలయునే కాని యవిధే
యుల నెవ్వాడును మనస్సులో సహితము ద్వేషింపను దూషింపను
రాదు.

ఇ ట్లెవరికిని నే కీడును జేయక యెవ్వరివిషయమునను పరుష
వాక్యము నోటరానీయక యెవ్వరికిని మనస్సులోను చెడుగుకోరక,
మంచిమాటలవలనను శుద్ధవర్తనము వలనను పరులను సిగ్గు వడిచి

వారిని కోపోద్రేకము నుండియు దుష్టత్వము నుండియు మరల్చ వల
సిన దని నియమించి జీసస్సు తన శిష్యులను క్రూరకర్మ్ములయిన దుష్టు
లకు ధర్మ్మబోధ చేయఁ బంప నిశ్చయించుకొనెను. దీనినిఁ బట్టి యాత
నికి సత్యబలము నందును ధర్మ్మబలము నందును నెంత దృఢవిశ్వాస
ముండెనో విస్పష్ట మగును. జనులను లోఁబఱుచుకొని ధర్మ్మమార్గము
నకుఁ ద్రిప్పుటలో బోధనాశక్తియున కంటె స్వీయసదనుష్ఠానరూపకోప
దేశమునం దధికశక్తి కల దని యాతని నమ్మకము. శిష్యు లెంత
జాగరూకులుగా నున్నను కష్టములు రాక మాన వని యెఱిఁగినవాఁ
డయి మఱియు నాతఁడు వారి కిట్టి వాక్యములను గొన్నిఁటిని బోధిం
చెను.

మిమ్ము తోడేళ్ళ లోనికి గొఱ్ఱెలను వలెఁ బంపుచున్నాను.
మీరు మేకపిల్లలంత సాధువులుగా నుండుటయే కాక సర్పములంత
జాగరూకులుగా కూడ నుండవలెను. సాధ్య మయినంత వఱి కపా
యమునుతప్పించుకొని దూరముగాతొలఁగుచు, మీరెయొద్దనున్న యోగ్య
తను గొప్పపఱుచుకొనుటచే నెప్పుడును మీరెయెడల పరుల కనూయ
పెరుగకుండునట్లు చేయవలెను. మీరెంత జాగరూకు లయి మెలఁగు
చున్నను దేశాచారములకు విరోధముగా ధర్మ్మబోధ చేయుచుండు
టనుబట్టి కొన్నిసమయములయందు మీరు బహుమిషలమీఁద ధర్మ్మ
స్థానముల కీడ్చుకొని పోఁబడి నిరోధము నొందవచ్చును. అటువంటి
సమయముల యందు స్వరక్షణార్థముగా దండవిధాయకునివద్ద
మీరేమి చెప్పుకోవలయునో దానిని మీకీశ్వరుఁడే యప్పుడు బోధిం
చును. మీ సాధువాదములవలన మనసు కరగనివాఁ డయి కఠినచి త్తు
ముతో న్యాయాధికారి మిమ్ము విడిచిపెట్టక దండింవఁ దలకొన్న
ప్పుడు మీకాతఁడు చేయఁగలిగిన దేమఁడును! మీకతఁడు చేయ

గలిగిన గొప్పయుపకృతియంతయు మిమ్మునధించుటకంటె నెక్కువగా నుండనేరదు. అతఁడు మీ దేహములకు భంగము కలిగింపఁ గలిగినను మీ యాత్మలను తాఁకలేఁడు; మీకుఁ బరలోకమునఁ గలుగనున్న నిత్యానందమునకు భంగము కలిగింపఁలేఁడు. శరీరమునకు మాత్రము హాని కలుగఁ జేయుఁగలిగినదానినిగూర్చి మీరు భయపడఁ బోకుఁడు; నిత్యమయిన యాత్మకు హాని కలిగించెదుదానినిగూర్చి భయపడుఁడు.

ఆత్మకు హానిచేసెడి దనఁగా ధర్మనరిత్యాగ మని యాతని భావము. వారు మరణమున కంటెను ధర్మభీరుత్వమున కెక్కుడు భయపడవలెనని యీబోధనయొక్క పరమార్థము. ఇట్లు దిటవుగఁబలి మఱియు, —

"మీరు బైలుదేఱి పోయి నేను మీకు చీఁకటిగడియలలో బోధించినదానిని పగటిపూట వెలుతురులో బహిరంగముగా బోధిం పుఁడు. రహస్యస్థలములలో నానోటినుండి వినిన దానిని మీరింటినడి కప్పులమీఁదినుండి ఘోషింపుఁడు. మనుష్యుల యధికారమునకు భయ పడఁబోకుఁడు. అల్పములైన పిచ్చుకల రక్షించెడి యీశ్వరుఁడు మీకు మార్గదర్శకుఁడును గాకపోఁడు. తమ దోషములనుజూపి ఖండించెడు సుజనులతో దుష్టజనులు కలహింతురు గనుక మీకాపదలును వచ్చును. మీకప్పుడును నత్యమే పోరాటమును పురికొల్పెదు ఖడ్గ ముగా నుండవలెను. తనకుఁ బ్రియ మయిన సర్వమును తుదకు ప్రాణ మును దానినిమిత్తమయి విడిచిపెట్ట నిష్టపడినంగాని మీలో నెవ్వఁ డును మీరిప్పుడు పంపఁబడనున్న దేవదౌత్యమున కర్హుఁడుకాఁజాలఁడు. అల్పప్రయోజనము నిమిత్తమయి యిట్టిపరిత్యాగములను మీరు చేయఁబోవుచుండలేదని దృఢముగా నమ్మెఁడు. నాశుభవార్త నంగీక రించుట కేహృదయమునైనను మీరు ప్రబోధింపఁ గలిగినయెడల,

ఆహృదయము తనకుఁ బ్రేమపదముగా నన్ను ప్రతిగ్రహించుటయే. నన్నుఁ బ్రతిగ్రహించుటయే నన్నుఁ బంపిన యాయీశ్వరుని ప్రతిగ్ర హించుట. మనుష్యులలో శాంతియు ననురాగమును వృద్ధిపొందించుట కయి మీరేది చేయుఁగలిగినను, ఆచేసినది దప్పిగొన్న వారి కొకగిన్నెడు మంచినీ ళ్ళిచ్చుట మాత్రమే యైనను, దానిబహుమానము రాక యుండదు.

అని యిటువంటి ప్రోత్సాహ వాక్కులు పెక్కులు పలికెను. ఇట్లు పలుమాఱుబోధించి దృఢచిత్తులను జేసి కొంతకాలము జరగిన పిమ్మట నతఁడు తనశిష్యులను స్వతంత్రముగా ధర్మబోధ చేయుట కయి పంపి శోధింప నిశ్చయించుకొని, తనవలెనే ధర్మబోధయు రోగ నివారణమును జేయుటకయి స్వాతంత్ర్యమిచ్చి యిద్దరిద్దఱిని బయిటఁ బంపఁజొచ్చెను.

ఇట్లెంతబోధించినను శిష్యు లెంతనిర్మలహృదయములై నను వారిలోవారి కీర్ష్యయు మనస్తాపమును బొత్తిగా కలుగకపోలేదు. ఈశిష్యబృందములో జీసస్సునకుఁ గొంద అధికాప్తులుగా నుండిరి. పీట రును, జెబిడీకొడుకు లయిన జేమ్సును జానును వారిలో ముఖ్యులు. ఈకడపటివారిరువురును నత్యుత్సాహమును చిత్తోద్వేగమును గల వారు. వారి యుత్సాహవ్యగ్రతను బట్టి జీసస్సు వారిని పిడుగుబిడ్డ లని పిలుచుచుండెను. ఆయిద్దఱిలోను జానునకు జీసస్సు వద్ద చన వెక్కువ యైనట్లు కనుపట్టుచున్నది. జీసస్సు ఫారిసీలతో వివాద పడు నప్పుడు పీటర్, జేమ్సు, జాను; అనుమువ్వురితోనే కార్యాలోచనము చేయుచుండెను. ఈశిష్యు లొండొరులను సహోదరు లనియు, జీస స్సును ప్రభు వనియు పిలుచుచుండిరి. పీటర్ జీసస్సునకు పరమాప్తుఁ డగుటచే పైకి శిష్యులకెల్ల నతఁడు నాయకత్వము వహించియుండెను.

పీటర్ ఋజువర్తనమును సత్యశీలతయు వేగిరపాటును గలవాఁడు. ఆతఁడు తన సందేహములను, ఇష్టానిష్టములను, లోపములను, వీమియు మఱుఁగు వఱుపక సర్వమును నిష్కపటముగా జీసస్సునకుఁ దెలుపుచుండును. జీస స్సాశనియం దాదరమును విశ్వాసమును గల వాఁ డయి మిత్రభావముతోనే యాతనిని చీవాట్లు పెట్టుచుండును. జీసస్సు నభిషిక్తునిగా మొట్టమొదట నంగీకరించినవాఁ డతఁడే. ఆతని భక్తి కానందించి జీస స్సాకనాఁ డాతనితో స్వర్గరాజ్యముయొక్క తాళములు నీకరగతము లగునని వలికెనఁట. ఇట్లొక శిష్యునియెడల పక్షపాతమును జూపినందునకయి తక్కినవారి మనస్సులలో అసూయ కలుగ నారంభించెను. జీస స్సప్పుడప్పుడు వారిముందఱ ముం దీశ్వర రాజ్యములో వా రందఱును దన కుభయపార్శ్వములయందును సింహా సనములమీఁదఁ గూరుచుందు రని యుత్సాహవాక్యములను బలుకు చుండెను. అమాయికు లయిన యాముగ్ధు లామాటల కక్షరార్థమునే గ్రహించి మనుష్యపుత్రుని యెడమవైపునను కుడివైపునను నత్యాసన్ను లయి కూరుచుండువారు తమలో నెవ్వ రని వివాదపడఁ జొచ్చిరి. జెబిడీపుత్రు లయిన జేమ్సును జానును తా మా రెండుస్థానము లను పొందనెంచి తమ తల్లియైన సలోమిచేత నాయగ్రస్థానము లను తన కొడుకుల కనుగ్రహింప నడిగించిరి. అడిగినదానికి స్పష్టముగా నుత్తరము చెప్పక జీసస్, 'తమ్ము ఘనపఱుచుకొను వారు నీచపదమునకుఁ బంపఁబడుదురు. ఈశ్వరరాజ్యము దీనులును నమ్రులు నైనవారిచేఁ బొందఁబడును' అని సామాన్యవాక్యములతో సమాధానము చెప్పెను. దీనినిబట్టి తక్కినశిష్యుల కా యిరివురియెడ లను గొంతయసూయ కలిగెను.

పూర్వోక్తరీతిని శిష్యులను ధర్మప్రవచనార్థము దేశము

మీఁదఁ బంప నారంభించుటకుఁ గొంతకాలముముందే కేపర్నాము పగరసమీపమున నున్నయొకకొండమీఁద జీసస్సాక యుత్తమోప న్యాసమును జేసెను. అట్టిమహోపదేశమునుగూర్చి యిందుఁగొంత ప్రశంసింపకుండుట యుచితముకాదు.

శిష్యులమొదలుకొని సర్వజనులును మెస్సయా వచ్చి భూలోక రాజ్యమును స్థాపించి యూదులను తదధిపులనుగాఁ జేయు ననినమ్మి యుండి రనియు, మెస్సయానుగాఁ బరిగణించి ప్రజలు గుంపులు గూడి జీసస్ వెంటఁ దిరుగ నారంభించినది మొద లతఁడు సైన్యమును గూర్చుకొని యెప్పుడు యుద్ధ మారంభించునా యని యెల్లవారు నెదురు చూచు చుండి రనియు, ఈవఱకే కొంత తెలుపఁబడి యుండెను గదా. ఈశ్వరరాజ్యము సమీపించుచున్నదని పలుమాఱు పలుకు చుండుటయేకాని యీశ్వరరాజ్య మెట్టిదో యీవఱ కెన్నఁడును జీసస్ స్పష్టముగా వివరించినవాఁడు కాఁడు. తానే మెస్సయానని మనస్సులో నతఁ డెంత దృఢముగా నమ్మి యుండినను పై కట్లు చెప్పకపోవుటచేత, ప్రతిపక్షు లైన ఫారిసీలు జీసస్ మెస్సయా కాఁ డనియు మోసగాఁ డనియు నెల్లయెడలను ఘోష మిడుచుండిరి. జీసస్సునందు భక్తివిశ్వాసములు గలశిష్యు లతఁడు తాను మెస్సయా నని లోకమునకు శీఘ్రముగాఁ బ్రకటించి లోకమును లోఁబఱుచుకొని ఫారిసీలమాట లసత్యములు చేయవలయునని యత్యుత్సుకు లై యభి లషించుచుండిరి. మెస్సయానని ప్రకటించి ఫారిసీలనో రడఁపవలసిన దని మిత్రు లాతనిని నిర్బంధపఱుపఁ జొచ్చిరి. జీస స్సిప్పు డేదోవిధ మున వారి మనోరథమును దీర్చి యందఱిని సమాధానపఱుపవలెను. అట్లు చేయనిపక్షమున వారందఱు నాశాభంగ మొంది యొక్క సారిగా విముఖులై యాతనిని విడిచి తొలఁగి పోవుదురు. జీసస్ తాను

మెస్సయా నని చెప్పుకోకయే జనులు గ్రహించునట్లు చేయువలె ననియు మనస్సులలో శాంతియుఁ గారుణ్యమును పూర్ణముగాఁ గలిగి నంగాని యీశ్వరరాజ్యము రానేరదని బోధించి మెల్లమెల్లఁగా జనులమనస్సులనుండి మెస్సయాయుం దారోపిత మైన యుద్ధచింతను బాఁదోలవలయుననియుఁ దలఁచి యుండిరను, ఫారసీలు శత్రువులై తన్నుఁ గూర్చి నానావిధముల దురారోపణములు ప్రకటించు చున్నందు నను మిత్రులు వేగిరపడు చున్నందునను తాఁదలఁచుకొన్నంతకాలము వేచియుండుట కవకాశము లేనివాఁడై తోడనే తన మిత్రులకును శిష్యులకును వారిచిత్తములలో నెలకొని యున్న యిహలోకరాజ్యా పేక్షను విడిచిపెట్టుఁడని తెలియఁజెప్పవలసినవాఁ డయ్యెను. ఈశ్వర రాజ్య మన్నమాటకు వారు చేసికొనుచుండిన యర్థమునకును తా నిప్పుడు విప్పి చెప్పఁబోయెడి యర్థమునకును గలతారతమ్యమును జను లొక్కసారిగా గ్రహించి తనయుత్తమసిద్ధాంతము నంగీకరింపఁ గలుగుదురా, ఈనూతనసిద్ధాంతప్రకటనమువలన వారి కావఱికుఁ దన యెడలఁ గల గౌరవానురాగము లాకస్మికముగా ద్వేషతిరస్కారము లుగా మాఱినయెడలఁ దాను పూనిన యీశ్వరకార్యమునకు విఘా తము కలుగకుండునా, మెస్సయాపని యుద్ధము చేయుట కాదని చెప్పి నప్పుడు వారు తన్ను రణభీరువునుగా భావించి తొలఁగ కుందురా. అనుచింత లిప్పుడు మనస్సును పరిపరిలాగుల బాధింపఁగా నతఁడు రాత్రి నిద్ర పట్టక కేపర్నాముపట్టణమును విడిచి యాచేరువ నున్న యొక పర్వతముమీఁదికిఁ బోయి యొంటిగా నీశ్వరుని ప్రార్థించి మనో బలమును శాంతియుఁ బొందినవాఁడై యాకొండమీఁదనే నిద్ర పోయెను. తెల్లవాఱి యతఁడు లేచునప్పటికే శిష్యు లాతఁ డున్నస్థల మును గనిపెట్టి మూఁకలుగా నాపర్వతపార్శ్వమును జేరి యుండిరి.

నాఁటి ప్రాఁతఃకాలమున నతఁడు ప్రప్రథమముగఁ జేసినపనిని యీశ్వరరాజ్యప్రకటనము చేయుటకై శిష్యసంఘములోనుండి పండ్రెండుగురను దేవకార్యదూతలనుగా పరిగ్రహించుట. శిష్యసంగ్రహకార్యము ముగియఁగానే యతఁడు కూరుచుండి యేదో ప్రసంగ మారంభింపఁబోవునట్లుగా నిమీలితనేత్రుఁడై క్షణకాల ముండెను. అతఁ డేమి చెప్పునో వినవలె ననన్న కుతూహలముతో నెల్ల వారును నాతనిముఖముమీఁద దృష్టిపఱపి వీను లొగ్గి యేకాగ్రచిత్తులయి నిశ్శబ్దముగా నుండిరి. అంతట నతఁడు మూసినకన్నులు తెఱచి తలయెత్తి శిష్యులవంకఁ జూచి సహజమధురగంభీరస్వరముతో—

"దీనమనస్సులు గలవారు ధన్యులు; స్వర్గరాజ్యము వారిది. దుఃఖార్తులగువారు ధన్యులు; వారు సమాశ్వాసింపఁబడుదురు. సౌమ్యులగు వారు ధన్యులు; వారు భూస్వామ్యమును బొందుదురు. పుణ్యముకొఱకు కాఁకలిదప్పులు గొన్నవారు ధన్యులు; వారు తృప్తిపఱుపఁబడుదురు. కరుణాళువు లగువారు ధన్యులు; వారు కరుణింపఁబడుదురు. శుద్ధహృదయము గలవారు ధన్యులు; వారీశ్వరునిదర్శింతురు. మనశ్శాంతి చేయువారు ధన్యులు; వారీశ్వరతనూజు లనఁబడుదురు. ధర్మము నిమిత్తము బాధపడువారు ధన్యులు; స్వర్గరాజ్యము వారిది."—అని బోధింప నుపక్రమించెను. ఉపన్యాసారంభమునఁ జేయఁబడిన యీ యుపదేశాష్టకముయొక్క భావము నచ్చటివా రప్పుడు చక్కఁగా గ్రహింపఁగలిగిరో లేకపోయిరో కాని యీయమూల్యవాక్యరత్నము లనుబట్టి జీవనస్సు మనస్సులో నైహికరాజ్య మంపచ్చింత లేదనియు నతని నాయకత్వ మంగీకరించినవారు భూలోకవైభవాపేక్ష వదలుకోవలసిన దనియు స్పష్టముగాఁ దెలిసికొని యుందురు. దుఃఖము, ఆకఁలి, దైన్యము, బాధలు, మొదలగు శ్రావ్యములు కానిమాట లిహలోక

సంపదల కాశించుచున్న యనేకుల కారంభదశలోనే యాశాభంగ
మును గలిగించి యుండును. అయినను జీసస్సుయొక్క వాగ్మాధుర్య
మును బట్టియు నుపన్యాసమునందలి విషయగౌరవమును బట్టియు
మనస్సు చెదరనీయక యెల్లవారును దానిని కడవఱకును పరమాదర
ముతో వినిరి. అపూర్వ మైన యీ ధర్మోపన్యాసశేషమును సమగ్ర
ముగా నిందుఁ బొందుపఱుచుచున్నాను.—

"నా నిమిత్తమై జనులు మిమ్ము దూషించినప్పుడును బాధించి
నప్పుడును మీమీఁద నన్యాయముగా సర్వవిధ దురారోపణములను
జేసినప్పుడును మీరు ధన్యు లగుదురు. పరలోకమున గలుగు ఫల
మధిక మయినది. కాఁబట్టి మీరు మోదించి యపరిమితానందము
నొందుఁడు. మీకుఁ బూర్వమునం దుండిన ప్రవక్తలనువా రీవిధము
వనే బాధ పెట్టిరి.

మీరు భూమికి లవణ మయినవారు. లవణమే తనసారమును
బోగొట్టుకొన్న పక్షమున, ఇఁక దానికి దేనితో చవి కలిగింపఁ
బడును? అది అప్పటినుండి పాఱవేయఁబడి మనుష్యుల కాళ్ళక్రింద
త్రొక్కఁబడుటకే కాని మఱి యెందునకును బనికిరాని దగును.

మీరు ప్రపంచమునకు వెలుగయినవారు. పర్వతముమీఁదఁ
గట్టఁబడిన పురము మఱుఁగుపడి యుండనేరదు. మనుష్యులు దీప
మును వెలిగించి దీపస్తంభముమీఁదఁ బెట్టుదురే కాని కుంచము
క్రిందఁ బెట్టరు. అది యింట నున్నవారి కందఱికిని వెలుతురు నిచ్చును.
జనులు మీ సత్కార్యములను జూచి పరలోకపితయొక్క మహి
మను బ్రశంసింపఁ గలుగుటకుఁ దగినట్లుగా వారిముందు మీ వెలుతురు
ప్రకాశింపనిండు.

ధర్మశాసనమును గాని ప్రవక్తలను గాని నేను జెఱుపవచ్చితి నని తలఁపఁబోకుఁడు. నేను నడిపించుట కయి వచ్చియున్నాను గాని నాశనము చేయుట కయి రాలేదు. భూమియు నాకాశమును గతించు వఱకును ధర్మశాసనము నుండి లవ లేశ మయినను పూర్ణముగా నెఱ వేర్పఁబడక యేవిధమునను గతింప దని నేను మీకు నిశ్చయముగాఁ జెప్పుచున్నాను. కాఁబట్టి యీసూక్ష్మము లయిన యాజ్ఞలలో నెవ్వఁ డొక్క దాని నతిక్రమించి లోకమున కట్లు బోధించునో వాఁడు పర లోకరాజ్యమునం దధమాధముఁ డని చెప్పఁబడును; ఎవ్వఁడు వానిని తా నాచరించి ప్రవచనము చేయునో వాఁడు పరలోకరాజ్యమున ఘనుఁ డనఁబడును. మీ నీతివర్తనము లేఖకులయొక్కయు ఫారిసీల యొక్కయు నీతివర్తనమును మించిన దయిసం గాని మీ రెప్పుడును స్వర్గరాజ్యమునఁ బ్రవేశింపఁ బోరని మీకు నేను జెప్పుచున్నాను.

నీవు హత్య చేయరాదు; ఎవ్వఁడు హత్యచేయునో వాఁడు విచారణోపద్రవమును (దండనమును) బొందును. అని పూర్వకాలపు వారిచేఁ జెప్పఁబడినట్లు మీరు వినియున్నారు. ఎవ్వఁడు నిష్కారణముగాఁ దన సోదరునియెడ కోపము చూపునో వాఁడు న్యాయవిచారణోపద్రవమును బొందు ననియు, ఎవ్వఁడు తన సహోదరుని 'నీచుఁడా' యని పలుకునో వాఁడు విచారణోపద్రవమును బొందు ననియు, 'బుద్ధిహీనుఁడా' యని యెవ్వఁ డనునో వాఁడు నరకాగ్ని భయమును బొందునని యు నేను మీకుఁ జెప్పుచున్నాను. కాఁబట్టి నీ వుపహారమును గొని బలిపీఠమునకుఁ బోయి యున్నప్పుడు నీసోదరుని యెడ నీవేదో యపరాధి వయినట్లు నీకక్కడ నిస్మరణకు వచ్చినను నీయుపహారమును బలిపీఠమువద్దనే దిగవిడిచి తిన్నఁగాఁ బోయి మొట్ట మొదట నీసోదరుని సమాధాన పఱచి పిమ్మట వచ్చి నీయుపహారమును

సమర్పింపుము. నీవాతనితో దారిలో నుండఁగానే శీఘ్రముగా నీప్రతిపక్షునితో సమాధానపడుము. లేకపోయినయెడల నీప్రతిపక్షుఁ డెప్పుడయినను నిన్ను న్యాయాధికారి కప్పగించును; నీవు చెఱసాలలో త్రోయఁబడుదువు. కడపటి కాసుకట్టువఱకును నీవందుండి యేమార్గ మునను వెడలిరావని నీతో నేను సత్యమును జెప్పుచున్నాను.

'నీవు వ్యభిచారము చేయరాదు' అని పూర్వకాలవువారిచేతఁ జెప్పఁబడినట్లు మీరు వినియున్నారు. కామముతో నెవ్వఁ డొకస్త్రీ వంకఁ జూచునో వాఁ డావఱకే యామెతో మానసిక వ్యభిచారము చేసినవాఁ డని నేను మీకుఁ జెప్పుచున్నాను. కాఁబట్టి నీ కుడికన్ను నీ కపరాధియయినపక్షమున దానిని పెరికివేసి నీయొద్దనుండి పార వేయుము. ఎందున కన, నీశరీరమంతయు నరకాగ్నిలో వేయఁబడక నీయవయవములలో నొకటి నశించుట నీకు లాభకరము. నీకుడిచేయి నీ కపరాధి యయిన పక్షమున, దానిని ఖండించివేసి నీయొద్దనుండి పాఱవేయుము. ఎందున కన, నీశరీర మంతయు నరకాగ్నిలో వేయఁబడుట కంటె నీయవయవములలో నొక్కటి నశించుట నీకు లాభకరము.

తనభార్యను విడిచిపెట్టువాఁ డెల్లను వివాహబంధ విమోచన పత్రము నియ్యవలెను' అని చెప్పఁబడి యున్నది. జారత్వకారణమునఁ దక్కఁ దనభార్య నెవ్వఁడు పరిత్యజించునో వాఁ డామెను వ్యభిచరించు నట్లు చేసినవాఁ డగు ననియు, అట్లు పరిత్యజింపఁబడిన దానిని వివాహ మాడువాఁడు వ్యభిచారము చేసినవాఁ డగు ననియు నేను మీకుఁ జెప్పుచున్నాను.

మఱియు 'నీవప్రమాణములు చేయక, నీప్రమాణముల నీశ్వ రుని కడ చెల్లింపవలెను' అని పూర్వకాలపువారిచేతఁ జెప్పఁబడినట్లు

మీరు వినియున్నారు. "మీరెవ్వడును ప్రమాణములే చేయకుఁడు. ఆకాశముతో డనఁ బోకు — అది దేవుని సింహాసనము; భూమితో డనఁబోకు —అది యాతనిపాదపీఠము; జెరూసలేముతో డనఁబోకు — అది మహారాజపట్టణము; నీశిరస్సుతో డని యొట్టుపెట్టుకోకు — నీ వొక్క వెండ్రుకను నల్లగాఁ గాని తెల్లగాఁ గాని చేయ లేవు. నీభాషణము అయిన దాను, కానిదికాదు. అయి యుండనిమ్ము. వీని కంటె నధిక మయినదంతయు చెడుగునుండి వచ్చిన దగును." అని నేను మీకుఁ జెప్పుచున్నాను.

'కంటికి కన్ను పంటికి పల్లు' అని చెప్పబడినట్లు మీరు విని యున్నారు. దౌష్ట్యమున కెదురొడ్డక, ఎవ్వరయినను నీ కుడిచెంప మీఁదఁ గొట్టినయెడల, రెండవచెంపనుగూడ నాతనివంక త్రిప్పుము. ఏమనుష్యుఁ డైనను వ్యాజ్యమూడి నీచొక్కాను తీసికొన్నయెడల, నీపయిబట్టకూడ వానినే దీసికొననిమ్ము. ఎవ్వఁ డయినను ని న్నరక్రోసు దూరము నడువ బలవంతపెట్టినయెడల, క్రోసుదూరము నీ వాతనితో నడువుము. నిన్ను వేఁడుకొనువాని కిమ్ము; నీవద్ద బదు లడుగఁ గోరు వానినుండి తొలఁగి పోకు" అని నేను మీకుఁ జెప్పుచున్నాను.

'నీవు నీపొరుగు వానియెడ ప్రేమచూపవలెను; నీశత్రువును ద్వేషింపవలెను' అని చెప్పఁబడఁగా మీరు వినియున్నారు. "మీ శత్రువులయెడలఁ బ్రేమ చూపుడు; మిమ్ము శపించువారి నాశీర్వ దింపుడు; మిమ్ము ద్వేషించువారికి మేలు చేయుఁడు; మి మ్మనూ యతో ననాదరించి బాధించువారినిమిత్తము ప్రార్థింపుడు. అందు వలన మీరు పరలోకమునం దున్నమీతండ్రికి కుమారు లగుదురు. ఎట్లన, ఆయన, తనసూర్యుని చెడ్డవారిమీఁదను మంచివారిమీఁదను ఉదయించు (ప్రకాశించు) నట్లు చేయుచున్నాడు; ధార్మికులకును

అధార్మికులకును వర్షమును బంపు చున్నాఁడు. మీమీద ప్రేమ గలవారిపైని మీరు ప్రేమ చూపినయెడల, మీకు ఫల మేమి? ఆలాగున సుంకరులు సహితము చేయుచుండ లేదా? మీసోదరులకు మాత్రము మీ రభివాదము చేసెడుపక్షమున, ఇతరులకంటె మీ రెక్కువ చేయుచున్న దేమున్నది? ఆలాగున సుంకరులుసహితము చేయరా? కాఁబట్టి స్వర్గమునం దున్న మీతండ్రి పరిపూర్ణుఁడయి యున్నట్లుగానే మీరును పరిపూర్ణులు కండు.

మనుష్యులచే చూడఁబడునిమిత్తమయి వారియెదు నీవు దానము చేయకుండ జాగ్రత్తపడుము. లేకపోయినయెడల, పరలోకమునం దున్న నీతండ్రియొద్ద బహుమానమును నీవు పొందవు కాఁబట్టి సభాగృహములలోను వీధులలోను మనుష్యుల మెప్పున కయి వేషధారులు చేయునట్లుగా, దానము చేయునప్పుడు నీవు నీయెదుట చాటుకోఁబోకు. వారికి వారిఫలము కలదని నేను నిశ్చయముగాఁ జెప్పుచున్నాను. నీవు దానము చేయునప్పుడు నీకుడిచేయి చేయు దానిని నీయెడమచేతికిఁ దెలియనీకు. నీదానములు రహస్యముగా జరుగనిమ్ము. రహస్యమునఁ జూచెడు తండ్రియే బహిరంగముగా నీకు బహుమానము చేయును.

నీవు ప్రార్థన చేయునప్పుడు వేషధారులవలెఁ జేయఁబోకు. వీలయున, మనుష్యులచే చూడఁబడునిమిత్త మయి వారు సభామందిరములలోను వీధులమూలలలోను నిలుచుండి ప్రార్థన చేయ నభిలషింతురు. వారికి వారిఫలము కలుగునని నేను మీతో నిశ్చయముగాఁ జెప్పుచున్నాను. నీవు ప్రార్థించునప్పుడు గదిలోనికిఁ బోయి తలుపు వేసికొన్నతరువాత నంతరంగమున నున్న తండ్రిని ప్రార్థింపుము. రహస్యమునఁ జూచెడు నీతండ్రి నీకు బహిరంగముగా బహుమానము

చేయును. నీవు ప్రార్థన చేయునప్పుడు ప్రతిమార్చకులవలె నిరర్థకము లైనవునరుక్తములను వాడఁబోకుము. వీలయున, అధికముగా మాటాడుటవలననే తమ మొఱ యాలకింపఁబడు నని వారు భావింతురు. కాఁబట్టి మీరు వారివలె నుండఁబోకుఁడు. మీకేమి కావలసి యున్నవో మీరడుగకముందే మీతండ్రి యెఱుఁగును. కాఁబట్టి మీరీవిధమునఁ ప్రార్థింపుఁడు — మాతండ్రీ! నీనామము పవిత్రీకరింపఁబడునుగాక! నీరాజ్యము వచ్చునుగాక! పరలోకమునందు వలెనే భూలోకమునందును నీయిచ్ఛయే నెరవేఱునుగాక! నేఁడు మాకు మాదినాహారము ననుగ్రహింపుము. మాఋణస్థులను మేము మన్నించు నట్లే నీవు మాఋణములను మన్నింపుము. మమ్మింద్రియవికారములోఁ బడనీయక పాపములనుండి విమోచనము చేయుము. వీలయున, రాజ్యమును, బలమును, మహిమయు నిరంతరమును నీవి. తథాస్తు!—మనుష్యుల వ్యతిక్రమములను మీరు క్షమించినపక్షమున, మీపరలోకపితకూడ మీవ్యతిక్రమములను క్షమించును. మనుష్యుల వ్యతిక్రమములను మీరు క్షమింపనిపక్షమున, మీతండ్రియు మీ వ్యతిక్రమములను క్షమింపకుండును.

అంతేకాక మీరుపవాసములు చేయునప్పుడు వేషధారులవలె మీరు దీనముఖులఁ బెట్టుకోకుఁడు. వీలయున, తా ముపవాసము చేయుచున్నట్టు మనుష్యులకు కనఁబఱుటకయి వారు తమముఖము లను వికృతముగాఁ జేసికొందురు. వారికి వారిఫలము కలదని నేను మీకు నిశ్చయముగాఁ జెప్పుచున్నాను. నీవో, యుపవాసము చేయు నప్పు డుపవాసము చేయుచున్నట్టు మనుష్యులకుఁగాక యంతరంగ మున నున్ననీతండ్రికిమాత్ర మగపడునట్లు గా శిరస్సంస్కారము చేసి కొని ముఖప్రక్షాళనము చేసికొమ్ము. రహస్యమునఁ జూచెడు నీతండ్రి

నీకు బహిరంగముగా ఫలదానము చేయును. కీటకములును త్రుప్పును భ్రష్టము చేయునట్టియు దొంగలు కన్నము వేసి దొంగిలునట్టియు భూమిమీఁద మీసంపదలను గూడఁబెట్టక, కీటకములుగాని త్రుప్పు గాని నాశము చేయనట్టియు చోరులు కన్నము వేసి యపహరింప నట్టియు పరలోకమునందు మీసంపదలను మీకొఱకు నిలువచేసి కొనుఁడు. మీవిత్త మెక్కడనుండునో మీచిత్తముకూడ నక్కడనే యుండును. నేత్రము శరీరమునకు జ్యోతి యగుటచేత, నీకన్ను తిన్నఁగా నున్నపక్షమున నీసర్వశరీరమును తేజోమయ మయి యుండును; నీకన్ను చెడినపక్షమున నీసర్వశరీరము నంధకారబంధుర మగును. అందుచేత నీలోపల నున్న వెలుతురే కలుష మైనపక్షమున, ఆయంధకార మెంత గాఢమై యుండును! ఏమనుష్యుఁడును ఇద్దఱు ప్రభువులను సేవింపలేఁడు. అతఁడొకరిని ద్వేషించి యొకరిని ప్రేమించును; లేదా, యొకరి నాశ్రయించి మఱియొకరిని తిరస్కరించును. మీరు దేవునిని ధనలక్ష్మినికూడ కొలువలేరు. కాఁబట్టి మే మేమి తిందుము? మే మేమిత్రాగుదుము? అని మీజీవనమునుగూర్చి కాని, మే మేమిధరింతుము? అని మీదేహమునుగూర్చి కాని, ఆలోచింప వలదని నేను మీకు చెప్పుచున్నాను. ఆహారమునకంటె జీవనమును, వస్త్రములకంటె శరీరమును, గొప్పవికావా? గాలిలోనిపక్షులను చూడుఁడు; అవి విత్తనములు వేసి, కోసి, కొట్లలో నిలువ చేసికోవు. అయినను మీపరలోకపిత వాని కాహారము దయచేయుచున్నాఁడు. వానికంటె మీరు మిక్కిలి శ్రేష్ఠతరములుకారా? ఆలోచన చేసి మీలో నెవ్వరు తనుపరిమాణమున కొక్కమూర చేర్పఁగలరు? వస్త్రములకొఱకు మీకేల చింత చేసెదరు? పొలములలోనిగడ్డి వువ్వులను గూర్చి యవి యెట్లువర్ధిలుచున్నవో యాలోచింపుఁడు. అవి కష్టపడి,

నూలువడకవు. అయినను సొలోమా నంతటి వాఁడు సహితము తన మహోన్నతదశలోను వానిలో నొక్కదానిని కోలిన వస్త్రధారణము చేసికొనియుండఁ డని నేను మీకుఁ జెప్పుచున్నాను. కాఁబట్టి ఓ భక్తి హీనులారా! నేఁడుండి రేపు పొయిలో వేయఁబడెడి పొలములోని గడ్డికే యిటువంటి యాచ్ఛాదనమును బ్రసాదించియున్నప్పుడు, మీ కింత కంటె నధికముగా నాచ్ఛాదన మనుగ్రహింపఁడా? కాఁబట్టి మే మేమి తిందు మనికాని, యేమి త్రాగుదు మనికాని, వేనితో నాచ్ఛాదితుల మగుదు మనికాని, చింతింపఁబోకుఁడు; ఈ యన్నివస్తువులును మీకుఁ గావలసిన వని మీపరలోకపిత యెఱుఁగును. మీరు మొట్ట మొదట నీశ్వరరాజ్యమును, ఆతనినీతిని, వెదకుఁడు. ఈవస్తువులన్నియు మీకు చేర్పఁబడును. కాఁబట్టి రేపటికొఱ కాలోచన చేయకుఁడు. రేపటిదినము తానే యావస్తువులకొఱ కాలోచన చేయును. ఆనాఁటి చింతయే యానాఁటికి చాలియుండును.

మీరు విమర్శింపఁబడ రని యెంచుకోకుడు. వీర్యాయముతో మీరు విమర్శింతురో దానితోనే మీరును విమర్శింపఁబడుదురు. ఏకొలపాత్రముతో మీరు కొలుతురో మరల దానితోనే మీకు కొలువఁబడును. నీవు నీపొరుగువానికంటిలోనినలుసును జూచుచు, నీనేత్రమునందే యున్న దూలమునుగూర్చి యేల యాలోచింపవు? నీకంటిలోనే దూల ముండఁగాఁ జూచుచు, 'నన్ను నీకంటిలోని నలు సును దీయని' మ్మని నీసోదరునితో నీవెట్లనఁ గలవు? ఓవంచకుఁడా! మొట్టమొదట నీకంటిలోనుండి దూలమును తీసివేసికొమ్ము; అప్పుడు నీసోదరునికంటిలోనుండి నలకను దీసి వేయుటకు చక్కఁగా చూడఁ గలుగువు. పవిత్రమైనదానిని కుక్కలకు వేయకుఁడు; మీముత్యము

లను పందులముందు వేయకుఁడు — అవి వానిని తమకాళ్ళక్రింద నలుగఁద్రొక్కి యెదురు తిరిగి మిమ్మే క్రుమ్మును. అడుగుఁడు; మీకియ్యఁబడును. వెదకుఁడు, మీకు కనఁబడును. తట్టుఁడు; మీకు తెఱవఁబడును. తనకొడుకు రొట్టె నడిగినప్పుడు వానికి రాయియిచ్చు వాఁడు మీలో నేపురుషుఁడుండును? వాఁడు చేప నడిగినప్పుడు వాని కతఁడు పామునిచ్చునా? మీబిడ్డలకు మంచియీవుల నెట్లియ్యవలెనో పాపు లయిన మీరే యెఱిఁగి యున్నప్పుడు, పరలోకమునం దున్న మీతండ్రి తన్ను వేఁడినవానికి మంచివస్తువుల నింకను నెంత యధిక ముగా నిచ్చును? కాఁబట్టి మనుష్యులు మీకేమి చేయవలె నని మీరు కోరుదురో వానిలెల్లను వారి కాలాగుననే మీరును చేయుఁడు. ఇదియే ధర్మశాస్త్రమును ప్రవక్తృవచనమును.

మీరు తిన్నని దారిని లోపలఁ బ్రవేశింపుఁడు; వినాశమునకు గొనిపోయెడు ద్వారము విశాల మయినదియు దారి వెడల్పయిన దియు కాఁబట్టి యామార్గమున లోనికిఁ బోవువా రనేకు లుందురు. (నిత్య) జీవమునకుఁ గొనిపోయెడి ద్వారము సరళ మయినదియు దారి యిఱు కయినదియు కాఁబట్టి దానిని కనుఁగొనువారు కొందఱే యుందురు. అబద్ధప్రవక్తలను గూర్చి మీరు జాగ్రత్త పడుఁడు; గొఱ్ఱె (సాధు) వేషములతో మీవద్దకు వత్తురు కాని వారు లోపల నత్యశనాతురము లయిన తోడేళ్ళు (క్రూరచిత్తులు). వారివలని ఫలము లను బట్టి మీరు వారిని తెలిసికొందురు. మనుష్యులు ముండ్లపొదల నుండి ద్రాక్షఫలములను గాని మేడిపండ్లను గాని సంగ్రహింతురా? ఆలాగుననే ప్రతిసద్వృక్షమును సత్ఫలముల నిచ్చును; దుష్టవృక్షము దుష్ఫలముల నిచ్చును. ఒక మంచిచెట్టు చెడుఫలముల నియ్యనేరదు;

చెడు చెట్టును మంచిఫలముల నియ్యఁజాలదు. మంచిఫలముల నియ్యని ప్రతివృక్షమును నఱకఁబడి నిప్పులో వేయఁబడును. కాఁబట్టి ఫలము వలన మీరు వాని నెఱుఁగుదురు.

పరలోకమునం దున్న నాతండ్రియొక్క చిత్తానుసారముగా నాచరించువాఁడే కాని ననున్నుఁ గూర్చి 'ప్రభువా! ప్రభువా!' అని పలుకువాఁ డెల్లను స్వర్గరాజ్యములోఁ బ్రవేశింపఁడు. 'ప్రభువా! ప్రభువా! మీ పేరిట మే మనాగతమును నూచించి యుండలేదా? మీ పేరిట మేము దయ్యములను వెడలఁ ద్రోలలేదా?' అని యా దినముల నాతో ననేకులు పలుకుదురు. 'మిమ్మును నే నెన్నఁడు నెఱుఁగను; నీతిమాలి వర్తించిన మీరు నాయొద్దనుండి తొలఁగుఁడు' అని వారితో నే నప్పు డందును. కాఁబట్టి యీ నావాక్యములను విని తదనుగుణముగా నెవ్వఁ డాచరించునో యటువంటివాని నెల్లను దన యింటిని జాతిమీఁదఁ గట్టుకొన్న బుద్ధిమంతునితోఁ బోల్చెదను. వర్షము కురియును; వఱదలు వచ్చును; గాలి వీచి యీయింటిమీఁద గొట్టును; జాతిబండమీఁద పునాది వేయఁబడినందున, ఆయిల్లు కూలదు. ఈనా వాక్యములను విని వానిప్రకారముగా నడవనివాఁ డెల్లను దనయింటి నినుకపైఁ గట్టుకొన్న బుద్ధిహీనునితో సరిపోల్పఁబడును. వాన దిగును; వఱదలు వచ్చును; గాలి వీచి యీ యింటిమీఁద కొట్టును; అది పడిపోవును; దానిపాటు మిక్కిలి గొప్పదగును."

వయి యుపన్యాసమునం దీశ్వరరాజ్య మన్న వచనమునకుఁ బనియభిప్రాయమేమో జీసస్ తన శిష్యబృందమునకు మనస్సు నొవ్వకుండ మంచిమాటలతో క్రమక్రమముగా విప్పి చెప్పివేసెను. అక్క

డిట్లు నేర్పుతోఁ బలుకక యీశ్వరరాజ్యవిషయమున వా రెదురు చూచుచుండిన దంతయు నసాధ్యమైన పనికిమాలిన యెన్నిక యని యొక్కసారిగాఁ జెప్పివేసినయెడల వారిమనస్సులకు నొప్పి కలుగుటయే కాక పలువురకు కోపము సహితము వచ్చియుండును. అట్లుచేయక యతఁడు శాంతవచనములతోఁ దా నుద్దేశించి యున్న యుత్తమ ధర్మములను బోధించి వారిమనస్సులోనున్న భ్రమను తొలగింపఁగా, తామావఱకు పలవరించుచున్న ప్రాపంచికవైభవనిరీక్షణము నిరర్థక మయిన దని వారిమనస్సులకు పొడకట్టును. పయి యుపన్యాసమునం దతఁడు బోధించిన ధర్మములలో నొకటి రెంటికిఁ గొందఱు విపరీతాభి ప్రాయములను జేయుదురు. కుడిచెంపను గొట్టినవాని కెడమచెంపఁ ద్రిప్పవలసిన దని యతఁడు చెప్పినదానికిఁ బరులు పెట్టెడు బాధను శాంతతతో సహించి తన కపకారము చేసినవానికిని బ్రత్యపకారము తలఁపవల దని బోధించుటయే కాని నిజముగా నెడమచెంప త్రిప్పవలె నని తాత్పర్యము కాదు. ఇట్లు దృష్టాంతపూర్వకముగాఁ జెప్పిన యీ యర్థమునే యతఁడు శత్రువులపయిని సహితము ప్రేమ చూపవలసిన దనియు చెడుగు చేసినవానికిని మేలు చేయవలసిన దనియు స్పష్టము గానే ముందుగాఁ దెలిపెను. భూలోకధనమును జేర్చక పరలోక సంపదలను గూడఁబెట్టఁ బ్రయత్నింపుఁ డని జీసస్ బోధించినదాని తాత్పర్యము క్షణభంగురము లైన యిహలోకవస్తువుల సంపాదనమున కంటె నిత్యమైన నీతి ధనార్జనము ముఖ్యముగాఁ జేయవలసిన దనుటయే కాని యశనవసనాదులను గూర్చి ప్రయత్నమే చేయఁగూడదని కాదుఁ ఎల్లప్పుడును నన్న వస్త్రాదులను గూర్చియే చింతించుచున్నచోఁ బర మార్థచింత యడుగంటు నన్న యుద్దేశముతో నతఁడు తేపటినిగూర్చిన చింతి మానఁ డని బోధించెనే కాని యంతకంటె వేఱు కాదు. అపు

వాక్యములలోనే యతఁడు పక్షుల కాహారము ప్రసాదించెడి యీశ్వరుఁడు మనుష్యునిఁ గాపాడకుండునా యనియు గడ్డిపూలకు విచిత్రవర్ణములు దయచేసిన దయాళుఁడు మనుష్యులకుఁ గట్ట నియ్యకుండునా యనియుఁ దెలిపి, అన్నవస్త్రాదులను గూర్చిన చింతయే సదాపూనక యీశ్వరుని మీఁద భారమువేసి శుద్ధవర్తనము నిమిత్తమయి పాటుపడుచున్నచో విశేష ప్రయాస మక్కఱలేకయే భగవదనుగ్రహమువలన నన్నపానాదులు లభించునని సత్కార్యాచరణమునకుఁ బురికొల్పెను.

వీడవ ప్రకరణము

(స్నాతకుఁడైన) జానుయొక్కసందేశము, జెరూసలేముయాత్ర.

బహుకాలమువఱకును దావున నున్న జీసస్ యొక్క మిత్రులకు సహితము "అభిషిక్తుఁడు (మెస్సయా)" అను పదమునకును "ఈశ్వర రాజ్యము" అను పదమునకును అతఁడుద్దేశించుకొన్న యర్థము తెలియదు. అట్టిస్థితిలో దూరమున నున్న (స్నాతకుఁడగు) జానున కెట్లు తెలియవచ్చును? ఇతరజనులవలెనే యతఁడును మెస్సయా దేశము నుండి రోమనులను వెడలఁగొట్టి, స్వదేశస్థులను లోకమునకు ప్రభువు లనుగాఁ జేయునని నమ్మియుండెను. జీస స్పట్టి యైహికరాజ్యచింత లేనివాఁ డయి వరమమయిన యొక యుత్తమకృత్యమును గూర్చి యాలోచించుచుండెను. రోమనులుపోయి యూదులు దేశమునకు ప్రభువులయినను ప్రజ లప్పటికంటె నధికసుఖము ననుభవించువారు కాఁజాలరనియు, న్యాయదయాదాక్షిణ్యాదుల నెఱిఁగి యభ్యసించు వఱకును లోకము మంచిదశకు రానేరదనియు, ఎఱిఁగినవాఁడయి జీసస్ జనులలో శాంతియు నీతియు ప్రీతియు నెలకొల్పు సాధనము చూచుచుండెను. అతఁ డుద్దేశించిన మహాకార్య మల్పకాలములో నెఱవేఱు నది కాదు. అతఁ డామహాకార్య పర్యాలోచనములోనుండఁగా నక్కడ గొంతకాలమునుండి కారాబద్ధుఁ డయియున్న జాన్ తా నాశతో నెదురుచూచుచుండిన యవ్వల్కృత్యమును నిర్వహింపక జీసస్ వృథా కాలక్షేపము చేయుచున్నాఁ డని నందేహ మొంది తత్తఱపడసాగెను. జాన్‌చేయు బోధవలన దేశక్షోభము సంభవించునని భయపడి ప్రభు త్వమువా రాతనిని బోధింపనీయక పట్టి తెచ్చి యాతని నాఱునెలల

నుండి మృతవముద్రతీరమం దుండిన మాకిరోనగరమునందలి చెఱ
సాలలో నుంచియుండిరికాని యారంభదశలో నాతనిని మిత్రులతో
మాటాడనిచ్చుటయేకాక శిష్యులకు సందేశములను సహితము పంప
నిచ్చుచుండిరి. చెఱసాలలోఁ బెట్టఁబడినతరువాత నాతనికి దినములు
గడచినకొలదిని మెస్సయా పనిమీఁది తహతహ హెచ్చఁ జొచ్చెను.
మెస్సయా యేమోచేయునని యెదురు చూచుచుండఁగా నెలలుకడచి
నను, ఆతఁడు చేసినపనియేమియుఁ గనరాలేదు. ఇట్లుండ కడకుజీసస్
కొండమీఁదఁ జేసిన ధర్మోపన్యాసవృత్తాంత మాతని చెవినిబడెను.
ఏమిచేయుమన్నను జేయుటకు సంసిద్ధమయి యున్న భక్తకోటితోఁ
గూడియుండియు రాజులయి యున్న యన్యదేశస్థులను దేశమునుండి
తొలఁగఁదోలు ప్రయత్నమును గూర్చినమాట యొక్కటియైనను
ఆయుపన్యాసములో లేకపోవుటయేకాక పయిపెచ్చు శత్రువుల
పయిని ప్రేమచూపవలె ననన్నయుపదేశము కనఁబడుటచేత నాతని
మనస్సునకది తృప్తికరముగా నుండలేదు. అందుచేత నాతనిడెందములో
జీసస్ మెస్సయాయగునో కాఁడోయని సందేహముసహితము కలిగెను.
కాఁబట్టి యతఁడు తనమనస్సంతుష్టికయి తనమిత్రులను కొందఱను జీసస్
కడ కంపి 'ప్రతీక్షింపఁబడినవాఁడవు (మెస్సయావు) నీవా? లేక మేము
వేఱొకనికొఱకు చూడవలెనా?" అని యడుగ నియమించెను.
ఆదూతలువచ్చి చూచునప్పటికి జీసస్ పూర్వప్రకారముగానే రోగ
ములు కుదుర్చుచు ధర్మోపదేశములు చేయుచునుండెను. వారాతనిని
సందర్శించి తమగురుఁ డడుగ నియమించినప్రశ్నలను రహస్యముగా
నడుగక యందఱిలోను బహిరంగముగా నడిగిరి. జీసస్సున కప్పుడేమి
చెప్పుటకును పాలుపోలేదు. నేనే మెస్సయానని చెప్పినపక్షమున,
తాను గొంతకాలములో సేనలను గూర్చికొనిపోయి పోరాడ నుద్దేశించు

గొని యున్నట్టు జానునకు దుర్భ్రిమ కలుగును. నేను మెస్సయాను
కానని చెప్పినపక్షమున, అది తానునమ్మినదానికి విరుద్ధ మగుటయే
కాక దానివలన శిష్యులకెల్లను నుత్సాహవిశ్వాసములు చెడిపోవును.
కాఁబట్టి యతఁ డాలోచించి తోడనే యేదోప్రత్యుత్తరము చెప్పక
తీఱదు కనుక సమయోచితబుద్ధి కలవాఁ డయి "మీరుమరలఁబోయి
యిక్కడ నాశిష్యమధ్యమున మీరునావిషయమయి విన్నదానిని కన్న
దానిని జానుతోఁ జెప్పుఁడు. నాపయిని గోపము వహింపనివాఁడు
ధన్యుఁడని కూడ మీరాతనితోడఁ జెప్పుఁడు." అని యుత్తరమిచ్చెను.
'నేను మెస్సయా నగుదునో కానో నేనుజేయుచున్న కార్యములవలననే
మీకు తేటపడియుండవచ్చును. అట్లు తేటపడియుండనిపక్షమున
నేను మెస్సయానని చెప్పుకొనుటవలనఁ బ్రయోజనమేమి?' అని
యాతఁ డిచ్చిన యుత్తరమునకు తాత్పర్యమయినట్టు కనఁబడుచున్నది.
ఈమాటలవలన వేగిరపడ వలదని జానునకు హితము చెప్పు
టయు నాతనియుద్దేశమయి యుండును. అంతట నానందేశహారు
లాతనిని విడిచి వెడలిపోయిరి. ఈసందేశము మరల జానున కందినదో
లేదో, అందినయెడల నాతఁ డెట్లనుకొనియెనో యేమియుఁ దెలియదు.

అటుతరువాత నత్యల్పకాలములోనే జాన్ దెఱసాలలోఁ
బడఁబడెనని దేశమునందంతటను సంక్షోభము పుట్టెను. జీసస్‌చే నావ
కు ధర్మబోధ నిమిత్తమయి పంపఁబడిన పండ్రెండుగురు శిష్యు
లును మరల వచ్చి యింతలో తమగురువు సమ్ముఖమునఁ జేరిరి.
హీరాడ్ చిరకాలమునుండి జాను నంతము నొందింపవలెనని యుద్దే
శించుకొని యుండెను గాని యట్లు చేసినపక్షమున తమ ప్రవక్తను
జంపినందున కయి జనులు తిరుగబడి యేమి యుపద్రవము చేయు
దురో యని జంకుచుండెను. ఆతనిని సంహరింప కుండిన పక్షమున

నాతని కాజ్ఞానువర్తులయి లెక్కకెక్కుడుగానున్న యతని యనుచరు
లెప్పుడైన నాకస్మికముగా రాజద్రోహు లయి రోమనులపై ధ్వజ
మెత్తి మతోన్మాదముచేత దేహముల కాశపడక క్రూరకృత్యములు
చేయవచ్చు ననియు భయపడుచుండెను. ఆతఁ డెట్లు చేయుటకును
తోఁచక సందేహడోలాయమాన మానసుఁడయి యున్న కాలములోనే
యొక్క తరుణి ప్రేరణముచేతఁ దాను జేయ శంకించుచున్న కార్య
మును జేయవలసినవాఁ డయ్యెను. హీరాడ్ తన సహోదరుఁడు
జీవించి యుండఁగానే యతని భార్యయైన హిరోడియాను వివాహము
చేసికొనెను. అతఁడు చేసినకార్య మకార్య మనియు ధర్మవిరుద్ధ
మనియు జాను తన ధరోపన్యాస సమయములయందు నిశ్శంకముగాఁ
బలుకుచుండెను. హీరాడావార్తను విని మనసులో పగపట్టియుండెను
గాని వెంటనే పగతీర్చుకొనుటకు శంకించి సమయముకొఱకు ప్రతీ
క్షించుచుండెను. హిరోడియాకు ప్రథమభర్తవలన నొకకూఁతు
రుండెను. ఆచిన్నది యొకనాఁ డొకయుత్సవసమయమునందు హీరాడు
నకు మెప్పు పుట్టునట్లు అత్యంత మనోహరముగా నృత్యకౌశలము
చూపెను. ప్రొద్దు పొద్దు వేడుక ననుభవించుచున్న యతఁ డామె
నృత్యమున కానందపరవశుఁ డయి యామెను జేరఁ దీసి శ్లాఘించి
యామె మనోరథ మేమి తెల్పినను దీర్చెదనని పలికెను. ఆతరుణి
యావఱకే తల్లిచేత బోధితురాలయి యుండినందున, స్నాతకుఁడైన
జానుయొక్క శిరస్సును నఱికించి తెప్పించి తనకు బహుమానము
చేయవలసిన దని వేఁడుకొనెను. తాను జేసినబాసను తీసివేయలేక
హీరాడ్ వెంటనే పోయి జానుయొక్క తల నఱికి తేవలసినదని తన
భృత్యుల కాజ్ఞాపించి తదాజ్ఞానుసారముగా వారు ఖండించి తెచ్చిన
శిర స్సాచిన్నదాని కర్పించి తన వాగ్దానము చెల్లించుకొనెను. కొంద

ట్టిదారుణకర్మము ఫారిసీల ప్రేరణమువలన జరుపఁబడిన దని భావింతురు. తనకువలెనే జానునకును గర్భశత్రువులుగా నున్న ఫారిసీ లాతని ప్రాణములు గొనఁ దలచి యున్నారని జీసస్ చిరకాలము క్రిందటనే యెఱిఁగి యుండెను. వారిద్వేషాగ్నికి రెండవబలి కావలసినవాఁడు తానని యు నతఁ డొకవేళ భావించి యుండును. జీసస్సును జనులలోఁ గొంతవఱకుఁ బేరువడి యుండినను జా నంత సుప్రసిద్ధుఁ డయి యంత జనానురంజకుఁడుగా నుండలేదు. అయినను ఫారిసీలుమాత్ర మాతని నపాయకరుఁ డైనశత్రుఁ డని భావించి యీవఱకే యతనివిూఁద నొక కన్ను వైచి యుండిరి. జీసస్ మరణమునకు భయపడలేదుగాని తాను పూనిన కార్యభారమును నిర్వహించుటకు ముందు ఫారిసీల కోపాగ్నికి బలి యగుట కిష్టము లేనివాఁడుగా మాత్ర ముండెను. లోకమునొక్క మేలునిమిత్తము తనప్రాణమును ధారపోయుటకు సంసిద్ధుఁ డయి యున్నను వ్యర్థముగా పోఁగొట్టుకొన నొల్లకుండెను. వారికిఁ దానొప్పగింపఁ దలఁచుకొన్న మహాకార్యమును శిష్యు లైనను నిర్వహింపఁగల స్థితిలో నున్నా రని యతని మనస్సునకు నిశ్చయము కలిగిన పక్షమున, శత్రువుల యెదుటఁబడి యేమి యైనను గాని మ్మని ముఖాముఖిని పోరాడ సాహసించి యుండును. నిర్వహణార్థ మయి యీశ్వరుఁడు తనవిూఁదఁ బెట్టినా ఁ డని యతఁడు దృఢముగా నమ్మియుండిన కార్యభారమును తాను నిర్వహింపక తాను జేయవలసిన కార్య మెంతో యుండఁగా నదుమ నపాయము తటస్థించి నప్పుడు తప్పించుకో గల యుపాయి ముండియు నుపేక్షచేసిన యెడల తానీశ్వరద్రోహము చేసినవా ఁ డగునని యతఁ డనుకొనెను. కాఁబట్టి యతఁడు తన యాప్తశిష్యులు పన్నిద్దఱితోను నిరపాయమైన తావునకు తొలఁగిపో నిశ్చయించుకొనెను. అంతేకాక జను లనేకు

లిప్పుడతనిని మెస్సయా యని తలఁచుచుండిరి. మెస్సయా విషయ
మున తమకుఁ గలిగియుండిన యభిప్రాయమునుబట్టి జాను మరణము
వలన దురాగ్రహావేశపరవశు లయియున్న జనులు ప్రభుత్వమువారిపై
తిరుగఁబడి యుద్ధనన్నద్ధు లయి తమ్ము నడువు మని యాతని నిర్బంధ
పఱుపవచ్చును. అందుచేత నతఁడీకోపోద్రేక మడఁగువఱకును వారి
కంటఁ బడక దూరముగా తొలఁగి యుండుట మంచి దని భావించియు
తన్నానవాలు పట్టలేని విదేశమునకుఁ బోవ నిశ్చయించుకొని యుండ
వచ్చును. అందుచేత నతఁడు శిష్యులను వెంటఁగొని పడవయెక్కి పర
స్తీరనమీపమునుండి పోయి యొక యెడారిఁ జేరెను. అయినను
జనులు పడవ నడుచు జాడను కనిపెట్టి వ్యాధిగ్రస్తులను తమవెంటఁ
దీసికొని తీరము పొడుగునను నడుచుచు రోగులను న్వస్థులను జేయ
వేడుచు జీసస్సు వెంటఁబడఁజొచ్చిరి. అందుచేత నెడారి సహిత మల్ప
కాలములోనే మూఁకలచేత నిండిపోయెను. అప్పు డతఁడు వారియొత్తుడి
నుండి తప్పించుకొనుట కయి యొక నూతనమార్గమున వేఱొకవంకకుఁ
బోవఁదలఁచుకొని వెనుకకు మరలి కాపర్నాము గ్రామనమీపమునకుఁ
బోవలసినవాఁ డయ్యెను. అతనిని వెంబడించువారిలో దారి పొడుగు
నను జాడలు తీసి తెలుపుచుండుట కయి జెరూసలేము నుండి ఘోరి
సీలచేఁ బంపఁబడిన వేగులవారు సహితము కొంద ఱుండిరి. జాను
మరణమువలన జీసస్ భయపడియుండె ననియు, తా మతనిని కొన్ని
ప్రశ్నె లడిగినప్పుడు భయభావమును సూచించెడి యుత్తరము లాతని
నోటినుండి వెలువడఁగానే భీరు వని కనిపెట్టి శిష్యు లాతని యెడలఁ
దమకుఁ గల తొంటి భక్తివిశ్వాసములను గోలుపోవుదు రనియు,
అతఁడు పిత్తికివాఁ డని తేటపడఁగానే జనులు సహిత మాతనిని తి
ష్కారభావముతోఁ జూతురు గాన ప్రజల కాతనియెడల గలగౌరవ

మును చెడఁగొట్టుట కిదే మంచిసమయ మనియు, వారు భావించి
యుందురు. ఈభ్రమతో వా రాతనిఁ జేరఁబోయి "నీ శిష్యులు
చేతులు కడుగుకొనకుండ భోజనము చేయు నంతటి పాపకార్యమున
కొడిగట్టుచుండఁగా నీవేల చూచి సహించుచున్నావు?" అని యవి
నయసూచకము లయిన గర్వోక్తులతో నడిగిరి. చేతులు కడుగుకొన
కుండ భుజించుట పాప మని భావించి యూదులు భోజనమునకు
ముందు మురికినీటిలో నయిన చేతులు ముంచుచుందురు; జీసస్సును
శిష్యులును శుచిత్వము కొఱకు మాత్రమే శుద్ధజలముతో హస్త
ప్రక్షాళనము చేయుచుందురు. జీసస్సు వారు తిన్ను పరాభవ పఱు
చుట కయి విరోధు లగు ఫారిసీల ప్రేరణముచేత వచ్చినవా రని
యెఱిఁగినవాఁ డయి లేశమాత్రమును జంకువడక దారివంకఁ దిరిగి
వారిని రూక్షవీక్షణములతోఁ జూచుచు ధీరభావముతో, "మీ
రాచారదాను లయి యేల యీశ్వరాజ్ఞోల్లంఘనము చేసెదరు? వార్ధ
కము చేత బలహీను లయినప్పుడు తనయులు తల్లిదండ్రులను పోషించ
వలసిన దని ధర్మశాస్త్రము విధించుచున్నది. ఆచారము నాధారము
చేసికొని కృతఘ్నుఁ డయిన సుతునిచేత తనధనవస్తువిషయమున 'నీశ్వ
రార్పణ' మన్నమాట యనిపించి, ఆచార్యపురుషు లైన మీరు శైశ
వము నుండియు తిన్ను పెంచి పెద్దవానిని జేసిన జననీజనకులను వృద్ధ
దశలో పోషింపవలసిన యక్కఱ ధర్మవిరుద్ధముగా కన్న కుమారుని
కర్తవ్యమునుండి విముక్తుని జేయుచున్నారు. ఓవంచకులారా! వీరు
పెదవులతో నన్ను పొగడుచున్నారే గాని వీరి హృదయములు నా
కెంతో దూరముగా నున్న వని యీశ్వరుఁడు మీవిషయమున పలు
కఁడా! భోజనమునకు ముందు చేతులు కడుగుకొనకపోవుట యేమో
దుష్కర్మ మని మీ రనుచున్నారు. అం దేమియు దుష్కర్మము

లేదని నే ననుచున్నాను. తన సొత్తును గూర్చి యీశ్వరార్పిత మని కొడుకునోట పలికించి వాడు వృద్ధు లయిన మాతాపితలకు తిండిపెట్టక పస్తుపడ విడిచిపెట్టి నిర్దోష మని మీరంగీకరించుట మహా ఘోర దుష్కృత్యము." అని పలికెను.

ఈమాటలు ఫారిసీలయుల్లములలో బల్లెమువలె నాటుకొని వారిని మఱింత కుపితులనుగాఁ జేసెను. అంతేకాని వా రుద్దేశించి నట్లుగా జీసస్సు పిఱికివంద యని జను లనుకొనునట్లు చేయుట కయి యెంతమాత్రమును సమర్థములు కాకపోయెను. ఈ వాక్యములను విన్న శిష్యులు కొందఱు మీమాటలు ఫారిసీలను మఱింత యాగ్రహ వ్యగ్రులనుగాఁ జేయలేదా" యని యడుగఁగా "అయినను చింత లేదు. వా రంధులకు నాయకు లయి నడుపు మహాంధులు; వారల్ప కాలములోనే గోతిలో వడుట యనివార్యము." అని చెప్పి యూర కుండెను. జీస స్సెంతమాత్రమును భయపడనివాఁ డయినను, దురా గ్రహగ్రస్తు లయియున్న ఫారిసీలు నమయము వేచి తన ప్రాణములు గొనవలె నన్న దీక్షతో గూఢముగాఁ దన్ను వెంబడింపవచ్చునని యెఱిఁగినవాఁ డయి కొంతకాలము వారు కనుగొనలేని వివిక్తస్థలములకుఁ బోవుట మంచి దని తలఁచి, యక్కడనుండి యతఁడు సైరు సీడన్ తీరములకుఁ బోయెను.

సైరు సీడన్ పురములు ఫినీసియా దేశములోని ముఖ్య పట్టణములు. ఆకాలమునందు ఫినిసియా దేశస్థులు మిక్కిలి ధనసంప న్నులును వృద్ధిగాములును నయి యుండిరి. వారు వ్యాపారముల యందు తెలివిగలవా రయి యత్యంతసమర్థులై యుండిరి. వారు కొంత వఱకు విగ్రహారాధకులు. విగ్రహారాధకుల నెల్ల సామాన్యముగా ద్వేషించునట్లే యూదులు సైరుపురవాసులను సీడన్‌పురవాసులను

ద్వేషించుచుండిరి. కాని వారిప్రాబల్యముచూచి భయపడుచుండిరి. ఆదేశములను మ్లేచ్ఛభూములనుగా నిషేధించి కర్మనిష్ఠులయిన ఫారిసీలు మొదలైన ఛాందసు లాదేశములు త్రొక్కినయెడల తామపవిత్రుల మగుదుమని భావించి యందదడుగిడకుండిరి. అయినను మతోన్మాదులు కాని యూదులనేకులు వాణిజ్యాదికర్మములను పురస్కరించుకొని పోయి యా పట్టణములలోను వానిచుట్టుపట్టులను నివసించుచుండిరి. జీసస్సీదేశమును జేరి తన్ను సురక్షితునిగా భావించుకొనెను; అది స్వాధికారములోఁ జేరినదికాదు కాఁబట్టి తన్నుఁ బట్టుకొనుటకయి హీరాడక్కడకు భటులను బంపలేఁదు; ఆదేశమునం దడుగుపెట్టుటయే పాపమని భావించువా రగుటచేత ఫారిసీలు తన్ను వెన్నాడుటకు సాహసింపఁజాలరు; స్థిరనివాస మేర్పఱుచుకొని యున్న యూదులు పలువురక్కడ నుండియుండుటచేత వారిలో కొందఱు తనయెడల మిత్రభావమును కనఁబఱుప వచ్చును. ఈ హేతువులచేత శత్రుబాధలనుండి తాత్కాలిక విముక్తి నొందుట కది మంచిస్థల మని జీసస్కక్కడ కొంతకాలముండెను గాని యెంతకాలముండెనో నిశ్చయముగా తెలియదు. కాని కొన్నివారము లతఁడక్కడనుండె ననుటకు సందేహము లేదు. స్వదేశమును పరిత్యజించి వరదేశమును శరణ్యముగాఁ జేకొని యుండుట జీసస్సున కవ్వుడు గొప్ప శోధనసమయముగా నుండి యుండవచ్చును. అతనికిని శిష్యులకును దక్క తక్కినవారి కందఱికిని శత్రువులచే నతఁడు పూర్ణముగా పరాజితుఁడయి పలాయితుఁడయ్యెనని తోఁచియుండవచ్చును. కాని యతఁడుమాత్ర మెప్పుడును ధైర్యమును విడువలేదు. భగవంతుఁడభిషిక్తునిగా నియమించి తన కప్పగించినాఁడని యతఁడు త్రికరణశుద్ధిగా నమ్మియుండిన మహాకార్య నిర్వహణపవలన కడపట సంపూర్ణవిజయము నొందక మానఁడని

యతఁ డెంతదృఢనిశ్చయము గలవాఁడయి యుండినను, పరమ కర్తవ్య మయి తనపాలఁ బడిన యీ ఘనకార్యము నీబాధలలోను ప్రతిబంధ ములలోను తా నెట్లు నిర్విఘ్నముగా నిర్వహింపఁ గలుగుదునా యన్న చింతమాత్ర మాతని మనస్సును సదా బాధించుచుండెను. ఫారిసీలు తమ యుపాయములును కృషియు సంపూర్ణముగా సఫలము లయ్యె ననియు జీసస్సు తన పన్నిద్దఱు శిష్యులతోను మరల తమకు మొగము చూపుటకు సాహసింపఁ డనియు తలఁచి తాము కృతార్థుల మయినట్లు గర్వపడుచుండిరి.

ఈ పరదేశావాసము జీసస్సున కనేకవిధముల లాభకర మయ్యెను. మొదటిది భావికర్తవ్యమునుగూర్చి చక్కఁగా నాలోచించు కొనుటకు కావలసినంత యవకాశము కలిగెను. రెండవది శిష్యులకు సర్వ ధర్మములందును సదుపదేశములు చేసి వారిని సుశిక్షితదృఢచిత్తులను గావించుటకయి తగిన క్షణము లు తటస్థించెను. మూఁడవది కయ్యము నకుఁ గాలుద్రవ్వుచు వివాదైక శీలతతో మాటిమాటికి మీఁదిమీఁదికి వచ్చుచుండెడి యవినయపరు లయిన ఫారిసీలవలనను సమయానమ యములను విచారింపక రోగులను స్వస్థపరుపవలసినదని దీనముగా వేఁడుచు కాళ్ళు (పేళ్ళు పట్టుకొని విరామము లేక పయిని బడుచుండెడి మూఁకలవలనను తొందరలు లేకపోవుటచేత నాతనికి సంతత మనశ్శాంతి కలిగెను. సదా చింతనుండి యుపదేశార్థములను శ్రద్ధాళువు లయి కర్ణ రసాయనముగా వినుచుండుటచేత నాశనభక్తి బలోత్సాహములు కలవా రయి శిష్యులు తననాయకునియెడల తొంటికంటెను సహస్ర గుణాధిక మైన (పేమను విశ్వాసమును గలవా రైరి. జీసస్సుయొక్క వానగృహమునకు సమీపమునఁ గాపుర మున్నయొక ఫినీసియా దేశ స్త్రీకి కొంతకాలము నుండి మతిచాంచల్యము నొందియుండిన యొక

కూఁతు రుండెను. తల్లి కాఁగొమారిత యత్యంత ప్రేమాస్పదురాలు. ఆకాలమునందు చిత్తచాంచల్యాదు లైన రోగములచేత బాధపడు వారిని దయ్యములువట్టినవా రని భావించుచుండెడివారు. తన యింటికి దాపుననే కాఁవురమున్న యాపరదేశస్థుఁడు గాలిలీదేశప్రవక్తయని తల్లి యేలాగుననో తెలిసికొనెను. ఎట్టిగినవా రెవ్వరును లేకపోయినను జీసస్సుకీర్తి యావఱకే ఫినీసియావంటి దూరదేశములలో సహితము వ్యాపించెను. యూదులు ఫినీసియా దేశస్థులను కుక్కలకంటెను హీన ముగాఁ జూచుచు వారియెడల దయాదాక్షిణ్యములు లేనివా రయి యుందురని యామె యెఱుఁగును. అయినను తాను పోయి వేడుకొన్న పక్షమున నతఁడు తన ప్రార్థనను వృథాపుచ్చఁడనియు, ఆతని యను గ్రహమువలన నేలాగునైనఁ దనకొమారితను స్వస్థపఱుచుకోఁ గలు గుదు ననియు, ఆమె నమ్మియుండెను. అందుచేత నొకనాఁ డతఁడు శిష్యులను వెంటఁగొని యిల్లువెడలి వీధిలోనికి రాఁగానే తన్ననుగ్ర హించి తన తనయను స్వస్థచిత్తురాలిని జేయువలయునని మొఱ్ఱపెట్టుచు నాతనివెంటఁబడెను. అతఁ డామె మొఱను వినియు వినని యట్లు ముందువంక నడవసాఁగెను. ఆమె వెనుక మరలక దీనస్వరముతో బిగ్గరగా నఱచుచు వెంటనడవఁజొచ్చెను. శిష్యు లామెదీనాలాపము లాలకించి ప్రభువు నుద్దేశించి "యామె మనవి విని వంపి వేయుఁడు" అని వలికిరి. ఆమాటల కతఁడు "నే నిస్రాయిలువంశమువారి రక్ష ణముకొఱకుమాత్రమే పంపఁబడలేదా? మెస్సయా యూదులకొఱకే పంపఁబడినపక్షమున నేనీమె కెట్లు సాయము చేయఁగలను?" అని యుత్తరమిచ్చెను. దానికి శిష్యులు మాఱుపలుకనందున, జీస స్సక్కడ నిలిచి యామె వచ్చి తన్ను కలిసికొనువఱకును వేచియుండెను. మొట్ట మొదట జీస స్సామెమాటలు వినిపించుకోక ముందుకు సాగిపోవుట

శిష్యుల కామె యెడల జాలి కలుగఁజేసి వారిచేత నామెకు తోడుపడవలసినదని పలికించుటకే గాని యామెప్రార్థనను నిరాకరించి పంపివేయవలె నన్న యుద్దేశముతో నెంతమాత్రమును కాదు. మెస్సయా యొక్క యూదులరక్షణార్థమే పంపఁబడు పని యూదు లందటియభిప్రాయము నయి యున్నది. జీసస్సుయొక్క శిష్యులనుసహిత మాయభిప్రాయము పూర్ణముగా విడిచి పోయినది కాదు. ఒక్కయూదులలో మాత్రమే కాక సర్వజాతులవారిలోను సర్వదేశములవారిలోను ఈశ్వరరాజ్యమును స్థాపించుట కయి మెస్సయా పంపఁబడె నని జీసస్సు బోధించినప్పుడు శిష్యులలో నెవ్వరో "మెస్సయా యూదులకొఱకే పంపఁబడె" నని పలికి యుండుటచేత వారిమాటలు వారి కొప్పగించుట కయి వారన్యదేశస్త్రీకి సాయముచేయ వేడినప్పుడు జీసస్సు పయిమాటలు పలికి యుండును.

ఇంతలో నామె సమీపించి పాదములమీఁదఁ బడి "ప్రభువా! సాయము చేయుము" అని దీనముగా వేడుకొనెను. 'నీయభీష్టసిద్ధి యగునుగాక! పొమ్ము' అని యాతఁడామెను పంపివేసెను. ఆమె యింటికిఁ బోయి కొమార్తితో జరిగినవృత్తాంతము చెప్పినప్పటి కాయువతి స్వస్థచిత్తురా లయ్యెనఁట! రోగిని చూడకమునుపే రోగశాంతి కలుగుట యెట్లు తటస్థ మయ్యెనో యూహింప శక్యము కాదు. గాని చికిత్సకునిమాటయందు రోగికి సంపూర్ణవిశ్వాస మున్నచో నట్లు జరుగుట యసాధ్యము కాదని యనుభవశాలులు చెప్పుచున్నారు. దేవునిదృష్టియందు సర్వజనులును సమానులనియు, ఈశ్వరానుగ్రహమును బడయుటకు జాతిమత దేశభేదములు లేక యెల్లవారును సమానముగానే పాత్రులనియు, అతఁడు పయిదృష్టాంతము వలన శిష్యులమనస్సులలో దృఢముగా నాటుకొనునట్లు చేసెను. యూదులు

తాముమాత్రమే యీశ్వరునికి ప్రియ మయినబిడ్డల మనియు, ఇతర జాతులవా రందఱును భగవదనుగ్రహదూర లయినపతిత లనియు, భావించు చుండిరి. జీస స్సట్టిదుర్భ్రమ లెంతమాత్రమును లేనివాఁడయి మానవజాతి యంతయు నీశ్వరసంతాన మనియు, జాతిదేశ వ్యత్యాసములు లేక యెల్ల వారును సోదరభావముతో నీశ్వరరాజ్యములోఁ జేరి సుఖింపవలసినవా రనియు, అట్లు చేర్చి యీశ్వరరాజ్యమును భూమిమీఁద స్థాపించుటయే మిస్సయా యగుటవలనఁ దనపాలఁ బడిన పరమధర్మమనియు, భావించి యుండెను. ఈసత్యమును తన శిష్యకోటియొక్క హృదయఫలకములందు శిలాక్షరములవలె నాటు కొనునట్లు చేయుట కయి యతఁడనేకవిధముల పాటుపడెను.

హైరు సీడన్ పట్టణప్రాంతములయం దీప్రకారముగా కొంత కాలము గడపినపిమ్మట జీసస్సు మరల కేపర్నాములంక స్వదేశమునకు మరలెను. అతఁడు గాలిలీదేశములో ప్రవేశింపఁగానే జనులు యథాపూర్వముగా సంతుష్టస్వాంతములతో సతనిచుట్టును మూగఁ జొచ్చిరికాని, ఫారసీలు జాగరూక లయి యాతని జంపనైనను జంపవలెను లేదా యాతనినో నైనను నడఁపవలెనని తా మారంభములో పూనినపూనిక నిప్పుడుసహిత మెంతమాత్రమును విడిచినవారు కారు. వా రాతనిని వెంటనే తారసించి నీవు మెస్సయా వయినందుకుఁ గలయమానుష మైన నిదర్శనమును దేని నైనను జూపవలసిన దని పట్టుకొనిరి. తన వినాశనోపాయముగా వా రేదోపన్ను గడ పన్నుకొని వచ్చినారని తెలిసికొని జీసస్సు వారి కెంతమాత్రమును సందీయక "ఓ వంచకులారా! మీమాటలతో నాకేమియు పని లేదు పొండు" అని యదలించుచు వారినుండి విముఖుఁడయి శిష్యబృందముతోడ వెడలిపోయెను. జనులకు ధర్మోపదేశములు చేసి జనానురాగమును

బడయుచు పనిచేయుచుండఁగాఁ జూచి యాదుష్టులు తన్ను స్వదేశ ములో బ్రతుకనియ్యరనియు, ఇంతటితో గాలిలీదేశములో తనపని తుదముట్టెననియు, దృఢము చేసికొని యుతఁడు స్వదేశమును విడిచి యీసారి యుత్తరాభిముఖుఁడయి వెడలి తూర్పున జార్డనునదీజన్మ స్థానప్రాంతములపఱకును బోయెను. ఈలోపల నతఁడు తనభావికర్మ మును నిశ్చయించుకొని దారిసాగి పోవునప్పు డొకచోట శిష్యులను దారిప్రక్కకు పిలిచి నిలిపి "నే నెవరని జనులు చెప్పుచున్నారు?" అని వారి నడిగెను. సమాధినుండి లేచి బ్రతికి వచ్చినస్నాతకుఁ డైనజా నని కొందఱును, పునర్జీవితుఁ డైనయొకపూర్వప్రవక్తయని కొంద ఱును, చెప్పుకొనుచున్నారని వారు బదులు చెప్పిరి. అతఁడు తెప్ప వాల్పక వారిమొగములవంకఁ జూచుచు "నే నెవరని మీరు తలఁచు చున్నారు?" అని యడిగెను. వారిలో చేపలవాఁ డైనసీమన్ "నీవు దేవునిచేఁ బంపఁబడిన మెస్సయావు" అని యనుమానింపక తత్క్షణమే యుత్తరము చెప్పెను. ఆయుత్తరమువలన జీసస్సు మనస్సున కపరిమిత సంతోషము కలిగెను. ఫారిసీలచే బాధలుపెట్టఁబడి స్వదేశత్యాగము చేసి విదేశములో నసహాయుఁడయి యేకాకిగా తిరుగుచున్నయీకాల ములోసహితము శిష్యులకు తనమీఁదిపూర్ణవిశ్వాస మణుమాత్ర మును తగ్గక తన్ను మెస్సయాయని నిర్వ్యాజాచంచలభక్తితో నమ్మి చున్నారని తెలిసికొనుటయే యాతనిసంతోషమునకుఁ గారణము. "ఓయీ! సీమన్! నీవు ధన్యుఁడవు. స్వర్గములో నున్న పరమపిత నీకు ప్రకాశపఱుచుట చేత నీవిది పలికినాఁడవేకాని జనులు నితో జెప్పి యుంటచేత దీనిని నీవన్నవాఁడవు కావు. ఇఁక నీపేరు పీటరు. ఈపదమునకు పర్వత మని యర్థము. ఈపర్వతముమీఁద దుష్టాధికార సమన్వితు లెవ్వరును పడఁగొట్టఁజాలని నుస్థిరధర్మహార్మ్యమును

నిర్మించెదను." అని జీసస్సు పలికెను. ఈమాటలు పలుకఁగానే యావఱి కాతనిమనస్సులో దుర్భరముగా నుండినభార మంతయు చేతులతో దింపివేసినట్లు తపణము తగ్గిపోయెను. మనస్సులో నున్న చింత యంతయు తొలఁగిపోఁగా, జయము కరస్థమయియున్న ట్టాతనికిఁ గానఁబడెను.

ఫారిసీలు తన్ను చంపెడుపథమున తాను నేర్పినబోధమును చక్కఁగా గ్రహించి జనులలో ప్రవచనము చేయఁగలవాఁ డెవ్వఁడైన నొక్కఁ డున్నాఁ డన్ననిశ్చయ మింతవఱికును జీసస్సు మనస్సునకు కలిగి యుండలేదు. అవ్యాజస్వామిభక్తి గలవాఁడయి తా నుపదే శించినధర్మసంచయమును తనయనంతరమున విడువక ప్రవచనము చేయువాఁడు సీమన్‌పీట రొక్కఁ డున్నాఁడని యిప్పు డతనికి తెలియ వచ్చెను; తక్కినశిష్యులును స్వామిభక్తివిశిష్టులయి నిస్సందేహ ముగాఁ దామును ధర్మప్రవచనముచేయు సంసిద్ధు లయి యున్నట్లు నమ్మఁబలికిరి. క్రొత్తమనుష్యులలో వారు చేసినదేశాటనము వ్యర్థ ముగా పోలేదు. శిష్యులు తమస్వామినిగూర్చి యొక్కవగాఁ దెలిసి కొనఁగలవా రయిరి. అతఁ డెట్లు కష్టములకు సహించి ధైర్యమువహించి యుండఁగలిగెనో, అన్నియాపదలలోను చలింపక తాను భగవంతు నిచేఁ బంపఁబడిన మెస్సయానని యాతఁ డెంత దృఢనిశ్చయముకలవాఁ డయి యుండెనో, వారు సదా సమ్ముఖమున నుండి చూచుచువచ్చుట చేత వారి కుండినవిశ్వాస మంతకంతకు బలవడి సుస్థిర మయ్యెను. ఫారిసీలు తామాతనిని పరదేశములకుఁ బాఱఁదోలినప్పు డాతని ప్రాబల్యమును రూపుమాపుచున్నా మనుకొనిరి గాని యీపరదేశ సంచారమే యాకనిశిష్యులలో ఫారిసీ లెవ్వఁడును నాశము చేయలేని

ప్రేమాతిశయ మాతనిపై గలుగునట్లు చేసి యాతని ప్రాబల్యమును మఱింత పెంపు చెందించెను.

శిష్యగణము బయలుపఱిచిన యీ మాతనోత్సాహభక్తివిశ్వాసములచేత జీసస్సునకు తాను మనస్సులో నేర్పఱుచుకొన్న మనోనిశ్చయమును సాగించుట మఱింత సులభ మయ్యెను. జీసస్సు మనస్సులో నేర్పఱుచుకొన్న నిశ్చయము మృత్యుముఖప్రవేశమున కయి సరిగా ముందంజె వేయుటయే యైనను తాను బోయి జెరూసలేమునగరములో ధర్మ్మప్రవచనము చేయవలె ననుట. తానక్కడ నుండఁ దట స్థించెడు కొన్నిదినములలోను జనులను మేలుకొలిపి వారికి జ్ఞానబోధ చేయుట కయి తాను జేయఁగలిగిన దంతయుఁ జేయవలెనని యాతని యభిలాషము. తరువాత శత్రువులు తాము చేయఁగలిగినంత చెఱుపును జేసి తన ప్రాణములు గొన్నను, తానీవఱకు నిర్వహించినదే తనమరణ దృష్టాంతమువలన బలపడి తన శిష్యుల హృదయములయందు స్థిర ముద్రిత మయి ఫలకారి యగునని యాతనినమ్మకము. తాను జెరూసలేమునగరమునకు పోక తీఱ దనియు, తనకక్కడ మరణము సంభవించుననియు, అతఁడు స్పష్టముగా తెలిసికొని యుండెను. ఎల్లప్పుడును తనచుట్టును మిత్రులు పరివేష్టించి యుందురుగాన తనకు పగటి వేళ భయ ముండదనియు, తాను రాత్రివేళ పట్టుకోఁబడి రోమను చెఱసాలలో బంధింపఁబడినపక్షమున మిత్రులకు విడిపింప సాధ్యము కాదనియు, ఎఱిఁగినవాఁడగుటచేత నాతఁడు శిష్యులను జేరఁబిలిచి తానుద్దేశించుకొన్న కార్యక్రమమును కడపట జరగఁబోవు పర్యవసానమును వారితోఁ దెలిపెను. వారు తమస్వామిని ప్రాణాధికముగా ప్రేమించు చుండినవా రగుటచేత తమకు ప్రభువుతోడి వియోగము కలుగుననియు ప్రభువునకు విరోధులవలన నాపద వాటిల్లు ననియు

వినుటయే వారికి దుస్సహ మయి తీవ్రమనోవేదనాకర మయ్యెను. అందుచేత "ఓప్రభువా! ఈయాపద నీకు ప్రాపింపకుండునుగాక!" అని పలికి పీట రాతనిని జెరూసలేమునకు పోకుండ బోధించి యొప్పింపఁ జూచెను. పీటరు తనప్రభువుమీఁది హృదయపూర్వక మైన ప్రేమాతిశ యముచేతనే యట్లు మగలింపఁజూచెను గాని వేఱుకారణముచేతఁ గాదు. ఈసంగతి పూర్ణముగా నెఱిఁగినవాఁ డయ్యును జీసస్సు తన కీశ్వరుఁడు విధించిన కార్యకరణపూర్ణము క్లేశకంటకములమీఁదుగా దుర్నిరీక్షాతీతమునకుఁ బోవలసి యున్న దని కనిపెట్టినవాఁ డగుట చేత పీటరుయొక్క ప్రార్థనము తనీశ్వరనిర్ణయమునుండి మరలించు ప్రయత్నమని భావించి "ఓపిశాచమా! వెనుక మరలుము. నీవు మనుష్యవాంఛితమును దెలుపుచున్నావుగాని యీశ్వరేచ్ఛను దెలుపు చున్నాఁడవు కావు" అని మందలించెను.

వా రాదేశములో నింకను గొన్నిదినములు సీజరాపురప్రాంత మునం దుండిరి. అతఁ డొకదినమురాత్రి ముగ్గురుశిష్యులను వెంటఁ బెట్టుకొని ప్రార్థనము చేయుట కయి యొకకొండమీఁదికి పోయెను. ఆశిష్యు లక్కడ తమస్వామి యిద్దఱు మహాతేజస్సు లైన దేవదూత లతో మాటాడుచుండఁగాఁ దాము చూచితి మనియు, తమప్రభు వప్పు డపూర్వ మైన దివ్యతేజస్సుతో ప్రకాశించె ననియు, చెప్పిరి. దేవదూతలు వచ్చి మాటాడి పోయిన వార్త వాస్తవ మయినను కాక పోయినను, జీస స్సీశ్వరుని హృదయపీఠమునందు నిలుపుకొని నిశ్చల భక్తితో ప్రార్థించినప్పుడు భక్త్యావేశముచేత భావమునం దతఁ డీశ్వర సాక్షాత్కారము ననుభవించి కర్తవ్యోపదేశమును బడసినట్టు భావించుకొని పరమానందభరితహృదయుఁ డయి తొంటికంటె నధికముఖవికాసముతో శిష్యులఁ గలిసికొని యుండుననుటకు సందేహ

ముండదు. తన మరణానంతరమున సహితము వన్నిద్దఱు శిష్యులును దృఢభక్తియుక్తు లయియుండి తాను బోధించిన సత్యములను లోకమునకు ప్రకటించి ధర్మవ్యాపసము గావింతు రనియు, తన మరణము శిష్యుల మనస్సులకు తన్నధికప్రీతిపాత్రునిఁ జేసి తన యుపదేశములను శిలాక్షరములవలె దృఢముగా నాటుకొనునట్లు చేసి వారి హృదయములలో స్థిరపఱుచుననియు, ఎటిఁగినవాఁ డగుటచేత నాతఁ డింకొకసారి పోయి స్వదేశమును వీడొక్కని యక్కడనుండి రాజధాని యైన జెరూసలేమునగరమున కరిగి యచ్చట నిశ్శంకముగా తాను మెస్సయా నని ఘోషించి ధర్మ ధ్వజ మెత్తి సత్యప్రవచనము చేయ నిశ్చయించుకొనెను.

ఇట్లు జెరూసలేము యాత్రాదీక్షవహించి యతఁడు శిష్య సహితముగా బైలుదేఱి కతిపయ ప్రయాణములు చేసి త్రోవలో కేపర్నాముపగరము చేరెను. కేపర్నామునివాసు లైన శిష్యులాతని రాకను ముందుగానే తెలిసికొని పృత్యుత్థానము చేసి తీసికొని వచ్చిరి. తాను జెరూసలేము యాత్రార్థము పోవుచు మార్గమధ్యమున వారిని జూడవచ్చితి ననియు, వారి ముఖదర్శనము చేయు భాగ్యము తనకు మరల లభింప దనియు, అతఁడు చెప్పినప్పుడు ప్రభుసందర్శన సంతోషపరవశు లయి యున్న యాభక్తులు తమస్వామి యొక్క శక్తి సామర్థ్యాదులను బట్టి యట్టిదుస్థితి కలుగఁబో దన్న నమ్మకముతో మనస్సులలో లేశమును క్లేశము నొందినవారు కారు. ఈశ్వరునిచే నభిషిక్తుఁ డయి మహిమాధ్యుఁ డయిన ప్రభువును సంహరించుట ఘోరసీలవంటి నరాధములకు సాధ్యము కాదని వారు తలఁచియుండిరి. అంతే కాక జెరూసలేము చేరి మృదుమధుర గంభీరవాక్యములతో ప్రభువు తన ధర్మవచనామృత రసప్రవాహమును వెల్లిగొలుపఁగానే సమ్మో

హితు లయి యహితులు సహితము వశ్యు లగును రనియు, అందు చేత తమస్వామికి జయము సులభ మగు ననియు, ఒక వేళ గిట్టనివారు గొందఱు దుండగమున గొడిగట్టినను భక్త్యాగ్రేసరు లయి ప్రభువును గురుభావముతో ప్రేమించు ప్రజలు వారి నవలీలగా పరాజితులను జేసి యపాయము నుండి రక్షింతు రనియు, భక్త్యావేశము చేత కేప ర్నాము లోనిశిష్యులు విశ్వసించి యుండిరి. భక్త్యావేశము చేతను ప్రేమాతిశయము చేతను తాము గొవ్వగానెంచువారిని లోకమంతయు నారీతినే యెంచు ననిభావించుట వింతకాదు గదా! అయిసను జీసస్సు మాత్రము దూరదేశయాత్రకుఁ బోవునప్పుడు కడసారి యాప్తులకుఁ జెప్పవలసిన హితవచనములు వారికిఁ జెప్పెను. శిష్యులలో నొకఁడు చెంతను జేరి "యీశ్వరరాజ్యములో నధికుఁ డగువాఁ డెట్టివాఁడు?" అని ప్రశ్న వేసెను. జీసస్సు చేరువ నున్న యొకశిశువును జేరఁదీసుకొని శిష్యునివంకఁ దిరిగి "యీ శిశువు వలె నెవ్వఁడు పావ మెఱుఁగనివాఁ డగునో యట్టివాఁ డీశ్వరరాజ్యములో నధికుఁ డగును" అని యుత్త రము చెప్పెను. ఆశిశువు నింకను చేతిలోనే యుంచుకొని జీసస్సు శిష్యులవంకఁ జూచి, "మీరు మీతోడివారి కంటె నెక్కువ వారుగా కనఁబడుట కెంతమాత్రమును ప్రయత్నము చేయఁగూడదు; మీ ప్రయత్న మంతయు వారి నెక్కువసుఖవంతులనుగా నెట్లుచేయఁ గలుగుదుమా యనుట కయి యుండవలెను; తక్కువస్థితిలో నున్న వారియెడల నెప్పుడును ననాదరభావము చూపరాదు; ఇటువంటి హీన స్థితిలో నున్నవారికే సంతోషమును సౌఖ్యమును గలిగించుట కయి యెక్కువకృషి చేయవలెను; ఇటువంటి తక్కువవారిలో నెవ్వరి విష యమున నయిన మీరపచారము చేసినయెడల, అది మీరు నావిష యమున చేసినయపచారమే; వారికి చేసిన యుపకారము నాకు చేసిన

దానినిగా నేను భావించుకొనిదను; తమ్ము రక్షించుకో లేని దుర్బలులకు హాని చేయుట కంటె మెడకు తిరుగంటిరాయి కట్టుకొని లోతు సముద్రములో పడుట మనుష్యునకు మంచిది; మీ రెప్పుడును అపకారమునకు ప్రత్యపకారము చేయరాదు." అని యీ ప్రకారము చెప్పుచుండగా "ప్రభువా! నాసోదరుఁడు నాకపకారము చేయుచు వచ్చినప్పుడు నే నెన్నిసారు లాతని క్షమింపవలెను? ఏడుసారులు క్షమింపవలెనా?" అని పీట రడిగెను. "ఏడు సారులు కాదు. అవశ్యక మయినయెడల డెబ్బదియేడు సారులు క్షమింపవలెను." అని జీసస్సు బదులు చెప్పెను. డెబ్బదియేడు సారు లన్నమాట కెల్లప్పుడును క్షమింపనకె నని యర్థము!

ఇట్లు జీసస్సు శిష్యులకు హితవాక్యము లనేకములు చెప్పి, వారు తన యెదుట నిప్పుడు ధైర్యశాలులుగా నున్నను తాను వారిని విడిచిపోయిన తరువాత నొకానొకప్పుడు బలవంతులును గర్వితులు నయినఫారసీలు బాధింపఁ గడఁగినప్పుడు ధైర్యము చెడి తమ్మే దుర్బలులనుగా భావించుకొనవచ్చు నని యెంచి వారికి దిటవు గఅపఁదలఁచి "మిమ్ము మించి బలవంతులు మిమ్ము బాధింపఁ దలపెట్టినను భయపడకుఁడు; వారి యధికార మిలోకజీవితమును దాటిరాదు; తరువాత మిమ్ము బహుమానించువాఁ డీశ్వరుఁ డున్నాఁడు. ఈ గొప్ప ప్రపంచముతో పోల్చిచూచినప్పుడు మీ రత్యల్పసంఖ్యవారుగానే యున్నను, నాపేరున మీరందఱును నొక్కటిగా నిలుతురేని మీకు పాయముగా నాబలమును గలవారయి యుందురనియు నేనేమీకు తోడుగా నుందు ననియు సదా జ్ఞప్తియుం దుంచుకొనుఁడు" అని వారికి నూతనధైర్యోత్సాహములు పురికొల్పి, అతఁడు వారినివీడ్కొని బయల్దు వెడలెను.

ఈసారి కేవర్నాము నుండి జీనస్సు జెరూసలేముయాత్రకు బైలుదేరి నప్పు డాతని పన్నిద్దఱు శిష్యులు మాత్రమే గాక పొరుల లోని మిత్రులును ఇతర శిష్యులును కూడ నసేకులు స్త్రీపురుషు లాతనివెంట ప్రయాణము మయి వచ్చిరి. వారిలో కొంద ఱాతనిధర్మ బోధనలు వినవలె ననియు, తమసాయము కావలసివచ్చిన యెడల చేయవలయు ననియు, ఉద్దేశించుకొని వచ్చిరి. మఱికొందఱు ప్యాసో వరువండుగ సమీపించుచున్నందున నాతని యువదేశములు వినుచు నాతనితోడఁ గూడ గలిసి యాత్రకుఁ బోయినవఱకును తీర్థమును స్వార్థమునుకూడ సమకూడు నని వెంటనంటిరి. వారు బహుదినములు ప్రయాణము చేసి గాలిలీ దేశమును గడచి దిగువ భాగమున జార్డను నదిని దాటి జూడియాదేశమునఁ బ్రవేశించిరి. కేవర్నాము పుర మున్నది గాలిలీదేశము; జెరూసలేము నగరమున్నది జూడియాదేశము. పెక్కుబాటలకు సంధిస్థాన మయినజెరికోపట్టణమును జేరునప్పటికి నానాముఖములవచ్చు యాత్రాపరు లయినప్రజలతో జెరూసలేము నకుఁ బోవుబాట క్రిక్కిఱిసిపోవ నారంభించెను. నాజరెత్తునగరమహా ప్రవక్త యనియు మెస్సయా యనియు జీసస్సుకీర్తి యీవటి కేదేశదేశ ములలో వ్యాపించియుండుటచే తీర్థప్రజలాతనిబోధలు వినవలెననియు ముఖసందర్శనము చేయవలె ననియు మూఁకమూఁకలుగావచ్చి యాత్ర ముతో నాతనిపైని బడఁజొచ్చిరి. వారిసందడినుండి కాపాడుట కయి శిష్యు లాతని చుట్టును జేరి వయిఁబదుమూఁకలను తొలఁగఁ ద్రోచు చుండిరి. ఈసందడిలో స్త్రీలు కొందఱు బిడ్డలను చంకనెత్తుకొని యొండొరులను మోఁది మెల్లమెల్లఁగా గుంపులోనుండి త్రోచుకొని వచ్చి జీసస్సును సమీపించిరి. వారతఁడు చేసెడియుపదేశములను విన వలెనన్న యాసక్తితో నంత శ్రమపడి రాలేదుగాని యటువంటి మహాను

భావుఁడు తన చేతులతో స్పృశించి తమ బిడ్డలను దీవించినయెడల వారికి మేలు కలుగు నన్న యపేక్షతో వచ్చిరి. శిష్యులు వారిని వారించి "ప్రభువువారు మిక్కిలి పనిగానున్నారని మీకు కనఁబడు చుండలేదా? ఇప్పుడు వారు మీతోశ్రమపడఁజాలరు" అని వెనుకకుఁ ద్రోచిరి. జీస స్సది కనిపెట్టి యసంతుష్టిని దెలిపెడి చూపులతో శిష్యుల వంకఁ జూచి "ఆ పసిబిడ్డల నిటు రానిండు. వారిని వారింప వలదు. ఈశ్వరరాజ్య మిటువంటివారిదే" అని పలికెను. అప్పుడు తల్లు లొకరి వెనుక నొకరు బిడ్డల నెత్తుకొని ముందుకురాఁగా జీస స్సొకరి తరువాత నొకరినిగా బిడ్డలను వారిచేతులలోనుండి తీసుకొని ప్రేమను జూపు చూపులతోను నవ్వుమొగముతోను వారిమీఁద చేయివైచి యందఱిని 'భగవంతుఁడు మిమ్ము రక్షించునుగాక' యని యాశీర్వదించెను.

ఆతనిరాకను విని దారిపొడుగునను జనులు మూఁకలు మూఁకలుగా వచ్చి యేప్రకారముగా చుట్టుకొనుచు వచ్చిరో యాప్రకారముగానే ఫారిసీలు సహితము వచ్చి చుట్టుకొని పరాభవింపవలెనన్న దుశ్చింతతో గాలిలీదేశమునందువలెనే జూడియాదేశమునందును బహువిధప్రశ్నలువేసి బాధింపఁ జొచ్చిరి. ఆతఁడు సమయోచితబుద్ధి గలవాఁడయి సదుత్తరములు చెప్పి నోరడఁచి వారిని తిరస్కారభావముతోఁ బంపివేయుచుండెను. ఫారిసీ లెంత బద్ధమత్సరులయి బాధింప పాటుపడినను జెయ్యూసలేము నగరమునందు సహితము తమస్వామికి పరాభవము గలుగఁబో దని భావించి శిష్యులు సంతతోత్సాహవంతులయి యుండిరి. జీసస్సు వారికుత్సాహభంగము కలిగింప నిష్టములేని వాఁడయినను, తన కాకస్మికముగా మరణము సంప్రాప్తమయినవఱకు మున భగ్నోత్సాహులయి ధైర్యమును గోలుపోయి తాను నియమించిన కార్యమును నిర్వహించుటకు జంకుసుదేమో యున్న భయమును

చేత జెరికోపట్టణమార్గసమీపమున తన పన్నిద్దఱు శిష్యులను ప్రక్కకుఁ బిలిచి వారితో "నాశత్రువుల నందఱిని నేను నోరడఁచి జెరూసలేము నగరములో నేను మెస్సయా నయి మహాప్రభావముతోను తేజస్సు తోను వసింతునని మీరు తలఁచియున్నట్లు జరగఁబోదు. ఆచార్యులు నన్ను పట్టుకొని, వధార్హునిగా నిర్ణయించి ప్రాణానికిఁ బెట్టి మేకులుకొట్టి చంపుటకయి రోమనుల కొప్పగింతురు" అని చెప్పెను. ఆమాటలు విన్నప్పుడు తాత్కాలికముగా వారి మనస్సులకు విచారము కలిగినను, ఆతనిశక్తియం దత్యంతవిశ్వాసము గలవా రగుటచేత తరువాత వా రంతగా చింతనొంది యుండలేదుగాని యాతఁడు మాత్రము చింతాకులితస్వాంతుఁ డయియే యుండెను. వారు జెరూసలేము నగరమును సమీపించుకొలఁదిని మానసోత్సాహము హెచ్చినవా రయి తమ ప్రభు వీశ్వరరాజ్యపట్టాభిషిక్తుఁ డత్యంత శీఘ్రకాలములోనే యగు ననియు, కాఁగానే ప్రభుసన్నిధానవర్తు లగుటచేత తమ కధి కొన్నత్యము కలుగఁబోవుచున్న దనియు, సంతోషపడుచు వచ్చుటయే కాక ప్రభుసమ్మానానురాగాతిశయముచేత తమలో నివ్వ రగ్రస్థాన మును పొందువా రగుదురా యని పరస్పరస్పర్ధ వహించువారు సహి తము కాఁజొచ్చిరి.

తనవెంటవచ్చిన గాలిలీయవారిలో పన్నిద్దఱు శిష్యులలోనివా రైన జేమ్సుయొక్కయు జానుయొక్కయు తల్లియైన సాలో మనునామె యుండెను. ఆమె తనకొడుకులు గొప్పవారు కావలె నన్న కోరిక గల దయి వారు శిష్యకోటిలో నెల్ల నగ్రగణ్యులుగా పరిగణింపఁ బడ వలె నని యభిలషించుచుండెను. జీస స్సెల్లవారిచే మెస్సయాగా నంగీక రింపఁబడి పూజింపఁబడునప్పుడు తమ్ము ప్రథమగౌరవస్థానమం దుంచున ట్లతనిచేత మాటపుచ్చుకోవలె నన్న వాంఛను వారి మనస్సులలో

పుట్టించిన దీమెయే యయి యుండును. తా మట్టిప్రార్థనను న్యాయముగా చేయుటకు వారిష్టములేనివా రయి యామెచేత నడిగించిరైన నుందురు; లేదా యామె స్వబుద్ధిచేతనైన వారిపక్షమున నడిగియుండవచ్చును. వారు ముగ్గురును గలిసి జీసస్సువద్దకు వచ్చినప్పుడు సాలో మతనిపాద ములమీఁదఁ బడి "దేవా! నా కొక్కవర మియ్యవలె" నని వేఁడు కొనెను. "నీకేమికావలెను?" అని జీస స్సడిగెను. "నాయీ యిద్దఱు పుత్రులును నీరాజ్యములో నొకరు కుడిప్రక్కను ఇంకొక రెడమ ప్రక్కను నీయుభయపార్శ్వముల నుండున ట్లనుగ్రహింపుము." అని వేఁడెను. జీస స్సుబ్ధుఁడై వారు తమతల్లికోరికలో చేరియున్నా రేమో కనిపెట్టుట కయి వారి మొగములవంకఁ జూచెను. తల్లి కోరినదే వారి కోరిక యని వారిచూపులవలనఁ దెలిసికొని వారికయి జాలి పడునట్లు నిందాగర్భముగా "మీ రేమి యడుగుచున్నారో మీ రెఱుఁగరు" అని యతఁడు పలికెను. వారు మెస్సయాకు పరిచరులగుటచేఁ దమకున్నత పదము లభించు నన్న సంతోషమే గాని తమకు రానున్న కష్టదశలను తెలిసికోలేక మనోరథ స్వర్గసుఖభ్రాంతు లయి నిలుచుండిరి. "నేను త్రాగవలసిన పాత్రాంతరాళవిషపూరమును మీరు త్రాగఁగలరా? నేను సహింపవలసిన దుఃఖప్రవాహస్నానమును మీరు భరింపఁ గలరా?" అని యతఁ డడిగెను. "మేము త్రాగఁగలము భరింపఁగలము" అని వా రుత్సాహముతోను దృఢనిశ్చయముతోను బదులుచెప్పిరి. "మీరు నిశ్చయముగా పాత్రపూరిత వేదనావిషజలమును నాతో త్రాగు దురు; నావలెనే మీరు దుఃఖరసస్నానము చేయుదురు. కాని యీశ్వర రాజ్యములోని గౌరవస్థానములు నాయీవిలో లేవు. ఈశ్వరేచ్ఛా నిర్వ హణము చేత వానినిబడయుట కెవ్వ రర్హులగుదురో వారికవి మన పర లోకపితచేత నియ్యబడును." అని యతఁడు మృదురీతిని చెప్పెను.

పయి ముగ్గురును రహస్యముగా తమగురువుతో మాటాడిన సంగతి యేలాగనో తక్కిన శిష్యులలో పొక్కినది. జేమ్సు యొక్కయు జానుయొక్కయు తల్లి యే యొక వేళ జీసస్సుయొక్క మృదువచనములను బట్టి యతనికి తన కొమకులయం దెక్కువ ప్రేమ గల దని భ్రమపడి యితరులవద్ద డంబములు చెప్పుకొని యుండును. వా రిద్ద ఱును తమకంటె నెక్కువ యాధిక్యమును పొందవలె ననిప్రయత్నించి నందున కయి తక్కినశిష్యులకు వారి యెడల నసూయయు కోపమును గలిగెను. ఇట్లు శిష్యులలోఁ గలిగిన యంతస్తాపమును దెలిసికొని దానిని నివారింపఁ దలఁచి యాసోదరుల వర్తనమును నిందింపక "లోక ములో తాము గొప్పవారము కావలె నని ప్రయత్నించు మార్కులు తలఁచునట్లుగానే వీరును తా మున్నతపదములకు నియమింపఁబడిన పక్షమున లోక మంతయు తమ్ము గౌరవించు ననుకొను చున్నారు. ఇతరులవలన గౌరవమును మాన్యతయు సంపాదించుకొనుటకు మార్గము తా మేదో యుత్తమ మయిన ఘనకార్యమును చేయుటమాత్రమే యని మీరు తెలిసికోవలెను" అని పలికి, వారు చేసినపని యనాలోచితమును బుద్ధిహీనము నైన ట్లితరులకు కనఁబడు నట్లుచేసి, జీసస్సు పదుగురి శిష్యుల కోపమును వారి తెలివితక్కువ కయి యా యిరువురి శిష్యుల మీఁదను గలిగిన జాలికి మార్చి, ఆయిద్దరిను తమ్ము నిందిం చుట కంటెను నెక్కువ సిగ్గువడునట్లు చేసెను. వారు జెరికోపురము చేరిన తరువాత విశ్రాంతి కయి కొన్ని దినము లచ్చట నిలిచిరి. ఆదిన ములలో నక్కడ ననేకులు మిత్రులును శిష్యులును నయిరి. వీరిలో పలువురు జీసస్సు జెరికోనగరమును విడిచి బైలుదేరినప్పుడు శిష్యగణ ముతోఁ జేరి వెంబడించి జెరూసలేముపురప్రవేశ సమయమునం దతనిని పరివేష్టించివచ్చినపరివారమును మహోత్తరమయినదానినిగాఁ జేసిరి.

పురబాహ్యప్రదేశము చేరఁగానే శిష్యులుగొందఱు వట్టణము లోనికిఁ బోయి యొకసుందర మయినరాసభము నద్దెకుఁదెచ్చి దానిపై మెత్తవేసి జీసస్సును కూరు చుండఁ బెట్టి పరివారము చుట్టును బలిసి నడవ పురప్రవేశోత్సవముల కుపక్రమించిరి. ఆకాలమునం దాదేశ ములో గుఱ్ఱముల నెక్కఁడు వాడుక లేదు. గొప్పవారు సహితము గాడిదలపైనే స్వారిచేయుచుండిరి. మనదేశపు గాడిదల వలెఁ గాక యాదేశపుగాడిదలు పెద్దవిగాను సుందర మైనవిగాను నుండును. ఇట్లు భక్తజనులు పరివేష్టించి నడుపఁగా, శిష్యులుచ్చైస్స్వనముతో మంగళ గీతములు పాడఁగా, ఇతరులు 'విజయోస్తు' అనిదిక్కులుమారుమ్రోగు నట్లు జయజయధ్వనులు చేయుచురాఁగా, జీస స్సాలివుకొండనుండి దిగి రాఁ దొడఁగెను. దిక్కులు పిక్కటిల్ల నజచు మూఁకలకోలాహల ధ్వనులును భక్త జనులసంతోషధ్వానములును చెవినిఁబడఁగా లోపలి నుండి వెలువలికి వచ్చి పురజను లాయుత్సవముతోఁ జేరి నడవఁదొడఁ గిరి. ఆగుంపులోనుండి "ప్రభునామమున వచ్చెడి యీతనికి శుభ మగును గాక!" యను ధ్వనులు క్రొత్తక్రొత్తనోళ్ళనుండి వెలువడి మిన్ను ముట్టుచుండెను. ఈయూరేగింపు వంతెనమీఁదుగా క్రెడన్ కాలువను దాటి పురద్వారము గుండ జయప్రదముగా సాగెను. ఈయసాధారణకోలాహలకారణమును దెలియఁ గోరి పౌరులు గృహ ములు వెడలి పరుగెత్తుకొని వచ్చి ఇదంతయు నేమి? ఈయన యెవ్వరు?" అని యడుగసాగిరి. "ఈయన మహాప్రవక్త యైన నాజి రెత్తు నగర జీసస్సు" అని శిష్యులు గర్వముతో నుత్తరము చెప్పు చుండిరి. ఇఱుకు వీధులలోనుండి పోవునప్పుడు కొందఱు ఫారిసీలు మనుష్యప్రవాహమధ్యమున తగులుకొని తప్పించుకొని యావలఁ బడు టకు శక్యముగాక యిష్టము లేకయే యూరేగింపుతో నడుచుచు కోప

ముతో "ఓబోధకుఁడా! నీమనుష్యులను మాటాడకుండ జేయుము" అని జీసస్సును గూర్చి యఱచిరి. జీసస్సు పూర్వప్రవక్తలవాక్యము లలో నొకదానిని "ఈమనుష్యులు మాటాడకపోయినయెడల శిలలే మాటాడును" అనియనువదించి యూరకుండెను. అక్కడనుండియెడమ వైపునకు తిరిగి దక్షిణాభిముఖముగా జీసస్సు తనశిష్యులను తిన్నఁగా దేవాలయము వంక నడిపించెను. నిర్మలమయిన పాలరాతిస్తంభము లును స్వర్ణాలంకారములును మాధ్యాహ్నికసూర్యకాంతిచేత తళతళ లాడుచు మెఱయుచుండఁగా నున్నతముఖద్వారమువద్దకు పోఁగానే జీసస్సక్కడ తన ఖరవాహనమునుంచి దిగి పాదచారి యయి వెడ ల్పయిన సోపానవరంపర నెక్కి శిష్యపరిజనాదికపరివృతుఁడయి సాధా రణముగా మతాంతరమంటప మని పిలువఁబడెడు ప్రథమప్రాకారము లోనికిఁ బోయెను. ఇక్కడ కెల్లదేశములవారును సర్వమతముల వారును నిరాతంకముగా పోవచ్చును; అక్కడనుండి గర్భాలయము లోనికి పోయెడు మెట్లున్నవి. మెట్ల కిరుప్రక్కల నున్న రాతిస్థంభ ముల మీఁద "ఈపవిత్రస్థలమునకు యూదులు తప్ప మఱియెవ్వ రయిన పోయెము పక్షమున ప్రాణదండనము కలుగును. జాగ్రత్త" అని పెద్దక్షరములతో చెక్కఁబడి యుండెను. ఈమతాంతరమండప మధ్యమున జీసస్సు నిలిచెను. అది సుందరవిశాలభవనము. దాని నేల వివిధవర్ణములు గల స్నిగ్ధము లయిన పెద్దపలకరాళ్ళతో పఱుపఁబడి యుండెను. దానిచుట్టును రెండేసివరుసల పాలరాతిస్తంభము లుండి వానిమీఁద కప్పు నిలిచియుండెను. ఈసుందరవిశాలస్థల మీశ్వరా రాధనమున కత్యంతానుకూల మయినదిగా నుండెను. కాని జీస స్సక్కడ నిలువఁబడియున్నప్పుడు భగవద్భక్తివిషయక మయినశబ్ద మొక్కటియు నాతని చెవి సోఁకలేదు, ఉపాసనాసంబంధ మయినశబ్ద

ములకు మాటుగా జంతువుల కూఁతలును, నావికుల మోతలును క్రయవిక్రయవ్యాపారవ్యగ్రుల శబ్దజాతములును, అతని దెవిని బడఁ జొచ్చెను. స్తంభమునకును స్తంభమువకును నడుమఁగల స్థలములన్నియు విదేశపునావికులను వట్టమునకు పుచ్చుకొని స్వదేశపునావికుల నిచ్చుబచ్చులతోను రాఁబోయెడి యుత్పన్నములో బలి యిచ్చునిమిత్త మయి గొఱ్ఱెలను పక్షులను విక్రయించు వణిజులతోను నిండియుండెను. ఈవ్యాపార మంతయు న్యాయసుచేత దేవాలయము వెలుపలి భాగమునందే జరగవలసియుండెను; గాని తమ మతమువెయ్యఁ బారి శుద్ధ్యమునుగూర్చి లక్ష్యము లేని యాచార్యులు ధనస్వీకారపరు లయి యీ వ్యాపారము పవిత్రాలయములోపలనే జరుగనిచ్చి యూదులు కానివారు ప్రార్థనలు జరుపుకొనుటకయి విడువఁబడిన యాస్థలము కూడ వారికి లేకుండఁ జేసిరి.

జీసస్సు భృత్యపురోగముఁ డయి యాధిపత్యము వహించి నలు గడల చూపుఁకులు నిగిడించి మండప మధ్యమున నిలఁబడఁగానే యిచ్చి పుచ్చుకొనువారు తమవ్యాపారము నించుక నిలిపి యాతనిముఖము వంకఁ జూడసాగిరి. ఆతని చూపులయుం దధికారభావమును కోపమును కానఁబడెను. "ఈవస్తువుల నిక్కడనుండి తీసికొనిపొండు. దేవాలయము ప్రార్థనాలయముగా నుండవలెనని విధింపఁబడియున్నది. మీరు దీనిని దొంగల నివాసభూమిగా చేసియున్నారు" అని కేకలువేయుచు నిప్పులు కురియుకన్నులతో చేతులు చాఁచుకొని కొట్టబోయినట్టు జీసస్సువారిమీఁదికి పోఁగా, తమగొఱ్ఱెలు బెదరినట్టుగా తామును బెదరి యచ్చటివారు నానాముఖముల వరుగులిడిరి. తమస్థానమును వదలక నిలుచు మని క్షణకాలము కొంద ఱాలస్యముచేసినను, కృత నిశ్చయత్వముతో పిడికిళ్ళ పట్టుకొని తమ నాయకుని వెనుకనుండి ముం

దుకు రాఁబోవుచున్న శిష్యులను చూడఁగానే మిగిలియున్న ధైర్యశేష
మును గోలుపోయి బచ్చులు వేవేఱ నాణెములరాసులను తమయొడిలో
బోసికొనియు, పక్షిస్వాములు వడివడి పిట్టలగూళ్లు చేతులతో వయి
కెత్తివట్టియు, వణిజులు తమవస్తువులు కొన్ని లోవల విడిచియు, భీత
చిత్తులయి క్షణకాలములో దేవాలయమును విడిచి వెలువలికిఁ బాఱిరి.
తవ్వపనిని జూచినప్పుడు కలిగెడి కోపమును జీన స్నీయొక్కసారి
యావుకోలేక బయలుపఱిచెను. అతఁడు సాధారణముగాఁ జూపెడు
శాంతభావము కోపము నడఁచుకొనుచువచ్చుటచేత కలిగినదే కాని
కోపము లేకపోవుటచేత కలిగినదికాదు. చెడువని జరుగుచుండఁగా
చూచినప్పుడును కోపము రానివాఁ డేమంచిపనిని చేయుటకును సమ
ర్థుఁడుకాఁడు. సాధారణముగా కోపము రానివానిని మనము శ్లాఘింప
వలసినదే కాని ఘనకార్యనిర్వహణపరాయణునకు కొన్ని సమయముల
యందు తీక్ష్ణతతోఁ గూడిన యౌత్సుక్య మావశ్యక మగును. జీసస్సు
చేసిన యీపనివలన శత్రువులమనస్సులలో నతనిఁబొడ మెఱింత
యాగ్రహమును ద్వేషమును కలిగెను.

ఆరాత్రి యతఁడు పట్టణమున కొకమైలుకంచెకొంచెమెక్కువ
దూరము:లో నాలీవుకొండ కావలివైపున నున్న బెథనీగ్రామమునకుఁ
బోయి యక్కడ మిత్రగృహమున సుఖనిద్రచేసి మఱునాఁడు తెల్ల
వాఱునప్పటికి మరల దేవాలయమునకు వచ్చెను. అప్పటికే యతఁడు
చేసెడు ధర్మోపన్యాసములను శ్రవణానందముగా వినవలె ననుయాస
క్తితో వచ్చియున్న జనులతో విశాలప్రాకారాంతర్భాగ మంతయు
నిండియుండెను. భక్త్యావేశముచేత వచ్చినవారిమాట యటుండఁగా
నూరక వేడుక చూడవచ్చినభక్తిహీనుల హృదయములు సహిత మాప
ఱకు తాఁపినవాఁడును వినియుండని కర్ణరసాయనములైన యాతని ధర్మ

వచనప్రసారముచేత కరఁగిన వయి ధర్మచింత కలవి కాఁజొచ్చెను. ఆతని నట్లు నిరంతరాయముగా బోధ చేయనిచ్చి యుండినపక్షమున, సామాన్యజనుల హృదయము లాతనివంక కాకర్షింపఁబడి యల్ప కాలములోనే నూఱులకొలఁది నాతనికి శిష్యులయి యుందురు కాని దేవాలయమున కధికారు లయి యుపాసనాదికమును నెఱవేఱ్చుచున్న మతాచార్యులు దురాగ్రహప్యగ్రు లయి భయకంపితులయి యాతని పనికి విఘాతము చేయ కృతనిశ్చయు లయిరి. గతదిన మతఁ డాకస్మిక ముగా శిష్యవర్గముతో దేవాలయములో ప్రవేశించి తమయధికార మును తిరస్కరించి తమబలన సెలవుపొంది లోపల వ్యాపారము చేయుచుండినవారిని బలవంతముగా గుడిలోనుండి వెలుపలికి తఱిమి వేసెను. ఆతనిప్రసంగములు వినుటకయి వచ్చిన మూఁక లిప్పుడు గుడిలోనంతటను నిండి గర్భాలయములోనికి పోవ దారిలేకుండఁ చేసి తాము జరపుచున్న యారాధన కరుగుట కనేకుల కవకాశము లేకుండఁ జేసిరి. అందుచేత వారు తమకుఁ గలిగినయవమానమునకు సహింపఁ జాలక తమ యధికారబలమును జూపి యక్రమముగా వచ్చి లోపలఁ బ్రవేశించిన యాయాగంతునకు బుద్ధి వచ్చునట్లు చేయ నిశ్చయించు కొనిరి. ఈనిశ్చయమును నిర్వర్తించుటకయి వారాలోచించుకొన్న యాలోచన తమలో కొందఱు తమయధికారకంచుకములను తొడుగు కొనిపోయి పదిమందిముందఱ "ఈపనులను నీ వేయధికారముతో చేయుచున్నా" వని యడుగుట. అతఁడు మతాచార్యుఁడు కాఁడనియు, పట్టణమునకాని దేశమునకాని యే యధికారిచేతను నియమింపఁబడినవాఁడు కాఁడనియు, విద్వత్పరిషత్తుచేత బోధచేయుట కనుజ్ఞయైన పొందినవాఁడు కాఁడనియు, వారెఱుఁగుదురు. తానెవ్వరి బలనను నధికారము పొందలేదని చెప్పినపక్షమున జను లాతనిని

వంచకునిగా నెంచి గేలిచేసి సాగనంపుదు రనియు, దేవునివలన నధికారము పొందితినని చెప్పిన వక్తమున ద్వైదూషకుడని పట్టి యధికారుల కొప్పగింపవచ్చుననియు, వా రను కొనిరి. అందుచేత వారిలో కొందఱు మూఁకలోనుండి త్రోచుకొనిపోయి, అతఁడు చేయు చున్న ప్రసంగమునకు భంగము కలిగించి, ఏయధికారముచేత నీ పనిని చేయుచున్నావు? అని గద్దించి యడిగిరి. ఈప్రశ్నకతఁడు మాత్రమును తడఁబాటుపూనక తడవుకొనక నేనుకూడ మిమ్మొకఁ ప్రశ్న యడిగెదను. దానికి మీరుత్తరము చెప్పినపక్షమున, నాకధికార మెవ్వరిచ్చినారో నేను చెప్పెదను. జ్ఞానస్నానము జేయించుటకు జానున కధికారమెక్కడనుండి వచ్చినది? అది దేవునినుండివచ్చినదా? మనుష్యులనుండి వచ్చినదా?" అని యడిగెను. ఈప్రశ్నచేత వారు వేసినవలలో వారే పడవలసినవా రయిరి; ఆచార్యపురుషుఁడు కానందున మత కర్మ జరుపుటకు జానున కధికారము లేదని వారి నమ్మకము. ఆమాటను పదిమందిలో నిప్పుడు బహిరంగముగా చెప్పెడు పక్షమున, జాను గొప్ప ప్రవక్త యని నమ్మియున్న యచ్చటిజనులు దురాగ్రహావేశముచేత లేచి పైనిఁబడి దొమ్మి చేయుదురు. జాను కధికారము దేవునివలన వచ్చిన దని చెప్పెడుపక్షమున జీసస్సు తనకును దేవునివలననే వచ్చినదని యాతనికిఁ గలిగిన స్వాతంత్ర్యమే తనకును గల దని చెప్పవచ్చును. అందుచేత, వారేమి చేయుటకును పాలుపోక 'మేము చెప్పజాల' మనఁగానే అనాదరభావముతో నతఁడును "ఏయధికారము చేత నే నీపనులను జేయుచున్నానో నేనును మీకు చెప్పను." అనెను.

అప్పు డామతాధ్యులు భగ్నప్రయత్నులయి క్రిక్కఱికిసి బిగుసుకొనిపోఁగలో నుండి వేగిరము వెలువలఁబడుటకు శక్యముగాక

యువమానస్థున్ను లయి నిలుచుండియుండఁగా, జీసస్సు జనులను సంబో
ధించి "ఒకానొకమనుష్యున కిద్దఱు కొడుకు లుండిరి. పోయి ద్రాక్ష
తోఁటలో పనిచేయువలసిన దని యతఁడొక కొడుకుతోఁ జెప్పెను.
నేను పోఁ జాల నని వాఁడు మొదటజెప్పినను తరువాత తండ్రియాజ్ఞ
వినసంచుకు పశ్చాత్తాపపడి పోయి తోఁటలో పనిచేసెను, తండ్రి
రెండవకొడుకునకును నట్లే యాజ్ఞ చేసెను. వాఁడు చిత్తమట్లే చేసెద
నని చెప్పెను గాని తరువాత తోఁట త్రొక్కి చూచినవాఁడే కాఁడు.
ఈయిద్దఱిలో తండ్రియాజ్ఞ చెల్లించినవా డెవఁడు?" అని యడిగెను.
'మొదటివాఁడు' అని యందఱు నేకవాక్యముగాఁ బలికిరి. అతఁడప్పుడు
నిలువఁబడి యున్నమతాచార్యులవంకఁ దిరిగి రూక్షవీక్షణములతోఁ
జూచుచు "నిశ్చయముగా మీకే యిది చెప్పుచున్నాను. సుంకరులును
పరమపాపులును మీకంటె ముందుగా నీశ్వరరాజ్యము లోనికిఁ బోవు
దురు; వారు జాను బోధనలవలన పశ్చాత్తాపపడి దేవుని యిష్టమును
సలిపిరి. దేవుని యాజ్ఞలను చెల్లింతు మని చెప్పుటకు మీ రెల్లప్పు
డును సిద్ధముగా నుందురు కాని మీమాటలను మీరు నెఱవేర్పరు."
అని కోపము రూపము దాల్చినట్లు పలికెను. అందఱికంటెను తామే
దేవున కెక్కువచేరువగా నున్నా మని భావించుకొనువారి కిట్టి
మాటలు వినుట దుస్సహముగా నుండును. అయినను వారీగర్వాణము
పొందుట కత్యంతపాత్రు లనుటకు సందేహము లేదు. వారి మత
మంతయు కేవల కర్మాచరణ మయమయి యున్నది కాని పరిశుద్ధ
వర్తనమును పాలించునదిగా లేదు.

జీస స్సింతటితో నరిపెట్టక మతాచార్యులు పరిసేలును దేవు
నిచేఁ బంపఁబడినవారిని బాధించువా రనియు, దేవుని పుత్రుఁడాయన
తన్ను పరిహసించి హింసింప నున్నవా రనియు అతి స్పష్టముగా

V. R. NARLA MEMORIAL LIBRARY
V. NARLA DEVI
Acc. No.

నింకొక యుపమానమును జెప్పి, వారిమనస్సులలో ననిరోధ మైన క్రోధమును వు్కొల్పెను. అప్పుడక్కడ నున్న వారిలో కొందఱు ఫారిసీ లుండిరి. వారా మాటలకు మండిపడి దేహములు తెలియక నడుములు బిగించి లేచి పరుషవాక్యము లాడుచు మీఁదఁబడి జీస స్సును దేవాలయములోనుండి యీడ్చి యావలకుఁ గెంటివేయుఁ జూచిరి కాని, అతనిని పరివేష్టించి యున్నయసంఖ్యాకు లయినశిష్యులు స్వామిరక్షణపరాయణు లయి కోపములు రూపము నొందినట్లు వీర రసమూర్తు లయి లేచి బాహులు చాఁచికొని ముష్టియుద్ధసన్నద్ధులై బైలుదేఱి కలియుఁబడఁబోఁగా భయపడి దంతతాడిత విషోరగములవలె రోఁజుచు వెనుక మరలవలసినవా రయిరి. ఆసాయంకాల మెప్పటివలె జీసస్సు పడకకు బెథనీగ్రామమునకుఁ బోయెను. ఈలోపల మతా చార్యులును ఫారిసీలును మఱునాఁడు దమవిరోధి నెట్లు నిరోధిం తుమా యని మారణోపాయము నాలోచింపఁ దొడఁగిరి.

యూదులు పలుతెగలుగా భాగింపఁబడి, వరస్పరద్వేషము గలవా రయి, యొకరి వినాశనము నొకరు కోరువారుగానుండిరి. అయి ననుసామాన్యశత్రుభయము సంభవించినప్పుడు గర్భశత్రువులు సహి తము కొంతకాల మాశత్రుసంహారమునకయి మిత్రభావము వహించి యేక మగుదురు. కాఁబట్టి జనులు జీసస్సును మెస్సయా యని యంగీ కరించుటలో దినక్రమమున నధికవిశ్వాసశీలు రగుచున్నారని భయ పడి, యూదులలోని యన్నశాఖలవారి నాయకులును తమపూర్వవైర ములను కట్టిపెట్టి, దినదినప్రవర్ధమాన మగుచున్న ప్రాబల్యమును బట్టి తమ కందఱకు సమానముగానే భయోత్పాతకుఁ డగుచున్న యీ క్రొత్తశత్రువును పరిమార్చుట కయి యొక్కటిగాఁజేరిరి. యూదుల లోని యధికారవంతులును ధనవంతులును విద్యావంతులును నించు

మించుగా నందఱును నొక్కసారిగా నొక్కపురుషునిపై ధ్వజ మెత్తిరి. అతనికి గొప్పవారిలో నొక్కరును సహాయులును మిత్రులును లేరు. ఆతని కున్న బలమంతయు జ్ఞానమును సత్యమును ధర్మమును మాత్రమే.

జీసస్సు ప్రతిపక్షు లందఱును చేరి యాలోచించి యాతనిపై మరణదండనమున కర్హ మైన నేరమును దేని నయిన మోపవలె ననియు, రాజద్రోహ మట్టినేర మైనందున రోమకచక్రవర్తి యయిన సీజరునకు ప్రతికూలముగా నాతనిచేత నే దయిన ననిపించెడి యుపాయము చూడవలె ననియు, కూడబలుకుకొని యెవ్వరికిని సందేహము కలుగకుండుట కయి తమలోని నాయకులను గొందఱ నావనికి నియమించిరి. వారు ధర్మశ్రవణార్థము వచ్చెడి మూఁకలోఁ జేరి మఱునాఁ డాతఁడు ప్రసంగముచేయు నప్పుడు దావునఁజేరి తద్వచనామృతసారమును అవ్యాజమయినశ్రద్ధాభక్తులతో గ్రహించుచున్నట్లునటించుచు ప్రసంగావసానసమయమున చేతులుజోడించుకొని 'స్వామీ! దేవరవారు భగవత్సన్నిధ్యమార్గమును బోధించుచున్నారనియు సత్యమును నిర్భయముగా వచించుచున్నారనియు మేమెఱుఁగుదుము. దయచేసి మేము సీజరునకు పన్నులుకట్టుట ధర్మమేమో సెలవిండు' అని యడిగిరి. "ఓవంచకులారా! నన్నేల వివేహాపఱిచెదరు? పన్ను కట్టెడి సొమ్మేదో నాకుచూపుము" అని యాతఁ డుత్తరము చెప్పెను. వారిలో నొకఁ డొక ప్రక్కను చక్రవర్తిముఖముగల రోమనునాణెము నొకదాని నాతనిచేతిలోఁ బెట్టెను. నాణెమును పయికెత్తి చూపి "ఇది యెవ్వరివిగ్రహము?" అని యతఁడడిగెను. "అది సీజరుది" అని వారుబదులుచెప్పిరి. "అట్లయినపక్షమున సీజరువస్తువులను సీజరునకు చెల్లింపుఁడు; భగవంతుని వస్తువులను భగవంతునకు సమర్పింపుఁడు." అని యతఁడు శాంతముగా

మనస్సునకు నాటుకొనునట్లుగా ను ్తరము చెప్పెను. ఆమాటలువిని తెల్లపోయి ఫారసీ లొండొరుల మొగమువంక జూచుకొనసాగిరి. వారు పెద్దవలవేసి శత్రువును పడ(ద్రోయ(జూచిరి కాని తుదకు వారివలలో నేమియుపడలేదు. అతడు సీజరునకు పన్ను చెల్లించవలసిన పనిలేదని చెప్పినపక్షమున రాజ(ద్రోహము (కింద పట్టుకొని రోమకపరిపాలకుఁ డైన పైలేటున కొప్పగింపవలెననియు, సీజరునకు పన్ను చెల్లింపవలసిన దని చెప్పినపక్షమున పరదేశ(ప్రభుత్వమును దేషించువా రయిన (ప్రజ లతడు మోసగాడే కాని మెస్సయా కాడని నిశ్చయించి యాతనిని గర్హింతు రనియు, వారెన్నుకొని యుండిరి. ఇప్పుడు వారియెన్నిక వ్యర్థ మయ్యెను. జీసస్ను చెప్పిన మాటలు తన్ను పాయమునుండి తప్పించు కొనుటకయి పలికిన పలుకులుగాక శ్లాఘూపా(తములయిన దివ్యవచనము లయి యున్నవి. బాహ్యాపదార్థము లిప్పు డున్నట్లే యుండవచ్చు ననియు, ఈశ్వరరాజ్యము హృదయములోని (పేమవలనను పరిశుద్ధత వలననుమా(తమే నిర్మింప బడవలెననియు, వయివాక్యముల యభి (ప్రాయము. 'ఆధ్యాత్మికవిషయములు వేఱు, లౌకికవిషయములు వేఱు' అని బోధించి, నిజమైన చిత్తోన్నతికిని నాగరికతకును మూలాధారము లయినవి యీ యమూల్యవాక్యరత్నములే.

అతనిని రాజ్యాంగ గర్తములోఁ బడవేయవలె నని చేసిన (పథమ (ప్రయత్న మిట్లు భగ్నము కాఁగా, రాజ(ద్రోహమువలెనే మతధర్మ దూషణమును మరణదండనమునకు దోషిని పా(తునిచేయునది యగుట దలపోసి ఫారిసీ లాతని నేలాగున నైన స్వధర్మాధిక్షేపకూపములో బడవేయవలెనని ద్వితీయ(ప్రయత్నము చేసిరి. వారిలో నొందఱు ముందుకు వచ్చి "అన్నిటిలో నుత్తమధర్మానుశాసన మేది?" అని యడిగిరి. "మొదటి ధర్మానుశాసనము నీప్రభువైన దేవుని నీవు పూర్ణ

హృదయముతో ప్రేమింపవలయు ననుట. రెండవది నీపొరుగువానిని నీవు నిన్నువలెనే ప్రేమింపవలయు ననుట. ఈ రెండుధర్మానుశాసన ములమీఁదనే ధర్మ మంతయు నిలిచి యున్నది." అని యతఁ డుత్తర మిచ్చెను. ఈయుత్తరము తమ కుత్సితోపాయసిద్ధి కనుకూల మయినది కానందున వారు లోలోపల నేమో సణుగుకొని మొగములు త్రిప్పు కొనిరి. ఇంకొక కొంద ఱొకవ్యభిచారిణిని గొనివచ్చి యాతనిముందు పెట్టి కపటవృత్తితో "స్వామీ! దీని కేమి దండనము?" అని ప్రశ్న చేసిరి. విధింపవలసినదండన ముందఱు నెఱిఁగియున్న దే ప్రపంచములో పాపము చేయనివా రెవ్వరు నుండరు గాన దయనీయులను క్షమింప దగు నన్న భావము తోఁచువట్లుగా "మీలో పాపము చేయనివా రెవ్వరో ముందుకువచ్చి యీమెమీఁద మొదటిరాయి యతనిని వేయనిండు." అని యతఁ డాదాంభికులమనస్సులకు శూలాయమా నముగా నుత్తరము చెప్పెను.

వా రిట్లు కపటనాటకవేషధారు లయి మాటిమాటికి వచ్చి తన్ను బాధించుచుండుట సహింపఁజాలనివా ఁడయి కోపోద్రేకముతో "ఓ మహాజనులారా! లేఖకులను ఫారిసీలును మోసెస్సునొయొక్క ధర్మానుశాసనములను మీకు ప్రసాదించుచున్నారు. కాఁబట్టి వారి ధర్మానుశాసనములను మీ రనుష్ఠింపవలసినదే. కాని వారు తమ దృష్టాంతమువలన చూపిన మార్గమును మీ రనుసరింపకుఁడు. వీల యన, వారు తమయుపదేశములనే తామాచరింపరు. వారు మను ష్యుల బుజములమీఁద పెద్దబరువుల నెత్తి కట్టుదురుగాని మనతోడి మానవులమీఁది బరువును లేపనెత్తుట కయి యొక ప్రేలెత్తునంతటిపని నైనను తాము చేయరు. మంచిదియు సత్యము నన్న హేతువుచేత దేనిని వారు ప్రేమింపరు; జనులు తమ్ము మంచివారినిగా చెప్పుకో

వలెననిమాత్రమే ధర్మము నాచరింతురు. సామాన్యజనులవిషయ
మైనచింతయే వారికి లేదు ; ఇతరులు తమసహోదరు లన్నజ్ఞానమే
వారికి లేదు ; వారిచింత యంతయు ఉత్తమపదార్థములను ఉన్నతపద
వులను తాము సంపాదించుకోవలెననిమాత్రమే" అని యొక్కింత
చెప్పి, అంతకంతకు కోప మతిశయించి వట్ట శక్యము కాకపోగా
ఫారిసీలవంకను లేఖకులవంకను దిరిగి "ఓ లేఖకులారా! ఫారిసీలారా!
వంచకులారా ! మీకు దుఃఖ మగుఁగాక ! జ్ఞానకుంచికను జనులనుండి
తొలఁగించి, మీ రీశ్వరరాజ్యము వారికి లభింపకుండ మూసిపెట్టు
చున్నారు. మీరును లోపలికి పోవరు ; పోవఁగోరినవారిని లోపలికి
పోవనునియ్యరు. మీకు దుఃఖ మగునుగాక ! మీరనాథలవసతులను
మ్రింగివేయు చున్నారు; పయి వేషమున కయి దీర్ఘప్రార్థనలు
చేయుచున్నారు ; కాఁబట్టి మీరధికతరనరక బాధల నొందుదురు.
ఎవ్వనినైన నొక్కనిని మీమతములో కలుపుట కయి స్థలమును జల
మును చుట్టఁబెట్టుదురు ; కలిసినతరువాత వానిని నరకభాజనుని గాఁ
జేయుదురు. ఓవంచకులారా ! బుద్ధిహీనులారా ! పొలములో పండెడు
సోపుగింజలలోను జీలకఱ్ఱపాయలలోను దశాంశమును గురువున
కర్పించుట మహాపుణ్యకార్యమని చెప్పుచు, దయాధర్మసత్యశౌచాదు
లైన మహత్తరవిషయములను విడిచిపెట్టుదురు. ఓ బుద్ధిహీను
లారా! మీకు దుఃఖ మగునుగాక! మీరు దోమనుమ్రింగ డొం
కొనుచు లొట్టియను గుటుక్కున మ్రింగివేయుదురు. మీరు లోపల
మృతాస్థులతోను సకలాశుద్ధతలతోను నిండియున్నను పయికి సుందర
ముగా కనఁబడెడి వెల్లవేసిన సమాధులవంటివారు. బాహ్యమునకు
పుణ్యాత్ముల వలెఁగానఁబడుచు లోపల మీరు పాపకాపట్యదూషితు
లయి యున్నారు. ఓలేఖకులారా! ఫారిసీలారా! వంచకులారా! మీకు

దుఃఖ మగును గాక! మీరు మీతేండ్రులు చంపిన పూర్వప్రవక్తల కును పుణ్యాత్ములకును సమాధులు నిర్మించుచున్నారు. మీరును మీపూర్వులవలెనే వర్తమానప్రవక్తలను పుణ్యపురుషులను బాధలు పెట్టి చంపుచున్నారు. ఓసర్పజాతులారా! విషసర్పములారా! మీరు నరక యాతన నెట్లు తప్పించు కొనఁగలరు?"

ఈపిడుగువంటి నుడువు లెవ్వరినిగూర్చి యుద్దేశింపఁబడినవో వారికి మనోవ్యధాకరములును కోపజనకములు నయి యుండెననుటకు సందియము లేదు. మిత్రమధ్యమునం దున్న యాతని నా సమయము సం దేమి చేయుటకును శక్తులు కాకపోయినను ప్రతిపక్షులలో కొండఱు దూరమునుండి యాతనిపై రాళ్ళు రువ్వి రఁట! ఇంతలో జీసస్సుయొక్క కోపాగ్ని కొంత ప్రశాంతినొందగా తొంటిక్రోధము ఖేదముగా మాటినవాఁ డయి పట్టణము నుద్దేశించి "జెరూసలేము నగరమా! కలకటా! నీవద్దకుఁ బంపఁబడిన ప్రవక్తలను నీవురాళ్ళతోఁ గొట్టి నిష్కరుణముగాఁ జంపుచున్నావు. కోడి తనపిల్లలను తెక్కల క్రిందఁ జేర్చుకొను నట్లుగా నీప్రజలను నాయండకుఁ జేరఁ దీయుటకై నే నెన్ని సారులు కోరుచున్నాను! అక్కటా! నీవు వారిని చేరనీయవు." అని పలుకుచు నతఁడు దేవాలయమునుండి వెడల బయలు దేఱెను. అతఁడు ద్వారమువంక నడుచు నప్పుడు ప్రక్కలను దానపేటికలు కనఁబడెను. ఆపెట్టెలలో వేయబడినధనమును తీసి తరువాత ధర్మ కార్యముల కుపయోగింతురు. అతఁడా పెట్టెలవంకఁ జూచుచు నిలఁ బడియుండగా ధనికు లయిన ఫారిసీలు మొదలయినవారు తమ యొద్దనున్న పెద్దవయిన వెండిబంగారు నాణెములను పరులకు తెలి యుటకేమో యునునట్లు ఘల్లు మని మ్రోగునట్లుగా దానపేటికలో వేయుచు వచ్చిరి. అప్పుడు జీర్ణ వస్త్రములు కట్టుకొనియున్న నిరుపేదఱి

యయిన మృతభర్తృక యొకతు యొకపెట్టెను మెల్లఁగా సమీపించి తనయొద్దనున్న యొక చిన్ననాణెమును భక్తిపూర్వకముగా దానిలో జాఱవేసెను. అదికనిపెట్టి జసస్సు తనశిష్యులతో ఆబీదదానిధర్మమును జూచితిరా? అందఱు నిచ్చినదానికంటె నీనిఱుపేదది యిచ్చినదే యెక్కువైనది. తక్కినవారు తమ కున్నవిశేషధనములో నత్యల్పభాగము నిచ్చిరి. ఈబీదదో రాత్రితనభోజనముమాటయైన తలపెట్టక తనకున్నదంతయు నిచ్చివేసినది. ఈమి చేసినదానమే యొకకాసయినను దేవునకధికప్రీతికరమైనది" అనిపలికెను. ఆమాటలు విన్న ఫారిసీలు మొదలైనవా రతఁడొక్కఁకాను పెట్టెలో వేసినబీదదానిని బట్టువలె పొగడుచు సువర్ణ నిష్కములను ధర్మార్థముగా వేసిన తమవంటి శ్రీమంతులను తెగడుచు నవజ్ఞ చేయుచున్నఁడనికోపముతో గొణుగుకొనుచుఁ బోయిరి. జీసస్సును శిష్యులును బెథనీగ్రామము వంక నడిచిరి. ఆలివ్ కొండమీఁద నున్న బెథనిగ్రామము జీసస్సున కత్యంతప్రియ మయినది. అక్కడ నొక్క సోదరుఁడును ఇద్దఱు సోదరీమణులును గలయొక సాధుకుటుంబ మతనికి పరిచితమైనది. వారితోడి మైత్రి యతని కెంతో యాహ్లాదకరమయినదిగా నుండెను. అక్కసెల్లెండ్రిద్దఱిలో నొకామె పేరు మార్తా; ఆమె దయాదాక్షిణ్యములు గలదియు శ్రద్ధాళువు నయియుండెను. రెండవయామె పేరు మేరీ; ఆమె యొకవిధ మయినసౌకుమార్యమును ధ్యానశీలమును గల దయి జీసస్సును రంజించుచుండెను. జీసస్సుయొక్క పాదసన్నిధానమందుఁ గూరుచుండి యాయన చెప్పునది తదేకధ్యానముతో వినుచు వలు మాఱు గృహవ్యవహారములనే మఱుచుచుండును. అటువంటి సమయములయం దింటిపని యంతయు తనమీఁదనే పడఁగా నామె సోదరి వచ్చి మృదువచనములతో నామెను మందలించుచుండును. అప్పుడు

జీసను మార్తా! నీ వెంతో శ్రమపడి పెక్కుపనులలో శ్రద్ధవహించు చున్నదానవు. ఆవశ్యక మయినది యింకొకయంశముమాత్రమున్నది. మేరీ యిప్పు డాయుత్త మాంశమును గ్రహించినది. దానిని వారింప వలదు." అని పలుకును. వారిసోదరుఁ డైన లాజరెన్నుకూడ జీసన్ను నకు పరమాప్తుఁడు. జీసన్ను న కాకుటుంబమువారు చేసిన సాయము నకును చూపినయాదరమునకును పరిమితిలేదు. వచ్చిననాఁడురాత్రియే జీసన్ననకు వారు గొప్పవిందు చేసిరి. యాత్రార్థ మయి వచ్చినగాలిలీ దేశస్థు లందఱును వారిసహావంక్తిని గుడిచిరి. విందునడుమను మేరీ యొక పరిమళద్రవపాత్రములోని గుమగుమలాడెడి యాసారభరసము నాతని పాదములకడ గ్రుమ్మరించెను. దాని పరిమళము గది నంతను గుప్పున ముంచుకొని యెల్లవారిని నంతోషసముద్రములో ముంచెను. అప్పు డామె సాగిలఁబడి తనదీర్ఘశిరోజములతో ప్రభుపాదనమార్జ నము చేసె నఁట! ఇది యాతినియం దామెకుఁ గలయసాధారణ శ్రద్ధాభక్తులను సహస్రముఖముల ఘోషించుచున్నది. ఇట్టి మిత్ర నికేతనమునకే నాఁటిరాత్రి జీసన్ను వెదకుకొనుచుఁ బోయెను.

ఎనిమిదవ ప్రకరణము.

జీసస్సుయొక్క విచారణ, మరణము.

ఈవఱకే శత్రువులయొక్క కోపోద్దీపనము పరమావధి కెక్కినది. జీసస్సు ప్రాణములతో నుండఁగా యూదమతము నిరపాయముగా తలయెత్తుట పొసఁగ నేరదని భావించి మతాచార్యులు సభ చేసి యేయుపాముచేత నైనను నాతని యిహలోకజీవితము నంతమొందింప వలయునని నిశ్చయముచేసికొనిరి. అప్పటి ప్రధానమతాచార్యుఁడు కైఫా యను నతఁడు. రోమనులు జెరూసలేము నగరమునాక్రమించుకొన్న కాలము మొదలుకొని రాజపురుషుల నిగ్రహానుగ్రహానుసారముగా ప్రధానాచార్య లేఁబోటు మాఱుచుండిరి. కాని కైఫా రోమనుపక్షావలంబుఁడగుటచేత పదిసంవత్సరముల నుండి యాచార్యపీఠమును వదలక యేకాధ్వర్యముగా నధికారము చెల్లించుచుండెను. అయినను అతని యధికార మంతయు నామమాత్రమే కాని ప్రధానాచార్యపట్టము లేకపోయినను నిజమైన యధికార మంతయు హాననుచేతిలో నుండెను. ఇతఁడతఁడాడించిన ట్లాడవలసినవాఁడు. హానను కైఫాకు మామగారు. హానను పూర్వము ప్రధానాచార్యపదమునందుండి యిప్పుడు తొలఁగింపబడినవాఁడయి యుండి నను తెరచాటుననుండి యప్పటినుండియు నితఁడే కార్యతంత్రినాటకమును నడపుచుండెను. ఈతనితో నాలోచించి యీతనిసమ్మతిని బడయక కయిఫా యేముఖ్యాంశమునందును స్వతంత్రముగా కర్తవ్య నిర్ణయమును చేయఁడు. హానను కుమారులలో నైదుగురప్పుడప్పుడు ప్రధానాచార్యపదమును పొందినవారయి యుండిరి. దేవాలయము

లోని ముఖ్యోద్యోగము లన్నియు నీతని కుటుంబములోని వారిచేతనే వహింపఁబడుచుండినవి. అందుచేత నాచార్యకోటిలోనివారి కందఱికిని హానను నాయకుఁడుగా నుండెను. ఇతఁడు సద్దూసీతెగవాఁడు.

ఆచార్యపురుషులు చేసినసభలో జీసస్సును సాధ్యమైనంత శీఘ్రముగా పట్టుకొనుటకు నిశ్చయము చేసికొనిరి. కాని యెప్పుడెట్లు పట్టుకోవలయునా యన్న యాలోచనమాత్రము తెగలేదు. అతనిని ధర్మ్మప్రవచనము చేయుటకయి బైటికివచ్చినప్పుడు పట్టుకొంద మంటినూ, అప్పుడు తమప్రాణములనైన నిచ్చి గురువును రక్షింప వలయునని కంకణము కట్టుకొనియున్న శిష్యు లాతనిని చుట్టుకొని యుండుటచేత ఘోరయుద్ధము జరిగి వీథులలో రక్తప్రవాహములు గట్టక పట్టుకొనుట సాధ్యముకాదు. బెథనీగ్రామములో నింటఁ బండు కొని యున్నప్పుడు పోయి పట్టుకొనుటకయి భటులను బంపుదమంటినూ, ముందుగా సంగతి తెలియక మానదు గనుక పట్టుపడక యతఁడు తప్పించుకొని పోవచ్చును. ఎట్లును పాలుపోక మతాచార్యు లిట్లు తల పోతలుచేయుచుండఁగా వారికెప్పుడును నెదురుచూడని తావునుండి సాయమువచ్చెను. మతాచార్యుల మనుష్యులు వాని మనోదౌర్బల్యమును కనిపెట్టి యాశపెట్టి మెత్తపఱిచి లోపఱిచి పంపుటచేఁ గాఁబోలును జీసస్సుయొక్క ద్వాదశశిష్యులలో నొకఁడైన జూడస్సనువాఁడు తనస్వామిని పట్టి యొప్పగించెదనని వారియొద్దకు వచ్చెను. పండ్రెండుగురు శిష్యులలోను జూడస్సొకఁడే జూడియా దేశస్థుఁడు; తక్కిన పదునొకండ్రును గాలిలీదేశస్థులు. తన ప్రభువుయొక్క ప్రతి పక్షులకు సాయము చేయవలెనన్న స్వామిద్రోహబుద్ధితో బెథనీ గ్రామమునుండి తప్పించుకొని తనతోడివారి నేమఱించి దొంగతన

ముగా నిప్పటికి వచ్చెను. ఏహేతువుచేతఁ నితఁ డిట్టి స్వామిద్రోహ మున కొడిగట్టెనో తెలియరాకున్నది. ఇతఁడు మొదటినుండియు చెడ్డ వాఁడయి యుండియుండఁడు; అట్లుండినపక్షమున జీస స్క్రీతనిని పరమ విశ్వాసినిగా భావించియుండుట తటస్థింపదు. జీసస్సు తా నేతికోరు కొన్నపన్నిద్దఱు శిష్యులలోను జూడస్కారియోతునివిషయములోనే ప్రమా దమునొందెను. తనతోడివారితోఁ గలిగిన స్పర్థచేతనో మాత్సర్యము చేతనో తనస్వామిసంకల్పము సఫలమగునది కాదన్న యధైర్యము చేతనో యతఁడీయకార్యకరణమున కొడఁబడియుండును. తన ప్రియ శిష్యుఁ డొకఁడు దుష్టులదురాలోచనలలో తగిలియున్నాఁ డన్న సంగతి నూత్నబుద్ధియైన జీసస్సుయొక్క బుద్ధిప్రచారమునకు గోచ రింపకుండినది కాదు. జూడస్సుయొక్క స్థలాంతరగమనవీక్షణము చేతనే యతఁ డొకఁడ కేపనిమీఁదఁ బోయెనో జీసస్సు తత్క్షణమే గ్రహించెను.

ఏప్రిల్ పదునాల్గవతేది గురువారము ప్యాసోవరుపండుగ యారంభము. రాత్రిభోజనమున కేర్పాటుచేయుట కయి జీసస్సు కొందఅమిత్రులను నాఁటియుదయమున జెరూసలేము నగరమునకుఁ బంపెను. ఆరాత్రి జెరూసలేములో నొక్కమిత్రగృహమునందు జీస స్సును ద్వాదశ శిష్యులును గలిసి యేకకుటుంబమువలె భోజనముచేసిరి. అది యొక్కనికిఁ దక్క శేషించిన శిష్యులకందఱకును సంతోషావహ మయి తమయన్యోన్య భ్రాతృస్నేహానుబంధ ప్రతిష్ఠాపనోత్సవముగా కనఁబడెను. ఆయొక్కఁడును జూడస్సు. ఆసుహృద్గణములో తనొక్కనిగా భావించుకొనుట మానివేసినందునను, ఇంకను శిష్యుఁడయినట్టు నటించుచు తానారాత్రియే తనస్వామిని బంధించుటకయి భటవర్గ మును కొనిరానున్నవాఁ డగుటచేతను, వాఁడు నిస్సందేహముగా మన

స్వాస్థ్యము లేనివాఁడయి యుండెను. జీన స్నాతనిముఖచర్యను బట్టి యతఁడాచార్యులతోడి తన కుతంత్రమును పూర్తి చేసె ననియు దానిని కొనసాగించుటకయి భోజన సమాప్తి కొఱకు ప్రతీక్షించు చుండె ననియు, కనిపెట్టెను. ఈ విశ్వాస ఘాతుకత్వమును దలంచికొని మనోవ్యథ నొందినవాఁడయి సహించి యూరకుండలేక వేగిరపాటుతో శిష్యులవంక చూడిక్కసిగిడించి "ద్రోహి యయి మీలో నొక్కఁడు నన్ను పట్టియిచ్చు నని నిశ్చయముగా చెప్పు చున్నాను" అని పలికెను. వారొండొరులముఖములవంకఁ జూచుచు "నేనా!" "మీరు నన్నుద్దేశించినాఁడా" అని యాశ్చర్యముతో నందఱు నొక్కపెట్ట నడిగిరి. అతఁడెవ్వరిపేరును జెప్పక యూరకుండెను. జూడస్సు మనోవేదన గలవాఁడయి యక్కడ నిలువనొల్లక గది విడిచి లేచిపోవుట కయి లేచెను. అతఁడు పోవునప్పుడు జీస స్నాతని వంకఁ జూచి "నీవు చేయవలసినదానిని శీఘ్రముగాఁ జేయుము" అని శాంతస్వరముతోఁ బలికెను. జీస స్నాతని నేదో పనిమీఁదఁ బంపు చున్నాఁడనుకొనిరేకాని యప్పుడుసహితము శిష్యులతఁడు స్వామి ద్రోహి యగు నని తెలిసికోఁజాలక పోయిరి.

జూడస్సు గది విడిచి పోయినతరువాత జీసస్సు తనకు రాఁబోవు చున్న మరణావస్థను మనస్సునం దుంచుకొని వారి కుత్సాహమును ధైర్యమును సంతోషమును గలిగింపవలె నన్న యుద్దేశముతో దయా రస మొలుకునట్లుగా ప్రీతిపూర్వకము లైనవాక్యములు కొన్ని చెప్పి శిష్యులకు దిటవు గఱపెను. ఆరాత్రి భోజనావసానసమయమునం దొకవిశేషకర్మ నడచినది. జీసస్సు రొట్టె యొక్కటి చేతఁబట్టుకొని దానిని ముక్కలుగా విఱిచి యొకొక్కముక్క యొకొక్కశిష్యుని చేతిలోఁ బెట్టి "ఇది మీరుపుచ్చుకొని భక్షింపుఁడు. ఇదిమీనిమిత్త

మయి యియ్యఁబడిన నాశరీరమునకొక్క చిహ్నమును తెలుపు చున్నది. నాస్మరణార్థముగా దీనిని మీరు తినుఁడు." అని గంభీరస్వరముతో ననెను. అదివా రారగించినతరువాత నాతఁ డొక్కగిన్నెలో ద్రాక్షా సవమును బోసి త్రాగుట కయి శిష్యులచేతికిచ్చుచు "ఇది మీనిమిత్త మయి కార్పఁబడ నున్న నారక్తమును దెలుపు చున్నది దీనిని మీరు త్రాగునప్పుడెల్లను నాస్మరణార్థముగా త్రాగుఁడు" అని పలికెను. ఈవలుకు లాతనికిఁ గలదయార్ద్రహృదయమును శిష్యులయెడఁ గల యవ్యాజప్రేమమును వేయినోళ్ళను చాటు చున్నవి. అత్యల్పకాల ములోనే సంభవింప నున్నతనమరణమునకు ముందు శిష్యులలో నైక మత్యమును తనమీఁదిభక్తిని తన్మూలమున స్వార్థపరిత్యాగబుద్ధిని పురికొల్పుటకయి శిష్యులలో నొకకర్మ యావశ్యక మని భావించి బుద్ధిమదగ్రేసరుఁ డైనయతఁ డీపనిని చేసి యుండును. ఈకర్మ యివ్వ టికిని భూమిని స్వర్గమునుగాఁ జేయుట కయితనప్రాణమును ధారపోసిన మహాత్మ్యని స్మృత్యర్థముగా "ప్రభుభోజన" మనుపేర ప్రతిసంవత్స రమును సమస్తక్రైస్తవజాతులవారిలోను అవిచ్ఛిన్నముగా జరపఁ బడుచున్నది.

భోజనము లయినతరువాత ప్రార్థనలు చేసి కీర్తనలు పాడి మరల బెథనీగ్రామమునకుఁ బోవ బైలుదేఱునప్పటి కించుమించుగా నర్ధరాత్ర మయినది. ఇట్టినిశాసమయమునం దొంటిగా తోఁటకు నడు చుటకు శిష్యులు కొంచెము సంశయించిరిగాని యతఁడు ప్రయాణ మయి నిర్భయముగా ముందడుగువేసినను మనస్సులోమాత్రము బెథనీగ్రామము చేరుదు ననునిశ్చయము లేనివాఁడయి యుండెను. కృతఘ్నుఁడయినయాశిష్యుఁ డెప్పుడు గదిని విడిచి బైలుదేఱి బయటికి పోయెనో యప్పుడే యతఁ డేపనిమీఁద పోవుచున్నాఁడో యేమిజరగ

నున్నదో సర్వమును జీసస్సు తనకన్నులయెదుట కట్టఁబడినట్లుగా మనో
దృష్టిచేతఁ జూచెను. కాని యతఁ డెప్పుడును చావునకు భయపడిన
వాఁడు కాఁడు. అతఁడిప్పుడు తప్పించుకొని పోఁదలఁచుకొన్నపక్షమున
నొరు లెఱుఁగకుండ నెందేని పోఁగలఁడు. అయినను తానట్లు తప్పించు
కొనిపోవుట కెంతమాత్రము నిష్టములేనివాఁ డయి యతఁడు తిన్నగా
మృత్యుముఖమునకు నడచుటకు కృతనిశ్చయుఁ డయి యుండెను. తన
మరణమూలముననే తాను పూనినధర్మప్రచారమునకు జగమునం
దభివ్యాప్తి కలుగవలె నని యీశ్వరసంకల్ప మనియు, తాను బ్రతికి
యుండి ధర్మబోధము చేయుచున్నప్పటికంటె తాను చచ్చి దారి
చూపుటవలననే తాను బోధించినసత్యముల కత్యంతశీఘ్రముగా లోక
ములో నధికప్రాచుర్యము కలుగుననియు, అతఁడు నిశ్చయముగా
నమ్మినవాఁ డయి ప్రపంచోద్ధరణార్థముగా తనప్రాణములను తృణ
ప్రాయముగా విడుచుటకు సంసిద్ధుఁ డయి యుండెను. అయినను
తన్ను విరోధులు నిరోధింపఁగానే శిష్యులు నిరుత్సాహు లయి యధైర్య
పడుదు రేమో యున్నభయముమాత్ర మాతనిమనస్సును బాధించుట
మానినది కాదు. అందుచేత నతఁడు వీధిలోనికి పోవునప్పుడు తలవా
కిట నిలిచి సిమనుతో "ఓయీ! పిశాచము నిన్ను తనవంకకు లాగు
కొనఁ గోరుచున్నది; కాని నీవిశ్వాసము చెడకుండునట్లు నీనిమిత్త
మయి నేను ప్రార్థనచేసియున్నాను." అని చెప్పెను. "తక్కినవారంద
ఱును విడిచిపెట్టినను నేను దృఢవిశ్వాసి నయి యుండి, ఆవశ్యకమయిన
యెడల కారాగృహమునకును మృత్యుముఖమునకును నేను నీతో
వచ్చెదను." అని యతఁ డుత్తర మిచ్చెను. అంతటిధైర్యశాలి నను
కొనుచున్న యాప్రియశిష్యుని మొగమువంకఁ జూచి విచారముతోడి
మందహాసము చేసి జీసస్సు "ఈరాత్రి ముగియకమునుపే కోడికూసెడు

లోపల నీవు నన్నెప్పుడు నెఱుంగ నని యుపలపించెదవు." అని పలికి, శిష్యుల నందఱిని జూచి "ఈరాత్రి మీరందఱును నాయెడల నాశా భంగము నొంది సాపరాధు లయ్యెదరు. గొల్లవాఁడు నేలఁగూల్పఁబడి నప్పుడుగొట్టెలమంద యెట్లో యట్లే భయకంపములతో మీరందఱును నానాముఖముల చెదరిపోయెదరు." అని చెప్పెను. వారు తమమనస్సు లలో ప్రభువు తమయోగ్యతకు తగినంతగణ్యతను తమ కియ్యలేదని తలఁచికొనినను పయి కేమియు ననలేదు. ఇంతలో నతఁడు మరల నందుకొని "సొమ్మగాని జోలిగాని పాదరక్షలుగాని యేమియులేకుండ మిమ్మ నేను ధర్మ్మప్రవచనార్థముగా బైటవఁపినప్పుడు మీకెప్పుడైన నేదైన కావలసివచ్చెనా?" అని యడిగెను. 'ఏదియు కావలసిరాలేదు' అని వారు బదులుపలికిరి. ఇప్పుడు మీలో ప్రతివురుషుఁడును తన సంగతి తానే చూచుకొనవలెను. నావ్యవహారము ముగింపునకు వచ్చు చున్నది. ఇఁక మీరుపోషణముయొక్కయు రక్షణముయొక్కయు సాధ నములను మీరే సమకూర్చుకోవలెను." అని జీసస్సు చెప్పుచుండఁగా నెవ్వఁడో యొక శిష్యుఁడు రెండు కత్తులతో ప్రపంచమునంతటను జయింపఁ గలుగుదు మన్నట్లుగా "ప్రభూవద్దనివిగో రెండుకత్తులున్నవి." అని పలికెను. వారి యమాయకత్వమునకు లోపలనవ్వుకొని 'చాలును ఇఁక పోదము రండి.' అని జీసస్సు ముందు నడవఁ జొచ్చెను.

అది వెన్నెలరాత్రి గాన దారి చక్కఁగా గానఁబడుచుండెను. వా రావెన్నెలలో నిశ్శబ్దముగా నున్న వీథులలోనుండి నడిచి పుర ద్వారము నిర్గమించి కొన్నిదినముల క్రిందట పెద్ద యూరేగింపుతో జీసస్సు జెరూసలేము నగరప్రవేశము చేసినమార్గమున నేపోయి కెడ్రన్ వంతెనను దాఁటి కొన్ని నిమిషములలో బెథనీగ్రామ సమీపమున ఆలీవుపర్వతపాదమున నున్నతోఁటలో ప్రవేశించిరి. జీస స్నేక

ముందుకుసాగక దానిప్రక్కకు దూరముగా తొలఁగి యక్కడ నిలువఁబడెను. దేవాలయభటులతోను సైనికులతోను గూడి జూడస్సు తప్పక తన్ను వెదకుకొనుచు వెంబడించి వచ్చు నని యతఁడు దృఢముగా నమ్మియుండెను. అందుచేత భటులు తన్ను పట్టుకొను నప్పు డనివార్యముగా సంభవించెడు సంక్షోభమును భీతియు బెథనీగ్రామములోని తన మిత్రులకు కలుగఁజేయ నిష్టము లేనివాఁడయి గ్రామములోనికిఁ బోవక కొంతసేపు తోఁటలోనేయుండి ప్రతిపక్షులయాగమనమును ప్రతీక్షించుచుండుట కయి యతఁడు నిశ్చయము చేసికొనెను. అంతే కాక యతఁడు తా నాలివుకొండమీఁద నిలువఁగోరుట కింకొక కారణము కూడఁ గలదు. అతని మన స్సిప్పుడు మిక్కిలి కలతనొందిన దయి స్థైర్యము లేక డోలాందోళనము నొందుచుండెను. మనశ్శాంతి కలుగుటకయి యేకాంతస్థలమున నీశ్వరుని సమీపించి తనహృదయము నాతనికి నివేదించి ప్రార్థనచేయవలసిన యావశ్యకతగూడ నతనికి కనఁబడెను. ఇతరులు నిద్రపోవుచుండిన కాలములో ననేకరాత్రు లతఁడు బైటికిఁబోయి తనకు బుద్ధిని బలమును ప్రసాదించుట కయి వేఁడుచు గంటలకొలఁదికాల మొంటిగా నీశ్వరధ్యానమునం దతఁడు తనపరమపిత సాన్నిధ్యమునఁ గడపుచువచ్చెను. కడవటి దయిన తన యీగొప్పవరిశోధన కయి పూర్ణముగా సంసిద్ధుఁడు కాఁగలుగుట కతఁడిప్పు డీశ్వరునితోఁ గొంతకాల మేకాంతముగాఁ గడప గోరియుండెను. గెత్సేమే ననిపిలువఁబడెడి క్షేత్రమునకు సమీపమున నున్న యొకయాలీవుచెట్ల యారామములో ప్రవేశించి యతఁడు శిష్యులనుద్దేశించి "మీ రిక్కడ వేచియుండుఁడు. నేను ప్రార్థననిమిత్తము ముందుకు పోయెదను" అని చెప్పెను. ఇట్లు చెప్పి పీటరును జానును జేమ్సును దనవెంటఁగొని యతఁడు చెట్లలోనికి మఱి

కొంతదూరము నడిచి "నాయాత్మ మరణ వేదనమునకుం బోలె నత్యంత విషాదము నొందుచున్నది మీ రిక్కడనుండి నాతో కనిపెట్టి చూడుఁడు" అని యాముప్పురతోను జెప్పి, అతఁడు మఱికొన్నియడు గులు ముందుకు నడచి భూమి మీఁద సాష్టాంగపడి "ఓ నాతండ్రీ! సాధ్య మయినయెడల, ఈవిషపాత్రము నన్నుండి కడచి పోనిమ్ము. అయినప్పటికిని నాయిచ్ఛగాక నీయిచ్ఛయే నెఱవేఱును గాక!" అని ప్రార్థించెను. అతఁ డింకేమి వేఁడెనో తెలియదుగాని చాలసేపు ప్రార్థనము చేసెను. ఈశ్వరుఁడు తన్నిట్లు నడుపుచున్నాఁ డనియు, తన శత్రువులనుండి పాఱిపోవుటకంటె తన ప్రాణమును సమర్పించుటయే యాశ్వరాభిమత మనియు, అతఁడు తెలిసికొనెను. కొంచెముసే పయినతరువాత నతఁడు భూమిమీఁదినుండి లేచి శిష్యులవద్దకు వచ్చునప్పటికి వారు ముగ్గురును నిద్రపోవుచుండిరి. "ఏమి యిది! ఒకచిన్న గంటకాలము మీరు నాతో వేచియుండ లేకపోయితిరా? మీకును శోధనసమయము రావచ్చును గనుక, నానిమిత్తము గాకపోయినను మీనిమిత్త మయినను వేచి ప్రార్థింపలేకపోయినారా?" అని సోద్వేగముగాఁ బలికి, వారియొద్దనుండి మరలి కదలిపోయి, ఓనాతండ్రీ! ఈ విషపాత్రము నేను పానము చేసిననే కాని నన్నుండి సాగిపోరానిపక్షమున, నీయిచ్ఛ నెఱవేఱును గాక!" అని జీసస్మీసారి యధిక మనోబలమును చిత్తశాంతియుఁ గలవాఁడయి ప్రార్థించెను. ప్రార్థనానంతరమున నాతనిమనస్సు శాంతమును సబలమును కాఁగా నతఁడు మరల శిష్యులవద్దకువచ్చి వా రింకను నిద్రపోవుచుండుట చూచి "ఇంకను నిద్రపోయి విశ్రాంతి ననుభవింపుఁడు" అని పలికి, తా నొక్క యాశ్వరసాహాయ్యమునే కాని మనుష్యసాహాయ్యము నిప్పుడపేక్షింపనివాఁ డయి యుండుటచేత వారిని నిద్రనుండి లేపక కర్తవ్య

చింతలో నుండెను. ఇంతలో దూరమునుండి నడిచివచ్చుచున్న మనుష్యుల కాళ్ళచప్పుడాతని చెవిని బడఁగా, చాలును! కాలము సమీపించినది. మనుష్యపుత్రుఁడు పాపులచేతులలో నప్పగింపఁబడుచున్నాఁడు మనము వెళ్లుదము. లెండు. అదిగో మద్ద్రోహి చేరువనున్నాఁడు. చూడుఁడు" అని గుండెలు జల్లుమనుచూటలతో నతఁడు పరిచరులను లేపెను. వా రులికిపడి లేచి నివ్వెఱపాటుతో నిలువఁబడునప్పటికి జూడస్సును ముందుంచుకొని యాయుధపాణులయిన మనుష్యులు వారిని చుట్టవేయుఁగా వారిలో పీటరు తనవట్టాకత్తిని దూసికొని వేవేగముగా వచ్చి ప్రధానాచార్యుని భృత్యులలో నొకఁడయిన మావిక స్సను వానిని చెవిమీఁద పొడిచి గాయపఱుపఁగా జీస స్సతనిని వారించెనఁట! ముందుకుపోయి ముద్దుపెట్టుకొని వాడుక ప్రకారముగా ప్రణామము చేయుటవలన జూడస్సు రాజద్రోహులకు జీస స్సెవ్వరో తెలుపు నట్లు మతాచార్యులచేత నేర్పాటు చేయఁబడెనఁట! ఈదండయాత్ర యేర్పాటు చేయఁబడిన విధమును బట్టియు, పంపఁబడిన యాయుధహస్తుల విస్తారసంఖ్యనుబట్టియు, చూడఁగా నాచార్యపురుషులు పట్టుకొనునప్పు డెంతో ప్రతిరోధము వచ్చునని జీసస్సునకు భయపడినట్లు కనుపట్టుచున్నది. దీర్ఘములైన లాటీకఱ్ఱలను కరములయందు ధరించి ముందు దేవాలయ రక్షకభటులు వచ్చిరి; వారివెనుక కృపాణపాణులయి రోమకసైనికుల సమూహము వచ్చెను. అవ్వాడు జూడస్సు ముందుకువచ్చి "స్వామీ! నమస్కారము." అని జీసస్సుయొక్క చెక్కిలి ముద్దుపెట్టుకొనెను. "మిత్రుఁడా! నీవేల వచ్చియున్నావు? ఈప్రకారముగా నాయెడల ద్రోహివగుటకు నీకు నేనేమి చేసియున్నాను?" అని నిందాగర్భముగా జీస స్సడిగెను. మృదువయినట్టియు మర్మచ్ఛేదకము లయినట్టియు జీసస్సు మాటలును చూపు

లును జూడస్సుయొక్క మనస్సులో కూలములవలె నాటుకొని తక్ష
ణమే పశ్చాత్తాపమును లజ్జను గలిగించెను. ఇట్లు పుట్టిన లజ్జానుశోధ
ముతో తరువాత జూడస్సును ఆత్మహత్య చేసికొనునట్లు చేసెను.

అప్పుడు నాయకులుగానున్న రాజపురుషులవంక దిరిగి
"నే నేమో దొంగనయినట్లుగా నన్ను పట్టుకొనుటకయి గట్టిలను కటారు
లను దాల్చి మీరేల వచ్చియున్నారు? దేవాలయములో బోధ
చేయుచు కూరుచుండినప్పుడు నన్నేల పట్టుకొనలేక పోయినారు?
అప్పుడు నామీద చేయిచాచుటకు సాహసము లేకపోయినది గాని
యీచీకటిగడియలో మాత్రము మీకు శూరత్వము వచ్చినది." అని
జీసస్సు పలికెను. నాయకులు సైగచేయగానే సైనికు లాతని బట్టు
కొని బంధించిరి. జీసస్సు వారి నెదిరించుట కించుకయుం బ్రయత్నింప
లేదు. కాని యప్పు డాతనిమన స్సెంతో క్షోభపడి యుండవచ్చును.
చేతులు వెనుకకు విజీచికట్టి చుట్టును రాజభటులు కాచియుండి పేరు
పడిన దొంగనువలెను హంతనువలెను వెనుకకు పట్టణమువంక కీడ్చు
కొని పోవునప్పుడు నిరపరాధి నని యెఱిగి యున్న యతడాదార్జస్సు
నకు హృదయమునం దెంతసంతాప మొందియుండునో! ఆతడిట్లు
పట్టుకోబడినది ప్రధానాచార్యునియొక్కయు సాన్ హెడ్రిమ్ సభ
వారియొక్కయు యధికారపత్రముమీద. ఈలోవల శిష్యులలో నసే
కులు పాతిపోయిరి. పీటరును జానును మాత్రము తమస్వామిని విడు
వక కావలివారికి మిక్కిలి దూరముగా వెనుక నడిచి వచ్చుచుండిరి.
ఎవ్వరో పేరు తెలియని తరుణ వయస్కుడొకడు సన్నదుప్పటి
కప్పుకొని యాతని వెంటనంటెను. కాని కావలివా రాతనిని పట్టుకొనఁ
బోగా పయివస్త్రము వారిచేతిలో విడిచిపెట్టి పాతిపోయెను. కడసారి
యిప్పుడు జీసస్సు క్రీడనువంతెనమీదుగా పురద్వారమునుండి మరల

నడిచెనుగాని యీసారి జయజయధ్వనులు చేయు భక్తులుగాని "ఈశ్వరప్రకా! మంగళము!" అని పలుకు శిష్యులుగాని, వెంట లేరు. న్యాయమునుకాని దయనుకాని చూపువారుగాని లేరు. కుపితశత్రు మధ్యమున బద్ధుడయి యతడు విషణ్ణహృదయముతో తలవంచుకొని నడిచెను.

రాజభటులు జీసస్సును ముందుగా హానను గృహామునకుఁ దీసి కొని పోయిరఁట. హానను జీసస్సును తనసిద్ధాంతములను గూర్చియు శిష్యులను గూర్చియు ప్రశ్నలు వేయుఁగా, అతఁడు త్తరము చెప్పక తన బోధనన్ను విన్న వారిని పిలిపించి తెలిసికొమ్మని బదులు పలికెనఁట! అట్లుపలుకుట తమఁకుజమాను నవమానపఱుచుటగా భావించి దగ్గఱి నున్న హానను పరివారములోనివాఁ డొకఁడు జీసస్సు నొకదెబ్బ కొట్టె నఁట! ముందుజరగఁబోయెడి యన్యాయవ్యవహారికహత్య కంతకును నిజమైన కారకుఁడు హాననే యైనను బహిరంగముగా విమర్శించి దండించుటకు తన కధికారము లేనందున నతఁడు విచారణనిమిత్తము జీసస్సును తన యల్లుఁడైన కయిఫా గృహామునకుఁ బంపెను.

ప్రధానాచార్యుఁడు సాన్‌హెడ్రిమునఁ కధ్యక్షుఁడు; ఈసభ డెబ్బదిమంది ధర్మాధికారులను గలదయి, యూదులయొక్క యున్నత న్యాయస్థాన మయి యున్నది. ఏవిషయములోనైనను తీర్పుచెప్పి దండన విధించుటకుముందు మూఁడవవంతునకు తక్కువ కాని సభ్యులును సభాధ్యక్షుఁడును చేరి విచారణజరపవలెను. అయినను రోమనులు దోషికి మరణదండనము విధింపఁబడినప్పుడు వానిని వధించు నధికారమును యూదులకు విడువక తమయధీనం దుంచుకొనిరి. సాన్‌హెడ్రిము సభవారు దోషినెవ్వనినైన, వధార్హునిగా నిర్ణయించినప్పుడు వారు వానిని రోమనువరిపాలకున కప్పగింపవలెను; వరిపాలకుఁ డావ్యవ

ఘోరమును విచారించి తన యిష్టానుసారముగా దోషిని వదలివేయుట గాని దండించుటగాని చేయువచ్చును. జీసస్సును పట్టుకొన్న వార్త జనులకు తెలియకముందే తన్ను విడిపించుటకయి మిత్రులను పిలిపించుటకు జీసస్సున కవకాశము కలుగకముందే విచారణ ముగింపవలె నన్న యుద్దేశముతో సానెహెడ్రిముసభ్యులను తనయింట సమావేశపఱుచుటకు జీసస్సును దీసికొనిరాకపూర్వమే ప్రధానాచార్యుడు మనుష్యులను బంపెను. దేవాలయములో నటువంటి నిర్భయత్వమును గనఁబఱచిన పురుషుఁడు తన కవకాశలేశము నిచ్చినపక్షమున తన ప్రాణరక్షణార్థము పోరాడక మానఁడని యతఁడు భావించుకొనియుండెను. కాఁబట్టి యింకను తెల్లవారకపోయినను రాజపురుషులాసేధింపఁబడిన బద్ధునితో తిరిగివచ్చునప్పటి కావఱకే ధర్మాధికారులు సమకూర్పఁబడి వివిధసాక్షులు సంసిద్ధముగా నుంచఁబడిరి. ధర్మాధికారులావఱకే జీసస్సు నపరాధి యని నిర్ధారణముచేయ నిశ్చయించుకొని వచ్చియున్నవారగుటచేత ధర్మాధికారులతో సంబంధించినంతవఱకు విచారణమునకే యావశ్యకము లేదు; కాని, పైలేటతనిని ప్రశ్నించిపైఁబెట్టించి మేకులు గొట్టించి దండింపవలెనని యభిలషించినవారగుటచేత వారు వ్యవహారరీతిని దోష నిరూపణము చేయువలసినవారగుటయేకాక రోమకవరిపాలకుఁడు తమతీర్పును త్రిప్పివేయక స్థిరీకరించునంతటి బలమైనదానినిగా జీసస్సుమీఁది యభియోగమును ప్రతిపాదింపవలయును.

భటులప్పుడు జీసస్సును వీధిలోని కున్న తోరణద్వారమున కాళ్లు వఱుపఁబడి యున్న బహిష్కారములోనికిఁ గొనిపోయిరి. ఆలోపల ప్రధానాచార్యునియొక్క మందిర ముండెను. సైనికులలో విశేషభాగ మీప్రాకారములో నిలిచిపోఁగా కావలికై నియమింపఁ

బడినభటులు తోవలికి సభాభవనములోనికి జీసస్సును గొనిపోయిరి. అందు ప్రధానాచార్యుడు మధ్య నాసీనుఁడయి యుండఁగా సర్వ చంద్రాకారముగా చుట్టును ధర్మాధికారులు కూరుచుండి యాతని రాకను బ్రతీక్షించుచుండిరి. జీసస్సు బంధములతోనే బ్రధానాచార్యునివద్దకుఁ గొనిపోఁబడి యాతనినుండు నిలువఁబెట్టఁబడెను. అతని వయని మోపఁబడిన దోషారోపణపత్రము చదువఁబడినపిమ్మట దానిని స్థాపించుటకయి సాక్షులు పిలువఁబడిరి. అతనిపై నారోపింపఁబడిన నేరములు—అపసిద్ధాంతములను బోధించి జనులను మోసపుచ్చుట, స్వమతధర్మములను నిరాకరింపవలె నని వారి కుపదేశించుట, దైవదూషణపరుఁడగుట.

సాక్షులొకరితరువాత నొకరుగా మందునకు వచ్చి దేవాలయము లోపల నట్లే యుపదేశించుచుఁగా తాము విన్నదానిని చెప్పిరి. తామిచ్చిన సాక్ష్యములో వారొకరు చెప్పినదాని కొకరు విరుద్ధముగా చెప్పుటయే కాక రోమక పరిపాలకునియసన్నునకు మిక్కిలి చెడ్డదిగా కనఁబడెడు దానిని దేనిని చెప్పకపోయిరి. వారిదుర్మార్గమును దూషించుచు మతాచార్యులకు విరోధముగా జీసస్సు సంభాషించినమాట వాస్తవమేకాని యట్టిమాటలు పలికినందున కయి పైలేటు జీసస్సు ప్రాణములను తీయించుట కంగీకరింపఁడు. తుద కిద్దరయసుష్యలు ముందుకు వచ్చి "దేవాలయమును నాశనము చేసి నేను రెండుదినములలో మరలఁ గట్టఁగలను" అని జీసస్సు చెప్పినట్లు సాక్ష్యమిచ్చిరి. ఈసాక్ష్యమునహితీయము నత్య మయినది కాదు; అతఁడు దేవాలయమును నాశమగునని పలికినను, దానిని తాను నాశము చేసెద నని యెప్పుడును పలుకి యుండలేదు. యూదులధర్మానుశాసనముల ననుసరించి దేవాల

యుమును దూషించుట దేవుని దూషించుటయే యయినందున దోషి వధార్హుఁడగును. ఇట్లు విచారణ జరుగుచున్న కాలములో జీన స్నాకు మాట వలుక లేదు; ఒక్కరి నొక్కప్రశ్న యడుగ లేదు. తన్నపరాధి నిగా నిరూపించుటకు చాలినంత బలమైన సాక్ష్యమును వారెన్నఁడును తేఁజాలరని తెలిసినవాఁడయినను సాక్ష్య మున్నను లేకపోయిన ను వారు తన్ను చంప నిశ్చయించుకొన్నవా రని యెఱిఁగి యుండుట చేత నట్టివారిముందట మాటాడఁజూచుట నిష్ప్రయోజన మని యతఁడు మౌనము ధరించి యూరకుండెను. ఇతఁడు వధార్హుఁడని పైలేటు నొడఁబఱుచునంతటి ప్రబలసాక్ష్య మేదియు నీవఱకు రాలే దని ప్రధానాచార్యుఁడుసహితము కనుఁగొన్నవాఁడయి కోపము తెప్పించి జీసస్సు నోట తొందరమాట యేదైనఁ బలికింపవలెనని "నీమీఁద నింతమంది సాక్ష్యమిచ్చుచుండఁగా నొక్కమాట కైన మాఱుపలుక వేమి!" అనిరోషముతో ననెను. తానే దోషారోపకుఁడును విచారణకర్తయు నైనవానితో మాటాడ నిష్టములేక కాఁబోలును జీసస్సు బదులుపలుకక పోవుటయేకాక యతని మొగమువంక తలయెత్తి చూడనైన నొల్లకుండెను. జీసస్సు తాను మెస్సయా ననుకొన్నవిషయమయి యింతవఱకు కొక్కప్రశ్న మయినను రాలేదుగ అది ముఖ్యాంశమే యయినను జీసస్సుపై నావిషయమున దోషారోపణము చేసెడుపక్షమున ననేకులాతనిని దేవునిచేఁ బంపఁబడినపానినిగా భావింపవచ్చునని యెంచి మతాచార్యులు సాధ్యమయినంతవఱ కావిషయము నడఁగఁద్రొక్కపయికి రానీయక యుంచి యితరదోషారోపణముచేత నాతని వధ్యునిగా నిర్ణయింపఁదలఁచిరి కాని వారికోరిక సఫల మయినది కాదు. అందుచేత నాముఖ్యాంశమును విడిచి యాతని దండ్యునిగాఁ జేయుటకు సాధనాంకురము కనఁబడనందున ప్రధానాచార్యుఁ డాతనివంక

పెప్పి వాల్పిక చూచుచు "నీవు మెస్సయా యగుదువేమో చెప్పుము" అని యడిగెను.

అకారణముగానో సకారణముగానో వా రెట్లును తనప్రాణ ములు తీయకమాన రని యెఱుంగునుగాన, మిథ్యాదోషారోపముల మీఁదఁ గాక తాను సత్యుని నమ్మిన మెస్సయా నామ ఘోషణదోష స్థాపనముమీఁదనే ప్రాణము లియ్యవలయు నని నిశ్చయించుకొని "నేను చెప్పినపక్షమున మీరు నమ్మరు" అని మౌనము మాని జీస స్సుత్తరము చెప్పెను. అతఁడు తనమాయా వాగురలో తగులుకొను చున్నాఁడని భావించి యాప్రధానాచార్యుఁడు "ఈశ్వరసాక్షికముగా నీవు దేవునికుమారుఁడ వైన మెస్సయా వగునుపేమో చెప్పుము" అని యడిగెను. సత్యమును గూఢముగా నుంచవలసిన కాలము పోయి బహి రంగముగా ఘోషింపవలసిన సమయము వచ్చినదని తలంచి "నేనెవరో నీవే చెప్పి యున్నావు." అని యాచార్యునిముఖమువంక దృఢముగా, జూచుచు వినమ్రతతో స్పష్టముగా జీసస్సు పలికెను. ధర్మాధికారుల వంక చూడక నిగిడించి "ఆకాశమున్పై సంచరించు మేఘములమీఁద వ్రాయఁబడిన దేమో యున్నట్లుగా మనుష్యపుత్రునియొక్క ప్రభావ ముమ మహిమయు మీరు చూచెడు కాలము వచ్చును" అని చెప్పెను.

ఈమాటలు వినఁగానే ప్రధానాచార్యుఁడు దేహము తెలియక కోపముచేత మండిపడి, యితరధర్మాధికారులతో బిగ్గఱగా "ఇతఁ డీశ్వర నిందను పలికినాఁడు. ఇఁక నెక్కువసాక్ష్యములతో పని యేమున్నది? ఈతని యీశ్వరదూషణమును మీరు వినియున్నారు; మీ కేమని తలఁ చెదరు?" అని యడిగెను. "ఇతఁడు దోషి; వధార్హుఁడు." అని యెల్ల వారు నొక్కమాటగా పలికిరి. ఇంతటితో విచారణ సమాప్త

మయినది. ధర్మాధికారులు తమ యధికారకాటులను తీసి దూరముగా వేసి, వేగముగా నరక్షితుఁడయి యున్న యాపాశబద్ధుని మీఁదికి పరు గెత్తిరి. చేతులు గొలుసులతో కట్టఁబడి యుండుటచేత నతఁడు తన్ను రక్షించుకో నిష్టముగలవాఁడయినను రక్షించుకో లేని దురవస్థలో నుండెను. అట్టివానిని వారు పైఁబడి కొట్టి మొగముమీఁద నుమ్మి వేసి, "ఓయభిషిక్తుఁడా! నీ వట్టి యాశ్చర్యమహిమలు కలవాఁడ వైన పక్షమున, నిన్ను ముష్టిప్రహారములు చేయుచున్నవా రెవ్వరో మాకు చెప్పుము." అని పరిహాసము చేసిరి. అతఁడు వారి కొక్కమాట బదులు పలకలేదు. కోపమునుగాని శోకమునుగాని తెలిపెడు శబ్ద మాత్రని పెదవులను దాఁటి రాలేదు; అలలతాఁకున చలింపకున్న పర్వత మేమో యున్నట్లు వారినడుమ నతఁడు చలింపక నిలుచుండెను.

లోపల నిది యంతయు నిట్లు జరుగుచుండఁగా పిలుపుల పీట రును జానును వచ్చి యొట్లో దారిచేసికొని ప్రాకారములోపలఁ బ్రవే శించిరి. ఆరాత్రి మిక్కిలి చలిగా నుండెను; అందుచేత సైనికులును మంటికోండలును చలిమంట వేసికొని దానిచుట్టును గూర్చుండి కాఁచుకొనుచుండిరి. పీట రాగుంపులో చేరి నిలుచుండి యుండఁగాఁ జూచి యెవ్వరో యొకరు "నీవు గాలిలీదేశస్థుఁడైన జీసస్తోడ నుండినవాఁడవు కావా?" అని పలుకరించిరి. అతఁడు మాటలకు భయపడి "నీవు చెప్పిననంగతి యేమో నే నెఱుఁగను" అని పలుకుచు ప్రాకారములోని మఱియొకచోటికి తొలఁగి పోయెను. అక్కడ నింకొకఁడు మానవాలు పట్టి "నిశ్చయముగా నీవు జీసస్ను శిష్యులలో నొక్కఁడవు; నీభాష్యోచ్చారణమే నీవు గాలిలీవాఁడ వని తెలుపు చున్నది." అని పలుకఁగా నతఁడు తాను కానని యొట్టుపెట్టుకొనెను. జీసస్ను పట్టుకొన్నవ్వ డితఁడక్కడ నుండఁగాఁ జూచితి నని

మూఁడవసారి పే లొక్కఁడు చెప్పెను. "నేను జీసస్సు నెఱుఁగనే యెఱుఁగను." అని మూఁడవసారి పీటరు తెలియఁబలికెను. ఇంతలో ప్రభాతమును దెలుపుచు కోడి కూసెను. ఆ కోడికూఁత వినఁగానే కొన్నిగంటలక్రిందట జీసస్సు పలికినపలుకులు తలఁపునకు వచ్చి పీట రావలకుఁ బోయి పెద్దపెట్టున నేడ్చెను.

దేవాలయములో నున్న సాన్ హెడ్రిమ్ సభయొక్క నియత మంత్రణమందిరమునకు మరణదండనమును విధించిన తీర్పు వక్కడ యథావిధిగా వినిపించుట కయి జీసస్సును బల మయిన రక్షకోనర్గము వెంట నుషఃకాలమునందు తొందరగాఁ గొనిపోయిరి. తీర్పు వినిపింపఁ బడినమీఁదట జీసస్సు నక్కడనుండి ప్రొద్దెక్కకముందే జనులు విశేషముగా వీథులలోనికి రాకముందే ప్రాతఃకాలమున గోమను వరి పాలకునియొక్క నివాసనికేతనమునకుఁ దీసికొనిపోయిరి. ఆతనివెంట దేవాయతనపరిజనము భటవర్గము సైనికనికాయము ధర్మాధికారులు మతాచార్యులు ఫారిసీలలోని ప్రముఖులు మొదలైనవా రింతమంది పెద్దయుత్సవమువలె నడచుచుండినను తచ్ఛిష్యమిత్రభక్తపరిచరాదులేమూలనుండి వచ్చి యాకస్మికముగా సైని బడి విడిపింపఁజూతురో యను భీతిచేత వారు రాజగృహము చేరువఅకును గుండెలు తటతట కొట్టుకొన తిరిగి తిరిగి చూచుచునే పోయిరి. పై లేటుమందిరావరణములో నడుగు పెట్టినతరువాత నక్కడఁ గావలి కాచుచున్న బలిష్ఠమైన రోమకసైన్యమును జూచినప్పుడు వారిగుండెలు కుదుటఁబడినవి.

వారప్పుడు తమవచ్చిన కార్యమును నివేదించుచు లోపలికి విన్నపము పంపఁగా, పై లేటు వెలుపలికి వచ్చి వారు కూడియున్న విశాలప్రదేశము చొచ్చి ధర్మాసనము నధిష్ఠించెను. అంతట వారిలో నొకఁడు జీసస్సును ముందు నిలిపి "ఇతఁడు యూదులరాజ నని యభి

నయించినట్లు తనయొప్పుదలమీఁదనే దోషస్థాపనము చేయుఁబడి యప
రాధియైనాఁడు" అని పై లేటుతో విన్నపముచేసెను. రోమనులు గూఢ
చారులను వియమించి తమ యధికారమును తాఁకుమూఁకు చేయు
జూచువారిని నిపుణముగా కనిపెట్టుచుండురు గాన పై లేటు జీసస్సును
గూర్చి తానావఱకే యెఱిఁగి యుండెను. ఇప్పుడు జీసస్సుమీఁద
నారోపించిన నేరము నవఁగా రాజద్రోహమున కయి ప్రజలను పురి
కొల్పుట యను నేరమును నిజముగానే చేసిన బారబ్బా యను ప్రసిద్ధ
మనుష్యుఁ డొక్కఁడు పై లేటుచేత కారాగారములో నుంచఁబడి
యుండెను. జీన స్నటువంటివాఁడు గాక కేవల భిన్నవర్తనము గలవాఁ
డనియు, మతోన్మాదమునుబట్టి పౌరులలోని ప్రముఖు లతనిని
ద్వేషించుచున్నా రనియు, నెఱిఁగి యుండుటచేత పై లేటు మనస్సు
జీసస్సు పక్షమున కొరగి యుండెను.

ప్రధానాచార్యుఁడు నేరము మోపినప్పుడును, జనులను
మోసముచేసెననియు సీజరునకు పన్ను కట్టవలదని ప్రజలకు బోధించె
ననియు జీసస్సునకు విరోధముగా నితరు లఱచినప్పుడును, "వీరు నీపయి
మోపుచున్న దోషములను నీవు వినుచున్నావుగదా? వీరి కేమి యుత్త
రము చెప్పెదవు?" అని పై లే టడిగెను. ప్రతిపక్షులు పలుకు కల్లల
కుత్తరము చెప్పుటకూడ ననుచిత మని యెంచి యతఁడు మాఱుపలుక
కూరకుండెను. "నీవు రాజ వగుట సత్యమా?" అని మరల పై లే
టడిగెను. వెనుక చెప్పినట్టే మరల "నీ వట్లు చెప్పుచున్నావు. నీవు
నానిజ మైన పేరును నాకనుగ్రహించినావు." అని జీసస్సు వలికెను.
అంతట జీసస్సు నొంటిగా తనగదిలోనికి తీసికొనిపోయి విచారింప
నారంభించెను. "నేను రాజనే కాని నా రాజ్య మిాలోకసంబంధ
మైనది గాదు. నారాజ్యము పూర్ణముగా సత్యానుభవములోను

సత్యప్రకాశనములోను ఉన్నది. నేను సత్యమునకు పాక్షిగా నిలుచుటకు వచ్చినాను." అని జీసస్సు తనరాజ్యస్వభావమును వివరింపఁ దొడఁగెను. పైలేటాతనిభావమును గ్రహింపఁజాలక, అతఁడు పరులకు బాధచేయని దివాస్వప్నరాజ్యప్రహృష్టునిగా పరిగణించి సపరిహాసముగా "సత్య మన నేమి?" అని ప్రశ్నవేసెను. జీసస్సు మతాచార్యులకును ఫారిసీలకును పక్కబల్లెనుగా నుండువాఁడే కాని తనకు శ్రమ కలుగఁ జేయువాఁడు కాఁడని కనిపెట్టి, పైలేటాతనిని ప్రాణములతో విడుచుట కిష్టముగలవాఁడయి యుండెను. అందుచేత నతఁడు ధర్మాసనమును మరల నధిష్ఠించి, ప్యాసోవరు వండుగలో జనులు కోరుకొన్న కారాబద్ధుఁడగు యూదుని నొక్కని విడిచిపెట్టుట యాచార మగుటనుబట్టి వారికోరికమీఁద జీసస్సును విడుదల చేయవలె ననుతలంపుతో "జీసస్సును విడిచిపెట్టనలయునా? బారబ్బాను విడిచిపెట్టనలయునా?" అని జనుల నడిగెను. జీసస్సున కారోపించిన యపరాధములను బారబ్బా నిజముగానే చేసినవాఁడగుటచేతను బారబ్బాను విడిచిపెట్టుమని కోరినపక్షమున వారు రాజభక్తి లేనివా రని వెల్లడి యగు నన్న భయముచేతను, జనులు జీసస్సునే విముక్తునిఁ జేయఁగోరుదు రని యతఁడు నమ్మియుండెను. అయినను జనులావఱిచే మతాచార్యులచేత బోధనొందినవా రయి యుండుటచేత "మాకు బారబ్బా నిమ్ము." అని యేకవాక్యముగా వేఁడుకొనిరి. "ఇఁక మీరాజు యేమి చేయవలెను?" అని పైలేటడిగెను. "అతనిని సిలువను వేయింపుము" అని వారు పెద్దపెట్ట నఱచిరి. "ఎందుకు? అతనియందు దోషమేమియు నాకు కనఁబడదు. అతఁడపరాధ మేమి చేసినాఁడు?" అని పైలేటు మరల నడిగెను. వా రాతనిమాటలను వినిపించుకోక దొమ్మిగా "అతనిని సిలువను వేయింపుము; సిలువను

వేయింపుము" అని కోలాహలధ్వనితో కేకలు వేసిరి. అప్పు డతఁడు చేయునది లేక వారి యల్లరి చూచి తా నాతనిని విడిచిపెట్టిన పక్షమున నడఁపరాని ప్రజాక్షోభము కలుగునేమో యని భయపడియు ప్రజలు సంఘవిజ్ఞాపనమును బంపుకొన్నపక్షమున చక్రవర్తి తన్ను పరిపాలక పదమునుండి తొలఁగించునేమో యని జడిసియు తుదకు బారబ్బాను విడిచిపెట్టి జీసస్సు విషయమున సాన్ హెడ్రిము సభవారు చేసిన తీర్పును స్థిరపఱిచెను. తమకృషి నఫల మయిన దన్న సంతోషముతో మతా చార్యులును ఫారిసీలును సభను విడిచి తమ యిండ్లకుఁ బోయిరి. రోమక సైనికులు జీసస్సును సభాభవనమునుండి యావలకుఁ గొనిపోయిరి.

రోమకసైనికులు మృగప్రాయు లైన క్రూరచిత్తులు; వారికి దయాదాక్షిణ్యములు లేవు. పైలేటు దండనమును విధించిన తరువాత జీసస్సు మానవరూపమును ధరియించియున్న యీఘాతుక మృగముల కవ్వగింపఁబడెను. సిలువను వేయ విధింపఁబడినప్పు డాదండనమును జరుపుటకు ముందపరాధిని కొరడాలతోఁ గొట్టుట యాచారము. నిష్కరుణు లయిన యీసైనికులకు చంపుటకు ముందు పిల్లి యెలుక ను బాధించునట్లు బాధలుపెట్టుట పరమసంతోషము. వీండ్ర కఠోఘాతములచేత జీసస్సు మూర్ఛపోలేదు; కంట తడిపెట్టలేదు. ఈవిధముగా నాతని ధైర్యము చెడఁగొట్టి యేడిపింప వలె నని వాండ్రు చేసిన ప్రయత్నమంతయు వ్యర్థమయినది! అతఁ డెవ్వరో యెట్టివాఁడో వాండ్రెఱుఁగరు. ఆతఁడు యూదుఁ డనిమాత్ర మెఱుఁగుదురు; యూదుల నవమానించుటయే తమ వ్రత మయినందున, వారిప్పు డేలాగునైన నాతని వేధించి నొప్పికి తాళలేనట్లు కనఁబడునట్లు చేయవలెను; తీవ్రవేదనచేత మనుష్యుఁడు గిలగిల కొట్టుకొనుచుండఁగాఁ జూచునప్పటికంటె మఱియొకప్పుడు వారి కెక్కువప్రమోదము కలు

గదు. అతఁడు మూలుగనందునను దయచూపుఁ డని వేఁడనందునను వారు పెట్టుబాధ యత్యంత కఠిన మైనదియు దీర్ఘతర మైనదియు నయ్యెను. ఎంతభయంకర మైన బాధలు పెట్టినవా రయ్యును తా మాతనిముఖమునందు దుఃఖసూచనలు తోఁపజేయు దారి కానరానం దునవారాతనిని వ్యథపెట్టుమార్గమునింకొకదానినాలోచించిరి. యూదుల రాజ నని చెప్పుకొన్న ట్టాతనిపై మోపఁబడిన నేరమును వారు విని యున్నవారు గాన, శరీరవేదనకు తాళఁగలిగినవారు సహితము పలువు రపహాసదుఃఖమునకు సహింపఁజాలకపోవుచు వచ్చుట నెఱిఁగి, అత నిని కృతకనృపతినిగాఁ జేసి యూమూలమున నవమానపఱుప నిశ్చ యించిరి. తదనుగుణముగా సైనికులు వేసికొనెడిరీతి శోణకంచుకము నొకదానిని తెచ్చి నెత్తుకు కాఱుచున్న యతని బుజములమీఁదకప్పి ముండ్లకంపతో నల్లిన కిరీట మొక్కటి యాతనినెత్తిని బెట్టి, రాజవేత్ర మునకు మారుగా శృంఖలాబద్ధము లైన యాతని హస్తములలో నొక బెత్తమును నిలిపి, ఒకరి తరువాత నొకరుగా వచ్చి పాదములముందు సాగిలఁబడి, "ఓయూదులరాజా! నమస్కారము" అని యపహసింపఁ బొచ్చిరి. అంతేకాక వారిలో నొంద అవహాసమున కవమానమును తోడువఱిచి సాష్టాంగనమస్కారము చేసి లేచి వచ్చునప్పు డాతని మొగముమీఁద నుమ్మి వేసిరి. మఱినొందఱు చేతిలోని బెత్తము నెత్తు కొని నెత్తిమీఁద మొత్తిరి. అతఁడిప్పుడు వారిచే కృత్రిమరాజుగా చేయఁబడియున్నను నిజ మైనరాజువలె నిశ్చలహృదయుఁ డయి నిర్వి కారుఁ డయి పెట్టిన బాధలెల్ల పడి యవమానము నంతను శాంత తతో సహించెను. దౌర్బల్యలక్షణము గాని భీరుత్వచిహ్నముగాని దుఃఖసూచనము గాని యాతనిముఖమునం దణుమాత్రమును గాన రానందున నాతని సంతాపకులకు సంతాపమే గాని సంతోషము కలిగి

నది కాదు. కోపము కానరాని చల్లనిచూపులతో తమపంక జూచు చున్న యతని శాంతవదనమును పొడగన్నప్పు డాక్రూరకర్మ్మల శిలా కఠినచిత్తములలో సహిత మొకవిధ మయిన యపరాధస్మృతి తల చూపి వారి పెదవులనుండి యావఱకు వెలువడఁబోవుచున్న పరిహాస వచనాంకురమును పైకి రానీక లోలోపలనె చంపివేసెను.

ఇంతలో నధికారులు వచ్చి జీసస్సును వధస్థానమునకుఁ గొని రావలసిన దని యాజ్ఞాపింపఁగా, కావలిభటు లాతనిని వెంటఁగొని రాజమందిరద్వారమువంక నడచిరి. ఈసమయమునందే మరణదండన మును పొందవలసిన మఱియిద్ద ఱపరాధు లప్పుడు వారితోఁజేర్పఁబడిరి. వారు సాధారణచోరులు, యూదులకు క్రొత్తయవమానమును కలిగింప వలెనన్న యుద్దేశముతో పై లేటు వారిని జీసస్సుతోడఁగూడఁబంపుట కేర్పాటు చేసె నని చెప్పుదురు. మరణదండనార్థము కొనిపోఁ బడు చున్న యపరాధికి ముందు వాఁడు చేసిన నేరమును వ్రాసినపలక నొకమనుష్యుఁ డెత్తిపట్టుకొని నడుచుట యాచారము. "ఇతఁడు యూదుల రా జయిన జీసస్సు" అని పెద్దక్షరములతో వ్రాయఁబడి యున్న పలక నిందునిమిత్త మయి పై లేటు ముందుగానే సిద్ధము చేయించెను. అవమానకర మయినచావు చావనై యున్నవానికి పై లే టిటువంటి బిరుదము నిచ్చుట జెరూసలేమువాను లైనయూదులపై తనకుఁ గలతిరస్కారభావమును వెల్లడిచేసి వారికి తలవంపులు తెచ్చు టకే యనుటకు సందేహము లేదు. దండ్యు లయియున్న తస్కరుల నాతని సహచరులనుగాఁ బంపుటకూడ యూదుల కవజ్ఞ కలిగించుట కయియే యుండును. "దొంగల కర్హ మయినమృతి ననుభవించుట కయి దొంగలతో నడచుచున్న యితఁడు మీకు రా జగుటకు తగిన వాఁడు," అని ఫలితార్థ మిచ్చెడి యీపని గర్వ్యిష్టు లయి యుండెడు

మతాచార్యులయొక్కయు ఫారిసీలయొక్కయు గర్వమునకు భంగకర మయి యవమానకరముగా నుండు నని యాతఁ డెఱుఁగును.

తాము దేనిపైని దిగఁగొట్టఁబడి చంపఁబడుదురో యాదారు వును దండ్యులచేతనే వధప్రదేశమునకు మోపించికొనిపోవుట రోమ నుల క్రూరకృత్యములలో నొకటి. సిలువ యని చెప్పఁబడెడి వధ సాధనము రెండుభాగములు కలదిగా నుండును. అం దొకభాగ మైన నిలువుదూలము భూమిలో పాతిపెట్టఁబడి యుండును; రెండవభాగ మైన యడ్డుదూలము భూమి కయిదా అడుగుల యెత్తున మొదటి దానిలో నమర్పఁబడును. జీసస్సు వీధిలోనుండి మోచుకొనిపోవలసిన దీ యడ్డుదూలమునే. చుట్టును సైనికులు కాఁచియుండఁగా, దోషా రోపకులు కొంతమంది వెంటనడువఁగా, జీసస్సు వధార్థము కొనిపో బడెను. పౌరులలో ననేకుల కాతనిని పట్టుకొన్న వార్తయే తెలియదు; మంచి నడిరేయిని రాజపురుషు లాతనిని బట్టుకొనిరి; మధ్యాహ్నము కాకమునుపే యతఁ డడ్డుదూలమును వహించి పైలేటుసభాగృహము నుండి బయలు వెడలెను. వీధులలోనుండి పోవుచున్నప్పుడు కొందఱు స్త్రీ లాతని నానవాలుపట్టి కీచుగొంతుకలతో రోదనము చేయఁ దొడఁగిరి. జీసస్సు వారివంక తిరిగి "ఓ జెరూసలేమువుత్రికలారా! నా నిమిత్త మయి శోకింపకుఁడు. మీనిమిత్తమును మీబిడ్డల నిమిత్త మును శోకింపుఁడు." అని వారి నూఱార్చెను.

జీసస్సు తనమీఁద మోపఁబడినభారమును మోపలేకపోయి నందున, రోమను భటులు పురద్వారమువద్ద నెక్కడనుండియో వచ్చి పురములోఁ బ్రవేశింపఁబోవుచున్న యొకపరదేశస్థునిఁ బట్టుకొని బల వంతముగా నాయడ్డుదూలము నాతనిచేత గమ్యస్థానమువఱకును మోయించుకొని పోయిరి. జీసస్సు దుర్బలశరీరుఁడు కాఁడుకాని రాత్రి


నుండి భోజనములేనివాఁడయి యుండుటచేతను, క్రూరకిరాతులైన పదాతులచేత నెత్తురు వఱిదలు కట్టునట్లుగా దెబ్బలు తినియుండుట చేతను, గంటలకొలఁదికాలము నిలువఁబడియుండి వ్యాకులమనస్కుఁడయి యుండుటచేతను బలహీనుఁడయి యతిభారమైన యాదారువును మోయలేక పోయెను. రోమనులు త్రోవను బోవువారి నెవ్వరినైనఁ బట్టుకొని వెట్టికిఁగొట్టి వారిచేత నిచ్చవచ్చినపని చేయింపవచ్చును. ఇట్లు పట్టుకోఁబడి బలాత్కారముగా బరువుమోచునట్లు చేయఁబడినవాఁడు త్తరాఫ్రికాలోని సైరీనువానస్థుఁడైన సిమ ననుపేరు గల యూదుఁడు. అతఁడు ప్యాసోవరు తీర్థమునిమిత్తమయి యాత్రకు వచ్చెను.

ఊరు దాఁటి కొంచెముదూరము నడచినతరువాత 'గాల్గోథా' యను స్థలమునకు వచ్చిరి. ఆపదమున కాభాషలో కపాలభూమి యని యర్థము. ఇదే కొంచెము సేపటిలో సిలువను వేయుట యనెడు క్రూర కర్మము జరుగ నున్న ప్రదేశము. ఇది మన దేశమునందు పూర్వ కాలమునం దుండిన కొఱతను వేయుట వంటిది. ఇందు మొదటిదానిలో మనుష్యుని ప్రాణానివైఁబెట్టి చేతులకు మేకులు దిగఁగొట్టుదువారు. రెండవదానిలో మనుష్యుని కొట్టినఁబడెడు శూలమునకు దిగఁగొట్టుదువారు. ఈరెండుదండనములలోను కూడ దండితులు వెంటనే ప్రాణములు గోలుపోక కొన్ని సమయములయందు దినములకొలఁదిని బ్రదికి బాధపడుచుండెడువారు. అడ్డుదూలమునఁ బెట్టి మేకులుకొట్టుటకు ముందు వధ్యులకు బాధ తెలియకుండఁ జేయుట కయి మైకము చేసెడి యొకవిధమైన మద్యమును త్రాగనిచ్చెడివారు. వాడుకనుబట్టి యొండలు తెలియకుండఁ జేసెడి మద్యమును పానముచేయుట కయి జీసస్సుచేతికిచ్చిరి. అతఁడామద్యపాత్రమును నోటివద్దఁ బెట్టుకొని నాలికతో చవిచూచి యది మత్తుపదార్థమని తెలిసికొని త్రాగక నిరాకరించెను;

నొప్పి తెలియకుండ స్మృతి తప్పియుండుటకంటె తెలివి గలిగియుండి నొప్పికి ధీరత్వముతో నోర్చుకొనవలయు ననియు, తాను గోరి తెచ్చు కొన్న మృత్యువును మహావీరునివలె నిర్భయముగా నెదుర్కొనవలయు ననియు, అతఁడు తలఁచి మత్తుచేసెడు మధుపానముయొక్క సాహా య్యము నొల్లఁ డయ్యెను. అంతట నతని వస్త్రములను దీసి యాతనిని గొయ్యాల కంటఁగట్టిరి; చేతుల నడ్డుగొయ్యావీఁద నిఱుప్రక్కలను చాచి మేకులను గొట్టిరి; శరీరము బరువుచేత జాఱిపడకుండ రెండు కాళ్ళనడుమనుండి దారము వేసి నడుమనున్న నిలువుగొయ్యకు నడుము వద్ద కట్టిరి. మృత్యుదేవత కనుగ్రహమువచ్చి ప్రాణములను గొనువఱకు నతఁ డీప్రకారముగా ప్రేలాడుచుండవలెను. ఆతనివెంటఁ గొనిరాఁ బడిన యిద్దఱు తస్కరులును జీసస్సున కిరుపార్శ్వములయందును సిలువ గొయ్యాలకు ప్రేలాడఁ దీయఁబడిరి. వారికి తగినంత మందిని భటులను కావలియుంచి తక్కినసైనికులు పురమున కరిగిరి. ఈదారుణకర్మము జరుగుచున్నంత సేపును జీసస్సు సంపూర్ణ స్థైర్యముతో నుండి యొక్క దీనవచనమునైనను పలుకక కడపట "తండ్రీ! వారేమిచేయుచున్నారో వారెఱుఁగరు; వారిని క్షమింపుము" అని ప్రార్థించెను. విశేషకాల మతఁడు లోలోపలనే ప్రార్థించుచుండెనుగాని పయికి నేమియుపలుకలేదు. ఈలోపల నాతని విరోధులు గొంద ఱాతని వినాశమునుజూచి సంతోషింపవలెనన్న నీచ బుద్ధితో పట్టణమునుండి పనికట్టుకొనివచ్చి, ఆతనిమరణవేదనను చూచి పకపకనవ్వుచు హేళనముచేయుచు "నీవు దేవునికుమారుఁడవైనచో మున సిలువనుండి దిగిరమ్ము. ఓయిస్రాయీలరాజా! దిగిరమ్ము. మేము నిన్ను నమ్మెదము." అని గొందఱును "నీవు దేవాలయమును నాశముచేసి మూఁడుదినములలో మరల కట్టుదువు. అట్టి నీవు నిన్ను

రక్షించుకొమ్ము” అని మతికొందఱును పలికి, తమలో తా మాతఁడు వినునట్టుగా వీఁడు దేవునిని నమ్మినవాఁడు; తాను దేవునికుమారుఁడ నని చెప్పుకొన్నాఁడు గదా! ఏదీ దేవుఁడు వచ్చి యివ్వాఁడితనిని రక్షింపు మను. వీఁ డితరులను రక్షించునుగాని తన్ను తాను రక్షించుకోలేఁడు.” అని నానావిధముల గేలిచేసిపోయిరి. వీరు వా రన నేల! తుదకు నీవ లావలల సిలువలమీఁదనుండి చావునకు సంసిద్ధులయియున్న దొంగలు సహిత మాతని నిగతాళిచేసిరఁట! ఈయధిక్షేపములకు దేనికిని మాఱు పలుకక యతఁడు పర్వతమువలె నిశ్చలుఁ డయి యుండెను. ఇట్టి కష్ట సమయమునం దాతనిశిష్యులు వలాయితు లయి మొగము చూపక పోయినను జెరూసలేమున కాతనివెంటవచ్చి యుపచారములు చేయు చుండిన గాలిలియామిత్రులుమాత్ర మాతనిని విడిచినవారు కారు. మేరీక్లియోఫస్, మేరీమాగ్డలేన్, జోయన్నా, సలోము, మొదలయిన స్త్రీ లాతనిని విడిచి పోవక భక్తిని చూపుచు కావలివారు రానిచ్చి నంతచేరువను నిలిచిరి.

జీసస్సును సిలువపై నివేసిన విధ మిక్రిందిపటము చూపుచున్నది.



జీసస్సును పరాభవించుట కయి చూడవచ్చిన మహాపురుషులును దారిని బోవుచు చూచినవారును బోయి సిలువకొనను "యూదుల రాజు" అని వ్రాయఁబడి యున్న పలకను జూచి యాయవనూనకర మైన వ్రాఁతనుగూర్చి యాచార్యపురుషులతో మొట్టి పెట్టుకొన్నందున వా రావ్రాఁతను మార్చి జీసస్సు యూదులరాజనని తాననుకొన్న ట్లర్థమిచ్చెడు వ్రాత వ్రాయింపవలసిన దని పైలేటుతో విన్నపము చేసిరి. కాని యతఁ డాచార్యులమాటలు పెడచెవిని బెట్టి వారిప్రార్థన నిరాకరించి పంపివేసెను.

సాయంసమయము సమీపించు చుండెను. రక్తనిస్సరణాధిక్య మువలన నాయాస మధికమయి విదాహము పుట్టఁగా జీసస్సు దప్పిక యగుచున్నదని చెప్పెను. దయాశూన్యులైనసైనికులలో నించుక దయగలవాఁ డయినభటుఁ డొకఁడు తాము భ్రాగుటకుఁ దెచ్చుకొన్న పానకములో స్పంజిని (లోనికి నీరు పీల్చుకొనుసము(దవుపాఁచి) ముంచి కట్టికొనను కట్టి యెత్తి నోటి కందియ్యఁగా జీసస్సు దానిని చప్పరించి పీల్చెను. ఆతని కంతకంతకు దేహతాపము దుస్సహము కాఁజొచ్చెను. ఎటు చూచినను ఆతనిమనస్సునకు మనుష్యునియొక్క కృతఘ్నతయు దుస్స్వభావమును గానవచ్చుచుండెను. క్షణకాల మాతని మనస్సును నిరాశామేఘములు కప్పుకొని యాశ్వగుని మఱుఁగుపఱిచెను. ఈనిరా శాంధకార నిమగ్నావస్థలో నతఁడు "ఓనాదేవా! నాదేవా! నీవు నన్నేల విడిచిపెట్టినావు?" అని యఱచెను. ఎంతటిమహాత్ములకును మానుషదౌర్బల్య మొకానొకప్పుడు పొడచూపక మానదుగదా! దీనినిబట్టి యాతని కీశ్వరునియందలి విశ్వాసము తగ్గినదని యెంచఁ గూడదు. బాల్యమునుండియు పలుక నలవాటు పడి యున్న యీవా క్యము తీవ్రశారీరకవేదనానుభవసమయమున నప్రయత్నముగా పయికి

వచ్చియుండును. అది యెట్టిదయినను శరీరము క్షీణదశ నొందుచు నచ్చినగొలఁదిని ఆయనయాత్మ యంతకంతకు విమలమగుచు వచ్చి దైవికస్వభావము ప్రకాశము నొందెను. తనకర్తవ్యము స్మరణకు వచ్చెను; తనమరణమే ప్రపంచముయొక్క ముక్తికి కారణ మగునని కనుఁగొనెను; తనముందు నడచు చున్నదారుణదర్శనము లదృశ్యము లయి మనస్సుతదేకనిష్ఠతో పరమపితయందు లగ్న మయ్యెను. మరణమునకు కొన్ని నిమిషములు ముందుగా నతఁడు "తండ్రీ! నాయాత్మను నీచేతులలో సమర్పించుచున్నాను." అని యుచ్చైస్వనముతో విన్నవ్యముగా పలికెను. కడపట నతఁడు "ఇది సమాప్తమయినది" అని తనలోతాను మందరవమున ననుకొనఁగానే తలతొమ్మ్రొగై ని ప్రేలాడఁబడెను; ప్రాణము లుత్క్రమణము లయ్యెను. సిలువను వేయఁబడినతరువాత మూఁడుగంటలలోనే యతఁడు కాలధర్మము నొందెను. ఆతని శీఘ్రమరణమునకు రక్తవాహిక యొకటి తెగుట కారణమని వచింతురు.

సాధారణముగా రోమనులు సిలువను వేయఁబడినవారి శవములను సమాధిచేయుట కయి బంధుమిత్రాదులను తీసికొని పోనిచ్చెడువారు కారు. అయినను తగినంత పెద్దలంచ మియ్యఁగలవారున్నవఱకు మున రోమకపరిపాలకులచేత నెట్టిపని చేయించుటయు నసాధ్యము కాదు. రహస్యమున జీనస్సునకు పరమభక్తులయి యుండియు బహిరంగముగా తా మతనిశిష్యు లయినట్లు చెప్పనంతటి ధైర్యము లేని వారు జెరూసలేమునగరవాసులలో ననేకు లుండిరి. అట్టివారిలో నొకఁడయిన జోసఫ్సనువాఁడు ప్రబలుఁడును విత్తవంతుఁడు నయి యుండెను. జీసస్సువిషయమయి జరుపఁబడిన యన్యాయమువలనను క్రూరత్వము వలనను కలిగినకోపముచేత ధైర్యవంతుఁడయి పైలేటువద్దకుఁబోయి

శవమును సిలువవ్రూనినుండి తీసికొని పోనియ్యవలసిన దని జోసఫ్ వేఁడుకొనెను. పైలే టాతనిప్రార్థన నంగీకరించెను. అందుచేత తత్సమీపమున నున్న జీసస్సుయొక్క మిత్రులతోడుపాటుతో నతఁడు శవమును సిలువనుండి దింపి, శుద్ధజలముతో కడిగించి, సమాధి యొద్దకు తీసికొని పోయెను. అతనితోఁటలో రాతిలో మలచిన సమాధి యొకటి యుండెను; దానిలో జీసస్సుశరీరమును బెట్టి దాని ముఖద్వారమున నొక్కమహాశిలను దాపి మూఁతపెట్టి, ఈ మిత్ర బృందము ఖిన్నహృదయములతో వెనుక మరలిపోయిరి. ఇట్లు జరి గిన దినము శుక్రవారము. ఆదివారమునాఁడు జీసస్సు తన మిత్రులకు కొందరకు సజీవుఁ డయి కనఁబడె నని చెప్పుదురు. జీసస్సుయొక్క పునరుజ్జీవనకథ యిది — గాలీ నుండి జీసస్సువెంట వచ్చిన మేరీ మాగ్డలీ ననునామె భానువారమునాఁడు ప్రాతఃకాలమున సమాధి యొద్దకుఁ బోయి చూడఁగా దానికి మూఁత వేసినట్టాయి యథా స్థానమున లేక తొలగింపఁబడియుండె నఁట! పీటరును జానును కలిసి కొని జరిగినసంగతిని వారితోఁ జెప్పుట కయి యామె దుఃఖముతోను భయముతోను వెనుకకుఁ బోయె నఁట! వా రామెతోఁ గూడి సమాధియొద్దకుఁ బరుగెత్తుకొని వచ్చి లోపలఁ జొచ్చి యది వట్టిదిగా నుండుట చూచి వెంటనే వెడలిపోయిరి గాని యామెమాత్ర మేడ్చుచు నక్కడనే యుండె నఁట! కొంతసే పయిన తరువాత మేరీ సమాధి లోనికి వంగిచూడఁగా, దానిలో నిద్దఱు దేవదూతలు కనఁబడి యేల యేడ్చుచున్నా వని యడిగి రఁట! "వారు నాప్రభువును తీసికొని పోయినారు గనుక వా రాతని నెక్కడ నుంచిరో నే నెఱుఁగను" అని మేరీ యుత్తరము చెప్పె నఁట! అప్పు డామె తలయెత్తి కనుఁగొనఁగా తన సమీపమున నొక్కరు కనఁబడి "ఓకాంతా! వీల యేడ్చెదవు?"

అని యడిగె నఁట! బాష్పముల వలనఁ గొంతవఱకు కన్నుగానని దయి యాస్థలమునకు కావున్న తోటవాఁడని, తలఁచి "అయ్యా! నీ వాతనిని తీసుకొనిపోయి యుండినచో నీ వాతని నెక్కడ బెట్టి తివో నాకు చెప్పుము" అని యామె యాతని నడిగె నఁట! అప్పు డామనుష్యుఁ డామెను 'మేరీ' అని పేరితో పిలువఁగా, "ప్రభువా అని సంతోషముతో కేకవేసి, ఆమె యతనిని జీసస్సని గురుతు పట్టె నఁట! జీసస్సుయొక్క పునరుత్థాన విషయమునఁ గల సాక్ష్య మంతయు నొక్క మేరీయొక్క మాట లయి యున్నవి. ఆమె నిజము గానే తన ప్రభువును జూచినట్లు భ్రమపడి యుండవచ్చును. ఆమె భయ శోకపరీతస్వాంత యయి తదేకధ్యానముతో సదా ప్రభువునే స్మరించు చున్నప్పుడు మనోనేత్రమున కాతనిరూపము కనఁబడుటయు భావనా సంభవము లయి యాతని మాటలు వినఁబడుటయు వింత కాదు. ఇట్లే యాతని శిష్యులును వివిధస్థలములయందు తమ స్వామియొక్క శబ్దస్వరూపములను వినియు కనియు నుండవచ్చును. చచ్చినవాఁడు లేచివచ్చుట సత్యము కాకపోయినను, ఆకాలమునందుఁ గలిగిన యీ నమ్మకము శిష్యులకు నూతనధైర్యోత్సాహములను గలిగించుటకు జీసస్సుపదేశించిన ధర్మములకు లోకములో నత్యంతవ్యాప్తిని కలి గించుటకును పరమోపకార మయినది. తనకుఁ గల మహామహిమ లతో సకలగుణగణగరిష్ఠుఁ డయినజీసస్సంతటివాఁ డేమియు చేయ లేక తనకాయము నాచార్యపీఠమునకు బలిపెట్టవలసినవాఁ డయి యప్పుడు శక్తిహీనులమును గుణహీనులము నయిన మే మేమి చేయఁగలు గుదు మని, శిష్యకోటిలో ప్రబల మైన నిరాశ వ్యాపించియుండినప్పుడు "జీసస్సు జీవించియే యున్నాఁడు. ఆచార్యపురుషు లాతని దేహము నంశము నొందించిరను, ఆతనియాత్మ యింకను మనతోనే యున్నది.

అతఁడు శోకార్తులయియున్న శిష్యులకుదర్శనమిచ్చి సంభాషించుచున్నాఁడు. దిగ్విజయము చేయుట కయి మన కాతఁడు తోడుపడ నున్నాఁడు. ఈలోకమునందు మన కేమి సంప్రాప్త మయినను పరలోకమునందుత్తమగతిని మన కతఁడు చూపుచున్నాఁడు" అను కర్ణపరంపరాగత మయిన జనశ్రుతి భీరువులకు నూతనధైర్యమును నిరుత్సాహులకు నూతనోత్సాహమును దుర్బలులకు నూతనబలమును పుట్టించి తమప్రభువు పనిచేసిన శుభవార్తను కష్టములకోర్చి దూషణలకు సహించి తర్జనభర్జనములకు తలయొగ్గి చావులకు తెగించి లోకములో ప్రవచనముచేయునట్లు చేసినది. మూడుగంటలకాలపుశ్రమతో జీనస్సనశాశ్వత మయిన స్థూలకాయమును విడిచినవాఁడయ్యును శాశ్వత మైన కీర్తికాయమును ధరించి ప్రపంచమునకు మహోపకారి యయి నూతనధర్మస్థాపకుఁడయి యిప్పటికిని జీవించియున్నాఁడు; ప్రపంచములో మనుష్యజాతి యున్నంతవఱకు ముందును జీవించియుండును. ఈశ్వరుఁడు ప్రపంచమున కంతకు తండ్రియగుటచేత మనమందఱ మీశ్వరపుత్రులమే యయినను జీసస్సీశ్వరపుత్రులలో నుత్తమోత్తముఁడనఁదగినవాఁడు. ఈయుత్తమత్వము కల్యాణగుణసంపత్తిచేతఁ గూడ నీశ్వరకుమారత్వమున కర్హుఁడగుటచేత వచ్చినది. ఇతఁడు బోధించిన సత్యములలో క్రొత్తవనఁదగినవి యెన్నో లేవు. ఈతఁడు బోధించిన సత్యములలో నీశ్వరుని పితృభావమును మనుష్యుల యన్యోన్యసోదరభావమును ప్రధానము లయిన వని చెప్పవచ్చును. ఇవి సహితము క్రొత్తవి కావు. జీసస్సుజాతివా రయిన యూదులు దేవుఁడు తమ తండ్రి యనియు తా మాతని ప్రియపుత్రుల మనియు తప్పునూత్రమే దేవుఁడు ప్రేమించి యుండఁజొ కంచెను దమ కెక్కువ యాధిక్యమును గలిగించు ననియు భావించుకొని గర్వపడుచుండెడివారు. ఈ భావన భ్రమ యనియు

నీశ్వరునికి తా మెట్లు ప్రియతనయులో యట్లే లోకములోని యెల్ల జాతులవారును సమానముగానే ప్రియతనయు లనియు, ఈశ్వరుఁడు తమయెడల నెట్లు ప్రేమ గలవాఁ డయి యున్నాఁడో యట్లే యెల్ల జాతులవారియెడలను సమానప్రేమమును గలవాఁ డయి యున్నాఁ డనియు, జీసన్ను బోధించెను. ఇదియే యాతఁడు బోధించిన క్రొత్త సత్యము. దేవుఁడు తండ్రియు, మనుజులు కొంగుకులు నగుటచేత వుత్రు లకు పిత్రాజ్ఞానువర్తనము పరమధర్మము. ఏవిషయములోను జను లీశ్వరాజ్ఞాతిక్రమణము చేయక యీశ్వరేచ్ఛానుసారముగా సర్వ విషయములలోను ప్రవర్తించువా రయ్యెడు పక్షమున భూమిపై నీశ్వరరాజ్యము నెలకొనును. ఈయీశ్వరరాజ్యస్థాపనము నిమిత్తమే జీసన్ను తనప్రాణము ధారపోసెను. ఈ యీశ్వరరాజ్యము స్థాపింపఁబడిన యెడల జగత్తులో పాప ముండదు; అధర్మ ముండదు; అసత్య ముండదు; అన్యాయ ముండదు; ద్వేష ముండదు; వంచన ముం డదు. అందఱును దేవునకు విధేయవుత్రు లయి, పరస్పరప్రేమము గల సోదరులయి, పావవిహారులయి, ధర్మపరులయి, సత్యవంతులయి, న్యాయపరాయణులయి, సదయులయి, ఋజువర్తనులయి, పరోపకార పారీణులయి, అంతకంత కీశ్వరసామీప్యము నందుచు దేవతుల్యు లయి మనుష్య లీశ్వరరాజ్యములో శాశ్వతానందమును బొందువా రగుదురు. యీశ్వరరాజ్యమున కందఱును సమానార్హత గలవారు. ఎంతటిపాపి యయ్యును దీనిని పొందుట కెవ్వఁడును ననర్హుఁడు కాఁడు. ముఖ్యముగా పావుల నీశ్వరరాజ్యములో ప్రవేశపెట్టుట కొఱకే తాను తన ప్రభు వయిన తండ్రిచేత పంపబడినట్టు సంపూర్ణవిశ్వాసము గల వాఁడయి జీసన్ను వారియెడల సదయుఁ డయి పావులకొఱకే తనప్రాణ మును నర్పించెను. ఈశ్వరరాజ్యము బలపడి భూమి భూతలస్వర్గ

మగునుగాక! జీసస్సు త్రొక్కిన త్రోవ లోకమునకు మార్గప్రదర్శక మగునుగాక! జీసస్సుసహితము మనవలె మనుష్యమాత్రుఁడె యయి నను తనయకళంకశుద్ధ వర్తనముచేతను, నిశ్చల నిర్మల దైవభక్తి చేతను, అవ్యాజవరార్థిక వరత్వము చేతను, దేవతుల్యుఁ డయినాఁడుం అంతవఱకును పాపమునకును వరాభవమునకును గుఱుతుగానుండిన సిలువ జీసస్సు దానిపైని హతుఁడగుటచేత ప్రభువులును పవిత్రులును గూడ గారవచిహ్నముగా ధరించిగర్వపడునంతటియోగ్యత కలదగునని యెవ్వరనుకొనిరి! దేవసమ్ముఁడన్నంత ఘనతను పొందుటకయి విషయ సుఖములవంక కాకర్షించునింద్రియవర్గముతో నతఁ డెంత పోరాటము పలిపియుండునో! భగవంతునినుండి పరాఙ్ముఖునిఁ జేయఁజూచు పాప చింతలను మనస్సునుండి పాఱఁదోలుటకయి యెంతకష్టపడియుండునో! ఈశ్వరునితోడ వంతతసాన్నిధ్యమును గలిగించుకొని యాయన యిచ్ఛకు సదా తనయిచ్ఛ లోఁబడునట్లు చేయుటకయి యెంత నిరం తరాభ్యాసము చేసియుండునో! ఏమియు చేయకున్న నంతసులభముగా సిద్ధించు ఈశ్వరరాజ్యము నతఁడెట్లు చూఱఁగొనఁ గలిగి యుండును! అతఁడు బోధించిన యీశ్వరరాజ్య మైహిక మయినదికాదు; మానసిక మయి నది. దేశకాలజాతివిభేదము లేక శుద్ధహృదయులును శుద్ధవర్తనులును అయినవా రందఱును దానినిబొందుటకు స్వాతంత్ర్యముగలవారు. ఈశ్వరాజ్ఞోల్లంఘనమున కనఁగా పాపమునకు పశ్చాత్తప్తులయి నిర్మల హృదయములతో తండ్రియైన పరమేశ్వరుని సమీపించు బిడ్డలంద ఱును ఈశ్వరరాజ్యములో ప్రవేశించి యానందము నొందుదురన్న మతసత్యహార్ద్రమునకు ప్రతిష్ఠాపనాచార్యుఁ డయిన జీసస్సుయొక్క సిద్ధాంతము లోకములోని సర్వమతముల యందును వ్యాపించి యనంత శుభదాయక మగునుగాక!

కీర్తిశేషులైన రావుబహద్దూరు

కందుకూరి వీరేశలింగం పంతులుగారి

గ్రంథములు

ప్రహసనములు

మొదటి సంపుటము.

1 అపూర్వబ్రహ్మచర్యప్రహసనం
2 విచిత్రవివాహ ప్రహసనము
3 మహాబధిర ప్రహసనము
4 పునర్మరణ ప్రహసనము
5 బలాత్కారగానవినోదప్రహస॥
6 కలహప్రియా ప్రహసనము
7మహామహోపాధ్యాయప్రహస॥
8 యోగనిద్రా ప్రహసనము
9 మహావంచక ప్రహసనము
10 అసహాయశూర ప్రహసనము
11 కలిపురుషశనైశ్చర విలాసము
12 వేశ్యాప్రియా ప్రహసనము
13 కౌతుకవర్ధని
14 వినోదతరంగిణి
15 హాస్యసంజీవి మొదటి భాగము
16 ,, రెండవ భాగము
17 ,, మూడవభాగము

నాటకములు

రెండవ సంపుటము.

1 బ్రాహ్మనివాహాము
2 వ్యవహార ధర్మబోధిని
3 తిర్యగ్విద్వన్మహాసభ
(మూషికాసుర విజయం)
4 మహారణ్య పురాధిపత్యము
5 ప్రహ్లాద నాటకము
6 సత్యహరిశ్చంద్ర నాటకము
7 దక్షిణ గోగ్రహణము
8 వివేక దీపిక

భాషాంతరీకృత నాటకములు

మూడవ సంపుటము.

1 చమత్కార రత్నావళి
2 రాగమంజరి
3 కళ్యాణకల్పవల్లి
4 అభిజ్ఞాన శాకుంతలము
5 రత్నావళి
6 మాళవికాగ్ని మిత్రము
7 ప్రబోధచంద్రోదయము
8 వినీసువర్తక చరిత్ర

వచన ప్రబంధములు

పద్యకావ్యములు

నాల్గవ సంపుటము.

1 సత్యరాజాపూర్వదేశ
యాత్రలు మొదటి భా॥
2 ,, రెండవ భా॥
3 రాజశేఖర చరిత్రము
4 శుద్ధాంధ్ర నిరోష్ట్య నిర్వచన
నైషధం

నాల్గవ సంపుటము.

5 రసికజన మనోరంజనము
6 శుద్ధాంధ్రభారత సంగ్రహము
7 అభాగ్యోపాఖ్యానము
8 వధిక విలాసము
9 జాన్ గిల్పిన్
10 నీతిదీపిక

స్త్రీల కుపయోగించు కథలు

అయిదవ సంపుటము.

1 సత్యవతీ చరిత్ర
2 చంద్రమతీ చరిత్ర
3 నత్యసంజీవిని
4 చమత్కార రత్నావళి
5 సతీమణి విజయము
6 సుమిత్ర చరిత్రము
7 రఘుదేవ రాజీయము
8 కురంగేశ్వర వర్తకచరిత్రము
9 కళావతీ పరిణయము
10 గయ్యాళిని సాధుచేయుట
11 చిత్రకేతు చరిత్రము
12 దానకేసరీ విలాసము
13 వైదర్భీ విలాసము
14 భానుమతీ కళ్యాణము
15 సరసిజన మనోభిరామము
16 ధర్మకవచోపాఖ్యానము
17 కుమారద్వయ విలాసము
18 పద్మినీ ప్రభాకరము
19 మాలతీ మధుకరము

స్త్రీల కుపయోగించు పుస్తకములు

అరవ సంపుటము.

1 విక్టోరియామహారాజ్ఞిచరిత్రము
2 సతీహితబోధిని
3 పత్నీహిత సూచిని
4 స్త్రీ నీతిదీపిక
5 సత్యద్రౌపదీ సంవాదము
మాతృపూజ – పితృపూజ
6 నీతికథామంజరి ప్రథమభాగము
7 ,, ద్వితీయ భాగము
8 దేహారోగ్య ధర్మబోధిని

ఉపన్యాసములు

ఏడవ సంపుటము.

1 జన్మాంతరము
2 అతిబాల్యవివాహము
3 విగ్రహారాధనము
4 ఈశ్వరదత్త పుస్తకములు
5 ఈశ్వరోపాసనము
6 ప్రార్థన
7 మానుషధర్మము
8 విద్యాధికుల ధర్మములు
9 జీవితముయొక్క పరమార్థము
దానిని పొందు మార్గము
10 వైరాగ్యము
11 విద్యాధురీణుల యర్హా
కృత్యములు
12 వర్ణము
13 హిందూమతములు

ఏడవ సంపుటము.

14 స్వయంకృషి
15 సకాయకష్టకర్మలు
16 వేశ్యాకాంతల ఉపన్యాసములు
17 ఐకమత్యము
18 దానములు
19 స్త్రీ పునర్వివాహ చరిత్రము
20 స్త్రీపునర్వివాహ విషయకోప
న్యాసము
21 స్త్రీ పున్వర్వివాహ విషయక
ప్రథమవిజ్ఞాపనము
22 స్త్రీ పునర్వివాహ విషయక
ద్వితీయవిజ్ఞాపనము
23 స్త్రీ పునర్వివాహ శాస్త్ర
సంగ్రహము
24 స్త్రీ పునర్వివాహ భూతవర్త
మానస్థితులు

ఉపన్యాసములు - జీవచరిత్రలు

ఎనిమిదవ సంపుటము.

1 దేశీయమహాసభ, దానియుద్దే
శము
2 స్వదేశసంస్థాన చరిత్రాదులు
3 విగ్రహతంత్ర విమర్శనము
4 ఉపన్యాసమంజరి

ఎనిమిదవ సంపుటము.

5 వివేకవర్ధని మొదటి భాగము
6 ,, రెండవ భాగము
7 ,, మూడవ భాగము
8 శంకరాచార్యులు
9 బసవరాజు గవర్రాజుగారి జీవ
చరిత్రము

సాహిత్య గ్రంథములు

తొమ్మిదవ సంపుటము.

1 సంగ్రహ వ్యాకరణము
2 కావ్యసంగ్రహము
3 అలంకార సంగ్రహము
4 నీతిచంద్రిక - విగ్రహము
5 నీతిచంద్రిక - సంధి
6 తర్క-సంగ్రహము
7 సత్యవాదిని
8 ఉత్తమస్త్రీ చరిత్రములు
9 జీసస్ చరిత్ర

పదియవ సంపుటము.

పూర్వాంధ్రకవులు

పదునొకండవ సంపుటము.

1. మధ్యకాలపు కవులు
2. ఆధునిక కవులు

పండ్రెండవ సంపుటము.

స్వీయచరిత్ర (అందులోనిది)

పుస్తకములు వలయువారు :—

కార్యదర్శి - హితకారిణీ సమాజమువారు,
రాజమహేంద్రవరము

అని వ్రాసిన బడయుగలరు.

NATIONAL LIBRARY
V. NARAYANA
D. F. R.
Ac. No.


పరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

BCL

AOUA1013133

BC

సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము



మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA101B133
పుస్తకం పేరు	కందుకూరి వీరేశలింగకవి కృతగ్రంథములు09
తారీఖు	31 December 2025
ముందు అట్ట	
వెనుక అట్ట	
మొత్తం పేజీలు	821
పెద్ద సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	CI, II, iv, 90, 92
లేని పేజీలు	
తయారు చేసినది	Jayalakshmi
పేజీలు విడదీసినది	Jayalakshmi
స్కాన్ చేసినది	madhu mathi
పరీక్ష చేసినది	
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good

21 కొనవెలికలు

122, 124, 236, 290, 292

310, 312, 314, 370, 476,

602, 800, CI, BCI.